
లియో టాల్‌స్టాయ్

ఆన్నా కరేనినా

I



లియో టాల్‌స్టాయ్

ఆన్నా కరేనినా

I

నవల

మొదటి వాల్యూమ్

(భాగాలు 1-4)

"రాదుగ" ప్రచురణాలయం
మాస్కో

విశాలాంధ్ర పబ్లిషింగ్ హౌస్

అనువాదం: ఆర్వియార్
చిత్రకారుడు: ఒ. వెరేయ్‌స్కీ
డిజైన్: పి. ఇవాషెంకో

Лев Толстой
АННА КАРЕНИНА
Книга 1
На языке телугу

Tolstoy L.
ANNA KARENINA
A novel
Book 1
In Telugu

సోవియట్ యూనియన్‌లో ముద్రింపబడింది

ISBN 5-05-002339-4
ISBN 5-05-002340-8

యిందులో

ముందుమాట

1873 మే నెలలో "అన్నా కరేనినా" రాయడానికి శ్రీకారం చుట్టినప్పుడు రష్యన్ మహా రచయిత లియో టాల్‌స్టాయ్ (1828–1910) ఒక మిత్రుడికి యిలా రాశేడు: "యీ నవల, కచ్చితంగా నా రచనల్లో తొలిగా నవల అనే పేరుకి అర్హమైనది, నా అంతరంగాన్ని ఆవహించింది, దీని రచనాక్రమంలో పూర్తిగా నిమగ్నం అయిపోయేను..."

రచయితగా టాల్‌స్టాయ్‌కి అప్పటికే మంచి పేరు వచ్చింది. "బాల్యం," "కౌమారం," "యౌవనం" అనే గ్రంథత్రయం, యుద్ధాన్ని, యుద్ధంలో మనిషిని అద్వితీయంగా చిత్రించిన "సెవస్తొపొల్ కథలు," "కోసక్కులు" అనే నవల, "యుద్ధమూ – శాంతి" (1863–1868) అనే మహత్తర ఐతిహాసిక నవల రాసిన రచయితగా టాల్‌స్టాయ్‌కి ప్రఖ్యాతి వచ్చింది. నెపోలియన్ 1812లో ఫ్రెంచి సైన్యాలతో జరిపిన దాడిలో రష్యన్ ప్రజల పోరాటాన్ని 19వ శతాబ్దపు మొదటి త్రిదశకంలో రష్యన్ సమాజ జీవితాన్ని చిత్రించిన మహేతిహాసం "యుద్ధమూ – శాంతి."

1

తన ప్రతి కొత్త పుస్తకంలోనూ అన్నిటి కంటె మొదటిగా టాల్‌స్టాయ్ ప్రధాన యితివృత్తాన్ని ఘనమైందిగా భావించేడు. ఆయన మాటల్లోనే "యుద్ధమూ – శాంతి" అనే నవలలో 'సామాజిక యితివృత్తం' ముఖ్యంగా వుంది. "అన్నా కరేనినా"లో 'కుటుంబ యితివృత్తం' ముఖ్యంగా కనిపించింది. నిజానికి "యుద్ధమూ – శాంతి" అనే నవలలో కుటుంబ గాథ వుంది, "అన్నా కరేనినా"లో ప్రజా జీవిత చిత్రణా వుంది. కుటుంబ యితివృత్తం గ్రంథంలో ముఖ్యమైంది. దానిలోని చిత్రీకరణం గాఢత్వాన్ని ప్రజ్వలించే ద్యోతికి శక్తివంతమైన ఆధారం.

చరిత్రని ప్రతిఫలింప చేసే "యుద్ధమూ – శాంతి" అనే నవలని లియో టాల్‌స్టాయ్ అయిదేళ్ళు రాశాడు. ఆనాటి జీవితానికి అద్దం పట్టిన "అన్నా కరేనినా" నవలకీ యించుమించు అయిదేళ్ళే పట్టింది. యీ మహా రచనలవల్ల టాల్‌స్టాయ్‌కి ప్రపంచ ప్రఖ్యాతి, గుర్తింపు వచ్చేయి.

టాల్‌స్టాయ్ చరిత్రనీ, సమకాలీన జీవితాన్నీ అపోశన పట్టి సాహిత్యంలో సృజనాత్మకంగా మలిచేడు.

మహా రష్యన్ రచయితా, టాల్‌స్టాయ్ సమకాలికుడు అయిన దాస్తొయేవ్‌స్కీ యిలా రాశాడు: ''నవలా రచయిత.... తను వర్ణించే యదార్థానికి సంబంధించిన అతి చిన్న వివరాలని కూడా (చారిత్రకమైనవీ, వర్తమాన కాలానివీ) తెలుసుకుని వుండాలన్న తిరుగులేని తీర్మానానికి వచ్చేను నేను. యీ విషయానికి సంబంధించి ప్రతిభావంతుడైన రచయిత మన దేశంలో కౌంట్ లియో టాల్‌స్టాయ్ ఒక్కడేనని నా అభిప్రాయం.''

జీవితం అప్పటికే లేవనెత్తిన ప్రశ్నలకి సమాధానం చెప్పడానికి 1870లలో రష్యన్ సాహిత్యంలో జరిగిన సాహసోపేతమైన ప్రయత్నం యీ నవల. జీవితాన్ని గాఢంగా పరిశీలించి పాతగిల్లిన విలువల స్థానంలో కొత్త వాటిని పెట్టడం అనే సాహసోపేత ప్రయత్నం టాల్‌స్టాయ్ కళాత్మక శిఖరాల నధిరోహిస్తూ చేశాడు.

విలువల యీ పునఃపరిశీలనే టాల్‌స్టాయ్ ఆత్మిక సంక్షోభానికి మూలం అయి 1870ల ఆఖర్లోనూ, 1880లలోనూ ఆయన ప్రపంచ దృక్పథంలో మౌలికమైన మార్పుని తీసుకు వచ్చింది. ''అన్నా కరేనినా'' తర్వాత టాల్‌స్టాయ్ ''పాప నివేదన'' అన్న తన మొదటి తాత్విక కృతి రాశాడు. ''నాలో యెంతో కాలంగా మెదులుతూ, పరిణతి చెందుతూ వున్న మౌలిక దృక్పథ పరివర్తన నాలో జరిగింది. మా ధనిక, విద్వత్ జనుల బృందం గడిపే జీవితం నాకు వెగటు పుట్టించడమేకాక, అర్థవిహీనం అయినట్టు నాకు జ్ఞానోదయమైంది'' అని టాల్‌స్టాయ్ ఒప్పుకున్నాడు.

యీ మార్పు యెలా జరిగిందో దాన్ని ''అన్నా కరేనినా'' నవల ఆధారంగా చూపించ వచ్చు. టాల్‌స్టాయ్ ఆధ్యాత్మిక శోధనవీ, కుటుంబ పరిస్థితులద్వారా నాటి సమకాలీన జీవిత సాధారణ క్రమాల్ని అర్థం చేసుకుందుకు ఆయన చేసే ప్రయత్నాలనీ యీ నవల ప్రతిబింబించింది. లేవిన్, కిట్టీల సంసార జీవిత యితివృత్తం యాస్నయా పొల్యానాలో టాల్‌స్టాయ్ కుటుంబ జీవితపు తొలి, కమనీయ స్మృతుల్ని నింపుకొంది. అంతే గాక ఆయన జీవితంలో తర్వాత దశలో తన చుట్టూ వున్న ప్రజలతో ఆయనకి కలుగుతూ వున్న సంక్లిష్ట సంబంధాలని, ప్రపంచం పట్ల ఆయన సంక్లిష్ట వైఖరిని వాటికి చెందిన కొన్ని లక్షణాలనీ కూడా పొదువుకుంది.

''అన్నా కరేనినా'' రాయడానికి సమాయత్తం అయే ఆ సంవత్సరాలలో టాల్‌స్టాయ్ 'తనలో, తన కుటుంబంతో'' సమరసంగా జీవించాలని ఆశించేడు. కాని అది జరగలేదు. నూతన తాత్విక, ఆచరణాత్మక ఉద్దేశ్యాలు ఆయనకి కలిగేయి. అవి పాతుకుపోయిన ప్రభువంశీకుల జమీ జీవితంతో సంఘర్షించేయి. దాంతో కుటుంబ జీవిత రాగంలో బీర స్వరం వచ్చింది.

టాల్‌స్టాయ్‌కి తన ఒంటరితనం, ప్రజా జీవితంతో తన రక్త సంబంధం అనుభూతం అయేయి. తనని వేధించిన సమస్యలని పరిష్కరించడానికి తను అశక్తుణ్ణన్న గుర్తింపు వల్ల నిరాశ కలిగింది. ప్రజలతో మమేకం కావడంద్వారా దానికి పరిష్కారం కనిపెట్టగలనన్న ఆశ ఆయనకి కలిగింది. కాని ఆయనకి అప్పటికే గ్రామీణ జమీందారీ జీవిత విధానంలోని ధర్మ

బద్ధత పట్ల, న్యాయం పట్ల అంతకు ముందు తనకి వున్న విశ్వాసం పోయింది. ఆయన నిత్యజీవితంలో స్థాపితమైన యాంత్రిక నియమానుసారం బతక లేకపోయేడు.

నిత్య జీవితానికి సంబంధించి టాల్‌స్టాయ్‌కి వున్న సామాన్య అభిప్రాయాలు తునాతునకలై పోవడమే కాదు సకల సైద్ధాంతిక, తాత్విక, మత విశ్వాసాలు కూడా తునాతునకలై పోయేయి. విలువల పునఃపరిశీలన ఒక వేదనామయ క్రమం.

"నేను పెద్దగా బతికేను" అని టాల్‌స్టాయ్ తన "పాప నివేదన"లో రాసుకున్నాడు. అంటే ఆయన ఉద్దేశం 'అందరి లాగా బతుకుతూ' తను 'ప్రజా క్షేమాన్ని' గురించి ఆలోచించలేదనీ, తన బతుకుని బాగు చేసుకునే దాని గురించే శ్రద్ధ పట్టాననీ, భూస్వాముల జమీలో రొడ్డ కొట్టుడు జీవితంలో వున్నాననీ. యీ జీవితంలో వున్న చారిత్రక నైతిక అన్యాయం ఆయనకి క్రమేపీ వెల్లడైంది. "పరమ భౌతిక వాంఛా పరిపూర్తికి వెంపరలాడే" ఆ జీవితాన్ని "కోరికలూ వ్యామోహాలూ తృప్తి పరచుకోవాలనుకునే" ఆ జీవితాన్ని త్యజించాలన్న కోరిక ఆయనకి కలిగింది. కాని యీ నవల్లోని నాయకత్వ ప్రాముఖ్య పాత్రలు అయిన అన్నా, ఆమె తమ్ముడు అబ్లాన్‌స్కీ, వ్రాన్‌స్కీ, యాష్విన్ తదితరులు, సరిగ్గా అదే పరిస్థితుల్లో బతుకుతూ వుంటారు.

భౌతిక వాంఛా పరిపూర్తి ప్రేరణలు, 'కులాసా వేదాంత' ధోరణి ప్రేరణలు బాగా తెలిసిన లేవిన్ వొక్కడికి మాత్రం ఆ జీవిత సమంజసత్వం గురించిన సందేహాలు కలుగుతాయి. అతను 'మామూలు ప్రజల పట్ల వున్న సహజ ప్రేమ పుణ్యమా' అని 'యిదే నన్ను కాపాడింది' అన్న టాల్‌స్టాయ్ భావనని పునరుద్ఘాటిస్తాడు.

నవల ఆఖర్లో టాల్‌స్టాయ్ వొక సాదా రైతు ఫ్యొదొర్‌తో పంట కోతలప్పుడు లేవిన్ సంభాషణని వర్ణిస్తాడు: "వూపిరి పీల్చుకోవడానికి తీరిక వుండని సమయం అది. వూళ్లో వాళ్లందరూ పిసరు కూడా వొళ్లు దాచుకోకుండా తీవ్రంగా పనికి అర్పితమైపోయే సమయం అది. అలా అర్పితమైపోవడం జీవితంలో మరే రంగంలోనూ వుండదు. ఆ పనిలో నిమగ్నం అయిన వాళ్లు స్వయంగా దాని మహోన్నత్యాన్ని ప్రకటించు కున్నట్లయితే గనక, ఆ పని సాలు సాలుకీ పునఃపున్యంగా రాకుండా వుంటే గనక, యీ శ్రమ ఫలితాలు యింత నిత్యజీవితానుభవం కాకుండా వుంటే గనక దీని మహోన్నత్యానికి గుర్తింపు వచ్చి వుండేది."

ఆత్మ త్యాగానికి సంబంధించి "పిసరు కూడా వొళ్లు దాచుకోకుండా తీవ్రంగా పనికి అర్పితమైపోవడం" లేవిన్‌కి హఠాత్తుగా ప్రజలలో కనిపించి అనుభూతం అవుతుంది, అది అతని ఆలోచనా సరళిని మౌలికంగా మార్చివేసింది. అతని కష్టాలూ, తార్కికంగా పేర్చుకున్న వాదనలూ వున్నట్టుండి అదృశ్యం అయిపోతాయి, గాలికి కొట్టుకుపోయిన బూజులాగా. మాతన "ప్రముఖమైన చింతలు, యేదో చెరనుంచి విముక్తమై వచ్చినట్టు యేక లక్ష్యం దిశగా పో ప్రయత్నిస్తున్నట్టు తమ తేజస్సుతో అతనికి మిరుమిట్లు గొలుపుతూ మస్తిష్కంలో పరిభ్రమించడం మొదలుపెట్టాయి."

లెనిన్ కూడా రచయిత టాల్‌స్టాయ్‌లాగా "మానవజాతి ఉమ్మడి జీవితా"న్వేషణలో వున్నాడు. అది సాధ్యం అని గుర్తించినప్పుడు, వసుధైక కుటుంబకం అనే మాక్సిమ్‌ జీవితంగా భాసించే దాంటో కలవడం సాధ్యం అని గుర్తించినప్పుడు అతని నిరాశ యెంత మామూలుగా ఆవిర్భవించిందో అలానే అదృశ్యమైపోయింది.

"యిప్పుడు నా జీవితం, నాకు యేం జరిగినా జరగనీ గాక, నా యావజ్జీవితం, జీవితంలోని ప్రతి క్షణం ముందటిలాగా అర్థహీనంగా వుండదు. కాని మంచికి ప్రతిరూపంగా దానికి వొక అర్థం కలుగుతుంది, దాన్ని అలా అర్థవంతం చేసుకునే సామర్థ్యం నాకు వుంది." యీ మాటలతో "అన్నా కరేనినా" నవల ముగుస్తుంది.

"అన్నా కరేనినా"లో 'సామాజిక యితివృత్తం' 'కుటుంబ యితివృత్తం' అనే విత్తనం నుంచి మొలకెత్తుతుంది. టాల్‌స్టాయ్ నవలలో యీ రెండు యితివృత్తాలు అభేద్యంగా వొక దానితో వొకటి కలిసి పోతాయి. యీ సంబంధం టాల్‌స్టాయ్ కల్పన వల్లనే గాక కళాకారుడిగా, ఆలోచనాశీలిగా ఆయన అభివృద్ధిలోని క్రమతవల్ల కూడా యేర్పడుతుంది. రష్యన్ జీవితంలోని వొక దశ ఆయన ఆత్మిక అన్వేషణలో మొత్తంగా ప్రతిఫలిస్తుంది.

రైతు సంస్కరణ జరిగిన పదేళ్ల తర్వాత – 1861లో భూస్వామ్య దాస్య వ్యవస్థనుండి రష్యన్ రైతు విముక్తి జరిగింది – 1870లలో టాల్‌స్టాయ్ యీ సమకాలీన నవలని రాశాడు. "గ్రామీణ రష్యాలోని ప్రధాన ఆధారాలన్నిట్నీ మూలంమట్టంగా ఛేదించుకోవడంతో ఆయన దృష్టి నిశితమైంది, తన చుట్టూ జరిగే దానిపట్ల ఆయన ప్రపంచ దృక్పథంలో మౌలికమైన మార్పుకి మార్గం వచ్చింది. పుట్టుకవల్లా, పెంపకంవల్లా లియో టాల్‌స్టాయ్ రష్యన్ ప్రభువంశీకుల అత్యున్నత శ్రేణి వాడు. కాని ఆయన యీ అంతస్తుని అంటి పెట్టుకు వుండే సకల సంప్రదాయిక అభిప్రాయాలనీ తెంచుకున్నారు" అని వి. ఐ. లెనిన్ రాశాడు. యిది కూడా ఆయన "ప్రజా చింతన" పరిణామం.

2

"అన్నా కరేనినా" వొక విజ్ఞాన సర్వస్వంలాంటి నవల. టాల్‌స్టాయ్ రాసిన యీ పుస్తకం వొక మొత్తం యుగాన్ని ఆ యుగపుటాశల, కాంక్షల, ఆందోళనలన్నిటితోబాటుగా ప్రతిబింబిస్తుంది. ఆ యుగం అపారమైన చారిత్రక ప్రాముఖ్యం వున్న యుగం. "ఆ నాటి ఘోష" యాస్నయా పొల్యానాలో, టాల్‌స్టాయ్ తన సమకాలీన జీవితం గురించిన నవలని రాస్తూ వుండిన ఆ యాస్నయా పొల్యానాలో, నిండుగా వుంది.

"అన్నా కరేనినా" నవలకి సంబంధించి దొస్తొయేవ్‌స్కీ వ్యాసాల్లో వొక దాని శీర్షిక "యీనాటి ప్రసక్త విషయం" అని. "అత్యుత్తమ శ్రేణి రచయిత, కళాకారుడు, ప్రధానంగా నవలా రచయిత అయిన ఆయన" రచనలో దొస్తొయేవ్‌స్కీకి "ఆ నాటి యదార్థ విషయానికి"

యీనాటి సమస్యలలో అతిముఖ్యమైన వాటిలో "అతిముఖ్యమైనది, యేకైక నిరతురపుష్కల లక్ష్యం అవడం" అనేదానికి మూర్తిమంత రూపం కల్పించింది.

యీ నవలలోని పాత్రలు, రచయిత మాదిరిగానే, భూస్వామ్య దాస్య వ్యవస్థలో పెరిగినవి. ప్రధానాధారం అయిన పురాతన వ్యవస్థ కుప్పకూలి పోవడం చూసినటు వంటి పాత్రలు. అదే సమయంలో 1870లనాటి నూతన "పరివర్తనా దశ"కి చెందినవి. యిదే యుగంలో టాల్‌స్టాయ్ "ఆలోచనా స్పందనని", అస్థిరత్వాన్ని పసికట్టేడు. "ప్రతీదీ కలగాపులగం అయిపోయింది" అనేది సూక్ష్మంగా, అర్థవంతంగా కారికలాగా చెప్పిన మాట. యీ పద బంధంతోనే నవల మొదలవుతుంది.

రష్యన్ ప్రజల విమోచనా కార్యకర్తలు, భూస్వామ్యదాస్య వ్యవస్థకి వ్యతిరేకంగా పోరాడిన వాళ్ళు, బానిసత్వాన్ని నిర్మూలించే అవకాశాన్ని విశ్వసించేరు. ఆ పోరాటానికి తగ్గ శక్తి వాళ్ళకి వుంది. అంతిమ లక్ష్యం యేమిటైందీ వాళ్ళకి తెలుసు. కాని సంస్కరణానంతర పరిస్థితి యెలా రూపు తీరుతుందీ అనే సమస్యని వాళ్ళు లేవనెత్తలేదు.

1870లలో పరిస్థితి మారింది. పదేళ్ళ సంస్కరణల తర్వాత కూడా భూస్వామ్య దాస్యం స్థిరంగా ఆర్థిక వ్యవస్థలో పాతుకున్నట్టూ, నూతన బూర్జువా రూపాలతో చక్కగా సహ జీవనం సాగించ గలిగినట్టూ రుజువైంది. పోరాట పద్ధతుల పట్లా, లక్ష్యాల పట్లా లోగడ వున్న విశ్వాసం అప్పటికే పోయింది. నూతన పరిస్థితుల ప్రధాన ఆధారాలు అస్థిరంగా వున్నట్టు తేలింది.

ప్రజా చైతన్యంలో నూతన అంశం గోచరమైంది. "అవిధేయత", "అస్థిరత" "అస్తవ్యస్త స్థితి" అయిన అంతర్గత మౌలిక అంశాన్ని సమకాలీన మానవుని మనస్తత్వంలో టాల్‌స్టాయ్ పసికట్టేడు. దాన్ని ఆయన పరిణామ దశలోని విశిష్ట అంశంగా తన నవలలో ప్రవేశపెట్టేడు.

"యీ నవల యితివృత్తం వివాహబంధాన్ని భార్య అతిక్రమించడం, దానివల్ల రేగిన మొత్తం ఘటనలు" అని టాల్‌స్టాయ్ తన నవల "అన్నా కరేనినా" రాయడం మొదలుపెట్టి నప్పుడే అన్నాడు. పుస్తకంలో పైకి గోచరమయే పార్శ్వం యిది. కాని నవలలో అంతర్గతంగా వున్న అర్థం "కుటుంబ గాథ"ని అధిగమించి వుంటుంది. యీ కుటుంబ విషాదం మరింత విస్తృత పరిధిలో గ్రాహ్యం అవుతుంది.

టాల్‌స్టాయ్ నవలకి వున్న విజ్ఞాన సర్వస్వంలాంటి స్వభావం "ఆనాటి విప్లవం" గమి లోనే కాకుండా చారిత్రకంగా సంబంధం వున్న సమస్యల్ని కుటుంబం, సొంత ఆస్తి, రాజ్యం లాంటి వాటితో మానవాళి ప్రపంచ వ్యవస్థ యేర్పాటు సమస్యని లేవనెత్తడంలోనే వుంది. యీ అన్ని సమస్యలకి సంబంధించి టాల్‌స్టాయ్‌కి సొంత నైతిక చారిత్రక దృక్పథం వుంది.

టాల్‌స్టాయ్ కి కరేనిన్ సొంత కుటుంబ చరిత్రకారుడే కాదు, 19వ శతాబ్దపు ఉత్తరార్ధంలో తలెత్తిన పతన చిహ్నాలు చూపించే మొత్తం గొప్ప కుటుంబాల చరిత్రకారుడు కూడా.

యింట్లో "ఆనంద వాతావరణం" నిలబెట్టడానికి కరేనిన్ యెంత తన్నుకులాడినా అతని కుటుంబం చితికిపోతోంది. కరేనిన్ వివాహ వ్యవస్థ అవ్యయత్వానికి అనుకూలుడు. అయినా కరేనిన్ ఓడిపోయేడు. టాల్‌స్టాయ్‌కి కరేనిన్ పట్ల సానుభూతి వుంది, కుటుంబం గురించి కరేనిన్‌కి వున్న అభిప్రాయం టాల్‌స్టాయ్ దృష్టిలో సరి అయిందే. అయినా గానీ, సత్యాతిక్రమణ చెయ్యకుండా టాల్‌స్టాయ్ సమాజ జీవిత నూతన పరిస్థితుల్లో నిస్సహాయుడైన వ్యక్తిగా కరేనిన్‌ని చిత్రించేడు.

కుటుంబం పతనం, వివాహ వ్యవస్థ అవ్యయత్వ నాస్తీకరణ అనే భావనలు "ఉన్నత సమాజ". జీవితంతో సహా సకల జీవిత రంగాలనీ పాదివి పట్టుకున్నాయి. వాటిని ఆ కాలపు చిహ్నాలుగా టాల్‌స్టాయ్ వర్ణించేడు.

వివాహ వ్యవస్థ గురించిన నాస్తీకరణ సిద్ధాంతాలు, "విశృంఖల ప్రేమ" సిద్ధాంతాలు టాల్‌స్టాయ్‌కి పూర్తిగా పరాయివి. పితృస్వామిక రైతాంగ జీవితంలో కుటుంబ సూత్రాల్ని పునరుద్ధరించే ఆధారాల్ని ఆయన చూడకోరేడు. ఆ రకంగా "సామాన్య జీవితం" గురించిన లేవిన్ కల "శ్రమించే సౌందర్యమయ జీవిత" ఆదర్శంతో మిళితం అవుతుంది. "లేవిన్ ముగ్ధుడై యీ జీవితాన్ని తరచు దర్శించేవాడు. ఈ తరహా జీవితం గడిపే వాళ్ళంటే అతనికి యెప్పుడూ అసూయ కలిగేది..." అని టాల్‌స్టాయ్ రాశాడు.

గడ్డి వాములు వేసే సమయంలో రైతు ఇవాన్ పర్మేనొవ్ భార్య పట్ల చూపించిన వైఖరి చూసి లేవిన్ ఆశ్చర్యపోయాడు: "ఆమె తనాముని కొర్రు పిడిని పట్టుకుని గడ్డిని పైకి యెత్తేది. ఆ పిల్ల వొక్క క్షణం కూడా వృధాగా శ్రమ పడకుండా చూడాలన్నట్టు ఇవాన్ ఆతృతగా ఆ గడ్డిని చేతులు బారచాపి ఆదరాబాదరా అందుకునేవాడు." "ఇద్దరి ముఖాల్లోనూ వెల్లడైన భావంలో యౌవనభరిత, ప్రబల నూతనావిర్భూత ప్రేమ తటిల్లతలా మెరిసింది."

లేవిన్‌కి ప్రేమ ఆనందదాయకమైన ఆవిష్కరణ. కరేనిన్‌కి దాని అభావం విషాదకరమైన ఆవిష్కరణ. కొత్తగా యేర్పడిన వ్రాన్‌స్కీ "చట్టవ్యతిరేక కుటుంబం"లోనూ ఆనందం లేదు. అబ్లాన్‌స్కీ కాపరంలోనూ ఆనందం లేదు.

"ప్రేమ అర్థాన్ని" పోగొట్టుకున్న యీ లోకంలో లేవిన్ ఆతృత మరీ తీవ్రంగా వుంటుంది. "యీ భారమైన, అసత్యభరిత, కృత్రిమ వ్యక్తిగత జీవితాన్ని యీ రకమైన శ్రమపూర్ణ, నిర్మల, సమష్టి శ్రమ సౌఖ్య ప్రదాయిక జీవితంగా మార్చుకోవడం తన చేతిలోనే వుంది" అని గడ్డి మేట్లు వేసేటప్పుడు ఇవాన్ పర్మేనొవ్‌ని చూసి లేవిన్ గ్రహించేడు.

కాని యెవళ్ళేనా తన జీవితాన్ని మార్చుకోవడం అంత తేలిక కాదు అనీ, అది వాళ్ల

సొంత కోరికమీద ఆధారపడి లేదు అని లేవిన్ గ్రహించేడు. "అందేత యేం చెయ్యను?" అని లేవిన్ ఆలోచిస్తాడు. "యెలా చెయ్యను?" కాని అతనికి స్పష్టమైన కార్యాచరణ యేదీ తట్టదు. "పెళ్లి చేసుకోనా? ఏదైనా పని చెయ్యనా? పని చెయ్యాల్సిన ఆవశ్యకతని అనుభూతం చేసుకోనా? పోక్రోవ్‌స్కాయెని వదిలెయ్యనా? పొలం కొననా? రైతు సమాజంలో కలిసిపోనా? ఏ రైతు పిల్లనైనా పెళ్లి చేసుకోనా? యెలా జీవితాన్ని మార్చుకోను?" లేవిన్ తనకి బాహ్య జీవితంలో ఆకర్షకరంగా భాసించిన మార్పుల్లో దేన్నీ అమలులో పెట్టడు. కాని మార్పు అవసరాన్ని అతను గమనించేడు. అదే అతని మహత్తర విజయం.

ప్రభువంశీకుల ఆస్తి పతనం, అబ్లాన్‌స్కీల విషయంలో కనిపించినంత స్పష్టంగా మరెక్కడా కనిపించదు. "జీవితం సోమరి మనిషిని గెంటేస్తుంది" అని టాల్‌స్టాయ్ రాశాడు. అబ్లాన్‌స్కీ కడపటి ఆశగా మిగిలిన అడవుల్ని అమ్మేసి నాశనం అయిపోతున్నాడు. యెర్గుషొవొలో వున్న అతని భవంతి శిధిలం అయిపోతోంది.

లేవిన్ వూళ్లోనే వుండిపోతాడు, నడుంకట్టి పొలం పనులు చేస్తాడు, అయినా అతనూ దిక్కుతోచని పరిస్థితిలో వుండి పోతాడు. వ్యవసాయం అతని ప్రయత్నాలకి యెదురుతిరుగుతుంది, అతను యేదో "మిధ్యాత్మక కుడ్యంతో" పెనుగులాడుతున్నాడు అని అనిపించింది. కరేనిన్ కుటుంబ యజమానిగా విఫలం అయితే లేవిన్ "వ్యవసాయ శాస్త్రం"లో విఫలం అవుతాడు.

"యిప్పుడతనికి అంతా స్పష్టంగా విశదమైంది ఏమంటే వ్యవసాయం విషయంలో తను నిర్వహిస్తున్న ధోరణి తనకీ వ్యవసాయ కార్మికులకీ మధ్య జరిగే కఠోర, తీవ్ర సంఘర్షణ తప్ప యేమీ కాదు. యీ సంఘర్షణలో వొక పక్క, అంటే తన పక్క, అన్నిట్నీ లేమిగ్గా వుండేటట్టు మార్చే స్థిర గాఢ ప్రయత్నం వుంది. అటు పక్క యెలా వున్న వాటికి అలావే లొంగిపోవడం వుంది" అని టాల్‌స్టాయ్ రాశాడు. లేవిన్ లోగడ తన భూస్వామ్యదాసులుగా వున్న వాళ్లకి యేం చెప్పినా వాళ్లు "వూరికే తన కంఠధ్వనులు వింటున్నారంతే". మాటలకి సంబంధించి అవి వాళ్లకి అర్థం కాలేదు, అర్థం చేసుకోదలచుకోలేదు వాళ్లు. "తమని మరింత యెక్కువగా దోచుకోవడం వినా జమీందారుకి వేరే ఉద్దేశం లేదని రైతులకి గట్టి నమ్మకం." అని చూసి తన వాద చెల్లు పడిందని లేవిన్ గ్రహించేడు. కుటుంబ జీవితం యెడతెగకుండా సాగడం కోసం మార్గాలు అన్వేషించాడు, అలాగే వ్యవసాయ కార్యకలాపాలని త్యజించాలని చూశాడు. "యిది పాత జీవితాన్ని త్యజించడం, వృధా కార్యకలాపాల్ని త్యజించడం."

కాని టాల్‌స్టాయ్ నవలలో రాజ్యవ్యవస్థకి సంబంధించిన సమస్య మరింత తీవ్రంగా వుంటుంది. టాల్‌స్టాయ్ స్వయంగా సమాజంలోని పైఅంతస్తుకి చెందిన వాడు. టాల్‌స్టాయ్ పూర్వులకి కౌంట్ అనే బిరుదుని రష్యన్ ప్రభువంశీకుల రాజ్యాన్ని స్థాపించిన పీటర్ ది గ్రేట్ ప్రదానం చేశాడు. వారసత్వ హక్కుగా టాల్‌స్టాయ్‌కి భూస్వామ్య దాసులు, భూములు, అడవులు, జలాశయాలు, మత్స్య సంపద వున్న బ్రహ్మాండమైన యాస్నయా పొల్యానా

జమీ. సంక్రమించింది. తన గది కిటికీ దగ్గర వున్న నైటింగేల్ పక్షులు కూడా ప్రభుత్వానివి గాక తన సొంతమేనని ఆయన అంటూ వుండేవాడు.

అపారమైన జమీతోబాటుగా టాల్‌స్టాయ్‌కి అంతరాత్మ స్పృహ కూడా వుండేది. యెప్పుడో 1861లోనే ఆయన భూస్వామ్య దాస్యంనుంచి రైతుల విమోచన కోసం తన శాయశక్తులా కృషిచేశాడు. క్రమేపీ ఆయన ప్రజల పట్ల తన చారిత్రక నేరాన్ని నిశితంగా గ్రహించేడు. సంపన్న, విద్యాంసుల బృంద జీవిత నైతిక పరిత్యాగ చారిత్రక అంతస్సారాన్ని పొదువుకున్నది సరిగ్గా అదే.

టాల్‌స్టాయ్ 1870ల నాటికే సుదూర భవిష్యత్‌లోకి చూస్తూ వున్నాడన్న దానికి రుజువు ఆయన నిశిత సాంఘిక వైరుధ్యాలతో విభజితమై పోయిన ముగ్గురు అన్నదమ్ముల్ని వర్ణించడం. వాళ్ల ఆదర్శాలు స్పర్థించకుండా వుండలేవు. లేవిన్ పెద్దన్నగారు కోజ్నిషెవ్ హోదాగల వర్గానికి చెందిన ఉదారవాది. తన ఉదారవాదం యెంతటిదైనా అతను హోదాలనే అన్నిటికంటే ఘనంగా భావించుకున్నాడు. కోజ్నిషెవ్ పట్ల లేవిన్ వైఖరి సర్వదా "లలితమైన అనార్ద్రత"తో వున్నటువంటిదే. కాని కోజ్నిషెవ్ పట్ల లేవిన్ రెండో అన్నగారు నికొలాయ్ వైఖరి మాత్రం దాపరికం లేని వైషమ్యంతో వుండేది. అతని అభిప్రాయంలో, కోజ్నిషెవ్ "వున్న చెడుగుల్ని సమర్థించడానికే బుర్రంతా ఉపయోగిస్తాడు." కోజ్నిషెవ్‌కి భిన్నంగా రెండో అన్నగారికి తీవ్రవాద భావాలు వుండేవి. "మన సమాజం యెలా వుందంటే శ్రామికులు యెంత కష్టపడి పనిచేస్తే అంతగా వర్తకులూ, భూస్వాములూ బలుస్తున్నారు; శ్రామికులు మాత్రం గానుగెద్దు పశుగానే వుండిపోతున్నారు. యీ పద్ధతిని మార్చాలి" అని అతను కార్మికుల గురించి రైతుల గురించి చెప్పాడు.

తను చేసే పని లక్ష్యం "ప్రజల్ని బానిసత్వంనుండి విముక్తం చెయ్యడం" అంటాడతను. మరి లేవిన్ ఉదారవాదీ కాదు, విప్లవవాదీ కాదు. అతను "పశ్చాత్తప్తుడైన ప్రభువంశీకు"ల తరహావాడు, తమ దోషం లేదు అని అనిపించడమే వాళ్లకి అతి ముఖ్యమైన విషయం.

లియో టాల్‌స్టాయ్ మాదిరీ లేవిన్ ఆర్థిక, రాజకీయ విప్లవం గురించి ఆలోచించ లేదు. మానసిక పరివర్తన గురించి ఆలోచిస్తాడు. యిది ప్రజలలో "శత్రుత్వం వైషమ్యం" బదులుగా "సమరస భావం, సత్సంబంధాలు" స్థాపిస్తుందని ఆయన అభిప్రాయం. "అతను సర్వుల కల్యాణం కోసమూ, మానవాళికి, గుబేర్నియాకి, రష్యాకి సంక్షేమం కోసం యేదో కొంత చేశాడు." జీవితం తను ఆశించిన దానికంటే వేగంగా మారడం లేవిన్ చూశాడు. "వ్యవసాయం యేర్పాట్ల పట్ల తనకి కలిగిన అసంతృప్తి కేవలం తనకి మాత్రమే కలిగిన అసంతృప్తి కాదు. యావత్ రష్యాలోనూ వ్యాప్తమై వున్న ఒక సామాన్య పరిస్థితి ఫలితంగా వచ్చినటు వంటిది" అనిపిస్తుంది అతనికి. అది అతనికి అనిపించినది మాత్రమే కాదు, అతనికి పూర్తిగా తెలిసిన అందరికీ అలావే అనిపిస్తుంది.

"ప్రస్తుతం యిక్కడ అంతా తారుమారు అయిపోయి కొత్త రూపు దాల్చే సమయంలో పరిస్థితులు యెలా కుదురుకుంటాయి అనేది రష్యాకి సంబంధించి అత్యంత ప్రాముఖ్యం గల ప్రశ్న" అనుకున్నాడు లేవిన్. యిది యీ యుగపు సాధారణ సూత్రం, టాల్‌స్టాయ్ నవల్లోని పాత్రల మనస్తత్వాన్నీ, గమకాల్నీ, స్వభావాల్నీ నిర్ణయించేది అదే.

"అంతా తారుమారు అయిపోయి కొత్త రూపు దాల్చేది" అనే యీ సూత్రాన్ని "రష్యన్ చరిత్ర మలుపు తిరిగే ఘట్టం" — అంటే 1861లో భూస్వామ్య దాస్య వ్యవస్థ పతనం నుంచి 1905నాటి మొదటి విప్లవందాకా — మొత్తానికి అన్వయిస్తుందని లేవిన్ భావించేడు. నాటి సమకాలీన టాల్‌స్టాయ్ నవలలో ముఖ్యమైన చారిత్రక భావాలు వున్నాయి, అవి కాల గతిలో తమ అంతస్సారాన్ని, ఆయన బోస్యాల్నీ, ఆశల్నీ రుజువు చేస్తూ వెల్లడయేయి.

"మొత్తం జీవిత నిర్మాణం" మారుతుందన్న నమ్మకం టాల్‌స్టాయ్‌కి వుంది. "మన నాగరికత పతనదిశగా పోతోంది" అని ఆయన రాశారు. రష్యా జీవితంలో రాబోయే మౌలిక మార్పుల సూచన "అన్నా కరేనినా"లో వ్యక్తం అయింది.

3

అన్నా స్వభావంలో వున్న నో ముఖ్య అంశం "ఆగ్రహంలో ప్రేమలో యెంతో త్యాగం చెయ్యగల" సామర్థ్యం. అన్నాకి గాఢమైన అంతరంగిక శక్తి వుంది. "నా దోషం లేదు" అంటుందామె, కాని విషాదభరిత నేరభావం ఆమెని ముంచెత్తుతుంది. "తను అతనిముందు దోషి అయిన ఆ ఘోర నేరానికి" కరేనిన్ పట్ల ఆమెకి అసహ్యంగా వుంటుంది.

ఆమె నైతిక ప్రాపు కోసం వెతికింది. కాని అది దొరకలేదు. "ప్రతిదీ అసత్యం, ప్రతిదీ మోసం, ప్రతిదీ ద్వేషం." ఆమెని నాశనం చేసింది కాంక్షలు మాత్రమే కాదు. శత్రుత్వం, దూరీకరణ, లోకనింద అనే క్రూర అప్రతిహత శక్తి, స్వేచ్ఛ కోసం తన పోరాటాన్ని సాగించడం అసంభవం కావడం అన్నీ కలిసి అన్నాకి విషాద అంతాన్ని సంప్రాప్తింప చేశాయి.

అన్నా వొక కాలానికి, వొక సాంఘిక బృందానికి, అంటే సమాజంలో ఉన్నత వర్గానికి చెందిన వ్యక్తి. నవలలో ఆమె విషాదం ఆ సమాజ యుగ నియమాలకి, ఆచారాలకి, నీతులకి పూర్తి అనురూపంగానే వర్ణితమైంది.

బెట్సీ త్వెర్‌స్కయా అన్నిట్నీ వాడుకుంటుంది, కాని మచ్చపడని ఉన్నత సమాజ మహిళగానే మిగిలి పోతుంది. యేమంటే ఆమె నటన, వంచన చాతుర్యాల్ని సాద్యు లేకుండా ఆపోశన పట్టింది. అవి అన్నా స్వభావానికి పరాయివి. అన్నా యెవరిమీదా దోషారోపణ

చెయ్యలేదు, కాని ఆమెమీద దోషారోపణ జరిగింది. ఆమె నిజాయితీ, నైతిక పరిశుద్ధత అత్యంతవ్యంగా వుంటాయి. ఆమెమీద దోషారోపణ చేసే శక్తుల్లో చట్టం, మతం, జనాప వాదం లాంటి బలీయమైనవి వుంటాయి.

అన్నా "తిరుగుబాటు"కి కరేనిన్, లిదియా ఇవానొవ్నా, "దుష్ట శక్తి" అయిన జనాపవాదం దృఢంగా ప్రతిఘటన యివ్వడం జరుగుతుంది.

"దుష్ట మంత్రాంగ యంత్రం" అని పిలుస్తూ కరేనిన్ పట్ల అన్నాకి కలిగిన యేవగింపు దేశ కాలమాన పరిస్థితులనే బలమైన శక్తుల ముందు ఆమె అశక్తతనీ, యేకాకితనాన్నీ ప్రతి బింబిస్తాయంతే.

అన్నా హృదయం వ్రాన్స్కీ పట్ల ప్రేమకీ, కొడుకు పట్ల ప్రేమకీ మధ్య చీలి పోయిన ప్పుడు చట్టం, చర్చి పవిత్రం చేసిన వివాహబంధం అన్నాని విపరీతమైన దుర్భర పరిస్థితికి గురిచేస్తాయి. ఆమె ఆత్మావలోకనం చేసుకునే వేదనాభరిత క్రమంలో వున్న సమయంలో ఆమెకి దండన పడుతుంది.

కరేనిన్, లిదియా ఇవానొవ్నా, యితరులు ఖండించడానికి తమకి హక్కు వుందన్న పూర్తి నమ్మకంతో అన్నాని ఖండిస్తారు. మరి యీ హక్కు వాళ్లకి వాళ్ల బృందానికి దృఢంగా వున్న సంప్రదాయాలు ప్రసాదించేయి.

అన్నా యెందుకు చనిపోయింది? "ధగద్ధగాయమైన తేజస్సులో" ఆమె కళ్లముందు యావజ్జీవితం వొక్క పాటున దర్శనమవడంలో ఆమెకి తన విషాదం గోచరమైంది. మొత్తం జీవితాన్ని వొక అచంచల, ఉన్మాద సమీపవర్తమైన బిందువుకి "ప్రేమ" అవేదానికి కుంచింప చేసే అహం అనే కాంక్షకి ప్రాప్తించే విషాదం ఆమె విషాదం. "నా ప్రేమ రాను రాను కాంక్షాభరితమూ, స్వార్థపూరితమూ అవుతోంది..." అని అన్నా వొప్పుకుంటుంది.

టాల్‌స్టాయ్ మనస్తత్వ శాస్త్రవేత్తలాగా అంతరంగిక విరుద్ధ గతితర్కాన్ని చూపిస్తు న్నాడు. యిక్కడ స్వార్థంమీదనే కేంద్రితం అయినప్పుడు ప్రేమ యెలా పగగా పరిణమిస్తుందో చూపించడం వుంది.

తన మృతిద్వారా అందర్నీ శిక్షించాలని అన్నా నిర్ణయం చేసుకోవడంలో, "అతన్ని శిక్షిస్తాను, ప్రతివాళ్లనుంచీ నామంచీ వదిలించుకునేటట్టు చేస్తాను" అనుకోవడంలో ఆమెని ఆవేశించిన "పిశాచ అహంకారం" తెలుస్తుంది. ఆమెని వొక దుష్ట పిశాచం ఆవహించింది, "దూరీకరణ, శత్రుత్వ నియమం" ఆవహించింది. పురాతన ఆదర్శీకృత "ప్రేమ కాంక్ష" అధిగమించడంలో ప్రపంచ సాహిత్యంలో "అన్నా కరేనినా" మహా ధైర్యం ప్రదర్శించిన ప్రయోగం. టాల్‌స్టాయ్ అన్నా కరేనినామీద అభియోగం మోపేవాడు కాదు, సమర్థన చేసేవాడూ కాదు. జీవితం కోసం అహంకారపూరితంగా ఆమె చేసే పోరాటంలో సంభ వించిన మహా విషాదంలో దేన్నీ వదిలిపెట్టని చరిత్రకారుడు ఆయన.

"మానవ అంతరంగ పరమాద్భుత మానసిక విశ్లేషణ"గా "అపారమైన గాఢత్వం శక్తి" వున్నదిగా, దాస్తొయేవ్‌స్కీ చెప్పినట్టు "కళాత్మక వర్ణనలో అనిదంపూర్వమైన వాస్తవం"గా "అన్నా కరేనినా" సమకాలీనులని చకితుల్ని చేసింది.

కౌంటెస్ వ్రాన్‌స్కీ, యింకా ఆ బాపతు "ఉన్నత సమాజపు తెట్టు", అన్నామీద దోషారోపణ చేసే హక్కు తమకి వుంది అనుకుని దోషారోపణ చెయ్యడాన్ని ఆ హక్కుని టాల్‌స్టాయ్ గుర్తించలేదు. పశ్చాత్తాపం వాళ్లనుంచి రాలేదు. "అన్నా కరేనినా" తర్వాత రాసిన వో పుస్తకంలో టాల్‌స్టాయ్ యిలా రాస్తాడు. "ప్రజలు పొకళ్ల కొకళ్లకి తమకి తాము చాలా చెడు కలిగించుకుంటారు, దుర్బలులూ పాపిష్టి వాళ్లూ అయిన జనం యితరులని దండించే హక్కు తమకి వుందనుకోవడం వల్లనే అలా చేస్తారు. 'పగతీర్చుట నా పని; నేనే ప్రతిఫలమిత్తునని ప్రభువు చెప్పెను.' దండించేవాడు భగవంతుడొక్కడు, అదీ మానవుడి ద్వారానే."

యీ ఆఖరి పదబంధం టాల్‌స్టాయ్ తన పుస్తకానికి సూక్తిగా పెట్టిన బైబిల్ వాక్యానికి అనువాదం ("భగవంతుడొక్కడే దండించేవాడు"), వ్యాఖ్య ("అదీ మానవుడి ద్వారానే").

మనిషి చేసే చర్యలకీ, అనే మాటలకీ నైతిక బాధ్యత మనిషిదే అని టాల్‌స్టాయ్ విశ్వసించేడు.

అన్నా కరేనినా గాథ దోషం, నింద, మానవ ఆత్మ దోష విముక్తి అనే సమస్యల్ని విస్తృతంగా లేవనెత్తేందుకు టాల్‌స్టాయ్‌కి భూమిక మాత్రమే.

"యీ నవల మన జీవిత యావత్ వ్యవస్థని కఠోరంగా, నిర్దాక్షిణ్యంగా విచారణ చేస్తుంది" అని రష్యన్ కవి ఎ. ఫెట్ రాశాడు.

గాఢంగా రష్యన్ స్వభావాన్ని ప్రతిబింబించడమూ, అదే సమయంలో సార్వజనీనమూ అయినందుకే టాల్‌స్టాయ్ నవల మనకి ఆదరణీయం అవుతోంది. "అన్నా కరేనినా" కాలం యెప్పుడో పాతబడి పోయింది. కాని టాల్‌స్టాయ్ కళకి వార్ధక్యం లేదు. పైపెచ్చు నవలలోని ఆత్మిక ఔన్నత్యంతో, సమున్నత లక్షణాలతో విశిష్టమై సమకాలిక వ్యాప్తి పొందుతుంది.

"నేను రాసిన దాన్ని యీనాటి పిల్లలు యిరవై యేళ్ల తర్వాత చదువుతారని, వాళ్లు యేడిచి, హసించి జీవితాన్ని ప్రేమిస్తారని నాకు గనక తెలిస్తే, నేను నా యావజ్జీవితాన్ని, సకల శక్తుల్ని దానికే అంకితం చేసేవాణ్ని" అని టాల్‌స్టాయ్ రాశాడు.

యీ మాటల్ని రాసి వంద యేళ్లకి పైగా అయింది. రష్యాలో నిజంగా గుర్తింపు పొందిన యీ నవల "అన్నా కరేనినా" అనేక విదేశ భాషల్లోకి అనువాదం అయింది. "తడుముకోకుండా చెప్తాను ప్రపంచ సాహిత్యం మొత్తంలో 'అన్నా కరేనినా' మహత్తరమైన నవల"

అని థామస్ మాన్ రాశాడు. ప్రపంచ మంతటా టాల్‌స్టాయ్ సృజనాత్మక కృషి పట్ల గల అపార ఆసక్తికి కారణం రష్యన్ జీవిత చారిత్రక భవితవ్యం ప్రపంచ చరిత్రనుంచి అభేద్యంగా వుండడమూ, దానిమీద గొప్ప ప్రభావం కలిగించడమూనూ అని చెప్పొచ్చు. అందుకనే ప్రతి నూతన తరం టాల్‌స్టాయ్ కృతుల్ని కొత్తగా చదువుతుంది. ''అన్నా కరేనినా'' అనర్ఘ రత్నం. కాలం మారినా ''నిత్య హరితంగా, స్పందనాత్మకంగా'' వుండే మణిపూసల కోవకి చెందినది. ప్రపంచ సాహిత్యంలో యిలాంటి రచనలని వేళ్లమీద లెక్కపెట్టవచ్చు.

ఎడ్వర్డ్ బబాయేవ్

ఆన్నా
కరేనినా

మొదటి భాగం

పగతీర్చుట నా పని; నేనే ప్రతిఫల
మిత్తునని ప్రభువు చెప్పెను

1

సుఖపడే సంసారాలన్నీ ఒకలాగే వుంటాయి. సుఖంలేని సంసారాలకి మాత్రం దేని బాధలు దానివి.

అబ్లాన్‌స్కీల కాపరంలో ప్రతీదీ కంగాపుంగా అయిపోయింది. తమ పిల్లలకి అంతకు ముందు దాకా ఫ్రెంచి పంతులమ్మగా వున్నావిడతో భర్త ప్రేమ కలాపం నడిపిస్తున్నాడని భార్య కనిపెట్టింది. ఒకే వెన్నువాసం కింద తనింక కాపరం చెయ్యలేనని అతనితో చెప్పేసింది. పరిస్థితి యీ రకంగా మూడ్రోజులు సాగింది. భార్యా భర్తలే కాకుండా యింట్లో వున్న ప్రతివాళ్లూ కూడా పరిస్థితి అలా తయారైనందుకు బాధపడ్డారు. యిక కలిసి కాపరం చెయ్యడంలో అర్థం లేదనీ, అబ్లాన్‌స్కీల యింట్లో వుంటున్న తమకంటే సత్రంలో ఓ పూట తలదాచుకోవడానికి చేరేవాళ్ల మధ్య మరింత సఖ్యత వుంటుందనీ యింట్లో వున్న అందరూ అనుకున్నారు. భార్య తన గదులు వదిలి యివతలికి రాలేదు, మూడ్రోజులు భర్త యింటికి రాలేదు. పిల్లలు దిక్కులేని పక్షుల్లా యిల్లంతా కలయ దిరిగేశారు. ఇంటి వ్యవహారాలు చూసే ఆమెతో ఇంగ్లీషు పంతులమ్మ దెబ్బలాడింది. తనకి వేరే యింకో చోట పని చూడమని తన స్నేహితురాలికి ఆ పంతులమ్మ ఉత్తరం రాసేసింది. ముందు రోజు మధ్యాహ్నం భోజనాల వేళకే వంటవాడు వెళ్లిపోయాడు. వంటింట్లో పనిచేసే పనిపిల్లా, బండి తోలేవాడూ పనిలోనుంచి తప్పుకుంటాం అని తెలియజేశారు.

గొడవ జరిగిన మూడో రోజున ప్రిన్స్* స్టెపాన్ అబ్లాన్‌స్కీ — నాగరిక సమాజంలో మిత్రులు "స్తీవ" అని అతన్ని పిలుస్తారు — తన మామూలు వేళకి నిద్ర లేచాడు. అంటే పొద్దుట ఎనిమిది గంటలకి. ఆ లేవడం భార్య పడక గదిలో కాదు, చదువుకునే గదిలో, తోలు సోఫామీద. మంచి పోషణతో కమ్మెచ్చులు తీసినట్టున్న శరీరం అతనిది. సోఫామీద గట్టిగా తలగడ వాటేసుకుని, మళ్లీ గాఢ నిద్రలోకి జారిపోదామన్నట్టు బుగ్గ దానికి ఆనించి పక్కకి తిరిగేడు. ఒక్క ఉదుట్న లేచి కూర్చున్నాడు. కళ్లు తెరిచాడు.

'చూడాలి, చూడాలి యెలా జరిగిందిది?' అని అనుకున్నాడు, కలని గుర్తు చేసుకో ప్రయత్నిస్తూ. 'యింతకీ యెలా జరిగింది? ఆఁ, అవును! అలాబిన్ మమ్మల్ని దార్మ్‌స్తద్‌లో విందుకి పిలిచాడు. కాదు దార్మ్‌స్తద్ కాదు... యేదో అమెరికన్‌ది... అబ్బే, యీ దార్మ్‌స్తద్

అమెరికాలోదే! అదీ, అలాదిన్ గ్లాస్ టేబిల్‌మీద విందు చేశాడు – ఆ బల్లలు పాడలేదూ! నా మీద ఒట్టు! Il mio tesoro[1]. కాదు, Il mio tesoro కాదు... యింకా మంచిది కూడాను... ముచ్చటైన చిన్న వైన్ గ్లాసులు... వూఁ, ఆ వైన్ గ్లాసులు ఆడాళ్ళ...' అని గుర్తు చేసుకున్నాడు.

అబ్లాన్‌స్కీ కళ్ళు హుషారుగా మెరిశాయి. అతను అలా కల గంటూ చిరునవ్వు నవ్వాడు. 'భలే సరదాగా వుంది. భలే. బోలెడు ముచ్చటైన సంగతులూ వున్నాయి. కాని అన్నిట్నీ మాటలలో చెప్పలేం, వూహల్లో కూడాను. మెలుకువ వచ్చాక అనుకున్న వాటిని మాటల్లో చెప్పలేం.' కిటికీకి వేలాడుతున్న నర్జి తెరమీద వెలుతురు రేఖ కనిపించింది. అతను హుషారుగా కాళ్ళు సోఫాకిందికి తకామని వాల్చాడు. చెప్పులు పాదాలకి తగిలాయి. చెప్పులకి బంగారు రంగు నగిషీ వుంది. వాటికి పెళ్ళాం ఎంబ్రాయిడరీ చేసింది (మొన్న పుట్టిన రోజుకి కానుకగా). తొమ్మిదేళ్ల పాత అలవాటు ప్రకారం లేవకుండానే డ్రెస్సింగ్ గౌను అందుకోవడానికి మామూలుగా పడక గదిలో అది వేలాడే దిశలో చెయ్యి చాచాడు. అదుగో అప్పుడూ అతనికి తట్టింది తను భార్య పడక గదిలో పడుకోలేదనీ, చదువుకునే గదిలోననీ. యెందుకనో కూడా వెంటనే గుర్తుకొచ్చింది. చిరునవ్వు మాయమైపోయింది. కనుబొమలు ముడుచుకున్నాడు.

"అయ్యో! అఁ" అని, జరిగిందంతా గుర్తు చేసుకుని మూలిగాడు. భార్యతో జరిగిన దెబ్బలాట గురించీ, అధ్వాన్నమైన తన పరిస్థితి గురించీ, అన్నిటికంటె యెక్కువగా బాధ కలిగించిన తన నేరం గురించీ మనసులో వివరంగా గుర్తు చేసుకున్నాడు.

'ప్చ్, ఆమె నన్ను క్షమించదు. క్షమించలేదు కూడా. యీ వ్యవహారమంతట్లోనూ తప్పు నాదే. దోషిని నేనే. అయినా అంతా నా తప్పే కాదు. అదీ విచారించాల్సిన విషయం' అనుకున్నాడు. "అయ్యో, అయ్యో" అని బాధగా మూలిగాడు. తమ దెబ్బలాటలో తనకి పరమ దుఃఖకారకమైన క్షణాన్ని గుర్తు చేసుకుని హతాశుడై అలా రెట్టించుకున్నాడు.

అన్నిటికంటె దారుణంగా ముల్లులా గుచ్చుకుంటూ వున్నది మొదటి క్షణం. పెళ్ళాం కోసమని పెద్ద బేరీ పండు పట్టుకుని హుషారుగా, సంతోషంగా థియేటర్‌నుంచి యింటికి వచ్చాడు. ఆవిడ డ్రాయింగ్ రూమ్‌లో కనిపించలేదు. చదువుకునే గదిలోనూ కనిపించలేదు. ఆశ్చర్యం వేసింది. ఆఖరికి ఆవిడ పడక గదిలో కనిపించింది. అదుగో ఆ పాపిష్టి చీటీ పట్టుకుని, కొంప ముంచిన ఆ చీటీ పట్టుకుని, కనిపించింది.

యెప్పుడూ కుటుంబం గురించే తపనపడే దాలీ, యెప్పుడూ హడావుడిగా వుండే దాలీ, అతని అభిప్రాయం ప్రకారం తెలివితేటలు అంతగాలేని దాలీ, ఆ చీటీ పట్టుకుని చలనంలేకుండా కూచుంది అక్కడ. అతని కేసి భీతిగా, నిరాశగా, కోపంగా అలా చూస్తూ కూచుంది.

"యేమిటిది? యేమిటి?" అని అడిగింది చీటీ చేత్తో పట్టుకుని.

---

*[1] నా ప్రాణం (ఇటాలియన్).

ఆ దృశ్యం గుర్తుకు వచ్చినప్పుడు — యెప్పుడూ అలానే జరుగుతూ వుంటుంది — తన భార్య మాటలకి తను యిచ్చిన జవాబుకి బాధ పడినంతగా ఆ పరిస్థితికి బాధ పడలేదు.

శుద్ధ తప్పుడు పని చేసినప్పుడు యెవళ్లైనా అనుకోకుండా దొరికిపోతే యేం జరుగుతుందో అదే అతనికి ఆ క్షణంలో జరిగింది. తన తప్పుడు పని బయట పడిపోయిన తర్వాత యేర్పడ్డ పరిస్థితికి సర్దుబాటుగా వాలకం పెట్టే వ్యవధి కూడా లేకపోయింది. కోపంతో తేపురించుకు పోవడానికి బదులు, అంతా అబద్ధం అని కొట్టి పారెయ్యడానికి బదులు, తన నేరం లేదని రుజువు చేసుకోవడానికి బదులు, పొరపాటైందని చెప్పుకోవడానికి బదులు, కనీసం ఉదాసీనంగా వున్నట్టు కనిపించడానిక్కూడా బదులుగా అతని పెదాలు అప్రయత్నంగానే తనకి మామూలుగా వుండే సాధు స్వభావపు తెలివి తక్కువ చిరునవ్వుతో విరిసేయి. దద్దమ్మ, తను అప్పుడు చేసిన దానికంటే వేరే ప్రయత్నాలు యేవైనా అంతకంటే బాగానే వుండేవి ("అసంకల్ప ప్రతీకార చర్య" అనుకున్నాడు. శరీరశాస్త్రం అంటే అతనికి ఆసక్తి).

ఆ తెలివి తక్కువ చిరునవ్వే పొరపాటయిపోయింది. ఆ చిరునవ్వు చూసి నొప్పితో వొళ్లు మెలితిప్పినట్టు దాలీ బాధపడి కదిలింది. వ్వరన రేగిపోయి, విరుచుకు పడిపోతూ మంటంతా వెళ్లగక్కింది. గదిలోనుంచి దూసుకుని వెళ్లిపోయింది. ఆ క్షణంనుంచీ పట్టుదలగా భర్త ముఖం చూడకుండా తప్పించుకు తిరిగింది.

'ఆ వెకిలి చిరునవ్వు వనే యిదంతా' అనుకున్నాడతను.

'యేం చెయ్యాలి? యేం చెయ్యాలి?' అనుకున్నాడు నిరాశగా. జవాబు దొరకలేదు.

2

అబ్లాన్‌స్కీ ఆత్మవంచన చేసుకోలేదు. తను చేసింది తప్పుడు పని అని పశ్చాత్తాప పడినట్టు తనలో తను నటించుకో లేకపోయాడు. తను ముప్పై నాలుగేళ్ల వాడు. అందగాడు. రసికప్రవృత్తి వున్న మనిషి. అలాంటి తను, రెండు కాన్పులు పోయినా యింకా అయిదుగురు పిల్లలకి తల్లి, తనకంటే ఒక యేడాదే చిన్నదీ అయిన తన భార్యని ప్రేమించడం లేదని పశ్చాత్తాప పడలేకపోయాడు. యీ తప్పు పనిని పెళ్లాం కంటబడకుండా మరింత బాగా దాచిపెట్టలేకపోయానే అని మాత్రమే బాధపడ్డాడు. తన పరిస్థితి యెంత తీవ్రంగా వుందో అతను గుర్తించాడు. భార్యపట్ల, పిల్లలపట్ల, తనపట్ల అయ్యో పాపం అనిపించింది. ఆమె అంత కష్ట పెట్టుకుంటుందని తెలిసుంటే బహుశా తను మరింత జాగ్రత్తగా వుండే వాడేమో. అతను దీన్ని గురించి యావత్తూ తనకిగా తను ఆలోచించుకోలేదు. కాని తన భార్య తను యేక పత్నీవ్రతుడుగా వుండలేదని తెలుసుకోవాలనీ, అలా అని చాలా కాలంగా తెలిసి వుండి ఆ విషయాన్ని పట్టించుకోకుండా వుందనీ అతను అస్పష్టంగా వూహించుకున్నాడు. తనేమో కాన్పులతోటి వన్నె తగ్గిపోయింది. పడుచుది కాదు యిక. అందమూ పోయింది. మామూలు

తల్లి మాత్రమే – మంచి తల్లే కావచ్చును. అంచేత న్యాయంగా చెప్పాలంటే ఆమె మాసీ చూడనట్టు వదిలెయ్యాలి అని అతనికి అనిపించింది. కాని యిప్పుడు చూస్తే పరిస్థితి తద్దు తలకిందులుగా వుంది.

'ఎంత దారుణం! అయ్యో నిజంగా యెంత దారుణం!' బయటపడే దారి యేమీ తోచక అబ్లాన్‌స్కీ తనకి తనే అనుకున్నాడు. 'యిది జరక్కా ముందుదాకా అంతా యెంత హాయిగా వుంది! యెంత చక్కగా గడిపాం! ఆమె పిల్లల్ని చూసి సంతోషపడింది, తృప్తిపడింది. నేను ఆమెకి యే విషయంలోనూ అడ్డం చెప్పలేదు. యింటి బాధ్యత అంతా తనకే అప్పగించాను. తన యిష్టం వచ్చినట్టు పిల్లల్ని పెంచనిచ్చాను. "ఆమె" పిల్లలకి పంతులమ్మగా వుండడం, న్ప్, యేం బాగా లేదు నిజమే. అది మాత్రం యేం బాగా లేదు, యేష్కి! పిల్లలకి పంతులమ్మగా వున్న ఆమెని చేరదియ్యడం చిల్లరగానూ, నీచంగాను వుంటుంది. కాని యెలాంటి పంతులమ్మ! (M-lle Roland చిరునవ్వు, ఆమె నల్లని చిలిపి కళ్ళు అతని ముందు రూపు కట్టాయి.) అయినా ఆమె యీ యింట్లో వున్నంత కాలం నేను యేం చనువుగా వుండలేదే. అధ్వాన్నమైన సంగతేమంటే ఆమె అప్పటికే.... అయ్యో రాతా, యిది తెలియకుండా యెలా జరిగింది? యిప్పుడేం చెయ్యాలి?'

పరిష్కారం లేని పరమ క్లిష్టమైన సమస్యలకి జీవితమే అందించే సార్వజనీన సమాధానం తప్పిస్తే సమాధానం లేదు. ఆ సమాధానం యేమిటి? రోజువారీ పనుల్లో మునిగిపోయి యీ సమస్యల్ని మరిచిపోవడం. కలల్లో మునిగి పోలేదు కదా, వైన్ గ్లాసుల ఆడవాళ్ళ పాడే సంగీత లోకంలోకి వెళ్ళలేదు, కనీసం రాత్రయే దాకానైనా, అంచేత నిత్య జీవిత స్వప్నంలో మునిగిపోవాలి.

'సరే, కానీ చూద్దాం' అనుకున్నాడు అబ్లాన్‌స్కీ. అనుకుని లేచాడు. బూడిదరంగు డ్రెస్సింగ్ గౌను తొడుక్కున్నాడు. దానికి నీలం పట్టు అస్తరు వుంది. దాని కుచ్చుతాడు లాగి ముడి వేసుకున్నాడు. గట్టిగా ఛాతీ నిండుగా గాలి పీల్చాడు. అతనిది భారీ శరీరం. కాళ్ళు యెడంగా పెట్టి సునాయాసంగా నడిచి పెద్ద అంగవేస్తూ కిటికీ దగ్గరికి వెళ్ళాడు. తెర యెత్తి గంట మోగించడానికి తాడుని గట్టిగా గుంజాడు. వెంటనే మత్వేయ్ అతని బట్టలూ, బూట్లూ, ఓ టెలిగ్రామ్ పట్టుకుని లోపలికి వచ్చాడు. మత్వేయ్ అతని సేవకుడు, పాత నేస్తం. మత్వేయ్ వెనక్కాలే పొది పట్టుకుని, మంగలి వచ్చాడు.

"ఆఫీసునుంచి కాగితాలేమన్నా వచ్చాయా?" అని టెలిగ్రాం అందుకుంటూ అడిగాడు అబ్లాన్‌స్కీ. అద్దం ముందు కూచున్నాడు.

"మీ రాతబల్ల మీదున్నాయి" అన్నాడు మత్వేయ్. యజమాని కేసి ప్రశ్నార్థకంగా, జాలిగా చూశాడు. కొంచెం ఆగి, తర్వాత "గుర్రాలశాలాయన మనిషొచ్చాడు" అని నాలిముచ్చులా చిరునవ్వు నవ్వుతూ అన్నాడు.

అబ్లాన్‌స్కీ జవాబేం చెప్పకుండానే మత్వేయ్‌ని అద్దంలో చూశాడు. అద్దంలో వాళ్ళ

చూపులు కలిశాయి. ఒకళ్లు చెప్పిందొకళ్లకి అర్థమైందని తెలుస్తూనే వుంది. 'యీ విషయం నాకెందుకు చెప్పినట్టు నువ్వు? పరిస్థితులెలా వున్నాయో నీకు తెలుసు కదా' అంటున్నట్టున్నాయి అబ్లాన్‌స్కీ కళ్లు.

మత్వేయ్ చొక్కా జేబుల్లో చేతులు పెట్టి ఓ కాలు ముందుకు చాచి యజమానికేసి మాట్లాడకుండా, సానుభూతిగా చూశాడు. అతని ముఖంమీద మందహాసపు ఛాయ కనిపించింది.

"మళ్లీ ఆదివారం రమ్మని చెప్పాను. అప్పటిదాకా వృథాగా మిమ్మల్ని బాధపెట్టద్దనీ తను బాధపడద్దనీ చెప్పాను" అన్నాడు. యీ మాటల్ని ముందుగానే వల్లించుకున్నట్టుంది.

ఖుషీపరచాలనీ తనని గుర్తించాలనీ మత్వేయ్ అలా అన్నాడని అబ్లాన్‌స్కీ గ్రహించాడు. టెలిగ్రాం చింపి యెప్పటిలాగా వర్ణక్రమం తప్పులతో వున్న మాటల అర్థం వూహించుకుంటూ చదువుకున్నాడు. అతని ముఖం వెలిగింది.

"మత్వేయ్, అన్నా అక్కయ్య రేపొస్తోంది" అన్నాడు. ఉంగరాలు తిరిగిన నిడుపాటి చెంపల దగ్గర యెర్రగా వున్న చోట మంగలి నిగనిగలాడే బుంగ చేత్తో సవరిస్తూ వుంటే అబ్లాన్‌స్కీ అతన్ని ఓ క్షణం ఆపి యీ మాట అన్నాడు.

"దేముడి దయవల్ల" అన్నాడు మత్వేయ్. ఆవిడ రాక ప్రాముఖ్యం తన యజమాని అంతగా తనూ గ్రహించినట్టు ఆ జవాబులో కనిపించాడు. అబ్లాన్‌స్కీ అభిమాన పాత్రురాలైన అక్కగారు అన్నా. ఆవిడ భార్యా భర్తలని ఫొక్తు పరుస్తుందని యిద్దరూ ఆశగా వున్నారు.

"ఒక్కరేనా, ఆయన కూడా వస్తున్నారా?" అని మత్వేయ్ అడిగాడు.

మంగలి మీసాల పనిలో వున్నాడు. అబ్లాన్‌స్కీ మాట్లాడలేకపోయాడు. అందుకని ఒక వేలు యెత్తి చూపించాడు. మత్వేయ్ అద్దంలోకి చూస్తూ తల ఆడించాడు.

"ఒక్కరే నన్నమాట. ఆవిడగారికి పైన గది యేర్పాటు చేయించ మంటారా?"

"అమ్మగారికి చెప్పు. ఆమె పురమాయిస్తుంది."

"అమ్మగారికా?" అని అనుమానంతో మత్వేయ్ రెట్టించాడు.

"వూ, ఆమెకి చెప్పు. యిదుగో యీ టెలిగ్రాం తీసికెళ్లి ఆమెకియ్యి. ఆమె యేమంటుందో నాకు చెప్పు."

'ఆమెతో సర్దుబాటు చేసుకో ప్రయత్నిస్తున్నాడల్లే వుంది' అనుకున్నాడు మత్వేయ్. కాని "అలాగే నయ్యా" అని తప్ప యేమీ అన్లేదు.

కిర్రుకిర్రు బూట్లు చప్పుడు చేసుకుంటూ, చేత్తో టెలిగ్రాం పట్టుకుని మత్వేయ్ మెల్లిగా వెనక్కి తిరిగి వచ్చేడు. అప్పటికి అబ్లాన్‌స్కీ ముఖం కడుక్కుని తలదువ్వుకుని బట్టలు వేసుకోవడానికి తయారుగా వున్నాడు. మంగలి వెళ్లిపోయాడు.

"తను వెళ్లిపోతున్నానని నన్ను మీతో చెప్పమన్నారు అమ్మగారు. ఆయన్ని – అంటే మిమ్మల్ని – తన యిష్టం వచ్చినట్టు చేసుకొమ్మని చెప్పమని అన్నారు." మత్వేయ్ కళ్ల

తోనే నవ్వాడు. తల పక్కకి ఒరగేసి కేబుల్లో చేతులు పెట్టుకుని యజమానికేసి చూస్తూ నుంచుండిపోయాడు.

కొంచెం సేపు అబ్లాన్‌స్కీ యేం అనలేదు. తర్వాత దయగా, కొంచెం జాలిగా వుండే చిరునవ్వు అతని అందమైన ముఖంమీద దోగాడింది.

"నీకెలా అనిపించింది మత్వేయ్?" అని అడిగాడు, తల వూపుతూ.

"మరేం బెంగ పడకండయ్యా, అన్నీ సర్దుకుంటాయి" అన్నాడు మత్వేయ్.

"సర్దుకుంటాయా? ఆఁ, అలా అంటావా?" అన్నాడు. గుమ్మం అవతల గౌను అంచులు రెపరెపలాడ్డం వినిపించింది. "ఎవరక్కడ?" అని అబ్లాన్‌స్కీ అడిగాడు.

"నేనయ్యా" అంది కమ్మగా బింకంగా వొక ఆడమనిషి కంఠం. గుమ్మందగ్గర మాత్రోనా కనిపించింది. ఆమె దాది. ఆమె ముఖం గంభీరంగా వుంది. ముఖంమీద స్ఫోటకం మచ్చలు వున్నాయి.

"యేమిటి సంగతి మాత్రోనా?" అని అబ్లాన్‌స్కీ గుమ్మం దాటి వెడుతూ అడిగాడు.

అబ్లాన్‌స్కీ భార్య పట్ల పెద్ద తప్పు చేసాడు. ఆ విషయం అతనికే బాగా తెలును. అయినా దాదితోసహా యింట్లో వున్న వాళ్ళ చాలామంది అతని పక్షమే వున్నారు. మాత్రోనా పిల్లలకి దాది. ఆమె అతని భార్యకి అండగా వుంటుంది.

"యేమిటి?" అని అతను జావగారి పోయి అడిగాడు.

"ఆమె దగ్గరికి రండయ్యా. పొరపాటై పోయిందని యింకో సారి చెప్పండి. దేవుడు చల్లగా చూస్తే దానివల్ల మేలు జరుగుతుంది. ఆమెని చూడలేకుండా వున్నాం. కడుపు తరుక్కుపోతోందయ్యా, కడుపు తరుక్కుపోతోంది. యిల్లంతా చిందర వందరైపోయింది. పిల్లల గురించేనా అనుకోండయ్యా. పొరపాటై పోయిందని ఆమెకి చెప్పండి. యేం చెయ్యలేం మరి. కొట్టిన చెయ్యే కోరుతుందయ్యా."

"కాని ఆమె ఒప్పుకోదే..."

"మీరు చెయ్యాల్సింది మీరు చెయ్యండయ్యా. దేవుడు చల్లగా చూస్తాడు. దేవుణ్ణి తలుచుకోండయ్యా తలుచుకోండి."

"వూఁ, సరే అయితే. నువ్వెళ్ళు" అని అబ్లాన్‌స్కీ తక్కున సిగ్గుపడ్డాడు. "కానీ, బట్టలు వేసుకునే వేళయింది" అన్నాడు మత్వేయ్‌తో డ్రెస్సింగ్ గౌన్ తకామని విసిరేస్తూ.

మత్వేయ్ అప్పటికే చొక్కాని పట్టుకు తయారుగా నుంచున్నాడు. చొక్కామీద కేని మరకని దేన్నో వూది, యజమాని నున్నటి వొంటికి తృప్తిగా చొక్కాని తొడిగాడు.

3

అబ్లాన్‌స్కీ బట్టలు తొడుక్కున్నాక పైన కొంచెం అత్తరు చల్లుకున్నాడు. చొక్కా చేతులని మణికట్ల దగ్గర సరి చేసుకున్నాడు. సిగరెట్లని, యాదాస్తు పుస్తకాన్ని, అగ్గిపెట్టెని,

చిన్న చిన్న బొమ్మలు, విలువైన రాళ్ళు వున్న ఒంటి గొలుసు గడియారాన్ని, వాటివాటి స్థానాల్లో పెట్టుకున్నాడు. కేబు రుమాల్ని తీసి దులిపాడు. తనకా దురదృష్టం దాపురించినా గాని ఆరోగ్యంగా శారీరకంగా ఉత్సాహంతో వున్నట్టు, ఉద్రంగా, ఘుమ ఘుమ లాడుతూ యేం ఆందోళన లేనట్టు కనిపించే రీతిలో భోజనాల గదిలోకి లాఘవంగా అడుగులు వేస్తూ వెళ్లాడు. అక్కడ అతనికోసం కాఫీ తయారుగా వుంది. కాఫీ కప్పు పక్కనే ఉత్తరాలు, ఆఫీసు కాగితాలు వున్నాయి.

ఉత్తరాలని చదివాడు. ఒకటి అసంతృప్తిగా వుంది. తన భార్య ఎస్టేట్‌లో వున్న అడివిలో కలపని కొనబోయే వర్తకుడు రాసిన ఉత్తరం అది. ఆ కలపని అమ్మక తప్పదు. కాని పెళ్లాంతో సఖ్యత కుదిరేదాకా ఆ విషయం గురించి చర్చించే ప్రసక్తి లేదు. యీ సఖ్యత వ్యవహారంతో డబ్బు లావాదేవీలని కలగాపులగం చెయ్యడం కంటే యిబ్బంది కరమైంది మరోటి వుండదు. తమ సంబంధాలు డబ్బు వ్యవహారాలకి లోబడ్డం, ఆ కలపని అమ్మేసేటందుకే సఖ్యతకోసం తను నిజానికి ప్రయత్నించడం – అనుకుంటేనే అవమానంగా వుంటాయి.

ఉత్తరాలు చదివాక అబ్లాన్‌స్కీ ఆఫీసు కాగితాలు తీశాడు. గబగబా ఆ దస్త్రాలు తిరగేశాడు. పెద్ద పెన్సిల్‌తో యేవో మాటలు గిలికాడు. కాఫీ హాయిగా తాగేందుకుగ్గాను వాటిని పక్కన పెట్టేశాడు. కాఫీ తాగుతూ ఉదయం పత్రికని తెరిచాడు. దానికి యింకా అచ్చు సిరా చెమ్మ పోలేదు.

అబ్లాన్‌స్కీ అతివాద పత్రికని గాక, అధిక సంఖ్యాకులు ఆమోదించే ధోరణిగల ఉదారవాద పత్రికకి చందాకట్టి తెప్పించి చదివేవాడు. అతనిగ్గా ప్రత్యేకం విజ్ఞానశాస్త్రం అన్నా, కళలన్నా, రాజకీయాలన్నా పెద్ద ఆసక్తి లేదు. అయినా యీ అన్ని రంగాల్లోనూ అతను అధికసంఖ్యాకులకీ, యీ పత్రికకీ వుండే అభిప్రాయాలకే కచ్చితంగా కట్టుబడ్డాడు. అధిక సంఖ్యాకులు తమ అభిప్రాయాలను మార్చుకున్నప్పుడే తనూ మార్చుకున్నాడు. అతనసలు యెన్నడూ వాటిని మార్చుకోలేదనడం మరింత సబబుగా వుంటుంది. అభిప్రాయాలు వాటంతట అవే అనుకోకుండానే అతనిలో మారిపోయేయి.

అబ్లాన్‌స్కీ తన అభిప్రాయాల్ని, దృక్పథాల్ని యెంచుకోలేదు తన టోపీలని, కోట్లని ఫాషన్లనీ యెంచుకోనట్టే. అప్పటికి యేవి ఫాషన్‌గా వుంటే వాటినే పట్టుకుంటారు. అలాగే దృక్పథాలూ, అభిప్రాయాలూ వాటంతట అవే వచ్చేవి. వయసుతోబాటు మామూలుగా మేధా కార్యకలాపవు అవసరం వస్తుంది. తను ఒక ప్రత్యేక బృందంలో బతుకుతున్నాడు. అంచేత టోపీల్ని పెట్టుకున్నట్టుగానే అభిప్రాయాల్ని పట్టుకోవడం అవసరంగా కనిపించాయు తనికి. కన్సర్వేటివ్ ధోరణికి బదులుగా (అతని బృందంలో చాలామంది అవలంబించిన ధోరణి) ఉదారవాద ధోరణిని అతను అవలంబించినందుకు కారణం యేదన్నా వుందీ అంటే అది ఉదారవాద ధోరణి మరింత హేతుబద్ధంగా వుందనుకోవడంవల్ల కాదు, అది అతని జీవిత విధానానికి మరింతగా నప్పడమే. రష్యాలో ప్రతిదీ దోష భూయిష్టంగానే వుందని ఉదార

వాద పార్టీ అంది. మరి ఖాయంగా అబ్లానిస్కీకి బోలెడన్ని రుణాలూ, అతి తక్కువ డబ్బూ వున్నాయి. వివాహ వ్యవస్థ పుచ్చి పోయిందనీ దాన్ని పునర్ నిర్మించాలనీ ఉదారవాద పార్టీ అంది. మరి ఖాయంగా అబ్లానిస్కీకి సంసార జీవితం యేం సంతృప్తిగా లేదు. దానివల్లనే అబద్ధం చెప్పాల్సి వచ్చింది, మోసం చెయ్యాల్సి వచ్చింది. యిది అతని స్వభావానికి వ్యతిరేకం. మతం అనేది జనాభాలో అనాగరికంగా వున్న భాగాన్ని అదుపులో వుంచుకునేందుకు సాధనం మాత్రమే తప్ప మరేం కాదని ఉదారవాద పార్టీ అంది. మరి ఖాయంగా అబ్లానిస్కీ చర్చిలో చిన్న ఆరాధనక్కూడా కాళ్ళు తీపులు పెట్టకుండా నుంచోలేడు. యీ లోకం యింత కులాసాగా జరిగే చోటుగా వున్నప్పుడు పరలోకం గురించి భయ పెట్టే ఆ గంభీర పదగుంఫన లేమిటో యెన్నటికీ అతనికి అర్థం కాదు. పైగా అబ్లానిస్కీకి సరాదికా లాడ్డం సరదా. తన పూర్వులని గురించి యెవడైనా గొప్పగా చెప్పుకునేటప్పుడు రూరిక్* దాకా వెళ్లి ఆగడం దేనికి అసలు మూలానికి, అంటే వానరం దగ్గరికి, వెళ్లి పోవచ్చు కదా అని ఒకో అప్పుడు ఓ చర్చి అనుయాయిని బెదరేసేవాడు. అంచేత ఉదారవాద ధోరణి అబ్లానిస్కీకి ఒక అలవాటు అయింది. భోజనానంతరం యిష్టపడే చుట్టలాగా ఆ పత్రిక అంటే యిష్టం కలిగింది. ఆ చుట్ట బుర్రకి కొద్దిగా తిమ్మిరి కలిగిస్తుంది. అతను సంపాదకీయాన్ని చదివాడు. మన రోజుల్లో కన్సర్వేటివ్ అంశాల్ని తీవ్రవాదం కబళించే ప్రమాదం ఉందనీ, విప్లవం అనే వెయ్యి తలల పాముని అణిచే బాధ్యత ప్రభుత్వంమీద వుందనీ అల్లరి గోలా చెయ్యడం శుద్ధ దండగ, తద్వ్యతిరేకంగా... "మా అభిప్రాయంలో ప్రమాదం అనేది కల్పిత విప్లవ సర్పంలో లేదు కాని పురోగతిని అడ్డగించే మొండి సంప్రదాయంలో వుంది..." అనీ యింకా అలాఅలా వివరించిందా వ్యాసం. అతను యింకో వ్యాసం చదివాడు. యిది అర్థశాస్త్ర వ్యాసం. అందులో బెంథామ్, మిల్‌ల పేర్లు ప్రస్తావించి* ఆర్థిక మంత్రి వర్గం గురించి తప్పపడుతూ చూచాయగా విసుర్లున్నాయి. ఆ విసుర్లు యేమిటైందీ, యెవరు యెవర్ని గురించి చేసిందీ, వాటిని యెవళ్లమీదకి యెక్కు పెట్టిందీ యే ప్రేరణవల్ల జరిగిందీ మహా సునాయసంగా పట్టేశాడు. యెప్పటి లాగానే అది అతనికి చెప్పుకోదగ్గ తృప్తిని యిచ్చింది. కాని యివాళ మాత్రోనా సలహో, కుటుంబంలో కలతా గుర్తు వచ్చి ఆ తృప్తి చెడిపోయింది. కౌంట్ బేయిన్స్ట్* వీయెన్‌బాడెన్‌కి బయల్దేరినట్టు అనుకుంటున్నారట. జుట్టు నెరిసి పోకుండా మందు వుందట. ఓ చెకడా బండి అమ్మకానికి వుందట. ఓ పడుచామె వరుని కోసం చూస్తోందట. యీ వార్తలు కూడా అతను చదివాడు. కాని యీ సమాచారాలేవీ కూడా అతనికి మామూలుగా కలిగించే అంతరంగిక, పరిహాస తృప్తిని కలిగించలేదు.

వెన్న రాసిన రొట్టె తిని రెండో కప్పు కాఫీ తాగి పేపరు చదవడం పూర్తి చేసి లేచాడు. వెయిస్ట్ కోటుమీద పడ్డ తునకల్ని దులుపుకున్నాడు. భుజాలు విరుచుకుని సంతోషంగా చిరునవ్వు నవ్వేడు. అంటే సంతోషంగా వుండే దేన్ని గురించో అనుకుంటున్నాడని కాదు. సంతోషపు మందహాసం మంచి జీర్ణశక్తివల్ల వచ్చినటువంటిది.

కాని తక్షణం ఆ హుషారైన చిరునవ్వుతో అన్నీ గుర్తుకు వచ్చేయి. అతను ఆలోచనలో మునిగిపోయేడు.

గుమ్మం అవతలినుంచి పిల్లల గొంతుకలు వినిపించాయి. చిన్న కొడుకు గ్రీషరీ, పెద్దమ్మాయి తాన్యాదీ కంఠాలు గుర్తుపట్టేడు. వాళ్ళు దేన్నో తోస్తూ కిందపారేసినట్టే వుంది.

"ప్రయాణీకుల్ని పైన యెక్కించద్దని చెప్పాను నీకు" అని ఆ చిన్న పిల్ల ఇంగ్లీషులో అరిచింది. "యిప్పుడు యెక్కించుకో పిల్లని" అంది.

'అంతా గందరగోళంగా వుంది, సంరక్షణ చూసేవాళ్ళు యెవళ్ళూ లేక పిల్లలు వాళ్ళ మానాన వాళ్ళు అటూ యిటూ తిరిగేస్తున్నారు' అనుకున్నాడు అబ్లాన్‌స్కీ. గుమ్మం దగ్గరికెళ్ళి వాళ్ళని పిలిచాడు. వాళ్ళు పెట్టెని రైలు బండిలాగా మార్చి ఆడుకుంటున్నారు. దాన్ని వదిలేసి తండ్రి దగ్గరికెళ్ళారు.

ఆ చిన్న పిల్ల అంటే అతనికి యెక్కువ యిష్టం. ఆ పిల్ల తొణుకూ బెణుకూ లేకుండా అతని దగ్గరికెళ్ళింది. చేతులు అతని మెడ చుట్టూ వేసి నవ్వుతూ వూగింది. అతని చెంపల అత్తరువాసనకి యెప్పటిలాగానే మురిసింది. అతని ముఖం జాలిగా మెరిసింది, వంగడంవల్ల ఎర్రబారింది. ఆ పిల్ల అతని ముఖం ముద్దు పెట్టుకుని అతన్ని వదిలేసింది. పరిగెత్తి వెళ్ళిపోయి వుండేదే కాని అతను ఆపేడు.

"అమ్మ యేం చేస్తోంది?" అని మృదువుగా నున్నగా వుండే ఆమె కంఠంమీద చేతిని పోనిస్తూ అడిగాడు. "ఏరా?" అని తన దగ్గరికి వచ్చిన చిన్న పిల్లాణ్ణి చిరునవ్వు నవ్వుతూ పలకరించాడు.

కుర్రాడికంటే ఆ పిల్ల పట్ల తను యెక్కువ ఆదరం చూపిస్తున్నట్టు అబ్లాన్‌స్కీకి తెలుసు, కాని తన మొగ్గ పొకళ్ళ పట్లే చూపిస్తున్నట్టు కనిపించకుండా చెయ్యాలనే యెప్పుడూ ప్రయత్నం చేసేవాడు. కాని ఆ కుర్రాడది గ్రహించాడు. తండ్రి ముఖావంగా నవ్వి పలకరించిన దానికి ఉలకలేదు.

"అమ్మా? యిప్పుడే లేచింది" అని చెప్పిందా పిల్ల.

అబ్లాన్‌స్కీ నిట్టూర్పు విడిచాడు. 'అంటే ఆమెకి మరో రాత్రి నిద్ర లేదన్నమాట' అనుకున్నాడు.

"అమ్మ హుషారుగా వుందా?"

అమ్మా నాన్నా దెబ్బ లాడుకున్నారనీ, అందుకనే అమ్మ హుషారుగా లేదనీ, ఆ విషయం తండ్రికి తెలుసనీ, యధాలాపంగా ఆ ప్రశ్న అడగడంలో వూరికే నటిస్తున్నాడనీ ఆ పిల్లకి తెలుసు. ఆమె తండ్రికేసి చూసి సిగ్గుపడింది. అతనికి అర్థం అయింది. తనూ సిగ్గుపడ్డాడు.

"నాకు తెలీదు. యివాళ పాఠాలు చదవక్కర్లేదట. మిస్ హల్‌తో కలిసి అమ్మమ్మ దగ్గరికి షికారు వెళ్ళమని అంది" అని చెప్పిందా పిల్ల.

"అయితే మరి వెళ్లండమ్మా. ఆఁ, ఒక్క క్షణం వుండు" అన్నాడు. ఆ పిల్లని ఆపి ఆమె మెత్తటి చిన్న చేతిని నిమిరాడు.

చలినెగడు తినెమీద పెట్టిన చాకొలెట్ల పెట్టె తీశాడు. అంతకు ముందు రాత్రి దాన్నక్కడ పెట్టేడు. ఆ పిల్లకి ఒక చాకొలెట్‌నీ, ఒక స్వీట్‌నీ యేరి ఆమెకి పెట్టాడు.

"గ్రీషకా?" అంది, చాకొలెట్ కేసి చూస్తూ.

"వూఁ." అతను ఆమె భుజం మళ్లీ నిమిరి మెడమీద జుట్టు చివర ముద్దు పెట్టుకున్నాడు. తర్వాత వెళ్లి పోనిచ్చాడు.

"బండి సిద్ధంగా వుంది" అన్నాడు మత్వేయ్. "యేదో అడగాలని ఒకావిడ వచ్చింది" అని జతచేశాడు.

"చాలా సేపయిందా?" అని అబ్లాన్‌స్కీ అడిగాడు.

"అరగంటో యేమో అయింది."

"యెవళ్లైనా వస్తే వెంటనే చెప్పమని నీకెన్ని సార్లు చెప్పాను?"

"మీరు ప్రశాంతంగా కాఫీయేనా తాక్కూడదేమిటి?" అన్నాడు మత్వేయ్ స్నేహితంగా వుండే నిష్ఠూరంతో. దానివల్లనే అతనిమీద కోపగించుకోవడం అసాధ్యం అవుతుంది.

"వూ, సరే ఆమెని పంపించు గబగబా" అని అబ్లాన్‌స్కీ, విసుగ్గా మొహం చిట్లించుకుని అన్నాడు.

ఆమె కలీనిన్ అనే సబ్ కేప్టెన్* వితంతువు. ఆమె యేదో తెలివి తక్కువ కోరిక కోరింది. ఆ కోరికని తీర్చడం కుదరదు. కాని అబ్లాన్‌స్కీ అలవాటు ప్రకారం ఆమెని కూర్చోమ్మని కుర్చీ చూపించాడు. మధ్యమధ్య ఆమె మాటలకి అడ్డం వెళ్లకుండా ఆమె చెప్పింది శ్రద్ధగా విన్నాడు. యెవర్ని కలుసుకోవాలో వివరంగా చెప్పి సలహా యిచ్చాడు. ఆమెకి సాయం చెయ్యగల పెద్దమనిషికి తన గొలుసు రాతతో పెద్ద అక్షరాలతో ఒక చీటీ కూడా గబగబా చక్కగా రాసి యిచ్చాడు. ఆమెని సాగనంపాక అబ్లాన్‌స్కీ టోపీ తీసుకుని ఓ క్షణం ఆగేడు. యేమన్నా మర్చిపోయానేమోనని చూసుకున్నాడు. అతను యేమీ మర్చిపోలేదు తను మర్చిపోవాలని అనుకున్నది తప్ప: భార్య.

"హూఁ! ఆఁ!" అతను తల వాల్చుకున్నాడు. అందమైన అతని ముఖంమీద విచారరేఖ కమ్మింది 'ఆమె దగ్గరికి, వెళ్లడమా మానడమా?' అనుకున్నాడు. వెళ్లడంలో అర్థంలేదని అంతరాత్మ చెప్పింది. వంచన తప్ప యేం వొరగదు. తమ సంబంధాలని సరిదిద్దుకోవడం గాని, మెరుగుపర్చుకోవడం గాని అసాధ్యం. యేమంటే ఆమెని తిరిగి మనోజ్ఞంగా, మనోహరంగా చెయ్యడం గాని, తనని ముసలివాణ్ణిగా, ప్రేమించలేని అశక్తునిగా చెయ్యడం గాని అసాధ్యం. దానివల్ల వంచన, అబద్ధాలు తప్ప యేమీ వొరగవు. వంచన, అబద్ధం తన స్వభావానికి విరుద్ధం.

'కాని నింపాదిగా చెయ్యాలి యీ పని, యిలా వున్నట్టుగా పరిస్థితి కొనసాగలేదు'

అనుకున్నాడతను ధైర్యం పుంజాకో ప్రయత్నిస్తూ. భుజాలు వెనక్కి విరుచుకున్నాడు. ఓ సిగరెట్ తీసి వెలిగించాడు. రెండు దమ్ములు పీల్చి శంఖం చిప్ప యాష్ట్రేలోకి దాన్ని విసిరాడు. దిగాలుగా వున్న డ్రాయింగ్ రూమ్‌లోనుంచి గబగబా నడిచి వెళ్ళి భార్య పడకగది తలుపు తెరిచాడు.

4

అతని భార్య డ్రాయర్ సొరుగులు తెరిచి వాటి ముందు చిందర వందరగా వున్న వస్తువుల మధ్యలో నుంచుంది. సొరుగులోనుంచి బట్టలు యేరుతోంది. నడుందాకావచ్చే జాకెట్ తొడుక్కుంది ఆమె. పల్చగా వున్న జుట్టు జడ వేసుకుని వెనక కొప్పుగా పెట్టుకుంది. (ఒకప్పుడు ఆ జుట్టు వొత్తుగా నిగనిగలాడుతూ వుండేది.) ఆమె ముఖం దిగులుగా కుప్పించి వుంది. కళ్ళు పెద్దవి. భయం భయంగా వున్నాయి. చెక్కిళ్ళు కుప్పించి పోవడంతో ఆ కళ్ళు యింకా పెద్దవిగా కనిపిస్తున్నాయి. భర్త అడుగుల చప్పుడు విని ఆమె ఆగింది. గుమ్మంకేసి తేరిపార చూసింది. కఠినంగా, యేవగింపుగా వుండే వాలకం పెట్టాలని వృథా ప్రయత్నం చేసింది. అతనన్నా, అతన్ని కలుసుకోవడమన్నా తనకి భయం అని ఆమెకి తెలుసు. గత మూడ్రోజులుగామా తను యెన్ని సార్లు యేం చెయ్య ప్రయత్నించిందో యిప్పుడూ అదే చెయ్య ప్రయత్నిస్తోంది: పుట్టింటికి తీసుకుపోవడానికి తనవీ, పిల్లలవీ వస్తువులు యేంచుకోవడం. మళ్ళీ యిదమిత్థంగా తేల్చుకో లేకపోయింది. యెన్నో సార్లు అనుకున్నట్టుగానే మళ్ళీ తనలో తను అనుకొంది పరిస్థితి యెల్లకాలం యిలానే వుంటుందా యేమిటి, యేదో వొకటి చెయ్యాలి తను. అతన్ని శిక్షించాలి. సిగ్గుపడేట్టు చెయ్యాలి. తనని అతను పెట్టిన క్షోభకి కొంత మేరకైనా పగ తీర్చుకోవాలి. అతన్ని వదిలిపెట్టి వెళ్ళిపోవాలని యింకా అనుకుంటూనే వుంది. అయినా అంతరాళంలో ఆమెకి తెలుసు అది అసాధ్యం అని. అసాధ్యం యెందుకంటే అతన్ని తన భర్తగా చూసే అలవాటుని వదులుకోలేదు. అతన్ని ప్రేమించకుండా వుండలేదు. పైగా, యిక్కడ, తన యింట్లో బిడ్డలయిదుగుర్నీ సంరక్షించుకోవడం కష్టంగా వుంటే అక్కడ, వీళ్ళని తీసుకెళ్ళాలనుకొన్న ఆ చోట, యింకా అధ్వాన్నం. ఒక్క ఈ మూడ్రోజుల్లోనే కడగొట్టు పిల్లాడు జబ్బు పడ్డాడు. చద్ది తిండి పడలేదు. మిగతా వాళ్ళు నిన్నంతా దాదాపు యేమీ కతకవేలేదు. అంచేత వెళ్ళిపోవడం అసాధ్యం అనిపించిందామెకి. అయినా వాళ్ల వస్తువులు యేరుతూ, వెళ్ళిపోతున్నానని నటిస్తూ ఆత్మవంచన చేసుకుంటోంది.

భర్తని చూడగానే మళ్ళీ సొరుగులు కెలకడం మొదలుపెట్టింది. అతను పక్కకి వచ్చి నుంచున్నాక తల తిప్పి చూసింది. కఠినంగా, దృఢ నిశ్చయంతో వున్నట్టు కనిపించడానికి ఆమె మహా ప్రయత్నం చేసింది. కాని ఆమె ముఖంలో బాధ దిక్కుతోచనితనం కనిపించాయి.

"డాలీ" అన్నాడతను లోగొంతుకలో బెరుగ్గా. అతను తలని భుజాల మధ్య వాల్చుకుని

పశ్చాత్తాపంగా, అణుకువగా వున్నట్టు కనిపించ ప్రయత్నించాడు. యింత ప్రయత్నం చేసినా అతనిలో ఆరోగ్యం, తాజాతనం ప్రకాశించాయి.

ఒక్క సారి అతన్ని ఆపాదమస్తకం గిరుక్కున చూసి ప్రకాశించే ఆ తాజాతనం, ఆరోగ్యం ఆమె గ్రహించింది. 'అవును, తను సంతోషంగా, తృప్తిగా వున్నాడు మరి నేను...' అనుకొంది. 'ఆ అసహ్యకరమైన జాలిగుండె వల్లనే ప్రతివాళ్ళూ అతన్ని అభిమానించి పొగుడుతారు. ఆ జాలిగుండెతనం తనెంత అసహ్యించుకుంటుంది' అనుకొంది. ఆమె మూతి బిగిసింది. విస్త్రితంగా వున్న ముఖంమీద కుడి వేపున చెక్కిళ్ళమీద కండరాలు అదిరాయి.

"ఏం కావాలి మీకు?" అని గబగబా జీరగా అడిగింది. ఆ గొంతు ఆమెది కాదు.

"డాలీ" అని రెట్టించాడు. అతని కంఠం కంపించింది. "అన్నా వస్తోందివాళ" అన్నాడు.

"అయితే యేమిటి నాకు? నేనామెకి అర్ఘ్య పాద్యాలు యివ్వలేను" అని అరిచింది.

"యివ్వక తప్పదు నీకు, డాలీ..."

"వెళ్లిపొండి, వెళ్లిపొండి, వెళ్లిపొండి యిక్కడినుంచి" అని అతనికేసి కన్నెత్తి చూడకుండా ఆమె గీపెట్టింది. యేదో వొంట్లో నొప్పితో అరిచినట్టు అరిచింది.

మత్వేయ్ చెప్పినట్టు అంతా "సర్దుకుంటుందని" ఆశపడుతూ భార్యని గురించి శాంతంగా అనుకోగలిగాడు అబ్లాన్‌స్కీ. పేపరు చదువుకోగలిగాడు. కాఫీ ప్రశాంతంగా తాగగలిగాడు. కాని బాధతో నలిగి పోయిన ఆమె ముఖం చూశాక, ఆమె ఆశ వదులుకుని తన ఖర్మకి లొంగిపోయిందన్నట్టు ధ్వనించే ఆమె గొంతుక విన్నాక అతనికి కాసేపు వూపిరి ఆడలేదు. గొంతుకలో వెలక్కాయపడ్డట్టయింది. కళ్ళు చెమ్మగిల్లాయి.

"ఓరి దేముడోయ్! నేనేం చేశాను? డాలీ, నీకు పుణ్యం వుంటుంది! యింతా చేసి..." అతను మాట్లాడలేకపోయాడు. వెక్కిళ్లతో ఉక్కిరిబిక్కిరి అయాడు.

ఆమె తపామని పొరుగు మూసి, అతనికేసి చూసింది.

"నేనేం చెప్పను డాలీ? ఒక్కటే చెప్పగలను. పొరపాటై పోయింది, పొరపాటై పోయింది. ఒకసారి చూడు, మన యిద్దరం కలిసి కాపరం చేసిన తొమ్మిది యేళ్ళూ యెక్కువ కాదా, కొన్ని క్షణాల... క్షణాల..."

ఆమె కళ్ళు వాల్చుకుని వింది. అతను బతిమలాడుతూ యేం చెప్తాడోనని, అతనివల్ల తన నమ్మకాన్ని పునఃస్థాపించే దాన్ని దేన్నో బతిమాలుతూ చెప్తాడని వింటానికి యెదురు చూసింది.

"...క్షణాల వ్యామోహం కంటే?" అని తేలాడు. యింకా చెప్పేవాడే. కాని ఆ మాట వినపడగానే శారీరకమైన నొప్పి కలిగినట్టు ఆమె పెదాలు బిగుసుకు పోయాయి. మళ్లీ ఆమె కుడి తెంపమీద కండరాలు అదిరాయి.

"వెళ్లిపొండి, వెళ్లిపొండి! మీ వ్యామోహాల గురించి, పశుత్వాల గురించి యిక నాకు చెప్పద్దు" అంటూ యింకా గట్టిగా అరిచింది.

ఆమె అక్కణ్నుంచి వెళ్లి పోవాలని అటు తిరిగింది. కాని వూగిపోయి ఓ కుర్చీ వీపుని ఆసరాగా పట్టుకుంది. అతని ముఖం వాలిపోయింది, పెదాలు ఉబ్బిపోయాయి, కళ్లల్లో నీళ్లు నిండి పోయాయి.

"డాలీ" అని వెక్కుతూ గొణిగాడు. "నీకు పుణ్యం వుంటుంది పిల్లల్ని చూడు. వాళ్ల తప్పు లేదు కదా. తప్పు నాది. నన్ను దండించు. నా పాపానికి శిక్ష విధించు. నే చెయ్యగలిగిన దేవన్నా చేస్తాను. నేరం నాది. నేనెంతటి దోషినో మాటల్లో చెప్పలేను. నన్ను మన్నించు, డాలీ" అన్నాడు.

ఆమె కూర్చుంది. ఆమె గాఢంగా శ్వాస పీల్చడం అతనికి వినిపించింది. ఆమె అంటే చెప్పలేనంత జాలి కలిగింది. ఆమె మాట్లాడాలని కొన్ని సార్లు ప్రయత్నించింది. కాని మాట్లాడ లేకపోయింది. అతను యెదురుచూశాడు.

"పిల్లలతో ఆడుకోవాల్సి వచ్చినప్పుడే వాళ్లు నీకు గుర్తుకొస్తారు. కాని నేనెప్పుడూ వాళ్ల గురించే ఆలోచిస్తూ వుంటాను, వాళ్లు నాశనం అయిపోయారని తెలుసు యిప్పుడు" అంది. గత మూడ్రోజులుగానూ ఆమె వల్లించుకుంటూ వున్న వాక్యాల్లో యిది వొకటి.

ఆమె తనని మామూలు చనువుతో "నువ్వు" అంది. కృతజ్ఞతగా అతను ఆమె కేసి చూసి ఆమె చెయ్యి అందుకోబోయాడు. కాని ఆమె యేవగింపుగా చెయ్యి వెనక్కి లాగేసుకుంది.

"నేను పిల్లల్ని గురించే అనుకుంటూ వుంటాను. వాళ్లని కాపాడ్డం కోసం ప్రపంచంలో యేదన్నా చేస్తాను. కాని వాళ్లని యెలా కాపాడాలో నాకే తెలీదు. తండ్రి దగ్గర్నుంచి వాళ్లని తీసుకుపోవడం ద్వారానా లేక భ్రష్టుడైన తండ్రిదగ్గర వదిలేసా — ఆఁ, భ్రష్టుడు. చెప్పండి, దయచేసి, యింత — యింత జరిగాక మనం కలిసి కాపరం చెయ్యడం కుదురుతుందా? అలా కుదురుతుందా అంట?" అని గొంతుక పెంచి ఆమె రెట్టించింది. "నా పెనిమిటి, నా పిల్లల తండ్రి, తన పిల్లలకి చదువు చెప్పే పంతులమ్మతో ప్రేమ కలాపం సాగించాక!.." అంది.

"కాని యేం చెయ్యాలి? యేం చెయ్యాలి?" అని అతను దీనంగా అడిగాడు. తను యేం అంటున్నదీ అతనికే తెలీలేదు. తన తలని యింకా యింకా కిందికి వాలేసుకున్నాడు.

"మిమ్మల్ని చూస్తే నాకు రోతగా వుంది, వెలపరంగా వుంది" అని ఆమె రెచ్చిపోతూ అరిచింది. "మీ కన్నీళ్ల నాటకం! మీరు యెన్నడూ నన్ను ప్రేమించలేదు. మీకు హృదయం లేదు, దొడ్డ మనసు లేదు. మీరు క్షుద్రులు, పాశవికంగా వున్నారు. నాకు పరాయి వాళ్లు — ఆఁ, అస్సలు ముక్కూ మొహం యెరగని పరాయి వాళ్లు" అంది. కసిగా బాధగా "పరాయి వాళ్లు" అనే మాటని నొక్కి పలికింది. ఆమెకి అది యెంతో భయంకరంగా ధ్వనించింది.

అతను ఆమె కేసి చూశాడు. ఆమె ముఖంలో కనిపించిన ద్వేషం అతన్ని భయ కంపితుణ్ణి చేసింది. ఆశ్చర్యం కలిగించింది. తన జాలి ఆమెకి మంటగా వుందని అతను గ్రహించ

లేదు. తన పట్ల అతను జాలి పడుతున్నాడని కాని తనని ప్రేమించలేడని ఆమె చూసింది. 'వుహూఁ, ఆమె యెన్నడూ నన్ను క్షమించదు, ఆమె నన్ను అసహ్యించుకుంటోంది' అనుకున్నాడు.

"ఇది భయంకరం, భయంకరం" అన్నాడు.

సరిగ్గా అప్పుడు పక్క గదిలో వో పిల్ల రాగం తియ్యడం మొదలుపెట్టింది. బహుశా కింద దొర్లిపడిందేమో. దాలీ దాన్ని వింది. వున్నట్టుండి ఆమె ముఖం మెత్తబడింది.

తనెక్కడ వున్నదీ తనేం చెయ్యాల్సిందీ గుర్తించడానికి ఆమెకి కొన్ని క్షణాలు పట్టిందంతే. గబగబా లేచి గుమ్మం దగ్గరికి వెళ్లింది.

'యేమైనా తను నా బిడ్డని ప్రేమిస్తోంది' అనుకున్నాడు అబ్లాన్‌స్కీ చంటిపిల్ల యేడుపు వినిపించగానే ఆమె ముఖంలో వచ్చిన మార్పు చూసి. 'నా బిడ్డ. అంచేత నన్నెందుకు అసహ్యించుకుంటుంది?'

"దాలీ, మరో మాట" అన్నాడు ఆమె వెనకే వెడుతూ.

"నా వెనక వస్తే నౌకర్లని, పిల్లల్ని పిలుస్తాను! మీరు భ్రష్టులన్న విషయం అందరికీ తెలియనివ్వండి! నేనివాళ యిల్లు వదిలి పెట్టి వెళ్లి పోతున్నాను, యిక్కడ మీ కులుకు లాడితో కలిసి కాపరం చెయ్యొచ్చు మీరు."

ఆమె బయటికి వెళ్లిపోయి ధనామని తలుపు వేసేసుకుంది.

అబ్లాన్‌స్కీ నిట్టూర్పు విడిచాడు. ముఖం తుడుచుకున్నాడు. మెల్లిగా అడుగులు వేస్తూ గుమ్మందగ్గరికి వెళ్లాడు. 'అన్నీ సర్దుకుంటాయని మత్వేయ్ అంటాడు, కాని యెలాగ? నాకేం అవకాశం కనిపించడంలేదు. అయ్యో, అయ్యో యెంత దారుణం! యెంత నీచంగా అరిచింది!' అనుకున్నాడతను ఆమె అరుపులూ, 'భ్రష్టుడు', 'కులుకులాడి' అనే మాటలూ గుర్తు చేసుకుంటూ. 'ఖర్మ! పని పిల్లలు విన్నారేమో! నీచం, పాటక జనం తంతుగా వుంది.' అబ్లాన్‌స్కీ అక్కడ కాసేపు మంచుండి పోయాడు. కళ్లు తుడుచుకున్నాడు. మరో సారి నిట్టూర్చాడు. వూఁ పోన్లే అని ఛాతీ విరుచుకుని బయటికి వెళ్లిపోయాడు.

ఆ వేళ శుక్రవారం. గడియారాలు బాగు చేసే జర్మన్ మనిషి భోజనాల గదిలో గడియారానికి కీ యిస్తున్నాడు. అతనికి బట్టతల. కచ్చితంగా వేళప్రకారం పనులు చేస్తాడు. గడియారాలకి కీ యిచ్చేటందుకు గాను యీ మనిషికి ఆజన్మాంతం కీ యిచ్చేశారని ఓ సారి అబ్లాన్‌స్కీ హాస్యమాడేడు. అది గుర్తు వచ్చి చిరునవ్వు నవ్వుకున్నాడు. అబ్లాన్‌స్కీకి పరిహాసాలు యిష్టం. 'యేమో అన్నీ సర్దుకుంటాయేమో' అనుకున్నాడు. 'బాగా చెప్పిన మాట సర్దుకుంటాయి. మా వాళ్లకి యీ ముక్క చెప్పాలి.'

"మత్వేయ్!" అని కేకేశాడు. మత్వేయ్ వచ్చాడు. "అక్కయ్యకి సోఫాల గదిలో పడుకుందుకు యేర్పాట్లు చెయ్యమని మాత్రోనాతో చెప్పు" అని మత్వేయ్‌తో అన్నాడు.

"అలాగే నండి."

అబ్లాన్‌స్కీ ఫర్ కోటు తొడుక్కుని ముందరి వసారాలోకి వెళ్లాడు.

"మీరు భోజనానికి యింటికి వస్తారు కదా?" అని అతన్ని సాగనంపుతూ అడిగాడు మత్యేయ్.

"తెలీదు. యిదుగో ఖర్చులకి" అన్నాడు, యూదాస్తు పుస్తకంలోనుంచి పది రూబుళ్ల నోటు తీస్తూ. "సరిపోతాయా?" అని అడిగాడు.

"చాలివా చాలకపోయినా సర్దుకోవాలి" అన్నాడు మత్యేయ్ బండి తలుపు మూస్తూ. వసారాకేసి తిరిగి వెళ్లిపోయాడు.

యీలోపున దాలీ పిల్లని సముదాయించింది. బండి చక్రాల చప్పుడు విని భర్త వెళ్లిపోయాడని అనుకొంది. మళ్లీ తన పడక గదిలోకి వెళ్లింది. పడక గది వదిలిపెడితే చాలు కుటుంబ చింతలన్నీ మునురుకు మీద పడిపోతాయి. పడక గది వొక్కటే వాటినుంచి తప్పించుకునే రక్షణ దుర్గం. యిప్పుడు కూడా, పిల్లల గదిలో తను వున్న యీ కాస్సేపట్లోనూ, ఇంగ్లీషు పంతులమ్మా, మాత్రోనా అత్యవసరమైన ప్రశ్నలెన్నిట్నో గుప్పించేశారు. వాటికి తను మాత్రమే జవాబు చెప్పగలదు. షికారుకి తీసికెళ్లడానికి పిల్లలకి యే బట్టలు తొడగాలి? వాళ్లకి పాలు యివ్వాలా? కొత్త వంటమనిషికోసం కబురంపాలా? యిలాంటి వన్నీ!

"అయ్యో, నా మానాన నన్ను వుండ నివ్వండర్రా" అని ఆమె మొత్తుకుంది. పడక గదిలోకి తిరిగి వెళ్లిపోయింది. ఉంగరాలు వదులై జారిపోతూ వుండే తన సన్నని వేళ్ల పట్టుకుని భర్త తనతో మాట్లాడినప్పుడు కూర్చున్న కుర్చీలో కూర్చుంది. అప్పుడు చెప్పిన మాటలన్నీ గుర్తు చేసుకోవడం మొదలుపెట్టింది. 'అతను వెళ్లిపోయాడు. కాని ఆమెకి స్వస్తి చెప్పేసినట్టేనా? యింకా ఆమెని చూస్తాడా? యెందుకడిగాను కాదు? వుహుం, లేదు లేదు కలిసి కాపరం చెయ్యడం అసాధ్యం. ఒకే యింట్లో వున్నా మేం పరాయి వాళ్లమే. యిక యెప్పటికీ పరాయివాళ్లమే.' హడలు పుట్టించే యీ మాటని ప్రత్యేకమైన వూనికతో రెట్టించుకుంది. 'యెంతలా అతన్ని ప్రేమించాను! పరమాత్ముడికి తెలుసు యెంతలా అతన్ని ప్రేమించిందీనీ!.. యిప్పుడు, యిప్పుడు ప్రేమించడంలేదా? యిప్పుడు కూడా మునుపటికంటే యెక్కువగా ప్రేమించడంలేదా? ఎంత దారుణం! అన్నిటికంటే దారుణమైంది యేమిటంటే'... గుమ్మం దగ్గిరికి మాత్రోనా వచ్చింది. దాంతో ఆమె ఆలోచనా ధార తెగిపోయింది.

"యెవర్లనేనా పంపి మా అన్నని పిలిపించండమ్మా. కనీసం యింత ఉడకేసి పడేస్తాడు, లేకపోతే నిన్నటిలాగానే అవుతుంది పొద్దుగూకే దాకా పిల్లలకి అన్నాయిండవు" అంది.

"సరే, నేనే స్వయంగా వచ్చి అన్నీ చూస్తాన్లే. పాల కోసం యెవర్లనన్నా పంపారా?"

దాలీ మళ్లీ సంసార తాపత్రయంలో పడి తాత్కాలికంగా తన దుఃఖాల్ని దాంట్లో ముంచేసుకుంది.

5

అబ్లాన్‌స్కీ స్వతహాగా ప్రతిభ వుండడం పుణ్యమా అని బళ్లో బాగానే లాక్కొచ్చేడు. కాని బద్ధకస్తుడూ, కొంటె మనిషీని. దాంతో క్లాసులో అందరికంటె వెనకవాడుగా తేలాడు. అతన్ది విచ్చలవిడి జీవితం. వయసు చూస్తే ఓ రకంగా యెక్కువేం కాదు. వీర ఉద్యోగంలోనేమో హోదా* తక్కువది. అయినా కూడా మాస్కోలోని ప్రభుత్వ ఆఫీసుల్లో ఒక దానికి అధిపతిగా మంచి ఆదాయమూ, గౌరవమూ గల ఉద్యోగమే లభించింది. అతనికా ఉద్యోగం బావగారు అలెక్సేయ్ అలెగ్జాంద్రోవిచ్ కరేనిన్ ధర్మమా అని వచ్చింది. కరేనిన్ అతని అక్క అన్నా భర్త, యీ మాస్కో ఆఫీసుకి సంబంధించిన మంత్రివర్గ శాఖలో ఓ ముఖ్యుడైన అధికారి. కరేనిన్‌గారు తన బావ మరిదిని యీ ఉద్యోగానికి నియమించకపోయినా వందలాది యితర అన్నయ్యలు, అక్కయ్యలు, మేనమామలు, మేనత్తలు, దూరం బంధువులు స్తీవ అబ్లాన్‌స్కీకి సాలీనా ఆరు వేల రూబుళ్ల ఆదాయం సంపాదించి పెట్టే ఉద్యోగాన్ని, దీన్ని కాకపోతే మరో దాన్ని, చూసిపెట్టే వుండేవాళ్లు. అతనికి ఆ ఆదాయం చాలా ముఖ్యం. యేమంటే, భార్య తరవున చెప్పకోదగ్గ ఐశ్వర్యం వచ్చినా, అతని సొంత వ్యవహారాలు చిక్కుల్లో వున్నాయి.

మాస్కో, పీటర్స్‌బర్గ్ నగరాల్లో సగంమంది అబ్లాన్‌స్కీల కుటుంబానికి బంధువులూ, స్నేహితులూనూ. అతను లోకంలో యిదివరలో గొప్పవాళ్లుగా వుండి, యిప్పుడు కూడా గొప్పవాళ్లుగా వుంటూ వున్న వాళ్లల్లో పుట్టేడు. ప్రభుత్వంలో పైన వున్న వాళ్లలో మూడో వంతు మంది అతని తండ్రికి స్నేహితులే. వాళ్లు స్తీవ అబ్లాన్‌స్కీని పొత్తిళ్లల్లో వున్నప్పటినుంచీ యెరుగుదురు. మరో మూడో వంతు మంది అతనికి సన్నిహిత మిత్రులు. ఆ మిగిలిన వాళ్లు మంచి పరిచయస్థులు. ఉద్యోగాలు, రాయితీలు, రాబడులు లాంటి ఐహిక వరాలని ప్రసాదించే వాళ్లు మిత్రులుగా వున్నప్పుడు వాళ్లు తమలో మనిషిని మరిచిపోతారా మరి. లాభదాయకమైన ఉద్యోగం సంపాదించడానికి అబ్లాన్‌స్కీ పెద్ద ప్రయత్నం చెయ్యక్కర్లేకపోయింది. అతను చెయ్యవలసినదంతా దేన్నీ కాదనకుండా వుండడం, దేన్ని గురించీ అసూయ పడకుండా వుండడం, యేమీ దెబ్బలాడకుండా వుండడం, నొచ్చుకోకుండా వుండడం. యిలాంటి వాటిని చెయ్యడం అతని స్వభావానికి యెలాగూ విరుద్ధం కాబట్టి అతను వీటిల్లో దేన్నీ చెయ్యలేదు. తనకి కావలసినంత జీతం వచ్చే ఉద్యోగం అతనికి యివ్వరని యెవళ్లైనా అని వుంటే అతను దాన్ని అసంబద్ధమైందిగా చూసి వుండేవాడు. యేమంటే తనేం కానిదాన్ని అడగడం లేదు, తన మిత్రులకి వున్నలాంటి దాన్నే అడుగుతున్నాడు. వాళ్ల మాదిరీ తనూ విధులు నిర్వహించగలడు.

అబ్లాన్‌స్కీ జాలిగుండెవాడు, ఉత్సాహంగా వుంటాడు, వేలెత్తి చూపించలేని నిజాయితీ పరుడు. అతన్ని యెరిగిన వాళ్లు అతన్ని అభిమానించడం యీ లక్షణాలవల్లనే కాదు. అతని కళకళలాడే అందమైన రూపంలో, మెరిసే కళ్లల్లో, నల్లని కనుబొమల్లో, జుట్టులో,

గులాబీరంగు మెరిసే ఛాయలో అతన్ని కలుసుకున్న వాళ్లని సమ్మోహ పరిచేది, ఉల్లాస పరిచేది యేదో వుంది. అందుకున్కూడా అతన్ని యెరిగిన వాళ్లు అతన్ని అభిమానిస్తారు. "హేయ్! స్తీవ! హాయ్! అబ్లాన్‌స్కీ! నిన్ను చూడ్డం సంతోషంగా వుంది" అనే మాటల్ని అతన్ని కలుసుకున్న వాళ్లు కళకళలాడే చిరునవ్వుతో తప్పకుండా అంటారు. అతనితో మాట్లాడిం తర్వాత అంత మురిసిపోవాల్సిందేమీ జరగలేదని వాళ్లు ఒకో అప్పుడు కనిపెట్టినా మళ్లీ సారి అతన్ని చూసినప్పుడు, ఆ తర్వాత సారి చూసినప్పుడూ కూడా మురిసిపోతూనే వుండేవాళ్లు.

యీ మాస్కో ఆఫీసుకి హెడ్‌గా వున్న యీ మూడేళ్లల్లామా అబ్లాన్‌స్కీ తనతో కలిసి పనిచేసేవాళ్లనుంచి, తనకింద పనిచేసేవాళ్లనుంచి, తన పై అధికారులనుంచి, తనతో సంబంధం వుండే అందరి దగ్గర్నుంచి గౌరవాభిమానాలు సంపాదించేడు. ఆఫీసులో అతనికి గౌరవం తెచ్చి పెట్టిన ముఖ్య గుణాలలో మొదటిది యితరులతో అతను చనువుగా వుండడం. అది తనకి వుండే లోటుపాట్లనుంచి వచ్చిందే. రెండవది అతని వైఖరి విరామాట మైన ఉదారత్వంతో వుండడం. ఆ ఉదారత్వం వార్తాపత్రికలనుంచి వచ్చినటువంటిది కాదు. అతని నరాల్లో ప్రవహించేటువంటిది. ఐశ్వర్యంతో, హోదాతో సంబంధంలేకుండా అందర్నీ ఒక్కలాగే అతను చూడగలిగేటట్టు అతన్ని చేసినటువంటిది. మూడవదీ అతి ముఖ్యం అయిందీ అతను తను చేసే పని పట్ల శుద్ధ ఉపేక్షాభావంతో వుండటం. దానివల్ల అతను అందులో యెన్నడూ ఉద్రేకభరితంగా నిమగ్నం అయేవాడు కాదు, తప్పులూ చేసేవాడు కాదు.

అబ్లాన్‌స్కీ ఆఫీసుకి వెళ్లగానే వొంగి సలాములు కొట్టే దర్వాన్ బ్రీఫ్‌కేస్ అందుకుని కూడా వెళ్లాడు. అబ్లాన్‌స్కీ తన సొంత గదికి వెళ్లాడు. అది చిన్నది. అక్కడ యూనిఫాం వేసుకుని బోర్డుగదికి వెళ్లాడు. గుమాస్తాలూ, రాయసగాళ్లూ అందరూ నుంచుని, ఉత్సాహంగా గౌరవపూర్వకంగా నమస్కారం చేశారు. యెప్పటిలాగా బిరగా అడుగులు వేస్తూ అబ్లాన్‌స్కీ తన చోట్లోకి వెళ్లాడు. బోర్డు మెంబర్లతో షేక్ హేండ్ చేసి కూర్చున్నాడు. అతను కేళాకోళం కబుర్లు చెప్పేడు. తను చూడవలసిన పనికి ఉపక్రమించడానికి ముందు ఔచిత్యానికి భంగకరంగా వుండనంతవరకే అలా చేశాడు. యేదైనా వ్యవహారాన్ని తృప్తిగా నిర్వర్తించేందుకు అవసరమైన కులాసాకి, స్వేచ్ఛకి, అధికారిక సరళికి కచ్చితమైన హద్దుల్ని యేర్పరచడానికి అతని కంటే దిట్టమైన వాడు లేడు. అతని కార్యదర్శి ఉత్సాహంగా, గౌరవ పూర్వకంగా కొన్ని కాగితాలని తీసుకొచ్చేడు. అబ్లాన్‌స్కీ ఆఫీసులో అందరూ అలానే ప్రవర్తిస్తారు. కార్యదర్శి ఉదారంగా వుండే చనువుతో యేదో చెప్పేడు. ఆ చనువుని అబ్లాన్‌స్కీ తనకింద పనిచేసే వాళ్లకి యిచ్చేడు.

"పెంజా గుబేర్నియా*నుంచి ఆ సమాచారాన్ని మొత్తంమీద రాబట్టగలిగాం, యిదుగో..."

"మొత్తానికి సాధించేరన్నమాట, ఆఁ" అంటూ అబ్లాన్‌స్కీ కాగితాలు తిరగేశాడు. "వూఁ, మిత్రులారా..." ఆ రోజు కార్యక్రమం మొదలైంది.

తల పక్కకి వొరగేసి, గంభీరంగా నివేదికని వింటూ అతను అనుకున్నాడు: 'తమ బోర్డు అధ్యక్షుడు తప్పుచేసిన కుర్రాడిలా ఒక్క అరగంట కితం యెలా కనిపించాడో వీళ్లకి తెలిసి వుంటే!' అతని కళ్లు మిణుక్కుమన్నాయి. వాళ్లు అలా తమ పనిని రెండు గంటలదాకా సాగించాలి. అప్పుడు భోజన విరామం వస్తుంది.

యింకా రెండవలేదు. బోర్డు గది పెద్ద అద్దాల తలుపులు తోసుకుని యెవరో లోపలికి వచ్చారు. జార్ బొమ్మకీ, త్రికోణ పట్టకానికీ* కింద కూర్చున్న బోర్డు సభ్యులు అటు కేసి చూశారు, తమ పని మీదనుంచి ధ్యాస మళ్లినందుకు సంతోషిస్తూ. కాని లోపలికి వచ్చిన ఆ ఆగంతకుణ్ణి గుమ్మం దగ్గరున్న దర్వాన్ బయటికి తీసుకుపోయి తలుపు వేసేశాడు.

నివేదిక అయిపోయాక అల్బానోవ్స్కీ లేచి వొళ్లు విరుచుకున్నాడు. ఆ రోజు ఉదారత్వానికి అనురూపంగా అతను, తన ఆఫీసు గదికి వెళ్లేముందు, బోర్డు గదిలోనే సిగరెట్ తీశాడు. యిద్దరు సహోద్యోగులు కూడా వెళ్లారు. ఒకతను నికీతిన్. కొలువులోనే అతను ముసలాడైపోయాడు. రెండో అతను కామెర్ జంకర్* గ్రివేవిచ్.

"భోజనాల తర్వాత పనంతా ముగించడానికి వ్యవధి వుంటుంది కదా" అన్నాడు అల్బానోవ్స్కీ.

"అయ్యో యెందుకుండదు" అన్నాడు నికీతిన్.

"ఆ ఫామీన్ పరమ కంత్రీ అయివుండాలి" అని చర్చలో వున్న వ్యవహారంలోని ఓ మనిషిని ఉద్దేశిస్తూ, గ్రివేవిచ్ అన్నాడు.

గ్రివేవిచ్ అన్నమాటల్ని గురించి యేం వ్యాఖ్యానించకుండానే అల్బానోవ్స్కీ ముఖం చిట్లించాడు. విషయం యెటూ తేలకుండా ముందే అభిప్రాయాలు చెప్పెయ్యడం ఉచితం కాదన్నట్టు ఆ రకంగా అతనికి తెలియచెయ్యడం అది.

"గదిలోకి వచ్చిన అతనెవరు?" అని దర్వాన్‌ని అడిగాడు.

"తెలవదండి, ప్రభూ, నేను మొహం యిటు తిప్పగానే అడగా పెట్టాకుండా లోపలికి తోసుకొచ్చేసాడండి, మీరు కావాలన్నాడండి. అయ్యగారి పని అయాక చెప్తానన్నానండి..."

"ఎక్కడున్నాడిప్పుడు?"

"కింద వుండి వుంటారండి, పచార్లు సేస్తా వున్నాడక్కడ. అరుగోనుండి" అంటూ దర్వాన్ ఒకతన్ని చూపించాడు. అతని భుజాలు వెడల్పుగా వున్నాయి. శరీరం దృఢంగా వుంది. గడ్డం ఉంగరాలు తిరిగి వుంది. అతను గొర్రెతోలు టోపీ తియ్యకుండానే అరిగిపోయిన మెట్ల మీద తేలిగ్గా గెంతుకుంటూ పైకి వస్తున్నాడు. ఓ ఉద్యోగి చేత్తో బ్రీఫ్‌కేస్ పట్టుకుని మెట్లు దిగుతూ ఆగి చకచకా మెట్లెక్కి వచ్చే ఆ కాళ్లకేసి యిదేం బాగా లేదన్నట్టు చూసి తర్వాత యేమిటిది అన్నట్టు అల్బానోవ్స్కీ కేసి చూపు విసిరాడు.

అల్బానోవ్స్కీ పైన చివరి మెట్టుమీద వున్నాడు. అతని యూనిఫాంకి మెడ దగ్గర అల్లిన పట్టీ వుంది. ఆ పట్టీలోనుంచి అతని ముఖం ఉల్లాసంగా మెరుస్తోంది. చకచక పైకెక్కి వచ్చే అతన్ని చూసేటప్పటికి యింకా తళతళ మెరిసింది.

"అమ్మ! నువ్వా లేవిన్!" అని ఆదరంగా, పరిహాసంగా చిరునవ్వు నవ్వుతూ అన్నాడు దగ్గరికి వస్తూ వున్న అతన్ని అందుకుని. "నా గుహలోనే నన్ను పట్టుకుందామని వచ్చావ్?" అని అడిగాడు. షేక్‌హేండ్ చెయ్యడం చాలదని చెప్పి ముద్దుపెట్టుకున్నాడు. "చాలా సేపు అయిందా యిక్కడికొచ్చి?" అని అడిగాడు.

"యిప్పుడే వచ్చాను, నిన్ను చూడాలని మహా అనిపించింది" అన్నాడు లేవిన్. అతను సిగ్గుగా, కోపంగా, యిబ్బందిగా కూడా అటూ యిటూ చూపులు విసిరేడు.

"రా, నా ఆఫీసు గదిలోకి వెడదాం" అన్నాడు అబ్లాన్‌స్కీ. తన మిత్రుడి ఆత్మాభిమానం, ముంగోపితనం, సంకోచం అతనికి తెలుసు. అతని చేతిని పట్టుకుని కష్టాల్లోనుంచి అతన్ని నడిపించి తీసికెడుతున్నట్టుగా తీసుకెళ్లాడు.

అబ్లాన్‌స్కీ దాదాపు తన పరిచయస్థులందర్నీ నువ్వు అంటూ సరదాగా చనువుతోనే పలకరించేవాడు — అరవై యేళ్ల ముసలాళ్లని గాని, యిరవై యేళ్ల పడుచు వాళ్లని గాని, నటుల్ని గాని, మంత్రుల్ని గాని, వ్యాపారుల్ని గాని, జనరల్స్‌ని గాని యెవళ్లనేనా సరే. వాళ్లల్లో చాలామంది సాంఘిక హోదా శ్రేణిమీద అటు చివరా యిటు చివరా వుండేటటువంటి వాళ్లు, అబ్లాన్‌స్కీతో తమ సంబంధాలవల్ల తమకి ఉమ్మడిగా వుండేదేదో యేర్పడిందని చూసి మహా ఆశ్చర్య పోయేవాళ్లు. తను కలిసి షాంపేన్ తాగిన అందర్నీ అబ్లాన్‌స్కీ చనువుగానే నువ్వు అంటూ వుండేవాడు. మరి అతను చాలా మందితో కలిసి షాంపేన్ తాగేవాడు. తన కింద పని చేసేవాళ్ల ముందర తను పరిహాసంగా తన మిత్రుల్ని చాలా మందిని పిల్చినట్టు యీ పరువు తక్కువ 'నువ్వు' మనుషుల్లో యెవళ్లేనా తగిలితే తన సహజ చాతుర్యం పుణ్యమా అని ఆ దురభిప్రాయం తగ్గించేసేవాడు. లేవిన్ అలాంటి 'పరువు తక్కువ నువ్వు' యెంత మాత్రం కాదు. కాని తనకీ లేవిన్‌కి గల సన్నిహితత్వాన్ని తన కింద పనిచేసేవాళ్లకి తెలియచెయ్యడం తనకి యిష్టం లేదని లేవిన్ అనుకుంటాడేమోనని అబ్లాన్‌స్కీ బుద్ధికుశలత అతనికి చెప్పింది. అందుకని తన సొంత గదికి అతన్ని తీసికెళ్లడానికి తొందరపడ్డాడు.

లేవిన్ కూడా దాదాపు అబ్లాన్‌స్కీ వయసువాడే. వాళ్లిద్దరికీ కూడా 'నువ్వు' అనే స్నేహం. కాని ఆ స్నేహం యిద్దరు కలిసి షాంపేన్ తాగిందానివల్ల కాదు. వాళ్లిద్దరూ నూనూగు మీసాల నాటినుంచీ మిత్రులు. యిద్దరి అభిరుచులూ, స్వభావాలూ వేరు, అయినా నూనూగు మీసాల నూత్నయవ్వనంలో పరిచయం అయిన వాళ్లు కలిసి పోయినట్టుగా కలిసి పోయారు. మామూలుగా భిన్న జీవిత విధానాలు అవలంబించిన వాళ్ల మాదిరీ హేతుబద్ధంగా ఆలోచించినప్పుడు ఒకళ్ల కార్యకలాపాల్ని ఒకళ్లు సమర్థించినా లోపల్లోపల యేవగింపుగా చూసుకున్నారు. తను యెంచుకున్న జీవిత విధానమే అసలైందనీ తన మిత్రుడు పట్టుకున్న దారి బోలుదనీ ప్రతివాడూ అనుకుంటాడు. లేవిన్‌ని చూడగానే కొంచెం కొంటెగా చిరునవ్వు వచ్చింది అబ్లాన్‌స్కీకి. అతను దాన్ని అణుచుకోలేకపోయాడు. లేవిన్ చాలా సార్లు తన పల్లెనుంచి మాస్కో వచ్చేడు. అప్పుడు అతన్ని అబ్లాన్‌స్కీ చూడనూ చూశేడు. లేవిన్ పల్లెలో

యేదో ఒకటి చెయ్యడంలో మునిగిపోయేవాడు. కచ్చితంగా యేమిటైందీ అబ్లాన్స్కీ యెన్నడూ అర్థం చేసుకోలేదు, అర్థంచేసుకోడానికి ప్రయత్నించదగ్గ ఆసక్తీ అతనికి లేదు. లేవిన్ యెప్పుడు మాస్కోకి వచ్చినా గానీ తత్తర పడిపోతూ, హడావుడి పడిపోతూ వుండేవాడు. కొంచెం బెరుగ్గా వుండేవాడు. అలా బెరుగ్గా వున్నందుకు చిరాకు పడుతూ వుండేవాడు. అనేక విషయాలకి సంబంధించి అతను వూహించని, కొత్త దృక్పథం అవలంబించినట్టు సాధారణంగా బయటపడేది. అబ్లాన్స్కీ అదంతా చూసి నవ్వేవాడు. అయినా కూడా అతనంటే యిష్టపడేవాడు. సరిగ్గా అదే రకంగా లేవిన్ తన మిత్రుడి బస్తీ బతుకుని, అతని ఉద్యోగాన్ని కూడా యేవగించుకునేవాడు. అది కాలం వృధా చెయ్యడమేనని అతను అనుకునేవాడు. అదంతా చూసి తనూ నవ్వేవాడు. తేడా యేమిటంటే తను మిగతా వాళ్లందరూ చేసినట్టే చేస్తూ వుండడం వల్ల అబ్లాన్స్కీ సరసంగా, ఆత్మ తృప్తిగా నవ్వేవాడు; లేవిన్ తృప్తిలేకుండా, ఒకో అప్పుడు విరసంగా నవ్వేవాడు.

"మువ్వొస్తావని చాలా కాలంగా చూస్తున్నాం" అని అబ్లాన్స్కీ, గదిలోకి వెళ్లగానే అక్కడితో ప్రమాదం తప్పిపోయినట్టు లేవిన్ చెయ్యి వదిలేసి అన్నాడు. "నిన్ను చూడ్డం సంతోషంగా వుంది. సంతోషంగా వుంది వూ, యెలా వున్నావ్? యెప్పుడొచ్చావ్?" అని అడిగాడు.

జవాబు చెప్పడానికి బదులుగా అబ్లాన్స్కీ సహోద్యోగులకేసి లేవిన్ తేరి చూశాడు. ఆ ముఖాలు కొత్తవి. అతను హుందాగా వున్న గ్రినేవిచ్ చేతికేసి మరీ యిదిగా చూశాడు. గ్రినేవిచ్ వేళ్లు పొడుగ్గా తెల్లగా వున్నాయి. వేళ్లకి పొడుగాటి పసుప్పచ్చ గోళ్లు గుండ్రంగా వొంపు తిరిగి వున్నాయి. అతని చొక్కా ముంజేతిమీద పెద్ద కఫ్‌లింకులు మెరుస్తూ వున్నాయి. దాంతో లేవిన్ దృష్టి అంతా ఆ చేతులపైనే పడింది, అతను మరి దేన్ని గురించీ అనుకోలేకపోయాడు. అబ్లాన్స్కీ అది గమనించి చిరునవ్వు నవ్వేడు.

"అవును కదూ పరిచయం చేస్తాను. మా సహోద్యోగులు. యీయన ఫిలిప్ ఇవానొవిచ్ నికీతిన్, యీయన మిహయీల్ స్తనిస్లావిచ్ గ్రినేవిచ్" అని పరిచయం చేసాడు. తర్వాత లేవిన్ కేసి తిరిగి అతన్ని వాళ్లకి పరిచయం చేశాడు. "యితను కాన్‌స్తన్‌తిన్ ద్మిత్రిచ్ లేవిన్. జేమ్‌స్త్వో* పరిపాలనలో మంచి చురుగ్గా పాల్గొంటాడు. నూతన తరహా ఆలోచనా ధోరణి పెద్దమనిషి, వస్తాదు. ధాన్యంబస్తా ఒక్క చేత్తో యెత్తే దిట్ట. పశుపోషకుడు, వేటగాడు, నాకు మంచి మిత్రుడు, సెర్గేయ్ ఇవానొవిచ్ కోజ్నిషెవ్ తమ్ముడు" అని చెప్పాడు.

"మిమ్మల్ని కలుసుకోవడం సంతోషంగా వుంది" అన్నాడా ముసలాయన.

"వీరా అన్నగారు కోజ్నిషెవ్‌గారిని యెరుగుదును" అని గ్రినేవిచ్ పొడుగాటి వేళ్లున్న సన్నని చేతిని చాస్తూ అన్నాడు.

లేవిన్ ముఖం చిట్లించేడు. మొక్కుబడికి అతనితో షేక్‌హేండ్ చేసి వెంటనే అబ్లాన్స్కీ కేసి తిరిగాడు. లేవిన్‌కి తన సవతి అన్నగారంటే మహా గౌరవమే. ఆయన దేశమంతా ప్రఖ్యాతి

గడించిన రచయిత. అయినాగానీ సుప్రసిద్ధ కోజ్నిషెవ్ తమ్ముడిగా ఆదరణ పొందడం అతను భరించలేడు, లేవిన్‌గానే తనని గుర్తించాలి.

"నేనిప్పుడు జెమ్‌స్త్వో పరిపాలనలో చురుగ్గా పాల్గొనడంలేదు. అందరితోనూ దెబ్బలాడేను. యిప్పుడు సమావేశాలక్కూడా వెళ్లడం లేదు" అన్నాడు అబ్లాన్‌స్కీనే సంబోధిస్తూ.

"యింత త్వరగానా" అన్నాడు అబ్లాన్‌స్కీ చిరునవ్వు నవ్వుతూ. "ఎలా జరిగింది? కారణం యేమిటి?" అని అడిగాడు.

"అదో పెద్ద కథ. తర్వాత చెప్తా" అన్నాడు లేవిన్. కాని వెంటనే చెప్పడం మొదలెట్టాడు. "సూక్ష్మంగా చెప్పాలంటే, జెమ్‌స్త్వోకి యే కార్యక్రమమూ లేదు, యేమీ వుండబోదు అని నాకు నమ్మకం కలిగింది." అప్పుడే యేదో అవమానానికి గురైన వాడి వాలకంతో చెప్పాడతను. "ఓ విధంగా అది వో పిల్లాట, పార్లమెంట్‌గా ఆడుకోడం. చిన్నపిల్లల ఆటలతో మురిసేటంత బుల్లోణ్ణీ కాదు, ముసలాణ్ణీ కాదు. మరో విధంగా" (అతను మాటలకోసం తడబడ్డాడు) "పల్లెటూరి భూస్వాముల coterie[1] జేబులు నింపుకోవడానికి సాధనం. యిదివరలో వాళ్లకివి ప్రాపకంద్వారా, పంచాయితీ పెద్దల హోదాంద్వారా వచ్చేవి. యిప్పుడు జెమ్‌స్త్వోంద్వారా వస్తున్నాయి. లంచాల రూపంలో కాదు గాని యే పనీ లేని జీతాంద్వారా." అతను ఆవేశంగా మాట్లాడేడు, అక్కడున్న వాళ్లు అతన్ని యేదో సవాల్ చేసినట్టు.

"అరె! నువ్వు కొత్త దశలోకి పోయినట్టు కనిపిస్తోంది. కన్సర్వేటివ్‌ది. సర్లే, ఆ విషయం గురించి తర్వాత చర్చించుకుందాం" అన్నాడు అబ్లాన్‌స్కీ.

"వూఁ, తర్వాత. యిప్పుడు నేను నీతో మాట్లాడాలి" అని గ్రినేవిచ్ చేతికేసి యేవగింపుగా చూస్తూ అన్నాడు లేవిన్.

అబ్లాన్‌స్కీ కనిపించీ కనిపించని చిరునవ్వు నవ్వేడు.

"యూరపియన్ బట్టలు యిక వేసుకోనన్న వాడివి నువ్వు కాదూ?" అన్నాడతను తన మిత్రుడి కొత్త సూటు చూస్తూ. అది ఫ్రెంచి టైలరు కుట్టిన సూటు. "ఆఁ, కనిపిస్తోంది, కొత్త దశ" అన్నాడు.

లేవిన్ ముఖం ఒక్కసారిగా ఎర్రబడింది. సిగ్గు పడ్డాడు. పెద్దవాళ్ల మాదిరీ కాదు, చిన్నపిల్లల్లాగా సిగ్గుపడ్డాడు. వాళ్లు తామే గుర్తించనట్టుగా సిగ్గుపడతారు. తమ సిగ్గువల్ల తాము నవ్వులాలుగా కనిపిస్తున్నట్టు పిల్లలకి తెలుసు. దాంతోటి మరింత సిగ్గుపడి బాధపడిపోతారు, కళ్లమ్మట నీళ్లు తిరిగేటంతగా. పౌరుషంగా వుండే తెలివైన ముఖంమీద చిన్నపిల్లల వాలకం కనిపిస్తే వింతగా వుంటుంది. దాంతో అబ్లాన్‌స్కీ చూపు యెటో తప్పించేసుకున్నాడు.

---

[1] ముఠా (ఫ్రెంచి).

"యెక్కడ కలుసుకుందాం? నేను పూరికే నీతో మాట్లాడాలి" అన్నాడు లేవిన్.

అబ్లాన్‌స్కీ ఆ విషయమే ఆలోచిస్తున్నట్టుంది.

"మనం 'గురిన్'లో మధ్యాహ్నం భోజనం చెయ్యచ్చు. అక్కడ మాట్లాడుకుందాం. మూడింటి దాకా నాకు ఖాళీ."

"లేదు" అన్నాడు లేవిన్ కాసేపాగి. "నేను వేరే వాళ్లని చూడాలి" అన్నాడు.

"సరే అయితే సాయంత్రం కలిసి భోంచేద్దాం."

"సాయంత్రం కలిసి భోంచేద్దామా? కాని ఒక్క మాట అడగాలి నిన్ను. పూరికే వొక విషయం. మనం తర్వాత మాట్లాడుకోవచ్చు."

"అయితే యిప్పుడే అడిగెయ్యి, భోజనాల దగ్గర మాట్లాడుకుందాం."

"యేమిటంటే... ప్రత్యేకం యేమీ లేదు" అన్నాడు లేవిన్. "ఆఁ, ప్రత్యేకం యేం లేదు" అన్నాడు.

అతను సిగ్గుపడిపోతున్నాడు. కాని సిగ్గుని కనిపించనియ్యకుండా వుందామని ప్రయత్నం చెయ్యడంతో ఉగ్రంగా కనిపించేడు.

"ష్చేర్‌బాత్‌స్కీలు యేం చేస్తున్నారు? అంతా మునపటిలాగానే వుందా?" అని తేలాడు హఠాత్తుగా.

లేవిన్ తన మరదలు కిట్టీని ప్రేమించాడని అబ్లాన్‌స్కీ చాలాకాలంగా యెరుగును. అంచేత కనిపించీ కనిపించకుండా వుండే చిరునవ్వు నవ్వేడు. అతని కళ్లు మెరిశాయి.

"నువ్వు ఒక్కమాటలో చెప్పమన్నావు. ఒక్క మాటలో చెప్పలేను. యేమంటే.... ఒక్క క్షణం వుండు."

అప్పుడు సెక్రటరీ గదిలోకి వచ్చాడు. నమ్రతగా వుండే చనువూ, తమ బాస్‌లకంటే తమకే యెక్కువ వ్యవహార విషయాలు తెలుసుననుకునే సెక్రటరీల కందరికి వుండే ఆత్మ విశ్వాసం అతనికి వున్నాయి. అతను యేవో కాగితాలు పట్టుకుని అబ్లాన్‌స్కీ దగ్గరికి వెళ్లాడు. యేదో సమాచారం అడుగుతున్నట్టు పైకి కనిపిస్తూ కొన్ని యిబ్బందుల గురించి అతనికి వివరించడం మొదలుపెట్టాడు. అతను చెప్పేది పూర్తిగా వినకుండానే అబ్లాన్‌స్కీ సెక్రటరీ చేతిమీద మృదువుగా చెయ్యి వేశాడు.

"వద్దు, నేను చెప్పినట్టు చెయ్యండి" అని చిరునవ్వు నవ్వడంద్వారా తన మందలింపుని మెత్తబరుస్తూ అన్నాడు. ఆ విషయం గురించి తన వైఖరిని కొంచెం వివరించి, ఆ కాగితాల్ని పక్కకి తోసి "ఆఁ, అంచేత నేను చెప్పినట్టు చెయ్యండి" అన్నాడు.

సెక్రటరీ ముఖం మాడ్చుకుని వెళ్లి పోయాడు. సెక్రటరీతో అబ్లాన్‌స్కీ సంభాషణ సాగుతూ వుండగా లేవిన్ కలవరపాటునుంచి తేరుకుని స్థిమితపడ్డాడు. సరదాగా వింటూ, యెత్తిపొడుపుగా చూస్తూ రెండు చేతుల్నీ కుర్చీ వీపుమీద ఆనించి నిలబడ్డాడు.

"నాకిది అర్థం కాదు, యేమిటో యిదంతా పూరికే నాకు అర్థం కాదు అంతే" అన్నాడు.

"యేమిటి అర్థం కాదు నీకు?" అని యెప్పటి అంత ఆత్మ తృప్తిగానూ చిరునవ్వు నవ్వుతూ అడిగాడు అబ్లాన్‌స్కీ. సిగరెట్ తీసుకున్నాడు. లేవిన్ యేదో చోద్యంగా వుండేది చెప్తాడని అబ్లాన్‌స్కీ అనుకున్నాడు.

"యిక్కడ మీరేం చేస్తున్నారో నాకర్థం కాదు. యిది సీరియస్‌గా చేస్తున్న పనేనా?" అని యేమంటావన్నట్టు భుజాలు యెగరేస్తూ లేవిన్ అడిగాడు.

"ఎందుకని?"

"ఎందుకంటే చెయ్యడానికేం లేదు గనక."

"అది నీ దృష్టిలో. నిజానికి మాకు తలమునకలుగా వుంది."

"కాగితాల పని. ఫూ, నీకా ప్రజ్ఞ వుంది" అన్నాడు లేవిన్.

"అంటే నా స్వభావంలో యేదో లోపం వుందని నీ ఉద్దేశమా?"

"బహుశా కావచ్చు. అయినా గానీ నీ గొప్పదనానికి జోహార్. స్నేహితుడిగా నాకు నీ వంటి గొప్ప వాడుండడం గర్వం. కాని నేనడిగినదానికి జవాబు చెప్పలేదు నువ్వు" అని అబ్లాన్‌స్కీ కళ్లల్లోకి సూటిగా చూడాలని మహా ప్రయత్నిస్తూ అన్నాడు.

"సరే బాగుంది. చూస్తూ వుండు నువ్వే వస్తావ్ యిటు. నీకేం అదృష్టవంతుడివి! కరాజిన్ ఉయేజ్ద్*లో మూడు వేల దెస్యతిన్లు* వుంది. చేవదేరిన శరీరం, పన్నెండేళ్ల పిల్లాడిలా నవనవలాడుతూ పుష్టిగా వున్నావు. యేదో ఓ రోజున యిటే చేరతావులే. యింతకీ నువ్వడిగిన విషయం గురించి. అక్కడ మార్పులేం లేవు, కాని నువ్వింత కాలం రాకుండా పోవడం, ప్చ్, బాగా లేదు."

"ఏం?" అని భయం భయంగా అడిగాడు లేవిన్.

"ప్రత్యేకం యేమీ లేదు. సరే, ఆ విషయం గురించి తర్వాత మాట్లాడుకుందాంలే. యింతకీ సంగతేమిటి మళ్లీ వచ్చావ్?"

"ఆ విషయం గురించీ తర్వాత మాట్లాడుకుందాం" అన్నాడు లేవిన్ మళ్లీ మహా సిగ్గుపడిపోతూ.

"సర్లే అయితే, తెలిసిందిలే. విషయం యేమంటే... మా యింటికి తీసుకెడుదును గాని మా ఆవిడకి ఒంట్లో బాగా లేదు. చూడు, నువ్వు గనక వాళ్లని చూడ దలుచుకుంటే నాలుగూ అయిదూ మధ్య జులాజికల్ గార్డెన్స్ దగ్గర వుంటారు వాళ్లు. కిట్టీ అక్కడికి స్కేటింగ్‌కి వెడుతుంది. అక్కడ వాళ్లని కలు. నేను వస్తాను. యిద్దరం కలిసి భోజనానికి వెడదాం."

"భేష్, మరి వుంటా."

"జాగ్రత్త! నీ సంగతి నాకు తెలుసు. మర్చిపోయి తకామని వూరికి చెక్కేసావుస్మా!" అన్నాడు అబ్లాన్‌స్కీ నవ్వుతూ.

"ఆ భయమేం వద్దులే" అని లేవిన్ బయటికి వెళ్ళిపోయాడు. గుమ్మందాకా వెళ్లాక నే అర్బాన్‌స్కీ సహోద్యోగుల దగ్గర సెలవు తీసుకోలేదని అతనికి గుర్తుకొచ్చింది.

లేవిన్ వెళ్ళిపోయాక "మాంచి దృఢమైన పెద్దమనిషిలాగే వున్నాడు" అన్నాడు గ్రినేవిచ్.

"మామూలుగానా!" అన్నాడు అర్బాన్‌స్కీ తల వూపుతూ. "జాతకుడు! కరాజిన్ ఉయేజ్డ్‌లో మూడు వేల దెస్యాటీన్లు! జీవితమంతా ముందే వుంది, ఉక్కుగుండులాగా వున్నాడు. మనలాగా కాదు" అన్నాడు.

"మీకేం లోటండీ బాబూ?"

"అన్నీ, యేదీ సవ్యంగా లేదు" అని అర్బాన్‌స్కీ గాఢంగా నిట్టూరుస్తూ అన్నాడు.

6

సంగతేమిటి మళ్ళీ వచ్చావ్ అని అర్బాన్‌స్కీ అడిగినప్పుడు లేవిన్ సిగ్గుపడిపోయాడు. ఆలా సిగ్గుపడి పోయినందుకు తనమీద తనకే కోపం కూడా వచ్చింది. యేమంటే "మీ మరదల్ని పెళ్ళాడతానని చెప్పేందుకు వచ్చాన"ని అనలేకపోయాడు. సరిగ్గా ఆ కారణం గానే తను వచ్చినా.

లేవిన్, ష్చేర్‌బాత్‌స్కీల కుటుంబాలు రెండూ పాతకాలంనుంచీ మాస్కోలో వున్న ప్రభువంశీకుల కుటుంబాలు. రెండు కుటుంబాలకీ సంబంధాలు యెప్పుడూ సన్నిహితంగానే వుండేవి. లేవిన్ యూనివర్సిటీలో విద్యార్థిగా వున్నప్పుడు వాళ్ల సాన్నిహిత్యం బలపడింది. దాలీ, కిట్టీల అన్నగారు అయిన యువ ప్రిన్స్‌తో కలిసి అతను విశ్వవిద్యాలయంలో చేరడానికి తయారయేడు. యిద్దర్నీ విద్యార్థులుగా చేర్చుకున్నారు. ఆ రోజుల్లో లేవిన్ యెక్కువగా ష్చేర్‌బాత్‌స్కీల యింటికి వెడుతూ వుండేవాడు. ఆ యింటిని ప్రేమించాడు. ఆ యింటిని, కచ్చితంగా కుటుంబాన్ని, ముఖ్యంగా ఆ కుటుంబంలోని ఆడవాళ్లని లేవిన్ ప్రేమించాడు వింతగా కనిపించినా గానీ. లేవిన్ తన తల్లిని యెరగడు. ఉన్న ఒక్క అక్కగారూ అతనికంటే వయసులో చాలా పెద్దది. దాంతోటి ష్చేర్‌బాత్‌స్కీల యింట్లో మొట్టమొదటగా ఒక రకమైన పాత ప్రభువంశీక నాగరిక కుటుంబాన్ని, ఉన్నత సంప్రదాయాలు గల కుటుంబాన్ని అతను చూశాడు. అతని తల్లీ తండ్రీ చనిపోవడంవల్ల యివన్నీ అతనికి లేకపోయాయి. అతను ఆ కుటుంబ సభ్యులందర్నీ, ముఖ్యంగా ఆడవాళ్లని నిగూఢ కవితాత్మక మేలిముసుగు గుండానే చూశాడు. వాళ్ల లోపాలని చూడకపోవడమే గాదు, వాళ్లని ఆచ్ఛాదించిన కవితాత్మక మేలిముసుగు గుండా మహోన్నత అనుభూతుల్నీ అన్ని రకాల పరిపూర్ణతనీ వూహించుకున్నాడు. యీ ముగ్గురు అమ్మాయిలూ ఒక రోజు ఒక్క ఫ్రెంచిలోనూ, యింకో రోజు ఒక్క ఇంగ్లీషులోనూ మాట్లాడేవాళ్లు. పైన చదువుకుంటూ వుండే అన్నగారి గదిలోకి వినిపించేట్టు

కొన్ని వేళల్లో ఒకర్ల తర్వాత ఒకళ్లు పియానో వాయించేవాళ్ళు. ఫ్రెంచి సాహిత్యం, సంగీతం, చిత్రకళ, నృత్యం వేర్వే గురువులు వీళ్ల యింటికే వచ్చేవాళ్ళు; M-lle Linon తోడు వుండగా యీ ముగ్గురూ త్వేర్‌స్కాయ్ బులావాకి బండిలో షికారు వెళ్ళేవారు. అప్పుడు దాలీ పొడుగాటి శాటిన్ ఫర్ కోటు వేసుకునేది, నతాలీ కొంచెం పొట్టిది వేసుకునేది, కిట్టీ మరీ పొట్టిది వేసుకునేది — అలా వేసుకోవడంవల్ల బిగుతుగా వుండే యెర్రటి స్టాకింగ్‌లో ఆమె కాళ్లు పొంకంగా కనిపించేవి. త్వేర్‌స్కాయ్ బులావాలో టోపీకి రెండు వూపు బంగారు తురాయి పెట్టుకున్న నౌకరు వెంట రాగా వాళ్లు షికారు వెళ్లేవారు. యివీ, మిగిలిన అనేక విషయాలూ దేని కోసమైంది వాళ్ల నిగూఢ ప్రపంచంలో అతని అవగాహనకి అంద కుండా వుండిపోయేవి. కాని షేర్‌బాత్‌స్కీం కుటుంబంతో ముడిపడివున్నదంతా కూడా అద్భుతమైందేనని, అతనికి తెలుసు. దాని నిగూఢత్వాన్ని తను ప్రేమించాడు.

స్టూడెంట్‌గా వుండగానే పెద్దమ్మాయి దాలీని ప్రేమించినంత పనిచేశాడు. కాని ఆమెకి అబ్లాన్‌స్కీతో పెళ్లయింది. తర్వాత రెండో అమ్మాయిని ప్రేమించినట్టు అను కున్నాడు. వాళ్లలో యెవర్నో ఒకళ్లని తను ప్రేమించి తీరాలన్న నిర్బంధం యేదో వున్నట్టూ, కాని యెవళ్లనైందీ యిదమిత్థంగా తేల్చుకోలేక పోయినట్టూ వుండది. రెండవ అమ్మాయి నతాలీ నాగరిక సమాజంలోకి అడుగు పెట్టీ పెట్టగానే ల్వోవ్ అనే దౌత్యాధికారిని చేసు కుంది. అతను దౌత్యకార్యాలయంలో ఉద్యోగం చేసేవాడు. లేవిన్ యూనివర్సిటీ చదువు పూర్తిచేసేటప్పటికి కిట్టీ యింకా చిన్నపిల్ల. అన్నగారు నౌకా దళంలో చేరాడు. బాల్టిక్ సముద్రంలో మునిగి చనిపోయాడు. ఆ తర్వాత లేవిన్ వాళ్ల యింటికి యెక్కువగా వెళ్ల లేదు — అతను దాలీ భర్త అబ్లాన్‌స్కీతో స్నేహంగా వున్నా. పల్లెటూళ్లో వొక యేడాది వున్నాక యిదే యేడు శీతకట్టు మొదట్లో అతను మాస్కో వచ్చేడు. షేర్‌బాత్‌స్కీం యింటికి మళ్లీ వెళ్లాడు. అప్పుడు గ్రహించాడు ఆ అక్క చెల్లెళ్లల్లో యెవళ్లని తను ప్రేమించా లని విధి నిర్ణయమైందీసీ.

తను ముప్పై రెండేళ్ల పెద్దమనిషి. సంప్రదాయమైన కుటుంబం. స్థితిమంతుడు. అలాంటి తను ప్రిన్సెస్ కిట్టీ షేర్‌బాత్‌స్కీని పెళ్లి చేసుకుంటానని చెప్పడం కంటే సులభ మైన వ్యవహారం వుండదు. దీన్ని మంచి సంబంధంగా పరిగణించే అవకాశాలే యెక్కువ. కాని లేవిన్ కిట్టీని ప్రేమించాడు. అంచేత కిట్టీని అన్ని రకాలుగానూ, యీ లౌకికమైన అన్నిటి కంటే యెత్తులో వుండే దేవతా మూర్తిగా చూశాడు. తను కిందుగా, క్షుద్రంగా వున్నట్టూ అంచేత ఆమెగాని, మరెవళ్లేనా గాని తను ఆమెకి తగినవాడని అనుకోనట్టూ అనిపించింది.

రెండు నెలలు అలా స్వాప్నిక లోకంలో వున్నట్టు మాస్కోలో గడిపేడు. కిట్టీని చూడ్డం కోసమన్నెప్పి దాదాపు ప్రతిరోజూ నాగరిక సమాజంలోకి వెళ్లేడు. అప్పుడు హఠాత్తుగా తనకిక ఆశ లేదని నిర్ణయించుకుని మళ్లీ పల్లెటూరికి వెళ్లిపోయేడు.

తనకిక ఆశ లేదన్న విశ్వాసం లేవిన్‌కి బలంగా కలగడానికి కారణాలు వున్నాయి. ఆమె తల్లిదండ్రుల దృష్టిలో తను ముప్ఫైలైన కిట్టీకి తగడనీ, యీ సంబంధం లాభదాయకమ్మైంది కాదనీ, కిట్టీయే తన లాంటి వాణ్ణి ప్రేమించదనీ అతనికి గట్టిగా అనిపించడమే ఆ కారణం. తనకి ఓ పద్ధతైన నికరమ్మైన ఉద్యోగంలేదని ఆమె తల్లిదండ్రుల దృష్టి అయినట్టు అతనికి అనిపించింది. మరి అతని తోటి వాళ్ళు – తనకే ముప్ఫై రెండేళ్ళు – కర్నల్, ఎయిడ్ డి కేంప్,* ప్రొఫెసరు, బేంక్ డైరెక్టరు, రైల్వే డైరెక్టరు లేకపోతే అబ్లాన్‌స్కీ లాగా యేదో ప్రభుత్వ కార్యాలయాం అధిపతులు. తద్భిన్నంగా తను (పై వాళ్ళకి తను యెలా కనిపించేదీ అతనికి బాగా తెలును) ఓ పల్లెటూరి భూస్వామి. ఆవుల పెంపకంలో, కంజు పిట్టల్ని వేటాడ్డంలో, కొట్టాలు కట్టించడంలో మునిగిపోతాడు. వేరే మాటల్లో చెప్పాలంటే తను నాగరిక ప్రపంచం దృష్టిలో యెందుకూ కొరగాని బండబ్బాయి. యే పనికీ యిక యోగ్యతలేని వాళ్ళు చేసే పని తను చేస్తున్నట్టు నాగరిక ప్రపంచంలో లెక్క అని అతననుకున్నాడు.

పైగా మనోహరంగా నిగూఢంగా వుండే కిట్టీ తనలాంటి సరసుడుగాని మనిషిని ప్రేమించదు. తను అలాంటి వాడినని అతను అనుకున్నాడు. యింకా అధ్వాన్నం తను చాలా సాదా మనిషి, యే ప్రత్యేకతా లేని వాడు. అన్నగారి స్నేహంవల్ల పెద్దవాడుగా చిన్నపిల్లతో వుండే లాంటి సంబంధాలు కిట్టీతో వుండేవి. ఆ పూర్వపు సంబంధాలు ఆమె ప్రేమని సంపాదించడానికి మరింత అవరోధంగా అతనికి కనిపించాయి. అతని దృష్టిలో యే ఆకర్షణలేకుండా సాధు స్వభావంతో వుండే తనలాంటి మనిషిని స్నేహితుడిగా అభిమానిస్తారు. అంతే. తను కిట్టీని ప్రేమించిన లాంటి ప్రేమని అందంగా, అన్నిట్నీ మించి యేదో ప్రత్యేకతతో వుండే మనిషికి వుండేదిగా భావిస్తారు.

ఆడవాళ్ళు సాదాగా, నిరాడంబరంగా వుండే వాళ్ళని ప్రేమిస్తారని అతను విన్నాడు. కాని ఆ విషయాన్ని నమ్మలేదు. యీ విషయంలో తన దృక్పథం మేరకే అతను తీర్పు చెప్పుకున్నాడు. తను అందంగా, నిగూఢంగా, విశిష్టంగా వుండే ఆడవాళ్ళని మాత్రమే ప్రేమించగలడు.

రెండు నెలలు పల్లెలో గడిపాక అతనికి అనిపించింది తను తొలి యౌవనంలో అనుభవించిన లాంటి అనుభూతి కాదు యిది అని. యీ అనుభూతి క్షణకాలంపాటు కూడా అతన్ని ప్రశాంతంగా వుండనియ్యలేదు. ఆమె తనని పెళ్ళాడుతుందా, పెళ్ళాడదా అనే ప్రశ్నకి జవాబులేకుండా వుండలేదు తను. తన బాధ తను వూహించుకున్న వాటివల్ల వచ్చిందే తప్ప తనని ఆమె నిరాకరిస్తుందనే దానికి రుజువు యేమీ లేదు. అంచేత పెళ్ళాడతానని చెప్పాలనీ, ఒప్పుకుంటే పెళ్ళాడాలనీ గట్టిగా తీర్మానించుకుని మాస్కో వచ్చాడు. ఒప్పుకోకపోతే... ఒప్పుకోకపోతే తనకి యేమవుతుందో అనే ఆ ఆలోచననే భరించలేక పోయాడు.

7

లేవిన్ మాస్కోకి ఉదయం రైల్లో వచ్చాడు. కోజ్నిషెవ్‌తో వుండాలని యెకాయెకీ అక్కడికే వెళ్లాడు. కోజ్నిషెవ్ అతని సవతి అన్నగారు. ఏక గర్భవాసులేగాని తండ్రులు వేరు. బట్టలు మార్చుకున్నాక లేవిన్ చదువుకునే గదిలోకి వెళ్లాడు. తను యే పనిమీద వచ్చిందీ చెప్పి, సలహా అడిగే ఉద్దేశ్యంతో వెళ్లాడు. కాని అప్పుడు ఆయనతోబాటు యెవళ్లో కూడా వున్నారు. ఆ వ్యక్తి ప్రఖ్యాత తత్వశాస్త్ర ప్రొఫెసరు. ఖార్కోవ్‌నుంచి వచ్చేడు. ఓ ముఖ్యమైన తాత్విక సమస్యకి సంబంధించి ఉత్పన్నమైన అభిప్రాయ భేదాన్ని గురించి చర్చించడానికి పని గట్టుకుని వచ్చాడు. ఆ ప్రొఫెసరుగారు భౌతికవాదులకి వ్యతిరేకంగా ఉగ్రంగా వాదిస్తున్నాడు. కోజ్నిషెవ్ ఆ వాదనని శ్రద్ధగా గమనిస్తున్నాడు. ప్రొఫెసరుగారు అంతకు ముందే రాసిన వ్యాసం చదివి అభ్యంతరం చెపుతూ కోజ్నిషెవ్ ఆయనకి ఉత్తరం రాశాడు. భౌతికవాదులకి మరీ లొంగుబాటు ప్రదర్శిస్తున్నట్టు ప్రొఫెసరుగారిని ఆ ఉత్తరంలో తప్పుపట్టుకున్నాడు. ఆ విషయం గురించి చర్చించడానికి ప్రొఫెసరుగారు వెంటనే బయల్దేరి ఆయనదగ్గరికి వచ్చేడు. అప్పట్లో ఆ విషయం జనానికి ఆసక్తిగా వుంది. మానవ నడవడికలో మానసిక, శారీరక విషయాలని విభజించే హద్దు యేదన్నా వుందా? వుంటే, యెక్కడ వుంది?

కోజ్నిషెవ్ తమ్ముణ్ణి తన సహజ ధోరణిలో చిరునవ్వు నవ్వుతూ పలకరించేడు. ఆ చిరునవ్వులో అభిమానం వుంటుంది గాని అది అంత ఆర్ద్రంగా వుండదు. అతన్ని ప్రొఫెసరు గారికి పరిచయం చేశాక వాళ్లు మళ్లీ తమ చర్చలో పడి పోయేరు.

ప్రొఫెసరుగారి ముఖం పసుపుపచ్చ వర్ణంతో వుంటుంది. కళ్లజోడు పెట్టుకున్నాడు. చిన్నగా వున్నాడు. ఆయన నుదురు వెడల్పుగా లేదు. కాసేపు సంభాషణ ఆపి పరిచయాలు పూర్తికాగానే లేవిన్ గురించి పిసరు కూడా పట్టించుకోకుండా మళ్లీ మాట్లాడ్డం సాగించేడు. ప్రొఫెసరుగారు వెళ్లిపోతాడని యెదురుచూస్తూ కూర్చున్నాడు లేవిన్. కొంచెం సేపయేటప్పటికి వాళ్ల చర్చలో అతనికే ఆసక్తి పుట్టింది.

చర్చకి సంబంధించిన వ్యాసాల్ని లేవిన్ చూశేడు. చదివేడు. ప్రకృతిశాస్త్ర మౌలిక సూత్రాల్లో ఆ విపులీకరణలో ఆసక్తి కలిగింది. యూనివర్సిటీలో జీవశాస్త్ర విద్యార్థిగా అతనికి ఆ సూత్రాల్ని బోధించారు. కాని యెన్నడూ కూడా ప్రకృతిలో భాగంగా మనిషి ఆవిర్భావానికి, ప్రతిచర్యలకి, జీవశాస్త్రానికి, సాంఘిక శాస్త్రానికి సంబంధించిన యీ శాస్త్రీయ నిర్ధారణల్ని జీవితానికీ మృత్యువుకీ అర్థం యేమిటి అన్న సమస్యలతో అతను సంధించలేదు. యిటీవలె యీ సమస్యలు మరింతగా అతని ఆలోచనల్లో వుంటున్నాయి.

అన్నగారూ ప్రొఫెసరుగారూ చర్చించుకునే విషయాన్ని విని కొద్దీ వాళ్లు శాస్త్రీయ సమస్యల్ని ఆధ్యాత్మిక సమస్యలని కలుపుతున్నారని అతను గ్రహించాడు. యెక్కువ సార్లు వాళ్లు ఆధ్యాత్మిక సమస్యల్ని స్పృశించారు. కాని తనకి అతి ముఖ్యం అయిన దానికి దగ్గరగా

రాగానే వాళ్ళు మళ్ళీ గబగబా వెనక్కి తగ్గేవాళ్ళు. మరో సారి సూక్ష్మ విభేదాలు, మినహాయింపులు, వ్యూహాలు ప్రామాణికమైన ఉల్లేఖనలు చేసేవాళ్ళు, తాము యేం మాట్లాడుతున్నదీ బోధపడ్డం కష్టం అయేదాకా అలా చేసేవాళ్ళు.

"నేను ఒప్పుకోను..." అని కోజ్నిషెవ్, తనకి సహజంగా వుండే స్పష్టతతో, వ్యక్తీకరణ కుశలతతో, ఉదాత్తమైన సౌందర్యంతో అన్నాడు. "...ప్రపంచం గురించిన నా భావనల్నీ ఇంద్రియ గ్రాహ్యమైన అనుభూతులవల్లనే కలుగుతాయన్న విషయానికి సంబంధించి కీయిస్*తో నేను యెన్నటికీ యేకీభవించలేను. అతి ప్రాథమికమైన భావన, ఉనికికి సంబంధించిన భావన, నా ఇంద్రియానుభూతులద్వారా నాకు అందదు. ఆ భావనని అందించే ప్రత్యేక యింద్రియం యేదీ లేదు కాబట్టి" అన్నాడాయన.

"నిజమే. కాని ఉనికిని గురించిన మీ చైతన్యం యింద్రియానుభూతులు మొత్తంగా కలిగించే దాని వల్ల వస్తుందని వూర్స్ట్, క్నాస్ట్, ప్రిపాసోవ్‌లు* చెప్తున్నారు. ఉనికికి సంబంధించిన చైతన్యం యింద్రియానుభూతుల ఫలితం. ఇంద్రియానుభూతులు లేకపోతే ఉనికి చైతన్యమే లేదనే దాకా పోతాడు వూర్స్ట్."

"సరిగ్గా దానికి విరుద్ధంగా వుండేదాన్ని నేను రుజువు చేస్తాను" అని కోజ్నిషెవ్ మొదలు పెట్టాడు.

కాని ముఖ్యమైన విషయానికి వచ్చేటప్పటికి వాళ్ళు మళ్ళీ వెనక్కి పోతున్నారనీ యీ అంశం దగ్గర లేవిన్‌కి అనిపించింది. అంచేత ప్రొఫెసర్ని వో ప్రశ్న అడిగే ధైర్యం చేశాడు.

"అంటే అనుభూతి చెందే నా సామర్థ్యం నాశనం అయితే, నా శరీరం చచ్చిపోతే, నేను వుండను బహుశా, అః" అని అడిగాడు.

ప్రొఫెసరుగారు అతనికేసి విసుగ్గా చూశాడు. యెవరీ మనిషి పడవ సరంగులా వున్నాడు తత్వవేత్త కాదు పాదూ కాదు, యిలాంటి వాడు తమ వాదనలోకి చొచ్చుకు రావడం యేమిటి అనే మానసిక బాధతో చూసినట్టు చూశాడు. యేమిటిలాంటి వాడికి తను యేం చెప్తాడు అన్నట్టు కోజ్నిషెవ్‌కేసి చూశాడు. కోజ్నిషెవ్ ప్రొఫెసరుగారిలా తీవ్రంగా, యేకపక్షంగా మాట్లాడ్డం లేదు. ప్రొఫెసరుగారికి జవాబు చెప్పడానికీ లేవిన్ సందేహానికి కారకమైన సాదా, సహజ దృక్పథాన్ని అర్థం చేసుకోగలడానికీ అతని బుర్రలో అవకాశం మిగిలింది. ఆయన చిరునవ్వు నవ్వి "ఆ ప్రశ్నకి జవాబు చెప్పే హక్కు మనకింకా లేదు" అన్నాడు.

"మనకి సమాచారం లేదు" అని ప్రొఫెసరుగారు బలపరిచేరు. తన అభిప్రాయాల్ని విపులీకరించుకుంటూ పోయాడు. "అటు వేపునుంచి చూస్తే, ప్రిపాసోవ్ వాదించినట్టుగా, గ్రహణ అనేది ఇంద్రియానుభూతులమీద ఆధారపడితే యీ రెండింటికీ మధ్య కచ్చితమైన తేడా చూడాలి అంటాను" అన్నాడాయన.

లేవిన్ యిక వినదల్చుకోలేదు. ప్రొఫెసరుగారు యెప్పుడు వెళ్ళిపోతాడా అని యెదురు చూస్తూ కూర్చుండి పోయాడు.

8

ప్రొఫెసరుగారు వెళ్లిపోయాక కోజ్నిషెవ్ తమ్ముడి కేసి తిరిగాడు.

"చాలా సంతోషంగా వుంది, వచ్చావు. ఎక్కువ రోజులు వుంటావా? యెలా వుంది వ్యవసాయం?" అని పలకరించేడు.

ఆయనకి వ్యవసాయం అంటే ఆసక్తి యేమీలేదనీ, యేదో మర్యాదకి అడగాలన్నట్టు అడిగాడనీ లేవిన్‌కి తెలుసు. అంచేత గోధుమ అమ్మకం గురించీ, వచ్చిన ఆదాయం గురించీ చెప్పి సరిపుచ్చేడు.

పెళ్లి చేసుకుందామన్న తన ఉద్దేశ్యం గురించి మాట్లాడి ఆయన సలహా అడుగుదా మనుకున్నాడు లేవిన్. యీ విషయం గురించి గట్టిగా నిర్ణయించుకున్నాడు కూడాను. కాని అన్నగారిని చూశాక, ప్రొఫెసరుతో ఆయన సంభాషణ విన్నాక వ్యవసాయం గురించి యేదో ప్రాపకంగా వుండే ధోరణిలో ఆయన అడగడం విన్నాక (తల్లిగారి ఎస్టేట్‌ని వాళ్లు పంచుకో లేదు, మొత్తం ఆస్తిని లేవిన్ తనే అజమాయిషీ చేస్తున్నాడు) పెళ్లి చేసుకోవాలన్న తన నిర్ణయం గురించి ఆయనతో యే కారణంవల్లనో మాట్లాడలేకపోతున్నట్టు లేవిన్‌కి అనిపించింది. యీ విషయాన్ని తను కోరుకునట్టుగా ఆయన పరిగణించడేమోనని అనుకున్నాడు.

"వూఁ, జేమ్‌స్త్వొ కౌన్సిల్ యెలా వుంది?" అని కోజ్నిషెవ్ అడిగాడు. ఆయనకి దానిపట్ల ఆసక్తి వుంది. దానికి చాలా ప్రాముఖ్యం యిస్తాడు.

"నిజం చెప్పాలంటే నాకు తెలీదు."

"అదేమిటి? నువ్వు కమిటీ మెంబరు*వి కదా?"

"యిప్పుడు కాదు. రాజీనామా పెట్టాను. సమావేశాలకి వెళ్లడం కూడా మానేశాను" అన్నాడు లేవిన్.

"ప్చ్" అని కనుబొమలు చిట్లిస్తూ గొణిగాడు కోజ్నిషెవ్.

వాళ్ల ఉయేజ్ద్‌లోని జేమ్‌స్త్వొ సమావేశాల్లో యేం జరిగిందో లేవిన్ వివరించాడు. తన తప్పులేదని చూపించడానికి అలా చేశాడు.

"అదుగో యెప్పుడూ అలానే వుంటుంది, మన రష్యన్ల పని యెప్పుడూ అంతే" అంటూ అతని మాటకి అడ్డం వెళ్లేడాయన. "మన లోటుపాట్లు మనం చూసుకోవడం సుగుణమే కావచ్చు. కాని దాన్ని కడకంటా లాగుతాం, వక్రోక్తి మాటల్తో మనల్ని మనం వూరడించు కుంటాం. అదెప్పుడూ మన నాలిక చివరే వుంటుంది. మన జేమ్‌స్త్వొ పరిపాలనకి యిచ్చిన హక్కుల్ని యే యూరపియన్ దేశానికి యిచ్చినా గానీ—జర్మన్లకి గాని, ఇంగ్లీషు వాళ్లకి గాని,—వాళ్లు దాన్ని స్వాతంత్ర్యం కోసం వాడుకుంటారు. మనమేమో వేళాకోళంగా చూస్తు న్నాం" అన్నాడు.

"నేనేం చెయ్యగలను" అన్నాడు లేవిన్ తన తప్పు యేం వుందన్నట్టు. "నా శాయ శక్తులా ప్రయత్నించాను. మనసంతా పెట్టాను. నా వల్ల కాదు. నాకా శక్తి లేదు" అన్నాడు.

"శక్తి లేదా? విషయాలని సరియైన పంథాలో చూడవు నువ్వు" అన్నాడు కోజ్నిషెవ్.

"బహుశా" అన్నాడు లేవిన్ చిన్నబుచ్చుకుని.

"ఆఁ, తెలుసా, నికొలాయ్ మళ్లీ వచ్చాడు యిక్కడికి."

నికొలాయ్ కోజ్నిషెవ్‌కి సవతి తమ్ముడు. కాన్‌స్తంతీన్ లేవిన్‌కి స్వయానా అన్నగారు. ఒక తండ్రి రక్తం పంచుకు పుట్టేరు. నికొలాయ్ సర్వ నాశనం అయిపోయేడు. తనకి రాబడి వుండే ఆస్తిని చాలా భాగం తగలేసేశాడు. పనికి మాలిన పోకిరీ సాహసాలు చేశాడు. అన్నదమ్ములతో దెబ్బలాడేడు.

"యేమిటి?" అని భయాందోళనతో లేవిన్ అరిచేడు. "నీకు యెలా తెలుసు?" అన్నాడు.

"ప్రొకోఫీకి దారిలో కనిపించాట్ట."

"యిక్కడ? మాస్కోలో? ఎక్కడున్నాడు? నీకు తెలుసా?" వెంటనే వెళ్లి అతన్ని చూడాలన్నట్టు లేవిన్ లేచి నుంచున్నాడు.

"నీకు చెప్పడం పొరపాటైనట్టుంది" అన్నాడు కోజ్నిషెవ్. తమ్ముడు అంతలా కలవరపడ్డం చూసి తల ఆడించేడు. "వాడు యెక్కడుంటున్నాడో కనుక్కుని యీ ప్రామిసరీ నోటు యిచ్చెయ్యమని మా మనిషిని పంపేను. త్రూబిన్‌కి వాడు రాసిన నోటు. యీ బాకీ నేను చెల్లించేశాను. యిదీ నాకు వచ్చిన జవాబు" అంటూ కోజ్నిషెవ్ పేపర్‌వెయిట్ కిందనుంచి వో కాగితాన్ని తీశాడు. తమ్ముడికి అందించాడు.

లేవిన్ చదివాడు. పరిచితమైన వింత దస్తూరీ.

"నా మానాన నన్ను వుండ నివ్వమని చేతులెత్తి వేడుకుంటున్నాను. మర్యాదస్తులైన నా అన్నదమ్ములు దగ్గరనుంచి నేను కొరుకునేది యిది వొక్కటే, నికొలాయ్ లేవిన్."

దాన్ని చదివాక అలా చేత్తో పట్టుకునే తలపైకి యెత్తకుండా లేవిన్ కోజ్నిషెవ్ ముందు నుంచున్నాడు.

నష్ట జాతకుడైన అన్నగారిని గురించి సర్వం మర్చిపోవడం అనే ఆలోచనకీ, అది తప్పు అవుతుందేమోనన్న యెరుకకీ మధ్య అతనిలో ఒక పెనుగులాట జరుగుతోంది.

"నా మనసు కష్టపెట్టాలని వాడు చూస్తున్నట్టుగా వుంది. కాని అలా చెయ్య లేడు. వాడికి సాయపడాలనే నాకు మనస్ఫూర్తిగా వుంది. కాని అది సాధ్యం కాదని తెలుసు" అన్నాడు కోజ్నిషెవ్.

"అవునవును. వాడ్ని నువ్వెలా చూసేదీ నాకు తెలుసు. అయినా వో సారి వెళ్లి చూస్తాను" అన్నాడు లేవిన్.

"వెళ్లాలనిపిస్తే వెళ్లు కాని నేను వెళ్లమని చెప్పను. అంటే నువ్వెళ్లడంవల్ల నాకేం భయం లేదనుకో. వాడు నీకూ నాకూ మధ్య తగూ పెట్టలేడు. కాని నీ హితం కోరే చెప్తు

న్నాను నువ్వు వెళ్లడం మంచిది కాదని. వాడికి సాయం చెయ్యలేవు. అయినా, నీ యిష్టం వచ్చినట్టే కానీ" అన్నాడు కోజ్నిషెవ్.

"వాడికి నేనేం సాయపడలేను. కాని ముఖ్యంగా యీ సమయంలో — సరే అది వేరే విషయం అనుకో — లేకపోతే నాకు మనశ్శాంతి వుండదు."

"యేమో మరి ఆ సంగతి నాకు తెలీదు. నాకు తెలిసింది యేమిటంటే" అని జత చేశాడు. "యిది ఆత్మశ్లాఘ్య లేకుండా వుండడానికి గుణపాఠం. నికొలాయ్ యిప్పుడున్న స్థితిని చూసి పతనం అని పిలిచేదాన్ని నే మాదిరిగా అర్థం చేసుకోగలను. తెలుసా నీకు వాడు . యేం చేశాడో" అని అడిగాడు కోజ్నిషెవ్.

"ఘోరం, ఘోరం" అన్నాడు లేవిన్.

కోజ్నిషెవ్ నౌకరుని అడిగి నికొలాయ్ యెక్కడుంటున్నది కనుక్కున్నాడు లేవిన్. వెంటనే వెడదా మనుకున్నాడు. కాని మళ్లీ కాసేపు ఆలోచించి సాయంత్రం వెళ్లచ్చని మనసు మార్చుకున్నాడు. ముందు తను మాస్కో వచ్చిన పని సంగతి తేల్చుకుని స్థిమితపడాలి. అందుకని అబ్లాన్స్కీ ఆఫీసుకి వెళ్లాడు. ష్చేర్బాత్స్కీల సంగతి తెలిశాక, కిట్టీ కనిపిస్తుందని చెప్పిన చోటుకి వెళ్లాడు.

9

నాలుగు గంటలకి లేవిన్ జూలాజికల్ గార్డెన్స్ దగ్గర బండి దిగాడు. అతని గుండె దడదడ కొట్టుకుంటోంది. మంచు గుట్టలమీదమంచి మనుషులు యేటవాలుగా జారే చోటికీ, స్కేటింగ్ రింక్‌కీ వెళ్లే దారిలో నడిచి వెళ్లాడు. ఆమె అక్కడ వుంది. యేమంటే గేటు దగ్గరే ష్చేర్బాత్స్కీల బండి కనిపించింది.

తేటగా, మంచుగా వున్న రోజు అది. ముందు వాకిటి దగ్గరే బళ్లు, స్లెడ్జీలు వున్నాయి. బళ్లవాళ్లు, జెండార్మ్ వాళ్లూ వున్నారు. నవ నాగరికంగా వున్న జనం పెట్టుకున్న టోపీలు యెండలో మెరుస్తున్నాయి. ఆ జనం గేటు దగ్గరా, రష్యన్ కొయ్య యిళ్లమధ్య వున్న దారులమీదా గుమి గూడుతున్నారు. ఆ యిళ్లు లోనాటు పనితో చెక్కిన కప్పు స్తంభాలతో వున్నాయి. తోటలో వున్న ముసలి బర్చ్ చెట్ల కొమ్మలు మంచు బరువుకి వంగి, చర్చి పీఠాధిపతులు దాంభికమైన ఉడుపులు కొత్తగా వేసుకున్నట్టుగా వున్నాయి.

స్కేటింగ్ రింక్‌కి వెడుతూ దారిలో అతను తనలో తనే అనుకున్నాడు. 'నేను ఆవేశ పడకూడదు. స్థిమితంగా వుండాలి. యేమిటిది? యెందుకు దడదడ కొట్టుకుంటు న్నావు? ఛస్, శాంతంగా వుండు' అంటూ హృదయాన్ని సమాధాన పరుచుకోబోయాడు. కాని యెంత స్థిమితంగా వుండాలని ప్రయత్నిస్తే అంతగా అతనికి వూపిరాడకుండా పోయింది. యెవళ్లో పరిచయస్థులు అతన్ని పిలిచారు. కాని యెవరైందీ కూడా అతనికి యెరుకే అవలేదు. అతను గుట్టమీదకి వెళ్లాడు. పైకి లాగుతూ కిందికి జారుతూ వున్న జారుడు స్లెడ్జిం

చప్పుడు గోలగా వుంది. జారుడు స్లెడ్జిలు చరచర జారిపోతూ వున్నాయి. వాటిల్లో కూచుని జారేవాళ్ళు హేయ్ అని అరుస్తున్నారు. కొన్ని అడుగుల్లో అతను స్కేటింగ్ రింక్ చేరుకున్నాడు. వెంటనే అక్కడున్న స్కేటర్లందరిలోను ఆమెని దూరంనుంచే కనుక్కోగలిగాడు.

అతని హృదయాన్ని వశం చేసుకున్న సంతోషంవల్లా భయంవల్లా ఆమెని కనుక్కోగలిగాడు. ఆమె రింక్ అవతలి వేపున నుంచుని ఒకావిడతో మాట్లాడుతోంది. మిగిలిన వాళ్ళ నుంచి ఆమెని ప్రత్యేకంగా వుండగలిగేటట్టు చేసేది ఆమె దుస్తుల్లో గాని, నుంచున్న భంగిమలో గాని యేమీ లేదని అనిపించవచ్చు. కాని ఉల్లిపువ్వుల్లో మల్లెపువ్వుని కనిపెట్టగలిగినంత సులభం అయి వుండేది లేవిన్ యే గుంపులో వున్నా ఆమెని కనిపెట్టడం. ఆమె అన్నిటి మీదా వెలుతురు ప్రకాశింపచేసింది. పరిసరాల్ని ధగద్ధగాయమానం చేసే మందహాసం ఆమె. 'మంచుమీద నడిచి వెళ్ళి ఆమె దగ్గరికి వెళ్ళగలనా?' అనుకున్నాడు. ఆమె నుంచున్న చోటు తను వెళ్ళ సాహసించలేని పవిత్ర స్థలం. ఓ క్షణంలో అతను దాదాపు వెనక్కి తిరిగి వెళ్ళి పోబోయాడు. అంత భయవిహ్వలుడై పోయాడు. కాని రకరకాల వాళ్ళూ ఆమె ముందు వున్నారు, తను కూడా పూరికే స్కేటింగ్ చెయ్యడం కోసం వచ్చివుండవచ్చు అని సర్ది చెప్పుకోబోయాడు. ఒడ్డమ్మటే వెళ్ళాడు. సూర్యుడికేసి చూడకుండా తప్పించుకున్నట్టుగా ఆమెకేసి చూడ్డం తప్పించుకున్నాడు. కాని ఆమెకేసి చూడకుండానే సూర్యుణ్ణి చూసినట్టుగా ఆమెని చూశాడు.

వారంలో ఆ రోజున, ఆ రోజున ఆ సమయంలో ఒక తరహా జనం రింక్ దగ్గర పోగయ్యారు. అంతా ఒకళ్ళనొకళ్ళు యెరిగినవాళ్ళే. ఆ క్రీడలో సిద్ధహస్తులైన వాళ్ళు వున్నారు, వాళ్ళు తమ నైపుణ్యాన్ని ప్రదర్శిస్తున్నారు. కొత్త వాళ్ళున్నారు, స్కేటింగ్ నేర్చుకుంటూ వున్నారు. బెరుకు బెరుగ్గా నడక నేర్చుకుంటూ, జారిపోకుండా కుర్చీ వున్న చిన్న తోపుడు బళ్ళనీపు అనుకుని పట్టుకుంటున్నారు. చిన్న పిల్లలూ వున్నారు, పెద్దవాళ్ళూ ఆరోగ్యంకోసం వ్యాయామంగా స్కేటింగ్ చేస్తున్నారు. ఆమెకి దగ్గరగా వుండే ప్రత్యేక భోగం వాళ్ళంతా అనుభవిస్తున్నారని లేవిన్ వూహించుకున్నాడు. అయినా కూడా యేమీ పట్టనట్టుగా వాళ్ళు ఆమెని దాటి వెళ్ళిపోతున్నారు. ఆమెతో మాట్లాడుతున్నారు కూడా. ఆమె ప్రమేయం లేకుండానే ఉల్లాసంగా వున్నారు. యీ బ్రహ్మాండమైన మంచుమీద, యీ చక్కని వాతావరణంలో స్కేటింగ్ చేస్తూ సంపూర్తిగా వినోదిస్తున్నారు.

కిట్టీకి అన్నగారి వరస అయిన నికొలాయ్ ష్చేర్‌బాత్‌స్కీ బల్లమీద కూర్చున్నాడు. అతను పొట్టి జాకెట్, బిగుతైన లాగు తొడుక్కున్నాడు. అతని కాళ్ళకి స్కేట్లు వున్నాయి. లేవిన్‌ని మొట్టమొదటగా చూసి పిలిచిన వాడు అతనే.

"హేయ్ రష్యా స్కేటింగ్ ఛాంపియన్! యెప్పుడొచ్చారు? మంచు బ్రహ్మాండంగా వుంది. రండి స్కేటింగ్‌కి" అన్నాడు.

"నాకు స్కేట్లు లేవు" అన్నాడు లేవిన్. ఆమె సమక్షంలో ఆ సాహసానికీ, చనువుకీ

ఆశ్చర్యం కలిగింది. ఒక్క క్షణం కూడా ఆమెనుంచి దృష్టి మళ్లించుకోలేదు. అయినా ఒక్క సారి ఆమెకేసి కన్నెత్తి చూళ్లేదు. సూర్యబింబం తన దగ్గరకి వస్తూ వున్నట్టు అతనికి స్పృహ కలిగింది. ఆమె యెత్తు బూట్లు తొడుక్కుంది. నాజూకైన తన కాళ్లని తిప్పి ఒక చుట్టు తిరిగి, పస్తాయిస్తున్నట్టు కనిపిస్తూ అతనికేసి వచ్చింది. రష్యన్ బిట్టలు వేసుకున్న ఓ కుర్రాడు చేతులు అసాధ్యంగా వూపుతూ దాదాపు వింటి బద్దలా వెంమీరకి వొంగి ఆమె పక్కనుంచి దూసుకుపోయాడు. ఆమె కాళ్లమీద నిబ్బరంగా వుండలేకపోతోంది. ఆమె మఫ్‌ని తాళ్లతో మెడలో మెడచుట్టూ కట్టుకుని వేళ్లాడేసుకుంది. ఆ మఫ్‌నుంచి చేతులు తీసేసింది. పడిపోకుండా వుండేందుకు చేతుల్ని చాచింది. లేవిన్ కేసే చూస్తూ వుంది. అతన్ని అంతకు ముందే గుర్తుపట్టింది. అతన్ని చూసీ, తన భయాల్ని చూసీ చిరునవ్వు నవ్వింది. చుట్టు తిరగడం పూర్తిచేసింది. తర్వాత లాఘవంగా కాళ్లతో ముందుకు తోసుకుంటూ అన్నగారి వేపు జారుతూ వచ్చింది. అతన్ని పట్టుకుని లేవిన్ కేసి చూసి చిరునవ్వు నవ్వుతూ తల వూపింది. లేవిన్ వూహించుకున్నదాని కంటే ఆమె యింకా యెక్కువ మనోహరంగా అతనికి కనిపించింది.

ఆమెని గురించి అనుకోగానే అతనికి మనోనేత్రం ముందు ఆమె మొత్తం రూపం సాక్షాత్కరించింది. ముఖ్యంగా, అమాయకపు నిష్కపటత్వాన్నీ, సౌశీల్యాన్నీ వెల్లడి చేసే ఆమె ముగ్ధత్వం రూపుకట్టింది. చక్కని పొంకమైన తరుణ భుజాలమీద తీరుగా వున్న చక్కని చిన్న తల అందం కనిపించింది. ఆమె వదనంలోని లాలిత్యం, ఆమె రూపం లోని నాజూకైన సొగసు కలిసే అతనికి అంతలా హత్తుకునే ప్రత్యేక మనోహరత్వాన్ని రూపొందించాయి. కాని అతనికి యెప్పుడూ కొత్తగా కనిపించేదీ, ఆశ్చర్యం కలిగించేట్టుగా వుండేదీ ఆమె చూపు. బెరుగ్గా, సాధువుగా, కపటం లేకుండా వుండే చూపు. దానికంటే యెక్కువ కొత్తగా, ఆశ్చర్యకారకంగా వుండేది ఆమె మందహాసం. అది లేవిన్‌ని యేదో మంత్ర ముగ్ధ ప్రపంచానికి తీసుకుని పోయేది. అక్కడ అతను ఒక విధమైన మార్దవత్వాన్ని అనురాగాన్ని అనుభూతి చెందేవాడు. అలాంటి మధురానురాగాల్ని పసితనంలో యెప్పుడో అనుభూతి చెందినట్టు లీలగా గుర్తు వచ్చేది.

"చాలా కాలమైందా వచ్చి?" అని అడిగింది, చేతిని అందిస్తూ. అతను ఆమె మఫ్‌నుంచి జారి కింద పడ్డ రుమాల్ని తియ్యగానే "థాంక్యూ" అంది.

"నేనా? అబ్బే లేదు... నిన్న... వుహుఁ, యివాళ వచ్చాను..." అన్నాడు లేవిన్. తన కంగారులో ఆమె యేం అడిగిందో వెంటనే గ్రహించలేకపోయాడు. "మీ యింటికి వచ్చి చూద్దామని" అన్నాడు. యెందుకు చూద్దామనుకున్నదీ తట్టగానే అతనికి సిగ్గయింది. యిబ్బంది పడిపోయాడు. "మీరు స్కేట్ చేస్తారని నాకు తెలీదు, అదీ యింత బాగా" అన్నాడు.

ఆమె అతన్ని పరకాయించి చూసింది, అతను యిబ్బంది పడుతూ వుండడానికి కారణం యేమిటా అని వూహించ ప్రయత్నించినట్టు.

"మీ పొగడ్త రావడం నిజంగా గొప్పే. యిక్కడ మిమ్మల్ని మించిన స్కేటర్ లేడని మాకింకా పేరుంది" అని మఫ్‌మీద వున్న మంచుని నల్లని గ్లవ్ తొడిగిన చేత్తో దులిపేసుకుంటూ అంది.

"ఒకప్పుడు స్కేటింగ్ అంటే మహా కాంక్షగా వుండేది. నాకు, అందులో ప్రావీణ్యం సంపాదించాలనుకున్నాను."

"మీరు యేం చేసినా మహా కాంక్షగా చేస్తారులా వుంది. మీరు స్కేట్ వెయ్యడం చూడాలని వుంది నాకు. రండి స్కేట్లు తొడుక్కోండి, యిద్దరం కలిసి స్కేటింగ్ చేద్దాం" అంది చిరునవ్వు నవ్వుతూ.

'యిద్దరూ కలిసి! అలాంటిది సాధ్యమే?' అనుకున్నాడు లేవిన్. ఆమె మీదనుంచి చూపు మళ్లించుకోలేదు.

"వెళ్లి స్కేట్స్ తెచ్చుకుంటా" అన్నాడు.

స్కేట్లు తొడుక్కోవడానికి వెళ్లాడు.

"శాన్నాళ్లైందండి మిమ్మల్ని చూసి" అని అక్కడ పనిచేసేవాడు, లేవిన్ కాలు పట్టుకుని మడమకి స్కేట్ బిగిస్తూ అన్నాడు. "మీలాగా వొక్కరు యీ క్రీడలో నైపుణ్యం సాధించలేదండి. సరిగ్గా వుందా అండి?" అని అడిగాడు తోలు పట్టీ బిగిస్తూ.

"బావుంది, కొంచెం గబగబా కానీ" అన్నాడు లేవిన్. అతనికి సంతోష మందహాసం తొణికిస లాడుతోంది, అదుపు చేసుకోలేక పోతున్నాడు. 'ఆహా! జీవితం అంటే యిదీ! ఆనందం అంటే యిదీ!' అనుకున్నాడు. ' "కలిసి" అందామె. "యిద్దరం కలిసి స్కేటింగ్ చేద్దాం" అంది. యిప్పుడే ఆమెకి చెప్పేస్తే? యేమో యెందుకు చెప్పలేనో భయం యేమిటో, యింత ఆనందంగా వుండబట్టేమో. కనీసం ఆశ వుండబట్టి ఆనందంగా వుందేమో... అయినా, ఒక వేళ... కాని చెప్పి తీరాలి, చెప్పి తీరాలి! యీ బలహీనత వుండకూడదు!'

లేవిన్ నుంచుని కోటు తీసేశాడు. ఆ భవనం దగ్గర మంచు యెగుడు దిగుడుగా వుంది. దానిమీదనుంచి పరిగెడుతూ నున్నగా వున్న మంచుమీదకి వెళ్లాడు. తన సంకల్పబలమే తనని వేగంగానో, మెల్లిగానో వెళ్లేటట్టు చేస్తూ వున్నట్టుగా సునాయాసంగా స్కేటింగ్ చేశాడు. బెరుకు బెరుగ్గా ఆమె దగ్గరికి వెళ్లాడు. కాని ఆమె చిరునవ్వు మరోసారి అతనికి ధైర్యం కలిగించింది.

ఆమె చేతిని అందించింది. యిద్దరూ స్కేటింగ్ మొదలుపెట్టారు. క్రమేపీ వేగం పెంచారు. వేగం పెరిగే కొద్దీ ఆమె అతని చేతిని గట్టిగా పట్టుకుంది.

"మీరుంటే గబగబా వేర్చేసుకుంటాను, నాకు మీరంటే ధైర్యంగా వుంటుంది" అంది.

"మీరు నామీద అనుకుంటే నాకూ ధైర్యం కలుగుతుంది" అన్నాడు. అలా అన్నందుకు వెంటనే భయం వేసి, సిగ్గు పడిపోయాడు. అతనలా అనగానే హఠాత్తుగా మేఘాల మాటుకి సూర్యుడు పోయినట్టుగా, ఆమె ముఖంలోని మృదుత్వం పోయింది. ఆమె ముఖంమీద కండరాలు కంపించడం అతను గమనించాడు. ఆమె యేదేనా ఆలోచనలో పడిందీ అలా జరుగుతుంది. అది అతనికి పరిచితమే. మన్నటి ఆమె నుదురు ముడుచుకుంది.

"మీకేదో యిబ్బంది కలిగినట్టుంది. ఆఁ? అలా అడిగే హక్కు నాకు లేదనుకోండి" అన్నాడు గబగబా.

"యెందుకు లేదు? అబ్బే, యేమీ యిబ్బందిగా లేదు" అంది. ఆమె స్వరం అనార్ద్రంగా వుంది. "మీరు M-lle Linonని చూశారా?" అని గబగబా జతచేసింది.

"యింకా లేదు."

"ఆమెని చూడండి. ఆమెకి మీరంటే యెంత యిష్టమో."

'యేమిటిది? యీమెని కష్టపెట్టానేమో. ఓరి నాయనోయ్! నన్ను కాపాడు!' అనుకున్నాడు లేవిన్ బెంచీ దగ్గరికి వెడుతూ. నెరిసిన ఉంగరాల జుట్టు వున్న ఫ్రెంచి ముసలావిడ దానిమీద కూర్చుంది. ఆమె అతన్ని పాత మిత్రుడిలాగా పలకరించి చిరునవ్వు నవ్వింది. ఆమె కట్టుడు పళ్ళు కనిపించాయి.

"వూఁ, మనం పెద్దవాళ్ళం అయిపోతాం" అని కిట్టీని కళ్ళతో చూపిస్తూ అతనితో అంది. మనం పెద్దవాళ్ళం అయిపోతాం. Tiny bear[1] అప్పుడే యింతై పోయింది" అని నవ్వింది. ఇంగ్లీషు అద్భుత కథ 'మూడు ఎలుగులు' మాదిరిగా వుండే వాళ్ళు అని యీ అప్ప చెల్లెళ్ళని అతను పిలవడం అతనికి గుర్తుచేస్తూ అలా అంది. "గుర్తుందా మీరు అలా అంటూ వుండే వాళ్ళు?" అంది.

అతనికి గుర్తులేదు. కాని గత పదేళ్ళుగా ఆమె యీ పరిహాసోక్తిని అతనికే అంటగడుతూ మహా సంతోషపడుతూ వుంది.

"కానివ్వండి, స్కేటింగ్ చెయ్యండి. మా కిట్టీ స్కేటింగ్ బాగా నేర్చుకుంది, కదూ?"

లేవిన్ మళ్ళీ కిట్టీ దగ్గరికి వెళ్ళాడు. యిప్పుడు ఆమె ముఖం కఠినంగా లేదు. ఆమె కళ్ళు ముందటి లాగానే నిష్కపటంగా, మృదువుగా వున్నాయి. కాని యీ మృదుత్వం వెనక కావాల్సికి తెచ్చి పెట్టుకున్న శాంతం వున్నట్టుగా లేవిన్‌కి అనిపించింది. అతనికి విచారం కలిగింది. ముసలి పంతులమ్మ గురించీ, ఆవిడ వింత అలవాట్ల గురించీ మాట్లాడుకున్నాక కిట్టీ అతని జీవితం గురించి అడిగింది.

"శీతాకాలంలో పల్లెటూళ్ళో మీకు యెలా తోస్తుంది? అని అడిగింది.

"బాగానే తోస్తుంది. నాకు చేతినిండా పని వుంటుంది" అన్నాడతను. ఆమె శాంతమైన

---

[1] బుల్లి ఎలుగు. (ఇంగ్లీషు).

ధోరణికి తనని అదుపు చేస్తోందనీ, యీ శీతకట్టు ఆరంభంలో లాగా తను దాన్నుంచి బయట పడలేడనీ అతను గ్రహించాడు.

"యెక్కువ రోజులుంటారా?" అని అడిగింది.

"తెలీదు" అన్నాడు తను యేమిటంటున్నదీ ఆలోచించకుండా. తను గనక ఆ శాంత స్నేహ స్వరానికి లొంగిపోతే యేమీ తేల్చుకోకుండానే మళ్లీ తిరిగి వెళ్లిపోవచ్చని అతనికి తట్టింది. యేమైనా అమీతుమీ తేల్చుకోవాలి అని నిర్ణయించుకున్నాడు.

"యేమిటి? మీకు తెలీదా?"

"వుహుం, తెలీదు. అదంతా మీమీద ఆధారపడి వుంటుంది" అన్నాడు. వెంటనే తనన్న మాటకి తనే భయపడి పోయాడు.

బహుశా తనన్నది ఆమెకి వినిపించి వుండదు లేక వినిపించుకో దలుచుకోలేదో, యేదైనప్పటికీ ఆమె హఠాత్తుగా తడబడింది. హడావుడిగా స్కేటింగ్ చేసుకుంటూ వెళ్లిపోయింది. మొదట M-lle Linon దగ్గరికి వెళ్లింది. ఆమెతో యేదో చెప్పింది. తర్వాత ఆడవాళ్ల స్కేట్లు విప్పేసే యింటి దగ్గరికి వెళ్లింది.

'ఓర్నాయనోయ్! యెంత పని జరిగింది! దేముడా, కాపాడు ఆపద తప్పించు నాకు' అని ప్రార్థించేడు. తనకి బలమైన వ్యాయామం తక్షణం అవసరం అనిపించింది. కుడి వేపూ, యెడం వేపూ పెద్ద వలయాలుగా స్కేటింగ్ చేస్తూ దూసుకుపోయాడు.

సరిగ్గా అప్పుడే ఓ యువకుడు కాఫీ హౌస్‌నుంచి యివతలికి వచ్చాడు. అతని నోట్లో సిగరెట్ వుంది. కొత్త స్కేటర్లలో అతన్ని మించిన వాడు లేడు. అతను కాళ్లకి స్కేట్లు తొడుక్కునే వచ్చాడు. అంగ తీసుకుని పరిగెత్తుతూ ధనధనా చప్పుడు చేసుకుంటూ మెట్ల మీద నుంచి కిందికి దూసుకువచ్చేడు. కిందికి రాగానే, వూపు తీసుకోవడానికి చేతులు కూడా విసరకుండా, వూపుగా వెళ్లేడు.

"యిది కొత్తగా వుంది" అన్నాడు లేవిన్. అలా ప్రయత్నిద్దామని వెంటనే మెట్లెక్కేడు.

"మెడలు విరుచుకోగలరు! దానికి అభ్యాసం కావాలి" అని నికొలాయ్ ష్చేర్‌బాత్‌స్కి అరిచాడు.

పైకి యెక్కాక లేవిన్ కూడా వూపు కోసం పరుగు తీశాడు. మెట్లమీదనుంచి యెగిరాడు. చేతులతోటే పట్టు తప్పకుండా కాసుకున్నాడు. కిందికి రాగానే తొట్రుపడ్డాడు. చేత్తోటి మెల్లిగా మంచుని తాకేడు. కాని బలమైన వూపు వుండబట్టి పడిపోలేదు. నవ్వుతూ స్కేటింగ్ చేసుకుని వెళ్లిపోయాడు.

సరిగ్గా ఆ సమయానికే కిట్టీ M-lle Linonతోటి ఆ ఇంటి యివతలికి వచ్చింది. 'యేం చక్కటి మనిషి, ముచ్చటైన వాడు' అనుకొంది. మెత్తగా మృదువుగా చిరునవ్వు నవ్వుతూ అతనికేసే చూస్తూ వుండిపోయింది, అభిమానపాత్రుడైన అన్నగారిని చూసినట్టు. 'నా తప్పే మన్నా వుందా? నేనేమన్నా తప్పు చేసానా? కులుకులు పోయానంటారు. నేను

వేరే వాళ్ళని (పేమిస్తున్నానని నాకు తెలుసు. అయినా కూడా యితనితో వుంటే ఆనందంగా వుంటుంది నాకు. యెంత మంచివాడు. కాని ఆ మాట యెందుకన్నాడో" అనుకుంది.

మెట్ల దగ్గర కిట్టీని వాళ్ళమ్మ కలుసుకుంది. ఆమెతో కలిసి కిట్టీ వెళ్ళిపోవడం లేవిన్ చూశాడు. అతను స్కేటింగ్ ఆపు చేశాడు. చురుగ్గా స్కేటింగ్ చెయ్యడంవల్ల యెఱ్ఱ బడ్డాడు. కొంచెం సేపు ఆలోచించి, స్కేట్లు తీసేసి, తల్లిని కూతుర్నీ గార్డెన్ గేటు దగ్గర అందుకున్నాడు.

"మిమ్మల్ని చూడ్డం సంతోషంగా వుంది. మామూలుగా గురువారాలు మా యింటికి నలుగురూ వస్తారు" అంది పెద్దావిడ.

"అయితే యివాళ?"

"ఆఁ, మీరూ వస్తే సంతోషంగా వుంటుంది" అందామె పొడిగా.

తల్లి అలా పొడిగా మాట్లాడ్డం కిట్టీకి బాధనిపించింది. సర్దుబాటు చేస్తున్నట్టుగా చిరునవ్వు నవ్వుతూ అతనికేసి తిరిగింది.

"అయితే మరి సాయంత్రం వస్తారు కదూ?" అంది.

సరిగ్గా ఆ సమయానికి అబ్లాన్స్కీ గార్డెన్స్‌లోకి వచ్చేడు. అతని టోపీ ఓరగా వుంది, ముఖమూ, కళ్ళూ కాంతిగా వున్నాయి. అతను యేదో విజయం సాధించిన వాడిలా వచ్చేడు. అయినా అత్తగారి దగ్గరికి రాగానే అతను విచారంగా దోషిలాగా వాలకం పెట్టేడు. డాలీ యెలా వుందని ఆవిడ అడిగిన (ప్రశ్నలకి జవాబు చెప్పేడు. వాళ్ళు మెల్లిగా, విచారంగా మాట్లాడుకున్నారు. ఆ తర్వాత అతను మళ్ళీ ఛాతీ విరుచుకుని లేవిన్ చెయ్యి పట్టుకున్నాడు.

"యేం, వెడదామా? యింతసేపూ నిన్ను గురించే అనుకుంటూ వుండిపోయాను. నువ్వు వచ్చావు నాకు చెప్పలేనంత సంతోషంగా వుంది" అని అతని కళ్ళల్లోకి అర్థవతుగా చూస్తూ అన్నాడు.

"వెడదాం, వెడదాం" అన్నాడు లేవిన్. అతనికి సంతోషంగా వుంది. 'సాయంత్రం వస్తారు కదా' అనే మాటలు చెవిలో మార్మోగుతున్నాయి. అతని కళ్ళ ముందు ఆమె చిరునవ్వు యింకా కనిపిస్తోంది.

" 'ఇంగ్లాండ్'కా 'హెర్మిటాజ్'కా?"

"నాకు యేదైనా ఫరవాలేదు."

"అయితే 'ఇంగ్లాండ్'కే వెడదాం" అన్నాడు అబ్లాన్స్కీ 'ఇంగ్లాండ్' హోటల్‌నే యెంచుకుని. అతను 'హెర్మిటాజ్'కంటే యీ హోటల్‌కి యెక్కువ బాకీ వున్నాడు. ఆ కారణంగా వెళ్ళకుండా వుండడం పెద్దమనిషి తరహా కాదని అనుకున్నాడు. "బండి వుందా? బాగుంది. నా బండిని యింటికి పంపేశాను" అన్నాడు.

వాళ్ళు దారిలో యేమీ మాట్లాడుకోలేదు. కిట్టీ ముఖంలో కనిపించిన మార్పు గురించే లేవిన్ ఆలోచిస్తున్నాడు. తనకి ఆశపెట్టుకోవడానికి తగ్గ ఆధారం వుందని కాసేపు ధైర్యం

చెప్పుకుంటున్నాడు. తర్వాత క్షణంలో, ఆశ పెట్టుకోవడం పిచ్చితనం అని ఖేదపడి పోతున్నాడు. అయినా కూడా ఆ చిరునవ్వుకీ 'సాయంత్రం వస్తారు కదూ' అనే మాటలకే అతనిలో మార్పు వచ్చి, తను వేరే మనిషి అయినట్టు భావించుకున్నాడు.

భోజనానికి యేమిటేమిటి పురమాయించాలి అనే ఆలోచనలో అబ్లాన్స్కీ మునిగి పోయి వున్నాడు.

"నీకు చందువాయి యిష్టమే కదూ?" అని లేవిన్‌ని అడిగాడు హోటెల్ దగ్గరికి వెళ్లగానే.

"యేమిటది?" అని లేవిన్ అడిగాడు. "ఆఁ, చందువాయి! అవును. నాకు మహా యిష్టం చందువాయి అంటే" అన్నాడు.

10

లేవిన్ అబ్లాన్స్కీతో కలిసి రెస్టారెంట్‌లోకి వెళ్లేటప్పుడు తన మిత్రుడిలో ద్యోతకమైన ప్రత్యేక ధోరణిని గమనించకుండా వుండలేకపోయాడు. అబ్లాన్స్కీ ముఖంలో, మొత్తం అతని మూర్తిలో, ఒక రకమైన తేజస్సు కనిపించింది. అది అదుపులో వున్నట్టుగా వుంది. అబ్లాన్స్కీ ఓవర్‌కోటు తీసేశాడు. టోపీని వో పక్కకి వాల్చుకుని డైనింగ్ రూమ్‌లోకి వెళ్లాడు. అక్కడ వున్న తాతార్ వెయిటర్లు చేతులమీద రుమాళ్లు వేసుకుని తోకలా బారుగా వెనక్కాల వేలాడుతూ వున్న ఫ్రాక్‌కోట్లు తొడుక్కున్నారు. వాళ్లు పరిగెత్తుకుంటూ వీళ్లకి యెదురు వచ్చేరు. అబ్లాన్స్కీ వాళ్లకి యేమేం చెయ్యాలో పురమాయించేడు. అన్ని చోట్లా వున్నట్టే అబ్లాన్స్కీని యెరిగిన వాళ్లు యిక్కడా వున్నారు. వాళ్లు చిరునవ్వుతో అతన్ని పలకరించేరు. యిటూ, అటూ వొంగి వాళ్లకి అభివాదం చేస్తూ అతను బుఫే దగ్గరికి వెళ్లేడు. అక్కడ అతను ఆకలి పుట్టించేందుకు కొంచెం చేప నంజుకుంటూ వోద్కా తాగేడు. కౌంటరు వెనక్కాల షోగ్గా ముస్తాబై వున్న ఫ్రెంచి అమ్మాయితో పరాచికాలాడేరు. ఆ అమ్మాయి ఉంగరాల జుట్టుకి రిబ్బన్లు, లేసులు అలంకరించుకుంది. అతని పరిహాసాంకి ఆఖరికి ఆమె కూడా ఫకామని నవ్వింది. ఫ్రెంచి అమ్మాయిని చూడగానే లేవిన్ సున్నిత అనుభూతులు దెబ్బ తిన్నాయి. యెరువు జుట్టు, poudre de riz, యింకా vinaigre de toilette[1] మాత్రం ఆమెలో కనిపించేయి. అతను వోద్కా కూడా తాగకుండా యేదో అపవిత్రమైందాని దగ్గర్నుంచి వెళ్లిపోయినట్టు ఆమె దగ్గర్నుంచి గబగబా నడిచి వెళ్లి పోయేడు. అతని హృదయం కిట్టీ తలపులతో ఉప్పొంగిపోతోంది. అతని కళ్లు విజయగర్వంతో, సంతోషంతో మెరిసిపోతున్నాయి.

"యిటు రండి, హుజూర్. యిక్కడ ప్రశాంతంగా కూర్చోవచ్చు" అన్నాడు వెయిటరు. అక్కడున్న వెయిటర్లలో వీళ్లని పట్టుకుని వదలకుండా వెంటబడింది అతనే. అతను

---

[1] టాయిలెట్ పౌడరు, ముస్తాబు కోసం లోషన్ (ఫ్రెంచి).

మునలి తాతారు. అతని జుట్టు పండిపోయింది. నడుం లావుగా వుంది. దాంతో తోకకోటు అటో భాగం యిటో భాగం విడిపోయాయి. "యిక్కడ హంజూర్" అన్నాడతను లేవిన్‌తో. తనకి అబ్లాన్‌స్కీ పట్ల వున్న గౌరవాన్ని అతని మిత్రుడి పట్ల కూడా ఆదరంగా వుండడం ద్వారా ప్రదర్శించేడు.

గుండ్రటి బల్ల ఒకటి గోడకి కొట్టిన కంచు సెమ్మ కింద వుంది. దానిమీద అప్పటికే వొక గుడ్డ వుంది, కాని మరో కొత్త గుడ్డని ఆ తాతారు యీ వున్న దానిమీద లాఘవంగా కప్పేడు. లోపలికి తోసి వున్న వెల్వెట్ కుర్చీలని యివతలికి లాగేడు. చేతిమీద రుమాలు వేసుకుని అబ్లాన్‌స్కీ ముందు నిలబడ్డాడు. చేతిలో మెనూ కార్డు పట్టుకున్నాడు. ఆర్డరు కోసం చూస్తూ నుంచున్నాడు.

"కావాలంటే విడిగా మీరు వో గదిలో కూర్చోవచ్చు హంజూర్. ప్రిన్స్ గలిత్సినా, ఆయ నతో వచ్చినావిడా వెళ్లిపోతున్నారు. మాదగ్గర తాజా సీపిగుల్లలు వున్నాయి, హంజూర్."

"హాయ్, సీపిగుల్లలు."

అబ్లాన్‌స్కీ వో క్షణం ఆలోచించేడు.

"అయితే యిలా మార్చుకుందాం యేమంటావ్ లేవిన్?" అన్నాడు, మెనూ కార్డు మీద వేలు వుంచి. అతని ముఖంలో నిజంగానే కలవరపాటు కనిపించింది. "సీపిగుల్లలు మంచివేనా? సరిగా చెప్పెయ్."

"ఫ్లెన్స్‌బర్గ్ సీపిగుల్లలు, ప్రభూ, అస్టెండ్‌వి లేవు."

"ఫ్లెన్స్‌బర్గ్‌వి అయితే మంచివే. కాని తాజావేనా?"

"నిన్న సాయంత్రమే వచ్చాయండి."

"అయితే సీపిగుల్లలతో మొదలెడదాం. ఆ రకంగా మార్చుకుందాం, వూఁ?"

"నాకెలాగైనా వొకటే. నాకయితే కాబేజీ సూప్, బక్‌వీట్ కాష చాలు. కాని అవి యిక్కడ దొరకవు మరి."

"కాష అలా రూస్, ప్రభూ?" అని వెయిటరు లేవిన్ మీదకి, దాది పంటిబిడ్డ మీదకి వొంగినట్టు వొంగి అడిగాడు.

"వేళాకోళం వద్దుగాని నువ్వేం తెమ్మని చెప్పినా నాకు ఫరవా లేదు. స్కేటింగ్ చెయ్య డంతో నాకు ఆకలి కరకరలాడిం చేస్తోంది. నువ్వు చెప్పింది నచ్చడం లేదనుకునేరు" అన్నాడు, అబ్లాన్‌స్కీ ముఖంలో కనిపించిన అసంతృప్తి చూసి. "సుష్టుగా భోజనం చెయ్యడమే నాకు కావాల్సింది" అన్నాడు.

"అదే నాక్కావాల్సిందీని! నువ్వేం చెప్పు, జీవిత సుఖాల్లో నిజంగా యిది వొకటి" అన్నాడు అబ్లాన్‌స్కీ. "సరే అయితే, పెద్దాయనా, మాకు రెండు — వుహు, కాదులే, — మూడు డజన్ల సీపిగుల్లలు పట్టా.... ఆకు కూరల సూప్ — " అంటూ యేవేం కావాలో చెప్పడం మొదలెట్టేడు.

" 'ప్రింతానియేర్' " అంటూ తాతార్ జోడించేరు. కాని ఫ్రెంచి భాషలో పదార్థాల పేర్లు చెప్పే తృప్తిని అతగాడికి అబ్లానోస్కీ యివ్వదలచుకోనట్టే కనిపించింది.

"ఆకు కూరల సూప్ తెలుసా? చిక్కటి నంజుడుతో వందుతాయి. హుమ్... ఊఁ... రోస్ట్‌బీఫ్ — కాని జాగ్రత్త బాగా వుండాలి. కబాబు కోడి, పూరేసినవి మమా."

అబ్లానోస్కీకి వాటి వాటి పేర్లు ఫ్రెంచిలో చెప్పడం యిష్టం లేదని తాతార్ గుర్తించాడు. అందుకని అతను చెప్పేంతర్వాత వాటి పేర్లు వల్లించలేదు. కాని ఆఖర్న మొత్తం అన్ని పేర్లనీ ఫ్రెంచి మెనూ ప్రకారం చదివి తృప్తి పొందాడు. "సూప్ ప్రింతానియేర్, తూర్బో సాస్ బొమార్‌షె, పులార్డ్ ఆ లెస్ట్రగోన్, మాసెదువాన్ దె ఫ్రుయీ..." అంటూ. వెంటనే స్ప్రింగులు మార్చినట్టుగా ఒక కార్డు కిందపెట్టి యింకో కార్డు తీశాడు. అది వైన్ లిస్టు. దాన్ని అబ్లానోస్కీకి అందించాడు.

"యేం తీసుకుందాం?"

"నీ యిష్టం. యెక్కువ వొద్దు. పోనీ షాంపేన్ తీసుకుందామా?" అన్నాడు లేవిన్.

"యేమిటి? మొదట అదా? నువ్వన్నదే రైటేమోలె వైట్‌సీల్ నీకిష్టమేనా?"

"కషే బ్లాం" అన్నాడు తాతార్.

"భేష్, సీపిగుల్లలతో ఆ బ్రాండ్ తీసుకుందాం. తర్వాత చూద్దాం."

"అలాగే ప్రభూ, టేబిల్ వైన్ యేం తెమ్మంటారు?"

"న్యుయీ. వుహుఁ, వద్దు. శ్రేష్టమైన షబ్లీ తే."

"అలాగే, ప్రభూ. మీ జున్ను తెమ్మంటారా హుజూర్?"

"ఆఁ, ఆఁ. పార్‌మెసన్. యేం వేరే రకాలు కావాలా?"

"నాకేదైనా వొకటే" అన్నాడు లేవిన్ చిరునవ్వు ఆపుకోలేక.

కోటు తోకలు యెగరేసుకుంటూ తాతారు గునగున వెళ్ళిపోయాడు. అయిదు నిముషాల్లో ప్లేటు నిండా చిప్పలు తెరిచిన సీపిగుల్లలు, వేళ్ళ మధ్యన పట్టుకుని ఓ సీసాని తెచ్చేడు.

అబ్లానోస్కీ గంజి పెట్టిన రుమాలు విప్పి అంచు వెయిస్ట్ కోటు పైబొత్తంలో దోపుకున్నాడు. బల్లమీద తన చేతులు హాయిగా ఆన్చుకుని సీపిగుల్లల పని అందుకున్నాడు.

"ఫరవా లేదు" అన్నాడు వెండి ఫోర్కుతో చిప్పలో మిలమిల మెరుస్తూ రసం వూరుతూ వున్న సీపిగుల్లల్ని విడదీస్తూ. ఒక టొకటొ నోట్లో వేసుకుని తిన్నాడు. "ఫరవా లేదు" అని రెట్టించాడు. చెమ్మగిల్లి మెరుస్తూ వుండే కళ్ళతో ఓ క్షణం తాతార్ కేసీ, ఓ క్షణం లేవిన్ కేసీ చూశాడు. లేవిన్‌కి తెల్లరొట్టే, జున్నూ యిష్టం. అయినా సీపిగుల్లలూ తిన్నాడు. అబ్లానోస్కీని చూడ్డం అతనికి సరదాగా వుంది. వెయిటర్ కూడా అబ్లానోస్కీని చూస్తూ తృప్తిగా నవ్వుకున్నాడు. సీసా మూత తెరిచి బుడగలు చిమ్మే వైన్‌ని గ్లాసుల్లో పోస్తూ చేత్తోటి తన తెల్ల టైని సరిచేసుకున్నాడు.

"నీకు సీపీగుల్లంటే అంత యిష్టంగా లేదేమో" అని అబ్లాన్‌స్కీ గ్లాసులో వైన్ ఖాళీ చేస్తూ అన్నాడు. "లేకపోతే నీ మనసులో యేదన్నా దిగులుగా వుందా? ఆఁ?" అన్నాడు.

లేవిన్ ఉల్లాసంగా వుండాలని అతని కోరిక. లేవిన్‌కి ఉల్లాసంగా లేకపోవడం కాదు గాని సౌకర్యంగా లేదు. యీ రెస్టారెంట్‌లో అతనికి దిగులుగా, అసౌకర్యంగా యిబ్బందిగా వుంది. అతని హృదయానుగత అనుభూతితో పొసగనిదేదో వుందక్కడ. పెద్దమనుషులు మహిళలతో కలిసి విందారగించే యీ ప్రైవేట్ రూముల్లో యీ ఆర్భాటంలో, అతిశయంలో అతనికి పొసగనిదేదో కనిపించింది. కంచు బొమ్మలు, నిలువుటద్దాలు, గాస్ లైట్లు, వెయిటర్లు వున్న యీ వాతావరణం అతన్ని గాయపరిచింది. తన హృదయాన్ని ఉప్పొంగింప చేసే దాన్ని కళంక పరుస్తున్నట్టు భయపడ్డాడు.

"నా మనసులోనా? ఆఁ, వుంది. పైగా అదలా వుంచినా యిక్కడ నేను యిమడ లేకుండా వున్నాను నువ్వు వూహించలేవు. పల్లెటూరి వాడినైన నాకు యిదెంత అసహజంగా వుందో. మీ ఆఫీసులో చూశావే పెద్దమనిషి, ఆయన గోళ్లంత అసహజంగా వుంది" అన్నాడు.

"అవును, పాపం గ్రినేవిచ్ గోళ్ల నువ్వు పనిగట్టుకు చూడ్డం గమనించాను" అంటూ నవ్వేడు అబ్లాన్‌స్కీ.

"నేను భరించలేను. నా స్థానంలో వున్నట్టు వూహించుకో, పల్లెటూరి వాడి దృష్టి నుంచి చూడ ప్రయత్నించు. పల్లెల్లో మేం మా చేతుల్ని పనిచేసే తీరులో పెట్టుకుంటాం. అందుకని గోళ్ళు చిన్నగా కత్తిరించుకుంటాం. ఒకో అప్పుడు చొక్కా చేతులు పైకి మడుచు కుంటాం. యిక్కడ మనుషులు బాగా గోళ్ళు పెంచుకుంటారు, అరచేతి వెడల్పు కఫ్‌లింకులు చొక్కా చేతులకి పెట్టుకుంటారు యిక చేతులతో యేం చెయ్యక్కర్లేకుండా" అన్నాడు లేవిన్.

అబ్లాన్‌స్కీ సరదాగా చిరునవ్వు నవ్వేడు.

"ఆ మనిషి మొతక పని చెయ్యక్కర్లేదు అనే తెలియజేస్తుందది. బుర్రతో పనిచేస్తాడు."

"కావచ్చు. అయినా కూడా అది నాకు దారుణంగానే కనిపిస్తుంది. నువ్వు నేనూ సాధ్యమైనంత సమయం భోజనం చేస్తూనే గడపడం అంత దారుణంగా. అందుకనే సీపీగుల్లలతో టోణీచేస్తాం. పల్లెల్లో అయితే గబగబా భోజనం చేసేస్తాం, పనిలోకి వెళ్లాలని."

"అవును మరి" అని అబ్లాన్‌స్కీ అతని మాటకి అడ్డం వెళ్లేడు. "మరి నాగరికత అంటే యేమిటి? అన్నిట్నీ సుఖవంతంగా వుండేటట్టు చేసుకోవడమే" అన్నాడు.

"అదే అయితే నేను అనాగరికంగానే వుండి పోతాను."

"అలాగే వున్నావ్. మీ లేవిన్‌లంతా అనాగరికులే."

లేవిన్ నిట్టూర్చాడు. అతనికి అన్నగారు నికొలాయ్ గుర్తు వచ్చేడు. అతనికి మనసు చివుక్కు మనిపించింది, బాధ కలిగింది. ముఖం చిట్లించుకున్నాడు. కాని అబ్లాన్‌స్కీ మాట మార్చేడు. అది తక్షణం అతని దృష్టిని మళ్లించింది.

"పూ, మా కుటుంబాన్ని — అంటే ష్చేర్బాత్‌స్కీలని — చూద్దామను కుంటున్నావా యివాళ్ల సాయంత్రం?" అని అడిగాడు. గరుగ్గా వున్న ఖాళీ సీపిగుల్ల చిప్పల్ని దూరం గెంటేసి జున్ను అందుకున్నాడు. అతని కళ్లు మెరిశాయి.

"తప్పకుండా. పెద్ద ప్రిన్సెస్ నన్ను అంత మనస్ఫూర్తిగా పిలవలేదని నాకనిపించినా" అన్నాడు లేవిన్.

"అదేం మాట! నాన్సెన్స్! ఆవిడ ధోరణే అంత... వెయిటర్! సూప్ వ్రటా!... ఆవిడ తీరు అదీ, grande dame[1]" అన్నాడు అబ్లాన్‌స్కీ. "నేనూ వస్తాను. కాని ముందు కౌంటెస్ బానినా వాళ్ల దగ్గర ఒక రిహార్సల్‌కి హాజరవాలి. సరేగాని, నువ్వు నిజంగా అటవి కుడివి కాదూ? చెప్పు? యింత కాలం మాస్కోకి రాకుండా వుండడం యేమంటావ్? ష్చేర్బాత్‌స్కీలు నిన్ను గురించి వొకటే అడగడం, అక్కడికి నీ గురించి నాకు తెలిసినట్టు! నాకు తెలిసిందల్లా వేరే యెవళ్లూ చెయ్యని దాన్నే నువ్వెప్పుడూ చేస్తావు" అని అన్నాడు అబ్లాన్‌స్కీ.

"అవును" అన్నాడు లేవిన్ మెల్లిగా, కలవిలపడి "నువ్వు అన్నది నిజమే. నేను అటవిక మైన పనులు చేస్తాను. కాని పరమ అటవికమైంది నేనిక్కడికి రావడం, నేను రాకుండా వుండడం కాదు. నేను వచ్చింది..."

"నువ్వెంత అదృష్టవంతుడివి!" అని అబ్లాన్‌స్కీ లేవిన్ కళల్లోకి చూస్తూ అన్నాడు.

"యెందుకని?"

"ఆకాశంలో యెత్తుగా యెగిరే తీరు బట్టి డేగని గుర్తిస్తాను, కళ్లల్లో కనిపించే ప్రేమ వెలుగు తీరు బట్టి ప్రేమికుణ్ణి గుర్తిస్తాను" అని కావ్య ధోరణిలో అన్నాడు. "భవిష్యత్తంతా నీకు ముందే వుంది" అన్నాడు.

"నీకు గతంలోకి పోయిందా అంతా?"

"అంతా కాదనుకో. కాని నీకు భవిష్యత్తు వుంది. నాకు — వర్తమానం, యెన్నో యెగుడు దిగుళ్లతో."

"అంటే?"

"ప్రస్తుతంలో యెక్కువగా దిగువకే వుంది. కాని నా గురించి నేను మాట్లాడ దలచు కోలేదులే. పైగా అన్నిట్నీ వివరంగా చెప్పడం కష్టం" అన్నాడు అబ్లాన్‌స్కీ. "సరే, యేం పనిమీద వచ్చావ్ మాస్కోకి... యిదుగో, వెయిటర్, ప్లేట్లు తీసెయ్యి" అంటూ తాతార్‌ని పిలిచాడు.

"నువ్వు వూహించావా?" అన్నాడు లేవిన్. లోతుల్లోనుంచి ప్రకాశించే కళ్లని అబ్లాన్‌స్కీ మీదనే లగ్నం చేశాడు.

---

[1] ఘనమైన మహిళ (ఫ్రెంచి).

"ఊహించాననుకో. కాని అనలేక పోయాను. నా ఊహ ఒప్పో తప్పో అదే నీకు చెప్తుంది" అన్నాడు అబ్లాన్‌స్కీ. లేవిన్ కేసి మహా కొంటెగా నవ్వుతూ చూశాడు.

"యేమంటావు మరి? నీకెలా అనిపిస్తోంది?" అన్నాడు లేవిన్. అతని కంఠం వొణికింది. ముఖంమీది కండరాలు కూడా కంపించడం అతనికి తెలుసు. "యేమిటి నీ ఉద్దేశ్యం?"

అబ్లాన్‌స్కీ గ్లాసులోని షబ్లీ వైన్ మెల్లిగా ఖాళీ చేశాడు. లేవిన్ మీద నుంచి దృష్టి మళ్లించుకోలేదు.

"నాకుగా యింతకంటే నేను కోరుకునేది లేదు. యేమీ లేదు. ఇంతకంటె మంచి పని జరగదు" అన్నాడు ఆఖరికి.

"నువ్వు పొరపాటు పడడం లేదని నమ్మకమేనా? మనం ఏ విషయం గురించి మాట్లాడుకుంటున్నామో ఖాయంగా తెలుసా?" అని లేవిన్ అతని ముఖంలోకి గుచ్చి గుచ్చి చూశాడు. "అలాంటి దానికి అవకాశం వుందనుకుంటున్నావా?" అని అడిగాడు.

"ఆఁ. ఎందుకవకాశం లేదు?"

"నిజంగా అనుకుంటున్నావా? వూఁ, చెప్పు, కచ్చితంగా మవ్వేమనుకుంటున్నదీనీ. ఒక వేళ... ఒకవేళ నమ్మ కాదంటే? అలాంటి అవకాశం యెక్కువగానే వుంది...."

"నువ్వు అలా యెందుకనుకోవాలి?" అన్నాడు అబ్లాన్‌స్కీ. లేవిన్ కంగారు చూసి చిరునవ్వు నవ్వేడు.

"ఒకో అప్పుడు నాకనిపిస్తుంది. అది మా యిద్దరికీ దారుణం. నాకూ, ఆమెకీ కూడా."

"అబ్బెబ్బె అందులో ఆమెకి దారుణం ఏమీ లేదు. యెవర్లైనా పెళ్లి చేసుకుంటామంటే ప్రతి పడుచు పిల్లకీ గొప్పగానే వుంటుంది."

"ప్రతి పడుచు పిల్లకీ – కాని ఆమెకి కాదు."

అబ్లాన్‌స్కీ చిరునవ్వు నవ్వేడు. లేవిన్ మనోభావాలు అతనికి అర్థం అయాయి. లేవిన్‌కి యీ లోకంలోని పడుచుపిల్లలంతా రెండు భాగాలుగా విడిపోయారని అతనికి తెలుసు. ఒకటి – కిట్టీ తప్ప మిగిలిన అమ్మాయిలందరూ. వాళ్లందరూ సామాన్యంగా మానవ దౌర్బల్యాలతో వుంటారు. రెండవ రకం – ఆమె ఒక్కత్తె. యే రకమైన బలహీనతలూ లేకుండా మిగతా మానవాళికంతటికీ పైన యెత్తులో వుందామె.

లేవిన్ సాస్ గిన్నెని పక్కకి గెంటెయ్యబోతే "అరె సాస్ తిను" అన్నాడు అబ్లాన్‌స్కీ లేవిన్‌తో.

లేవిన్ మరేం మాట్లాడకుండా సాస్ వేసుకున్నాడు. కాని అబ్లాన్‌స్కీని అతని మానాన అతన్ని తిననివ్వకుండా లేవిన్ అడ్డం వెళ్లాడు.

"ఆగు, ఆగు. నాకీ విషయం చావు బతుకుల సమస్య తెలుసా? ఈ విషయం గురించి నీతో తప్ప యెవళ్లతోనూ మాట్లాడలేదు, యెవళ్లతోనూ మాటాడనూ లేను. నువ్వూ నేనూ ఉత్తర దక్షిణ ధ్రువాలం. అభిరుచుల్లో, అభిప్రాయాల్లో, అన్నింట్లోనూ. అయినా నువ్వు

నన్ను అర్థం చేసుకుంటావని, నేనంటే చాల యిష్టపడతావని నాకు తెలుసు. అందువల్లే నువ్వంటే నాకు చాల యిష్టం. నీకు పుణ్యం వుంటుంది. నిర్మొహమాటంగా చెప్పు'' అన్నాడు.

''నా మనసులో మాట చెప్తున్నాను'' అన్నాడు అబ్లాన్‌స్కీ చిరునవ్వు నవ్వుతూ. ''కాని యింకా చెప్తా. మా ఆవిడ వుందేం అసాధ్యురాలు...'' అని ప్రస్తుతం భార్యతో వున్న సంబంధాలు గుర్తు వచ్చి నిట్టూర్చేడు. ఓ క్షణం ఆగి మళ్లీ చెప్పేడు. ''ఆవిడకి కర్ణపిశాచి వుంది. ఆవలిస్తే మనిషి పేగులు లెక్క పెట్టెయ్యడమే కాదు, జరగ బోయే దాన్ని చెప్తుంది కూడా, ముఖ్యంగా పెళ్లిళ్లకి సంబంధించి. మాటకి షఖొవ్‌స్కాయా బ్రెన్ తెల్న్‌ని పెళ్లి చేసుకుంటుందని అంది. ఒక్కళ్లు నమ్మలేదు. కాని అలానే జరిగింది. మా ఆవిడ నీ పక్షమే'' అన్నాడు.

''అంటే యెలా?''

''నువ్వంటే ఆవిడకి యిష్టం. అదే కాదు కిట్టీ తప్పకుండా నిన్ను పెళ్లి చేసుకుంటుందని ఆవిడ అంది.''

ఈ మాటలు చెవిని పడగానే లేవిన్ ముఖం చిరునవ్వుతో దివిటీలా వెలిగింది. ఆనంద పారవశ్యంతో కళ్లల్లో నీళ్లు తిరిగే చిరునవ్వు అది.

''నిజంగా అలా అందా? నేనెప్పుడూ అంటూ వుంటాను మీ ఆవిడ యెంత మంచిదని. ఆ మాట చెప్పావు చాలు, అదే పదివేలు'' అన్నాడు ఎగిరి గెంతేస్తూ.

''బాగుంది. కానీ కూర్చో.''

కాని లేవిన్ కూర్చోలేకపోయాడు. బింకంగా అడుగులు వేస్తూ ఆ చిన్న గదిలో రెండు సార్లు పచారు చేశాడు. మనక కమ్మేట్టు కళ్లల్లో తిరిగిన నీళ్లని రెప్పలల్లార్చి అదుపు చేసుకున్నాడు. అప్పుడు మాత్రమే వెనక్కి వెళ్లి మళ్లీ కూర్చున్నాడు.

''నీకు అర్థం అవుతోందా యిది ప్రేమ కాదు. యింతకు ముందు ప్రేమించాను. కాని యిది అది కాదు. ఇది నా అనుభూతి కాదు. ఏదో బాహ్యశక్తి నన్ను ఆవేశించింది. ఇది యెన్నటికీ జరగదన్పిస్తి అనిపించింది. యీ భూమ్మీద ఆనందం అసంభవం. అలానే యీ ఆనందం కూడా అందనిది అనుకున్నాను, అందుకనే వెళ్లిపోయేను. నాలో నేను చాలకాలం పెనుగులాడేను. ఆఖరికి యిది లేకుండా వుండలేనని గ్రహించాను. యీ విషయాన్ని యిటో అటో తేల్చుకోవాలని అనుకున్నాను.''

''మరలాంటప్పుడు, ఖర్మ! యెందుకు పారిపోయావ్?''

''ఆగు మరి. యింకా బోలెడు కథ వుంది. అడగాల్సింది బోలెడుంది. విను. నువ్వీ విషయం చెప్పి నాకు యెంత మహోపకారం చేసావో వూహించలేవు. ఆనందంతో వొళ్లు తెలియకుండా అయిపోయాను. అన్నిట్నీ మర్చిపోయాను, మా అన్నయ్య నికొలాయ్ యిక్కడ వున్నాడని యివాళే తెలిసింది, నీకు తెలుసా? అతన్ని గురించి కూడా అంతా మరిచిపోయాను. అతను కూడ ఆనందంగా వుండి తీరాలని యిప్పుడు నాకు అనిపిస్తోంది. ఇది శుద్ధ పిచ్చితనమేననుకో.

కాని ఘోరమైంది ఏకటుంది, నీకు అర్థమవుతుందిలే — నువ్వు పెళ్లి చేసుకున్నావు కదా. మనం పెద్దవాళ్లం, కొంత మనకి గత అనుభవం వుంది. ప్రేమ కాదనుకో పాపంతో గడిచిన గతం. అలాంటి మనం, వున్నట్టుండి పరిశుద్ధమైన ఒక మనసుతో సన్నిహితంగా వుండడం. అది వెలపరంగా వుంటుంది, మనం యోగ్యులం కాదేమోనన్న భావం కలిగిస్తుంది."

"చాల్లే, నువ్వేం యెక్కువ పాపం చెయ్యలేదు."

"అయినా గానీ, అయినా గానీ, 'నా జీవిత పుటల్ని యేవగింపుగా చదువుతాను, భయంతో కంపిస్తాను, నిందిస్తాను, కటువుగా విలపిస్తాను...'* అవును, అలానే వుంది" అన్నాడు లేవిన్.

"ఏం చేస్తాం? లోక రీతి అంతే" అన్నాడు అబ్లాన్స్కీ.

"ఒక్కటే పూరట. ప్రార్థనలో వున్నట్టు. 'ప్రభూ నేను చేసిన పనుల బట్టి కాక నీ దయాస్వభావానికి అనుగుణంగా నన్ను మన్నించు.' ఇది నాకు బాగా హత్తుకుంది. ఆమె నన్ను క్షమించగల్గే మార్గం అదొక్కటే."

11

లేవిన్ గ్లాసు ఖాళీ చేసాడు. కాసేపు వాళ్లు యేమీ మాట్లాడకుండా కూర్చున్నారు.

"నీకు చెప్పాల్సిన సంగతి యింకొకటుంది. నువ్వు వ్రాన్స్కీని యెరుగుదువా?"

"ఊహూఁ. యెరగను. యేం, అడిగావ్?"

"యింకో సీసా వ్రటా" అని అబ్లాన్స్కీ వెయిటర్‌కి పురమాయించేడు. వెయిటరు వాళ్లు ఖాళీ చెయ్యగానే గ్లాసుల్లో వైన్ పోస్తున్నాడు. వాళ్లకి అవసరం లేనప్పుడే అక్కడ తచ్చాడుతున్నాడు.

"వ్రాన్స్కీ గురించి నేనెందుకు తెలుసుకోవాలి?"

"ఎందుకంటే అతనే నీకు పోటీ."

"ఎవరతను?" అని అడిగాడు లేవిన్. అబ్లాన్స్కీకి యెంతో ముచ్చటగా కనిపించిన లేవిన్ అమాయకత్వ పారవశ్యం వెంటనే మాయమైంది. కోపం, అయిష్టత కనిపించాయి.

"వ్రాన్స్కీ కౌంట్ కిరిల్ ఇవానొవిచ్ వ్రాన్స్కీ కొడుకు. పీటర్స్‌బుర్గ్‌లో చమక్ చమక్ మంటూ వుండే బంగారు పూత యువకులకి మచ్చు తునక. నేను త్వేర్‌లో సైన్యం కొలువులో వున్నప్పుడు నాకతను పరిచయం. సైనికుల్ని చేర్చుకోవడానికి వచ్చేడక్కడికి. దప్పివంత డబ్బుంది. రూపసి. పెద్ద పెద్ద పరిచయాలున్నాయి. అప్పుడే ఎయిడ్ డి కేంప్. అయినా ప్రేమాస్పదుడు. మంచివాడు. ఒట్టి మంచిమనసే కాదు, యింకా యెక్కువే. యిక్కడ అతనితో బాగా పరిచయమయే కొద్దీ మంచి సంస్కారి అనీ, బాగా తెలివైన వాడనీ కూడా నాకు తెలిసింది. బాగా పైకి వస్తాడు."

లేవిన్ చిరచిరలాడేడు. ఏమీ అనలేదు.

"నువ్వు వెళ్ళిపోయిన కొంత కాలానికి యిక్కడికి వచ్చేడు. గాఢంగా కిట్టీని ప్రేమిం చేశాడు. నీకు అర్థమవుతుందా వాళ్ళమ్మ..."

"కాదు, నాకు యేమీ అర్థం కాదు" అన్నాడు లేవిన్, దిగాలుగా వాలకం పెట్టేడు. సరిగ్గా అప్పుడు అన్నగారు నికొలాయ్ గుర్తు వచ్చేడు. అతన్ని గురించి మర్చిపోవడం యెంత అన్యాయం!

"ఆగు, ఆగు" అన్నాడు చిరునవ్వు నవ్వుతూ అబ్లాన్‌స్కీ. అతని చేతిమీద చెయ్యి వేశాడు. "నాకు తెలిసినదంతా చెప్పేశాను. ఇలాంటి సున్నిత విషయంలో వూహకి అవకాశం వుంటే నీ అవకాశాలే మెరుగ్గా వున్నాయని నా అభిప్రాయం" అన్నాడు.

లేవిన్ కుర్చీలో వెనక్కి చేర్లబడ్డాడు. అతని ముఖం పాలిపోయింది.

"కాని వీలైనంత త్వరగా వ్యవహారం పరిష్కరించుకో" అని అబ్లాన్‌స్కీ లేవిన్ గ్లాసుని మళ్ళీ నింపాడు.

"వుహుఁ, వద్దు. యింక చాలు" అన్నాడు లేవిన్ గ్లాసు గెంటేస్తూ. "మత్తెక్కి పోతుంది. వూఁ, యెలా వుంది నీ జీవితం?" అని అడిగాడు. అతను విషయం మళ్ళించాలని ప్రయత్నం చేస్తున్నట్టు కనిపించింది.

"యింకో మాట: ఏమైనా విషయాన్ని తక్షణం తేల్చుకోమనే నా సలహా. అంటే యీ పూటే కాదనుకో. రేప్పొద్దున్నే వెళ్ళు, శాస్త్రోక్తంగా. విషయం ఫలానా అని చెప్పు. తథాస్తు దేవతలు ఆశీర్వదించాలని కోరుతున్నాను" అన్నారు అబ్లాన్‌స్కీ.

"మా వూళ్ళో వేటకి వస్తానన్నావు కదా? ఈ వసంత ఋతువులో రా" అన్నాడు లేవిన్.

తన విషయం గురించి అబ్లాన్‌స్కీతో చర్చించినందుకు మనస్సులో లేవిన్ యెంతో విచారపడ్డాడు. పీటర్స్‌బర్గ్ ఆఫీసరొకడు తనకి పోటీ అనే మాటలు వినడంవల్లా, అబ్లాన్‌స్కీ యిచ్చిన సలహాలవల్లా, చేసిన సూచనలవల్లా అతని సున్నిత అనుభూతులు గాయపడ్డాయి.

అబ్లాన్‌స్కీ చిరునవ్వు నవ్వేడు. లేవిన్ మనస్సులో యేం చెలరేగుతోందో అతనికి తెలుసు.

"ఈ రోజుల్లోనే యెప్పుడో ఒకసారి వస్తాలే. చూడు నాయనా ఆడవాళ్ళు అనే అక్షం చుట్టూనే అన్నీ తిరుగుతూ వుంటాయి. నా స్వంత వ్యవహారాలే బాగా లేవు. బాగా లేవు అంటే అంతా ఆడవాళ్ళ వల్లనే. నువ్వు నిర్మొహమాటంగా చెప్పు. నీ సలహా కావాలి" అన్నాడు చుట్ట తీసుకుంటూ. అతను ఓ చేత్తో చుట్ట పట్టుకున్నాడు, యింకో చేత్తో వైన్ గ్లాస్ పట్టుకున్నాడు.

"దేన్ని గురించి?"

"ఇదీ విషయం. మాటకి నీకు పెళ్ళయింది, నీ పెళ్ళాన్ని ప్రేమించావు. కాని మరో ఆవిడ పట్ల మోహం కలిగింది అనుకో."

"మరేం అనుకోకు, ఆ విషయం నాకు మించింది, అర్థం అవదు. ఇదెలాంటి...

ఇప్పుడిక్కడ సుష్టుగా భోజనం చేసింతరువాత చిన్న బన్ రొట్టెని కొట్టెయ్యడం యెలా వుంటుందో అలాగే యిదీనీ. నాకు అర్థం కాదు.”

అబ్లాన్‌స్కీ కళ్ళు మామూలు కంటే యెక్కువ మెరిశాయి.

“ఎందుక్కాదు? ఒకో అప్పుడు మరీ అప్పుడే తయారుచేసిన బన్ రొట్టెం ఘుమ ఘుమని నిగ్రహించుకోలేం.

Himmlisch ist's, wenn ich bezwungen
Meine irdische Begier;
Aber noch wenn's nicht gelungen,
Hatt'ich auch recht hübsch Plaisir![1]

ఈ పద్యం చదువుతూ అబ్లాన్‌స్కీ కొంటెగా చిరునవ్వు నవ్వేడు. లేవిన్ కూడ చిరునవ్వు నవ్వేడు.

“కాని సీరియస్‌గా చెప్తా. ఈ రెండో ఆమె సాధువు. సాగప్పైంది. ప్రేమాస్పదురాలు. పేదది. ఒంటరిది. సర్వం నాకోసం అర్పించింది. ఇక యిప్పుడు తీరా దూకేక ఆమెని వదిలెయ్యాలా? ఏదో కుటుంబం ఛిన్నాభిన్నం కాకుండా చేసుకుందుకు ఆమెని వదిలి పెట్టాననే అనుకుందాం, కాని ఆమెపట్ల కనికరం చూపించవద్దా? ఆమెని గురించి శ్రద్ధ పట్ట వద్దా? ఆమెకి సుఖంగా వుండేటట్టు చూడద్దా?”

“ఊఁ, నిజంగా నన్ను మన్నించు. నీకు తెలుసు, నాకు సంబంధించి రెండు రకాల ఆడవాళ్ళే ఉన్నారు... వుహుఁ... కచ్చితంగా చెప్పాలంటే ఆడవాళ్ళు... అలా కాని వాళ్ళు. పతితులైన వాళ్ళల్లో నాకు ఎన్నటికీ సమ్మోహాకరమైంది కనిపించరు. ఆ కౌంటర్ వెనక్కాల వున్న ఉంగరాల జుట్టు రంగేసిన ఫ్రెంచి ఆడమనిషి లాంటివాళ్ళు — నేను అసహ్యించుకుంటాను, పతితులైన వాళ్ళందర్నీ అసహ్యించుకున్నట్టే.”

“సువార్త చెప్పిన మేరి మాగ్దలీన్* గురించి కూడానా?”

“అబ్బ అవుదూ. క్రీస్తు అన్నమాటల్ని యెంత దుర్వినియోగ పరుస్తారో తెలిసివుంటే క్రీస్తు ఆ మాటల్ని చెప్పివుండేవాడు కాదు. సువార్తల్లో జనానికి గుర్తుండేవల్లా అవే. ఏమైనా నేను చెప్పేది నేను అనుకుంటూ వుండేదాన్ని గురించి కాదు, నేను అనుభూతి చెందే దాన్ని గురించి. పతితులైన ఆడవాళ్ళంటే నాకు రోత. నీకు సాలెపురుగులంటే యెవ

[1] ఐహిక వ్యామోహాన్ని
అధిగమించేనా మంచిదే,
లేదా విఫలమయ్యానా
అయినా దివ్యసుఖం పొందా!* (జర్మన్).

గింపు. నాకు వీళ్ళంటే యేవగింపు. నువ్వు పొరుగువాళ్ళ గురించి చదవలేదు, వాటి అసలు లక్షణం నీకు తెలియదు. మరి అలాగే నాకూ వీళ్ళూనూ."

"మాట్లాడ్డం దేముందిలే, నీకు సులువు. నువ్వు డికెన్స్ రాసిన ఓ నవల్లోని పాత్ర లాంటి వాడివి. పెద్ద పెద్ద సమస్యల్ని తోసేసేవాడు ఆ పెద్దమనిషి. కాని వాస్తవాలని కాదన్నంత మాత్రాన అవి లేకుండా పోతాయా. ఏం చెయ్యాలి? అది చెప్పు నాకు. మా ఆవిడకేమో వయస్సు మళ్ళిపోతుంది. నువ్వేమో బింకంగా పిటపిటలాడిపోతున్నావు. నీకు యెరుకలోకి వచ్చేటప్పటికే నిండు హృదయంతో ఆవిడ్ని ప్రేమించడం అసాధ్యమని తేలిపోతుంది, నువ్వెంతలా ఆవిడ్ని గౌరవించినా. అప్పుడు ప్రేమ హఠాత్తుగా గోచరమవుతుంది. నువ్వు జారిపోయావు... పోయావు" అన్నాడు అబ్లాన్‌స్కీ మహా విచారంగా.

లేవిన్ యెత్తిపొడుపుగా చిన్నగా నవ్వేడు.

"అవును, జారిపోయావు, ఏం చెయ్యాలి?" అని రెట్టించాడు అబ్లాన్‌స్కీ.

"బన్ రొట్టెలు కాజెయ్యకు."

అబ్లాన్‌స్కీ నవ్వేడు.

"ఓయ్ నీతిమంతుడా! కాని యీ యిద్దరి ఆడవాళ్ళనీ వూహించుకో, ఒకామె తన హక్కుల్ని కావాలంటుంది. ఆమె హక్కులు నీ ప్రేమకి సంబంధించి నువ్వు దాన్ని యివ్వలేవు. రెండో ఆమె తన సర్వస్వం అర్పించి, యేమీ కోరదు. యెవడన్నా యేం చెయ్యాలి? ఎలా నడుచుకోవాలి? ఘోరమైన విషాదం."

"నేను కపటం లేకుండా చెప్పాలనుకుంటే యిక్కడసలు విషాదం వుందనే నమ్మకమే లేదు. ఎలాగా అంటే యిదుగో యిలాగ నాకనిపిస్తుంది. ప్లేటో తన 'సింపోజియం'లో నిర్వచించిన రెండు రకాల ప్రేమ గుర్తుందా? ఆ రెండు రకాలూ కూడా వ్యక్తిత్వానికి పరీక్ష. కొంతమందికి ఒక రకం మాత్రమే అర్థమవుతుంది. ఇంకొందరికి రెండో రకం మాత్రమే అర్థమవుతుంది. నాన్‌ప్లేటానిక్ ప్రేమని మాత్రమే అర్థం చేసుకున్నవాళ్ళ విషాదం గురించి వూరికే చెప్తున్నారు. అలాంటి ప్రేమవల్ల విషాదం రాదు. 'నాకీ సంతోషాన్ని కలిగించినందుకు థాంక్స్, మంచిది మీకు శుభం' అదీ ఏ విషాదం అంతా. ప్లేటోనిక్ ప్రేమ వల్ల విషాదం రాదు. యెందుకంటే అలాంటి ప్రేమ నిష్కల్మషంగా వుంటుంది. తేజోవంతంగా వుంటుంది. అంచేత..."

ఇక్కడికొచ్చేటప్పటికి లేవిన్‌కి తను చేసిన పాపపు పనులు గుర్తుకొచ్చాయి. వాటివల్ల తను పడ్డ మానసిక వేదన గుర్తుకొచ్చింది. ధోరణి మార్చి అతను "అయినా నువ్వన్నదే నిజమేమో. అలా జరగడానికి అవకాశం వుంది. ఏమో నాకు తెలీదు. నిజంగా నాకు తెలీదు" అన్నాడు.

"చూశావా! నీ బుద్ధి స్థిరమైంది. జీవిత లక్ష్యం వున్న మనిషివి. ఇది నీ సుగుణం. ఇదే నీ బలహీనత కూడా. నీకుగా నువ్వు ఒక లక్ష్యం వున్నవాడివే. లక్ష్యపూరితంగా వుండే భాగంతో జీవితాన్నంతటినీ నిర్మించుకుందామనుకుంటావు. కాని అది వాస్తవం కాదు. నీకు

యీ ఉద్యోగాలూ సద్యోగాలూ అంటే యేవగింపు. ఏమంటే వాటి కార్యకలాపాలు తప్ప కుండా యేదో ఒక లక్ష్యంతో తూగాలని అనుకుంటావు. కాని వాస్తవం అది కాదు. ప్రతి వాడు చేసే పనికి యేదో ప్రయోజనం వుండాలనుకుంటావు. ప్రేమ, కుటుంబ జీవితం యెప్పుడూ కలిసే వుండాలనుకుంటావు. కాని వాస్తవం అది కాదు. జీవితంలో వున్న వైవిధ్యమంతా, సొగసు అంతా, సౌందర్యం అంతా, వెలుగునీడల క్రీడలోనే వుంటుంది" అన్నాడు అబ్లాన్‌స్కీ.

లేవిన్ నిట్టూర్చేడు, యేమీ మాట్లాడలేదు. తన గొడవల గురించి ఆలోచనలో పడి పోయి అబ్లాన్‌స్కీ చెప్పేది వినిపించుకోనేలేదు.

తామిద్దరూ మిత్రులు. కలిసి తింటున్నారు. కలిసి తాగుతున్నారు. దాని వల్ల యిద్దరూ బాగా సన్నిహితం అయి వుండాల్సింది. అయినా యెవడి గొడవల గురించి వాడు తనకిగా అనుకుంటూ అవతలి వాడి గురించి పిసరుకూడ పట్టించుకోవడం లేదని యిద్దరూ హఠాత్తుగా గుర్తించారు. ఎవళ్లతోనేనా కలిసి భోజనం చేసినప్పుడు సన్నిహితత్వం యేర్పడ్డానికి బదులుగా తను వాళ్లకి యింకా యింకా దూరం అయిపోవడం అబ్లాన్‌స్కీకి అనుభవమే. అలా అతనికి చాలా సార్లు జరిగింది. అలాంటి పరిస్థితుల్లో తను యేం చెయ్యాల్సిందీ అతనికి తెలును.

"వెయిటర్, బిల్" అని కేక వేసి అవతలికి వెళ్లాడు. ఆ గది పెద్దది. అక్కడ అతనికి తెలిసిన ఒక అడ్జుటెంట్ కనిపించాడు. అతనితో ఓ నటి గురించీ, ఆవిడ్ని చేరదీసిన అతని గురించీ ముచ్చట మొదలెట్టేడు. లేవిన్‌తో మాట్లాడిం తర్వాత అతనితో మాట్లాడేట ప్పటికి హమ్మయ్య హాయిగా వుంది అనిపించింది. లేవిన్ యెప్పుడూ అతనికి మానసికంగా, నైతికంగా పెద్ద శ్రమ కలిగిస్తాడు.

తాతార్ వెయిటర్ బిల్లు తెచ్చాడు. ఇరవై అరు రూబుళ్ల చిల్లర అయింది, వెయిటర్ మామూలు కాక. లేవిన్ పల్లెటూళ్లో బతికే మనిషి. మామూలుగా తన వాటాకి పధ్నా లుగు రూబుళ్లు పడితేనే గుండెలు బాదుకొనే రకం. అలాంటిది యిప్పుడు బిల్లు యెంతైందీ పట్టించుకోకుండా పూరికే చెల్లించేసి యింటికి వెళ్లిపోయాడు. బట్టలు మార్చుకుని ష్చేర్ బాత్‌స్కీల దగ్గరికి వెళ్లాలి. అక్కడ తన రాత తేలిపోతుంది.

12

ప్రిన్సెస్ కిట్టీ ష్చేర్‌బాత్‌స్కయాకి పద్దెనిమిది యేళ్లు. నాగరిక సమాజంలో యిదే ఆమె మొదటి శీతాకాలం. వాళ్ల రోజుల్లో ఆమె అక్కగార్లకి లభించిన ఆదరణ కంటే యీమెకి యెక్కువ ఆదరణ యిప్పుడు నలుగురిలోనూ లభించింది. వాళ్లమ్మ ఊహించిన

దానికంటె యెక్కువ. మాస్కోలో జరిగే విందు నాట్యాలకి హాజరయే యువకుల్లో చాల మంది కిట్టీని ప్రేమించేశారు. అంతే కాదు, యిద్దరు ఆ 'తొలి వినికి'లోనే ఆమె పాణి గ్రహణం కోసం గట్టిగా ప్రయత్నించే వాళ్లయినట్టు ఆమెకి అనిపించింది. ఒకతను లేవిన్, రెండో అతను కౌంట్ వ్రాన్‌స్కీ. లేవిన్ పల్లెకి వెళ్లిపోయిన కొత్తలో వ్రాన్‌స్కీ అక్కడ దర్శనమిచ్చేడు.

శీతాకాలం ప్రారంభంలో లేవిన్ తరచుగా వాళ్ల యింటికి వెళ్లడం, కిట్టీ పట్ల చూపించిన ప్రేమ, కనబర్చిన శ్రద్ధ ఆమె తల్లిదండ్రులు గమనించేరు. కిట్టీ భవిష్యత్తు గురించి మొదటి సారి వాళ్లు సీరియస్‌గా చర్చించుకోవటానికీ, వాళ్ల మధ్య దెబ్బలాటలకీ అవి కారకం అయాయి. లేవిన్ పట్ల మొగ్గు చూపేడు ప్రిన్స్. కిట్టీకి అంతకంటే తను కోరుకునేది వుండదని అన్నాడు. ఆయన భార్య మాత్రం యీ విషయాన్ని దాటవేసింది. ఆడవాళ్లు మామూలుగా అలానే చేస్తారు. కిట్టీ యింకా చిన్నపిల్ల అనీ, నిజంగా తనకి పెళ్లి చేసుకోవాలని వుందనడానికి తగ్గ గట్టి హేతువులు లేవిన్ యింకా బయటపెట్టలేదనీ, కిట్టీ అతనికి హత్తుకోలేదనీ, యింకా అలాంటి, అలాంటి విషయాలు అందావిడ. కాని ఆవిడ అసలు విషయం తేలలేదు. అదేమిటంటే తన కూతురికి యింకా మంచి సంబంధం వస్తుందేమోనని చూస్తోంది అవి. లేవిన్ అంటే ఆవిడకి యిష్టం లేదు. అతని స్వభావం ఆవిడకి అర్థం కాలేదు కాబట్టి. లేవిన్ హఠాత్తుగా వెళ్లిపోవడంతో ఆమె సంతోషించింది. "చూశారా? నే చెప్పలేదా" అని భర్తతో గొప్పలు పోయింది. వ్రాన్‌స్కీ రంగంలోకి వచ్చేక ఆవిడ యింకా యెక్కువ సంతోషించింది. కిట్టీకి వొట్టి మంచి సంబంధం మాత్రమే కాదు, దివ్యమైన సంబంధం వస్తోంది అని ఆవిడకి నమ్మకం కుదిరింది.

ఆవిడకి సంబంధించి నంతవరకూ వ్రాన్‌స్కీకీ లేవిన్‌కీ పోలికే లేదు. లేవిన్‌వి వింత, కటువైన అభిప్రాయాలు, అవి ఆవిడకి యిష్టం లేదు. నాగరిక సమాజంలో అతను మోటుగా వుంటాడు, అది యిష్టం లేదు. ఆమె అభిప్రాయంలో స్వాతిశయం వల్ల అతవలా వుంటాడని. అనాగరికంగా పశువులతో, రైతులతో తంటాలు పడుతూ వుండే పల్లెటూళ్లంటే అతనికి పిచ్చి. అది ఆవిడకి యిష్టం లేదు. పైగా అతను తమ కూతుర్ని ప్రేమించినా ఒకటిన్నర నెలలపాటు యేకటాకీన తమ యింటికి వస్తూ, ఆ విషయం చెప్పడానికి సంశయించాడు. వాళ్ల అమ్మాయిని పెళ్లి చేసుకుంటానని చెప్పడంద్వారా తనేదో వాళ్లకి గొప్ప గౌరవం కలగజేస్తున్నానేమోనని భావించుకున్నట్టు, పెళ్లి కావలిసిన పిల్ల యింట్లో వున్నప్పుడు, ఆ యింటికి తను అన్నిసార్లు వెడుతున్నప్పుడు తన మనస్సులో మాట బయటపెడతాడని వాళ్లు ఆశిస్తారన్న విషయం తనకి తెలియనట్టు ప్రవర్తించేడు. ఆమెకి అదీ నచ్చలేదు. ఇంత అయాక, యేమీ చెప్పా చెందాకుండా, తకామని వెళ్లిపోయాడు. 'అతను అంత ఆకర్షణీయంగా వుండకపోవటం, కిట్టీ అతన్ని ప్రేమించకపోవడం మెరుగిచ్చింది' అనుకుంది ఆవిడ.

ఆ తల్లిగారు కోరుకున్నవన్నీ వ్రాన్‌స్కీకి వున్నాయి. గొప్ప ధనవంతుడు. తెలివైనవాడు.

గొప్ప వంశం వాడు. పైన్యానికి చెందిన ఆఫీసరుగా మంచి భవిష్యత్తు వున్నవాడు. మనిషేమో మంచి సాగసుకాడు. యిక అంతకంటే కావాల్సింది యేముంది?

వ్రాన్స్కీ, బాల్‌డాన్స్‌ల దగ్గర నలుగురిలోనూ వుండగానే కిట్టీపట్ల తన ప్రేమను కనబర్చేవాడు. నాట్యం చేసేటప్పుడు ఆమెతో కలిసి నాట్యం చేసేవాడు, వాళ్ల యింటికి వెళ్లేవాడు. యివన్నీ అతని అసలు ఉద్దేశం యేమిటైందీ అనుమానానికి ఆస్కారం లేకుండా వెల్లడిచేసాయి. అయినా కూడా కిట్టీ తల్లి శీతాకాలం అంతా ఆందోళనగా, అస్థిమితం గానే వుంది.

ఆవిడకి ముప్పై యేళ్లకితమే పెళ్లయింది. పినతల్లి ఆవిడకి యీ సంబంధం కుదిర్చింది. తనకి కాబోయే భర్త గురించి ఆవిడకి ముందే చెప్పారు. ఆయన వాళ్లింటికి చూడ్డానికి వచ్చేడు. ఓ రకంగా అదే పెళ్లి చూపులు. ఆ తర్వాత యిరుపక్షాల వాళ్ల అభిప్రాయాలూ యేమిటైందీ పినతల్లి తెలుసుకుని వీళ్ల ఉద్దేశం వాళ్లకీ, వాళ్ల ఉద్దేశం వీళ్లకీ తెలియజేసింది. ఇద్దరికీ నచ్చుబాటు అయింది. దరిమిలా వో రోజున వివాహ ప్రస్తావన చేశారు. తల్లిదండ్రులు ఒప్పు కున్నారు. యెంతో సునాయసంగా, తేలిగ్గా జరిగిపోయింది. కనీసం అలా అని అప్పుడు ఆవిడకి అనిపించింది. కాని కన్యాదానం చేసెయ్యడం అని సాదాగా కనిపించే యీ వ్యవహారం అంత సునాయాసమైందీ, తేలికైందీ కాదని తన కూతుళ్ల పెళ్లి వచ్చేటప్పటికి ఆవిడకి అను భవం అయింది. ఆవిడకి యెన్ని భయాలో! ఎంత గుంజాటన పడింది! ఎంత డబ్బు ఖర్చు పెట్టింది! తన పెద్ద కూతుళ్లు దాలీ, నతాలీలిద్దరికీ సుఖంగా పెళ్లిళ్లయేదాకా యెగు డితో ఎన్ని ఘర్షణలు పడింది! ఆఖరి పిల్ల పెళ్లికి కూడ ఆవిడకి యిన్ని భయాలూ, సంశ యాలూ కలుగుతున్నాయి. పెద్ద పిల్లల పెళ్లిళ్లప్పటికంటే కూడా యెక్కువగా భర్తతో ఘర్షణలు వస్తున్నాయి. తండ్రులందరి లాగానే ప్రిన్స్ తన కూతుర్ల మర్యాద, మన్ననలకి సంబంధించి యెక్కువ పాకులాడతాడు. తన కూతుర్లంటే ఆయనకి చెప్పలేనంత గొప్ప. ముఖ్యంగా కిట్టీ అంటే. ఆమె ఆయన అభిమాన పుత్రిక. భార్యతో యెప్పుడూ రగడ పెట్టు కొనేవాడు. కూతురి విషయంలో ఆవిడ లొంగుబాటు ప్రదర్శిస్తోందని తప్పు పట్టేవాడు. తన పెద్ద కూతుళ్ల పెళ్లిళ్లప్పుడూ ఆవిడ యిదంతా చవి చూసింది. కాని ఈ సారి ఆయన మర్యాదలకి పీక్కులాడ్డానికి ఎక్కువ సబబు వుందని అనుకొంది. సాంఘిక కట్టుబాట్లు చాలా మారిపోతున్నాయి అన్న విషయాన్ని ఆవిడ చూసింది. అంచేత తల్లుల బాధ్యతలు పెరు గుతున్నాయి. కిట్టీ యీడు పిల్లలు అనేక బృందాల్లో చేరుతున్నారు, అనేక రకాల కోర్సులకి వెడుతు న్నారు అని ఆవిడ చూస్తూనే వుంది. ఆ పిల్లలు పూర్వం లేనంత స్వేచ్ఛాభావంతో మగాళ్లతో కలిసి మెలిసి తిరుగుతున్నారు. పెద్దవాళ్ల యెవళ్లూ కూడా లేకుండానే బళ్లల్లో షికార్లు తిరుగుతున్నారు. చాలమంది ఆడపిల్లలు యీ మధ్యకాలంలో మోకాళ్ల వొంచి మన్ననగా వందనమే చెయ్యడం లేదు. ఇక అన్నిటికీ మించిపోయింది యింకొకటి వుంది. తమ భర్తలని ఎంచుకోవడం తమ వ్యవహారమేనని, తల్లిదండ్రుల ప్రమేయం కానే కాదని చాలమంది అమ్మా

యిలు ఢంకా బజాయించి అనేస్తున్నారు. "ఇవాళ అమ్మాయిలకి పూర్వంలో లాగ కన్యాదానం చేసి పెళ్ళిళ్ళు చెయ్యక్కర్లేదు" అని ఈ పడుచుపిల్లలూ, పెద్దవాళ్ళూ కూడా అనుకుంటున్నారు, అంటున్నారు. కాని యివాళ వాళ్ళకి పెళ్ళిళ్ళు యెలా అవుతున్నదీ యెవళ్ళూ ఆవిడకి చెప్పలేకపోయారు. అన్నీ తల్లిదండ్రులే చూసి యేర్పాటు చేసే ఫ్రెంచి సంప్రదాయాన్ని తిట్టి, తోసిపారేశారు. వధువుకి పూర్తి స్వేచ్ఛ వుండాలనే ఇంగ్లీషు సంప్రదాయం స్వీకరించలేదు. యిది రష్యన్ సమాజంలో అసాధ్యం. పెళ్ళి సంబంధాలు పెద్దలే కుదిర్చే రష్యన్ సంప్రదాయం* దారుణం అన్నారు. ప్రతివాళ్ళూ దాన్ని చూసి నవ్వేరు — ఆవిడతో సహా. కాని ఆడపిల్లలకి సంబంధాలు చూడ్డం యెలాగో పెళ్ళిళ్ళు చెయ్యడం యెలాగో యెవళ్ళూ చెప్పలేదు. ఆవిడ యీ ప్రశ్న అడిగిన ప్రతివాళ్ళూ ఒకటే అన్నారు. "ఓరి దేవుడా! పుచ్చిపోయిన యీ ఆచారాలకి సలాం కొట్టెయ్యడం మంచిది! పెళ్ళిళ్ళు కావలిసింది పడుచువాళ్ళకి, వాళ్ళ తల్లిదండ్రులకి కాదు. అంచేత వాళ్ళ వ్యవహారాలని తమకి తగ్గట్టుగా వాళ్ళే చూసుకుంటారు, వదిలెయ్యండి!" అని. ఆడపిల్లలు లేనివాళ్ళు, వాళ్ళకేం చెప్తారు కబుర్లు. నలుగురిలోనూ తిరిగితే పెళ్ళి గిళ్ళి చేసుకొనే ఉద్దేశం లేనివాడ్ని తన కూతురు ప్రేమించవచ్చనీ, లేదా వరుడిగా తగిన యోగ్యతలు లేనివాణ్ణి ప్రేమించవచ్చని ఆవిడకి బాగా తెలుసు. మన రోజుల్లో ఆడపిల్లలు తమ బతుకుబాట తామే చూసుకుంటారని యెంత చెప్పండి, ఆవిడ్ని ఒప్పించలేరు. అయిదేళ్ళ పిల్లాడికి మంచి ఆటవస్తువు గుళ్ళు పెట్టిన పిస్టలు అని, మన రోజుల్లో కాదు యే రోజుల్లోనూ ఆవిడ నమ్మనట్టే, ఈ విషయాన్నీ నమ్మేది కాదు. అందుకనే ఆవిడ తన పెద్ద కూతుళ్ళ నాటికంటే కిట్టీ విషయంలో ఎక్కువగా బెంగగా వుంది.

వ్రాన్‌స్కీ తన కూతురితో సరసాలాడ్డం కంటే యెక్కువ చెయ్యకపోవచ్చని ప్రస్తుతంలో ఆవిడకి భయంగా వుంది. తన కూతురు అతన్ని ప్రేమిస్తోందని ఆవిడకి తెలుసు. అతను నమ్మకమైన మనిషనీ, తన కూతురితో తేలిగ్గా ప్రవర్తించడనీ సమాధాన పెట్టుకుంది. ఆడపిల్లలూ, మగపిల్లలూ స్వేచ్ఛగా తిరిగే యీ రోజుల్లో మగవాడి ఉద్దేశ్యాలేమిటైందీ గ్రహించలేక ఆడపిల్లలు ఎంత సులభంగా మోసపోవచ్చునో కూడా ఆవిడకి తెలుసు. మగవాడికి అంతరాత్మ యేం బాధించకుండా వుండడం ఆవిడకి తెలుసు. ఒక మజూర్కా నాట్యం చేసేటప్పుడు తనకీ వ్రాన్‌స్కీకీ జరిగిన సంభాషణ గురించి కిట్టీ గత వారంలో తల్లికి చెప్పింది. అది విన్నాక ఆవిడ మనసుకి ధైర్యం కలిగింది. కాని మొత్తం మీద కుదుట పడలేకపోయింది. అతనూ, అతని అన్నగారూ తల్లిగారి మాట జవదాటరట, ఆవిడని సంప్రదించకుండా ముఖ్యమైన విషయాలకి సంబంధించిన నిర్ణయాలు యేమీ తీసుకోరట. అలా అని వ్రాన్‌స్కీ కిట్టీకి చెప్పాడు. "అందుకనే అమ్మ పీటర్స్‌బుర్గ్‌నుంచి యిక్కడికి యిప్పుడే రావడం నాకు అదృష్టం వున్నట్టే కన్పిస్తోంది" అన్నాడట.

ఈ మాటలని ఏమంత ప్రత్యేకమైనవిగా భావించుకోకుండానే కిట్టీ తల్లికి చెప్పింది. కాని

ఆవిడ వాటిని వేరే రకంగా గ్రహించింది. ఆ పెద్ద కౌంటెస్‌గారు యే సమయంలోనైనా రావచ్చని ఆమెకి తెలుసు. తన కొడుక్కి నచ్చినదాన్ని ఆవిడ వూఁ అంటుందనీ తెలుసు. మరి తల్లిని కష్టపెట్టడం యెందుకులే అని కొడుకు ఆగడం చిత్రంగా అనిపించింది. కాని యీ పెళ్ళి జరిగి తీరాలని ఆవిడకి మహా ఆతృతగా వుంది. తన ఆశంకలు తగ్గిపోవాలని యింకా యెక్కువగా వుంది. కిట్టీ చెప్పింది తప్పకుండా జరగాలనే సమాధాన పెట్టుకుంది. పెద్ద కూతురు డాలీ దీనావస్థ ఆవిడకి బాధగానే వుంది. డాలీ భర్తని వదిలెయ్యాలనే ఆలోచనలో వుంది. అయినా తన కడగొట్టు కూతురి భవిష్యత్తు గురించి ఆవిడకి వున్న ఆందోళన మిగిలిన అన్నిటినీ కమ్మేసింది. ఈ స్థితిలో లేవిన్ ఆ వేళ రావడంతో ఆవిడ ఆందోళన యెక్కువైంది. ఒకప్పుడు తన కూతురు లేవిన్ పట్ల అభిమానంగా వుండేది. అంచేత అతిశయంగా గొప్పకి పోయి వ్రాన్‌స్కీని కాదంటుందేమో. లేవిన్ రాకవల్ల వ్యవహారం సాగకుండా, పరాకాష్టకి చేరకుండా ఆలస్యం అయి చిక్కులు వస్తాయేమో. యివీ ఆవిడ భయాలు.

"అతనొచ్చి చాల రోజులైందా?" అని లేవిన్ గురించి ఆవిడ యింటికి రాగానే అడిగింది.

"ఇవాళే వచ్చాడు."

"చూడమ్మా నేను చెప్పదల్చుకున్నది ఒక్కటే" అని ఆవిడ మొదలుపెట్టింది. ఆమె ముఖ భంగిమ గంభీరపూరితంగా, ఉద్రేకపూరితంగా మారింది. దాన్ని బట్టే ఆవిడ యేం చెప్పబోయేదీ కిట్టీ ముందే గ్రహించింది.

"అమ్మా, మీకు పుణ్యం వుంటుంది, దాన్ని గురించి యేం చెప్పకండి. నాకన్నీ తెలుసు" అని సిగ్గుపడుతూ, గబగబా ఆవిడ కేసి తిరుగుతూ అంది.

తల్లి కోరుకున్నదే తనూ కోరుకుంది. కాని అలా కోరుకోవడానికి తల్లికి వున్న ఉద్దేశ్యాలు ఆమెకి నచ్చలేదు.

"నేను ఒకటే చెప్పదలుచుకున్నాను, ఒక మనిషికి ఆశ కల్పించి..."

"అమ్మా, మా అమ్మవు కదూ, యేం చెప్పద్దు. అలాంటి విషయాల గురించి మాట్లాడ్డం యెంత భయంగా వుంటుందో."

"మాట్లాడనులే, మాట్లాడనులే" అందావిడ కూతురి కళ్ళల్లో నీళ్ళ తిరగడం చూసి. "ఒక్క మాట, చూడమ్మా. నా దగ్గర యేమీ దాచుకోనని మాట యిచ్చావ్. దాచుకోవు కదా?" అంది.

"అలాగే నమ్మా, దాచుకోను" అంది కిట్టీ. మళ్ళీ సిగ్గుపడింది. తల్లి కళ్ళల్లోకి నేరుగా చూసింది. "కాని మీకు చెప్పవలసింది యేమీ లేదు. నేను... నేను... ఒకవేళ చెప్పాలనుకున్నా యేం చెప్పాలో తెలియదు" అంది.

'ఇలాంటి కళ్ళున్న యీ పిల్ల అబద్ధం చెప్పలేదు' అనుకుంది ఆవిడ. కూతురి సంతోషం, కలవరపాటు చూసి నవ్వుకుంది. పాపం ఆ వెర్రిపిల్ల తన మనస్సులో వడే గుంజాటన యెంతో గొప్పదని అనుకుంటూ వుండచ్చని ఆవిడ చిరునవ్వు నవ్వింది.

13

భోజనాలకీ, అతిథులు రావడానికీ మధ్య వున్న సమయంలో కిట్టీ మనోభావాలు యుద్ధం జరగబోయే ముందు ఓ యువకుడికి కలిగే భావాల్లా వున్నాయి. ఆమె గుండె దడదడ కొట్టుకుంది. ఏ విషయంమీదా మనస్సు లగ్నం చెయ్యలేక పోయింది.

వాళ్ళిద్దరూ మొదటిసారిగా కలుసుకోబోయే యీ సాయంత్రమే తమ రాత తేలిపోతుంది. ఇద్దరూ మనో నేత్రం ముందు కనిపించారు. ఇద్దర్నీ విడివిడిగా కాసేపు వూహించుకుంది. తర్వాత కలిపి చూసుకుంది. గతం గురించి తలచుకున్నప్పుడు లేవిన్ మధ్యా తన మధ్యా వున్న సంబంధాలు సంతోషాన్నీ మృదుత్వాన్నీ గుర్తుకు తెచ్చాయి. తన బాల్య స్మృతులూ, చనిపోయిన తన అన్నగారితో లేవిన్‌కి గల స్నేహం గురించిన స్మృతులూ తమ సంబంధాలకి ఒక కవితాత్మక కమనీయతని కల్గించాయి. తన పట్ల అతనికి ప్రేమ వుందని ఆమెకి ఖాయంగా తెలుసు. ఆ ప్రేమ ఆమెకి గొప్పదనాన్నీ, ఆనందాన్నీ యిచ్చింది. లేవిన్ గురించిన జ్ఞాపకం వస్తే ఆమె మనస్సుకి తేలిక పడినట్లుండేది. వ్రాన్‌స్కీ గురించి అనుకున్నప్పుడు యేదో లోటు చొచ్చుకు వచ్చేది, అతను యెంతో సరసుడూ, నాగరికుడూ, నెమ్మదస్థుడూ అయినాగానీ. ఏదో కృత్రిమత్వం వున్నట్టుండేది. అది అతనిలో కాదు, అతను చాలా సహజంగా, ముచ్చటగా వుంటాడు. తనలోనే అది కనిపించేది. అదే మరి లేవిన్‌తో చాల నిష్కపటంగా, సహజంగా వున్నట్టు అనిపించేది. కాని వ్రాన్‌స్కీతో కలిసిన భవిష్యత్తు జీవితం సుఖమయంగా, వెలిగి పోతూ వున్నట్టు గోచరించేది. లేవిన్‌తో కలిసి వుండే భవిష్యత్తు అంత తేటగా, పూర్ణంగా వున్నట్టు కనిపించేది కాదు.

సాయంత్రం సమావేశం కోసం ముస్తాబవడానికి కిట్టీ మేడమీదకి వెళ్ళింది. అక్కడ అద్దంలో చూసుకుంది. ఆ రోజు తన శుభదినాల్లో ఒకటని సంతోషపడింది. తన సర్వశక్తులూ తన ఆధీనంలో వున్నాయి. తన పరీక్షా సమయంలో అలా వుండడం అతి ముఖ్యం. పైకి ప్రశాంతంగా వుంది, తన కదలికల్లో సొగసు వుంది. అలా వుందన్న గుర్తింపూ ఆమెకి వుంది.

ఏడున్నరకి ఆమె యింకా డ్రాయింగ్ రూమ్‌లోకి అడుగుపెడుతూ వుండగానే "లేవిన్ గారు" వచ్చినట్టు నౌకరు చెప్పాడు. వాళ్ళమ్మ యింకా తన గదిలోనే వుంది. తండ్రి యింకా యివతలకి రాలేదు. "అదీ విషయం" అనుకుంది కిట్టీ. ఆమె గుండె దడదడ కొట్టుకోవడం మొదలెట్టింది. అద్దంలో నిస్తేజంగా వున్న తన ముఖం ప్రతిఫలించి ఉలిక్కిపడింది.

అతను మిగిలిన వాళ్ళకంటే ముందుగా యెందుకు వచ్చాడో ఆమెకిప్పుడు బాగా అర్థమైంది. తనని ఒంటరిగా కలుసుకుని పెళ్ళి ప్రస్తావన చెయ్యాలని వచ్చేడు. ఇప్పుడు మొదటిసారిగా ఆమె ముందు ప్రతీదీ భిన్న రీతిలో, కొత్త రీతిలో ప్రత్యక్షం అయింది. తన నిర్ణయం తనకి మాత్రమే సంబంధించి లేదనీ, తను యెవళ్ళని ప్రేమించిందో, యెవళ్ళతో సంతోషంగా

వుండగలదో అది మాత్రమే సమస్య కాదనీ యిప్పుడు, యిప్పుడు మాత్రమే, ఆమె గ్రహించింది. ఇప్పుడే, ఈ క్షణంలోనే తను అభిమానించే వ్యక్తిని అవమానపరుస్తోంది. తీవ్రంగా అవమానపరుస్తోంది. ఎందుకని? అతను యెంతో మంచివాడు కాబట్టి, తనని ప్రేమించాడు కాబట్టి. నిండుగా తనని ప్రేమించాడు కాబట్టి. కాని యింకోలా జరగడానికి లేదు. ఇలాగే జరుగుతుంది. జరిగి తీరుతుంది.

"భగవంతుడా, నేనే స్వయంగా యీ విషయం అతనికి చెప్పాలా?" అనుకుంది. "ఏం చెప్పాలి? తనని ప్రేమించడం లేదు అని చెప్పగలనా? కాని అది నిజం కాదు. ఏం చెప్పను? ఇంకొకళ్లని ప్రేమిస్తున్నానని చెప్పనా? ఊహు, చెప్పలేను. నేనిక్కడనుంచి వెళ్లిపోతాను, వెళ్లిపోతాను" అనుకుంది.

కిట్టీ గుమ్మం దగ్గరికి వెళ్లగానే అతని అడుగుల చప్పుడు వినిపించింది. 'అబ్బే, యిది పిరికితనం అవుతుంది; యెందుకు నేను భయపడాలి? నేను తప్పేం చెయ్యలేదే? సరే జరగాల్సిందేదో జరుగుతుంది. ఉన్న విషయం చెప్పేస్తాను. అతని ముందు బెదరవలసిన పని లేదు. అడుగో అతను' అనుకుంది. అతను ఆమె దగ్గరికి వస్తున్నాడు. దృఢంగా వున్నాడు. బెరుకు పడుతున్నాడు. అతని కళ్లు మెరుస్తున్నాయి. ఆమె మీదనే అతని చూపు లగ్నం అయింది. కరుణించు నన్ను అన్నట్టుగా ఆమె అతనికేసి చూసింది. అతనికేసి చెయ్యి చాచింది.

"వేళకి ముందే వచ్చినట్టున్నాను, మరీ పెందరాళే" అన్నాడతను. ఖాళీగా వున్న ఆ గదిని కలియ చూశాడు. తన మనస్సులోని మాట బయటపెట్టడానికి అక్కడ అడ్డం యెవరూ లేరు. తను ఆశించింది అదే. దానివల్ల అతని ముఖం గంభీరంగా అయింది.

"అబ్బే లేదు, లేదు" అంది కిట్టీ. బల్ల దగ్గర కూర్చుంది.

"సరిగ్గా నేను కోరుకున్నట్టే వుంది, మిమ్మల్ని ఒంటరిగా కలుసుకోవాలనుకున్నాను" అని అతను మొదలుపెట్టాడు. అతను కూర్చోలేదు, ధైర్యం సన్నగిలిపోతుందేమోనని ఆమెకేసి చూడలేదు.

"అమ్మ యిప్పుడే వస్తుంది. నిన్న ఆవిడ బాగా అలిసిపోయింది. నిన్న..."

తన పెదాలనుంచి యే మాటలు వస్తున్నాయో తెలియకుండానే ఆమె మాట్లాడింది. అతనికేసి స్నేహ స్నిగ్ధ నేత్రాలతో అర్థిస్తూ చూస్తూనే వుంది.

అతను ఆమెకేసి చూశాడు. ఆమె ముఖంమీద సిగ్గు ఛాయ దోగాడింది. ఆమె మౌనంగా వుండిపోయింది.

"ఎంతకాలం వుందామని వచ్చానో నాకు తెలియదని, అదంతా మీమీద ఆధారపడి వుందని మీతో చెప్పాను..."

రాబోయే ప్రశ్నకి తను యేం సమాధానం చెప్పాలి అన్నది ఆమెకి యింకా తోచడం లేదు. తల యింకా యింకా కిందికి వాల్చుకుంది.

"అదంతా మీమీదే ఆధారపడివుంది" అని మళ్లీ అన్నాడు. "నేను యేం చెప్పా లనుకున్నానంటే... అంటే నేను యెందుకు వచ్చానంటే... మిమ్మల్ని... పెళ్లి చేసుకోమని అడుగుదామని" అనేశాడు. తనేం అన్నాడో తెలియకుండానే అనేశాడు. అతనికి మహా కష్టంగా కనిపించిన మాట చెప్పేశాడు. ఆగి, ఆమేకేసి తేరిచూశాడు.

ఆమె భారంగా ఊపిరి తీసింది. కళ్లని పైకి యెత్తలేదు. పారవశ్యంతో నిండిపోయింది. హృదయం ఆనందంతో ఉప్పొంగి పోయింది. అతను తనని ప్రేమిస్తున్నానని అన్నమాటలు తనని అంతలా ఉప్పొంగింప చేస్తాయని ఆమె వూహించలేదు. కాని యేమైనా ఆ అనుభూతి ఒక్క క్షణం సేపే వుంది. ఆమెకి వ్రాన్‌స్కీ గుర్తు వచ్చేడు. తేటగా, నిర్మలంగా వున్న తన కళ్లని లేవిన్ ముఖంకేసి యెత్తింది. అతను యెంత నిరాశ పడిందీ చూసింది. గబగబా అనేసింది:

"అలా జరగదు, మరేం అనుకోకండి..."

ఒక్క క్షణంకితం ఆమె తన జీవితానికి యెంత ప్రాణభూతంగా వుంది! యెంత ఆధిక్యతతో వుంది! ఇప్పుడు ఆమె యెంత పరాయిదిగా అయింది! ఎంత దూరం అయి పోయింది!

"నాకు సంబంధించి మరోలా జరగదు" అన్నాడు లేవిన్, ఆమెకేసి చూడను కూడా చూడకుండా.

అతను వొంగి వందనం చేసి వెళ్లిపోవడానికి తయారయేడు.

14

సరిగ్గా ఆ సమయంలో పెద్ద ప్రిన్సెస్ వచ్చింది. ఇద్దరూ యేకాంతంగా, విచారంగా వుండడం చూసి ఆవిడ గుండె ఝల్లుమంది. లేవిన్ యేం మాట్లాడకుండా ఆవిడకి వొంగి వందనం చేశాడు. కిట్టీ కూడా యేమీ అనలేదు. కళ్ళు యింకా పైకి యెత్తలేదు. 'బతికాం రా దేవుడా, అతన్ని కాదంది' అనుకుంది పెద్దావిడ. ఆమె ముఖంలో చిరునవ్వు లాస్యం చేసింది. అలాంటి చిరునవ్వు నవ్వుతూనే ఆవిడ గురువారాలప్పుడు వచ్చిన తమ అతిథుల్ని పలకరిస్తుంది. ఆమె కూర్చుని, పల్లెటూరి జీవితం యెలా వుంటుందీ యేమిటీ అని లేవిన్‌ని అడగడం మొదలెట్టింది. అతను మళ్లీ కూర్చున్నాడు. ఇతర అతిథులు యెప్పుడు వస్తారా అని చూస్తూ వున్నాడు. అప్పుడు తను యెవర్నూ గమనించకుండా వెళ్లిపోవచ్చు.

కొన్ని క్షణాల తర్వాత కిట్టీ స్నేహితురాలు ఒకావిడ వచ్చింది. ఆమె పేరు కౌంటెస్ నార్డ్‌స్టన్. ముందుటేడు శీతాకాలంలో ఆవిడకి పెళ్లయింది.

ఆమె తత్తరపాటు మనిషి. పాండువర్ణం మనిషి. రోగిష్టిదానిలా వుంటుంది. ఆమెవి మెరిసే నల్లని కళ్లు. ఆమెకి కిట్టీ అంటే యిష్టం. పెళ్లికాని పిల్లం పట్ల పెళ్లయిన

వాళ్లకి యిష్టం వుంటే, వాళ్ళ దాన్ని యెప్పుడూ యెలా చూపిస్తారో అలా ఆమె తన యిష్టాన్ని చూపించేది. తన ఆదర్శానికి అనుగుణంగా ఆ పిల్లకి పెళ్లికావాలని ఆమెకి వుంటుంది. అందుచేత కిట్టీ వ్రాన్‌స్కీని పెళ్లి చేసికోవాలని ఆమె కోరిక. లేవిన్ అంటే ఆవిడకి యెప్పుడూ యిష్టం లేదు. శీతాకాలం మొదట్లో వాళ్లింటి దగ్గర అతన్ని యెక్కువగా చూసేది. అతన్ని యెప్పుడూ యేడిపించడం ఆమెకి యిష్టం, అది ఆమెకి మహా సరదా.

"ఏదో మహోన్నతమైన యెత్తునుంచి నన్ను చూస్తాడతను; నేను మొద్దునని అర్థం చేసుకోలేనని అనుకుంటూ బుద్ధికి పనిబెట్టే సంభాషణని తుంచవేసా తుంచేస్తాడు. లేదా నన్ను అనుగ్రహపూరితంగానేనా చూస్తాడు. అది బాగా వుంటుంది – అనుగ్రహపూరితంగా చూడ్డం! నాకు అది యిష్టం. నన్ను అతను భరించలేడు, యిది నాకు సంతోషంగా ఉంటుంది" అందతని గురించి ఆమె.

ఆమె అన్నమాట నిజమే. లేవిన్ ఆమెని భరించలేడు. ఆమె తన సుగుణాలు అని వేటి గురించి అనుకుంటుందో వేటిని గురించి గొప్పగా భావించుకుంటుందో వాటినే అతను, చిన్నగా చూస్తాడు. ఆమె దుర్బల నున్నితత్వం, ప్రాపంచికమైన అన్నిటిపట్లా ఆమెకి వుండే పరమ యేవగింపు, ఉదాసీనత – యివి ఆ గుణాలు.

నాగరిక సమాజంలో తరచుగా యేర్పడే లాంటి వొక సంబంధం కౌంటెస్ నార్డ్‌స్టన్‌కీ లేవిన్‌కీ మధ్య యేర్పడింది. యిద్దరు వ్యక్తులు పైకి స్నేహంగా వున్నట్టే కన్పిస్తారు. కాని ఒకళ్ల నొకళ్లు చాల తీవ్రంగా యేవగించుకుంటారు. వాళ్లు ఒకళ్లనొకళ్లు అంతగా పట్టించుకోనూ పట్టించుకోరు, ఒకళ్లన్నమాటకి ఒకళ్లు కష్టపెట్టుకోనూ కష్టపెట్టు కోరు. అలాంటిదా సంబంధం.

కౌంటెస్ నార్డ్‌స్టన్ వెంటనే లేవిన్ మీద దాడికి లంఘించింది.

"ఓ లేవిన్‌గారూ! అయితే పాపిష్ట బాబిలోన్*కి తిరిగి వచ్చారన్నమాట!" అంటూ తన పాండు వర్ణపు చిన్న చేతిని అతనికేసి చాచింది. శీతాకాలం మొదట్లో అతను మాస్కో ఓ బాబిలోన్ అని అన్నాడు. దానికిది యెత్తిపొడుపు. "ఊఁ అయితే మా బాబిలోన్ బాగుపడిందా లేకపోతే మీరు పతనమయారా?" అంది దెప్పుతూ. కిట్టీకేసి అలా చూసింది.

"నా మాటలు మీరింకా గుర్తుపెట్టుకున్నారు, నాకు గొప్పగా వుంది, కౌంటెస్" అన్నాడు లేవిన్. అతను యీ వ్యవధిలో మళ్లీ స్థిమితపడ్డాడు. కౌంటెస్ నార్డ్‌స్టన్‌తో మాట్లా డేటప్పుడు అతనిలో యెప్పుడూ పరిహాసభరిత అయిష్టత ధ్వనిస్తూ వుంటుంది. అలాంటి గొంతుకతోనే మాట్లాడేడు. "నేనన్న మాటలు మీమీద గట్టి ప్రభావం కలిగించాయేమో" అన్నాడు.

"అవును నిజంగా! అలాంటి మాటల్ని నేను గుర్తుగా రాసి పెట్టుకుంటాను. ఊఁ, కిట్టీ, యివాళ స్కేటింగ్ చేశావా?"

ఆమె కిట్టీతో మాటలు మొదలెట్టింది. యిప్పుడు వెళ్లిపోవడం అమర్యాదగా వుంటుం

దేమో ననిపించింది లేవిన్‌కి. అయినా కిట్టీ సమక్షంలో అక్కడ ఆ పూటంతా గడవడం కంటే అమర్యాదగా కనిపించడమే మెరుగు. కిట్టీ తడవ తడవకీ అతనికేసి చూస్తూనే వుంది. కాని అతని దృష్టిని తప్పించుకుంటూనే వుంది. అతను యిక లేవలేకపోయాడు. అతను మౌనంగా వుండడం పెద్దావిడ చూసింది.

"మాస్కోలో యింకా యెక్కువ కాలం వుంటారా? మీరు జేమ్‌స్ట్వో పరిపాలనలో చురుగ్గా పాల్గొంటా రనుకుంటాను. అందుచేత యెక్కువ కాలం వదిలిపెట్టి ఉండ టానికి లేదేమో" అని అతన్ని సంబోధిస్తూ అంది.

"లేదండీ, ప్రిన్సెస్, నేనిప్పుడు జేమ్‌స్ట్వో పరిపాలనలో పాల్గొనడం లేదు. ఊరికే కొన్ని రోజులుందామని వచ్చాను" అన్నాడు.

'యివాళ యేమిటో అదో మాదిరిగా వున్నాడు' అనుకుంది కౌంటెస్ నార్డ్‌స్టన్. అతను గంభీరంగా, నవ్వూ తుళ్ళూ లేకుండా వుండటం చూసి. 'ఎందుకనో తన మామూలు ధోరణిలో వాదనలో దిగడం లేదు. కాని యితన్ని అలా వుండనివ్వను. కిట్టీ ముందర యితన్ని ఆటపట్టించడం నాకు సరదాగా వుంటుంది, చూద్దాం' అనుకుంది.

"లేవిన్‌గారూ, కొంచెం దీని అర్థమేమిటో వివరించండి – మీకు అన్నీ తెలుసు కదా! మా కలూగ గుబేర్నియాలో వో ఏస్టేట్‌లో రైతులూ, ఆడాళ్ళూ మొత్తం వున్నదంతా పూడ్చి తాగేసారు. మాకు శిస్తు కట్టడానికి యేమీ మిగల్లేదు. దీన్నేమంటారు? మీరెప్పుడూ రైతుల్ని పొగడుతారు కదా" అందతనితో.

ఆ సమయంలో మరో ఆవిడ గదిలోకి వచ్చింది. లేవిన్ నుంచున్నాడు.

"మరేం అనుకోకండి కౌంటెస్, ఆ విషయం గురించి నాకు యేమీ తెలీదు; యేమీ చెప్పలేను" అన్నాడతను. ఇప్పుడు వచ్చిన ఆవిడ వెనక ఓ మిలిటరీ ఆఫీసరు వచ్చాడు. లేవిన్ అతనికేసి చూశాడు.

'ఇతనే వ్రాన్‌స్కీ అయివుంటాడు' అనుకున్నాడు లేవిన్. తన వూహ నిజమా కాదా అని తెల్సుకోవడానికి కిట్టీకేసి చూశాడు. ఆమె వ్రాన్‌స్కీని చూసింది. తిరిగి లేవిన్‌కేసి చూసింది. ఆమె కళ్ళు అప్రయత్నంగా మిలమిలా మెరిశాయి. ఆ ఒక్క చూపుని బట్టీ ఆమె అతన్ని గాఢంగా ప్రేమిస్తోందని కిట్టీ తను స్వయానా మాటల్లో చెప్పినట్టుగా అతను గ్రహించాడు. కాని యితను యెలాంటి మనిషి అయివుంటాడు?

ఇక యిప్పుడు లేవిన్ వుండక తప్పలేదు, వెళ్ళలేకపోయాడు. ఆమె ప్రేమించిన ఆ మనిషి యెలాంటి వాడో తను తెలుసుకోవాలి.

ఒక రకం మనుషులుంటారు. తమ ప్రత్యర్థులు అదృష్టవంతులైనా వాళ్ళల్లోని మంచిని చూడరు; చెడు మాత్రమే చూస్తారు. మరో రకం మనుషులున్నారు. దీనికి వ్యతిరేకం. తమ ప్రత్యర్థులు పైకి రావడానికి తగ్గ కారణాలు యేమిటా అని వెతుకుతారు. వాళ్ళల్లో వున్న మంచినే చూస్తారు – అది తమకి యెంత కష్టం కలిగించినా గానీ. లేవిన్ అలాంటివాడు.

వ్రాన్‌స్కీలో వున్న ఆకర్షణగేమిటో కనిపెట్టడానికి అతను కష్టపడనక్కర లేకపోయింది. అవి యిట్టే దృష్టిని ఆకట్టుకుంటాయి. వ్రాన్‌స్కీ జుట్టు నల్లగా వుంది. మనిషి సామాన్యమైన యెత్తు వుంటాడు. దృఢకాయుడు. సుపుర్రూపి. ముఖంలో సౌశీల్యం ద్యోతకమవుతూ వుంటుంది. చాల నిబ్బరంగా, శాంతంగా కన్పిస్తాడు. అతని ముఖం, రూపం, చిన్నగా క్రాపు చేయించుకున్న నల్లని జుట్టు, నున్నగా గీసుకున్న గడ్డం దగ్గరనుంచి వదులుగా వున్నా, వప్పినట్టుండే సరికొత్త సూటుదాకా ప్రతి అంశం నిరాడంబరంగా హుందాగా కనిపించాయి. వ్రాన్‌స్కీ తనతో కూడా వచ్చిన ఆమెని ముందుగా లోపలికి వెళ్లనిచ్చి ముందు ప్రిన్సెస్‌కి అభివాదం చేసి తర్వాత కిట్టీ దగ్గరకు వెళ్లాడు.

అతను ఆమె దగ్గరకు వెడుతూ వుంటే ఒక ప్రత్యేక తరహా మార్దవమైన కాంతి అతని అందమైన కళ్లల్లో మెరిసింది. సంతోషం, విజయం ద్యోతకమయే కనిపించీ కనిపించని మందహాసంతో (లేదా అలా అని లేవిన్‌కి అనిపించింది) అతను ఆమె ముందు శ్రద్ధ చూపిస్తూ గౌరవపురస్సరంగా వంగాడు. చిన్నదే అయినా వెడల్పుగా వున్న తన చేతిని చాచాడు.

అతను అందర్నీ పలకరించి, కొన్ని మాటలు మాట్లాడేడు. తర్వాత కూర్చున్నాడు. లేవిన్‌కేసి ఒక్కసారీ చూళ్లేదు. లేవిన్ దృష్టి అతని మీదనుంచి మళ్లలేదు.

"మీకు యీయన తెలుసా?" అని లేవిన్‌కేసి చూపించి పెద్ద ప్రిన్సెస్ అంది. "కాన్‌స్తంతీన్ ద్మీత్రియెవిచ్ లేవిన్. కౌంట్ అలెక్సేయ్ కిరీల్లొవిచ్ వ్రాన్‌స్కీ" అని ఒకళ్లనొకళ్లకి పరిచయం చేసింది.

వ్రాన్‌స్కీ నుంచుని, లేవిన్‌తో షేక్‌హేండ్ చేస్తూ ఆదరంగా అతనికేసి చూశాడు.

"ఈ శీతాకాలంలో ఒక చోట మీతో కలిసి భోజనం చెయ్యాల్సి వుండిందనుకుంటాను. కాని మీరు హఠాత్తుగా వూరికి వెళ్లిపోయారు" అన్నాడు వ్రాన్‌స్కీ. అతని చిరునవ్వు నిష్కపటంగా, నిశ్చలంగా వుంది.

"లేవిన్‌గారికి బస్తీలన్నా, బస్తీమనుషులన్నా అసహ్యం, రోత" అంది కౌంటెస్ నార్డ్‌స్టన్.

"నా మాటలు మీకు యింత బాగా గుర్తున్నాయంటే అవి మీమీద చెరగని ముద్ర వేశా యన్నమాట" అన్నాడు లేవిన్. ఇదే మాటని ఇంతకు ముందే అన్నట్టు గుర్తుకొచ్చింది. సిగ్గుతో ఎర్రబడిపోయాడు.

వ్రాన్‌స్కీ లేవిన్ నుంచి కౌంటెస్ నార్డ్‌స్టన్ కేసి కళ్లని తిప్పిచూశాడు. మందహాసం చేసాడు.

"మీరు యెప్పుడూ పల్లెలోనే వుంటారా? శీతాకాలంలో చప్పే విసుగ్గా వుంటుంది, యేమంటారు?" అన్నాడు.

"ఏపని కూడ విసుగ్గా వుండదు, చేతినిండా పని వుంటే. నా అంతట నేను వుంటే యేమీ విసుగ్గా వుండదు" అని లేవిన్ పరుషంగా అన్నాడు.

"నాకు పల్లెటూళ్లంటే భలే యిష్టం" అన్నాడు వ్రాన్‌స్కీ. లేవిన్ పరుషత్వం గమనించాడు, కాని గమనించనట్టు నటించాడు.

"కాని మీరు యెప్పుడూ పల్లెలోనే గడపడానికి అంగీకరించరని నేననుకుంటున్నాను" అంది కౌంటెస్ నార్డ్‌స్టన్.

"ఏమో చెప్పలేను. ఆ ప్రయత్నం యెక్కువగా చెయ్యలేదు. కాని శీతాకాలంలో మా అమ్మతో కలిసి నీస్‌లో గడిపేను. యేదో వింతైన అనుభూతిని పొందాను. అక్కడ రష్యన్ పల్లెల పట్ల నేను బెంగ పడినంతగా మరెక్కడా పడలేదు. లెరడు చెప్పులూ రైతులూ వుండే రష్యన్ పల్లె. మీకు తెలుసో తెలియదో నైస్ చాల విసుగ్గా వుండే చోటు. నేపిల్స్, సార్‌నెట్టోలు కూడా కొన్ని రోజులే హుషారుగా కనిపిస్తాయి. సరిగ్గా అలాంటి చోటుల్లోనే రష్యాని గురించిన గాఢ జ్ఞాపకాలు వస్తాయి, ముఖ్యంగా రష్యన్ పల్లెసీమల జ్ఞాపకాలు. అది యేదో..."

అతను మాట్లాడుతూ కిట్టీ, లేవిన్‌ల కేసి చూస్తూ మాట్లాడేడు. ఒకళ్ల మీద నుంచి మరొకళ్లమీదకి దృష్టి తిప్పుతూ మాట్లాడేడు. తనకి తట్టిన మొదటి విషయాన్ని గురించే చెప్పేడు.

కౌంటెస్ నార్డ్‌స్టన్ యేదో మాట్లాడబోతుందని చూసి తన మాట మధ్యలో తుంచేసాడు. ఆమెకేసి శ్రద్ధగా చూసేడు.

సంభాషణ ఆగకుండా సాగింది. అందుచేత పెద్దావిడకి తన రెండు భారమైన ఆయుధాలనీ వాడే అవసరం లేకపోయింది. సంభాషణ నీరసించిపోతే ఆవిడ వాటిని వాడుతూ వుంటుంది. శాస్త్ర విద్య కంటె భాషాసాహిత్యాల విద్యవల్ల కలిగే లాభాలూ,* నిర్బంధ సైనిక కొలువు* అనేవి ఆ విషయాలు. అలాగే లేవిన్‌ని యేడిపించే అవకాశమూ కౌంటెస్ నార్డ్‌స్టన్‌కి లేకపోయింది.

లేవిన్ సంభాషణలో జోక్యం చేసుకోవాలని అనుకున్నాడు. గాని కలగజేసుకో లేకపోయాడు. 'వెళ్లిపోతా, వెళ్లిపోతా' అనుకుంటూనే వున్నాడు. కాని వెళ్లలేదు. ఏదో జరుగుతుందని యెదురు చూస్తున్నట్టుగా వున్నాడు.

సంభాషణ మంత్ర తంత్రాలమీదికి, ఎగిరే మేజాలమీదకీ మళ్లింది. కౌంటెస్ నార్డ్‌స్టన్‌కి మంత్ర తంత్రాలమీద విశ్వాసం ఉంది. తను చూసిన అద్భుతాలన్నిట్నీ వర్ణించడం మొదలుపెట్టింది.

"ఓ మీరు నన్ను తప్పకుండా అలాంటి వాళ్ల దగ్గరికి తీసికెళ్లాలి కౌంటెస్. మీకు పుణ్యం వుంటుంది, తప్పకుండా. యిలాంటి అద్భుతాల్ని నేను యెన్నడూ చూసి యెరగను. అవి కనిపిస్తా యేమోనని చాల చోట్ల వెతికాను గాని" అన్నాడు చిరునవ్వు నవ్వుతూ వ్రాన్‌స్కీ.

"తప్పకుండా, మళ్లీ శనివారం" అంది కౌంటెస్ నార్డ్‌స్టన్. "మీరూ, లేవిన్‌గారూ! మీకు అలాంటి వాటిల్లో నమ్మకం వుందా?" అని లేవిన్‌ని అడిగింది.

"నన్నెందుకు అడుగుతారు? నేనేం జవాబు చెప్పబోయేదీ మీకు తెలుసు."

"కాని మీ అభిప్రాయం తెలుసుకోవాలని వుంది నాకు."

"నా అభిప్రాయంలో ఎగిరే మేజాలు యేం తెలియచేస్తాయీ అంటే విద్యావంతుల మనుకుంటూ వుండే మనుషులకీ రైతులకీ తేడా యేమీ లేదని. వాళ్ళ దిష్టి దిరుగుండాల్ని తాయెత్తులని నమ్ముతారు. మనం..."

"అంటే మీకు నమ్మకం లేదనే కదా?"

"వాటిని నేను నమ్మను, కౌంటెస్ వార్డ్స్టన్."

"నా కళ్లతో నేను చూశానని చెప్పినా నమ్మరా?"

"ఇంట్లో దెయ్యాన్ని తమ కళ్లతో చూశామని పల్లెటూరి ఆడవాళ్లూ అంటారు."

"అంటే నేను అబద్ధం ఆడుతున్నానంటారు" అందామె.

ఆమె వ్యాకులంగా నవ్వింది.

"అబ్బెబ్బే, లేదు, కౌంటెస్. తను వాటిని నమ్మలేననే లేవిన్‌గారు అంటున్నదల్లా" అని కిట్టీ లేవిన్ తరపున మాట్లాడి సిగ్గుపడుతూ అంది. అతనికి అది అర్థమైంది. దానివల్ల అతని పరిస్థితి యింకా దిగజారింది. దిమ్మతిరిగే జవాబు యిచ్చివుండేవాడే. కాని ఘోరంగా పరిణమించలోయే ఆ సంభాషణని వ్రాన్‌స్కీ తనకి మామూలుగా వుండే నిశ్చల, ఉల్లాస భరిత మందహాసంతో ఒడ్డుకి లాగేడు.

"పోనీ అలాంటివి వుండే అవకాశం కూడా లేదంటారా? ఎందుకుండకూడదు? విద్యుచ్ఛక్తి వుందని ఒప్పుకుంటున్నాం, దాన్ని యెవరూ చూడక పోయినా. ఏమో అజ్ఞాతంగా వున్న ఒక శక్తి వుండవచ్చుని, అది..." అన్నాడు.

"విద్యుచ్ఛక్తిని కనిపెట్టినప్పుడు" అంటూ లేవిన్ అడ్డం వెళ్ళేడు, "ఒక ప్రకృతి వ్యాపారాన్ని గుర్తించారంతే. అది యెక్కడినుంచి వచ్చిందో, యేం చేస్తుందో యెవరికీ తెలియదు. ఈ శక్తిని యెలా వినియోగించుకోవాలో తెలుసుకోవడానికి ముందు ఎన్నో యుగాలు గడిచిపోయాయి. దీనికి విరుద్ధంగా మేజాలు మాటలు రాస్తాయనీ, దెయ్యాలు కనిపిస్తాయనీ, మంత్ర తంత్రాలని నమ్మేవాళ్ళు మొదలుపెడతారు. అప్పుడు మాత్రమే యేదో అజ్ఞాత శక్తిని గురించి మాట్లాడతారు."

ఎప్పటి లాగానే వ్రాన్‌స్కీ శ్రద్ధగా విన్నాడు. ఆ చెప్తూ వున్న విషయం పట్ల ఆసక్తి చూపిస్తూ విన్నాడు.

"కాని ప్రస్తుతంలో మనకి యీ శక్తి యేమిటైందీ తెలీదు, కాని అది వుంది అని, సీటి సీటి ద్వారా అది వెల్లడవుతోంది అని మంత్రతంత్రాలని నమ్మేవాళ్ళు అంటారు. వాటి గుణాలు యేమిటో శాస్త్రజ్ఞుల్ని కనిపెట్టనివ్వండి. కొత్త శక్తి ఒకటి యెందుకు వుండ కూడదో నాకు అర్థం కాదు, యీ..."

"ఎందుకంటే" అంటూ లేవిన్ అడ్డం వెళ్ళేడు. "విద్యుచ్ఛక్తికి సంబంధించి చూడండి. వూలుతో రైజిన్‌ని రుద్దిన ప్రతిసారీ అదే ఫలితం వస్తుంది. యీ మంత్ర తంత్రాల విష

యంలో యెప్పుడూ ఒకే ఫలితం రాదు. అంటే అది ప్రకృతి వ్యాపారం కాదన్నమాట" అన్నాడు.

చర్చ మరీ గంభీరంగా డ్రాయింగ్ రూమ్ వాతావరణానికి నప్పకుండా అయిపోతోందని బహుశా గ్రహించాడేమో మరి, వ్రాన్‌స్కీ యిక ఆ విషయాన్ని ముందుకు తొయ్యలేదు. ఖుషీగా చిరునవ్వు నవ్వుతూ విషయాన్ని మార్చడానికి ఆడవాళ్ళకేసి తిరిగాడు.

"రండి, దీన్ని పరీక్షకు పెడదాం, కౌంటెస్" అని మొదలెట్టేడు. కాని లేవిన్ తను చెప్పదల్చుకున్న దాన్నంతటినీ చెప్పాలనే అనుకున్నాడు.

"తమ అద్భుతాల్ని యేదో కొత్త, అజ్ఞాత శక్తికి మంత్రగాళ్ళు అంట గట్టడమే వాళ్ళకి వున్న పెద్ద లొసుగు అని నాకనిపిస్తుంది. ఏదో అతీతశక్తిని గురించి బహిరంగంగా మాట్లాడతారు, కాని దాన్ని భౌతిక పరీక్షలకి పెట్ట చూస్తారు" అని చెప్పేడు లేవిన్.

ఎప్పుడు ముగిస్తాడా అని ప్రతివాళ్ళూ విసుగ్గా చూసేరు. దాన్ని అతను గ్రహించేడు.

"మంత్రశక్తుల్ని ఆవాహన చెయ్యడం మీద్వారా జరిపించవచ్చని నాకనిపిస్తోంది. మీ స్వభావంలో మహోత్సాహ పూరితమైంది యేదో వుంది" అంది కౌంటెస్ నార్డ్‌స్టన్.

జవాబు చెప్దామా అని లేవిన్ నోరు తెరిచాడు. కాని యెందుకు లెమ్మని వూరుకున్నాడు. అతని ముఖం సిగ్గుతో యెర్రబడింది.

"రండి కౌంటెస్, యీ బల్లల్ని పరీక్షకు పెడదాం" అన్నాడు వ్రాన్‌స్కీ. "కానివ్వమంటారా ప్రిన్సెస్?" అని అడిగేడు.

ఆ మాట అని లేచి అనువుగా వుండే బల్లకోసం వెతికాడు.

కిట్టీ తను కూర్చున్న బల్ల దగ్గర్నుంచి లేచింది. లేవిన్ దాటి వెడుతూ వుంటే ఒకళ్ళనొకళ్ళు చూసుకున్నారు. ఆమె మనస్ఫూర్తిగా అతని పట్ల జాలిపడింది. ముఖ్యంగా తనే అతని దీనావస్థకి కారణమైనందుకు. 'నన్ను మీరు క్షమించగలిగితే క్షమించండి' అన్నట్టు వుంది ఆమె చూపు. 'నేను యెంతో ఆనందంగా వున్నాను' అన్నట్టు వుంది.

'నాకు అందరిపట్లా అసహ్యం కలుగుతోంది; మీపట్లా, నాపట్లా కూడ' అని అతని చూపు జవాబు చెప్పింది. అతను టోపీని అందుకున్నాడు. కాని వెళ్ళిపోయే అదృష్టం అతనికి లేకపోయింది. సరిగ్గా వాళ్ళు బల్ల దగ్గర కూర్చోబోయే సమయానికి, లేవిన్ వెళ్ళిపోవడానికి తయారయే వేళకి పెద్ద ప్రిన్స్ వచ్చేడు. ఆడవాళ్ళని పలకరించాక లేవిన్‌కేసి తిరిగాడు.

"హాయ్!" అన్నాడు సంతోషంగా, "ఎప్పుడొచ్చేవు? నువ్వు యిక్కడున్నట్టు నాకు తెలియనే తెలియదు. మిమ్మల్ని చూడ్డం చాలా సంతోషంగా వుంది."

పెద్ద ప్రిన్స్ లేవిన్‌ని కాసేపు "నువ్వు" అనీ, కాసేపు "మీరు" అనీ సంబోధించేడు. ఆయన అతన్ని కౌగలించుకున్నాడు. అతనితో మాట్లాడ్డంలో మునిగిపోయి వ్రాన్‌స్కీని

గురించి పట్టించుకోనే లేదు. వ్రాన్స్కీ లేచి నుంచున్నాడు. ఆయన తనని పలకరిస్తాడని ఓపిగ్గా యెదురుచూసేడు.

అంతకు ముందే తమ మధ్య జరిగిన ఆ విషయం తర్వాత తండ్రి లేవిన్‌పట్ల అంత ఆదరం కనబర్చడం అతనికి బాధగా వుంటుందని కిట్టీ గ్రహించింది. వ్రాన్స్కీ మర్యాదగా తండ్రికి వందనం చేస్తే, దాన్ని ఆయన ముభావంగా స్వీకరించడం కూడా కిట్టీ గమనించింది. వ్రాన్స్కీ తండ్రి కేసి యిదేమిటీ ముభావం అన్నట్టు చూడ్డమూ గమనించింది. తనపట్ల యెవర్లైనా, యే కారణం వల్లనైనా, యెందుకు విముఖంగా వుంటారా అని అర్థం చేసుకో ప్రయత్నించి అర్థం అవక వ్రాన్స్కీ తండ్రి కేసి చూస్తూ వుండిపోయినట్టూ గమనించింది. కిట్టీకి చెక్కిళ్లు సిగ్గుతో యెర్రబడ్డాయి.

"ప్రిన్స్, లేవిన్‌గారిని మా దగ్గరికి రానివ్వండి. మేము ఓ ప్రయోగం చెయ్యబోతున్నాం" అంది కౌంటెస్ నార్డ్‌స్టన్.

"ఎటువంటి ప్రయోగం? ఎగిరే మేజాలు? ఊఁ, సోదరసోదరీమణులారా క్షమించండి నన్ను. ఉంగరం యెవరికి దొరికింది అనేది యింకా సరదాగా వుండే ఆట" అన్నాడాయన. వ్రాన్స్కీకేసి చూశాడు, అతనే దీన్ని లేవెట్టి వుంటాడని వూహించి. "ఉంగరం యెవరికి దొరికింది అనే ఆటకి కనీసం తలా తోకా అయినా వుంటుంది" అన్నాడు.

వ్రాన్స్కీ ఆశ్చర్యపోతూ తదేకంగా ఆయనకేసి చూశాడు. తర్వాత సేలవంగా చిరునవ్వు నవ్వుతూ, ఆ తర్వాతి వారంలో జరగబోయే గొప్ప బాల్‌డాన్స్ గురించి కౌంటెస్ నార్డ్‌స్టన్‌తో మాట్లాడడం మొదలుపెట్టాడు.

"మీరు వస్తారు కదూ?" అని కిట్టీని అడిగాడు.

పెద్ద ప్రిన్స్ పక్కకి తిరగ్గానే లేవిన్ ఉలుకూపలుకూ లేకుండా జారిపోయాడు. బాల్‌డాన్స్ గురించి వ్రాన్స్కీ అడిగిన దానికి సంతోషంతో ముఖం మెరుస్తూ వుంటే కిట్టీ జవాబు చెప్పడమే ఆ సాయంత్రం అతని హృదయంమీద పడిన ఆఖరి ముద్ర.

15

అతిథులంతా వెళ్లిపోయిన తరువాత ఆ సాయంత్రం కిట్టీ తనకీ లేవిన్‌కీ జరిగిన సంభాషణ అంతా తల్లికి చెప్పింది. అతనిపట్ల జాలివడ్డా, అతను తనని పెళ్లి చేసుకుంటానన్న ప్రస్తావన చేసినందుకు సంతోషం కలిగింది. తను యేం చెయ్యాలో అదే చేసింది. అందులో ఏవరు సందేహం లేదు. అయినా గానీ చాల సేపటిదాకా నిద్ర పోలేకపోయింది. ఒకటే రూపం ఆమెకి వ్యధ కలిగిస్తూ వుంది. లేవిన్ ముఖం, ముకుళించుకున్న కనుబొమలు, ఆ కనుబొమల క్రిందనుంచి దిగులుగా, బాధగా చూసే సౌమ్య నేత్రాలు. అతను తండ్రి చెప్పేది వింటూ, తనవీ, వ్రాన్స్కీని గమనిస్తూ నుంచున్నప్పుడు అలా వున్నాడు. అతనిపట్ల ఆమెకి

చాలా జాలి కలిగింది. కళ్లల్లో నీళ్లు తిరిగాయి. కాని ఆ మరుక్షణంలోనే ఆమె ఆలోచనలు లేవిన్‌కి బదులుగా తను యెంచుకున్న మనిషిమీదికి మళ్లాయి. అతని రూపం స్పష్టంగా మనోనేత్రం ముందు ప్రత్యక్షమైంది. సాహస భరితంగా, స్థిరంగా వున్న ముఖం, ఆ ముఖంలో ద్యోతకమయే ప్రశాంతత, ఆ ముఖ కవళికలలో సర్వులపట్లా ఉద్భూతమయే సౌజన్యం స్మృతిలోకి వచ్చాయి. తను ప్రేమించిన వాడి ప్రేమ తనకి లభించిందని గుర్తువచ్చింది. తనే అతన్ని ప్రేమిస్తోంది, మళ్లీ ఆమె మనసు ఆనందంలో పులకించింది. మందహాసం చేస్తూ తలగడలో తల దూర్చేసుకుంది. 'అది విచారకరమైందే, చాల విచారకరమైందే. కాని నేనేం చెయ్యగలను? నా దోషం యేమీ లేదు' అని తనలో తనే అనుకుంది. కాని ఆమె అంతరాత్మ పూర్తిగా భిన్నంగా వుండే మరో దాన్ని చెప్పింది. లేవిన్‌కి తను ప్రోత్సాహం కలిగించిన దానికి పశ్చాత్తాపపడిందో, అతన్ని తిరస్కరించినందుకు పశ్చాత్తాపపడిందో ఆమెకి తెలియలేదు. కాని సందేహంవల్ల ఆమె ఆనందం భగ్నం అయింది. 'హే భగవంతుడా, కరుణించు, కరుణించు' అని నిద్రపట్టేదాకా అనుకుంటూనే వుంది.

ఈ లోపున కింద తండ్రి చదువుకునే గదిలో తల్లీ తండ్రీ తమ ముద్దుల కూతురి గురించి దెబ్బలాడుకుంటున్నారు. వాళ్లకి యీ మధ్య అలాంటి దెబ్బలాటలు ఎక్కువయాయి.

"ఏం చేశారా? యిది చేశారు" అంటూ చేతులు బారచాపుతూ అరిచేడు ప్రిన్స్, అలా చేతులు కదిలించడంతో ఆయన నైట్‌గౌన్ అంచులు తెరుచుకున్నాయి. ఆయన వాటిని ముడుచుకున్నాడు. ఉడత చారల్లాంటి చారలున్న నైట్‌గౌన్ అది. "మీకు ఆత్మాభిమానం లేదు, గౌరవం లేదు. ఈ దరిద్రపు గొట్టు పెళ్లి సంబంధాలతో నీ కూతుర్ని అవమానం పాలుచేస్తున్నావు, నాశనం చేస్తున్నావు" అన్నాడు.

"ఓరి భగవంతుడా, నేనేం చేశాను?" అంది ఆవిడ. ఆవిడకి దాదాపు కళ్లనీళ్ల పర్యంతం అయింది.

కూతురితో మాట్లాడింతరువాత ఆవిడకి సంతోషంగా, తృప్తిగా వుంది. భర్తకి యధాప్రకారం గుడ్‌నైట్ చెప్పుదామని వచ్చింది. లేవిన్ చేసిన ప్రస్తావన గాని, కిట్టీ కాదనడం గాని ఆయనికి చెప్పే ఉద్దేశం ఆవిడకి లేదు. వ్రాన్‌స్కీతో వ్యవహారం ఒక కొలిక్కి వస్తోన్నట్టూ, అతని తల్లి రాగానే తేలిపోయేటట్టూ తనకి అనిపిస్తున్నట్టూ సూచన చేసింది. ఆవిడ యీ మాటలు అందో లేదో ఆయన కోపంతో రేగిపోయాడు. గొంతు చించుకోవడం మొదలెట్టాడు.

"తమరు యేం చేశారా? ఇదీ తమరు చేసింది. నీ కూతురికి వరుడికోసం బహిరంగంగా ఆరాటపడుతున్నావు. త్వరలోనే మాస్కో అంతా యీ విషయం గురించే చెవులు కొరుక్కుంటుంది. అందుకు తగ్గ హేతువు వుంది. ఇలా సాయంత్రాలప్పుడు సమావేశాలేర్పాటు చేసేటట్టుంటే అందర్నీ పిలు. ఇలా వరుల్ని మాత్రమే కాదు. షోకిల్లా పడుచుకుర్రకారు అందర్నీ పిలు." (మాస్కో యువకులకి ఆయన పెట్టిన పేరు అదీ.) "పియానో వాయిద్యగాణ్ణి

పిలిపించు. కుంయ్ కుంయ్ వాయించమను. ఇవాళలా కాకుండా పొట్టి వరుస్నీ, సంబంధం కుదిరే వాళ్లని మాత్రమే కాదు! నాకు వెలపరంగా వుంది. చూడ్డానికే వెలపరం! నీక్కావల్సింది వచ్చింది. పాపం వెర్రిపిల్ల, దాని తల తిరిగిపోతుంది. లేవిన్ వంద రెట్లు మెరుగు. యీ పీటర్స్‌బర్గ్ షోకిలా రాయుడూ వున్నాడు! యిలాంటి వజ్జా అంతా ఒకటే మూస పోత! అంతా ఒకటే నమూనా, పనికి రాని వాళ్లు. జార్ కుటుంబం రక్తం తనలో వుందంటే అనవీ, నా బిడ్డకి ఆ అవసరం లేదు."

"అయినా నేనేం చేశానని?"

"ఇదే చేశావ్..." అంటూ ఆయన గొంతు చించుకున్నాడు.

"ఒకటి మాత్రం నిజం. నేను గనక నీ మాటలు వింటే మన అమ్మాయికి పెళ్లంటూ ఒకటి చెయ్యగలమా? అదే అయితే మనం పల్లెటూరికి వెళ్లి వుండడం మెరుగు" అంటూ ప్రిన్స్ మాటలకి అడ్డం వచ్చిందావిడ.

"అదే మెరుగు."

"కాస్త ఆగు. నేను యెవళ్ల వెనక్కాలేనా పడ్డానా? నేనేమీ అలా చెయ్యలేదు. పడుచతను, చక్కని పడుచతను, తను ప్రేమించాడు. నేననుకోవడం మన అమ్మాయి కూడా..."

"అనుకుంటావు నువ్వు! అమ్మాయి ప్రేమించిందేననుకో, నిజానికి అతను పెళ్లి చేసుకోవాలనుకున్నాడా? నేను పెళ్లాడాలని అనుకున్నట్టుగానే! అలా అయితే? అబ్బ అతన్ని చూడకుండా వుంటే బాగుండేది! ఆహ్, మంత్రతంత్రాలు, ఆహ్ నీన్! ఆహ్ విందు వాట్యాలకి వెళ్లడం!" ఆయన యిలా అంటూ మాట మాటకీ వంగి వందనం చేస్తున్నట్టు భార్యని అనుకరించేడు. "కిట్టీ బతుకు దుర్భరం చేస్తాం మనం, దాని మనస్సుకి నిజానికి యిది వస్తుంది..."

"అలాంటి వాటి గురించి యెందుకనుకోవాలి?"

"నేననుకోవడం కాదు. నాకు తెలుసు. ఇలాంటి విషయాల్ని మగాళ్లే చూడగలరు, ఆడాళ్లు కాదు. నిజమైన ఉద్దేశాలతో ఉన్న మనిషిని నేను కనిపెట్టగలను. లేవిన్ అలాంటి వాడు. నీ కులాసా రాయుళ్లనీ, రంగేలీగాళ్లని కూడ చూడగలను, వాళ్లకి కావలసింది సరదాలు."

"యెక్కడెక్కడ లేని వూహాలు తడతాయి నీకు."

"చేతులు కాలి ఆకులు పట్టుకోనేటప్పుడు నా మాటలు నీకు గుర్తొస్తాయి. దాలీ విషయంలో లాగ."

"అబ్బ చాలు చాలు. ఆ విషయం యిక మాట్లాడుకోవద్దు" అందావిడ హడావుడిగా. దురదృష్టవంతురాలైన దాలీ పేరు చెప్పగానే భర్తని వారించింది.

"మంచిది, వెళ్లి పడుకో."

ఇద్దరూ ఒకళ్ళమీద ఒకళ్ళు శిలువ గుర్తు గీసుకున్నారు. ముద్దుపెట్టుకున్నారు. పడుకోవడానికి వెళ్ళిపోయారు. ఎవళ్ల ఆలోచనల్లో వాళ్ళు వున్నారు.

ఆ రోజు సాయంత్రం కిట్టీ అదృష్టం తేలిపోయిందనీ, వ్రాన్‌స్కీ ఉద్దేశం విషయంలో అనుమానమే లేదనీ మొదట ఆవిడకి గట్టిగా నమ్మకం కుదిరింది. కాని మొగుడి మాటలు విన్నాక బేజారైపోయింది. భవిష్యత్తు యెలా వుంటుందో యేమీ తెలియక భయపడి పోయి తన గదికి వెళ్ళింది. కిట్టీ లాగానే "భగవంతుడా కరుణించు, కరుణించు" అనుకుంటూ వుండిపోయింది.

16

విజమైన కుటుంబ జీవితం అనేదాన్ని వ్రాన్‌స్కీ యెన్నడూ యెరగడు. అతని తల్లి తన రోజుల్లో నాగరిక సమాజంలో ధగధగ మెరిసిపోయేటట్టు గడిపింది. తమ భర్తతో కాపరం చేసిన రోజుల్లోనూ, ముఖ్యంగా ఆ తర్వాతా ఆవిడ శృంగార కార్యకలాపాలు చాలా వున్నాయి. ఉన్నత సమాజంలో ప్రతివాళ్ళకీ అవి తెలుసు. అతనికి తండ్రి సరిగా గుర్తేలేదు. అతని చదువు 'పేజ్ కోర్*'లో సాగింది.

ప్రతిభా విశేషాలు గల యువ మిలిటరీ ఆఫీసరుగా చదువు పూర్తిచేసి పీటర్స్‌బుర్గ్ సంపన్న సైనిక అధికార్ల జీవిత సరళిలో పడ్డాడు. అతను నాగరిక సమాజంలోకి తడవ తడవకీ వెళ్ళినా అతని శృంగార చేష్టలన్నీ ఆ సమాజం బయటే సాగాయి.

పీటర్స్‌బుర్గ్‌లో భోగభాగ్యాలతో సైలా సప్పినుగా బతికేడు. ఆ తర్వాత మాస్కో వచ్చేడు. మాస్కోలో మొదటిసారిగా తనని ప్రేమించి, తన సాంఘిక హోదాకి చెంది ప్రేమా స్పదంగా, అమాయికంగా వుండే అమ్మాయికి సన్నిహితమయే సంతోషానుభవాన్ని పొందేడు. కిట్టీకి తనకి గల సంబంధాలలో తప్పుపట్టుకోదగ్గది యేదన్నా వుంటుందేమోననే విషయం అతనికి యెన్నడూ తట్టలేదు. బాల్‌డాన్సులప్పుడు ఆమెతో కలిసి నాట్యం చేసేవాడు. వాళ్ళింటికి వెళ్ళేవాడు. మామూలుగా ఆ సమాజంలో చెప్పుకొనే నానా రకాల చెత్త విషయాలూ ఆమెతో చెప్పేవాడు. కాని తనకి తెలియకుండానే యే రీతిలో చెప్పేవాడంటే ఆమె వాటికి ప్రత్యేక ప్రాముఖ్యాన్ని యిచ్చేది. నలుగురి ముందు చెప్పకూడని విషయాలని వేటినీ అతను ఆమెకి చెప్పక పోయినా ఆమె రాను రాను తనకి దగ్గరవుతోందనే అతనికి అనిపించింది. అలా అని యెంత గాఢంగా అతనికి అనిపిస్తే అంతలా అతని సంతోషానుభూతి అధికం అయేది, అంతలా కిట్టీపట్ల అనుభూతి కోమలత్వం పెరిగేది. కిట్టీపట్ల తన ప్రవర్తనకి ఒక ప్రత్యేకమైన పేరు వున్నదనీ, పెళ్ళి చేసుకొనే ఉద్దేశం లేకుండానే ఒక పడుచు పిల్ల ప్రేమకోసం తను ఆమె వెంటబడుతున్నాడనీ, అలాంటిది తన లాంటి గొప్పింటి పడుచువాళ్ళు మామూలుగా చేసే పెద్ద పనుల్లో ఒకటని అతనికి తెలియదు. ఈ ప్రత్యేక సుఖాన్ని కనిపెట్టిన మొదటి

వాడు తనేనని అతను భావించుకున్నాడు. తను కనిపెట్టిన దాంతో ఆనంద పులకాంకి తుడయేడు.

ఆ రాత్రి ఆమె తల్లిదండ్రుల మధ్య జరిగిన గొడవ అతను విని వుంటే, ఈ కుటుంబం దృష్టినుంచి అతను విషయాల్ని చూడగలిగి వుంటే, తను గనక పెళ్లాడకపోతే కిట్టీకి చాల దుఃఖం కలుగుతుందని అతనికి తెలిసి వుంటే అతను ఆశ్చర్యపోయి వుండేవాడు. నిజానికి నమ్మి ఉండేవాడు కాదు. అలాంటి ఘనమైన, సాధ్యంలేని సంతోషాన్ని తనకి, తనకంటే యెక్కువగా ఆమెకి సమకూర్చిన ఆ సంబంధంలో తప్పు పట్టుకోదగ్గది వుంటుందే అనే విషయాన్ని అతను నమ్మలేదు. తను ఆమెని పెళ్లాడవలసి వుందనే విషయాన్ని అలాగే అతను నమ్మలేదు.

పెళ్లి చేసుకోవాలనే విషయమే అసలు అతని బుర్రకి తట్టలేదు. కుటుంబ జీవితం అంటే అతనికి యిష్టం లేకపోవడమే కాదు, తను కలిసి మెలిసి తిరిగే బ్రహ్మచారి ముఠా దృష్టినుంచి చూస్తే కుటుంబమన్నా ముఖ్యంగా భర్త అన్నా ద్వేషపూరితమైందీ, నవ్వనిదీ అన్నిటినీ మించి పరిహాసాస్పదమైందీ యేదో వుందనిపించింది. ఆమె తల్లిదండ్రులు లేమను కుంటున్నదీ అతని వూహకి తట్టలేదు. కాని ఆ సాయంత్రం వాళ్ల యింటి దగ్గరనుంచి వచ్చేసినప్పుడు తనకీ కిట్టీకీ మధ్య వున్న నిగూఢ ఆత్మిక బంధం యీ సాయంత్రం దృఢం అయిందనీ, యెంత దృఢం అంటే దానికి సంబంధించి యేదో వొకటి చెయ్యాలనీ అతనికి అనిపించింది. ఏం చెయ్యాలో, ఏం చెయ్యాల్సివుందో దాన్ని గురించి అతను అను కోను కూడా అనుకోలేకపోయాడు.

'దీని అందం యేమిటంటే' అనుకున్నాడతను వాళ్ల యింటినుండి తిరిగి వెళ్లిపోతూ. ఎప్పటిలాగా నిర్మల, నూతన, సౌఖ్య భావన అతనికి కలిగింది. ఆ భావన ఆ సాయంత్రమంతా ఒక్క సిగరెట్టు కూడా కాల్చకపోవడం వల్లా వచ్చివుండొచ్చు. కిట్టీ తనపట్ల చూపించిన ప్రేమతో తను కొత్త రీతిలో స్పందించిదానివల్లా వచ్చి వుండొచ్చు. 'దీని అందం యేమంటే నేను గాని ఆమె గాని ఒక్కమాటా మాట్లాడుకోలేదు. అయినా కళ్ల మాట్లాడే భాషనీ, స్వరాన్నీ యెంత స్పష్టంగా అర్థం చేసుకున్నా, యెప్పటికంటే తేటతెల్లంగా ఆమె నాకు చెప్పింది తను నన్ను ప్రేమిస్తున్నట్టు. ఎంత మధురంగా, సరళంగా అన్నిటినీ మించి నేనంటే యెంత విశ్వాసంగా వుంది! నాకుగా నేను యిదివరకటి కంటే మెరుగా వున్నట్టూ, నిర్మలంగా వున్నట్టూ నాకనిపిస్తోంది. నాకు హృదయం వున్నట్టు నాకనిపిస్తోంది, బోలెడు మంచితనం వుంది. ఓ, ప్రేమపూరితమైన, ప్రేమాస్పదమైన ఆ నేత్రాలు! ఆమె అంది "ఓ, చాలా..."'

'ఊఁ, అయితే? ఏముంది? ఏమీ లేదు. నేను ఆనందంగా వున్నాను. ఆమె కూడ ఆనందంగా వుంది.' యిక ఆ తర్వాత వున్న వ్యవధి యెలా గడపాలా అని అతను తర్కించు కున్నాడు.

తను యెక్కడెక్కడికి ఆ వేళప్పుడు వెళ్ళడానికి అవకాశం వుందో ఆ చోటుల గురించి ఆలోచించాడు. 'క్లబ్బుకా? బెజిక్ ఆటలో ఓ చెయ్యి కలపచ్చు, ఇగ్నాతొవ్‌తో కలిసి ఓ సీసా షాంపేన్ తాగచ్చు. ఉహుం, వద్దు, అక్కడికి వెళ్లను. Château des fleurs*కి వెడితే? అక్కడ అబ్లాన్‌స్కీ తగులుతాడు. ఫ్రెంచి పాటలు, cancan నాట్యం. ఉఫ్. మొహం మొత్తింది. ష్చేర్‌బాత్‌స్కీలంటే యిష్టం, యెందుకు అంటే అక్కడ మంచివాడుగా వుంటాననిపిస్తుంది. ఎందుకొచ్చింది, యింటికే పోతా' అనుకున్నాడు. నేరుగా దూసో హోటల్‌కి వెళ్లిపోయాడు. భోజనం తన గదికే తెమ్మని పురమాయించాడు. తర్వాత బట్టలు మార్చుకున్నాడు. తలగడమీద తల అన్చాడో లేదో యథాప్రకారం గాఢంగా ఆదమరిచి నిద్ర పోయాడు.

17

మర్నాడు ఉదయం పదకొండు గంటలకి వ్రాన్‌స్కీ పీటర్స్‌బుర్గ్ రైల్వే స్టేషన్‌కి వెళ్లాడు. వాళ్లమ్మ వస్తోంది. పెద్ద మెట్లమీద అతనికి తగిలిన మొదటి వ్యక్తి అబ్లాన్‌స్కీ. అదే రైల్లో తన అక్కగారు వస్తోందని అతనూ స్టేషన్‌కి వచ్చేడు.

"అరె! హుజూర్! నువ్వు ఎవరికోసం వచ్చావు?" అని అబ్లాన్‌స్కీ సంతోషంగా అరుస్తూ అన్నాడు.

"మా అమ్మకోసం" అన్నాడు వ్రాన్‌స్కీ. అబ్లాన్‌స్కీని కలుసుకున్నప్పుడు అందరూ చిరునవ్వు నవ్వినట్టుగానే అతనూ చిరునవ్వు నవ్వేడు. అతనితో షేక్‌హాండ్ చేశాడు. ఇద్దరూ కలిసి మెట్లు యెక్కారు. "ఆవిడ పీటర్స్‌బుర్గ్‌నుంచి వస్తోంది" అన్నాడు.

"నువ్వొస్తావని తెల్లవారకట్ల రెండింటిదాకా చూశాను. ష్చేర్‌బాత్‌స్కీల యింటి దగ్గర్నుంచి యెక్కడికి వెళ్లావు?"

"ఇంటికే. నిన్న సాయంత్రం ష్చేర్‌బాత్‌స్కీల యింటి దగ్గర మనస్సుకి చాల సంతోషం కలిగింది. ఇక ఆ తరువాత యెక్కడికీ వెళ్ల బుద్ధి పుట్టలేదు" అన్నాడు వ్రాన్‌స్కీ.

"ఆకాశంలో యెగిరే యెత్తుని బట్టి దేగని గుర్తుపడతాన్నేను, కళ్లల్లో వెలిగే ప్రేమ దీధితులని బట్టి ప్రేమికుణ్ణి గుర్తుపడతా" అంటూ అంతకు ముందు లేవిన్ దగ్గర చదివి నట్టుగా చదివేడు అబ్లాన్‌స్కీ.

అందులో వున్న ధ్వనిని తను ఖండించడం లేదని ద్యోతకమయేటట్టుగా వ్రాన్‌స్కీ చిరునవ్వు నవ్వేడు. కాని మాట మార్చేడు.

"ఎవరికోసం వచ్చావు?" అని అడిగాడు.

"నేనా? ఒక సొగసైన సుందరి కోసం" అన్నాడు అబ్లాన్‌స్కీ.

"వాహ్వా!"

"Honni soit qui mal y pense![1] మా అక్క అన్నా కరేనినా కోసం."

"ఆఁ! కరేనిన్‌గారి భార్యా?" అని వ్రాన్‌స్కీ అడిగాడు.

"నువ్వెరుగుదువు కదూ ఆమెని?"

"అనుకుంటా. వుహూ, లేదు... యేమో మరి, గుర్తులేదు" అన్నాడు వ్రాన్‌స్కీ పరధ్యానంగా. కరేనినా అనే పేరు వినగానే సందిగ్ధంగా ఏదో బిగుసుకు పోయినట్టూ, విసుగు కలిగించేటట్టూ అనిపించింది.

"మా బావ అలెక్సేయ్ అలెగ్జాంద్రొవిచ్ కరేనిన్‌ని నువ్వు యెరిగే వుంటావు. ఆయన జగమెరిగిన వ్యక్తి."

"ఆయన పేరు విన్నాలే, ముఖ పరిచయం వుంది. ఆయన బుద్ధికుశలుడనీ, విద్వత్తు వున్నవాడనీ, విష్టాపరుడనీ తెలుసు. కాని నీకు తెలుసు కదా. అవి నాలో లేవు... not in my line[2]" అన్నాడు వ్రాన్‌స్కీ.

"కాని ఆయన అఖండుడు. కొంచెం చాదస్తుడనుకో కాని ఒకటో రకం మనిషి" అన్నాడు అబ్లాన్‌స్కీ.

"ఒకటో రకం మనిషయితే మంచిదేలే" అన్నాడు వ్రాన్‌స్కీ చిరునవ్వు నవ్వుతూ. "హాయ్, నువ్వొచ్చేశావ్!" అన్నాడు ఒక పొడుగాటి ముసలి మనిషికేసి చూసి. అతను వాళ్లమ్మగారి నౌకరు. గుమ్మం దగ్గర నుంచున్నాడు. "ఇలారా" అని పిలిచాడు అతన్ని.

అబ్లాన్‌స్కీని కలుసుకున్నప్పుడు అందరికీ కలిగే లాంటి హాయి వ్రాన్‌స్కీకి కలిగింది. అంతే కాదు అబ్లాన్‌స్కీ కిట్టీకి బావ అవడం వల్ల యిప్పుడు ప్రత్యేకం తను అతనికి చేరువైనట్టు అనిపించింది.

"వూఁ అయితే ఆ ముద్దుల గుమ్మకి ఆదివారం విందు యేర్పాటు చేస్తున్నామా?" అని అబ్లాన్‌స్కీ చేతిని తన చేతిలోకి తీసికొని చిరునవ్వు నవ్వుతూ అడిగాడు.

"ఖాయంగా! నేను చందాలు వసూలు చేస్తున్నాను. సరేగాని నిన్న సాయంత్రం మా స్నేహితుడు లేవిన్‌ని చూశావా?" అని అబ్లాన్‌స్కీ అడిగాడు.

"చూశాను. కాని యెందుకనో పెందరాళే వెళ్లిపోయాడు."

"భలేవాడ్లే. నీకెలా అనిపించింది?" అన్నాడు అబ్లాన్‌స్కీ.

"ఏమో తెలీదు" అన్నాడు వ్రాన్‌స్కీ. "అవును గాని మాస్కో వాళ్లంతా, అంటే యిప్పుడు నేను మాట్లాడుతూ వున్న పెద్దమనిషి తప్ప నువ్వు తప్ప మిగిలినవాళ్లు అనుకో" అంటూ వేళాకోళంగా మినహాయింపు పెట్టి "యింత కంచువదునుగా యెందుకుంటారో!

---

[1] దీన్ని తప్పుగా అర్థం చేసుకుంటే సిగ్గుపడాలి (ఫ్రెంచి).

[2] మనకి సరిపడేవి కాదు (ఇంగ్లీషు).

ఎప్పుడూ చిరచిరలాడుతూ యిట్టే కోపం తెచ్చుకుంటూనే వుంటారేమిటో! తమతో పరాచికాలాడకూడదని నీకు హెచ్చరిక చేస్తున్నట్టు!" అన్నాడు.

"ఉన్నారు అలాంటివాళ్ళు నిజమే" అంటూ సరదాగా నవ్వేడు అబ్లాన్‌స్కీ.

"రైలు వస్తోందా?" అని వ్రాన్‌స్కీ స్టేషన్ మనిషినొకణ్ణి అడిగాడు.

"పక్క స్టేషన్ వదిలిందండి" అని అతను చెప్పాడు.

రైలు వస్తోందనగానే హడావుడి యెక్కువైంది. పోర్టర్లు అటూ యిటూ పరిగెత్తేరు. జెండార్మీ వాళ్ళూ, రైల్వే ఉద్యోగులూ ప్రత్యక్షం అయేరు. రైల్లో వచ్చే మిత్రుల్నీ, బంధువుల్నీ కలుసుకుందుకు వచ్చిన వాళ్ళూ వున్నారు. గొర్రెతోలు కోట్లూ, బొచ్చు బూట్లూ తొడుక్కున్న రైల్వే పనివాళ్ళు గజిబిజిగా అల్లుకుపోయిన రైలు పట్టాలు దాటుకుంటూ వెళ్ళడం చల్లని గాలిలో లేచే పొగమంచు ఛాయలో కనిపిస్తూ వుంది. దూరంనుంచి ఓ పెద్ద రైలింజను కూత వినిపించింది. పట్టాలమీద భారమైన రవాణాపెట్టెలు అటూ యిటూ షంటింగ్ అవడం వినిపించింది.

"లేదు" అన్నాడు అబ్లాన్‌స్కీ. కిట్టీపట్ల లేవిన్‌కి వున్న ఉద్దేశం యేమిటైందీ వ్రాన్‌స్కీతో చర్చించాలని అతనికి మహా ఉత్సాహంగా ఉంది. "నువ్వు మా మిత్రుడు లేవిన్‌ని సరిగా అర్థం చేసుకోలేదు. అతను తత్తరపాటు మనిషి కావచ్చు. ఒకో అప్పుడు చిరాకు తెప్పిస్తాడు కూడా. కాని మామూలప్పుడు భేషైన మనిషి. నిప్పులాంటి నిజాయితీ వున్నవాడు. సత్యసంధుడు. మనస్సు బంగారం. కాని నిన్న సాయంత్రం వున్న పరిస్థితులు వేరు" అన్నాడు అబ్లాన్‌స్కీ. అని భావగర్భితంగా మందహాసం చేశాడు. అతను నిన్న తన మిత్రుడి పట్ల చూపించిన నిజమైన సానుభూతిని పూర్తిగా మర్చేపోయాడు. ఇప్పుడు అదే సానుభూతి వ్రాన్‌స్కీపట్ల కలిగింది. "అవును ఒక కారణం వల్ల అతను ప్రత్యేకం సంతోషితుడో లేక దుఃఖితుడో అయివుంటాడు."

వ్రాన్‌స్కీ నడుస్తూ నడుస్తూ వున్నవాడు. ఆగి కచ్చితంగా అడిగేడు.

"ఏమిటది? అతను నిన్న సాయంత్రం మీ belle soeur[1] దగ్గర పెళ్ళి ప్రస్తావన చేశాడంటావా?"

"చేసి వుండచ్చు. నిన్న అలా చెయ్యబోతున్నాడనే అనుకున్నాను. అవును, అతను పెంద రాళే వెళ్ళిపోయేడూ, చిరాగ్గా వున్నాడు అంటే అంతే అయివుండాలి. అతనామెని చాలా కాలంగా ప్రేమిస్తున్నాడు. అతనంటే నాకు బాధగా వుంది" అన్నాడు అబ్లాన్‌స్కీ.

"ఓ అదన్నమాట సంగతి!... కాని యేమైనా తనకి యింతకంటె మంచి సంబంధం కుదురుతుందని ఆమె ఆశించవచ్చని నేననుకుంటున్నాను" అన్నాడు వ్రాన్‌స్కీ. మళ్ళీ ఛాతీ పొంగరించుకుని నడక సాగించేడు. "అయినా నాకతను తెలీదు" అని జత చేశాడు. "ప్,

[1] మరదలు (ఫ్రెంచి).

చాల చిక్కు పరిస్థితే. అందుకనే చాలమంది మగాళ్ళు రంగేళీల్లాంటి వాళ్లతో వుండడానికి యిష్టపడతారు. అక్కడ దెబ్బ తిన్నామనుకో బాధలేదు, నీ జేబు దండిగా 'లేదన్నమాట. యిక్కడో? నీ గౌరవం, ఆత్మాభిమానం గంగపాలయిపోతాయి. అదుగో రైలు వచ్చేసింది'' అన్నాడు.

రైలింజను దూరంనుంచి కూతవేసింది. కొన్ని క్షణాల తరువాత రైలింజను థనథన మంటూ, పొగలు చిమ్ముతూ రాగానే ప్లాట్‌ఫాం అదిరింది. ఇంజను వదిలిన పొగ మేఘాలు మంచువల్ల దిగువకి ఒత్తుకు పోతున్నాయి. ఇంజను పిష్టన్ కడ్డీ మెల్లిగా లోపలికి పోతూ, బయటికి వస్తూ కదుల్తోంది. ఇంజను డ్రైవరు వెచ్చగా వుండే బట్టలు కప్పుకున్నాడు. అతని మీద మంచు కమ్మింది. ధీరుగా వున్నాడు. అతను లోపలినుంచి యివతలకి చూస్తూ అందరికీ సలాం చేస్తూ కిటికీకి ఆనుకుని వున్నాడు. రైలు వేగం తగ్గే కొద్దీ ప్లాట్‌ఫాం యింకా యెక్కువగా అదిరింది. బొగ్గు వున్న పెట్టె, లోపలనుంచి కుక్కపిల్ల కుంయ్యోమంటూ యివతలకి రాబోతూ వున్న లగేజ్ వాన్, ఆ తర్వాత ప్రయాణీకుల పెట్టెలూ వున్న రైలు కుదుపుకొని ఆగింది.

చురుకుగా వున్న కండక్టరు యీల వూదుతూ పెట్టె మెట్లమీదనుంచి దిగేడు. అంపి పోయి చికాగ్గా వున్న ప్రయాణీకులు ఒకళ్ల తరువాత ఒకళ్లు దిగేరు. ఒకతను గార్డు దళంలో ఆఫీసరు. కఠినంగా అటూ యిటూ చూస్తూ నిబ్బరంగా, నిటారుగా వున్నాడు. ఓ చిన్న వ్యాపారస్థుడు కులాసాగా చిరునవ్వు నవ్వుతూ సంచీ పట్టుకు దిగేడు. ఓ రైతు భుజంమీద మూట యెత్తుకుని దిగేడు.

రైలు పెట్టెల్నీ ప్రయాణీకుల్నీ చూస్తూ వ్రాన్‌స్కీ అబ్లాన్‌స్కీ పక్క నుంచు న్నాడు. తల్లి గురించి అసలు మరిచేపోయాడు. కిట్టీ గురించి విన్న విషయం అతనికి ఉత్తేజం కలిగించింది. సంతోషం కలిగించింది. అతని ఛాతీ పొంగింది. కళ్లు మెరిసాయి. తను ఒక విజేత అయినట్టు భావించుకున్నాడు.

"కౌంటెస్ వ్రాన్‌స్కీ వారు ఆ పెట్టెలో వున్నారు'' అంటూ చురుకుగా వున్న కండ క్టరు వ్రాన్‌స్కీ దగ్గరికి వస్తూ అన్నాడు.

కండక్టరు మాటలకి అతను మళ్లీ యీ లోకంలోకి వచ్చేడు. తల్లి గురించి జ్ఞాపకం వచ్చింది. తను ఆవిడని కలుసుకోవటం కోసం వచ్చేడని గుర్తుకొచ్చింది. అంతరంగంలో అతనికి తల్లిపట్ల గౌరవం లేదు, ఆవిడపట్ల ప్రేమా లేదు. కాని అలా అని అంటే ఒప్పు కోడు. తన పెంపకం వల్లా, తను కలిసి మెలిసి తిరిగే బృందంలోని మర్యాదలవల్లా ఆవిడ పట్ల వినయవిధేయతల్ని మాత్రం ప్రదర్శిస్తాడు. తల్లీ కొడుకుల మధ్య సంబంధాలు వేరే రకంగా వుంటాయనే వూహే అతనికి లేదు. మనస్సులో బాగా తక్కువ ప్రేమాభిమానాలు ఆవిడ పట్ల ఉన్నా, పైకి యెంతో వినయవిధేయతలు చూపిస్తాడు.

18

వ్రాన్‌స్కీ కండక్టరు వెనకాలే పెట్టెలోకి వెళ్లాడు. ఎవరో ఒకావిడ యివతలికి వస్తోంది. ఆవిడకి దారి యివ్వడం కోసమని గుమ్మం దగ్గర పక్కకి తప్పుకుని ఆగేడు. ఆవిడ రూపు రేఖల్ని బట్టి వ్రాన్‌స్కీ ఒక్కసారి చూడ్డంతోటే ఆవిడ ఉన్నత సమాజంలో ప్రతిష్ఠిత మైన మహిళ అని గ్రహించాడు. క్షమించండన్నట్లుగా గొణిగి పెట్టె లోపలికి అడుగు పెట్టబోయాడు. ఆ క్షణంలోనే ఆమెని మళ్లీ చూడాలని ప్రేరణ కలిగింది. ఆమె గొప్ప అందకత్తె అని కాదు; ఆవిడ మొత్తం మూర్తిలో ద్యోతకమయే లావణ్యం వల్లా, వినమ్ర మనోహరత్వం వల్లా కూడా కాదు. తన పక్కనుంచి వెళ్లేటప్పుడు ఆమె కమనీయ వదనంలో వ్యక్తం అయిన అసామాన్య కోమలత్వంవల్లా, రామణీయకతవల్లా మళ్లీ చూడాలని అతనికి ప్రేరణ కలిగింది. అతను తన వేపు తిరగ్గానే ఆమె కూడ అతని వేపు తల తిప్పింది. ఆమె కళ్లు రజిత వర్ణంగా, ప్రకాశమానంగా వున్నాయి. గుబురుగా వున్న పక్ష్మాలవల్ల నల్లగా కనిపించాయి. ఆ కళ్లు అతని ముఖంమీద — అతను ఆ కళ్లనే చూస్తూ వున్నాడు — ఒక క్షణంపాటు స్నేహపూర్వకమైన శ్రద్ధ కనబరుస్తూ చూపు సారించాయి, అతన్ని గుర్తుపట్టినట్టుగా. మరు క్షణంలో యెవరికోసమో వెతుకుతున్నట్టు జనసమూహం కేసి మళ్లాయి. ఆ లిప్తకాలంలోనే ఆమె వదనంమీద లాస్యం చేసిన సంయమిత ఉత్సాహాన్ని అతను గమనించేడు. తేజోవంతమైన కళ్లల్లో తాణికిసలాడిన జీవచైతన్యాన్ని గమనించేడు. ఆమె అరుణాధరాల్ని వొంపు తిప్పుతూ లీలగా భాసింపచేసిన మందహాసాన్ని గమనించేడు. ఆమె మొత్తం మూర్తిలో యేదో ఉప్పొంగి వస్తూవున్నట్టూ, అది ఆమె యిష్టానిష్టాల ప్రమేయం లేకుండానే ఆమె చిరునవ్వులోనూ, కళ్ల తేజస్సులోనూ వ్యక్తం అయినట్టూ వుంది. ఆమె ప్రయత్నపూర్వకంగా కళ్లల్లోని ఆ దీప్తిని ఆర్పింది. అయినా ఆమె యిష్టానిష్టాలకి వ్యతిరేకంగానే అది లీలగా భాసితమయే ఆమె చిరునవ్వులో ప్రకాశించింది.

వ్రాన్‌స్కీ పెట్టెలోకి వెళ్లాడు. అతని తల్లి బక్కపల్చటి మనిషి, పెద్దావిడ. ఆవిడ కళ్లు నల్లగా వున్నాయి. ఆవిడ ఉంగరాల జుట్టు ముఖంమీద పడుతోంది. ఆవిడ కళ్లు మిటకరించి కొడుకుకేసి చూసింది. పల్చని పెదాలతో సన్నగా చిరునవ్వు నవ్వింది. తన సీట్లో నుంచి లేచి హాండ్ బేగ్‌ని పనిమనిషికి యిచ్చింది. అతనికి తన చేతిని అందించింది, ముద్దు పెట్టుకుందామని కొడుకు చేతిమీదకి వంగగానే ఆవిడ అతని తలని పైకెత్తి నొసలు ముద్దు పెట్టుకుంది.

"నేనిచ్చిన టెలిగ్రాం అందిందా? బాగున్నావా? దేవుడి దయ" అంది.

"ప్రయాణం బాగా జరిగిందా?" అని ఆవిడ పక్కన కూర్చుంటూ అడిగాడతను. తలుపు అవతలినుంచి ఒకామె కంఠస్వరాన్ని అప్రయత్నంగానే విన్నాడు. అది తను లోపలికి వచ్చేటప్పుడు యెదురైన ఆమె కంఠం అని అతనికి తెలుసు.

"అయినా మీరన్న మాట ఒప్పుకోలేను" అంటోంది.

"పీటర్స్‌బర్గ్ దృష్టి వదిలెయ్యండి, మేడమ్."

"పీటర్స్‌బర్గ్‌ది కాదు, ఒక ఆడమనిషి దృష్టి" అందామె.

"సరే తమ హస్తాన్ని చుంబించే భాగ్యం కలిగించండి."

"సెలవ్ ఇవాన్ పెత్రోవిచ్. మా తమ్ముడు కనిపిస్తాడేమో చూడండి. కనిపిస్తే యిక్కడకు పంపించండి" అందామె గుమ్మం దగ్గరనుంచే. మళ్లీ పెట్టెలోకి వచ్చింది.

"మీ తమ్ముడు కనిపించాడా?" అని వ్రాన్‌స్కీ తల్లి అడిగింది.

ఈవిడే అన్నా కరేనినా అని యిప్పుడు వ్రాన్‌స్కీకి అర్థమైంది.

"మీ తమ్ముడు యిక్కడే వున్నాడు" అన్నాడతను లేస్తూ. "మిమ్మల్ని వెంటనే గుర్తుపట్టనందుకు యేమీ అనుకోకండి. మన పరిచయం కూడ చాల తక్కువ" అంటూ అతను గౌరవసూచకంగా వంగి వందనం చేశాడు. "నేను మీకు గుర్తుండి వుండను, ఆఁ" అన్నాడు.

"ఓ, మిమ్మల్ని గుర్తుపట్టి వుండేదాన్ని. ప్రయాణం అంతా మీ అమ్మగారూ, నేనూ మిమ్మల్ని గురించి తప్ప వేరే యెవళ్ల గురించీ మాట్లాడుకోలేదు" అందామె. బయట పడాలని ప్రయత్నించే తన ఉత్సాహాన్ని చిరునవ్వు నవ్వి తెలియజేసింది. "ఇంకా మా తమ్ముడు రాలేదేమిటో" అంది.

"అల్యోష, వెళ్లి అతన్ని పిలుచుకురా" అందా పెద్దావిడ.

వ్రాన్‌స్కీ ప్లాట్‌ఫాంమీదకి వెళ్లాడు.

"అబ్లాన్‌స్కీ! యిటు!" అని పిలిచాడు.

కాని తమ్ముడు అక్కడికి వచ్చేదాకా అన్నా కరేనినా ఆగలేదు. అతను కనిపించగానే ఆమె నిబ్బరంగా, లాఘవంగా అడుగులు వేస్తూ పెట్టెలోనుంచి యివతలికి వచ్చేసింది. అతను ఆమె దగ్గరికి రాగానే, ఆమె తన యెడమ చేతిని అతని మెడమీద వేసి, తలవంచి గట్టిగా ముద్దుపెట్టుకునే పొగుసునీ, బింకాన్నీ చూసి వ్రాన్‌స్కీ విస్తుపోయాడు. వ్రాన్‌స్కీ తన చూపు మళ్లించుకోలేకపోయాడు. ఎందుకు చిరునవ్వు నవ్వేడో తెలియకుండానే చిరునవ్వు నవ్వేడు. కాని వెంటనే తల్లి తనకోసం చూస్తోందని గుర్తుకొచ్చి మళ్లీ పెట్టెలోకి వెళ్లాడు.

"ముచ్చటగా వుంది కదూ?" అని అన్నాని ఉద్దేశిస్తూ తల్లి అంది. "వాళ్లాయన ఆమెని నా పక్కన కూర్చోబెట్టాడు. నాకు చాల సంతోషం కలిగింది. ప్రయాణం అంతా మాట్లాడుకుంటూనే వున్నాం. నీ గురించి విన్నాను. నువ్వు... vous filez le parfait amour. Tant mieux, mon cher, tant mieux.[1]"

"మీరు దేన్ని గురించి ఉద్దేశిస్తున్నారో నాకు తెలీదు అమ్మా" అన్నాడతను పెడసరంగా. "రండి అమ్మా వెడదాం" అన్నాడు.

---

[1] నీకింకా ఆదర్శ ప్రేమ గాథ సాగుతోంది. మేలు నాయనా, మేలు (ఫ్రెంచి).

కౌంటెస్ దగ్గర సెలవు తీసుకు వెడదామని అన్నా మళ్లీ లోపలికి వచ్చింది.

"ఊ, మరి, మీ అబ్బాయి మిమ్మల్ని కలుసుకున్నాడు. మా తమ్ముడు నన్ను కలుసుకున్నాడు" అందామె హుషారుగా. "ఇక నే చెప్పగల కథలూ అయిపోయాయి, యేమీ మిగల లేదు" అంది.

"అయ్యో" అంది కౌంటెస్ ఆమె చేతిని అందుకుంటూ. "భూమి అంచులదాకా విసుగనిపించకుండా మీతో కలిసి ప్రయాణం చేస్తాను. మాట్లాడుతూ వున్నా, మౌనంగా వున్నా కూడా సంతోషం కలిగించే ఆహ్లాదకరమైన ఆడవాళ్ల కోవలో వాళ్లు మీరు. మీ కొడుకు గురించి బెంగపడకండి. అప్పుడప్పుడు ఒక్కణ్ణీ విడిచిపెట్టి వుండాలి మరి" అందావిడ.

అన్నా కరేనినా నిశ్చలంగా, నిబ్బరంగా నుంచుంది. ఆమె కళ్లు మందహాసం చేసాయి.

"అన్నా కరేనినాగారికి యెనిమిదేళ్ల కొడుకున్నాడు. వాణ్ణి వదిలిపెట్టి యెప్పుడూ వుండలేదుట. అందుకని ఒకటే బాధ పడిపోతోంది" అని కౌంటెస్ తన కొడుక్కి వివరించి చెప్పింది.

"అవును, ఆవిడా నేనూ యెడతెరిపి లేకుండా మాట్లాడుకున్నాం; ఆవిడ తన కొడుకు గురించి, నేను నా కొడుకు గురించి" అంది అన్నా కరేనినా. మళ్లీ ఆమె ముఖం మందహాసంతో వెలిగింది, అతని కోసం ఉద్దేశించిన స్నేహపూర్వక మందహాసంతో.

"మీకు చాల విసుగనిపించి ఉండాలే మరి!" అన్నాడు వ్రాన్స్కీ. తన వేపు ఆమె విసరిన మిటారి చూపు కందుకాన్ని అందుకున్నాడు. కాని అదే ధోరణిలో సంభాషణ కొనసాగించడం యిష్టం లేనట్టు కనిపించింది ఆమె. కౌంటెస్‌కేసి తిరిగింది.

"మరి వుంటా. నిన్న ప్రయాణం అంతా యెలా గడిచిందో తెలియనే లేదు; నమస్తే కౌంటెస్" అంది.

"మంచిదమ్మా, మీ ముచ్చటైన ముఖాన్ని ముద్దుపెట్టుకోనియ్యండి. మీకు దాపరికం లేకుండా చెప్తున్నాను, పెద్దవాళ్లన్నట్టు. మీరంటే నాకు యెంతో ప్రేమ కలిగింది" అందావిడ.

ఆ మాటలు యేదో ముఖ ప్రీతికోసం యెప్పుడూ వుండేలాంటివే, అయినా అన్నా వాటిని నిజం అయినట్టుగా గ్రహించింది. సంతోషించింది. ఆమె ముఖం కెంపెక్కింది. కౌంటెస్ పెదాలకి తన ముఖాన్ని అందించడానికి వంగింది. మళ్లీ నిటారుగా నిలబడింది. కళ్ల మధ్యా, పెదాల మధ్యా తొణికిసలాడే అదే చిరునవ్వు నవ్వుతూ వ్రాన్స్కీకి చేతిని అందించింది. తనకి అందించిన ఆ చిన్న చేతిని అతను అదిమాడు. అన్నా యెంతో దృఢంగా, సాహసంతో అతని చేతిని అదిమింది, అది అతనికి విశేషంగా తోచి సంతోషం కలిగింది. తర్వాత ఆమె తన మొత్తం స్థౌల్యపూరిత మూర్తికి ప్రత్యేక లఘిమని కూర్చిన శీఘ్రగమనంతో బయటకు వెళ్లిపోయింది.

"చాల సొగసైంది" అంది కౌంటెస్.

కొడుకు అభిప్రాయం కూడ అదే. అతని పెదాలమీద యింకా చిరునవ్వు లాస్యం చేస్తూనే

వుంది. అలాగే అతను ఆమె తీరైన రూపం అదృశ్యం అయేదాకా ఆమెని కళ్ళతో అను సరించాడు. ఆమె తమ్ముణ్ని కలుసుకోవడం కిటికీలోనుంచి చూశాడు. ఆమె తమ్ముడికి చేతిని అందించింది. ఎంతో ఉత్సాహంగా అతనితో యేమిటేమిటో చెప్తోంది. బహుశా ఆమె చెప్పే దానికీ వ్రాన్‌స్కీకీ యేమీ సంబంధం వుండి వుండదు, అనిపించి వ్రాన్‌స్కీకి నిరుత్సాహం కలిగించింది.

"ఊఁ, maman బాగున్నారు కదా?" అంటూ తల్లికేసి తిరిగి మళ్లీ అడిగాడు.

"దివ్యంగా. అంతా బ్రహ్మాండంగా వుంది. అలెగ్జాండర్ చాలా బాగా చూశాడు. మారి చాలా మారింది; నిజానికి యెంత అందం వచ్చిందని."

మరోసారి ఆమె తనకి యిష్టమైన వాటి గురించి మాట్లాడ్డం మొదలు పెట్టింది. తన మనవడి బారసాల గురించి మాట్లాడింది. అందుకోసమే ఆవిడ పీటర్స్ బర్గ్‌కి వెళ్లింది. జార్ తన పెద్దకొడుకు పట్ల చూపిన ఆదరం గురించి మాట్లాడింది.

"ఇదుగో ల్వ్రేంతి" అన్నాడు వ్రాన్‌స్కీ కిటికీలోనుంచి బయటికి చూస్తూ. "మీరు ఊఁ అంటే మనం వెళ్లచ్చు" అన్నాడు.

వృద్ధ కౌంటెస్‌కి ప్రయాణంలో తోడుగా వెళ్లిన ఆ ముసలి బట్లర్ పెట్టెలోకి వచ్చేడు. అంతా సిద్ధంగా వుందని చెప్పేడు. ఆమె రైలు దిగడానికని లేచింది.

"రండి, జనం తగ్గేరు" అన్నాడు వ్రాన్‌స్కీ.

పనిపిల్ల సంచినీ, కుక్కనీ పట్టుకుంది. బట్లరూ, కూలిమనిషీ మిగిలిన సమ్నాను అందుకున్నారు. వ్రాన్‌స్కీ తల్లికి చేతిని అందించేడు. వాళ్లు పెట్టె యివతలకు రాబోతు న్నారు. ఇంతలోకి కొంతమంది మనుషులు పక్కనుంచి పరిగెత్తి వెళ్లారు. వాళ్లు భయపడి పోయినట్టు వున్నారు. వింతయిన రంగు టోపీ పెట్టుకున్న స్టేషన్ మాస్టర్ కూడా పరి గెత్తేడు.

ఏం జరిగిందో మరి. అప్పడే రైలు దిగిన జనం కూడా వెనక్కి పరిగెత్తేరు.

"ఏమిటి?.. ఏమిటి?.. ఎక్కడ?.. తనే పడ్డాడా?.. మీదనుంచి రైలు వెళ్లిపోయిందా?.." అనే మాటలు వాళ్ల చెవుల బడ్డాయి.

అబ్లాన్‌స్కీ అక్కగారి చేతిని అనుకొని వెనక్కి అడుగేశాడు. ఇద్దరి ముఖాల్లోనూ భయం కనిపిస్తోంది. ఇద్దరూ జనాన్ని తప్పించుకుందామని పెట్టె గుమ్మం దగ్గర నుంచు న్నారు.

ఆడవాళ్లు తిరిగి పెట్టెలోకి వెళ్లారు. మగాళ్లిద్దరూ ఆ ప్రమాదం వివరాలేమిటో తెలుసుకుందామని జనం వెనక వెళ్లేరు.

ఒక వాచ్‌మెన్ తాగే వున్నాడో లేకపోతే గజగజ ఊపేసే చలికి గట్టిగా బిగించేసుకోవడం వల్ల వినిపించలేదో వెనక్కి వచ్చే రైలుకింద పడిపోయాడు.

వ్రాన్‌స్కీ, అబ్లాన్‌స్కీ యీ సమాచారం పట్టుకుని పెట్టె దగ్గరికి వచ్చేటప్పటికే ఆడవాళ్లకి బట్లర్‌ద్వారా అది తెలిసింది.

మగాళ్లిద్దరూ ముక్కలైపోయిన శవాన్ని చూసేరు. అబ్లాన్‌స్కీ గాఢంగా చలించి పోయాడు. అతని ముఖం ముడుచుకు పోయింది. కళ్లల్లో నీళ్లే తక్కువ.

"ఎంత భయంకరంగా వుంది! అన్నా! నువ్వు చూసి వుంటేనా! ఎంత భయంకరంగా వుంది!" అంటూనే వున్నాడతను.

వ్రాన్‌స్కీ యేమీ మాట్లాడలేదు. అందమైన అతని ముఖం గంభీరంగా వుంది. కాని చాలా శాంతంగా వుంది.

"మీరు చూసి వుంటేనా, కౌంటెస్" అని అబ్లాన్‌స్కీ అంటూనే వున్నాడు. "అతని పెళ్లాం వుందక్కడ... గుండెలు తరుక్కుపోతాయి ఆమెని చూస్తే... శవంమీద పడి పోయింది. పెద్ద కుటుంబం! యితనే ఆధారమట. ఇది దారుణం కదూ!" అన్నాడు.

"వాళ్లకి మనమేం చెయ్యలేమా?" అని ఆందోళనగా గొణుగుతూ అంది అన్నా.

వ్రాన్‌స్కీ ఆమె కేసి చూసి వెంటనే పెట్టెలోంచి అవతలకి వెళ్లిపోయాడు.

"నేనిప్పుడే వస్తా, maman" అని గుమ్మం దగ్గర వెనక్కి తిరిగి అన్నాడు.

కొన్ని క్షణాల తరువాత తిరిగి వచ్చేడు. అప్పటికి అబ్లాన్‌స్కీ కొత్త గాయకి యెవరి గురించో కౌంటెస్‌కి చెప్తున్నాడు. ఆమె మాత్రం కొడుకు కోసం గుమ్మం కేసే చూస్తూ వుంది.

"పదండి వెడదాం" అన్నాడు వ్రాన్‌స్కీ లోపలికి వస్తూ.

అందరూ కలిసే బయటికి వెళ్లేరు. వ్రాన్‌స్కీ తల్లితో కలిసి ముందు వెళ్లేడు. అన్నా కరేనినా తమ్ముడితో కలిసి వెనక వెళ్లింది. స్టేషన్ బయటికి వెళ్లిపోతూ వుండగా స్టేషన్ మాస్టర్ వచ్చి వ్రాన్‌స్కీని అందుకున్నాడు.

"మీరు మా అసిస్టెంట్‌కి రెండు వందల రూబుళ్ళు యిచ్చారా? దయచేసి ఆ సొమ్మును యెవరికి అందజెయ్యాలో చెప్తారా?"

"ఆ వితంతువుకి!" అన్నాడు వ్రాన్‌స్కీ యేమిటలా అడుగుతావ్ అన్నట్టు భుజాలు యెగరేస్తూ. "అయినా యిందులో అడగాల్సిందేముందో నాకు అర్థం అవడం లేదు" అన్నాడు.

"మీరిచ్చారా?" అన్నాడు అబ్లాన్‌స్కీ వెనకనుంచి. అక్కగారి చేతిని నొక్కి "చాల బాగుంది, చాల బాగుంది! భేష్నైనవాడు, ఏం? మంచిది, సెలవ్ కౌంటెస్" అన్నాడు.

అతనూ, అక్కగారూ ఆమె పనిమనిషి కోసం ఆగేరు.

స్టేషన్ యివతలకి వచ్చేటప్పటికి వ్రాన్‌స్కీల బండి వెళ్లిపోయింది. స్టేషన్‌లోనుంచి వచ్చే జనం యింకా ఆ ప్రమాదం గురించే మాట్లాడుకుంటున్నారు.

"ఎంత ఘోరమైన చావనుకున్నావు! రెండుగా తెగిపోయిందట శరీరం" అన్నాడొకతను పక్కనుంచే వెడుతూ.

"ఘోరమేముంది. మహాయాన మరణం. క్షణంలో" అన్నాడింకో అతను.

"పరిమైన జాగ్రత్తలు యెందుకు తీసుకోరో?" అని మూడో అతను అన్నాడు.

అన్నా కరేనినా బండిలోకి యెక్కేటప్పుడు ఆమె పెదాలు వొణకడం, ఆమె కన్నీళ్లని ఆపుకోలేకపోవడం అబ్లాన్‌స్కీ చూశేడు. అతనికి ఆశ్చర్యం కలిగింది.

"ఏమిటది, అన్నా?" అని బండి కొంచెం దూరం వెళ్లాక అడిగాడు.

"ఇది దుశ్శకునం" అందామె.

"ఏం పనికి మాలిన మాటలంటావ్! ముఖ్యమైంది నువ్వు రావటం. నీమీద యెంత ఆశలు పెట్టుకున్నానో నీకు తెలీదు" అన్నాడు.

"వ్రాన్‌స్కీని చాల కాలంగా యెరుగుదువా?" అని అడిగింది.

"ఆఁ. అతను కిట్టీని పెళ్లి చేసుకుంటా డనుకుంటున్నాం."

"అలాగా" అంది అన్నా మెత్తగా. "పూఁ సరే, నీ సంగతి చెప్పు" అంది. ఏదో అనిష్టమైందాన్నుంచి, తనని యిబ్బంది పెట్టిన దాన్నుంచి బయటపడాలని శారీరక ప్రయత్నం చేస్తున్నట్టు, తల కొంచెం యెగరేసింది. "ఊఁ, నీ విషయాం గురించి మాట్లాడుకుందాం. నీ ఉత్తరం అందింది. వచ్చాను" అంది.

"నా ఆశలు నీ మీదే వున్నాయి" అన్నాడు అబ్లాన్‌స్కీ.

"మొత్తం అంతా చెప్పు."

అతను కథ మొదలుపెట్టేడు.

బండిలో ఇంటి దగ్గరకు వెళ్లగానే అక్కగారు దిగడానికి సాయం చేశాడు. హమ్మయ్య అనుకున్నాడు. ఆమె చేతిని నొక్కాడు. ఆఫీసుకి బయలుదేరాడు.

19

అన్నా డ్రాయింగ్ రూమ్‌లోకి వెళ్లింది. దాలీ చిన్న కుర్రాణ్ణి పెట్టుకుని కూర్చుంది. వాడు బొద్దుగా వున్నాడు. వాడి జుట్టు బంగారు రంగులో వుంది. వాడిలో అప్పటికే తండ్రి పోలికలు కన్పిస్తున్నాయి. ఫ్రెంచి పాఠం చదువుతున్నాడు. దాలీ వింటోంది. చదువుతూ, చదువుతూ వాడు చొక్కా బొత్తం వొకటి వదులుగా వుంటే, దాన్ని మెలి తిప్పుతున్నాడు. దాన్ని వూడబీకబోతున్నాడు. చాల సార్లు తల్లి వాడి చేతిని దానిమీదనుంచి తోసేసింది. కాని బొద్దుగా వున్న వేళ్లు మళ్లీ బొత్తాంమీదకే పోతూ వున్నాయి. ఆఖరికి చిరాకెత్తి ఆమె దాన్ని వూడబీకి, తన గౌను జేబులో పెట్టుకుంది.

"కుదురుగా కూర్చోలేవు గ్రీష" అంది. మళ్లీ తన పని అందుకుంది. ఎంతో కాలంగా అల్లుతూ వున్న లేసు అది. తనకి ఎప్పుడు ఆందోళనగా వున్నా, ఆ పని అందుకుంటూ వుంది. ఇప్పుడు కంగారు కంగారుగా అల్లుతోంది. వేళ్ల విదిలిస్తూ కుట్లు లెక్కపెడుతూ

అల్లుతోంది. అంతకు ముందు రోజున భర్తకి కబురుచేసింది అతని అక్కగారి రాకతో తన కేమీ సంబంధం లేదని. అయినా కూడా అంతా సిద్ధం చేసుకొని ఆమె రాకకోసం ఆతృతగా చూస్తోంది.

డాలీ తన కష్టంలో మునిగిపోయింది. పూర్తిగా వివశమైపోయింది. అయినా అన్నాని మరిచిపోలేదు. అన్నా తన వదినగారు, ఘనమైన మహిళ, పీటర్స్‌బర్గ్‌లో ప్రఖ్యాతుడైన వ్యక్తి భార్య. అందుకనే తను చేస్తానని భర్తని బెదిరించిన పని చెయ్యలేదు. అంటే తన ఆడబడుచు వస్తున్న విషయం మర్చిపోలేదు. 'యింతకీ అన్నా తప్పేముంది?' అనుకొంది డాలీ. 'ఆమె గురించిన మంచి విషయాలు తప్ప అంతకు మించి మరేమీ యెరగను. నాపట్ల చాలా ప్రేమగా వుంటుంది, స్నేహంగా వుంటుంది.' పీటర్స్‌బర్గ్‌లో కరేనిన్ల యింటికి చుట్టపు చూపుగా వెళ్లినప్పుడు ఆమెకి కలిగిన భావాలు వేరు, నిజమే. వాళ్ల సంసారం ఆమెకి నచ్చలేదు. వాళ్ల కుటుంబ జీవితంలో యేదో వెలితిగా వుంది అనిపించింది. 'అయినా ఆమెని యే కారణంవల్ల ఆదరించకుండా వుండగలను? నన్ను ఓదార్చడానికి ప్రయత్నించ కూడదామె అంతే' అనుకొంది డాలీ. 'ఈ ఊరడింపులూ, బోధలూ, క్రైస్తవ క్షమ — ఇవా తొంభై సార్లు అనుభవించి వుంటాను, లాభం లేదు' అనుకొంది.

గత కొద్ది రోజులుగా డాలీ తన పిల్లలతోనే గడుపుతోంది. తన దుస్థితి గురించి మాట్లాడ్డం ఆమెకి యిష్టం లేదు. కాని గుండెలో అంతటి బాధ పెట్టుకొని, మరి దేన్ని గురించీ మాట్లాడ లేకపోయింది. ఏదో విధంగా అన్నాకి సర్వమూ తను చెప్పేస్తుందని ఆమెకి తెలుసు. తన కష్టాలన్నీ వెళ్లబోసుకునే అవకాశం కదా అని ఓ క్షణం సంతోషపడేది. తర్వాత క్షణంలో తను ఆమెకి — అతని అక్కగారికి — తన అవమానం గురించి చెప్పాల్సి వచ్చినందుకూ, అరిగిపోయిన ఓదార్పు మాటలూ, సలహాలూ వినవలసి వచ్చినందుకూ ఆమెకి కోపం వచ్చేది.

ఆడపడుచు యెప్పుడు వస్తుందా అని క్షణక్షణం గడియారంకేసి చూస్తూనే గడిపింది డాలీ. కాని మామూలుగా జరిగేటట్టుగానే, అసలు ఆమె వచ్చే వేళకి యేదో ధ్యాసలో వుండి గంట మోగడం విననే లేదు.

గౌను రెపరెపలు, గుమ్మంలో తేలిగ్గా అడుగులు వేస్తూ యెవరో వస్తూ వున్న చప్పుడు వినిపించి, కళ్లు పైకెత్తి చూసింది. దిగులుపడ్డ ఆమె ముఖంలో ఆనందం కంటే ఆశ్చర్యమే కనిపించింది. లేచి ఆడబిడ్డని కౌగలించుకుంది.

"అరె! వచ్చేశావు!" అని డాలీ ఆమెని ముద్దుపెట్టుకుంటూ అంది.

"నిన్ను చూడ్డం యెంత సంతోషంగా వుంది, డాలీ!"

"నాకూ సంతోషంగా వుంది" అంది డాలీ. అన్నా ముఖం చూసి విషయం ఆమెకి తెలుసునా లేదా అని వూహించ ప్రయత్నిస్తూ నీరసంగా చిరునవ్వు నవ్వింది. అన్నా సానుభూతిగా చూడ్డం గమనించి, 'మూడు వంతులు తెలిసే వుండాలి' అనుకొంది. "రా, నీ గది

చూపిస్తా'' అంది. మనసులో మాట చెప్పేటప్పుడే క్షణాన్ని వాయిదావెయ్యడానికి చూసింది.

''పిడు గ్రీష కదూ? బాప్‌రే, యెంత యెదిగాడు!'' అంది అన్నా. దాలీ మీదనుంచి దృష్టి తప్పించుకోకుండానే వాణ్ణి ముద్దుపెట్టుకుంది. తర్వాత ఆగి, సిగ్గుపడింది. ''వద్దు, యిక్కడే వుండనియ్యి'' అంది.

స్కార్ఫుని, టోపీని తీసేసింది. నల్లని ఉంగరాల జుట్టు కొంచెం టోపీలో చిక్కుకుంది. దాని విడదియ్యడానికి తల ఆడించింది.

''ఆనందంతో, ఆరోగ్యంతో మిసమిసలాడి పోతూ వున్నావు'' అంది దాలీ దాదాపు అసూయగా.

''నేనా?... ఆఁ!'' అంది అన్నా. ''అరె! తాన్యాయేనా! మా సెర్యోష యీడుదే'' అంది లోపలికి పరిగెట్టుకుంటూ వచ్చే వో చిన్న పిల్లని చూసి. ఆ పిల్లని చేతుల్లోకి తీసుకుని ముద్దుపెట్టుకుంది. ''ముద్దొచ్చే పిల్ల, ముద్దొచ్చే పిల్ల! అందర్నీ చూపించు'' అంది.

పేరుపేరునా అందర్నీ పలకరించింది. పేర్లు గుర్తుపెట్టుకోవడమే కాదు, వాళ్ల పుట్టిన తిథులు నక్షత్రాలు, యెవళ్లు యెలా వుండిందీ ఆ వివరాలు, వాళ్లు యే నలతలతో బాధపడ్డారో అన్నీ గుర్తుగా చెప్పింది. దాలీ మెచ్చుకోకుండా వుండలేకపోయింది అది చూసి.

''బాగుంది, పద వాళ్ల గదిలోకి వెడదాం. అయ్యో, వాస్య నిద్ర పోతున్నాడే అత్తని పలకరించకుండా!'' అంది.

పిల్లల్ని చూశాక యిద్దరూ డ్రాయింగ్ రూమ్‌లో కాఫీ తాగడానికి చేరారు. అన్నా ట్రేని అందుకుని మళ్లీ దాన్ని పక్కకి తోసేసింది.

''దాలీ, వాడు నాకు చెప్పాడు'' అంది.

దాలీ నిరుత్సాహంగా అన్నా కేసి చూసింది. సానుభూతిపూర్వకమైన అనునయ వాక్యాలు చెప్తుందని దాలీ చూస్తోంది. కాని అన్నా ఆ మాటలు అనలేదు.

''అమ్మా దాలీ. వాణ్ణి వెనకేసుకు వచ్చే ఉద్దేశమూ లేదు నాకు, నిన్ను వూరడించే ఉద్దేశమూ లేదు. అది అసాధ్యం. కాని నాకు బాధగా వుందమ్మా, నువ్వింతలా బాధపడ్డం నాకు చాలా విచారంగా వుందంటే నమ్ము'' అంది.

చమక్కుమనే ఆమె కళ్ల గుబురు పక్ష్మాల వెనక కన్నీళ్లు తిరిగాయి. మరదలికి దగ్గరగా చేరి కూర్చుంది. దృఢంగా వున్న తన చిన్న చేతిలోకి ఆమె చేతిని తీసుకుంది. దాలీ వెనక్కి ముడుచుకుపోలేదు. కాని ఆమె ముఖంలో ఆ నిరుత్సాహం అలాగే వుంది.

''నన్ను వూరడించలేవు. యింత జరిగాక మిగిలిందేముంది, అంతా అయిపోయింది'' అంది.

ఆ మాటలనగానే ఆమె ముఖం మెత్తబడింది. దాలీ చేతిని తీసుకుని ముద్దుపెట్టుకుంది అన్నా. ఆ చెయ్యి శుష్కించిపోయి సన్నగా వుంది.

''కాని యేం చెయ్యాలి దాలీ? యేం చెయ్యాలి? యిలాంటి ఘోరమైన పరిస్థితిలో

వున్నంతలో యే మంచి పని చెయ్యాలి అనే దాన్ని గురించి మనం ఆలోచించాలి" అంది.

"అంతా అయిపోయింది, యిక మరి అంతే. పరమ అధ్వాన్నమైన విషయం చూడు, నేను తనని వదిలిపెట్టలేను. పిల్లలున్నారు. కాళ్ళూ, చేతులూ కట్టడిపోయాయి. అతనితో కలిసి కాపరం చెయ్యలేను, అతన్ని చూస్తేనే రగిలి పోతోంది" అంది.

"డాలీ, చూడమ్మా, వాడు నాకు చెప్పాడు. కాని నువ్వు చెప్పేదీ వినాలి కదా నేను. అసలు యేం జరిగిందో అంతా చెప్పు."

డాలీ ఆమెకేసి గుచ్చిగుచ్చి చూసింది.

అన్నా ముఖంలో నిజమైన సానుభూతి, ప్రేమ కనిపించాయి.

"సరే అయితే" అందామె వున్నట్టుండి. "కాని ఓం ప్రథమంనుంచి మొదలెడతాను. నా పెళ్లి నాటికి యెలా వుండేదాన్నో నీకు తెలుసుగా? మా అమ్మ పెంపకం పుణ్యమా అని నేను అమాయకురాలిగా వుండడమే కాదు చిలిపిగా కూడా వుండేదాన్ని. నాకు యేం తెలిసేది కాదు. భర్తలు తమ గత జీవితం గురించి పెళ్లాలకి చెప్తారని అందరూ అనుకుంటూ వుండే వారు అన్నారు. కాని స్త్రీవె మాత్రం" — అని వెంటనే సవరించుకుని "కాని మీ తమ్ముడు మాత్రం నాకు యేం చెప్పలేదు. చెప్తే నువ్వు నమ్మవు గాని నిజం, యిప్పటిదాకా నా ఒక్కర్తి తోనే తను ధర్మం తప్పకుండా వుంటున్నాడని నేను అనుకున్నా. ఎనిమిదేళ్లు అలాగే కాపరం చేశా, అతను యిలా వేరేవాళ్లతో తిరుగుతాడనే అనుమానమే రాలేదు. అలాంటిది అసంభవం అనుకున్నా. యిప్పుడు చూడు. అతన్ని గురించిన వూహలు అలా వుంటే, హఠాత్తుగా యీ ఘోరం, యీ రొచ్చు కనిపించడం... నా బాధ అర్థం చేసుకో. నీ ఆనందం పట్ల సొద్దు లేకుండా నమ్మకం పెట్టుకున్నప్పుడు హఠాత్తుగా..." అంది డాలీ, వెక్కిళ్లు అవుకుంటూ. "యీ ఉత్తరం నా చేతుల్లో పడ్డం.... తన ప్రియురాలికి — నా పిల్లల పంతులమ్మకి — రాసిన ఉత్తరం! అబ్బ, భరించలేం!" గబగబా జేబురుమాలు తీసి ముఖం కప్పుకుంది. "యేదో పొరపాటు చేస్తే సరే నేనర్థం చేసుకోగలను" అని కొంచెం సేపాగింతర్వాత మళ్లీ చెప్పింది. "కాని కావాల్సికి, కుత్సితంగా నన్ను మోసం చెయ్యడం... అదీ యెవర్ని అడ్డంపెట్టుకుని?.. నాకు భర్తగా కాపరం చేస్తూనే ఆమెతో వుండడం! అబ్బ! యింతకంటే ఘోరం వుంటుందా? నీకర్థం కాదు అలాంటిది!" అంది.

"అయ్యో, ఎందుకర్థం కాదు? అర్థమవుతుంది, డాలీ! నిజంగా నేను అర్థంచేసుకో గలను" అంది అన్నా ఆమె చేతిని నొక్కుతూ.

"నా పరిస్థితి యెంత ఘోరంగా వుందో తను అర్థం చేసుకున్నాడంటావా? యేమీ్నా లేదు. తనమట్టుకి తృప్తిగా, సంతోషంగా వున్నాడు" అంది డాలీ.

"అబ్బెబ్బె, లేదు. వాడు విచారంగా వున్నాడు. పశ్చాత్తాపంతో నలిగిపోతున్నాడు" అని అన్నా అడ్డం వెళ్లింది.

"పశ్చాత్తాప పడగలడా అని అసలు?" అని అడిగింది దాలీ. వదినగారి ముఖంకేసి గుచ్చి గుచ్చి చూసింది.

"యెందుక్కాదు? వాడి సంగతి నాకు తెలుసు. వాడంటే బాధగా వుంది నాకు. వాడి సంగతి నీకూ తెలుసు, నాకూ తెలుసు. మనసు మంచిదే కాని అహం. కాని యిప్పుడు మేక పిల్లలా అయిపోయాడు. నన్ను బాగా కదిలించిన విషయం యేమిటంటే..." (దాలీని యేది బాగా కదిలిస్తుందో అన్నా వూహించింది) "...వాడు రెండు విషయాలవల్ల మథన పడి పోతున్నాడు: పిల్లల ముందు తలెత్తుకోలేడు; నిన్ను ప్రేమిస్తూనే నీకు... అవును, నిన్ను భూమ్మీద అన్నిటికంటే యెక్కువగా ప్రేమిస్తున్నాడు" అంది గబగబా దాలీ అభ్యంతరాల్ని తోసెయ్యడానికి. "...నీకు బాధ కలిగించినందుకు, నిన్ను నాశనం చేసినందుకు. 'లేదు, లేదు ఆమె నన్ను యెన్నటికీ క్షమించదు' అంటూనే వున్నాడు" అంది అన్నా.

ఆడపడుచు చెప్పే మాటలు వింటూనే దాలీ యెటో ఆలోచనలో మునిగిపోయి చూసింది.

"అవును, అతని పరిస్థితి దారుణమే. అమాయకులకంటే నేరం చేసినవాళ్ల పరిస్థితి అధ్వాన్నం, అంటే తన తప్పు వల్లనే యీ బాధలన్నీ అని అతనికి అర్థం అయితే. కాని అతన్ని యెలా క్షమించగలను? మళ్లీ యెలా అతనితో కాపరం చెయ్యగలను? అతనితో కలిసి కాపరం చెయ్యడం భరించలేను, యెందుకంటే అతనిపట్ల నాకున్న పూర్వ ప్రేమ యెంత మధురమైంది..."

వెక్కిళ్లవల్ల ఆమెకి మాటలు రాలేదు.

హృదయం తేలికపడిందని ఆమెకి అనిపించిన ప్రతిసారీ, యేదో నిర్బంధంవల్లనన్నట్టుగా, తన దుఃఖం గురించి మళ్లీ చెప్పడం మొదలెట్టింది.

"ఆమె పడుచుది! ముచ్చటగా వుంది! కాని అన్నా, నువ్వే చెప్పు, నా పడుచుదనం, అందం యెలా పోయాయి? తనవల్లా, తన పిల్లలవల్లా. నాకు శక్తి వున్న మేరకి తనకోసం అన్నీ చేశాను. అలా చెయ్యడంలో నా సర్వస్వం అతనికే అర్పించాను. మరిప్పుడు! అవున్లే, తనకి నవనవలాడే ఆ నీచమైన పడుచుది కావాల్సివచ్చింది. నా గురించి ఒకళ్లకొకళ్లు చెప్పుకునే వుంటారు. యింకా ఖర్మ నా గురించి యేమీ నోరు మెదపకుండానేనా వుండి వుంటారు — తెలిసిందా?" మరో సారి ద్వేషాగ్ని జ్వాలలు ఆమె కళ్లల్లో లేచాయి. "యింత అయాక నాతో అంటాడు... మరి చెప్పు, తనని నమ్మమంటావా? ఎన్నటికీ! లేదు, అంతా ముగిసిపోయింది. నాకు వూరడింపుని యిచ్చేటువంటిది, నా పాట్లకీ, యాతనలకీ బహుమానంగా వుండేటువంటిది అంతా పోయింది... నువ్వు నమ్ముతావా? నేను గ్రీషకి చదువు చెప్తూ వుండేదాన్ని. ఆ పని నాకు యిష్టంగా వుండేది. యిప్పుడదంటే అసహ్యం పుడుతోంది. యెందుకు నేను పనిచెయ్యడం? యీ యాతనంతా పడడం? నేనెందుకు పిల్లల్ని కన్నాను? దారుణమైన విషయం నా మనసు విరిగిపోయింది. ఒకప్పుడు అతనిపట్ల ప్రేమగా,

కోమలంగా వుండేటువంటిది యివాళ యేవగింపుగా మారింది, అవును యేవగింపుగా. అతన్ని చంపేసివుండేదాన్ని..."

"నాకు తెలుసమ్మా, నాకు తెలుసు. కాని యిలా క్షోభపడిపోకు. నువ్వెంతో గాయపడిపోయి, యెంతో చిత్రహింస పడిపోయి దేన్నీ సరిగ్గా చూడలేకుండా వున్నావు."

దాలీకి ఆవేశం తగ్గింది. కొన్ని క్షణాలు యిద్దరూ మాట్లాడుకోలేదు.

"యేం చెయ్యాలి? దాన్ని గురించి ఆలోచించు, అన్నా. నాకు సాయం చెయ్యి. పరిపరి విధాల ఆలోచించాను. మార్గం కనబడ్డం లేదు."

అన్నాకి యేం తోచలేదు. కాని ఆమె హృదయం మరదలు అన్న ప్రతి మాటకీ, ఆమె కవళికల్లో కలిగిన ప్రతి మార్పుకీ ప్రతిస్పందించింది.

"నే చెప్పదలచు కున్నదొక్కటే" అని మొదలుపెట్టింది. "నేను వాడి తోబుట్టువుని. వాడి స్వభావం నాకు తెలుసు. ప్రతిదాన్నీ, ప్రతిదాన్నీ ఆదమరిచేవాడి వైఖరి నాకు తెలుసు" (అంటూ ఆమె తన చేతిని తన నుదుటిముందు వూపింది) "తన యీ వ్యామోహానికి పూర్తిగా లొంగిపోయే వైఖరీ, అలాగే అంత పూర్తిగానూ పశ్చాత్తాపపడే వైఖరీ నాకు తెలుసు. తను యీ పని యెలా చేశాడో వాడికే తెలీదు, వాడే నమ్మలేడు" అంది.

"అబ్బే, యేం కాదు, తెలుసు, తెలుసు" అని దాలీ అడ్డం చెప్పింది. "కానీ నేను... నువ్వు నన్ను మర్చిపోతున్నావు. నాకు దానివల్ల బరువు తగ్గుతుందా?"

"ఆగు. వాడు నాతో మాట్లాడినప్పుడు నీ పరిస్థితి యింత దారుణంగా వుందని నేను గ్రహించలేదని ఒప్పుకుంటాను. సంసారం చెడిపోతోందనే చూశాను. వాణ్నే చూశాను. నాకు బాధ కలిగింది వాడంటే. కాని నీతో మాట్లాడేక రెండో వేపునుంచి కూడా చూడగలిగాను – ఆడదానిలాగా నీ బాధ చూశాను, నువ్వంటే నాకెంత విచారంగా వుందో చెప్పలేను. కాని, దాలీ, నీ బాధ నాకు పూర్తిగా అర్థమవుతుంది, కాని నాకు తెలియనిది వొకటుంది: నాకు తెలియదు... నాకు తెలియదు, అతనిపట్ల నీ మనసులో యింకా ప్రేమ వున్నదీ లేనిదీ. అది నీ ఒక్కత్తికే తెలుసు. వాణ్ని క్షమించగల ప్రేమ వుందా? వుంటే, వాణ్ని క్షమించు."

"ఉహూఁ" అని దాలీ మొదలుపెట్టింది. కాని అన్నా ఆమె చేతిని మళ్లీ ముద్దుపెట్టుకుని ఆపింది.

"నీకంటే నాకు లోకం యెక్కువ తెలుసు. స్త్రీవె లాంటివాళ్లు యిలాంటి విషయాల్లో యెలా వుంటారో నాకు తెలుసు. నీ గురించి వాడు 'ఆమె'తో మాట్లాడివుంటాడని అంటున్నావు. వాడు యెన్నడూ మాట్లాడ్డు. అలాంటి మగాళ్లు తప్పుడు పనులు చెయ్యచ్చు కాని వాళ్లకి తమ యిళ్లూ పెళ్లాలూ – అవి పవిత్రం. పై ఆడవాళ్లని తిరస్కారంగా చూస్తారు, తమ కుటుంబ జీవితాన్ని దెబ్బతియ్యనివ్వరు. వాళ్లకీ తమ కుటుంబాలకీ మధ్య దాటలేని హద్దు రేఖలు గీస్తారు. యెలా గీస్తారో నాకు అర్థం కాదు కాని అలా వుంటుంది."

"కావచ్చు, కాని ఆమెని ముద్దుపెట్టుకున్నాడు..."

"వినమ్మా, డాలీ. నిన్ను ప్రేమించినప్పుడు నేను స్త్రీని ఎరుగుదును. నాదగ్గరికి వచ్చి, నీకోసం యేడ్వడం నాకు గుర్తు వుంది. నీ గురించి యెంతో ఘనంగా మాట్లాడేడు. నువ్వంటే మహా అనురాగం వుండేది. యెంత యెక్కువగా నీతో కలిసి వుంటే అంత యెక్కువగా నిన్ను యెత్తేసేవాడు. వాణ్ణి చూసి మాకు నవ్వొచ్చేది. మాట మాటకీ 'డాలీ అద్భుతమైన మనిషి' అంటూ పాడుతూ వుండేవాడు. నువ్వెప్పుడూ వాడికి ఓ దేవతలాగే వుండేదానివి. యిప్పటికీ అలాగే వున్నావు. వాడి ప్రస్తుత వ్యామోహం యేదో పైపైదే..."

"యిది మళ్లీ వస్తే?"

"రాదనే నా నమ్మకం."

"ఆఁ, కాని నువ్వతన్ని క్షమించగలవా?"

"తెలీదు, నేను చెప్పలేను, చెప్పలేను... వూఁ, చెప్పగలను" అంది అన్నా ఆలోచించి. తనే ఆ స్థానంలో వున్నట్టు వూహించుకుని అన్నీ జాగ్రత్తగా పరిశీలించింది. "చెప్పగలను. క్షమిస్తా. నేను వాణ్ణి క్షమిస్తాను. ముందటిలాగానే వుండలేను కాని క్షమిస్తాను. అది యెన్నడూ జరగనట్టే మన్నిస్తాను. అసలెన్నటికీ జరగనట్టు."

"ఆ సంగతి చెప్పక్కర్లేదులే" అంది డాలీ గబగబా, తను దేన్ని గురించి అనుకుంటోందో దాన్నే అన్నాకి చెప్తున్నట్టుగా. "లేకపోతే అది క్షమించడమే కాదు. క్షమించడమంటూ జరిగితే పూర్తిగా క్షమించాలి. మినహాయింపుల్లేకుండా. సరే, రా, నీ గది చూపిస్తా" అంది లేస్తూ. వెళ్లేటప్పుడు డాలీ అన్నాని వాటేసుకుంది. "నాకెంత సంతోషంగా వుందో! నువ్వు వచ్చావు! నాకిప్పుడే తేలిక పడ్డట్టు అనిపిస్తోంది. చాలా తేలికపడ్డట్టు!" అంది.

20

అన్నా రోజంతా యింటిదగ్గరే, అంటే అబ్లాన్స్కీల కుటుంబంతోటే గడిపింది. ఆమె వచ్చిందని విని కొంతమంది తెలిసినవాళ్లు ఆ రోజునే ఆమెని చూద్దామని వచ్చారు. కాని ఆమె యెవర్నీ కలుసుకోలేదు. ఉదయం అంతా డాలీతో, పిల్లలతో గడిపింది. భోజనానికి తప్పకుండా యింటికే రమ్మనమని తమ్ముడికి చీటీ పంపింది. "యింటికి రా. దేవుడు చల్లగా చూస్తాడు" అని రాసింది.

అబ్లాన్స్కీ యింటిదగ్గరే భోజనం చేశాడు. అందరూ మాటలు కలిపారు. అతనితో మాట్లాడినప్పుడు అతని భార్య అతన్ని 'నువ్వు' అని పిలిచింది. యీమధ్య కొన్ని రోజులుగా పిలవడం మానేసిన పిలుపు. యింకా భార్యా భర్తల మధ్య కొంత యెడం యేదో వున్నట్టు కనిపించింది. కాని విడిపోవడం గిడిపోవడం లాంటి మాటలు మాత్రం లేవు. అబ్లాన్స్కీ తను చెప్పాల్సిన మాటలు యేవో చెప్పి, సర్దుబాటు చేసుకోవడానికి వుండే అవకాశం వుందని చూశాడు.

భోజనాలు అయిన వెంటనే కిట్టీ వచ్చింది. ఆమెకి అన్నాతో పరిచయం వుంది. కాని ఏదో మాదిరి పరిచయమే. అందరూ పొగిడే యీ పీటర్స్‌బర్గ్ నవనాగరిక మహిళ తనని యెలా పలకరిస్తుందా అని అక్కగారి యింటికి వెడుతూ వుంటే, కిట్టీకి బెరుకు కలిగింది. కాని అన్నాకి ఆమెపట్ల యిష్టం కలిగింది. ఆ విషయాన్ని కిట్టీ వెంటనే గ్రహించగలిగింది. అన్నా కిట్టీ పడుచుదనం చూసీ, సౌందర్యం చూసీ ముగ్ధురాలైందన్నది స్పష్టంగా తెలుస్తూనే వుంది. కిట్టీ మొదటి కలయికలోనే అన్నా ప్రభావంలో పడిపోయింది. అంతేకాదు తను, ఒకో అప్పుడు ఆడపిల్లలు పెళ్లయిన పెద్ద ఆడవాళ్లని ప్రేమించినట్టుగా, ఆమెని ప్రేమించింది కూడా. అన్నా నవనాగరిక మహిళలాగా కనిపించలేదు. ఎనిమిదేళ్ల కొడుకు వున్నదానిలాగా కూడా కనిపించలేదు. అన్నా ముఖం నేవళింపుతో వుంది. మృదుత్వంతో వుంది. జీవ చైతన్యంతో వుంది. యీ జీవ చైతన్యం అన్నా చిరునవ్వులో లేదా కళ్లల్లో వుంది. కిట్టీకి ఆశ్చర్యం కలిగించి ఆకర్షించిన గంభీర విచారకరమైన దృక్కులతో వుండనట్లయితే ఆమె యిరవై యేళ్ల దానిలా కనిపించి వుండేది. అన్నాలో కృత్రిమత్వం అనేది వెదికినా కనిపించదనీ, ఆమె యేదీ దాచుకోలేదనీ, అయినా తను ప్రవేశించడానికి సాధ్యమవని సంక్లిష్ట, మధుర కవితాత్మక అనస్తుల ఉన్నత ప్రపంచం మరొకటి ఆమెకి తెలుసనీ కిట్టీ గ్రహించింది.

భోజనాలయాక డాలీ తన గదికి వెళ్లిపోయింది. అన్నా గబగబా లేచి తమ్ముడి దగ్గరికి వెళ్లింది. అతను చుట్ట కాల్చుకుంటున్నాడు.

"స్తీవ" అంది కొంటెగా కను సైగచేస్తూ. అతనిమీద శిలువ గుర్తు గీసి, కళ్లతో గుమ్మంకేసి చూపిస్తూ "వెళ్లు, దేవుడు నీకు సాయం చేస్తాడు" అంది.

అతను వెంటనే దాని భావం గ్రహించి, చుట్ట అవతల పారేసి లోపలికి వెళ్లాడు.

అతను వెళ్లాక, ఆమె పిల్లలతో కలిసి తను కూర్చున్న సోఫా దగ్గరికి మళ్లీ వెళ్లింది. యీ మేనత్తని తమ తల్లి అభిమానించిందన్న కారణంవల్ల కావచ్చు, లేదా తమకే ఆమెలో ఒక ప్రత్యేకమైన ఆకర్షణ గోచరించిన కారణంవల్ల కావచ్చు పెద పిల్లలిద్దరూ భోజనాంకి ముందు అన్నాకి అతుక్కుపోయారు. ఆమెని వదిలిపెట్టి పక్కకి వెళడానికి వొప్పుకోలేదు. పిల్లలతో మామూలుగా జరిగినట్టే, చిన్న పిల్లయీ పెద్ద పిల్లల ఒరవడిలోనే వున్నారు. ఎవరు ఆమెకి బాగా దగ్గరగా కూర్చుంటారో, లారిస్తారో ఆమె చిన్న చేతిని పట్టుకుంటారో, ముద్దుపెట్టుకుంటారో, ఆమె ఉంగరాలతో ఆడుకుంటారో లేకపోతే ఆమె గౌను కుచ్చిళ్లని తాకుతారో అనేదంతా ఒక తరహా ఆట అయింది.

"రండి, ముందు కూర్చున్నట్టుగానే కూర్చుందాం" అంది అన్నా తన చోట్లో కూర్చుంటూ.

మళ్లీ గ్రీష ఆమె చేతికిందనుంచి తల దూర్చి ఆమె గుండెమీద వాల్చేడు. వాడి ముఖం గొప్పతో, సంతోషంతో వెలిగిపోయింది.

"బాల్‌డాన్స్ యెప్పుడు జరుగుతుంది?" అని ఆమె కిట్టీకేసి తిరిగి అడిగింది.

"మళ్లీ వారం, చాలా గొప్ప బాల్‌డాన్స్. యెప్పుడూ చాలా హుషారుగా వుండే వాటిల్లో ఒకటి."

"యెప్పుడూ హుషారుగా వుండే బాల్‌డాన్స్‌లు వున్నా యేమిటి?" అని సరదాగా యెత్తి పొడుస్తూ అడిగింది అన్నా.

"ఏంత మాట గాని, వున్నాయి. బ్రెస్కీవ్‌ల యింటిదగ్గర యెప్పుడూ హుషారు గానే వుంటాయి. నికితిన్ల దగ్గరానూ. కాని మెష్‌కోవ్‌ల యింటి దగ్గర యెప్పుడూ వుసూరు మంటూనే వుంటాయి. మీరు గమనించలేదా?"

"లేదు తల్లీ, బాల్‌డాన్స్‌లు యిక నాకు హుషారుగా వుండవు" అంది అన్నా. తనకి ప్రవేశం లేని ఆ ప్రత్యేక ప్రపంచపు మిణుకు ఆమె కళ్లల్లో కిట్టీకి కనిపించింది. "నాకు మట్టుకి కొంచెం తక్కువ విచారం, విసుగు కలిగించే బాల్‌డాన్స్‌లే వున్నాయి" అంది.

"బాల్‌డాన్స్‌ల్లో 'మీకు' విసుగెలా కలుగుతుంది?"

"యెందుకు 'నాకు' కలగ కూడదు?" అని అడిగింది అన్నా.

యేం జవాబు వస్తుందో అన్నాకి తెలుసని కిట్టీ గ్రహించింది.

"యెందుకంటే యే బాల్‌డాన్స్‌లోనేనా మీరే రాణీగా వుంటారు కాబట్టి."

అన్నాకి సిగ్గుతో ఎర్రబడ్డం తెలుసు. యిప్పుడు సిగ్గుపడింది.

"మొదటిది నేను అలా వుండను. రెండవదిగా ఒక వేళ వున్నా దానివల్ల నాకేమిటి వస్తుంది?" అంది.

"మీరు వస్తున్నారా యీ బాల్‌డాన్స్‌కి?" అని కిట్టీ అడిగింది.

"రాకపోతే బాగోదేమోననిపిస్తోంది" అని అన్నా "వూ, యిందు తీసుకో" అంది తాన్యాతో. ఆ పిల్ల తెల్లగా, కోసుగా వున్న మేనత్త సన్నటి వేలుకి వదులుగా వున్న ఉంగరాన్ని పీకుతూ వుంది.

"మీరు వస్తున్నందుకు నాకు చాలా సంతోషంగా వుంటుంది. మిమ్మల్ని అక్కడ చూడాలని నాకు చాలా కోరికగా వుంది."

"వూఁ, రావడమనేదంటూ తప్పకపోతే కనీసం మీకు సంతోషం కలుగుతుందనేదేనా నాకు తృప్తిగా వుండాలి. గ్రీష, నా జుట్టు పీకకు అదే యెలాగూ జారిపోతోంది" అంది గ్రీష ఆడుకుంటూ వున్న కురుల్ని వెనక్కి సర్దుకుంటూ.

"బాల్‌డాన్స్ దగ్గర మిమ్మల్ని వూదారంగు గౌను తొడుక్కుని వున్నట్టు వూహిస్తున్నాను."

"అదేమిటి నేనే వూదారంగు గౌను యెందుకు వేసుకోవాలి?" అని అన్నా చిరునవ్వు నవ్వుతూ అడిగింది. "వూఁ, పిల్లలూ, వెళ్లండి. వినిపిస్తోందా? టీ తాగడానికి రమ్మని మిస్ హల్ పిలుస్తోంది" అందామె. వాళ్లని విడిపించుకుని భోజనాల గదికి తరిమేసి మళ్లీ కిట్టీతో మాట్లాడింది.

"నన్నెందుకు బాల్‌డాన్స్‌కి రమ్మని పిలుస్తున్నారో నాకు తెలుసు. యీ బాల్‌డాన్స్

దగ్గర గొప్ప విషయాలు జరుగుతాయని అనుకుంటున్నారు. అందరూ అక్కడ వుండి అందులో భాగం పంచుకోవాలని వుంది మీకు."

"అవును. మీకెలా తెలుసు?" అని కిట్టీ అడిగింది.

"ఓ, యెంత సంతోషదాయకమైన వయసు మీది! స్విట్జర్లండ్ పర్వత శ్రేణిమీద లేచే నీలి పొగమంచు లాంటిది నాకు గుర్తువస్తుంది. బాల్యం ముగిసిపోతూ, యెంతో సంతోషంగా చీకూ చింతా లేకుండా వుండే బ్రహ్మాండమైన ఈ వృత్తంనుంచి బయటికి నడిపించే బాట యింకా యిరుకు అయిపోతూ వుండే ఆ సంతోషదాయక వయసులో అన్నిట్నీ ఆవరించుకునే నీలి పొగమంచు. అవతల వున్న తరుశ్రేణి నడుమ పొడవైన దారుల్లోకి అడుగు పెట్టాలంటే సంతోషంగానూ వుంటుంది, భయంగానూ వుంటుంది – అవి యెంత తేటో వంతంగా అందంగా కనిపించినా కూడా. యీ దారులమీద తిరక్కుండా యెవళ్ళైనా వున్నారా?"

కిట్టీ యేమీ మాట్లాడకుండా చిరునవ్వు నవ్వింది. 'తను యీ దారులమీద యెలా వెళ్ళింది? యీవిడ ప్రేమ గాథని పూరా వినడానికి నాకు యెంత ఉత్సాహంగా వుంది!' అనుకుంది కిట్టీ. అన్నా భర్త అలెక్సేయ్ అలెగ్జాండ్రొవిచ్ కరేనిన్‌గారి పరమ లౌకిక వ్యక్తిత్వం గుర్తుకు వచ్చి అలా అనుకొంది కిట్టీ.

"నాకు కొద్దిగా తెలుసు. మా తమ్ముడు చెప్పాడు. నా శుభాకాంక్షలు మీకు. అతను నాకు చాలా నచ్చేడు. వ్రాన్‌స్కీని స్టేషన్ దగ్గర చూశాను" అంది అన్నా.

"ఓ, అతను అక్కడకి వచ్చేడా? బావ యేం చెప్పాడు మీకు?" అని అడిగింది సిగ్గుతో యెర్రబడుతూ.

"మొత్తం అంతా చెప్పేడు. నాకు చాలా సంతోషంగా వుంది. నిన్న వ్రాన్‌స్కీ అమ్మగారితో కలిసి ప్రయాణం చేశాను. అతన్ని గురించి తప్ప వేరే విషయాలే ఆవిడ మాట్లాడలేదు, తన ముద్దుల కొడుకు గురించే మాట్లాడింది. తల్లుల ప్రేమ నాకు తెలుసు కాని..."

"ఆవిడేం చెప్పారు?"

"అబ్బో! ఒకటా! బోలెడు! అతను ఆవిడ ముద్దుల కొడుకు అని నాకు తెలుసు. కాని అతనిలో ఆదర్శ గుణాలు వున్నట్టే కనిపిస్తాడు. మాటకి, ఆవిడ చెప్పింది నాకు, తన ఆస్తి నంతట్నీ తోడబుట్టినవాడికి యిచ్చేద్దామనుకున్నాట్ట. యింకా చిన్న పిల్లవాడిగా వున్నప్పుడే సాహస కృత్యం చేశాట్ట – నీళ్ళల్లో మునిగిపోయే ఒకామెని రక్షించాట్ట. ఆఁ, ఒక్క మాటలో చెప్పాలంటే – వీరుడు" అంది అన్నా చిరునవ్వు నవ్వుతూ. స్టేషన్ దగ్గర అతను రెండు వందల రూబుళ్ళు దానంచెయ్యడం గుర్తువచ్చింది ఆమెకి.

కాని ఆ రెండు వందల రూబుళ్ళ గురించి ప్రస్తావించలేదు. యెందుకనో దాన్ని గుర్తుచేసుకోవడం యిష్టం లేకపోయింది. ఆ సంఘటనతో తనకి సంబంధం వున్నదీ, యేదో వుండకూడనిదీ వున్నట్టనిపించింది.

"వాళ్ళింటికి రమ్మని నన్ను బలవంతం చేసింది. ఆవిడని చూడ్డం నాకు సంతోషమే. రేపు వెడతాను ఆవిడ దగ్గరికి. ఓ, దేముడి దయవల్ల, అబ్లానెస్కీ దాలీ గదిలో చాలా సేపు వున్నాడు" అందామె. విషయం మార్చి, లేచింది. ఆమెకి యెందువల్లనో అసంతృప్తి కలిగిందని కిట్టీకి అనిపించింది.

"లేదు, నేను ముందు! వుహూ:, నేనూ ముందు" అంటూ పిల్లలు అరిచారు. వాళ్ళు టీ తాగి, మళ్ళీ పందేలమీద మేనత్త దగ్గరికి వచ్చేరు.

"అందరూ ముందే" అంది అన్నా. ఆమె నవ్వుతూ పరిగెత్తి వాళ్ళ దగ్గరికి వెళ్ళి, వాళ్ళని కౌగలించుకుని కింద పడేసింది. పిల్లలు గుంపుగా కిలకిలా నవ్వుతూ మురిసిపోయి ఒకళ్ళమీద ఒకళ్ళు పడ్డారు.

21

పెద్దవాళ్ళు టీ తాగేవేళకి దాలీ వచ్చింది. కాని అబ్లానెస్కీ ఆమె వెంట రాలేదు. భార్య గదిలోనుంచి వేరే గుమ్మం గుండా అవతలికి వెళ్ళాడేమో.

"మేడమీద చలిగా వుంటుందేమో. నీకు కింద గది యేర్పాటు చేయిస్తాను. నాకు దగ్గరగా వుంటావు" అంది దాలీ.

"అబ్బే, నా గురించి యిబ్బంది పడకు" అంది అన్నా. సర్దుబాటు అయిందా లేదా అన్నట్టు దాలీ ముఖంలోకి వెతుకుతూ చూసింది.

"యిక్కడైతే వెలుతురుగా కూడా వుంటుంది" అంది మరదలు.

"యిదిగో నే చెప్తున్నా విను నేను యెక్కడేనాగాని, యెప్పుడేనాగానీ యేనుగులు తొక్కినా లేవంత మొద్దు నిద్రపోగలను."

"ఏమిటి గొడవ పడిపోతున్నారు?" అని చదువుకునే గదిలోనుంచి యివతలికి వస్తూ అబ్లానెస్కీ భార్యని అడిగాడు.

అతని గొంతుక ధోరణిని బట్టి సర్దుబాటు జరిగే వుంటుందని కిట్టీ, అన్నా లిద్దరూ ఖాయంగా అనుకున్నారు.

"అన్నాని కింద గదిలోకి మారుద్దామను కుంటున్నాను. కాని కొత్త తెరలని మళ్ళీ పెట్టాలి. యెలాగో యెవళ్ళకీ తెలీదు, నేనే చూసుకోవాలి పని" అంది దాలీ అతనితో.

దాలీ ఉదాసీనంగా ఆ మాటలు అనడం చూసి 'యింతకి సమాధానపడ్డారా లేదా దేవుడికి తెలును' అనుకొంది అన్నా.

"అబ్బ! దాలీ! గోరంతలు కొండంతలు చెయ్యకు. నీక్కావాలంటే నే చేస్తాను" అన్నాడు అబ్లానెస్కీ.

'హమ్మయ్య సర్దుబాటు అయినట్టే' అనుకొంది అన్నా.

"ఆ:, నాకు తెలుసు నువ్వెలా చేసేదీనీ! ఆ పని చెయ్యమన్చెప్పి మత్వేయ్‌కి పురమాయింపు

పెడతావు. అతను చెయ్యలేదు. యిక అది జరిగినట్టే! నీ దారిన నువ్వు వెళ్ళిపోతావ్, యిక ఆ పని అలానే వుండి పోతుంది." ఆ మాటలు అంటూ వుంటే దాలీ పెదాల మూలలు వ్యంగ్యంగా చిరునవ్వుతో ముడతలు పడ్డాయి.

'పూర్తిగా సర్దుబాటు అయింది, మినహాయింపుల్లేకుండా. హమ్మయ్య దేవుడి పుణ్యమా అని' అనుకొంది అన్నా. దాన్ని సాధించడంలో తను నిమిత్తంగా వుందని సంతోషించింది. దాలీ దగ్గరికి వెళ్ళి ముద్దుపెట్టుకుంది.

"యేం కాదు, మత్వేయ్ అన్నా, నేనన్నా నీకలాంటి చెడ్డ అభిప్రాయం యెందుకుంది?" అన్నాడు అబ్లాన్‌స్కీ భార్యతో. కనిపించీ కనిపించని చిరునవ్వు నవ్వేడు.

ఎప్పటిలాగానే దాలీ ఆ సాయంత్రం భర్తతో అదే వ్యంగ్య ధోరణిలో మాట్లాడింది. అబ్లాన్‌స్కీకి తృప్తిగా వుంది. హుషారుగా వున్నాడు. అలా అని మరీ హుషారుగానూ కనిపించలేదు, యేమంటే అప్పుడే క్షమాభిక్ష పొందిన తను తన దోషాన్ని మర్చిపోయాడని అనిపించవచ్చు.

అబ్లాన్‌స్కీల యింట్లో టీ బల్ల దగ్గర ఆ పూట హుషారైన, కులాసా సంభాషణ వుంది. దానికి సాగుతూ తొమ్మిదిన్నర సమయంలో ఒక అతి సామాన్యంగా కనిపించే సంఘటన వల్ల అంతరాయం కలిగింది. కాని యీ అతి సామాన్య సంఘటనే యే కారణంగానో ప్రతి వాళ్ళకీ చిత్రంగా కనిపించింది. వాళ్ళు పీటర్స్‌బుర్గ్‌లో తమందరికీ తెలిసినవాళ్ళ గురించి మాట్లాడుకుంటూ వుండగా అన్నా వున్నట్టుండి లేచింది.

"ఆమె ఫోటో నా ఆల్బంలో వుంది" అంది. "మా సెర్యోష ఫోటో కూడా చూపిస్తా" అని తల్లికి వుండే గర్వపూరితమైన చిరునవ్వుతో జతచేసింది.

పది గంటలవబోతోంది. మామూలుగా ఆమె ఆ వేళప్పుడు కొడుక్కి గుడ్‌నైట్ చెప్పి, బాల్‌డాన్స్‌కి వెళ్ళేముందు తరుచుగా తనే నిద్రపుచ్చేది. యిప్పుడు ఆమె మనసులో ప్రత్యేకం గాఢమైన అనుభూతి రేగింది. తనేమో యింత దూరంలో వుంది మరి. సంభాషణ యెలా సాగుతూ వున్నాగానీ ఆమె ఆలోచనలు ఉంగరాల జుట్టు సెర్యోష మీదకే మళ్ళుతున్నాయి. వాడి ఫోటో చూడాలని తపన కలిగింది. వాణ్ణి గురించి మాట్లాడాలని అనిపించింది. అందుకు తగ్గ మొదటి అవకాశం రాగానే ఆమె లేచి దృఢంగా లాఘవంగా అడుగులు వేసుకుంటూ ఆల్బం తేవడానికి వెళ్ళింది. ఆమె గది వేపు మెట్లు వెచ్చని పెద్ద మేడ మెట్లమీద విశాలంగా, చదరంగా వుండే స్థలం దగ్గరనుంచి వున్నాయి.

ఆమె డ్రాయింగ్ రూమ్‌నుంచి వెళ్ళేటప్పుడు సరిగ్గా ఆ సమయంలో, సింహద్వారం దగ్గర గంట మోగింది.

"యెవళ్ళయి వుంటారబ్బా?" అంది దాలీ.

"నన్ను యింటికి తీసుకెళ్ళడానికి వచ్చినవాళ్ళయితే మరీ పెందరాళే వచ్చినట్టే అవుతుంది. మరెవళ్ళైనా అయితే మరీ పొద్దుపోయి వచ్చినట్టే" అంది కిట్టీ.

"ఖాయంగా నాకోసం కాగితాలేవో తెచ్చివుంటారు" అన్నాడు అబ్లాన్‌స్కీ. అన్నా

పెద్ద మేడ మెట్లు దాటి వెళ్లే సమయంలో నౌకరు వచ్చి యెవళ్లో వచ్చారని చెప్పాడు. ఆ వచ్చినతను కింద హాల్లో దీపం పక్కన నుంచున్నాడు. ఆమె కిందికి చూసింది. వెంటనే వ్రాన్‌స్కీని గుర్తుపట్టింది. భయంతో పెనవేసుకున్న వింత సంతోషానుభూతి ఆమె హృదయంలో రెపరెపలాడింది. వ్రాన్‌స్కీ ఓవర్‌కోటు విప్పకోకుండా అలావే వున్నాడు. జేబులో నుంచి యేదో తీస్తున్నాడు. ఆమె మెట్లదారి మధ్యకి వచ్చేక అతను కళ్లు పైకి యెత్తి ఆమెని చూశాడు. అతనికి లజ, భయమూ కలిసిన భావం కలిగింది. అన్నా కొంచెంగా తల వంచి మెట్లదారి దాటి వెళ్లిపోయింది. ఆ తర్వాత క్షణంలో అబ్లాన్‌స్కీ గొంతుక పెద్దగా వినిపించింది. అతన్ని రమ్మని అబ్లాన్‌స్కీ పిలుస్తున్నాడు. కాని లోగొంతుకలో నిదానంగా రాను ఫరవాలేదు లెమ్మని వ్రాన్‌స్కీ జవాబు చెప్తున్నాడు.

అన్నా ఆల్బం తీసుకుని వెనక్కి వచ్చేటప్పటికి వ్రాన్‌స్కీ వెళ్లిపోయాడు. ఆ మర్నాడు మాస్కో సందర్శిస్తున్న ఓ ప్రఖ్యాత గాయకికి సన్మానం చేస్తూ తాము యివ్వబోయే విందు వుందా లేదా అని వాకబు చెయ్యడంకోసం అతను వచ్చాడని అబ్లాన్‌స్కీ చెప్పాడు.

"యెంత బతిమాలినా లోపలికి రాందే. భలే వింత మనిషి" అన్నాడు అబ్లాన్‌స్కీ.

కిట్టీ సిగ్గుతో యెర్రబడింది. అతను యెందుకు అక్కడికి వచ్చేడో, యెందుకు లోపలికి రాలేదో తనకి మాత్రమే తెలుసునని ఆమె అనుకొంది. "ముందు మా యింటికి వెళ్లివుంటాడు; అక్కడ నేను కనిపించక పోవడంతో యిక్కడ వుంటానేమోనని వచ్చివుంటాడు. లోపలికి రావడానికి భయపడి వుంటాడు. బాగా పొద్దుపోయింది కదా? పైగా అన్నా వుందాయిరి" అనుకొంది.

యెవళ్లూ యేమీ మాట్లాడకుండానే ఒకళ్లకేసి ఒకళ్లు చూసుకున్నారు. తర్వాత అన్నా ఆల్బంకేసి తిరిగారు.

అనుకున్న కార్యక్రమం ప్రకారం విందు వుందా లేదా అని వాకబు చెయ్యడానికి యెవళ్లైనా ఓ మిత్రుడి యింటికి తొమ్మిదిన్నరకి వెళ్లడంలోగాని, రమ్మన్నా లోపలికి రాకుండా వుండడంలోగాని విచిత్రమైందిగాని, విశేషమైందిగాని యేమీ లేదు. కాని ప్రతివాళ్లకీ యిప్పుడది విచిత్రంగా కనిపించింది. కాని అన్నాకి అనిపించినంత విచిత్రంగా, అసంతృప్తిగా యెవళ్లకీ అనిపించలేదు.

22

దేదీప్యమానంగా వెలిగిపోతూవున్న మెట్లమీద తల్లితో కలిసి కిట్టీ అడుగుపెట్టే వేళకి బాల్‌డాన్స్ మొదలైంది. ఆ మెట్లకి అటూ యిటూ పువ్వు గుచ్ఛాలు అలంకరించి వున్నాయి. పౌడరు అద్దుకుని, ఎర్ర కోట్లు తొడుకున్న పరిచారకులు అటూ యిటూ నుంచున్నారు. తేనె పట్టులోనుంచి వచ్చినట్టుగా గదుల్లోనుంచి మర్మర ధ్వనులు వినవస్తున్నాయి. మెట్లమీద విశాలంగా చదరంగా వుండే చోట మొక్కల మధ్య వాళ్లు ఆగేరు. అక్కడ అద్దంలో

చూసుకుని జుట్టూ, గౌన్లూ సవరించుకున్నారు. అప్పుడు బాల్ రూమ్‌నుంచి, నట్టుతూ నట్టుతూ వున్నా, స్పష్టంగా ఆర్కెస్ట్రా వయొలిన్ వాయిద్య ధ్వనులు వాల్ట్జ్ నృత్యం మొదలైనట్టు వినవచ్చాయి. మరో అద్దం ముందు పొర దుస్తుల్లో వున్న ఒక ముసలాయన కణతల దగ్గర నెరిసిన వెంట్రుకల్ని సవరించుకున్నాడు. ఆయన దగ్గర ఘాటు అత్తరు వాసన కొడుతోంది. ఆయన వీళ్లని మెట్లమీద ఢీ కొట్టకుండా వుండేందుకు పక్కకి మళ్లేడు. ఆహా అనుకుంటూ కిట్టీకేసి చూస్తూ వున్నట్టే నుంచున్నాడు. ఆయన ఆమెని యెరగడు. గడ్డంలేని ఓ యువకుడు వరిగెత్తుకుంటూ మేడమెట్లు యెక్కుతూ తెల్లని టైని సరి చేసుకుంటున్నాడు. అతను వెల్లడిగా వున్న వెయిస్ట్ కోట్ తొడుక్కున్నాడు. ప్రిన్స్ ష్చేర్‌బాత్‌స్కీ షోకిలా వడుచుక్కురకారు అని పిలిచే రకంలాంటి నాగరిక యువకుల తరహా వాడు అతను. అలా వెడుతూ అతను వాళ్లకి వంగి వందనం చేశాడు. మళ్లీ వెనక్కి కిట్టీ దగ్గరికి వచ్చి తనతో క్వాడ్రిల్ నాట్యం చెయ్యవలసిందిగా పిలిచాడు. ఆమె తన మొదటి క్వాడ్రిల్ నాట్యాన్ని వ్రాన్‌స్కీతో చేస్తుంది, కాబట్టి రెండవ క్వాడ్రిల్ నాట్యం యీ యువకుడితో చేస్తానని చెప్పింది. గ్లవ్‌కి బొత్తాలు పెట్టుకుంటూ గుమ్మం దగ్గర నుంచున్న ఒక మిలిటరీ ఆఫీసరు వీళ్లని లోపలికి వెళ్లనివ్వడానికి దారి యిస్తూ పక్కకి మళ్లేడు. యీ గులాబీ కిట్టీకేసి ఆహా అని చూస్తూ మీసాలు దువ్వుకున్నాడు.

యీ బాల్‌డాన్స్‌కోసం కిట్టీ వేసుకున్న గౌను, చేసుకున్న కేశాలంకరణ, జరిగిన యేర్పాట్లు యెంతో శ్రమపడి యెంతో ముందు చూపుతో సమకూర్చినవే. అయినా ఆమె ఆ గులాబీ బట్ట అస్తరు మీద వేసుకున్న దివ్యమైన మజ్లిన్ బట్టల్లో యెంత సహజంగా, మనాయాసంగా లోపలికి వెళ్లిందంటే యీ గులాబీలు, లేసులు, యితర అలంకారాలు తనకి గాని తన యింట్లో వాళ్లకిగాని పిసరు కూడా సమయం వృథా కాకుండా వచ్చినవే అనే భావం కనిపింపచేసింది. నిజానికి ఆమె ఆ మజ్లిన్ బట్టలతో, లేసులతో, వాటికి మకుటాయమానంగా వున్న రెండు ఆకుల గులాబీ పువ్వు కేశాలంకరణతో పుట్టిందేమో ననిపింపచేసింది.

బాల్ రూమ్‌లోకి అడుగు పెట్టేముందుగా పెద్దావిడ కూతురి నడుం పట్టీగా వున్న అలంకార వస్త్రపు అంచు ముడివిప్పబోయింది. కాని కిట్టీ మెల్లిగా పక్కకి మళ్లింది. ప్రతిదీ సహజంగా, వుండవలసినట్టు వున్నాయనీ మరిక మార్చుకోనక్కర్లేదనీ ఆమెకి అనిపించింది.

కిట్టీకి ఆ రోజు గొప్ప శుభప్రదమైన రోజుల్లో ఒకటి. బాడీ మరి బిగుతుగా లేదు. బట్ట బాడి భుజాల మీదనుంచి జారడం లేదు. గుడ్డతో కుట్టిన పువ్వులు జాళ్లు పడిపోవడంలేదు, వదులుగానూ లేవు. మెలిక తిరిగిన యెత్తు మడమ గులాబీరంగు స్లిప్పర్లు కరవడం లేదు, కాళ్లని బుజ్జగించాయి. తల వెనకాల పెట్టుకునే అందమైన సవరం కొప్పు ఆమె చిన్న తలకి సహజంగా వున్నట్టే నప్పింది. పొడవాటి గ్లవ్స్‌కి వున్న మూడు బొత్తాలూ వూడకుండా గట్టిగా వున్నాయి. గ్లవ్స్ కూడా చేతులకి ముడతలు రాకుండా సాఫీగా మెత్తగా దూసినట్టు సరి

పోయాయి. ఆమె లాకెట్‌కున్న నల్లని వెల్వెట్ రిబ్బన్ మహా మృదువుగా ఆమె కంఠాన్ని ఆలింగనం చేసుకుని శోభాయమానంగా వుంది. ఆ రిబ్బన్ అమోఘంగా వుంది. యింటిదగ్గర అద్దంలో దాన్ని చూసుకుని అది సరిగ్గా సరిపోయిందనుకుంది కిట్టీ. మరి మిగిలినదేనికైనా వంక పెట్టొచ్చు కాని రిబ్బన్‌కి మాత్రం వంకపెట్టలేం. మహా మనోహరంగా వుంది. యీ బాల్ రూమ్ దగ్గర కూడా అద్దంలో దాన్ని చూసుకుని కిట్టీ మురిసిపోకుండా వుండలేకపోయింది. ఆమె చేతులూ, భుజాలూ ఆచ్ఛాదన లేకుండా వెల్లడిగా వున్నాయి. వాటి పాలరాతి చల్లదనాన్ని ఆమె అనుభూతి చెందింది. ఆ అనుభూతి గిలిగింతలు పెట్టింది. ఆమె కళ్లు మిలమిల మెరిశాయి. తను యెంత ముచ్చటగా వుందోనన్న గుర్తింపు వచ్చి ఆమె ఎర్రటి పెదవులు మందహాసం చేశాయి. బాల్ రూమ్‌లో రిబ్బన్లతో, లేసులతో, రవసెల్లా పట్టుబట్టలతో, శోభయమానంగా వెలిగిపోతూవున్న ఆడవాళ్లు గుంపుగా వున్నారు. నాట్యానికి రమ్మని పిలిచే పిలుపుల కోసం వాళ్లు యెదురుచూస్తున్నారు (కిట్టీ వాళ్ల మధ్య యెప్పుడూ లేదు). కిట్టీ ఆ గుంపు దగ్గరికి యింకా వెళ్లిందో లేదో ఆమెని వాల్ట్జ్ నృత్యానికి రమ్మని పిలుపు వచ్చింది. ఆ పిలిచిన ఆయన తక్కువవాడు కాదు. ఎగోరుష్కా కోర్సూన్‌స్కీ. ఆయన పొడగరి. స్ఫురద్రూపి. వివాహితుడు. బాల్ నాట్యాల్లో శ్రేష్ఠుడు. బాల్‌నాట్య గణంలో ఉత్తమ శ్రేణివాడు, బాల్‌నాట్యాల ప్రముఖ నాయకుడు. బాల్‌నాట్యాల సంచాలకుడు. ఆయన అప్పుడే కౌంటెస్ బానినాతో వాల్ట్జ్ మొదటి అర్ధభాగం నాట్యంచేసాడు. ఆయన ఆ నాట్య రంగాన్ని ఉపద్రష్ట నేత్రంతో ఒక్కసారి దృష్టి సారించగానే నాట్యంచెయ్యడానికి కొన్ని జంటలు సాహసించి చేరిన ఆ మైదానంమీదకి — కిట్టీ రావడం కనిపించింది. ఆయన ఆమె దగ్గరికి గబగబా వెళ్లాడు. బిగువు సడలిన ఒయ్యారపు నడకతో వెళ్లాడు. అలాంటి నడక నాట్య సంచాలకులకే వుండే విశిష్ట లక్షణం. శిరసువంచి అభివాదంచేసి, నాట్యం చెయ్యాలని వుందా లేదా అని మర్యాద కోసమైనా అడగను కూడా అడగకుండా ఆమె సన్నని నడుం చుట్టూతా వెయ్యడానికి తన చేతిని చాచాడు. తన చేతిలో వున్న విసన కర్రని అందించడానికి యెవరున్నారా చూసింది. యింటి యజమానురాలు చిరునవ్వు నవ్వుతూ దాన్ని అందుకుంది.

"ఎంత బాగుంది మీరు సరిగ్గా వేళకి రావడం" అన్నాడాయన తన చేతిని ఆమె నడుం చుట్టూతా వేస్తూ. "యిలా ఆలస్యంగా రావడం అంటే నాకు అసలు యిష్టం వుండదు" అన్నాడు.

ఆమె తన ఎడమ చేతిని వంచి అతని భుజంమీద వేసింది. గులాబీ రంగు స్లిప్పర్లు తొడుక్కున్న చిన్న కాళ్లు గబగబా తేలిగ్గా సంగీతానికి అనుగుణంగా, నగిషీచెక్కిన కొయ్య పలకలు పరిచిన ఆ నేలమీద, నాట్యంచేస్తూ కదిలాయి.

"మీతో వాల్ట్జ్ చెయ్యడం హాయిగా వుంటుంది. ఎంత తేలిక, ఎంత précision[1]"

---

[1] కచ్చితత్వం (ఫ్రెంచి).

అని ఆయన తేలిపోతూ మెల్లిగా సాగిన మొరటి అడుగులు వేస్తూ అన్నాడు. తనతో నాట్యంచేసిన వాళ్ళందరితోనూ ఆయన దాదాపుగా యివే మాటల్ని అన్నాడు.

ఆ పొగడ్తకి ఆమె చిరునవ్వు నవ్వింది. అతని భుజం పైనుంచి గదిలో పరకాయించి చూస్తూనే వుంది. ఆమె బాల్‌డాన్స్‌కి కొత్తగా వచ్చిందేమీ కాదు. కొత్త వాళ్ళకి అన్ని ముఖాలూ సమ్మోహకర ప్రభావంలో మిళితమైపోయే నూతనానుభూతులు కలుగుతాయి. బాల్‌నాట్యాలకి చాలా ఎక్కువగా హాజరైనటువంటిదీ కాదు, అలాంటివాళ్ళకి అందరూ తెలిసే వుంటారు, విసుగనిపిస్తారు. ఆమె ఆ ఉభయులకీ మధ్యలో యెక్కడ్నో వుంది. ఉత్తేజంగా వుంది, కాని పరిసరాల్ని చూసేటంత స్తిమితంగానూ వుంది. గదిలో యెడమ వేపు మూల సమాజంలో శ్రేష్ఠమైనవాళ్ళ బృందం వుంది. అక్కడ అందమైన లీదీ కనిపించింది. ఆవిడ కోర్సూన్‌స్కీ భార్య. ఔచిత్యపు హద్దులు మీరేటట్టుగా కురచ బాడీ వేసుకుంది. యింటి యజమానురాలు అక్కడ కనిపించింది. అక్కడనే క్రీవిన్ కనిపించాడు. అతని నున్నటి బట్టతల నిగనిగలాడుతోంది. అతను యెప్పుడూ శ్రేష్ఠమైన వర్గం దగ్గరే చేరతాడు. యువకులు అటువేపు చూస్తూ వున్నారు. వాళ్ళు అక్కడికి వెళ్ళే ధైర్యం చెయ్యలేకుండా వున్నారు. తర్వాత ఆమెకి అబ్లాన్‌స్కీ కనిపించాడు. అన్నా తల, నల్లని ముఖమల్ బట్టలు వేసుకున్న ముచ్చటైన రూపమూ కనిపించాయి. 'అతను' కూడా అక్కడే వున్నాడు. లేవిన్‌ని తిరస్కరించిన ఆ సాయంత్రంనుంచీ కిట్టీ అతన్ని చూళ్ళేదు. కిట్టీ తన నిశిత నేత్రాంతో వెంటనే అతన్ని గుర్తుపట్టింది. అతను తనని చూస్తూవున్నాడని కూడా గమనించింది.

"యింకో సారి డాన్స్ చేద్దామా? యేం, అలిసిపోయారా?" అని కొద్దిగా ఆయాసపడుతూ అడిగేడు కోర్సూన్‌స్కీ.

"వద్దు, చాలు."

"యెక్కడికి తీసికెళ్లను మిమ్మల్ని?"

"అన్నా కరేనినా అక్కడ వున్నట్టుంది. అక్కడికి."

"మీరెలా కావాలంటే అలా."

హాల్‌లో యెడమ వేపు మూల వున్న బృందం దగ్గరికి కోర్సూన్‌స్కీ వాల్ట్జ్ చేస్తూ క్రమేపీ అడుగుల్ని మందగింపచేశాడు. వెడుతూ వెడుతూ "pardon, mesdames, pardon, pardon, mesdames[1]" అంటూనే వున్నాడు. ఆయన యీ లేసుల, రిబ్బన్ల, రవసెల్లాల పద్మవ్యూహంగుండా పీసరు కూడా ఆగకుండా, అడ్డులేకుండా ఆమెని నడిపించుకుంటూ వెళ్ళేడు. చివర్లో ఆమెని ఒక్క చుట్టు తిప్పేడు. ఆ తిప్పడంతో లేసు మేజోళ్ళు తొడుక్కున్న ఆమె నాజూకైన కాళ్ళు వెల్లడిగా కనిపించాయి. ఆమె జీరాడే ఉడుపు యెగురుతూ క్రీవిన్ మోకాళ్ళకి చుట్టుకుంది. కోర్సూన్‌స్కీ వంగి వందనంచేసి, నిటారుగా నిలబడ్డాడు. ఆమెని

---

[1] "క్షమించండమ్మా, క్షమించండి, క్షమించండి అమ్మా" (ఫ్రెంచి).

అన్నా దగ్గరికి తీసికెళ్లడానికి తన చేతిని చాచాడు. కిట్టీ డాన్స్ చేసిచేసి యెర్రబడిపోయింది. క్రీపిన్ మోకాళ్లకి చుట్టుకున్న బట్టని విడదీసుకుంది. యింకా తల తిరుగుతున్నట్టే అనిపించింది. అన్నాకేసి చూసింది. కిటీ కోరుకున్నట్టుగా అన్నా వూదా రంగు బట్టలు వేసుకోలేదు. నల్లని ముఖమల్ గౌను వేసుకుంది. భుజాల వంపులు కనిపించేటట్టు మెడ దగ్గర కురచగా కుట్టిన గౌను అది. పురాతన దంతంతో మలిచినట్టు వున్న ఆమె గుండ్రటి భుజాలు, వక్షస్సు కనిపిస్తున్నాయి. ఆమె చేతులు గుండ్రంగా వున్నాయి. చాలా చిన్నవిగా వున్నాయి. గౌన్‌కి వెనీషియన్ లేసు అంచులు వున్నాయి. ఆమె నల్ల జుట్టు సవరాలు వగైరాలేమీ లేకుండా ఒత్తుగా వుంది. ఆ జుట్టుమీద పేన్సీ పువ్వుల చిన్న మాల వుంది. అలాంటిదే మరో మాల నడుముకి కట్టుకున్న నల్లని పట్టు రిబ్బన్‌కి తగిలించిన తెల్లని లేసు మధ్య వుంది. ఆమె కేశాలంకరణ నదురుగా కనిపించేటట్టు లేదు. కాని ఆమె కణతల దగ్గరా, మెడదగ్గరా అలంకారంగా వేలాడిన ఉంగరాల ముంగురులు నదురుగా కనిపిస్తూ వున్నాయి. యౌవనంతో దృఢంగా వున్న మెడలో ముత్యాల పేట వుంది.

కిట్టీ రోజా అన్నాని చూస్తూనే వుంది. ఆమెని ప్రేమిస్తూనే వుంది. ఊదారంగు ఆమెకి చక్కగా నప్పుతుందనే వూహించుకుంది. యిప్పుడు నల్లని ముఖమల్ గౌనులో ఆమెని చూసాక ఆమె మనోహరత్వాన్ని పూర్తిగా తను గ్రహించ లేకపోయాననే అనుకుంది. యిప్పుడు కిట్టీ ఆమెని అనుకోని రూపంలో కొత్త మనిషిలాగా చూసింది. అన్నా ఊదారంగు బట్టలు వేసుకోగలేదని, ఆమె మనోహరత్వం సర్వదా ఆమె ధరించిన బట్టలని మించి పైనే వుంటుందని గ్రహించింది. అన్నా ధరించిన బట్టలు యెప్పుడూ విశేషమైనవిగా వుండవు. ఆమె వేసుకున్న చక్కని లేసు నల్ల ముఖమల్ గౌను కూడా విశేషంగా ఆకర్షించలేదు. అది వూరికే చౌకట్టు మాత్రమే. సాదాగా, సహజంగా, శ్రేష్ఠంగా వున్న ఆమె మాత్రమే, ఉల్లాసంతో జీవంతో తొణికిసలాడే ఆమె మాత్రమే చూడదగినటు వంటిది.

ఆమె యెప్పటిలాగా నిబ్బరంగా నుంచుంది. కిట్టీ తన దగ్గరికి వచ్చేటప్పటికి ఆమె యింటాయనకేసి తల కొద్దిగా వాల్చి ఆయనతో మాట్లాడుతోంది.

“అబ్బే నేను తప్పులు యెంచడం లేదు” అని ఆయన అన్న దేనికో జవాబు చెప్తోంది. “యేమో నాకు తెలీదు” అంది భుజాలు యెగరేస్తూ. మరుక్షణం కిట్టీకేసి కోమలంగా మృదువుగా చిరునవ్వు నవ్వుతూ చూసింది. ఆడవాళ్లు చూసే శీఘ్రమైన చూపుతో ఆ అమ్మాయి గౌనుకేసి చూసి, గౌనునీ ఆమె అందాన్నీ మెచ్చుకుంటున్నట్టు తల వూపింది. ఆ వూపడం దాదాపు కనిపించీ కనిపించనట్టుగా వుంది. కానీ కిట్టీ వెంటనే గ్రహించింది. “హాల్ కి మీరు నాట్యంచేస్తూనే వచ్చినట్టుందే” అని అన్నా కిట్టీతో అంది.

“నాకు సహాయంచేస్తుందని నేను యెప్పుడూ ఆమెని నమ్ముకోగలను” అన్నాడు కార్‌సూన్‌స్కీ అన్నాకి వందనంచేస్తూ. ఆయన ఆమెని అంతకుముందు చూడలేదు. “యీ ప్రిన్సెస్ బాల్‌డాన్స్‌ని హుషారుగా వుండేటట్టూ, సంతోషంగా వుండేటట్టూ చేస్తుంది.

యీ వాల్ట్జ్ నాతో చేస్తారా, అన్నాగారూ?'' అని మరోసారి వొంగి వందనంచేస్తూ అడిగాడు.

''మీకు పరిచయం వుందా?'' అని యజమాని అడిగాడు.

''మాకు పరిచయం లేనిదెవరితో? నాకూ మా ఆవిడకీ అందరితోనూ పరిచయం వుంది. మేం తెల్ల తోడేళ్లల్లాంటివాళ్లం. అందరికీ మేం తెలుసు'' అన్నాడు కొర్సూన్స్కీ. ''యీ వాల్ట్జ్ అన్నాగారూ'' అని అడిగాడు.

''డాన్స్ చెయ్యక్కర్లేకుండా గడిచి పోయేటట్టయితే నేను డాన్స్ చెయ్యనే చెయ్యను'' అందామె.

''కాని యివాళ గడవదు'' అని కొర్సూన్స్కీ జవాబు చెప్పేడు.

సరిగ్గా ఆ సమయానికి వ్రాన్స్కీ వాళ్ల దగ్గరికి వచ్చేడు.

''సరే, యివాళ తప్పదా, అయితే పదండి'' అని వ్రాన్స్కీ చేసిన అభివాదాన్ని పట్టించు కోకుండానే, కొర్సూన్స్కీ భుజంమీద గబగబా చెయ్యి వేసింది.

''యెందుకని అతనంటే విముఖంగా వుంది?'' అనుకుంది కిట్టీ, అన్నా కావాల్సికి వ్రాన్స్కీకి ప్రత్యభివాదం చెయ్యలేదని చూసి. వ్రాన్స్కీ కిట్టీ దగ్గరికి వెళ్లేడు. తన మొదటి క్వాడ్రిల్ నాట్యాన్ని ఆమెకి గుర్తుచేశాడు. యిన్ని రోజులూ ఆమెని చూసే అదృష్టం తనకి కలగలేదని బాధ వ్యక్తంచేశాడు. కిట్టీ అతను చెప్పేదాన్ని వింటూనే అన్నా వాల్ట్జ్ చెయ్యడం ఆహా అనుకుంటూ చూసింది. వ్రాన్స్కీ తనని వాల్ట్జ్ చెయ్యడానికి పిలుస్తాడని కిట్టీ ఆశించింది. కాని అతను పిలవలేదు. ఆమె అతనికేసి ఆశ్చర్యంగా చూసింది. అతను సిగ్గుతో యెర్రబడిపోయి హడావుడిగా ఆమెని వాల్ట్జ్ చెయ్యడం కోసం పిలిచాడు. ఆమె సన్నని కొను చుట్టూ చెయ్యివేసి మొదటి అడుగులు వెయ్యగానే సంగీతం ఆగిపోయింది. కిట్టీ తనకి బాగా దగ్గరగా వున్న అతని ముఖంలోకి చూసింది. ప్రేమతో పొంగిపొర్లే తన వదనంకేసి చూసి కూడా అతను ప్రత్యుత్తరం యివ్వకుండా వుండిపోవడం గుర్తుకు వచ్చి నప్పుడల్లా ఆ తర్వాత చాలా కాలందాకా, నిజానికి చాలా యేళ్లదాకా అవమాన గాయంతో ఆమె హృదయం సలుపుతూనే వుంది.

"Pardon, pardon! వాల్ట్జ్, వాల్ట్జ్!'' అని కొర్సూన్స్కీ హాల్ అవతలి వేపు నుంచి అరిచాడు. అందుబాటులోకి వచ్చిన మొదటి పడుచు పిల్లని పట్టుకుని ఆమెతో నాట్యం చెయ్యడం మొదలుపెట్టేడు.

23

వ్రాన్స్కీ, కిట్టీ లిద్దరూ కలిసి వాల్ట్జ్ కొన్ని వరసలు నాట్యంచేశారు. అది అయి పోయాక కిట్టీ తల్లి వున్న బృందం దగ్గరికి వెళ్లింది. కౌంటెస్ నార్డ్‌స్టన్‌తో యేదో కాసేపు మాట్లాడిందో లేదో వ్రాన్స్కీ మొదటి క్వాడ్రిల్ చెయ్యమని అడుగుతూ ఆమె దగ్గరికి వచ్చేడు. క్వాడ్రిల్ నాట్యం చేసేటప్పుడు ముఖ్యమైన విషయాలేమీ ప్రస్తావనకి రాలేదు. యేదో

పాడి ముక్కలు, కొర్సూన్‌స్కీ దంపతుల గురించి యేవో మాటలు సాగేయంతే. ముద్దొచ్చే నలభై యేళ్ల ప్రాయపు పిల్లలు అంటూ వేళాకోళంగా ఆ దంపతుల గురించి అన్నాడు. కొత్తగా కట్టబోయే ప్రజా థియేటర్ పథకం గురించి యేదో మాటలు నడిచాయి. ఒక్కసారి మాత్రం సంభాషణలో కుదుపు వచ్చింది, ఆమె అనుభూతులని స్పృశించింది. అది అతను లేవిన్ గురించి అడిగినప్పుడు. అతను వున్నాడా వెళ్లిపోయాడా అని వాకబు చేశాడు. అత నంటే తనకి యెంతో యిష్టం అని జత చేశాడు. అయినా కిట్టీ క్వాడ్రిల్‌మీద పెద్ద ఆశలు పెట్టుకోలేదు. గుండె దడదడ కొట్టుకుంటూ వుంటే మజూర్కా నాట్యం కోసం యెదురు చూసింది. మజూర్కా నాట్యం అప్పుడు అంతా తేలిపోతుందని ఆమెకి అనిపించింది. క్వాడ్రిల్ నాట్యం చేసేటప్పుడు వ్రాన్‌స్కీ ఆమెని మజూర్కా తనతో కలిసి చెయ్యమని అడగ లేదు. అయినా ఆమె గాభరా పడలేదు. తను అతనితో కలిసి ఖాయంగా మజూర్కా చేస్తుంది అని ఆమె నమ్మకం. లోగడ బాల్‌డాన్స్ లన్నింటిలోనూ అలాగే జరిగింది. తను వేరేవాళ్లతో మజూర్కా నాట్యం చెయ్యాల్సి వుందని చెపుతూ అయిదు మందిని కాదంది. కడపటి క్వాడ్రిల్ దాకా మొత్తం బాల్‌డాన్స్ అంతా ఉత్సాహభరిత వర్ణాలతో, ధ్వనులతో, కదలికలతో సాగిన సమ్మోహకర స్వప్నంలాగా భాసించింది. ఆమె అలిసిపోయి, విశ్రాంతికోసం అప్పప్పు కూర్చుండిపోయిన ఆ కాస్త సమయమూవే ఆమె నాట్యం చెయ్యకుండా వుంట. విసుగు పుట్టించే వో యువకుడితో ఆమె కడపటి క్వాడ్రిల్ చెయ్యాల్సి వచ్చింది. అతన్ని వదిలించుకోవడం కుదరలేదు. ఆ నాట్యం చేసేటప్పుడు వ్రాన్‌స్కీ అన్నాంకి vis-à-vis[1] రావడం తటస్థించింది. బాల్‌కి వచ్చిన వెంటవే చూడ్డం తప్పిస్తే తర్వాత కిట్టీ అన్నాని చూడలేదు. అన్నా యిప్పుడు ఆమెకి పూర్తిగా మరో వ్యక్తిలాగా, అనుకోకుండా కొత్తగా మారిపోయిన వ్యక్తిలాగా కనిపించింది. సఫలతవల్ల ఉత్పన్నం అయిన ఉత్తేజిత లక్షణం ఆమెకి అన్నాలో కనిపించింది. తనకిగా తనకే అలాంటి లక్షణం బాగా పరిచితం అయిందే. ప్రశంసా సారాయితో అన్నా మత్తెక్కి పోయివుందని కిట్టీ చూసింది. ఆమెకి ఆ అనుభూతి తెలుసు, దాని చిహ్నాలు తెలుసు. అన్నాలో ఆమె వాటిని చూసింది. కళ్లల్లో మిణుకు, తేజోభరిత దీప్తి, అనుకోకుండావే ఆమె పెదాలమీద లాస్యం చేస్తూవున్న సంతోషభరిత ఉత్తేజ మందహాసం, ఆమె కదలికల్లో ద్యోతకమయే లఘిమ, జిగి, శోభాయమాన నిర్దుష్టత కిట్టీ గుర్తించింది.

'ఎవరి పొగడ్తలవల్ల? ఒక్కరి పొగడ్తలకా లేక అందరిపొగడ్తల వల్లానా?' అని కిట్టీ తనలో తను అనుకుంది. తనతో కలిసి నాట్యం చేస్తూవున్న యువకుడి సంభాషణ యెక్కడ్నో తెగిపోయి అతను అందుకోలేకుండా వున్నాడు. ఆమె అతనికి మాట అందించి సాయపడలేదు. కొర్సూన్‌స్కీ

[1] ముఖాముఖి, యెదురెదురుగా (ఫ్రెంచి).

వాళ్ళని కాసేపు grand rond[1]కీ కాసేపు chaine[2]కీ పురికొల్పుతూ గట్టిగా, హుషారుగా అరుస్తూ వున్నాడు, ఆ అరుపులని మస్నించి కిట్టీ నాట్యంచేస్తున్నట్టుగా పైకి కనిపించింది. కాని కిట్టీ నిజానికి వ్రాన్‌స్కీ అన్నాలని తదేక దృష్టితో చూసింది. ఆమె హృదయం నీరసించిపోయింది. 'వుహుం, నలుగురి పొగడ్తలవల్లా కాదు, ఒక్క మనిషి పొగడ్తకే ఆమె మత్తెక్కిపోయింది. కాని ఎవరా ఒక్కళ్ళూ? అతనే అయివుంటాడా?' అనుకొంది. వ్రాన్‌స్కీ ఆమెతో మాట్లాడినప్పుడల్లా అన్నా కళ్ళు సంతోషంతో మెరిశాయి. ఆమె యెర్రటి పెదాలు ఆనంద మందహాసంతో వొంపు తిరిగాయి. తన సంతోష చిహ్నాల్ని బయటకి కనిపించనియ్యకుండా చెయ్యాలని ఆమె ప్రయత్నిస్తున్నట్టుగా వుంది. కాని అవి తమంత తామే బయటకి వెల్లడవుతున్నాయి. 'అతని సంగతి యేమిటో?' అనుకుని కిట్టీ అతనికేసి చూసింది. దిగాలు పడిపోయింది. అన్నా ముఖదర్పణంలో యెంతో స్పష్టంగా ప్రతిఫలించిందే అతని ముఖంలోనూ కనిపించింది. దృఢంగా శాంతంగా వుండే అతని ముఖంలో సర్వదా ద్యోతకమయే నిశ్చింత భావాలు యేమయాయి? అన్నీ పోయాయి. యిప్పుడు అతను ఆమెతో మాట్లాడిన ప్రతి సారీ ఆమె ముందు మోకాళ్ళమీద వాలిపోవడానికి ఆతృతపడుతున్నట్టు తల కొంచెంగా వంచేడు. అతని చూపులో భయమూ, వశమైపోయిన భావమూ ద్యోతకం అయాయి. 'మిమ్మల్ని గాయపరచను' అని అతను చూసిన ప్రతి చూపూ చెప్తున్నట్టుంది 'నన్ను రక్షించుకోవాలనుకుంటున్నాను కాని యెలాగో తెలీదు' అనే లాంటి చూపుని అతని ముఖంలో ఆమె అంతకు ముందు యెన్నడూ చూసి యెరగదు.

వాళ్ళిద్దరూ తమకి తెలిసిన వాళ్ళ గురించి మాట్లాడుకున్నారు. శుద్ధ భౌతిక విషయాలు మాట్లాడుకున్నారు. కాని వాళ్ళు అనే ప్రతి మాటా తన అదృష్టాన్నీ, వాళ్ళ అదృష్టాన్నీ నిర్ణయిస్తోందని కిట్టీ అనుకొంది. కాని చిత్రమేమంటే ఫ్రెంచి మాట్లాడ ప్రయత్నించినప్పుడు ఇవాన్ ఇవానొవిచ్ యెంత హాస్యాస్పదంగా వుండేదీ, ఎలేత్‌స్కయాకి యింకా యెలాంటి మంచి సంబంధం దొరికి వుండేదీ అనే విషయాలే వాళ్ళు నిజానికి మాట్లాడుకున్నారు. అయినా ఆ మాటలే వాళ్ళకి ప్రత్యేకార్థంలో భాసించాయి. వాళ్ళకీ ఆ విషయం తెలుసు, కిట్టీకి లాగానే. యిప్పుడు ఆ బాల్‌డాన్స్, అక్కడున్న ప్రతివాళ్ళూ కిట్టీకి సంబంధించి మసక కమ్ముకుపోయినట్టు అనిపించింది. మర్యాదలని పాటించాలి అనే కఠోర శిక్షణే ఆమెకి ఆసరాగా వుంది, ఆమె ఆ శిక్షణలో పెరిగింది. దానివల్లనే తను యేం చెయ్యాల్సి వుందో అది చేసింది — అంటే నాట్యం చెయ్యడం దేనికేనా జవాబు చెప్పడం, మాట్లాడ్డం, చిరునవ్వు నవ్వడం కూడా. కాని మజూర్కా మొదలవడానికి ముందు కుర్చీలని తీసేస్తున్నప్పుడు, కొన్ని జంటలు ఆ చిన్న గదులలోనుంచి పెద్ద గదిలోకి వెడుతున్నప్పుడు,

[1] పెద్ద వృత్తం (ఫ్రెంచి).

[2] గొలుసు (ఫ్రెంచి).

అప్పుడు ఓ క్షణం కిట్టీ హతాశురాలై పోయింది, పూర్తిగా చింతాక్రాంతం అయిపోయింది. మజూర్కా నాట్యం చెయ్యమని తనని పిలిచిన అయిదుమందిని కాదు పొమ్మంది, యిప్పుడు తను మజూర్కా నాట్యం చెయ్యడం లేదు. యిక యెవర్లైనా తనని నాట్యానికి రమ్మని పిలుస్తారన్న ఆశ కూడా లేశ మాత్రంగానైనా లేదు. ఆమె అందరి ఆదరణకీ పాత్రురాలవడంవల్ల ఆమెని యెవళ్ళూ నాట్యానికి పిలవలేదన్న వూహే యెవళ్ళకీ తట్టదు. తనకి వొంట్లో బాగా లేదని తల్లికి చెప్పి యింటికి వెళ్ళిపోవాలి. కాని అలా చేసే ధైర్యం ఆమెకి లేకపోయింది. ఆమె పూర్తిగా దౌర్భాగ్యురాలైపోయింది.

ఆ చిన్న డ్రాయింగ్ రూమ్‌లో ఓ మారుమూలకి వెళ్ళి వో చేతుల కుర్చీలో కూలబడింది. ఆమె రవసెల్లా గౌను నాజూకైన ఆమె ఆకృతి చుట్టూ మేఘంలాగా లేచింది. ఆచ్ఛాదనలేని సన్నటి కోమల తరుణ హస్తం గులాబి కుచ్చెళ్ళ మధ్య నిరుత్సాహంగా పడింది. రెండో చేత్తో విసన కర్ర పట్టుకుంది. దాన్ని గబగబ ఆడిస్తూ వేడెక్కిన ముఖంమీద విసురుకుంది. గడ్డిమీద అప్పుడే వాలిన సీతాకోకచిలక ఇంద్ర ధనస్సు రంగు లీనే తన రెక్కల్ని యే క్షణంలోనైనా తెరుస్తుంది, అల్లల్లాడించుకుంటూ యెగిరిపోతుంది. ఆమె అలా కనిపించింది. అయినా ఆమె గుండెలో భారమైన నిరాశ నిండిపోయింది.

'బహుశా నేను పొరపడ్డానేమో. అలాంటిదేమీ జరిగివుండదు' అనుకొంది ఆమె. మళ్ళీ తను చూసిన దానంతట్నీ గుర్తుచేసుకుంది.

"ఏమిటిది, కిట్టీ? నాకు అర్థం కావడంలేదు" అంది కౌంటెస్ నార్డ్‌స్టన్. తివాసీ మీద నడుచుకుంటూ చప్పుడు కాకుండా కిట్టీ దగ్గరికి వచ్చిందామె.

కిట్టీ కింది పెదవి వణికింది. గబగబా నుంచుంది.

"కిట్టీ, మజూర్కా చెయ్యడం లేదా?"

"లేదు, లేదు" అంది కిట్టీ గద్గదికమైన కంఠంతో.

"అతను ఆమెని మజూర్కా నాట్యానికి పిలవడం నేను విన్నాను" అంది కౌంటెస్ నార్డ్‌స్టన్. 'అతను,' 'ఆమె' అంటే యెవరైందీ కిట్టీకి అర్థమవుతుందని ఆమెకి తెలును. " 'మీరు కిట్టీతో నాట్యంచెయ్యడం లేదూ?' అని ఆమె అడిగింది" అని చెప్పింది నార్డ్‌స్టన్.

"ఓ, ఫరవా లేదు" అంది కిట్టీ.

కిట్టీ పరిస్థితి ఆమె కంటె యెక్కువగా యెవళ్ళూ అర్థంచేసుకోలేరు. తనకి బహుశా ప్రేమ వున్న మనిషిని అంతకు ముందే తను తిరస్కరించింది, మరొకరి మీద యెక్కువ ఆశలు పెట్టుకుంది కాబట్టి. యీ విషయం కూడా యెవళ్ళకీ తెలీదు తనకి తప్ప.

కౌంటెస్ నార్డ్‌స్టన్ కోర్‌సూన్‌స్కీని చూసింది. తను అతనితో మజూర్కా చెయ్యాలి. కాని అతను కిట్టీని పిలిచేటట్టు చేసింది.

కిట్టీ మొదటి జంటలో నాట్యం చేస్తోంది. అదృష్టవశాత్తూ తను యేమీ మాట్లాడనవసరం లేకపోయింది. కోర్‌సూన్‌స్కీ అటూ యిటూ పరిగెత్తేసి క్షేత్రంలో తన బలగానికి

పురమాయింపులు యిచ్చేస్తున్నాడు. అన్నా, వ్రాన్‌స్కీలు దాదాపు ఆమెకి యెదురుగా కూర్చున్నారు. ఆమె తీక్ష్ణమైన కళ్ళు వాళ్లని చూశాయి. తమ జంట నాట్యంచేస్తూ తన దగ్గరికి వచ్చేటప్పటికి యింకా బాగా చూసింది. వాళ్ళని యెంతగా చూస్తే అంతగా తనకి విపత్తు మూడుతోందని ఆమెకి అర్థమైపోయింది. అంత సమ్మర్దంగా వున్న చోట వాళ్లిద్దరూ యేకాంతంగా వున్నట్టే కనిపించింది. యెప్పుడూ నిబ్బరంగా, స్వతంత్రంగా వుండే వ్రాన్‌స్కీ ముఖంలో కిట్టీని ఆశ్చర్య చకితం చేసేటట్టు, నేరం చేసినప్పుడు తెలివైన కుక్కలో కనిపించే మాదిరీ, యేదో కలవరపాటు అణకువ కనిపించేయి.

అన్నా చిరునవ్వు నవ్వితే అతనూ చిరునవ్వు నవ్వాడు. ఆమె యేదన్నా ఆలోచనలో పడితే అతనూ గంభీరంగా అయేడు. యే అతీంద్రియ శక్తో కిట్టీ కళ్లని అన్నా ముఖంకేసి లాగింది. ఆమె సాదా నల్ల గౌనులో మనోజ్ఞంగా వుంది. వంకీలు పెట్టుకున్న ఆమె చేతులు మనోహరంగా వున్నాయి. ముత్యాల పేట వున్న ఆమె దృఢమైన కంఠం మనోహరంగా వుంది. రేగిన ఆమె ముంగురులు మనోహరంగా వున్నాయి. ఆమె చిన్న కాళ్ళు, చేతులు అధికంగా శోభాయమానంగా కదలడం మనోహరంగా వుంది. జీవంతో తొణికిసలాడే ఆమె ముచ్చటైన వదనం మనోహరంగా వుంది. కాని ఆ మనోహరత్వంలో భయం కల్గించేదీ, క్రూరమైందీ కూడా యేదో వుంది.

కిట్టీకి ఆమె అంటే ముందటికంటె యెక్కువగా ప్రేమ కలిగింది. అంతగానూ బాధ కలిగింది. అణగారి పోయినట్టు కిట్టీ బాధపడింది. ఆమె ముఖంలో అది కనిపించింది. వ్రాన్‌స్కీ మజూర్కా నాట్యంచేస్తూ ఆమె దగ్గరికి వచ్చినప్పుడు ఆమెని వెంటనే గుర్తు పట్ట లేక పోయాడు. ఆమె అంతలా మారిపోయింది.

''బ్రహ్మాండమైన బాల్‌డాన్స్'' అన్నాడు, యేదో వొకటి చెప్పాలని.

''అవును'' అంది.

మజూర్కా సాగుతోంది. మధ్యలో కోర్‌సూన్‌స్కీ సూచించిన చిక్కుచిక్కు భంగిమల్లో నాట్యం చేస్తున్నారు. అప్పుడు అన్నా బృందం మధ్యకి వచ్చి యిద్దరు మగాళ్లని పిలిచింది. కిట్టీనీ మరో ఆవిడనీ తన దగ్గరికి రమ్మంది. ఆమె దగ్గరికి వెడుతూ కిట్టీ భయపడినట్టు కనిపించింది. అన్నా కంటిరెప్పలు వాలుస్తూ కిట్టీకేసి చూసి చిరునవ్వు నవ్వుతూ ఆమె చేతిని అదిమింది. కిట్టీ ఆ చిరునవ్వుకి ఆశ్చర్యంగా, నిరాశగా కనిపించే చూపుతో బదులుచెప్పింది. దాన్ని గమనించే అన్నా పక్కకి మళ్లింది. మరో ఆవిడతో హుషారుగా మాట్లాడ్డం మొదలెట్టింది.

'అవును, యీమెలో వింతగా, రాక్షసంగా, సమ్మోహకరంగా కనిపించేది యేదో వుంది' అనుకొంది కిట్టీ.

అన్నా భోజనాలకి వుండాలని అనుకోలేదు. కాని ఆ యింటి యజమాని వుండమని ఆమెని బలవంతం చేశాడు.

"ఓ, అన్నాగారూ, రండి" అన్నారు కొర్సూన్‌స్కీ. అనాచ్ఛాదితంగా వున్న ఆమె చేతిని తన చేతిలోకి లాక్కున్నాడు. "కాటిలియోన్ నాట్యంలో నాకో కొత్త వూహ తట్టింది. Un bijou![1]"

అతను అన్నాని మెల్లిగా తీసుకెళ్ళబోతూ కొంచెం ముందుకు వెళ్ళాడు. యజమాని అంగీకారసూచకంగా చిరునవ్వు నవ్వేడు.

"వద్దు, నేను వుండను" అని చిరునవ్వు నవ్వుతూ అంది అన్నా. ఆమె చిరునవ్వుతో చెప్పినా గట్టిగా అంటూ వున్న ధోరణిని బట్టి ఆమె వుండదని కొర్సూన్‌స్కీ, యజమానీ గ్రహించారు.

"లేదు, యీ శీతకట్టు అంతా పీటర్స్‌బుర్గ్‌లో చేసిందానికంటె మాస్కోలోని యీ ఒక్క బాల్‌లోనూ యెక్కువ నాట్యం చేశాను" అంది అన్నా, తన దగ్గర నుంచున్న వ్రాన్‌స్కీకేసి చూస్తూ. "ప్రయాణానికి ముందు విశ్రాంతి తీసుకోవాలి" అంది.

"మీరు తప్పకుండా రేపే వెళ్ళిపోవాలా?" అని వ్రాన్‌స్కీ అడిగేడు.

"ఆఁ, నా ఉద్దేశం అంతే" అని అంత ధైర్యంగా అతను అలా అడిగినందుకు ఆశ్చర్య పడుతున్నట్టు అంది అన్నా. కాని ఆమె చిరునవ్వు, ఆమె కళ్ళల్లో అదమంగా జ్వలించిన దీప్తి అతన్ని నిప్పులాగా కాల్చేశాయి.

భోజనానికి వుండకుండానే అన్నా బాల్‌నుంచి వెళ్ళిపోయింది.

24

ష్చేర్‌బాత్‌స్కీల యింటినుంచి బయటపడి, అన్నగార్ని చూద్దామని బయల్దేరాడు లేవిన్. 'అవును, నాలో యేదో అప్రియకరమైంది, వెగటు పుట్టించేది కూడా, యేదో వుంది' అనుకున్నాడు నడుస్తూ, నడుస్తూ. 'నేను మనుషులకి నచ్చను. స్వాతిశయం నాకు యెక్కు వంటారు. లేదు, నాకు స్వాతిశయం లేదు. నాకే గనక స్వాతిశయం యెక్కువైతే యిలాంటి పరిస్థితిలో యెందుకు పడతాను?' అనుకున్నాడు. మనో నేత్రం ముందు వ్రాన్‌స్కీ కని పించాడు. సంతోషంగా, దయార్ద్రంగా, తెలివిగా, శాంతంగా వుండే మనిషి. ఆ సాయంత్రం లేవిన్ చిక్కుకున్న లాంటి చిరాకు పరిస్థితిలో అతను యెన్నడూ చిక్కుకోడు. 'అవును మరి ఆమె వ్రాన్‌స్కీనే యెన్నుకోవాలి. అంతే మరి, నేను యెవళ్ళ గురించీ, దేన్ని గురించీ పితూరీ చెయ్యడానికి లేదు. దోషం నాదే. తన జీవితాన్ని నాతో జతచేస్తుందని అనుకొనే హక్కు నాకు యేం వుంది? నేనెవర్ని? నేనేమిటి? యెవళ్ళకీ పనికిరాని చవటని.' అతనికి అన్నగారు నికొలాయ్ గుర్తువచ్చాడు. అతన్ని గురించి అనుకుంటూ తేలిక పడ్డాడు. 'లోకంలో వున్న

---

[1] చాలా ముచ్చటైంది (ఫ్రెంచి).

ప్రతిదీ యేహ్యమైందనీ, వెంపరమైందనీ వాడు అంటాడు. వాడు అలా అనడం సబబే కదా? ముందుగాని, యెప్పుడుగాని నికొలాయ్‌ని గురించి యేం అనుకున్నదీ నిజమేనేమో నాకు తెలీదు. చిరిగిపోయిన కోటు తొడుక్కుని, చిత్తుగా తాగివుండగా ప్రొకోఫీ వాణ్ణి చూశాడు. అతని ప్రకారం నికొలాయ్ రోత మనిషి. నాకు మరో నికొలాయ్ తెలుసు. వాడి అసలు స్వభావం తెలుసు. వాడూ నేనూ చాలా వాటిల్లో ఒకటే అనీ తెలుసు. వాడి దగ్గరకి వెళ్ళడానికి బదులుగా భోజనానికి వెళ్ళాను. యిప్పుడు యిక్కడికి వచ్చాను' అనుకున్నాడు లేవిన్. అతను వీధి దీపం దగ్గరికి వెళ్ళి అన్నగారి అడ్రస్ చదువుకున్నాడు. అది అతని యాదాస్తు పుస్తకంలో వుంది. బండిని పిలిచాడు. అక్కడికి వెళ్ళే దాకా దారిలో అంత సేపూ తనకి తెలిసిన నికొలాయ్ జీవిత సంఘటనల గురించి జ్ఞాపకం చేసుకుంటూనే వున్నాడు. అన్నగారు యూనివర్సిటీలో వున్నప్పుడూ, తర్వాత యింకో యేడాది దాకానూ, యతిలాగా బతికేడు. తోటివాళ్ళ వేళాకోళం చేసినప్పటికీ కచ్చితంగా ఉపవాసాలూ, పుజా పునస్కారాలూ చేసేవాడు. ప్రార్థనలకి హాజరయేవాడు. శారీరక సుఖాలని వేటినీ దరికి రానివ్వలేదు, ముఖ్యంగా ఆడవాళ్ళని. ఆ తర్వాత వున్నట్టుండి దీన్నంతట్నీ గంగలో వదిలేసి పరమ నికృష్టమైనవాళ్ళతో స్నేహం చేశాడు; అడ్డూ అపు లేని వ్యభిచారం చేశాడు. నికొలాయ్ పెంచుకుందామని చేరదీసిన పల్లెటూరి కుర్రాడు లేవిన్‌కి గుర్తుకొచ్చేడు. ఓ సారి వెర్రి కోపం వచ్చి ఆ కుర్రాణ్ణి చావ చితకబాదేడు. అందుగ్గాను నికొలాయ్‌మీద అభియోగం మోపి విచారణ జరిపేరు. ఓ మోసగాడికి పేకాటలో నికొలాయ్ డబ్బు పోగొట్టుకోవడం గుర్తుకొచ్చింది. వాడికి అప్పు పత్రం రాసి యిచ్చేడు. తర్వాత వాడిమీద ఫిర్యాదుచేశాడు, తనని వాడు మోసంచేశాడని (యిదిగో యీ బాకీనే పెద్దన్నయ్య కోజ్నిషెవ్ తీర్చింది). అసభ్య ప్రవర్తనకిగాను నికొలాయ్ ఓ రోజు రాత్రి జైల్లో గడపడం అతనికి గుర్తువచ్చింది. తల్లిగారి ఎస్టేట్‌లో తనకి రావాల్సిన వాటా తనకి యివ్వలేదని కోజ్నిషెవ్ మీద సిగ్గు మాలిన దావా వేసిన విషయం గుర్తువచ్చింది. ఆఖరిగా యింకోటి గుర్తు వచ్చింది. నికొలాయ్ పశ్చిమ ప్రాంతాలకి సర్కారు కొలువు నిమిత్తం వెళ్ళేడు. అక్కడ యెవరో గ్రామపెద్దని కొట్టేడు. అందుగ్గాను కోర్టులో కేసు పెట్టారు. యిదంతా చెప్పలేనంత రోతగానే వుంది. కాని నికొలాయ్‌ని యెరగని వాళ్ళకి, నికొలాయ్ జీవిత గాథ తెలియనివాళ్ళకి, అతని అసలు స్వభావం అందని వాళ్ళకి దీనివల్ల కలిగేటంత వెలపరం లేవిన్‌కి కలగలేదు.

నికొలాయ్ వైష్ణికంగా సన్యాసిలాగా బతుకుతూ, పూజలూ పునస్కారాలూ చేస్తూ తన తీవ్ర కాంక్షాభరిత స్వభావాన్ని దమితంగా వుంచుకోవడానికి మతపరమైన మార్గాలు అవలంబించినప్పుడు యెవళ్ళూ అతన్ని బలపరచలేదు. పైపెచ్చు తనతో సహా అందరూ అతన్ని చూసి నవ్వేరు. అతన్ని నోవాఅనీ, యతీంద్రుడనీ పిలిచి యేడిపించారు. యిప్పుడు పతితుడయ్యాడని యెవళ్ళూ అతనికి సాయంచెయ్యరు. పైగా భయపడిపోయి, యేవగింపుగా అతన్నుంచి పారిపోతున్నారు.

నికొలాయ్ జీవిత విధానం అసహ్యంగా వున్నా అతని అంతరంగంలో, అంతరంగపు లోతు పొరల్లో అతన్ని ఖండించేవాళ్లకంటె యెక్కువ దోషి కాడని లేవిన్‌కి అనిపించింది. జన్మతః అదమిత కాంక్షలూ, వ్యథాభరిత చిత్తమూ వుండడం అతని తప్పు కాదు. అతను యెప్పుడూ చెడు చెయ్యకుండా వుండాలనే కోరుకున్నాడు. 'సర్వం వాడికి చెప్తాను, తను నాకు యావత్తూ చెప్పేటట్టు చేస్తాను. వాడంటే నాకు యిష్టం అని చూపిస్తాను. అందుకు అతన్ని అర్థంచేసుకుంటాను' అని అన్నగారు వుంటున్న హోటల్ దగ్గరికి రాత్రి పది దాటాక వెడుతూ లేవిన్ తీర్మానించుకున్నాడు.

"పైన, పన్నెండు పదమూడు నంబరు గదులు" అని లేవిన్ అడిగిందానికి కాపలా వాడు జవాబిచ్చేడు.

"లోపం వున్నాడా?"

"వుండే వుండాలి."

పన్నెండవ నంబరు గది తలుపు ఓరగా తెరిచి వుంది. ఆ సందులోనుంచి యువతలికి పడుతూ వున్న వెలుతుర్లో చవక బారు చెత్త పొగాకు దట్టమైన పొగ సుళ్లు తిరుగుతోంది. యేదో అపరిచిత కంఠం లేవిన్‌కి వినిపించింది. కాని అన్నగారు అక్కడ వున్నట్టు గ్రహించాడు, అతను దగ్గడం వినిపించింది.

అతను గుమ్మం దగ్గరికి వెళ్లేడు. కొత్త కంఠం మాట వినిపించింది:

"యీ వ్యాపారం నిర్వహించే మంచితనంమీదా, చిత్త శుద్ధిమీదా అంతా ఆధారపడుతుంది."

లేవిన్ గదిలోకి చూశాడు. యీ మాటలు అంటున్న మనిషి పడుచువాడు. అతని జుట్టు గుబురుగా వుంది. అతను పైకోటు తొడుక్కున్నాడు. సోఫామీద స్ఫోటకం మచ్చల పడుచామె ఒకరు కూర్చుంది. ఆమె తొడుక్కున్న వూలు బట్టల చేతులకి, మెడకి లేసులు లేవు.* నికొలాయ్ కనిపించలేదు. యిలాంటి వింత మనుషులతోనా అన్నగారు కలిసి వుండడం అని మనసుకి తట్టగానే లేవిన్ హృదయం కలుక్కుమంది. లేవిన్ రాక యెవరూ గమనించలేదు. పై బూట్లు విప్పుతూ అతను పైకోటు తొడుక్కున్న పడుచతను చెప్పేది విన్నాడు. అతను యేదో వ్యాపారం గురించి మాట్లాడుతున్నాడు.

"ఆధిక్య వర్గాల సిగ్గోసిరిగాని" అంటున్నాడు అన్నగారు దగ్గుతూ. "మాషా! కొంచెం తిండి తెప్పించు. అందులో యేమన్నా వైన్ మిగిలివుంటే యిలా యియ్యి, లేకపోతే యింకొంచెం తెమ్మనమని చెప్పు" అన్నాడు.

ఆమె లేచి గుమ్మం దగ్గరికి వెళ్లింది. లేవిన్ కనిపించాడు.

"యెవరో వచ్చారు నికొలాయ్‌గారూ" అంది.

"యెవరు?" అని నికొలాయ్ విరాగ్గా అడిగాడు.

"నేను" అన్నాడు లేవిన్ గదిలోనుంచి యువతలకి పడే వెలుతురులోకి వెళ్తూ.

"నేనంటే?" అన్నాడు నికొలాయ్ యింకా చిరాగ్గా. అతను గలగలా లేస్తూ వుండడం, దేనిమీదో తొట్రుపడ్డం వినిపించింది. మరు క్షణంలో అన్నగారు గుమ్మంలో తనకి యెదురుగా నుంచోవడం లేవిన్‌కి కనిపించింది. నికొలాయ్ పొడుగాటి మనిషి. వల్చగా యెండిపోయి వున్నాడు. భుజాలు వాలి వున్నాయి. భయపడుతూవున్న పెద్ద కళ్ళు. అది తనకి తెలిసిన దృశ్యమే అయినా అన్నగారు యెంత జబ్బుగా, బెదిరిపోయి వున్నదీ చూసి లేవిన్ నిశ్చేష్టుడైపోయాడు.

లేవిన్ అతన్ని మూడేళ్లనాడు చూసేడు. అప్పటికంటే యిప్పుడు అన్నగారు యింకా చిక్కిపోయాడు. పొట్టి కోటు వేసుకున్నాడు. పెద్ద కణువులతో వున్న చేతులు అంత పెద్దగా ముందెప్పుడూ కనిపించలేదు. జుట్టు పలచబడింది. వంకరలేని అదే మీసం. అవే కళ్ళు కొత్తగా వచ్చిన యీ మనిషికేసి వింతగా అమాయకంగా తేరి చూశాయి.

"అరె, నువ్వా" అన్నాడతను తమ్ముణ్ణి గుర్తుపట్టి. అతని కళ్లల్లో సంతోషం మెరిసింది. కాని వెంటనే అక్కడున్న ఆ రెండో పడుచు మనిషికేసి చూసి కాలరు మరీ బిగుతుగా వున్నట్టనిపించే మెడ సాగదీసి మెలితిరిగినట్టుగా తల తిప్పాడు. అది లేవిన్‌కి బాగా పరిచితమైన కవళికే. వెంటనే నికొలాయ్ చిక్కిపోయిన ముఖ భంగిమ మారిపోయింది. అన్యమనస్కంగా, క్రూరంగా, బాధతో నిండినట్టుగా అయింది.

"మీతో నాకు యిక సంబంధం లేదని మీకూ, పెద్దాయనకీ రాశాను కదా? యిదేమిటి? యేం కావాలి నీకు – మీకు?"

అతన్ని గురించి తను యెలా వూహించుకున్నాడో ఆ మాదిరి లేనేలేడతను. అతన్ని గురించి అనుకున్నప్పుడు అతని స్వభావంలో వున్న దుర్మార్గ లక్షణాలని, అతన్ని కలుసుకోవడం కఠినంచేసే వాటిని లేవిన్ మర్చిపోయాడు. యిప్పుడు అతని ముఖంలోకి చూసేటప్పుడు, అతని తల బాధగా మెలితిరగడం చూసినప్పుడు, అవన్నీ గుర్తువచ్చాయి.

"నేనేం నీ దగ్గరికి పనిమీద రాలేదు. వూరికే నిన్ను చూద్దామని వచ్చేను" అన్నాడు లేవిన్ వినయంగా.

అతని వినయం చూసి నికొలాయ్ మెత్తబడినట్టే కనిపించాడు. అతని కింది పెదవి వణికింది.

"ఓ, అందుకు వచ్చావా? అయితే లోపలికి రా. కూర్చో. భోజనం చేస్తావా? మాషా, ముగ్గురికి భోజనాలు చెప్పు. వుహుం, ఆగు. యితనెవరో నీకు తెలుసా?" అని పైకోటు తొడుక్కున్న వ్యక్తిని చూపిస్తూ తమ్ముణ్ణి అడిగాడు. "యితను క్రీట్స్కీ. కీయెవ్‌లో వున్న రోజులనాటి స్నేహం. భలేవాడు. పోలీసులు యితన్ని వెన్నాడుతున్నారు, యితను నీచుడు కాదని! ఆ విషయం చెప్పక్కర్లేదుగా" అన్నాడు.

అతను గదిలో అందరికేసీ తన ధోరణిలో చూశాడు. గుమ్మం దగ్గర యింకా నుంచున్న ఆడమనిషి వెళ్లిపోతున్నట్టు కదలగానే చూసి "ఆగు! ఆగమని చెప్పాను నీకు" అని అరిచాడు. తర్వాత, లేవిన్‌కి బాగా తెలిసిన రీతిలో, చుట్టూతా మరో సారి చూసి అసందర్భంగా,

యెడ్డితనంగా వుండే మాటలతో తమ్ముడికి క్రీత్‌స్కీ కథ చెప్పడం మొదలుపెట్టేడు: బీద విద్యార్థులకి సాయంచేసే సంఘాన్ని నిర్వహించినందుకూ, ఆదివారాలప్పుడు బడి నడిపి పాఠాలు చెప్పినందుకూ క్రీత్‌స్కీని యూనివర్సిటీనుంచి బహిష్కరించారట. తర్వాత అతను యేదో వూళ్లో బడి పంతులు అయాట్ట. అక్కడ్నుంచీ ఉద్వాసన చెప్పార్ట. ఆ తర్వాత దేనికోగాని కోర్టుకు పట్టుకుపోయారట.

"మీరు కీయెవ్ యూనివర్సిటీవాళ్లా?" అని లేవిన్ యిబ్బెట్టుగా వున్న నిశ్శబ్దం తొలగించడానికి అడిగాడు.

"ఆఁ, కొంతకాలం" అన్నాడు క్రీత్‌స్కీ ముఖం ముడుచుకుంటూ.

"ఆమె" అన్నాడు నికొలాయ్ ఆమెకేసి చూపిస్తూ, "ఆమె మాషా. నా జీవిత భాగస్వామి. ఆమెని ఒక చోటునుంచి తీసుకువచ్చాను" అంటూ అతను తల యెగరేశాడు. "కాని ఆమె అంటే నాకు ప్రేమ. ఆమెని గౌరవిస్తాను. నా స్నేహితుడని చెప్పుకునే ప్రతివాడూ ఆమె అంటే యిష్టపడి ఆమెని గౌరవించాలని అడుగుతాను" అని కనుబొమలు ముడుస్తూ, గొంతుక పెంచి అన్నాడు. "ఆమె నా భార్య లాంటిదే, అచ్చం అలాంటిదే. తెలిసిందా, యెవరితో వున్నావ్ నువ్వు? నువ్వు గనక యిది నీకు పరువు తక్కువని అనుకుంటే, దణ్ణం పెట్టి తిన్నగా వెళ్లిపోవచ్చు" అన్నాడు.

మరోసారి అతను అందరి ముఖాలకేసీ ప్రశ్నార్థకంగా చూశాడు.

"నాకు పరువు తక్కువని నేనెందుకనుకోవాలో అర్థం కావడం లేదు" అన్నాడు లేవిన్.

"అయితే మాషా, ముగ్గురికి భోజనాలు తెమ్మని చెప్పు. వోద్కా వైనూ కూడా.... వుహుఁ, ఆగు.... వద్దులే, ఆగద్దు... వెళ్లు."

25

"చూశావా?" అన్నాడు నికొలాయ్, కనుబొమలు ముడుస్తూ. కష్టంమీద వొళ్లంతా విరుచుకున్నాడు. యేం చెప్పాలో, యెలా వుండాలో తెలియక యిబ్బంది పడుతున్నట్టు కనిపించాడు. "అదుగో, అక్కడ చూశావా?" అంటూ గదిలో వొక మూలకి చూపించాడు. అక్కడ కొన్ని యినప వూచలు కట్ట కట్టివున్నాయి. "చూశావా అది? ఒక కొత్త వ్యాపారానికి నాంది. ఒక ఉత్పత్తి సంఘాన్ని స్థాపిస్తున్నాం" అన్నాడు.

లేవిన్ అతను చెప్పేదాన్ని అసలు వినడమే లేదు. అతని ముఖంకేసే చూస్తూ వున్నాడు. క్షయ వ్యాధిగ్రస్తంగా వున్న అతని ముఖంకేసి చూస్తూ వుంటే యింకా బాధ కలిగింది. ఆ కొత్త వ్యాపారం గురించి అతనేం చెప్తున్నాడో వినలేకపోయాడు. తన పట్ల తనకే యేహ్యభావం కలగకుండా వుండేందుకు గాను ఆఖరి ప్రయత్నంగా అన్న యీ ఉత్పత్తి సంఘాన్ని పట్టుకుంటున్నాడని లేవిన్‌కి అర్థం అయింది. నికొలాయ్ చెప్తూనే వున్నాడు.

"తెలుసా పెట్టుబడి పనివాళ్లని నాశనం చేసేస్తోంది. మన రైతులు, పనివాళ్లు మొత్తం

కావడి బరువుని భుజాంమీద మోస్తున్నారు. అయినాగాని వాళ్ల బతుకుల గొంగళి నేసిన చోటే వుంటోంది. యెంత ప్రయత్నించినా 'సందులలో పందుం' స్థితి దాటి బయటపడ లేకపోతున్నారు. తమ శ్రమ ఫలితాలతో తమ పరిస్థితిని మెరుగుపరుచుకోగలరు, కొంత విశ్రాంతిని అనుభవించగలరు, తత్ఫలితంగా విద్య సంపాదించుకోగలరు. ఆ లాభాలని ఫలితాలని పెట్టుబడిదారులు చేజిక్కించుకుంటున్నారు. మన సమాజం యెలా వుందంటే శ్రామికులు యెంత కష్టపడి పనిచేస్తే అంతగా వర్తకులూ, భూస్వాములూ బలుస్తున్నారు; శ్రామికులు మాత్రం గానుగెద్దు పశుగానే వుండిపోతున్నారు. యీ పద్ధతిని మార్చాలి" అని తమ్ముడికేసి యేమంటావ్ అన్నట్టు చూస్తూ, ముగించాడు.

"అవును మరి, అంతేగా" అన్నాడు లేవిన్. స్ఫుటంగా వున్న అన్నగారి చెక్కిళ్లకి కెంపు వన్నె వచ్చింది. లేవిన్ దాన్ని ప్రత్యేకంగా గమనించేడు.

"అందుకనే మేం కమ్మరం పని చేసేవాళ్ల సంఘం పెడుతున్నాం. . మేం ఉత్పత్తి చేసేదంతా, మేం సంపాదించేదంతా, ముఖ్య ఉత్పత్తి సాధనాలన్నీ ఉమ్మడి స్వామ్యంలోనే వుంటాయి."

"మీ సంఘం యెక్కడ పనిచేస్తుంది?" అని లేవిన్ అడిగాడు.

"కజాన్ గుబేర్నియాలోని వోజ్ద్ర్యోమ గ్రామంలో."

"గ్రామంలో యెందుకు? దాని పని దానికి వుంది, అలా అని నాకనిపిస్తుంది. కమ్మర్ల సంఘాన్ని పల్లెటూళ్లో స్థాపించడం దేనికి?"

"యెందుకా? యెందుకంటే రైతులు యిది వరకటిలాగానే యివాళా బానిసలుగా* బతుకుతున్నారు కాబట్టి. వాళ్ల బానిసత్వాన్ని రూపుమాపే ప్రయత్నాలు నీకూ, నీ ఘనమైన అన్నగారికి కూడా యిష్టంలేదు కాబట్టి" అన్నాడు నికొలాయ్, తమ్ముడు చెప్పిన అభ్యంతరానికి చిరాకుపడి.

లేవిన్ నిట్టూర్పు విడిచి, మకిలిగా మబ్బుగా వున్న గదిలో చుట్టూ చూశాడు. ఆతని నిట్టూర్పు నికొలాయ్‌ని యింకా చిరెత్తించింది.

"మీ అన్నగారి భూస్వామ్య అభిప్రాయాలు నాకు తెలుసు. వున్న చెడుగుల్ని సమర్థించడానికే బుర్రంతా ఉపయోగిస్తాడనీ తెలుసు."

"నేనలా అనుకోను. అయినా అన్నయ్య గురించిన చర్చ యెందుకు చేస్తున్నావ్ నువ్వు?" అని లేవిన్ చిరునవ్వు నవ్వుతూ అన్నాడు.

"యెందుకనా? యెందుకని!" అని కోజ్నిషెవ్ ప్రస్తావన రాగానే వున్నట్టుండి నికొలాయ్ అరిచాడు. "యెందుకని!... అయినా యేం లాభం? అదే పాత కంపు... నా దగ్గరికి యెందుకు వచ్చావ్? యిదేమీ నీకు పడదు, అసహ్యం, సరే, పో అవతలికి. వెళ్లిపో" అని లేచి మంచంటూ అరిచాడు. "వెళ్లిపో, వెళ్లిపో" అన్నాడు.

"నాకు అసహ్యం యేమీ లేదు. నేను నువ్వు చెప్పేదాన్ని ఖండించను కూడా ఖండించడం లేదే!" అన్నాడు లేవిన్ పిరికిలాగా.

సరిగ్గా అప్పుడే మాషా లోపలికి వచ్చింది. నికొలాయ్ ఆమెకేసి కోపంగా చూశాడు. ఆమె గబగబా అతని దగ్గరికి వెళ్లి అతనితో యేదో గొణిగింది.

"నాకు బాగా లేదు. చిరాగ్గా వుంది" అన్నాడు నికొలాయ్. తర్వాత కొంచెం స్థిమిత పడ్డాడు. గాఢంగా గాలి పీల్చాడు. "నువ్వేమో పెద్దన్నయ్య గురించి ఆయన వ్యాసం గురించి మాట్లాడతావు. యెన్ని అబద్ధాలు, యెంత చెత్త, యేం ఆత్మవంచన! న్యాయం అంటే యేమిటో యెరగని మనిషి దాన్ని గురించి రాయడం యేమిటి చెప్పు? – ఆ వ్యాసం చదివారా?" అని క్రీత్‌స్కీని అడిగాడు. బల్లమీద సిగరెట్లు చుట్టుకునే కాగితాలు వున్నాయి. చుట్టిన సిగరెట్లు వున్నాయి. వాటిని పక్కకి తోసేసి కూర్చున్నాడు.

"లేదు, చదవలేదు" అన్నాడు క్రీత్‌స్కీ ఉదాసీనంగా. సంభాషణలో జోక్యం చేసు కోవడం యిష్టంలేనట్టే కనిపించాడు.

"యెందుకు చదవలేదు?" అని యీ సారి క్రీత్‌స్కీ మీద చిరాకుపడుతూ అడిగాడు నికొలాయ్.

"అలాంటి వాటి మీద సమయం వృథా చెయ్యడం యిష్టంలేక."

"అహా, తెలియక అడుగుతాను! సమయం వృథా అని మీకు యెలా తెలుసు? చాలా మందికి ఆ వ్యాసం అర్థంకాదు, వాళ్ల బుర్రలకి యెక్కదు. మన విషయంలో అలా కాదు. అతని వుహాలేమిటో నాకు తెలుసు, వాటిల్లో లొసుగేమిటో నాకు తెలుసు."

యెవళ్లూ యేమీ అనలేదు. క్రీత్‌స్కీ మెల్లిగా లేచి టోపీ అందుకున్నాడు.

"భోజనం వద్దా? సరే అయితే, సెలవ్. రేపు ఆ కమ్మరిని కూడా తీసుకురండి."

అతను వెళ్లిపోగానే నికొలాయ్ చిరునవ్వు నవ్వి కన్ను గీటేడు.

"యితనూ యేం పనికి రాడు" అన్నాడు. "కనిపిస్తోందిగా..."

గుమ్మం దగ్గరినుంచి క్రీత్‌స్కీ పిలవడంతో అతను చెప్పబోయేదానికి అంతరాయం కలిగింది.

"యేం కావాలి మీకు" అన్నాడు నికొలాయ్ అతని దగ్గరికి వెడుతూ. మాషా, లేవిన్‌లు యిద్దరూ గదిలో వుండిపోయారు. లేవిన్ ఆమెని మాటల్లోకి దించాడు.

"మా అన్నయ్యని చాలా కాలంగా యెరుగుదురా మీరు?"

"ఓ యేడాదిపైగా. చాలా చిక్కిపోయారు. బాగా తాగేస్తున్నారు" అందామె.

"యేమిటి?"

"వోద్కా. ఆయనకి అది పడదు."

"అంత యెక్కువ తాగుతాడా?" అని లేవిన్ గొంతు తగ్గించి అడిగాడు.

"వూఁ" అందామె, బెరుకు బెరుగ్గా గుమ్మంకేసి చూస్తూ. నికొలాయ్ అప్పుడే వస్తు న్నాడు.

"యేమిటి మాట్లాడుకుంటున్నారు?" అని అడిగాడు. కనుబొమలు ముడుస్తూ

ఒకళ్ల నేపునుంచి యింకొకళ్ల నేపు బెదిరిన చూపు చూశాడు. "దేన్ని గురించి?" అని అడిగాడు.

"యేమీ లేదు" అన్నాడు లేవిన్ యిబ్బంది పడుతూ.

"చెప్పడం యిష్టం లేకపోతే చెప్పొద్దు. కాని ఆమెతో మాట్లాడేదేమీ వుండదు నీకు. ఆమె బజారు మనిషి, నువ్వేమో పెద్ద మనిషివి" అన్నాడు, తల వూపుతూ.

"నీకు అన్నీ అర్థం అయాయనుకుంటాను. నువ్వు పొప్పకోవు. పాపం చేసిన నీ అన్నని జాలితో చూస్తున్నావు" అని మళ్లీ బిగ్గరగా మొదలుపెట్టాడు.

"నికొలాయ్‌గారూ, నికొలాయ్‌గారూ" అని అతనికి దగ్గరికి వెళ్లి మాషా గొణిగింది.

"ఓ, బాగుంది, బాగుంది!.. భోజనం యేదీ? ఆఁ! వస్తోందా" అన్నాడు ట్రే పట్టుకుని లోపలికి వస్తూవున్న వెయిటర్‌ని చూసి. "యిక్కడ పెట్టు" అన్నాడు చిరాగ్గా. తకామని వోద్కా అందుకున్నాడు. బుల్లి గ్లాసు నిండా పోసుకుని గడగడ ఆబగా తాగేశాడు. "తాగుతావా?" అని తమ్ముడ్ని అడిగాడు. అప్పడే హుషారెక్కింది.

"మీ పెద్ద అన్నగారి గురించి యిక చాలు. నువ్వు కనిపించావు సంతోషంగా వుంది. యెంతయినా, మనం పరాయివాళ్లమా! దా, తాగు. యేం చేస్తున్నావో చెప్పు" అంటూ మాట్లాడుతూనే వున్నాడు. రొట్టె ముక్కని నములుతూ, బుల్లి గ్లాసు నిండా మళ్లీ వోద్కా పోసుకున్నాడు. "నీ జీవితం యెలా వుంది?" అని అడిగాడు.

"ముందటిలాగానే గ్రామంలో ఒంటరిగా వున్నాను. ఎస్టేట్ చూస్తున్నాను" అన్నాడు. అన్నగారు అలా ఆబగా తినడం, తాగడం చూసి స్తబ్ధుడైపోయాడు. కాని తను పరకాయించి అటు చూస్తూనట్టు అన్నగారు గమనించకూడదనే ప్రయత్నం చేశాడు.

"పెళ్లెందుకు చేసుకోలేదు?"

"అవకాశం రాలేదు" అన్నాడు సిగ్గుతో ఎర్రబడుతూ లేవిన్.

"అదేమిటి! నాకైతే కథ ముగిసినట్టే. నా జీవితం నాశనం అయిపోయింది. నేనిది వరలోనే చెప్పాను, యిప్పుడూ చెప్తున్నాను నాకు రావాల్సిన వాటాని అప్పుడే, నాకవసరం పడినప్పుడే, యిచ్చేసివుంటే, నా యావజ్జీవితం మరోలా వుండి వుండేది."

లేవిన్ గబగబా విషయాన్ని మార్చేడు.

"తెలుసా నీకు, నీ వాన్య నా దగ్గర పొక్రోవ్‌స్కొయెలో గుమాస్తాగా పని చేస్తున్నాడు" అన్నాడు.

నికొలాయ్ తక్కున తల ఆడించేడు. యేదో ఆలోచనలో మునిగిపోయాడు.

"పొక్రోవ్‌స్కొయెలో యేం జరుగుతోందో చెప్పు. యింకా ఆ యిల్లు వుందా, బర్చ్ చెట్లూ, మనం చదువుకునే గదీ వున్నాయా? తోటమాలి ఫిలిప్ బాగున్నాడా? నేసవి యిల్లూ, మనం కూర్చునే జాగా యెంత బాగా గుర్తున్నాయి నాకు! చూడు, యింటి విషయంలో

యే మార్పులూ చెయ్యకు. త్వరగా పెళ్లి చేసుకో. వున్నవాటిని యెప్పటిలాగానే వుంచెయ్యి. నేను వచ్చి నిన్ను చూస్తా — నీ పెళ్లాం మంచిదైతేనే."

"నువ్వు యివ్వాడే నా దగ్గరికి వచ్చెయ్యొచ్చు. మనం యెంత హాయిగానో కలిసి వుండచ్చు" అన్నాడు లేవిన్.

"పెద్దాయనతో అక్కడ భేటీ అవకపోతే వచ్చేవాణ్ణి."

"అవదు. నేను ఒకణ్ణే వుంటున్నాను."

"నాకు తెలుసులే. నువ్వేన్ని చెప్పు, మా యిద్దరిలో యెవళ్లనో ఒకళ్లనే యెంచుకోవాలి నువ్వు" అన్నాడు తమ్ముడి కళ్లల్లోకి అణకువగా చూస్తూ. ఆ అణకువ లేవిన్ హృదయాన్ని కదిలించింది.

"యీ విషయంలో నా అభిప్రాయం చెప్పమంటావా? నీకూ పెద్దన్నయ్యకీ మధ్య జరిగిన గొడవలో నేను యే పక్షమూ వుండను. యిద్దరిదీ తప్పే. నువ్వేమో పైకి తేల తావు, ఆయన తేలడు అంతే."

"అద్గదీ! నీకర్థం అయింది కదా! అర్థం అయింది కదా!" అని నికొలాయ్ సంతోషంగా అరిచాడు.

"కాని నీకో సంగతి చెప్తాను, వ్యక్తిగతంగా అయితే నీతో స్నేహానికే యెక్కువ స్థానాన్ని యిస్తాను. యేమంటే..."

"యెందుకని? యెందుకని?"

నికొలాయ్ దురదృష్టవంతుడనీ, అంచేత అతనికి స్నేహం యెక్కువ అవసరమనీ లేవిన్ చెప్పలేకపోయాడు. కాని అదే అతను చెప్పబోయాడని నికొలాయ్ వూహించాడు. దాంతో ముఖం చిట్లించుకుని మళ్లీ వోద్కా అందుకున్నాడు.

"చాలింక, నికొలాయ్‌గారూ" అంది మాషా, బొద్దుగా బోసిగా వున్న చేతిని బుడ్డి వేపు చాస్తూ.

"ఛవ్! నువ్వు రాకు! ఒక్కటేస్తానంతే" అని అతను అరిచాడు.

మాషా పిల్లిలా చూస్తూ జాలిగా చిరునవ్వు నవ్వి బుడ్డి లాగేసింది. నికొలాయ్ కూడా ఆ చిరునవ్వుకి జవాబుగా చిరునవ్వు నవ్వేడు.

"ఆమె అర్థం చేసుకోలేదని నువ్వనుకుంటున్నావా? ఆమె నీకంటే నాకంటే బాగా అర్థంచేసుకోగలదు. ఆమెలో యెంతో మంచితనం వుంది, ప్రియమైంది వుంది. యేమంటావ్?" అన్నాడు నికొలాయ్.

"మీరు యింతకు ముందెప్పుడన్నా మాస్కో వచ్చారా?" అని లేవిన్ యేదో వొకటి అనాలి కదా అన్చెప్పి అడిగాడు.

"నువ్వు ఆమెని 'మీరు' అనక్కర్లేదు. ఆమెకి అలాంటి మర్యాదలంటే భయం. యింత వరకూ యెవళ్లూ యీమెతో యిలాంటి మర్యాదలు పాటించలేదు, ఆ పల్లెటూరి పంచా

యితే న్యాయాధికారి తప్ప. యీమె గుడిసెటి కొంపలోనుంచి పారిపో ప్రయత్నించినప్పుడు పంచాయితీ పెట్టార్లే, అప్పుడు" అన్నాడు. హఠాత్తుగా "అరె బాప్‌రే! యీ కొత్త సంస్థలు, జెమ్‌స్ట్వో కౌన్సిళ్లు, పల్లెటూరి న్యాయాధికార్లు,* యేమిటివన్నీ! యెన్ని ఘోరాలు జరిగిపోతున్నాయి! యింతకంటే ఘోరం యేమన్నా వుంటాయా?" అని అరిచాడు.

యీ కొత్త సంస్థల వల్ల వచ్చే కీడులని వివరించ మొదలుపెట్టాడు.

యే ప్రజా సంస్థల వల్లా ఉపయోగం లేదని అన్నగారు కొట్టిపారేస్తూ వున్నాడు. అదే అభిప్రాయాలు లేవిన్‌కీ వున్నాయి, యెన్నో సార్లు తనే వాటిని వ్యక్తం చేశాడు. కాని అన్నగారి నోటమ్మట వాటిని వినడం యెందుకనో అతనికి బాగా అనిపించలేదు.

"పై లోకంలో వీటన్నిటి గురించీ అర్థంచేసుకుందాంలే" అన్నాడు తేలిగ్గా.

"పై లోకంలో? నాకు పై లోకం అంటే యిష్టం లేదు, యేమీ యిష్టం లేదు" అంటూ నికొలాయ్ తమ్ముడికేసి భయంగా, వెర్రి చూపు చూశాడు. "యీ కుళ్ళూ, పాశవికత్వం – నీదీ, పరాయిదీ కూడా – వదిలించుకోవడం మంచిదనే యెవళ్ళేనా అనుకుంటారు. కాని నాకు చావంటే భయం. చెప్పలేనంత భయం" అతను కుదిలేడు. "వూఁ, కొంచెం తాగు. షాంపేన్ కావాలా? యెక్కడికేనా పోదాం పద. వెళ్లి జిప్సీ పాటలు విందాం. నాకు జిప్సీలన్నా, రష్యన్ పాటలన్నా యిష్టంగా వుంది" అన్నాడు.

అతని నాలుక మొద్దుబారుతోంది. ఓ దొంకా తెన్నూ లేకుండా వో విషయంమీదనుంచి యింకోదాని మీదకి గెంతేస్తున్నాడు. యెక్కడికీ వెళ్లక్కర్లేదని మాషా సాయంతోటి వొప్పించి, చిత్తుగా తాగిన మైకంలో అతన్ని పడుకోబెట్టాడు లేవిన్.

అత్యవసరం అయితే లేవిన్‌కి ఉత్తరం రాస్తానని మాషా మాట యిచ్చింది. నికొలాయ్‌ని బలవంతంచేసి లేవిన్‌తో వుండేటట్టు చేస్తానని కూడా అంది.

26

ఉదయమే మాస్కోనుంచి వూరికి బయల్దేరాడు లేవిన్. సాయంత్రానికి యింటికి చేరాడు. రైల్లో తోటి ప్రయాణీకులతో రాజకీయాల గురించీ, కొత్త రైల్వేల గురించీ, అలాంటి బాపతు విషయాల గురించీ మాట్లాడేడు. మళ్లీ మాస్కోలో మాదిరిగానే గజిబిజిగా వున్న తన ఆలోచనలని చూసి దిగాలు పడిపోయాడు. తనమీద తనకే అసంతృప్తి కలిగింది. యెవళ్లకో అన్యాయం చేశానన్న లజ్జ కలిగింది. కాని స్టేషన్ దగ్గర దిగాక తన బండి తోలే ఒంటి కన్ను మనిషి ఇగ్నాత్ కనిపించేడు. ఇగ్నాత్ అంగి కాలర్ పైకి యెత్తుకున్నాడు. లేవిన్‌కి స్టేషన్ కిటికీల్లోనుంచి పడే మసక వెలుతురులో తివాసీలు పరిచిన తన స్లెడ్జ్ బండి కనిపించింది. తోకలు ముడివికట్టిన గుర్రాలు కనిపించేయి. ఆ గుర్రాలు గంటలు, కుచ్చులు కట్టిన ముస్తీబులతో వున్నాయి. అతని సామానుని బండిలో చేరవేయిస్తూ వుండగా

ఇగ్నాత్ వూళ్లో విశేషాలు అన్నీ చెప్పేడు. కాంట్రాక్టరు వచ్చేడట. ఆవు 'పావా' యీనిందట. యిదంతా చూసి, యీ విశేషాలు విన్నమీదట లేవిన్‌కి మనసు తేటపడినట్టు అనిపించింది. మనస్సులోని గజిబిజి, తనమీద తనకే కలిగిన అసంతృప్తి, లజ్జ తొలగినట్టనిపించింది. ఇగ్నాత్‌నీ, గుర్రాలనీ చూడగానే అతనికి అలా అనిపించింది. తనకోసం తెచ్చిన గొర్రెతోలు కోటుని తొడుక్కుని స్లెడ్జి బండిలో యెక్కి బయల్దేరాడు. ఎస్టేట్‌లో తను చెయ్యవలసి వున్న పనుల గురించి అనుకున్నాడు. బండి లాగుతున్న దాపటి గుర్రాన్ని చూశేడు. అది జాతి గుర్రమే. డాన్ జాతిది. ఒకప్పుడు జీను సవారీ గుర్రంగా వుండేది. యిప్పుడు ముసలిదై పోయింది. అయినా జవంతోటే వుంది. దీనంతటిని చూసి తనకి జరిగిన దాన్ని గురించి సమూలంగా నూతన భావం కలిగింది. తను తనేననీ, మరి యింకోలా వుండ గోరడం లేదనీ అతనికి అనిపించింది. తను ముందు వున్నదానికంటే మెరుగ్గా వుండాలనే కోరుకున్నాడు. మొదటగా, పెళ్లి లాంటిది సమకూర్చే అసాధారణ ఆనందంమీద ఆశపెట్టుకోవడం మానెయ్యాలి. తత్ఫలితంగా ప్రస్తుతం తను జీవిస్తూ వున్న సరళిని యేవగించుకోవడం మానేస్తాడు. రెండవదిగా, తను యిక యెన్నటికీ మనసుని తుచ్ఛంగా విహరించనివ్వడు. పెళ్లి ప్రస్తావన చెయ్యాలని ఆలోచన చేసినప్పుడు ఆ జ్ఞాపకం తనకి దుర్భర వేదనని కలిగించింది. తర్వాత అన్నగారు నికొలాయ్ గుర్తువచ్చేడు. తను అతన్ని యెన్నటికీ మరిచిపోననీ, అతని అజ కనుక్కుంటూనే వుంటాననీ, సంబంధాలు పెట్టుకుంటూనే వుంటాననీ, అలా వుంటే అతనికి సహాయం అవసరం అయినప్పుడు సాయచెయ్యవచ్చునీ మనసులో తీర్మానించుకున్నాడు. అలా సాయం చెయ్యవలసి రావడం త్వరలోనే జరగవచ్చునేమో ననిపించింది. తర్వాత అన్నగారితో కమ్యూనిజం గురించి జరిపిన చర్చ గుర్తువచ్చింది. అప్పుడు దాన్ని గురించి అంత పట్టించుకోలేదు. ఆ చర్చ జరిగాక దాన్ని గురించి ఆలోచించి దృష్టిపెట్టడం యిప్పుడు అవసరంగా తోచింది. ఆర్థిక పరిస్థితుల్ని తిరగదోడడం పనికిమాలిన వ్యవహారం అనిపించింది. కాని సామాన్య జనం అనుభవిస్తూ వున్న దారిద్ర్యంతో పోల్చిచూస్తే తన సంపద యెప్పుడూ అన్యాయంగానే కనిపించింది. తను యెప్పుడూ కష్టపడి పనిచేస్తూనే వున్నాడు, యెప్పుడూ భోగాలతో కులకలేదు. అయినా యిప్పుడు యింకా యెక్కువ కష్టపడి, యింకా తక్కువ సుఖాలు అనుభవించాలని తీర్మానించుకున్నాడు. అప్పుడు తను చేస్తూవున్నది సరైనదన్న భావం తనకి వుంటుంది. యిన్ని రకాలుగానూ తనని మెరుగు పరుచుకోవడం యెంతో సులభంగా కనిపించింది. ఆ రకంగా యింటికి చేరేదాకా కమ్మటి ఆలోచనలతో గడిచిపోయింది. మరింత మెరుగైన చక్కని జీవితాన్ని గురించిన ఉల్లాసభరిత ఆశలతో నిండిపోయి రాత్రి ఎనిమిది గంటలు దాటిన కొంచెం సేపటికి యిల్లు చేరాడు.

అగాఫ్యా మిహైలొవ్నా గది కిటికీలోనుంచి సింహ ద్వారం ముందున్న మంచుమీద వెలుతురు పడుతోంది. ఆమె అతనికి చిన్నప్పుడు దాదిగా వుండేది. యిప్పుడు గృహ సంరక్షణ చూస్తోంది. ఆమె యింకా నిద్రపోలేదు. ఆమె నౌకరు కుజ్మాని లేపింది. నిద్ర మగతలోనే,

దిస కాళ్లతో కుజ్మా గుమ్మం దగ్గరికి పరిగెత్తి వచ్చేడు. పేట కుక్క లాస్కా కూడా బయటికి పరిగెత్తుకు వచ్చింది. ఆ రావడంలో కుజ్మాని తోసేసినంత పని జరిగింది. 'కుంయ్ కుంయ్' మంటూ అది లేవిన్ మోకాళ్లకి రాసుకుంది. వెనక కాళ్లమీద నుంచుంది. ముందు కాళ్లు యెత్తి అతని ఛాతీమీద పెడదామని తపన పడింది గాని ధైర్యం చెయ్యలేకపోయింది.

"అనుకోకుండా ముందే వచ్చేశారే" అంది అగాఫ్యా మిహైలొవ్నా.

"యింటి బెంగ వచ్చేసింది, అగాఫ్యా మిహైలొవ్నా. వూళ్లు తిరగడం బాగానే వుంటుందనుకో కాని సొంత వూరు రావడం యింకా బాగుంటుంది" అని చదువుకునే గదిలోకి వెడుతూ జవాబు చెప్పాడు.

కొవ్వొత్తి దీపం తెచ్చి అక్కడ పెట్టారు. కొంచెంకొంచెంగా గదిలో వెలుతురు పరుచుకుంది. తెలిసిన వస్తువులు కనిపించాయి. అక్కడ జింక కొమ్ములు, పుస్తకాల అల్మారాలు, పెద్ద పొయ్యి వున్నాయి. ఆ పొయ్యిలో వున్న యినప బిళ్లని యెప్పుడో మరమ్మత్తు చేయించాల్సి వుండింది. తర్వాత తండ్రి సోఫా కనిపించింది. పెద్ద రాత బల్ల వుంది. దాని మీద ఓ పుస్తకం తెరిచిపెట్టి వుంది. పగిలిన యాష్ట్రే వుంది. ఓ నోటు పుస్తకం వుంది. ఆ పుస్తకం పేజీలు తన దస్తూరీతోనే నిండిపోయాయి. యీ వస్తువులన్నీ కనిపించగానే, స్లెడ్జి బండిలో వస్తూ తను తీర్మానించుకున్న నూతన జీవితాన్ని యేర్పాటుచేసుకోగలనా అన్న శంక ఓ క్షణం సేపు కలిగింది. యీ జీవిత సంబంధమైన సామానులన్నీ అతన్ని పట్టుకుని 'వుహుం, మమ్మల్ని వదిలి నువ్వు వెళ్లలేవు. మారలేవు. యిలాగే వుండిపోతావు. సందేహ గ్రస్తుడివిగా, యెప్పటికీ మానసిక అసంతృప్తితో వుండిపోతావు. సర్వదా సంస్కరించుకోవాలనుకుంటూ, సర్వదా విఫలమవుతూ, సర్వదా ఆనందంకోసం నిరీక్షిస్తూనే వుంటావు. ఆ ఆనందం యెన్నటికీ రాదు, దాన్ని పొందడం నీకు సంభవించదు' అని చెప్తున్నట్టు వున్నాయి.

కాని అలా చెప్పినవి అతని వస్తువులే. అంతరంగంలోనుంచి మరో వాణి తను గతానికి లొంగిపోకూడదని అతనికి చెప్పింది. తను యెలా కోరుకుంటే అలా తనని మలుచుకోగల శక్తి మనిషికి వుందని చెప్పింది. యీ అంతర్వాణి మాటలు వింటూ అతను గదిలో మూలకి వెళ్లాడు. అక్కడ పదహారేసి శేర్ల బరువున్న డంబెల్స్ రెండు వున్నాయి. కసరత్తు చేస్తే ఉత్సాహం పుంజుకుంటుందనే ఆశ పుట్టి వాటిని తీసుకుని కసరత్తు చెయ్యడం మొదలు పెట్టాడు. గుమ్మం అవతలి వేపునుంచి క్రిరుక్రిరుమంటూ అడుగుల చప్పుడు వినిపించింది. గబగబా డంబెల్స్ కింద పెట్టేశాడు.

అతని నిగామాను వచ్చేడు. దేవుడి దయవల్ల అంతా సక్రమంగానే వుందని చెప్పాడు. కాని బక్‌వీట్ ధాన్యాన్ని ఆరబెట్టే కొత్త మరలో బక్‌వీట్ ధాన్యం కొంత మాడి పోయిందట. ఆ మాట లేవిన్‌కి కొంత చిరాకు కలిగించింది. తనే పాక్షికంగా ఆ మర నమూనా తయారు చేసి నిర్మించాడు. యీ నిగామాను దాన్ని యెప్పుడూ వ్యతిరేకిస్తూనే వున్నాడు. యిప్పుడు, తన మాట నెగ్గిందన్న సంతోషాన్ని అణుచుకుంటూ, బక్‌వీట్ ధాన్యం కాలి పోయిందని

చెప్పున్నాడు. యేది యెలా చెయ్యాలో తను నో వంద సార్లేనా చెప్పి వుంటాడు. ఆ సూచనలని ఉపేక్షిస్తేనే బక్‌వీట్ ధాన్యం కాలి వుంటుందని లేవిన్‌కి నమ్మకంగా అనిపించింది. అతనికి చిరాకు వచ్చి నిగామానుని తిట్టాడు. కాని సంతోషకరమైన వార్త యింకా మిగిలే వుంది. ఆవు పావా యీనిందట. అది అతని ఆవులన్నింటిలోకీ ఉత్తమమైంది, విలువైనది. ప్రత్యేక పశువుల ప్రదర్శనలో దాన్ని కొన్నాడు.

"కుజ్మా, నా గొర్రెతోలు కోటు తీసుకురా. దీపం కూడా తీసుకు రావాలి" అతను నిగామానుతో "నే వెళ్లి దాన్ని చూస్తాను" అన్నాడు.

యింటికి పక్కనే వెనక్కాలం మేలైన ఆవులకోసం కట్టించిన శాల వుంది. పెరట్లో నుంచి మంచు గుట్ట దాటుకుంటూ వెళ్లారు. అక్కడ లైలాక్ పొద పెరిగింది. శాల గుమ్మం తలుపు గట్టిగా బిగుసుకుపోయింది. అతను దాన్ని లాగి తెరిచాడు. తెరవగానే పశు రేణువు వెచ్చని ఆవిరి వాసన వచ్చింది. అలవాటులేని దీపం వెలుతురుకి ఆశ్చర్యపోయి ఆవులు తాజా గడ్డిలో అటూ యిటూ కదిలాయి. నల్ల పొడలతో వెడల్పుగా వున్న హాలండ్ ఆవు డొక్కలు చూశాడు. ముక్కుకి రింగు వున్న ఆంబోతు బెర్కూత్ లేవాలనుకుందిగాని యెందుకనో లేవలేదు. మనుషులు పక్కనుంచి వెళ్లేటప్పుడు ఒకటి రెండు సార్లు బుస కొట్టింది. అందంగా కాని రంగులో వున్న పావా పెద్దగా హిప్పొపొటమస్‌లాగా వుంది. దూడని వాసనచూస్తూ దాన్ని కనిపించ నియ్యకుండా వీపు యిటు తిప్పి అడ్డంగా నుంచుంది.

లేవిన్ శాలలోకి వెళ్లాడు. పావాని పరీక్షించేడు. గోధుమ రంగు మచ్చలున్న దూడని సన్నటి కాళ్లమీద నిలబడేటట్టు చేశాడు. పావా బెదిరింది. నిరసన తెలియచేస్తున్నట్టుగా అంబా అనబోయింది. కాని లేవిన్ దూడని దగ్గరికి తొయ్యగానే శాంతించి నిట్టూర్పు విడిచింది. గరుకు నాలికతో తన దూడని నాకడం మొదలుపెట్టింది. పొదుగుకోసం వెతుకుతూ ఆ దూడ తల్లి కడుపులో ముట్టె దూర్చి, దాని తోకని గుండ్రంగా సుళ్లు తిప్పింది.

"వెలుతురు యిటు చూపించు ఫ్యోదొర్, దీపం యిటు చూపించు" అన్నాడు లేవిన్ దూడని పరీక్షిస్తూ. "తల్లిలాగానే వుంది. రంగు తండ్రిది. భేష్. పొడుగ్గా వెడల్పుగా వుంది. బాగుంది, యేం? వసీలియ్ ఫ్యోదొరొవిచ్?" అన్నాడు నిగామానుతో. దూడని చూసిన సంతోషం బక్‌వీట్ ధాన్యం కాలిపోయిన సంగతిని కమ్మేసింది.

"యెందుకు బాగోదు? మీరు వెళ్లిన రోజునే కాంట్రాక్టరు సెమ్యోన్ వచ్చేడు. అతనికి మీరు చెప్పాలి, లేవిన్‌గారూ. అరబెట్టే యంత్రానికి సంబంధించి చెప్పనే చెప్పాను కదా" అన్నాడు నిగామాను.

తన ఎస్టేటు నిర్వహణలో వుండే కష్టాలలోకి తొయ్యడానికి లేవిన్‌కి యిది చాలు. ఎస్టేట్ పెద్దది, చిక్కులతో కూడింది. దూళ్లశాలనుంచి ఆఫీసు గది దగ్గరికి వెళ్లాడు. అక్కడ నిగామానుతో, కాంట్రాక్టరు సెమ్యోన్‌తో మాట్లాడేడు. ఆ తర్వాతనే యింట్లోకి తిరిగివచ్చి తిన్నగా డ్రాయింగ్ రూమ్‌కి వెళ్లాడు.

27

ఆ యిల్లు పాతది. పెద్దది. లేవిన్ ఒక్కడే వుంటున్నాడు. అయినా అన్ని గదుల్నీ వెచ్చజేసి వాడుతూ వుంటాడు. అలా చెయ్యడం మూర్ఖత్వం అని అతనికి తెలుసు. తను కొత్తగా చేసుకున్న నిర్ణయాలకి కచ్చితంగా వ్యతిరిక్తం కూడానూ. కాని ఆ యిల్లే అతనికి యావత్ప్రపంచమూనూ. ఆ యింట్లోనే తల్లిదండ్రీ బతికారు, చనిపోయారు. ఆదర్శ ప్రాయమైంది అని అతను అనుకునే జీవితం వాళ్ళు గడిపారు. తన భార్యతో, సంసారంతో దాన్ని పునరుజ్జీవితం చెయ్యాలని అతను ఆశించాడు.

లేవిన్‌కి తల్లి గుర్తులేదు. ఆమెని గురించిన అతని భావన ఒక పవిత్ర స్మృతి. అతని తల్లి అతనికి స్త్రీత్వపు సమున్నత పవిత్ర ఆదర్శమూర్తిగా వుండింది. తనకి, రాబోయే భార్య కూడా అలాగే వుండాలని అతని వూహ.

పెళ్ళి అనేది లేకుండా ఒక స్త్రీపట్ల ప్రేమని అతను వూహించుకోలేడు. నిజానికి అతను ముందు కుటుంబం గురించి అనుకున్నాడు. తర్వాతనే తనకి ఆ కుటుంబాన్ని యివ్వగలిగే మహిళ గురించి అనుకున్నాడు. అందువల్ల పెళ్ళి గురించి అతను అనుకున్నవాటికీ అత్యధిక భాగం అతని పరిచయస్థులు అనుకునేవాటికీ పోలికే వుండేది కాదు. వాళ్ళకి పెళ్ళి అనేది సాంఘిక విధుల్లో మరొకటి మాత్రమే. లేవిన్‌కి మాత్రం పెళ్ళే జీవితంలో ముఖ్యమైంది. తన ఆనందమంతా దానిమీదనే ఆధారపడివుంది. యిప్పుడతను ఆ ఆలోచన యావత్తూ వదులుకోవాల్సి వచ్చింది.

అతను చిన్న డ్రాయింగ్ రూమ్‌లోకి వెళ్ళాడు. అతను యెప్పుడూ టీ అక్కడే తాగేవాడు. ఓ పుస్తకం తీసుకుని పడక కుర్చీలో కూలబడ్డాడు. అగాఫ్యా మిహైలొవ్నా టీ తెచ్చి, "నేనూ కూర్చుంటా బాబూ యిక్కడ" అని యథా ప్రకారం అంటూ కిటికీ దగ్గర తను కూర్చునే చోటులో చేరింది. యెంత వింతగా కనిపించినా గానీ అతను తన కలలని వదలలేదు, అవి లేకుండా తను బతకలేడు అని అతనికి అనిపించింది. తప్పకుండా అవి నిజమవుతాయి — ఆమెతో గాని, మరొకళ్ళతో గాని. అతను చేతిలో వున్న పుస్తకం చదివాడు. చదివినదాన్ని గురించి ఆలోచించాడు. మధ్యమధ్యన అగాఫ్యా మిహైలొవ్నా చెప్పేది వినడానికి ఆగేడు: ఆమె గుక్క తిప్పుకోకుండా మాట్లాడుతూనే వుంది. అతని వూహల్లో తన యింటిని గురించీ, తన భవిష్యత్ కుటుంబం గురించీ పొంతనలేని చిత్రాలూ ఉద్భూతమయాయి. తన అంతరంగపు లోతుల్లో యేదో నేళ్ళూనుకుంటోందనీ, సర్దుకుంటోందనీ, జవం పుంజుకుంటోందనీ అతనికి అనుభూతమైంది.

అగాఫ్యా మిహైలొవ్నా యేమిటేమిటో చెపుతూనే వుంది, అతను వింటూనే వున్నాడు. దైవ భక్తి లేని ప్రోఖర్, గుర్రం కొనుక్కోమని లేవిన్ యిచ్చిన డబ్బు పెట్టి చిత్తుగా తాగేశాట్ట, పెళ్ళాన్ని చావ చితక తన్నేశాట్ట. అతను వింటూనే పుస్తకం చదువుతూ వున్నాడు.

ఆ చదివిన విషయం చేసిన ఆలోచనలని కొనసాగించేడు. అది ఉష్ణానికి సంబంధించి టిండాల్* రాసిన గ్రంథం. టిండాల్ యుక్తిగా చేసిన తన ప్రయోగాల గురించి గర్వపడ్డాడు. అందుకూ, టిండాల్‌కి తాత్విక దృష్టి తక్కువ అయినందుకూ తను చేసిన విమర్శ లేవిన్‌కి గుర్తు వచ్చింది. వున్నట్టుండి ఒక సంతోషభరిత ఆలోచన అతని మనోఫలకంమీద గోచరించింది: 'రెండేళ్లల్లో మా శాలలో డచ్ ఆవులు రెండు అవుతాయి. పావా కూడా అప్పటికి బతికే వుంటుంది బహుశా. బెర్కుత్‌వల్ల పుట్టిన పన్నెండూ, యీ మూడూ... ఓహ్! అద్భుతం!' అనుకుంటూ మళ్లీ పుస్తకంలో పడ్డాడు.

'సరే బాగానే వుందయ్యా, విద్యుచ్ఛక్తీ ఉష్ణమూ ఒకటేననుకుందాం. కాని ఒక సమస్యని పరిష్కరించడానికి ఉద్దేశించిన చోట ఒక పరిమాణాన్ని మరొకదానికి బదులుగా సమీకరణంలో వుంచవచ్చునా? యేంత మాత్రమూ లేదు. అయితే యేమన్న మాట? ప్రకృతి లోని అన్ని శక్తులకీ మధ్య వున్న సంబంధం సహజ జ్ఞానంవల్లనే అనుభూతికి వస్తుంది... పావా పెయ్య దూడ గోధుమ రంగు పొడల ఆవు అవుతుంది. మందలో యీ మూడింటినీ కలిపితే నాకు ప్రత్యేకం సంతోషంగా వుంటుంది. భేష్! మా ఆవిడా నేనూ మా చుట్టాల్ని తీసికెళ్లి మా మందని చూపిస్తాం. "నేనూ మా ఆయనా ఆ దూడని చంటి బిడ్డలాగా సాకాం" అంటుంది మా ఆవిడ. "మీకిలాంటి విషయాలపట్ల ఆసక్తి యెలా వచ్చింది" అని చుట్టాల్లో ఒకళ్లు అడుగుతారు. "ఆయనకి ఆసక్తిగా వుండేవన్నీ నాకూ ఆసక్తే" అంటుందామె. కాని యింతకీ "ఆమె" యెవరు?' యీ ఆలోచన మాస్కోలో జరిగిన సంఘటనని గుర్తుకు తెచ్చింది. 'వూ, యేం చెయ్యాలి? నా తప్పు యేం లేదు. యిప్పుడు ప్రతీదీ కొత్తగా తయారవాలి. జీవితం అలా అవనివ్వదు, గతం అలా అవ్వనివ్వదు అనడం తెలివితక్కువతనం. మనిషి బాగు పడడానికి సంఘర్షణ చేస్తాడు, యింకా యింకా బాగుపడడానికి...' అతను తన ఆలోచనల్లో మునిగిపోయాడు. యజమాని తిరిగి యింటికి వచ్చాడన్న సంతోషంలో ఉబ్బి తబ్బిబ్బు అవుతూవున్న ముసలి కుక్క లాస్క మొరగడానికి బయటికి వెళ్లి, యిప్పుడు తోకాడిస్తూ లోపలికి వచ్చింది. దానితోబాటు తాజా గాలి వాసనా వచ్చింది. అతని దగ్గరికి మెల్లిగా వెళ్లి ముట్టెని అతని చేతి కిందకి దోపింది. నన్ను లాలించు అన్నట్టు గోముగా కుంయ్ కుంయ్ మంది.

"అన్నీ తెలుసు, మాట్లాడలేదంతే" అంది అగాఫ్యా మిహైలొవ్నా. "కాని కుక్కే... యజమాని తిరిగి వచ్చాడనీ, ఉత్సాహంగా లేడనీ దానికి తెలుసు" అందామె.

"ఉత్సాహంగా లేకపోవడమా?"

"నేను అంత చూడలేని గుడ్డిదాన్ననుకుంటున్నారా బాబూ? యిప్పటికి కూడా మా బాబుని అర్థంచేసుకోలేకపోతే యింకెప్పుడు అర్థంచేసుకుంటాను? పిల్లలు చేసే వయసునుంచి పెద్దబాబుల యిళ్లల్లో పెరిగాను. మరేం దిగులు పడకండయ్యా. వొంట్లో బాగా వుండే టట్టు చూసుకోవడం, మనసు శుభ్రంగా వుంచుకోవడం, అవే చాలు."

లేవిన్ ఆమెకేసి పరకాయించి చూశాడు. తన మనసులో వున్నదాన్ని అంత అర్థంలా పరివెయ్యగలిగిందని ఆశ్చర్యపోయాడు.

"యింకో కప్పు టీ తెమ్మంటారా?" అని ఆమె అడిగింది. కాలీ కప్పు తీసుకుని వెళ్ళిపోయింది.

లాస్కా యింకా ముట్టెని అతని చేతి కిందకి తోస్తూనే వుంది. అతను దాన్ని నిమిరేడు. వెంటనే అది అతని కాళ్ళ దగ్గర ఉంగ చుట్టుకు పోయింది. తన వెనక పంజామీద తల ఆన్చుకుంది. అంతా బాగానే వుంది యిప్పుడు అని చెప్పడానికన్నట్టు దవడలు కొద్దిగా తెరిచింది. చెమ్మగా వున్న పెదాల్ని నాక్కుంది. ముసలి పళ్లమీద జిగురుగా వున్న పెదాలని అన్ని మళ్లీ కులాసాగా దవడల్ని మూసింది. ఆనందమయ లోకంలోకి జారిపోయింది. లేవిన్ ఆ కుక్క చేసిన యీ ఆఖరి చేష్టని శ్రద్ధగా గమనించేడు.

'నేనూ అలాగే చేస్తాను. విచారించక్కర్లేదు. అంతా సవ్యంగానే వుంది' అని తనలో తను అనుకున్నాడు.

28

బాల్‌డాప్స్ అయిన మర్నాడు ఉదయమే తను ఆ రోజే మాస్కోనుంచి బయల్దేరుతోందని అన్నా భర్తకి టెలిగ్రామ్ యిచ్చింది.

"లేదు, నేను వెళ్ళాలమ్మా, వెళ్ళాలి" అంది మరదలితో. హఠాత్తుగా తను మనసు మార్చుకున్నందుకు కారణం చెపుతూ చెయ్యవలసిన పనులు యెన్నో అప్పుడే గుర్తువచ్చినట్టు సూచించే గొంతుకతో అలా అంది. "లేదు, నేనివాళ వెళ్లడమే మంచిది" అంది.

అబ్లాన్‌స్కీ యింటిదగ్గర భోజనం చెయ్యలేదు. కాని సాయంత్రం యేడు గంటలకి అక్కగార్ని స్టేషన్‌లో దిగబెడతానని మాట యిచ్చేడు.

కిట్టీ కూడా రాలేదు. తలనొప్పిగా వుందని చీటీ పంపించింది. దాలీ, అన్నాలిద్దరూ పిల్లలతో, ఇంగ్లీషు పంతులమ్మతో కలిసి భోజనం చేశారు. పిల్లలు స్థిరచిత్తంగా వుండే వాళ్ళు కాకపోవడం వల్లయితేనేం, త్వరగా గ్రహించే శక్తి వుండే వాళ్లవడంవల్లయితేనేం, అన్నా తాము అంతకు ముందు రోజున అనుకుని, యెంతో అభిమానించిన మేనత్తలాగా ఆవేళ లేదనీ, తామంటే ఆసక్తిగా లేదనీ అనుకోవడం వల్లనయితేనేం – యే కారణంవల్లనైతేనేంగాని, పిల్లలు ఆమెతో ఆడుతూవున్న ఆటని వదిలేశారు. ఆమెపట్ల వాళ్ల అభిమానం కూడా పోయింది. ఆమె వెళ్లిపోతోందని వాళ్ళు పిసరు కూడా పట్టించుకోలేదు. ఆ ఉదయమంతా అన్నా ప్రయాణానికి యేర్పాట్లు చేసుకుంటూనే గడిపింది. మాస్కోలో తను యెరిగినవాళ్లకి ఉత్తరాలు రాసింది. యేవేం ఖర్చులు అయాయో రాసుకుంది, సామాన్లు సర్దుకుంది. అన్నా మనస్థిమితంగా లేదని దాలీకి అనిపించింది. ఆమె యేదో వ్యగ్రంగా వ్యాకులంగా వున్నట్టు కనిపిస్తోంది. అలాంటి స్థితి దాలీకి బాగా తెలిసిందే. అకారణంగా అలాంటి

స్థితి రాదు, తరుచుగా అలాంటి దానికింద తమపట్ల వొక అసంతృప్తి దాగి వుంటుంది. భోజనాలయాక అన్నా తన గదికి వెళ్లింది. డాలీ ఆమె వెనకాలే వెళ్లింది.

"యివాళ యేమిటో అదోలా వున్నావు" అంది డాలీ.

"వున్నానా? అలా అనిపిస్తోందా నీకు? అదోలా వుండడం కాదు గాని నా మనసేమిటో బాగోలేదు. ఒకో అప్పుడు అలానే వుంటుంది. గట్టిగా యేడిచెయ్యాలనిపిస్తుంది. యేమిటో పిచ్చి! అదే పోతుందిలే" అంది అన్నా గబగబా. యెర్రబడ్డ ముఖాన్ని చిన్న సంచీవెనక చాటు చేసేసుకుంది. అందులో రాత్రి మామూలుగా పెట్టుకునే టోపీ, పల్చటి రుమాళ్లూ సర్దుకుంది. ఆమె కళ్లు విశేషమైన తేజస్సుతో వున్నాయి. సంతతంగా కన్నీళ్లతో పొర కమ్మేసి వున్నాయి. "చూడు, అప్పుడేమో పీటర్స్‌బర్గ్‌నుంచి రాబుద్ధి పుట్టింది కాదు, యిప్పుడేమో మాస్కోనుంచి వెళ్లబుద్ధి పుట్టడం లేదు" అంది.

"కాని వచ్చి మంచి పని చేశావు" అని ఆమెని జాగ్రత్తగా చూస్తూ డాలీ అంది.

అన్నా చెమ్మగిల్లిన తన కళ్లని ఆమెకేసి తిప్పింది.

"ఆ మాటనకు, డాలీ. నేనేం చెయ్యలేదు, యేమీ చేసి వుండేదాన్ని కాదు. మనుషులు నన్ను పాడుచెయ్యడానికి యెందుకింత కుట్ర పన్నుతారా అని యెక్కువ సార్లు ఆశ్చర్య పోతూ వుంటాను. నేనేం చేశాను? యేం చెయ్యగలిగి వుండేదాన్ని? వాడిని క్షమించగలంత ప్రేమ నీ హృదయంలో వుంది, అంతే."

"నువ్వు రాకపోయి వుంటే యిది యెలా ముగిసి వుండేదో ఆ పరమాత్ముడికే యెరుక. నువ్వెంత అదృష్టవంతురాలివి, అన్నా! నీ మనసు నిర్మలమైంది, స్ఫటికం" అంది డాలీ.

"ప్రతి మనసులోనూ ఇంగ్లీషువాళ్లన్నట్టు దాని skeletons[1] వుంటాయి."

"నీకేం skeletons వుంటాయి? నీది స్ఫటికంలాగా స్వచ్ఛంగా వుండే మనసు."

"వున్నాయి, నాకూ skeletons వున్నాయి" అంది వున్నట్టుండి అన్నా. ఆ కన్నీళ్ల తర్వాత ఆమె పెదాలు కుటిలంగా, వెక్కిరింతగా చిరునవ్వుతో వొంపు తిరగడం చూస్తే ఆశ్చర్యం వేస్తుంది.

"ఉంటే నీ skeletons ఉల్లాసంగా వుంటాయి, దుఃఖ భాజకంగా వుండవు" అంది డాలీ చిరునవ్వు నవ్వుతూ.

"లేదు, దుఃఖభాజకంగానే వుంటాయి. నేను రేపు వెళ్లాల్సింది యివాళే వెళ్లిపోతున్నాను కారణం యేమిటో తెలుసా? నా గుండెలో భారంగా వున్నదాన్ని హృదయం విప్పి చెప్పుకోవడం యిది. నీకు చెప్పుకుంటా" అంది అన్నా. కుర్చీ వీపు మీదకి పూర్తిగా వాలి డాలీ కళ్లల్లోకి నేరుగా చూసింది.

---

[1] చెప్పుకో లేని రహస్యాలు.

అన్నా సిగ్గుతో బాగా యెర్రబడిపోయింది. మెడమీద జీరాడే నల్లని ఉంగరాల జుట్టు దాకా వ్యాపించిందా యెరుపు. ఆమె అంతలా సిగ్గుపడ్డం చూసి దాలీ చకితురాలై పోయింది.

"కిట్టీ యెందుకు భోజనానికి రాలేదో తెలుసా?" అని చెప్పసాగింది అన్నా. "నేనంటే ఆమెకి అసూయ. నేను పాడుచేశాను... ఆమెకి నిన్నటి బాల్‌డాన్సు సంతోషంగా లేదు, కష్టం కలిగించింది. దానికి నేనే కారణం. కాని అది నిజానికి నా తప్పూ కాదు, నిజంగా కాదు — ఒకవేళ వున్నా అతి కొద్ది తప్పే" అంది. 'అతి కొద్ది' అనే మాటని సన్నగా సాగదీస్తూ అంది.

"అబ్బ, అచ్చం స్త్రీవెలాగానే చెప్పావు నువ్వు" అని నవ్వింది దాలీ.

అన్నాకి చెడ్డగా అనిపించింది.

"లేదు, లేదు. నేను స్త్రీవె లాంటి దాన్ని కాదు. నేనెందుకు యీ సంగతి చెప్తున్నానంటే ఒక్క పిసరు కూడా నామీద నాకు సంశయం లేదు కాబట్టి" అని నొసలు చిట్లిస్తూ అంది అన్నా.

కాని ఆ మాటలు అనే ఆ క్షణంలోనే ఆమెకి తెలుసు అవి అబద్ధం అని. ఆమె తనని సంశయించుకోవడమే కాదు, వ్రాన్‌స్కీ తలపుకొస్తేనే ఆమె గుండె దడదడ కొట్టుకుంటోంది. అతన్ని మళ్ళీ కలుసుకోకుండా తప్పించుకుందుకే ఆమె అనుకున్నదానికంటే ముందే ప్రయాణం కట్టింది.

"ఆఁ, నువ్వు అతనితో కలిసి మజూర్కా నాట్యం చేశావని స్త్రీవె చెప్పాడు. అతను..."

"అంతా యెంత అసంబద్ధంగా వుందో నువ్వు వూహించుకోలేవు. యిద్దరికీ సంధానం చేద్దామని నేను వెళ్ళానా, తీరా చూస్తే జరిగింది యిదా. బహుశా నా సంకల్పానికి వ్యతిరేకంగా..."

ఆమె సిగ్గుతో ఎర్రబడి ఆపైన చెప్పలేకపోయింది.

"ఓ, మగాళ్ళ యిలాంటి వాటిని యిట్టే పట్టేస్తారు" అంది దాలీ.

"అతనికి సంబంధించి నిజంగా అలాంటిదేమన్నా వుందని నాకనిపిస్తే యెంతో బాధపడిపోతాను" అని ఆమె మాటకి అడ్డం వచ్చింది అన్నా. "దీన్నంతట్నీ మర్చిపోతారనీ, కిట్టీకి నామీద ద్వేషం పోతుందనీ నా నమ్మకం" అంది.

"వున్న మాట చెప్పనా, అన్నా. కిట్టీకి యీ సంబంధం కుదరడం నాకు యిష్టం లేదు. వ్రాన్‌స్కీ ఒక్క రోజులోనే నిన్ను ప్రేమించేసేటటువంటి మనిషైతే యిక చెప్తేం?"

"అయ్యో దేముడా! యింతకంటే యేదన్నా నవ్వుతాలుగా వుంటుందా!" అంది అన్నా. తన మనసులో తారట్లాడిన ఆలోచనని దాలీ ముఖతః విన్నప్పుడు ఆమె వదనం మీద మరోసారి సంతోషభరిత గాఢ అరుణిమ వ్యాపించింది. "అంచేత కిట్టీని నాకు శత్రువుగా చేసుకుని వెళ్ళిపోతున్నాను. ఆమె అంటే నాకు యెంత యిష్టం! నిజంగా యెంత ముచ్చటైన పిల్ల! కాని నువ్వు సర్దుబాటు చేస్తావు కదూ, దాలీ, చేస్తావా?" అంది.

డాలీ చిరునవ్వుని ఆపుకోలేకపోయింది. ఆమెకి అన్నా అంటే ప్రేమ. కాని అన్నాకి కూడా ఆమె బలహీనతలు ఆమెకి వున్నాయని తెలిసి తృప్తిపడింది.

"శ్రతువా? అలా యెన్నటికీ జరగదు" అంది డాలీ.

"నేను మిమ్మల్నందర్నీ ప్రేమిస్తున్నట్టుగానే మీరంతా నన్ను ప్రేమించాలనే నా కోరిక. నిన్ను యెప్పటికంటే యెక్కువ ప్రేమిస్తున్నాను" అంది అన్నా నీళ్లు తిరిగే కళ్లతో. "యేమిటిది యివాళ యిలా తెలివితక్కువగా ప్రవర్తిస్తున్నాను" అంది మళ్లీ.

జేబురుమాలుతో ముఖం తుడుచుకుంది. తర్వాత బట్టలు వేసుకోవడం మొదలు పెట్టింది.

యిక బయల్దేరడానికి వేళ అయింతనగా అబ్లాన్‌స్కీ వచ్చాడు. అతని ముఖం యెర్రగా వుంది. హుషారుగా కనిపించేడు. అతనిదగ్గర చుట్ట వాసనా, వైన్ వాసనా కొడుతున్నాయి.

అన్నా భావోద్వేగం డాలీకి తగిలింది. సెలవు తీసుకుంటూ ఆఖరి సారి కౌగలించుకుంది.

"గుర్తుంచుకో అన్నా. నువ్వు నాకు చేసిన ఉపకారం యెన్నటికీ మర్చిపోను. గుర్తుంచుకో నేను నిన్ను ప్రేమిస్తూనే వుంటాను; యెప్పటికీ నా ప్రాణ స్నేహితురాలిలాగా ప్రేమిస్తూనే వుంటాను". అంది.

"యెందుకనో నాకర్థం కావడంలేదు". అంది అన్నా. మరదల్ని ముద్దుపెట్టుకుంటూ, కన్నీళ్లని ఆపుకో ప్రయత్నించింది.

"నువ్వు నన్ను అర్థంచేసుకున్నావు. నువ్వు అన్నీ అర్థంచేసుకుంటావు. వుంటా మరి."

29

'హమ్మయ్య. కథ ముగిసింది. దేముడి దయవల్ల' అనుకొంది అన్నా. ఆఖరిసారి తమ్ముడి దగ్గర సెలవు తీసుకునేటప్పుడు అన్నాకి వచ్చిన మొదటి ఆలోచన అదీ. మూడో గంట కొట్టేదాకా పెట్టె గుమ్మం దగ్గరే నుంచున్నాడతను. ఆమె మెత్తటి సీట్లో తన పనిమనిషి అన్నుష్కా పక్కన కూర్చుంది. అది స్లీపింగ్ కోచ్. మసక వెలుతురులో ఆ పెట్టె అంతా కలయ చూసింది. 'దేముడి దయవల్ల రేప్పొద్దున్నే సెర్యోషనీ, అయన్నీ చూస్తాను. నా జీవితం సాఫీగా యెప్పటిలాగానే గడుస్తుంది' అనుకొంది.

అన్నా ఆ రోజంతా వ్యగ్రంగానే వుంది. ప్రయాణం హాయిగా, సుఖంగా చెయ్యాలని అదే స్థితిలోనే ప్రతిదాన్నీ జాగ్రత్తగా సిద్ధంచేసుకుంది. ముచ్చటగా వున్న చిన్న చేతులతో చిన్న ఎర్ర సంచీని తెరిచింది, మళ్లీ మూసింది. ఓ చిన్న మెత్తని తీసింది. దాన్ని మోకాళ్లమీద పెట్టుకుంది. కాళ్లని చక్కగా కప్పుకుని విశ్రాంతిగా కూర్చుంది. ఓ జబ్బు మనిషి నిద్రపోవడానికి ఉపక్రమిస్తోంది. యెవరో యిద్దరు ఆడవాళ్లు ఆమెతో మాట్లాడ్డం మొదలెట్టారు. ఓ లావాటి ఆడమనిషి కాళ్లకి చక్కగా కప్పుకుని పెట్టెలో తగినంత వెచ్చగా లేదని గొణ

గడం మొదలెట్టింది. అన్నా ఆ ఆడవాళ్లతో కాసేపు యేదో మాట్లాడింది. వాళ్ల సంభాషణ యేం ఆసక్తిగా లేదనిపించి అన్నుష్కాతో దీపం తెమ్మని చెప్పింది. ఆ దీపాన్ని తను కూర్చున్న కుర్చీ చేతికి బిగించింది. సంచీలోనుంచి కాగితాలు కోసే చిన్న కొయ్య చాకునీ, ఓ ఇంగ్లీషు నవలనీ తీసింది. మొదట్లో యేమీ చదవలేకపోయింది. జనం వస్తూపోతూ చుట్టుతా హడావుడిగా వుండడంవల్ల ధ్యాస కుదరలేదు. తర్వాత రైలు బయల్దేరాక చక్రాల చప్పుడు వినకుండా వుండలేకపోయింది. తర్వాత మంచు కివ్వున యెడమ వేపు కిటికీ మీదకి దూసుకువచ్చి దానికి అంటుకుపోయింది. తర్వాత ఒళ్లంతా బట్టలు కప్పేసుకుని, మంచు కొట్టుకుపోయిన కండక్టరు అటు పక్కనుంచి వెళ్లేడు. తర్వాత యేదో సంభాషణలు వినవచ్చేయి. భీకరమైన మంచు తుఫాన్ వీస్తోందట బయట. యీ అన్నిటివల్లా చదివే ధ్యాస కుదరలేదు. తర్వాతా యిదే గొడవ సాగుతూనే వుంది. అదే ధనధన చప్పుడు. కిటికీ దగ్గర అదే మంచు. ఒక్క సారి వేడి, ఒక్క సారి చలి, మళ్లీ వేడి — యిలా గబగబా మార్పులు జరిగిపోతూనే వున్నాయి. మసక వెలుతుర్లో అవే ముఖాలు మిణుకు మంటున్నాయి. అవే గొంతుకలు వినిపించేయి. ఆఖరికి అన్నా చదువుతూ దాన్ని అర్థంచేసుకునే స్థితి వచ్చేదాకా సాగాయి. అన్నుష్కా నిద్రపోయింది. మోకాళ్లమీద చిన్న ఎర్ర సంచీ అలానే పట్టుకుంది. ఆమె పెద్ద చేతులకి గ్లవ్స్ వున్నాయి. ఒక గ్లవ్‌కి చిరుగు వుంది. అన్నా చదువుతూ అర్థం చేసుకుంటూనే వుంది. ఆ చదవడం ఆమెకి యిష్టం లేదు. యేమంటే చదవడం అనేది యితరుల జీవితాల లోతుల్లోకి చొచ్చుకుపోవడం. అది ఆమెకి యిష్టం లేదు. తను స్వయంగా జీవించాలని చాలా కోరిక కలిగింది. నవలలోని నాయిక యెవరో జబ్బుగా వున్న వాళ్ల సంరక్షణ చేస్తూ వుంటే అన్నా తనే చప్పుడు చెయ్యకుండా రోగి గదిలోకి వెళ్లాలనుకొంది. ఓ పార్లమెంటు సభ్యుడు ఉపన్యాసం యిస్తూ వున్నట్టు చదివితే తనే అలా ఉపన్యాసం యివ్వాలనుకుంది. లేడీ మేరీ సాహసంగా వేట కుక్కల వెనక వెడుతూ 'వేటాడుతూ గుర్రంమీద దౌడు తీస్తూ వుంటే, వదినగారిని విసిగిస్తూ వుంటే తనూ అలాగే చెయ్యాలనుకుంది. కాని ఆమెకి చెయ్యడానికి యేమీ లేకపోయింది. అంచేత తన చిన్న చేతులతో సాఫీగా వుండే కొయ్య చాకు తిప్పుతూ ఆడుకుంది. మళ్లీ బలవంతంగా చదవాలనుకొంది.

నవలా నాయకుడు ఇంగ్లీషు పద్ధతిలో ఆనందం సాధించబోతున్నాడు. అంటే బారొనెట్ కావడం, ఎస్టేట్ సంపాదించడం. అన్నాకి అతనితో కలిసి అతని ఎస్టేట్‌ని సందర్శించాలనిపించింది. అతను సిగ్గుపడాల్సి వుందని హఠాత్తుగా ఆమెకి అనిపించింది. అదే కారణం వల్ల తనూ సిగ్గుపడి పోయింది. అయినా అతను యెందుకు సిగ్గుపడాలి? 'నేనెందుకు సిగ్గుపడాలి?' అని నొచ్చుకున్న ఆశ్చర్యంతో ప్రశ్నించుకుంది. పుస్తకం పక్కన పెట్టేసింది. రెండు చేతులతోను కొయ్య చాకు పెట్టుకుని చేతుల కుర్చీలో వెనక్కి వాలింది. సిగ్గుపడాల్సిందేమీ లేదు. మాస్కో జ్ఞాపకాల్ని మననం చేసుకుంది. అన్ని జ్ఞాపకాలూ బాగున్నాయి, హాయిగా వున్నాయి. భాల్‌డాన్స్‌ని గుర్తు చేసుకుంది. వ్రాన్‌స్కీని గుర్తు చేసుకుంది. ప్రేమతో

పిండిన అతని విశ్రమ వదనం గుర్తువచ్చింది. అతనితో తన సంబంధాలు గుర్తువచ్చాయి. అందులో సిగ్గుపడాల్సిందేమీ లేదు. కాని జ్ఞాపకాలు యీవరకు వచ్చేటప్పటికి ఆమెకి సిగ్గు పడాల్సింది వుందన్న భావం యెక్కువైంది. వ్రాన్‌స్కీ గుర్తువచ్చిన యీ సమయంలో యేదో అంతర్వాణి మాట వినిపించింది. 'యిదే కారణం, యిదే కారణం; మరి యిది యిక్కడే వుంది.' 'అయితే యేమిటి?' అని చేతుల కుర్చీలో అటువేపు తిరుగుతూ నిబ్బరంగా అనుకొంది. 'యేమిటైతే? వున్నదాన్ని వున్నట్టు ముఖాముఖీ చూళ్లేనా? యేమిటి సంగతి? ఆ మిలిటరీ ఆఫీసర్ కుర్రాడితోటి నా సంబంధాలు యితర పరిచయస్థులతో వుండేవాటి కంటే వేరేగా వుంటాయా, వుండగలవా?' అనుకుంటూ ఆమె తిరస్కారపూరిత మందహాసం చేస్తూ యీ వూహని కొట్టి పారేసింది. మళ్ళీ పుస్తకం తీసుకుంది. కాని యీసారి యేం చదువుతున్నదీ ఆమెకి పూర్తిగా అర్థంకాలేదు. కొయ్య చాకుతో కిటికీ అద్దంమీద గీసింది. సాఫీగా, చల్లగా వున్న దాని అలుగుని చెక్కిలిమీద అదుముకుంది. హఠాత్తుగా కారణం యేమీ లేకుండానే ముంచెత్తుతూ వచ్చిన సంతోష తరంగంలో పడి దాదాపు పైకే నవ్వింది. పేదెలు తీగల్లాగా తన స్నాయు తంత్రులు యింకా యింకా బిగుస్తున్నట్టు ఆమెకి అనిపించింది. తన కళ్లు యింకా యింకా వెడల్పుగా విప్పారుతున్నట్టు, తన కాలి వేళ్లు, చేతి వేళ్లు భయకంపితంగా మెలి పడుతున్నట్టు, తనలోని యేదో తన శ్వాసని సంకుచితం చేస్తున్నట్టు మిణుకుతూ మిణుకుతూ వున్న మసక వెలుతురులో అన్ని బింబాలూ, అన్ని ధ్వనులూ అసాధారణ ఆకారాలూ, రూపాలూ ధరించి తనని నిశ్చేష్టురాల్ని చేస్తున్నట్టూ అనిపించింది. వుండి వుండి ఆమెకి రైలు ముందుకు పోతోందా, వెనక్కి పోతోందా లేదా అసలు కదుల్తోందా, తన పక్కన వున్న మనిషి అన్నుష్కాయేనా లేక ముక్కూ మొహం తెలియని పరాయి వ్యక్తా అని శంక కలిగేది. 'యిక్కడ వేలాడుతోందే యిదేమిటి? నా ఫర్ కోటా? లేక యేదన్నా జంతువా? నేను యిక్కడ యెందుకు వున్నాను? నేను నేనేనా లేక యెవరేనా పరాయి వ్యక్తినా?' అనుకొంది. యిలాంటి విస్మృతి స్థితిలోకి పాక్కుంటూ దేక్కుంటూ పడిపోవడం మహా భయానకంగా కనిపించింది. అయినా యేదో తనని దాని వేపు లాగేసుకుంటోంది. తను దానికి లొంగిపోనేనా లొంగిపోవాలి లేదా దాన్ని నిరోధించనేనా నిరోధించాలి. యీ స్థితినుంచి బయటపడ్డానికి ఆమె లేచింది. రగ్గు తీసేసింది. వెచ్చటి గౌనుమీద కేప్‌ని తీసేసింది. ఓ క్షణం సేపు కుదుట పడింది. బారు ఓవర్‌కోటు తొడుక్కున్న సన్నటి మనిషి ఒకతను లోపలికి వచ్చేడు. ఆ కోటుకి ఒక బొత్తాం వూడిపోయింది. ఆతన్ని గుర్తు పట్టింది. స్టేషన్ మేన్. అతను థర్మామీటరు చూడ్డం గమనించింది. అతను తలుపు తెరిచినప్పుడు గాలీ మంచూ లోపలికి దూసుకురావడం చూసింది. కాని మళ్లీ ఆమె మనస్థితి కలగాపులగం అయిపోయింది... పొడుగాటి ఓవర్‌కోట్ తొడుక్కున్న ఆ మనిషి గోడమీద యేవేవో కొరుకుతున్నాడు. ఆ ముసలమ్మ కాళ్లని బారచాపింది. ఆ కాళ్లు మొత్తం పెట్టంతా పరుచుకుని, ఒక నల్లని మేఘంలాగా అయి అన్నిటినీ కమ్మినట్టయింది. యెవర్నో ఖండఖండాలుగా కోస్తు

స్పష్టంగా యేదో క్రూరమైన అరుపు, సమ్మెట మోత వచ్చాయి. తర్వాత యెర్రటి కాంతి ఆమె కళ్లని అంధం చేసేసింది. తర్వాత అన్నీ గోడవెనక పడిపోయినట్టయి, అంతా అంధకారం కమ్మేసింది. ఆమెకి తను యేదో అగాధంలో కూరుకు పోతున్నట్టు నిపించింది. అయినా యిదంతా భయావహంగా లేదు. సుఖంగా వుంది. బట్టలు లుంగచుట్టేసుకుని, వొళ్లంతా మంచు కొట్టుకుపోయిన మనిషి యెవరో సరిగ్గా చెవిలో గంయ్‌మని అరిచాడు. అన్నా లేచి నుంచుంది. స్పృహలోకి వచ్చింది. రైలు యేదో స్టేషన్ దగ్గరికి వచ్చిందని ఆమెకి అర్థమైంది. ఆ అరిచే మనిషి కండక్టరు. తను తీసేసిన కేప్‌నీ, శాలువానీ అందిమ్మని అన్నుష్కాని అడిగింది. కేప్ పెట్టుకుని, శాలువా కప్పుకుని గుమ్మందగ్గరికి వెళ్లింది.

"బయటికి వెళతారా అమ్మా?" అని అన్నుష్కా అడిగింది.

"ఆఁ, కొంచెం సేపు తాజా గాలి పీల్చివద్దామని వుంది. యిక్కడ పెట్టెలో ఉక్కగా వుంది."

ఆమె తలుపు తెరిచింది. తుఫాన్ మంచూ, ఝంఝ ఆమెకేసి దూసుకువచ్చాయి. ఆమె తలుపు తెరవకుండా ప్రతిఘటించాయి. ఆ పెనుగులాట ఆమెకి సరదాగా అనిపించింది. ఆమె తలుపు తెరిచింది. బయటికి వెళ్లింది. గాలి ఆమెకోసం హాజరుగా వున్నట్టు వుంది. సంతోషంగా గీ పెట్టింది. ఆమె గనక మెట్లమీద చల్లగా వున్న కమ్మీని పట్టుకోకపోయి వున్నట్టయితే గాలి ఆమెని అందుకుని యెగరేసుకు పోయివుండేదే. ఆమె గౌను కుచ్చెళ్లు యెత్తి పట్టుకుంటూ ప్లాట్‌ఫారంమీదకి దిగింది. పెట్టె చివరిదాకా నడిచి వెళ్లింది. మెట్లమీద గాలి ఉరవడి విపరీతంగా వుంది. కాని యిక్కడ పెట్టెలు అడ్డం వున్నాయి. సంతోషంగా, గుండె నిండుగా చల్లని తాజా గాలిని పీలుస్తూ పెట్టె పక్కనే నుంచుని దీపాల వెలుతుర్లో ప్రకాశిస్తూవున్న స్టేషన్‌కేసి చూపు తిప్పింది.

30

భయంకరమైన మంచు తుఫాన్ రేగింది. గాలి రైలు చక్రాలకింద హోరు యెత్తుతూ, స్టేషన్ మూల వున్న దీప స్తంభాల్ని వూపేస్తూ ప్రచండంగా వుంది. రైలు పెట్టెలు, దీప స్తంభాలు, జనం, కను చూపు మేరలో వున్న ప్రతీదీ వో వేపున మంచు కొట్టుకు పోయి వుండటం కనిపించింది. మంచు యింకా యింకా యెక్కువగా పడుతూనే వుంది. మధ్య మధ్య ఓ క్షణం తెరిపి యిచ్చినా, ఆ వెంటనే మరింత ఉగ్రంగా పడేది. భరించడం దుర్భటమైపోయింది. అయినా జనం అటూ యిటూ హుషారుగా వేళాకోళా లాడుకుంటూ పరిగెత్తుతూనే వున్నారు. ప్లాట్‌ఫారం కొయ్య పలకల నేలమీద నడుస్తూ కిర్రుకిర్రుమని చప్పుడు చేస్తూనే వున్నారు. స్టేషన్ భారీ తలుపుల్ని తెరుస్తూనే వున్నారు, మూస్తూనే వున్నారు. బాగా వొంగి నడుస్తూ వున్న ఒక మానవ ఛాయ ఆమె కాళ్ల పీదనుంచి జారి

పోయింది. ఇనప ప్లాట్‌ఫారంమీద సమ్మెటతో కొట్టిన చప్పుడు వినిపించింది. ఇంకొక అవతలి వేపు తుఫాన్ అంధకారంలోనుంచి "ఆ టెలిగ్రామ్ యిలా యియ్యి" అని కోపంగా యెవరో అరవడం వినిపించింది. "నంబరు 28, దయచేసి యిటు రండి" అని యింకో గొంతుక అరవడం వినిపించింది. మంచు కమ్ముకుపోయిన ముసుగు రూపాలు పరిగెత్తి వెళ్ళాయి. సిగరెట్లు కాలుస్తూవున్న యిద్దరు పెద్దమనుషులు ఆమె పక్కనుంచి వెళ్ళారు. ఆన్నా మరోసారి తాజా గాలి తృప్తిగా పీల్చింది. మఫ్‌లో వున్న చేతిని యివతలికి తీసి మెట్లమీది రైలు కమ్మీ పట్టుకుంది. లోపలికి వెళ్ళబోయింది. మిలిటరీ పెద్ద కోటు తొడుక్కున్న వో వ్యక్తి దగ్గరిగా వచ్చాడు. అతను మిణుకు మిణుకుమనే దీపానికి అడ్డం అయాడు. ఆమె అతనికేసి చూసి వెంటనే గుర్తుపట్టింది: వ్రాన్‌స్కీ. అతను ఒక చేతిని టోపీకేసి యెత్తి ఆమెకి అభివాదం చేశాడు. ఆమెకి యేమన్నా కావాలా, తనేమన్నా సాయం చెయ్యగలడా అని అడిగాడు. కొంచెం సేపు యేమీ మాట్లాడకుండా ఆమె అతనికేసి చూసింది. అతను నీడలో వున్నాడు. అయినా కూడా ఆమె అతని ముఖాన్నీ, కళ్ళనీ చూసింది, లేదా చూశాననుకుంది. అనురాగభరిత ముగ్ధత్వం ద్యోతకంచేసే అదే భావం, అంతకు ముందు రోజున తనమీద గాఢంగా ముద్ర వేసిన అదే భావం. ఆన్నా, యిప్పుడు అనుకున్నట్టే, గత రెండు రోజులుగానూ అను కుంటూ వుంది: తనకి యెప్పుడూ తారసపడే వందలాది అదే రకపు యువకుల్లో వ్రాన్‌స్కీ మరొకడు అంతే. తను అతన్ని గురించి యిక అనుకోనూ అనుకోదు. కాని యిప్పుడు, అతన్ని కలుసుకున్న ప్రథమ క్షణంలో, ఆమె మనసులో ఉల్లాసభరిత గర్వభావ ఛాయ కమ్మింది. అతను అక్కడ యెందుకు వున్నాడు అనే విషయాన్ని అడిగే అవసరం లేదు. తను యెక్కడ వుంటే అక్కడే అతనూ వుంటాడని వ్రాన్‌స్కీ మాటలతో స్పష్టంగా చెప్పినంతగా ఆమెకి ఆ కారణం తెలుసు.

"మీరూ ప్రయాణం అవుతున్నారన్న సంగతి నాకు తెలీదే. మీరు దేనికోసం వస్తు న్నారు?" అని అడిగింది. కమ్మీమీదనుంచి చేతిని తీసింది. ఆమె ముఖంలో సంతోషం, ఉద్వేగం మెరిశాయి. వాటిని ఆమె అదిమి వుంచుకోలేదు.

"దేనికోసమేమిటి?" అని అతను రెట్టించాడు. నేరుగా ఆమె కళ్ళల్లోకి చూశాడు. "మీరెక్కడుంటే నేనూ అక్కడే వుండాలని వస్తున్నాను. మీకు తెలుసు అది. మరి నేనేం చెయ్యలేనింక" అన్నాడు.

సరిగ్గా ఆ సమయంలోనే సకల అవరోధాలనీ ఛేదించుకుంటూ వున్నట్టుగా ప్రచండ మారుతం రైలుపెట్టెల కప్పులమీదనుంచి మంచుని యెగరగొడుతూ వీచింది. వదులుగా వున్న వో యినప రేకు ధనధనమని కొట్టుకుంది. పైనుంచి బంయ్‌మంటూ ఇంజన్ కూత నిరుత్సాహభరితంగా, రోదిస్తూ వున్నట్టుగా వినవచ్చింది. యీ భయంకర తుఫాన్ మరె వ్వటికంటే ఆమెకి మహోన్నతంగా కనిపించింది. తన హృదయం కోరుకున్న విషయాన్నే అతను చెప్పాడు. తన మనసు భయపడుతూ వున్నదాన్నే అతను చెప్పాడు. ఆమె జవాబు చెప్ప

లేదు. కాని ఆమె మనసులో రేగుతున్న సంఘర్షణ ఆమె ముఖంలో అతనికి కనిపించింది.

"నేనన్న మాట మీకు అభ్యంతరంగా వుంటే మన్నించండి" అని వినమ్రంగా అన్నాడు.

అతను ఆదరంగా, సమ్మానపూర్వకంగానే మాట్లాడేడు. కాని యెంత దృఢంగా, ఖండితంగా మాట్లాడేడంటే ఆమె వెంటనే జవాబు చెప్పలేకపోయింది.

"మీరు అన్నమాట చెడ్డది. మీరు మంచివాళ్లయితే మీరన్న మాటని మర్చిపొండని వేడుకుంటున్నాను. నేనూ మర్చిపోతాను" అంది ఆఖరికి.

"మీరన్న ఒక్క మాటని గాని, మీలోని ఒక్క హావ భావాన్ని గాని నేను యెన్నడూ మర్చిపోను, మర్చిపోలేను."

"చాలు, చాలు" అని ఆమె అరిచింది. కఠినంగా కనిపించాలని వ్యర్థ ప్రయత్నం చేసింది. అతను యేదో అన్వేషిస్తున్నట్టు ఆమె ముఖాన్ని చూస్తున్నాడు. చల్లని కమ్మని పట్టుకుని ఆమె మెట్లు యెక్కింది. గబగబా లోపలికి వెళ్లింది. అక్కడ దారిలో ఆగింది. జరిగిన దాన్నంతట్నీ గురించీ అనుకుంది. తనన్న మాటంనిగాని, అతనన్న మాటంనిగాని జ్ఞప్తికి తెచ్చుకోలేదు. అయినా, వాళ్ల మధ్య సంభాషణ క్షణం సేపే సాగినా యిద్దరూ చాలా చాలా సన్నిహితంగా వచ్చినట్టు ఆమె మనసుకి అనిపించింది. దానివల్ల ఆమెకి భయమూ కలిగింది, సంతోషమూ కలిగింది. అక్కడవే కొన్ని క్షణాలు వుండి, తర్వాత తన పెట్టెలోకి వెళ్లి తన చోట్లో కూర్చుంది. ప్రయాణం మొదట్లో రోజంతా తను అనుభవించిన మనోద్వేగం మళ్లీ వచ్చింది. అధికమయింది. ఆ ఉద్వేగం యెంత ఉగ్రంగా అయిందంటే తనలో వున్న యేదో యే క్షణంలోనేనా పుటుక్కున తెగిపోతుందేమోనని ఆమెకి భయం కలిగింది. రాత్రంతా ఆమెకి నిద్ర పట్టలేదు. కాని తన మనసు రేఖమీద ఛాయలా కమ్మిన ఆ మనోద్వేగం, స్వప్నకల దిగులు కలిగించేవిగా, దుఃఖభరితంగా లేవు. తద్భిన్నంగా సంతోష కారకంగా, ఉత్తేజకరంగా, గిలిగింతలు పెట్టేవిగా వున్నాయి. తెల్లవారుతూ వుందనగా అన్నా కాసేపు కుర్చీలో వోగింది. కళ్లు తెరిచేటప్పటికి అంతా వెలుతురు పరుచుకుని తేజోవంతంగా, ఉల్లాసభరితంగా కనిపించింది. పీటర్స్‌బుర్గ్ దగ్గర పడుతోంది. వెంటనే ఆమె తన యింటిని గురించీ, తన భర్త గురించీ, తన కొడుకు గురించీ ఆలోచనల్లో మునిగిపోయింది. యిక ఆ రోజు చూసుకోవాల్సిన పనులూ, ఆతర్వాత వచ్చే పనులూ ఆమెని ముంచెత్తాయి.

రైలు పీటర్స్‌బుర్గ్ చేరి ఆగేక, ఆమె బయటికి రాగానే మొదట కనిపించిన వ్యక్తి ఆమె భర్త. 'ఓరి దేముడోయ్, ఆయన చెవులు అలా అయా యేమిటి?' అని భర్త గంభీరమైన, ఘనమైన విగ్రహం చూసి అనుకొంది. ముఖ్యం అతని చెవులు ఆమెని మొదటి సారిగా ఆకట్టుకున్నట్టు కనిపించాయి. అతని గుండ్రటి టోపీ అంచుల్ని చెవులు మోస్తున్నట్టున్నాయి. అతను ఆమెని చూసి ముందుకు వచ్చాడు. అతని పెదాలమీద యెప్పటిలాగానే పరిహాసభరితమైన చిరునవ్వు లాస్యంచేస్తోంది. అలిసిన పెద్ద కళ్లతో అతను ఆమెకేసే చూస్తూ వచ్చాడు. అలిసినట్టుగానూ, స్థిరంగా వున్నట్టుగానూ కనిపించే ఆ కళ్లని

చూడగానే ఒక అసంతృప్తిపూరిత అనుభూతి ఆమె హృదయాన్ని ఆవరించింది; తను అతన్ని వేరే రూపంలో చూడాలని ఆశిస్తున్నట్టు. కాని భర్తని చూడగానే ఆమెకి తనపట్లనే ఒక అసంతృప్తి భావన కలిగి విస్తుపోయింది. యీ అసంతృప్తి భావం పాతదే. తెలిసీ తెలియనట్టుగా వున్నదే. భర్తకీ తనకీ వున్న సంబంధాల్లో కృత్రిమత్వం లాంటిది. కాని యింతకుముందు ఆమెకి దాన్ని గురించిన స్పృహలేదు. యిప్పుడు అది స్పష్టంగా, బాధాకర అనుభూతిగా గోచరమైంది.

"చూశావా నీ ప్రియమైన భర్త, పెళ్ళినాడు నిన్ను ప్రేమించినట్టుగా ప్రేమిస్తూవున్న భర్త నిన్ను చూడాలని తహతహలాడిపోతూ వచ్చాడు" అన్నాడతను. కీచుగా మెల్లిగా వుందా గొంతు. యెప్పుడూ ఆమెతోటి మాట్లాడే అపహాస్యభరిత స్వరంతోనే మాట్లాడేడు. స్వభావరీత్యా అలాంటి మాటలు మనస్ఫూర్తిగా అనడం ఆ మనిషికి పొసగదు. అంచేత ఆ స్వరంలో వెటకారం వుంటుంది.

"సెర్యోష బాగున్నాడా?" అని అడిగింది.

"నా తహతహకి, ఆందోళనకి యిదా బహుమానం?" అన్నాడతను. "ఆఁ, వాడు బాగున్నాడు, బాగున్నాడు" అన్నాడు.

31

వ్రాన్‌స్కీ ఆ రాత్రి నిద్రపోవాలనే ప్రయత్నం కూడా చెయ్యలేదు. చేతుల కుర్చీలో అలా ముందుకి తేరిచూస్తూ, కాసేపు వచ్చే పోయేవాళ్ళకేసి చూస్తూ కూర్చున్నాడు. అంతకు ముందుదాకా అపరిచితులైన మనుషులకి తన స్థిరమైన ప్రశాంత గాంభీర్యంతో ఆశ్చర్యం కలిగించి, వాళ్ళకి చిరాకు తెప్పించాడు. యిప్పుడు మరింత యెక్కువ పొగరుగా, ఆత్మ తృప్తిగా కనిపించాడు. మనుషులకేసి వాళ్ళంతా యేదో వస్తువులైనట్టుగా చూశాడు. మునురుమూతి యువకుడొకడు అతనికి యెదురుగా కూర్చున్నాడు. అతను జిల్లా కచేరీలో గుమాస్తా. అతను వ్రాన్‌స్కీ పొగరుమోతు వాలకం చూసి అతన్ని ద్వేషించుకున్నాడు. సిగరెట్ ముట్టించుకోవడానికి అగ్గిపెట్టె అడిగి వ్రాన్‌స్కీతో మాట కలుపుదామని ప్రయత్నం చేశాడు. తను వో యువకుడు, ఒక వ్యక్తి, వస్తువు కాదు అని చూపించడానికన్నట్టు మోచేత్తో పొడిచాడు కూడాను. అయినా వ్రాన్‌స్కీ అతనికేసి యేదో దీప స్తంభం కేసి చూసినట్టుగానే చూశాడు. ఆ యువకుడి ముఖం మెలి తిరిగింది. తనని మానవుడుగా గుర్తించడానికి వసేమిరా వీలులేదన్నట్టుగా వ్రాన్‌స్కీ పెడుతున్న వాలకం చూసి తన ధైర్యం సన్నగిల్లిపోతున్నట్టు ఆ యువకుడికి అనిపించింది.

వ్రాన్‌స్కీ దేన్నీ చూడలేదు, ఎవర్నీ చూడలేదు. తను చక్రవర్తినైనట్టుగా భావించుకున్నాడు. అన్నామీద ప్రభావం కలిగించానని నమ్మడంవల్ల కాదు. యింకా అతనికా నమ్మకం

కలగలేదు. తనమీద ఆమె కలిగించిన ప్రభావంవల్ల అతనికి ఆనందం కలిగింది. గర్వం కలిగింది.

దీన్నంతటివల్లా యే పరిణామం వస్తుందీ అన్నది అతనికి తెలియదు. దాన్ని గురించి బెంగపడనూ లేదు. యింతవరకూ అదుపులేకుండా, చెదిరిపోయివున్న తన శక్తులన్నీ సంపుటీకరం అయాయనీ, బ్రహ్మాండమైన ఉరవడితో ఒకే ఆనందమయ లక్ష్యంకేసి కేంద్రితం అయాయనీ అతనికి అనుభూతం అయింది. ఆ భావన అతనికి సంతోషం కలిగించింది. తను ఆమెకి నిజం చెప్పాననే అతను అనుకున్నాడు. ఆమె వున్న చోట వుండడం కోసమే అతనా ప్రయాణం తలపెట్టాడు. అతని జీవితానందం సర్వం, అతని జీవిత చరితార్థత ఆమెని చూడ్డంలో, ఆమె మాటల్ని వినడంలోనే వున్నాయి. అతను బొలగోయె* స్టేషన్లో సోడా తాగుదామని దిగి అన్నాని చూసినప్పుడు తన మనసులో అనుకుంటూ వున్న దాన్నే ఆమెతో మొదటగా చెప్పేశాడు. తను చెప్పేసినందుకు సంతోషించాడు. యిప్పుడామెకి తెలిసింది. తనూ దాన్ని గురించే అనుకుంటుంది. రాత్రంతా అతను పిసరు కూడా నిద్రపోలేదు. తన పెట్టెలోకి తిరిగి వచ్చాక ఆమె యేమేం అన్నదీ గుర్తుచేసుకున్నాడు. తను ఆమెని చూసిన సందర్భాలన్నీ గుర్తుచేసుకున్నాడు. భవిష్యత్తులో సంభవించబోయే దానికి సంబంధించి యెలాంటి చిత్రాలు అతని వూహల్లో ఉద్భూత మయ్యాయంటే అతని హృదయం తీవ్రంగా కొట్టుకుంది.

రాత్రంతా నిద్రలేకపోయినా కూడా పీటర్స్‌బుర్గ్ స్టేషన్లో దిగే సమయానికి చన్నీళ్ల స్నానం చేసినంత తాజాగా తేటగా వున్నట్టు కనిపించాడు. ఆమె దిగి రావడం కోసం చూస్తూ తన పెట్టె దగ్గరే నుంచున్నాడు. 'మరోసారి ఆమెని చూస్తాను' అని తనకి తెలియకుండానే చిరునవ్వు నవ్వుతూ అనుకున్నాడు. 'ఆమె నడక, ఆమె ముఖం మరోసారి చూస్తాను. ఆమె నాతో యేమన్నా చెప్తుందేమో. నాకేసి తల తిప్పుతుందేమో, చూపు విసురుతుందేమో. చిరునవ్వు కూడా నవ్వచ్చు.' కాని అన్నా దర్శనం కంటే ముందుగా ఆమె భర్త దర్శనం అయింది. స్టేషన్ మాస్టరు అతన్ని చాలా గౌరవంగా గుంపులోనుంచి తీసుకువస్తున్నాడు. 'అరె! ఆఁ! ఆమె భర్త!' ఆమెతో బంధం వున్న వ్యక్తి భర్త అని మొట్టమొదటి సారిగా వ్రాన్‌స్కీకి యిప్పుడే విశదంగా అవగతం అయింది. అన్నాకి భర్త వున్నాడు అని తెలుసు. కాని అతని అస్తిత్వం అనేది లీలగానే మనసులో వుంది. యిప్పుడు మాత్రమే, అతన్ని చూసినప్పుడు మాత్రమే అతని అస్తిత్వాన్ని పూర్తిగా విశ్వసించాడు. అతని తల, భుజాలు, నల్లని లాగు తొడుక్కున్న కాళ్లు చూసినప్పుడే ఆ అస్తిత్వం రూపు తీసుకున్నట్టనిపించింది. ఆ భర్త సొంత వస్తువు మాదిరి ఆమె చేతిని నిదానంగా అందుకున్నప్పుడు ఆ అస్తిత్వం గురించి విశ్వాసం పూర్తిగా కలిగింది.

పీటర్స్‌బుర్గ్ తరహా నవనవలాడే ముఖ వర్చస్సు, పెద్దమనిషి తీరు, ఆత్మ విశ్వాస ధోరణి వున్న కరేనిన్ గుండ్రటి టోపీ పెట్టుకున్నాడు, కొంచెంగా వంగి నడిచేడు. అలా అతన్ని చూసినప్పుడు వ్రాన్‌స్కీకి అతని అస్తిత్వం గురించి సందేహం లేకపోయింది. అతన్ని

చూసినప్పుడు చీదర కలిగింది. దాహంతో తపించి పోతూవున్న మనిషి వెతుక్కుని వెతుక్కుని ఒక మంచి నీటి బుగ్గని చూసి, దాహం తీర్చుకుందా మనుకుని ఉద్యుక్తుడయి, అంతకు ముందే ఓ కుక్కో, గొర్రో, పందో అక్కడికి వచ్చి నీళ్లని బురద చేసేసిందని తెలిస్తే యెలా చీదరపడతాడో అలాంటి చీదర కలిగింది. బండ కాళ్లతో అడుగడుక్కీ తుంటి వంచుతూ కరేనిన్ నడిచే నడక అతనికి మరీ అసహ్యంగా కనిపించింది. ఆమెని ప్రేమించే హక్కు తనొక్కడికే వున్నట్టు అతనికి అనిపించింది. కాని ఆమె మాత్రం ముందటి లాగానే వుంది. ఆమె ముఖం ముందటి లాగానే శారీరకంగా ఉత్తేజాన్ని కలిగిస్తూ, ఉద్వేగభరితం చేస్తూ, హృదయాన్ని సంతోషంతో నింపుతూ వుంది. అప్పుడు, రెండవ తరగతి పెట్టెలోనుంచి వస్తూవున్న జర్మన్ నౌకరితో సామాన్లు తీసుకుని యింటికి వెళ్లిపొమ్మని వ్రాన్‌స్కీ చెప్పాడు. తను ఆమె దగ్గరికి వెళ్లాడు. భార్యా భర్తలు కలుసుకోవడం చూశాడు. ఆమె భర్తతో కొంచెం బెరుకు తనంతో మాట్లాడుతూ వుండడం ప్రేమికుడికి వుండే నిశిత దృష్టితో గమనించాడు. 'లేదు, ఆమె అతన్ని ప్రేమించడం లేదు, ప్రేమించగలేదు' అనుకున్నాడు.

వెనకనుంచి అన్నా దగ్గరికి వెడుతూవుంటే, తను దగ్గరికి వస్తున్నట్టు ఆమె అనుభూతి చెందిందనీ, వెనక్కి చూసి తనని గమనించి మళ్లీ భర్తతో మాట్లాడ్డానికి అటు తిరిగిందనీ వ్రాన్‌స్కీ గుర్తించాడు. సంతోషపడ్డాడు.

"రాత్రి బాగా గడిచింద నుకుంటాను" అని వ్రాన్‌స్కీ అడిగాడు. ఆమెకీ భర్తకీ కలిపి ఒకే అభివాదం చేశాడు. ఆ అభివాదం తనకేనని కరేనిన్ భావించుకునేటట్టూ, తను అతనిని గుర్తించినట్టుగాని గుర్తించనట్టుగాని యెలా భావించుకుంటే అలా, అతనిష్టం అని స్ఫురింప చేస్తున్నట్టూ వుంది.

"చాలా బాగా గడిచింది, కృతజ్ఞురాల్ని" అంది అన్నా.

ఆమె అలిసి పోయినట్టుగా కనిపించింది. ఆమె చిరునవ్వులోగాని, ఆమె కళ్లల్లోగాని మామూలుగా మెరిసే జీవ చైతన్యం తొణికిస లాడ్డం లేదు. కాని ఆమె కళ్లు అతని కళ్లు కలవ గానే ఒక క్షణకాలంపాటు ఆమె కళ్లల్లో యేదో తటిల్లత మెరిసింది. అది క్షణం సేపే వుంది. అయినా ఆ క్షణ కాలమే అతనికి అపారమైన ఆనందాన్ని ప్రసాదించింది. వ్రాన్‌స్కీతో పరిచయం వుందా లేదా అని అడుగుతున్నట్టుగా ఆమె భర్తకేసి చూసింది. ఇతను యెవరా అని గుర్తుచేసుకో ప్రయత్నిస్తున్నట్టు కరేనిన్ అయిష్టంగా వ్రాన్‌స్కీకేసి చూశాడు. ఆ క్షణంలో వ్రాన్‌స్కీ ధీరత, ఆత్మవిశ్వాసం కరేనిన్ కఠోర ఆత్మవిశ్వాసంతో రాతిమీద ఉక్కు కొట్టుకున్నట్టుగా కొట్టుకున్నాయి.

"కౌంట్ వ్రాన్‌స్కీ" అంది అన్నా.

"ఆఁ, మనం కలుసుకున్నా మనుకుంటాను" అని కరేనిన్ చెయ్యి చాస్తూ ఉదాసీనంగా అన్నాడు. "తల్లితో వెళ్ళి కొడుకుతో తిరిగివచ్చావన్న మాట" అన్నాడు వొత్తి వొత్తి పలుకుతూ. ఒక్కొక్క మాటా ఒక్కొక్క వరహాతో సమమైన బహుమానంలాంటిదన్నట్టుగా అన్నాడు.

"సెలవునుంచి తిరిగి వస్తున్నారా?" అని అడిగాడు. జవాబు కోసం ఆగకుండానే యథా ప్రకారం తన వ్యంగ్య ధోరణిలో "నువ్వు వచ్చేసేటప్పుడు మాస్కోలో యెక్కువ కన్నీళ్లు కారాయా?" అని అడిగాడు.

కరేనిన్ భార్యతో అలా మాట్లాడుతూనే, వ్రాన్స్కీ అవసరం తమకి లేదన్నట్టు అతను గ్రహించాలన్న ప్రయత్నం చేశాడు. అతని వేపు తిరిగి యిక సెలవు తీసుకోవచ్చన్నట్టుగా తన టోపీమీద చెయ్యి వేసాడు. కాని వ్రాన్స్కీ అన్నాతో మాట్లాడేడు.

"మీ యింటిని సందర్శించగలిగే అదృష్టం నాకు కలిగిస్తారా?" అన్నాడు.

కరేనిన్ అతనికేసి అలిసిన కళ్లతో చూశాడు.

"చాలా సంతోషంగా" అని ఉపేక్షాభావంతో గొణిగాడు. "ప్రతి సోమవారం మా యింటికి అతిథులు వస్తారు" అన్నాడు. తర్వాత వ్రాన్స్కీకి సెలవు చెప్పేసి భార్యకేసి తిరిగి మాట్లాడేడు. "నాకు నిన్ను కలుసుకుందుకు రావడానికి, నా ఆరాధనని చూపించడానికి అరగంట ఖాళీ దొరకడం యెంత అదృష్టం" అంటూ ముందటిలాగానే వ్యంగ ధోరణిలో మాట్లాడ్డం సాగించేడు.

"తమ ఆరాధన గురించి పదేపదే చెప్తూవుంటే దాన్ని గణించడం నాకు కష్టం అవుతుంది" అంది అన్నా అదే రకంగా వ్యంగ్యం ధ్వనించే గొంతుకతో. వెనక వెళ్ళిపోతూ వున్న వ్రాన్స్కీ అడుగుల చప్పుడు తనకి తెలియకుండానే వింది. 'ఆఁ, దీనివల్ల నాకేమిటి?' అనుకొంది. సెర్యోష గురించి భర్తని అడిగింది. తను లేనప్పుడు వాడు యెలా వున్నదీ వాకబు చేసింది.

"ఓ, చాలా బాగా వున్నాడు. వాడు మంచి పిల్లాడంటుంది Marlette. నీకు బాధ కలుగుతుందేమోగాని నువ్వు లేకపోయినా బెంగపెట్టుకోలేదు, నీ భర్తంత కాదు. కాని మరోసారి merci[1] నా బంగారం. అదనంగా నాకు మరో రోజుని కానుకగా యిచ్చావు. మన ప్రియమైన సమొవార్ సంబరపడుతుంది." (ప్రఖ్యాత కౌంటెస్ లిదియా ఇవానొవ్నాకి అతను సమొవార్ అని పేరు పెట్టాడు. ఆమె యెప్పుడూ ప్రతి విషయం గురించీ పొగలు కక్కుతూ బుడగలు చిమ్ముతూ వుంటుంది.) "నీ గురించి అడిగింది. నేను గనక నీ స్థానంలో వుండి వుంటే, నీకు సలహా యివ్వగలిగే ధైర్యం చేస్తే యివాళే ఆమెని చూడమని చెప్తా. నీకు తెలుసుగా ఆమె ప్రతిదాన్ని గురించీ ఆందోళన పడిపోతుంది. యిప్పుడు పాపం తన బెంగలెన్ని వున్నాగానీ, అబ్లాన్స్కీల సర్దుబాటు గురించి బాధపడిపోతోంది."

కరేనిన్‌కి కౌంటెస్ లిదియా ఇవానొవ్నా గొప్ప నేస్తం. పీటర్స్‌బుర్గ్ ఉన్నత సమాజ బృందాల్లో ఒకదానికి ఆమే కేంద్ర బిందువు. భర్తద్వారా అన్నా ఆ బృందానికి మరీ సన్నిహితంగా వుండేది.

---

[1] ధన్యవాదాలు (ఫ్రెంచి).

"నేను ఆమెకి రాశానే."

"అయినా ఆమె వివరాలన్నీ వినాలనుకుంటోంది. అంత బడలికగా లేకపోతే వెళ్ళ తప్పకుండా, నా బంగారం. కొంద్రాతీ నిన్ను బగ్గీలో యింటికి తీసికెడతాడు, నేను కమిటీకి వెళ్లాలి. యిప్పుడు నేను ఒక్కణ్ణే భోజనం చెయ్యక్కర్లేదు" అన్నాడు. అతని వ్యంగ్య ధోరణి తగ్గింది. "నువ్వు వూహించలేవు నాకు నువ్వు యెంత..."

చాలా సేపు ఆమె చేతిని ఆప్యాయంగా నొక్కేడు. ఆమెకేసి చూసి ప్రత్యేకమైన చిరునవ్వు నవ్వేడు. బగ్గీ యెక్కించేడు.

32

అన్నా యింటికి రాగానే మొదటగా ఆమెని కలుసుకున్నవాడు కొడుకు. పంతులమ్మ వారిస్తూ వున్నా కూడా వినిపించుకోకుండా మెట్లమీదనుంచి, పట్టరాని సంతోషంతో "అమ్మా, అమ్మా!" అని అరుస్తూ గెంతుకుంటూ వచ్చేడు. అమ్మ దగ్గరికి రాగానే ఆమె మెడ వాటేసుకున్నాడు.

"నే చెప్పానా అమ్మేనని" అన్నాడు పంతులమ్మ కేసి తిరిగి. "నాకు తెలుసు" అన్నాడు.

కొడుకుని చూడగానే ఆమెకి మొదట భర్తని చూసినప్పటిలాగానే యేదో వెలితిగా అనిపించింది. యదార్థంలో వాడు వున్నదానికంటె వాడి రూపాన్ని వూహలోనే బాగా కల్పించుకుంది. వున్నవాణ్ణి వున్నట్టుగా వాణ్ణి చూసి సంతోషించడానికి గాను ఆమె వాస్తవంలోకి దిగి రావాల్సి వచ్చింది. కాని వాడు నిజంగానే ముచ్చటగా వున్నాడు. వాడిది అందమైన ఉంగరాల జుట్టు. నీలం కళ్ళు. వాడి కాళ్ళు నిటారుగా బొద్దుగా వున్నాయి. బిగుతుగా వుండే లాగు తొడుక్కున్నాడు. వాడి సామీప్యం వల్లా, ప్రేమ వల్లా అన్నాకి దాదాపు శారీరకమైన సంతోషానుభూతి కలిగింది. వాడి చూపు అమాయకంగా, విశ్వాసపూరితంగా, ప్రేమభరితంగా వుంది. వాడు అడిగే ప్రశ్నలు నిష్కపటంగా వుండడంవల్ల అన్నా మనసు కుదుట పడింది. వాడికి మేనత్త బిడ్డలు పంపిన బహుమతుల్ని యిచ్చింది. మాస్కోలో వున్న చిన్న పిల్ల తాన్యా గురించి చెప్పింది. ఆ పిల్ల యెంత బాగా చదువుతుందో, యితర పిల్లలకి చదవడం నేర్పుతుందో చెప్పింది.

"యేం నేను వాళ్లకి తీసిపోయానా?" అని సెర్యోష అడిగాడు.

"నాకు నువ్వే యీ లోకంలో అన్నిటికంటే యెక్కువ. నువ్వు నా బంగారానివి."

"నాకు తెలుసు", అన్నాడు చిరునవ్వు నవ్వుతూ సెర్యోష.

అన్నా కాఫీ పూర్తిగా తాగక ముందే కౌంటెస్ లిదియా ఇవానొవ్నా వచ్చిందని చెప్పారు. కౌంటెస్ లిదియా ఇవానొవ్నా పొడుగ్గా లావుగా వుంటుంది. రోగిష్టిగా కనిపించే పాలిన చాయతో వుంటుంది. ఆమెని చింతాక్రాంతంగా కనిపించే నల్లని కళ్ళు. అన్నాకి ఆమె అంటే

యిష్టం. కాని యివాళ యేదో మొదటి సారిగా చూస్తున్నట్టు ఆమె లోటుపాట్లతో ఆమెని చూసింది.

"ఆఁ, అయితే యిద్దరికీ సంధి కుదిర్చి వచ్చావన్నమాట" అని గదిలోకి వస్తూ అడిగింది కాంటెస్ లిదియా ఇవానొవ్నా.

"ఆఁ, కథ కంచికి వెళ్లింది. అయినా మనం భయపడినంత గొడవ యేం లేదక్కడ. మా belle soeur[1] తొందరెక్కువ" అంది.

కాంటెస్ లిదియా ఇవానొవ్నా తనకి సంబంధంలేని యే గొడవన్నా ఆసక్తి చూపించేస్తుంది. కాని తనకి ఆసక్తి వుండే వాటిని కూడా వినే అలవాటు ఆమెకి లేదు. యిప్పుడు అన్నా మాటకి అడ్డం వెళ్లింది.

"యీ లోకంలో యెంతో దుఃఖం, దుర్మార్గం వున్నాయి. నాకివాళ చాలా విచారంగా వుంది."

"యేం జరిగింది?" అని చిరునవ్వుని ఆపుకోడానికి తంటాలు పడుతూ అడిగింది అన్నా.

"సత్యంకోసం పోరాడుతూ అలిసిపోతున్నాను. యిదంతా వదిలేద్దామా అనిపిస్తూ వుంటుంది నాకో అప్పుడు. సోదరీమణుల కృషి (పరోపకారపూరిత, దైవభక్తిపూరిత, దేశభక్తియుత సంస్థని ఉద్దేశించి) "బాగానే మొదలైంది. కాని యీ మహానుభావులతో యేమీ పొరిగేటట్టు లేదు" అంది కాంటెస్ అదృష్టం లేకపోతే యేం చెయ్యలేమని వ్యంగ్యంగా లొంగిపోతున్న వేదాంత ధోరణిలో. "యీ పని మొదలెట్టారు, దాన్ని వంకర చేశారు. వాళ్ల అభిప్రాయాలు అబ్బ, యెంత అల్పం, తుచ్ఛం అనుకున్నావ్. యేదో మీ ఆయనలాంటి ఒకళ్లిద్దరు యీ ప్రయత్నం యెంత బ్రహ్మాండమైందో అర్థంచేసుకున్నారు. మిగతావాళ్లు యెంత సేపూ దిగదియ్యడమే. నిన్న ప్రావిన్ దగ్గర్నుంచి నాకు ఉత్తరం వచ్చింది."

ప్రావ్దిన్ విఖ్యాత పాన్‌స్లావ్.* విదేశాల్లో వుంటున్నాడు. ఆ ఉత్తరంలో యేం రాశాడో కాంటెస్ లిదియా ఇవానొవ్నా యూవత్తూ చెప్పింది.

తర్వాత, చర్చిలని ఏకం చేసే లక్ష్యానికి వ్యతిరేకంగా జరిగిన కుట్రలనీ, పథకాలనీ యేకరువు పెట్టింది. అదయ్యాక హడావుడిగా వెళ్లిపోయింది. ఆవేళ ఆమె యేదో సంఘం మీటింగుకి, స్లావ్ కమిటీ* మీటింగుకి వెళ్లాల్సివుందట.

'యిదంతా యింతకు ముందే వుంది, కాని నా దృష్టి యింతకు ముందే వీటికేసి యెందుకు మళ్లలేదు?' అనుకొంది అన్నా. 'బహుశా యివాళ ఆమె యెక్కువ దిగాలుగా వుండడం వల్లనా? నిజానికి యెంత నవ్వుతాలుగా వుంటుంది! ఆమె ధ్యేయం లోకోపకారం చెయ్యడం, ఆమె క్రైస్తవ మతానుయాయి. అయినా యెప్పుడూ కోపంగానే వుంటుంది, ప్రతివాళ్లా

---

[1] మరదలు (ఫ్రెంచి).

ఆమెకి శత్రువులే. క్రీస్తు పేరుమీదా లోకోపకారం పేరుమీదా ఆమెకి శత్రువులు' అనుకొంది.

కౌంటెస్ లిదియా ఇవానొవ్నా వెళ్ళిపోయాక అన్నా స్నేహితురాలు ఒకామె వచ్చింది. ఆమె యేదో డిపార్ట్‌మెంట్ డైరెక్టరుగారి భార్య. ఆమె నగరంలోని విశేషాలన్నీ చెప్పింది. భోజనానికి వస్తానని మాట యిచ్చి ఆమె మూడు గంటలకి వెళ్ళిపోయింది. కరేనిన్ మంత్రి మండలి దగ్గర వున్నాడు. అన్నా ఒక్కర్తీ వుండిపోయింది. భోజనాల వేళకి ముందు కొడుకుతో గడిపింది. వాడు భోజనం చేస్తూ వుంటే వాడి దగ్గర కూర్చుంది (వాడు ఒక్కడూ తినేవాడు). తర్వాత సామాన్లు సర్దుకుంటూ, తన టేబిల్‌మీద పేరుకు పోయిన ఉత్తరాలనీ, పత్రాలనీ చదువుకుంటూ వాటికి జవాబులు రాస్తూ గడిపింది.

పీటర్స్‌బుర్గ్ వచ్చేటప్పుడు దారిలో అకారణంగా కలిగిన లజ్జామభూతి, ఉద్విగ్నత యిప్పుడు పూర్తిగా మాయమైపోయాయి. పరిచితమైన జీవిత పరిస్థితులలో మళ్ళీ దృఢంగా, అనింద్యపూరితంగా వున్నట్టు ఆమెకి అనిపించింది.

అంతకు ముందు రోజు వున్న తన మానసిక స్థితిని గుర్తుచేసుకుంది. 'యేం జరిగింది? యేమీ లేదు. వ్రాన్‌స్కీ యేదో తెలివితక్కువ ముక్క అన్నాడు, నేను దాన్ని అక్కణ్ణే తుంచేశాను. యెలాంటి జవాబివ్వాలో ఆ జవాబే యిచ్చాను. మా ఆయనకి విషయం చెప్ప నవసరం లేదు. నిజానికి అలా చెప్పడం తప్పు కూడానూ. అలా చెప్పడం అంటే ఆ మాటకి లేనిపోని ప్రాముఖ్యం యిచ్చినట్టవుతుంది.' ఆమెకి లోగడ కరేనిన్‌కి చెప్పిన విషయం ఒకటి గుర్తు వచ్చింది. కరేనిన్ కింద పనిచేసే ఓ యువకుడు అన్నాగారు మిమ్మల్ని ప్రేమిస్తున్నానని తనతో అన్నాడు. ఆ సంగతి భర్తకి చెప్పింది. ఉన్నత సమాజంలోకి వస్తూ పోతూ వుండే ప్రతీ మహిళకీ అలాంటి సంఘటనలు జరుగుతాయనీ, కాని ఆమె తగినంత నేర్పు చూపించగలదనడంలో తనకి సందేహం లేదనీ, యీర్ష్య పడి తననిగాని ఆమెనిగాని కించపరుచుకోవడం జరగదనీ అతను అన్నాడు. 'అంచేత ఆయనకి చెప్పడంలో పలబులేదు. నిజానికి చెప్పాల్సిందేముంది? దేముడి దయవల్ల యేమీ లేదు' అనుకొంది.

33

అలెక్సేయ్ అలెగ్జాండ్రోవిచ్ కరేనిన్ నాలుగు గంటలకి మంత్రి మండలి కార్యాలయం నుంచి యింటికి తిరిగి వచ్చేడు. సరాసరి ఆమె దగ్గరికి వెళ్ళే వ్యవధి మామూలుగానే అతనికి లేకపోయింది. తన చదువుకునే గదిలోకి వెళ్ళాడు. అక్కడ అతనికోసం మహజర్లు పట్టుకుని కొంతమంది యెదురు చూస్తున్నారు. అక్కడ ఆఫీసునుంచి సూపరింటెండెంట్ పంపిన కాగితాలమీద సంతకాలు చేశాడు. (భోజనాలకి కరేనిన్ల యింట్లో యెప్పుడూ కనీసం ముగ్గురేనా పైవాళ్ళుంటారు) ఆ పూట భోజనాల దగ్గర ఒక పెద్దావిడ వుంది. ఆమె కరేనిన్‌కి అక్కగారి వరస అవుతుంది. ఆ డిపార్ట్‌మెంట్ డైరెక్టరూ, ఆయన భార్య, యింకో యువకుడు వున్నారు. యీ యువకుణ్ణి కరేనిన్ డిపార్ట్‌మెంట్‌లో యేదో ఉద్యోగానికి సిఫార్సుచేశారు.

అన్నా అతిధులకి కాలక్షేపం కలిగించడానికి డ్రాయింగ్ రూమ్‌లోకి వచ్చింది. సరిగ్గా అయిదు గంటల వేళకి, పీటర్ ది గ్రేట్ నాటి కంచు గడియారం కదవటి గంట మోగేలోగా, కరేనిన్ గదిలోకి వచ్చేడు. అతను ఫ్రాక్ కోటు వేసుకున్నాడు. తెల్ల టై కట్టుకున్నాడు. కోటు ఛాతీమీద రెండు పతకాలు వున్నాయి (భోజనాలయిన వెంటనే అతనికో కార్యక్రమం వుంది). కరేనిన్ జీవితంలో ప్రతి క్షణమూ యేదో ప్రత్యేక వ్యాపకంతో నిండింది. ప్రతి రోజూ తను చెయ్యవలసివున్న పనులన్నీ పూర్తిచెయ్యడానికి గాను అతను కచ్చితమైన కార్యక్రమం పాటించేవాడు. "తొందర కూడదు, దండుగ కూడదు" అనేది అతని సూక్తి. డ్రాయింగ్ రూమ్‌లోకి వచ్చి అందరికీ అభివాదంచేసి భార్యకేసి చిరునవ్వు నవ్వుతూ చూసి గబగబా భోజనాల దగ్గర చేరాడు.

"అమ్మయ్య, నేను ఒక్కణ్ణే వుండక్కర్లేదు. ఒక్కళ్ళూ భోజనం చెయ్యడం యెంత యిబ్బందిగా వుంటుందో" (అతను 'యిబ్బంది' అనే మాటని వొత్తి పలికాడు) "నీకు తెలీదు" అన్నాడు.

భోజనాల దగ్గర భార్యతో మాస్కో సంగతుల గురించి ముచ్చటించేడు. పరిహాసంగా నవ్వుతూ అబ్లాన్‌స్కీ గురించి అడిగేడు. కాని సంభాషణ పీటర్స్‌బుర్గ్ డిపార్ట్‌మెంటల్ వ్యవహారాలకి సంబంధించీ, సమాజ కార్యకలాపాల గురించీ మొత్తంమీద లోకాభిరామాయణంగానే సాగింది. భోజనాల తర్వాత కరేనిన్ అతిధులతో వో అర గంట కాలక్షేపం చేశాడు. మరోసారి చిరునవ్వు నవ్వుతూ భార్య చేతిని నొక్కి కౌన్సిల్ మీటింగ్‌కి వెళ్ళిపోయాడు. అన్నా వచ్చిందని విని ప్రిన్సెస్ బెట్సీ త్వెర్‌స్కాయా ఆమెని రమ్మని పిలిచింది. అయినా అన్నా ఆ సాయంత్రం బెట్సీ త్వెర్‌స్కాయా దగ్గరికి వెళ్ళలేదు. ఆ రోజు సాయంత్రం ప్రదర్శనకి థియేటర్‌కి వెళ్ళచ్చు, బాక్స్ టికెట్ వుంది. అయినా అక్కడికీ వెళ్ళలేదు. ఆమె వెళ్ళకపోవడానికి ముఖ్య కారణం తను వేసుకుందామన్న గౌను తయారై రాకపోవడమే. అతిధులు వెళ్ళిపోయాక బట్టల అల్మారా చూసింది. మా చెడ్డ చిరా కనిపించింది. పెద్దగా ఖర్చు పెట్టకుండానే అన్నా షోకైన బట్టలు వేసుకుంటుంది. ఆమెకా నేర్పు వుంది. మాస్కో ప్రయాణానికి ముందు మూడు గౌన్లు బాగుచేతకి పురమాయించింది. అసలు యివి పాతవి బాగు చేయించారేమోనని గుర్తు పట్టలేకుండా వాటిని చెయ్యాలి. తను మాస్కోనుంచి తిరిగి రావడానికి మూడ్రోజులు ముందే అవి తయారై వుండాలి. యింతకీ తేలిందేమిటంటే రెండేమో అసలు తయారవనే లేదు, మూడోది అన్నా కోరుకున్న రీతిలో లేదు. దర్జీ ఆమె వచ్చి యిదే మంచిదని చెప్తూ మొండిగా వివరించబోయింది. అన్నాకి కోపం వచ్చింది. తర్వాత అలా కోపం తెచ్చుకున్నందుకు సిగ్గుపడింది. కోపం చల్లారడం కోసం అన్నప్పి పిల్లాడి గదిలోకి వెళ్ళింది. ఆ సాయంత్రమంతా కొడుకుతో గడిపింది. స్వయంగా వాణ్ణి నిద్ర పుచ్చింది. వాడిమీద శిలువ గుర్తుగీసింది. దుప్పటీ కప్పింది. తను యెక్కడికీ వెళ్ళకుండా అంత సంతోషంగా యింటి దగ్గరే ఆ సాయంత్రం గడిపినందుకు ఆనందించింది. ఆమె

స్తిమిత పడింది. కులాసాగా వున్నట్టనిపించింది. రైల్లో తనకి యెంతో విపరీతంగా కనిపించిన ప్రతీదీ ఉన్నత సమాజంలో చిల్లర విషయాలేనని స్పష్టంగా చూసింది. యితరుల ముందుగాని, తన మనసులోగాని సిగ్గు పడవలసింది యేమీ లేదని స్పష్టంగా చూసింది. ఓ ఇంగ్లీషు నవల తీసుకుని నెగడు దగ్గర చేరి భర్త రాక కోసం చూస్తూ కూర్చుంది. సరిగ్గా తొమ్మిదిన్నర గంటలకి గుమ్మం దగ్గర గంట వినిపించింది. వెంటనే అతను గదిలోకి వచ్చేడు.

"మొత్తానికి యింటికి చేరావ్" అని చెయ్యి చాచి అంది అన్నా.

అతనామె చేతిని ముద్దుపెట్టుకుని ఆమె పక్కన కూర్చున్నాడు.

"నీ మాస్కో ప్రయాణం పండు అయింది, బాగుంది" అన్నాడు.

"ఓ బ్రహ్మాండంగా" అందామె. ఓం ప్రథమంనుంచీ జరిగినదంతా చెప్పడం మొదలు పెట్టింది: వ్రాన్‌స్కీ తల్లితో కలిసి ప్రయాణం చెయ్యడం, అక్కడికి చేరడం, రైల్వే స్టేషన్‌లో జరిగిన ప్రమాదం యిలా అన్నిట్నీ చెప్పింది. తను మొదట తమ్ముడికోసం బాధ పడిన సంగతి, తర్వాత దాలీకోసం బాధపడిన సంగతి చెప్పింది.

"అలాంటి మనిషిని, నీ తమ్ముడైనాగానీ, క్షమించే అవకాశాన్ని నేను నొప్పుకోను" అని కరేనిన్ కటువుగా అన్నాడు.

అన్నా చిరునవ్వు నవ్వింది. నిజాయితీగా తన ఉద్దేశాన్ని వ్యక్తంచెయ్యడానికి బంధుత్వాలు తనకి అడ్డం రావని చూపించడానికి అలా అన్నాడని ఆమెకి తెలుసు. భర్తకి వున్న యీ గుణం ఆమెకి తెలుసు. అదంటే యిష్టపడేది.

"అంతా సుఖంగా ముగిసింది, నువ్వు తిరిగివచ్చావ్, అంతే చాలు నాకు. కౌన్సిల్‌లో నేను తీసుకునేటట్టు చేసిన కొత్త ప్రతిపాదనం గురించి మాస్కోలో యేమనుకుంటున్నారేమిటి?" అని అడిగాడు.

అన్నా వాటి గురించి యేమీ వినలేదు. అతనికి అంత ముఖ్యం అయినదాన్ని తను మరిచిపోయిందే అని నేరం చేసినట్టు ఆమెకి మనస్సు చివుక్కుమంది.

"యిక్కడైతే మాత్రం బోలెడు వ్యాఖ్యానాలు రేగుతున్నాయి" అన్నాడు ఆత్మతృప్తిగా చిరునవ్వు నవ్వుతూ.

అతనికి సంతోషం కలిగించిన యీ విషయం గురించి కొంత తనకి చెప్పాలని అతనికి వుందని అన్నా గ్రహించింది. అందుకని అతన్ని అలా చెప్పేటట్టు చేసే ప్రశ్నలు కొన్ని అడిగింది. అదే ఆత్మతృప్తి పూరిత మందహాసం చేస్తూ తన ప్రతిపాదనలు నెగ్గినప్పుడు తనకి యెంతలా అభినందనలు ముంచెత్తేస్తూ వచ్చాయో చెప్పాడు.

"నాకు చాలా సంతోషం కలిగింది. నిజంగా చాలా. యీ విషయంలో యెట్టకేలకి మనం దృఢమైన వైఖరిని, స్థిర వున్న వైఖరిని అవలంబించ మొదలెట్టాం అని యిది చూపిస్తుందంతే."

అతను రొట్టె, మీగడ తిని రెండో కప్పు టీ తాగేక తను చదువుకునే గదిలోకి వెళ్లడానికి లేచాడు.

"నువ్వీ సాయంత్రం యెక్కడికీ వెళ్లలేదా? చాలా విసుగ్గా వుండిందేమోనే?" అని అడిగాడు.

"యేమీ లేదు" అంది అన్నా. తనూ లేచి అతని తోబాటు హాల్లో గుండా చదువుకునే గదిదాకా వెళ్లింది. "యేం చదువుతున్నావు?" అని అడిగింది.

"యిప్పుడా? Duc de Lille, Poésie des enfers.[1] భలే పుస్తకంలే" అన్నాడు.

తనకి యిష్టమైనవాళ్ల దౌర్బల్యాలని చూసి యెవళ్లైనా చిరునవ్వు నవ్వినట్టు అన్నా చిరునవ్వు నవ్వింది. అతని చెయ్యి పట్టుకుని అతని గదిదాకా వెళ్లింది. అతనికి సాయంత్రాంప్పుడు చదువుకునే అలవాటు అబ్బింది, యిప్పుడలా చదవడం ఒక అవసరంగా మారింది అని ఆమెకి తెలుసు. అధికార విధుల నిర్వహణలో అతనికి తీరిక వుండనంత వ్యాపకం వున్నా బౌద్ధిక రంగంలో జరిగే గణనీయమైన సంఘటనలతో సంబంధం పెట్టుకోవడం తన విధి అయినట్టు అతను భావిస్తాడని ఆమెకి తెలుసు. అతనికి అసలు ఆసక్తికరంగా వుండేవి రాజకీయాలు, తత్వశాస్త్రం, మతం అనీ, స్వభావ రీత్యానే అతనికి కళ పరాయిదనీ ఆమెకి తెలుసు. అయినా కూడా, లేదా తత్పర్యవసానంగా, ఆయా రంగాల్లో కలకలం రేపిన దాన్ని దేన్నీ జారవిడవడు. ప్రతిదాన్నీ చదవడం తన విధి అని భావిస్తాడు. రాజకీయాలకి సంబంధించి, తత్వశాస్త్రానికి సంబంధించి, మతానికి సంబంధించి అతను సందేహాలు లేవనెత్తుతాడు, శోధన చేస్తాడు. కాని కళకీ కవిత్వానికీ సంబంధించి, ముఖ్యంగా తనకి యే మాత్రమూ కొరుకుడుపడని సంగీతానికి సంబంధించి, అతనికి స్థిరమైన అభిప్రాయాలు వున్నాయి అని ఆమెకి తెలుసు. షేక్స్పియర్, రాఫయేల్, బీథోవెన్*ల గురించి మాట్లాడ్డమన్నా, సంగీతంలో కవిత్వంలో వస్తూ వున్న నూతన శాఖల గురించి మాట్లాడ్డమన్నా అతనికి సరదా. యీ నూతన ధోరణులన్నీ అతనికి సంబంధించి స్పష్టంగా వర్గీకృతం అయిపోయాయి.

"సరే అయితే చదువుకో" అంది చదువుకునే గది దగ్గరికి వచ్చాక. అతని నౌకరు అప్పటికే కొవ్వొత్తి వెలిగించి సిద్ధంచేశాడు. చేతుల కుర్చీ పక్కన నీళ్ల కూజా పెట్టాడు. "నే వెళ్లి మాస్కోకి ఉత్తరాలు రాసుకుంటాను" అంది.

అతను ఆమె చేతిని నొక్కి ముద్దుపెట్టుకున్నాడు.

'పాపం మనిషి మంచివాడే. నిజాయితీ వున్నవాడు. జాలి గుండె మనిషి. తన రంగంలో ప్రసిద్ధుడు' అనుకొంది అన్నా తన గదిలోకి వెళుతూ. యితన్ని ప్రేమించడం అసంభవం అని యెవరో అంటూ వున్నట్టు తను యితని తరఫున వాదిస్తున్నట్టు అలా అనుకొంది.

[1] డ్యూక్ దె లిల్ "నరక కావ్యం" (ఫ్రెంచి). కల్పిత గ్రంథం — సం.

'కాని అతని చెవులు యింత వింతగా పైకి కనిపిస్తున్నా యేమిటి? జుట్టు పొట్టిగా క్షవరం చేయించుకున్నందువల్లా?' అనుకొంది.

సరిగ్గా రాత్రి పన్నెండు గంటలైంది. అన్నా యింకా రాతబల్ల దగ్గరే వుంది. అప్పుడే దాలీకి రాస్తూవున్న ఉత్తరాన్ని పూర్తిచేసింది. అప్పుడు యింట్లో వేసుకునే చెప్పులతో నడుస్తూ వస్తున్న అడుగుల చప్పుడు వినిపించింది. యింతట్లోకీ అతను ఆమె పక్కకి వచ్చేడు. ముఖం కడుక్కుని తల దువ్వుకున్నాడు. చంకలో పుస్తకం వుంది.

"పూ, పూ. వేళైంది" అన్నాడు. ఒక ప్రత్యేక తరహా మందహాసం చేశాడు. తర్వాత పడక గదిలోకి వెళ్లాడు.

'అలా యీయనకేసి చూసేందుకు అతనికేం హక్కు వుంది?' అనుకొంది అన్నా కరేనిన్‌కేసి వ్రాన్‌స్కీ చూసిన చూపుని గుర్తుచేసుకుంటూ.

బట్టలు మార్చుకుని పడక గదిలోకి వెళ్లింది. మాస్కోలో వున్నప్పుడు ఆమె కళ్ల ల్లోనూ, చిరునవ్వులోనూ తొణికిసలాడిన జీవ చైతన్యం ఆమె ముఖంలో యిప్పుడు లేదు. లేకపోవడమే కాదు తనలోని జీవ జ్వాల కూడా ఆరిపోతున్నట్టుగా, లేదా యేదో మూలకి కుంచించుకు పోయినట్టుగా వుంది.

34

పీటర్స్‌బర్గ్ నగరంలోని మొర్స్కాయ వీధిలో వ్రాన్‌స్కీకి పెద్ద ఫ్లాట్ వుంది. వూరికి వెళ్లేటప్పుడు దాన్ని పెత్రిత్‌స్కీకి అప్పజెప్పాడు. అతను వ్రాన్‌స్కీ స్నేహితుడు, యిష్టుడైన సహోద్యోగి.

పెత్రిత్‌స్కీ యువకుడు, లెఫ్టినెంట్. చెప్పుకోదగ్గంత హోదా వంశీకుడూ కాదు, డబ్బున్నవాడూ కాదు. పైపెచ్చు పీకలదాకా అప్పుల్లో మునిగిన మనిషి. సాయంత్రం అయే వేళకి యెప్పుడూ తాగేస్తాడు. చాలా సార్లు తాగిన నేరానికీ, పరువు తక్కువ సాహసకృత్యా లకీ శిక్షగా కటకటాల వెనక పడ్డాడు. కాని తోటివాళ్లకీ, పై అధికార్లకీ అతనంటే బాగా యిష్టమే. పొద్దున్న పదకొండు గంటల ప్రాంతంలో వ్రాన్‌స్కీ స్టేషన్‌నుంచి తన యింటికి వచ్చేటప్పటికీ వీధిలో తనకి తెలిసిన అద్దెబగ్గీ నిలబడివుండడం చూశాడు. గంట వొత్తేడు. లోపలినుంచి మగాళ్ల నవ్వులు వినిపించాయి. ఆడామె యెవరో వాగుతూ వుండడం విని పించింది. "తుంటరి వెధవలెవర్నీ లోపలికి రానివ్వకండి" అని పెత్రిత్‌స్కీ అరవడం విని పించింది. తను వచ్చినట్టు ఆర్డర్లీని చెప్పనివ్వకుండానే వ్రాన్‌స్కీ ముందు గదిలోకి వెళ్లేడు. పెత్రిత్‌స్కీ స్నేహితురాలు బేరనెస్ షిల్టన్ ఓ గుండ్రటి బల్లదగ్గర కూర్చుంది. కాఫీ కలుపుతోంది. పారిస్‌వాసుల ఉచ్చారణలో కానరీ పిట్టలాగా వాగుతూనే వుంది. ఆమె వూదా రంగు సిల్కు గౌను తొడుక్కుంది. ఆమె ముచ్చటైన వదనం గులాబీ రంగు చెక్కిళ్లతో

మెరుస్తోంది. ఆమె బంగారు కురులు అందాలు పొలక బోస్తున్నాయి. ఆమెకి ఓ పక్క పెద్ద కోటు తొడుక్కుని పెత్రిత్‌స్కీ, పూర్తి యూనిఫాం వేసుకుని కెప్టెన్ కామెరోవ్‌స్కీ కూర్చున్నారు. (అతను అప్పుడే డ్యూటీనుంచి వచ్చినట్టుంది.)

"హెయ్ వ్రాన్‌స్కీ!" అని ఎగిరి గంతేస్తూ అరిచాడు పెత్రిత్‌స్కీ. "మన యజమానే స్వయంగా వచ్చేడు! బేరనెస్, యితనికి కొత్త పాట్‌లోని కాఫీ పోసి యియ్యి. అరె! యెంత ఆశ్చర్యం, అనుకోకుండా వచ్చావ్! నీ అధ్యయన మందిరాన్ని కొత్తగా అలంకరించిన యీ ఆభరణం నీకు సంతోషంగానే వుందనుకుంటా" అన్నాడు బేరనెస్‌ని చూపిస్తూ. "మీకు పరిచయం వుందా?" అని అడిగేడు.

"అయ్యో, లేకపోవడమేం? ఆమే నేమా పాత మిత్రులం" అని వ్రాన్‌స్కీ సంతోషంగా చిరునవ్వు నవ్వుతూ, బేరనెస్ చిన్న చేతిని తన చేతిలోకి తీసుకుంటూ అన్నాడు.

"మీరిప్పుడే ప్రయాణంచేసి వచ్చారు కదా అంచేత నే వెళ్లిపోతా. మీకడ్డంగా వుంటే యీ క్షణంలోనే వెళ్లిపోతా" అంది బేరనెస్.

"మీరెక్కడ వుంటే అదే మీ యిల్లు, బేరనెస్" అన్నాడు వ్రాన్‌స్కీ. "నమస్తే కామెరోవ్‌స్కీ" అన్నాడు, ఉదాసీనంగా కామెరోవ్‌స్కీ చేతిని అందుకుంటూ.

"చూశారా, మీరెప్పుడూ అలాంటి యింపైన మాటలు అన్లేరు" అంది పెత్రిత్‌స్కీతో బేరనెస్.

"ఎందుకు అన్లేను? భోజనం చేశాక అంత బాగామా వుంటాను."

"భోజనాల తర్వాత అంత బాగా వుండదు. సరే కాఫీ తయారుచేస్తా. చేతులూ మొహం కడుక్కుని బట్టలు మార్చుకోండి" అంది బేరనెస్. మళ్లీ కూర్చుని బహు శ్రద్ధగా కొత్త కాఫీ పాట్ హేండిల్ తిప్పింది. "ప్యేర్, కాఫీ పొడరు యివ్వండి" అంది పెత్రిత్‌స్కీతో. పెత్రిత్‌స్కీ యింటి పేరునిబట్టి ప్యేర్ అని పిలుస్తోంది. అతనికీ తనకీ గల సంబంధాన్ని కప్పి వుంచుకునే ప్రయత్నమే చెయ్యదు. "యింకొంచెం కాఫీ వేద్దామని" అంది.

"పాడు చేస్తావు."

"చెయ్యను. సరే, మీ ఆవిడ యేదీ?" అని బేరనెస్ వున్నట్టుండి వ్రాన్‌స్కీ తన స్నేహితుడితో యేదో మాట్లాడుతూ వుంటే అడ్డం వచ్చి అడిగింది. "మీ పరోక్షంలో మీకు పెళ్లిచేసేశాం, మీ భార్యని తీసుకొచ్చారా?"

"లేదు బేరనెస్, నేను పుట్టడమే జిప్సీగా పుట్టేను, చచ్చిపోవడం జిప్సీగా చచ్చిపోతాను."

"యింకా క్షేమగ్గా వుందీ మాట, క్షేమగ్గా వుంది. యేదీ మీ చెయ్యి యిలా యివ్వండి."

బేరనెస్ అలాగే వ్రాన్‌స్కీ చెయ్యి పట్టుకుని, మధ్య మధ్య ఛలోక్తులు విసురుతూ తను యెలా జీవించ దలుచుకున్నదీ ఆ కొత్త పథకాలు వివరిస్తూ, అతని సలహా అడిగింది.

"తనింకా నాకు విడాకులివ్వడానికి ఒప్పుకోవడం లేదు" అంది ('తను' ఆమె భర్త). "యింకెలా తగలడను? దావా వడేద్దా మనుకుంటున్నాను. యేమంటారు పడెయ్యమంటారా?

కామెరొవ్‌స్కీ, కాఫీని ఓ కంట కనిపెట్టి వుండండి. అరె, చూడండి, పొర్లిపోయింది. మీరు కాళీగా లేను చూస్తున్నారు కదా? ఆఁ, యేం, నేను దావా వదెయ్యాలని చూస్తున్నాను. నా ఎస్టేట్ వదులుకుంటానా యేమిటి? యింతకంటే అసంగతమైన మాట వుంటుందా చెప్పండి – నేను తనకి పతివ్రతగా లేనట" అందామె తిరస్కారంగా, "ఆ కారణంగా ఎస్టేట్ రానడి అంతా తీసేసుకుంటాడట" అంది.

యీ ముచ్చటైన పడుచామె ఉల్లాసంగా వాగుతూ వుంటే వ్రాన్‌స్కీ ఆసక్తిగా విన్నాడు. ఆమె పట్ల సానుభూతి చూపించేడు. తను మామూలుగా అలాంటి ఆడ వాళ్ళతో మాట్లాడే ధోరణిలోనే సగం సీరియస్‌గా సగం తేలిగ్గా వుండేటట్టు సలహా యిచ్చేడు. అతని పీటర్స్‌బర్గ్ ప్రపంచంలో జనమంతా రెండు విరుద్ధ వర్గాలుగా యేర్పడిపోయారు. ఒకటి దిగువ రకం. అందులో వాళ్ళు సాదా మనుషులు, దద్దమ్మలు; పరమ హాస్యాస్పదంగా వుంటారు. తను శాస్త్రోక్తంగా పెళ్ళాడిన భార్యతోనే కాపరంచేస్తూ ఒకే భర్త ఒకే భార్య అని నమ్మే రకం వాళ్ళు. పడుచు అమ్మాయిలు పవిత్రంగా వుండాలి, పెళ్ళయిన ఆడాళ్ళు పర పురుషుణ్ణి కన్నెత్తి చూడకూడదు, మగాళ్ళు తెగువగా వుండాలి, సంయమనంతో వుండాలి, దృఢ చిత్తంతో వుండాలి, పిల్లలకి విద్యాబుద్ధులు చెప్పించాలి, 'అనుదినాహారం' సంపాదించుకోవాలి, అప్పులు వుంచుకోకూడదు యింకా ఆ బాపతు చెత్తంతా నమ్మే రకం. యీ బాపతు వాళ్ళు పూర్వోత్తరం రకం, హాస్యాస్పదంగా వుండే రకం. యిక రెండో రకం సిసలైన సరుకు వున్నారు. యీ రకానికి చెందినవాళ్ళే అతని బృందం అంతా. వీళ్ళు అన్నిటినీ మించి, స్ఫుర్రదూపంతో వుంటారు. ఉల్లాసంగా, ధైర్యంగా, ఉదార హృదయం కలవాళ్ళుగా వుంటారు. యే మాత్రం సిగ్గుపడకుండా కోరికలకి లొంగిపోతారు. యిక మిగతా అన్ని విషయాలనీ నవ్వులాటగా తీసిపారేస్తారు.

పూర్తిగా భిన్నమైన మాస్కో ప్రపంచాన్ననుసరించి తనలో కూడా వచ్చిన అనుభూతుల కారణంగా మొదట కాసేపు వ్రాన్‌స్కీ నిశ్చేష్టుడై పోయాడు. కాని కొంచెం సేపట్లోనే అలవాటైన పాత చెప్పుల్లో కాళ్ళు పెట్టినట్టుగా కులాసాగా సరదాగా వుండే తన పాత లోకంలోకి జారిపోయాడు.

కాఫీ అసలు తయారవనే లేదు. పొంగిపోయింది. అందరిమీదా చిమ్మింది. ఖరీదైన తివాసీమీద మరకలు పడ్డాయి. బేరనెస్ గౌనుమీద మరకలు పడ్డాయి. యేది కోరుకున్నారో అదే జరిగింది: నవ్వులు, కేకలు, అల్లరి కోలాహలం రేగాయి.

"మరి సెలవ్, లేకపోతే మీరింక ముఖం కడుక్కోరు. పెద్ద మనిషికి కూడని మహాపరాధం అపరిశుభ్రంగా వుండడం అనే దాన్ని చేయించిన దోషిని అవుతాను నేను. అయితే ఆయన మెడమీద చాకు పెట్టమంటారు మీరు?"

"పిసరు వెనకా ముందూ చూడకుండా. అదీ యెలాగో తెలుసా మీ చేతులు అతని పెదవుల్ని తాకుతూ వుండేటట్టు. అప్పుడతను మీ చేతిని ముద్దు పెట్టుకుంటాడు.

యిక యాతనంతా దివ్యంగా ముగుస్తుంది" అన్నాడు వ్రాన్స్కీ.

"సరే, వుంటా, సాయంత్రం ఫ్రెంచి థియేటర్*కి వెడతా" అంటూ సిల్కు గౌను రెప రెపలాడుతూ వుండగా వెళ్లిపోయింది.

కామెరోవ్స్కీ కూడా లేచినుంచున్నాడు. అతను వెళ్లేదాకా ఆగకుండానే వ్రాన్స్కీ కరచాలనం చెయ్యడానికి తన చేతిని అతనికేసి చాచాడు. తర్వాత స్నానాల గదిలోకి వెళ్లేడు. అతను ముఖం కడుక్కుంటూవుండగా పెత్రిత్స్కీ సంక్షిప్తంగా తన పరిస్థితి అతని పరోక్షంలో యెలా మారిందీ యేమిటీ వర్ణించి చెప్పేడు. తన చేతిలో చిల్లి గవ్వ లేదట. తన తండ్రి తనకి యేమీ యివ్వననీ, తను చేసిన అప్పులు తీర్చననీ కరాఖండీగా చెప్పేశాట్ట. తనమీద దావా వేస్తా నని దర్జీ బెదిరిస్తున్నాట్ట. మిగతావాళ్లూ అలాగే చూస్తున్నారట. తన పోకిరీ పనులకి స్వస్తి చెప్పకపోతే యిక రాజీనామా పెట్టాల్సివస్తుందని రెజిమెంట్ కమాండర్ చెప్పాట్ట. అతనికి బేరనెస్ అంటే కూడా వెలపరంగా వుందట, యేమంటే ఆమె చీటికీ మాటికీ డబ్బు యిస్తా అంటూ వుంటుందట. కాని యింకోకామె వుంది. వ్! వ్రజం. తను ఆమెని వ్రాన్స్కీకి చూపిస్తాడుగా. చూడాల్సిందే, అచ్చం పూర్వోత్తర పద్ధతిలో వుంటుంది "దాసీ రెబెకా*లాగా, తెలుసా?" నిన్న తనకీ బెర్కోషెవ్‌కీ లడాయీ పడింది. బెర్కోషెవ్ ద్వంద్వ యుద్ధానికిగాను తన సాక్షుల్ని పంపుతాడట. బహుశా అలాంటిదేం జరగక పోవచ్చు. మొత్తంమీద అంతా దివ్యంగానే వుంది. యెంతో సరదాగా వుంది. వివరాలకోసం తన మిత్రుడు అడిగే అవకాశం యివ్వకుండానే పెత్రిత్స్కీ లోకంలో ఆసక్తికరంగా వుండే వార్తలని విని పించడం మొదలెట్టేడు. వ్రాన్స్కీ తను మూడేళ్లగా వుంటూవున్న ఆ సొంత యింటి వాతా వరణంలో తెలిసిన ఆ కథలు విన్నాడు. మళ్లీ తిరిగి పీటర్స్‌బర్గ్‌లో తను గడుపుతున్న పాత కులాసా జీవితానికి తిరిగివచ్చిన సంతోషానుభూతి అతనికి కలిగింది.

"అబ్బె, అసంభవం, అలా జరగదు!" అన్నాడు వాష్ బేసిన్ పెడల్ మీదనుంచి కాలు తీస్తూ. దృఢంగా, ఎర్రగా వున్న మెడని ఆ బేసిన్‌లో రుద్దుకుంటూ వున్నాడు. "అలా జరగదు" అన్నాడు. లోరా ఫెర్తిన్‌హాఫ్‌ని వదిలేసి మిలేయెవ్‌తో వుంటోంది అని విన్నప్పుడు అలా అన్నాడు. "ఫెర్తిన్‌హాఫ్ యింకా అలా బద్ధుడయి లాగానే సంతుష్టిగానే వున్నాడా? బుజాల్కోవ్ సంగతేమిటి?"

"బుజాలుకోవ్ కథ విన్నావా? ఓహ్, మహా మజాగా వుంటుంది. బుజాలుకోవ్‌కి బాల్ డాన్సంటే యమా పిచ్చి కదా? ఒక్క దర్బార్ డాన్స్ కూడా మానడు. కొత్త హెడ్‌గేర్ తీసుకుని ఓ ఘనమైన బాల్‌డాన్స్‌కి వెళ్లాడు. కొత్త హెడ్‌గేర్‌లని చూశావా? చాలా బాగుం టాయి, తేలిగ్గా వుంటాయి. యేం అతను నుంచున్నాడు... ఆగు, ఆగు, విను."

"వూఁ, వింటున్నా" అన్నాడు వ్రాన్స్కీ టర్కీ తువ్వాలుతో తుడుచుకుంటూ.

"గ్రాండ్ ప్రిన్సెస్* యెవరో రాయబారితో కలిసి అతని దగ్గరసా వచ్చింది. మనవాడి ఖర్మ కాలి వాళ్ల మధ్య కొత్త హెడ్‌గేర్‌ల గురించిన చర్చ సాగుతోందట. రాయబారికి కొత్త

హెడ్‌గేర్‌ని చూపించాలని గ్రాండ్ ప్రిన్సెస్‌కి అనిపించింది. యింతట్లోకీ, అక్కడ నుంచున్నాడుగా మన ప్రియ మిత్రుడు ఆమె చూసింది..." (అతనక్కడ హెడ్‌గేర్ పట్టుకుని నుంచున్న భంగిమని అనుకరించి చూపించేడు పెత్రీత్‌స్కీ.) "...దాన్ని ఇవ్వమని గ్రాండ్ ప్రిన్సెస్ అడిగింది. అతను యివ్వలేదు. సంగతేమిటట? అవం యియ్య అని సైగచేశారు. తల వూపారు. ముఖం చిట్లించుకున్నారు. వుహుం, యివ్వడే. బిర్రబిగట్టిన రాయిలాగా అలానే నుంచున్నాడు. అప్పుడెవరో... అతని పేరేమిటి చెప్మా... యేం, అతను దాన్ని లాక్కోబోయాడు. అయినా మనవాడు వదిలితేనా. అతగాడు బలవంతంగా వూడ పెరుక్కుని దాన్ని గ్రాండ్ ప్రిన్సెస్‌కి యిచ్చాడు. "చూడండి, యిది కొత్తది" అని ఆవిడ చూపిస్తూ దాన్ని తిరగేసింది. చూస్కో, నాయనా! లోపల్నుంచి భేరీపండు, కొన్ని చాకొలెట్లు — రెండు పౌన్ల చాకొలెట్లు, కింద పడ్డాయి. మనవాడు గుట్టు చప్పుడు కాకుండా కొట్టేసి దాని లోపల పెట్టేవన్నీ!"

వ్రాన్‌స్కీ పగలబడి నవ్వేడు. ఆ తర్వాత కొంచెం సేపటిదాకా, యేవో వేరే మాటల్లో పడిపోయినప్పుడు కూడా, మధ్యలో యిది గుర్తుకొస్తే అతనికి నవ్వాగలేదు. యెగుడు దిగుడు లేకుండా చక్కగా తెల్లగా వున్న పలు వరస కనిపించేటట్టు నవ్వేడు.

వార్తలన్నీ విన్నాక వ్రాన్‌స్కీ తన నౌకరు సాయం చేస్తూ వుంటే యూనిఫాం తొడుక్కుని హెడ్‌క్వార్టర్స్ దగ్గిరికి వెళ్ళి డ్యూటీలో చేరాడు. అక్కడ్నుంచి వెళ్ళి తన అన్నగార్నీ, బెట్సీనీ యింకా కొంతమందినీ చూద్దామనుకున్నాడు. అన్నా కరేనినాని కలుసుకోవడానికి అవకాశం యిచ్చే బృందాల్లో ప్రత్యక్షమవవచ్చుని అలా అనుకున్నాడు. పీటర్స్‌బుర్గ్‌లో యెప్పుడూ వుండే మాదిరిగానే యిక యే అర్ధరాత్రి వేళకో యింటికి తిరిగిరావడమే. అందాకా యింటి ముఖం చూడడు.

రెండవ భాగం

I

శీతాకాలం ఆఖరులో షేర్‌బాత్‌స్కీం యింట్లో డాక్టర్లని సమావేశ పర్చారు. కిట్టీ ఆరోగ్యం క్షీణిస్తోంది. అసలు పరిస్థితి మెరుగున పడాలంటే యేం చెయ్యాలో వాళ్ళ నిర్ధారణ చేసి చెప్పాలి. ఆమెకి జబ్బుగా వుంది. వసంత ఋతువు తిరిగేటప్పటికి ఆమె ఆరోగ్యం ఇంకా దిగజారింది. కుటుంబ వైద్యుడు ఆమెచేత కాడ్‌లివర్ ఆయిల్ తాగించేడు. లోహభస్మాలు తినిపించేడు. తర్వాత వైఢూర్యం చూర్ణం మింగించేడు. మొదటి దాని వల్లగాని రెండవ దానివల్లగాని, మూడవ దానివల్లగాని గుణం ఏమీ కనిపించక పోవడంవల్ల ఆమెని చికిత్స నిమిత్తం విదేశాలకి తీసికెళ్ళమని సలహా యిచ్చేడు. అప్పుడు ఒక ప్రసిద్ధ వైద్య శేఖరుణ్ణి సంప్రదించేరు. ఆ ప్రసిద్ధ వైద్యుడు నడివయస్కుడు, యింకా అతని అందం తగ్గలేదు. అమ్మాయిని పరీక్షించాలన్నాడు. ఆడపిల్లలు సిగ్గుపడటం అనేది పాత కాలపు అనాగరిక అవశేషమని, వొక రకమైన తృప్తి ప్రదర్శిస్తూ, నొక్కి చెప్పాడు. ఇంకా మంచి నడివయస్సులో ఉన్న మగవాడు పడుచు అమ్మాయిని నగ్నంగా శరీరం అంతా తడిమి చూడ్డం కంటే సహజమైంది యేమీ లేదని అన్నాడు. అతనికది సహజమైందిగానే కనిపించింది. మరి అతను తన జీవితంలో రోజూ అలానే చేస్తూ వున్నాడు. అలా చెయ్యడంలో యే రకమైన ఉద్రేకమూ లేకుండా, యే దురుద్దేశమూ లేనట్టుగా, లేదా అతనికి అలా కనిపించిన దాని వల్లనో అలా పరీక్ష చేసాడు. అందుకనే అతనికి ఆడపిల్ల సిగ్గుపడ్డం అనాగరికంగా కనిపించింది. అంత మాత్రమే కాదు. అలా సిగ్గుపడ్డం వ్యక్తిగతంగా తనని అవమానించడం సుమా అనిపించింది.

వాళ్ళు ఈ ప్రసిద్ధ డాక్టరుగారి కోరికకి లొంగి పోవలసి వచ్చింది. డాక్టర్లు అందరూ ఒకే చోట చదువుకున్నా, అందరూ ఒకే పుస్తకాలు చదివినా, అందరూ వొకే శాస్త్రాన్ని చదివినా ఈ ప్రసిద్ధ డాక్టరు మంచి డాక్టరు కాదని కొంతమంది చెప్పినా కూడా, ఏ కారణంవల్లనో ఏమో, ఈ కుటుంబంలోనూ, వాళ్ళ బృందంలోనూ ఈ ప్రసిద్ధ డాక్టరుగారికే ఒక ప్రత్యేక పరిజ్ఞానం వుందనీ ఆయనే కిట్టీని కాపాడగలడనీ ఒక అభిప్రాయం ఏర్పడిపోయింది. రోగి నిశ్చేష్టురాలైపోయింది, సిగ్గుతో, సాగిలపడిపోయింది. ఆ స్థితిలో ఆమెని బాగా తడిమి, తట్టి తర్వాత మహా జాగ్రత్తగా చేతులు కడుక్కున్నాక ఆ ప్రసిద్ధ డాక్టరు ప్రిన్స్‌తో మాట్లాడుతూ డ్రాయింగు రూములో నుంచున్నాడు. ప్రిన్స్ ముఖం

చిట్లించుకున్నాడు. డాక్టరు చెప్పేది వింటూ గొంతు ఖాండ్రించుకున్నారు. ఆయనకి జీవితానుభవం బాగా వుంది. ఆయన తెలివితక్కువ వాడు కాదు; రోగిష్టివాడు కాదు. అందు చేత ఆయనకి మందులమీద నమ్మకం లేదు. ఈ తమాషా అంతా చూసి లోపల్లోపల మహా కోపంగా ఉన్నాడు. ముఖ్యంగా కిట్టీ జబ్బుకి హేతువు తెలిసిన వాడు తను ఒక్కడే అవడం వల్ల కోపంగా వున్నాడు. కూతురి జబ్బు లక్షణాలని గురించి ఆ ప్రసిద్ధ డాక్టరు లొడలొడమని వాగుతూవుంటే విని 'పోలికోలు వాగుడుగాడు' అని తనలో తను అనుకున్నాడు. తనకి ఆ ముసలి జమీందారుగారి పట్ల వున్న ఏవగింపుని డాక్టరుగారు కూడ దాచుకోలేకపోయాడు. ఆయనకి అర్థం అయేటట్టు చెప్పే సిచస్థాయికి కష్టంమీద దిగేడు. ఆ ముసలాయనతో మాట్లాడ్డంవల్ల లాభం లేదని అతనికి తెలుసు. అసలు ఆ యింట్లో పెత్తనమంతా తల్లిదేననీ అతనికి తెలుసు. మరి ఆమె ముందు తన విలువైన మాటలు వదలాలి. సరిగ్గా ఆ సమయంలో పెద్దావిడ డ్రాయింగు రూములోకి వచ్చింది. ఆమెతో కూడా కుటుంబ వైద్యుడు వున్నాడు. పెద్ద ప్రిన్స్ వెళ్లిపోయాడు. ఈ తమాషా అంతా ఎంత హాస్యాస్పదంగా తనకి కనిపిస్తుందో వాళ్ళ గమనించకుండా వుండేటందుకు ఆయన ప్రయత్నించాడు. పెద్దావిడ కళవళ పడిపోయింది. ఏం చెయ్యాలో ఆవిడకి తోచలేదు. కిట్టీ జబ్బుకి తనే దోషి అయినట్టుగా బాధపడింది.

"హా! డాక్టరుగారూ! మా తలరాత యెలా వుందో తేల్చండి. నాకు విషయం యావత్తూ చెప్పండి" అంది. 'ఏమన్నా ఆశ వుందా?' అని అడుగుదామనుకొంది. కాని ఆమె పెదాలు వొణికేయి. ఆ ప్రశ్నని అలా అడగలేకపోయింది. "ఏమిటి విషయం డాక్టర్?" అని అడిగింది.

"ఒక్క క్షణం, ప్రిన్సెస్, నేను మా తోటి డాక్టరుతో మాట్లాడాలి. తర్వాత మా అభిప్రాయం తమకి తెలియజేస్తాం."

"అయితే నన్ను కాసేపు లోపలికి వెళ్లమంటారా?"

"మీ యిష్టం."

ప్రిన్సెస్ నిట్టూర్చి వెళ్లిపోయింది.

డాక్టర్లు ఒంటరిగా వున్నప్పుడు కుటుంబ వైద్యుడు అణకువగా తన అభిప్రాయాన్ని చెప్పేడు. క్షయరోగపు బీజాలు అంకురిస్తున్నట్టు కనిపిస్తోందట, కాని... వగైరా, వగైరా. ప్రసిద్ధ డాక్టరు అతని మాట వింటూనే మధ్యలో తన చేతికి వున్న పెద్ద బంగారు గడియారం కేసి చూసుకున్నాడు.

"ఆ, కాని" అన్నాడు ప్రసిద్ధ వైద్యుడు.

కుటుంబ వైద్యుడు గౌరవపురస్సరంగా ఆగేడు.

"చూశారూ, క్షయవ్యాధి అంకురిస్తున్నట్టు నిర్ధారించే ఆధారం మనకి లేదు. కేవిటి కనిపించేదాకా యిదమిత్థంగా తేలదు. ఏమైనా మనం అనుమానించవచ్చు. ప్రస్తుత కేసులో ఆ లక్షణాలు వున్నాయి. ఆకలి మందగించటం, నరాల ఉద్రిక్తత, యింకా అలాంటివి ఉన్నాయి.

ఇప్పుడు మన ముందున్న సమస్య ఇదీ: క్షయ వుందన్న అనుమానం మనకి కలుగుతోంది కాబట్టి జీర్ణశక్తిని పెంచేటట్టు ఎలా చెయ్యగలం?"

"నిజమే, మీకు తెలును కదా అడుగున యేదో నైతిక, మానసిక కారణం అణగి వుంటుంది" అన్నాడు కుటుంబ వైద్యుడు. చిన్నగా చిరునవ్వు నవ్వుతూ సూచన ప్రాయంగా ఆ మాత్రం మాట వదిలేడు.

"ఆఁ, ఆ విషయం గురించి అనుకోనవసరం లేదు" అన్నాడు ప్రసిద్ధ డాక్టరు. గడియారంకేసి మళ్లీ చూసుకున్నాడు. "మరేం అనుకోకండి. యావుజా బ్రిడ్జి పూర్తయిందా లేకపోతే చుట్టూ తిరిగివెళ్ళాల్సిందేనా?" అని అడిగాడు. "ఓ పూర్తయిందా! బాగుంది. అయితే యిరవై నిమిషాల్లో నేను అక్కడికి చేరుకోగలను. చూసారూ, మనం అనుకున్నట్టుగా పరిస్థితి యిదీ: జీర్ణశక్తిని పెంచాలి, నరాల బలహీనతకి చికిత్స చెయ్యాలి. ఈ రెండింటికీ సంబంధం ఉంది. రెండు వైపులమంచీ కొట్టుకు రావాలి."

"ఆమెని విదేశాలకి తీసుకెళితే ఎలా ఉంటుందంటారు?" అని కుటుంబ వైద్యుడు అడిగాడు.

"నేను విదేశయాత్రలకి వ్యతిరేకం. చూడండి నిజంగా క్షయవ్యాధి అంకురించే వున్నట్టయితే; అయితేనే సుమా — ఎందుకంటే మనకి తెలుసుకొనే ఆధారమే లేదు — నిజంగా అదే అయితే. మాత్రం విదేశయాత్రవల్ల లాభం ఉండదు. ఆమెకి యే చెరుపూ జరగకుండా ఆమె జీర్ణశక్తిని పెంచే చికిత్స చెయ్యాలి."

సోడెన్ ఖనిజ జలంతో చికిత్స చేయడానికి సంబంధించిన తన ఊహని ప్రసిద్ధ డాక్టరు విపులంగా వివరించేడు. దాన్ని సిఫార్సు చెయ్యడానికి గల ముఖ్య కారణం అది ఆమెకి ఏమీ చెరువు చెయ్యదని అనిపించడమే.

కుటుంబ వైద్యుడు మహాశ్రద్ధగా, వినయంగా విన్నాడు.

"కాని విదేశయాత్రకి సంబంధించి నేను చెప్పదల్చుకున్నదేమంటే వాతావరణంలో మార్పు వస్తుంది కదా అని. బాధాకరమైన జ్ఞాపకాలని రెచ్చగొట్టే పరిస్థితులనుంచి ఆమెని తప్పిస్తున్నాం కదా అని. అంతే. పైగా అమ్మగారికి వెళ్లాలని వుంది" అన్నాడు.

"అలాగా! అయితే వెళ్లమనండి. ఆ జర్మన్ నాటువైద్యులు ఆమెకి హాని కలిగేటట్టు చేస్తారేమో. మన సలహా వాళ్ళు పాటించాలి. సరే, అయితే, వెళ్లమనండి."

మరోసారి గడియారంకేసి చూసుకున్నాడు.

"ఆఁ, టైమయింది" అని గుమ్మం దగ్గరికి వెళ్లాడు.

తను మళ్లీ రోగిని చూడాలని ప్రసిద్ధ వైద్యుడు పెద్దావిడతో చెప్పేడు. (అలా చూడ్డం మర్యాదావసరంగా భావించి ఉండవచ్చు.)

"ఏమిటి? మరోసారి పరీక్షా?" అందావిడ భయపడిపోయి.

"ఉహుఁ, ఊరికే కొన్ని వివరాలు ధృవ పరచు కుందామని" అన్నాడు.

"సరే అయితే."

పెద్దావిడా, డాక్టరుగారూ కలిసి డ్రాయింగ్ రూమ్‌లో కిట్టీ దగ్గరికి వెళ్లారు. కిట్టీ గది మధ్యలో నిలబడి ఉంది. ఆమె చిక్కిపోయింది. తను భరించాల్సివచ్చిన అవమానానికి ఆమె కళ్లు జ్వలిస్తున్నాయి. డాక్టరు లోపలికి రావడం చూసేటప్పటికి ఆమె సిగ్గుపడిపోయింది. కళ్లల్లో నీళ్లు గిర్రున తిరిగాయి. తన యీ జబ్బు వ్యవహారం, దాని చికిత్సా వ్యవహారం అన్నీ ఆమెకి నవ్వుతాలుగా, తెలివితక్కువతనంగా కనిపించాయి. విరిగి ముక్కలైపోయిన పింగాణీ కూజాని అతకడం అంత తెలివితక్కువతనంగానూ కన్పించింది తన చికిత్స. తన మనస్సు విరిగిపోయింది. దాన్ని చూర్ణాలతో, మాత్రలతో బాగు చెయ్యగలరా? కాని తల్లిని కష్టపెట్టడం యిష్టం లేకపోయింది. ముఖ్యంగా దోషమంతా తనదేనని ఆవిడ బాధపడుతూ వుండడంవల్ల.

"కొంచెం శ్రమ అనుకోకుండా కూర్చుంటారా?" అని ప్రసిద్ధ డాక్టరు అడిగేడు.

డాక్టరు చిరునవ్వు నవ్వుతూ ఆమెకి యెదురుగా కూర్చున్నాడు. నాడి పరీక్షించేడు. మళ్లీ విసుగు పుట్టించే కొన్ని ప్రశ్నలు అడిగాడు. ఆమె జవాబు చెప్పింది. ఉన్నట్టుండి ఆమెకి కోపం వచ్చింది. ఆమె లేచిపోయి నిలబడింది.

"చాలు, డాక్టరుగారూ, ఏమనుకోకండి. దీనివల్ల ఏమీ లాభం వుండదు. ఇవే ప్రశ్నలు యిప్పటికి మూడు సార్లు అడిగారు."

ప్రసిద్ధ డాక్టరుగారు తప్పు పట్టుకోలేదు.

కిట్టీ గదిలోనుంచి బయటికి వెళ్లిపోగానే తల్లితో "ఈ చిరుబుర్రులాడ్డం రోగలక్షణం" అన్నాడు. "కాని నా పరీక్ష పూర్తయింది" అన్నాడు.

అసాధారణ గ్రహణశక్తి వున్న ఆడావిడకి చెప్పినట్టుగా కూతురి పరిస్థితి గురించి ఆమెకి శాస్త్రీయ వివరణ యిచ్చాడు. ఆ ఖనిజ జలాన్ని యెలా వాడాలో సూచనలు చేసేడు. ఇంతకీ ఆ ఖనిజ జలాన్ని పుచ్చుకోవలసిన అవసరమే లేదు. తాము విదేశాలకి వెళ్లాల్సి వుందా లేదా అని అడిగిన ప్రశ్నకి ఆయన యేదో చిక్కు సమస్యని పరిష్కరిస్తున్నట్టు దీర్ఘంగా ఆలోచించాడు. ఆఖరికి జవాబు ఊడిపడింది. వాళ్లు విదేశాలకి వెళ్లవచ్చు. కాని విదేశీ నాటు వైద్యుల మాటలు వినకూడదు. తను చెప్పిందాన్నే వినాలి.

డాక్టరు వెళ్లిపోయాక ఒక సంతోషకర సంఘటన జరిగినట్టుగా అనిపించింది. పెద్దావిడ ఉత్సాహంగా పొంగిపోతూ కూతురి దగ్గరికి వెళ్లింది. తను కూడా మహోత్సాహంగా ఉన్నట్టు కిట్టీ నటించింది. ఆమె ఎక్కువగా నటించాల్సి వస్తోంది, ఇప్పుడు.

"Maman, నాకు నిజంగా యేమీ లేదు. బాగున్నాను. కాని విదేశాలకి వెళ్దామంటే వెళ్దాం" అంది. తల్లి తలపెట్టిన ప్రయాణం అంటే తనకి ఆసక్తిగానే ఉందని చూపించడం కోసం అన్నట్టుగా దాని యేర్పాట్ల గురించి మాట్లాడ్డం మొదలుపెట్టింది.

2

డాక్టరు వెళ్ళిపోయిన కొంచెం సేపటికి దాలీ వచ్చింది. ఆ రోజున వైద్యులను పిలిపించి యేదో సంప్రదించడం వుంటుందని ఆమెకి తెలుసు. ఆమె బాలెంతరాలు. (శీతాకాలం ఆఖరులో ఆడబిడ్డని ప్రసవించింది.) ఇంటి దగ్గర బోలెడు చీకుచింతలున్నాయి. అయినా చంటిబిడ్డనీ, జబ్బు చేసిన యింకో పిల్లనీ వదిలిపెట్టి, కిట్టీ పరిస్థితి కనుక్కుందామని వచ్చింది.

టోపీ కూడా తియ్యకుండానే డ్రాయింగు రూములోకి వస్తూ, "అయితే, యేమైంది? నువ్వు ఉల్లాసంగానే కనిపిస్తున్నావు. అంతా బాగానే వుందటనా?" అంది.

డాక్టరు ఏమన్నదీ వాళ్ళు చెప్ప ప్రయత్నించారు. కాని డాక్టరు ఆపకుండా దడదడా దీర్ఘోపన్యాసం చేసినా చెప్పినా ఆయన ఏమన్నదీ బోధపడక దాన్ని చెప్పడం అసాధ్యమైపోయింది. ఆసక్తికరమైన విషయం ఆల్లా విదేశాలకి వెళ్ళడం గురించి ఖాయంగా తేలిందే అది.

దాలీ అప్రయత్నంగానే నిట్టూర్పు విడిచింది. తన ప్రాణస్నేహితురాలైన చెల్లెలు వెళ్ళిపోతోంది. తన బతుకా ఏమీ ఉత్సాహంగా లేదు. రాజీ కుదిరిన తరువాత అబ్లాన్‌స్కీకీ తనకీ మధ్య సంబంధాలు అవమానకరంగా తయారయాయి. అన్నా మళ్ళీ యిద్దర్నీ కలిపింది గాని ఆ సర్దుబాటు తాత్కాలికంగానే వుండింది. మరోసారి వాళ్ళ కుటుంబ బంధం అదే చోట తెగిపోయింది. ప్రత్యేకమైంది ఏదీ జరగలేదు. కాని అబ్లాన్‌స్కీ పగటిపూట యెప్పుడో గాని యింటిపట్టున వుండడమే లేదు. ఇంట్లో డబ్బు దాదాపు వుండటం లేదు. సంసార బంధాన్ని అతను ఉల్లంఘిస్తున్నట్టు అనుమానాలతో దాలీ మథనపడిపోతోంది. ఆమె ఈ అనుమానాలని మనస్సులోకి రానివ్వకుండా తోసేస్తోంది. లేకపోతే మరోసారి అసూయా గ్రస్తం అయి బాధ పడాల్సి వస్తుందని భయం. మొన్న మొన్ననే ఆ బాధ అనుభవించింది. కాని అలాంటి బాధని ఒకసారి అనుభవించెయ్యడం వల్ల యిక యెన్నటికీ అది పునరావృత్తం కాదు. అతను వివాహబంధాన్ని ఉల్లంఘించాడని బయటపడినా మొదటిసారి అంతలా తర్వాత అది ఆమెకు యిక బాధ కలిగించదు. అలాంటిది బయటపడితే తన దాంపత్యపు అలవాట్లకి స్వస్తి జరుగుతుందంతే. అందుచేత ఆమె అతని పట్లా, తన బలహీనతవల్ల తనపట్లా యింకా యెక్కువగా అసహ్యాన్ని అనుభవిస్తూ తనని తాను మోసంచేసుకుంది. పెద్ద కుటుంబం మానుకోవలసిరావడం కారణంగా ఆమెకి యీ చింతకంటే అదే యెక్కువగా ఉంది. ఓ పిల్లకి పాలివ్వడంలో యిబ్బంది కలగవచ్చు. లేకపోతే ఆ దాది పనిలోనుంచి తప్పుకుంటానని చెప్పవచ్చు. లేదా యిప్పుడున్నట్టుగా ఓ బిడ్డకి జబ్బు చేయవచ్చు.

"నీ పిల్లలెలా వున్నారమ్మా?" అని తల్లి ఆమెని అడిగింది.

"అయ్యో, maman, మీ బాధలు మీకున్నాయి కదా. లిలీకి యేదో నలత చేసి కదలటం లేదు. బహుశా స్కార్లెట్ ఫీవరేమోనని భయంగా ఉంది. ఊరికే వార్త కనుక్కుం

దామని యిక్కడికి వచ్చాము. దేవుడు మేలుచేసి స్కార్లెట్ ఫీవరు కాకూడదు. అయితే గనక యిక నేను యిల్లు వదిలిపెట్టి వచ్చినట్లే."

డాక్టర్లు వెళ్ళిపోయాక పెద్ద ప్రిన్స్ చదువుకునే గదిలోనుంచి యివతలికి వచ్చేడు. దాలీ ముద్దు పెట్టుకోవడానికి గాను ఆమెకి తన చెంప అందించి, ఆమెతో కొన్ని మాటలు మాట్లాడేడు.

"అయితే వెళ్లడం నిర్ణయమైందా? నన్నేం చెయ్యమంటావు?" అని భార్యని అడిగాడు.

"నువ్వు వెనక వుండడమే మెరుగు అనుకుంటాను, అలెగ్జాండ్ర్" అందావిడ.

"నువ్వెలా అంటే అలా."

"Maman, నాన్న కూడా మనతో రాకూడదా? ఆయనకీ బాగుంటుంది, మనకీ సరదాగా వుంటుంది" అంది కిట్టీ.

పెద్దాయన లేచి కిట్టీ తల నిమిరాడు. ఆమె ముఖం యెత్తి ఆయన్ని చూసి తెచ్చిపెట్టుకున్న చిరునవ్వు నవ్వింది. ఆయన కుటుంబంలో అందరికంటే బాగా తనని అర్థం చేసుకున్నాడని ఆమె ఎప్పుడూ అనుకుంది, ఆయన తనతో చాల తక్కువ మాట్లాడినా గాని. కడసారి బిడ్డ కావడం వల్ల ఆమె అంటే ఆయనకి అభిమానం యెక్కువ. తన పట్ల ప్రేమ వల్ల ఆయన మరింత సూక్ష్మగ్రాహి అయ్యాడని ఆమె భావించుకుంది. ఆయన కృపామయ నీలి నేత్రాలు తన మీదనే లగ్నం కావడం చూసి ఆయన నేరుగా తనలోకి దర్శిస్తున్నాడని, తన హృదయంలో చెలరేగుతున్న చెడ్డగొడవలన్నిట్నీ అర్థం చేసుకున్నాడని ఆమె అనుకుంది. సిగ్గుపడుతూ ఆమె ఆయన తనని గోముగా ముద్దు పెట్టుకుంటాడన్న ఉద్దేశ్యంతో తల యెత్తింది. కాని ఆయన సరదాగా ఆమె జుట్టు తడిమాడు.

"ఏమిటో యీ వెర్రి సవరాల కొప్పులు! నా కన్న కూతురి జుట్టు నిమరలేను; యేదో ఆడ శవం జుట్టు నిమరడం. వూఁ, దాలీ" అన్నాడు పెద్ద కూతురికేసి తిరిగి, "నీ తురుపు యేం చేస్తున్నట్టు యివ్వాళ?"

"యేమీ లేదు, నాన్నా" అంది దాలీ. తన భర్తనుద్దేశించే ఆయన మాట్లాడుతున్నాడని తెలుసు. "ఎప్పుడూ తిరుగుతూనే వుంటాడు. యెప్పుడో గాని కనిపించనే కనిపించడు" అని వ్యంగ్యంగా మందహాసం చేస్తూ యీ మాటలని జత చేసింది.

"కలప అమ్మటానికి యింకా వూరికి వెళ్లలేదా?"

"లేదు. వెళ్లాలి, వెళ్లాలి అని మాత్రం అంటూ వుంటాడు."

"అంటూ వుంటాడు, హాఁ?" అన్నాడు. "నన్ను వెళ్లమంటారా పోనీ? సిద్ధంగా వున్నాను" అన్నాడు భార్యకేసి తిరిగి కూచుంటూ. "కిట్టీ, నువ్విలా చెయ్యి" అని చిన్న కూతురితో అన్నాడు. "ఓ శుభదినాన లేచి కళ్లు తెరిచి, 'నేను శుభ్రంగా వున్నాను, ఉల్లాసంగా వున్నాను. నాన్నతో కలిసి చలిలో ఉదయం షికారు వెడతాను' అను, యేం?" అన్నాడు.

తండ్రి అన్న మాటలకంటే అమాయకంగా యేదీ వుండదని యెవర్లకేనా అనిపిస్తుంది.

కాని ఆ మాటలు విన్నాక కిట్టీకి సిగ్గు, బెదురు కలిగాయి. నేరం చేసేటప్పుడు దొరికిన వాళ్లలాగా బిత్తరపోయింది. 'అవును, ఆయనకి అన్నీ తెలుసు. అన్నీ అర్థం అవుతాయి. నువ్వు సిగ్గు పడుతున్నావ్, అయినా దీన్ని మర్చిపోయే టట్టుండాలి, అని యిన్ని మాటల్లో చెప్తున్నారు' అనుకుంది. కాని ఆయనకు సమాధానం చెప్పే ధైర్యం లేకపోయింది. చెప్తామని అనుకుంటూ వుందిగాని తెలియకుండానే యేడుపొచ్చేసింది. గబగబా బయటకు వెళ్లిపోయింది.

"ఇదీ నీ వేళాకోళం ఫలితం!" అని పెద్దావిడ మొగుడిమీద రేగిపోయింది. "నువ్వెప్పుడూ..." అని మొగుణ్ణి తిట్టడం లంకించుకుంది.

ఆ ముసలాయన కొంచెం సేపు యేమీ మాట్లాడకుండా వింటూ వుండిపోయాడు. కాని ఆయన కనుబొమలు యింకా యింకా యెక్కువ చిట్లించుకున్నాయి.

"పిల్ల యెంత బాధ పడుతుందో, యెంత బాధ పడుతుందో! తన బాధకి కారణం ఫలానా అని పేరు కదిపితే యెంత పుండు రేపినట్టవుతుందో నీకు పట్టనే పట్టదు. ఓరి భగవంతుడా! యిలాంటి పొరపాటు యెలా చేసామని!" అంది. ఆమె స్వరంలో మార్పు రావడం చూసి ఆమె వ్రాన్‌స్కీ గురించి మాట్లాడుతోందని దాలీ, పెద్ద ప్రిన్స్ గ్రహించారు. "ఇలాంటి నీచనర్రాలకి విరుగుడుగా చట్టాలు యెందుకు లేవో అర్థం కాదు" అంది.

"నేను వినలేకుండా వున్నాను" అన్నాడు ప్రిన్స్ ముఖం ముడుచుకొని. అవతలికి వెళ్లాలని లేచి గుమ్మం దాకా వెళ్లేడు. కాని అక్కడ ఆగి వెనక్కి తిరిగేడు. "చట్టాలు వున్నాయి, ముసలిదానా, పరిస్థితి యిలా రావడానికి కారణం నన్ను చెప్పనిస్తే దీనంతటికీ దోషివి నువ్వు—నువ్వు తప్ప మరెవరూ కాదు, అంటాను. అలాంటి తుంటరుల పని పట్టడానికి చట్టాలు ఎప్పుడూ వున్నాయి, ఆఁ, ఉన్నాయి. జరగకూడనిది జరగబట్టే, కాని లేకపోతే నేను ముసలాడ్ని అయినా కూడా సిగ్గుమాలిన వెధవని ద్వంద్వ యుద్ధానికి సవాల్ చేసి వుండేవాణ్ణి. ఇక యిప్పుడు కానీ, వైద్యం చేయించు. గచ్చకాయ పుచ్చకాయ నాటు వైద్యులందరినీ కొంపలోకి తీసుకురా" అన్నాడు.

ప్రిన్స్ యింకా యేవేవో లోతెడు చెప్పాలనుకున్నట్టే కనిపించింది. కాని ఆయన మాట్లాడిన ధోరణి చూసి ఆవిడ వెంటనే మెత్తబడి, పశ్చాత్తాప పడింది. పరిస్థితి గంభీరంగా తయారయినప్పుడల్లా ఆవిడ అలా అవుతుంది.

"అలెగ్జాండ్ర్, అలెగ్జాండ్ర్" అంటూ ఏడ్వటం మొదలుపెట్టింది.

ఆవిడ యేడుపు మొదలెట్టగానే ఆయన ఆగేడు. ఆమె దగ్గరకి వచ్చాడు.

చేతిమీద ఆవిడ తడి ముద్దు స్పర్శ తగిలి యేమంటున్నాడో తెలియకుండానే "ఊరుకో, ఊరుకో! నీకు భరించడం కష్టంగా వుందని నాకు తెలుసు. యేం చెయ్యాలి? కనిపించేటంత హాని జరగలేదులే. దేవుడు చల్లగా చూస్తాడు..." అని చెప్పి బయటకు వెళ్లిపోయాడు.

కిట్టీ ఏడుస్తూ బయటకు వెళ్లిపోవడంతో ఆమెకి స్త్రీ సహాయం అవసరం అని తన

మాతృత్వ స్వభావ గుణం వల్లా, కుటుంబ అభ్యాసం వల్లా దాలీకి అనిపించింది. ఆ సహాయం అందివ్వడానికి తయారైంది. టోపీ తీసేసి, పనికి నడుం కట్టి రంగంలోకి దిగింది. తల్లి తండ్రిమీద విరుచుకు పడినప్పుడు తల్లిపట్ల తన ధర్మం అపేక్షించినంత మేరకి ఆమెని అదుపు చేయడానికి వీలైనంత వరకూ చేసింది. తండ్రి రెచ్చిపోయినప్పుడు మాట్లాడకుండా వూరుకుంది. తల్లిని చూసి సిగ్గుపడింది. ఆయన సహజ దయ యెంత త్వరగా తిరిగి వచ్చిందో చూసి తండ్రిపట్ల మార్దవంగా అనుభూతి చెందింది. కాని ఆయన బయటికి వెళ్లిపోయాక ఆ క్షణంలో తను నిర్వర్తించవలసిన ముఖ్య కర్తవ్యాన్ని భుజంమీద వేసుకుంది. అది కిట్టీ దగ్గరకు వెళ్లి ఆమెను ఓదార్చడం.

"కొంత కాలంగా మీకో సంగతి చెప్దామనుకుంటూ వున్నా, maman. మీకు తెలుసా లేవిన్ కిందటి సారి యిక్కడకు వచ్చినప్పుడు కిట్టీని పెళ్లి చేసుకొనే ఉద్దేశంతో వచ్చాడు. స్త్రీవకి చెప్పాడు."

"అయితే యేమయింది? నువ్వనేదేమిటో నాకర్థం కావడం లేదు..."

"కిట్టీ అతన్ని కాదని ఉంటుంది. మీకేం చెప్పలేదా?"

"అబ్బే, లేదు. ఆ యిద్దరిలోనూ యెవళ్ల గురించీ నాకేం చెప్పలేదు. దానికి మహా స్వాతిశయం. కాని నేననుకోవడం యిదంతా దానివల్ల..."

"ఆఁ, వూహించండి, తను లేవిన్‌ని కాదందేమో. ఆ రెండో మనిషి లేకపోతే అలా అని వుండదు అని నాకు తెలుసు... ఇప్పుడేమో యింత దారుణంగా దగా పడిపోవడం."

తన కూతురి దౌర్భాగ్య పరిస్థితికి తన నేరం యే మేరకి వుందో ఒప్పుకొనే ధైర్యం పెద్దావిడకి లేకపోయింది. అందేత ఆమెకి కోపం వచ్చింది.

"నాకు యేమీ యెంతమాత్రమూ అర్థమవడం లేదు. ఎవళ్ల యిష్టం వచ్చినట్లు వాళ్లుండా లనుకుంటున్నారు యీ రోజుల్లో; తల్లికి యే విషయమూ చెప్పరు – మరి..."

"Maman, నేను దాని దగ్గరికెడతా."

"వెళ్లు కావాలంటే. నేనేమన్నా వద్దని ఆంక్షలు పెట్టానా?" అంది.

3

దాలీ కిట్టీ చిన్న గదిలోకి వెళ్లింది. గది ముచ్చటగా ఉంది. గులాబీ రంగు సొగసుతో వుంది. శాక్సనీ చైనా మట్టితో చేసిన చిన్న బొమ్మలు అలంకరించి వున్నాయి. రెండు నెలల నాడు కిట్టీ గులాబీ రంగుతో ఉత్సాహంతో, ప్రఫుల్లంగా యెలా వుందో అలా వుందా గది. తమా చెల్లెలూ కలిసి ముందటేడు యెంత ప్రేమగా సంతోషంగా గదిని షోకు చేసిందీ దాలీకి గుర్తు వచ్చింది. కిట్టీని చూడగానే అమె గుండె గుభిల్లుమంది. కిట్టీ గడప దగ్గర కురచ కుర్చీలో కూర్చుని తివాసీ మూలకేసి నిశ్చేష్టురాలై చూస్తూ వుంది. కిట్టీ అక్కగారికేసి

తల యెత్తి చూసింది. ఆమె ముఖంలో కన్పిస్తున్న ఉదాసీనత, కాఠిన్యం మారకుండా అలానే వున్నాయి.

"నేను యింటికి వెళ్ళిపోతున్నా. ఇక పూడిపడలేను. నువ్వు రాలేవు నన్ను చూడ్డానికి" అంది దాలీ చెల్లెలి పక్కన కూర్చుటూ. "నీతో మాట్లాడా లనుకుంటున్నాను" అంది.

"దేన్ని గురించి?" అని భయపడుతూ తల పైకెత్తి కిట్టీ అడిగింది.

"ఇక దేన్ని గురించి, నీ బాధ గురించి."

"నాకే బాధా లేదు."

"చాల్లే కిట్టీ. నాకు తెలియకుండా యెలా వుంటుంద నుకుంటున్నావు? నాకంతా తెలుసు. నా మాట నమ్ము. ఇది చాల చిన్న విషయం. మేమంతా యిలాంటివి అనుభవించిన వాళ్ళమే."

కిట్టీ మాట్లాడలేదు. ఆమె ముఖంలో కఠినత్వం కనిపిస్తోంది.

"దీన్ని గురించి నువ్వు మనస్సు కష్టపెట్టుకొనేటంత గొప్ప అతనికి లేదు" అని యెకాయెకీ విషయం యెత్తుకొని దాలీ అంది.

"నన్ను కాదన్నాడు గాబట్టా?" అంది కిట్టీ. ఆమె కంఠం వణికింది. "ఆ మాట అనకు. వద్దు, ఆ మాటనకు" అంది.

"అలా అని యెవరన్నారు? యెవర్నూ అలాంటి మాటని అనలేదు. అతను నిన్ను ప్రేమించాడనే నా నమ్మకం. ఇంకా ప్రేమిస్తూనే వున్నాడు. కాని..."

"అబ్బ యిలాంటి సానుభూతి మాటలే మహా భయంకరంగా వుంటాయి" అని హఠాత్తుగా కిట్టీ కోపంతో అరిచింది. కుర్చీలో గిరుక్కున తిరిగి ముఖం అటు తిప్పేసుకుంది. కోపంతో యెర్రబడిపోయింది. ఆమె చేతులతో బకుల్ వున్న బెల్టు పట్టుకుంది. కాసేపు వో చేత్తోనూ, కాసేపు రెండో చేత్తోనూ దాన్ని నొక్కుతూ వేళ్ళతో గబగబా కదిలించింది. కోపం వచ్చినప్పుడు వేళ్ళతో యేదన్నా పట్టుకొని అలా చేసే అలవాటు చెల్లెలికి వుందని దాలీకి తెలుసు. కోపం వస్తే వొళ్ళు పై తెలియకుండా యిది అనకూడని మాటా, అనదగిన మాటా అని వెనకా ముందూ చూడకుండా అనేస్తుందనీ తెలుసు. దాలీ ఆమెని వూరడించాలనుకుంది. కాని మించిపోయింది.

"యేమిటి చెప్పు? నాకు యే అనుభవం కలిగించాలనుకుంటున్నావో చెప్పు! యేమిటి?" అంది కిట్టీ దడదడా. "నేనో మనిషిని ప్రేమించాననీ, అతను నా గురించి యేమీ పట్టించుకోలేదనీ, నేను ప్రేమకోసం పరితపించి చచ్చిపోతున్నానని కదా? యీ మాటలు అక్కగారినుంచి తను... తను... సానుభూతి చూపిస్తున్నాను అనుకునే అక్కగారినుంచి!.. నాకు నీ సానుభూతీ అక్కర్లేదు, నీ నటనా అక్కర్లేదు" అంది.

"అన్యాయంగా మాట్లాడుతున్నావమ్మా, కిట్టీ."

"యెందుకు నన్నిలా వేధిస్తున్నావు?"

"అయ్యో, అందుకు శుద్ధ వ్యతిరేకం — నువ్వెంత బాధపడుతున్నావో కనిపిస్తోంది...."

కాని కిట్టీ చాల ఆవేశపడిపోయింది, అక్క అంటున్న మాటలు వినిపించుకోలేదు.

"నాకు సానుభూతి చూపించి అనునయించాల్సిన పని లేదు. నాకు చాల ఆత్మాభిమానం వుంది. నన్ను ప్రేమించని మనిషిని నేను ప్రేమించను యెన్నడూ."

"నువ్వు అలాంటి దానివి కాదని నేననలేదు. కాని ఏో సంగతి నిజం చెప్పు నాకు" అని దాలీ ఆమె చేతిని తీసుకొని బతిమలాడింది. "లేవిన్ నీతో మాట్లాడాడా?" అని అడిగింది.

లేవిన్ పేరు యెత్తగానే కిట్టీకి వొళ్ళు తెలీలేదు. తకామని యెగిరి బకుల్ నేలకి విసిరి కొట్టింది. చేతులు బారచాపి విసురుతూ రెచ్చిపోయింది.

"దీనికీ లేవిన్‌కీ సంబంధం యేమిటి? యెందుకిలా నన్ను చిత్రహింసలు పెడుతున్నావ్? నేనోసారి చెప్పాను. మళ్ళీ చెప్తున్నాను. నాకు స్వాభిమానం వుంది. చచ్చినా, చచ్చినా నువ్వు చేసినలాంటి పని చెయ్యను. మరో ఆమెని ప్రేమించి నాపట్ల అక్రమంగా ప్రవర్తించిన మనిషి మొహం మళ్ళీ తిరిగి చూడను. నాకలాంటిది అర్థం కాదు. అర్థం కాదంతే. నువ్వు చెయ్యగలవు అలాంటి పని, కాని నేనెన్నడూ చెయ్యలేను."

కిట్టీ బయటకి బయల్దేరి వెళ్ళిపోవాలనుకున్నది. ఆమె అక్కకేసి చూసింది. దాలీ యేమీ అనలేదు. వూరికే విచారంగా తల వాల్చుకొని అలా కూర్చుంది. అది చూసి, కిట్టీ వెళ్ళకుండా గుమ్మం దగ్గర కూలబడింది. తల వాలేసుకొని జేబు రుమాలుతో ముఖం కప్పుకుంది.

రెండు నిమిషాలు నిశ్శబ్దంగా గడిచాయి. యెవళ్ళూ మాట్లాడలేదు. దాలీ తన గురించే ఆలోచిస్తోంది. తనని యెప్పుడూ సలుపుతూ వుండే అవమానం చెల్లెలు గుర్తు చెయ్యడం వల్ల ఆమెకి మరీ బాధ అనిపించింది. కిట్టీ అంత క్రూరంగా వుంటుందని ఆమె అనుకోలేదు. కిట్టీమీద కోపం వచ్చింది. కాని హఠాత్తుగా ఆమెకి గౌను కుచ్చెళ్ళ రెపరెపలాడ్డం, బలవంతాన అపుకుంటున్న వెక్కు వినిపించేయి. తన మెడ చుట్టూ యెవళ్ళవో చేతులు బంధం వేసుకోవడం కనిపించింది. ఆమె ముందు కిట్టీ మోకాళ్ళమీద వాలి వుంది.

"నా ప్రియమైన దాలీ, నాకు చెప్పలేనంత విచారంగా వుంది, యెంతో విచారంగా వుంది" అని పశ్చాత్తప్తంగా గొణిగింది.

కన్నీళ్ళతో పులుముకు పోయిన అందమైన ముఖాన్ని దాలీ కుచ్చెళ్ళల్లో దూర్చేసింది.

అప్ప చెల్లెళ్ళ మధ్య పరస్పరానుబంధం అనే యంత్రానికి కన్నీళ్ళే కందెనలాగ కనిపించాయి. యిద్దరూ గుండె బరువు తీరా యేడ్చారు. తర్వాత కూడా తమ తమ మనస్సుల్లో తారట్లాడుతూ వున్న విషయాల గురించి మాట్లాడుకోలేదు. కాని అప్రముఖమైన వాటిని గురించి మాట్లాడుకున్నా ఒకళ్ళ నొకళ్ళు అర్థం చేసుకున్నారు. దాలీ భర్త తప్పుడు ప్రవర్తన గురించి, దాలీ భరిస్తున్న అవమానం గురించీ తను కోపంలో అన్న మాటలు ఆమెకి

శరాఘాతంలా తగిలాయని, కాని ఆమె తనని క్షమించిందని కిట్టీ అర్థం చేసుకుంది. యిక డాలీ తను తెలుసుకోవాలనుకున్న వాటిని అన్నిట్నీ తెలుసుకుంది: తను అనుమానించింది నిజమేనని రుజువైంది. కిట్టీకి కలిగిన తీరని దుఃఖం ఆమె లేవిన్‌ని తిరస్కరించడం వల్లా, వ్రాన్‌స్కీ ఆమెని మోసం చెయ్యడం వల్లా వచ్చింది. యిప్పుడు ఆమె లేవిన్‌ని ప్రేమించడానికి వ్రాన్‌స్కీని ద్వేషించడానికి సిద్ధంగా ఉంది. యిలా అని ఒక్క ముక్క కూడ కిట్టీ మాటల్లో అనలేదు. ప్రస్తుతం వున్న తన మానసిక పరిస్థితి గురించే మాట్లాడింది కిట్టీ.

"నేను దుఃఖపడడం లేదు" అంది మరింత స్థిమితపడ్డాక. "కాని అంతా రోతగా, అసహ్యంగా వెలవరంగా ఉంది నాకు, తెలుసా? అన్నిటికంటే యెక్కువగా నామీద నాకే అలా అనిపిస్తోంది. నాకెలాంటి రోత ఆలోచనలు వస్తాయో నువ్వు ఊహించలేవు" అంది.

"నీకెలాంటి రోత ఆలోచనలు వస్తాయే!" అని చిరునవ్వు నవ్వుతూ అంది డాలీ.

"అబ్బో, మహా రోత ఆలోచనలు; వూహించలేనంతగా వుండేవి. వాటిని గురించి నీకు చెప్పను కూడ చెప్పలేను. వొక రకమైన వెలితివల్లా లేదా నిర్భాగ్యస్థితివల్లా వచ్చినవి కావు. యీ వెలితి, నిర్భాగ్య స్థితి కాక యింకా అధ్వానంగా వుండే దేన్నుంచో వచ్చినవి. నాలో వున్న మంచిది యేదో మాయమైపోయి, జుగుప్సాకరమైన దాన్ని దేన్నో మిగిల్చినట్టు. నీకర్థమయేటట్టు యెలా చెప్పగలను?" అంది అక్కగారి కళ్లల్లో కనిపిస్తున్న భావం చూసి, తను చెప్పేది ఆమెకి అర్థం అవడం లేదని గ్రహించి. "నాన్న యిప్పుడే నాతో అంటున్నారు... ఆయన నా పెళ్లి గురించి తప్ప మరి దేన్ని గురించీ ఆలోచించడం లేదనిపిస్తోంది. అమ్మ నాతో కూడా బాల్‌డాన్స్‌కి వస్తుందనుకో, నాకు పెళ్లి చేసేసి వన్నొదిలించుకోవాలన్న దృష్టితోనే ఆవిడ అలా చేస్తుందని నాకనిపిస్తుంది. అది నిజం కాదని నాకు తెలుసనుకో కాని అలాంటి ఆలోచనలు రాకుండా చేసుకోలేను. అర్హతలున్న వరుడు అని వాళ్లు పిలిచేవాళ్లకేసి అసలు కళ్లెత్తి చూడలేను. వాళ్లంతా నా కొలతలు తీసుకుంటున్నట్టుగా అనిపిస్తుంది నాకు. బాల్‌డాన్స్ గౌను వేసుకొని యెక్కడికేనా వెళ్లాలంటే యిదివరలో నాకు చెడ్డ సరదాగా వుండేది. చక్కగా వున్నట్టు నాకే అనిపించేది. ఇప్పుడు చూస్తే సిగ్గేస్తోంది, యెబ్బెట్టుగా అనిపిస్తోంది. కాని యేం చెయ్యను? యీ డాక్టర్లు... లేదా..."

కిట్టీ ఆగింది. తనలో యీ మార్పు వచ్చినప్పటినుంచీ బావ అబ్లాన్‌స్కీ తన దృష్టిలో పరమ భ్రష్టుడిగా కనిపిస్తున్నాడని చెప్దామనుకుంది. అతని మాట వింటే పరమ యేహ్యమైన, వికారమైన వూహలు మనస్సులో రేగుతాయని చెప్పబోయింది.

"అవును, ప్రతిదీ పరమ రోతగా, పాశవికంగా కనిపిస్తున్నాయి. అదీ నా జబ్బు. బహుశ పోతుందేమోలే."

"దాన్ని గురించి అనుకోకు..."

"అనుకోకుండా వుండలేను. పిల్లలతో కలిసి వున్నప్పుడు మీ యింటిదగ్గర మాత్రమే సంతోషంగా వుంటుంది నాకు."

"నువ్వు మా యింటికి రాలేకపోవడం యెంత బాధగా వుంది!"

"అబ్బే, వస్తాను. నేమా స్కార్లెట్ ఫీవర్ అనుభవించాను కదా. Mamanకి చెప్పి ఆమెని వొప్పించి వస్తాను."

కిట్టీ తల్లిని వొప్పించి అక్కగారి యింటికి వెళ్లింది. దాలీ పిల్లలకి స్కార్లెట్ ఫీవరు నిజంగానే వచ్చింది. వాళ్ల సంరక్షణ చూస్తూ కిట్టీ అక్కడనే గడిపింది. అక్కచెల్లెళ్లిద్దరూ కలిసి ఆరుగురు పిల్లల్నీ జాగ్రత్తగా ఆ జబ్బునుంచి కాపాడేరు. కాని కిట్టీ ఆరోగ్యం మెరుగవలేదు. యీస్టర్ ముందు లెంట్ దినాల్లో** ష్చేర్బాత్‌స్కీలు విదేశాలకి వెళ్లారు.

4

పీటర్స్‌బర్గ్ ఉన్నత సమాజంలో వాస్తవానికి ఒక బృందమే వుంది. అందులోని సభ్యులందరూ ఒకళ్లనొకళ్లు యెరుగుదురు. ఒకళ్ల యిళ్లకి యింకొకళ్లు వస్తూ పోతూ వుంటారు కూడా. కాని ఆ మహా బృందంలో చిన్న చిన్న తరగతులున్నాయి. యీ చిన్న తరగతుల్లో మూడింట్లో అన్నాకి మిత్రులున్నారు. సన్నిహిత బంధాలున్నాయి. ఒకటి భర్త సహోద్యోగులూ, ఆయన కింద పనిచేసేవాళ్లూ వున్న తరగతి. యిందులో సామాజిక అంతస్తుని బట్టి యెంతో వైవిధ్యభరితంగా వింత రీతుల్లో కలుస్తూ, విడిపోతూ వుండే వాళ్లు వుంటారు. మొదట్లో యీ తరగతిలో వున్న సభ్యుల్ని అన్నా దాదాపు ఆరాధ్యనీయం అనిపించే గౌరవ అనుభూతితో చూసేది. కాని యిప్పుడా అనుభూతి ఆమెకి గుర్తుకే రాదు. ఆమె యీ తరగతిలోని వాళ్లందరినీ, పల్లెటూరివాళ్లు ఒకళ్లనొకళ్లని యెరిగినట్టుగా యెరుగును. యెవళ్ల అలవాట్లు యేమిటో, బలహీనతలు యేమిటో, యెవళ్లకి యే బాధలున్నాయో, యెవళ్ల దృక్పథాలు యేమిటో, వాళ్లల్లో వాళ్ల మధ్యా, బృందంలోని కేంద్ర బిందువు పట్ల వాళ్లవాళ్ల సంబంధాలు యెలా వుంటాయో తెలుసు. యెవళ్లు యెవళ్లని అంటిపెట్టుకుని వుంటారో, యెవళ్లు యే విషయంలో యెవరితో అంగీకరించారో, విభేదించారో తెలుసు. కాని కౌంటెస్ లీదియా ఇవానొవ్నా యెంత బలవంతం చేసినా ప్రభుత్వ అనక్తులున్న యీ పురుష తరగతి అన్నాకి నిజంగా నచ్చలేదు. అందుకని ఆమె దానితో కలవడం తగ్గించేసింది.

అన్నా కలిసి తిరిగే రెండవ తరగతి వుంది. కరేనిన్ ఉద్యోగ జీవితంలో మెట్లెక్కడానికి సాయపడినది యిదే. యిందులో కౌంటెస్ లీదియా ఇవానొవ్నా కేంద్ర బిందువు. యిందులో సద్భక్తిపరులు, కృపామయులూ, అందవికారులూ, వృద్ధులూ అయిన ఆడవాళ్లూ, తెలివితేటలు, విద్వత్తూ, మహాకాంక్ష గల మగవాళ్లు వుంటారు. యీ తరగతివాడైన వొక తెలివిపరుడు యీ తరగతిని "పీటర్స్‌బర్గ్ సమాజపు అంతరాత్మ" అని అన్నాడు. కరేనిన్ యీ తరగతిలో వుండడాన్ని మహా ఘనంగా చూసేవాడు. అన్నా అందరితోనూ వెట్టుకు

రాగం మనిషి కావడం వల్ల పీటర్స్‌బుర్గ్‌లో కాపరం మొదలుపెట్టిన కొత్తలో ఆమెకి యిక్కడా స్నేహితులు యేర్పడ్డారు. కాని మాస్కోనుంచి తిరిగి యింటికి వచ్చాక ఆమెకి యీ తరగతి వెలవెలంగా కనిపించింది. అందరూ కూడా, అంటే తనతో సహా, కపటంగానే వున్నట్టు కనిపించారు. వాళ్లతో వుండడం ఆమెకి మహా విసుగ్గా యిబ్బందిగా కనిపించింది. అందుచేత అవకాశం దొరికినప్పుడల్లా కౌంటెస్ లీదియా ఇవానొవ్నాని తప్పించుకు తిరిగేది.

ఇక ఆమెకి సంబంధం వున్న మూడవ తరగతి అసలైన నాగరిక ప్రపంచం. బాల్ డాన్సులు, విందులు, ధగధగ మెరిసే దుస్తులు వున్న లోకం. యీ లోకంలో వాళ్లు నొక చేత్తో దర్బార్‌ని పట్టుకుంటారు తమకంటే హీనంగా వున్న సమాజంలోకి పడిపోకుండా వుండేందు కని. యీ దిగువ సమాజాన్ని వాళ్లు తిరస్కార దృష్టితో చూస్తున్నామని అనుకుంటారు. కాని వాళ్ల అభిరుచులూ వీళ్ల అభిరుచులూ కలవడమే కాదు; సర్వవిధాలా సమానంగానే వుంటాయి కూడ. ప్రిన్సెస్ బెట్సీ అన్నా పెత్తండ్రి కోడలు. ఆమెకి సాలీనా లక్ష యిరవై వేల రూబుల్ల ఆదాయం వుంది. అన్నా ఆ సమాజంలోకి వెళ్లగానే బెట్సీ ఆమె పట్ల ఆరాధన కనబర్చింది. ఆమెని చేరదీసింది. తన తరగతిలో కలుపుకుంది. కౌంటెస్ లీదియా ఇవానొవ్నా తరగతిని చూసి నవ్వింది.

"నేనూ ముసలిదాన్నై అందవికారంగా తయారైనప్పుడు వాళ్లల్లో వుంటాను. కాని మీలాంటి అందమైన పడుచువాళ్లు ఆ వృద్ధ మహిళల ఆశ్రమంలోకి వెళ్లకూడదు" అంది బెట్సీ.

మొదట్లో అన్నా బెట్సీ ప్రపంచాన్ని తప్పించుకునేది. యేమంటే, అక్కడ వుండాలంటే తన రాబడికి మించిన ఖర్చు చెయ్యగలిగి వుండాలి. అదీ కాకుండా ఆమెకి మొదటి తరగతి మరింత అనుకూలంగా కనిపించింది. కాని మాస్కోనుంచి తిరిగి వచ్చాక అన్నీ మారిపోయాయి. ఆమె యిప్పుడు ఆశ్రమవాస నేస్తాల్ని వదిలేసింది. నాగరిక లోకం వెంటబడింది. అక్కడ వ్రాన్‌స్కీని కలుసుకుంది. అతన్ని కలుసుకున్న ప్రతి సారి ఆమె ఉత్తేజపూర్వక సంతోషాన్ని పొందింది. అతన్ని యెక్కువగా బెట్సీం యింటిదగ్గర కలుసుకునేది. బెట్సీ పుట్టింటి వారి పేరు వ్రాన్‌స్కయా. బెట్సీ వ్రాన్‌స్కీకి అక్కగారి వరస అవుతుంది. తను యెక్కడెక్కడ అన్నాని కలుసుకోగలిగితే అక్కడికల్లా వ్రాన్‌స్కీ వెళ్లాడు. యెప్పుడు అవకాశం దొరికినా తన ప్రేమని ప్రకటించేవాడు. ఆమె అతన్ని ప్రోత్సహించలేదు. కాని అతను వున్నప్పుడల్లా మొదటి సారి తను అతన్ని రైల్లో కలుసుకున్నప్పుడు కలిగిన అత్యుల్లాసభరిత అనుభూతే కలుగుతూ వుండేది. అతను కనిపిస్తే చాలు ఆమె కళ్లు సంతోషంతో మెరుస్తాయి. పెదాలు మంద హాసంతో వంపు తిరుగుతాయి; యీ సంతోషానుభూతిని అదుపుచేసుకొనే శక్తి ఆమెకి లేదు. యిదంతా ఆమెకే తెలుసు.

అతను తన వెంటబడేటట్టు తయారవడం తనకి బాగా లేదని మొదట్లో అన్నా నిజంగానే నమ్మింది. కాని మాస్కోనుంచి తిరిగి వచ్చిన కొత్తలో ఆమె వో పార్టీలో అతను

కనిపిస్తాడేమోనని ఆశించింది. కాని అతను అక్కడ లేకపోవడంతో ఆమెకి నిరుత్సాహం కలిగింది. తనని తను మోసం చేసుకుంటోందనీ, అతను తన వెంటబడడం తనకి యిష్టమే కాక తను జీవితంలో కోరుకునే ఒకే ఒక్క విషయమూ అదీ ఆ అనుభవం తెలియజేసింది.

* * *

ఒక సుప్రసిద్ధ గాయని రెండవసారి వినిపిస్తోంది. నాగరిక సమాజం అంతా థియేటర్ దగ్గరే చేరింది. వ్రాన్స్కీ మొదట వరసలో కూర్చున్నాడు. అక్కడినుంచి అతనికి బాక్స్‌లో కూర్చున్న అక్కగారు కనిపించింది. ఇంటర్వెల్ దాకా ఆగకుండా అతను ఆమె దగ్గరకు వెళ్లాడు.

"మీరు భోజనానికి రాలేదేం? ప్రేయసీ హృదయాల స్పందన యేకరీతిగా వుంటుంది అని నాకాశ్చర్యం కలుగుతుంది" అందామె మందహాసం చేస్తూ, అతని కొక్కడికే వినిపించేటట్టు గొంతుక తగ్గించి చెప్పింది: "ఆమె కూడా రాలేదు." తర్వాత "కాని ఒపెరా అయిపోయాక రండి" అంది.

వ్రాన్స్కీ ఆమెకేసి ప్రశ్నార్థకంగా చూసేడు. ఆమె తల వాల్చింది. అతను చిరునవ్వుతో తన కృతజ్ఞత తెలియచేసి ఆమె ప్రక్కన కూర్చున్నాడు.

"మీరిదివరలో అందర్నీ గురించి యెలా వేళాకోళాలాడుతూ వుండేవారో జ్ఞాపకం వస్తోంది" అని బెట్సీ మాట్లాడుతూనే వుంది. అతని ప్రేమలీల పురోగతిని చూడ్డం ఆమెకి విశేషం తృప్తిగా వుంది. "అదంతా యిప్పుడేమైంది? యిప్పుడు పంజరంలో చిక్కావు నాయనా" అంది.

"పంజరంలో చిక్కుకోవడమే నేను కోరుకునే దల్లా" అన్నాడు వ్రాన్స్కీ శాంతంగా, నిష్కపటంగా నవ్వుతూ. "నిజం చెప్పాలంటే నా బాధల్లా సరిగా చిక్కుకోలేదనే, నాకు ఆశ సన్నగిల్లుతోంది."

"మీకు అసలు యెలాంటి ఆశ వుంది?" అంది బెట్సీ, అతనన్న మాటలు తన మిత్రురాలిని అవమాన పరచడంగా ఆమె తీసుకుంది. – "Entendons nous...[1]" కాని ఆమె కళ్లల్లో మెరిసిన మెరుపు ఆమె విషయాన్ని సరిగ్గా, అతనికి లాగానే, తెలుసుకుందన్నట్టూ అతను యెలాంటి ఆశ పెట్టుకో గలడన్నట్టూ సూచించింది.

"యెలాంటిదీ కాదు" అని వ్రాన్స్కీ నవ్వేడు. అతని తీరైన పలువరుస కనిపించింది. "యేదీ ఓ సారి" అంటూ ఆమె దగ్గర్నుంచి ఒపెరా గ్లాసులు తీసుకున్నాడు. బోసిగా వున్న ఆమె భుజం మీదనుంచి పైకి యెదురుగ్గా కూచున్న జనంకేసి ఒపెరా గ్లాసులతో చూసాడు. "నన్ను చూసి నవ్వుతారేమో, అలా ప్రవర్తిస్తున్నాను" అన్నాడు.

---

[1] విషయాన్ని సరిగ్గా తెలుసుకోండి (ఫ్రెంచి).

బెట్సీ దృష్టిలో గాని, నాగరిక లోకపు సభ్యుల దృష్టిలో గాని తను పరిహాసాస్పదంగా కనిపించే ప్రమాదం లేదని అతనికి తెలుసు. వీళ్ల దృష్టిలో ఏ పడుచుపిల్ల గాని బంధనాలు యేమీ లేని ఆడమనిషి గాని యే ప్రేమికుణ్నైనా తిరస్కరిస్తే వాడి పరిస్థితి మాత్రం నిజంగా నవ్వుతాలుగానే వుంటుందని అతనికి తెలుసు. కాని పెళ్లయిన ఒకామెను వెంబడించడం, ఆమెని సర్వశక్తులా వొడ్డి చేజిక్కించుకోడానికి ప్రయత్నించడం అనే పనులు వాళ్ల దృష్టిలో మహా ఘనమైనవి, మహా ఉన్నతమైనవి; అలాంటి వాటిని పరిహాసాస్పదంగా చూడ్డం అనేది జరగను గాక జరగదు. అంచేత అతను ఒపెరా గ్లాసులు కిందికి దించి, మీసాలకింద లాస్యం చేసే అతిశయపూర్వక, ఉల్లాసభరిత మందహాసంతో అక్కగారి కేసి చూశాడు.

"మీరు మధ్యాహ్నం భోజనానికి యెందుకు రాలేదు?" అని మురుస్తూ అతనికేసి చూసి అడిగింది.

"ఆ, చెప్పాలి కదూ, నాకు తీరిక లేకపోయింది. యేం పనసుకున్నారు? వూఁ, యెంతైనా పరే పందెం, మీరు వూహించలేరు. ఒకాయన భార్యని అవమానించాడట వొక వ్యక్తి. అతనికీ భర్తకీ సంధి కుదర్చడం, తెలుసా? నిజంగా!"

"మీరు సంధి కుదిర్చారా?"

"దాదాపు."

"యేది ఆ కథ చెప్పండి వింటాను. రెండో ఇంటర్వెల్‌లో రండి" అంది ప్రిన్సెస్ బెట్సీ లేస్తూ.

"రాలేను. ఫ్రెంచి థియేటర్*కి వెళ్లాలి."

"నీల్సన్‌ని వదిలేసి?" అంది బెట్సీ యెంతో ఘోరం అన్నట్టు, తనకిగా వీధిగాయనికీ ప్రఖ్యాత గాయకి నీల్సన్‌కీ ఉన్న తేడా తెలియకపోయినా.

"యేం చేస్తాం! యీ సంధికి సంబంధించి అక్కడ చిన్న వ్యవహారం వుంది."

"శాంతి దూతలు ధన్యులు, వాళ్లకి మేలు జరుగును" అంది బెట్సీ. యెవళ్లో యేదో సందర్భంలో యిలాంటి దేన్నో లేదా అలాంటి దాన్నో అనడం విన్నట్టు గుర్తు చేసుకుని యీ మాటలు అంది. "సరే అయితే కూర్చోండి. చెప్పండి యేమైందీ యేమిటీ?" అని అడిగింది.

తనూ మళ్లీ కూర్చుంది.

5

"ఇది కొంచెం మోటుగా వుండచ్చు, కాని చాల సరదాగా వుంటుంది. నేను మీకు చెప్పి తీరాలి; కాని నేను పేర్లేమీ చెప్పను" అన్నాడు వ్రాన్‌స్కీ నవ్వే కళ్లతో ఆమెకేసి చూస్తూ.

"మరీ మంచిది. నేనే వూహించుకుంటాను."

"అయితే వినండి. యిద్దరు సరదా అయిన పడుచువాళ్ళు గుర్రాలమీద స్వారీ చేసుకుంటూ..."

"మీ రెజిమెంట్ మిలిటరీ ఆఫీసర్లయి వుంటారు బహుశా."

"మిలిటరీ ఆఫీసర్లని నేను అనలేదు. వూరికే యిద్దరు పడుచువాళ్ళు. అప్పుడే వాస్తవి..."

"యింకోలా చెప్పాలంటే తాగి..."

"బహుశా. యిద్దరూ నో మిత్రుడి యింటికి భోజనానికి వెడుతున్నారు – మహా ఉత్సాహంగా, అది ఖాయం. హఠాత్తుగా నో ముచ్చటైన మగువ బండిలో వాళ్ళ పక్కనుంచే వెళ్ళింది. ఆమె వెనక్కి తిరిగి వీళ్ళకేసి చూసింది. తల వూపింది, నవ్వింది. కనీసం అలా అని వాళ్ళు వూహించుకున్నారు. మరి వదుల్తారా వాళ్ళు, ఆమె వెనక బడ్డారు. యింకా జోరుగా గుర్రాలని దౌడు తీయించారు. వాళ్ళు వెళ్ళాల్సిన చోటనే యీ ముచ్చటైన రూపసి ఆగింది. వాళ్ళకి ఆశ్చర్యం వేసింది. ఆమె చివరి అంతస్తులోకి వెళ్ళింది. చిన్న పరదా కిందనుంచి దొండపండులాంటి పెదవులు, ముచ్చటైన చిన్న పద్మాల్లాంటి పాదాలు వాళ్ళకి కనిపించాయి – యింకేమీ లేదు."

"మీరెంత హుషారుగా చెప్తున్నారంటే మీరే వాళ్ళల్లో ఒకరై వుంటారని నాకనిపిస్తోంది."

"మీరిందాక నాతో యేమన్నారు? వూఁ – సరే, యీ పడుచువాళ్ళిద్దరూ వీడ్కోలు విందు యిస్తూ వున్న తమ మిత్రుడి దగ్గరికి వెళ్ళారు. యిక యిప్పుడు మాత్రం ఖాయంగా తాగేరు, ఓ పిసరు యెక్కువే తాగేరేమో కూడాను. వీడ్కోలు విందుల్లో ఆచారం అంతే కదా. ఆ యింటి చివరి అంతస్తులో యెవరుంటున్నారని అడిగారు. యెవళ్ళకీ తెలీదు. యెవరన్నా అమ్మాయిలు అక్కడ వుంటున్నరీ లేనిదీ నౌకర్ని అడిగారు. కొంతమంది వున్నారని అతగాడు చెప్పేడు. భోజనాలయిం తర్వాత వాళ్ళు తమ మిత్రుడి చదువుకునే గదిలోకి వెళ్ళి ఆ అజ్ఞాత యువతికి ఉత్తరం రాసేరు. ఆవేశభరితమైన లేఖ, ప్రేమ పత్రం రాసేరు. స్వయంగా పైకి మేడమీదకి తీసుకెళ్ళారు, యేవన్నా అనుమానాలుంటే తేల్చెయ్యవచ్చని."

"యీ చెత్తమాటలు యెందుకు వినిపిస్తున్నారు మీరు? వూఁ, తర్వాత?"

"వాళ్ళు కాలింగ్ బెల్ నొక్కేరు. ఓ పనిమనిషి వచ్చి తలుపు తీసింది. ఆ ఉత్తరాన్ని ఆమెకి యిచ్చి ప్రేమకోసం పడి చచ్చిపోతున్నామనీ, నిజానికి ఆ క్షణంలోనే గుమ్మంలోనే ప్రాణం అర్పించవచ్చనీ చెప్పారు. ఆ పనిమనిషికి మతి పోయి వాళ్ళతో మాట్లాడ్డం మొదలెట్టింది. యింతట్లోకే నో పెద్దమనిషి అక్కడ ప్రత్యక్షమయ్యేడు. బెండకాయల్లాగ చెంపలు పెంచుకున్న మనిషి. కోపంతో జేవురించుకుపోయేడు. తనూ, తన భార్యా తప్ప వేరే వాళ్ళెవరూ అక్కడ వుండటం లేదని చెప్పి వాళ్ళని తరిమేసాడు."

"అతని చెంపలు బెండకాయల్లాగా వున్నాయని మీకెలా తెలుసు?"

"వినండి మరి. యివాళ నేను సంధి కుదర్చడానికి వెళ్లాను."

"కుదిర్చారా?"

"అసలు రంజా యిక్కడే వుంది. ఆ ఖుషీ జంట యింతాచేసి టిట్యులరీ కౌన్సిలరూ*, ఆయనగారి భార్యాను. ఆయనగారు అధికారక పితూరీ చేసాడు. నన్ను మధ్యవర్తిగా వేసారు. యెలాంటి మధ్యవర్తినో చూడండి. తాలైరాన్* నాముందు యెందుకు పనికి రాడు."

"యేం, అంత కష్టమైందా యిది?"

"అబ్బ వినండీ! మేం యధావిధిగా క్షమాపణ అర్థించాం. 'మేం మిక్కిలి చింతించు చున్నాము. యీ దురదృష్టకర విషయమునకు సంబంధించి మమ్మల్ని మన్నించ వేడుకుంటూ వున్నాము' అని. బెండకాయల్లాంటి చెంపలున్న టిట్యులరీ కౌన్సిలరుగారు మెత్తబడ్డాడు. కాని తన ఉద్దేశం చెప్పాలనుకోగానే కోపం వొచ్చేసేది. యిక ఆ కోపంలో నానా చెత్తా కూసేసాడు. నేను నా దౌత్య కుశలత అంతా మళ్లీ చూపించాల్సి వచ్చింది. 'వాళ్ల ప్రవర్తన గర్హ్యమైందన్న విషయం వొప్పుకుంటాను కాని యేదో కుర్రతనం, తప్పుడు ఆలోచనలు. పైగా వాళ్లు అప్పుడే నాస్తా చేశారు, మీకు తెలుసు కదా అలాంటప్పుడు యెలా వుంటుందో. వాళ్లు చాల విచారిస్తున్నారు. మిమ్మల్ని క్షమాభిక్ష వేడుకుంటున్నారు.' మరోసారి ఆయన మెత్తబడ్డాడు. 'మీరన్న మాటలు వొప్పుకుంటాను, కౌంట్. వాళ్లని క్షమించాలనే నాకూ వుంది. కాని మా ఆవిడ... మా ఆవిడ పరపురుషుణ్ణి కన్నెత్తి చూడని ఆమె, వీళ్లు తన వెంటబడిందాని వల్ల, దుర్మార్గంగా ప్రవర్తించడం వల్ల బాధపడవలసి రావడం... యీ కుక్కలు, ఛండాలురు...' చూసారా, ఆ కుక్కలు నా పక్కనే వుండటం, నేను మళ్లీ రెడ్డొచ్చెమొదలాడు అన్నట్టు చెయ్యడం! మళ్లీ దౌత్య కుశలత ఉపయోగించి, వ్యవహారం అంతట్నీ విజయవంతంగా ముగించేశాననుకునే వేళకి ఈ టిట్యులర్ కౌన్సిలర్‌గారు మళ్లీ కోప్పడిపోయి జేవురించుకునేవాడు. చెంపలమీది బెండకాయలు లేచేవి. మళ్లీ అందుకునే వాడు. మళ్లీ నేను నా నేర్పరితనం అంతా వాడాల్సి వచ్చేది."

"అబ్బ యీ కథ మీకు తప్పకుండా వినిపించాల్సిందే, ఈయన నన్నెలా నవ్వించాడో అడక్కండి! అబ్బబ్బ!" అంది బెట్సీ అప్పుడే తన బాక్స్‌లోకి వచ్చిన వొకామెతో.

"సరే, bone chance[1]" అంది, వ్రాన్‌స్కీకి వినవక్ర పట్టుకున్న చేతి వేలిని అందిస్తూ, భుజాల్ని కుంచించింది. దాంతో పైకి వున్న బాడీ వక్షస్సుమీద బిగుతుగా పడింది. ఆమె బాక్స్ ముందుకు వచ్చినప్పుడు అందరి దృష్టీ ఆమెమీదకి మళ్లినప్పుడు, వో మాదిరి బోసిగా వున్నట్టు కనిపించాలని అలా చేసింది.

వ్రాన్‌స్కీ రెజిమెంట్ కమాండర్‌ని కలుసుకోడానికి ఫ్రెంచి థియేటర్‌కి వెళ్లాడు. ఆ కమాండర్ ఫ్రెంచి థియేటర్ ప్రదర్శనలని ఒక్కదాన్ని కూడ వదులుకోడు. గత

---

1 మీ పనిలో విజయం సిద్ధించుగాక (ఫ్రెంచి).

మూడు రోజులుగానూ తనకి న్యాపకంగా వుండి, సరదా కలిగిస్తూ వున్న రాజీ వ్యవహారం గురించి వ్రాన్‌స్కీ ఆయనకి చెప్పాలని వెళ్ళాడు. ఒక దోషి పెత్రీత్‌స్కీ. అతనంటే నిజం గానే తనకి యిష్టం. రెండో అతను ప్రిన్స్ క్రెదొవ్. రెజిమెంట్‌లో కొత్తగా చేరాడు. సరదా అయినవాడు, చక్కని స్నేహపాత్రుడు. అన్నిటికంటె ముఖ్యం అయింది యీ గొడవలో రెజిమెంట్ పరువు మర్యాదలు పణంగా వుండడం.

ఈ యిద్దరు యువకులూ వ్రాన్‌స్కీ స్క్వాడ్రన్‌లోనే వున్నారు. టిట్యులరీ కౌన్సిలర్ వెండెన్ రెజిమెంట్ కమాండర్ దగ్గరకి వెళ్ళి తన భార్యని అవమాన పరిచారని అతని కింద పనిచేసే యీ ఆఫీసర్లమీద్ద ఫిర్యాదు చేసాడు. తమ వివాహం జరిగి ఆర్నెల్లే అయిం దట. ఆమె తల్లితో కలిసి చర్చికి వెళ్ళింది. గర్భవతి కావడం వల్ల అనుకోకుండా ఒంట్లో బాగా లేనట్టు అనిపించిందట. ఆరాధన కడదాకా చర్చిలో వుండలేక యింటికి వెళ్ళిపోదా మని అనుకుంది. యేదో దొరికిన బండి యెక్కింది. అప్పుడు యీ ఆఫీసర్లు ఆమె వెంట బడ్డారు. ఆమె బెదిరిపోయింది. యింకా వికారం యెక్కువై పోయింది. తమ యింటిలోకి పరిగెత్తుకుంటూ వెళ్ళిపోయింది. తను ఆఫీసునుంచి యింటికి వెళ్ళాడు. యెవరో వచ్చి నట్టు గంట మోగింది. వరాయి గొంతుకలు వినిపించాయి. గుమ్మంలో యీ తాగేసివున్న ఆఫీసర్లు ఉత్తరం చేత్తో పట్టుకుని నుంచుని వున్నారు. తను వాళ్ళని తన్ని తరిమేసాడు. వాళ్ళని కఠినంగా దండించాలని యిప్పుడు కోరుతున్నాడు.

"అబ్బే, మీరేం చెప్పండి పెత్రీత్‌స్కీ మరీ హద్దుమీరి పోతున్నాడు. యేదో ఫిర్యా దులు అతనిమీద రాకుండా ఒక్క వారం గడవడం లేదు. ఈ టిట్యులరీ కౌన్సిలర్ దీన్ని వదలడు. పై అధికార్ల దగ్గరికి వెడతాడు" అని రెజిమెంట్ కమాండర్ వ్రాన్‌స్కీని తన ఆఫీసుకి పిలిపించి చెప్పాడు.

యీ వ్యవహారం అంతా చీదరగా వుందనీ, ద్వంద్వ యుద్ధంద్వారా పరిష్కారం కాదనీ, టిట్యులరీ కౌన్సిలర్‌గారిని శాంత పరిచి గుట్టు చప్పుడు కాకుండా సర్దుబాటు చేసెయ్యడానికి సర్వవిధాలా ప్రయత్నించాలనీ వ్రాన్‌స్కీ గ్రహించాడు. రెజిమెంట్ కమాండర్ మధ్యవర్తిగా వ్రాన్‌స్కీని కుదిర్చేడు. వ్రాన్‌స్కీ తెలివైన వాడు. గొప్ప వంశం వాడు. అన్నిట్నీ మించి రెజిమెంట్ మర్యాద కాపాడతాడు అని ఆయనకి తెలుసు. విషయాన్ని సాకల్యంగా చర్చించాక వాళ్ళు ఒక నిర్ణయానికి వచ్చేరు. పెత్రీత్‌స్కీ, క్రెదొవ్‌లు వ్రాన్‌స్కీతో కలిసి టిట్యులర్ కౌన్సి లర్‌గారి దర్శనం చేసుకొని క్షమాపణ అర్థించాలి. వ్రాన్‌స్కీ పేరూ, ఎయిడ్ డి కేంప్ హోదా ఆగ్రహావూరితుడైన ఆ భర్తగారిని శాంతింప జేస్తాయని రెజిమెంట్ కమాండర్‌కీ, వ్రాన్ స్కీకి కూడ తెలుసు. నిజంగానే యీ రెండింటి ప్రభావమూ కనిపించింది. అయినాగాని ప్రయత్న ఫలితాలు సందిగ్ధంగా వుండిపోయాయి. వ్రాన్‌స్కీ దాని కారణాలని యీ కథ చెప్పేటప్పుడు వివరించాడు.

ఫ్రెంచి థియేటర్‌లో వ్రాన్‌స్కీ రెజిమెంట్ కమాండర్‌ని ఫాయెర్‌లోకి తీసుకెళ్ళి తన

ప్రయత్నాల జయాపజయాల్ని గురించి చెప్పాడు. అన్ని విషయాలూ ఆలోచించాక యెవళ్లనీ దండించ నవసరం లేదని రెజిమెంట్ కమాండర్ తీర్మానించుకున్నాడు. తన ఉబలాటం కొద్దీ ఆయన వ్రాన్స్కీని ఆ సమావేశం యెలా జరిగిందీ యేమిటీ అని అడిగాడు. శాంతించిన టిట్యులర్ కౌన్సిలరుగారు మళ్లీ ఆ సన్నివేశం గుర్తు చేసుకున్నప్పుడల్లా యెలా రెచ్చిపోయిందీ, రాజీ చేసే ఆఖరి మాటల దగ్గర ఆగి తను యెంత గబగబా పెత్రీత్స్కీని అక్కణ్ణుంచి ముందుకు గెంటేస్తూ వెళ్లిందీ వ్రాన్స్కీ వర్ణించి వర్ణించి చెప్పేడు. దాన్ని విని ఆపుకోలేక పగలబడి నవ్వేడు.

"రోతగా వున్న సంఘటనే, కాని మజాగా వుంది. క్నేద్రావ్ ఆ పెద్దమనిషీ ద్వంద్వ యుద్ధం చెయ్యడం వూహించండి! అంతలా మదపిచ్చిలో వున్నాడన్నమాట, ఆఁ" అన్నాడాయన, మళ్లీ పగలబడి నవ్వుతూ. "ఆఁ, క్లేయిర్ యివాళ యెలా వుంటుందంటారు?" అని ఆ ఫ్రెంచి నటిని ఉద్దేశించి అడిగాడు. "అద్భుతం కదా! ప్రతిరోజూ చూసినా గానీ విసుగనిపించదు. ఫ్రెంచి వాళ్లకే చెల్లిందది" అన్నాడు.

6

ఆఖరి అంకం పూర్తవకముందే బెట్సీ థియేటర్‌నుంచి వెళ్లిపోయింది. ముస్తాబు చేసుకొనే గదిలోకి వెళ్లి కోలగా నిస్తేజంగా వున్న తన ముఖంమీద పౌడరు అద్దుకుని తుడుచుకుని, జుట్టు సరిచేసుకుంది. పెద్ద డ్రాయింగ్ రూమ్‌లోకి టీ తీసుకు రమ్మని పురమాయించింది. యింతట్లోకి బొల్షాయా మొర్‌స్కాయ వీధిలో వున్న ఆమె పెద్ద యింటి దగ్గరకి ఒక్కొక్క బగ్గీ వచ్చి ఆగడం మొదలెట్టాయి. విశాలమైన సింహద్వారం ముందు అతిథులు బగ్గీలు దిగడం మొదలుపెట్టేరు. అక్కడ ఒక లావాటి కాపలివాడు వున్నాడు. అతను పొద్దుటి పూట దారమ్మట పోయేవాళ్లు ఆహా అనుకొనేటట్టుగా, పెద్ద అద్దాల ద్వారం వెనక కూర్చుని పత్రికలు చదువుకుంటూ వుంటాడు. యిప్పుడు అతను యేమాత్రం సద్దు చెయ్యకుండా పెద్ద తలుపులు తెరిచి యీ వచ్చిన అతిథులని లోపలికి వెళ్లనిస్తూ పక్కన నుంచున్నాడు.

ముఖానికి పౌడరు అద్దుకుని కేశబంధం సవరించుకుని యజమానురాలూ, అతిథులూ దాదాపు యేక కాలంలోనే డ్రాయింగ్ రూమ్‌లోకి వచ్చేరు. ఆమె ఒక గుమ్మంలోనుంచి వచ్చింది. అతిథులు యింకో గుమ్మంలోనుంచి వచ్చేరు. ఆ డ్రాయింగ్ రూమ్ గోడలు ముదురు రంగువి. తివాసీలు మందంగా వున్నాయి. దీపాల వెలుతురు ప్రకాశమానంగా ఉంది. ఆ వెలుతుర్లో ఒక మేజా వుంది. దానిమీద తెల్లని గుడ్డ కప్పి వుంది. దానిమీద వెండి సమొవార్ వుంది. దీపాల వెలుతుర్లో నాజూకైన పింగాణీ సామాన్లు మెరుస్తూ వున్నాయి.

యజమానురాలు సమొవార్ పక్కన కూర్చుంది. చేతి గ్లవ్స్ తీసేసింది. వినయంగా

కనిపించే నౌకర్లు కుర్చీలు లాగిపెడుతూ వుండగా అతిథులు రెండు బృందాలుగా కూర్చు న్నారు. ఒక బృందం యజమానురాలి దగ్గర సమొవార్ పక్కన, రెండో బృందం డ్రాయింగ్ రూమ్ ఆ మూల ఒక రాజదూతగారి భార్య పక్కన చేరారు. ఆవిడ అందంగా వుంది. నల్లని ముఖమల్ గౌను తొడుక్కుంది. ఆమె నల్లని కనుబొమలు స్ఫుటంగా వున్నాయి. ఆరంభంలో యెప్పుడూ వుండేటట్టుగానే యీ బృందాల మధ్య సంభాషణ, యే విషయం మీద స్థిరంగా దిగాలా అని వెతుకుతున్నట్టు, వూగులాడింది. కొత్తవాళ్లు వస్తూ వుండడం, నమస్కారాలూ కుశల ప్రశ్నలూ, టీలు అందివ్వడం సంభాషణలకి అలా అంతరాయం కలిగి స్తూనే ఉన్నాయి.

"అబ్బ ఆవిడ నటించింది అద్వితీయం. కౌల్‌బాఖ్* తెమ్మరాలు" అని రాజదూతగారి భార్య బృందంలో ఆమెకి దగ్గరగా కూర్చున్న ఒక దౌత్యజ్ఞుడు అన్నాడు. "ఆమె యెలా మూర్ఛ పోయిందో గమనించారా?" అని అడిగేడు.

"ఓహ్! నీల్‌సన్ గురించి యింకా మాట్లాడ్డం రేనికండోయ్! అసలింక కొత్త విష యమనే దాన్నేమీ చెప్పలేం!" అంది పొకావిడ. ఆవిడ ప్రిన్సెస్ మ్యాకయా. ఆమె లావుగా వుంది. ఆమె ముఖం యెర్రగా వుంది. జుట్టు బంగారు రంగుతో వుంది. ఆమెకి కను బొమలు దాదాపు లేవు. నవరం సిగలేదు. పాత సిల్కు బట్టలు వేసుకుంది. సిగ్గు యెగ్గూ లేకుండా నిర్మొహమాటంగా యే మాట పడితే ఆ మాట అనేసే మనిషి అని ఆమె పేరు మోసింది. అందుకని ఆమెని enfant terrible[1] అంటారు. ప్రిన్సెస్ మ్యాకయా రెండు బృందాలకీ మధ్య కూర్చుంది. అనుకూలంగా వున్న ఆ చోటునుంచి రెండు పక్షాల మాటలనీ వినేది. కాసేపు ఒకళ్ల సంభాషణలో పాల్గొనేది. కాసేపు మరొకళ్ల సంభాషణలో పాల్గొనేది. "యివాళ కౌల్‌బాఖ్ గురించి ముగ్గురు యిదే ప్రస్తావన చేసారు — కూడ బలుక్కున్నట్టు. వాళ్లకి యెందుకని యీ మాట అంత యిష్టంగా వుందో అర్థం కాదు" అంది.

యీ వ్యాఖ్యవల్ల సంభాషణ విషయం తెగిపోయింది. యింకో దాన్ని వెతుక్కోవాల్సి వచ్చింది.

"కాస్త మజాగా వుండేదేమైనా చెప్పండి కాని, ఆడిపోసుకునే నింద మాటలు వద్దు" అంది దౌత్యజ్ఞుడితో రాజదూతగారి భార్య. ఆవిడ మెత్తటి సంభాషణలో ఇంగ్లీషువాళ్లు small–talk అని పిలిచే సంభాషణలలో నిపుణురాలు. దౌత్యజ్ఞుడు కూడా యేమనాలో తోచక వుండిపోయాడు.

"అది కష్టం అంటారు. అలాంటి ఆడిపోసుకొనే మాటలే మజాగా వుంటాయి" అన్నాడతను నవ్వుతూ. "అయినా ప్రయత్నిస్తా. యేదేనా పింది అందివ్వండి. అంతా పింది బట్టే వుంటుంది. సరిఅయిన విషయం అంటూ దొరికితే ఎన్ని నగిషీలేనా పెట్టచ్చు. గత

---

[1] అగ్గిపిడుగు (ఫ్రెంచి).

శతాబ్దంలో మాటకారులైన వాళ్ళు యివాళ యుక్తిగా వుండటం కష్టం అని నాకు అనిపిస్తుంది. యుక్తి మాటలు లోకులకి విసుగ్గా కనిపిస్తున్నాయి..."

"యీ మాటలని ముందే చెప్పెయ్యడం జరిగింది" అని రాజదూతగారి భార్య నవ్వుతూ అడ్డం వెళ్ళింది.

పసందుగానే మొదలైన సంభాషణ యిది. కాని మరీ పసందుగా వుండడం వల్ల జావగారిపోయింది. సంభాషణ ముందుకి సాగాలి అంటే యెప్పుడూ విసుగు పుట్టించకుండా, పరిశకి తట్టుకుని నిలబడిన మార్గం వొక్కటే వుంది – పరనింద.

"తుష్కేవిచ్‌లో లూయీ XV* బాపతు ధోరణి కొంచెం లేదూ?" అని మేజా దగ్గర మంచున్న పడుచతని కేసి కళ్ళతో చూపిస్తూ అడిగాడు.

"అవునమ్మా! డ్రాయింగ్ రూమ్‌కి చక్కగా నప్పేది అతనిలో వుంది. అందుకనే అతను అస్తమానమూ యిక్కడికి వస్తూ వుంటాడు."

యీ సంభాషణ కొంచెం నిలబడింది. డ్రాయింగ్ రూమ్‌లో యెకాయెకిని అనెయ్య డానికి వీలుపడని దాన్ని అది సూచనగా తెలియజేసింది. అంటే ప్రిన్సెస్ బెట్సీకి తుష్కేవిచ్‌కీ మధ్య వుండే సంబంధాన్ని.

యీ లోపున అక్కడ సమొవార్ దగ్గర కూడా సంభాషణ మూడు అనివార్యమైన విషయాల చుట్టూ వూగుతోంది. తాజా సమాచారం, థియేటరు, యిరుగు పొరుగు వాళ్ళ మీద విమర్శ. యీ సంభాషణ యిప్పుడు సరియైన మూడో దానిమీదకి మళ్ళి స్థిరపడింది: పరనింద.

"మాల్తిష్చేవా – కూతురు కాదు, తల్లి – గురించి విన్నారా మీరు? తనకి diable rose[1] ఫ్రాక్ కుట్టించుకుంది."

"ఛ, నిజంగా? మరీ ముచ్చటగా!"

"ఆమె తెలివి తేటలే మయ్యాయని! నాకాశ్చర్యంగా వుంది. ఆమేం మొద్దు కాదు కదా. యెంత నవ్వులాటగా వుంటుందో అర్థం చేసుకోలేకపోయిందా?"

యెవళ్ళ మట్టుకి వాళ్ళు తమ వంతుగా పాపం మాల్తిష్చేవాని తిట్టిపోసి, వేళాకోళం చేసి సరదా తీర్చుకున్నారు. సంభాషణ అప్పుడే రాజేసిన చితుకుల పొయ్యిలాగా చిటపట పేలుతూ సాగింది.

ప్రిన్సెస్ బెట్సీ పెనిమిటి క్లబ్బుకి వెడుతూ తన యిల్లాలి అతిథుల్ని చూసి పోదామని డ్రాయింగ్ రూమ్‌లోకి వచ్చేడు. ఆయన లావుగా వుంటాడు. సాధువు. అచ్చు కొట్టిన బొమ్మల్ని పోగు చేసే పిచ్చి మహా వుంది. ఆయన చడీ చప్పుడూ చెయ్యకుండా దళసరిగా వున్న తివాసీమీద అడుగులేసుకుంటూ ప్రిన్సెస్ మ్యాకయా దగ్గరికి వెళ్ళాడు.

"మీకు నీల్‌సన్ యెలా అనిపించింది?" అని అడిగాడు.

---

[1] డాబుగా ఉండే గులాబీరంగు (ఫ్రెంచి).

"అబ్బ! అంత చలీ, చప్పుడూ కాకుండా యెవరేనా వస్తారా! యెంత దడుసుకున్నాను!" అంది. "బాబూ మీకు పుణ్యం వుంటుంది, యిహ ఆ ఓపెరా గొడవ నాదగ్గర యెత్తకండి. మీకు సంగీతం యేం తెలుసుగనక? మీ స్థాయికి దిగి అచ్చుబొమ్మల గురించి మతోలికాల గురించి మాట్లాడ్డం మెరుగు. ఊఁ, మీరు పాత వస్తువుల బజార్లో యీమధ్య విలువైనది యేం కొన్నారేమిటి?" అని అడిగింది.

"చూపించమంటారా? కాని మీకు అలాంటి విషయాలు బోధపడవే?"

"చూపించండి. నేను వాళ్లదగ్గర్నుంచి — వాళ్లనేమంటారు చెప్మా? — ఆఁ! బేంకర్లు, నేర్చుకుంటున్నాను. వాళ్ల దగ్గర కొన్ని అద్భుతమైన అచ్చుబొమ్మలున్నాయి. మాకు చూపించారు."

"యేమిటి? మీరు షూట్స్‌బర్గ్‌ల దగ్గరికి వెళ్లారా?" అని యజమానురాలు సమొవార్ వెనకనించి అడిగింది.

"ఆఁ, ma chère, నన్నూ మా ఆయన్నీ భోజనానికి పిలిచారు. ఆ విందులో సాస్‌కే వెయ్యి రూబుళ్లయిందట" అంది ప్రిన్సెస్ మ్యాకయా పెద్దగా అందరూ తన మాటల్ని వింటున్నారని గమనించి. "అబ్బ యేం సాస్ రా నాయనా అది. యేమిటో ఆకుపచ్చగా వుంది. మా యింటికి పిలిచినప్పుడు వాళ్లకి యెనభై అయిదు కోపెక్కుల సాస్ వడ్డించాను. తిన్న వాళ్లందరూ మహా బాగుందన్నారు. వెయ్యి రూబుళ్ల సాస్‌లు పెట్టేటంత స్తోమతు నాకు లేదు" అంది.

"యీమెకి సాటి లేరు!" అని యజమానురాలు గొణిగింది.

"అద్భుతం!" అని యెవళ్లో తమ ఉద్దేశం వెల్లడి చేసారు.

ప్రిన్సెస్ మ్యాకయా అన్న మాటల ప్రభావం యెప్పుడూ ఒక్కలాగానే వుంటుంది. దాని రహస్యం, సర్వవేళలా యిప్పట్లాగా సందర్భోచితంగా కాకపోయినా అర్థవంతంగా వుండే వాటిని ఆమె నిరాడంబరంగా చెప్పడంలో వుంది. ఆమె తిరిగే సమాజంలో అలాంటి మాటలు నిశితమైన చమత్కారోక్తులంత ప్రభావాన్ని కలిగిస్తాయి. అలాంటి ప్రభావం యెందుకు కలిగిస్తాయీ అనేది ప్రిన్సెస్ మ్యాకయాకి తెలీదు, కలిగిస్తాయని తెలుసంతే. ఆ విషయాన్ని ఆమె వాడుకుంది.

ప్రిన్సెస్ మ్యాకయా మాటలని వినడానికి అందరూ యిటు తిరిగేరు. ఆ విధంగా రాజదూతగారి భార్య దగ్గరి సంభాషణకి అంతరాయం కలిగింది. అప్పుడు యజమానురాలు రెండు బృందాల్నీ కలిపేద్దామని ప్రయత్నించింది.

"మీకు టీ వద్దా యేమిటి? వచ్చి యిటు మాతో కలవండి" అంది రాజదూతగారి భార్యకేసి తిరిగి.

"అహఁ, మాకు యిక్కడ భేషుగ్గా వుంది" అని రాజదూతగారి భార్య మందహాసం చేస్తూ జవాబు చెప్పింది. సంభాషణ తెగిపోయిన చోట మళ్లీ అందుకుంది.

సంభాషణ మంచి రంజుగా సాగుతోంది. కరేనిన్ దంపతుల గురించి వ్యాఖ్యలు, తాత్పర్యాలు సాగుతున్నాయి.

"మాస్కోనుంచి వచ్చేక అన్నా చాలా మారిపోయింది. వింతగా కనిపిస్తోంది" అని అన్నా మిత్రురాలెవరో అంది.

"పెద్ద మార్పు యేమంటే అలెక్సేయ్ వ్రాన్‌స్కీ నీడని కూడా తీసుకొచ్చింది" అంది రాజదూతగారి భార్య.

"అయితే యేమిటి? గ్రిమ్ కథ వొకటుంది*. ఓ మనిషికి నీడ వుండదు. దేనికైనా శిక్ష యేమిటో మరి. అది శిక్ష యెందుకనో నాకు అర్థం కాదు. కాని తనని అనుసరించి నీడ లేకపోతే ఆడమనిషికి చెడ్డగా వుంటుంది."

"నిజమే, కాని నీడ వున్న ఆడమనిషికి అంతం చెడ్డగా వుంటుంది" అంది అన్నా మిత్రురాలు.

"మీ నాలుక కాలిపోనూ" అంది ప్రిన్సెస్ మ్యాకయా. "మదాం కరేనినా బంగారం లాంటి మనిషి. ఆవిడ మొగుడంటే నాకు సరిపడదు. గాని ఆమె అంటే నాకు మహా యిష్టం" అంది.

"ఆవిడ భర్తంటే యెందుకు సరిపడదు మీకు? బంగారం లాంటి మనిషి. ఆయనతో తూగే రాజనీతిజ్ఞులు యూరప్‌లో బహు తక్కువ వున్నారట, మా ఆయన చెప్పారు" అంది రాజదూతగారి భార్య.

"మా ఆయనా ఆ ముక్కే అంటారు గాని ఆయన మాట నేను నమ్మను. మన భర్తలు మనకి చెప్పకపోయినా, మనంతట మనమే యధార్థంగా వున్న వాటిని చూడగలం. అలెక్సేయ్ అలెగ్జాండ్రొవిచ్ కరేనిన్ మూర్ఖుడు. మనలో మాటగా అంటున్నానుస్మా యీ ముక్క... కాని అలా అన్నందువల్ల అంతా స్పష్టమైంది కదా! అతను తెలివైన వాడని చెప్పినప్పుడు కామోసు నిజమెంతో చూద్దామని ప్రయత్నించాను, కాని తెలివైన వాడుగా నాకు కనిపించక పోవడంవల్ల నేనే మూర్ఖురాలిని అని తీర్మానించుకున్నాను. నాలో నేనే అతను మూర్ఖుడు అనుకున్నప్పుడు అంతా అరటిపండు వొలిచి చేతిలో పెట్టినట్టు అర్థం అయిపోయింది" అంది ప్రిన్సెస్ మ్యాకయా.

"మీరు యింతలా విషం కక్కేస్తున్నారేమిటి యివాళ?"

"యెంత మాత్రమూ లేదు. నన్నేం చెయ్యమంటారు? మాలో యెవళ్ళమో ఒకళ్ళం మూర్ఖులం కావాలి. మరి యెవళ్ల గురించి వాళ్ళు అలా అనుకోలేరు కదా?"

"సంపదైతే సరిపోదనిపిస్తుంది కాని తెలివితేటలు యెలా వున్నా అలా అనిపించదు" అన్నాడు దౌత్యజ్ఞుడు ఓ ఫ్రెంచి రచయిత మాటల్ని ఉల్లేఖిస్తూ.

"ఖచ్చితంగా" అంది ప్రిన్సెస్ మ్యాకయా అతనికేసి తిరిగి. "కాని తెలుసుకోండి,

అన్నాని మీరు వేలెత్తి చూపించనియ్యను. ఆమె అంత మంచి మనిషి. ప్రతివాడూ ఆమెని ప్రేమించి, ఆమె వెంట నీడలా పడ్డం ఆమె తప్పా?"

"ఆమెని నేనేమీ వేలెత్తి చూపించడం లేదే" అంది అన్నా నేస్తం తనని సమర్థించుకుంటున్నట్టు.

"మన వెనక్కాల యెవళ్ళూ నీడలా పడేవాళ్ళు లేనంత మాత్రాన యితరుల్ని వేలెత్తి చూపించే హక్కు మనకి లేదు."

అన్నా నేస్తాన్ని బాగా తోమాక ప్రిన్సెస్ మ్యాకయా లేచి, రాజదూతగారి భార్యతో కలిసి టీ బల్లదగ్గర కూర్చున్న వాళ్లల్లో చేరింది. అక్కడ అందరూ ప్రష్యా రాజు గురించి మాట్లాడుకుంటున్నారు.

"అక్కడ యెవర్ని ఆడిపోసుకుంటున్నారు?" అని బెట్సీ అడిగింది.

"కరేనిన్ దంపతుల్ని. ప్రిన్సెస్ మ్యాకయా కరేనిన్‌గారి వర్ణన చేసింది" అని రాజదూతగారి భార్య చిరునవ్వు నవ్వుతూ బల్ల దగ్గర కూర్చుని అంది.

"అయ్యొయ్యో మేం వినకపోయామే" అంది యజమానురాలు. గుమ్మం కేసి చూసింది. "యెట్టకేలకి వచ్చేసారు" అంది అప్పుడే లోపలికి వస్తూవున్న వ్రాన్‌స్కీని చూసి చిరునవ్వు నవ్వుతూ.

వ్రాన్‌స్కీకి అక్కడున్న వాళ్లందరూ తెలుసు. అంతేకాదు రోజూ వాళ్లని చూస్తూనే వుంటాడు. అంచేత యిప్పుడే కాసేపు మిత్రుల్ని వదిలి బయటికి వెళ్లి మళ్లీ వచ్చి కలిసేటట్టు వచ్చేడు.

"నేనెక్కడికి వెళ్లాను?" అన్నాడు రాజదూతగారి భార్య అడిగిన దానికి జవాబుగా. "యేం చేస్తాం, చెప్పక తప్పదుకదా. బూఫ్ థియేటర్*కి వెళ్లాను. వందోసారి వెళ్లి వుంటాను. కాని ప్రతీ సారీ అంతకు అంత సంతోషంగానే వుంటుంది. సరదాగా వుంది! నాకు తెలుసు యిలా అంటున్నందుకు సిగ్గు పడాలని – కాని సీరియస్ ఒపెరా చూస్తే నాకు నిద్ర వొచ్చేస్తుంది. కాని యిక్కడ కడకంటా వుంటాను. హుషారుగా వుంటుంది. యివాళ, ఉదాహరణకి..."

అతను ఫ్రెంచి నటి పేరు ప్రస్తావించి ఆమె గురించి యేదో చెప్పబోయాడు. కాని రాజదూతగారి భార్య భయపడిపోతున్నట్టుగా మాటకి అడ్డం వచ్చింది.

"బాబ్బాబు, హడలుగొట్టే విషయాలు చెప్పకండి" అంది.

"సరే అయితే, చెప్పను. పైగా ఆ హడలుగొట్టే విషయాలు అందరికీ తెలుసు కనుక."

"బూఫ్ థియేటర్ని కూడా ఒపెరాలాగానే అనుకుంటే అందరూ అక్కడికే వెడతారు" అంది ప్రిన్సెస్ మ్యాకయా.

7

గుమ్మం దగ్గర అడుగుల చప్పుడు వినిపించింది. ఆ వస్తున్నవారు అన్నా కరేనినా అని తెలిసి, ప్రిన్సెస్ బెట్సీ వ్రాన్స్కీకేసి చూసింది. అతను గుమ్మంకేసి చూసాడు. అతని ముఖంలో వింతగా స్ఫురించే కొత్త భావం వ్యక్తం అయింది. సంతోషంతో, కొంచెం సంకోచంగానే అయినా కళ్లు అలానే లగ్నం చేసి, లోపలికి వస్తూ వున్న ఆమెకేసి వ్రమతగా చూసాడు. అలా చూస్తూనే మెల్లిమెల్లిగా లేచి నుంచున్నాడు. యెప్పటి లాగానే నిటారుగా నడుచుకుంటూ ఆమె లోపలికి వచ్చింది. నాగరిక సమాజంలోని యితర మహిళలనుంచి ఆమెని విశిష్టంగా వుంచేది ఆమె నడకే. దృఢంగా, తేలిగ్గా అడుగులు వేసే హంసగమనం లాంటి నడక. దృష్టి అటుగాని యిటుగాని తిప్పకుండా నిబ్బరంగా చూస్తూ నడుస్తుంది. ఆమె బెట్సీ దగ్గరికి వెళ్లి ఆమె చేతిని తీసుకొని చిరునవ్వు నవ్వింది. అలా చిరునవ్వు నవ్వుతూనే వ్రాన్స్కీకేసి చూసింది. అతను కొంచెం అభివాదపూర్వకంగా వొంగి ఆమెకోసం ఒక కుర్చీని లాగేడు.

ఆమె పలకరిస్తున్నట్టు తల ఆడించింది. సిగ్గుతో యెర్రబడింది. తర్వాత కనుబొమలు ముడిచింది. మరు క్షణంలోనే అక్కడున్న పరిచయస్థులందరికీ వందనం చేసింది. తన వేపు చాచిన చేతులతో చేతులు కలిపింది.

"నేను కౌంటెస్ లిదియాగారింటికి వెళ్లాను. పెందరాళే వచ్చేదామనుకుంటూనే అలా కూర్చుండి పోయాను. సర్ జాన్ అక్కడ వున్నారు. భలే సరదా అయిన మనిషి" అని బెట్సీతో అంది.

"ఓహ్, ఆ మిషనరీయా?"

"ఆఁ, ఆయన ఇండియన్ల జీవిత విధానం గురించి భలే ఆసక్తికరంగా వుండే విషయాలు చెప్పారు."

ఆమె రాకవల్ల అంతరాయం కలిగిన సంభాషణ మళ్లీ ఎగ దోసిన మంటలాగా అందుకుంది.

"సర్ జాన్? ఆఁ — అవును నేను ఆయన్ని కలుసుకున్నాను. బాగా మాట్లాడుతాడు. మదాం వ్లాస్యేవాకి ఆయనంటే ప్రాణం."

"ఆవిడ చిన్న కూతురు తోపావ్‌ని పెళ్లాడుతోందట నిజమేనా?"

"అవునట. నిర్ణయమై పోయిందని నేనూ విన్నాను."

"ఆ తల్లిదండ్రులంటే నాకు యిదిగా వుంది. ఇది ప్రేమ వివాహం అంటున్నారు."

"ప్రేమ వివాహం? ఏం ఇక్ష్వాకుల నాటి వూహాలండీ మీవి? ఈ రోజుల్లో ప్రేమ గురించి యెవళ్లు మాట్లాడుతున్నారు?" అంది రాజదూతగారి భార్య.

"ఏం చేస్తాం? తొలివిక్టోరియన్ పాతకాలపు ఛాయాలే అయినా ఇంకా అంతం అవలేదు" అన్నాడు వ్రాన్‌స్కీ.

"ఆ పాత చింతకాయ పచ్చడి పట్టుకున్న వాళ్ల ఖర్మ. సుఖమైన పెళ్లిళ్ల ఐహిక లాభం కోసం చేసుకున్నవే."

"కాని ఐహిక లాభం కోసం చేసుకున్న పెళ్లిళ్లయినా వాళ్లు తిరస్కరిస్తూ వున్న ప్రేమ కనిపించగానే గాలికి కొట్టుకుపోతాయి" అన్నాడు వ్రాన్‌స్కీ.

"అయినా ఐహిక లాభం కోసం జరిగిన పెళ్లిళ్లు అని వేటిని పిలుస్తాం? యిరుపక్షాలు తమతమ విచ్చలవిడి బతుకులు గడిపాక చేసుకున్నవాటినే. ప్రేమ అనేది స్కార్లెట్ ఫీవరు లాంటిది: వస్తుంది, యిక భయం పోతుంది."

"అయితే ప్రేమని కృత్రిమంగా యెక్కించాలి, టీకాల్లాగా, మశూచికానికి చేసినట్టు."

"నేను పడుచుపిల్లగా వున్నప్పుడు ఒక చిన్న మతాధికారిని ప్రేమించాను. తర్వాత దాని వల్ల నాకేమన్నా లాభం కలిగిందా?" అంది ప్రిన్సెస్ మ్యాకయా.

"వేళాకోళాలకేంగాని ప్రేమ అంటే యేమిటో అని కనిపెట్టడానికి వాక్కునిపించే ఒక్క మార్గమూ యేమంటే తప్పుచెయ్యడం, సవరించుకోవడం" అంది ప్రిన్సెస్ బెట్సీ.

"పెళ్లయిన తరువాత కూడానా?" అని రాజదూతగారి భార్య వేళాకోళంగా అడిగింది.

"పశ్చాత్తాపానికి ఆలస్యం అంటూ లేదు" అన్నాడు దౌత్యజ్ఞుడు ఇంగ్లీషు సామెతని ఉల్లేఖిస్తూ.

"బాగా చెప్పారు" అని బెట్సీ అతని మాటల్ని వెంటనే అందుకుంది. "మనిషన్నాక తప్పులు చెయ్యాలి, సవరించుకోవాలి. ఏమంటారు?" అని అన్నాని అడిగింది. ఆమె కని పించీ కనిపించని మందహాసంతో మౌనంగా సంభాషణని వింటూ ఉంది.

అప్పుడే తీసిన గ్లవ్స్‌తో ఆడుకుంటూ అన్నా అంది: "నాకేమని పిస్తుందంటే ఎన్ని బుర్రలున్నాయో అన్ని తెలివితేటలున్నాయి. అలాగే యెన్ని హృదయాలు వున్నాయో అన్ని రకాల ప్రేమలు వున్నాయి."

ఆమె యేం చెప్తుందోనని వ్రాన్‌స్కీ ఉగ్గబట్టుకొని వున్నాడు. ఆమె మాటలు విన్నాక హమ్మయ్య అనుకున్నాడు, అప్పుడే గండం గడిచి బయటపడ్డవాడిలాగా.

ఉన్నట్టుండి అన్నా అతనికేసి తిరిగింది.

"మాస్కోనుంచి నాకు ఉత్తరం వచ్చింది. కిట్టీ ష్చేర్‌బాత్‌స్కీకి చాలా జబ్బుగా వుందట."

"అయ్యో, నిజమా?" అన్నాడు వ్రాన్‌స్కీ నుదురు ముడిచి.

అన్నా అతనికేసి కొరకొర చూసింది.

"యీ విషయం మీకేం పట్టలేదా?"

"యెందుకు పట్టలేదు! ఖచ్చితంగా యేం రాశారో అడగవచ్చా?" అన్నాడు.

అన్నా లేచి బెట్సీ దగ్గరకు వెళ్లింది.

"ఏదీ ఓ కప్పు టీ" అని ఆమె కుర్చీ వెనుక నుంచుని అడిగింది.

బెట్సీ కప్పులో టీ పోస్తూ వుంటే వ్రాన్‌స్కీ అన్నా దగ్గరికి వెళ్ళాడు.

"ఏమిటి రాశారు మీకు?" అని మళ్ళీ అడిగాడు.

"మర్యాదామట్టా అంటే యేమిటో తెలియకుండానే మగాళ్ళు దాని గురించి సర్వదా చర్చిస్తుంటారని ఎప్పుడూ నాకు అనిపిస్తూ వుంటుంది" అని అంది అతనికి జవాబు చెప్ప కుండానే. "కొంత కాలంగా మీకో సంగతి చెప్పాలను కుంటున్నాను..." అని మొదలుపెట్టి, కొన్ని అడుగులు నడిచి గదిలో ఓ మూల వున్న చిన్న బల్ల దగ్గర కూర్చుంది. దానిమీద ఆల్బమ్‌లు వున్నాయి.

"మీరేమన్నారో నాకేం అర్థం కాలేదు" అని అతను ఆమెకి టీ కప్పుని అందిస్తూ అన్నాడు.

సోఫామీద తన ప్రక్కన ఖాళీగా వున్న జాగాకేసి ఆమె చూసింది. అతనక్కడ కూర్చు న్నాడు.

"ఆ, మీరు సరిగా ప్రవర్తించలేదని మీకు చెప్పాలనుకున్నాను, చెడ్డగా ప్రవర్తిం చారు, చాలచెడ్డగా" అంది అతనికేసి చూడకుండా.

"నేను సరిగా ప్రవర్తించలేదన్న విషయం నాకు తెలీదనుకుంటున్నారా? కాని నేనలా ప్రవర్తించటానికి కారణం యెవరు?"

"ఎందుకు చెప్తున్నారు నాకు ఆ విషయం?" అని అతని కేసి కొరకొరా చూసింది.

"ఎందుకో మీకు తెలుసు" అని సంతోషంగా, ధైర్యంగా కళ్ళు వాల్చకుండా ఆమె కళ్ళల్లోకి చూస్తూ అన్నాడతను.

తత్తరపాటు కలిగింది, వాన్‌స్కీకి కాదు, అన్నాకి.

"మీకు హృదయం లేదని తెలుస్తోందంతే" అందామె. కాని అతనికి హృదయం వుందని ఆమెకి తెలుసనీ, అందుకనే అతనంటే భయపడుతోందనీ ఆమె కళ్ళు తెలియజేసాయి.

"మీరిందాక చర్చించిన విషయం ప్రేమకాదు, పొరపాటు."

"గుర్తుంచుకోండి ఆ మాటని, ఆ చెడ్డ మాటని మీరు ఉచ్చరించకూడదని చెప్పాను" అంది అన్నా కుదులుతూ, కాని వెంటనే ఆమెకి తట్టింది – 'ఉచ్చరించకూడదని చెప్పాను' అని అనడంలోనే అతనిమీద తనకి కొంత అధికారం వుందని ఒప్పుకుంటున్నట్టు, అందు వల్లనే ప్రేమ గురించి అతను మాట్లాడడానికి ప్రోత్సాహం పొందుతున్నట్టు. "మీకీ విషయాన్ని కొంత కాలంగా చెప్పాలనుకుంటున్నాను" ఆమె చెబుతూనే వుంది, అతని కళ్ళ ల్లోకి నిబ్బరంగా చూస్తూనే వుంది. ఆమె ముఖం సిగ్గుతో యెర్రబడుతోంది. "మిమ్మల్ని కలుసుకోవచ్చనే యివాళ యిక్కడికి వచ్చాను. ఈ వ్యవహారం అంతం కావాలని చెప్పడానికే వచ్చాను. ఎవళ్ళముందూ యింతవరకూ నేను తల దించుకోలేదు. కాని మీరు దేనివల్లనో నన్ను అపరాధినని అనుకొనేటట్టు చేస్తున్నారు."

వ్రాన్‌స్కీ అన్నా ముఖంకేసి చూశాడు. ఆమె వదనంలో కనిపించిన నూతన ఆత్మిక సౌందర్యానికి చకితుడయ్యాడు.

"నన్నేం చెయ్యమంటారు?" అని సాదాగా, గంభీరంగా అడిగాడు.

"మీరు మాస్కో వెళ్లి మన్నించమని కిట్టీని అడగండి" అంది.

"నేను అలా చెయ్యాలని మీరు కోరుకోవడం లేదు" అన్నాడతను.

అన్నా తన మనసులో వున్న దాన్ని కాక వేరే యేదో బలవంతాన చెప్తోందని వ్రాన్‌స్కీ గమనించేడు.

"మీరు చెప్తూ వున్నట్టు నన్ను ప్రేమిస్తూ వుంటే నాకు మనశ్శాంతిగా వుండేటట్టు చెయ్యండి" అని మెల్లిగా చెప్పింది.

అతని ముఖం వెలిగింది.

"మీరు నా ప్రాణం అని తెలియదా? కాని నా మట్టుకు నాకే మనశ్శాంతి లేదు, మీకు యెలా ప్రసాదించగలను? అవును... నా ప్రేమని సంపూర్ణంగా, నన్నే సంపూర్తిగా అర్పించుకుంటాను. మీరూ నేనూ వేరువేరు అని అనుకోలేను. మీరూ, నేనూ అభేదం యేకం. మీకు గాని నాకు గాని మనశ్శాంతి సంభవమని నాకనిపించడం లేదు. దుఃఖం, హతాశ ప్రాప్తమయేటట్టు కనిపిస్తున్నాయి.... లేదా ఆనందం ప్రాప్తించవచ్చునన్నట్టూ కనిపిస్తోంది — ఆఁ — ఎలాంటి ఆనందం! ఇది అసాధ్యం అంటారా?" అతను పూరికే పెదాలని కదిలించే యీ మాటలు జత చేసాడు. కాని అన్నా వింది.

తను చెప్పవలసిన మాటలు అని తనకి తెలిసిన వాటిని తన బుద్ధి బలాన్నంతటినీ ఉపయోగించి ఆమె చెప్ప ప్రయత్నించింది. కాని చెప్పటానికి బదులుగా ప్రేమలో పొంగిపొర్లే చూపు మాత్రం అతనిమీద నిలవగలిగింది. అంతే ఇంకేమీ చెప్పలేదు.

'అబ్బ! చివరికి నేను ఆశ వదులుకున్న క్షణంలో, ఇక యీ కథకి ముగింపు లేదు అని అనిపించిన క్షణంలో యిదీ విషయం! అబ్బ! ఆఖరికి! ఆమె నన్ను ప్రేమిస్తోంది. ఆమె అంగీకరించిందా విషయాన్ని' అని వ్రాన్‌స్కీ సంతోషపారవశ్యంతో అనుకున్నాడు.

"అయితే నాకోసం యిది చెయ్యండి. అలాంటి మాటల్ని నాతో యెప్పుడూ అనకండి. మనం మంచి స్నేహితులుగా వుండిపోదామంతే" అందామె. కాని ఆమె కళ్ళు పూర్తిగా భిన్నమైందాన్ని చెప్పాయి.

"మనం యెన్నటికీ స్నేహితులుగా వుండలేం. అది మీకూ తెలుసు. మనం అందరికంటె యెక్కువ ఆనందంగా వుండగలమా లేదా దుఃఖితులుగా వుంటామా అనేది — వూఁ, మీ చేతుల్లోనే ఉంది."

ఆమె యేదో చెప్పబోయింది. కాని ఆమెకి అతను అడ్డం వెళ్లాడు.

"నేను ఒక్కటే అడగ దల్చుకున్నాను. ఏమంటే యిప్పటిలా ఆశ పెట్టుకోవడానికీ, బాధ పడడానికీ హక్కుని అడుగుతున్నాను. అదీ సాధ్యం కాకపోతే చెప్పండి వెళ్లిపొమ్మని, వెళ్లి

పోతాను. నేను వుండటం మీకు దుఃఖభాజకంగా వుంటే – ఎన్నటికీ మీకు కనిపించను."

"మీరు యెక్కడకేనా పారిపోవాలని నేను కోరుకోను."

"అయితే దేన్నీ మార్చకండి. ప్రతిదాన్నీ యిప్పుడున్నట్టుగానే వుండనివ్వండి" అన్నాడతను కంపించే స్వరంతో. "మీ ఆయన వస్తున్నారు."

నిజంగానే ఆ సమయంలో కరేనిన్ మెల్లగా, వికారంగా నడుచుకుంటూ డ్రాయింగ్ రూమ్‌లోకి వచ్చేడు.

తన భార్యకేసీ, వ్రాన్‌స్కీకేసీ చూసి బెట్సీ దగ్గరికి వెళ్ళేడు. టీ తాగడం కోసమని అక్కడ కూర్చున్నాడు. నిదానంగా, స్ఫుటమైన గొంతుకతో తన మామూలు వ్యంగ్య ధోరణిలో యెవళ్ళనో పరిహాసం చేస్తూ మాట్లాడ్డం మొదలుపెట్టాడు.

"మీ రాంబులె సభ* భలే పోగయిందే" అన్నాడు అక్కడ సమావేశమైన అందర్నీ చూస్తూ. "సకల కళాసంగీతాల సమ్మేళనం" అన్నాడు.

ప్రిన్సెస్ బెట్సీకి, ఆమె ఇంగ్లీషులో అన్నట్టు ఆయన sneering[1] స్వరం అంటే సరిపడదు. తెలివైన యింటావిడ గాబట్టి సంభాషణని గంభీరంగా వుండే 'నిర్బంధ సైనిక కొలువు'* అనే విషయం మీదికి మళ్ళించింది. ఆయన ఆ విషయాన్ని వెంటనే సీరియస్‌గానే అందుకున్నాడు. ప్రిన్సెస్ బెట్సీ విమర్శలని ఖండిస్తూ, దాన్ని సమర్థించాడు.

వ్రాన్‌స్కీ, అన్నా ఆ బల్లదగ్గరే కూర్చుండి పోయారు.

"ఇదేం బాగా లేదు" అని ఒకావిడ అర్థవంతంగా వ్రాన్‌స్కీకేసీ, అన్నాకేసీ, ఆమె భర్తకేసీ చూస్తూ అంది.

"నేను చెప్పలా?" అంది అన్నా స్నేహితురాలు.

యీ ఆడవాళ్ళే కాక, ప్రిన్సెస్ మ్యాకయా, బెట్సీంతో సహా డ్రాయింగు రూములో వున్న ప్రతివాళ్ళూ వాళ్ళిద్దర్నీ మధ్యమధ్య చూస్తూ వున్నారు, వ్రాన్‌స్కీ, అన్నా మిగతా అందర్నుంచీ దూరంగా పోయి కూర్చోవడం బాగా లేనట్టు. కరేనిన్ వాళ్ళున్న వేపు ఒక్కసారి కూడ చూడలేదు. చర్చనీయంగా వున్న విషయం మీదనుంచి తన ఆసక్తిని పక్కకి మళ్ళించుకోలేదు.

దీన్ని చూసి అందరూ యిబ్బందిగా భావించుకుంటున్నారని గమనించి కరేనిన్ పక్కన తన స్థానంలో యింకో ఆమెని కూర్చోబెట్టి బెట్సీ అన్నా దగ్గరికి వెళ్ళింది.

"మీ ఆయన యెంతో స్పష్టంగా, సూటిగా అభివ్యక్తం చేసే తీరు చూసి నేనెప్పుడూ ఆశ్చర్యపోతాను. అర్థం కాని అతీత విషయాలు కూడ ఆయన మాట్లాడితే నాకు అర్థం అవుతాయి" అంది.

---

[1] వెక్కిరించే ధోరణి (ఇంగ్లీషు).

"అవును" అంది అన్నా సంతోషంతో మెరిసే చిరునవ్వు నవ్వుతూ. బెట్సీ అన్న ముక్క ఒక్కటీ ఆమెకి అర్థం కాకుండానే అలా అంది. పెద్ద టేబిల్ దగ్గరికి వెళ్ళి నలుగురూ మాట్లాడుతూ వున్న దాంతో కలిసింది.

ఓ అరగంట వున్నాక కరేనిన్ భార్య దగ్గరికి వెళ్ళి యిక యింటికి పోదామా అన్నాడు. ఆమె అతనికేసి చూడకుండానే భోజనం చేసివస్తానని చెప్పింది. కరేనిన్ సరేనని వెళ్ళిపోయాడు.

* * *

అన్నా కరేనినా బండి లోలే మనిషి లావాటి ముసలి తాతారు. మెరిసే తోలు కోటు తొడుక్కున్నాడు. దావటి బూడిదరంగు గుర్రాన్ని అదుపు చెయ్యడం అతనికి కష్టంగా వుంది. గుమ్మం దగ్గర చాలా సేపట్నుంచి నిలబడే వుండడంతో చలికి ఒణికిపోయి అది యెగురుతూ, వెనక కాళ్ళమీద లేస్తూ వుంది. నౌకరు బండి తలుపు తెరిచి పట్టుకుని నుంచునే వున్నాడు. కావలివాడు సింహద్వారం తలుపు తెరిచి నుంచున్నాడు. అన్నా ఫర్ కోటు కొక్కేనికి చిక్కుకున్న గౌను చేతి లేసుని చిన్న చేత్తో అలవోకగా విడదీస్తూనే తలవంచి వ్రాన్‌స్కీ చెపుతున్న మాటల్ని చాల సంతోషంగా వింటోంది. అతను ఆమెని బండి దగ్గర దిగబెట్టడానికి కూడా వచ్చాడు.

"మీరే మాటా చెప్పలేదు. సరే నాకు అడిగే హక్కు లేదనుకోండి, యేదీ కూడా. మీకు తెలుసు నాకు కావలిసింది స్నేహం కాదు. నాకు జీవితం ప్రసాదించే ఆనందం వొక్కటే ఆ పదంలో, మీకు యేమీ యిష్టంలేని ఆ పదంలో వుంది — అది ప్రేమ."

"ప్రేమ" అని ఆమె మెల్లగా రెట్టించింది. ఇంతట్లోకీ కొక్కెంలో చిక్కుకున్న లేసు విడి, అనుకోకుండానే "నాకా పదం యిష్టం లేదు. ఏమంటే నాకు అది చాలా అధికమైంది. మీరు అర్థం చేసుకోగల దానికంటే చాల యెక్కువ" అంది. అని అతని ముఖం కేసి వొక్క సారి చూసి, "మరి వుంటా" అంది.

అతనికి చేతిని అందించింది. తర్వాత గబగబా లేడిలాగా అడుగులు వేస్తూ కావలివాణ్ణి దాటివెళ్ళి బండిలోకి యెక్కింది.

ఆమె చూపు, హస్త స్పర్శ అతన్ని కాల్చేసాయి. ఆమె తన చేతిని తాకిన చోట ముద్దు పెట్టుకున్నాడు. గడిచిన రెండు నెలలకంటే ఆ రోజు సాయంత్రం తన కోరికను సాధించడంలో కలిగిన పురోగతి సంతోషం కలిగించింది.

8

తన భార్య వ్రాన్‌స్కీతో కలిసి విడిగా వేరే బల్ల దగ్గర కూర్చుని ఉత్సాహంగా అతనితో మాట్లాడుతూ వుండటం అలెక్సేయ్ అలెక్సాంద్రొవిచ్ కరేనిన్‌కి వింతగానూ కనిపించలేదు, కూడని పనిగానూ అనిపించలేదు. కాని డ్రాయింగ్ రూమ్‌లో కూర్చున్న మిగిలిన వాళ్లకిది వింతగానూ, కూడని పనిగానూ కనిపిస్తున్నట్టు అతను గమనించేడు. ఆ కారణంగా తనూ అది కూడని పని అయివుండాలి అనుకున్నాడు. భార్యతో ఆ విషయం గురించి మాట్లాడాలని నిర్ణయించుకున్నాడు.

ఇంటికి తిరిగి వచ్చేక యెకాయెకీ అలవాటు ప్రకారం చదువుకునే గదిలోకి వెళ్లాడు. చేతుల కుర్చీలో కూర్చున్నాడు. పోపు ఆధిపత్యం గురించి రాసిన పుస్తకాన్ని తీసుకొని గుర్తు పెట్టుకున్న చోట తెరిచి చదవసాగేడు. ఒంటిగంటదాకా చదువుకోవడం అతనికి అలవాటు. అలాగే చేశాడు. కాని ఈ రోజు రాత్రి తడవ తడవకీ యెత్తుగా వున్న నుదురుపైన చేతిని రాసుకుంటూనే వున్నాడు; యేవో విసిగించే ఆలోచనలని తరిమేస్తున్నట్టుగా తల వంకిస్తూనే వున్నాడు. యథాప్రకారం వేళకి నిద్రకుపక్రమించడానికని లేచాడు. అన్నా యింకా యింటికి రాలేదు. అతను పుస్తకం చంకలో పెట్టుకుని మెట్లెక్కి పైకి వెళ్లాడు. అతనికి మామూలుగా ఉద్యోగ సంబంధమైన ఆలోచనలు, ఆ వూహలూ బుర్రలో తిరుగుతూ వుంటాయి. కాని యివాళ రాత్రి మాత్రం భార్యని గురించిన ఆలోచనలూ, ఆమెకి సంబంధించి యేదో అసంతృప్తిగా వుండే వూహలూ బుర్రలో తిరుగుతున్నాయి. అలవాటు ప్రకారం పడుకోలేదు. చేతులు వెనక్కి కట్టుకొని గదులలో అటూ యిటూ పచార్లు చేశాడు. ప్రస్తుతం తలెత్తిన పరిస్థితిని మొదట సాకల్యంగా పరిశీలిస్తే తప్ప పడక చేరలేదు.

భార్యతో యీ విషయం గురించి మాట్లాడాలని యిందాక కరేనిన్ నిర్ణయించుకున్నప్పుడు, యిదంతా చాల సునాయాసమైన విషయంగా, తేలికైన విషయంగా కనిపించింది. కాని యిప్పుడు సరిగా దాన్ని గురించి ఆలోచించిన మీదట అది చాల కష్టం గానూ, సంక్లిష్టమైంది గానూ కనిపించింది.

కరేనిన్ అసూయాపరుడేం కాదు. అసూయపడ్డం అంటే భార్యని అవమానించడమేనని అతని భావన. భార్యని నమ్మాలి. భార్యని ఎందుకు నమ్మాలి, యీ పడుచు భార్య యెప్పుడూ తనని ప్రేమిస్తుంది అన్న పూర్తి విశ్వాసం తనకి యెందుకు వుండాలి, అని అతను ప్రశ్నించుకోలేదు. తనకి ఆమెమీద అపనమ్మకం లేదు. తను ఆమెని నమ్మేడు, అలా నమ్మాలని తనకి తాను చెప్పుకున్నాడు కాబట్టి. అసూయపడటం సిగ్గుపడవలసిన విషయమనీ, నమ్మకం వుండాలనీ అతని భావన చలించలేదు కాని యేదో అర్థంలేని అహేతుకమైన దాన్ని ఎదుర్కోవలసి వస్తోందని అతనికి అనిపించింది. ఏం చెయ్యాల్సిందీ అతనికి తెలియదు. కరేనిన్ నిజ జీవితాన్ని ఎదుర్కోవలసి వచ్చింది. తన భార్య వేరే వాళ్ల నెవళ్లనో ప్రేమించే సందర్భాన్ని

యెదుర్కోవాల్సి వచ్చింది. అది అర్థరహితంగా, అహేతుకంగా కనిపించింది. యేమంటే అది నిజ జీవితం కాబట్టి. అతనికి గుర్తున్నంతవరకూ అతను అధికారిక రంగాల్లోనే జీవించి పని చేసాడు. అక్కడ జీవిత ప్రతిబింబాలతో వ్యవహరించడమే వుంటుంది. నిజ జీవితంలో సంబంధం కలిగించుకోవలసి వచ్చిన ప్రతిసారీ దాన్నుంచి దూరం వెళ్లాడు. ఇప్పుడు తన స్థితి పెద్ద అగాధంమీద వంతెన దాటేవాడి లాగా వుంది. వంతెన దాటేవాడు ప్రశాంతంగా దాటుతూనే వుంటాడు. ఉన్నట్టుండి వంతెన తెగిపోయి అగాధం తన ముందు ఆవులించుకుని యెదురు చూస్తుంది. ఆ అగాధం నిజ జీవితం. వంతెన కరేనిన్ బతుకుతూ వున్న కృత్రిమ జీవితం. తన భార్య మరొక మనిషిని ప్రేమించే సందర్భం అనే దాన్ని అతను మొదటి సారిగా యెదుర్కొంటున్నాడు. అతను స్తబ్ధుడయ్యాడు.

అతను బట్టలు మార్చుకోలేదు. సమంగా అంగలు వేస్తూ, భోజనాల గది చెక్కనేల మీద చప్పుడు అవుతూవుంటే, అటూ యిటూ పచారుచేశాడు. భోజనాల గదిలో ఒక్క దీపమే వెలుగుతోంది. డ్రాయింగ్ రూమ్ తివాసీమీద పచారుచేశాడు. డ్రాయింగ్ రూమ్ చీకటిగా వుంది. ఆ గదిలో వెలుతురు ఈ మధ్యనే గీసిన తన బొమ్మమీద పడుతోంది. ఆ బొమ్మ సోఫామీద వేలాడుతుంది. అన్నా గదిలో పచారుచేసాడు. ఆమె గదిలో రెండు కొవ్వొత్తులు వెలుగుతున్నాయి. ఆ వెలుతుర్లో ఆమె కుటుంబం, మిత్రులు వున్న బొమ్మలు కనిపిస్తున్నాయి. ఆమె రాత బల్లమీద వున్న చిన్నా చితకా వస్తువులు కనిపిస్తున్నాయి. అవి అతనికి బాగా పరిచయం. ఆమె గదిలో నడిచి వెళుతూ అతను తమ పడక గది దాకా వెళ్లాడు. అక్కడినుంచి మళ్లీ వెనక్కి తిరిగాడు.

పచారుచేస్తూ చివరికంటా వెళ్లిన ప్రతిసారీ దీపం వెలుగుతూ వున్న భోజనాల గదిలో చెక్కనేల దగ్గరకి రాగానే అతను ఆగేవాడు. 'అవును నేను దీనంతట్నీ పరిశీలించి పరిష్కరించాలి. నా ఉద్దేశాలు చెప్పి నా నిర్ణయం తెలియజెయ్యాలి' అనుకొనేవాడు. మళ్లీ వెనక్కి తిరిగేవాడు. 'కాని యేం చెప్పాలి? ఏ నిర్ణయం తెలియజెయ్యాలి?' అనుకొనేవాడు మళ్లీ డ్రాయింగ్ రూమ్ దగ్గరికి వెళ్లగానే. కాని జవాబు దొరికేది కాదు. 'అయినా యేం జరిగింది?' అని ఆమె గది వేపు తిరిగి అనుకునేవాడు 'ఏమీ లేదు. ఆమె అతనితో కాసేపు మాట్లాడింది. దాని వల్ల యేమైంది? సమాజంలో ఆడవాళ్లు అనేక రకాల వాళ్లతో మాట్లాడతారు. అసూయపడటం ఆమెని అవమానపరచటం, నన్ను అవమానపరచుకోవటం' అనుకున్నాడు, ఆమె చదువుకునే గదిలోకి వెళ్లి. కాని యింతకు ముందు యెక్కువ సమాధాన పూర్వకంగా వున్న యీ వాదనలు శూన్యంగా కనిపించాయి. పడక గది గుమ్మం దగ్గర వెనక్కి తిరిగి మళ్లీ డ్రాయింగ్ రూమ్‌కి తిరిగి వచ్చేడు. అతను చీకటిగా వున్న డ్రాయింగ్ రూమ్‌లోకి మళ్లీ రాగానే — తను తప్పని, యితరులు దేన్నో గమనించారూ అంటే ఏదో వుండే వుండాలి అని యెవరో చెప్పినట్టయింది. భోజనాల గదిలోకి వెళ్లాక మళ్లీ తనలో అనుకున్నాడు: 'అవును నేను దీనంతట్నీ పరిశీలించి పరిష్కరించాలి. నేననుకుంటున్నది

చెప్పాలి.' మళ్లీ డ్రాయింగ్ రూమ్ చివర వెనక్కి తిరుగుతూ 'యెలా పరిష్కరించాలి?' అనుకునేవాడు. మళ్లీ 'యేం జరిగింది?' అనుకునేవాడు. 'ఏం జరగలేదు' అని సమాధానం చెప్పుకునేవాడు. అనుమానపడటం తన భార్యని అవమానపర్చటం అని గుర్తుచేసుకొనేవాడు. కాని తిరిగి డ్రాయింగ్ రూమ్‌లోకి వచ్చేటప్పటికి ఏదో జరిగిందని అనుకునేవాడు. అతను గదిలోనుంచి గదిలోకి తిరుగుతూ వున్నట్టు అతని ఆలోచనలు కూడా వేరే కొత్త దాన్ని దేన్నీ సూచించకుండా వొక వృత్తంలో తిరిగాయి. యీ విషయంమీదకి అతని దృష్టి మళ్లింది; చేత్తో నుదురు రుద్దుకున్నాడు. అన్నా గదిలో కూర్చుండి పోయాడు.

అక్కడ కూర్చుని ఆమె రాసుకొనే బల్లకేసి చూశాడు. దానిమీద మాలకాయిట్ రాత పరికరాలు వున్నాయి. పూర్తిచెయ్యాని ఉత్తరం ఒకటుంది. అతని ఆలోచనలు హఠాత్తుగా కొత్త మలుపు తిరిగాయి. ఆమె ఆలోచనలు యేమిటో ఆమె అనుభూతులు యేమిటో అని ఆమె గురించి అనుకోవడం మొదలుపెట్టాడు. మొట్టమొదటి సారిగా ఆమె వ్యక్తిగత జీవితం గురించీ, ఆమె ఆలోచనల గురించీ, ఆమె కోరికల గురించీ స్పష్టంగా వూహలో అవగాహన చేసుకున్నాడు. ఆమెకి సొంత జీవితం ఒకటుంటుందనే ఊహ, అది వుండి తీరాలన్న ఊహ యెంతో భయంకరంగా కనిపించింది. దాన్ని గబగబా మనస్సులోనుంచి తరిమెయ్యబోయాడు. అతను చూడలేని అగాధం అది. తనని ఆలోచనల్లో, భావనల్లో వేరే వ్యక్తి స్థానంలో పెట్టుకోవడం అనేది కరేనిన్ స్వభావానికి విరుద్ధమైన ఆత్మిక ప్రయత్నం. అలాంటి ఆత్మిక ప్రయత్నం అనే దాన్ని చెయ్యడం ప్రమాదకరమైన, నష్టదాయకమైన కల్లన్ని వదలడంగానే అతను పరిగణిస్తాడు.

'అన్నిటికంటే చెడ్డది — యిది నా పని దాదాపు పూర్తయే సమయంలో (తను అప్పట్లో ముందుకు తెస్తూ వున్న ప్రణాళిక అతని మనస్సులో వుంది) నాకు మనశ్శాంతి పూర్ణ ఆత్మిక శక్తి అవసరమైన యీ సమయంలో యిది సరిగ్గా రావడం, నేనిలాంటి వ్యర్థ ఆందోళనతో కుంగిపోవడం. కాని యేం చెయ్యాలి? యెదురుగా చూసే ధైర్యం లేక చింతనీ వ్యాకులతనీ అనుభవించే లాంటి వాణ్ణి కాను నేను.'

"నేను సాకల్యంగా ఆలోచించాలి. ఒక పరిష్కారానికి రావాలి. మనస్సులో యీ చింత లేకుండా చేసుకోవాలి" అని పైకే అన్నాడు.

'ఆమె అనుభూతులకి సంబంధించి ఆమె హృదయంలో యేం జరిగిందో, జరుగుతూ వుందో, నాకు సంబంధం లేదు. అది ఆమె అంతరాత్మకి సంబంధించిన విషయం. ధర్మానికి సంబంధించిన విషయం' అనుకున్నాడు. దానితో నైతిక నియమావళికి చెందిన ఖచ్చితమైన అంశం ప్రస్తుతం తల యెత్తిన ఈ పరిస్థితికి అన్వయించేటట్టు దొరికిందని ఉపశాంతి పొందాడు.

'అందుచేత ఆమె అనుభూతులూ వగైరాలన్నీ ఆమె అంతరాత్మకి సంబంధించిన విషయాలు. నాకు ప్రమేయం లేదు. నా బాధ్యత స్పష్టంగానే వుంది. కుటుంబ యజమా

నిగా నా బాధ్యత ఆమె నడవడికని సరిగా వుండేటట్టు చూడ్డం. ఆ రకంగా ఒక మేరకి జవాబుదారీ వుందంతే. రానున్న ప్రమాదాన్ని చూసి, ఆమెని హెచ్చరించి, నా అధికారాన్ని కూడ చూపించాల్సి వుంది. దీన్నంతటినీ ఆమెకి వివరించి చెప్పాలి' అనుకున్నాడు.

భార్యకి యేం చెప్పాలో కరేనిన్ మనస్సులో స్పష్టమైన రూపం తీసుకుంది. తను ఏం చెప్పబోయేదీ దాన్ని గురించి అనుకుంటూ యిలాంటి చిన్న విషయంమీద, స్వంత కుటుంబ వ్యవహారంమీద తన సమయాన్నీ, మానసిక శక్తినీ ఖర్చు చెయ్యాల్సి వస్తోందేనని బాధ పడ్డాడు. అయినాగానీ ఆమెకి యివ్వబోయే ఉపన్యాస రూపం, క్రమం, అవి ఒక ప్రజా నివేదిక అయినట్టుగా, అతని మనస్సులో రూపుతీసుకున్నాయి. 'ఈ విషయాల గురించి చెప్పి వ్యాఖ్యానించాలి. మొదటిది, ప్రజాభిప్రాయ ప్రాముఖ్యం, శిష్టాచార మహత్యం; రెండవది, వివాహ బంధపు ధర్మ ప్రాముఖ్యం; మూడవది, అవసరం అయితే యిదీ చెప్పాలి — కన్న కొడుక్కి కలిగే భవిష్యత్ దురదృష్ట సూచన; నాల్గవది, ఆమెకిగా — ఆమెకి ప్రాప్తించబోయే దురదృష్ట సూచన.' తర్వాత కరేనిన్ వేళ్లల్లో వేళ్లు పెట్టి చేతుల్ని కిందికి చాచాడు. వేళ్ల మెటికలు విరుచుకొనేదాకా చేతుల్ని చాచాడు.

వేళ్లూ వేళ్లూ బంధించుకోవడం, మెటికలు విరుచుకోవడం, యెప్పుడూ అతనికి పూరట కలిగిస్తాయి. అతని ఆలోచనలు కూడదీసుకోవటానికి అనుకూలిస్తాయి. ఆ క్షణంలో అతనికి యెంతో అవసరం అయింది అదే. ఆ సమయంలో యింటి గుమ్మం దగ్గరికి వస్తూ వున్న బండి చప్పుడు వినిపించింది. కరేనిన్ హాలు మధ్యలో నుంచుండిపోయాడు.

ఆడమనిషి మెట్లు యెక్కి వస్తూవున్న చప్పుడు వినిపించింది. కరేనిన్ ఉపన్యాసం యివ్వడానికి సిద్ధంగా నిలబడ్డాడు. కట్టుకున్న వేళ్లని నొక్కాడు. మరోసారి మెటిక విరుగుతుందా అని చూశాడు. విరిగింది.

మెట్లమీద ఆమె తేలిగ్గా అడుగులు వేసుకుంటూ వస్తోంది. ఆమె దగ్గరికి వస్తోందని కరేనిన్ గ్రహించాడు. తను తయారు చేసుకున్న ఉపన్యాసం తృప్తిగానే వుందతనికి. కాని రాబోయే సంభాషణ అతనికి భయం కలిగించింది.

9

అన్నా తల వంచుకునే, టోపీ కుచ్చులతో ఆడుకుంటూ మెట్లెక్కి వచ్చింది. ఆమె ముఖం ప్రకాశమానంగానే వుంది. కాని సంతోషభరిత ప్రకాశం కాదు. చీకటి రాత్రిలో అగ్ని ప్రమాదం సంభవించినప్పుడు రగులుకునే మంటలాంటి ప్రకాశం. ఆమె భర్తని చూసి తల యెత్తి చిరునవ్వు నవ్వింది, అప్పుడే మెలకువ వచ్చిన మనిషిలాగా.

"ఇంకా పడుకోలేదా? చిత్రంగా వుందే!" అంది టోపీ విసిరేసి. యెకాయెకీ యెక్కడా ఆగకుండా తన డ్రెస్సింగ్ రూమ్‌కి వెళ్లిపోయింది. "పడుకునే వేళయింది, కదా" అంది లోపలినుంచి.

"అన్నా, నీతో మాట్లాడాలి."

"నాతోనా?" అని ఆశ్చర్యంగా అంది. ఇవతలకి వచ్చి అతనికేసి చూసింది. "ఏమిటిది? దేని గురించై వుంటుంది?" అని కూర్చుంటూ అడిగింది. "ఊఁ, సరే అయితే. అంత అవసరం అయితే మాట్లాడుకుందాం. కాని నాకు నిద్రపోవడం మెరుగనిపిస్తోంది" అంది.

అన్నా తనకి తట్టిన విషయాన్నే అనేసింది. తను అన్న మాటలు చూసి తను అంత బాగా అబద్ధం ఆడగలదా అని ఆశ్చర్యపోయింది. తన మాటలు యెంతో సహజంగా, నిష్కపటంగా తనకే కనిపించాయి. నిజంగా నిద్రపోవాలని ఆమెకి అనిపించింది! అబద్ధాల అభేద్యమైన కవచంలో వున్నట్టు ఆమెకి అనిపించింది. ఏదో అదృశ్యశక్తి తనకి తోడుగా వుండి సాయపడుతున్నట్టు ఆమెకి అనిపించింది.

"అన్నా, నిన్ను నేను హెచ్చరించాల్సి వుంది."

"నన్నా? హెచ్చరించడమా? దేన్ని గురించి?" అని అడిగింది.

ఆమె భర్తకేసి యెంతో సహజంగా, కులాసాగా చూసింది. ఆమె భర్త తప్ప, ఆమెని తెలిసిన వాళ్లెవరూ ఆమె స్వరంలో గాని ఆమె మాటల అర్థంలో గాని కృత్రిమమైంది దేన్నీ కనిపెట్టలేరు. కాని ఆమె అతనికి బాగా తెలుసు. తను అయిదు నిమిషాలు ఆలస్యంగా నిద్రపోవడానికి వెడితే గమనించి కారణం అడుగుతుందని తెలుసు. ఎప్పుడూ ఆమె కష్టసుఖాలని చెప్పుకోడానికి వెంటనే తన దగ్గరికి వస్తుంది అని తెలుసు. ఇప్పుడు తను వున్న మానసిక స్థితిని ఆమె గుర్తించ నిష్టపడ్డం లేదు. తన గురించి ఒక్క మాటా చెప్పడం లేదు. ఆమెని గురించి అంతలా తెలిసిన అతనికి యిప్పటి ప్రవర్తన చాలా గంభీరమైన ప్రాముఖ్యం వున్న విషయం. తనకి సర్వదా తెరచి వున్న ఆమె హృదయం లోతులు యిప్పుడు మూసుకు పోయాయని అతను చూశాడు. పైగా ఆమె కంఠస్వర ధోరణిని బట్టి తన స్థితి ఆమెను యే మాత్రమూ కలత పెట్టడం లేదని, నిజానికి 'అవును, మూసుకుపోయాయి. అలాగే వుండాల్సి వుంది, భవిష్యత్తులో కూడ అలాగే ఉండబోయేది' అని చెప్తున్నట్టు అనిపించింది. తిరిగి తిరిగి ఇంటికి వచ్చేటప్పటికి తలుపులు మూసివుంటే యెవళ్లకేనా యెలా వుంటుందో అతనికి అలా అనిపించింది. 'కాని తాళం చెవి దొరుకుతుంది' అనుకున్నాడు.

"నేను హెచ్చరించదలచుకున్నది" అని నిదానంగా మొదలుపెట్టాడు. "నీ అవివేకంవల్ల, ఆలోచనలేమివల్ల లోకులు నిన్ను గురించి మాట్లాడుకోవేందుకు హేతువు కల్గిస్తున్నావు. ఈ సాయంత్రం కౌంట్ వ్రాన్స్కీతో (అతను ఆ పేరుని స్ఫుటంగా, నిదానంగా ఒత్తుతూ ఉచ్చరించేడు) మురిసిపోతూ నువ్వు మాట్లాడుతూ వుండటం నలుగురి దృష్టిలోనూ పడింది."

ఆ మాటలు చెప్తూ అతను ఆమె కళ్లలోకి చూశాడు. అవి నవ్వుతున్నట్టున్నాయి. అభేద్యతవల్ల భయం కలిగించేటట్టు అయాయి. తను ఆ మాటలు అంటూ వున్నా గూడా అవి వ్యర్థమనీ పనికిమాలినవనీ అతను గ్రహించాడు.

"అదే నీతో వచ్చింది" అందామె అతని మాటల్ని అర్థం చేసుకో లేకపోతున్నట్టుగా,

ఆఖరున అన్న మాటలనే అర్థం చేసుకుంటున్నట్టు. "యివాళ నేను నిరుత్సాహంగా వున్నాను కాబట్టి నువ్వు అసంతృప్తిగా వుంటావు, రేపు నేను సంతోషంగా వుంటాను కాబట్టి అసంతృప్తి పడతావు. నేనివాళ నిరుత్సాహంగా లేను. అదేగా నీకు కష్టం కలిగించింది?"

కరేనిన్ కుదిలేరు. మెటికలు విరుచుకోడానికి వేళ్లని వంచేరు.

"అబ్బ ఆ పాడు చప్పుడు చెయ్యొద్దు. నాకు అసహ్యం" అంది.

"ఆన్నా, నువ్వేనా?" అన్నాడు, బలవంతంగా మెటికలు విరుచుకోకుండా వుండే ప్రయత్నం చేశాడు.

"వూఁ, యేమిటి విషయం? యేం కావాలి నీకు?" అని నిజంగా ఆశ్చర్యపడుతున్నట్టు, ఓ మాదిరి పరాచికంగా వుండేటట్టు అడిగింది.

జవాబు చెప్పకుండా అతను నుదుటిపైనా, కళ్లపైనా చేత్తో రాసుకున్నాడు. తను చెయ్యాలనుకున్న దాన్ని చెయ్యకుండా అంటే లోకుల దృష్టిలో తప్పుగా వున్నదాన్ని చెయ్యకుండా హెచ్చరించడానికి బదులు, అనుకోకుండానే ఆమె అంతరాత్మకి సంబంధించిన దాని గురించి తను ఆందోళన పడిపోతున్నాడనీ అక్కడలేని గోడకి కొట్టుకుంటున్నాడని గుర్తించాడు.

"నేను చెప్పదల్చుకున్నది యిదీ. నేను చెప్పేది సాంతం విను. నీకు తెలుసు, నాకు అసూయపడ్డం అనేది చెడ్డగా, చిన్నతనంగా కనిపిస్తుందని. నామీద అలాంటిది పెత్తనం చెయ్యకుండానే చేసుకుంటాను. కాని కొన్ని శిష్టాచార నియమాలున్నాయి. వాటిని ఉల్లంఘిస్తే అనివార్యంగా దండన అనుభవించాల్సి వస్తుంది. ఇవాళ సాయంత్రం, నీ ప్రవర్తన అక్కడున్న అందరికీ యెలా వుందో నేను మాత్రమే గాక, మిగిలిన అందరూ గమనించారు, నీ ప్రవర్తన యెలా వుండాలో అలా మర్యాదగా లేదని" అని నిదానంగా పొడిగా అన్నాడు.

"నిజంగా నాకు అర్థం అవడం లేదు" అని భుజాలు యెగరేసి ఆన్నా అంది. 'తనకి సంబంధించి అంతా సరిగానే వుంది. కాని లోకులు గమనించారని చింత పట్టుకుంది' అనుకుంది ఆన్నా. "నీకు ఒంట్లో బాగాలేదు" అని భర్తని సంబోధించి పైకి అని, వెళ్లిపోవడానికి లేచింది. ఆమెని ఆపడానికా అన్నట్టు అతను ఒక అడుగు ముందుకు వేశాడు.

అతని ముఖం వికారంగా, మునురుకుపోయి వుంది. అలా అతన్ని అంతకు ముందెన్నడూ చూడలేదు. ఆమె ఆగి తల వో పక్కకి తిప్పి, తన మామూలు రీతిలో గబగబా తల పిన్నులు తియ్యడం మొదలుపెట్టింది.

"వూఁ, వింటానికి తయారుగా వున్నాను" అంది నిదానంగా, తలబిరుసుగా. "నేను ఆసక్తిగా వింటున్నాను; విషయం యేమిటో తెలుసుకోవాలని" అంది.

తన సహజ, శాంత, నవ్య స్వరం, కచ్చితమైన మాటలు చూసి ఆఁ అవి ఆమెకే ఆశ్చర్యం అనిపించింది.

"నీ అనుభూతులలోకి వెళ్లే హక్కు నాకు లేదు, నిజానికి అలాంటి పని నిరర్థకం,

ప్రమాదకరం కూడానూ అనుకుంటున్నాను. మన అంతరంగాలని శోధించుకోవడంలో మనం తరచుగా కదిలించకుండా వుండే వాటిని తవ్వి తోడతాం. నీ అనుభూతులు నీ అంతరాత్మకి సంబంధించినవి. కాని నీపట్ల, నాపట్ల దేవుడిపట్ల నాకు వున్న బాధ్యత వల్ల నీ విధుల్ని నీకు చూపించాల్సి వస్తోంది. మన జీవితాలు కలిసి బంధం యేర్పడింది. యీ బంధం యేర్పడింది మనిషివల్ల కాదు, దేవుడివల్ల. యిలాంటి బంధాన్ని నేరం మాత్రమే తుంచుతుంది. యిలాంటి పాపానికి కఠినమైన శిక్ష వుంటుంది'' అన్నాడు కరేనిన్.

''నాకింకా అర్థం అవడం లేదు. అబ్బ, నాకు నిద్ర ముంచుకొస్తోంది'' అంది ఆమె. యింకా పిన్నులు మిగిలాయేమోనని గబగబా చేత్తో తల తడుముకుంది.

''అన్నా, నీకు పుణ్యం వుంటుంది. అలా మాట్లాడకు. బహుశ నేను పొరపాటు పడి వుండచ్చు. కాని నేను నీ కోసం, నా కోసం మాట్లాడేనని నువ్వు నమ్మాలని కోరుతున్నాను. నేను నీ భర్తని, నిన్ను ప్రేమిస్తున్నాను'' అన్నాడు అణకువగా.

ఓ క్షణం ఆమె ముఖం దిగాలుగా అయింది. ఆమె కళ్లల్లో అపహాస్యపూర్వకమైన మెరుపు మాయమైంది. కాని ''ప్రేమిస్తున్నాను'' అనే పదం వినగానే ఆమెకి మళ్లీ కోపం వచ్చింది. 'ప్రేమిస్తున్నాడా? తను ప్రేమించగలడా? ప్రేమ అనే పదం వుందని విని వుండకపోతే యెన్నడూ దాన్ని వాడేవాడు కూడా కాదు. ప్రేమంటే తనకి తెలియదు.'

''నువ్వు చెప్పేది నిజంగా నాకు అర్థం అవడం లేదు. దయచేసి స్పష్టంగా చెప్పు నీకు యేం...''

''దయచేసి నన్ను పూర్తిగా చెప్పనీ. నిన్ను ప్రేమిస్తున్నాను. కాని నేను నా గురించి చెప్పటం లేదు. ముఖ్య వ్యక్తులు యెవరూ అంటే — మన అబ్బాయీ, నువ్వూను. నా మాటలు అసందర్భంగా, అధికంగా కనిపించవచ్చు. నేను పొరపాటుగా అర్థం చేసుకోవడం వల్లా అవి వొచ్చి వుండచ్చు. అలా అయితే నన్ను మన్నించు. కాని నేనన్న మాటలకి యే మాత్రం హేతువు వుందని నీ అంతట నీకు అనిపించినా నువ్వు వాటిని గురించి ఆలోచించు. నీకు కావాలనుకుంటే నాతో చెప్పు.''

తనకు తెలియకుండానే కరేనిన్ తను అనుకున్న ఉపన్యాసానికి పూర్తిగా భిన్నమైందాన్ని చెప్తున్నాడు.

''నేను చెప్పాల్సిందేమీ లేదు. పైగా...'' అందామె గబగబా, చిరునవ్వు ఆపుకో ప్రయత్నిస్తూ. ''పడుకునే వేళ అయింది'' అంది.

అతను నిట్టూర్చి, మరోమాట అనకుండా పడక గదిలోకి వెళ్లాడు.

ఆమె లోపలికి వెళ్లేటప్పటికి అతనప్పుడే మంచంమీద పడుకున్నాడు. అతను గట్టిగా మూతి ముడుచుకున్నాడు. కళ్లతో ఆమెని చూడలేదు. అన్నా తన పక్కమీద చేరింది. యే క్షణంలోనైనా అతను మళ్లీ మాట్లాడ్డం మొదలుపెడతాడని చూసింది. అతను మళ్లీ మాట్లాడ్డం మొదలెడతాడని భయపడింది. కాని వినాలనిపించింది. అతను ఏమీ అన

లేదు. కాసేపు చూసింతర్వాత అతన్ని గురించి మరిచిపోయింది. రెండో వ్యక్తిని గురించి అనుకుంది. తన మనోనేత్రంలో అతన్ని చూసింది. ఆమె హృదయం ఉత్తేజభరితంగా గెంతింది. కసిగా హర్షంతో గెంతింది. హఠాత్తుగా ఆమెకి నిదానంగా, సమస్థాయిలో వున్న గురక విని పించింది. ఒక క్షణంలో కరేనిన్ తన గురకకి తనే భయపడినట్టు గురక ఆగింది. తర్వాత ఒకటి రెండు సార్లు శ్వాస మామూలుగా ఉంది మళ్లీ గురక మొదలైంది, నిదానంగా సమస్థాయిలో.

"ఆలస్యమైపోయింది. యిప్పటికే మించిపోయింది" గొణిగింది చిరునవ్వు నవ్వుతూ. కదలకుండా అలానే పడుకుంది. కళ్లు మూతపడకుండానే వున్నాయి. ఆ కళ్ల మెరుపు చీకట్లో తనే చూడగల్గుతున్నట్టు వూహించుకుంది.

10

ఆ రాత్రినుంచి కరేనిన్‌కీ, అతని భార్యకీ నూతన జీవితం ఆరంభమైంది. ప్రత్యేకంగా ఏమీ మారలేదు. అన్నా యధాప్రకారంగానే ఉన్నత సమాజంలోకి వెడుతుంది. యెక్కువగా ప్రిన్సెస్ బెట్సీ దగ్గరికి వెళ్లేది. యెక్కడికి వెళ్లినా వ్రాన్‌స్కీని కలిసేది. కరేనిన్‌కి తెలుసు కాని, యేమీ చెయ్యలేకపోయాడు. దీనికి సంబంధించి యే ప్రస్తావన అతను చెయ్యనారంభించినా అన్నా అతని ముందు ఉల్లాసభరిత, ఆశ్చర్యపూరిత అభేద్యకుడ్యాన్ని నిలబెట్టేసేది. పైకి మాత్రం అంతా మారకుండానే వుంది. కాని వాళ్ల ఆంతరంగిక సంబంధాలు పూర్తిగా మారిపోయాయి. ప్రభుత్వ వ్యవహారాలకి సంబంధించి కరేనిన్ గొప్పవాడే అయినా, యీ విషయంలో మాత్రం యేమీ చెయ్యలేకపోయాడు. వధ్యశాలకి తీసుకుపోయిన యెద్దులాగా అతను నోరెత్తకుండా తల వాల్చేసి దెబ్బపడడం కోసం చూశాడు. అతని మనస్సుకి యీ విషయం తట్టినప్పుడల్లా తను మరోసారి ప్రయత్నం చెయ్యాలని అనుకునేవాడు. ఆమెని యింకా రక్షించగలనని అనుకునేవాడు. ఆమెకి వివేచన కలిగించవచ్చని అనుకున్నాడు. దయ, ఉదారత్వం ప్రేమాభిమానాలు చూపించి ఆమెకి అర్థం అయేటట్టు చెయ్యగలననుకున్నాడు. ప్రతిరోజూ ఆమెతో మాట్లాడదామనే తీర్మానించుకునేవాడు. కాని ఆమెతో మాట్లాడ్డం మొదలుపెట్టిన ప్రతిసారి ఆమెని ఆవేశించిన దుష్టశక్తి, కపటత్వం తననీ ఆవహించినట్టు అనిపించేది. తను చెప్పే విషయాలూ, తను వాటిని చెప్పే ధోరణీ తను వుద్దేశించినట్టు వుండేవి కావు. అప్రయత్నంగానే తన మామూలు వ్యంగ్య ధోరణి వచ్చేసేది. అలాంటి స్వరంతో ఆమెకి తను చెప్పాలనుకున్నదాన్ని చెప్పడం అసంభవం.

. . . .

. . . .

11

దాదాపు ఒక సంవత్సరం పాటు వ్రాన్స్కీ జీవిత యేకైక కోరిక అయినటువంటిది, అతని పూర్వపు కోరికలన్నిటి స్థానాన్నీ ఆక్రమించినటువంటిది, అన్నాకి అసంభవంగా భయానకంగా కనిపించి, ఆ రకంగా ఆనందపు మనోహర స్వప్నంగా భాసించినటువంటిది – సఫలమైంది. వ్రాన్స్కీ ముఖం పాలిపోయింది. కంపించే కింది దవడతో ఆమె దగ్గర వాలి నుంచున్నాడు. ఆమెని శాంతించమని అర్థిస్తున్నాడు. కాని యెలా యెందుకు శాంతి పడాలో అతనికే తెలీదు.

"అన్నా, అన్నా" అన్నాడు కంపించే స్వరంతో. "అన్నా, వేడుకుంటున్నా!.."

కాని అతను యెంత గట్టిగా అర్థిస్తూ వుంటే, అంత కిందుగా ఆమె తల వాలిపోయింది. ఒకప్పుడు గర్వంగా, ఉల్లాసంగా వున్న తల యిప్పుడు నేర పంకిలమై వాలిపోయింది. ఆమె అలా తల వాల్చుకుంటూ, చివరకి సోఫామీదనుంచి జారి నేలమీద అతని కాళ్లముందు జారింది. అతను గనక ఆమెని పట్టుకోకపోయి వుంటే, తివాసీమీద సాగిలపడిపోయేదే.

"భగవంతుడా! నన్ను క్షమించు" అని ఆమె వెక్కింది. అతని చేతులు తన ఛాతీమీద అదుముకుంది.

ఆమె యెంత అపరాధినిలాగా, దోషిలాగా బాధపడుతోందంటే వినమ్రురాలై క్షమ యాచించడం కంటె మరేమీ చెయ్యలేకపోయింది. ఇప్పుడిక యావత్ప్రపంచంలోనూ ఆమెకి మిగిలిన వ్యక్తి అతనే కాబట్టి అతన్ని సంబోధించే క్షమాభిక్ష అర్థించింది. అతనికేసి చూసినప్పుడు తన పతన స్థితి మూర్తికట్టినట్టు అనుభవంలోకి వచ్చింది. ఈ క్షమాభిక్షకంటె వేరే మాటలు ఆమె అనలేకపోయింది. హత్యచేసిన హంతకుడు తను ప్రాణం తీసిన శరీరాన్ని చూస్తే యెలా వుంటుందో అలా వుంది వ్రాన్స్కీకి. తను ప్రాణం తీసిన ఆ శరీరం అంటె తమ ప్రేమ – తొలి దశలోని ప్రేమ. భయంకర జుగుప్సాత్మకమైనదేదో విపరీతమైన అవమాన భార మూల్యం చెల్లించినటువంటిది, దీన్ని గుర్తు చేసుకుంటే కలుగుతుంది. తన ఆధ్యాత్మిక నగ్నతా కారణంగా ఉత్పన్నమైన అవమానం ఆమెని నలిపేస్తోంది. అది వ్రాన్స్కీ మీద ప్రభావం కల్గిస్తోంది. తను హత్యచేసిన శవాన్ని చూసి హంతకుడు భయవిహ్వలితుడై పోతాడు. కాని ఆ కళేబరాన్ని ముక్కలు ముక్కలుగా ఖండించెయ్యాలి, దాచెయ్యాలి. హత్యవల్ల తనకి లభించిన యే లబ్ధినైనా అనుభవించి తీరాలి.

విపరీతమైన ఆవేశభరితంగా కనిపించే విద్వేషంతో హంతకుడు శవంమీద పడి దాన్ని పీకి ఛిద్రం చేస్తాడు. వ్రాన్స్కీ కూడ సరిగ్గా అలానే చేసాడు. ఆమె ముఖంమీద, భుజాలమీద తీవ్ర కాంక్షాభరితంగా ముద్దులు వర్షింపచేశాడు. ఆమె అతని చేతిని పట్టుకుంది, కదల్లేదు. అవును యీ ముద్దులకి యింత అవమాన మూల్యం చెల్లించింది. ఈ చెయ్యి ఒక్కటే యిక యెన్నటికీ నాదే – ఇది నా సహాపరాధి చెయ్యి. ఆమె ఆ చేతిని యెత్తి ముద్దుపెట్టుకుంది. అతను ఆమె పక్కన మోకాళ్లమీద వాలేడు. ఆమె ముఖంలోకి చూడ

ప్రయత్నించాడు. కాని ఆమె ముఖం దాచేసుకుని మౌనంగా వుండిపోయింది. ఆఖరికి యెంతో ప్రయాసమీదట ఆమె లేచి అతన్ని తోసేసింది. ఆమె ముఖం యెప్పటి లాగానే మనోహరంగా వుంది. కాని అందువల్ల మరింత దయనీయంగా కనిపించింది.

"అంతా ముగిసింది. నాకు నువ్వు తప్ప యేమీ మిగలలేదు గుర్తుపెట్టుకో" అంది.

"నా ప్రాణం అయినదాన్ని యెలా మరిచిపోతాను? యిలాంటి మహదానందం ఒక్క క్షణమే అయినా..."

"ఆనందమా?" అని అన్నా భీతితో, జుగుప్సతో అరిచింది. ఆ భీతి అతనికే అనుభూతం అయింది. "నీ పుణ్యం వుంటుంది, మరొక్కమాట, ఒక్కమాట కూడ వద్దు" అంది.

గబగబా లేచి అతన్నుంచి దూరంగా వెళ్లిపోయింది.

"మరొక్క మాట కూడ అనవద్దు" అని రెట్టించింది. అతని అవగాహనకందని నిర్విణ్ణ నిరాశ ముఖంలో వెల్లడవుతుండగా, వెళ్లిపోయింది. కొత్త జీవితంలోకి పాదం పెట్టినప్పుడు తనకి కలిగిన లజ్జ, సుఖం, భీతి అనే యీ సమ్మిళితానుభూతిని మాటలలో వ్యక్తం చెయ్యలేకపోయింది, యీ క్షణంలో. కాబట్టి ఆ అనుభూతిని అరకొర మాటలతో వ్యక్తం చేసి పంకిలం చేసి దాన్ని గురించి మాట్లాడాలని అనిపించలేదు. ఆ తర్వాత కూడా, రెండో రోజునా, మూడో రోజునా కూడ తనకి కలిగిన జటిల అనుభూతిని వ్యక్తం చెయ్యడానికి ఆమెకి మాటలు దొరకలేదు. నిజానికి తన ఆత్మ నిండుగా వున్న దాన్ని గురించి అనుకోడానికి కూడ ఆమెకి ఆలోచనలు దొరకలేదు.

'వుహుఁ, యిప్పుడు నేను దాన్ని గురించి అనుకోలేను; తర్వాత నేను మరింత ప్రశాంతంగా వున్నప్పుడు' అని తనలో తను అనుకుంది. కాని ఆలోచించి అవగాహన చేసుకొనే దానికి తగ్గ ప్రశాంతి ఆమెకి యెప్పటికీ రాలేదు. తను యేం చేసింది, తనకి యేం సంభవించబోతుంది, తను యేం చెయ్యాల్సి వుంది అని ఆమె అనుకున్న ప్రతిసారీ ఆమెని విపరీతమైన భీతి ఆవహించి ఆ ఆలోచనలని మనస్సులోనుంచి తరిమేసేది.

'తర్వాత, తర్వాత నేను మరింత ప్రశాంతంగా వున్నప్పుడు' అని అనుకునేది.

కాని కలల్లో, తన వూహలు తన వశంలో లేనప్పుడు ఆమెకి పరిస్థితి మొత్తం జుగుప్సావహమైన నగ్నత్వంతో దర్శనమిచ్చేది. దాదాపు ప్రతిరోజూ రాత్రి ఆమెకి ఒకే కలవచ్చేది. ఆ యిద్దరు మగాళ్లూ తన భర్తలనీ, యిద్దరూ తన పట్ల అనురాగ భరిత లాలనని ప్రదర్శిస్తున్నారనీ ఆమె కలగనేది. అలెక్సేయ్ కరేనిన్ ఆమె చేతిని ముద్దుపెట్టుకుని రోదిస్తూ యిప్పుడంతా సజావుగా వుందని అనేవాడు. అలెక్సేయ్ వ్రాన్‌స్కీ కూడా అక్కడే వున్నాడు. అతనూ తన భర్తే. మరి ఒకప్పుడు యిది అసంభవంగా కనిపించిందని ఆమె ఆశ్చర్యపోయేది. నవ్వి యిప్పుడంతా చాలా సులభతరమైందని, వాళ్లిద్దరూ తృప్తిపడి ఆనందంగా వున్నారని వాళ్లకి చెప్పింది. కాని యీ స్వప్నం ఆమెని పీడకలలాగా అణచివేసేది; ఆమె భయ కంపితురాలైపోయేది. వెంటనే మెలుకువ వచ్చేసేది.

12

మాస్కోనుంచి వచ్చిన కొత్తలో కిట్టీ తనని కాదన్న అవమానం గుర్తుకొచ్చినప్పుడల్లా లేవిన్ కంపించిపోయేవాడు. జేవురించుకుపోయేవాడు. మళ్లీ తనలో తనే అనుకునేవాడు: 'నేను ఫిజిక్సు పరీక్ష తప్పి మళ్లీ చదవవలసి వచ్చినప్పుడు కూడా ఆ జ్ఞాపకం నాకు వణకు పుట్టించేది, జేవురించుకుపోయేవాణ్ణి. నా బ్రతుకు ముగిసిపోయినట్టే అనుకునేవాణ్ణి. మా అక్క నాకు చెప్పిన పని తగలేసినప్పుడు అలాగే నా పని అయిపోయినట్టేనని భావించుకునే వాణ్ణి. కాని జరిగిందేమిటి? – కాలం గడిచింది. నాకు యిప్పుడవి గుర్తుకొస్తే అవి అంతలా నన్ను కుంగదీశాయేమని ఆశ్చర్యం కలుగుతుంది. ఇప్పుడు జరిగేదీ అంతే; యీ సందర్భంలో కూడ కాలం గడుస్తుంది. దీన్ని పట్టించుకోకుండా వుండిపోతాను.'

కాని మూడు నెలలు గడిచాయి. అతను పట్టించుకోకుండా వుండలేదు. ఇప్పుడు దాన్ని గుర్తుచేసుకోవడం మొదట్లో ఉన్నంత బాధగానూ వుంది. అతను ప్రశాంతంగా వుండలేక పోయాడు. తనేమో కుటుంబ జీవితం గురించి యెంతో కాలంగా కలగన్నాడు. దాని కోసం యెంతో సిద్ధపడి వున్నాడు. అయినా యింకా పెళ్లి అవకుండానే వుండిపోయాడు. పెళ్లి ఆడే అవకాశమూ యింకా తక్కువగానే కనిపించింది. తన వయస్సు మగాడు ఒంటరిగా వుండటం మంచిది కాదని తన చుట్టూ వున్న వాళ్లనుకుంటున్నట్టుగానే బాధాకరంగా తనూ గుర్తించాడు. మాస్కోకి వెళ్లేముందు తను నికొలాయ్‌కి యేం చెప్పాడో గుర్తు వచ్చింది. నికొలాయ్ తన పశువులను చూస్తూవుంటాడు. అమాయకుడు. అతనితో మాట్లాడ్డం తనకి సరదాగా వుంటుంది. "నికొలాయ్, పెళ్లి చేసుకోవాలనుకుంటున్నా" అన్నాడు తను. నికొలాయ్ ఆ విషయానికి సంబంధించి అనుమానానికి తావు లేదన్నట్టు వెంటనే జవాబు చెప్పాడు: "ఆఁ, మరి అదునే యిది అయ్యా" అన్నాడు. అదంతా లేవిన్‌కి గుర్తుకొచ్చింది. ఇప్పుడింకా పెళ్లి అవకాశం తక్కువగానే వుంది. హృదయంలో ఖాళీ లేదు. తనకి యెరుకలో వున్న అమ్మాయిలలో యెవరైనా యీ ఖాళీ స్థానంలో వున్నట్టు వూహించుకుందామన్నా అది శుద్ధ నిరర్థకంగా అతనికి తోచేది. పైగా తనని ఆమె కాదనడం, అందులో తన పాత్ర గుర్తుకు వస్తే కలిగే అవమాన భారంతో చిత్రహింస పడిపోయాడు. తన దోషం యేమీ లేదని అతను యెన్ని సార్లు సమాధాన పడదామనుకున్నా, యిదీ, యితర అవమానకరమైన జ్ఞాపకాలలాగా గుర్తుకు వచ్చి అతను వణికిపోయేవాడు, జేవురించుకుపోయేవాడు. గతంలో అతను యితర మనుషులలాగానే తను తప్పు అని గుర్తించిన పనులు చేశాడు. అందుకుగాను అతనికి అంతరాత్మ క్షోభ కలిగి వుండవలసింది. అయినా తప్పు పనుల జ్ఞాపకాలు, అవమాన కరంగా వుండే చిల్లర అనుభవాల జ్ఞాపకాలంతగా అతనిని బాధించలేదు. వాటి గాయాలు యెన్నటికీ మానలేదు. ఆ జ్ఞాపకాల వరసలోనే కిట్టీ తనని తిరస్కరించడం, ఆ రోజు సాయంత్రం యితరుల ముందు తన దీనావస్థ కూడా చేరతాయి. కాని యేమైనా కాలం,

చేతినిండా వున్న పనీ కొంత మెరుగ్గా ప్రభావం కలిగించాయి. పైకి గుర్తింపు వున్నట్లు కనిపించక పోయినా, పెళ్లి జీవితంలోని ముఖ్య సంఘటనల కింద కటువైన స్మృతులు యింకా, యింకా లోతుగా స్థాపితమైపోయాయి. ఒక్కొక్క వారమే గడిచే కొద్దీ అతని మనస్సులో కిట్టీ తలపులు తక్కువ అవుతూవచ్చేయి. ఆమెకి పెళ్లి అయిందనో, లేదా అవబోతుందనో వార్తకోసం తహతహలాడుతూ యెదురు చూశాడు. సలుపు పెట్టే పన్ను పీకేసినట్టుగా ఆ వార్త తనకి ఉపశాంతిని యిస్తుందని ఆశించాడు.

ఈ లోపున వసంత రుతువు వచ్చింది. ఒక్క సారిగా, అందంగా. వస్తున్నట్లు ఆశ కలిగించి మళ్లీ వాగ్దాన భంగం చేసి నిరాశ కలిగించే వసంతం కాదు. చెట్లకీ, పశువులకీ, మనుషులకీ ఒక్కలాగే సంతోషాన్ని ప్రసాదించే అరుదైన వసంతాలలో ఒకటి ఆ వసంతం. మంత్రకవాటం తెరుచుకు వచ్చిన ఆ ముగ్ధ వసంతం లేవిన్‌ని జాగృతం చేసింది. గతాన్ని పరిత్యజించాలన్న అతని సంకల్పాన్ని మరింత దృఢం చేసింది. తన యేకాంత జీవితాన్ని దిటవుగా, స్వతంత్ర పూరితంగా యేర్పాటు చేసుకోవాలన్న ఉద్దేశాన్ని మరింత పటువు చేసింది. మాస్కోనుంచి తిరిగి వచ్చేటప్పుడు యెన్నెన్నో చెయ్యాలని అనుకున్నాడు. వాటిలో అధిక భాగం అమలు జరగకుండానే వుండిపోయాయి. కాని ముఖ్యమైంది, పవిత్ర జీవితం గడపాలన్నది, నిశ్చయంగా జరిగింది. పతనం అయిన ప్రతిసారీ అనుభవించిన లజ్జ, యిప్పుడిక అనుభవించడం లేదు. లోకుల కళ్లల్లోకి నిర్భయంగా చూడగల్గుతున్నాడు. ఫిబ్రవరి నెలలో మాషా అతనికి ఉత్తరం రాసింది: అతని అన్నగారు నికొలాయ్‌కి ఒంట్లో ఏమీ బాగుండటం లేదట. డాక్టర్ల దగ్గరికి ససేమిరా వెళ్లనంటున్నాట్ట. అప్పుడు లేవిన్ మాస్కో వెళ్లాడు. అన్నగార్ని బలవంతం చేసి, ఒప్పించి డాక్టరు దగ్గరికి వెళ్లేటట్టు చేసాడు. ఖనిజ జలంతో నయం కావడం కోసం విదేశాలకి వెళ్లేటట్టు చేశాడు. అంత సునాయాసంగా అన్నగార్ని ఒప్పించ గలిగినందుకు, అతనికి కోపం కలక్కుండా ప్రయాణానికి సొమ్ము అప్పు యిచ్చినందుకూ తృప్తి పడ్డాడు. తన ఎస్టేట్ వ్యవహారాలు నిర్వహించుకుంటున్నాడు. యీ పనికి వసంత రుతువులో ప్రత్యేక శ్రద్ధ అవసరం. చాల యెక్కువగా చదువుతున్నాడు. వీటికి తోడు వ్యవసాయంమీద రాస్తున్న వ్యాసాన్ని కొనసాగించేడు. దాన్ని శీతాకాలంలో రాయడం ప్రారంభించాడు. శీతోష్ణస్థితీ, నేల గుణం అవేవాటి లాగానే వ్యవసాయ కార్మికుని స్వభావాన్ని ముఖ్యాంశంగా స్వీకరించాలనీ, తదనుగుణంగా వ్యవసాయానికి సంబంధించిన సకల శాస్త్రీయ సిద్ధాంతాలనీ శీతోష్ణస్థితి, నేల గుణం అనే దత్తాంశాలనుంచే గాక నేల, శీతోష్ణస్థితి వ్యవసాయ కార్మికుని స్వభావంలోని కొన్ని స్థిర లక్షణాలని బట్టే గ్రహించాలనీ అందులోని ముఖ్య విషయం. అందుచేత ఒంటరితనం వున్నా కూడా, లేదా తత్కారణంగానేనేమో లేవిన్ అతని జీవితం నిండుగా వుంది. ఎప్పుడో అరుదుగా తన మనస్సులో మూగే భావాల్ని అగాఫ్యా మిహైలొవ్నాకి కాకుండా వేరే వాళ్లకి చెప్పుకోవాలని అతనికి తపనగా వుండేది. అతను ఆమెతో ఫిజిక్సు గురించి, వ్యవసాయ సిద్ధాంతాల గురించి ముఖ్యంగా తత్వశాస్త్రం గురించి యెక్కువగా

చర్చిస్తూనే వుండేవాడు. అగాఫ్యా మిహైలొవ్నాకి శత్రుశాస్త్రం అభిమాన విషయం.

వసంతం ఆలస్యంగా గాని విరిసి ముందుకు రాలేదు. లెంట్ చివరి ఆఖరులో** వాతావరణం అంతా తేటగా, చల్లగా వుంది. పగలు యెండకి మంచు కరిగేది. కాని రాత్రిళ్లప్పుడు మైనస్ ఏడు డిగ్రీల సెంటిగ్రేడ్‌కి టెంపరేచరు పడిపోయేది. మంచు దిమ్మెసా అయినట్టు గట్టిపడిపోయేది. దారి వున్నా లేకపోయినా కూడా దానిమీద స్లెడ్జి బళ్లు వెళ్లేవి. ఈస్టరు పండుగ మంచులోనే గడిచింది. ఇంతట్లోకే ఈస్టర్ సోమవారం నాడు వెచ్చని గాలి వీచింది. తుఫాన్ మేఘాలు మునురుకున్నాయి. మూడు పగళ్లూ, మూడు రాత్రుళ్లూ నును వెచ్చగా వుండే వాన కుండపోతగా కురిసింది. గురువారం నాటికి గాలి జోరు తగ్గింది. దట్టమైన బూడిద రంగు పొగమంచు, ప్రకృతిలో జరుగుతున్న పరిణామ రహస్యాన్ని నిగూఢంగా ఉంచడానికా అన్నట్టు నేలమీద వ్యాపించింది. పొగమంచులోనే మంచు కరిగి సెలయేళ్లు పారాయి. నదిమీద పేరుకున్న హిమం విచ్ఛిన్నమైంది. ప్రవాహంమీద తేలి ప్రవహించింది. బుడగలు చిమ్మే బురదనీరు సెలయేళ్లు వేగంగా పారాయి. ఆదివారం సాయంత్రం నాటికి పొగమంచు విడనారంభించింది. దట్టంగా మునురుకున్న ఆకాశం తేటబారి దూదిపింజల్లాంటి మేఘాలు తేలి ఆడేయి. గాలి తేటోపంతమైంది. అసలైన వసంతం తెర తీసింది. ప్రభాత సమయానికి వెచ్చటి యెండ కాసింది. నీటికుంటలమీద పేరుకున్న మంచు కరిగింది. జాగృతమవుతూ వున్న నేలమీదనుంచి లేచే ఆవిరుల భారంతో నును వెచ్చని గాలి కంపించింది. గత యేడు మోసులెత్తే గరికదీ, యీ యేడు యీరికలెత్తే గరికదీ పచ్చదనం పరుచుకుంది. గెల్డర్ రోజ్ మొగ్గలు తొడిగింది, కర్రంట్ పొదలు మొగ్గలు నవ్వాయి, బర్చ్ చెట్లమీదా మొగ్గలు విచ్చాయి. విల్లో గుబురుమీదనుంచి వేలాడే బంగారు పువ్వుల్లో తేనెటీగ ఝంకారం చేసింది. అది శీతాకాలం తేనెపట్టులోనుంచి కొత్తగా బయటకు వచ్చింది. కాని అప్పటికే అన్ని వేపులకీ యెగిరిపోతోంది. యీరికలెత్తే పూదారంగు కంకుల పైనుంచీ మంచు వున్న కోత కోసిన పొలాలమీదనుంచీ కనిపించకుండా యెక్కణ్ణో వున్న భరద్వాజ పిట్టల కూతలు వినవచ్చాయి. పల్లాల్లో బాడవల్లో నిలిచిన వరదనీటి కుంటలమీదనుంచి దూసుకుపోతూ ప్లోవర్ పిట్టలు గీపెట్టాయి. ఆకాశంలో యెత్తులో కొంగలూ, అడవి బాతులూ యెగురుతూ ఉచ్చైస్వరంతో కూతపెట్టాయి. పచ్చిక బీళ్లల్లో పశువులు అంబారవాలు చేస్తున్నాయి. వాటికి పాత జుట్టు వూడిపోకుండా కొత్త జుట్టు పెరుగుతూ వుంది. అది పల్చటి జుట్టు. వంకర కాళ్ల గొర్రె పిల్లలు గీపెడుతూ తల్లుల చుట్టూ తిరుగుతున్నాయి. వాటి కురువ కత్తిరించేశారు. ఎండిపోతూ వున్న దారులమీద చురుగ్గా పిల్లలు పరిగెత్తారు. వాళ్ల దినపాదాల గుర్తులు అక్కడ పడేవి. వారబట్టలు ఉతికే రైతుపడతులు హుషారుగా మాట్లాడుకుంటూ వుండడం చెరువు దగ్గర్నుంచి వినిపించింది. నాగళ్లు, నొల్లలు బాగు చేసుకుంటూ వున్న మగాళ్ల గొడ్డళ్ల చప్పుళ్లు పెరళ్లలోనుంచి వినవచ్చాయి. నిజంగానే వసంత రుతువు వచ్చింది.

13

లేవిన్ యెత్తు బూట్లు తొడుక్కున్నాడు. గొర్రెతోలు కోటు బదులుగా మొదటిసారి వూలు కోటు తొడుక్కున్నాడు. పొలాల్ని చూడ్డానికి బయలుదేరి వెళ్లాడు. ఎండలో కళ్లు మిరుమిట్లు గొలిపేటట్లు పారే సెలయేళ్లపైనుంచి గెంతుకుంటూ, మంచుమీద ఒకోసారి అడుగులేస్తూ, ఒకోసారి అంటుకునే బురదలో అడుగులు వేస్తూ వెళ్లాడు.

పథకాలు వేసుకోవడానికీ, వూహలు వూహించుకోవడానికీ వసంత రుతువు అదును. తన లోపల మొలకెత్తే చిగుళ్లు యేయే దిశల్లో పెరుగుతాయో తెలియని చెట్టులాగా లేవిన్ వున్నాడు. బయటికి వచ్చేడు. కాని తన ప్రియమైన వ్యవసాయం పనిలో ఏమేం చెయ్యాలో వాటి గురించి యింకా సరియైన అభిప్రాయం యేర్పడలేదు. తనకి మహా శ్రేష్ఠమైన పథకాలూ, వూహలూ వున్నాయని మాత్రమే అతనికి తెలుసు. మొదటగా అతను పశువుల్ని చూడ్డానికి వెళ్లాడు. ఆవుల్ని పసిరిక దొడ్డిలోకి వదిలారు. వాటికి అక్కడ యెండలో వెచ్చగా ఉంది. వాటి నున్నటి చర్మాలు ఎండలో అందంగా మెరిశాయి. పచ్చిక పొలాలమీదకి వదల మన్నట్టుగా అవి అంబా అంటున్నాయి. ఆవుల్ని ఆమూలాగ్రం చూసి లేవిన్ ముచ్చటపడ్డాడు. వాటిని పచ్చిక పొలాలమీదకి మేతకోసం వదలమనీ, దూళ్లని దొడ్డిలోకి తోలుకురమ్మనీ పురమాయించాడు. పచ్చిక పొలంలోకి ఆవుల మందని తోలుకెళ్లే పాలేరు హుషారుగా వెళ్లాడు. పశువుల్ని కాసే ఆడవాళ్లు కుచ్చెళ్లు పైకి దోపుకుని, దిసకాళ్లతో తపతపమనే బురదలో దూళ్లని దొడ్డిలోకి తోలుకురావడానికి బెత్తాలు వూపుతూ పరిగెత్తారు. వాళ్ల దిసపాదాలు యెండ పడక యింకా నిస్తేజంగా వున్నాయి. దూడలు వసంతోత్సాహంతో మత్తెక్కివున్నాయి.

ఆ యేడాదే పుట్టిన దూడలు చాలా బాగున్నాయి. లేగదూడలు అప్పటికే రైతుల ఆవులల్లే వున్నాయి. పావా యీనిన దూడకి మూడు నెలలే అయినా యేడాది దూడలా వుంది. వాటిని చూసి లేవిన్ మురిశాడు. దూళ్లకి మేత పెట్టడానికి దొడ్డిలోకి ఉంక కంచెల తొట్టెల్ని పెట్టి, వెనక్కాల గడ్డి వెయ్యమని చెప్పాడు. అయినా శీతాకాలంలో దొడ్డిని వాడక పోవడంవల్ల ఆకురాలుకాలంలో తయారు చేసిన ఉంక కంచె మరమ్మత్తుకి వచ్చిందని తెలిసింది. వడ్రంగం పనివాడి కోసం కబురు చేసాడు. పనివాడు ఆవేళ నూర్పిడి యంత్రం మరమ్మత్తు చేస్తూ వుండి వుండాలి. కాని అతను యంత్రానికి బదులు నాగళ్లని బాగుచేస్తున్నట్టు తెలిసింది. వాటిని లెంట్‌కి ముందే చేసి వుండాల్సింది. లేవిన్‌కి చిరాకు కలిగింది. ఎన్నో యేళ్లుగా తను దేనికోసం తంటాలు పడుతున్నాడో ఆ క్రమ పద్ధతి రావడం లేదు. అందుచేత అతనికి చిరాకేసింది. శీతాకాలంలో వాడకుండా వున్న కంచె చట్రాల్ని బళ్ల గుర్రాలశాలలో లాటు పడేశారని తర్వాత అతనికి తెలిసింది. దూడల కోసమని చేయించినవి. అవి విరిగిపోయాయి, అవుకుగా ఉండబట్టి. నాగళ్ల,బళ్లల్ని, యితర వ్యావసాయిక పనిముట్లని సరిగా వున్నాయో లేదో చూసి శీతాకాలంలోనే బాగుచెయ్యమని అతను చెప్పాడు. అందుగ్గాను ముగ్గురు వడ్రంగుల్ని

పెట్టాడు. అయినా వాటిని బాగు చెయ్యలేదు. తీరా యిప్పుడు చూస్తే, పొలంలో పనికి అవి అవసరం అయిన యీ తరుణంలో నాగళ్ళని బాగుచేస్తున్నారు. లేవిన్ నిగామాను కోసం కబురుపెట్టాడు. కాని ఉండబట్టలేక తనే అతని కోసం బయలుదేరాడు. నూర్పిడి కళ్లం నుంచి నిగామాను వస్తూవున్నాడు. లేవిన్ దారిలో అతన్ని కలుసుకున్నాడు. నిగామాను అందంగా కుట్టిన గొర్రె బొచ్చు కోటు తొడుక్కున్నాడు. వేళ్లతో గడ్డిపరకలు తుంపుతున్నాడు. అతని ముఖం ఉల్లాసంగా వుంది, ఆ రోజున అందరూ వున్నట్టుగా.

"వ్రడంగివాడు నూర్పిడి యంత్రం పని చెయ్యలేదేం?"

"ఆ సంగతే మీకు నిన్న చెప్దామనుకున్నాను. నాగళ్ళని బాగుచెయ్యాల్సి వుంది. నేల దుక్కి చెయ్యాల్సిన అదునైంది."

"శీతాకాలం అంతా యేం చేశారని?"

"మీకు వ్రడంగం వాళ్లతో పనేమిటి లెండి?"

"దొడ్డికి కంచె చట్రాలేవి?"

"వాటిని అమర్చమని పురమాయించాను. కాని యిలాంటి మనుషుల వల్ల యేమవుతుం దండి" అన్నాడు అతను, అయ్యో ఖర్మ అన్నట్టు చెయ్యి ఆడిస్తూ.

"అలాంటి మనుషులవల్ల కాదు, యిలాంటి నిగామానువల్ల" అని లేవిన్ కోపంతో మండిపడ్డాడు. "తమర్ని యెందుకు పనిలో పెట్టుకున్నట్టు?" అని అరిచాడు. కాని కోప్పడిం దానివల్ల యేమీ ఒరగదని గుర్తువచ్చింది. తమాయించుకుని చిన్నగా నిట్టూర్చాడు. "వూఁ, విత్తులు చల్లవచ్చా?" అని కాసేపాగాక అడిగాడు.

"రేపు గాని, యెల్లుండి గాని తూర్కిన్ అవతల వున్న భూముల్లో చల్లుతాం."

"క్లోవర్ గడ్డి విషయం యేమిటి?"

"వసీలియ్‌ని, మీష్కాని పంపేను. వాళ్లు చూస్తున్నారా పని. కాని చెయ్యగలరో లేదో తెలియదు, నేలంతా బురదగా వుంది."

"ఎన్ని దెస్యాతీన్లు?"

"ఆరు."

"ఆరే యెందుకని?" లేవిన్ గంయ్‌మన్నాడు.

ఇరవై దెస్యాతీన్లు కాకుండా ఆరు దెస్యాతీన్ల క్లోవర్ని వూడ్చడం యింకా చిర్రెత్తిం చింది. క్లోవర్ గడ్డిని ముందే వూడ్చాలి అని సిద్ధాంతమూ వుంది, లేవిన్‌కి అనుభవమూ వుంది. మంచు కరగకముందే చెయ్యాలా పని కాని యెప్పుడూ అనుకున్నట్టు జరగడం లేదు.

"మనుషుల్లేరు. యిలాంటి మనుషులతో పనవుతుందా? ముగ్గురు మనుషులు పనికే రాలేదు. యిప్పుడు సెమ్యోన్..."

"కప్పమీద గడ్డివేసే వాళ్లల్లోనుంచి కొంతమందిని తీసికెళ్లి వుండాల్సింది."

"అలాగే చేశాను."

"మరి యేరి వాళ్లంతా?"

"అయిదుగురు కంపోత్[1] (అంటే అతని ఉద్దేశం కంపోస్ట్ అని) చేస్తున్నారు. నలుగురు ఓట్లు తిరగేసేవాళ్లు లేకపోతే రంగు మారిపోయే ప్రమాదం వుందండి."

"రంగు మారిపోయే ప్రమాదం వుంది" అంటే యేమిటో లేవిన్‌కి చాలా బాగా తెలుసు, బూజు పడతాయని. ఇంగ్లీషు విత్తనాల ఓట్ గింజలన్నీ అప్పటికే పాడయిపోయాయి — తను చెప్పినట్టు చెయ్యకపోవడంవల్ల.

"కాని లెంట్‌కి ముందే చెప్పి వచ్చాను పైపుల్లో గాలి పంపిం..." అని చింపుకున్నాడు.

"మరేం బెంగపడకండి. ప్రతీదీ దాని అదునులో జరుగుతుంది."

లేవిన్ కోపంతో చెయ్యి వూపి గాదెల దగ్గరకు వెళ్లాడు. ఓట్లు ఎలా వున్నాయో చూసి అక్కడనుంచి గుర్రాలశాల దగ్గరకు వచ్చాడు. ఓట్లు యింకా బాగానే వున్నాయి. కాని పని వాళ్లు పారలతో తిరగదోడుతున్నారు, వూరికే పైనుంచి కింది గాదెల్లోకి పోసెయ్యకుండా. అలా చెయ్యమని వాళ్లకి పురమాయించి, వాళ్లల్లోనుంచి యిద్దరు మనుష్యుల్ని తీసి క్లోవర్ గడ్డి వాళ్లకి సాయం కోసం పంపేడు. అప్పటికి నిగామానువల్ల కలిగిన చిరాకు తగ్గింది. అంత ఆహ్లాదకరంగా వున్న అలాంటి రోజున యెక్కువ సేపు కోపంగా యెవళ్లూ ఉండలేరు.

"ఇగ్నాత్!" అని పిలిచేడు. ఆ మనిషి చొక్కా చేతులుపైకి మడిచి నూతి దగ్గర బండి కడుగుతున్నాడు. "గుర్రం కట్టించు" అని చెప్పాడు.

"ఏ గుర్రం అయ్యా?"

"ఏదైనా పరవాలేదు. కోల్పిక్ చాలు."

"అలాగేనయ్యా."

గుర్రానికి జీను వేస్తూ వుండగా నిగామాను అక్కడే తచ్చాడుతూ వుండడం చూసేడు లేవిన్. అతన్ని పిలిచాడు, అతనితో సర్దుబాటు చేసుకున్నట్టవుతుందని. వసంత ఋతువులో వాళ్లు చెయ్యాల్సిన పనుల గురించి, కొత్త పథకాల గురించి అతనితో మాట్లాడేడు.

పొలాలకి యెరువులు వెయ్యడం తొందరగా మొదలెట్టాలి. అలా అయితే తొలి గడ్డి కోసేనాటికే అంతా సజావుగా పూర్తవుతుంది. దూరంలో వున్న పొలాన్ని పని ఆపకుండా దుక్కి చేసి వుంచెయ్యాలి. గడ్డిమేట్లు పనంతా జీతానికే అవాలిగాని, గుత్త పంపకాలపతుగా కాదు.

నిగామాను శ్రద్ధగా విన్నాడు. యజమాని చెప్పేదాంతో పూర్తిగా యేకీభవిస్తున్నట్టే విన్నాడు. అయినా కూడా మునురు మూతి పెట్టుకుని, యెందుకొచ్చిందిరా భగవంతుడా అన్నట్టు ముఖం పెట్టుకునే వున్నాడు. ఆ వాలకం లేవిన్‌కి బాగా తెలుసు. యీ పథకాలన్నీ రైటే, కాని పని దైవసంకల్పం ప్రకారం జరుగుతుంది అనే వాలకం అది.

---

[1] కంపోత్ — ఎండ బెట్టిన పళ్లరసం (రష్యన్). కంపోస్ట్ అంటే యెరువు.

ఆ ధోరణి లేవిన్‌కి దిగాలుగా వుంటుంది. అయినా అతను పనిలో పెట్టుకున్న విగామాను అందరూ అదే తీరులోనే వున్నారు. అందరూ అతని పథకాలను సరిగ్గా అలానే చూశారు. అందుకని అతనికి కోపం కంటే యెక్కువ దిగాలుగా వుండేది. అతను ఈ ప్రాకృతిక శక్తిగా కనిపించిన దాంతో పోరాడాలనే మరీ ఉత్తేజంతో వున్నాడు. అది యెప్పుడూ అతన్ని ప్రతిఘటిస్తూనే వుంది. 'దైవసంకల్పం ప్రకారం జరుగుతుంది' అని తప్ప దానికి పెట్టడానికి అతనికి వేరే పేరు దొరకలేదు.

''యెంత చెయ్యగలమో చూద్దాం లేవిన్‌గారూ'' అన్నాడు విగామాను.

''యెందుకు చెయ్యలేం?''

''మరో పదిహేను మందిని పనిలో పెట్టుకోవాలి మనం. కాని చూశారూ, పనివాళ్ళు రారు. ఇవాళ కొంతమంది వచ్చేరు. వేసవికి డబ్బై రూబుళ్ళు అడిగారు.''

లేవిన్ యేం మాట్లాడలేదు. మళ్లీ అదే బలీయమైన శక్తి ముందు నుంచుంది. ఆ కూలీకి ముప్పై యేడు, ముప్పై ఎనిమిది తప్పితే నలభై మందిని పనిలో పెట్టుకో లేమని అతనికి తెలుసు. ఆ, మహా అయితే నలభై మంది. అంతకంటే యెక్కువ రారు. అయినా లేవిన్ లొంగిపోదల్చుకోలేదు.

''పై వూళ్లకి పంపించండి సూరికో లేకపోతే చెఫిరొవ్కాకో. మనుషులు రాకపోతే మనం వాళ్లకోసం వలేసి పట్టుకోవాలి.''

''పంపడానికైతే పంపిస్తాను'' అన్నాడతను ముడుచుకుని. ''గుర్రాలున్నాయి, వాటికే శక్తి లేదు'' అన్నాడు.

''మరి కొన్నిటిని కొందాం. నాకు తెలీదా యీ సంగతి!'' అన్నాడు లేవిన్ నవ్వుతూ. మీ యిష్టం వచ్చినట్టు యెంత తక్కువకి వీలైతే అంత తక్కువకీ, అంత చెడ్డవి కొంటున్నారు. యీ యేడాది అంతా స్వయంగా నేనే చూసుకుంటాను.''

''మీకు సరిగా నిద్రవుండదు. మాకైతే ఫరవాలేదు యజమాని అజమాయిషీ కింద పనిచెయ్యడం.''

''బర్చ్ లోయ అవతల క్లోవర్ గడ్డి నాటుతున్నారు కదా? అక్కడికెళ్లి చూసి వస్తాను'' అన్నాడు లేవిన్ కోల్పిక్ యెక్కుతూ. ఆ చిన్న గుర్రాన్ని ఫైను అతని దగ్గరికి తీసుకొచ్చేడు. నల్లటి జూలు, వీపుమీద నల్లని చారిక వున్న లేతరంగు గుర్రం అది.

''పెలయేరు దాటలేరండి'' అని ఫైను వెనకనుంచి అరిచాడు.

''అడివి గుండా వెడతాను.''

లేవిన్ పెరటి బందలోనుంచి గేటు దాటించి పొలాల్లోకి దాన్ని తోలేడు. శాలలో చాల రోజులు కట్టిపడేసిందానివల్ల విసుగొచ్చేసిందా గుర్రానికి. అది యిప్పుడు కుంటల్ని చూసి బుస కొడుతూ, కళ్లెం గుంజుతూ చురుకుగా పోయింది.

లేవిన్‌కి పశువులశాలలోనూ, గాదెల దగ్గరా సంతోషం కలిగితే, పొలాల్లో యింకా

చాలా ఉత్సాహంగా అనిపించింది. చిన్న గుర్రంమీద స్వారీ చేస్తూ నియబద్ధంగా పూగుతూ, లేవిన్ అడవిలోని గాలినీ, మంచు తాజా వాసననీ గాఢంగా ఆస్వాదించేడు. అక్కడక్కడ మంచు కరుగుతున్న జాడలున్నాయి. చెట్ల కాండాలమీద పచ్చగా విరుస్తున్న నాచునీ, కొమ్మలమీద మోసులెత్తుతూవున్న మొగ్గల్నీ చూసి, అతని హృదయం పులకించింది. చెట్ల గుబురులోనుంచి యివతలికి రాగానే యెటు చూసినా యీసులెత్తే ధాన్యం పొలం అకుపచ్చటి ముఖమల్ తివాసీ పరిచినట్టు వుంది. చెదురుమదురుగా కరుగుతూ వున్న మంచు కన్పించడం తప్పిస్తే, మిగిలినదంతా కన్నుల పండువుగా వుంది. రెండు రైతు గుర్రాలు పొలంలో తొక్కుతూ వున్నా అతనికి కోపం రాలేదు. (ఎదురుగా వెడుతూ వున్న ఏ రైతుతో ఆ గుర్రాల్ని తోలెయ్యమని చెప్పాడు.) అతను మరో రైతుని చూసి "పూ, నాట్ల సమయం అయిందా ఇపాత్?" అని అడిగిన దానికి "మొదట దుక్కి చెయ్యాలి దొరా" అని ఆ రైతు తెలివితక్కువగా, వెక్కిరింతగా చెప్పిన జవాబుక్కూడా కోపం రాలేదు. అతను ముందుకి వెళ్లేకొద్దీ అతని మనస్సు తేలిక పడింది. తన ఎస్టేట్‌ని మెరుగుపరిచే పథకాలు ఒకదాని తర్వాత ఒకటి అతని ముందు ప్రత్యక్షం అయేయి. అతనికి తట్టిన ప్రతి కొత్త వూహా ముందరి దానికంటే మెరుగ్గా వుంది. పొలంగట్లమీద చెట్లు వేయించాలి. మంచు అక్కడ ఎక్కువ నిలవదు. పొలాలని విభజించాలి ఆరింట్లో యెరువులు వేసి నాట్లకి సిద్ధం చెయ్యాలి. మూడు క్లోవర్ గడ్డి కోసం పెట్టెయ్యాలి. ఓ పొలానికి చివర పశువుల దొడ్డిని కట్టించాలి. ఓ చెరువుని తవ్వించాలి. ఎరువు పోగుచెయ్యడానికి వీలుగా ఉంకన పశువుల శాలలు కట్టించాలి. మూడువందల దెస్యాతీన్లలో గోధుమ, వంద దెస్యాతీన్లలో బంగాళాదుంప, ఒకటిన్నర వంద దెస్యాతీన్లలో క్లోవర్ గడ్డి వేయించాలి. అప్పుడు ఒక దెస్యాతీను కూడ వృధా పోదు, నష్టం రాదు.

మనస్సంతా అలాంటి ఆలోచనలతో నిండిపోగా అతను జాగ్రత్తగా గుర్రాన్ని యీరిక లేత్తే గోధుమని తొక్కకుండా వారనే నడిపించుకుంటూ క్లోవర్ గడ్డి విత్తులు చల్లుతూ వున్న పనివాళ్ల దగ్గరికి వెళ్లాడు. గడ్డినారు విత్తనాల బండి వారని కాకుండా, సరిగ్గా పొలంలోనే వుంది. తాలి శీతకట్టు గోధుమ* బండి చక్రాల కింద గుర్రం గిట్టలకింద నలిగిపోయింది. పని వాళ్లిద్దరూ వారన మంచున్నారు. బహుశా ఒకళ్ల తర్వాత ఒకళ్లు పైపు తీసుకొని కాల్చుకుంటున్నారేమో. విత్తనాలు చల్లిన మట్టిని బాగా పదును చెయ్యలేదు. మట్టి దట్టంగా వేసి వుంది, లేదా ముద్దలు ముద్దలుగా గడ్డకట్టేనా వుంది. యజమానిని చూసి వసీలియ్ బండి దగ్గరకు వెళ్లాడు. మిాన్క చల్లడం మొదలుపెట్టాడు. అది చిరాకు తెప్పిస్తుంది. కాని లేవిన్ పనివాళ్లమీద యెప్పుడో గాని కోప్పడదు. వసీలియ్ బండి దగ్గరికి వెళ్లగానే గుర్రాన్ని వారకి తీసుకెళ్లమని లేవిన్ చెప్పాడు.

"ఫరవాలేదండి, గోధుమ మళ్లీ చిగురిస్తుంది" అన్నాడు వసీలియ్.

"వాతో వాదించకు. చెప్పినట్టు చెయ్యి" అన్నాడు లేవిన్.

"చిత్తం" అన్నాడు వసీలియ్. గుర్రం కళ్లెం పట్టుకున్నాడు. "మంచి విత్తనాలండయ్యా"

అన్నాడు యజమానికి ఉత్సాహం కలిగించాలని. "ఒకటో రకం. నడవడం మాత్రం కష్టంగా వుంది. ముద్దలు ముద్దలు మట్టి అంటుకుపోతోంది కాళ్లకి" అన్నాడు.

"మట్టిని పదును చెయ్యలేదేం?" అన్నాడు లేవిన్.

"చేత్తో నలుపుతున్నాం" అన్నాడు వసీలియ్. ఓ మట్టి ముద్దని యెత్తి చేత్తో నలిపాడు.

ముద్దలు ముద్దలుగా మట్టి వుండడం వసీలియ్ తప్పు కాదు. అయినా గానీ లేవిన్‌కి చిరాకు కలిగించింది.

అలాంటి సందర్భాలలో తనని సంబాళించుకుని వున్నంతలోనే మేలు చూపే ఉత్తమమైన పద్ధతి లేవిన్‌కి తెలుసు. తనిప్పుడు ఆ పనే చేశాడు. మిష్కా కాళ్లకి పెద్ద పెద్ద మట్టి పెళ్లలు అంటుకుంటే యీడ్చుకుంటూ పొలంలో తిరగడం కాసేపు చూశాడు. తర్వాత గుర్రం దిగి, వసీలియ్ దగ్గరనుంచి విత్తనాల బుట్ట తీసికొని చల్లడం మొదలుపెట్టాడు.

"యెక్కడ ఆపేరు?"

వసీలియ్ కాలితో ఆ చోటు చూపించేడు. లేవిన్ తనకి చేతనైనంత బాగా విత్తనాలు చల్లడం మొదలుపెట్టాడు. ఫూదిలో నడవడం అంత కష్టంగా వుంది యిక్కడ. ఒక చాలు కడవరకు వెళ్లేటప్పటికి లేవిన్‌కి చెమటలు పట్టేశాయి. ఇక వదిలేసి బుట్టని వసీలియ్‌కి యిచ్చేసాడు.

"యీ చాలు బాగా వుండకపోతే వేసవిలో నన్ను తిట్టకండయ్యా" అన్నాడు వసీలియ్.

"నిన్నెందుకు తిడతాను?" అన్నాడు లెవిన్ హుషారుగా. తను అనుసరించే పద్ధతి ఫలవంతంగా వుందని అనిపించింది.

"వేసవిలో చూడండి. అది తేడాగా వుంటుంది. కిందటి వసంత ఋతువులో నేను చల్లిన చోటు చూడండి. తీర్చిదిద్దినట్టుంది. మీరు నా కన్న తండ్రి అయినా యింతకంటే బాగా చేసి వుండనండయ్యా. నాకు వేలెత్తి చూపించే పని చెయ్యడం నచ్చదు. ఇతరులు చేస్తే సహించను. యజమాని మేలే మా మేలు. ఒక్కసారి యిటు చూడండయ్యా" అన్నాడు వసీలియ్ పొలంకేసి చూపిస్తూ. "మనస్సు నిండిపోతుంది, ఆఁ" అన్నాడు.

"భేష్యైన వసంతం, వసీలియ్."

"ముసలోళ్లకి కూడా యిలాంటి వసంతం గుర్తులేదంట. నేను మా వూరు వెళ్లాను. మా ముసలాయన అరదెస్యాతీను పొలంలో గోధుమ చల్లాడండి. రై లాగ దివ్యంగా వస్తుందట అన్నాడు."

"మీరు చాల యేళ్లుగా గోధుమ చల్లుతున్నారా యేమిటి?"

"రెండేళ్ల కితం మీరు చెప్పారు కదా, అలాగే. తమరే రెండు పూడ్ల విత్తనాలని యిచ్చేరు. నాల్గోవంతు అమ్మేసాం. మిగతాది చల్లేం."

"చూడు, ఆ మట్టి గడ్డల్ని చిదుపు" అని చెప్పాడు లేవిన్ గుర్రం దగ్గరికి వెడుతూ.

"మాష్కోని వో కంట చూస్తూవుండు. దుబ్బు బాగా వుంటే దెస్యాటిన్‌కి యాభై కోపెక్కులు అదనంగా ముడుతుంది నీకు" అన్నాడు.

"ఆ మాట చాలయ్యా, యిప్పటికే తమకి రుణపడి వున్నాం."

లేవిన్ మళ్లీ గుర్రం యెక్కేడు. ముందుటేడు క్లోవర్ గడ్డి నాటిన పొలం దగ్గరికి వెళ్లేడు. తర్వాత యిటీవలే వసంతరుతు గోధుమ చల్లడానికి దున్నిన పొలం దగ్గరికి వెళ్లేడు.

కోత పొలంలో క్లోవర్ గడ్డి చూడ్డానికి దివ్యంగా ఉంది. కిందటేడాది కోసిన పంట మొదళ్లమీద లేచి పచ్చగా వుంది. గుర్రం చీలమండలు దిగబడేటట్టు బురదలో కూరుకుంటోంది. బురదలోనుంచి గిట్ట యెత్తగానే చిటచిటలాడే చప్పుడు వినిపించింది. నిజానికి పాపం ఆ గుర్రం దున్నిన పొలంలో నడవలేకపోయింది. బొర్లల్లో మోకాళ్ల దాకా కూరుకుపోతోంది. అక్కడా, అక్కడా గడ్డ కట్టిన భాగాల మీదనే పోగలిగింది. కాని చాళ్ళు బాగా దున్నేరు. ఇంకో రెండు రోజుల్లో వాళ్ల అవుతుంది. చల్లడం అవుతుంది. అంతా భేషుగ్గా వుంది. ఉత్సాహకరంగా వుంది. లేవిన్ సెలయేటి దారిన తిరిగి వచ్చేడు. మెరక పట్టి వుంటుందనుకున్నాడు. అలానే వుంది. సునాయాసంగా దాటేడు. దాటుతూ వుంటే రెండు అడవి బాతులు బెదిరి లేచాయి. స్నైప్ పిట్టలు కూడా వున్నాయేమోననుకున్నాడు. దారిలో కలిసిన అడవి కావలామనిషి వున్నాయని చెప్పాడు.

లేవిన్ దారు తీయిస్తూ యింటికి వెళ్లేడు. భోజనం చేసి, సాయంత్రం వేళకి తుపాకీ శుభ్రం చేసుకొనే వ్యవధి వుంటుందనుకున్నాడు.

14

హుషారుగా యింటికి చేరుతూ వుండగా స్లెడ్జి బండి గంటలు వినిపించాయి. సింహద్వారం వేపునుంచి వచ్చిందా గంటల చప్పుడు.

'రైల్వేదారి, అటు వేపే. మాస్కోనుంచి రైలు వచ్చే వేళ యిది' అనుకున్నాడు. 'ఎవరై వుంటారు? నికొలాయ్ అన్నయ్య వచ్చాడేమో! క్షయ జబ్బు కోసం విదేశాలకి వెడతానేమో లేదా యిక్కడికి వస్తాను అని అన్నాడు' అనుకున్నాడు. తన అన్నగారైతే తనకి కలిగిన వసంతోత్సాహం చెడిపోతుందేమోనని మొదట లేవిన్ భయపడ్డాడు. మరు క్షణంలోనే సిగ్గు కలిగింది అలా అనిపించినందుకు. తక్షణం తన హృదయద్వారాలు తెరిచి అన్నగారి కోసం ఆరాటపడ్డాడు. అతనే అయివుండాలని మనసా కోరుకున్నాడు. గుర్రాన్ని వురిగొల్పేడు. అకేషియా పొదలు దాటగానే రైల్వేస్టేషన్ వైపునుంచి మూడు గుర్రాల అద్దె బండి రావడం కనిపించింది. ఎవరో ఫర్‌కోటు తొడుక్కున్నాయన అందులో వున్నాడు. అతను అన్నగారు కాదు. 'ఎవరైనా మంచివారైతే బాగుణ్ను, మాటాపలుకూ ఆడుకోవడానికి వుంటుంది' అనుకున్నాడు.

''ఒహ్!'' అని అరిచాడు అబ్లాన్‌స్కీని గుర్తుపట్టి సంతోషంతో రెండు చేతులూ పైకి యెత్తి. ''నీ నెత్తిమీద పాలుపొయ్యాలి. అబ్బ! యెంత సంతోషంగా వుంది నువ్వు రావడం!'' అన్నాడు.

'ఆమెకి పెళ్లయిందా లేకపోతే యెప్పుడవుతుందీ అన్నీ వివరంగా తెలుస్తా యివ్వాడు' అనుకున్నాడు.

అంత ఆనందంగా వున్న ఆ వసంత దినాన ఆమె గుర్తు రావడం తనకి బాధ కలిగించ లేదని గమనించాడు.

''హేయ్, అసలు అనుకుని వుండవుకదూ!'' అన్నాడు అబ్లాన్‌స్కీ స్లెడ్జి దిగుతూ. అతని ముక్కు, బుగ్గలు, కనుబొమలు బురద కొట్టుకుపోయి వున్నాయి. అయినా ముఖంలో దీప్తి, ఆనందం తొణికిసలాడుతున్నాయి. ''మొదటగా నిన్ను చూద్దామని వచ్చేను'' అన్నాడు లేవిన్‌ని కాగలించుకుని ముద్దుపెట్టుకుంటూ. ''రెండవది కాస్తంత వేటకి వెళ్లవచ్చని. మూడవది యెర్గుషోవొలో కలప అమ్మాలని'' అంటూ చెప్పేడు.

''భేష్! యెల్లాంటి వసంతం! అం! స్లెడ్జిలో యెలా చేరావిక్కడికి?''

''బండిలో యింకా అధ్వాన్నం, లేవిన్‌గారూ'' అన్నాడు స్లెడ్జి తోలేవాడు. అతనికి లేవిన్ తెలుసు.

''బాగుంది, నాకింతకంటే సంతోషం వుండదు'' అన్నాడు లేవిన్ మనస్ఫూర్తిగా. చిన్న పిల్లాడిలా యికిలించాడు.

లేవిన్ తన మిత్రుణ్ణి గెస్ట్‌రూమ్‌కి తీసికెళ్లాడు. అతని వస్తువుల్ని అక్కడికి తెప్పించాడు. ఓ తోలుపెట్టె, ఓ గన్ కేస్, చుట్టయున్న చిన్న పంచి. అబ్లాన్‌స్కీని ముఖం కడుక్కుని బట్టలు మార్చుకొమ్మని చెప్పి, లేవిన్ దున్నడం గురించీ, క్లోవర్ గడ్డి గురించీ మాట్లాడ్డానికి ఆఫీసు గదికి వెళ్లాడు. యింటి గౌరవం కాపాడాలని యెప్పుడూ తపనపడే అగాఫ్యా మిహైలొవ్నా అతన్ని మధ్యలో కలుసుకుని భోజనాల యేర్పాట్లు యేం చేయమంటారని అడిగింది.

''మీ యిష్టం వచ్చింది చెయ్యండి. కాని త్వరగా మాత్రం కావాలి'' అని నిగామానుతో మాట్లాడ్డానికి వెళ్లాడు.

తిరిగి వచ్చేవేళకి అబ్లాన్‌స్కీ శుభ్రంగా ముస్తాబై తన గదిలోనుండి యివతలకి వొస్తున్నాడు. చిరునవ్వు వెలిగిపోతోంది. ఇద్దరూ కలిసి మేడమీదికి వెళ్లారు.

''ఇక్కడికి వచ్చినందుకు నాకెంత సంతోషంగా వుందో. నువ్విక్కడ యే యే రహస్య వ్యవహారాలు జరిపిస్తున్నావో చూస్తానిప్పుడు. నిజం చెప్పనా, నువ్వంటే నాకు యీర్ష్యగా వుంది. ఏం చక్కని యిల్లు, ఎంత ఉల్లాసంగా వుంది!'' అన్నాడు అబ్లాన్‌స్కీ సర్వదా వసంత ఋతువే ఉండదనీ, అన్ని రోజులూ ఇవాళ అంత ఉజ్జ్వలంగా వుండవనీ మరిచిపోయి. ''మీ ఆయా యెంత ప్రేమాస్పదురాలు. లోటల్లా గంజిపెట్టిన ఆప్రన్ కట్టుకున్న పనిపిల్ల

లేకపోవడమే. అయినా నీ సన్యాసి బతుక్కీ, నిష్ఠాగరిష్ఠమైన అలవాట్లకీ యిలాంటి ఆవిడే మేలులే" అన్నాడు.

అబ్లానోవ్‌స్కీ అతనికి చాల ఆసక్తికరమైన వార్తలు చెప్పాడు. లేవిన్‌కి మహా ఆసక్తి కారకమైంది అతని మారుటి అన్నగారు కోజ్నిషెవ్ ఆ వేసవిలో తమ్ముణ్ణి చూడ్డానికి పల్లెకి రావాలని అనుకుంటున్నాట్ట.

వాళ్ళావిడ అడిగినట్టు చెప్పమందని తప్పిస్తే కిట్టీని గురించి గాని షేర్‌బాత్‌స్కీల గురించి కాని ఒక్కముక్క కూడా అతను చెప్పలేదు. లేవిన్ అతని నేర్పుని మెచ్చుకున్నాడు. అతనిలాంటి వాడు తనకి అతిథిగా రావటం మహా సంతోషంగా అనిపించింది. ఎప్పుడూ వున్నట్టుగా అతని వొంటరి జీవితం అతనిలో పుంఖానుపుంఖంగా ఆలోచనల్నీ, అనుభూతుల్నీ రేపుతుంది. కాని తన చుట్టూవున్న వాళ్ళకి వాటిని చెప్పుకోలేదు. యిప్పుడు వసంత ఋతువు వల్ల తనకి కలిగిన కవితా పారవశ్యాన్నంతటినీ అబ్లానోవ్‌స్కీకి చెప్పాడు. వ్యవసాయానికి సంబంధించి తన విరుద్ధాశాల్నీ, తను వేసుకున్న ప్రణాళికల్నీ అబ్లానోవ్‌స్కీకి వెళ్ళబోసుకున్నాడు. తను చదివిన పుస్తకాల గురించి తన అభిప్రాయాలు, వ్యాఖ్యలూ చెప్పుకున్నాడు. అన్నిటినీ మించి తను రాస్తూవున్న సిద్ధాంత వ్యాసం గురించి వెల్లడించాడు, తనకిగా తనకే తెలియక పోయినా అందులోని మౌలిక భావం అంతకు ముందుగానే వ్యవసాయంమీద రాసిన అన్నింటిమీదా విమర్శ. అందిస్తే, అల్లుకుపోయే చక్కని గ్రహణశక్తి వున్న అబ్లానోవ్‌స్కీ యిప్పుడు ముఖ్యంగా ముచ్చటగా వున్నాడు. అతనికి తనపట్ల ఆదరపూర్వక గౌరవం వున్నట్టు లేవిన్ కనిపెట్టాడు. అది అతనికి తృప్తిగా కనిపించింది.

అగాఫ్యా మిహైలొవ్నా, వంటమనిషీ కలిసి దివ్యమైన విందుకోసం చేసిన ప్రయత్నాలవల్ల ఆఖరికి ఆకలితో నకనకలాడే మిత్రులిద్దరికీ వడ్డన కోసం నిరీక్షించడంలో అలగా రొట్టె ముక్కలమీద వెన్న రాసుకుని మెక్కడం, ఉప్పు వేసిన పుట్టగొడుగులు, తంపట వేసిన పిట్టలు నంజుకోవడం సరిపోయింది. మాంసం బూరెలు లేకపోయినా సూప్‌ని ముందు వడ్డించండని లేవిన్ ఆడగాల్సి వచ్చింది. వంటమనిషి మాంసం బూరెలతో అతిథికి ఆశ్చర్యం కలిగించాలనుకున్నాడు. అబ్లానోవ్‌స్కీకి వేరే వంటకాలు యిష్టం అయినా, యీ తిండి భేషుగ్గా వుందని మెచ్చుకున్నాడు. వనమూలికల సుగంధం చేర్చిన వోద్కా, యింట్లో తయారుచేసిన రొట్టె, వెన్న, ప్రత్యేకం తంపట వేసిన పిట్ట, ఉప్పు వేసిన పుట్టగొడుగులు, నెట్టిల్ సూప్, తెల్లని సాస్‌తో కోడి, తెల్లని క్రైమియన్ వైన్ – అన్నీ వొద్దు పెట్టడానికి లేకుండా వున్నాయి, దివ్యంగా వున్నాయి.

"దివ్యంగా వుంది, దివ్యంగా వుంది" అన్నాడతను కోడి వేపుడు తిన్నాక సిగరెట్ ముట్టించుకుంటూ. "మహా సముద్రపు అలల తాకిడికి నలిగిపోయిన తర్వాత ప్రశాంతమైన తీరంమీదకి దిగడంలాగా వుంది. వూఁ, అయితే, నువ్వొదన్న మాట శ్రామికుణ్ణి వొక అంశంగా ముఖ్యంగా అధ్యయనం చెయ్యాలనీ, వ్యావసాయిక పద్ధతులను యెంపిక చేసుకోవడానికి యీ అంశం

ప్రముఖంగా వుండాలనీ అంటావు. నాకలాంటి విషయం గురించిన పరిజ్ఞానం లేదు కాని, యే సిద్ధాంతమైనా దాన్ని అమలు పరచడంవల్ల శ్రామికుడిమీద ప్రభావం కలిగించి తీరాలని నాకు అనిపిస్తుంది."

"ఆగు మరీ, నేను రాజకీయ అర్థశాస్త్రం గురించి మాట్లాడ్డం లేదు. నేను వ్యావసాయిక విజ్ఞానం గురించి మాట్లాడుతున్నాను. ప్రకృతి శాస్త్రం మాదిరిగానే యిదీ వుండాలి. దత్తాంశాలని పరిగణనలోకి తీసుకోవాలి. కార్మికుణ్ణి కలుసుకుని అతని ఆర్థిక, జాతివర..."

సరిగ్గా ఆ సమయంలో అగాఫ్యా మిహైలొవ్నా జామ్ జాడీ తీసుకు వచ్చింది.

"ఆ, అగాఫ్యా మిహైలొవ్నా" అన్నాడు అబ్లాన్‌స్కీ బొద్దుగా వున్న తన వేళ్ల అంచుల్ని ముద్దుపెట్టుకుంటూ. "యేం తంపట వేసిన పిట్ట, యేం వోద్క! సరేగాని టైమవలేదూ?" అన్నాడు లేవిన్‌కేసి తిరిగి.

లేవిన్ కిటికీలోనుంచి బయటికి సూర్యుడికేసి చూశాడు. సూర్య బింబం బోసిగా వున్న చెట్ల శిఖరాల వెనక దిగుతోంది.

"ఇదే టైము. కుజ్మా, బండి సిద్ధం చేయించు" అని లేవిన్ కిందికి పరిగెత్తాడు.

అబ్లాన్‌స్కీ తన గదికి వెళ్లి మెరుగు పెట్టిన గన్‌కేస్ కాన్వాస్ తొడుగు విప్పాడు. దాన్ని తెరిచాడు. అత్యంత ఆధునికమైన, ఖరీదైన గన్‌ని అమర్చడం మొదలుపెట్టాడు. పెద్ద బక్షీ వస్తుందన్న ఆశతో కుజ్మా అబ్లాన్‌స్కీని అంటిపెట్టుకునే వుంటున్నాడు. అతనికి మేజోళ్లు, బూట్లు తొడుక్కోవడానికి కూడా సాయం చేస్తున్నాడు. ఆ సేవని అబ్లాన్‌స్కీ సంతోషంగా స్వీకరించాడు.

"లేవిన్, వర్తకుడు ర్యబీనిన్ వస్తాడేమో, ఇవాళ సాయంత్రం రమ్మని చెప్పాను. లోపల కూర్చోబెట్టి మనకోసం ఆగమని కబురు చెప్పమను."

"నీ కలప ర్యబీనిన్‌కి అమ్ముతున్నావా?" అని లేవిన్ అడిగాడు.

"ఆఁ, యేం, నీకతను తెలుసా?"

"ఆఁ, తెలుసు. 'నిక్కచ్చిగా నిర్మొహమాటంగా' వ్యవహారాలు ఫైసలా చేసుకున్నాను నేను అతనితో."

వర్తకుల పడికట్టుపదం గురించి అబ్లాన్‌స్కీ నవ్వేడు.

"అతను భలే చిత్రంగా మాట్లాడతాడ్లే. చూడు, దానికి తన యజమాని వేటకి వెడుతున్నాడని తెలుసు" అన్నాడు, లాస్క జూలు కొంచెం కుదుపుతూ. కుక్క లేవిన్ చేతిని, బూట్లనీ, తుపాకీని నాకుతూ అతని చుట్టూ కుంయ్ కుంయ్‌మంటూ చక్కర్లు కొడుతోంది.

వాళ్లు బయటికి వెళ్లేరు. బండి సింహద్వారం దగ్గర వుంది.

"మనం దూరం వెళ్లడం లేదు, అయినా దీన్ని సిద్ధం చేయించాను. లేకపోతే యేం, నడుద్దామా?"

"పద్దురే, బండిలో వెడదాం" అని అబ్లాన్‌స్కీ బండిలోకి యెక్కి కాళ్లమీద పులి చారల రగ్గు కప్పుకున్నాడు. చుట్ట ముట్టించాడు. "నువ్వు పొగ తాగకుండా యెలా నిబ్బరించు కోగలవు? ఒక చుట్ట — దీన్ని పొట్టే సుఖం అంటామా, సుఖానికి మకుటాయమానమైంది. కొంబద్ద అంటాం. ఆహా! యిదీ జీవితం! అద్భుతం! ఇలా బతకాలని వుంటుంది నాకు."

"నీకేమిటి అడ్డం?" అని లేవిన్ చిరునవ్వు నవ్వుతూ అడిగాడు.

"నీకేం జాతకుడివి! నీ మనసు కోరుకున్నదల్లా నీకు దక్కింది. నీకు గుర్రాలంటే యిష్టం — నీకు వున్నాయి. కుక్కలంటే యిష్టం — నీకు వున్నాయి. నీకు వేటంటే యిష్టం — అది వుంది. నీకు వ్యవసాయం యిష్టం — నీకు వుంది."

"బహుశా నేను ఉన్నవాటితో తృప్తి పడతాను కాబట్టి, లేనివాటి కోసం దేబిరించుకుని యేడవను కాబట్టి" అన్నాడు లేవిన్ కిట్టీని గుర్తుచేసుకుంటూ.

అబ్లాన్‌స్కీకి అర్థమైంది. అతనికేసి ఓ చూపు విసిరాడు. కాని యేమీ అన్లేదు.

అబ్లాన్‌స్కీ షేర్‌బాత్‌స్కీల ప్రస్తావన చెయ్యకుండా తప్పించుకుంటున్నాడు. లేవిన్ ఆ విషయం అంటే బెదురుతున్నాడని చూసి అలా తప్పించాడు. అతని వ్యవహార కుశలతని లేవిన్ అభినందించాడు. కాని లేవిన్ తనని మథనపెట్టే విషయానికి సమాధానం కోసం తహతహ పడుతున్నాడు. కాని అడిగే ధైర్యం వుండడం లేదు.

" పూఁ, నీ వ్యవహారాలు ఎలా ఉన్నాయి?" అని అన్నాడు లేవిన్. తన గురించే ఆలోచించు కుంటూ వుండటం తప్పని తోచింది.

అబ్లాన్‌స్కీ కళ్లు హుషారుగా మెరిసాయి.

"అప్పుడే నువ్వుగా భోజనం చేసిన మనిషి, బన్ రొట్టెని కోరే అవకాశం వుండొచ్చని నువ్వు ఒప్పుకోవు. నీ దృష్టిలో అది నేరం. కాని ప్రేమ లేని జీవితాన్ని నేను వూహించలేను" అన్నాడు లేవిన్ ప్రశ్నని తన ధోరణిలో తాత్పర్యం చెప్పి వ్యాఖ్యానిస్తూ. "యేం చెయ్యమంటావ్? నా తత్వం అదీ. నిజంగా చూస్తే దీనివల్ల యెవరికీ హాని జరగదు. మనకిగా మనకి గొప్ప సంతోషం కలుగుతుంది" అన్నాడు.

"నీకు కొత్తది యేదన్నా కనిపించిందా?"

"ఆ, మిత్రమా! అస్సీయన్ తరహా ఆడవాళ్లు* నీకు తెలుసా? కలల్లో నిన్ను కంగారుపెడతారు. కలల్లోనే కాదు. అబ్బ, వాస్తవంలో. యేం భయంకరమైన ఆడవాళ్లు! మొత్తంమీద నువ్వు ఆడవాళ్లని గురించి అధ్యయనం చేసే కొద్దీ కొత్తగానే కనిపిస్తూ వుంటారు వాళ్లు."

"అధ్యయనం చెయ్యకుండా వుంటేనే మంచిది మరి."

"కాదు. ఎవరో గణిత శాస్త్రజ్ఞుడు చెప్పాడ్లే, సత్యం కనిపెట్టిన దాని కంటే, దాన్ని శోధించడం యెక్కువ సంతోషకారకంగా వుంటుందని."

లేవిన్ ఒక్కమాట కూడా మాట్లాడకుండా విన్నాడు. అతను యెంత ప్రయత్నించినా

తన మిత్రుడిలాగా చూడలేక పోయాడు. ఆ బాపతు ఆడవాళ్లని గురించి అధ్యయనం చెయ్యడంలో అతని సంతోషాన్ని అర్థం చేసుకోలేకపోయాడు.

15

వేటకోసం యెంచుకున్న చోటు దగ్గర్లోనే వుంది. నది వొడ్డున వున్న ఆస్ప్ చెట్ల తోపు. అక్కడికి చేరుకోగానే లేవిన్ దిగి అబ్లాన్‌స్కీని బయలుగా వుండే చోటుకి చివరికంటా తీసుకు వెళ్లాడు. అక్కడ చిత్తడిగా, నాచుతో వుంది. మంచు కరిగిపోయింది. తను అభిముఖంగా వున్న అంచుకి వెళ్లాడు. జంటగా వున్న బర్చ్ చెట్లకిందకి వెళ్లాడు. దిగువగా ఉన్న కొమ్మ సందులో తుపాకీ నిలబెట్టాడు. కోటు తీసేసి, పటకా బిగించి సునాయాసంగా చేతులు కదిలించ వచ్చో లేదో చూసుకున్నాడు.

బూడిద రంగు ముసలి కుక్క లాస్క అతని వెనకాలే వచ్చింది. అతనికి యెదురుగుండా కూర్చుంది. చెవులు రిక్కించింది. సూర్యుడు అడవి వెనక దిగుతున్నాడు. అస్తమయ సూర్యుని కాంతిలో ఆస్ప్ చెట్ల మధ్య చెదురు మదురుగా వున్న కొద్దిపాటి బర్చ్ చెట్లు మొసులెత్తే చిగుళ్ల కొమ్మలతో సులభంగా కంటికి అనుతున్నాయి.

దట్టంగా వున్న అడవిలో మంచు యింకా వుంది. వసంతఋతువు సెలయేళ్లు అక్కడి చెట్ల మధ్యనుంచి ఉరకలెత్తుతూ పారుతున్నాయి. చిన్న చిన్న పక్షులు కిలకిలా రావాలు చేస్తున్నాయి. అడపాదడపా ఒక చెట్టుమీదనుండి ఇంకొక చెట్టుమీదకి ఎగురుతున్నాయి.

చీమ చిటుక్కుమంటే వినిపించేటంత నిశ్శబ్దంగా వున్న అక్కడ నేలమీద మంచు కరగడం వల్లా, అంకురించే గడ్డివల్లా కదిలిన నిరుటి యెండుటాకుల చప్పుళ్లు వినిపిస్తున్నాయి.

'అరె వాహ్! గడ్డి మొలవడం వినగల్గుతున్నాం, చూడగల్గుతున్నాం!' అనుకున్నాడు లేవిన్. అప్పుడే మొసులెత్తుతున్న గడ్డిపరక పక్కన బూడిదరంగు తడి ఆస్పెన్ ఆకు కదలడం చూసి అలా అనుకున్నాడు. చెవులు అప్పగించి నుంచున్నాడు. చెమ్మగా, నాచుతోవున్న నేలకేసి, దేన్నో శ్రద్ధగా వింటూ వున్న లాస్కకేసి, గుట్టకింద కనుచూపు మేరదాకా విస్తరించిన బోసి చెట్ల శిఖరాలకేసి చూస్తూ నుంచున్నాడు. చీకట్లు కమ్ముతోయే ఆకాశంమీద తేలియాడే తెల్లని దూదిపింజల్లాంటి మేఘాలకేసి చూస్తూ నుంచున్నాడు. బద్ధకంగా రెక్కలు ఆడించుకుంటూ వొక డేగ దూరంగా అడవులపైన ఆకాశంలో తేలింది. మరొకటి అంతే బద్ధకంగా అదే దిశలో యెగురుకుంటూ పోయింది. తోపులో పక్షుల కూతలు యింకా బిగ్గరగా, యింకా కంపితంగా వినవచ్చాయి. దగ్గర్లోనే ఒక గుడ్లగూబ అరిచింది. లాస్క కదిలింది. జాగ్రత్తగా కొన్ని అడుగులు ముందుకు వేసింది. ఆగి తల ఒక పక్కకి వారగేసి వింది. నదిపైనుంచి కోకిల పాట వినిపించింది. రెండు సార్లు అది కుహూ కుహూ అంది. తర్వాత బొంగురుపోయి, ఉత్తేజంతో స్వరాల్ని మేళవించింది.

“చూడు! అప్పుడే కోకిల!” అన్నాడు అబ్లాన్‌స్కీ పొదవెనకనుంచి యివతలకు వస్తూ.

“విన్నా” అన్నాడు లేవిన్, అడవి నిశ్శబ్దాన్ని భంగించే తన కంఠమే అతని చెవులకి కఠోరంగా కనిపించింది. “యెక్కువ సేపు నిరీక్షించక్కర్లేదు” అన్నాడు.

అబ్లాన్‌స్కీ పొదవెనక్కి అడుగేసాడు. అగ్గిపుల్ల వెలగడం, తర్వాత సిగరెట్టు యెర్రగా మండడం, నీలం పొగ సుడి తిరిగి లేవడం తప్ప లేవిన్‌కి యేమీ కనిపించలేదు.

“క్లిక్! క్లిక్!” అని అబ్లాన్‌స్కీ తుపాకీ యెక్కుపెట్టే చప్పుడైంది.

“యేమిటా కూత?” అని అబ్లాన్‌స్కీ యెంతో సేపు వినిపించిన కూతని లేవిన్ దృష్టికి తెస్తూ అడిగాడు. ఓ గుర్రపు పిల్ల హుషారుగా హెచ్చుస్థాయిలో సకిలిస్తున్నట్టు వుంది అది.

“అరె, తెలీదా? అది కుందేలు. యిక మాటలు వద్దు. విను! వస్తున్నాయి” అని తుపాకీ యెక్కుపెడుతూ లేవిన్ దాదాపు అరిచాడు.

దూరంనుంచి సన్నగా వూళ వినిపించింది. కొన్ని క్షణాల తర్వాత, ప్రతీ వేటగానికీ తెలిసిన లయలో రెండో వూళ తర్వాత మూడో వూళ, ఆ తర్వాత లఘువుగా రెక్కలు టపటప మనడం వినిపించాయి.

లేవిన్ కుడి వేపు, యెడమ వేపు చూశాడు. అప్పుడే సంధ్యామయమయ్యు నీలి ఆకాశ నేపథ్యంలో, ఆస్పెన్ చెట్ల శిఖరాల యీరికలెత్తే లేత చిగుళ్లపైన నిబ్బరంగా ఒక పక్షి యెగురుకుంటూ రావడం కనిపించింది. అది సరాసరి అతనికేసే యెగురుతూ వస్తోంది. బిగుతుగా వున్న గుడ్డని సర్రని చింపినట్టు వున్నాయా రెక్కల టపటప శబ్దాలు. అది సరిగ్గా తన తలమీదనుంచే వస్తున్నట్టుంది. అతనికి ఆ పక్షి పొడుగాటి ముక్కు, మెడ కనిపించాయి. అతను గురిచూసే లోగానే అబ్లాన్‌స్కీ నుంచున్న పొదవెనకనుంచి యెర్రటి మంట కనిపించింది. పక్షి బాణంలాగ కిందికి దూసుకుంటూ వచ్చి మళ్లీ యెగిరింది. మరోసారి మంట వెలిగింది, గుండు తగిలిన చప్పుడు వినిపించింది. గాలిలో తేలి వుండేందుకు గాను రెక్కలు అల్లల్లాడించి ఆ పక్షి ఆగింది. ఓ క్షణం సేపు చక్కర్లు కొట్టింది. తర్వాత బురద నేలమీద తపామని పడింది.

“యేం గురి తప్పిందా?” అని అబ్లాన్‌స్కీ అడిగాడు. పొగవల్ల అతనికి కనిపించడం లేదు.

“ఇదిగో యిక్కడ” అన్నాడు లేవిన్ లాస్కాకేసి చూపిస్తూ. అది ఒక చెవి యెత్తి బొచ్చు తోక అంచుని యెత్తి గాలిలో ఆడిస్తూ యజమాని దగ్గిరికి ఆ పక్షిని తీసుకువస్తోంది. ఆ సంతోషాన్ని మరి కొంచెం సేపు వుంచుకోవా లన్నట్టుగా, చిరునవ్వు లాంటిదేదో ముఖంలో ద్యోతక మవుతుండగా మెల్లగా నడుచుకుంటూ వస్తోంది. “నాకు సంతోషంగా వుంది, నువ్వు బాగా కొట్టావు” అన్నాడు లేవిన్. తను కొట్టలేదు కదా స్నేహితుడు కొట్టాడు కదా అని అసూయపడ్డాడు.

“మొదటిది గురి తప్పడం, అదీ మంచి తుపాకీతో, బాగా లేదు” అన్నాడు అబ్లాన్‌స్కీ మళ్లీ తుపాకీ నింపుకుంటూ. “హుష్, యింకోటి వస్తోంది” అన్నాడు.

విజంగానే చెవులు చిల్లులు పడే కూతలు ఒకదాని తర్వాత ఒకటి వినవచ్చాయి. రెండు స్నైప్ పక్షులు ఒకదాన్ని ఒకటి సరదాగా తరుముకుంటున్నాయి. యీల వేస్తూ, కూతలు కూయకుండా వీళ్ల తలలపైనే సరిగ్గా యెగిరాయి. నాలుగు గుళ్లు పేలాయి. స్నైప్‌లు స్వాలోల మాదిరే గిర్రున తిరిగి కనిపించకుండా మాయమైపోయాయి.

. . . .

వేట దివ్యంగా సాగింది. అబ్లాన్‌స్కీ మరో రెండింటిని కొట్టేడు. లేవిన్ రెండింటిని కొట్టేడు. అందులో వొకటి దొరకలేదు. చీకటి పడుతోంది. పడమటి వేపు బర్చ్ చెట్ల వెనకనుంచి నిర్మల రజిత పరివేషంతో శుక్రగ్రహం కోమల కాంతు లీనుతోంది. తూర్పున మిటమిటలాడుతూ వున్న స్వాతి నక్షత్రం యెర్రటి వెలుతురు ప్రసరింపచేస్తోంది. సరిగ్గా నెత్తిమీద లేవిన్‌కి సప్తర్షిమండలం నక్షత్రాలు కనిపించి అదృశ్యమయిపోయాయి. స్నైప్ పక్షులు యెగరడం లేదు. కాని బర్చ్ చెట్ల కొమ్మల వెనకనుంచి ప్రకాశిస్తూవున్న శుక్రగ్రహం కొమ్మలపైకి వచ్చేదాకా, సప్తర్షిమండలం నక్షత్రాలు స్పష్టంగా కనిపించేదాకా అక్కడ వుందామని లేవిన్ అనుకున్నాడు. శుక్రగ్రహం బర్చ్ కొమ్మల పైకి యెక్కి వచ్చింది. నీలాకాశ నేపథంలో సప్తర్షిమండలం ప్రకాశిస్తూ స్పష్టంగా గోచరించింది. అయినా అతను అక్కడే తచ్చాడేడు.

"వెడదామా మరి?" అన్నాడు అబ్లాన్‌స్కీ.

అడవిలో చీమ చిటుక్కుమంటే వినిపించేటంత నిశ్శబ్దంగా వుంది. ఓ పిట్ట టపటపమనడం కూడా వినిపించలేదు.

"కొంచెం వుందాం" అన్నాడు లేవిన్.

"నీ యిష్టం."

వాళ్లిద్దరూ పదిహేను అడుగుల దూరంలో నుంచున్నారు.

"అబ్లాన్‌స్కీ" అన్నాడు లేవిన్ వున్నట్టుండి. "మీ మరదలికి పెళ్లి అయిందో లేదో, యెప్పుడవుతుందో చెప్పావు కాదేం?" అని అడిగాడు.

లేవిన్ నిబ్బరంగా, చలించకుండా వున్నాడు. జవాబు యేదైనా తనకి కలవరం కలిగించదన్నట్టు బింకంగా వున్నాడు. కాని అబ్లాన్‌స్కీ యిచ్చిన జవాబుకి యేరకంగానూ సిద్ధపడి లేడు.

"ఆమెకి పెళ్లి అవలేదు. పెళ్లి చేసుకోవాలనీ లేదు. ఆమెకి చాల జబ్బు చేసింది. డాక్టర్లు ఆమెని విదేశాలకి పంపేరు. ఆమె ప్రాణానికి ముప్పు రావచ్చుని కూడ వాళ్లు భయపడుతున్నారు."

"ఏమిటి నువ్వంటున్నది? చాలా జబ్బుగా వుందా? యేమైంది ఆమెకి? యేమిటి..." అని లేవిన్ అడిగాడు.

వాళ్లిద్దరూ మాట్లాడుకుంటూ వుండగా లాస్క చెవులు రిక్కించి ఆకాశంకేసి చూసింది. తర్వాత వాళ్లకేసి నిష్కారంగా చూసింది.

'కబుర్లు చెప్పుకోడానికి భలే తేప్పైన సమయమే!' అని అనుకుంటున్నట్టుగా వుంది దాని చూపు. 'అదిగో పక్షి వస్తోంది. ఆ... వచ్చింది. వీళ్లు దాన్ని పోగొట్టుకుంటారు' అనుకుంది.

కాని ఆ క్షణంలోనే చెవులమీద కొట్టినట్టుగా ఆ మిత్రులకి కీచుమంటూ పూళ వినిపించింది. ఇద్దరూ ఒకేసారి తుపాకులు పట్టుకున్నారు. రెండు మెరుపులు, రెండు గుండు దెబ్బల చప్పుళ్లు ఒకేసారి వచ్చాయి. తక్షణం యెత్తులో యెగిరే స్నైప్ పక్షి రెక్కలు వాలేసి, పొదలో పడిపోయింది. అలా పడ్డంలో లేత చిగురు సన్నటి కొమ్మలు అణగి పోయాయి.

"శేష్! మన ఉమ్మడి వేట" అని లేవిన్ అరిచాడు. స్నైప్‌ని వెదకడం కోసం లాస్కతో పొదల్లోకి పరిగెత్తాడు. 'అరె యేమిటి మనసుకి కష్టం కలిగించింది' అని గుర్తు చేసుకో ప్రయత్నించేడు. 'ఆఁ, కిట్టీకి జబ్బుచేసింది. యేం చెయ్యాలి? యెంత బాధగా వుంది' అనుకున్నాడు.

"కనిపించింది కదా? భలే కుక్క" అని లాస్క నోటితో పట్టుకున్న వెచ్చని పిట్టని తీసుకొని తన సంచిలో వదేసుకున్నాడు. అది అప్పటికే నిండుగా వుంది. "అబ్లాన్‌స్కీ, దొరికింది!" అని అరిచాడు.

16

ఇంటికి తిరిగివచ్చే దారిలో కిట్టీ జబ్బు గురించి, షేర్‌బాట్‌స్కీల ఉద్దేశాల గురించి లేవిన్ చాల వివరాలు అడిగాడు. తను విన్న వార్తవల్ల తనకి సంతోషం కలిగిందని వొప్పుకోవడానికి సిగ్గుపడినా నిజానికి అతనికి సంతోషం కలిగింది. తనకి యింకా ఆశ మిగిలినందుకు అతనికి సంతోషం కలిగింది. కాని యింకా యెక్కువ సంతోషం యెందుకు కలిగిందంటే తనకి క్షోభ కలిగించిన ఆమె తనే క్షోభ పడుతోంది కాబట్టి. అబ్లాన్‌స్కీ కిట్టీ జబ్బు పడడానికి దారితీసిన కారణాల గురించి చెబుతూ వ్రాన్‌స్కీ పేరు ప్రస్తావించాడు. అప్పుడు లేవిన్ అతని మాటకి అడ్డం వెళ్లాడు.

"కుటుంబ రహస్యాలు తెలుసుకోవాలన్న కోరిక నాకు లేదనుకో, నిజం చెప్పాలంటే నాకెటువంటి ఆసక్తి లేదు" అన్నాడు.

లేవిన్ ముఖం వెంటనే మారిపోవడం చూసి అబ్లాన్‌స్కీ పైకి కనిపించీ కనిపించని చిరునవ్వు నవ్వేడు. ఒక్క క్షణం కితమే హుషారుగా వున్నటువంటిది యిప్పుడు నిరుత్సాహం కలిగించేటట్టు మారింది. లేవిన్ ముఖభంగిమ అలా యెప్పుడూ మారుతూనే వుంటుంది అని అతనికి తెలుసు.

"ర్యబీనిన్‌తో వ్యవహారం ఫైసలైందా?" అని లేవిన్ అడిగాడు.

"ఆఁ, అయింది. మంచి ధర పలికింది. ముప్పై ఎనిమిది వేలు. ఎనిమిది వేలు రొఖ్ఖం యిప్పుడివ్వడం. మిగిలింది ఆరేళ్లలో యివ్వడం. ఈ జంఝాటం నాకు చాల కాలం పట్టింది. యింతకంటె యెక్కువ యెవళ్లూ యివ్వడానికి సిద్ధపడలేదు."

"నీ కలపని పుణ్యానికి ధారపోస్తున్నావు" అన్నాడు లేవిన్ ఉదాసీనంగా.

"యేం, యెందుకని?" అని అబ్లాన్‌స్కీ అడిగాడు, సరదాగా చిరునవ్వు నవ్వుతూ. ప్రస్తుతం ప్రతిదీ లేవిన్‌కి తప్పుగానే కనిపిస్తాయని తెలుసు.

"యెందుకంటే కలపకి దెస్యాతీన్‌కి హీనపక్షం అయిదు వందల రూబుళ్లు వస్తాయి" అన్నాడు లేవిన్.

"అబ్బ, మీ పల్లెటూరి జమీందార్లున్నారే" అన్నాడు అబ్లాన్‌స్కీ వేళాకోళంగా. "మా బస్తీవాళ్లంటే చీదరించుకుంటారు. కాని వ్యాపారానికి వచ్చేవేళకి మేమే పైచెయ్యిలో ఉంటాం. నే చెప్తున్నా విను. నా మాట గుర్తుంచుకో. కలపని లాభానికే అమ్మాను. యెంత లాభానికంటే నాకు భయమేస్తోంది అతను వెనక్కి తగ్గుతాడేమోనని. ఇదేమంత జాతి కలప కాదు" అన్నాడు అబ్లాన్‌స్కీ. 'జాతికలప' అని పదబంధం వాడి లేవిన్‌ని నొప్పించ గలనని అనుకున్నాడు. "చాలమట్టుకి వంట చెరుకుగా పోతుంది. దెస్యతీన్‌కి ముప్పై సాజెన్‌ల కంటె వుండదు కలప.* అయినా దెస్యతీన్‌కి రెండు వందల రూబుళ్లు యిస్తున్నాడు" అన్నాడు.

లేవిన్ తిరస్కారంగా నవ్వేడు. 'నాకు తెలుసు' అనుకున్నాడు. 'కేవలం యితనొక్కడే కాదు. బస్తీవాళ్లంతా యింతే. పుష్కరంలో ఒకటి రెండు సార్లు పల్లెకి వస్తారు. ఒకటి రెండు పల్లె పదాలు పట్టుకుంటారు. యిక వాటిని గుప్పిస్తారు, సమయమూ, సందర్భమూ లేకుండా, తాము పండితులమైనట్టు. 'జాతికలప'... 'దెస్యతీన్‌కి ముప్పై సాజెన్‌ల' కంటె వుండదు కలప, వగైరా.'

"మీ ఆఫీసుల్లో మీరేం రాసుకుంటారో నేను నీకు బోధించను. పైపెచ్చు అవసరం అయితే మీ బోంట్ల సలహా అడుగుతాను. కాని, ఇక్కడుంది చూశావ్. అడివి కలప వ్యవహారం అంతా తెలిసిన వాడిలా మాట్లాడకు. యిది అంత తేలిగ్గాదు. చెట్లన్నీ లెక్కపెట్టేవా?" అన్నాడు.

"చెట్లెలా లెక్కపెట్టగలను?" అని అబ్లాన్‌స్కీ నవ్వేడు. లేవిన్‌కి కలిగిన చిరాకుని తొలగించాలని ఆత్రపడ్డాడు. "... యిసుక రేణువుల్ని, నక్షత్ర కాంతి పుంజాల్ని నిపుణుడైన వాడు లెక్కపెట్టినా..."

"ఊఁ, ర్యబీనిన్ నిపుణుడు. లెక్కపెట్టగలడు. వొట్టి పుణ్యానికి ధారాదత్తం చేస్తే తప్ప, వొక్క వర్తకుడు కూడా నీ చెట్లని లెక్కపెట్టకుండా కొనడు. నువ్వలా దత్తం చేసావు. నీ అడివిలో కలప నాకు తెలుసు, ప్రతి యేడు నేనక్కడికి వేటకి వెడతాను. దెస్యతీన్‌కి అయిదు

వందల రూబుళ్ల నగదు ఉన్నపళంగా వచ్చేటటువంటిది నీ అడివి. వాడేమో నీకు రెండు వందలు, అదీ ఆరు వాయిదాల్లో యిస్తాట్ట! ఇంకోలా చెప్పాలంటే, నువ్వు వాడికి ముప్పై వేలు సువర్ణపుష్పం సమర్పించుకుంటున్నావ్!"

"పూ, పొన్లెద్దూ" అన్నాడు అబ్లాన్‌స్కీ దీనంగా. "మరి యెవళ్లూ యెందుకని యెక్కువ యివ్వలేదు?" అని అడిగాడు.

"ఎందుకంటే ఇతర వర్తకులతో లాలూచీ పడ్డాడు వీడు. వాళ్లని కట్టేసుకున్నాడు. వేనందరితోనూ వ్యవహారం నడిపాను. అందరూ నాకు బాగా తెలుసు. వాళ్ళు వర్తకులు కారు. దోచుకునే దొంగలు. యీత పండిచ్చి తాటి పండులాగే రకం. పది శాతం, పదిహేను శాతం కూడా లాభం వచ్చే వ్యాపారం వాడు చెయ్యడు. రూబుల్‌ని యిరవై కోపెక్కులు లాగేదాకా నక్కలాగ కాసి కూర్చుంటాడు."

"పొన్లే వదిలెయ్యి. నీ మనస్సు బాగాలేదు."

"అదేం కాదు" అన్నాడు లేవిన్ మబ్బుగా. వాళ్లు యిల్లు చేరారు.

సింహద్వారం దగ్గర ఒక చిన్న బండి వాళ్లకి కనిపించింది. తోలుగూడు గట్టిగా బిగించి వుందా బండికి. బాగా మేపిన గుర్రం ఆ బండికి పెద్దపటకాలతో కట్టి వుంది. లోపల ఒకడు కూర్చుని వున్నాడు. నడుం గట్టిగా బిగించి కట్టుకున్నాడు. బాగా మోటుగా వున్నాడు. అతను ర్యబీనిన్‌కి గుమాస్తా. అతనే బండి తోలేవాడూనూ. ర్యబీనిన్ యింట్లో వున్నాడు. హాల్లోనే వీళ్లని కలిసాడు. అతను సన్నగా, పొడుగ్గా వున్నాడు. నడివయస్కుడు. మీసం పెంచాడు. గడ్డం నున్నగా గీసుకున్నాడు. దవడ స్ఫుటంగా కనిపిస్తుంది. చెమ్మగా వున్నట్టు కనిపించే మిడిగుడ్లు. అతను ముదురు నీలం కోటు తొడుక్కున్నాడు. దానికి పిరుదులకింద బొత్తాలు పెట్టి వున్నాయి. యెత్తు బూట్లు తొడుక్కున్నాడు. మడమల దగ్గర ముడతలు పడి పిక్కలపైన నున్నగా వున్నాయి అవి. వాటిపైన పెద్ద ఓవర్‌బూట్లు వేసుకున్నాడు. చెమటలు కక్కే ముఖం రుమాలుతో తుడుచుకున్నాడు. కోటు బొత్తాలు సర్దుకున్నాడు. అది అతని శరీరానికి బాగా నప్పింది. చిరునవ్వు నవ్వుతూ వాళ్లకి స్వాగతం చెప్పాడు. దేన్నో పట్టుకుంటున్నట్టుగా అబ్లాన్‌స్కీ వేపు చేతిని చాచాడు.

"మీరు వచ్చేసారన్నమాట, నాకు సంతోషంగా వుంది" అన్నాడు అబ్లాన్‌స్కీ చేతిని చాస్తూ.

"దారి బాగోలేకపోయినా ప్రభువుల ఆజ్ఞని ధిక్కరించే సాహసం చెయ్యలేకపోయాను. నిజం చెప్పాలంటే, యింత దూరమూ నడుచుకుంటూనే వచ్చాను. వేళకి యిక్కడికి చేరుకున్నాను. నమస్కారం, లేవిన్‌గారూ" అన్నాడు లేవిన్ కేసి తిరిగి. అతని వైపు చెయ్యి చాచాడు గాని లేవిన్ దాన్ని చూడనట్టుగా నటిస్తూ సంచిలోంచి స్నైప్ పిట్టల్ని తీస్తూ ముఖం ముడుచుకున్నాడు. "సరదాగా వేటకి వెళ్లారేమిటి? అదేం పక్షి?" అని ర్యబీనిన్ అడిగాడు, తిరస్కారంగా స్నైప్‌లకేసి చూస్తూ. "రుచిగా వుంటుంది కదా?" అని తనకి యిష్టం

లేనట్టు, యీ మాత్రం పేటకి యింత శ్రమ దండుగ అని అనుమానిస్తున్నట్టు తల ఆడించాడు.

"చదువుకునే గదిలో కూర్చుంటారా?" అని లేవిన్ అబ్లాన్‌స్కీని ఫ్రెంచిలో అడిగేడు. "చదువుకునే గదిలోకి వెళ్లండి అక్కడ మాట్లాడుకోవచ్చు" అని రష్యనులో అన్నాడు.

"తమరి యిష్టప్రకారమే హుజూర్" అన్నాడు ర్యబీనిన్. ఎంత తిరస్కారపూర్వక స్వాభిమానంతో అలా అన్నాడంటే, పరాయివాళ్ల ముందు వ్యవహారం జరిపించుకోవడానికి వేరేవాళ్లకి మొహమాటంగా వుండవచ్చునేమో గాని తనకి మాత్రం అలా వుండదు అని తెలియ జేస్తున్నట్టుగా ఉందా ధోరణి.

ఆ గదిలోకి అడుగుపెడుతూనే ర్యబీనిన్ యిథాప్రకారం పూజా విగ్రహం యేదన్నా వుందేమోనని కళ్లతో వెతికాడు. అది కనిపించినా శిలువ గీసుకోలేదు. పుస్తకాల అల్మారాలనీ, సొరుగుల్నీ చూసి తిరస్కారపూర్వకంగా చిరునవ్వు నవ్వినట్టుగానే నవ్వేడు. తనకి నచ్చనట్టు, ఆ పేటకి నిజంగా శ్రమ దండుగ అన్నట్టు తల ఆడించేడు.

"ఊఁ, సొమ్ము తెచ్చారా?" అని అడిగాడు అబ్లాన్‌స్కీ. "కూర్చోండి" అన్నాడు.

"సొమ్ము గురించిన బెంగ అక్కర్లేదు మీకు. వూరికే మిమ్మల్ని చూసి మీతో మాట్లాడదామని వచ్చేను."

"మాట్లాడ్డానికేం వుంది. కాని కూర్చోండి."

"దాన్దేముంది లెండి కూర్చుంటా" అన్నాడు ర్యబీనిన్. చేతుల కుర్చీలో కూర్చుని వెనక్కి ఆనుకున్నాడు. అది అతనికి సౌకర్యంగా లేదు. "ధర కొంచెం తగ్గించాలి ప్రభూ, అంత ధర అడగడం ధర్మం కాదు. సొమ్ము సిద్ధంగా వుంది. కోపెక్కుతో సహా లెక్క యిస్తా. సొమ్ము గురించి మీకు బెంగ అక్కర్లేదు" అన్నాడు.

వాళ్లతో పాటు లేవిన్ కూడ లోపలికి వచ్చేడు తుపాకీ పెడదామని. యీ మాటలు విని ఆగేడు.

"యిప్పటికే కలపని అప్పనంగా కొట్టేసారు. మా వాడు ఆలస్యంగా వచ్చేడు, ఖర్మ. లేకపోతే నేనే యింకా మంచి ధర యిచ్చి వుండేవాణ్ని" అన్నాడు.

ర్యబీనిన్ ఒక్క మాటా అనకుండా నొట్టివే చిరునవ్వు నవ్వుతూ లేచి లేవిన్‌కేసి చూస్తూ నుంచున్నాడు.

"లేవిన్‌గారు డబ్బు గట్టిమనిషి" అన్నాడు అబ్లాన్‌స్కీతో యింకా చిరునవ్వు నవ్వుతూనే. "ఆయనతో బేరం కష్టం. ఆయన గోధుమ కొనాలనుకున్నామ మంచి ధర యిచ్చి."

"నా గోధుమ మీకెందుకు సువర్ణ తాంబూలం సమర్పించుకోవాలి? నాకేం దారిలో దొరకలేదు, నేనెక్కడా మొత్తుకు రాలేదు."

"క్షమించండయ్యా యీ రోజుల్లో దొంగిలించుకు రావడం కష్టం. యీ రోజుల్లో అంతా చట్టం ప్రకారం ఆర్భాటంగా జరగాల్సిందే. కాజేసుకొచ్చే మాటే లేదు. నేను న్యాయంగానే

వున్నాను. ఆయన కలపకి మరీ యెక్కువ అడుగుతున్నారు. నాకు దానిమీద లాభం యేమీ రాదు. పూరికే కొంచెం తగ్గించమంటున్నాను. అదే నేను వేడుకొనేది."

"మీరు ఒప్పందానికి వచ్చేరా లేదా?" అన్నాడు లేవిన్. "వస్తే యికపైన చెప్పాల్సిందేమీ లేదు. రాలేదూ, ఆ కలపని నేనే కొంటాను" అన్నాడు.

ర్యబీనిన్ చిరునవ్వు వెంటనే మాయమైపోయింది. కఠినంగా, డేగ లాగా కొల్లగొట్టే వాలకం పెట్టేడు. పుల్లిల్లా వున్న వేళ్లతో గబగబా కోటు బొత్తాలు విప్పేడు. లాగుపైకి వున్న చొక్కా, ఇత్తడి బొత్తాలున్న వెయిస్ట్‌కోటు బయటికి కనిపించాయి. వెయిస్ట్ కోటుకి గడియారం గొలుసు వుంది. గబగబా అతను ఉబ్బి వున్న పర్సువాన్ని తీశాడు.

"ఇదిగో నండి, కలప నాది" అన్నాడు. గబగబా శిలువ గుర్తు గీసుకున్నాడు. చేతిని చాచాడు. "రొఖ్ఖం మీది కలప నాది. ర్యబీనిన్‌తో బేరం అంటే అంతే. పైసాపైసా లెక్క పెట్టే రకం కాదు" అన్నాడు ముఖం ముడుచుకుని పర్సువాన్ని తీవుతూ.

"నేనే నీ స్థానంలో వుంటే అంత తొందర పడను" అన్నాడు అబ్లాన్‌స్కీతో లేవిన్.

"కాని విను, మాట యిచ్చేసాను" అని అబ్లాన్‌స్కీ ఆశ్చర్యపోయేడు.

ధనామని తలుపు మూస్తూ లేవిన్ గదిలోంచి అవతలకి వెళ్లిపోయాడు. ర్యబీనిన్ తలుపు కేసి చూసి చిరునవ్వు నవ్వుతూ తల ఆడించేడు.

"అంతా కుర్రతనం, చిన్నపిల్లల ప్రవర్తన. యిదుగోనండి కలప కొంటున్నా నమ్మండి నమ్మకపొండి, మాటకోసం. అబ్లాన్‌స్కీగారి అడవుల్ని కొన్నవాడు ర్యబీనిన్, మరెవళ్లూ కాదు అన్న మాట కోసం. ఇందులో నాకేం మిగులుతుంది, పరమాత్ముడికెరుక. ఆ పరమేశ్వరుడే సాక్షి. యిదిగోనండయ్యా, దయచేసి కాగితం తయారు చేయించండి."

ఓ గంట తర్వాత జేబులో ఒప్పందం పత్రం పెట్టుకుని జాగ్రత్తగా కోటు బొత్తాలు పెట్టుకుంటూ ఆ వర్తకుడు గూడు గట్టిగా కట్టిన బండిలో యింటికి వెళ్లిపోయాడు.

"అబ్బ! యీ పెద్దమనుషులు! ఒకళ్లని మించినవాడొకడు" అన్నాడు గుమస్తాతో.

"అంతేనండయ్యా" అన్నాడు గుమస్తా. తోలు అప్రన్ బొత్తాలు పెట్టుకుంటూ కళ్లేలు అందించేడు. "వ్యవహారం సజావుగా అయిందా?" అని అడిగాడు.

"వూఁ, వూఁ..."

17

మూడు నెలల అడ్వాన్సుగా వ్యాపారస్థుడు యిచ్చిన బేంక్ నోట్లతో జేబులు ఉబ్బిన అబ్లాన్‌స్కీ మేడమీదకి వెళ్లాడు. కలప అమ్మకం పూర్తయింది. డబ్బు జేబులో పడింది. వేట దివ్యంగా వుంది. అబ్లాన్‌స్కీ గాలిలో తేలిపోతున్నాడు. ఆ కారణం వల్ల దిగాలుపడిన లేవిన్‌ని హుషారు చెయ్యాలని అతనికి అనిపించింది. ఆ రోజు యెంత సరదాగా మొదలైందో అంత సరదాగా సాయంత్రం భోజనాల దగ్గర ముగించాలని అనుకున్నాడు.

నిజంగానే లేవిన్‌కి మనస్సు బాగా లేదు. తన ప్రాణమిత్రుడిపట్ల ఎంత ఆదరంగా ఆత్మీయంగా వుండాలని అతను కోరుకున్నా అతనికి అలా వుండడం వశం అవడం లేదు. కిట్టీకి పెళ్లి అవలేదు అన్న వార్త మత్తు కొంచెం కొంచెంగా తన ప్రభావాన్ని చూపిస్తోంది.

కిట్టీకి పెళ్లవలేదు, జబ్బుగా వుంది. తనని కాదు పొమ్మని తిరస్కరించిన మనిషి కారణంగా జబ్బు పడింది. ఆ తిరస్కారపు ఛాయ అనుకుంటే తన మీదా పడుతోంది. వ్రాన్‌స్కీ కిట్టీని కాదన్నాడు. ఆమె లేవిన్‌ని కాదంది. అందుచేత వ్రాన్‌స్కీకి లేవిన్‌ని తిరస్కరించే అధికారం వుంది. ఆ కారణంగా అతను తనకి శత్రువు. కాని దీనంతటి గురించీ లేవిన్ ఆలోచించలేదు. యేదో తనని గాయపరిచేది యిందులో వుందని అస్పష్టంగా అనిపించింది. అంచేత తన మనస్సు బాగా లేకపోవడం అనేదాన్ని అసలైన బాధకి ఆపాదించలేదు. ఆ క్షణంలో తటస్థపడిన చిన్నా చితకా విషయాలవల్ల తన మనస్సు బాగా లేదని అనిపించేటట్టు వున్నాడు. తెలివితక్కువగా కలప అమ్మడం, అబ్లాన్‌స్కీ మోసపోవడం, ఆ వ్యవహారం తన యింట్లోనే ఫైసలా అవడం అతన్ని రెచ్చగొట్టాయి.

"వూఁ అంతా పూర్తిచేసుకువచ్చావా?" అని అబ్లాన్‌స్కీ పైకి రాగానే అడిగాడు. "భోజనం చేద్దామా?" అన్నాడు.

"నా అభ్యంతరం యెంత మాత్రం లేదు. పల్లెటూరు నా జఠరాగ్నికి యేం దోహదం చేస్తోందో ఆశ్చర్యం! ర్యబీనిన్‌ని భోజనానికి వుండమన లేదేం?"

"వాడి సిగ్గోసిరిగాని."

"అతన్ని అలా పురుగులా చూశావేం? చేతిని కూడ అందివ్వలేదు. యెందుకు షేక్‌హాండ్ చెయ్యలేదు?" అని అబ్లాన్‌స్కీ అడిగాడు.

"తొత్తుకి చెయ్యి చాచను, వాడు తొత్తుకంటే వంద రెట్లు అధముడు."

"యెంత ప్రగతివ్యతిరేకివి నువ్వు! అంతస్తులు కలిసిపోవడమేమిటి యిక!" అన్నాడు అబ్లాన్‌స్కీ.

"కలిసిపోవాలనుకునే వాళ్లు కలవవచ్చు. నాకు మాత్రం దుర్భరం."

"నువ్వు నిజంగా ప్రగతివ్యతిరేకివే."

"నన్ను వర్గీకరించుకునే శ్రమ యెప్పుడూ పడలేదు నేను. నేను కాన్‌స్తన్‌తిన్ లేవిన్‌ని. అంతే."

"ఆఁ, కాన్‌స్తన్‌తిన్ లేవిన్, మనస్సేమీ బాగా లేనివాడు" అని నవ్వుతూ అన్నాడు అబ్లాన్‌స్కీ.

"అవును నా మనస్సు బాగా లేదు. యెందుకనో తెలుసా? మరేం అనుకోకు. అడివిని అంత నవ్వులాటగా నువ్వు అమ్మిన తీరువల్ల."

అబ్లాన్‌స్కీ అకారణంగా గాయపడి వ్యాకులపడిన వాడిలాగా ముఖం చిట్లించేడు.

"అబ్బ, చాల్లే. వ్యవహారం అంతా ముగిసిన తరవాత యింతకంటె బాగా జరిగివుండేది

అనే మాటలు రాకుండా యెవడన్నా యెప్పుడైనా దేనినయినా అమ్మేడా? అమ్మకానికి ముందు మాత్రం యెవ్వడూ యెక్కువ ధర యిస్తానని అనడు. పాపం ఆ ర్యబీనిన్‌కి చీకూ చడదు. నాకలా అనిపిస్తోంది" అన్నాడు.

"బహుశా, యెందుకనో తెలుసా? మళ్లీ నన్ను పాతకాలం వాడిననీ, ఇంకా అలాంటి మాటలని దేన్నో అంటావు. అంతే. కాని జమీందారీ కుటుంబాలు దిగజారిపోవడంవల్ల నా మన స్సెంతో ఖేదపడుతోంది. నేనా జమీందారీ వంశస్థుణ్ణి. అంతస్తులు కలిసిపోయేటప్పుడు కూడా, నేను ఆ అంతస్తుకి చెందినవాణ్ణి అని చెప్పుకోవడం నాకు గొప్ప. వాళ్లు తిరిసికట్టు అయి పోవడం భోగలాలసత్వంతో బతకడం వల్ల కాదు — అదేమంత పరవాలేదు. వాళ్లు ఆ వైభ వంతోనే బతకాల్సి వుంది, దర్పంగా. జమీందారీ కుటుంబాలకే తెలుసు అలా యెలా బత కాలో. కాని ప్రస్తుతంలో రైతులు మన భూములు కొనేస్తున్నారు. దానికి నేనేం అననుకో. యజమాని గోళ్లుగిల్లుకుంటూ కూర్చుంటే రైతు పనిచేసి అతన్ని గెంటేస్తాడు. అలాగే జరగాలి. యిది నాకు చాల సంతోషం కలిగిస్తుంది. కాని జమీందార్ల పరిస్థితి తిరిసికట్టు అవడానికి కారణం ఒకరకమైన — వూఁ యేమని పిలవను దాన్ని — తెలియడం లేదు — అమా యకత్వం అది నాకు బాధ కలిగిస్తోంది. నీవ్‌లో బతుకుతూ వున్న రష్యన్ జమీందారు ఎస్టేట్‌ని సగం విలువకి ఒక పోలిష్ కౌలుదారు యిక్కడ కొనేస్తున్నాడు. మరేమో వర్తకుడు పది రూబుళ్ల విలువచేసే దెస్యాతీన్‌కి ఒక రూబుల్ శిస్తు యిస్తున్నాడు. యింకా నువ్వు చూడు ఆ బద్మాష్‌కి పొట్టి పుణ్యానికి ముప్పై వేల రూబుళ్లు ధారపోసావు."

"నన్నేం చెయ్యమంటావ్? చెట్టు చెట్టూ లెక్కపెట్టమంటావా?"

"ప్రతి చెట్టూ! నీవు లెక్కపెట్టవు గాని ర్యబీనిన్ లెక్కపెట్టుకున్నాడు. హాయిగా బతికి చక్కగా చదువుకోవడానికి ర్యబీనిన్ పిల్లలకి డబ్బు వుంటుంది, కాని నీ పిల్లలకి వుండదు."

"వూఁ, అలా లెక్కపెట్టడం యేదో చవక బారుగా కనిపిస్తుంది నాకు. మనం చూసుకో వలసిన పనులు మనకి వున్నాయి. వాళ్ల పనులు వాళ్లకి వున్నాయి. మరి వాళ్లు లాభం కూడా చేసుకోవాలి కదా. వూఁ, పోన్లే వదిలెయ్యి ఆ గొడవ. అయిందేదో అయింది. ఆఁ గుడ్ల వేపుడు సరిగ్గా నాకిష్టం అయినట్టే వుంది. అగాఫ్యా మిహైలొవ్నా ఆ ఘుమ ఘుమ లాడే వోద్కా యిస్తుంది మనకి."

అబ్లాన్‌స్కీ బల్లదగ్గర కూర్చుని అగాఫ్యా మిహైలొవ్నాని కుశలప్రశ్నలు అడగడం మొదలుపెట్టాడు. తను అలాంటి భోజనం తిని చాల రోజులైందని ఆమెని పొగిడాడు.

"నన్ను పొగుడుతున్నారు మీరు. కాని లేవిన్‌గారికి నేనేం పెట్టినా ఒక లాగే వుంటుంది. రొట్టె పెచ్చు పెట్టినా అదే మాదిరి తినేసి వెళ్లిపోతాడు" అంది అగాఫ్య మిహైలొవ్నా.

లేవిన్ యెంత ప్రయత్నించినా గానీ హుషారుగా ఉండలేకపోయాడు. దిగాలుగా, ముభా వంగా వుండిపోయాడు. అబ్లాన్‌స్కీని అతను హో ప్రశ్న అడగాలని తపనపడ్డాడు. కాని

యెలా, యెప్పుడు అడగాలో, యెక్కడ అడగాలో తెల్సుకో లేక పోయాడు. అబ్లాన్స్కీ తన గదికి వెళ్ళిపోయాడు. బట్టలు మార్చుకొని ముఖం కడుక్కొని లేసు అంచు నైట్‌గౌను తొడుక్కుని మంచం యెక్కాడు. లేవిన్ నానా రకాల చిల్లర విషయాల గురించి మాట్లాడుతూ గదిలో తచ్చాడేడు. తను అడగదల్చుకున్న దాన్ని అడిగే ధైర్యం కూడదం లేకపోయింది.

"సబ్బుని ఎంత లేసుగ్గా చేస్తున్నారు" అని అగాఫ్య మిహైలొవ్నా చుట్టం కోసం అక్కడ పెట్టిన సువాసన సబ్బు పై కాగితాన్ని వేళ్ళతో విప్పుతూ అన్నాడు. కాని అబ్లాన్స్కీ దానిని వాడలేదు. "చూడు, కళాత్మకంగా వుంది."

"ఈ మధ్యకాలంలో పరిపూర్ణత సాధిస్తున్నారు" అన్నాడు అబ్లాన్స్కీ సంతోషంగా కళ్ళల్లో చెమ్మ తిరిగేటట్టు ఆవులిస్తూ. "మాటకి థియేటర్ తీసుకో. కాబరేలు, ఆయ్!" మళ్లీ ఆవులించేడు. "విద్యుత్ దీపాలు యెక్కడ చూసినా... ఆయ్!"

"అవును, విద్యుత్ దీపాలు" అన్నాడు లేవిన్. "అవును. సరేగాని, వ్రాన్స్కీ యిప్పుడెక్కడ వున్నాడు?" అని వున్నట్టుండి అడిగాడు.

"వ్రాన్స్కీయా?" అని రెట్టించాడు అబ్లాన్స్కీ, ఆవులింత వస్తూవుంటే ఆపుకొని. "పీటర్స్‌బర్గ్‌లో ఉన్నాడు. నువ్వు వచ్చేసిన కొద్ది రోజులకే అక్కడికి వెళ్లిపోయాడు. మళ్లీ మాస్కో రాలేదు. విను, నిజం చెప్తాను" అన్నాడు మోచేతిని పక్కబల్లమీద ఆనుస్తూ. యెర్రటి చెక్కిళ్ళతో, అందంగా వున్న ముఖాన్ని అరచేతులమీద ఆన్చుకున్నాడు. నిద్రమత్తుగా, దయగా వున్న కళ్లు నక్షత్రాల్లా మెరుస్తున్నాయి. "అంతా నీదే తప్పు. నీ పోటీదారుణ్ణి చూసి బెదిరిపోయావు. అప్పుడే చెప్పానుకదా—నాకు నిజంగా తెలియదు యెవళ్లకి యెక్కువ అవకాశాలు ఉండిందీ. యెందుకు నువ్వు బరిమీదకి దూకలేదు? నేనప్పుడే చెప్పాను నీకు..." అతను నోరు తెరవకుండా దవడలతోనే ఆవులించాడు.

'నేను ఆమెని అడిగిన విషయం యితనికి తెలుసా, తెలీదా?' అని అతనికేసి చూసి లేవిన్ అనుకున్నాడు. 'ఇతని ముఖంలో కొంటెగా, గూఢంగా యేదో కనిపిస్తోంది.' తను సిగ్గుతో యెర్రబడుతున్నానని తెలిసీ అబ్లాన్స్కీ కేసి సరాసరి చూపాడు.

"అప్పట్లో కిట్టీ యేమన్నా భ్రమసిందీ అంటే పైపై మెరుగులు చూసి, అంతే. అతను పెద్ద జమీందారనీ, సంఘంలో గొప్ప హోదా వుందనీ మాయలో పడింది, అసలు ఆమె కాదు, వాళ్ల అమ్మ" అన్నాడు అబ్లాన్స్కీ.

లేవిన్ ముఖం చిట్లించాడు. తనని తిరస్కరించిన అవమాన గాయం అప్పుడే పొడిచిన దెబ్బలా సలిపింది. కాని అతను తన యింట్లో వున్నాడు. ఇంటిదగ్గర వున్నప్పుడు గోడలు కూడ ఆసరగా వుంటాయి.

"ఆగు, ఆగు" అన్నాడు అబ్లాన్స్కీ మాటకు అడ్డం వెడుతూ. "జమీందారు గిమిందారని అంటున్నావు. వ్రాన్స్కీలో గొప్పింటి అంశ యేముంది? నాకు తెలియక అడుగుతాను, ఆ మాటకొస్తే మరెవళ్లలోనైనా, నాకంటే అతని ఆధిక్యత వుందనడానికి? మీరు వ్రాన్స్కీని

జమీందారుగా చూస్తున్నారు. నేను చూడను. వాళ్ల నాయన యెవడు? వాళ్ల జట్టూ, వీళ్ల జట్టూ ముళ్లెట్టి పైకి వచ్చిన బాపతు. ఇక ఆ తల్లి వుంది. ఆ దేవుడికే తెలియాలి, యెన్ని గ్రంథాలు నడిపిందో... అబ్బ, మరేం అనుకోకు. నేనూ, నా తోటిగాళ్లం నిజంగా జమీందార్లం. నాలుగైదు తరాల వెనుకనుంచీ పరువు మర్యాదలున్న వాళ్లం, సాంప్రదాయక మైన కుటుంబాల వాళ్లం (ప్రతిభ, వ్యుత్పత్తులంటావా అది వేరే విషయం) యెవళ్ల ప్రాపకం కోసం పాకులాడిన వాళ్లం కాదు. ప్రాపకం అవసరమూ లేదు: మా తాత, తండ్రుల్లా బతికిన వాళ్లు — అలాంటివాళ్లని చాలమందిని యెరుగుదును. నేను అడవిలో చెట్లని లెక్క పెట్టడం నీకు చవక బారు వ్యవహారంగా కనిపిస్తుంది. ఆ ర్యబినిన్‌కేమో ముప్పై వేలు ముదుపు చెల్లిస్తావ్ నువ్వు. నువ్వు శిస్తులమీద బతుకుతావు. మరి యింకా పేటి పేటి మీదనో నాకు తెలియదు. నాకు అలా కాదు. అందుకనే నా పూర్వులనుంచి నాకు వారసత్వంగా సంక్రమించినదాన్నీ నా చెమటోడ్చి సంపాదించిన దాన్నీ నేను గర్వంగా చూసుకుంటాను. జమీందార్లం మేము, యెంగిలి మెతుకులమీద బతికే ఆ మనుషులు కాదు, యిరవై కోపెక్కుల నాణానికి అమ్ముడు పోయే రకం."

"నువ్వెవళ్లతో దెబ్బలాడుతున్నావ్? నువ్వనేది నేను కాదనడం లేదే" అన్నాడు అబ్లాన్‌స్కీ. ఇరవై కోపెక్కుల నాణానికి అమ్ముడుపోయే బాపతులో తన మిత్రుడు తనని కూడ చేరుస్తున్నాడని గ్రహించినా, నిజంగా ఉత్సాహంగానే మాట్లాడేడు. లేవిన్ ధాటీ అతనికి నచ్చింది. "ఎవరితో దెబ్బలాడుతున్నావు నువ్వు? నువ్వు వ్రాన్‌స్కీ గురించి చెప్పేదాంట్లో యెక్కువ భాగం నిజం కాదు. అయినా ఆ విషయం గురించి నేను మాట్లాడ్డం లేదు. నిజం చెప్తున్నా చూడు. నీ స్థానంలో నేను గనక వున్నట్టయితే నేను తిరిగి మాస్కో వెళ్లి...."

"లేదు నేను వెళ్లను. నీకు తెలుసో తెలియదో, నాకంతా ఒకటే. నీకు చెప్తున్నాను — నేను పెళ్లిప్రస్తావన చేసాను, తిరస్కారం పొందేను. ప్రిన్సెస్ కిట్టీ షెర్‌బాత్‌స్కీ యిప్పుడు నాకు బాధాకరమైన, అవమానకరమైన స్మృతి మాత్రమే."

"యెందుకని? అదేం తెలివితక్కువ మాట."

"ఇక దాని గురించి మనం మాట్లాడుకోవద్దు. నేను పరుషంగా వుంటే మరేం అనుకోకు" అన్నాడు లేవిన్. గుండె బరువు దింపేసుకోవడంతో ప్రొద్దుట వున్న హుషారు తిరిగి వచ్చింది. "నామీద కోపం వచ్చిందా నీకు? మా బాబువి కదూ, నామీద కోపగించుకోకు" అన్నాడు చిరునవ్వు నవ్వుతూ. అతని చేతిని తన చేతిలోకి తీసుకున్నాడు.

"యెంతమాట, కోప్పడాల్సింది యేముంది యిందులో. మనం విషయం మినహాయింపుల్లేకుండా మాట్లాడుకున్నాం. నాకు సంతోషంగా వుంది. విను, వాకో అప్పుడు వేట పొద్దుటి పూట క్షేమంగ్గా వుంటుంది. పొద్దున్నే వెడదామా? ఆ తర్వాత నిద్రపోను, వేటనుంచి సరాసరి స్టేషన్‌కి వెళ్లిపోతా."

"సరే, అలాగే."

18

వ్రాన్‌స్కీ ఆంతరంగిక జీవితం ప్రేమ భావంతో ఓతప్రోతంగా వున్నా, అతని బాహ్య జీవితం మాత్రం ఓరగా మళ్లకుండా, ఆగకుండా సామాజిక, రెజిమెంటల్ సంబంధాలు, ఆసక్తులు అనే నలిగిన పట్టాలమీదనే సాగిపోతూ వుంది. రెజిమెంటల్ ఆసక్తులు వ్రాన్‌స్కీ జీవితంలో గొప్ప స్థానాన్ని ఆక్రమించాయి. వ్రాన్‌స్కీ రెజిమెంట్‌ని ప్రేమించడం వల్లనే కాదు, మరీ యెక్కువగా యెందుకంటే రెజిమెంట్ అతనిని ప్రేమించింది కాబట్టి. రెజిమెంట్ అతనంటే అభిమాన పడడమే కాదు, అతన్ని ఆరాధించింది. అతనంటే వాళ్లకి గొప్ప. యెందుకంటే అతను అంతులేని ఐశ్వర్యం వున్నవాడు, గొప్ప విద్య, సామర్థ్యం వున్నవాడు. విజయేందిర యే పథంలోనేనా హారం వుచ్చుకుని తన కోసం సిద్ధంగా వుండేటు వంటివాడు; కీర్తిరీధితులు విరజిమ్ముకుంటూ వచ్చే అవకాశం వున్నవాడు. ఆ పథాలని వేటినీ పట్టుకోకుండా తన జీవితాసక్తులన్నిట్నీ పక్కన పెట్టి తన రెజిమెంట్ ఆసక్తులనీ, తన మనుషుల ఆసక్తులనీ ఆలింగనం చేసుకున్నాడు. కాబట్టి రెజిమెంట్ వాళ్లు తనని యెంతలా అభిమానించేదీ వ్రాన్‌స్కీకి బాగా తెలుసు. అలాంటి జీవితాన్ని ఆనందించడానికి తోడుగా వాళ్లు తనని యెంత అభిమానంగా చూస్తున్నారో దానికి తగ్గ అర్హత తనూ కనిపింప చెయ్యాలని అనుకున్నాడు.

తన ప్రేమ గురించి అతను తన మిత్రులెవళ్లతోనూ ప్రస్తావించలేదన్న విషయం స్పష్టమే. చిత్తుగా తాగిన సందర్భాలలో కూడా (యింతకీ అతను స్పృహ తప్పేటంతగా యెన్నడూ తాగడు) తన ప్రేమ సంబంధం విషయంలో సూచన ప్రాయంగానైనా యెవ రేనా పదరుబోతు ఓ మాట అనబోయినా తక్షణం వాడి నోరు మూయించేసేవాడు. అయినా గానీ అతని ప్రేమ విషయం వూరంతటికీ తెలిసింది. అతనికీ, అన్నా కరేనినాకి వున్న సంబంధాల గురించి ప్రతి ఒక్కళ్లూ యించుమించుగా నిశ్చయంగా వూహించారు. అతని ప్రేమలో దుస్పృహ పార్శ్వంవల్ల, అంటే సంఘంలో కరేనిన్ ఉన్నత స్థాయి హోదా తత్ఫలితంగా యీ వ్యవహారం ఉన్నత సమాజం దృష్టిలో పడడంవల్ల యెక్కువమంది యువకులు అతనంటే ఈర్ష్య పడ్డారు.

అన్నా విష్పలాంటిదని విని విని విసుగెత్తి పోయి ఆమె అంటే యీర్ష్యపడ్డ యువతులు చాలమంది అన్నాకి సంబంధించి లోకుల అనుమానాలు నిజమవుతాయని నోసిగ్గా చూస్తున్నారు. యిక తమ అక్కసు అంతా తీరేటట్టు విరుచుకు పడవచ్చు. పాపం పండే అదును కోసం చూస్తూ వాళ్లు ఆమె మీదకి విసిరేందుకుగాను అప్పుడే మట్టి ఉండల్ని సమకూర్చుకుంటున్నారు. యీ అవమానకరమైన గొడవ త్వరలో బద్దలయి పడబోవడం ఎక్కువ మంది నడివయస్కులు పలుకుబడిగల పెద్దలూ గర్హించారు.

వ్రాన్‌స్కీ ప్రేమకలాపం సంగతి విని మొదట్లో వాళ్లమ్మ సంతోషించింది. ఉన్నత

సమాజంలో ప్రేమ వ్యవహారం కంటే యెక్కువగా మరేదీ వో యువకుడి ప్రతిభకి మెరుగులు దిద్దదని ఆవిడ అభిప్రాయం. పైగా అన్నా కరేనినా అంటే ఆవిడకి ఆసక్తి కలిగింది. తన కొడుకు గురించి అంతలా చెప్పిన ఆమె కూడా ఆవిడ అభిప్రాయంలో పరువు మర్యాదలున్న అందమైన ఆడవాళ్లందరూ చేసినట్టే చేసిందన్న విషయం కూడా ఆవిడకి తృప్తి కలిగించింది. కాని అన్నాకి దగ్గరగా వుండాలన్న కోరికతో తన కొడుకు ఉద్యోగ జీవితంలో ముందుకు పోయే అవకాశాన్ని తిరస్కరించాడని యిటీవలే ఆవిడకి తెలిసింది. అలా తిరస్కరించడం పై స్థానాల్లో వున్న కొందరు అధికార్లకి అసంతృప్తి కారకమైందనీ ఆవిడకి తెలిసింది. అందుచేత ఆవిడ తన వైఖరిని మార్చుకుంది. మరో కారణంవల్ల కూడ ఆవిడ యీ సంబంధాన్ని ఆమోదించలేకపోయింది. యీ సంబంధాన్ని గురించి ఆమెకి తెలిసిన అన్నిట్నీ బట్టీ తను వూః అనేటువంటి తేజోవంతమైన, సొగసైన ఉన్నత సమాజ వ్యవహారం కాదు యిది, ఆమెకి తెలిసినట్టు ఒక రకమైన వెర్తర్ కాంక్ష*, పిచ్చికోరిక తన కొడుకుని తెలివి తక్కువ పనులు చేసేటట్టు పురికొల్పేది. అతను అనుకోకుండా మాస్కో వదిలి వెళ్లిపోయాక ఆవిడ అతన్ని చూడలేదు. అతను మాస్కో వచ్చి తనని చూడాలని పెద్దకొడుకుద్వారా హుకుం పంపించింది.

అన్నకు కూడ తమ్ముడి వ్యవహారం నచ్చలేదు. అది యెలాంటి ప్రేమ అనే విషయం జోలికి అతను వెళ్లలేదు. ఘనమైందా, అల్పమైందా, కాంక్షాభరితమైందా లేదా, పాపపూరితమైందా కాదా అనే వాటిని వేటినీ పట్టించుకోలేదు. (తను పిల్లల తండ్రి అయినా వో నర్తకిని చేరదీసాడు, అందుచేత యిలాంటి విషయాలకి సంబంధించి విశాలమైన దృష్టి కనబర్చేడు.) కాని వ్రాన్స్కీ అంటే యిష్టం కలగవలసిన వాళ్లకి యీ ప్రేమ వ్యవహారం యిష్టంగా లేదు కాబట్టి తనూ దాన్ని ఆమోదించలేదు.

వ్రాన్స్కీకి సైన్యంలో కొలువుకీ, సమాజ జీవితానికీ తోడుగా మరో వ్యాపకం కూడ ఉంది. గుర్రాలు. అవంటే అతనికి వెర్రి వ్యామోహం.

ఆ యేడు ఆఫీసర్లకోసం అవరోధాలు దాటే గుర్రపు పందెంని యేర్పాటుచేసారు. అందులో చేరడానికి వ్రాన్స్కీ పేరిచ్చాడు. అచ్చమైన జాతి ఇంగ్లీషు అశ్వాన్ని కొన్నాడు. ప్రేమ వ్యవహారం వున్నా, తీవ్రకాంక్షతో, కొంచెం అదుపులో ఉంటూనే యీ రాబోయే పందెం కోసం యెదురుచూశాడు.

యీ రెండు కాంక్షలూ ఒకదాని నొకటి స్పర్థించలేదు. పైగా అతనికి కొంచెం యే మార్పు కావలసి వచ్చింది. భావావేశపూరితమైన ప్రేమనుంచి కొంచెం మళ్లడం అవసరం అయింది.

19

క్రాస్నయె సెలోలో గుర్రప్పందేలు జరిగే రోజున వ్రాన్స్కీ రెజిమెంట్ భోజనశాలలో మాంసం తిందామని మామూలు వేళకంటే పెందరాళే వెళ్లాడు. ఖచ్చితమైన ఆహార

నియమం పాటించవలసిన అవసరం అతనికి లేదు. వుండవలసిన పరిమితిలోనే డబ్బై రెండు కిలోగ్రాముల బరువు వున్నాడు. ఏమైనా యిక బరువు యెక్కకూడదు. అందుకని రొట్టె, తీపివదార్థాలు వదిలేసాడు. అతను రెండు మోచేతుల్నీ బల్లమీద ఆన్చుకున్నాడు. తెల్లటి వెయిస్ట్ కోటుమీద వేసుకున్న జాకెట్‌కి బొత్తాలు పెట్టుకోలేదు. మాంసం వద్దనకోసం చూస్తూ ఫ్రెంచి నవలని ప్లేటుమీద తెరిచి పెట్టి చదువుతూ కూర్చున్నాడు. అతను పుస్తకం కేసి అలా తేరి చూస్తూ తన ఆలోచనల్లో తను వున్నాడు. పుస్తకం తెరిచి వుంచడంలో ఉద్దేశం లోపలికి వస్తూ పోతూవున్న ఆఫీసర్లతో మాట్లాడకుండా తప్పించుకోవడమే.

అతని ఆలోచనలు ఆన్నా మీదనే వున్నాయి. ఆ వేళ పందేలయాక తనని కలుసుకుంటానని మాట యిచ్చింది. మూడు రోజులుగా అతను ఆమెని చూడలేదు. ఆమె భర్త అప్పుడే విదేశయాత్రనుంచి తిరిగి వచ్చిన దాని వల్ల అన్నమాట ప్రకారం తనని కలుసుకుంటుందో లేదో తెలియదు. యెలా ఆ విషయం తెలుసుకోవాలో తెలియలేదు. కిందటిసారి ఆమెని అతని బంధువు అయిన బెట్సీ దాచాలో చూశాడు. కరేనిన్ల దాచాకి తను వీలైనంత తక్కువ వెళ్లేవాడు. ఇప్పుడు అక్కడికి వెళ్లాలనుకున్నాడు. యెలా వెళ్లాలా అని యిప్పుడు ఆలోచించడం మొదలుపెట్టాడు.

'తను పందేలకి వస్తుందో రాదో కనుక్కోమని నన్ను బెట్సీ పంపించిందని చెప్తాను. పూఁ వెడతాను' అని పుస్తకంమీదనుంచి తలపైకి యెత్తి మనస్సులో తీర్మానించుకున్నాడు. ఆమెని కలుసుకుంటున్నాను అన్న వూహకే అతని ముఖం వెలిగింది.

"మా యింటికి కబురు చేసి అమమేఘాలమీద మూడుగుర్రాల బండిని పంపించమన్నానని చెప్పు" అని వేడిగా వున్న వెండిపళ్లెంలో మాంసం తెచ్చిన వెయిటర్‌కి చెప్పాడు. పళ్లేన్ని తన వేపు లాక్కుని తినడం మొదలుపెట్టాడు.

పక్కనే బిలియర్డ్స్ గది వుంది. ఏవో గొంతుకల ధ్వనులు, నవ్వులు, బంతులు టకటక కొట్టుకోవడం వినిపిస్తున్నాయి. ముందు గుమ్మంలోనుంచి యిద్దరు మిలిటరీ ఆఫీసర్లు లోపలికి వచ్చేరు. ఒకతను పడుచువాడు. పల్చగా పాలిపోయిన ముఖం వున్న మనిషి. కొత్తగా యీ రెజిమెంట్‌కి పేజ్ కోర్*నుంచి వచ్చేడు. రెండో అతను బొద్దుగా వుండే పెద్దాయన. ఆయన చిన్న కళ్లు లోపలికి దిగినట్టు వున్నాయి. చేతికి కడియం పెట్టుకున్నాడు.

వ్రాన్‌స్కీ వాళ్లకేసి చూసాడు. ముఖం చిట్లించుకున్నాడు. కళ్లు పుస్తకం కేసి తిప్పుకున్నాడు. వాళ్లని చూడనట్టు, తింటూ, చదువుకుంటూ వుండిపోయేడు.

"యేం కార్యనిర్వహణకోసం పుంజుకుంటున్నావా?" అని బొద్దుగా వున్న ఆఫీసరు అతని పక్కన కూర్చుంటూ అడిగేడు.

"చూస్తున్నావుగా" అన్నాడు వ్రాన్‌స్కీ పైకి చూడకుండానే కనుబొమలు చిట్లిస్తూ, మూతి తుడుచుకున్నాడు.

"లావెక్కి పోతావేమో" అన్నాడు అతను, పడుచు ఆఫీసర్ కోసం కుర్చీ యివతలకు లాగుతూ.

"యేమిటి?" అన్నాడు వ్రాన్‌స్కీ అయిష్టంగా ముఖం పెడుతూ. చక్కని కుదురైన తెల్లని పలువరుస కనిపించింది.

"లావెక్కి పోతావేమోనని భయం లేదా?"

"వెయిటర్! షెర్రీ పట్టా" అన్నాడు వ్రాన్‌స్కీ జవాబివ్వకుండా. పుస్తకం రెండోవేపు పెట్టుకొని చదవడం మొదలుపెట్టాడు.

బొద్దు ఆఫీసరు వైన్ల లిస్టు తీసుకొని పడుచు ఆఫీసరుకి యిచ్చేడు.

"యేం కావాలో నువ్వే చూడు" అన్నాడు అతనికా లిస్టు అందించి అతనికేసి చూస్తూ.

"బహుశా రైన్‌వైన్ బాగుంటుంది" అన్నాడు పడుచు ఆఫీసరు; వ్రాన్‌స్కీకేసి బిడియంగా చూస్తూ పల్చగా వున్న మీసాల్ని దువ్వుకున్నాడు. వ్రాన్‌స్కీ తనని అసలు యేం పట్టించుకోవడం లేదని గమనించి పడుచు ఆఫీసరు లేచాడు.

"బిలియర్డ్సు ఆడదాం పద" అన్నాడు.

బొద్దు ఆఫీసరు మారుమాట్లాడకుండా లేచాడు. ఇద్దరూ కలిసి వెళ్ళిపోయారు.

సరిగ్గా ఆ సమయంలో కేప్టెన్ యాష్విన్ లోపలికి వచ్చేడు. అతను పొడగరి. దృఢకాయుడు. యీ యిద్దరి ఆఫీసర్లకేసీ వోసారి చూసి వ్రాన్‌స్కీ కూర్చున్న బల్ల దగ్గరికి వెళ్ళేడు.

"నువ్విక్కడున్నావా!" అని పెద్ద చేత్తో వ్రాన్‌స్కీ భుజంమీద చరుస్తూ అరిచాడు. వ్రాన్‌స్కీ కోపంగా తల యెత్తి చూశాడు. కాని మరుక్షణంలోనే అతనికి సహజంగా వుండే దృఢమైన, ప్రశాంత భరితమైన కాంతి అతని ముఖంమీద కనిపించింది.

"మంచిది మిత్రమా" అన్నాడు కేప్టెన్ ఖంగుమనే గొంతుకతో. "భోజనం అయిపోతే నాతో కలిసి కొంచెం తాగు" అన్నాడు.

"భోజనం చెయ్యాలని లేదు."

"చూడు జంటకవులు వాళ్ళిద్దరూ" అన్నాడు యాష్విన్. గదిలోనుంచి బయటికి వెళ్ళిపోతున్న ఆఫీసర్లకేసి చీదరించుకొని చూస్తూ. అతను వ్రాన్‌స్కీ ప్రక్కన కూర్చున్నాడు. బిగుతు బ్రీచెస్ తొడుక్కున్న కాళ్ళని విబ్బరంగానే వుంచేడు. ఆ బల్లకింద పట్టనంత పొడుగు వున్నాయవి. "రాత్రి థియేటర్‌కి రాలేదేం? న్యూమెరోవా పర్లేదు. యెక్కడ వున్నావు?"

"ప్రిన్సెస్ బెట్సీ యింటి దగ్గర ఆలస్యమైపోయింది" అన్నాడు వ్రాన్‌స్కీ.

"అలాగా" అన్నాడు యాష్విన్.

యాష్విన్ తిరుగుబోతు, జూదరి. మనిషికి నీతి నియమాలు లేకపోవడం సరేసరి వున్నవన్నీ అవినీతి నియమాలే. అలాంటి యాష్విన్ వ్రాన్‌స్కీకి రెజిమెంటులో ప్రాణమిత్రుడు.

అతనికి వున్న గొప్ప శారీరక శక్తిని వ్రాన్‌స్కీ మెచ్చుకుంటాడు. ఆ శక్తి అధిక భాగం సముద్రాల కొద్దీ సారా తాగడంలోనూ నిద్రలేకుండా గడపడంలోనూ, అయినా బుద్ధి విశేషాలు నిలబెట్టుకోవడంలోనూ ప్రదర్శితమవుతూ వుంటుంది. తనతో కలిసి పనిచేసే వాళ్లతోనూ, పై అధికార్లతోనూ ఒకేమాదిరిగా అతనికి వుండే సంబంధాలలో అతని గొప్ప నైతిక శక్తి వెల్లడవుతుంది. వాళ్లందరూ దానివల్ల అతనంటే భయపడతారు, అతన్ని గౌరవిస్తారు. అదే శక్తి అతని జూదంలో కూడ వెల్లడి అవుతుంది. వేల వేల మొత్తాలతో ఆడేస్తాడు. ఎంతో సాహసంగా, లాఘవంగా ఆడేస్తాడు, యెంత తాగినాగాని. అందుకని అతనికి ఇంగ్లీషు క్లబ్బులో సాటిలేని మేటి అని పేరు వచ్చింది. కాని వ్రాన్‌స్కీ అతన్ని గాఢంగా అభిమానించడానికి చెప్పుకో దగ్గ కారణమేమిటంటే తన పేరుకీ, డబ్బుకీ గాక వ్యక్తిగా తనంటే అతను యిష్టపడడమే. తన పరిచయస్థులందరిలోకీ వ్రాన్‌స్కీ తన ప్రేమని గురించి చెప్పడానికి యిష్టపడింది ఒక్క యాష్విన్‌కే. మమకారాలంటే పైకి యాష్విన్ యేవగింపుగా చూసినా అతనొక్కడే తన జీవిత సర్వస్వాన్నీ ఆవహించిన తీవ్ర అనురాగ భావనని అర్థం చేసుకో గలవాడని వ్రాన్‌స్కీకి అనిపించింది. పైగా యాష్విన్ దాన్ని చూసి పుకార్లు, అపనిందలు కలిగించే ఆనందంలో తుళ్లిపోడు. దాన్ని యే రీతిలో అర్థం చేసుకోవాలో ఆ రీతిలో అర్థం చేసుకుంటాడు. అంటే తన ప్రేమ యేదో మజా వ్యవహారం అనీ, తాత్కాలిక వ్యామోహం అనీ కాక నిజమైన లోతైన విషయం అని గ్రహిస్తాడు.

వ్రాన్‌స్కీ అతనితో తన ప్రేమ గురించి చెప్పలేదు కాని అతనికి మొత్తం అంతా తెలుసు, అంతా సరియైన రీతిలో అర్థం అయింది అని వ్రాన్‌స్కీకి తెలుసు. అతని కళ్లల్లో ఆ భావాన్ని చదివి వ్రాన్‌స్కీకి సంతోషం కలిగింది.

"ఆహా, అలాగా" అన్నాడు యాష్విన్ తను బెట్సీ యింటిదగ్గర వున్నానని చెప్పినప్పుడు. తన నల్లని కళ్లల్లో మెరుపు దూసుకుపోగా అతను యెడమ మీసం పట్టుకుని నోట్లో పెట్టుకున్నాడు. అతని దురలవాటు అది.

"నిన్న సాయంత్రం యేం చేసావ్? నెగ్గావా?" అని వ్రాన్‌స్కీ అడిగాడు.

"ఎనిమిది వేలు. అందులో మూడు వేలు కచ్చా అనుకో."

"అయితే పర్లేదు. ఇవాళ నామీద పందెం వోడిపోయినాగాని" అని వ్రాన్‌స్కీ నవ్వేడు. (యాష్విన్ వ్రాన్‌స్కీమీద పెద్ద పందెం కట్టేడు.)

"నాకు వోడిపోవాలని లేదు. నీ వొక్క ప్రత్యర్థి మఖోతిన్."

ఆవేళ పందెంలో జరగబోయే వాటి గురించి ఏయే ఊహాగానాలు సాగుతున్నాయో వాటి మీదకి సంభాషణ మళ్లింది. వ్రాన్‌స్కీ యిప్పుడు పందెం గురించి మాత్రమే ధ్యాస పెట్టేడు.

"రా పోదాం" అన్నాడు వ్రాన్‌స్కీ లేచి నుంచుని. గుమ్మం దగ్గరికి దారి తీసేడు. యాష్విన్ కూడ పొడుగాటి కాళ్లు, లొమ్ము చాచుకుంటూ లేచాడు.

"భోజనానికి యింకా చాల పొద్దు వుంది. నాకు కొంచెం తాగాలని వుంది. ఓ క్షణంలో

నిన్ను కలుస్తా. వెయిటర్, కొంచెం వైన్ పట్రా" అని అతను గట్టిగా అరిచాడు. ఖంగుమని మోగే అతని కంఠధ్వని రెజిమెంట్‌లో పేరుమోసింది. అతను అరిస్తే కిటికీలు హో మాదిరిగా అదురుతాయి. "పూః పోన్లే, వద్దులే" అని మళ్ళీ అరిచాడు. "నువ్వింటికి వెడితే నేనూ వస్తా" అన్నాడు వ్రాన్‌స్కీతో.

అతనూ, వ్రాన్‌స్కీ కలిసి వెళ్ళిపోయారు.

20

వ్రాన్‌స్కీ ఫిన్నిష్ రైతుకుటీరంలో బస చేసాడు. అది పెద్దది, శుభ్రంగా వుంది. అడ్డ గోడ కట్టి రెండు భాగాలుగా వుంది. శిబిరంలో కూడ పెత్రీత్‌స్కీ అతనితోనే వుండేవాడు. వ్రాన్‌స్కీ యాష్విన్‌లు వచ్చేటప్పటికి పెత్రీత్‌స్కీ నిద్రపోతున్నాడు.

"లే యిక పడుకున్నది చాలు" అన్నాడు యాష్విన్ అడ్డం కట్టిన విభాగంలోకి వెళ్ళి పెత్రీత్‌స్కీని కుదుపుతూ. పెత్రీత్‌స్కీ ముఖం తలగడలో దూర్చేసుకుని నిద్రపోతున్నాడు.

పెత్రీత్‌స్కీ ఒక్క ఉదుటున మోకాళ్ళమీద లేచి అటూ యిటూ చూడ్డం మొదలు పెట్టాడు.

"మీ అన్న వొచ్చేడు" అన్నాడు వ్రాన్‌స్కీని చూసి. "దుంపతెగ నన్ను లేపాడు. మళ్ళీ వస్తానన్నాడు." ఇంకోసారి దుప్పటీ లాక్కుని మళ్ళీ తలగడలో దూరేడు. "అబ్బ అవు యాష్విన్" అన్నాడు చిరాగ్గా యాష్విన్‌తో. యాష్విన్ అతను కప్పుకున్న దుప్పటిని లాగేస్తున్నాడు. "యెహె, అవు!" అని యిటు తిరిగి కళ్ళు తెరిచాడు. "నోరంతా యేదోలా వుంది, యేం తాగితే మంచిదో చెప్పు" అన్నాడు.

"వోద్కాని మించింది లేదు" అని యాష్విన్ బంయ్‌మంటూ చెప్పేడు. "తెరేష్చెంకో, మీ సాబ్‌కి కొంచెం వోద్కా, దోసకాయలూ పట్రా" అని పిలిచాడు, తన కంఠస్వరానికి తనే ఆహా అనుకుంటూ.

"వోద్కా అంటావా? యేహ్?" అన్నాడు పెత్రీత్‌స్కీ. ముఖం ముడతలు పడేసుకుని, కళ్ళు నులుముకున్నాడు. "నువ్వు తాగుతావా? భేష్ కలిసి తాగుదాం. నువ్వూ వ్రాన్‌స్కీ?" అని అడిగాడు పెత్రీత్‌స్కీ. లేచి దుప్పటి చుట్టబెట్టుకున్నాడు.

అడ్డ గోడ గుమ్మం దాటి లోపలికి వెళ్ళేడు. చేతులు యెత్తి ఫ్రెంచిలో పాడడం మొదలు పెట్టాడు. "'మహారాజా తూ.... లా....'* వ్రాన్‌స్కీ, నువ్వూ తాగు కొంచెం."

"ఛస్, పో" అన్నాడు వ్రాన్‌స్కీ, తన నౌకరు తెచ్చిన కోటు తొడుక్కుంటూ.

"యెక్కడికి వెడుతున్నావ్?" అని యాష్విన్ వ్రాన్‌స్కీని అడిగేడు. "అదుగో, బండి వస్తోంది."

"గుర్రాలశాలకి వెడుతున్నాను. తర్వాత వెళ్లి గుర్రాల గురించి కనుక్కోవడానికి బ్రియాన్‌స్కీ దగ్గరికి వెళ్లాలి" అన్నాడు వ్రాన్‌స్కీ.

వ్రాన్‌స్కీ నిజంగానే బ్రియాన్‌స్కీ దగ్గరకు వెళ్లి గుర్రాల ఖరీదు చెల్లిస్తానని మాట యిచ్చేడు. బ్రియాన్‌స్కీ పీటర్‌హాఫ్*కి పది కిలోమీటర్ల దూరంలో వుంటాడు. ఇప్పుడా పని కూడా పూర్తి చెయ్యాలని అనుకున్నాడు. కాని అతను ఒక్క బ్రియాన్‌స్కీ దగ్గరికి మాత్రమే వెళ్లడం లేదని అతని మిత్రులకి అర్థమైంది.

పెత్రిత్‌స్కీ పాట ఆపకుండానే కళ్లతో పైగచేసి పెదాలు ముడిచాడు. 'నీ బ్రియాన్‌స్కీ కథ మాకు తెలుసులే' అన్నట్టు వుందా భంగిమ.

"నువ్వేం ఆలస్యం చెయ్యకుస్మా" అని మాత్రమే యాష్విన్ అన్నాడు. తర్వాత ప్రసంగ విషయం మార్చడానికి "గుర్రాల బండికి కట్టిన గుర్రాల్లో మా ముఖ్య గుర్రం బాగా వుంది కదా?" అని అడిగాడు. కిటికీలోనుంచి బయటికి గుర్రంకేసి చూపాడు. తనే దాన్ని వ్రాన్‌స్కీకి అమ్మేడు.

"ఆగు" అని పెత్రిత్‌స్కీ బయటకు వెడుతూ వున్న వ్రాన్‌స్కీ కేసి అరిచాడు. "మీ అన్నయ్య యేదో చీటీసీ, ఉత్తరాన్నీ యిచ్చేడు. యెక్కడున్నాయో అవి" అన్నాడు.

వ్రాన్‌స్కీ ఆగేడు.

"ఎక్కడున్నాయి?"

"ఎక్కడున్నాయి? అదే యిప్పుడు ప్రశ్న" అని గంభీరంగా అన్నాడు పెత్రిత్‌స్కీ, ముక్కు పైనుంచి తర్జని పోనిస్తూ.

"ఛస్, వేళాకోళం కట్టిపెట్టు" అన్నాడు వ్రాన్‌స్కీ చిరునవ్వు నవ్వుతూ.

"నేనేం వాటిని తగలెయ్యలేదు. యిక్కడెక్కడో వుంటాయి."

"చాలుగాని, యేదా ఉత్తరం?"

"నిజం చెప్తున్నాను గుర్తులేదు. లేకపోతే యిదంతా కలా? ఆగు, ఆగు... కోపం వద్దు. నాకు లాగా రాత్రి నాలుగు సీసాలు తాగితే నువ్వు నీ పేరే మరిచిపోతావు. ఆగు, గుర్తుకొస్తుంది."

పెత్రిత్‌స్కీ అవతలి కావాలోకి వెళ్లాడు. మంచంమీద పడుకున్నాడు.

"యిక్కడ పడుకున్నాను. అతను అక్కడ నుంచున్నాడు. ఆఁ, ఆఁ! యిదిగో యిక్కడ వుంది" అని పరుపుకింద దాచిన ఉత్తరాన్ని తీసి యిచ్చేడు.

వ్రాన్‌స్కీ అన్నగారు యిచ్చిన చీటీని, ఉత్తరాన్ని తీసుకున్నాడు. తను వూహించిందే. తనని చూడడానికి రానందుకు తిడుతూ తల్లి రాసిన ఉత్తరం. అన్నగారి చీటీలో ఆయన తనతో మాట్లాడాలనుకుంటున్నట్టు ఉంది. అంతా అదే విషయం గురించి అని వ్రాన్‌స్కీకి తెలుసు. 'వాళ్లకేం సంబంధం?' అనుకున్నాడు. దారిలో మరింత శ్రద్ధగా చదువుకోవచ్చని ఉత్తరాన్ని మడిచి కోటు బొత్తాం వెనుక దోపుకున్నాడు. బయటకు వెళ్లి

పోతూ వుంటే యిద్దరు ఆఫీసర్లు తగిలారు. ఒకతను వాళ్ల రెజిమెంట్ వాడే. రెండో అతను వేరే రెజిమెంట్ వాడు.

వ్రాన్‌స్కీ బసలోనే ఆఫీసర్లందరూ యెప్పుడూ చేరతారు.

"యెక్కడికి?"

"పనిమీద పీటర్‌హాఫ్‌కి."

"త్సార్స్కొయె సెలో నుంచి గుర్రం వచ్చిందా?"

"వచ్చిందిగాని నేనింకా చూడలేదు."

"మహోతిన్ గుర్రం గ్లాడియేటర్ కుంటుతుం దంటున్నారు."

"శుద్ధ అబద్ధం. కాని యీ బురదలో పందేలు యెలాగ?" అని రెండో ఆఫీసరు అన్నాడు.

"అమ్మయ్య నన్ను రక్షించేవాళ్లు వచ్చారు!" అని అరిచాడు పెత్రిత్‌స్కీ యీ కొత్తవాళ్లని చూసి. అతని నౌకరు ట్రేలో వోడ్కా, దోసకాయలూ పట్టుకొచ్చి అతని ముందు నుంచున్నాడు. "తాజాగా తయారవాలంటే నేను మళ్లీ తాగాలని యాష్విన్ అంటున్నాడు" అన్నాడు.

"నిన్న రాత్రి ముంచావు కదా మమ్మల్ని, కంటిమీద కునుకు లేదు" అన్నాడు ఆ వచ్చిన వాళ్లలో ఒకతను.

"నిన్న యెలా ముగిసిందో విన్నారా? నిమ్గ్గా వుందో అంటూ వోల్కోవ్ కప్పుమీదకి యెక్కి గొడవ మొదలెట్టాడు. రండి సంగీతం మొదలెడదాం అన్నాను నేను – శవ సంగీతం. అలా నిద్రపోయాడు శవ సంగీతంతో కప్పుమీద" అన్నాడు పెత్రిత్‌స్కీ.

"పూఁ యింద తాగు. వో గ్లాసు వోడ్కా, సోడా, నిమ్మరసం" అన్నాడు యాష్విన్ పెత్రిత్‌స్కీమీద చంటిపిల్లకి మందు యిచ్చే తల్లిలాగ వాలి. తర్వాత కొంచెం షాంపేన్. ఒక సీసాకంటె యెక్కువ వద్దు" అన్నాడు.

"అదీ పసహో అంటే. ఆగు, వ్రాన్‌స్కీ కొంచెం తాగు."

"వద్దు, వుంటా మరి. యివాళ తాగను."

"బరువు పెంచుతుం దనుకుంటున్నావా? నువ్వు లేకుండానే మేము తాగుతాంలే. సోడా, నిమ్మరసం పట్రా."

వ్రాన్‌స్కీ గుమ్మం దగ్గరికి వెళ్లేటప్పటికి "వ్రాన్‌స్కీ!" అని యెవరో పిలిచారు.

"యేం?"

"క్షవరం చేయించుకో. చాల భారంగా వున్నట్టుంది. మరీ బోడితలమీద!"

వ్రాన్‌స్కీ జుట్టు నిజంగానే అకాలంగా పలచబడుతోంది. అతను సరదాగా నవ్వేడు. కుదురైన పలువరస బయటికి కనిపించింది. జుట్టులేని భాగం మీదకి టోపీ లాక్కున్నాడు వెళ్లి బండి యెక్కాడు.

"శాలకి" అన్నాడు. మళ్లీ చదవడానికి ఉత్తరం తీద్దామని అనుకుని, గుర్రం చూసే దాకా వేరే ధ్యాస యెందుకు లెమ్మన్నట్టు మానుకున్నాడు. 'తర్వాత!..'

21

శాల తాత్కాలికంగా నిలబెట్టిన కొయ్యకొట్టం. పందేల చోటుదగ్గర దాన్ని కట్టేరు. అతని గుర్రాన్ని అంతకు ముందు రోజునే అక్కడికి తీసుకువచ్చారు. ఇంకా అతను దాన్ని చూడలేదు. గత కొన్ని రోజులుగా తను దానిమీద స్వారీ చేయలేదు. ఆ పనిని ట్రెయినర్‌కి అప్పగించేడు. తన గుర్రం యే స్థితిలో వచ్చిందో, యెలా వుందో ఆ క్షణంలో అతనికి అంచనా లేదు. అతను బండి యింకా దిగీదిగకుండానే బండిని గుర్తుపట్టిన అతని నౌకరు ట్రెయినర్ని పిలిచాడు. అతను బక్కపల్చగా వుండే ఇంగ్లీషతను. యెత్తు బూట్లు తొడుక్కున్నాడు. కురచ వెస్ట్ వేసుకున్నాడు. చిరుగడ్డం వుంది. జాకీలకి వుండే వింత నడక నడుస్తూ, మోచేతులు చాచి, వ్రాన్‌స్కీని కలుసుకోవడానికి వచ్చేడు.

"ఊఁ, ఫ్రూ ఫ్రూ యెలా వుంది?" అని వ్రాన్‌స్కీ యింగ్లీషులో అడిగాడు.

"All right, sir, అంతా సవ్యంగా వుంది హుజూర్" అన్నాడా ఇంగ్లీషతను. అతని మాట అతని గొంతుకలోనే వున్నట్టుంది. "దాని దగ్గరకు వెళ్లద్దు లెండి" అన్నాడు టోపీ యెత్తి. "చిక్కం కట్టేను. చిరాగ్గా వుంది. దగ్గరికి వెడితే దానికి ఉద్రేకం యెక్కువ అవుతుంది" అన్నాడు.

"లేదు, వెళతాను. చూడాలి దాన్ని."

"అయితే రండి" అన్నాడా ఇంగ్లీషతను కనుబొమలు చిట్లిస్తూ. మళ్లీ మాటల్ని పళ్ల మధ్యనుంచి జల్లిస్తూ పలికేడు. వూగుకుంటూ నడుస్తూ మోచేతులు ఆడిస్తూ వెళ్లాడు.

శాలముందు వున్న పెరడులోకి వెళ్లారు. శాల నౌకరు కుర్రాడు తలబిరుసు వాడు. ధగధగ మెరిసే చొక్కా తొడుకున్నాడు. అతని చేతిలో చీపురు వుంది. వీళ్లని చూసి వీళ్లతో కలిసి వెళ్లాడు. శాలలో అయిదు గుర్రాలున్నాయి. తనకి గట్టి పోటీ యిచ్చే మఖోతిన్ గుర్రం గ్లాడియేటర్ వాటిల్లో వొకటని వ్రాన్‌స్కీకి తెలుసు. దాన్ని ఆ రోజున అక్కడికి తీసుకువచ్చి వుండాలి. ఎత్తరిగా ఎర్రరంగులో వున్న గుర్రం అది. తన గుర్రం కంటే కూడా యెక్కువగా గ్లాడియేటర్‌ని చూడాలనిపించింది. దాన్ని అంతకు ముందెన్నడూ చూడలేదు. కాని పందేల మర్యాద ప్రకారం దాన్ని చూడ్డం సరేసరి దాన్ని గురించి అడగడం కూడా ధర్మం కాదని అతనికి తెలుసు. అతను నడవలో వెడుతూ వుంటే శాల కుర్రాడు యెడమ వేపున వున్న రెండో శాల తలుపు తెరిచాడు. వ్రాన్‌స్కీకి ఎర్రరంగు పెద్ద గుర్రం కనిపించింది. దానివి తెల్లవి కాళ్లు. అది గ్లాడియేటర్ అని అతనికి తెలుసు. కాని ముందు యెవరిదో పరాయివాళ్ల ఉత్తరం

తెరిచివుంటే దాన్ని చూడకుండా తప్పించుకొనే వ్యక్తిలాగ అతను తల పక్కకి తిప్పి ఫ్రూ ఫ్రూ ఉన్న శాలకి వెళ్లాడు.

"ఆ గుర్రం మాక్... మాక్... యేమిటో ఆ పేరు చప్పినా నా నోరు తిరగదు" అంటూ ఆ ఇంగ్లీషతను గ్లాడియేటర్‌కేసి బొటన వేలితో చూపించాడు. పెద్ద మకిలి గోరువున్న బొటనవేలు అతనిది.

"మఖోతిన్‌దా? అవును అతనొక్కడే నాకు గట్టిపోటీ" అన్నాడు వ్రాన్‌స్కీ.

"మీరు దీనిమీద స్వారీ చేసేటట్టయితే నేను పూర్తిగా మీ తరఫున పందెం వుంటా" అన్నాడు ఇంగ్లీషతను.

"ఫ్రూ ఫ్రూకి ఉత్తేజం యెక్కువ. గ్లాడియేటర్‌కి శక్తి యెక్కువ" అన్నాడు వ్రాన్‌స్కీ. తన స్వారీ సామర్థ్యం పొగడ్త అందుకున్నందుకు పెదాలమీద చిరునవ్వు విరిసింది.

"అవరోధాల పందెంలో అంతా స్వారీమీదా, pluckమీదా ఆధారపడి ఉంటుంది" అన్నాడు ఇంగ్లీషతను.

తన pluck అంటే శక్తి, ధైర్యం ఆ సందర్భానికి సరిపోతుందని అనుకున్నాడు. కాని మరీ ముఖ్యమైంది యేమంటే మరెవళ్లకీ అంతకంటె యెక్కువ pluck వుండదని వ్రాన్‌స్కీ దృఢ విశ్వాసం.

"యిక బరువు తగ్గించే శిక్షణ అవసరం లేదంటారా?"

"అక్కర్లేదు" అన్నాడు ఇంగ్లీషతను. "కొంచెం మెల్లగా మాట్లాడండి, గుర్రం ఆవేశపడుతుంది" అన్నాడు తాళం వేసిన శాల ముందు నుంచుని. లోపలనుంచి గుర్రం గడ్డిలో గిట్టలతో కొట్టుకోవడం వినిపిస్తోంది.

అతను తలుపు తెరిచాడు. వ్రాన్‌స్కీ మసకగా వున్న శాలలోకి వెళ్లాడు. దానికి చిన్న కిటికీ వుంది. అందులో నుంచే కొంచెం వెలుతురు వస్తోంది. చిక్కం కట్టిన గోధుమ రంగు గుర్రం గడ్డిమీద నుంచుని కాళ్లు కదిలిస్తోంది. మసక వెలుతురులోకి పరీక్షగా చూసేడు వ్రాన్‌స్కీ. తన ప్రియమైన గుర్రం అందాన్ని ఒక్కసారి చూశేడు. ఫ్రూ ఫ్రూ సామాన్యమైన యెత్తువున్న గుర్రం. రూపంలో మరీ దోషరహితంగా వుండదు. దాని జీను భాగం చిన్నది. ఛాతీ సన్నం. కాని యెక్కువగా ముందుకు చొచ్చుకుని వుంది. దాని కటి భాగం కొంచెం వాలి వుంటుంది. దాని కాళ్లు, ముఖ్యంగా వెనక కాళ్లు, వో మాదిరిగా దొడ్డికాళ్లు. ముందు కాళ్లని గాని, వెనక కాళ్లని గాని కండరాలు మరీ ప్రస్ఫుటంగా పెద్దవి కావు. దాని కడుపు పల్చగా వుండడంవల్ల అది ముఖ్యంగా మంచి తీరులో వుండడంవల్ల అంస ఫలకం దగ్గర బాగా వెడల్పుగా కనిపించింది. ఎదరనుంచి చూస్తే దాని కాలి యెముకలు వేలంత సన్నంగా కనిపిస్తాయి. కాని పక్క నుంచి చూస్తే మహా విశాలంగా వున్నట్టు కనిపిస్తాయి. దాని ఛాతీ తప్పించి, మిగిలినదంతా పక్క భాగాలు అదిమి నొక్కి బారుగా సాగదీసినట్టు వుంటుంది. ఎన్ని మినహాయింపులువున్నా గాని అన్నిటినీ మరిపించ చెయ్యగల వొక గుణం అత్యధిక స్థాయిలో దానికి వుంది – అది దాని జాతి

రక్తం. ఇంగ్లీషు వాళ్ళన్నట్టు స్వభావం వెల్లడిచేసే రక్తం. పల్చగా కంపిస్తూ, పట్టులాగ సాఫీగా వున్న చర్మం కిందనుంచి నరాలు అల్లిబిల్లిగా అల్లుకుపోయాయి. వాటికింద నూటిగా పొడుచుకు వస్తున్న కండరాలు యెముకలాగా గట్టిగా వున్నాయి. దాని తల చక్కగా తీర్చి నట్టుంది. కళ్ళు కాంతివంతంగా, ఉల్లాసంగా ఉబ్బి వున్నాయి. తల ముట్టె చివర ముక్కు పుటాల దగ్గర వెల్లడిగా వున్నాయి. అక్కడ వుండే గట్టి వుపాస్థినరం రక్తంతో పొంగరించింది. దాని మొత్తం రూపం, ముఖ్యంగా దాని తల నిశ్చితంగా, ఉత్సాహంగా వున్నాయి. అంతే కాదు, మృదువుగా, కోమలంగా వున్నాయి. తమ తమ నోటి ఆకృతులు మాట్లాడ్డానికి అనుగుణంగా అమరలేని కారణంగా మాట్లాడకుండా వుండిపోయిన జంతువుల బాపతుకి చెందింది అది అనిపిస్తుంది.

తను అనుభూతి చెందేదాన్నంతట్నీ అది అర్థం చేసికుంటోందని దానికేసి చూస్తూ వుంటే వ్రాన్స్కీకి అనిపించింది.

వ్రాన్స్కీ లోపలికి వెళ్ళగానే అది గాఢంగా శ్వాస పీల్చింది. పైకి ఉబికి వచ్చిన కంటి తెల్ల గుడ్లు రక్తం జీరలతో యెఱ్ఱబడేటట్టుగా — గుండ్రంగా తిప్పి శాల అవతలి వేపునుంచి అతనికేసి చూసింది. ఒక కాలిమీదనుంచి యింకో కాలిమీదకి బరువు మార్చుకుంటూ ముట్టె ఆడించింది.

"చూడండి యెంత ఉద్రేకపడుతుందో" అన్నాడా ఇంగ్లీషాయన.

"ఓయ్ నా ముద్దుల పట్టీ, ఓయ్" అని వ్రాన్స్కీ దాని దగ్గరికి వెడుతూ, మృదువుగా మాట్లాడుతూ అన్నాడు.

అతను దగ్గరికి వెళ్ళేకొద్దీ దానికి ఆవేశం ఎక్కువ అయింది. అతను దాని తల దగ్గర నుంచున్నప్పుడే అది ఒక్కసారి శాంతించింది. దాని పల్చటి మృదువైన చర్మంకింద కండరాలు కదిలాయి. దృఢంగా వున్న దాని మెడని వ్రాన్స్కీ నిమిరాడు. కోసుగా వున్న దాని మూపురం అటు పక్కకి వాలిన జూలుని కొద్దిగా యిటు వేపు సవరించాడు. వెల్లడిగా తల్ల కిందుల పక్షి రెక్కలాగా పారదర్శకంగా వుండే ముక్కుపుటాల దగ్గరి కంటా ముఖం పెట్టేడు. అది ముక్కు పుటాలు పెద్దవి చేసి గాఢంగా శ్వాస పీల్చి వదిలింది. కంపించింది. కోసుగా వున్న చెవుల్ని చదునుగా పెట్టుకుంది. గట్టిగా, నల్లగా వున్న పెదవిని వ్రాన్స్కీకేసి చాచింది అతని చొక్కా చేతిని పట్టుకుందామా అన్నట్టు. కాని చిక్కం వుందని గుర్తువచ్చి ముట్టె ఆడించి మళ్ళీ నాజూకైన కాళ్ళని అటూ యిటూ కదిలించింది.

"నిదానంగా వుండు, నిదానంగా వుండు" అన్నాడతను దాని వీపుమీద నిమురుతూ. గుఱ్ఱం మంచి స్థితిలో వుందని చూసి సంతోషంగా శాలలోంచి బయటకు వెళ్ళేడు.

గుఱ్ఱానికి వున్న ఆవేశం వ్రాన్స్కీకి సోకింది. తన గుండె దడదడ కొట్టుకుంటున్నట్టు అతనికి అనిపించింది. గుఱ్ఱం లాగానే అతనికీ కదలాలనిపించింది, కొరకాలనిపించింది. అతని మానసిక స్థితిలో భయం కలిగించేదీ, సంతోషకరమైందీ యేదో కనిపించింది.

"సరే మరి, మీమీద భరోసా పెట్టుకున్నాను. సరిగ్గా ఆరున్నరకి అక్కడ వుంటాను" అన్నాడు ఇంగ్లీషతనితో.

"అంతా సిద్ధంగా వుంది. మీరు యెందాక వెడుతున్నారు మిలార్డ్" అని ఇంగ్లీష తను అడిగాడు. అనుకోకుండానే అతన్ని my Lord అని సంబోధించేడు. అలా యెవ్వరూ చెయ్యరు.

వ్రాన్‌స్కీ ఆశ్చర్యంతో తల యెత్తి, తను మాత్రమే చూడగల్గినట్టుగా చూశేడు. ఇంగ్లీషతని కళ్లల్లోకి చూడలేదు. అతని నుదుటికేసి చూశాడు. ధైర్యంగా ఆ అడగడం యేమిటన్నట్టు చూశాడు. కాని అలా అడగడంలో ఇంగ్లీషతను తనని యజమానిగా కాక జాకీగా చూస్తున్నాడని గ్రహించేక జవాబు చెప్పేడు.

"నేను బ్రియాన్‌స్కీం దగ్గరికి వెళ్లాల్సిన పని వుంది. ఓ గంటలో వచ్చేస్తాను."

'ఇవాళ యెన్నిసార్లు యీ ప్రశ్న అడిగారు నన్ను' అని తనలో తను అనుకున్నాడు. సిగ్గుపడ్డాడు. అలాంటిది అతనికి అరుదు. వ్రాన్‌స్కీ యెక్కడికి వెడుతున్నదీ తనకి తెలిసినట్టుగా ఇంగ్లీషతను వో క్షణం సేపు అతన్ని పరకాయించి చూశేడు.

"ముఖ్యమైంది పందేనికి ముందు ఆందోళన పడకుండా స్థిమితంగా వుండడం. దేన్ని గురించీ కలతపడకండి, ఉత్సాహంగా వుండండి" అని చెప్పాడు ఇంగ్లీషతను.

"All right" అన్నాడు వ్రాన్‌స్కీ చిరునవ్వు నవ్వుతూ. తర్వాత బండిలోకి గెంతి పీటర్‌హోఫ్‌కి తోలుకుపొమ్మని తోలేవాడితో చెప్పాడు.

వాళ్లు పదడుగులు వెళ్లారో లేదో పొద్దుటినుంచీ బెదిరిస్తూ వున్న మేఘాలు ముసురు కుంటూ వచ్చి కుండపోతగా వాన కురిసింది.

'బాగా లేదు' అనుకున్నాడు వ్రాన్‌స్కీ బగ్గీ పడిగ పైకి లాగుతూ. 'ఇప్పటికే బురద బురదగా వుంది. ఇంకా చిత్తడి అయిపోతుందిప్పుడు' అనుకున్నాడు. గూడు వేసుకున్న బండిలో తనొక్కడు వున్నప్పుడు తల్లి రాసిన ఉత్తరం, అన్నగారు రాసిన చీటీ తీసి మళ్లీ చదివాడు.

అంతా ఒక్క విషయం గురించే. తల్లి, అన్నగారు అందరూ తన హృదయానికి సంబంధించిన విషయాలలో జోక్యం కలిగించుకునే వాళ్లే. ఆ జోక్యం అతనికి కోపం తెప్పించింది. అతనికి ఎప్పుడో గాని కోపం రాదు. 'వాళ్లకి యేమిటి సంబంధం? యెందుకు ప్రతీ వాళ్లకీ నా గురించి యీ పట్టింపు? యెందుకని నా వెనక బడతారు? దీనికి సంబంధించి వాళ్ల అవగాహనకి అందనిది వుండబట్టి వాళ్లు అలా చేస్తున్నారు. ఇది ఉన్నత సమాజంలో వుండే సాధారణ తుచ్ఛ సంబంధం అయితే నన్ను వొదిలేసేవాళ్లు నా మానాన. ఇది వూరికే వినోదం కాదనీ, భిన్నమైందనీ, యీమె నా ప్రాణం కంటె నాకు ప్రియమైందనీ వాళ్లకి తోచింది. అదే వాళ్లకి అర్థం కాని విషయం. అందుకనే చింతపడిపోతున్నారు. మా అదృష్టం యెలా వుందో దానికి మేమే బాధ్యులం, మేమేం ముక్కి మూలగడం లేదు' అని తనలో తను అనుకున్నాడు. 'మేము' అని వాడడం ద్వారా ఆన్నానీ, తననీ కలుపుకుంటూ. 'లేదు మేం యెలా బతకాలో నేర్పడం వాళ్లకి అవసరం. ఆనందం అంటే యేమిటో వాళ్ల వూహలోకి కూడ

రాదు. మా యీ ప్రేమ లేకుండా మాకు ఆనందం అనేది లేదని వాళ్లకి తెలీదు. దుఃఖం అనేది లేదని వాళ్లకి తెలీదు. జీవితమే లేదు' అనుకున్నాడు.

వాళ్లు పొప్పే, అందరూ పొప్పే, అని హృదయాంతరాళంలో అతనికి అనిపించి వాళ్లు జోక్యం చేసుకుంటూ వుండటంవల్ల అతనికి కోపం వచ్చింది. తననీ అన్నానీ బంధించే ప్రేమ క్షణిక ఆకర్షణ లాంటిది కాదు. అని అతనికి తెలుసు. అలాంటి ఆకర్షణ ఉన్నత సమాజంలో ఒకళ్లపట్ల ఒకళ్లకి కటువైనదో, మధురమైనదో స్మృతిని తప్ప మరి దేని చిహ్నాన్నీ మిగల్చకుండా పోతుంది. తన పరిస్థితివల్లా, ఆమె స్థానంవల్లా కలిగే యాతనా భరిత కష్టం అతనికి తెలుసు. ఉన్నత సమాజం దృష్టిలో పడ్డంవల్ల యెదుర్కోబోయే ఘోరమైన కష్టాలు అతనికి తెలుసు. అబద్ధాలు చెప్పడం, మోసం చెయ్యడం, కుయుక్తులు పన్నడం, తమ తీవ్ర కాంక్షాభరిత, అనురాగభరిత క్షణాల్లో తమ ప్రేమని గురించి తప్ప మరి దేన్ని గురించీ అనుకోవడం యిద్దరికీ అసంభవం అయినప్పుడూ యితరుల గురించి నిరంతరంగా తలపు రావడం లాంటివన్నీ యాతనగా అతనికి అనిపించాయి.

తన స్వభావానికి శుద్ధ విరుద్ధంగా వుండే అబద్ధాలకీ, మోసాలకీ తను దిగజారే పరిస్థితులు యెప్పటికీ పునరావృతమవుతూ వుండడం అతనికి స్పష్టంగా గుర్తుకొచ్చాయి. ఆమె అబద్ధాలకీ, మోసాలకీ దిగజారవలసిన పరిస్థితులు వచ్చినప్పుడు ఆమె పడ్డ లజ్జని తను గమనించిన సందర్భాలు మరింత స్పష్టంగా అతనికి గుర్తు వచ్చాయి. అన్నాతో తనకి సంబంధం కలిసాక యిప్పుడతనికి మధ్య మధ్య ఒక వింత అనుభూతి తెలియకుండానే కలుగుతోంది. ఒక విధమైన ఏవగింపు – యెవళ్ల పట్లనో అతనికి తెలియలేదు. కరేనిన్ పట్లా? తన పట్లా? ఉన్నత సమాజం పట్లా? అతనికి బాగా తెలియలేదు. ఎప్పుడూ ఆ అనుభూతిని దరికి రానిచ్చేవాడు కాదు. ఇప్పుడు దాన్ని మనస్సుకి తగలకుండా తరిమేసి తన ఆలోచనా ధారలో పడిపోయాడు.

'ఇదివరలో ఆమె సుఖంగా లేదు. కాని గర్వంగా, శాంతంగా వుండేది. ఇప్పుడు పైకి వెల్లడి చెయ్యకపోయినా, శాంతంగా వుండలేకపోతుంది. ఆత్మగౌరవ భావంతో వుండలేక పోతుంది. ఈ పరిస్థితికి స్వస్తి చెప్పాలి' అని తనలో తను నిశ్చయంగా అనుకున్నాడు.

యీ మృషా జీవితానికి స్వస్తి పలకాలని మొట్టమొదటి సారిగా అతని మనస్సుకి స్పష్టంగా ఆలోచన వచ్చింది. అదీ యెంత త్వరగా అయితే అంత త్వరగా జరగడం మేలు.

'ఆమే, నేనూ సర్వాన్నీ త్యజించి వెళ్లిపోవాలి, మా ప్రేమ తప్ప మరేం లేకుండా వెళ్లిపోవాలి' అని తనలో తను అనుకున్నాడు.

22

వాన కుండపోతగా వచ్చినా యెక్కువ సేపు కురవలేదు. బండికి కట్టిన మూడు గుర్రాల్లోనూ ముఖ్య గుర్రం మంచి చురుగ్గా దౌడు తీస్తూ వుంది. అటూ యిటూ కట్టిన రెండు

గుర్రాలూ వదులుగా వున్న కళ్లేలతో బురదలో ఆ గుర్రాన్ని అనుసరించే దౌడు తీసాయి. అతను చేరవలసిన చోటుకి చేరే ముందే మళ్లీ మేఘాల మాటునుంచి సూర్యుడు దోబూచు లాడుతూ తొంగి చూశాడు. ఇళ్ల కప్పులు, దారికి అటూ యిటూ వున్న పాత లైమ్ చెట్లు వాన తడికి మెరుస్తున్నాయి. కొమ్మలమీదనుంచీ, యిళ్ల చూరులనుంచీ నట్టాట్లు కిలాకిలా జారుతున్నాయి. యీ వానవల్ల పందెం మైదానం పాడైపోయి వుంటుందన్న విషయం గురించి అతను యిక అనుకోవడం మానేశాడు. వాన పుణ్యమా అని ఆమె యింటి దగ్గర కనిపిస్తుందని సంతోషపడ్డాడు. వొక్కతీ వుండి వుండాలి. కరేనిన్ అంతకుముందు కొద్ది రోజుల కితమే విదేశీ ఖనిజ జలస్రోతస్సునుంచి తిరిగి వచ్చాడనీ, పీటర్స్‌బుర్గ్‌నుంచి దాచాకి యింకా మారలేదనీ అతనికి తెలుసు.

ఆమెని వొంటరిగా కలుసుకోవచ్చని ఆశిస్తూ వ్రాన్‌స్కీ చిన్న వంతెనకి ముందే బండి దిగేడు. యింటి దగ్గరికి నడిచే వెళ్లాడు. యెవళ్ల కంటా పడకుండా వుండేందుకని అతను యెప్పుడూ అలానే వెళ్లేవాడు. అతను యింట్లోకి వీధి గుమ్మంలోనుంచి వెళ్లలేదు. పెరట్లో నుంచి చుట్టు తిరిగి వెళ్లేడు.

"అయ్యగారు యింట్లో వున్నారా?" అని తోటమాలిని అడిగేడు.

"లేరండయ్యా. అమ్మగోరున్నారు. ముందటి గుమ్మంలోనుంచి వెళ్లండయ్యా. నౌకర్లు మిమ్మల్ని లోపికి తీసికొని వెళ్తారు" అని తోటమాలి జవాబిచ్చేడు.

"వద్దులే, నేను తోటలోనుంచి వెడతాను."

ఆమె వొంటరిగా వుంటుందని ధైర్యం చిక్కింది. తను వస్తానని ఆమెకి చెప్పలేదు. పందెం రోజు కాబట్టి తను వస్తాడని ఆమె కూడా అనుకొని వుండదు. అంచేత ఆమెకి ఆశ్చ ర్యం కలిగించాలని అతను చడీచప్పుడు లేకుండా లోపలికి వెళ్లాడు. నడుంమీద వారలో వేలాడు తున్న కత్తిని కాలికి అదిమి పట్టుకున్నాడు. ఇసక దారిలో జాగ్రత్తగా అడుగులు వేస్తూ వెళ్లాడు. ఆ దారికటూ యిటూ పుష్పశయ్యలు ఉన్నాయి. తోట వేపు వున్న వరండా దాకా అలానే నడిచి వెళ్లాడు. దారమ్మట అతని మనస్సంతా తమ స్థితిలో వున్న యాతనం గురించీ, కష్టాల గురించీ రేగిన ఆలోచనంతో నిండి వుంది. ఇప్పుడు ఆ ఆలోచన అంతా పోయింది. ఇప్పుడున్నదల్లా వొకటే ఆలోచన. ఇప్పుడామెని మనో నేత్రం ముందు కాక వున్నదాన్ని వున్నట్టుగా వాస్తవంలో చూడబోతున్నాడు. కిర్రుమని చప్పుడు చెయ్యకుండా వుండేందుకు గాను దిగువ మెట్లమీద చదునుగా పాదం పెట్టి వరాండాలోకి యెక్కి వెళ్లే టప్పుడు అతనికి హఠాత్తుగా గుర్తు వచ్చింది, అతను యెప్పుడూ మరిచిపోతూ వుండే విషయం. వాళ్ల మధ్య సంబంధాల్లో మహా బాధాకరమైన అంశంగా వున్న సంగతి: ఆమె కొడుకు. అతను వ్రాన్‌స్కీకి యిష్టంలేని చూపుతో ప్రశ్నార్థకంగా చూస్తాడు.

తమ యిద్దరి మధ్యా మరెవళ్లకంటే యెక్కువగా యీ కుర్రవాడు బాధాకరంగా ప్రత్యక్షమవుతున్నాడు. అతను వున్నప్పుడు వ్రాన్‌స్కీ, అన్నాలిద్దరూ పరాయివాళ్ల ముందు

అనుకోలేని మాటల్ని అనుకునే వారు కాదు. అంత మాత్రమే కాదు. కుర్రవాడి అవగాహన పరిధికి మించిన దేన్ని గురించి సూచన లాగ కూడ అనుకునేవాళ్లు కాదు. ఆ పరిస్థితి యేదో అనుకొని యేర్పాటు చేసుకున్నదీ కాదు, దానంతట అదే వచ్చింది. అతన్ని మోసం చెయ్యడం అనేది తమని తామే అవమాన పరుచుకున్నట్టుగా వాళ్లు పరిగణించి వుండేవాళ్లు. అతని ముందు వాళ్లు పరిచయస్తుల్లా మాత్రమే వుండేవాళ్లు. తాము యెంత హెచ్చరికగా వున్నా సెర్యోష తనకేసి గుచ్చి గుచ్చి, యేదో వెతుకుతున్నట్టు చూపు నిలిపి చూస్తున్నాడని యెక్కువగా వ్రాన్‌స్కీ గమనించాడు. తన పట్ల ఆ కుర్రవాడి వైఖరిలో వో వింత సిగ్గు, అస్థిరత వున్నట్టు వ్రాన్‌స్కీకి అనిపించేది. అతను కాసేపు ఆదరపూర్వకంగా, కాసేపు జడంగా, కాసేపు బెరుకుగా వున్నట్టు తోచేది. తన తల్లికీ, యీ మనిషికీ మధ్య తనకి బోధపడని యేదో ముఖ్య సంబంధం వుందని ఆ కుర్రవాడు అనుకుంటున్నట్టుగా వుండేదా వైఖరి.

వాళ్ల సంబంధం యేమిటైందీ ఆ కుర్రవాడు నిజంగానే తనకి అర్థం కాదని అనుకున్నాడు. తను యెంత ప్రయత్నించినాగానీ, యీ మనిషి పట్ల తన మనస్సులో యెలాంటి భావం వుండాలీ అనేది స్పష్ట పరచుకోలేకపోయాడు. అనుభూతి అభివ్యక్తీకరణం విషయానికి సంబంధించి పిల్లలకి సహజంగా వుండే సుగ్రాహ్యతతో అతను స్పష్టంగా వొక విషయం గమనించాడు. తండ్రి, పంతులమ్మ, ఆయా — అందరూ కూడా వ్రాన్‌స్కీని అసహ్యించుకోవడమే కాదు అతన్ని భయంతో, యేవగింపుతో చూసేవాళ్లు, అతన్ని గురించి యెన్నడూ మాట్లాడుకోకపోయినా. తల్లేమో అతన్ని తన ప్రాణ స్నేహితునిగా చూసేది.

'ఏమిటి దీని అర్థం? ఎవరతను? అతన్ని నేనెలా ప్రేమించాలి? నాకీ విషయం అర్థం అవకపోతే అది నా దోషమే అవుతుంది. నేను మొద్దునేనా కావాలి, చెడ్డ పిల్లాణ్నైనా కావాలి' అనుకున్నాడా కుర్రాడు. అందుకనే వ్రాన్‌స్కీకేసి యెక్కువ ప్రశ్నార్థకంగా, వైరకంగా అయిష్టంగా వుండే చూపు చూసేవాడు. అతని వైఖరిలోని సిగ్గరితనానికీ అస్థిరతకీ అదే కారణం. అదే వ్రాన్‌స్కీకి యిబ్బందికరంగా తోచేది. ఆ కుర్రవాడు ఉన్నప్పుడల్లా వ్రాన్‌స్కీలో వింత, అకారణ యేవగింపు భావం విధిగా కలిగేది. ఈ మధ్య అలాంటి భావం అతనికి యెక్కువగా కలుగుతోంది. ఆ కుర్రవాడు దగ్గర ఉన్నప్పుడు వ్రాన్‌స్కీ, అన్నాలిద్దరిలోనూ వక్క దారి పట్టిన ఓడ కేప్టెన్‌లో కలిగే భావాల్లాంటివి కలుగుతున్నాయి. తను మహా వేగంగా పోతూ వున్న దారి, అసలు వెళ్లాల్సిన దారికి చాలా తప్పి పోయి వుందని దిక్సూచిని బట్టి ఆ కేప్టెన్ గ్రహిస్తాడు. కాని దాన్ని సరిదిద్దుకొనే శక్తి అతనికి పోయింది. క్షణక్షణం అసలు దారినుంచి దూరం అయిపోతూనే వుంటాడు. కాని ఆ విషయాన్ని ఒప్పుకొనే ధైర్యం వుండదు. ఏమంటే అలా వొప్పుకోవడం వినాశనం దాపురిస్తోందని విధిగా వొప్పుకోవడమే అవుతుంది.

జీవితం పట్ల అమాయిక దృక్పథంతో వున్న ఆ కుర్రాడు దిక్సూచి. తమకి తెలిసిన దారినుంచి వాళ్లు యెంత పక్కకి మళ్లిపోయారో సూచించే దిక్సూచి. కాని తాము తెలుసుకోవాలని అనుకోరు వాళ్లు.

ఆ పూట సెర్యోష యింటి దగ్గర లేదు. అన్నా కొడుకు కోసం చూస్తూ వరండాలో వొక్కత్తే వుంది. అతను షికారు వెళ్లాడు. వానలో చిక్కుకు పోయాడు. అతన్ని వెతికి పట్టుకోమని పనిపిల్లనీ, నౌకర్నీ పంపింది. వాళ్ల రాక కోసం చూస్తూ వుంది. ఆమె తెల్ల గౌను వేసుకుంది. దానికి వెడల్పాటి జరీ ఎంబ్రాయిడరీ వుంది. వరండాలో ఓ మూల పువ్వుల మధ్య కూర్చుంది. వ్రాన్‌స్కీ రావడం చప్పుడు వినలేదు. గుబురుగా ఉంగరాలు తిరిగిన ఆమె జుట్టు కమ్మీలంపైన మొక్కలకి నీళ్లుపోసే కూజామీదకి వాల్చింది. చల్లని నీళ్లకూజాని ముచ్చటైన రెండు చేతులతోనూ పట్టుకుని నుదుటి దగ్గర పెట్టుకుంది. ఆ చేతులకి అతనికి బాగా తెలిసిన ఉంగరాలు వున్నాయి. ఆమె మొత్తం మూర్తిలో, ఆమె శిరస్సులో, కంఠంలో, చేతుల్లో ద్యోతకమయే సౌందర్యం చూసినప్పుడల్లా అది అతన్ని అప్రత్యాశితంగా చకితం చేస్తుంది. అతను నిలిచి పారవశ్యంతో ఆమెని చూశాడు. అతను ఆమె వేపు మరో అడుగు వెయ్యబోయే సమయంలో అతని ఉనికిని ఆమె అనుభూతి చెందింది. ఆమె కూజాని తోసేసి, సిగ్గుతో యెర్రబడిన ముఖం అతనికేసి తిప్పింది.

"యేమైంది? ఒంట్లో బాగా లేదా మీకు?" అని ఫ్రెంచిలో అడిగాడు, ఆమె దగ్గరికి వెడుతూ. యెవళ్లైనా చూస్తారేమోనన్న భయం అడ్డం రాకపోయి వుంటే ఆమె దగ్గరికి పరిగెత్తి వెళ్లేవాడే. ఆ భయంవల్ల గుమ్మంకేసి ఓర చూపులు చూసి సిగ్గుపడ్డాడు. తను హెచ్చరికగా కాస్త వెనకా ముందూ చూసుకుంటూ వుండాలి అని గుర్తు వచ్చినప్పుడల్లా సిగ్గుపడినట్టు సిగ్గుపడ్డాడు.

"అబ్బే బాగానే వుంది" అంది, లేచి నుంచుని అతను చాచిన చేతిని గట్టిగా అదిమింది. "కాని నువ్వు వస్తావని అనుకోలా" అంది.

"బాప్‌రే! చేతులు యెంత చల్లగా వున్నాయి" అన్నాడు.

"నువ్వు నన్ను భయపెట్టేశావ్! ఒక్కత్తినే వున్నాను. సెర్యోష కోసం చూస్తున్నాను. వాడు షికారు వెళ్లాడు. అటువేపునుంచి రావాలి."

స్థిమితంగా వుండాలని ప్రయత్నం చేస్తూవున్నా ఆమె పెదాలు కంపించాయి.

"మన్నించండి నేనిక్కడకు వొచ్చేను, కాని మిమ్మల్ని చూడకుండా రోజు గడపలేను" అని ఫ్రెంచిలో అన్నాడు. రష్యన్‌లో "మీరు", "నువ్వు" అనే సంబోధనలని తప్పించడం కోసం అతనెప్పుడూ ఫ్రెంచినే వాడేవాడు. "మీరు" అంటే యేదో దూరంగా, అనార్ద్రంగా వుంటుంది, "నువ్వు" మరీ ప్రమాదకరమైన సన్నిహితత్వం సూచిస్తుంది.

"మన్నించడాని కేముంది? నాకు చాలా సంతోషంగా వుంది."

"కాని మీకు వొంట్లో బాగా లేదేమో, లేదా యే కారణంవల్లనో కుంగిపోయి వున్నారు. అలా అని నాకనిపిస్తోంది" అని ఆమె చేతులు పట్టుకుని ఆమె మీదకి వాలి అన్నాడు. "దేన్ని గురించి ఆలోచిస్తున్నారు?" అని అడిగాడు.

"యెప్పుడూ ఒక్కదాన్ని గురించే ఆలోచిస్తూ వుంటాను" అందామె చిరునవ్వు నవ్వుతూ.

ఆమె అన్నది నిజమే. తను యే విషయం గురించి ఆలోచిస్తుందీ అని యే సమయంలో యే క్షణంలో అడిగినా గానీ ఆమె తడుముకోకుండా చెప్పే జవాబు అదే. యెప్పుడూ ఒకే విషయం గురించి, నా ఆనందం గురించి, నా ఆనందలేమి గురించి అవే. అతను వచ్చే సమయంలో ఆమె అనుకుంటూ వున్న విషయం యిదీ. యితరులకి – మాటకి బెట్స్‌కి (తుష్కేవిచ్‌కీ బెట్స్‌కీ వున్న రహస్య సంబంధం గురించి ఆమెకి తెలుసు), అది అంత సులభం కావడమేం, తనకి అంత చిత్రహింస కావడమేం? ఆ ఆలోచన యిప్పుడామెని వేధించడానికి ప్రత్యేక కారణాలు వున్నాయి. ఆమె అతన్ని పందేల గురించి అడిగింది. అతను జవాబు చెప్పేడు. కాని ఆమె దిగులుగా వుందని చూసి అతి మామూలు గొంతుకతో అవరోధాల పందేనికి తగ్గ యేర్పాట్ల గురించిన అన్ని వివరాలనీ యేకరువు పెడుతూ ఆమె దృష్టి మళ్లించ ప్రయత్నించాడు.

'ఇతనికి చెప్పనా వద్దా' అని శాంతంగా, మృదువుగా వున్న అతని కళ్లల్లోకి చూస్తూ ఆమె అనుకుంది. 'అతను యెంతో సంతోషంగా వున్నాడు. తన పందేలలో యెంతో మునిగి పోయి వున్నాడు. మాకు సంబంధించి ఆ విషయం యెంత ప్రాముఖ్యమైందో యిప్పుడు చెప్పినా అర్థం చేసుకోలేడు' అనుకొంది.

"నేను వచ్చినప్పుడు మీరు దేన్ని గురించి ఆలోచిస్తున్నారో ఆ విషయం చెప్పారు కాదు. చెప్పండి వూ!" అన్నాడతను తను చెప్పే గొడవ తుంచేసి.

ఆమె జవాబు చెప్పకుండా తల కొంచెం వాల్చింది. కనుబొమల కిందనుంచి వెతుకుతూ చూసే కళ్లతో అతనికేసి చూసింది. నిడుపాటి పక్ష్మాలతో శోభగా వున్న ఆమె కళ్లు మెరుస్తున్నాయి. ఆమె చేతి ఆకు తుంచి చేత్తో తిప్పుతూ వుంది. ఆ చెయ్యి వొణుకుతోంది. అతను దాన్ని చూశాడు. అతని వదనంమీద అణకువతనం, దాసత్వం ద్యోతకమయే భావం గోచరమైంది. అవే ఆమె హృదయాన్ని జయించాయి.

"ఏదో జరిగిందని నాకనిపిస్తోంది. నేను పాలు పంచుకో లేనటువంటి బాధ మీకుందని తెలిసి నేను ఒక్క క్షణం మనశ్శాంతిగా వుండగలనా? మీకు పుణ్యం వుంటుంది చెప్పండి" అని ఆమెని బతిమలాడేడు.

'అబ్బ, యితను నేను చెప్పేదాని ప్రాముఖ్యం పూర్తిగా గ్రహించలేకపోతే యితన్ని యెన్నటికీ క్షమించ గలగలేను. చెప్పకుండా వుండడమే మెరుగు, యెందుకు పరీక్షకి పెట్టడం యితన్ని?' అనుకుంది. ఇంకా అతనికేసి చూస్తూనే వుంది. ఆకుని పట్టుకున్న చెయ్యి యింకా యెక్కువగా వణకుతోందని ఆమెకి తెలుసు.

"మీకు పుణ్యం వుంటుంది" అని రెట్టించాడు, ఆమె చేతిని తీసుకుని.

"నిజంగా చెప్పనా?"

"వూఁ, తప్పకుండా, ఆఁ."

"నాకు నెల తప్పింది" అందామె మెల్లిగా, నిదానంగా.

అకు యింకా యెక్కువగా వణుకుతోంది. కాని ఆ వార్తని విని అతనిలో యెలాంటి మార్పు వస్తుందో చూడ్డానికి ఆమె తన కళ్లని అతని కళ్లమీదే లగ్నం చేసింది. అతని ముఖం కాంతి విహీనమైంది. యేదో చెప్పాలనుకున్నాడు. కాని సంబాళించుకున్నాడు. ఆమె చేతిని వదిలేసి తల వాల్చుకున్నాడు. 'దీని ప్రాముఖ్యం అతనికి పూర్తిగా అర్థమయింది' అనుకొంది. కృతజ్ఞతా పూర్వకంగా అతని చేతిని అదిమింది.

కాని తను, ఆడదానిగా ఆ వార్త ప్రాముఖ్యం అర్థం చేసుకున్న రీతిలో అతనూ అర్థం చేసుకున్నాడని భావించడంలో ఆమె పొరపడింది. యిదివరలో యెవళ్ల పట్లో తనకి కలిగే వింత యేవగింపు భావం యీ వార్త విన్నాక వ్రాన్స్కీలో మునుపటికంటె వెయ్యిరెట్లు యెక్కువగా కలిగింది. కాని తను యెంతగానో యెదురుచూస్తూ వున్న క్లిష్ట సమయం యిప్పుడు వచ్చిందని అప్పుడే అతను గ్రహించాడు. ఆమె భర్తకి తెలియకుండా తమ సంబంధాలని యిక యెంత మాత్రమూ గోప్యంగా వుంచలేరు, యీ అసహజ పరిస్థితిని యెలాగో అలాగ అంతం చెయ్యాలి. అదీ ఆ క్లిష్ట సమయం. యిదికాక అన్నా ఆందోళన అతనికి శారీరకంగా అనుభూతం అయింది. అతను ఆమె వేపు ఆరాధనా పూర్వకంగా, అధీనుడైనట్టుగా వుండే చూపు చూశాడు. ఆమె చేతిని ముద్దుపెట్టుకున్నాడు. లేచి మౌనంగా వరాండాలో పచార్లు చేశాడు.

"వూఁ" అన్నాడు ఆమె దగ్గరికి నిబ్బరంగా వస్తూ. "మీరు గాని, నేను గాని మన సంబంధాన్ని తేలికగా తీసుకోలేదు. ఇప్పుడు మన రాత తేలిపోయింది. మనం జీవిస్తూ వున్న యీ అబద్ధానికి మనం స్వస్తి చెప్పాలి" అన్నాడు దిక్కులు చూస్తూ.

"స్వస్తి చెప్పాలా? యెలా స్వస్తి చెప్పాలి, అలెక్సేయ్?" అని ఆమె మెత్తగా అడిగింది.

ఆమె యీ పాటికి స్థిమితపడింది. ఆమె ముఖం మృదుహాసంతో వెలుగుతోంది.

"ఆయన్ని వదిలెయ్యి. మన జీవితాలని మనం యేకం చేసుకుందాం."

"మనం అలా యేకం అయే వున్నాం" అందామె వినిపించీ వినిపించని గొంతుకతో.

"కాని సంపూర్తిగా సంపూర్తిగా."

"కాని యెలా అలెక్సేయ్? యెలాగో చెప్పు" అందామె. తన నిస్సహాయ పరిస్థితి పట్ల బాధాకరమైన యెగతాళి ధ్వనించే గొంతుకతో అంది. "మన పరిస్థితినుంచి బయటపడే మార్గం వుందా? నేను ఆయన ధర్మపత్నినిగానా?"

"యే పరిస్థితిలోనుంచైనా బయటపడే మార్గం వుంటుంది. మనం గట్టిగా అనుకోవాలంతే. యిప్పుడు నువ్వు జీవిస్తూవున్న పరిస్థితి కంటే మరేదైనా మెరుగ్గానే వుంటుంది. ప్రతిదీ నీకు మనోవేదనగా వున్నాయని, ఉన్నత సమాజం, కొడుకు, భర్త — మొత్తం నేను చూడడం లేదా?"

"భర్త మాత్రం కాదు" అందామె శుద్ధ యేవగింపుగా. "నేనాయన్ని గురించి యెర

గను. ఆయన గురించి నేను అనుకోవడం లేదు. నాకు సంబంధించి ఆయన లేనట్టే" అంది.

"నువ్వు మనస్ఫూర్తిగా చెప్పటం లేదు. ఏ సంగతి నాకు తెలుసు. ఆయన గురించిన ఆలోచనలతో కూడా నువ్వు వ్యధ పడుతున్నావు."

"ఆయనకి యింకా తెలీదు" అందామె. అనుకోకుండానే ఆమె ముఖం య్రెరగా అయింది. ముఖం, చెక్కిళ్ళు, మెడురు, కంఠం య్రెరబడి పోయాయి. సిగ్గుతో కన్నీళ్ళు ఉబికి వచ్చాయి. "ఆయన్ని గురించి మాట్లాడుకోవద్దు" అంది.

23

యిప్పుడంత గట్టిగా కాకపోయినా, గతంలో కూడా వ్రాన్స్కీ ఆమె పరిస్థితి గురించి చర్చించే ప్రయత్నం కొన్ని సార్లు చేశాడు. ప్రతిసారీ లోతుగా పోకుండా, తేలిక ధోరణిలో వుండే వైఖరే అతనికి యెదురైంది. యిప్పుడూ ఆమె అలానే అతనికి జవాబు చెప్పింది. ఆమె తనకిగా తాను స్పష్టపరచ దలుచుకోలేనిదీ స్పష్టపరచుకో నిష్టపడనిదీ యేదో వున్నట్టుగా వుంది. తన పరిస్థితి గురించి మాట్లాడ్డం మొదలుపెట్టిన ప్రతిసారీ తను, నిజమైన ఆన్నా, తనలోకి ముడుచుకు పోయి మరో వింత పరాయి ఆన్నా ప్రత్యక్షమైనట్టు వుంది. ఆ ఆన్నా అంటే అతనికి ప్రేమ లేదు, భయం యెక్కువ. ఆ ఆన్నా అతని నోరు కుట్టేస్తుంది. కాని యీ సారి అతను తేల్చెయ్యాలనుకున్నాడు.

"ఆయనకి తెలిసినా తెలియకపోయినా" అంటూ తనకు సహజంగా వుండే శాంత, దృఢ స్వరంతో మొదలెట్టాడు. "ఆయనకి తెలిసినా, తెలియకపోయినా మనకి సంబంధం లేదు. మనం... మీరు... అలా బతకలేరు, ముఖ్యంగా యిప్పుడు."

"అయితే మీ ఉద్దేశ్యం యేం చెయ్యాలంటారు?" అని అదే తేలిక ధోరణి యెగతాళి స్వరంతో అడిగింది. తను గర్భవతి అని తెలిస్తే చులకనగా చూస్తారేమోనని యెంతో భయపడింది. అలాంటిది యిప్పుడతను తీవ్ర చర్యలు తీసుకునేందుకు సాకుగా దీన్ని చూడ్డం ఆమెకి చిరాకు కలిగించింది.

"యీ వస్తూ అతనికి చెప్పి వదిలెయ్యి."

"సరే అలానే చేస్తానని అనుకుందాం. యేం జరుగుతుందో తెలుసా? ముందే చెప్పగలనా సంగతి." ఓ క్షణంకితం యెంతో మృదువుగా కనిపించిన ఆమె కళ్లల్లో విద్వేషపూరిత జ్వాలారేఖ దూసుకుపోయింది. " 'ఓహో! అయితే తమరు మరొకణ్ని ప్రేమించి అతనితో పాపపంకిలమైన సంబంధం కలిగించుకున్నారన్న మాట?' " (భర్తని అనుకరించడంలో ఆమె 'పాపపంకిల' మనే మాటని సరిగ్గా కరేనిన్ అనేటట్టే నొక్కి పలికింది.) " 'నేను మిమ్మల్ని ధార్మిక, లౌకిక, కౌటుంబిక విషయ ఫలితాలకి సంబంధించి హెచ్చరించాను. తమరు నా మాట చెవిని పెట్టలేదు. యిప్పుడు నా పేరు కళంకితం కావడం నేను వొప్పుకోను....' " 'నా

కొడుకు 'పేరు కూడా' అని అన్నా దాదాపు అనేదే కాని కొడుకు గురించి పరిహాసంగా మాట్లాడ లేకపోయింది. "....ఆ ధోరణిలో అలా సాగుతుంది" అంది. "ఒక్క ముక్కలో చెప్పాలంటే ఆయన నన్ను విముక్తి చెయ్యాలనీ, లోకంలో అప్రదిష్ఠ రాకుండా వుండేందుకు సకల చర్యలు తీసుకుంటామనీ తన అధికారిక ధోరణిలో పరమ స్పష్టంగా కచ్చితంగా ప్రకటిస్తాడు. తను అన్నట్టు కచ్చితంగా చేస్తాడు, అదీ నిదానంగా యథావిధిగా. ఆయన మనిషి కాదు. యంత్రం. కోపం వస్తే దుష్టయంత్రం" అని తన మనోనేత్రం ముందు కరేనిన్‌ని దర్శిస్తూ అంది. అతని రూపంలో వ్యక్తిత్వంలో వున్న ప్రతి అంశాన్నీ, అతను మాట్లాడే ధోరణినీ గుర్తు చేసుకుంటూ అంది. అతనిలో చెడ్డగా కనిపించే ప్రతిదానికీ అతన్ని తప్పు పట్టుకుంది. అతని సముఖంలో తను చేసిన ఘోర దోషానికి అతన్ని క్షమించ నిరాకరించింది.

"కాని అన్నా, అయినా ఆయనకి చెప్పడం అవసరం. ఆ తర్వాత యేం చెయ్యాల్సిందీ మనం నిర్ణయించుకుందాం. ఆయన తీసుకొనే చర్యను బట్టి" అని వ్రాన్‌స్కీ ఆమెను శాంతపరచ ప్రయత్నిస్తూ ఒప్పించే ధోరణిలో మెత్తగా అన్నాడు.

"ఏమిటి? పారిపోదామా?"

"యెందుకు పారిపోకూడదు? యిలా కొనసాగే అవకాశం నాకు కనిపించడం లేదు, నా కోసం అని కాదు. మీరు వ్యథపడడం చూస్తున్నా."

"మనం పారిపోతాం, నేను మీ ఉంపుడుకత్తె నవుతాను" అంది కోపంగా.

"అన్నా!" అని అతను మెత్తగా మందలిస్తున్నట్టు గొణిగాడు.

"అవును, నేను మీ ఉంపుడుకత్తె నవుతాను, అంతా నాశనం చేసుకుంటాను" అంది.

మరో సారి ఆమె "నా బాబు" అనబోయింది. కాని ఆ మాట ఉచ్చరించ లేకపోయింది.

ఆమె తన దృఢ, నిష్కపట స్వభావంతో తను యిప్పుడున్న కపట స్థితిని యెలా భరిస్తుందో, యెందుకు బయటపడ కోరటం లేదో వ్రాన్‌స్కీకి బోధపడలేదు. అసలు కారణం కొడుకు అనే మాట అనీ, ఆ మాటని ఆమె ఉచ్చరించ లేకపోతోందనీ అతను గ్రహించలేదు. తన కొడుకుని గురించీ, తండ్రిని వదిలిన తల్లిపట్ల వాడు అనుసరించబోయే ధోరణి గురించీ అనుకున్నప్పుడల్లా తను చేసిన దాన్ని చూసి ఆమె భయంతో కంపించిపోయేది. తర్కబద్ధంగా ఆలోచించ లేకపోయేది. ఆడది కావడం వల్ల మాయమాటలతో సాకుతో తనని వూరట పరచుకోబోయేది దాంతో వున్నవాటిని వున్నట్టు వదిలేసి, తన బిడ్డకి యేమవుతుంది అనే భయంకరమైన ప్రశ్నని దాటవేసేది.

"నిన్ను బతిమాలుతున్నాను, వేడుకుంటున్నాను" అందామె అతని చేతిని తీసుకుని వున్నట్టుండి. ఆమె గొంతుక యిప్పుడు పూర్తిగా భిన్నంగా, మృదువుగా, నిజాయితీ ధ్వనిస్తూ వుంది. "యీ విషయం గురించి నాతో యిక మాట్లాడవద్దు."

"కాని, అన్నా..."

"యెన్నటికీ వద్దు. దీన్ని నాకు వదిలిపెట్టు. నా పరిస్థితి యెంత భయంకరంగా

వుందో, పతనమై వుందో నాకు తెలుసు. కాని నువ్వు చెప్పింది చెయ్యడం నువ్వనుకున్నంత తేలిక కాదు. అన్నీ నాకు వదిలిపెట్టు, నే చెప్పినట్టు విను. దీన్ని గురించి నాతో యెన్నడూ మాట్లాడవద్దు. ఒట్టేనా?.. వద్దు, వద్దు, ఒట్టు పెట్టు."

"ప్రతిదానిమీద ఒట్టు పెడతాను. కాని నేను మనశ్శాంతిగా వుండలేను, ముఖ్యంగా యిప్పుడు నువ్వు చెప్పిన విషయం విన్నాక. నీకు మనశ్శాంతి లేనప్పుడు నాకెక్కడిది?"

"నాకా? అవును. నాకు అప్పుడప్పుడు విచారంగా వుంటుంది. కాని దాన్ని గురించి నువ్వు మాట్లాడకుండా వుంటే అదే పోతుంది. దాన్ని గురించి మాట్లాడినప్పుడే నాకు మనశ్శాంతి వుండదు" అంది.

"నాకర్థం కావడం లేదు" అన్నాడతను.

"నాకు తెలుసు" అంటూ ఆమె అతని మాటలకి అడ్డం వెళ్లింది. "నీ లాంటి నిజాయితీపరుడికి అబద్ధం ఆడటం యెంత కష్టంగా వుంటుందో నాకు తెలుసు. నువ్వంటే నాకు జాలిగా వుంది. నాకోసంగాను నీ జీవితం యెలా నాశనం చేసుకున్నావో అని యెక్కువ అనుకుంటూ వుంటాను."

"నువ్వు నాకోసం అన్నిట్నీ యెలా అర్పించుకున్నావో అని యిప్పుడే అనుకుంటున్నాను, నిన్ను నిర్భాగ్యురాల్ని చేసినందుకు నన్ను నేను క్షమించుకోలేను."

"నన్ను నిర్భాగ్యురాలిగానా?" అని అతని దగ్గరగా వెళ్లి ప్రేమ పారవశ్య పూరిత మందహాసంతో అతని కళ్లల్లోకి చూస్తూ అంది. "నేను, తిండిపెట్టిన క్షుధార్తుని మాదిరిగా వున్నాను. ఆ ప్రాణి చలికి వొణికిపోవచ్చు, చింకిపాతల్లో వుండచ్చు, అవమాన భారంతో కుంగిపోవచ్చు. కాని నిర్భాగ్యుడు కాడు. నేను నిర్భాగ్యురాలినా? లేదు, లేదు. నా ఆనందం యిక్కడ వుంది..."

కొడుకు వస్తున్నట్టుంది, వాడి గొంతుక విని ఆమె తటుక్కున లేచింది. వరండాలో గలగలా అటూ యిటూ చూసింది. అతనికి బాగా తెలిసిన మెరుపు ఆమె కళ్లల్లో మెరిసింది. ఒక్క ఉదుట్న ఆమె ఉంగరాలున్న అందమైన చేతుల్ని యెత్తి అతని తలని పట్టుకుని తచ్చాడే చూపుతో అతన్ని చూసింది. ఆమె పెదాలు తెరచుకున్నాయి, చిరునవ్వు నవ్వుతున్నాయి. అలా వున్న తన ముఖాన్ని అతని ముఖం దగ్గరగా పెట్టి గబగబా అతని పెదాలు ముద్దుపెట్టుకుంది. అతని రెండు కళ్లమీదా ముద్దుపెట్టుకుని అతన్ని దూరం తోసేసింది. ఆమె వెళ్లిపోవడానికి అటు తిరిగింది. కాని అతను ఆమెని పట్టుకున్నాడు.

"యెప్పుడు?" అని పారవశ్యంతో ఆమెకేసి చూస్తూ గుసగుసలాడేడు.

"రాత్రి, ఒంటి గంటకి" అని మెల్లగా అంది. గాఢంగా నిట్టూర్చి తనకి మామూలుగా వుండే తేలికైన హంస గమనంతో కొడుకుని చూడ్డానికి వెళ్లింది.

వాన కురిసినప్పుడు సెర్యోష పెద్ద తోటలో వున్నాడు. అతనూ దాదీ నేసని యింట్లో దూరేరు.

"సరే, వుంటా. కొంచెం సేపట్లో పందేనికి వెళ్ళి పోతున్నాను. బెట్సీ నాకోసం వస్తానంది" అంది వ్రాన్‌స్కీతో.

వ్రాన్‌స్కీ గడియారం చూసుకొని గబగబా వెళ్ళిపోయాడు.

24

వ్రాన్‌స్కీ కరేనిన్ల యింటి వరండాలో గడియారం కేసి చూసే సమయంలో యెంతో ఆందోళన పడిపోయి, తన ఆలోచనల్లో మునిగిపోయి ఉన్నాడు. దాంతో గడియారం ముల్లుం నైతే చూశాడుగాని వేళ యెంత అని సూచిస్తున్నాయో బుర్రకి యెక్కలేదు. రోడ్డు మీదకి వెళ్ళాడు. బురదలోనుంచి జాగ్రత్తగా నడుస్తూ బండి దగ్గిరికి చేరాడు. అతను అన్నాపట్ల తనలో రేగిన భావాంతో యెంతో మునకలైపోయి వుండడం వల్ల వేళ యెంతైందీ దాన్ని గురించి అనుకోలేదు. బ్రియాన్‌స్కీ దగ్గరికి వెళ్ళే వ్యవధి వుంటుందా లేదా అని ఆలోచించలేదు. యెప్పుడూ జరిగినట్టుగానే అతనికి మిగిలింది జ్ఞాపకాల పైపొర మాత్రమే. యే పని తరువాత యే పని వస్తుందో సూచిస్తుందంతే. అతను బండి తోలేవాడి దగ్గరకు వెళ్ళాడు. అప్పటికే పెద్ద నీడ పరచుకున్న లైమ్ చెట్టు నీడలో బండి తోలేవాడు తన చోట్లో తూగుతున్నాడు. చెమటలు కక్కే గుర్రాంమీద రొదపెట్టే జోరీగల్ని అహా అను కుంటూ చూశాడు. బండివాణ్ణి లేపాడు. లోపలికి యెగిరిగెంతి బ్రియాన్‌స్కీ యింటికి తోలుకు పొమ్మని పురమాయించాడు. సుమారు పది కిలోమీటర్లు వెళ్ళాకనే అతనికి గడియారం కేసి చూసుకుని అయిదున్నర అయిందనీ, తను ఆలస్యం అయాడనీ గుర్తించే టంత తెలివి చిక్కింది.

ఆ రోజున చాలా పందేలు జరగాల్సి వుంది. మౌంటెడ్ గార్డ్స్* పందెం, తర్వాత ఆఫీసర్ల రెండు కిలోమీటర్ల పందెం, తరువాత నాలుగు కిలోమీటర్ల పందెం, అవరోధాల పందెం జరగాలి. తను యిందులో పాల్గొంటున్నాడు. బ్రియాన్‌స్కీ దగ్గరికి వెళ్ళినా తను పాల్గొంటున్న పందెం వేళకి రాగలడు. కాని బొటాబొటీ వ్యవధి మాత్రమే వుంటుంది. అప్పటికి అంతా చేరివుంటారు. అది బాగోదు. కాని బ్రియాన్‌స్కీకి వస్తానని మాట యిచ్చేడు. అందుకనే వెళ్ళాలనే అనుకున్నాడు. వేగంగా గుర్రాల్ని దౌడు తీయించమని బండివానికి పురమాయించేడు.

బ్రియాన్‌స్కీ దగ్గరకు వెళ్ళి అయిదు నిమిషాలు వుండి మళ్ళీ వెనక్కి దౌడు తీయించాడు. ఉరవడిగా ప్రయాణం చెయ్యడం వల్ల అతని మనస్సు స్థిమిత పడింది. అన్నాతో తనకి గల సంబంధాలలో అతనికి కష్టం కలిగించినదంతా, తమ సంభాషణ తర్వాత తను పరిస్థితిలో కనిపించిన అసందిగ్ధత అంతా అతని బుర్రలోనుంచి మాయమైపోయింది. యిప్పుడు అతను అత్రుతగా ఉద్రిక్తతతో రాబోయే పందెం గురించే ఆలోచిస్తున్నాడు. యేమైనా తను

ఆలస్యం కాలేదనే అనుకున్నాడు. ఆ రాత్రి అన్నాని కలుసుకొనే యేర్పాటు చేసుకున్నా నన్న సంతోషకర భావన మధ్య మధ్య అతని మనస్సులో మెరిసింది.

దాచాలనుంచి, పీటర్స్‌బర్గ్‌నుంచి వచ్చే బగ్గీలని దాటుకుంటూ అతను రేస్ కోర్సు సమీపించే కొద్దీ కొంచెం సేపట్లో జరగబోయే పందెపు ఉత్తేజం అతని మీద యెక్కువగా ప్రసరించ సాగింది.

తన మకాం దగ్గర అతనికి యెవళ్లూ కనిపించలేదు. అందరూ పందేల దగ్గరికి వెళ్లి పోయారు. అతని నౌకరు అతని కోసం చూస్తూ గేటు దగ్గర వున్నాడు. అతను బట్టలు మార్చుకుంటూ వుండగా రెండవ పందెం మొదలైందని, అతని గురించి వాకబుచేస్తూ చాలామంది పెద్ద మనుష్యులు అడిగారనీ, శాల కావలా కుర్రాడు రెండు సార్లు వచ్చేడనీ నౌకరు చెప్పాడు.

అతను హడావుడి పడకుండా బట్టలు వేసుకున్నాడు (అతను యెప్పుడూ హడావుడి పడడు, నిబ్బరం కోల్పోడు). శాల దగ్గరికి తోలుకు పొమ్మని బండి తోలేవాడితో చెప్పేడు. శాల దగ్గరనుంచి పందెం మైదానాన్ని చుట్టుముట్టిన బళ్లు, సైనికులు, జనం, ప్రేక్షకుల మండపాల్లో పోగయిన గుంపులు మహా సముద్రం లాగ కనిపించాయతనికి. రెండవ పందెం సాగుతోందన్నమాట, యేమంటే అతను శాలలోకి వెళ్లేటప్పటికి అతనికి గంట వినిపించింది. శాల దగ్గరికి వెళ్లేటప్పుడు అతనికి మఖోటిన్ గుర్రం యెర్రని గ్లాడియేటర్ కనిపించింది. దానికి తెల్లని కాళ్లు వున్నాయి. దానిమీద నారింజ పండు రంగు, నీలం రంగు పట్టా కప్పేరు. దాని చెవుల అంచులమీద నీలం పట్టా వుండడం వల్ల అవి పెద్దగా కనిపిస్తున్నాయి. దాన్ని పందేల దగ్గరికి తీసుకుపోతున్నారు.

"కార్డ్ యెక్కడ?" అని సైనిని అడిగాడు.

"లోపల జీను వేస్తున్నారు."

ఫ్రూ ఫ్రూ వున్న శాల తలుపు తెరచుకుంది. అప్పటికే దానికి జీను వేశారు. దాన్ని యిక బయటికి తీసుకు వస్తారు.

"నేను ఆలస్యం చేశానా?"

"All right! All right! అంతా సవ్యంగా వుంది. ఉద్రేకపడకుండా వుండడం ముఖ్యం" అన్నాడు ఇంగ్లీషతను.

ఆపాదమస్తకం వణకుతూ వున్న తన ప్రియమైన ముద్దుల గుర్రం ఫ్రూ ఫ్రూ కేసి వ్రాన్‌స్కీ మళ్లీ యింకో సారి చూశాడు. దాని నుంచి కష్టంమీద చూపు తప్పించుకుంటూ శాలనుంచి బయటకు వెళ్లాడు. అతను తనని యెవళ్లూ గమనించని అదునులో ప్రేక్షక మండపాల దగ్గర చేరాడు. రెండు కిలోమీటర్ల పందెం యిక ముగింపు కొస్తోంది. అందరి కళ్లూ ముందు వున్న గుర్రం గార్డ్ ఆఫీసరు మీదా, అతని వెనక వున్న హుస్సార్ మీదా లగ్నం అయివున్నాయి. ఇంక పందెం ముగింపు బర్డీ చేరుతున్నారు. వాళ్ల

శాయశక్తులా గుర్రాల్ని దౌడు తీయిస్తున్నారు. పందెం ముగింపు బద్దీకేసే అందరూ కళ్ళ ప్పగించి చూస్తున్నారు. గార్డ్సు కొంతమంది తమ వాడు నెగ్గుతున్నాడన్న సంతోషంతో అరుస్తున్నారు. వ్రాన్స్కీ మొహళ్ళ కంటా పడకుండా గుంపులోపలికి వెళ్ళేరు. సరిగ్గా ఆ సమయంలో ఆ పందెం అయిపోయిందని సూచిస్తూ గంట మోగింది. మొదటి స్థానంలో వచ్చిన గార్డ్ ఆఫీసరు మెల్లిగా కళ్ళెలు వదిలేస్తూ జీనుమీద కూలబడ్డాడు. అతను పొడుగ్గా వున్నాడు. అతని వొళ్ళంతా బురద చిమ్మి వుంది. ఆ గుర్రం బూడిద రంగుది. పందెంలో అలిసిపోయి వగురుస్తూ చెమట్ను కక్కుతోంది. చెమట్లు కక్కడంవల్ల నల్లగా కనిపిస్తోంది.

ఆ గుర్రం కష్టంమీద కాళ్ళు యెత్తుతూ తన మేరుకాయువు వేగం తగ్గించింది. గార్డు ఆఫీసరు చుట్టూతా చూసి అప్పుడే నిద్ర లేచిన వాడిలాగా బలవంతంగా చిరునవ్వు నవ్వేడు. అతని స్నేహితులూ, మిగిలిన వాళ్ళూ అతన్ని చుట్టుముట్టేరు.

వ్రాన్స్కీ హోదా కవిపింపచేసే గొప్ప సమాజం వాళ్ళ బృందంనుంచి ఉద్దేశ పూర్వకంగా తప్పించుకు వెళ్ళిపోయాడు. వాళ్ళు ప్రేక్షక మండపం ముందర నడుస్తూ అలవోకగా, హాయిందాగా మాట్లాడుకుంటున్నారు. వాళ్ళల్లో అన్నా వుండడం అతను చూశాడు. బెట్సీ, అతని వదిన గారు వున్నారు. తన దృష్టి మళ్ళుతుందేమో నన్న భయం కొద్దీ అతను వెళ్ళి వాళ్ళతో కలవలేదు. కాని అతనికి విరామం లేకుండా పంచయమ్ములు తగులుతూనే వున్నారు. అంతకు ముందు జరిగిన పందెం విశేషాలు చెపుతూ తను యెందుకు ఆలస్యంగా వచ్చాడని అడుగుతూనే వున్నారు.

అప్పటికి ముగిసిన పందేల్లో నెగ్గిన వాళ్ళని బహుమతి ప్రదానం కోసం మండపం దగ్గరికి రమ్మని పిలిచేరు. జనం అందరూ ఆ వేడుక చూద్దామని పోగవగానే వ్రాన్స్కీ అన్నగారు అలెగ్జాండర్ వచ్చి అతన్ని కలుసుకున్నాడు. ఆయన కర్నల్. భుజంమీద ఆ హోదా తెలియచేసే తాళ్ళు కట్టుకున్నాడు. మనిషి సామాన్యమైన యెత్తు వుంటాడు. వ్రాన్స్కీ లాగానే దిట్టంగా వుంటాడు. కాని యింకా నదురైన కవళికలతో వున్నాడు. యింకా ఎర్రగా అందంగా వున్నాడు. అతని నాసిక ఎర్రగా ఉంది. అతను తాగి వున్నాడు. నిష్కపటమైన ముఖంతో వ్రాన్స్కీ దగ్గరకు వచ్చాడు.

''నా చీటీ అందిందా? నువ్వో నల్లపూసై పోయావు'' అన్నాడు.

అలెగ్జాండర్ తిరుగుబోతు. తాగుడికి పేరు మోసిపోయాడు. అయినా కూడా పద్ధతిగా వుండే రాజదర్బారు మనిషి.

అందుకని యిప్పుడు తమ్ముడితో అప్రియమైన విషయాల గురించి మాట్లాడుతూ వున్నా కూడ యేదో చిల్లర విషయం గురించి పరిహాసంగా మాట్లాడుతున్న వాడిలాగ వాలకం పెట్టి మందహాసం చేశాడు. చాలమంది తమకేసి చూడవచ్చని తెలిసి అలా చేశాడు.

"అందింది. యెందుకు నువ్వు ఆందోళన పడిపోతున్నావో నాకు తెలియడం లేదు" అన్నాడు అలెక్సేయ్ వ్రాన్‌స్కీ.

"యెందుకంటే నువ్విక్కడ లేవనీ, సోమవారం నాడు పీటర్‌హోఫ్‌లో కనిపించావనీ యివ్వాడే విన్నాను కాబట్టి."

"నేరుగా విషయంతో సంబంధం వున్న వాళ్లతో మాత్రమే మాట్లాడే సంగతులు వుంటాయి. యివ్వాడు నువ్వు మాట్లాడిన విషయం అలాంటిదే..."

"అలాంటప్పుడు సైన్యంలోనుంచి కూడా తప్పుకోవాలి..."

"దయచేసి యిందులో జోక్యం చేసుకోవద్దు, అంతే."

చిరచిరలాడే వ్రాన్‌స్కీ ముఖం పాలిపోయింది. స్ఫుటంగా వుండే అతని కింది దవడ కంపించింది. అలా యెప్పుడో గాని జరగదు. స్వతహాగా మంచి మనస్సుగల వాడవడం వల్ల అతనికి యెక్కువగా కోపం రాదు. కాని కోపం వచ్చి గడ్డం కంపించిందంటే అతన్ని చూసి అవతలివాడు జాగ్రత్త పడాల్సిందే. ఆ విషయం అతని అన్నగారికి తెలుసు. అలెగ్జాండర్ హుషారుగా కనిపించేటట్టు మందహాసం చేశాడు.

"అమ్మ రాసిన ఉత్తరం అందచేద్దామని అనుకున్నానంతే. ఆమెకి జవాబు రాయి. పందేం ముందు మనస్సు పాడుచేసుకోకు. Bonne chance[1]" అని చిరునవ్వు నవ్వుతూ వెళ్లిపోయాడు.

అతను వెళ్లాడో లేదో యెవరో మళ్లీ వ్రాన్‌స్కీని ఆదరంగా పలకరిస్తూ ఆపేరు.

"స్నేహితుల్ని పలకరించదలుచుకో లేదన్నమాట? నమస్తే, mon cher[2]" అన్నాడు అబ్లాన్‌స్కీ. మాస్కోలో మాదిరి యిక్కడ పీటర్స్‌బుర్గ్ ధగద్ధగాయమైన సమాజంలో కూడ తన యెర్రటి ముఖాన్నీ, నున్నగా బాగా దువ్వుకున్న చెంపల్నీ వాటంగా ప్రదర్శిం చేడు అతను. "నేను యిక్కడికి నిన్న వచ్చేను. నీ విజయం చూడగల్గుతున్నందుకు సంతోషంగా వుంది. యెప్పుడు కలవను?" అన్నాడు.

"రేపు మా మకాం దగ్గరికి రా" అన్నాడు వ్రాన్‌స్కీ, స్నేహపూర్వకంగా అబ్లాన్‌స్కీ కోటు చెయ్యి పట్టుకుని మరేం అనుకోవద్దని అడుగుతూ రేస్ కోర్స్ మధ్యకి వెళ్లిపోయాడు. అవరోధాల పందెంలో పాల్గొనే గుర్రాలు అప్పటికే అక్కడ చేరాయి.

పందెంలో పాల్గొని అలిసిపోయి చెమటలు కక్కుతూ వున్న గుర్రాల్ని సైనులు నడిపించుకు పోతున్నారు. కొత్త గుర్రాలు ఒకదాని తర్వాత ఒకటి వస్తున్నాయి. వాటిల్లో యెక్కువ ఇంగ్లీషు పంగడానివే. పడిగెంతోనూ, బిగుతైన ఉదరాలతోనూ అవి యేదో విరాట్ పక్షుల్ని తలపింప చేస్తూ వున్నాయి. కుడి వేపున తన ఇంగ్లీషు మనిషి ముచ్చటైన ఫ్రూ ఫ్రూ చేత

---

[1] గుడ్ లక్ (ఫ్రెంచి).

[2] మై డియర్ (ఫ్రెంచి).

అభ్యాసాలు చేయిస్తున్నాడు. దాని మడమలు నిడువుగా ఉండి స్ప్రింగుల మాదిరి దానికి వూపు యిస్తున్నాయి. దానికి దగ్గర్లోనే పెద్ద చెవులున్న గ్లాడియేటర్ మీదనుంచి పట్టా తీసేస్తూ వున్నారు. ఆ పెద్ద అందమైన రూపంలో యే దోషం లేకుండా వుంది. దాని పిర్ర భాగం దివ్యంగా వుంది. కాలి మడమల భాగాలు వూహించనంత పొట్టిదిగా వున్నాయి. నిజానికి గిట్టలపైన అవి కనిపించడమే లేదు. ఆ గుర్రంకేసి వ్రాన్‌స్కీ అప్రయత్నంగానే అలా చూస్తూ వుండిపోయాడు. తన గుర్రం దగ్గరికి వెడదామనుకుంటూ వుండగా మళ్లీ యెవరో తెలిసిన వాళ్లు అడ్డు చేశారు. మళ్లీ కొన్ని పలకరింపు మాటలు అనాల్సి వచ్చింది.

"అరె కరేనిన్‌గారు అక్కడున్నారే. భార్యకోసం వెతుకుతున్నట్టున్నాడు. ఆమె లోపం వుంది. ఆమెని మీరు చూడలేదా?" అన్నాడా వ్యక్తి.

"ఉహూఁ, లేదే" అన్నాడు వ్రాన్‌స్కీ. ఆన్నా వుందని ఆ మనిషి చూపించిన వేపు చూడను కూడా చూడకుండా తన గుర్రం దగ్గరికి వెళ్లిపోయాడు.

జీను వెయ్యడం గురించి తను కొన్ని సూచనలు యివ్వవలసి వుంది. ఆ సంగతి చూసే లోపలే రౌతుల్ని మండపంలోకి రమ్మని పిలుపు వచ్చింది. అక్కడ చీట్లు తీసి వాళ్ల వాళ్ల స్థానాలకి పంపుతారు. పదిహేడు మంది ఆఫీసర్లు మండపం దగ్గర చేరారు. వాళ్ల ముఖాలు గంభీరంగా, చలనం లేకుండా వున్నాయి. చాలమంది నిస్తేజంగా వున్నారు. మండపంలోపల వాళ్లు చీట్లు తీశారు. వ్రాన్‌స్కీకి యేడవ సంఖ్య వచ్చింది. "గుర్రాల నెక్కండి" అనే పిలుపు వచ్చింది.

అందరి కళ్లూ తనమీదా, యితర పోటీదార్లమీదా వుంటాయని తెలిసే వ్రాన్‌స్కీ గుర్రం దగ్గరికి ఉద్విగ్నంగా వెళ్లాడు. అలాంటి స్థితిలో వున్నప్పుడెప్పుడూ అతని నడక నిదానంగా ఆచి తూచి వుంటుంది. కార్డ పందేలకు తగ్గట్టు వేషం వేసుకున్నాడు. నల్లని గుండ్రని టోపీ పెట్టుకున్నాడు. నల్లని కోటు తొడుక్కుని బొత్తాలు పెట్టుకున్నాడు. అతని కాలరు గంజిపెట్టి బిగిగా వుంది. అది చెక్కిళ్ల పైకి లేచి వుంది. ఎత్తు బూట్లు వేసుకున్నాడు. అతను గుర్రం కళ్లేలు పట్టుకుని యెప్పుడూ వుండేటట్టుగా శాంతంగా, ధీరంగా గంభీరంగా దాని ముందు నుంచున్నాడు. చలి జ్వరంతో వున్నట్టుగా ఫ్రూ ఫ్రూ యింకా వొణుకుతూనే వుంది. వ్రాన్‌స్కీ దగ్గరికి రాగానే అది నిప్పులు కక్కే కంటిని అతని కేసి తిప్పింది. వ్రాన్‌స్కీ టంగువారు కిందికి వేలిని పోనిచ్చాడు. ఆ గుర్రం కంటిని యింకా తిప్పింది. పళ్లు యికిలించింది. చెవిని అప్పళించుకుంది. ఇంగ్లీషు అతను పెదాలు ముడతలు పడేటట్టు పెట్టాడు. వ్రాన్‌స్కీ జీను సరిగా వుందో లేదో చూసినందుకు అతను చిరునవ్వు నవ్వడం అన్నమాట అది.

"యెక్కండి. ఆందోళన తగ్గుతుంది."

వ్రాన్‌స్కీ పోటీలో వున్నవాళ్ల కేసి ఆఖరి సారి చూశాడు. పందెం సాగుతూ వుంటే వాళ్లని చూళ్లేడు. ఆ విషయం అతనికి తెలుసు. యిద్దరప్పుడే పందెం ప్రారంభం అయ్యే

బర్డీ దగ్గరికి వెళ్ళిపోయారు. ఒకడు గాల్ట్సిన్. తనకి మిత్రుడు, గట్టి పోటీ. ఎరుపురంగు గుర్రం చుట్టూ చక్కర్లు తిరుగుతున్నాడు. అది అతన్ని జీనుమీదకి రానియ్యడం లేదు. లైఫ్‌గార్డ్స్‌లో పనిచేసే చిన్న హుస్సారు వొకడు బిగుతైన పవారీ లాగు తొడుక్కుని, గుర్రం మీద ఇంగ్లీషు జాకీల మాదిరి పిల్లిలా వొంగిపోయి కూర్చుని దౌడు తీసుకు పోయాడు. ప్రిన్స్ కూజొవ్‌లెవ్ ముఖం పాలిపోయి జాతిగుర్రంమీద కూర్చున్నాడు. అది గ్రాబోవ్ గుర్రాలక్షేత్రానికి చెందిన ఆడగుర్రం. దాన్ని వో ఇంగ్లీషు పైని కళ్ళేలు పట్టుకు నడిపించుకు వెడుతున్నాడు. కూజొవ్‌లెవ్ దుర్బల నరాల వాడనీ, స్వాతిశయానికి తక్కువ లేదనీ వ్రాన్స్కీకీ, అతని మిత్రులకీ తెలును. అతనికి యేదన్నా భయమేననీ, మంచి తేజీమీద స్వారీ చెయ్యడం అంటే కూడా భయమేననీ వాళ్ళకి తెలును. యివ్వాళ పందెం ప్రమాదకర మైందవడం వల్లా, మనుషులకి మెడలు విరిగిపోయే పరిస్థితి వుండడం వల్లా, రెడ్‌క్రాస్ వున్న బగ్గీ వొకటి వో డాక్టరుతో, నర్సుతో ప్రతి అవరోధం దగ్గరా హాజరుగా వుండడం వల్ల పందెల్లో దిగాలని అతను సంకల్పించేడు. వ్రాన్స్కీ అతనూ వొకళ్ళనొకళ్ళు చూసుకున్నారు. వ్రాన్స్కీ అతనికేసి ఆదరంగా వూఁ అంటున్నట్టుగా కన్ను గీటేడు. వ్రాన్స్కీ చూడని మనిషల్లా గ్లాడియేటర్ అశ్వాన్ని యెక్కిన తన అసలు ప్రత్యర్థి మహోతిన్.

"కంగారు పడకండి" అంటూ కార్డ్ వ్రాన్స్కీని మందలించేడు. అవరోధాల దగ్గర దాని కళ్ళేలు బిగలాగద్దు. ముందుకు దూకమని పొడవద్దు. దాని మానాన దాన్ని వెళ్ళనివ్వండి" అని హెచ్చరించాడు.

"అలాగే, అలాగే" అని వ్రాన్స్కీ కళ్ళేలు అందుకుంటూ అన్నాడు.

"వీలైతే అందరికంటె ముందు వుండండి. ఒకవేళ వెనకపడితే ఆఖరి దాకా నిబ్బరం కోల్పోవద్దు."

గుర్రం కిరంచ కూడ కదలలేదు, వ్రాన్స్కీ మంచి చురుగ్గా ఉక్కు రికాబులోకి కాలుపెట్టి కండలు దేరిన తన శరీరాన్ని క్రియక్రియమనే తోలు జీనుమీదకి చేరేశాడు. కుడి కాలు రికాబులోకి పెట్టగానే వేళ్ళతో కళ్ళేల్ని సమం చేశాడు తనకి అలవాటుగా వుండే రీతిలో. కార్డు గుర్రాన్ని వదిలేశాడు. యే కాలు ముందు పెట్టాలా అనేది తేలనట్టుగా ఫ్రూ ఫ్రూ నిడుపాటి తన మెడమీద కళ్ళేలన్నీ లాగింది. తర్వాత వూగుతూ కదిలింది. వాజాగ్గా వున్న వీపుమీద స్వారీ చేసే మనిషి వుయ్యాలా వూగినట్టు వూగేడు. కార్డ్ గుర్రం పక్కనే గబగబా అడుగులు వేస్తూ నడిచాడు. గుర్రానికి ఉద్రేకం వచ్చింది. రౌతు చెప్పినట్టే వినకుండా కళ్ళేల్ని కాసేపు వొక వేపునుంచి కాసేపు యింకో వేపునుంచి లాగుతూ సాగిపోవాలనుకుంది. వ్రాన్స్కీ చేత్తో, మాటలతో దాన్ని శాంతింప చెయ్యడానికి వ్యర్థ ప్రయత్నం చేశాడు.

కొంచెం సేపట్లోనే అడ్డకట్ట కట్టిన నది దగ్గరికి వొచ్చేరు. అక్కడనుంచే పందెం మొదలవుతుంది. పందెంలో పాల్గొనే వాళ్ళలో చాల మంది ముందు వున్నారు. చాల మంది

వెనక వున్నారు. వెనక్కాలనుంచి బురద దారిమీద దౌడు తీస్తూ వస్తున్న గుర్రం గిట్టం చప్పుడు వ్రాన్‌స్కీకి వినిపించింది. మరు క్షణంలోనే తెల్ల కాళ్లున్న నిడుపాటి చెవుల గ్లాడియేటర్‌మీద మఖోతిన్ దూసుకు ముందుకు పోవడం కనిపించింది. పెద్ద పళ్లు బయటికి కనిపించేటట్టుగా మఖోతిన్ నవ్వేడు. కాని వ్రాన్‌స్కీ అతనికేసి కోపంగా చూశేడు. మఖోతిన్ అంటే వ్రాన్‌స్కీకి యెప్పుడూ యిష్టం లేదు. యిప్పుడు అసలు యిష్టం లేదు. యేమంటే అతనే యిప్పుడు తనకి గట్టి ప్రత్యర్థి. తన గుర్రానికి పురిపెట్టి దూసుకుంటూ పోవడం వల్ల అతనికి కోపంగా వుంది. దౌడు తియ్యడానికి ఫ్రూ ఫ్రూ యెడమ కాలు విసిరింది, రెండు అంగలు ముందుకి వేసింది. కాని కళ్లెలు వెనక్కి లాగడం వల్ల చిరాగ్గా తగ్గి గెంతులు వేసింది. దాంతో జీనుమీద కూర్చున్న మనిషి యెగిరాడు. కార్డ్ దాదాపు పరిగెడుతూ వెనక వస్తూ ముఖం చిట్లించుకున్నాడు.

25

మొత్తం పదిహేడు మంది ఆఫీసర్లు అవరోధాల పందెంలో పాల్గొన్నారు. పందెం నాలుగు కిలోమీటర్ల వలయంలో ప్రేక్షకుల మండపాలకి ముందు జరుగుతుంది: దారిలో తొమ్మిది అవరోధాలు పెట్టారు. ఒక నది, మండపానికి ముందు ఒకటిన్నర మీటర్ల యెత్తు అవరోధం, యెండిపోయిన కందకం, నీళ్లతో నిండుగా వున్న కందకం, ఓ గుట్ట, ఒక ఐరిష్ అవరోధం (వున్న వాటిల్లోకల్లా బహుశా యిదే కష్టతరమైనది కావచ్చు). ఇందులో పొదలు కమ్మిన గుట్ట వుంటుంది. అవతలి వేపున పెట్టిన కందకాన్ని కనిపించ నియ్యకుండా వుండేందుకు అలా పెట్టిన గుట్ట యిది. అంటే గుర్రం వొక్క గెంతులో గుట్టనీ, కందకాన్నీ దాటాలి. లేకపోతే అందులో పడి చచ్చిపోతుంది. ఆ తర్వాత నీళ్ల నింపిన కందకాలు రెండు, పొడి కందకం వొకటీ వున్నాయి. ఈ పందెం ప్రేక్షక మండపం ముందు ముగుస్తుంది. వలయం దగ్గర కాకుండా పందెం రెండు వందల మీటర్ల దూరంలో మొదలైంది. అక్కడ మొదటి అవరోధం యెదురైంది – రెండు మీటర్ల వెడల్పులో వున్న నది. పందెంలో పాల్గొనేవాళ్లు దాని మీదనుంచి గెంతనూ వచ్చు, లేదా నీళ్లలో దిగి దాటనూ వచ్చు. వాళ్ల యిష్టం.

పందెంలో పాల్గొనేవాళ్లు బయలుదేరడానికి సిద్ధంగా వరసలో మూడు సార్లు నుంచున్నారు. ప్రతిసారీ యేదో గుర్రం ముందుగానే బయల్దేరడం, దాంతో మళ్లీ అంతా మొదలవడం. అనుభవజ్ఞుడైన అంపైర్ కర్నల్ సెస్ట్రిన్‌కి మంటెక్కిపోయింది. ఆఖరికి "పరిగెత్తండి" అని నాలుగో సారి అరిచాడు. దాంతో ఆరంభమైంది.

అందరి కళ్లూ, అందరి ఫీల్డ్‌గ్లాస్‌లూ రంగురంగుల బట్టలతో మెరిసిపోతున్న రౌతులకేసే లగ్నం అయివున్నాయి.

"పందెం మొదలైంది, బయలుదేరి వస్తున్నారు" అని మాటలు అప్పటిదాకా ఆతృతగా అన్ని వేపులనుంచీ చూస్తున్న వాళ్లనుంచి వినిపించాయి.

యిక చూసేవాళ్లు వొక్కొక్కళ్లుగా, చిన్న చిన్న గుంపులుగా బాగా చూడ్డం కోసమని వో చోటనుంచి యింకో చోటికి పరిగెత్తడం మొదలెట్టారు. మొదటి క్షణం అవరోధాల పందెం పోటీదార్లు వొక గుంపుగా, తర్వాత యిద్దరు యిద్దరుగా, ముగ్గురు ముగ్గురుగా నది దగ్గరకు వస్తున్నట్టు కన్పించింది. అందరూ ఒకేసారి బయల్దేరినట్టు చూసేవాళ్లకి కనిపించింది. కాని పందెంలో పాల్గొంటున్న వాళ్లకి మాత్రం కొన్ని క్షణాల అంతరం వుంది. పందెంలో అది చాల ముఖ్యమైంది.

ఉద్వేగంగా వున్న ఫ్రూ ఫ్రూ తత్తరపడిపోయి మొదటి క్షణం వెనకబడిపోయింది. కొన్ని గుర్రాలు దాన్ని దాటి ముందుకు పోయాయి. నది దగ్గరకు చేరుకోకముందే తంటాలు పడి గుర్రాన్ని అదుపులో పెట్టుకుని సునాయాసంగా వ్రాన్‌స్కీ ముగ్గురు పోటీదారుల్ని దాటి వచ్చేశాడు. దాంతో అతని ముందున్న గుర్రాల్లో మఖోతిన్ యెరుపు రంగు గ్లాడియేటరు వొకట్టైంది. దాని వెనక కాళ్లు సరిసమానంగా సునాయాసంగా వ్రాన్‌స్కీ ముందు యెగురుతున్నాయి. ముందున్న యింకో గుర్రం అన్నిటికంటే అందమైన డయానా. దానిమీద స్వారీ చేసే కూజొవ్‌లెవ్, పాపం భయంతో సగం ప్రాణం పోయినట్టు వున్నాడు.

మొదటి క్షణాల్లో వ్రాన్‌స్కీ తనని గాని తన గుర్రాన్ని గాని అదుపులో వుంచుకో లేక పోయాడు. తొలి అవరోధం చేరేదాకా అతను గుర్రాన్ని అనుకున్నట్టు నడిపించలేక పోయాడు.

గ్లాడియేటరూ, డయానా నది దగ్గరకి దాదాపు ఒకే సమయంలో వచ్చేయి. రెప్పపాటులో అవి గాలిలోకి యెగిరి అవతలి వేపు గెంతాయి. ఏదో రెక్కలున్నట్టుగా అలవోకగా ఫ్రూ ఫ్రూ వాటి వెనక యెగిరింది. గాలిలో అలా తేలుతూ వున్నట్టున్న ఆ క్షణంలోనే దాదాపు ఫ్రూ ఫ్రూ కాలికింద కూజొవ్‌లెవ్‌ని డయానాతో నది అవతలి వేపున గింజాకులాడుతున్నట్టు వ్రాన్‌స్కీ చూశాడు. (గెంతు తర్వాత కూజొవ్‌లెవ్ కళ్లేల్ని వదులు చేశాడు. దానితో గుర్రం తలకిందులై పోయింది.) తర్వాతనే వ్రాన్‌స్కీకి కారణాలు వివరంగా తెలిసాయి. ప్రస్తుత క్షణంలో అతనికి తెలిసింది యేకాయేకీ డయానా తలమీదా, కాలిమీదా ఫ్రూ ఫ్రూ వచ్చి పడవచ్చునే. కాని కిందికి పడిపోయే పిల్లిలాగ ఫ్రూ ఫ్రూ శరీరాన్ని మెలి తిప్పి, ఆ గుర్రాన్ని తప్పించుకుని తన దారిన ముందుకు వెళ్లిపోయింది.

'అబ్బ! నా ముద్దుల గుర్రమా' అనుకున్నాడు వ్రాన్‌స్కీ.

ఆ తర్వాత వ్రాన్‌స్కీకి గుర్రంమీద పూర్తి అదుపు వచ్చింది. దాన్ని తన అధీనంలో ఉంచుకున్నాడు. మఖోతిన్ తర్వాత పెద్ద అవరోధం లంఘించవచ్చని అనుకున్నాడు. అవరోధాలు లేని నాలుగు వందల మీటర్ల బయలులో అతన్ని దాటిపోవచ్చని అనుకున్నాడు.

పెద్ద అవరోధం జార్ మండపం ముందు వుంది. జార్ అంతఃపుర బృందం, మిగిలిన గుంపు అందరూ చూస్తున్నారు — అతన్నీ, మఖోతిన్‌నీ. మఖోతిన్ కొంచెం ముందు

వున్నారు. వాళ్ళు దయ్యాన్ని (పెద్ద అవరోధాన్ని అలా పిలిచేవాళ్ళు) చేరేటప్పటికి అన్ని వేపుల నుంచీ కళ్ళు తనమీదే లగ్నం అయివున్నాయని వ్రాన్‌స్కీకి తెలుసు. కాని అతని కళ్ళకి తన గుర్రం చెవులూ, మెడా, తన వేపు దూసుకుంటూ వస్తూ వున్న నేల, తన ముందు వేగంగా, లయబద్ధంగా, తమ మధ్య యెడం అంతే వుంచుతూ పోతున్న గ్లాడియేటర్ వెన్ను, తెల్లని కాళ్ళూ తప్ప యేమీ కనిపించడం లేదు. గ్లాడియేటర్ గాలిలోకి లేచి అడ్డపలకని తాకను కూడా తాకకుండా త్రుటికాలంలో వ్రాన్‌స్కీ దృష్టి పథం నుంచి అదృశ్యమై పోయింది.

''షెభాష్'' అని యెవళ్ళో అరిచారు.

సరిగ్గా అదే క్షణంలో అతని వెనక, వ్రాన్‌స్కీ వెనక అవరోధం త్రుటిలో జారిపోయింది. కదలికల్లో పిసరు కూడా మార్పు లేకుండా అతని గుర్రం అవరోధాన్ని దాటేసింది. పెద్ద అవరోధం దాటేశాడు. కాని యేదో టక్‌మని తట్టిన శబ్దం వెనకనుంచి వినిపించింది. గ్లాడియేటర్‌ని చేరువలో చూసిన అతని గుర్రం ఉద్రేకపడిపోయి అవరోధానికి కొంచెం ముందే గెంతేసింది. దాంతో వెనక్కాల కాలు అవరోధానికి కొట్టుకుంది. కాని అందువల్ల వేగం తగ్గలేదు. వ్రాన్‌స్కీ ముఖంమీద బురద ముద్ద పడింది. గ్లాడియేటర్ యింకా ముందే వున్నట్టు గుర్తించాడు. మళ్ళీ అతనికి దాని వెనక భాగం, చిక్కులు వద్ద కురచ తోక, గబాగబా అంగలు వేసే కాళ్ళు కనిపించాయి. (ఆ అంగలవల్ల తమ మధ్య యెడం అంతే వుండి పోతోంది.)

మహోతిన్‌ని దాటవెళ్ళే వేళవచ్చిందని వ్రాన్‌స్కీ అనుకుంటూ వుండగానే ఫ్రూ ఫ్రూ అతని వూహని పసికట్టింది. యే మాత్రం ప్రేరణ యివ్వకుండానే సుమారుగా వేగం పెంచింది. అనుకూలంగా వున్న వేపునుంచి మహోతిన్‌ని సమీపించడం మొదలుపెట్టింది. కాని ఆ దిశలో మహోతిన్ దాన్ని పోనివ్వలేదు. మహోతిన్‌ని యివతలి వేపునుంచి అధిగమించే అవకాశం వుందని వ్రాన్‌స్కీ చూడగానే ఫ్రూ ఫ్రూ తన దిశని మార్చింది. ఆ వేపునించే అతన్ని దాట మొదలుపెట్టింది. చెమటకి నల్లబడ్డ ఫ్రూ ఫ్రూ భుజాలు గ్లాడియేటర్ వెనక కాళ్ళకి సమంగా వచ్చాయి కూడా. ఆ రకంగా వాళ్ళు కొంత దూరం దౌడు తీసారు. తర్వాత అవరోధం చేరుకోకముందే వ్రాన్‌స్కీ తన గుర్రం కళ్ళేల్ని అదుపు చేశాడు. బయట పెద్ద వలయంలోకి వెళ్ళాలని అతను అనుకోలేదు. గబగబా గుట్టమీదనే మహోతిన్ కంటే ముందు వెళ్ళిపోయాడు. బురద కొట్టుకు పోయిన మహోతిన్ ముఖం యీషణ్మాత్రంగా అతనికి కనిపించింది. అతను చిరునవ్వు నవ్వాడని కూడ వూహించుకున్నాడు. వ్రాన్‌స్కీ మహోతిన్‌ని దాటి ముందుకు వచ్చేడు. కాని అతను తనని అనుసరించి వెనక్కాలే వున్నాడన్న విషయం యెరుకలోనే వుంది. గ్లాడియేటర్ లయబద్ధమైన గిట్టం చప్పుడు వినిపిస్తూనే వుంది. దాని శ్వాస యింకా అలసట లేకుండా సరిగ్గా వెనకాల తెలుస్తూనే వుంది.

తర్వాత రెండు అవరోధాలూ ఒక కందకమూ, కంచే. వాటిని సునాయాసంగానే దాటేసారు. కాని గ్లాడియేటర్ గిట్టలూ, బుసలూ దగ్గర పడుతున్నట్టు వ్రాన్‌స్కీ గమనించేడు.

తన గుర్రాన్ని ఉసికొల్పేడు. యెంత సునాయాసంగా అది వేగం పుంజుకుందోనని మహా సంబరపడి పోయాడు. ఆ వేగం వల్ల గ్లాడియేటర్ గిట్టల చప్పుడు వెనకబడి పోతుంది.

ఆశించినట్టుగానే, కార్డ్ సంహా యిచ్చినట్టుగానే వ్రాన్‌స్కీ ముందు వచ్చేడు. యిప్పుడు విజయం సాధించవచ్చుని అతనికి హామీ కలిగింది. ప్రతి క్షణం అతని ఉద్రేకం, సంతోషం, ఫ్రూ ఫ్రూ పట్ల ఆప్యాయత పెరుగుతున్నాయి. వెనక్కి చూడాలన్న ప్రేరణ అతనికి కలిగింది. కాని చూడ సాహసించలేదు. నిబ్బరపడడానికి గుర్రాన్ని ఉసి కొల్పకుండా వుండడానికి, గ్లాడియేటర్‌కి తాను వుందనుకున్న శక్తితో దాని శక్తిని సమంగా వుంచడానికీ ప్రయత్నించేడు. అతి కష్టమైన అవరోధం ముందర వుంది. యితరుల కంటె ముందు తను దాన్ని దాటితే, తనే నెగ్గడం ఖాయం. ఐరిష్ అవరోధాన్ని అతను సమీపిస్తున్నాడు. అతను దూరం నించే దాన్ని చూశేడు. ఫ్రూ ఫ్రూ కూడా చూసింది. తనకీ, గుర్రానికీ వో క్షణం సందేహం కల్గింది. గుర్రం చెవుల్లో వూగిసలాటని అతను గమనించాడు. కొరడాని యెత్తాడు. కాని మరు క్షణం లోనే తన అనుమానాలు నిరాధారం అని గ్రహించేడు. యేం చెయ్యాలో గుర్రానికి తెలిసింది. ముందుకి సాగి, అతను వూహించిన సమతూకంతోనూ, కచ్చితత్వంతోనూ పేంపైమంచి గెంతి వాహకశక్తి మాత్రానికి లొంగింది. అది దాన్ని కందకం పైనుంచి యెక్కువ దూరం తీసుకు పోయింది. అదే తీరులో యే ప్రయత్నమూ లేకుండా ఫ్రూ ఫ్రూ పందేన్ని కొన సాగించింది.

"సెభాష్ వ్రాన్‌స్కీ" అనే అరుపులు వో గుంపునుంచి వచ్చేయి. వాళ్ళ తన రెజిమెంట్ మనుషులని అతనికి తెలుసు. వాళ్ళ అవరోధం పక్క నుంచున్నారు. యాష్విన్ కంఠం అతను గుర్తు పట్టేడు. కాని అతన్ని చూడలేదు.

వెనకనుంచి వచ్చే శబ్దాలు వింటూ 'ఆహా! నా ప్రియమైన గుర్రమా' అనుకున్నాడు ఫ్రూ ఫ్రూ గురించి. 'దాటేసింది' అనుకున్నాడు మళ్లీ గ్లాడియేటర్ గిట్టలు వింటూ. యిక వొక్క అవరోధం మాత్రమే వుంది. నీళ్ళున్న కందకం. ఒకటిన్నర మీటర్ల వెడల్పు వుంది. వ్రాన్‌స్కీ దానికేసి చూడను కూడా చూడలేదు. చాలా ముందుగానే గమ్యం చేరుకోవాలన్న ఆతృతతో అతను కళ్లెల్ని గుండ్రంగా తిప్పేడు లయకి అనుగుణంగా. అది తన యావచ్ఛక్తినీ వినియోగిస్తుందని అతనికి తెలుసు. దాని మెడా, భుజాలూ తడిగా అవడమే కాదు, చెమట బిందువులు దాని తలమీదా, మూపురంమీదా, కోసుగా వున్న దాని చెవుల మీదా ప్రత్యక్షమయాయి. అది వేగంగా, కొంచెం కొంచెంగా శ్వాస పీలుస్తోంది. అయినా ఆ మిగిలిన నాలుగు వందల మీటర్లు పోవడానికి గల శక్తి కంటె యెక్కువే దాని దగ్గర వుందని వ్రాన్‌స్కీకి తెలుసు. గతిలో వొక విశేష సమరయువల్లా నేల బారుగా వస్తున్నట్టున్న అనుభూతివల్లా గుర్రం వేగాన్ని యెంత పెంచిందీ అతనికి తెలిసింది. అది కందకంమీద యెలా యెగిరిందంటే అసలు కందకాన్ని గమనించిందా లేదా అన్నట్టు వుంది. పిట్టలా యెగిరింది. కాని ఘోరం యేమంటే సరిగ్గా ఆ సమయంలో వ్రాన్‌స్కీ గుర్రంతో సమంగా వుండేటట్టు తన కదలికల్ని సమన్వయిం

చుకో లేకపోయాడు. పరమ ఘోరంగా క్షంతవ్యం కాని రీతిలో అతను జీనుమీద వేళకి ముందే సర్దుకున్నాడు. రెప్పపాటులో సర్వం మారిపోయింది. దారుణం జరిగిపోయిందని అతను గ్రహించాడు. అదేమిటో తెలుసుకునే లోగానే యెర్ర రంగు గుర్రం తెల్ల గిట్టలు అతని పక్క నుంచే దూసుకుపోయాయి. మఖోతిన్ చాలా వేగంగా దౌడు తీయిస్తూ దాటి పోయాడు. వ్రాన్స్కీ ఒక కాలితో నేల తాకేడు. గుర్రం అతని కాలిమీద పడింది. అది వో పక్కకి కువ్వ కూలేటప్పటికి అతను సరిగ్గా కాలు యివతలకి తీసుకోను కూడా తీసుకోలేదు. అది చెడ్డగా బుసకొడుతూ, చెమటతో తడిసిన తన సన్నని మెడని తిప్పుతూ, కాళ్లని కూడ దీసుకోవడానికి వృథా ప్రయత్నం చేసింది. అది గుండు దెబ్బ తగిలిన పక్షిలా మెలి తిరిగి వ్రాన్స్కీ కాళ్ల దగ్గర పడింది. వ్రాన్స్కీ తెలివితక్కువ చేష్టవల్ల దాని నడుం విరిగి పోయింది. ఆ విషయం తర్వాత తెలిసింది అతనికి. యిప్పుడు మఖోతిన్ దౌడు తీసుకుంటూ పోవడమే అతనికి కనిపించింది. నిశ్చలంగా వున్న బురద నేలమీద ఒక్కడూ వూగుతూ నిల బడిపోయేడు. తల అతనికేసి చాచి, అందమైన కంటితో అతన్ని చూస్తూ మహాయాసంతో శ్వాస పీలుస్తూ అతని ముందు పడివుంది ఫ్రూ ఫ్రూ. ఏం జరిగిందో యింకా గ్రహించలేక వ్రాన్స్కీ దాన్ని లేవడానికి కళ్లెలు లాగేడు. అది మళ్లీ చేపలాగ తన్నుకులాడింది. దాని జీను పక్క భాగాలు కొట్టుకున్నాయి. ముందు కాళ్లమీద లేవగలిగింది. కాని వెనక కాళ్లని యెత్త లేకపోయింది. మరోసారి గుంజాటన పడి, తిరిగి పక్కకి వాలిపోయింది. వ్రాన్స్కీ ముఖం పాలిపోయింది. తీవ్రావేశంతో వంకర తిరిగిపోయింది. అతని కింది దవడ వొణి కింది. మడమతో దాని డొక్కలో తన్నాడు. కళ్లేల్ని మళ్లీ లాగాడు. కాని అది కదలలేదు. ముట్టె నేలకి ఆన్చి అది యజమానికేసి అలా చూస్తూనే వుండిపోయింది.

“అయ్యో!” అని వ్రాన్స్కీ తల పట్టుకుని మూలిగాడు. “అయ్యో! ఏం చేసిను?” అని అరిచాడు. “పందెంలో ఓడిపోయాను. అంతా నా తప్పే. సిగ్గుమాలిన, క్షంతవ్యం కాని తప్పు. పాపం యీ ప్రియమైన గుర్రం నాశనం అయిపోయింది. అయ్యో! ఎంత పని చేశాను!” అని అరిచాడు.

కొంతమంది, ఓ డాక్టరూ, అతని అసిస్టెంటూ, అతని రెజిమెంట్ ఆఫీసర్లూ, అతని కేసి పరిగెత్తుతూ వచ్చేరు. తను మాత్రం చెక్కు చెదరకుండా అలానే వున్నాడు. అతనికి బాధ కలిగించింది అది. గుర్రం నడుం విరిగిపోయింది. యిక దాన్ని గుండుపెట్టి కాల్చెయ్యాలని తీర్మానం చేశారు. యెవళ్ల యేమి అడిగినా వ్రాన్స్కీ జవాబు చెప్పే స్థితిలో లేడు. అసలు మాట్లాడే స్థితిలో లేడు. తలమీదనుంచి జారిపోయిన టోపీని కూడా తీసు కోకుండా, తిరిగి యెక్కడికి పోతున్నదీ తెలియకుండానే వెళ్లిపోయాడు. అతని మనస్సు దుఃఖభారంతో నిండిపోయింది. జీవితంలో మొట్టమొదటి సారి పరమ దౌర్భాగ్యమైన స్థితి ప్రాప్తించిందని గ్రహించాడు. దాన్ని కూడదీసుకోవడం అసంభవం. దానికి దోషం తనదే.

యాష్విన్ టోపీ తీసుకొని అతని వెనక్కాలే పరిగెత్తి వ్రాన్స్కీని యింటికి తీసు

కొని వెళ్లాడు. ఓ అరగంట తర్వాత వ్రాన్‌స్కీ కుదుట పడ్డాడు. కాని అతని జీవితంలో ఆ పందెం స్మృతి అన్నిటి కంటె కటువైన, చాలా బాధాకరమైన స్మృతిగా మిగిలిపోయింది.

26

పైకి భార్యతో కరేనిన్ సంబంధాలు యెప్పటిలాగానే వున్నాయి. తేడా అల్లా అతను యిదివరకటికంటే యెక్కువగా పనుల్లో మునిగిపోయాడు. శీతాకాలంలో తీవ్రంగా శ్రమపడి పనులు చేయడం వల్ల ఆరోగ్యం చెడిపోతే, పుంజుకోవడం కోసం అంతకు ముందటి సంవత్సరాల్లో మాదిరే విదేశీ ఖనిజజలాల దగ్గరకి వెళ్లాడు. యధాప్రకారం జూలైలో తిరిగి వచ్చేడు. వెంటనే ద్విగుణీకృత శక్తితో బాధ్యతలని అందుకున్నాడు. యధాప్రకారం అతని భార్య పల్లెలో దాచాకి వెళ్లింది. అతను పీటర్స్‌బుర్గ్‌లో వుండిపోయాడు.

ప్రిన్సెస్ బెట్సీ యింటి దగ్గర పార్టీ తర్వాత తమ యింటి దగ్గర జరిగిన చర్చ దరిమిలా అతను తన సందేహాల గురించి గాని, యీర్ష్య గురించి గాని అన్నాతో యెన్నడూ తిరిగి చర్చించలేదు. తన భార్యతో ప్రస్తుతం వున్న సంబంధాలకి అతని అపహాస భరిత ధోరణి స్వరం యివ్వడు నప్పింది. భార్యపట్ల అతను ముభావంగా అయేడు. ఆనాటి రాత్రి భార్యతో జరిగిన సంభాషణలో సంభాషణ కొనసాగించాలన్న అతని ప్రయత్నాన్ని ఆమె తోసి వేసిన కారణం వల్ల అతను కొంచెం కష్ట పెట్టుకున్నట్టు వుంది. ఆమెపట్ల అతని వైఖరిలో అసంతృప్తి ఛాయ గోచరించింది. అంతే. 'నువ్వు నాతో మనసు విప్పి మాట్లాడదలచుకోలేదన్నమాట' అని మనస్సులో ఆమెని సంబోధిస్తూ అంటున్నట్టు వుండేది. 'అది నీకు చెడ్డది. నువ్వు గనక యివ్వాళ అలా చెయ్యడానికి నన్ను ప్రాధేయపడితే నేను చెయ్యను. అది నీకు యింకా చెడ్డది.' మంటని ఆర్పడానికి ప్రయత్నించి విఫలుడై, తన విఫల ప్రయత్నాలపట్ల కోపంతో 'అలా వుందా నీకు, సరే అయితే తగలడు' అనే వాడిలా అతను యిలా అనుకునేవాడు.

ప్రభుత్వ వ్యవహారాల్లో అంత యుక్తిగా, కుశలంగా వుండే యీ మనిషి భార్యపట్ల అలాంటి వైఖరి పిచ్చిదనం అని గ్రహించలేకపోయాడు. యెందుకు గ్రహించలేకపోయాడూ అంటే తన యధార్థ పరిస్థితి గ్రహించడానికి మరీ భయంకరంగా వుండబట్టే. తన కుటుంబం పట్ల అంటే భార్య పట్ల, కొడుకు పట్ల తన అనుభూతిని వుంచిన పెట్టెని గుండె లోతుల్లో మూసేసి, తాళం వేసి సీలు వేసేశాడు. పిల్లవాడి పట్ల శ్రద్ధ వహ్నే తండ్రిగా వుండే అతను శీతాకాలం ఆఖరికి కొడుకు పట్ల ఉదాసీనంగా తయారయి భార్యతో మాట్లాడే పరిహాస ధోరణినే కొడుకు పట్లా అవలంబించేడు. "ఆహా! యువకుడా!" అంటూ అతన్ని ఆ ధోరణిలో సంబోధించేవాడు.

అంతకు ముందెన్నడూ యింత తీరికలేని పని తనకి వుండలేదని కరేనిన్ అనుకునే

వాడు, చెప్పేవాడు కూడా. తనే అన్ని పన్నలనీ యిప్పుడు సృష్టించుకున్నాడన్న విషయాన్ని అతను గ్రహించలేదు. తన భార్య పట్ల, కుటుంబం పట్ల తనకి వున్న అనుభూతులు, వాళ్ల గురించిన ఆలోచనలు వున్న పెట్టెని తెరవకుండా యిదొక సాధనం అని గ్రహించలేదు. ఆ ఆలోచనలు మూసేసిన కొద్దీ భయంకరంగా తయారయేయి. తన భార్య ప్రవర్తన గురించి తను యేం అనుకుంటున్నాడో అడిగే హక్కు యెవళ్లకేనా వుండినట్లయితే సాధువు, వినమ్రుడు అయిన కరేనిన్ జవాబు చెప్పి వుండేవాడు కాదు. కాని అలా అడిగిన వాడిమీద మహా ఆగ్రహ పడిపోయేవాడు. అందుకనే తన భార్య యెలా వుందని యెవళ్లేనా అడిగినప్పుడు అతని ముఖం కఠోరంగా, గంభీరంగా మారిపోయేది. కరేనిన్ తన భార్య ప్రవర్తన గురించీ, అనుభూతుల గురించీ యేమీ ఆలోచించ దలుచుకోనేవాడు కాదు. వాస్తవానికి యీ విషయం గురించి అసలు అనుకునేవాడు కాదు.

కరేనిన్ యెప్పుడూ పీటర్‌హోఫ్‌లో అదే దాచాని తీసుకోనేవాడు. మామూలుగా కౌంటెస్ లిదియా ఇవానొవ్నా వేసవిలో అక్కడ వాళ్ల పొరుగున వుండేది. అన్నాతో యెప్పుడూ మాటా పలుకూ ఆడుతూ వుండేది. ఈ వేసవిలో కౌంటెస్ లిదియా ఇవానొవ్నా పీటర్‌హోఫ్ రావటానికి నిరాకరించింది. అన్నాని ఒక్కసారి కూడా చూళ్లేదు. బెట్సీ, వ్రాన్‌స్కీలతో అన్నా సన్నిహితంగా వుంటోందనీ, అది అనౌచిత్యం అనీ కరేనిన్‌కి సూచనగా తెలియజేసింది. కరేనిన్ తన భార్యని అనుమానించడానికి లేదని ఆ సూచనని కరాఖండిగా కొట్టి పారేశాడు. ఆ తర్వాత కౌంటెస్ లిదియా ఇవానొవ్నాని తప్పించుకు తిరిగాడు. తమ స్థాయి బృందం వాళ్ల చాలమంది తన భార్యకేసి వెర్రిగా చూడడం అతను చూడదలుచుకోలేదు, చూడలేదు, ఆ యేడు తన భార్య పీటర్‌హోఫ్‌నుంచి త్సార్‌స్కొయె సెలోకి మారాలని యెందుకు పట్టు బట్టిందో అతను అర్థం చేసుకో దలుచుకోలేదు, అర్థం చేసుకోలేదు. బెట్సీ త్సార్‌స్కొయెలో వుండేది. వ్రాన్‌స్కీ రెజిమెంట్ విడిది చేసిన చోటుకి అది దగ్గర. అతను తనకిగా యీ విషయం గురించి ఆలోచన రానివ్వలేదు ఆలోచించలేదు. కాని అంతరంగంలో మాత్రం అతనికి తనో దగాపడ్డ భర్తనన్న విషయం, దాన్ని తను ఒప్పుకోక పోయినా, అందుకు సాక్ష్యం యే మాత్రం లేకపోయినా అనుమానం లేకుండా కచ్చితంగా వుండేది. అందువల్ల మనస్సులో చాలా బాధపడేవాడు.

భార్యతో ఆనందంగా కాపరం చేసిన యీ యెనిమిది యేళ్లల్లోనూ వంచకురాళ్లైన భార్యల గురించీ, వంచితులైన భర్తల గురించీ యెన్నో సార్లు అనుకున్నాడు. 'అలాంటి వాటిని వాళ్లు యెలా సహిస్తారు? హేయంగా వుండే యిలాంటి స్థితికి యెందుకు స్వస్తి చెప్పరు?' అని అనుకున్నాడు. యిప్పుడు అలాంటి శాపం అతని నెత్తిమీదనే పడినప్పుడు, యీ పరిస్థితికి యెలా స్వస్తి చెప్పాలా అని ఆలోచించడానికి నిరాకరించడమే కాదు, అలాంటి పరిస్థితి వుందని గుర్తించ దలుచుకోలేదు కూడా. యెందుకు గుర్తించ విష్టపడ లేదూ అంటే అది అంత ఘోరంగా అంత అస్వాభావికంగా వుంది కనక.

విదేశాలనుంచి తిరిగి వచ్చేక కరేనిన్ దాచాకి రెండు సార్లు వెళ్లేడు. ఒక సారి అక్కడ భోజనం చేశాడు. మరో సారి సాయంత్రం అక్కడ మిత్రులతో కలిసి గడిపేడు. రెండు సందర్భాల్లోనూ కూడా పూర్వం రోజుల్లో మాదిరి అక్కడ రాత్రి గడపలేదు.

పందేం రోజున కరేనిన్ తీరిక లేకుండా వున్నాడు. ఆ రోజు పొద్దుట కార్యక్రమం నిర్ణయించుకుంటూ పెందరాళే భోజనం చేశాక దాచా దగ్గరికి భార్యని చూడ్డానికి వెళ్లి అక్కడ్నించి యెకాయెకీ పందేం దగ్గరికి వెళ్లాలని అనుకున్నాడు. అక్కడ రాజపరివారం యావత్తూ హాజరై వుంటుంది. తనూ తప్పకుండా అక్కడ కనిపించాలి మరి. లోక మర్యాద కోసం భార్యని వారానికోసారి చూడాలని అనుకున్నాడు, కాబట్టి ఆమె దగ్గరికి వెడతాడు. పైగా ప్రతి నెలా పదిహేనో తారీఖున ఆమెకి ఖర్చుల నిమిత్తం డబ్బు యివ్వడం అతని అలవాటు.

భార్యకి సంబంధించి మొత్తం యిదంతా ఆలోచించుకున్నాక తన ఆలోచనలని అదుపులో వుంచుకొనే అలవాటువల్ల ఆమెకి సంబంధించిన యితర యే విషయాన్నీ లోతుగా అతను ఆలోచించ దలచుకోలేదు.

కరేనిన్ ఆ పొద్దుట పిసరు తీరిక లేకుండా వున్నాడు. అంతకు ముందు నాటి సాయంత్రం కౌంటెస్ లిదియా ఇవానొవ్నా అతనికి వో ప్రఖ్యాత యాత్రికుడు చైనామీద రాసిన పుస్తకం పంపింది. ఆ రాసినతను అప్పుడు పీటర్స్‌బుర్గ్‌లోనే వున్నాడట. పుస్తకంతో బాటుగా ఆ రచయితని కలుసుకొమ్మని కరేనిన్‌ని అడుగుతూ వో చీటీ కూడ పంపింది. ఆ రచయిత అనేక కారణాలవల్ల చాలా ఆసక్తికరమైన వ్యక్తనీ, చాలా పనులకి ఉపయోగపడే వ్యక్తి అనీ రాసింది. సాయంత్రమే పుస్తకం అంతా చదివే వ్యవధి కరేనిన్‌కి లేకపోయింది. పొద్దుట పూర్తి చేశాడు. తర్వాత మహజర్లు పట్టుకుని అర్థించేవాళ్లు వచ్చేరు. తర్వాత నివేదికలు, కలుసు కోవడానికి వచ్చినవాళ్లు, నియామకాలు, తొలగించడాలు, పతక ప్రదానాలు, పెన్షన్లు, జీతాలు, ఉత్తరాలు రాయడం లాంటివి — యిదంతా కరేనిన్ అన్నట్టు రోజువారీ కార్య క్రమం, దానికి అతని సమయం యెక్కువ ఖర్చయిపోతుంది. తర్వాత సొంత పనులూ వున్నాయి. అతని డాక్టరు వచ్చేడు. అతని వ్యవహారాలు చూసే మనిషి వచ్చేడు. అతను యెక్కువ సేపు వుండలేదు. కరేనిన్‌కి అవసరమైన డబ్బు యిచ్చి వ్యవహారం గురించి కొంచెం చెప్పేడు. ఆ యేడు పరదాలకీ, షికార్లకీ యెక్కువ ఖర్చయిందనీ, దానివల్ల ఆదాయం కంటె ఖర్చు యెక్కువై లోటు వచ్చిందనీ తెలిసింది. డాక్టరు పీటర్స్‌బుర్గ్‌లో ప్రసిద్ధుడు. కరేనిన్‌కి స్నేహి తుడు. అతను మాత్రం యెక్కువ సేపు వున్నాడు. అతను వస్తాడని కరేనిన్ అనుకోలేదు. అంచేత అతన్ని చూసి ఆశ్చర్యపడ్డాడు. అంతేకాక అతను కరేనిన్ ఛాతీ దగ్గర చెవి పెట్టి వినడంతో, ఉదరంమీద తట్టి పరీక్షించడంతో, ఆరోగ్యం యెలా వుందని అతివివరంగా అడగడంతో మరీ ఆశ్చర్యపోయాడు. కరేనిన్‌కి యీ యేడు ఒంట్లో బాగా లేదని చూసి

పరీక్షించమని డాక్టరుని తన వేస్తం లిదియా ఇవానొవ్నా పంపిందన్న సంగతి కరేనిన్‌కి తెలీదు. "దయచేసి నాకోసం అలా చెయ్యండి" అని లిదియా ఇవానొవ్నా డాక్టర్ని అడిగింది.

"రష్యాకోసం ఆ పని చేస్తాను" అని డాక్టరు జవాబు చెప్పాడు.

"వెలగట్టలేని మనిషి" అంది కౌంటెస్ లిదియా ఇవానొవ్నా.

కరేనిన్‌ని డాక్టరు పరీక్షించిన తరువాత డాక్టరు అసంతృప్తి ప్రకటించేడు. అతని ఉదరం సుమారుగా పెరిగింది. ఆకలి మందగించింది. ఖనిజ జలం గుణం కనిపింప చెయ్య లేదు. సాధ్యమైనంత మేరకి శారీరక వ్యాయామం చెయ్యమని సలహా యిచ్చేడు. ఆందోళన అనేది కూడదన్నాడు. మానసికంగా శ్రమ వీలైనంత తక్కువ వుండాలన్నాడు. ఊపిరి పీల్చ కుండా మానెయ్యడం యెలాంటిదో కరేనిన్‌కి యిది అలాంటిది. లోపం యేదో నవ్యంగా లేదు, దాన్ని సరిదిద్దడం తనకి సంభవం కాదు అనే అనిష్టకర భావం కరేనిన్ మనస్సులో మిగిల్చి వెళ్లాడు డాక్టరు.

కరేనిన్ యింట్లోనుంచి బయటకు వెడుతూవుంటే గుమ్మంలో డాక్టరుకి స్ల్యూదిన్ కనిపించేడు. అతను కరేనిన్ కార్యదర్శి. డాక్టరు అతన్ని బాగా యెరుగును. ఇద్దరూ కలిసి యూనివర్సిటీలో చదువుకున్నారు. ఎప్పుడో గాని ఒకళ్లనొకళ్లు కలుసుకోక పోయినా ఒకళ్ల పట్ల ఒకరికి మంచి గౌరవం వుంది. మంచి స్నేహితులు. ఆ కారణంగా స్ల్యూదిన్‌కి డాక్టరు తన రోగి గురించి చెప్పడానికి సంకోచించలేదు.

"మీరు ఆయన్ని పరీక్షించినందుకు నాకు చాల సంతోషంగా వుంది. ఆయన ఆరోగ్యం బాగా లేదు. నాకు అనిపిస్తోందీ... ఆ, అయితే మీకే మనిపించింది?" అన్నాడు స్ల్యూదిన్.

"నాకే మనిపించిందంటే" అని డాక్టరు స్ల్యూదిన్ తలపైనుంచి బండివాడికి బండిని తీసుకు రమ్మని సైగచేస్తూ అన్నాడు. "ఇదీ" అని మేకతోలు గ్లవ్సుని తన తెల్ల చేతులతో పట్టుకుని ఒక వేలు సాగదీసి అన్నాడు. "తీగని బిగదియ్యకుండా తుంచ ప్రయత్నిం చండి, చాల కష్టం. కాని బాగా బిగదీసి పూరికే వేలుతో నొక్కండి చాలు, పుటుక్కున తెగి పోతుంది. కరేనిన్ కష్టపడి పనిచేసే స్వభావం వల్లా, పనంటే అయనకుండే చిత్తశుద్ధి వల్లా ఆయన నరాలు బాగా ఒత్తిడికి గురి అయాయి. యిదీ గాక బయటి ఒత్తిడి కూడా వుంది. చాల యెక్కువ వత్తిడి" అని డాక్టరు అర్థవంతంగా చూపు విసురుతూ ముగించాడు. "గుర్రం పందేలకి వెడుతున్నారా?" అని తన బగ్గీ దగ్గరికి వెడుతూ అడిగాడు. "ఆ, అవును మరి... చాల కాలం పడుతుంది" అని డాక్టరు స్ల్యూదిన్ అన్న యే మాటకో, ఆ మాటని సరిగ్గా వినకుండానే జవాబిచ్చేడు.

కరేనిన్‌కి కాలహరణం చేసి డాక్టరు వెళ్లిపోయాడు. ప్రఖ్యాత యాత్రికుడు వచ్చేడు. కరేనిన్ ఆ ఉదయమే పుస్తకం పూరా చదివేసి వుండడం వల్లా, ఆ విషయం గురించి తనకి అప్పటికే వున్న పరిజ్ఞానం వల్లా ఆ రచయితని తన గాఢ విజ్ఞానంతో, విషయజ్ఞాతతో ఆశ్చర్య చకితుణ్ణి చేసేశాడు.

ఆ యాత్రికుడు వచ్చిన విషయం తెలియజేస్తూనే గుబేర్నియా మార్షల్ కూడ వచ్చినట్టు నౌకరు చెప్పేడు. మార్షల్ పీటర్స్‌బుర్గ్ వచ్చేడు. కరేనిన్‌కి అతనితో మాట్లాడ్డం అవసరం. మార్షల్ వెళ్లిపోయాక కరేనిన్ ఆ రోజువారీ కార్యక్రమం తన కార్యదర్శితో ముగించాల్సి వుంది. అప్పటికి యింకా ఓ గంభీరమైన, ఘనమైన విషయానికి సంబంధించి ఓ గొప్ప హోదా వ్యక్తిని కలుసుకోవడం పని మిగిలే వుంది. కరేనిన్ భోజనం వేళకి, అంటే అయిదు గంటలకి, యింటికి తిరిగి వచ్చేడు. కార్యదర్శితో కలిసి భోజనం చేశాడు. తనతో పాటు దాచాకి, గుర్రపు పందేలకీ రమ్మని అతన్ని పిలిచేడు.

తను భార్యతో వున్నప్పుడు యెవరో పై మనిషి నౌకరు వుండేటట్టు కొంతకాలంగా కరేనిన్ చూస్తున్నాడు, ఆ విషయం అతనే గుర్తించకపోయినా.

27

అన్నా మేడమీద వుంది. అద్దం ముందు నుంచుంది. అన్నుష్కా సాయంతో గౌను ఆఖరి రిబ్బన్లు కట్టుకుంటోంది. అప్పుడు బయటి గుమ్మం రాళ్ల రోడ్డుమీద బండి చక్రాల చప్పుడు వినిపించింది.

'బెట్సీ యింత పెందరాళే రాదు' అనుకొంది. కిటికీలోనుంచి చూసింది. బండి, అందులోనుంచి కరేనిన్ నల్ల టోపీ, బాగా పరిచితమైన చెవులూ కనిపించాయి. 'అబ్బ వేళగాని వేళలో పీడగాని! రాత్రి యిక్కడ వుండిపోడుకదా' అనుకొంది. దాని ఫలితం యెంత భయానకంగా, ఘోరంగా వుంటుందో నవిపించిందంటే, ఓ క్షణం కూడా సస్తాయించకుండా ఉల్లాసంతో మెరుస్తున్నట్టు వాలకం పెట్టి అతన్ని కలుసుకోవడానికి వెళ్లింది. అప్పటికే అలవాటైన అసత్యం కపటం మళ్లీ తనని కమ్మినట్టు అనుభూతి చెందుతూనే, ఆమె వెంటనే వాటికి లొంగిపోయి తను యేం మాట్లాడుతుందో యేమిటో తెలియకుండానే మాట్లాడటం మొదలుపెట్టింది.

"ఎంత దయచూపించారు!" అని భర్తకి చెయ్యి అందిస్తూ, యింట్లో మనిషిలాగా వుండే స్లూదిన్‌కేసి చూసి చిరునవ్వు నవ్వింది. "రాత్రి యిక్కడ వుంటావనుకుంటాను" అని కపటత్వం ఆమెని ప్రేరేపించిన తొలి మాటలు అంది. "ఇప్పుడు మనం కలిసే వెడదాం, కాని, ఖర్మ, బెట్సీకి మాట యిచ్చాను. ఆమె నా కోసం యిక్కడకు వస్తుంది."

బెట్సీ పేరు వినగానే కరేనిన్ నుదురు ముడుచుకుంది.

"యెన్నడూ విడని జంటని వేర్పాటు చెయ్యను" అన్నాడు తన మామూలు పరిహాస ధోరణిలో. "స్లూదిన్ నేనూ కలిసి వెడతాం. నడక వ్యాయామం కావాలి నాకు అని డాక్టరు చెప్పేడు. రోడ్డుమీద నడిచి వెళ్లి యింకా ఖనిజ జలం దగ్గరే వున్నట్టు వూహించుకుంటాను."

"తొందర పడక్కరలేదు" అంది అన్నా. "టీ తాగుతారా?" అని గంట మోగించింది.

"కొంచెం టీ తెచ్చిపెట్టండి. వాళ్ల నాన్న వచ్చేరని సెర్యోషతో చెప్పండి. ఊఁ, యెలా వుంది నీ ఆరోగ్యం? స్విదిన్‌గారూ, మీరసలు యిక్కడికి రానేలేదు. రండి, మా వరాండా యెంత బాగుందో చూద్దురుగాని" అంది కాసేపు వొకళ్లకేసీ, కాసేపు మరొకళ్లకేసి చూస్తూ.

ఆమె సాదాగా, సహజంగా మాట్లాడింది. కాని యెక్కువగా వేగంగా మాట్లాడింది. ఆ విషయం ఆమెకీ తెలుసు. స్విదిన్ జిజ్ఞాసగా తనని చూస్తూ తనని అంచనా వేస్తున్నాడని గమనించి దానివల్ల ఆ విషయం గురించిన స్పృహ మరీ కలిగింది.

స్విదిన్ వరాండాలోకి వెళ్లేడు.

అన్నా భర్త పక్కన కూర్చుంది.

"నువ్వు బాగా వున్నట్టు కనిపించడం లేదు" అంది.

"అవును, యివాళ డాక్టరు వచ్చేడు. నా టైమ్ గంట పూరా లాగేసుకున్నాడు. నా స్నేహితులెవరో పంపి వుంటారతన్ని, నాకలా అనిపిస్తోంది. నా ఆరోగ్యం యెంతో విలువైంది..."

"సరే, ఆయన యేమన్నాడో చెప్పు."

ఆమె అతని ఆరోగ్యం గురించి, వ్యవహారాల గురించి అడిగింది. విశ్రాంతి తీసుకొమ్మని, తనతో బాటు దాచాకి రమ్మనీ అనురోధం చేసింది.

అన్నా యిదంతా అదే ఉల్లాసపూరిత ధోరణిలో కళ్లల్లో వొక విశిష్టమైన మెరుపుతో గబగబా అంది. ఆమె మాట్లాడే ధోరణికి కరేనిన్ యే మాత్రం ప్రాముఖ్యం యివ్వలేదు. ఆమె మాటలు విని వాటి మామూలు అర్థం గ్రహించాడంతే. సాదాగా కొంచెం పరిహాస ధోరణిలో జవాబు చెప్పేడు. ఈ సంభాషణ అంతటిలోనూ విశేషంగా కనిపించేది యేదీ లేదు. అయినా కానీ ఆ తర్వాత అది అన్నాకి యెప్పుడు గుర్తు వచ్చినా లజ్జాన్విత యాతనాభరిత బాధ కలిగేది.

సెర్యోష పంతులమ్మతో కలిసి వచ్చేడు. కరేనిన్ గనక దృష్టి పెట్టి వుంటే సెర్యోష సిగ్గుగా, బిత్తరపోతూ తండ్రికేసి, తర్వాత తల్లికేసి చూడటం గమనించేవాడు. కాని అతను దేన్నీ చూడదల్చుకోలేదు. అందుచేత దేన్నీ చూడలేదు.

"ఆహ్, యువకుడా! పెద్దవాడయాడు. నిజంగానే మగాడు అయాడు. ఏమిటి సంగతి, యువకుడా?"

బెదిరి పోయిన సెర్యోషకేసి అతను చెయ్యి చాచేడు.

తండ్రి ముందు సెర్యోష యెప్పుడూ బెరుగ్గానే వుండేవాడు. కరేనిన్ యిప్పుడు 'యువకుడా' అని పిలవడంవల్లా, వ్రాన్‌స్కీ మిత్రుడా శత్రువా అనే ప్రశ్న ఉదయించడంవల్లా తండ్రి దగ్గర నిజంగా కుంచించుకు పోయాడు. తన రక్షణకి రమ్మన్నట్టు తల్లికేసి చూశాడు. తల్లితోనే అతను హాయిగా వుండగలడు. కరేనిన్ ఆ సమయంలో పంతులమ్మతో మాట్లాడుతూ కొడుకు భుజం పట్టుకున్నాడు. సెర్యోషకి అది మరీ యిబ్బందిగా వుంది. అతను యేడుస్తాడేమోనని అన్నాకి అనిపించింది.

కొడుకు లోపలికి వచ్చినప్పుడు అన్నా ముఖం సిగ్గుతో యెర్రబడింది. యిప్పుడు కొడుకు పడుతున్న యాతన చూసి ఆమె హడావుడిగా లేచి అతని భుజంమీదనుంచి కరేనిన్ చేతిని తీసేసింది. కుర్రవాణ్ణి ముద్దుపెట్టుకుంది. వరాండాలోకి తీసికెళ్లి దిగబెట్టి వెంటనే తిరిగి వచ్చింది.

"వెళ్లే వేళ అయింది" అంది తన గడియారం చూసుకుంటూ. "యింకా బెట్సీ యెందుకు రాలేదు చెప్మా" అంది.

"అన్నట్టు" అన్నాడు కరేనిన్ లేచి నుంచుని, మెటికలు విరుచుకున్నాడు. "నీకు డబ్బు యివ్వాలి కదా, నా రాకకి కారణం అదొకటి. ఏమంటే కిలాకిలా రావంతోనే బుల్ బుల్ పిట్టల పొట్టలు నిండవు. నీకు దాని అవసరం ఉందనుకుంటా" అన్నాడు.

"లేదు అవసరం లేదు... ఆఁ, వుంది" భర్తకేసి చూడకుండానే బాగా సిగ్గుపడిపోతూ అంది. "పందేల తర్వాత మళ్లీ వస్తావు కదా?"

"ఆఁ, ఆఁ" అన్నాడు కరేనిన్. "పీటర్‌హోఫ్ అలంకారం ప్రిన్సెస్ బెట్సీ త్వెర్‌స్కాయా వస్తోంది" అని దారిలో వస్తూవున్న ఇంగ్లీషు బగ్గీని కిటికీలోనుంచి చూసి అన్నాడు. బాగా యెత్తుగా, అమరికగా వున్న చిన్న బండి పెట్టె వుంది. "ఏం శోభ! ముచ్చటగా వుంది. సరే మనం వెళ్లాలి" అన్నాడు.

ప్రిన్సెస్ బెట్సీ బగ్గీ దిగలేదు. గుమ్మం దగ్గరికి రాగానే ఆమె నౌకరు కిందికి గెంతాడు. అతను బొత్తాలు పెట్టుకునే బూట్లు తొడుక్కున్నాడు. చిన్న కేప్ వేసుకున్నాడు. నల్లని టోపీ పెట్టుకున్నాడు.

"నే వెడుతున్నాను" అని అన్నా కొడుకుని ముద్దుపెట్టుకుని భర్తకేసి చేతిని చాచింది. "నువ్వు రావడం యెంతో బాగుంది" అంది.

కరేనిన్ ఆమె చేతిని ముద్దుపెట్టుకున్నాడు.

"ఊఁ, సరే, సెలవ్. టీకి వస్తావు కదూ. బాగుంది" అని సంతోషంతో మెరిసిపోతూ వెళ్లిపోయింది. అతను దృష్టికి అందని దూరం వెళ్లగానే అతని పెదాలు చేతిమీద తాకిన చోట రోతగా అనిపించింది. దాంతో ఆమె వొళ్ళు సారి కుదిలింది.

28

కరేనిన్ పందేల మైదానం దగ్గరికి వెళ్లేవేళకి అన్నా బెట్సీ పక్కన వో మండపంలో కూర్చుంది. అక్కడ ఉన్నత వర్గ సమాజం మొత్తం చేరింది. దూరంనుంచే భర్తని చూసింది. యిద్దరు వ్యక్తులు – పతి, ప్రేమికుడు – ఆమె జీవితపు రెండు కేంద్ర బిందువులుగా వున్నారు. యే బాహ్య శక్తి ప్రభావమూ అవసరం లేకుండానే వాళ్ళు సమీపంలో వున్నట్టు ఆమె అను భూతి చెందింది. ఇంకా దూరంలో వుండగానే భర్త తన దగ్గరికి వస్తున్నట్టు భావన కలి

గింది. అతను గుంపులోనుంచి దారి చేసుకుంటూ వస్తూవుంటే తనకి తెలియకుండానే అతన్ని కళ్లతో అనుసరించింది. అతను మండపం దగ్గరికి వస్తూ వుండడం చూసింది. తనకి అభివాదం చేసిన తక్కువ తరగతి వాళ్లకి కృపారసం చిలికేటట్టు ప్రత్యభివాదం చేస్తూ, తన సమస్థాయి వాళ్లకి పరధ్యానంగా స్నేహపూర్వకంగా నమస్కారం చేస్తూ, హెచ్చుస్థాయి వాళ్ల దృష్టి ఆకర్షించడం కోసం చూపులు ఆత్రతగా పెడుతూ, వాళ్లని చూసి తన చెవులమీద అదుముకొని వున్న పెద్ద గుండ్రని టోపీని తీసి అభివాదం చేస్తూ వస్తున్నాడతను. అతని పద్ధతులన్నీ అన్నాకి తెలుసు. ఆమెకి అవంటే వెంపరం. 'శుద్ధ దాంభికం తప్ప యేమీ కాదు. పెగ్గుకు రావాలన్న తీవ్రకాంక్ష అతని మనస్సంతా నిండిపోయింది: ఆదర్శవంతుడి ననడం, ప్రబుద్ధత, ధర్మప్రియత – అన్నీ నెగ్గుకు రావాలన్న కాంక్షని సంతృప్తి పరుచుకునే మార్గాలు మాత్రమే' అనుకుంది.

ఆడవాళ్ల మండపం కేసి అతను చూసే తీరును బట్టి అతను తనకోసం వెతుకున్నాడని గ్రహించింది. (అతని కళ్లు వేరుగా ఆమెమీదకే మళ్లేయి. కాని రవసెల్లాలు, రిబ్బన్లు, తురాయిలు, గొడుగులు, పువ్వుల మహాసముద్రంలో ఆమెని గుర్తు పట్ట లేకపోయాడు.) ఆమె కావాలని అతనిని ఉపేక్షించింది.

"కరేనిన్‌గారూ! మీ ఆవిడని మీరు చూడలేదని తెలుస్తూనే వుంది. ఆమె యిక్కడ వుంది" అని బెట్సీ అతన్ని పిలిచింది.

అతను జడంగా మందహాసం చేశాడు.

"ఇక్కడ యింత వైభవంగా వుండడంతో నా కళ్లు మిరుమిట్లు గొలిపాయి" అన్నాడు మండపంలోకి వస్తూ. భార్యకేసి చూసి, అప్పటికి కొంచెం సేపటి కితందాకా భార్యతో వున్నవాడు చిరునవ్వు నవ్వినట్టు చిరునవ్వు నవ్వేడు. ప్రిన్సెస్‌కీ, పరిచయమ్మలకీ అభివాదం చేశాడు. యెవళ్లకి తగట్టు వాళ్లకి అభివాదం చేశాడు. అంటే ఆడవాళ్లతో కులాసాగా మాట్లాడుతూ, మగవాళ్లకి నమస్కారాలు చెప్తూ వెళ్లాడు. మండపానికి దగ్గర ఆ జనం కూర్చున్న చోటికి దిగువున జార్‌గారి జనరల్ అడ్జుటెంట్* నుంచున్నాడు. అతనంటే కరేనిన్‌కి చాలా గౌరవం. అతను తెలివైన వాడనీ, విద్యావంతుడనీ పేరు వుంది. కరేనిన్ అతనితో మాట్లాడేడు.

పందేల విరామం సమయంలో యిది జరిగింది. అంచేత వాళ్ల సంభాషణకి అంతరాయం కలగలేదు. జనరల్ అడ్జుటెంట్ గుర్రప్పందేల్ని తిట్టి పోశాడు. కరేనిన్ సందేహిస్తూనే వాటిని సమర్థించేడు. అన్నాకి అతని కీచుమనే ఉచ్ఛ స్వరం వినిపించింది. ఒక్క మాట కూడా ఆమె చెవిని పడకుండా పోలేదు. అతనన్న ప్రతి మాటా ఆమెకి అబద్ధంగానే కనిపించింది, ఆమెని బాధించింది.

అవరోధాల పందెం మొదలయాక ఆమె ముందుకి వంగింది. వ్రాన్‌స్కీ గుర్రంకేసి వెడుతూ వుంటే అతని మీదనుంచి చూపు తప్పించుకోకుండా అతనికేసి చూసింది. అదే

సమయంలో విరామం లేకుండా, ఘృణిత స్వరంతో మాట్లాడుతూ వున్న భర్త మాటలు వింటూనే వుంది. వ్రాన్‌స్కీ గురించి ఆమెకి గాభరాగా వుంది. కాని పరిచయమైన గమకంతో భర్త హెచ్చుస్థాయి కీచు స్వరం యింకా యెక్కువ పీడగా వుంది.

'నేను చాలా చెడ్డదాన్నే, నాశనం అయిపోయినదాన్నే' అనుకుంది. 'కాని అబద్ధాలు చెప్పడం అంటే నాకు అసహ్యం. అబద్ధాలని సహించలేను. తనకి (ఆమె భర్తకి) అబద్ధాలే ప్రాణం. ఆయనికి అన్నీ తెలుసు, అన్నీ చూస్తాడు. యింత నిబ్బరంగా మాట్లాడగలుగుతున్నాడంటే అసలు అనుభూతి అనేది ఏమన్నా వుందా అని? వ్రాన్‌స్కీని గాని, నన్ను గాని చంపేసి వుంటే ఆయన్ని గౌరవించి వుందును. కాని లేదు, తనకి కావలిసిందల్లా అబద్ధాలు, లోక మర్యాద మాత్రమే' అని అన్నా తనలో తను అనుకుంది. భర్తనుంచి తను యేం కోరుతోంది, లేదా అతను యెలా ప్రవర్తించాలని తను అనుకుంటోంది అని ఆలోచించకుండానే మనస్సులో అలా అనుకుంది. ఇటీవం కరేనిన్ తనకి చిరాకు కలిగించేటట్టు యెక్కువగా వాగుతూ వుండడం, అతనికి లోపల్లోపల వున్న చింతకీ, ఆందోళనకీ వ్యక్తీకరణ అని ఆమె గ్రహించలేకపోయింది. దెబ్బ తగిలించుకున్న పిల్లాడు నొప్పి తెలియకుండా ఉండేటందుకు గెంతి, కండరాలని సాగదీసుకునే కార్యకలాపాలు చేసినట్టుగా కరేనిన్‌కి భార్య గురించిన ఆలోచనలు మర్చిపోవడానికి యీ బౌద్ధిక కార్యకలాపాలు అవసరం అయేయి. ఆమె ఉనికివల్లా, వ్రాన్‌స్కీ ఉనికివల్లా, తరచూ వ్రాన్‌స్కీ పేరు ప్రస్తావనకి వస్తూ వుండడంవల్లా ఆ ఆలోచనలు అతని మనస్సులో ముసురుకుంటున్నాయి. పిల్లవాడికి గెంతడం యెంత సహజమో అతనికి బాగా, యుక్తిగా మాట్లాడటం అంత సహజం అయింది. అతను అంటున్నాడు:

"సైనిక ఆఫీసర్ల పందేల్లో, అశ్విక దళం పందేల్లో ప్రమాదం వొక ముఖ్య అంశం. ఇంగ్లండు తన అశ్వసైన్య చరిత్రలో చాల ఉజ్వల విజయాల గురించి ఉల్లేఖించుకుంటోంది అంటే, చారిత్రకంగా ఆ దేశం మనుషులకి సంబంధించీ, అశ్వాలకి సంబంధించీ ఆ శక్తిని సంపాదించడంవల్లనే. నా అభిప్రాయంలో క్రీడలకి బ్రహ్మాండమైన ప్రాముఖ్యం వుంది. కాని యెప్పటిలాగానే దీన్ని కూడా చాల పైపైనే వో పక్కనుంచి మాత్రమే చూస్తున్నాం."

"పైపైన వో పక్క చూడ్డం కాదు" అంది ప్రిన్సెస్ బెట్సీ. "ఓ ఆఫీసరు యెముకలు విరగ్గొట్టుకున్నాడని అంటున్నారు" అంది.

కరేనిన్ పళ్ళ మాత్రమే బయటకు కనిపించేటట్టు తన ధోరణిలో లాంఛనంగా చిరునవ్వు నవ్వేడు.

"కాని ప్రిన్సెస్, మీరు అనేది పైపైన మాత్రమే కనిపించేదానికి సంబంధించి కాదు, అంతరంగికమైనది అనుకుంటే అనుకోండి. కాని ముఖ్య విషయం అది కాదు" అన్నాడు. మళ్ళీ జనరల్‌కేసి తిరిగి నిబ్బరమైన గొంతుకతో మొదలుపెట్టాడు. "పందెంలో పాల్గొనే వాళ్ళు తమంత తామే యీ పనిని చేపట్టిన ఆఫీసర్లనే విషయాన్ని మర్చిపోకండి. ప్రతీ పనికీ దాని చెడ్డ పార్శ్వమూ వుంటుందన్న విషయాన్ని కూడా గమనించండి. సైన్యంలో చేరే

యెవళ్ళకేనా వుండే ప్రత్యక్ష కర్తవ్యాల్లో యిది వొకటి. రోతగా వుండే ముష్టి యుద్ధాలూ స్పెయిన్ వృషభ యుద్ధాలూ బర్బరత్వ చిహ్నాలు. విశేషవంతమైన క్రీడలు వికాస లక్షణం."

"అబ్బ, నేనైతే మళ్ళీ రాను. నాకైతే దీనివల్ల మరీ ఆవేశం వస్తుంది. నిజమే కదా, అన్నా?" అంది ప్రిన్సెస్ బెట్సీ.

"ఆవేశం వస్తుంది, నిజమే, కాని చూడకుండా కళ్ళని తప్పించుకోవడం కష్టం" అంది మరొకామె. "నేను గనక రోమ్‌వాసినినైతే గోదాలో జరిగే ప్రతి తమాషానీ చూస్తాను" అంది.

అన్నా యేమీ మాట్లాడలేదు. ఆమె వో క్షణం కూడా ఫీల్డ్‌గ్లాస్‌ని వదలలేదు. ఒక నేపు దృష్టిని లగ్నం చేసింది.

ఆ సమయంలోనే పొడగరి అయిన వొక జనరల్ మండపం ముందునుంచి వెళ్ళాడు. కరేనిన్ మాట్లాడ్డం ఆపి హడావుడిగానే అయినా హుందాగా లేచి నుంచుని వంగి వందనం చేశాడు.

"మీరు పందేల్లో పాల్గోవటం లేదేమిటి?" అని జనరల్‌గారు వేళాకోళంగా అన్నారు.

"నా పందేలు మరింత కష్టమైనవి" అని కరేనిన్ మన్ననపూర్వకంగా సమాధానం యిచ్చేడు.

ఈ జవాబుకి అర్థం పర్థం లేకపోయినా చమత్కార కుశలుడినుంచి చమత్కార పూర్వకమైన జవాబు వచ్చినట్టుగా, దీనిలోని la pointe de la sause[1] పట్టు కున్నట్టుగా జనరల్‌గారు వాలకం పెట్టారు.

"రెండు పక్షాలున్నాయి" అంటూ కరేనిన్ మళ్ళీ మొదలుపెట్టాడు. "పాల్గొనే వాళ్ళు, చూసేవాళ్ళు. ఇది ఒక తమాషా అని యిష్టపడ్డ ప్రేక్షకుల అధమ అభిరుచికి చిహ్నం అనే దానిగా వొప్పుకోకుండా వుండలేను. కాని..."

"ప్రిన్సెస్, పందెం" అని అబ్లాన్‌స్కీ కిందనుంచి బెట్సీని ఉద్దేశిస్తూ అన్నాడు. "ఎవరిమీద పందెం కడతారు?" అన్నాడు.

"అన్నా, నేనూ ప్రిన్స్ కూజొవ్‌లెవ్‌మీద పందెం కడుతున్నాం" అంది బెట్సీ.

"నేను వ్రాన్‌స్కీమీద పందెం కడుతున్నాను. ఓ జత గ్లవ్స్ పందెం."

"సరే."

"చూడ్డానికి ముచ్చటగా వుంది కదూ?"

వాళ్ళు మాట్లాడుకుంటూ వున్నంత సేపూ కరేనిన్ నోరు మెదపలేదు. వాళ్ళు ఆప గానే మళ్ళీ మొదలుపెట్టాడు.

"నే వొప్పుకుంటా, కాని సాహసవంతమైన క్రీడలు..." అంటూ మొదలుపెట్టాడు.

---

[1] అంతరార్థం (ఫ్రెంచి).

ఆ సమయంలో పందెం మొదలయిందని సూచన రావడంతో అందరూ మాటలు ఆపే సారు. కరేనిన్ కూడా మాట్లాడ్డం మానేసాడు. ప్రతివాళ్లూ నుంచుని నదికేసి చూడ్డం మొదలుపెట్టారు. కరేనిన్‌కి గుర్రపు పందేల్లో ఆసక్తి లేదు. అందుకని పందెంలో పాల్గొం టున్న వాళ్లకేసి చూడలేదు. ఏదో పరధ్యానంగా మండపంలో వున్న ప్రేక్షకుల కేసి అలిసిన కళ్లు సారించేడు. అతని దృష్టి అన్నామీద పడింది.

అన్నా ముఖం కళా విహీనంగా వుంది. కఠినంగా వుంది. ఆమె పందెంలో పాల్గొంటున్న వాళ్లల్లో ఒక వ్యక్తికేసే తప్ప మరి యే యితర వ్యక్తిని గాని, వస్తువుని గాని చూడ్డం లేదని ప్రత్యక్షంగా తెలుస్తూనే వుంది. ఆమె విలవిల్లాడుతూ వో చేత్తో విసనకర్రని పట్టుకుంది. ఆమె శ్వాస ఆగినట్టుంది. కరేనిన్ ఆమెకేసి చూసి గబగబా యితరులమీదకి చూపు మళ్లించుకున్నాడు.

'ఆఁ, అక్కడున్న ఆ ఆడమనిషీ యితర ఆడవాళ్లూ కూడా ఆందోళనగా వున్నారు. ఇది సహజమే' అనుకున్నాడు కరేనిన్. అన్నాకేసి చూడదలుచుకోలేదు కాని అనుకోకుండానే అతని కళ్లు అటు మళ్లేయి. మరోసారి ఆమె ముఖంకేసి పట్టి చూశాడు. ఆమె ముఖం మీద స్పష్టంగా గోచరమవుతున్న భావాల్ని అర్థం చేసుకోకుండా వుండే ప్రయత్నం చేశాడు. కాని తన యిష్టానికి విరుద్ధంగా భయభ్రాంతం అవుతూ తను అర్థం చేసుకోదలుచుకోలేని దాన్ని అర్థం చేసుకున్నాడు.

నది పైనుంచి గెంతేటప్పుడు కూజొవ్‌లెవ్ పడిపోవడం అందరికీ భయం కల్గించింది. అయినా తను యెవరికేసి చూస్తుందో ఆ మనిషి పడిపోలేదన్న భావం అన్నా ఉల్లాసభరిత తెల్లని వదనంలో వెల్లడి కావడం కరేనిన్ స్పష్టంగా గ్రహించాడు. మఖోతిన్, వ్రాన్‌స్కీలు పెద్ద అవరోధాన్ని దాటేక వాళ్ల వెనక్కాలే వస్తూవున్న ఆఫీసరు తలమీద దెబ్బ తగిలి చని పోయేడు. చూసే వాళ్లకి వొణుకు పుట్టింది. అప్పుడేనా అన్నా దాన్ని గమనించను కూడా గమనించలేదని, జనం కంగారుగా యేమి మాట్లాడుకుంటున్నారో ఆమెకి బోధపడ్డం కష్టంగా వుందని కరేనిన్ చూశేడు. కాని అతను మళ్లీ మళ్లీ యెక్కువ గాఢంగా ఆమె కేసి చూశాడు. వ్రాన్‌స్కీని చూడ్డంలోనే అన్నా నిమగ్నం అయివుంది, కాని భర్త జడ దృక్కులు తనమీదనే వున్నాయన్న అనుభూతి ఆమెకి కలిగింది.

ఓ క్షణం సేపు అతనికేసి ప్రశ్నార్థకంగా చూసింది. ముఖ్యూ మొహం చిట్లించుకుని పక్కకి మళ్లింది.

'ఆ, నువ్వేమనుకుంటే నాకేం' అని అతనికి చెప్పినట్టు చూసింది. ఆ తర్వాత భర్తకేసి వొక్క సారి కూడ చూడలేదు.

అవరోధాల పందెం దురదృష్టకరంగా వుంది. పాల్గొన్న పదిహేడు మందిలోనూ సగం మంది కింద పడిపోయారు. వాళ్లకి దెబ్బలు తగిలాయి. పందెం ముగిసేటప్పటికి అందరికీ ఆందోళన కలిగింది. జార్ అసంతృప్తి చెందడంవల్ల ఆ ఆందోళన మరీ యెక్కువ అయింది.

29

ప్రతివాళ్ళూ తమ అసమ్మతిని పైకి వెళ్లడి చేశారు. "ఇః యిక గోడాలో సింహాళ్ళీ, వస్త్రాలుంచి పెట్టడం తరవాయి వుంది" అని యెవర్లో అన్న ముక్కని ప్రతివాళ్ళూ రెట్టించారు. అందరి మనస్సులూ వికలం అయిపోయాయి. వ్రాన్‌స్కీ కింద పడిపోయినప్పుడు అన్నా గట్టిగా యెగశ్వాస తీసినా యెవళ్లకీ అది వింతగా అనిపించలేదు. కాని ఆ తర్వాత అన్నా ముఖం మారిపోయింది. అనుమానం లేకుండా ఆమె వదనం ఉచితంగాని ఆందోళన వ్యక్తం చేసేటట్టు మారింది. తనమీద తనకి పూర్తిగా అదుపు పోయింది. పంజరంలో బంధించిన పిట్టలాగ విలవిల్లాడిపోయింది. కాసేపు వెళ్లిపోదామనుకొని లేచేది. కాసేపు బెట్సీతో మాట్లాడేది.

"రా పోదాం, పద యిక్కణ్నుంచి పోదాం" అంది.

కాని బెట్సీ ఆమె మాటలు వినిపించుకోలేదు. ముందుకు వాలి తనదగ్గరికి వస్తూవున్న జనరల్‌గారితో మాట్లాడింది.

కరేనిన్ అన్నా దగ్గరకు వచ్చి, చాలా నమ్రతగా ఆమెకి చెయ్యి అందించేడు.

"రావాలని వుంటే రండి వెడదాం" అని ఫ్రెంచిలో అన్నాడు.

కాని జనరల్‌గారు యేం చెప్తున్నారో వినడం కోసం అన్నా ఆతృతగా చెవులు అప్పగించి భర్తకేసి దృష్టి పెట్టనే లేదు.

"అతనికక్కడ కాలు విరిగి పోయిం దంటున్నారు. యిలాంటిది యిక లేదు" అన్నాడు జనరల్‌గారు.

భర్త మాటకి జవాబు చెప్పకుండానే అన్నా ఫీల్డ్‌గ్లాస్‌ని యెత్తి వ్రాన్‌స్కీ పడిపోయిన వైపు పెట్టి చూసింది. కాని ఆ చోటు చాలా దూరంగా వుండడంవల్లా, చాలా మంది జనం పోగవడంవల్లా ఆమెకి యేమీ కనిపించలేదు. ఫీల్డ్‌గ్లాస్‌ని వదిలేసింది. వెళ్లిపోయి వుండేదే. సరిగ్గా ఆ సమయంలో వో ఆఫీసరు స్వారీ చేసుకుంటూ వచ్చి జార్‌కి నివేదించాడు. అతనేం చెప్తున్నాడో వినడానికని అన్నా ముందుకంటా వాలింది.

"స్తీవా! స్తీవా!" అని తమ్ముడు అబ్లాన్‌స్కీని పిలిచింది.

కాని ఆమె పిలవడం అతనికి వినిపించలేదు. మళ్లీ అక్కడ నుంచి వెళ్లిపోవాలనుకుంది.

"రావాలనుకుంటే మరోసారి మీకు చేతిని అందిస్తున్నాను" అన్నాడు కరేనిన్ ఆమె చేతిమీద తన చెయ్యి వేస్తూ.

ఆమె వెలపరంగా అతని చేతిని తోసేసి అతనికేసి చూడకుండానే

"వద్దు, వద్దు, నన్ను వదలండి, నేను యిక్కడే ఉంటాను" అంది.

వ్రాన్‌స్కీ పడిపోయిన చోటు దగ్గర్నుంచి వో ఆఫీసరు పరిగెత్తుకుంటూ రావటం

ఆమెకి కనిపించింది. పందేల మైదానంమీదుగా పరిగెత్తుకుంటూ అతను మండపం దగ్గరికి వస్తున్నాడు. బెట్సీ అతనికేసి రుమాలు వూపింది. పందెంలో పాల్గొన్న వ్యక్తికి యేమీ అవలేదనీ, గుర్రానికి మాత్రం నడుం విరిగిపోయిందనీ అతను వార్త అందించేడు.

ఆ వార్త విన్న వెంటనే అన్నా కూలబడి పోయింది. వినవక్రతతో ముఖం కప్పుకుంది. ఆమె యేడుస్తుందనీ, కన్నీళ్లనే గాక యేడ్పే వెక్కిళ్లని కూడా అపుకోలేక పోతోందనీ కరేనిన్ చూశాడు. ఆ వెక్కిళ్లకి ఆమె వక్షస్సు యెగిసి పడుతోంది. ఆమెకి సంబాళించుకునే వ్యవధి యిచ్చేందుకని ఆమె ముందు నిలబడి ఆమెని కమ్మేశాడు.

"పట్టుకోవాల్సిందిగా మీకు మూడో సారి చెయ్యి అందిస్తున్నాను" అన్నాడు కొన్ని క్షణాల తర్వాత. అన్నా అతనికేసి చూసింది. ఏం చెప్పాలో ఆమెకి బోధపడలేదు. ప్రిన్సెస్ బెట్సీ ఆమెని రక్షించింది.

"లేదులెండి, కరేనిన్‌గారూ, నేను అన్నాని యిక్కడికి తీసుకువచ్చేను. ఆమెని యింటి దగ్గర నేనే దిగబెడతాను" అంది.

"క్షమించండి ప్రిన్సెస్" అన్నాడతను మర్యాదగానే చిరునవ్వు నవ్వుతూ. కాని ఆమె కళ్లల్లోకి దృఢంగా చూస్తూ అన్నాడు. "అన్నాకి వొంట్లో బాగలేదని నాకనిపిస్తోంది. ఆమె నాతో యింటికి రావాలని నా కోరిక" అన్నాడు.

అన్నా భయం భయంగా అటూ యిటూ చూసింది. కిమ్మనకుండా లేచి భర్త చెయ్యి పట్టుకుంది.

"అతని దగ్గరికి యెవర్లనేవా పంపి నీకు కబురు అందజేయిస్తాను" అని బెట్సీ మెల్లిగా అన్నా చెవిలో చెప్పింది.

మండపంనుంచి బయటకు వెళ్లేటప్పుడు కరేనిన్ యథాప్రకారంగానే తనని పలకరించే వాళ్లతో మాట్లాడేడు. యధారీతిగానే అన్నా కూడా పలకరింపులకి జవాబు యివ్వవలసి వచ్చింది. కాని ఆమె తన స్వాధీనంలో లేదు. ఏదో కలలో ఉన్నట్టు భర్త చెయ్యి పట్టుకుని నడిచింది.

'అతనికి దెబ్బ తగిలిందో ఏమో? అసలు ఏం జరిగిందో? వస్తాడో రాడో? యీ రాత్రి కలుస్తాడో కలవడో?' అని ఆమె అనుకుంది.

యేం మాట్లాడకుండా ఆమె కరేనిన్‌తో బగ్గీ యెక్కింది. గుంపుగా వున్న బగ్గీల మధ్య నుంచి మాట్లాడకుండానే దారి చేసుకుంటూ వెళ్లారు. కరేనిన్ తన కళ్లతో యెంతో చూసినా, భార్య అసలైన పరిస్థితి గురించిన ఆలోచన రానివ్వలేదు. అతను పూరికే బాహ్య లక్షణాలని చూశేడు. ఆమె అనుచితంగా ప్రవర్తించిందనే చూశేడు. ఆ విషయం ఆమెకి చెప్పడం తన విధి అని భావించేడు. కాని అంత మాత్రమే చెప్పడం, అంతకు మించి యేమీ చెప్పక పోవడం అతనికి చాల కష్టం అయింది. ఆమె ప్రవర్తన అనుచితంగా వుందని చెప్పడానికి నోరు తెరిచాడు. కాని అప్రయత్నంగానే వేరే మాటలు అనేసాడు.

"అయినా యిలాంటి క్రూర దృశ్యాల్ని చూసే అభిరుచి మనకి యెలా వుంటుందో" అన్నాడు. "వాకనిపిస్తోంది..."

"ఏమిటి? నాకర్థం కావడం లేదు" అని అన్నా తూష్ణీంభావంతో అంది.

అతను నొచ్చుకుని తను చెప్పదల్చుకున్న దాన్ని వెంటనే చెప్పడం మొదలుపెట్టాడు.

"మీతో నేను చెప్పి తీరాలి" అని మొదలుపెట్టాడు.

'ఆఖరికి విషయం బయటపడుతోంది' అనుకుంది అన్నా. ఆమెకి భీతి కలిగింది.

"ఇవాళ మీ ప్రవర్తన అనుచితంగా వుందని నేను చెప్పి తీరాలి" అన్నాడతను ఫ్రెంచిలో.

"ఏ విధంగా అనుచితంగా వుంది?" అని బిగ్గరగా అంది. గిరుక్కున తల అతనికేసి తిప్పి నేరుగా అతనికేసి చూస్తూ అంది. కాని యీ సారి గతంలో మాదిరి ఆమె సరదా ముసుగు వేసుకున్నట్టుగా ఉపయోగించే ఉల్లాసకర ధోరణికి బదులు స్థిర నిశ్చయ వైఖరితో అంది. తనలో కలుగుతున్న భయానుభూతిని ఆ వైఖరి కింద కప్ప ప్రయత్నించింది.

"అతన్ని మర్చిపోకండి" అని తెరిచి వున్న కిటికీలోనుంచి బండి తోలేవాణ్ణి చూపిస్తూ అతను అన్నాడు.

ముందుకు వొంగి కిటికీ మూసేడు.

"అందులో మీకు అనుచితంగా కనిపించిన దేమిటి?" అని ఆమె రెట్టించింది.

"పందెంలో పాల్గొనే వాళ్లల్లో ఒకతను కింద పడిపోయినప్పుడు మీరు వ్యక్తం చేసిన బాధ."

అన్నా, అదేం కాదని కొట్టి పారేస్తుందని అతను ఆశించాడు. కాని ఆమె వూరికే ముందుకి గుడ్లప్పగించి చూస్తూ యేమీ జవాబు చెప్పలేదు.

"జనం మీ గురించి చెవులు కొరుక్కుని చెడ్డగా చెప్పడానికి వీలు లేకుండా ఉన్నత సమాజం వాళ్లతో వున్నప్పుడు అలాంటి ప్రవర్తన కనిపించ చెయ్యొద్దని మిమ్మల్ని వేడుకున్నాను. మన వ్యక్తిగత సంబంధాల గురించి నేను మాట్లాడా నొకప్పుడు. ఇప్పుడిక వాటి గురించి మాట్లాడను. ఇప్పుడు మన బాహ్య సంబంధాల గురించే మాట్లాడతాను. మీ ప్రవర్తన అనుచితంగా వుంది. మళ్లీ తిరిగి అలా జరగకూడదని కోరుతున్నాను."

అన్నా అతనన్న మాటలు సగం వినసే లేదు. అతనంటే భయపడింది. కాని వ్రాన్‌స్కీని గురించే ఆలోచిస్తోంది. అతను గాయపడ లేదన్న మాట నిజమేనా? ఆశ్వికుడికి దెబ్బలు తగలలేదనీ, గుర్రం నడుము విరిగి పోయిందనీ చెప్పిన మాట అతన్ని గురించేనా? కరేనిన్ మాట పూర్తి చెయ్యగానే ఆమె వూరికే కపట ధోరణిలో వ్యంగ్యంగా చిరునవ్వు నవ్వింది. ఏమీ అనలేదు, యేమంటే అతనన్న మాటలు వినలేదు గనక. కరేనిన్ ధైర్యంగానే మొదలెట్టాడుగాని తను యేం అంటున్నదీ పూర్తిగా గ్రహించగానే అన్నాకి కలుగుతున్న భయం అతన్నీ పట్టుకుంది. అతను అన్నా చిరునవ్వును చూశేడు. విచిత్రమైన వొక భ్రమలో పడి పోయాడు.

'ఆమె నా అనుమానాలు చూసి నవ్వుతోంది. అప్పట్లో నాతో అన్న మాటలు యిప్పుడు అంటుంది. నా అనుమానాలు నిరాధారం అయినవి, పరిహాసాస్పదమైనవి.'

సర్వమూ వెల్లడి అవబోయే సమయం అది. కాని అంతకుముందు లాగానే తన అనుమానాలు నిరాధారమైనవనీ, హాస్యాస్పదమైనవనీ ఆమె పరిహాసభరితంగా అనాలనే అతను మనస్సులో కోరుకున్నాడు. అతనికి అప్పటికే తెలిసిన విషయం యెంత భయంకరంగా వుందంటే అతను యేమి చెప్పినా నమ్మడానికి సిద్ధంగా వున్నాడు. కాని భయకంపితమైపోయి, ముభావంగా కనిపించే అన్నా ముఖంలో వ్యక్తమైన భావం అలా మోసం చేసుకోవడానికి కూడా ఆశ కలిగించడం లేదు.

"బహుశా నేను పొరపడి వుండచ్చు. అలా అయితే క్షమించమని అడుగుతున్నాను" అన్నాడు.

"లేదు మీరు పొరపడలేదు" అందామె మెల్లగా. జడంగా వున్న భర్త ముఖంకేసి హతాశతో చూసింది. "మీరు పొరపడలేదు. నేను ఇందాక విలవిల్లాడిపోయాను, యిప్పుడు కూడ విలవిలలాడిపోకుండా వుండలేను. మీ మాటలు వింటూనే ఉన్నాను. అతన్ని గురించి అనుకుంటూ వున్నాను. అతన్ని ప్రేమిస్తూ వున్నాను. అతని ప్రేయసిని. మిమ్మల్ని భరించలేను, మీరంటే నాకు భయం, అసహ్యం... యిక మీ యిష్టం ఏమన్నా చేసుకోండి."

బగ్గీలో వో మూలకి వాలిపోయి ముఖం చేతులతో కప్పుకొని వెర్రిగా యేడ్వడం మొదలు పెట్టింది. కరేనిన్ కొయ్యబారిపోయి కదలకుండా నేరుగా యెదరకి చూస్తూనే కూర్చుండిపోయాడు. కాని అతని ముఖంమీద మృతుని ముఖంమీద మాదిరీ గంభీర నిశ్చలత ఆవహించింది. దాచాకి చేరేదాకా ఆ భావం అలానే వుంది. దాచాకి చేరగానే అదే కవళికతో అతను ఆమెకేసి తల తిప్పేడు.

"సరే అయితే సంగతి అదన్నమాట. కాని నేను లోక మర్యాదకోసం ఉచితమైన ప్రవర్తన వుండాలని కోరుతున్నాను" అతని గొంతుక కంపించింది. "నా గౌరవం కాపాడుకోవడానికి తగ్గ చర్యల్ని నేను తీసుకొని, అవేమిటో మీకు తెలియజేసే దాకా."

ముందు అతను బండి దిగి, ఆమె దిగడానికి సాయం చేశాడు. నౌకర్ల ముందు మాట్లాడకుండా ఆమె చేతిని అదిమాడు. మళ్లీ బండి యెక్కి పీటర్స్‌బుర్గ్‌కి వెళ్లిపోయాడు.

అతను వెళ్లిపోయిన వెంటనే ప్రిన్సెస్ బెట్సీ నౌకరొకడు వచ్చి అన్నాకి వో చీటీ అందించాడు: 'వ్రాన్స్కీ యెలా వున్నదీ కనుక్కు రమ్మని పంపేను. తను బాగానే వున్నాననీ, దెబ్బలు యేం తగలలేదనీ కాని దుఃఖంలో వున్నాననీ రాశాడు.'

'అమ్మయ్య, అయితే వస్తాడు. యీపత్తూ ఆయనికి చెప్పెయ్యడం యెంత బాగుంది!' అనుకుంది.

అన్నా గడియారం చూసుకుంది. మూడు గంటలు నిరీక్షించాలి. గత సారి తాము కలుసుకున్నప్పుడు జరిగింది గుర్తు వచ్చింది. ఆమె రక్తనాళాల్లో రక్తం వెచ్చగా ఉరుకులెత్తింది.

'హమ్మయ్య! ఎంత ప్రకాశవంతంగా వుంది! ఇది భయానకంగా వుంది కాని, అతని ముఖం చూడ్డం నాకు యిష్టం. ఈ విలక్షణ ప్రకాశం బాగుంటుంది. భర్త! ఉఫ్, ఊ... దేవుడి దయవల్ల ఆయనతో మొత్తం సమాప్తం అయిపోయింది.'

30

జనం పోగయే అన్ని చోటుల్లో మాదిరి ష్చేర్‌బాత్‌స్కీలు కుటుంబం చేరిన జర్మన్ జల చికిత్సా పట్టణంలో కూడా, సమాజంలో జరిగే లాంటి వొక సామాన్య 'స్ఫటికీకరణం' జరిగింది. అందులో ప్రతి వొక్క వ్యక్తికీ వొక విశేష అపరివర్తనీయ స్థానం వచ్చేస్తుంది. నీటి బిందువు చలికి గడ్డకట్టి మంచు స్ఫటికం రూపం తీసుకున్నట్టుగా ఆ ఆరోగ్య కేంద్రానికి వొచ్చే ప్రతి కొత్త వ్యక్తీ తనకి నప్పిన స్థానంలో పడడం జరుగుతుంది.

ఫూర్‌స్ట్ ష్చేర్‌బాత్‌స్కీ జమ్త్ గెమాలిన్ ఉండ్ టొహ్‌టర్[1], వుంటున్న నివాసాన్ని బట్టీ, పేరుని బట్టీ అలాగే కలిసి మెలిసి తిరిగే పరిచయస్థులని బట్టీ వొక నిశ్చిత పూర్వ నియమిత స్థానంలో స్ఫటిక రూపం తీసుకున్నారు.

అసలైన జర్మను ప్రిన్సెస్ వొకావిడ ఖనిజ జలం దగ్గర వుండటంతో సమాజ స్ఫటికీకరణ ఆ యేడాది మామూలుకంటే యెక్కువ ఉరవడితో జరిగింది. తన కూతురికి జర్మన్ ప్రిన్సెస్‌తో పరిచయం కలిగించాలని ప్రిన్సెస్ ష్చేర్‌బాత్‌స్కాయా ఆతృత పడింది. వాళ్ళు అక్కడికి చేరిన రెండవ నాడే ఆ తంతు పూర్తయింది. పారిస్‌నుంచి పురమాయించి తెప్పించిన 'అతి సాధారణ', అంటే మహాశోభాయమైన, వేసవి గౌను తొడుక్కుని కిట్టీ చాలా వంగి, మనోజ్ఞంగా వందనం చేసింది. "ఈ ముచ్చటైన చెక్కిళ్ళమీద గులాబీలు మళ్ళీ వికసిస్తాయని ఆశిస్తున్నాను" అంది జర్మన్ ప్రిన్సెస్. ఆ క్షణంనుంచీ ష్చేర్‌బాత్‌స్కీలకి వో ప్రత్యేక జీవిత విధానం నిర్ణయమై పోయింది. దానినుంచి వాళ్ళు మళ్ళలేక పోయారు. ష్చేర్‌బాత్‌స్కీలు వో యింగ్లీషు ఉన్నత మహిళతో, ఆవిడ కుటుంబంతో సంబంధం కలిగించుకున్నారు. ఓ జర్మన్ కౌంటెస్‌తో, గత యుద్ధంలో గాయపడిన ఆమె కొడుకుతో, ఒక స్వీడిష్ పండితునితో, M. Canutతో, ఆయన సోదరితో పరిచయాలు కలిగించుకున్నారు. కాని మాస్కో నుంచి వచ్చిన మహిళ మరీయా యెవ్‌గేనియెవ్నా ర్తీశ్చెవా, ఆమె కూతురూ అనుకోకుండానే వీళ్ళకి ముఖ్య స్నేహితులయారు. ఆమె కూతురు అంటే కిట్టీకి యిష్టంగా లేకపోయింది. యేమంటే ఆమె కూడా భగ్న ప్రేమ వ్యవహారంవల్ల జబ్బు పడింది. మాస్కోనుంచి వచ్చిన కర్నల్ గారొకాయన కూడా వీళ్ళతో యెక్కువ కలిసి మెలిసి వుండేవాడు. కిట్టీ ఆయన్ని మొదట చిన్న పిల్లగా వున్నప్పుడు చూసింది. భుజకీర్తులున్న యూనిఫాం తొడుక్కుని వుండగా

[1] భార్యా బిడ్డలతో ప్రిన్స్ ష్చేర్‌బాత్‌స్కీ (జర్మన్).

అయన్ని చూడడానికే అలవాటు పడింది. చిన్న కళ్లతో వువ్వుల పై కట్టుకుని కాలరు బొత్తాం విప్పుకొని యిప్పుడాయన మహా తమాషాగా కనిపించేడు. ఆమెని అంటిపెట్టుకొని వదలకుండా వుండడం వల్ల మహా విసుగు పుట్టించేడు. యిదంతా స్థిరంగా పాతుకున్నాక కిట్టీకి చాలా నిరుత్సాహం కలిగింది. ముఖ్యంగా తండ్రి కారల్స్‌బడ్‌కి వెళ్లి, ఆమె తల్లితో ఒక్కర్తీ వుండ వలసి వచ్చినప్పుడు అలా నిరుత్సాహం కలిగింది. అప్పటికే పరిచితులైన వాళ్లపట్ల ఆసక్తి పోయింది. వాళ్ల దగ్గర కొత్త విశేషాలేమీ లేవు. ఖనిజ జలాం దగ్గర కనిపించే అపరిచితుల్ని పరిశీలించడం వాళ్లని గురించి వూహించుకోవడం కిట్టీకి ముఖ్య ఆసక్తికర విషయమైంది. ఇతరుల్లో ముఖ్యంగా తనకి తెలియని వాళ్లల్లో సర్వోత్తమ లక్షణాలున్నట్టు వూహించుకో వడం కిట్టీ స్వభావంలో వొకటి. ఇప్పుడు యెవరు యెవరైందీ, వాళ్ల మధ్య సంబంధాలు యెలాంటివై వుండేదీ, వాళ్లు యెలాంటి మనుషులైందీ వూహించుకుంటూ కిట్టీ అద్భుత, శ్రేష్ఠ స్వరూపాల కల్పన చేసుకునేది. ఆమె పరిశీలనలు ఆమె కల్పనలని బుజువు చేసేవి. అలాంటి వాళ్లల్లో వొక రష్యన్ అమ్మాయి కిట్టీ ఆకర్షణకి కేంద్ర బిందువు అయింది. ఆ అమ్మాయి వో రష్యన్ మహిళతో వచ్చింది. ఆవిడ జబ్బు మనిషి. ప్రతివాళ్లూ ఆవిడ్ని మేడం స్థాల్ అని పిలిచేవాళ్లు. మేడం స్థాల్ ఉన్నత సమాజం ఆవిడ. కాని చాలా జబ్బు మనిషి కావడంవల్ల నడుస్తూ తిరగడానికి వీల్లేకపోయింది. ఎప్పుడేనా వాతావరణం బాగా వున్న రోజుల్లో ఆమె చక్రాల కుర్చీలో బయటకు వచ్చేది. కాని రష్యన్లలో ఆమెకి స్నేహి తులు యేర్పడకపోవడానికి రోగంకంటె ఆమె స్వాతిశయం యెక్కువ కారణం అని ప్రిన్సెస్ ష్చేర్‌ బాట్‌స్కాయా తాత్పర్యం చెప్పేది. ఆ రష్యన్ అమ్మాయి మేడం స్థాల్ సంరక్షణ చూసేది. ఆమె అక్కడున్న బోలెడు మంది జబ్బు మనుషులతో కలిసి మెలిసి తిరగడం కిట్టీ చూసింది. వాళ్లకి చాలా సాదాగా చాలా సహజరీతిలో శుశ్రూష చేసేది. కిట్టీ వూహాప్రకారం ఆ రష్యన్ అమ్మాయి మేడం స్థాల్‌కి బంధువు కాదు, అలా అని జీతానికి కుదురుకున్న మనిషీ కాదు. మేడమ్ స్థాల్ ఆమెని వారెంకా అని పిలిచేది. పైవాళ్లు ఆమెని 'M-lle వారెంకా' అని పిలిచేవాళ్లు. తనకి పరిచితులు కాని యితరులకీ, మేడం స్థాల్‌కీ, ఆ అమ్మాయికీ మధ్య గల సంబంధాలని పరిశీలించే ఆసక్తితో బాటుగా కిట్టీ ఆ అమ్మాయి పట్ల ఫలానా అని చెప్పలేని ఆకర్షణ పొందింది. తరచుగా అలా జరుగుతూ వుంటుంది. ఆ అమ్మాయికి కూడా తనపట్ల యిష్టం వుందని యిద్దరి కళ్లూ కలిసినప్పుడు గ్రహించింది.

M-lle వారెంకాకి తొలి యౌవన వికాసం గడిచిపోయిందని కాదు, కాని ఆమె యౌవన రాగం యెన్నడూ సోకనటువంటి ప్రాణి. ఆమె వయస్సు పంధొమ్మిది వుండచ్చు, ముప్పయీ కావచ్చు. ఆమె కవళికల్ని పరిశీలిస్తే ఆమె అనారోగ్యపు శరీర ఛాయతో వున్నా, ఆమె అనా కారిగా కాకుండా అందమైన మనిషిలాగే కనిపిస్తుంది. ఆమె చాలా బక్కపల్చగా వుండ బట్టీ, తల పెద్దదిగా మనిషి యెత్తు సామాన్యంగా వుండడంతో తూకం కుదరకపోబట్టీ గాని లేకపోతే ఆమె ఆకృతి బాగా వుండి వుండేది. కాని మగాళ్లకి ఆకర్షవంతంగా వుండేటట్టు

కనిపించే అదృష్టం ఆమెకి లేదు. ఆమెలో అది పూర్తిగా వికసించేస్తోంది. రేకులు యింకా రాల్చలేదు. కాని వాసనలేని అందమైన పువ్వులాంటిది. కిట్టీకి పుష్కలంగా వున్న గుణం ఆమెలో లోపించడం కారణంగా కూడ ఆమె మగాళ్లని ఆకర్షించలేక పోయింది — జీవితపు సంయమిత అగ్ని, తన ఆకర్షణ పట్ల చేతన.

ఆమె యెప్పుడూ పనిలో మునిగిపోయి వున్నట్టే కనిపించేది. దాని ప్రాముఖ్యం గురించి అనుమానమే వుండడానికి వీల్లేదు. అందుచేత యితర విషయాలకి సంబంధించి ఆమెకి తీరికే వుండేది కాదని అనిపించింది. తనతో పోలిస్తే వున్న యీ భిన్నత్వం కారణంగా, కిట్టీ ఆమె పట్ల విశేషంగా ఆకర్షితమైంది. ఆమె జీవిత విధానంనుంచి తను సర్వాత్మనా కాంక్షించే దాన్ని పొందగలనని కిట్టీ భావించుకుంది. ఎవళ్లైనా కొంటారా అని ఆజ్ఞాకరంగా ప్రదర్శనకి పెట్టిన వస్తువుల్లాగా తను చూడనారంభించిన ఉన్నత సమాజంలోని అమ్మాయిలకి పురుషులతో వుండే సంబంధాలు వెలపరం పుట్టిస్తాయి. అలాంటి వాటికి అవల వుండే జీవితాన్ని, ఆసక్తికరమైన జీవితాన్ని, అర్థవంతమైన ప్రయోజన పుష్టమైన జీవితాన్ని ఆమె కాంక్షించింది. తన అపరిచిత నేస్తాన్ని పరిశీలించే కొద్దీ ఆమె తను వూహించుకున్న పరిణత మూర్తి అని కిట్టీకి నమ్మకం కలిగింది. ఆమెతో పరిచయం కలిగించుకోవాలన్న కోరిక అధికం అయింది.

వాళ్లు ప్రతి రోజూ కొన్ని సార్లు వొకళ్లకొకళ్లు తటస్థ పడుతూ వుండేవాళ్లు. ప్రతి సారీ కిట్టీ కళ్లు 'ఎవరు మీరు? ఏమిటి మీరు? నేను కల్పించుకుంటున్నంత అద్భుతమైన వాళ్లా? నేను బలవంతంగా మీ పరిచయం కలగ చేసుకుంటానని, అనుకోకండి మీకు పుణ్యం వుంటుంది, నేను వూరికే ముగ్ధురాలినై మిమ్మల్ని చూసి మిమ్మల్ని అభిమానిస్తున్నాను.' అని చెప్తున్నట్టు వుండేవి. 'నేనూ మీరంటే అభిమానంగా వున్నాను. నాకా వ్యవధే వుంటే యింకా యెక్కువ అభిమానించేదాన్ని' అని ఆ అజ్ఞాత యువతి జవాబు చెప్తున్నట్టుండేది. యధార్థానికి ఆమెకి తీరిక లేకపోవడం కిట్టీ చూస్తూనే వుండేది. ఆమె వో రష్యన్ కుటుంబం పిల్లల్ని ఖనిజ జల స్రోతస్సునుంచి యిళ్లకు తీసుకెళుతూనో, వో జబ్బు మనిషికి దుప్పటి తెచ్చి కాళ్లు కప్పుతూనో, లేదా చిరాకు పడిపోతూ వున్న వో రోగిని వోదారుస్తూనో, లేదా యెవళ్లకో బిస్కట్లు కొనిపెడుతూనో వుండేది.

ష్చేర్‌బాత్‌స్కీలు వచ్చిన కొన్ని రోజులకే ఖనిజ జలం దగ్గరికి యిద్దరు వ్యక్తులు ఉదయం పూట రావడం ఆరంభించారు. అందరూ వాళ్లని అయిష్టంగా చూశారు. వాళ్లల్లో పొడుగ్గా, వొంగి నడిచే మగతను వొకడున్నాడు. అతని చేతులు చాలా చాలా పెద్దవి. చిరిగి పోయిన ఓవర్‌కోటు తొడుక్కునే వాడు. అది అతనికి కురచగా వుండేది. అతని కళ్లు నల్లగా వుండేవి. అవి భోళాగానూ కనిపించేవి, మళ్లీ భయంకరంగానూ వుండేవి. అతని తోపాటు వొక స్ఫోటకం మచ్చల ముచ్చటైన ఆడమనిషీ వుంది. ఆమె బట్టలు బీదగా, మంచి అభిరుచి లేనట్టుగా వుండేవి. వాళ్లు రష్యన్లు అని తెలిసి కిట్టీ వాళ్లని గురించి

హృదయంగమమైన ప్రేమ కథని అల్లుకుంది. కాని ప్రిన్సెస్ Kurliste[1] చూసి వాళ్లు నికొలాయ్ లేవిన్, మాషా అని తెలుసుకుంది. లేవిన్ అన్నగారు యెంత చెడ్డ మనిషైందీ అమె కిట్టీకి చెప్పింది. దాంతో కిట్టీ మధుర కల్పనలన్నీ ముక్కలైపోయాయి. కాని తల్లి చెప్పిందానివల్ల కాక అతను కాన్స్తన్తీన్ లేవిన్ అన్నగారు అవడంవల్ల యెక్కువగా కిట్టీ అతన్ని అసహ్యించుకుంది. నిజానికి నికొలాయ్ తల యెగరేసే అలవాటువల్ల ఆమెలో అదుపు చేసుకోలేని ఘృణభావాన్ని కలిగించేదు.

ఆమెకేసి చూస్తూ వుండే భయానంకంగా ఉన్న అతని పెద్ద కళ్లు ద్వేషంతో, పరిహాసంతో ఉన్నట్టు ఆమెకి అనిపించింది. వాటిని తప్పించుకోవడానికి శాయశక్తులా ప్రయత్నించింది.

31

వాతావరణం బాగా లేదు. పొద్దుటిపూట అంతా వాన పడుతూనే వుంది. రోగులు గొడుగులు వేసుకొని గేలరీలో పోగయారు.

కిట్టీ తల్లితోనూ, మాస్కో కర్నల్‌తోనూ కలిసి నడుస్తోంది. అతను ఫ్రాంక్‌ఫర్ట్‌లో కొన్న యూరోపియన్ ఫేషన్ ఓవర్‌కోటు తొడుక్కున్నాడు. వాళ్లు నికొలాయ్ లేవిన్‌ని తప్పించుకోవడానికి గేలరీకి ఓ పక్కనుంచి వెడుతున్నారు. వారెంకా వో ఫ్రెంచి అంధురాలితో కలిసి గేలరీ అంతా తిరుగుతోంది. వారెంకా నల్లని బట్టలు వేసుకుంది. అంచులు వాలివున్న నల్లని టోపీ పెట్టుకుంది. ఆమె కిట్టీకి యెదురు పడినప్పుడల్లా వాళ్లు వొకళ్లకేసి వొకళ్లు స్నేహపూర్వకంగా చూసుకున్నారు.

"అమ్మా, ఆమెతో మాట్లాడనా?" అని కిట్టీ అడిగింది, తన అజ్ఞాత స్నేహితురాలు బుగ్గలో దగ్గరికి వెళ్లడం చూసి. అక్కడ తాము తప్పకుండా కలుసుకుంటారు.

"నీకు అంతగా అనిపిస్తే స్వయంగా ఆమె గురించి వాకబు చేసి నిన్ను ఆమె దగ్గరికి నేనే పంపిస్తాను" అందామె. "కాని ఆమెలో అంత విశేషం నీకు యేం కనిపించింది? ఏదో తోడు వుంటుందంతే. నువ్వు కావాలంటే మేడం స్థాల్ పరిచయం చేయిస్తాను. నాకు ఆవిడ belle-soeur[2] తెలుసు" అని నగర్వంగా తల యెగరేస్తూ అంది.

ఆమెని పరిచయం చెయ్యడంలో మేడం స్థాల్ ఆమెని చీదరించుకుంటుందేమోనని, తల్లి దానితో నొచ్చుకుంటుందని కిట్టీకి తెలుసు. కిట్టీ యిక తల్లిని ఒత్తిడి చెయ్యలేదు.

"ఆమె యెంత ముచ్చటగా, అద్భుతంగా వుంది!" అని వారెంకా ఫ్రెంచి అంధ మహిళకి లోటాతో నీళ్లు యివ్వడం చూసి ఆమె అంది. "చూడండి యెంత మధురంగా, నిష్కపటంగా వుందో!"

---

[1] సందర్శకుల చిట్టా (జర్మన్).

[2] వదిన లేదా మరదలు (ఫ్రెంచి).

"ఏ engouements[1] చూస్తే నాకు నవ్వొస్తోంది" అంది ఆమె. "పద పోదాం మంచిది" అని నికొలాయ్ లేవిన్, అతనితో వుండే ఆడమనిషీ తమకేసి రావడం చూసి అంది. ఓ జర్మను డాక్టరు వాళ్లతో కలిసి వస్తున్నాడు. ఆయనతో నికొలాయ్ లేవిన్ కోపంగా గొంతు పెద్దది చేసుకుని మాట్లాడుతున్నాడు.

వీళ్లు వెళ్లిపోదామని వెనక్కి తిరిగారో లేదో పెద్ద గొంతుక చించుకుంటూ మాట్లాడ్డం వినిపించింది. నికొలాయ్ లేవిన్ అక్కడే నిలబడిపోయి డాక్టరుకేసి గొంతు చించుకొని అరుస్తున్నాడు. ఆయన యెదురు అరుస్తున్నాడు. వాళ్ల చుట్టూ వో గుంపు పోగయింది. ప్రిన్సెస్, కిట్టీ గబగబా వెళ్లిపోయారు. సంగతేమిటో చూద్దామని కర్నల్ గుంపులో చేరాడు.

కొన్ని క్షణాల తర్వాత కర్నల్ వచ్చి వీళ్లని కలిసేడు.

"ఏమిటట?" అని ప్రిన్సెస్ అడిగింది.

"చెప్పుకుంటే సిగ్గు, అవమానం" అని కర్నల్ జవాబిచ్చేడు. "మన రష్యన్లని విదేశాల్లో కలుసుకోవాలంటే భయం వేస్తోంది. ఆ పొడుగాటి ఆయన డాక్టరుని దుమ్మెత్తి పోస్తున్నాడు. నానా మాటలూ అన్నాడు. తనకి డాక్టరు సరిగ్గా వైద్యం చెయ్యడం లేదుట. డాక్టరు మీదకి బెత్తం కూడ యెత్తేడు. సిగ్గుచేటు" అన్నాడు.

"ఎంత అసహ్యంగా వుంది!" అందామె. "యేమైంది ఆఖరికి?" అని అడిగింది.

"అదృష్టవశాత్తూ... ఆ పుట్టగొడుగు టోపీ పెట్టుకున్న అమ్మాయి, రష్యన్ అనుకుంటా, రక్షించింది" అన్నాడు కర్నల్.

"Mademoiselle వారెంకా?" అని కిట్టీ సంతోషంగా అడిగింది.

"అవును ఆమే. ఆమె మొదట పరిస్థితిని చక్కబెట్టింది. ఆ పెద్దమనిషిని చెయ్యి పట్టుకొని తీసుకు పోయింది."

"చూశారా అమ్మా! ఆమెని చూసి నేను ముచ్చట పడుతున్నానని మీరు బెంగపడి పోతున్నారు" అంది కిట్టీ.

ఆ మర్నాడు తన అపరిచిత నేస్తాన్ని చూస్తూ వుండగా M-lle వారెంకాకి నికొలాయ్ లేవిన్‌పట్లా, అతని సహచరిపట్లా, యితర protégés, అంటే తమ సంరక్షణ చూసే యితర వ్యక్తులపట్ల వున్న సంబంధాల లాంటివే వున్నాయని కిట్టీ చూసింది. వారెంకా వాళ్ల దగ్గరికి వెళ్లేది, మాట్లాడేది; ఆ ఆడమనిషికి యే విదేశీ భాషా రాకపోవడం వల్ల ఆమెకి దుబాసీగా పనిచేసేది.

వారెంకాతో పరిచయం కలిగించుకుందుకు ఒప్పుకోవల్సిందిగా కిట్టీ తల్లిని మరింతగా బలవంతం చెయ్యడం మొదలుపెట్టింది. మేడం స్టాల్‌తో పరిచయం కలిగించుకొనే విషయంలో మొదటి అడుగు తను వెయ్యవలసి రావడం అయిష్టంగానే వున్నా — యేమంటే

[1] ఆకర్షణలు (ఫ్రెంచి).

మేడం స్టాల్ మహా స్వాతిశయం ప్రదర్శించేది – వారెంకా గురించి ప్రిన్సెస్ వాకబు చేసింది. తన కూతురికి ఆమెతో పరిచయం అవడం హాని చెయ్యదు మేలు చెయ్యదు అని, తత్ సమాచారం అందుకుని తెల్సుకున్నాక ఆవిడ స్వయంగా వారెంకాని కలుసుకొని పరిచయం చేసుకుంది.

కిట్టీ ఖనిజ జలం దగ్గరికి వెళ్లిన సమయం ఆమె యెంచుకుంది. అప్పుడు వారెంకా రొట్టె దుకాణం ముందు నుంచుంది.

"మీతో పరిచయం కలిగించు కోవాలని వుంది" అని ప్రిన్సెస్ సగర్వంగా మందహాసం చేస్తూ అంది. "మా అమ్మాయికి మీరంటే మహా మక్కువగా ఉంది. నేనెవరో బహుశా మీకు తెలియదేమో..."

"నాకు అలానే అనిపిస్తుంది ప్రిన్సెస్" అని వారెంకా వెంటనే జవాబు చెప్పింది.

"మన దయనీయ దేశస్థులకి మీరు విన్న యెంత మంచి పని చేశారు నిజంగా" అందావిడ.

వారెంకా సిగ్గుతో యెర్రబడింది.

"యేదీ చేసినట్టు నాకు గుర్తులేదు" అంది.

"చెయ్యకపోవడం ఏమిటి? పెద్ద యిబ్బందుల్లో పడకుండా నికొలాయ్ లేవిన్‌ని తప్పించారు."

"ఓ, అదా! sa compagne[1] నన్ను పిలిచింది. ఆయన్ని శాంతింప చెయ్య ప్రయత్నించాను నేను. ఆయనకి చాల జబ్బుగా వుంది. డాక్టరు మీద చాలా కోపంగా వున్నారు. అలాంటి రోగులతో వ్యవహరించడం నాకు తెలుసు."

"మీరు మీ పినతల్లి మేడం స్టాల్‌తో మెంటొనోలో వుంటున్నారని విన్నాను. నాకావిడ belle-soeur తెలుసు."

"ఆవిడ మా పిన్ని కాదు. ఆవిడని maman అని పిలుస్తాను కాని ఆవిడ నాకు బంధువు కాదు. ఆవిడ నన్ను పెంచింది" అని వారెంకా మళ్లీ సిగ్గుతో యెర్రబడుతూ అంది.

ఆమె యెంత సాదాగా యీ మాటలు అందంటే, ఆమె ముఖంలో నిత్యపూరితంగా, నిష్కపటంగా వ్యక్తమైన భావం యెంత మధురంగా వుందంటే కిట్టీ యీ అమ్మాయిని అంతలా యెందుకు అభిమానిస్తుందో ప్రిన్సెస్‌కి అర్థమైంది.

"అయితే నికొలాయ్ లేవిన్ విషయం యేమైంది?" అని ప్రిన్సెస్ అడిగింది.

"ఆయన వెళ్లిపోతున్నారు" అని వారెంకా జవాబు చెప్పింది.

సరిగ్గా ఆ సమయంలో కిట్టీ ఖనిజ జల దగ్గర్నుంచి తిరిగి వచ్చింది. తన అజ్ఞాత నేస్తంతో తల్లి మాట్లాడుతూ వుండడం చూసి సంతోషంతో పులకించి పోయింది.

"ప్రూ: కిట్టీ, నెరవేరింది నీ ఆశ, పరిచయం కావించుకోవాలి Mademoiselle..."

---

[1] ఆయనకి తోడుగా వున్న మనిషి (ఫ్రెంచి).

"వారెంకాతో" అందా అమ్మాయి చిరునవ్వు నవ్వుతూ. "నన్నందరూ అలానే పిలుస్తారు" అంది.

కిట్టీ సంతోషంతో యెర్రబడింది. కొంచెం సేపు యేమీ మాట్లాడకుండా తన కొత్త స్నేహితురాలి చెయ్యి నొక్కింది. జవాబుగా వారెంకా కిట్టీ చేతిని నొక్కలేదు. ఆమె చెయ్యి కదలకుండా కిట్టీ చేతిలో వుండిపోయింది. చెయ్యి చేతికి జవాబు యివ్వలేదు. కాని M-lle వారెంకా ముఖం శాంతంగా, ప్రసన్నతా పూర్ణంగా, కొంచెం విచార మందహాసంతో కనిపించి, వెలిగింది. ఆ చిరునవ్వుకి ఆమె పలువరుస కనిపించింది. ఆ పలువరస పెద్దగా వున్నా అందంగానే వుంది.

"చాల రోజులుగా నేను కూడా మిమ్మల్ని కలుసుకోవాలని అనుకున్నాను" అంది వారెంకా.

"మీరెప్పుడూ యెంతో పనిలో వుంటారు..."

"అబ్బె అదేం లేదు, నాకు తీరిక లేనంత పనే లేదు" అంది వారెంకా. కాని ఆ క్షణం లోనే ఆమె తన కొత్త స్నేహితురాల్ని వదిలిపెట్టి వెళ్ళిపోవాల్సి వచ్చింది. ఎందుకంటే ఖనిజ జలం దగ్గర వుండే ఒక రష్యన్ జబ్బు మనిషి చిన్న కూతుళ్ళిద్దరు ఆమె దగ్గరికి పరిగెత్తుకుంటూ వచ్చేరు.

"వారెంకా, అమ్మ పిలుస్తోంది" అని వాళ్ళు అరిచారు.

వారెంకా వాళ్ళతో వెళ్ళిపోయింది.

32

వారెంకా గురించి, ఆమెకి మేడం స్థాల్‌తో వుండే సంబంధాల గురించి, మేడం స్థాల్‌ని గురించి ప్రిన్సెస్ ష్చేర్‌బాత్‌స్కీ సేకరించిన సమాచారం యిదీ:

మేడం స్థాల్ యెప్పుడూ రోగిష్ఠి మనిషే. తిక్కమనిషే. భర్తకి పిచ్చి యెక్కించేసే దని కొందరంటారు. కాదు ఆయనే విచ్చలవిడిగా తిరిగి యీమెకి పిచ్చి యెక్కించే వాడని కొందరంటారు. భర్తనుంచి విడాకులు తీసుకున్నాక ఆమెకి తొలి కాన్పయింది. ఆ బిడ్డ పురుట్లోనే చనిపోయింది. యీమె మనసు అతి సున్నితం అని తెలిసిన బంధువులు బిడ్డ మృతి ఆమెకి ప్రాణాంతకం అవుతుందని భయపడ్డారు. పీటర్స్‌బర్గ్‌లో అదే రాత్రి రాజ వంశస్థుల వంటవాడి యింట్లో పుట్టిన బిడ్డని తెచ్చి, చనిపోయిన బిడ్డ స్థానంలో పెట్టారు. ఆ పిల్లే వారెంకా. ఆమె తన కన్నబిడ్డ కాదని తర్వాత మేడమ్ స్థాల్‌కి తెలిసింది. అయినా గానీ ఆమె సంరక్షణ మానకుండా పెంచింది. ముఖ్యంగా మరొక కారణంవల్ల కూడా అలానే పెంచింది, యేమంటే ఆ తర్వాత త్వరలోనే వారెంకాకి నా అన్న బంధువులెవరూ లేకుండా పోయారు.

పదేళ్లకి పైగా మేడమ్ స్థాల్ విదేశాల్లో దక్షిణాదిన వుంటోంది. ఎప్పుడూ మంచాన్ని

అంటిపెట్టుకునే వుండేది. తను బహు పవిత్రురాలిననీ, మహా దయాశీలవంతురాలిననీ, కావాల్సికి తన కీర్తి సృష్టించుకుని ఉన్నత స్థానం పొందిందని కొందరంటారు. ఆమె స్వతహాగానే పైకి కనిపించేటట్టు, అత్యుత్తమ నైతిక సూత్రాలున్న మహిళ అనీ పరోపకారం కోసమే జీవితం సాగిస్తున్నదని యింకొందరంటారు. ఆవిడదే మతమో యెవళ్లకీ తెలీదు. కాథలిక్ మతస్థురాలా, ప్రొటెస్టంటా, లేక రష్యను పూర్వాచార మతానికి చెందిందా అనేది యెవళ్లకీ తెలీదు. ఆమె సకల ధర్మాలకీ సంప్రదాయాలకీ చెందిన మహనీయులందరిలోనూ స్నేహపూర్వక సంబంధాలు పెట్టుకుందన్న విషయం మాత్రం స్పష్టం.

వారెంకా ఆమెతో అంతకాలమూ విదేశాలలోనే వుంది. మేడం స్థాల్‌ని యెరిగిన వాళ్లందరూ ఆమెని యెరుగుదురు. ఆమె అంటే యిష్టపడేవాళ్లు. ఆమెని M-lle వారెంకా అని పిలిచేవాళ్లు.

ఈ విషయం తెలుసుకున్నాక తన కూతురు వారెంకాతో స్నేహం చెయ్యడంలో తప్పు పట్టుకోవల్సిందేమీ లేదని ప్రిన్సెస్ గ్రహించింది. ముఖ్యంగా యెందుకంటే వారెంకాకి సత్ప్రవర్తన తెలుసు. సుశిక్షణలో పెరిగింది. ఆమె ఇంగ్లీషు, ఫ్రెంచి భాషలని దివ్యంగా మాట్లాడేది. ఇంకా ముఖ్యం అయిందేమంటే, తన జబ్బువల్ల ప్రిన్సెస్‌ని కలుసుకునే అదృష్టం తనకి కలగడం లేదని మేడం స్థాల్ విచారిస్తున్నట్టు వారెంకా వార్త అందజేసినందుకు.

వారెంకాతో పరిచయం అయాక కిట్టీ ఆమెని చూసి యింకా యింకా యెక్కువ ముగ్ధురాలైంది. రోజురోజుకీ ఆమెకి వారెంకాలో నూతన సుగుణాలు వెల్లడవుతూనే వున్నాయి.

వారెంకాకి మంచి స్వరం వుందని తెలిసి ఆమెని పాట పాడమని ప్రిన్సెస్ పిలిచింది.

"కిట్టీ పియానో వాయిస్తుంది. మా దగ్గర పియానో వుంది, చెప్పుకో దగ్గంత మంచిది కాకపోయినా. కాని మాకు చాల సంతోషంగా వుంటుంది" అంది ప్రిన్సెస్ కృత్రిమంగా మందహాసం చేస్తూ. కిట్టీకి అది నచ్చలేదు. ముఖ్యంగా యెందుకంటే వారెంకాకి పాడాలని లేదని ఆమె అప్పుడు గమనించడంవల్ల. అయినా వారెంకా సాయంత్రం వచ్చింది. కృతులు రాసిన కాగితం తీసుకొని వచ్చింది. ప్రిన్సెస్ మరీయా యెవ్‌గేనియెవ్నానీ, ఆమె కూతురునీ, కర్నల్‌నీ కూడా పిలిచింది.

తనకి అపరిచితులైన వాళ్లు వున్నా కూడా బిడియం లేకుండా, వారెంకా సరాసరి పియానో దగ్గరికి వెళ్లింది. పియానాతో సమలయ కలపక పోయినా కృతులు చూసి బాగా పాడింది. కిట్టీ బాగా పియానో వాయించి సమలయ కలిపించవేసింది.

"మీ ప్రతిభ అసాధారణమైంది" అని వారెంకా మొదటి పాట అవగానే ప్రిన్సెస్ అంది.

మరీయా యెవ్‌గేనియెవ్నా, ఆమె కూతురూ ధన్యవాదాలు చెప్పి వారెంకాని పొగిడారు.

"చూడండి" అన్నాడు కిటికీ దగ్గర వుంచున్న కర్నల్. "మీ పాట వినడానికి జనం పోగయ్యారు" అన్నాడు. నిజంగానే కిటికీకింద పెద్ద గుంపు పోగయింది.

"మీకు సంతోషం కలిగినందుకు నాకు ఆనందంగా వుంది" అని వారెంకా మామూలుగా జవాబు చెప్పింది.

కిట్టీ తన స్నేహితురాలికేసి సగర్వంగా చూసింది. ఆమె కళ, ఆమె కంఠం, ఆమె వదనం కిట్టీని ముగ్ధురాల్ని చేశాయి. కాని అన్నిటికంటే యెక్కువగా ఆమె సంస్కారం ముగ్ధురాల్ని చేసింది. ఏమంటే అంత గాత్ర మాధుర్యం వున్నా వారెంకా దానికి ప్రత్యేకం ఏ విశిష్టతనీ యివ్వనట్టే కనిపించింది. పొగడ్తలని చూసి చాలా ఉదాసీనంగా ఉండిపోయింది. ఏం యింకా పాడమంటారా, చాలా అని అడుగుతున్నట్టు మాత్రమే వుందామె.

'నేను గనక ఆమె స్థానంలో వుండి వుంటే, నాపట్ల నాకు యెంత గర్వంగా వుండేది! కిటికీ కింద చేరిన ఆ గుంపు యెంత సంతోషం కలిగించేది! కాని ఆమెకి యివేమీ పట్టినట్టు లేదు. యితరుల కోరికలని మన్నించడం, mamaని సంతోషపరచడం మాత్రమే ఆమెకి యిష్టం అయిందల్లా. ఆమెలో యేం వుంది? అన్నిటినీ లోక్కుగా చూసేటట్టు, ఆత్మ నిర్భర ధోరణితో శాంతంగా వుండేటట్టు యేది ఆమెకి శక్తిని ప్రసాదించింది? దీన్ని తెలుసుకోవాలని, యీమెనుంచి నేర్చుకోవాలని నాకు యెంతో ఉత్సుకతగా వుంది!' అని వారెంకా ప్రశాంత వదనం చూసి కిట్టీ అనుకుంది. ఇంకా యేదన్నా పాడమని ప్రిన్సెస్ వారెంకాని అడిగింది. వారెంకా ముందటి అంత నిమస్థాయిలో, స్పష్టంగా, అందంగా పాడింది. పియానో దగ్గర మంచుని యెండకి కమిలిన వళ్ళని చేత్తో తాళం వేస్తూ పాడింది.

ఆమె పుస్తకంలో వున్న తర్వాతి పాట ఇటాలియన్‌ది. కిట్టీ దాని ప్రారంభ సంగీతం వాయించి వారెంకాకేసి చూసింది.

"ఇది వద్దులెండి" అంది వారెంకా సిగ్గుపడుతూ.

కిట్టీ అదేమిటన్నట్టు ప్రశ్నార్థకంగా ఆమెకేసి చూసింది.

"సరే అయితే యింకోటి" అందామె గబగబా పుట తిప్పుతూ. ఆ పాటకి సంబంధించి యేదో వుందనేది స్పష్టంగా తెలుస్తూనే వుంది.

"పొన్లెండి" అని వారెంకా కృతుం పుస్తకంమీద చెయ్యి పెట్టి, చిరునవ్వు నవ్వుతూ అంది. "యీ పాటే పాడతానులెండి" అంది. ముందటి పాటల మాదిరీ అంతే నిదానంగా, తొట్రుపడకుండా, మధురంగా యీ పాటనీ పాడింది.

ఆమె పాట పూర్తి చెయ్యగానే అందరూ ఆమెకి ధన్యవాదాలు చెప్పి టీ తాగడానికి వెళ్ళారు. కిట్టీ, వారెంకాలిద్దరూ యింటిని ఆనుకుని వున్న తోటలోకి వెళ్ళారు.

"ఈ పాటతో మీ జ్ఞాపకాల్లో యేదో ముడిపడి వుంది. నిజమా, అబద్ధమా చెప్పండి" అని కిట్టీ అడిగింది. "అదేమిట్నైంది చెప్పద్దు లెండి. నిజమో, కాదో చెప్పండి చాలు" అని గబగబా జత చేసింది.

"చెప్పకుండా వుండడాని కేముంది లెండి. చెప్తాను" అని వారెంకా మామూలు ధోరణిలో అంది. జవాబు కోసం ఆగకుండానే చెప్పింది. "ఒకప్పుడు ఆ స్మృతి చాలా బాధగా

వుండేది. నేను ఒకతన్ని ప్రేమించాను, ఆ పాటని అతనికి పాడి వినిపించేదాన్ని" అంది.

కిట్టీ కళ్లు చేరెడు చేసుకుని వారెంకాకేసి స్పందించిపోయి తేరి చూసింది.

"అతన్ని నేను ప్రేమించాను. అతనూ నన్ను ప్రేమించాడు. కాని అతని తల్లికి యిష్టం లేకపోయింది. అంచేత అతను వేరే అమ్మాయిని పెళ్లిచేసుకున్నాడు. ఇప్పుడతను యిక్కడికి దగ్గర్లోనే ఉంటున్నాడు. అప్పుడప్పుడు కనిపిస్తూ వుంటాడు. నా జీవితంలో కూడా ప్రేమ కలాపం వుంటుందా యెప్పుడేనా అనుకున్నారా?" అంది. ఆమె ముచ్చటైన వదనం తేజస్సుతో వెలిగింది. ఆమెని ఆపాదమస్తకం అది ప్రకాశవంతం చేసిందని కిట్టీకి అనిపించింది.

"యెందుకనుకోలేదు? నేను మగాణ్ణి అయివుంటే మిమ్మల్ని యెరిగాక మరి వేరే వాళ్ల నెవళ్లనీ ప్రేమించి వుండను. నాకర్థం కానిదల్లా అతను తల్లిని సంతోషపెట్టడం కోసం మిమ్మల్ని యెలా మర్చిపోగలిగాడా, మీకు దుఃఖం యెలా కలిగించగలిగాడా అని. అతనికి హృదయం లేదు."

"అబ్బెబ్బె, అతను చాల మంచి మనిషి. నేను దుఃఖించడం లేదు. పైగా సుఖంగా వున్నాను. అయితే యివాల్టికి యిక పాటలు పాడ్డం అయిపోయినట్టేనా?" అంది యింటి కేసి తిరుగుతూ.

"మీరెంత మంచివాళ్లు, యెంత మంచివాళ్లు!" అని కిట్టీ అరిచింది. ఆమెని ఆపి ముద్దుపెట్టుకుంది. "కొంచెమైనా నేను మీలాగ ఉంటే యెంత బాగుణ్ణు!" అంది.

"మీరు మరొకళ్లలా వుండాలని యెందుకనుకుంటారు? మీరు యీ వున్నట్టుగానే మంచి వాళ్లుగా వున్నారు" అని వారెంకా వినమ్రంగా కొంచెం అలసటగా మందహాసం చేసింది.

"లేదు, నేను యేమీ మంచిదాన్ని కాదు. కాని చెప్పండి... ఆగండి. కూర్చోండి" అని కిట్టీ మళ్లీ తన పక్కన కూర్చునేటట్టు ఆమెని బల్లమీదకి లాగుతూ అంది. "చెప్పండి, వో వ్యక్తి మీ ప్రేమని తృణీకరించాడు, యేమీ పట్టనట్టు వున్నాడు, అది అవమానకరం కాదూ?" అని అడిగింది.

"తృణీకరించలేదు. అతనూ నన్ను ప్రేమించాడని నా నమ్మకం. కాని తల్లి మాట వినే కొడుకు..."

"కాని తల్లి మాటని బట్టి కాకుండా తనంతటతనే అలా చేస్తే?" అని కిట్టీ అడిగింది. తన రహస్యాన్ని వెల్లడిస్తున్నానన్న స్పృహ ఆమెకి కలిగింది. అవమానంతో దహించుకు పోతున్న తన ముఖం తన మనోభావాల్ని వ్యక్తం చేస్తోందన్న స్పృహ ఆమెకి కలిగింది.

"అది చెడ్డ పని. అతని పట్ల నాకు జాలి వుండదు" అంది వారెంకా. తన గురించి కాక కిట్టీ గురించి మాట్లాడుకుంటున్నట్టు గ్రహించింది.

"కాని అవమానం?" అంది కిట్టీ. "అవమానాన్ని మర్చిపోలేం, వుహు, యెన్నటికీ" అంది. ఆ కడపటి బాల్‌డాన్సప్పుడు, సంగీతంలో విరామం వచ్చిన సమయంలో అతను చూసిన చూపు గుర్తు వచ్చింది.

"అవమానకరం అయిందేముంది? మీరుగా చెడ్డగా ప్రవర్తించ లేదు కదా."

"అంతకంటే అధ్వానంగా, సిగ్గుచేటుగా."

వారెంకా తల ఆడించి కిట్టీ చేతిమీద చెయ్యి వేసింది.

"సిగ్గుచేటుగానా? మీరంటే యేమీ పట్టని వ్యక్తితో మీరు ప్రేమిస్తున్నట్టు చెప్పి వుండలేరు కదా?"

"అలా యెలా చెప్తాను; అతనితో వొక్క మాటా చెప్పలేదు. కాని. అతనికి తెలుసు. ఆ చూపులు, హావభావాలు వుంటాయి కదా. నేను యావజ్జీవితమూ మర్చిపోలేను."

"దేన్ని మర్చిపోవడం? నాకు బోధపడడం లేదు. మీరింకా అతన్ని ప్రేమిస్తూ వున్నారా లేదా అనేదే కావల్సినదల్లా" అంది వారెంకా ఖండితంగా.

"అతన్ని అసహ్యించుకుంటున్నాను, నన్ను నేను క్షమించుకోలేను."

"ఎందుకని?"

"సిగ్గు, అవమానం."

"అహా! అందరూ మీ అంత సున్నిత మనస్కులైతే" అంది వారెంకా. "ఇలాంటి అనుభవం చవిచూడని ఆడపిల్ల ఒక్కత్తి కూడా వుండదు. ఇదంతా ముఖ్యం కాదు" అంది.

"అయితే ముఖ్యమైందేమిటి?" అని కిట్టీ జిజ్ఞాసపూర్వక ఆశ్చర్యంతో ఆమె ముఖం కేసి పట్టి చూస్తూ అడిగింది.

"అబ్బో బోలెడున్నాయి ముఖ్యమైన విషయాలు" అంది వారెంకా చిరునవ్వు నవ్వుతూ. ఏం చెప్పాలో ఆమెకి తోచలేదు. ఇంతట్లోకే ప్రిన్సెస్ కిటికీ దగ్గరనుంచి పిలిచింది.

"కిట్టీ, చలి తిరుగుతోంది, శాలువాయేనా తీసుకెళ్ళు, లేకపోతే లోపలికేనా రా."

"వెళ్ళే వేళయింది" అంది వారెంకా లేస్తూ. "నేనింకా Madame Berthe దగ్గరికి వెళ్ళాలి. నన్ను రమ్మందావిడ" అంది.

కిట్టీ ఆమె చేతిని పట్టుకుంది. జిజ్ఞాసపూర్వకంగా, అనునయపూరితంగా వున్న ఆమె దృక్కులు 'యేమిటది? అతి ముఖ్యం అయింది, యింత ప్రశాంతంగా వుండేటట్టు చేసేది, యేమిటి? మీకు తెలుసు, చెప్పండి' అని అడుగుతున్నాయి. కాని కిట్టీ చూపు యేం ప్రశ్నిస్తుందో వారెంకాకి బోధపడలేదు. తను యింకా m-me Berthe దగ్గరకు వెళ్ళాల్సి వుందనే ఆమెకి గుర్తు వుంది. రాత్రి పన్నెండు గంటలకు ముందే యింటికి వెళ్ళి mamanకి టీ యివ్వాలి అనే గుర్తు వుంది. ఆమె లోపలికి వెళ్ళింది. తన కృతుల పుస్తకం తీసుకుంది. అందరికీ సెలవు చెప్పి వెళ్ళడానికి బయల్దేరింది.

"మిమ్మల్ని యింటి దగ్గర దిగబెట్టనివ్వండి" అన్నాడు కర్నల్.

"రాత్రి యింత పొద్దుపోయాక వొక్కరూ ఎలా వెళ్ళగలరు? పోనీ మీతో పరాషని పంపిస్తాము" అంది ప్రిన్సెస్.

దిగబెట్టడానికి తనకి తోడు రావల్సిన అవసరం వుంది అని విని వారెంకా చాల కష్టం మీద చిరునవ్వు ఆపుకోవడం కిట్టీ చూసింది.

"అక్కర్లేదు, నేనెప్పుడూ ఒక్కత్తినీ వెడుతూ వుంటాను, యేం జరగదు" అని టోపీ తీసుకుంటూ అంది. కిట్టీని మళ్లీ ముద్దుపెట్టుకుంది. ముఖ్యం అయింది యేమిటో ఆమెకి చెప్పకుండానే ఆ వేసవి చీకటి వీధిలోకి చేతిలో కృతుల పుస్తకం పట్టుకుని ధైర్యంగా అడుగు పెట్టింది. ఏది ముఖ్యం అయిందో, అసూయపడదగ్గ ప్రశాంతత, గరిమ దేనివల్ల తనకి వచ్చాయో ఆ రహస్యాన్ని తనతో తీసుకెళ్లి పోయింది.

33

కిట్టీకి మేడం స్థాల్‌తో కూడ పరిచయం అయింది. ఆ పరిచయం, వారెంకాతో స్నేహం ఆమెమీద ఘనమైన ప్రభావాన్ని కలిగించాయి. అంతేకాక ఆమె గాయంమీద లేపనం పూసాయి. ఆమె కొత్త మిత్రుల పుణ్యమా అని ఆమెకి సంపూర్తిగా వొక నూతన ప్రపంచం ఆవిష్కృతమైంది; దానికీ, అంతకు ముందు వున్న ప్రపంచానికీ యేమీ పోలిక లేదు. ఇది వొక సమున్నత సౌందర్య సమన్విత ప్రపంచం. ఆ శిఖరాల మీదనుంచి ఆమె తన పూర్వ ప్రపంచంకేసి ప్రశాంతంగా చూడగలదు. ఆమె సాంత్వనం యీ వాస్తవంలోనే వుంది. తను అప్పటిదాకా లొంగిపోయిన సహజప్రేరణల ప్రపంచమే కాకుండా వొక ఆత్మిక జీవనం కూడా వుందని ఆమె గ్రహించింది. ఆ ఆత్మిక జీవితం ఆమెకి ధార్మికతద్వారా ఆవిష్కృతమైంది. కాని కిట్టీకి చిన్నప్పటినుంచీ తెలిసిన మతానికీ దీనికీ సామ్యం లేదు. ఆ మతం "వితంతు శరణాలయం"* పగటిపూట ప్రార్థనలతో, సాయంత్రం పూట ఆరాధనలతో వుంటుంది. ఆ సమావేశాల్లో తను స్నేహితుల్ని కలుసుకునేది. ఫాదర్ సహాయంతో స్లావనిక్ భాషలో వున్న గ్రంధాలని వల్లె వెయ్యడంలోనే వుంటుంది. అంతకంటె యేమీ వుండేది కాదు. కాని యీ నూతన మతం సమున్నతమైంది. నిగూఢమైంది. మహాన్వితమైన ఆలోచనలతో, అనుభూతులతో నిండి వున్నటువంటిది. ఎవరో ఆదేశించిన కారణంగా దాన్ని నమ్మడం కాదు, దాన్ని ప్రేమించినందువల్ల విశ్వసించడం వుంది.

కిట్టీ దీన్నంతటినీ మాటలద్వారా తెలుసుకోలేదు. ముద్దొచ్చే చిన్నపిల్లలతో మాట్లాడినట్లు మేడం స్థాల్ కిట్టీతో మాట్లాడేది. ఆవిడ యౌవన దినాలు కళ్లకి కట్టినట్టు కనిపించి మురిపిస్తున్నట్టు, కిట్టీ ఆమెని మురిపించింది. మనుషుల సకల వ్యథలకీ ప్రేమా, విశ్వాసం మాత్రమే సాంత్వనం ప్రసాదిస్తాయని, దుఃఖం యెంత కనీసం అయిందైనా క్రీస్తు దయ ప్రాప్తి కలగకుండా పోదనీ ఒక్కసారి మాత్రం ఆమె అంది. వెంటనే ప్రసంగ విషయం మార్చేసింది. కాని ఆమె ప్రతి కదలికనుంచీ, ప్రతి మాటనుంచీ, కిట్టీకి దివ్యంగా కనిపించిన ఆమె ప్రతి దృక్కునుంచీ, ముఖ్యంగా వారెంకాద్వారా తను విన్న ఆమె జీవిత

చరిత్రనుంచి, ముఖ్యమైందేమిటో యేదైతే తనకి అప్పటిదాకా తెలీదో దాన్ని కిట్టీ గ్రహించింది.

మేడమ్ స్థాల్ చరిత్ర యెంతో ఉన్నతమైందే. ఆమె కథ హృదయాన్ని ఆకట్టుకునే టటువంటిదే. ఆమె మాటలు ఉత్కృష్టమైనవే, కోమలమైనవే. అయినాగానీ ఆమెలో తనని కలవరపెట్టిన కొన్ని లక్షణాలు కిట్టీకి అనుకోకుండానే కనిపించాయి. తన బంధువుల గురించి అడిగినప్పుడు ఆమె తిరస్కార పూర్వకంగా చిరునవ్వు నవ్వడం కిట్టీ గమనించింది. అలాంటిది క్రైస్తవ ధర్మానికి విరుద్ధం. ఓసారి మేడం స్థాల్ దగ్గరికి ఓ కాథలిక్ ఫాదర్ వచ్చినప్పుడు ఆమె ప్రయత్నపూర్వకంగా లేంప్ షేడ్ పరిచిన నీడలో తన ముఖాన్ని వుంచుకుంది. ఆమె చిరునవ్వు కూడా ప్రత్యేక పద్ధతిలోనే వుండింది. ఈ విషయం కూడా కిట్టీ గమనించింది. ఇవి చిన్న విషయాలే కావచ్చు, గాని కిట్టీని కలవర పెట్టాయి. మేడం స్థాల్ గురించి కిట్టీకి మనసులో కొన్ని సందేహాలు మిగిలిపోయాయి. కాని అటు వేపున చుట్టపక్కాలు యెవరూ లేకుండా యేకాకిగా మిగిలిపోయి, భగ్నప్రేమని అనుభవించినా, దేన్నీ కోరుకోకుండా, దేన్నీ గురించి ఫిర్యాదు చెయ్యకుండా వున్న వారెంకా పరిపూర్ణతకి ఆదర్శ రూపంగా భాసించింది. అలాంటి పూర్ణత్వం కోసం కిట్టీ పరితపించింది. ప్రశాంతంగా, ఆనందంగా, సమున్నతంగా వుండడానికి తమని తాము మర్చిపోయి యితరుల్ని ప్రేమించాలని వారెంకా ఉదాహరణని బట్టి కిట్టీ గ్రహించింది. కిట్టీ తనూ అలా అవాలని కోరుకుంది. 'అన్నిటికంటే ముఖ్యమైనదేమిటో' స్పష్టంగా తెలిశాక కిట్టీ తన మిత్రుల్ని చూసి ముగ్ధురాలవడంతోనే సంతుష్టి పడలేకపోయింది. తనకి ఆవిష్కృతం చేసిన ఆ నూతన జీవితానికి అర్పితమైపోయింది. మేడం స్థాల్, యితర మహిళలు చేసిన వాటి గురించి వారెంకా చెప్పిన దాన్ని ఆధారం చేసుకుని కిట్టీ తన భావిజీవిత పథకం తయారుచేసుకొంది. మేడం స్థాల్ చెల్లెలి కూతురు Aline గురించి వారెంకా తరచుగా చెప్తూవుండేది. ఆ అమ్మాయిలాగా కిట్టీ కూడా దుఃఖభాజనుల్ని యెక్కడ వున్నా చూసి వాళ్లకి సహాయం చేస్తుంది. బైబిల్ని పంచిపెట్టి, రోగిష్ఠి వాళ్లకి, పతితులకి, మరణశయ్యమీద వున్న వాళ్లకి చదివి వినిపిస్తుంది. Alineలాగా పతితులకి బైబిల్ చదివి వినిపించే ఆలోచన ఆమెని విశేషంగా ఆకర్షించింది. కాని యివన్నీ రహస్యమైన పథకాలు. వాటిని కిట్టీ తల్లికి గాని, వారెంకాకి గాని చెప్పలేదు.

తన పథకాల్ని భారీ స్థాయిలో అమలు పరిచే వ్యవధి వచ్చేదాకా నిరీక్షిస్తూనే కిట్టీ యిప్పుడు కూడా యెక్కువమంది రోగులున్న ఈ చికిత్సాకేంద్రంలో కూడా, వారెంకా మాదిరీ తన నూతన సూత్రాల్ని ఆచరణలో పెట్టే అవకాశాల కోసం చూసింది.

మేడం స్థాల్ పట్లా, ముఖ్యంగా వారెంకా పట్లా తన engouementవల్ల — అలా అని ప్రిన్సెస్ పిలిచేది — కిట్టీ బాగా ప్రభావితం అయిందనే మొదట్లో ప్రిన్సెస్ అనుకుంది. కిట్టీ తన కార్యకలాపాల్లోనే గాక, తనకి తెలియకుండానే నడకలో, మాట్లాడ్డంలో, కళ్లని చికిలించడంలో కూడా వారెంకాని అనుకరిస్తోందని ఆమె గమనించింది. అలా సమ్మోహిత

మవడమే కాకుండా తన కూతురు గంభీర ఆత్మిక పరివర్తనకి గురవుతోందని ప్రిన్సెస్ ఆ తర్వాత గమనించింది.

మేడమ్ స్టాల్ బహూకరించిన ఫ్రెంచి బైబిల్‌ని కిట్టీ సాయంత్రం పూట చదవడం ప్రిన్సెస్ చూసింది. కిట్టీ బైబిల్‌ని అంతకు ముందెన్నడూ చదవలేదు. కిట్టీ ఉన్నత సమాజ మిత్రుల్ని తప్పించుకు తిరుగుతోంది. వారెంకా సంరక్షణలోకి తీసుకున్న రోగులతో, ముఖ్యంగా చిత్రకారుడు పెత్రోవ్ కుటుంబంతో గడిపేది. పెత్రోవ్ రోగిష్టి మనిషి, బీద కుటుంబం వాడు. ఆ కుటుంబానికి తను నర్సులాగా పనిచేస్తున్నానని గొప్పగా భావించుకునేది. అది మెచ్చుకో దగ్గదే, అందులో ప్రిన్సెస్‌కి అభ్యంతరకరమైనదేమీ కనిపించలేదు. పైగా పెత్రోవ్ భార్య చాల గౌరవప్రదమైన కుటుంబంనుంచి వచ్చినటువంటిది. కిట్టీ కార్యకలాపాలు చూసి జర్మన్ ప్రిన్సెస్ ఆమెని పొగిడింది. ఉపచారం చేసే దేవత అంది. పరిమితుల్లో వుండి వుంటే అంతా బాగానే వుండేది. కాని తన కూతురు అతిగా పోతోందని రాకుమారి చూసింది. అందుకని కూతురికి హెచ్చరిక చేసింది.

"Il ne faut jamais rien outrer[1]" అని కిట్టీతో అంది.

కాని కూతురు జవాబివ్వలేదు. క్రైస్తవ ధర్మంలో అతిగా పోవడం అనేదేముంది అని మాత్రమే మనస్సులో అనుకుంది. ఈ బోధని అనుసరించడంలో అతిగా చెయ్యడం అనేది యెక్కడుంది? 'నిన్ను కుడి చెంపమీద కొట్టువాని వైపునకు ఎడమ చెంప కూడా త్రిప్పుము,' 'ఎవడైన నీమీద వ్యాజ్యమువేసి నీ అంగీ తీసికొన గోరిన యెడల వానికి నీ పైవస్త్రముసు కూడ ఇచ్చివేయుము' అని చెప్పే యీ బోధని అనుసరించడంలో యెవళ్లైనా అతిగా యెలా చేస్తారు? కాని ప్రిన్సెస్‌కి కిట్టీ అతిగా వెళ్లడం నచ్చలేదు. తను అశిస్తున్నట్టు, కిట్టీ తనకి మనస్సు విప్పి చెప్పక పోవడం అంతకంటే నచ్చలేదు. వాస్తవానికి కిట్టీ తన నూతన దృక్పథాన్నీ అనుభూతులనీ తల్లికి చెప్పకుండా గోప్యంగా వుంచుకొంది. తల్లి అంటే ఆదరం, ప్రేమ లేకపోబట్టి అలా చేసిందని కాదు, తల్లి కాబట్టే అలా చేసింది. తల్లితో కంటే మరెవళ్ల తోనేనా సునాయాసంగా చెప్పి వుండేది.

"ఎందుకనో మరి అన్నా పావ్‌లొవ్నా చాలా కాలంగా మన దగ్గరికి రావడం లేదు" అని వొక రోజున పెత్రోవ్ భార్య గురించి ప్రిన్సెస్ అంది. "నేను రమ్మని ఆమెని పిలిచాను. కాని ఆమె యే కారణంవల్లనో సుముఖంగా వున్నట్టు లేదు" అంది.

"అబ్బే నాకలా అనిపించడం లేదు, maman" అని కిట్టీ సిగ్గుతో యెర్రబడుతూ అంది.

"నువ్వు వాళ్లింటికి చాల రోజులుగా వెళ్లలేదు కదా?"

"రేపు కొండలు యెక్కడానికి వెళ్లాలనుకుంటున్నాం" అంది కిట్టీ.

---

[1] అతి సర్వత్ర వర్జయేత్ (ఫ్రెంచి).

"బాగుంది, వెళ్ళు" అని ప్రిన్సెస్ అంది. కూతురి ముఖంమీద వ్యాకుల భావం గమనించి, దానికి కారణం యేమై వుంటుందా అని వూహించ ప్రయత్నించింది.

అదే రోజున వారెంకా వీళ్ళ యింటికి భోజనానికి వచ్చింది. ఆ మర్నాడు కొండలు యెక్కడానికి వెళ్ళే ఉద్దేశాన్ని అన్నా పావ్‌లొవ్నా మార్చుకుందని ఆమె తెలియజేసింది. కిట్టీ ముఖం యెర్రబడడం ప్రిన్సెస్ మళ్ళీ గమనించింది.

"కిట్టీ, నీకూ, పెత్రోవ్ కుటుంబానికీ మధ్య పొరపులు వచ్చేయా?" అని తనూ, కూతురూ మాత్రమే వున్నప్పుడు ప్రిన్సెస్ అడిగింది. "ఆమె పిల్లల్ని మన యింటికి పంపడం మానేసింది, తనూ రావడం మానేసింది, యెందుకనో?" అంది.

అలాంటిదేమీ తమ మధ్య లేదనీ, అన్నా పావ్‌లొవ్నా యెందుకు అలా వుందో తనకి నిజంగా అర్థం అవడం లేదనీ కిట్టీ చెప్పింది. కిట్టీ నిజమే చెప్పింది. తనపట్ల అన్నా పావ్‌లొవ్నా వైఖరి యెందుకు మారిందో ఆ కారణం ఆమెకి తెలీదు. కాని ఆమె వూహించింది. తల్లికి చెప్పలేకపోవడమే కాదు, తనకిగా తనే చెప్పుకోలేనిది అది. మనకి తెలిసినా, యిదీ అని చెప్పుకునే ధైర్యం చిక్కని విషయాల్లో అది వొకటి. పొరపాటు అయితే గనక మహా భయానకంగా, లజ్జాకరంగా వుండేటటువంటిది.

కిట్టీ తనకీ ఆ కుటుంబానికీ వున్న సంబంధాలని మళ్ళీమళ్ళీ పునరావలోకనం చేసుకుంది. తనూ, అన్నా పావ్‌లొవ్నా కలుసుకున్నప్పుడు ఆమె గుండ్రటి దయాళు వదనం మీద ప్రకాశించే నిష్కపట సంతోషం గుర్తు వచ్చింది. ఆమె రోగిష్టి భర్త గురించి తాము రహస్యంగా అనుకున్న మాటలు గుర్తు వచ్చేయి. అతను పని చెయ్యకూడదని డాక్టర్లు ఆంక్ష పెట్టారు. అతన్ని పనినుంచి తప్పించి షికార్లకి తీసుకెళ్ళడం విషయంలో తాము ఆలోచించుకున్న పథకాలు గుర్తు వొచ్చేయి. తనపట్ల వాళ్ళ చిన్నపిల్లాడికున్న ఆరాధన గుర్తు వచ్చింది. తను పక్కన ఉంటేగాని వాడు నిద్రపోయేవాడు కాదు. తనని 'నా కిట్టీ' అనేవాడు. ఇదంతా యెంత హాయిగా వుండేది! తర్వాత ఆమెకి కృశించిపోయిన పెత్రోవ్ రూపం గుర్తు వచ్చింది. అతని కాచురంగు ఫ్రాక్‌కోటు, అతని పొడుగాటి మెడ, పల్చని ఉంగరాల జుట్టు, యేదో ప్రశ్నిస్తూ వున్నట్టుండే నీలి కళ్ళూ గుర్తు వచ్చేయి. మొదట్లో ఆ కళ్ళు కిట్టీకి చాలా భయం కలిగించేయి. తన సమక్షంలో ఉల్లాసవంతంగా, ప్రఫుల్లంగా కనిపించాలని అతను చేసే తీవ్ర ప్రయత్నాలు గుర్తు వచ్చేయి. మామూలుగా క్షయరోగులందరి పట్లా వున్నట్టే పెత్రోవ్ పట్ల కూడ తనకి వున్న ఘృణ భావాన్ని వదిలించుకోవడానికి మొదట్లో యెంత శ్రమ పడాల్సి వచ్చిందో గుర్తు వచ్చింది. అతనితో యేం మాట్లాడాలా అని విషయాల కోసం తను వెదుక్కోవడం గుర్తు వచ్చింది. తనకేసి పెత్రోవ్ చూసే నమ్రతాపూర్వక ఆర్ద్రతా భరిత దృష్టి ఆమెకి గుర్తు వచ్చింది. ఆ చూపు తను అతని పట్ల సానుభూతి చూపించేటట్టు, కలత పడేటట్టు వొక వింత భావాన్ని కలిగించేది. తన పరోపకారత్వం గురించిన చేతన కూడా గుర్తు వచ్చింది. కిట్టీ ఆ సమయంలో దాన్ని అనుభూతి చెందుతూ వుండేది. అదంతా

యెంత బాగుండేది! కాని ఆ విధంగా మొదట్లోనే ఉండేది. కొద్ది రోజుల కితం వున్నట్టుండి అంతా మారిపోయింది. యిప్పుడు అన్నా పావ్‌లొవ్నా తెచ్చిపెట్టుకున్న స్నేహభావంతో కిట్టీని పలకరిస్తోంది. కిట్టీని, తన భర్తనీ ఓ కంట కనిపెట్టి చూస్తోంది.

కిట్టీ వెళ్ళినప్పుడు అతనికి కలిగే ఉల్లాసం, అన్నా పావ్‌లొవ్నా ఆమెపట్ల ఉదాసీనంగా తయారవడానికి కారణం కాదుకదా?

'అవును' అని కిట్టీ గుర్తుచేసుకుంది. 'అన్నా పావ్‌లొవ్నా మూడు రోజుల నాడు మీరు రాలేదని చూస్తున్నారాయన. మీరు లేకుండా కాఫీ తాగనన్నారు చాలా నీరసంగా వున్నాగానీ అని చిరచిరలాడుతూ అంది. అన్నా పావ్‌లొవ్నా స్వరం కొంచెం అస్వాభావికంగా కనిపించింది. ఆమెకి సహజంగా వున్న సాధు స్వభావానికి విరుద్ధంగా వుంది.

'అతనికి తను రగ్గు తెచ్చి యివ్వడం అన్నా పావ్‌లొవ్నాకి రుచించక పోయి ఉండచ్చు. అదేమో చాలా సాదా విషయమే. కాని అతను యిబ్బంది పడిపోయి అదే పనిగా నాకు ధన్యవాదాలు చెప్పడంటే, నేనే యిబ్బంది పడిపోయాను. ఇక అతను గీసిన నా బొమ్మ వుంది. ఎంత బాగా చిత్రించాడు. అన్నిటికంటే ముఖ్యం అతను చూసిన చూపు—యెంత మృదువుగా సిగ్గుగా వుంది! అవునవును అదే' అని కిట్టీ భయంతో మనస్సులో రెట్టించుకుంది. 'కాదు, అలా జరగదు! జరగకూడదు! అతను యెంత దయనీయంగా వున్నాడు!' అని ఓ క్షణం తరువాత తనలో తాను అనుకొంది.

ఈ సందేహం ఆమె నూతన జీవితానందాన్ని విషకలుషితం చేసింది.

34

ఖనిజ జల స్రోతస్సు దగ్గర చికిత్స ముగిసే ముందు ప్రిన్స్ ష్చేర్‌బాత్‌స్కీ పర్యటన నుంచి తిరిగి వచ్చేడు. ఆయన కారల్స్‌బడ్‌నుంచి బాడెన్‌లోనూ, కిస్సెన్‌గెన్‌లోనూ రష్యను మిత్రులను చూసి, ఆయన అన్నట్టు 'రష్యను గాలి ఆనందాన్ని' అనుభవించి వచ్చేడు.

విదేశ జీవితానికి సంబంధించి భార్యాభర్తలకి వున్న అభిప్రాయాలు ఉత్తర దక్షిణ ధ్రువాల్లాంటివి. ప్రిన్సెస్‌కి అన్నీ వైభవోపేతంగానే కన్పించాయి. రష్యన్ సమాజంలో తన స్థానానికి యేమీ ఢోకా లేకపోయినా, ఆవిడ యూరోపియన్ మహిళగా వుండాలని ప్రయత్నించింది. కాని ఆవిడ యూరోపియన్ మహిళ అవలేదు, యేమంటే ఆవిడ సిసలైన రష్యన్ మహిళ. దాంతో ఆవిడ నటించాల్సి వచ్చింది. అది యిబ్బంది కలిగించింది. తద్భిన్నంగా ప్రిన్స్‌కి విదేశాల్లో యేదీ నచ్చలేదు. యూరోపియన్ జీవితం ఆయనని కుంగదీసింది. ఆయన తన రష్యను అలవాట్లనే అంటి పెట్టుకుపోయాడు. విదేశాల్లో వున్నప్పుడు యదార్థానికి తను వున్న దానికంటే తక్కువ యూరోపియన్‌లాగా కనిపించ ప్రయత్నించేడు.

ప్రిన్స్ తిరిగి వచ్చేటప్పటికి కొంచెం చిక్కిపోయాడు, చెక్కిళ్ళు వేలాడాయి. కాని మనిషి మాత్రం చాల ఉత్సాహంగా వున్నాడు. కిట్టీ పూర్తిగా కోలుకోవడం చూసి ఆయన ఉత్సాహం ఇనుమడించింది. మేడం స్టాల్‌తోనూ, వారెంకాతోనూ కిట్టీ స్నేహం గురించీ, కిట్టీలో తనకి కనిపించిన మార్పు గురించీ ప్రిన్సెస్ చెప్పింది. విన్నాక ఆయనకి కొంచెం పరిత్రాసం కలిగింది. కిట్టీని తన నుంచి ఆకర్షించి లాక్కుపోయే యెవరివల్లనైనా, దేనివల్లనైనా ఆయనకి యెప్పుడూ కలిగే యీర్ష్యలాంటిది కలిగింది. తన ప్రభావ పరిధినుంచి కిట్టీని ఆకర్షించి తనకి ప్రవేశం దొరకని క్షేత్రాల్లోకి తీసుకుపోతారేమోనని భయం కలిగింది. కాని ఈ అప్రియమైన వార్తల చుక్కలన్నీ ఆనంద సాగరంలో, సంతోష సముద్రంలో మునిగి పోయాయి. ఆయన యెప్పుడూ వాటిలో తేలిపోతూ వుండేవాడు. కార్ల్స్‌బెడ్ ఖనిజ జలాల తర్వాత అవి ప్రబలం అయాయి.

తిరిగి వచ్చిన మర్నాడు ఆయన కూతురితో కలిసి జల దగ్గరికి ఉత్సాహంగా బయల్దేరాడు. పొడుగాటి ఓవరుకోటు తొడుక్కున్నాడు. ఆయన ముఖంమీద రష్యన్ ముడతలున్నాయి. గంజిపెట్టిన చొక్కా కాలరు వేలాడే బుగ్గల్ని పైకి యెత్తింది.

ఆ ఉదయం పూట చాలా శోభగా వుంది. శుభ్రంగా, ఉల్లాసవంతంగా వున్న యిళ్ళనీ, చిన్న చిన్న తోటలనీ, ప్రకాశవంతంగా వున్న యెండనీ, బీరు తాగి తాగి పొంగిన యెర్ర బుగ్గలూ, చేతులూ వున్న జర్మన్ ఆడపరిచారకులు ఖుషీగా పనులు చేస్తూ వుండడాన్నీ చూస్తే మనస్సు ఉప్పొంగి పోతుంది. కాని తండ్రీ కూతురూ ఖనిజ జలానికి దగ్గరగా వచ్చేకొద్దీ రోగిష్టివాళ్ళు యింకా యింకా యెక్కువగా తగిలేరు. వెల్లి విరుస్తూ వున్న జర్మన్ జీవిత సామాన్య పరిస్థితుల్లో, వాళ్ళ వాళ్ల ముఖాలు యింకా దయనీయంగా వున్నాయి. కిట్టీకి యీ వైరుధ్యం యిప్పుడేమీ ఆశ్చర్యకరంగా లేదు. ఆమెకి సంబంధించి ప్రకాశవంతంగా వున్న ఆ యెండ, మిలమిలలాడే పచ్చదనం, సంగీత శింజితం ఆ పరిచిత రోగుల పద వాలకీ తాను పరిశీలించిన వాళ్ల వదనాల్లో కలిగే శుభాశుభ పరివర్తనలకీ ప్రాకృతిక పరిసరాలు మాత్రమే. కాని ప్రిన్స్‌కి మాత్రం ఆ జూన్ మాసపు ప్రభాత తేజస్సు, మిలమిల, ఉల్లాసంగా మోగుతూ వున్న వాల్ట్జ్ నృత్యపు సంగీత ధ్వని, ముఖ్యంగా ఆరోగ్యవంతమైన పరిచారకుల ప్రకాశమాన వదనాలు యూరపు నలుమూలలనుంచీ వచ్చి యిక్కడ చేరిన జీవచ్ఛవాల్లాంటి రోగుల సమూహం సరసనే వుండడం యెబ్బెట్టుగా రోతగా కనిపించింది.

తన ముద్దుల కూతురి చెయ్యి పట్టుకు నడుస్తూవుంటే ప్రిన్స్‌కి గర్వంగా వుంది, యౌవనం తిరిగి వచ్చినట్టుగా వుంది. అయినా కూడా తన దృఢమైన నడక, కమ్మెచ్చులు తీసినట్టున్న అవయవాలు చూసి ఆయనకి మనస్సులో ఇబ్బందిగా అనిపించింది. సిగ్గు కూడ కలిగింది. నగ్నంగా నలుగురిలోనూ నడుస్తున్నట్టు ఆయనకి అనిపించింది.

"నీ కొత్త స్నేహితుల్ని నాకు చూపించు" అన్నాడాయన మోచేత్తో కూతురి చేతిని నొక్కుతూ. "నిన్ను ప్రస్నురాల్ని చేసినందువల్ల నాకు నీ వెంపరం పుట్టించే సోడెన్ మంచిది

గానే అనిపిస్తుంది. కాని ఇక్కడ విచారంగా, చాలా విచారంగా ఉంది. యెవరు వాళ్లు?" అని అడిగాడు.

తాము కలుసుకున్న పరిచితుల గురించీ, అపరిచితుల గురించీ కిట్టీ తండ్రికి చెప్పింది. తోట గుమ్మం దగ్గర వాళ్లకి అంధురాలైన m—me Berthe కనిపించింది. ఆమెకి తోడుగా వో ఆడమనిషి వుంది. కిట్టీ కంఠం వినగానే ఆ ఫ్రెంచి వృద్ధురాలి ముఖం స్నేహభావంతో వికసించడం చూసి, ప్రిన్స్‌కి సంతుష్టి కలిగింది. ఆమె ఫ్రెంచి వాళ్లకి వుండే అతి నమ్రతతో ఆయనతో మాట్లాడింది. కిట్టీలాంటి ముచ్చటైన కూతుర్ని కన్నందుకు చాలా అభినందించింది. కిట్టీ అణి ముత్యం అనీ, విలువైన నిధి అనీ, దుఃఖితులకి సేవచేసే దేవత అని ఆమె సముఖంలోనే మహా ప్రశంసించింది.

"ఆఁ, అయితే మా అమ్మాయి రెండో దేవత అన్నమాట. యీమె Mademoiselle వారెంకాని మొదటి దేవత అంటుంది" అని ప్రిన్స్ చిరునవ్వు నవ్వుతూ అన్నాడు.

"ఓహ్, Mademoiselle వారెంకా నిసలైన దేవత, allez[1]" అని m—me Berthe అంది వెంటనే.

గేలరీలో వాళ్లకి వారెంకాయే కలిసింది. ఆమె ఫేషనైన యెర్ర పర్స్ పట్టుకుని హడావుడిగా నడుస్తూ వీళ్లకేసి వస్తోంది.

"మా నాన్నగారు వచ్చారు చూడండి" అంది కిట్టీ.

వారెంకా యెప్పటిలాగానే వాజాగ్గా, సహజంగా ప్రిన్స్‌కి అభివాదం చేసింది. వెంటనే యే సంకోచమూ లేకుండా సరళంగా అందరితోనూ తను మాట్లాడే రీతిలో ఆయనతో మాట్లాడింది.

"మిమ్మల్ని నేను యెరుగుదును, బాగా యెరుగుదును" అని ప్రిన్స్ చిరునవ్వు నవ్వుతూ అన్నాడు. తన నేస్తం తండ్రికి నచ్చిందని ఆ చిరునవ్వుని బట్టి కిట్టీ సంతోషంతో గ్రహించింది. "యేమిటంత హడావుడిగా వెడుతున్నారు, యెక్కడికి?" అని అడిగాడు.

"Maman యిక్కడ వుంది" అంది కిట్టీకేసి తిరిగి. "రాత్రంతా ఆమెకి నిద్ర పట్టలేదు. ఆమెని బయటికి షికారు తీసికెళ్లమని డాక్టరు చెప్పాడు. ఆవిడకి కుట్టుపని తీసుకు వెళ్తున్నాను" అంది.

"వూఁ, అయితే ఈమేనన్నమాట మొదటి దేవత" అని వారెంకా వెళ్లిపోయాక ప్రిన్స్ అన్నాడు.

ఆయన వారెంకాని ఎగతాళి చెయ్యాలని అనుకున్నాడనీ, కాని ఆమె తనకి బాగా నచ్చడంతో అలా చెయ్యలేకపోయాడనీ కిట్టీ గ్రహించింది.

---

[1] ఆ విషయం చెప్పేదేముంది! (ఫ్రెంచి).

"ఫ్వా, నీ మిత్రులందర్నీ త్వరలోనే చూసేస్తామన్నమాట. మేడం స్టాల్‌ని కూడ, నన్ను గుర్తు పట్టే మహద్భాగ్యం ప్రసాదిస్తే" అన్నాడు.

"ఏమిటి, నీకామె తెలుసా నాన్నా?" అంది కిట్టీ. ఆమె పేరుని చెప్పినప్పుడు తండ్రి కళ్లల్లో కనిపించిన పరిహాస రేఖ చూసి బెదిరింది.

"ఆవిడ భర్తని యెరుగుదును. ఆమెనీ కొంచెం యెరుగుదును. కాని ఆమె పయటిస్టు* కాక ముందు."

"పయటిస్టు యెవరు నాన్నా?" అని కిట్టీ అడిగింది. తను మేడం స్టాల్‌లో ఎంతో ఘనమైనవిగా భావించే వాటికి ఒక పేరు కూడ వుందని భయపడింది.

"నాకే తెలీదు సరిగ్గా అదేమిటో. ప్రతి విషయానికీ దేవుడి దయ అంటుందని తెలుసు; ప్రతి దురదృష్టానికీ, భర్త మృతికి – దానిక్కూడా, దేవుడి దయ అంటుంది. కొంచెం చిత్రంగా వుంటుంది, యేమంటే వాళ్ల కాపరం యేం సజావుగా లేకపోయింది."

"ఎవరతను? యెంత దయనీయంగా వున్నాడు!" అని బల్లమీద కూర్చున్న వో మనిషిని చూపి ఆయన అడిగాడు. అతను సామాన్యమైన యెత్తు వున్నాడు. కాచురంగు ఓవర్‌కోటు తొడుక్కున్నాడు. తెల్లని లాగు తొడుక్కున్నాడు. శల్యావశిష్టంగా వున్న కాళ్లమీది లాగు ముడతలు పడిపోయింది.

అతను గడ్డి టోపీని యెత్తాడు. పల్చగా వున్న వుంగరాల జుట్టు, యెత్తైన నుదురు కనిపించాయి. టోపీ ఒత్తుకోవడంవల్ల అతని నుదురు యెర్రగా అయింది.

"అతను చిత్రకారుడు పెత్రోవ్" అంది కిట్టీ, సిగ్గుతో యెర్రబడుతూ. "ఆమె అతని భార్య" అని అన్నా పావ్‌లొవ్నాని చూపించి చెప్పింది. అన్నా పావ్‌లొవ్నా కావాలని సరిగ్గా వాళ్లు దగ్గరికి వెడుతూ వున్న ఆ సమయంలో రోడ్డుమీద పరిగెట్టి పోతున్న బిడ్డని తీసుకురావడానికన్నట్టు బిడ్డ వెనకాలే పరిగెట్టింది.

"ఇతని ముఖం యెంత దయనీయంగా వుంది, అయినా యెంత ముచ్చటగా వుంది!" అన్నాడు ప్రిన్స్. "యేం అతని దగ్గరికి వెళ్లలేదేం? నీతో యేమిటో చెప్పాలని అతను అనుకుంటున్నట్టు లేదూ?" అన్నాడు.

"సరే పద వెడదాం" అంది కిట్టీ నిబ్బరంగా పెత్రోవ్ దగ్గరికి వెడుతూ. "యివాళ యెలా వుంది మీకు?" అని అడిగింది.

పెత్రోవ్ కర్రమీద ఆనుకుని లేచి నుంచున్నాడు. ప్రిన్స్ కేసి చూశాడు.

"యీమె నా కూతురు. మిమ్మల్ని కలుసుకోవడం సంతోషంగా వుంది" అన్నాడాయన.

అతను వొంగి వందనం చేశాడు, చిరునవ్వు నవ్వేడు. అందమైన తెల్లని పలువరుస అద్భుతంగా మెరుస్తూ కనిపించింది.

"నిన్న మీరు వస్తారని చూశాం, ప్రిన్సెస్" అని అతను కిట్టీకేసి చూస్తూ అన్నాడు.

యీ మాటలు అంటూ అతను తొట్రుపడ్డాడు. ఆ తొట్రుపాటు ఉద్దేశపూర్వకంగానే జరిగినట్టు కనిపింప చెయ్యాలని మళ్లీ అలానే చేశాడు.

"వచ్చేదాన్నే, కాని మీరు వెళ్లడం లేదని అన్నా పావ్‌లొవ్నా కబురు పంపినట్టు వారెంకా చెప్పింది."

"యెందుకు వెళ్లడం లేదూ?" అన్నాడు స్టెర్‌తోవ్. కోపంతో యెర్రబడ్డాడు. దగ్గుతూ, కళ్లతో పెళ్లాం కోసం వెతికాడు. "అన్నా, అన్నా" అని భార్యని పిలిచాడు. తెల్లటి సన్నని మెడమీద నరాలు కొరడాకోల తాళ్లల్లా ఉబ్బరించేయి.

అన్నా పావ్‌లొవ్నా దగ్గరికి వచ్చింది.

"మనం వెళ్లడం లేదని ప్రిన్సెస్‌కి యెలా కబురు పంపించేవు?" అని కోపంగా, బొంగురు కంఠంతో అడిగాడు.

"నమస్తే, ప్రిన్సెస్" అంది అన్నా పావ్‌లొవ్నా తెచ్చిపెట్టుకున్న చిరునవ్వు నవ్వుతూ. అంతకు ముందు ఆమె వున్న ధోరణికీ, యీ ధోరణికీ పోలికే లేదు. "మిమ్మల్ని కలుసుకోవడం చాలా సంతోషంగా ఉంది" అని ప్రిన్స్‌తో అంది. "మీరు వస్తారని చాలా కాలంగా చూస్తున్నాం ప్రిన్స్" అంది.

"మనం వెళ్లడం లేదని ప్రిన్సెస్‌కి యెలా కబురు పంపించేవ్?" అని స్టెర్‌తోవ్ యింకా కోపంగా చిందులుతూ అడిగాడు. అతను గొంతుకని తమాయించుకో లేకపోవడంవల్ల అతను చెప్పదలచుకున్న దాన్ని అతని మాటలు వ్యక్తం చెయ్యలేకపోయాయి. దాంతో చిందు కోవడం యెక్కువైపోయింది.

"హారి భగవంతుడా! మనం వెళ్లడం లేదనే నిజంగా నేను అనుకున్నాను" అని అతని భార్య చిరాగ్గా జవాబిచ్చింది.

"యెలా, మనం..." అని మొదలుపెట్టాడు. కాని దగ్గుతెర కమ్ముకు వచ్చి అతను మాట్లాడలేకపోయాడు. చేసేది లేక చేతులు వూపాడు.

ప్రిన్స్ టోపీ యెత్తి కూతురితో బాటు వెళ్లిపోయాడు.

"ప్చ్, పాపం! విధివంచితులు!" అన్నాడు ప్రిన్స్ నిట్టూరుస్తూ.

"అవును, నాన్నా" అంది కిట్టీ. "పైగా వీళ్లకి ముగ్గురు పిల్లలు, నౌకర్లు యెవళ్లూ లేరు. రాబడీ అంతంత మాత్రమే. అతనికి యేదో కొద్దిగా అకాడమీనుంచి ముడుతుంది" అని ఆమె గబగబా మాట్లాడింది. తనపట్ల అన్నా పావ్‌లొవ్నా వైఖరిలో వచ్చిన వింత మార్పు ఆమెకి ఆందోళన కలిగించింది. దాన్ని నిబ్బరించుకోవడానికి ప్రయత్నిస్తూ అలా మాట్లాడింది.

"అదుగో మేడం స్టాల్" అని కిట్టీ చక్రాల కుర్చీ కేసి చూపిస్తూ అంది. బాలీసులకి ఆనుకుని, గొడుగు నీడ కింద, బూడిద రంగు, లేత నీలం రంగు బట్టలలో కొంచెం వాలి వున్న ఆకారం కనిపించింది.

ఆవిడ మేడం స్థాల్. వెనకాల చిన్న వదనంతో మోటుగా వున్న జర్మన్ పనిమనిషి వున్నాడు. అతను చక్రాల బండిని తోస్తూ వున్నాడు. మేడం స్థాల్ పక్క నో స్వీడిష్ కౌంట్ వున్నాడు. అతని జుట్టు బంగారు రంగులో బాగుంది. అతన్ని కిట్టీ యెరుగును. కొంత మంది జబ్బు మనుషులు అక్కడక్కడనే తచ్చాడుతూ వున్నారు. చక్రాల కుర్చీ దగ్గర ఆగి యేదో వింత వస్తువుని చూసినట్టు ఆవిడకేసి చూస్తూవున్నారు.

ప్రిన్స్ ఆవిడ దగ్గరికి వెళ్ళేడు. ఆ క్షణంలో తనని అంతకుముందు కలవరపెట్టిన లాంటి వ్యంగ్యపూరితమైన మెరుపుని కిట్టీ తండ్రి కళ్ళల్లో చూసింది. ఆయన మేడం స్థాల్ దగ్గరికి వెళ్లి మన్ననపూర్వకంగా, ఆదరస్వరంతో, చక్కని ఫ్రెంచిలో పలకరించేడు. అలాంటి ఫ్రెంచిని యీ రోజుల్లో చాలా తక్కువ మంది మాట్లాడతారు.

"నేను మీకు గుర్తు వున్నానో లేదో తెలీదు, కాని మీరు మా అమ్మాయి పట్ల చూపించిన ఆదరణకి కృతజ్ఞత చెప్పేందుకు నన్ను గుర్తు చేస్తున్నాను మీకు" అని ఆయన టోపీ యెత్తి, మళ్లీ పెట్టుకుంటూ అన్నారు.

"ప్రిన్స్ అలెగ్జాండర్ ష్చేర్‌బాత్‌స్కీ" అంది మేడం స్థాల్ తన దివ్య నేత్రాల్ని ఆయనకేసి యెత్తుతూ. ఆ కళ్లల్లో కిట్టీకి అసంతృప్తి కనిపించింది. "చాల సంతోషంగా వుంది. మీ అమ్మాయి అంటే నాకెంతో యిష్టం" అంది.

"మీ ఆరోగ్యం యింకా మెరుగవలేదా?"

"దీనికి అలవాటు పడిపోయేను" అంది మేడమ్ స్థాల్. స్వీడిష్ కౌంట్‌ని ఆయనికి పరిచయం చేసింది.

"మీరు యేం మారలేదు. పది పదకొండేళ్లుగా మిమ్మల్ని దర్శించే అదృష్టం కలగలేదు నాకు" అన్నాడు ప్రిన్స్.

"భగవంతుడు మనకి కష్టాలనీ యిస్తాడు, వాటిని భరించే శక్తినీ యిస్తాడు. యెందుకు ఈ జీవితం యిలా ఆగకుండా యీడ్చుకుంటూ వుందా అనిపించి మామూలుగా ఆశ్చర్య పోతూ వుంటాను.—అటు వేపునుంచి" అని ఆవిడ చిరాగ్గా వారెంకాతో అంది. వారెంకా రగ్గుని ఆమె కాళ్లమీద సరిగ్గా కప్పలేకపోయింది.

"బహుశా సత్కార్యాలు చెయ్యడానికి" అని ప్రిన్స్ కళ్లతోనే నవ్వుతూ అన్నాడు.

"దాన్ని నిర్ణయించడం మన పని కాదు" అని మేడం స్థాల్ ప్రిన్స్ యెత్తిపొడుపుని గమనిస్తూనే అంది. "వూ, అయితే కౌంట్, మీరు ఆ పుస్తకం పంపిస్తారు కదూ నాకు? కృతజ్ఞురాలిని" అంది పడుచు స్వీడిష్ ఆయనతో.

దగ్గర్లోనే మాస్కో కర్నల్ నిలబడి వుండడం చూసి "ఆఁ మీరా!" అన్నాడు ప్రిన్స్. మేడమ్ స్థాల్‌కి వంగి వందనం చేసి కూతురునీ మాస్కో కర్నల్‌నీ తీసుకొని వెళ్లిపోయాడు.

"వీళ్లా మన గొప్పింటివాళ్ళు, ప్రిన్స్" అన్నాడు మాస్కో కర్నల్ యెత్తిపొడిచే ఉద్దే

శంతో. మేడం స్థాల్ తనతో పరిచయం కలిగించుకోవడానికి యిష్టపడనందుకు ఆతనికి మంటగా వుంది.

"యేమీ మారలేదు అలానే వుంది" అన్నాడు ఫ్రిన్స్.

"యీామె జబ్బు పడకముందు యెరుగుదురా యీావిడ్ని ఫ్రిన్స్? అంటే మంచం పట్టక ముందు?"

"ఆఁ, నా కళ్లముందే అలా అయింది" అన్నాడు ఫ్రిన్స్.

"పదేళ్లుగా నడిచి యెరగదంటారు."

"యెందుకు నుంచోలేదంటే ఆమె కాళ్లు చాలా పొట్టివి. ఆమె రూపం దారుణంగా వుంటుంది..."

"నాన్నా అలా అయివుండదు" అని కిట్టీ అరిచింది.

"పాడు నోళ్లు అలా అంటాయమ్మా మరి. మీ వారెంకాకి వున్నాయి పొట్లు. అబ్బ! రోగిష్టి ఆడాళ్లు కాదు గాని" అన్నాడు.

"లేదు నాన్నా" అని కిట్టీ కోపంగా అభ్యంతరం చెప్పింది. "వారెంకా ఆవిడ్ని నెత్తిమీద పెట్టుకుంటుంది. మేడం స్థాల్ యెన్ని మంచి పనులు చేస్తుంది! యెవర్ననేనా అడుగు! ప్రతి వాళ్లకీ ఆవిడ, Aline స్థాల్‌గా తెలుసు" అంది.

"కావచ్చు" అన్నాడాయన కూతురి చేతిని మోచేత్తో నొక్కుతూ. "కాని అలాంటి మంచి పనులు యెవళ్లకీ తెలీకుండా చేస్తే మేలు" అన్నాడు.

కిట్టీ యేమీ జవాబు చెప్పలేదు. చెప్పడానికి యేమీ లేనందు వల్ల కాదు, తండ్రికి కూడ తన రహస్యాలోచనలని వెల్లడించడం యిష్టం లేక. కాని చిత్రం యేమంటే తండ్రి ఆలోచనల ప్రభావానికి లొంగకుండా, ఆయన్ని తన ఆంతరంగిక పవిత్ర భావనలని స్పృశించనియ్యకుండా వుండాలన్న గట్టి ఉద్దేశం వున్నా కూడా మేడం స్థాల్ అంటే తన మనస్సులో నెలపైగా ప్రతిష్ఠించుకున్న దివ్యరూపం యిక యెన్నటికీ తిరిగి రాకుండా అదృశ్యం అయిపోయింది. అజాగ్రత్తగా విసిరేసిన ఓవర్ కోటు, మనిషి ఆకారపు భ్రాంతి కలిగించినా అది వొట్టి ఓవర్‌కోటే, మనిషి ఆకారం కాదు అని తెలిసిడికి వచ్చినప్పుడు ఆ భ్రాంతి అదృశ్యం అయినట్టు. పొట్టికాళ్లతో, రూపం దారుణంగా వుండడం వల్ల మంచానికే అంటిపెట్టుకుపోయి, తను కోరుకున్నట్టు రగ్గు కాళ్లమీద కప్పలేనందువల్ల అణకువ అయిన వారెంకామీద చిర్రుబుర్రులాడే ఆడమనిషి రూపం మాత్రం మిగిలిపోయింది. యెంత శ్రమపడి కల్పించుకుందా మనుకున్నా కిట్టీ వూహకి పూర్వపు మేడం స్థాల్ రూపం తిరిగి రాలేదు.

35

ఫ్రిన్స్ ఉత్సాహం ఆయన భార్యకి, కూతురికి, తాము కాపురముంటున్న జర్మన్ యింటాయన కృ్యాడా సోకింది.

జలప్రోతస్సు మంచి కిట్టీతో బాటు తిరిగి వచ్చేక మాస్కో కర్నల్‌ని, మరియా యెవ్‌గే నియెవ్నాని, వారెంకాని ప్రిన్స్ కాఫీకి రమ్మని పిలిచేడు. ఓ బల్లనీ, కుర్చీలనీ తోటలోకి తెప్పించి, తోటలో ఛెస్ట్‌నట్ చెట్టుకింద వేయించి నాస్తా పెట్టించేడు. యింటాయనకీ, నౌకర్లకీ కూడా ప్రిన్స్ ఉత్సాహంతో హుషారు వచ్చింది. ఆయన చేతికి యెముకలేకుండా పెట్టే మనిషి వాళ్లకి తెలుసు. ఆ యింటి పై అంతస్తులో హాంబర్గ్‌నుంచి వచ్చిన వో డాక్టరుగారు వుంటున్నారు. ఆయన జబ్బు మనిషి. ఓ అరగంట తర్వాత ఆయన కిందికి చూస్తే ఛెస్ట్‌నట్ చెట్టుకింద హుషారుగా చేరిన ఆరోగ్యవంతులైన రష్యన్లు కనిపించి ఆయనకి యీర్ష్య కలిగింది. చెట్ల ఆకుల నీడలో ఓ మేజా వుంది. ఆకులు కదులుతూ వుంటే, నీడలూ కదులుతున్నాయి. ఆ మేజామీద తెల్లని గుడ్డ వుంది. కాఫీ పాత్రలు, వెన్న, జున్ను, చల్లారిన పక్షిమాంసం మేజామీద వున్నాయి. దాని దగ్గర ప్రిన్సెస్ కూర్చుంది. ఆవిడ వూదారంగు రిబ్బన్లు చుట్టిన టోపీ పెట్టుకుంది. కప్పుల్నీ, శాండ్‌విచెస్‌నీ అందరికీ అందజేయిస్తూ కూర్చుందావిడ. మేజాకి అటుచివర ప్రిన్స్ కూర్చున్నాడు. ఆయన సుష్టుగా తింటూ హుషారుగా గట్టిగా మాట్లాడుతూ వున్నాడు. ఆయన తను తిరిగిన ఖనిజ స్రోతస్సులన్నింటి దగ్గర్నుంచీ బోలెడు వస్తువులు కొనుక్కొచ్చేడు. నగిషీ చెక్కిన చిన్న పెట్టెలు, సాదా ఆటవస్తువులు, కాగితాలు కోసుకొనే నానారకాల కత్తులు వాటిల్లో వున్నాయి. వాటిని గుట్టగా తన పక్కన పెట్టుకొని పనిపిల్ల లీస్‌హెన్, యింటి యజమానితోసహా అందరికీ కానుకలు యిచ్చేడు. వచ్చీరాని జర్మన్‌లో యింటాయనతో నవ్వు తెప్పించేటట్టు హాస్యాలాడేడు. కిట్టీకి జబ్బు ఖనిజ జలంవల్ల నయం కాలేదనీ, యజమాని పెట్టిన భోజనంవల్లా, ముఖ్యంగా ఆల్‌బుఖారా పళ్లరసంవల్లా నయం అయిందనీ తనకి గట్టి నమ్మకంగా వున్నట్టు చెప్పేడు. ప్రిన్సెస్ తన భర్త రష్యన్ స్వభావం చూసి నవ్వుకుంది. కాని ఖనిజ స్రోతస్సు దగ్గిరికి వచ్చిన దగ్గర్నుంచి కూడా ఆమె యెన్నడూ యివాళ అంత హుషారుగా లేదు. ప్రిన్స్ ఛలోక్తులకి కర్నల్ గారు యెప్పటి లాగానే నవ్వేడు. కాని యూరప్ విషయం వచ్చేటప్పటికి ప్రిన్సెస్ పక్షం వహించేడు. యూరప్‌ని గురించి తనకి క్షుణ్ణంగా తెలుసని అతని నమ్మకం. సరసురాలైన మరియా యెవ్‌గేనియెవ్నా ప్రిన్స్ హాస్యోక్తులకి విరగబడి నవ్వింది. వారెంకా కూడా ప్రిన్స్ వింత మాటలకి, అందరికి మళ్లేనే పొర్లి పొర్లి నవ్వి ఆయాస పడిపోయింది. కిట్టీ అంతకు ముందెప్పుడూ వారెంకాని అలా వుండగా చూళ్లేదు.

కిట్టీకి యిదంతా సంతోషంగానే వుంది. అయినా కూడా దిగులు పోగొట్టుకోలేకుండా వుంది. కిట్టీ మిత్రుల పట్లా, ఆమెకి యెంతో యిష్టం కలిగిన ఆ జీవితం పట్లా తండ్రి తన పరిహాస ధోరణి చూపించి, అప్రయత్నంగా ఆమె ముందు లేవనెత్తిన సమస్యని ఆమె పరిష్కరించు కోలేకుండా వుంది. దీనికి తోడు తనకీ పెత్రోవ్ కుటుంబానికీ మధ్య సంబంధాల్లో వచ్చిన మార్పు కొంత దిగులు కలిగించింది. అది ఆ పొద్దుట అనుమానానికి తావు లేకుండా కుండబద్దలు కొట్టినట్టు వెల్లడైంది. ప్రతి ఒక్కళ్ళూ హుషారుగా వున్నారు.

కాని కిట్టీ హుషారుగా వుండ లేకపోయింది. దానివల్ల ఆమెకి మరీ బాధ అనిపిస్తోంది. చిన్నప్పుడు యేదో తప్పు చేసినందుకు తనని గదిలో పెట్టి గొళ్ళెం వేసారు. అక్కలందరూ బయట తుళ్ళుతూ, పేలుతూ వుంటే తను వొక్కర్తీ లోపల వుండిపోయింది. యిప్పుడు ఆమెకి అలాంటి అనుభూతే కలిగింది.

"యీ పోగంతా యెందుకు కొనుక్కొచ్చినట్టు?" అని ప్రిన్సెస్ చిరునవ్వు నవ్వుతూ, భర్తకి కాఫీ కప్పు అందిస్తూ అడిగింది.

"ఆఁ, యేముందీ! షికారుకని బయల్దేరేవాణ్ని. ఏ దుకాణం తగిలేది. ఎర్లాట్, ఎక్సెలెన్స్, దుర్లాట్[1] అని నన్ను పిలుస్తూ కొనమని అడిగేవాళ్ళు. వాళ్ళు దుర్లాట్ అన్నారో, అంతే, మనం పడిపోయామే. పది థేలర్లు[2] ఖాళీ."

"విసుగుకి ఫలితం యిదన్నమాట" ప్రిన్సెస్ అంది.

"శేషుగ్గా చెప్పావ్, విసుగనిపించి నందువల్లే. యెంత విసుగ్గా వుండేదనుకున్నావ్, చెప్పద్దు."

"ప్రిన్స్, అంత విసుగని యెలా అనిపిస్తుంది? జర్మనీలో యిప్పుడు యెంత మజా వుందీ, యేం కథ" అంది మరియా యెవ్‌గేనియెవ్నా.

"ఆ మజాలన్నీ యెరుగుదుం. అల్‌బుఖారా పళ్లరసం, బఠానీ పప్పున్న సాసేజ్‌లూ అన్నీ యెరుగుదుం."

"మీరెన్నన్నా చెప్పండి, ప్రిన్స్, వాళ్ల సంస్థలు ఆసక్తికరంగా వుంటాయి" అన్నాడు కర్నల్.

"ఏముంది వాటిలో ఆసక్తికరమైంది? జర్మన్‌లందరూ మెరిసే రాగి వాణేల్లాగా సుఖంగా వుంటారు. అందర్నీ జయించేశారు. కాని నేను యేం చూసుకుని సుఖంగా వుండగలను? నేనెవర్నీ జయించలేదు. నా బూట్లు నేనే విప్పుకొని గుమ్మం వార పెట్టుకోవాలి. పొద్దున్నే లేవడం, ఆదరా బాదరా బట్టలు వేసుకోవడం, కప్పు టీ నీళ్ల కోసం వంటింట్లోకి పరిగెత్తడం. యింటి దగ్గర యెంత ఆమరికగా ఉంటాం! యిష్టం వచ్చినప్పుడు లే, దేన్ని గురించేనా గొణుక్కో యేదు, హాయిగా మగత విడిచి, యే హడావుడీ లేకుండా అన్నిట్నీ గురించి ఆలోచించుకో."

"కాని కాలం అమూల్యమైనదని – మీరు మరిచిపోతున్నారు" అన్నాడు కర్నల్.

"యే కాలం అనే దానిమీద ఆధారపడి వుంటుంది. కోపెక్కు విలువ కూడా చెయ్యని కాలం నెలల తరబడి వుండచ్చు. ప్రపంచంలోని ఐశ్వర్యమంతటికంటె విలువైన అర్ధగంట సమయాలూ వుండచ్చు. కదమ్మా కిట్టీ? కాని నువ్వు అంత దిగులుగా వున్నావేం?"

---

[1] అయ్యా, ఘనత వహించిన ప్రభూ, దేవరా (జర్మన్).

[2] జర్మన్ నాణెం.

"నేను బాగానే వున్నాను."

"యెక్కడికి వెడుతున్నారు? కొంచెం సేపు వుండండి" అన్నాడాయన వారెంకాతో.

"నేను యింటికి వెళ్ళాలి" అంది వారెంకా. లేచి నుంచుని, మళ్ళీ విరగబడి నవ్వింది.

సంబాళించుకున్నాక అందరి దగ్గరా సెలవు తీసుకొని, టోపీ తీసుకోవడం కోసం యింట్లోకి వెళ్ళింది. కిట్టీ ఆమెతో కూడా వెళ్ళింది. వారెంకా కూడా యిప్పుడామెకి కొత్తగా కనిపించింది. ఆమె చెడ్డదయిందని కాదు. కాని తనకు తెలుసుననుకున్న వారెంకా కంటె భిన్నంగా కనిపించింది యిప్పుడు.

"నా జన్మలో యింతలా నవ్వలేదు" అంది వారెంకా గొడుగూ, సంచీ తీసుకుంటూ. "మీ నాన్న యెంత సరదా అయిన మనిషి!" అంది.

కిట్టీ మాట్లాడలేదు.

"మళ్ళీ యెప్పుడు కలవడం?" అని వారెంకా అడిగింది.

"Maman పెత్రోవ్‌ల దగ్గరికి వెళ్ళాలనుకుంటోంది. మీరు అక్కడ వుంటారా?" అని కిట్టీ వారెంకాని అడిగింది, తన స్నేహితురాల్ని పరీక్షకి పెడుతూ.

"ఆఁ, వుంటాను. వాళ్ళు వెళ్ళిపోతున్నారు. సర్దుకోవడానికి సాయం చేస్తానని చెప్పాను" అంది వారెంకా.

"అయితే నేనూ వస్తాను."

"వద్దు మీరెందుకు రావడం?"

"యెందుకు వద్దు? యెందుకని?" అని కిట్టీ వారెంకాని వెళ్ళనివ్వకుండా ఆపుతూ గొడుగు పట్టుకొని కళ్ళు గుండ్రంగా తిప్పుతూ అడిగింది. "ఆగండి, యెందుకని నేను రాకూడదు?" అని అడిగింది.

"యేం లేదు, మీ నాన్న వచ్చేరుకదా యిప్పుడే. పైగా మీరు వుంటే వాళ్ళకి సంకోచంగా వుంటుంది."

"వుహుఁ, చెప్పండి, నేను పెత్రోవ్‌ల దగ్గరికి యెందుకు రాకూడదు? మీకిష్టం లేదా? యెందుకనో చెప్పండి."

"నేనలా అనలేదు" అని వారెంకా శాంతంగా అంది.

"దయచేసి చెప్పండి."

"మొత్తం అంతా చెప్పనా?"

"అంతా, అంతా చెప్పండి" అంది కిట్టీ.

"అంటే ప్రత్యేకం యేమీ లేదు లెండి. మిఖయీల్ అలెగ్జేయెవిచ్ (చిత్రకారుడి పేరు అది) కొంతకాలంకితం యీ చోటు వదిలిపెట్టి వెళ్ళిపోవాలని పట్టుబట్టేరు, యిప్పుడేమో వెళ్ళడానికి యిష్టంగా లేరు" అంది వారెంకా చిన్నగా నవ్వుతూ.

"వ్రూ, వ్రూ" అని కిట్టీ విచారంగా వారెంకాకేసి చూస్తూ మాట ముందుకు సాగడానికి తొందర చేసింది.

"వ్రూ, మరి యెందుకందో తెలీదుగాని మీరిక్కడ వుండబట్టి తనకి వెళ్లడం యిష్టం లేదంటున్నా డాయన అని అన్నా పావ్‌లొవ్నా అంది. ఆ ముక్క తప్పేననుకోండి. కాని యీ కారణంగా, అంటే మీవల్ల వాళ్ల యిద్దరికీ మధ్య దెబ్బలాట జరిగింది. జబ్బు మనుషులు యెంత చిరాగ్గా వుంటారో మీకు తెలుసుగా" అంది.

కిట్టీ యేం మాట్లాడలేదు, ఆమె ముఖం యింకా ముడుచుకుపోయింది. కాని ఆమెని శాంతింప చేస్తూ, అనునయింపచేస్తూ వారెంకా మాట్లాడుతూనే వుంది. కన్నీళ్ల గాని, మాటలు గాని తెంచుకు ఉరుకుతాయని అనుకుంటూ చూసింది.

"అందుకని మీరు వెళ్లకుండా వుంటేనే బాగుంటుంది... మీరు అర్థం చేసుకో గలరు, తప్పుగా భావించకండి..."

"నాకిలా జరగాల్సిందే, యిలా జరగాల్సిందే" అని కిట్టీ వారెంకా చేతిలోనుంచి గొడుగు లాక్కుని ఆమెకేసి చూడకుండా గబగబా అంది.

చిన్న పిల్లల్లా ఆమె ఉడుకుమోత్తనంతో వుండడం చూసి వారెంకాకి చిరునవ్వు నవ్వా లనిపించింది. కాని ఆమె కష్టపెట్టుకుంటుందేమోనని భయపడి మానేసింది.

"నాకర్థం కావడం లేదు, యెందుకు అలా జరగాల్సిందే అంటున్నారో మీరు?" అంది వారెంకా.

"నాకలా జరగాల్సిందే. యేమంటే యిదంతా నటన, అంతా దగా, మనస్సులోంచి వచ్చింది కాదు. ముక్కూ మొహం తెలియని పరాయి మనిషి కోసం నేను తంటాలు పడ్డం యేమిటి? తీరా యిప్పుడు చూస్తే వాళ్ల దెబ్బలాటకి నేను కారణం అయాను. యెవళ్లూ నాకు చెయ్యమని చెప్పా పెట్టకుండా వున్న దాన్ని నేను చేశాను. అందుకనే యిదంతా నటన, నటన, నటన!"

"కాని నటన యే ఉద్దేశంతో?" అని వారెంకా మెల్లిగా నెమ్మదిగా అడిగింది.

"ఉఫ్! యెంత తెలివితక్కువతనం, ఘోరం! అసలు అవసరమే లేదు నాకు... అంతా నటన" అని కిట్టీ గొడుగు తెరుస్తూ మూస్తూ అంది.

"కాని యే ఉద్దేశంతో?"

"యెందుకంటే పైవాళ్ల దృష్టిలో బాగా కనిపించాలని, భగవంతుడికి బాగా కనిపిం చాలని, అందరి కళ్లల్లోనూ దుమ్ము కొట్టాలని. వుహూ, మళ్లీ యిటువంటి చిక్కుల్లో యిరుక్కోను. చెడ్డగానే వుండిపోతాను. కాని వంచకురాలిగా, దగాకోరుగా అవను."

"యెవరు దగాకోరు?" అని వారెంకా విభ్రాంతంగా అంది. "మీరు యెలా మాట్లా డుతున్నారంటే..."

కాని కిట్టీకి కోపంతో వొళ్లు తెలియలేదు. తన స్నేహితురాల్ని మాట్లాడ నియ్యలేదు.

"నేను మీ గురించి, అసలు మీ గురించి ప్రమాణపూర్తిగా యేమీ అనడం లేదు. మీరు మచ్చలేని వాళ్ళు. నాకు తెలుసు మీరు మచ్చలేని వాళ్ళని. కాని నేను చెడ్డదాన్ని అయితే యేం చెయ్యగలం? నేను చెడ్డదాన్ని కాకపోయి వుంటే యిదంతా జరిగి వుండేది కాదు. అందుకని నేనిలా వుండడమే మంచిది. కాని నటించను. ఆన్నా పావ్‌లొవ్నాతో నాకే మిటి సంబంధం? వాళ్ళ మానాన వాళ్ళని బతక నియ్యండి. నా మానాన నేను వుంటాను. నేను వేరే దానిలా అవలేను... యిదంతా అలా లేదు."

"యేది అలా లేదు?" అని వారెంకా తెల్లమొహం వేసి అడిగింది.

"యిదంతా. నా మనస్సు చెప్పినట్టు తప్ప నేను బతకలేను. కాని మీరు నియమాను సారంగా బతుకుతారు. వూరికే మీరంటే అభిమానపడ్డాను. కాని మీరు నన్ను తరింప చెయ్యాలనుకున్నారు, నాకు బోధించా లనుకుని అలా చేశారు."

"మీరు నా గురించి చాల అన్యాయంగా మాట్లాడుతున్నారు" అంది వారెంకా.

"నేను పైవాళ్ళ గురించి యేమీ అనడం లేదు. నా గురించే అనుకుంటున్నాను."

"కిట్టీ" అంటూ వాళ్ళ అమ్మ పిలవడం వినిపించింది. "మీ నాన్నకి నా పగడాల దండ చూపించమ్మా" అంది.

తన నేస్తంతో రాజీ అవకుండానే కిట్టీ ఆహంతో పగడాల దండ వున్న పెట్టె బల్ల మీదనుంచి తీసి తల్లి దగ్గరికి వెళ్ళింది.

"యేమైంది? ముఖం యెర్రగా వుందేం?" అని తల్లీ, తండ్రీ ఒక్కసారే అడిగారు.

"యేం లేదు, యిప్పుడే వస్తా" అని కిట్టీ మళ్ళీ లోపలికి పరిగెత్తి వెళ్ళిపోయింది.

'ఆమె యిక్కడే ఉంది! యేం చెప్పను? బాప్‌రే! యేం చేశాను? యేం అనేశాను? యెందుకు ఆమె మనస్సు గాయపర్చాను? యేం చెయ్యను? యిప్పుడామెతో యేం చెప్పను?' అని కిట్టీ గుమ్మం దగ్గర ఆగి అనుకుంది.

వారెంకా టోపీ పెట్టుకుని, చేత్తో గొడుగు పట్టుకుని కిట్టీ కొంచెం విరిచేసిన స్ప్రింగుని పరీక్షగా చూసుకుంటూ కూర్చుంది. తల పైకి యెత్తింది.

"వారెంకా, నన్ను క్షమించండి, క్షమించండి" అని కిట్టీ ఆమె దగ్గరికి వెళ్ళి గొణిగింది. "నేనేమంటున్నానో తెలీకుండా అనేశాను. నాకు..."

"నిజంగా మీ మనస్సు కష్టపెట్టాలని లేదు నాకు" అంది వారెంకా చిరునవ్వు నవ్వుతూ.

ఇద్దరికీ సర్దుబాటు జరిగింది. కాని తండ్రి వచ్చాంతర్వాత కిట్టీకి తను బతుకుతూ వున్న ప్రపంచం యావత్తూ మారిపోయింది. ఆమె తాను నేర్చుకున్నదాన్ని త్యజించిందని కాదు. కాని తను కోరుకున్నట్టు తయారు కాగలను అని అనుకోవడంలో తనని తాను మోసం చేసుకుంటున్నానని గ్రహించింది. అప్పుడే మెలకువ వచ్చినట్టు అయింది. తనని తాను వంచించు

కోకుండా, నటనలు లేకుండా తను కాంక్షించిన ఉచ్ఛ స్థాయిలో బతకడం యెంత కష్టమో అర్థం చేసుకుంది. అది గాక తను జీవించిన లోకం బాధలతో, దుఃఖాలతో, జబ్బులతో, మృత్యువుతో భారంగా వుంది. యిలాంటి లోకాన్ని ప్రేమించడానికి తను విధించుకో చూసిన శ్రమ యిప్పుడు తన శక్తికి మించిందిగా కనిపించింది. ఆమె తాజా గాలికోసం, రష్యాకోసం, యెర్గుషెవొ గ్రామం వెళ్లడం కోసం తపించింది. దాలీ, పిల్లలూ వేసవి కాలం గడపడానికి అక్కడికి వెళ్లారని ఉత్తరం వచ్చింది.

అయినా వారెంకా పట్ల ఆమె ప్రేమ తగ్గలేదు. సెలవు తీసుకుంటూ రష్యా రావలసిందిగా ఆమెని అర్థించింది.

"మీ పెళ్లికి వస్తాను" అంది వారెంకా.

"నేనసలు పెళ్లే చేసుకోను."

"అయితే నేను రానే రాను."

"మిమ్మల్ని రప్పించాలంటే నేను పెళ్లి చేసుకోవాలన్న మాట. సరే, మాట తప్పకండేం మరి!" అంది కిట్టీ.

డాక్టరు చెప్పింది నిజమే అయింది. కిట్టీ ఆరోగ్యం కోలుకుని రష్యాకి తిరిగి వచ్చింది. ఆమె ముందటి అంత చలాకీగా ఛలోపాలోమంటూ లేదు కాని మానసిక శాంతితో వుంది. పాత మాస్కో వ్యధలు, వేదనలు యిప్పుడు స్మృతిలో మాత్రమే మిగిలిపోయాయి.

మూడవ భాగం

1

సెర్గేయ్ ఇవానొవిచ్ కోజ్నిషెవ్‌కి బౌద్ధిక కార్యకలాపాలనుండి విశ్రాంతి కావల్సి వచ్చింది. మామూలుగా విదేశాలకి వెళ్ళేవాడు. కాని యీసారి అలాకాక మే నెలాఖరులో తమ్ముడి దగ్గరికి పల్లెటూరు వచ్చేడు. పల్లెటూరి జీవితం అన్నిటికంటే బాగుంటుందని ఆయన నమ్మకం. ఆ జీవితానందంలో పరవశించడానికి తమ్ముడి దగ్గరికి వచ్చేడు. లేవిన్‌కి చాలా సంతోషం కలిగింది. ఆ వేసవిలో అన్నగారు నికొలాయ్ వచ్చే అవకాశం లేనందువల్ల మరీ సంతోషం కలిగింది. కోజ్నిషెవ్ అంటే యెంతో గౌరవం, ప్రేమా ఉన్నప్పటికీ లేవిన్‌కి పల్లెలో అన్నగారితో వుండడం యిబ్బందిగానే అనిపించింది. పల్లెలపట్ల అన్నగారి వైఖరివల్లనే అతనికి అలా యిబ్బందిగా, అసంతృప్తిగా అనిపించింది. లేవిన్‌కి పల్లెటూరు నివాస ప్రాంతం, అంటే సుఖ దుఃఖాలకి, పనిపాట్లకి తావు. కోజ్నిషెవ్‌కేమో పల్లెటూరు వొక పక్క పని పాట్లనుంచి విశ్రమించడానికి తావు. మరో పక్క పట్నవాసపు ప్రలోభాలకి మంచి విరుగుడు. దాని శక్తిని తెలిసే ఆయన ఆ మందుని సంతోషంగా పుచ్చుకుంటాడు. లేవిన్‌కేమో పల్లెటూరు నిశ్చయంగా ఉపయోగకరమైన శ్రమకి కర్మభూమి, అందుకని మంచిది. కోజ్నిషెవ్‌కి పల్లెటూరులో యే పనీ చెయ్యక్కరలేదు కాబట్టి, చెయ్యవలసింది లేదు కాబట్టే మంచిది. అంతేకాక రైతుల పట్ల అన్నగారి వైఖరి కూడ లేవిన్‌కి నచ్చలేదు. తను రైతుల్ని అర్థం చేసుకుంటాననీ, వాళ్ళంటే యిష్టమనీ కోజ్నిషెవ్ అనేవాడు. రైతులతో యెక్కువగా మాట్లాడేవాడు. యే రకమైన కృత్రిమత్వం, తన ఆధిక్య భావం లేకుండా బాగా మాట్లాడేవాడు. రైతులు స్వతహాగా మంచి వాళ్ళనీ, తను వాళ్ళని అమూలాగ్రం అర్థం చేసుకున్నానని రుజువు చేస్తూ ప్రతి సంభాషణ తర్వాత సాధారణ సూత్రీకరణలు చేశాడు. రైతుల పట్ల అలాంటి వైఖరి లేవిన్‌కి నచ్చలేదు. లేవిన్ దృష్టిలో రైతులు సమష్టి శ్రమలో ముఖ్య భాగస్వాములు మాత్రమే. రైతులపట్ల అతనికి ఆదరభావం ఉంది. రైతులతో అతను వొక బాంధవ్యం అనుభూతి చెందేవాడు. రైతు దాది పాలు తాగేడు తను, అందుచేత యీ బాంధవ్యం తనకి వచ్చిందని అనేవాడు. తను రైతులతో భుజం భుజం కలిపి పని చేశాడు. రైతుల శక్తి, వినమ్రత, ధర్మబుద్ధి చూసి మహా ముగ్ధుడైపోయేవాడు. యిన్నీ వున్నా గానీ కలిసి చేసే పనిలో యెదురయే యితర గుణాల అవసరం తీర్యా చూస్తే రైతుల్లో కని పించే లేఖర్వాతనం, మొద్దితనం, తాగుబోతుతనం, కపటత్వం అతనికి మంట కలిగించేది.

రైతులంటే తనకి యిష్టమేనా అని లేవిన్ని అడిగితే యేం జవాబు చెప్పాలో అతనికి తెలిసేది కాదు. వాళ్లంటే యిష్టమూ వుంది, అయిష్టమూ వుంది, యితరు లందరిపట్ల మాదిరి గానే. స్వతహాగా మంచివాడవడంవల్ల సహజంగానే అతనికి మనుషులంటే అయిష్టత కంటే యెక్కువ యిష్టమే వుండేది. రైతుల పట్లా అంతే. కాని రైతుల్ని యేదో దయాతుందిలు డైన మనిషిలాగా ప్రేమించడం, ప్రేమించకపోవడం అనేవి అతనికి సంభవం కాదు. యేమంటే అతను రైతులతో కలిసి జీవించడమే కాదు, అతని ఆసక్తులన్నీ వాళ్లతో కలిసి వుండడమే కాదు, తనే వాళ్లల్లో వొకడుగా అతను భావించుకొనేవాడు. రైతుల్లో తనలో అతనికి విశేషం సుగుణాలు, దుర్గుణాలు కనిపించలేదు. వాళ్లకీ, తనకీ యేవిధమైన విభిన్నత వున్నట్టు అతను అనే వాడు కాదు. అతనికి వాళ్లతో యెన్నో యేళ్లుగా, వాళ్ల యజమానిగా, తీర్పరిగా, అన్నిట్నీ మించి సలహాదారుడిగా సంబంధాలు వున్నా (రైతులకి అతనంటే నమ్మకం, డబ్బై యేసి కిలోమీటర్ల దూరంనుంచి అతని సలహా కోసం వచ్చేవాళ్లు) అతనికి రైతులంటే యిదమిత్థమైన దృక్పథం లేకపోయింది. రైతుల గురించి తనకి తెలుసునా, వాళ్లని అర్థం చేసుకుంటాడా అని ప్రశ్నిస్తే, రైతుల్ని తను ప్రేమిస్తున్నాడా అని అడిగిన దానికి సమాధానం చెప్పడం లాగే, అతనికి కష్టం అవుతుంది. రైతుల్ని తను యెరుగును, అర్థం చేసుకోగలడు అని చెప్పడం ప్రజలందర్నీ తను యెరుగును, అర్థం చేసుకోగలడు అని చెప్పడం లాంటిదే. అతను యెప్పుడూ ప్రజల్ని పరిశీలిస్తూనే వున్నాడు, తెలుసుకుంటూనే వున్నాడు, రైతులతో సహా. వాళ్లు మంచివాళ్లు, సరదా అయినవాళ్లు అని అతను భావించేవాడు. వాళ్లల్లో అతనికి నిత్యమూ కొత్త లక్షణాలు కనిపించేవి. వాళ్ల గురించి అతని ముందటి అభిప్రాయాలు మారి కొత్త అభిప్రాయాలు యేర్పడేవి. కోజ్నిషెవ్ సరిగ్గా దీనికి విరుద్ధం. తనకి యిష్టం లేని జీవితంతో పోల్చి, గ్రామీణ జీవితం పట్ల యిష్టపడి మెచ్చుకున్నట్టుగా, తనకి యిష్టంలేని మనుషుల వర్గంతో పోల్చి, రైతుల పట్ల యిష్టపడి, మెచ్చుకొనేవాడు. సామాన్యంగా ప్రజలతో పోల్చి ప్రత్యేకంగా వుండేటట్టు రైతుల్ని చూసేవాడు. ఆయన సువ్యవస్థిత మస్తిష్కంలో రైతు జీవితం గురించిన నిశ్చిత రూపాలు చక్కగా యేర్పాటై వున్నాయి. వాటిలో కొన్ని రైతుల జీవితంనుంచి తీసుకున్నటువంటివి. అధిక భాగం తనకి తెలిసిన జీవితానికి విరుద్ధంగా వుండే దాని ఆధారంగా యేర్పడినవి. రైతుల పట్ల ఆయన దృక్పథం గాని, వాళ్లపట్ల సానుభూతి గాని యెన్నడూ మారలేదు.

తమ తమ అభిప్రాయాలని వివరిస్తూ రైతుల గురించి అన్నదమ్ములిద్దరూ వాదించుకున్నప్పుడల్లా కోజ్నిషెవ్ తమ్ముణ్ణి వోడించేసేవాడు. యెందుకంటే కోజ్నిషెవ్‌కి రైతుల గురించి, వాళ్ల ప్రవర్తన గురించి, లక్షణాల గురించి, అభిరుచుల గురించి నిర్దిష్టమైన భావనలున్నాయి. లేవిన్‌కి రైతుల గురించి అచంచలమైన, నిర్దిష్టమైన భావన లేదు. అందుచేత వాగ్యుద్ధాల్లో లేవిన్ యెప్పుడూ స్వవచోవ్యాఘాతానికి గురయేవాడు.

కోజ్నిషెవ్ దృష్టిలో తమ్ముడు మంచివాడే, 'అతని మనస్సు సరైన దారిలోనే వుంది'

(పెంచినవాళ్ళ అన్నట్లు). కాని ఖర్మ చురుకెక్కితే క్షణికానుభూతులకి లొంగిపోతుంది, అందుకని వైరుధ్యాల పుట్టగా వుంది. పెద్దవాడిగా తమ్ముడి పట్ల ఔదార్యభరిత దయతో వున్నట్లు ఆయన అప్పుడప్పుడు లేవిన్‌కి కొన్ని విషయాలని స్పష్టంగా వివరించేవాడు. కాని అతనితో వాదించే ఉత్సాహం ఆయనికి వుండేది కాదు. యేమంటే తను సునాయాసంగా తమ్ముణ్ణి చిత్తు చెయ్యగలడు గనక.

లేవిన్ అన్నగారిని మేధావి అని, జ్ఞాని అని, అత్యుత్తమ గౌరవనీయ వ్యక్తి అని, లోక కళ్యాణం కోసం పనిచేసే ప్రతిభా సంపత్తున్నవాడని భావించేవాడు. కాని తను పెద్ద వాడయే కొద్దీ, అన్నగార్ని గురించి యింకా బాగా తెలిసే కొద్దీ అతనికి హృదంతరాళంలో యింకా యెక్కువగా యింకోటి అనుభూతం అయేది. తనకి లేకపోయిందే అని తను అనుకొనే ఆ లోక కళ్యాణ క్రియా సామర్థ్యం అనేది సద్గుణమే కాదు; తద్భిన్నంగా యేదో లోపించిన దాని ఫలితం. అంటే మంచితనం, నిజాయితీ, సద్భావనా పూరిత కామితాలు, అభిరుచులు లోపించిన దానివల్లనని కాదు — జీవశక్తి, "హృదయం" అని పిలిచేటువంటిది లోపించిన దానివల్ల; జీవితంలో యెదురయే అసంఖ్యాక పథాల్లో ఒక దాన్ని మాత్రమే మనిషి యెంచు కుని, దాన్నే అనుసరించేటట్టు చేసే చోదక శక్తి లోపించిన దానివల్ల వచ్చింది అని. లేవిన్‌కి కోజ్నిషెవ్ గురించి తెలిసే కొద్దీ యింకా బాగా మరో విషయం స్పష్టం అయింది. లోక కళ్యాణం కోసం పాటుపడే కోజ్నిషెవ్ యింకా అనేకమంది యితరులూ అలా చెయ్యడం తమ హృదయ ప్రేరణవల్లగాక, అలా చెయ్యడం మంచిదని తార్కిక బుద్ధి బోధించినందువల్లనే అని, కేవలం అందుకనే అలా చేస్తున్నారని విశదమైంది. అన్నగారు లోక కళ్యాణం, ఆత్మ అమరత్వం లాంటి సమస్యల్ని ఓ చదరంగం ఆటకంటే, ఓ సంక్లిష్ట నూతన యంత్ర నిర్మాణం కంటే యెక్కువ మహత్తరమైన వాటిగా పరిగణించడం లేదని గ్రహించాక లేవిన్‌కి తన ఉద్దేశం బలపడింది.

మరో కారణంవల్ల కూడా లేవిన్‌కి అన్నగారితో పల్లెలో యిబ్బంది అయింది, ముఖ్యంగా వేసవి కాలంలో. అప్పుడు లేవిన్‌కి పొలం పనలతో తీరికే వుండదు. చెయ్యాల్సిన పనల్నిట్నీ చెయ్యడానికి, పగటిపూట యెక్కువగా వుండే వేసవి రోజు కూడా సరిపోదు. కోజ్నిషెవ్ మాస్తే విశ్రాంతి తీసుకోవడానికి వచ్చేడు. ఆయన విశ్రాంతి తీసుకుంటున్నాడు, అంటే తన రచనా వ్యాసంగం కట్టి పెట్టాడన్నమాట. కాని బౌద్ధిక కార్యకలాపాలకి అలవాటు పడిన మనిషి కావడంవల్ల తన ఆలోచనలకి చక్కని పదబంధాలలో వాగ్రూపం యివ్వాలన్న ప్రీతి యెక్కువ వుండేది. అలాగే తను చెప్పేదాన్ని వినేవాళ్ళు వుండాలన్న ప్రీతీ వుండేది. తమ్ముడు ఆయనకి సాధారణ సహజ శ్రోత అయాడు. వాళ్ళ మధ్య సంబంధాలు సరళంగా మైత్రీపూర్వకంగా వున్నప్పటికీ కూడా ఆయన్ని ఒంటరిగా వదిలి వెళ్ళడం లేవిన్‌కి బాగా అనిపించలేదు. యెండలో విశ్రాంతిగా పచ్చికమీద చాచుకుని పడుకుని ఆతపస్నానం చేస్తూ హృదయోల్లాస పూరి తంగా మాట్లాడ్డం కోజ్నిషెవ్‌కి యిష్టం.

"ఓ మాట చెప్తాను నమ్ముతావా. పల్లెటూరి అలప జీవితం అంటే నాకు పారవశ్యం కలుగుతుందనుకో. బుర్రలో ఒక్క ఆలోచన లేదు. శుద్ధ ఖాళీ" అన్నాడాయన లేవిన్‌తో.

వొట్టినే కూర్చుని ఆయన మాటలు వింటూ వుండడం లేవిన్‌కి విసుగ్గా వుండేది. ముఖ్యంగా మనుషులు పొలాలకి యెరువు తోలుతున్నారనీ, మళ్ళని యింకా అందుకు సిద్ధం చెయ్యలేదనీ, తను గనుక సరిగ్గా చూసుకోకపోతే వో మూల పారేసిపోతారనీ తెలుస్తూ వున్నప్పుడు. నాగళ్ళ క్రొరుల్ని సరిగా బిగించకుండా యీ కొత్త నాగళ్ళు పాతవాటిలా బాగా లేవనీ, యే దెయ్యం కనిపెట్టిందోనని తిడుతూ వుంటారనీ తెలిసినప్పుడు మరీ అన్నగారి దగ్గర విసుగ్గా వుండేది.

"యెండలో వెళ్ళడం ఆపు" అని కోజ్నిషెవ్ అతనితో అనేవాడు.

"నేను వో క్షణం ఆఫీసుకి వెళ్ళివస్తాను" అని లేవిన్ జవాబు చెప్పి దూరంగా వున్న పొలం దగ్గరికి పరిగెత్తుతూ వెళ్ళిపోయేడు.

2

అగాఫ్యా మిహైలొవ్నా లేవిన్‌కి దాదీ, గృహనిర్వహణ చూసే మనిషినీ. ఆ జూన్ నెం మొదటి రోజుల్లో ఆమె నేలమాళిగలోకి ఉప్పువేసిన పుట్టగొడుగుల జాడీ తెస్తూ వుంటే జారి పడిపోయింది. దాంతో చెయ్యి బెణికింది. జేమ్‌స్త్వో వైద్యుణ్ణి పిలిచారు. అతను యువకుడు, వాగుడుకాయ. కొత్తగా వైద్యశిక్షణ పూర్తిచేశాడు. చేతిని పరీక్షించి విరిగిపోలేదని ధైర్యం చెప్పి పట్టీ కట్టేడు. మధ్యాహ్నం భోజనానికి దిగడిపోయేడు. ప్రఖ్యాత సెర్గేయ్ ఇవానొవిచ్ కోజ్నిషెవ్‌తో మాట్లాడే అవకాశం లభించినందుకు ఆ డాక్టరు మురిసి పోతున్నాడని తెలుస్తూనే ఉంది. స్థానికంగా చెవులు కొరుక్కుంటూ వున్న పొచికోలు సంగతులన్నిట్నీ కోజ్నిషెవ్‌కి యేకరువు పెట్టీ, స్థానిక వ్యవహారాలు యెలా కష్టం తక్కెడగా వున్నాయో విమర్శించి తన ప్రబుద్ధతని చూపించుకున్నాడు. కోజ్నిషెవ్ శ్రద్ధగా విన్నాడు. అవీ యివీ అడిగాడు. కొత్త శ్రోత దొరకడంతో ఉత్తేజం వచ్చింది కోజ్నిషెవ్‌కి. సంభాషణలో తూచి సరియైన వ్యాఖ్యలు కొన్ని చేశాడు. దాంతో ఆ పడుచు డాక్టరు ఆహా అని ఆయన్ని మెచ్చుకున్నాడు. తత్ఫలితంగా కోజ్నిషెవ్‌కి ఉత్సాహం అతిశయించింది. మేధోపరమైన గొప్ప సంభాషణ తర్వాత ఆయనకి అలాంటి ఉత్సాహం కలుగుతుంది. అది లేవిన్‌కి బాగా తెలిసినటువంటిదే. డాక్టరు వెళ్ళిపోయిన తర్వాత చేపలు పట్టడానికి వెళ్ళాలని కోజ్నిషెవ్ కోరిక వెల్లడి చేశాడు. ఆయనకి చేపలు పట్టడం సరదా. అలాంటి రిక్తమైన పని తనకి సరదా కలిగించడం చూసి గర్వం కూడా కలిగేది.

లేవిన్ పొలంలో గాని, పచ్చిక బీళ్ళో గాని వుండాల్సిన వేళ అది. అందుకని అన్నగార్ని వొంటి గుర్రం బండిలో తీసుకెళ్ళి అక్కడ దిగబెడతానని అన్నాడు.

వేసవి కాలం రోజులు. ఆ యేటి పంట యెంతో తేలే సమయం. మీదటికి దుక్కి

యేర్పాట్ల గురించి రైతులు ఆలోచించుకోవడం మొదలయే సమయం. గడ్డికోత జరగాల్సిన సమయం. రై పొలాలు కంకులు వేశాయి. కాని ఆ కంకులు యింకా గట్టిపడలేదు, సన్నగా తప్పగానే ఉన్నాయి. అవి గాలిలో లేత ఆకుపచ్చరంగులో అలలుగా వూగుతున్నాయి. ఆకుపచ్చ ఓట్ విత్తనాలు పొలాల్లో నో పద్ధతి లేకుండా యీరిక లెత్తుతున్నాయి. ఆ పొలాల్లో బంగారు గడ్డి మోపులు చెదురుమదురుగా వున్నాయి. అలాంటి సమయం అది. తొలి బక్‌వీట్ ధాన్యం నేలని పూర్తిగా కమ్మేస్తూ మోసుకెత్తే సమయం. పశువుల గిట్టలకింద నలిగిన రాళ్లల్లా గట్టిపడిపోయిన పల్లం నేల, సగం సగమే దున్నిన సమయం. నాగటి క్రొరు దిగని తావుల్లో పెద్దపెద్ద మట్టి బెడ్డలు మిగిలిపోయి వున్నాయి. యెండిపోయే పేడగుట్టల వాసన సూర్యాస్తమయం వేళ గడ్డి సువాసనంతో కలిసే సమయం. కొంకి క్రర కోతకత్తుల కోసం వచ్చిక బీటి మైదానాలు సిద్ధంగా వున్న సమయం. ఆ మైదానాలు పెద్ద సముద్రంలా పరుచుకుని వున్నాయి. అక్కడక్కడ మధ్యలో యేరి పారేసిన కలుపు మొక్కల కుప్పలు నల్ల సంద్రంలా కనిపించాయి అందులో.

అమనికి ముందు పొలం పనుల్లో కొంత తీరిక దొరికే సమయం అది. ప్రతి యేడూ, రైతుల సర్వశక్తుల్నీ సమీకరిస్తూ శానఃపున్యంగా వచ్చే సమయమే అది. అమని పుష్కలంగా వుండేటట్టే వుంది. వేసవి రోజులు తేటగా వున్నాయి, వేడిగా వున్నాయి. రాత్రి పొద్దు తక్కువ వుంటోంది. తేమ తుషారం బాగా వుంటోంది.

వచ్చిక బీళ్లని చేరుకోవడానికి వాళ్లు అడవిలోనుంచి వెళ్లాల్సి వచ్చింది. కోజ్నిషెవ్ వృక్ష భరితంగా వున్న వనసౌందర్యాన్ని అహో ఓహో అని మెచ్చుకుంటూనే వున్నారు. కొంచెం సేపు ఓ వృద్ధ లైమ్ వృక్షాన్ని తమ్ముడికి చూపించి మెచ్చుకునేవాడు. ఆ చెట్టు నీడ నేవు నల్లగా కనిపించేది. గుబురైన పత్రమూలాలంతో మిలమిలలాడుతూ మొగ్గ తొడుగుతూ వుండేది. తర్వాత ఆ యేడు యెదుగుతూ వున్న నో పైన్ చెట్టు ఆకుపచ్చ చిగుళ్లతో దర్శన మిచ్చేది. లేవిన్‌కి ప్రకృతి సౌందర్యం గురించి మాట్లాడ్డం, వినడం యిష్టం వుండేది కాదు. మాటలు అతనికి తను చూసిన అందాన్ని పాడుచేస్తాయి. అతను యేదో యాంత్రికంగా అన్నగారికి ఆఁ, వూఁ అంటూనే వున్నాడు గాని తన ఆలోచనల్లో తను వున్నాడు. అడవి గుబురు దాటి వచ్చేక మిట్ట వాలులో దున్ని విత్తనాలు చల్లకుండా వున్న నేలమీద అతని దృష్టి లగ్నం అయింది. దానిలో అక్కడక్కడ పసుపురంగు తిరుగుతున్న గడ్డి వుంది. ఆ గడ్డి కొన్ని చోట్ల అణగ దొక్కి వుంది. కొన్ని చోట్ల చదరాయిగా వుంది. కొన్ని చోట్ల పేడ పోగులతో కలిపి వుంది. మరి కొన్ని చోట్ల దున్ని వుంది. బళ్లు పొలంలో నో వరుసగా పోతున్నాయి. అవసరమైన యెరువు తోలడానికి తగినన్ని బళ్లు వున్నాయో లేదో చూసు కొని వాటిని లెక్క పెట్టి తృప్తి పడ్డాడు లేవిన్. వచ్చిక బీళ్లని చూడగానే అతనికి గడ్డికోత గురించిన ఆలోచనలు వచ్చేయి. గడ్డికోత విషయం గుర్తుకొచ్చినప్పుడల్లా అతనికి విశేషంగా ఉత్తేజం కలుగుతుంది. వచ్చికబీటి దగ్గరికి వచ్చేక అతను గుర్రాన్ని ఆపేడు.

గడ్డి మొదళ్ల దగ్గర యింకా మంచు చెమ్మగా ఉంది. కోజ్నిషెవ్ కాళ్లు తడుస్తాయని చెప్పి బండిలోనే తనని పచ్చికబీటిమీదుగా తీసుకెళ్లి పెర్చి చేపలు బాగా దొరికే చోట దింపమని తమ్ముణ్ణి అడిగాడు. గడ్డిని తొక్కెయ్యడం లేవిన్‌కి యే మాత్రమూ యిష్టం లేదు. అయినా గానీ బండిని పచ్చికబీట్లోకి తోలేడు. నిడుపాటి గడ్డిపరకలు బండి చక్రాలకీ, గుర్రం కాళ్లకీ ఉంగలు చుట్టుకున్నాయి. బండి చక్రాలమీద, ఆ పరకలు రాల్చిన విత్తనాలు అంటుకు పోయేయి.

లేవిన్ గుర్రాన్ని తీసుకెళ్లి వో చెట్టుకి కట్టేశాడు. యీ లోపున అన్నగారు వో పొదకింద చేరి గాలాలు సరిచేసుకున్నాడు. లేవిన్ పచ్చికబీటి మహాసముద్రంలోకి చొచ్చుకు పోయాడు. అక్కడ గాలి కదలాడ్డం లేదు. నీటితో బాగా చెమ్మగా వుంది పచ్చికబీడు. పక్కానికి వచ్చే గింజలతో పట్టులా వున్న గడ్డి అతని మోలదాకా వచ్చింది.

పచ్చికబీటిని దాటి లేవిన్ రోడ్డుమీదకి వచ్చేడు. అతనికి వో ముసలాయన తగిలాడు. అతని కన్ను వాచింది. అతను బుట్టలో తేనెటీగల్ని మోసుకొస్తున్నాడు.

"యేమిటి ఫొమిచ్? తేనెటీగల కొత్త పెట్టె పట్టేవేమిటి?" అని లేవిన్ అడిగాడు.

"కొత్త పెట్టె యెక్కడిది లేవిన్‌గారూ? పాతదాన్ని చూసుకోవడమే చావుగా వుంటే! రెండోసారి తుట్టె యెగిరిపోయింది... మీ పొలం పనులు చేసేవాళ్ల ధర్మమా అని దక్కింది. వాళ్లు వో గుర్రం వదిలి దౌడు తీయించారు..."

"వుఁ, అయితే ఫొమిచ్, గడ్డి కోయిద్దా మంటావా లేక ఆగుదామంటావా?" అని అడిగాడు.

"యేం చెప్పమంటారు? మేమైతే సెయింట్ పీటర్ పండుగ* దాకా ఆగుతాం. కాని తమరు పెందరాళే మొదలెడతారు. దేవుడు చల్లగా చూడాలి, భేషైన గడ్డి. మంచి గ్రాసం పశువులకి.

"వాతావరణం సంగతేమంటావ్?"

"దేవుడి దయ. బహుశా బాగానే వుంటుంది."

లేవిన్ అన్నగారి దగ్గరికి వెళ్లేడు. చేప వొక్కటి కూడా పడలేదు. అయినా కోజ్నిషెవ్ పట్టించుకోలేదు. ఆయన మంచి హుషారుగా వున్నాడు. డాక్టరుతో సంభాషణ ఆయనకి వుఠి యెక్కించిందనీ, ఆయన మాట్లాడాలని ఉత్సుకతో ఉన్నాడని లేవిన్ గమనించాడు. కాని లేవిన్‌కేమో యింటికి వెళ్లిపోవాలని ఆతృతగా వుంది. ఆ మర్నాడు గడ్డికోత మనుషుల్ని పిలిపించమని కబురు పెట్టడానికీ, ఆ పని యెప్పుడు మొదలుపెట్టాలో తన సందేహాలు నివృత్తి చేసుకోవడానికీ పిలవుతుంది.

"వుఁ వెడదామా?" అన్నాడు లేవిన్.

"ఏమిటా తొందర? కూర్చో. ఎలా తడిసిపోయావో చూడు. చేపలు మాత్రం పడ లేదు. అయితేనేంలే! చేపలు పట్టడంలో సంతోషం యేమంటే ప్రకృతికి చేరువుగా వస్తాం.

వెండిలా మెరిసే నీళ్లకంటె ముచ్చటైంది యేముంది? ఈ పచ్చికబీటి తీరాలు నాకు యెప్పుడూ నో గూఢమైన పాడువు కథని గుర్తుకు తెస్తాయి తెలుసా? గడ్డి పరకలు నీటితో అంటాయి 'మేం పారుగుతున్నాం, మేం పారుగుతున్నాం'..."

"నేను యెన్నడూ వినలేదు యీ పాడువు కథ" అని లేవిన్ దిగాలుగా జవాబిచ్చేడు.

3

"చూడు, నేను నీ గురించే ఆలోచిస్తున్నాను" అన్నాడు కోజ్నిషెవ్. "ఆ డాక్టరు కుర్రాడు బుర్ర ఉన్న వాడిలాగే కనిపిస్తున్నాడు. అతను చెప్పింది నిజమే అయితే మీ జిల్లా వ్యవహారాలు అయ్యవార్లంగారి నట్టిల్లులా ఉన్నాయట. నేను లోగడో సారి నీకు చెప్పాను. ఇప్పుడు మళ్లీ చెప్తున్నాను. నువ్వు సమావేశానికి హాజరవకపోవడం, మొత్తంమీద నువ్వు జెమ్స్త్వో వ్యవహారాలకి దూరంగా ఉండిపోవడం యేమాత్రం సబబుగా లేదు. వివేకవంతులు పక్కకి తప్పుకుంటే జెమ్స్త్వో వ్యవహారాలు యెలా సాగుతాయో భగవంతుడికే తెలుసు. డబ్బు యిచ్చేది మనం, యేం, అదంతా జీతవాతాలకి వెళ్లిపోతుంది. కాని బళ్లు గాని, డాక్టర్లు గాని, మంత్రసానులు గాని, మందుల షాపులు గాని యేమీ లేవు" అన్నాడు.

"నేను ప్రయత్నించి చూశాను" అని లేవిన్ అయిష్టంగా వున్నట్టు నిదానంగా జవాబు చెప్పాడు. "చెయ్యలేక పోయాను. ఏం చెయ్యాలి మరి?" అన్నాడు.

"ఏం చెయ్యలేక పోయావు? యేమిటో మరి నాకర్థం కావడం లేదు. యిది ఉదాసీనతవల్ల అనో, అసమర్థతవల్ల అనో నమ్మలేను. మరేం కావాలన్నమాట? శుద్ధ సోమరి తనం, వూఁ?"

"నువ్వన్నది యేదీ కాదు. నేను ప్రయత్నించాను. యీ విషయంలో ఏమీ చెయ్య లేనని గ్రహించాను" అన్నాడు లేవిన్.

అన్నగారు యేం చెప్తున్నాడో అతను శ్రద్ధగా వినలేదు. నది అవతల పొలంలో అతనికి యేదో నల్లటిది కనిపించింది. అది వొట్టి గుర్రమేనా, లేక గుర్రంమీద స్వారీ చేస్తూ నిగా మాను కూడా వున్నాడా అనేది తెలీలేదు.

"యెందుకని నువ్వు యేమీ చెయ్యలేకపోయావు? ప్రయత్నం చేసావ్. నెగ్గలేదు. అంతే దణ్ణం పెట్టి వదిలేశావ్. ఆత్మాభిమానం వుండాలి, అఁ."

"ఆత్మాభిమానమా?" అన్నాడు లేవిన్. అన్నగారి మాటలకి కష్టం కలిగింది. "ఈ మాటలు నాకర్థం కావటం లేదు. నేను యూనివర్సిటీలో చదువుకొనేటప్పుడు సమాకలన గణితం మిగతా విద్యార్థులందరికీ అర్థమైందనీ నా వొక్కడికే అర్థం కాలేదనీ అంటే నా ఆత్మాభిమానం దెబ్బ తిని వుండేది. కాని యీ విషయానికి సంబంధించి ముందుగా యెవళ్లకేనా అలాంటి కార్యక్రమాల పట్ల మొగ్గు, యింకా ముఖ్యం ఆ పనులే గొప్పవి అన్న నమ్మకం వుండాలి."

"యేమిటి? అవి ముఖ్యమైనవి కావంటావా?" అని కోజ్నిషెవ్ ఆశ్చర్యంగా అడిగాడు. తను యెంతో ఆసక్తికరంగా పరిగణించిన వాటిని తమ్ముడు ముఖ్యం అయినవిగా చూడనందుకు యీసారి ఆయనకు కష్టం కలిగించింది. యింకా కష్టం కలిగించింది అతను తను చెప్పే దాని పట్ల చెవిపెట్టడమే లేదు, అనే సంగతి.

"నాకవి గొప్పవిగా కనిపించడం లేదు. వాటిపట్ల నాకు ఆసక్తి పుట్టడం లేదు, యేం చెయ్యను?" అన్నాడు లేవిన్. తను చూపింది నిగామానే అవి గ్రహించి, దుక్కి దున్నేవాళ్లని దున్నడం వదిలి వెళ్లమంటున్నాడులా వుంది. వాళ్ళు నాగళ్లని తిరగేసి పెడుతున్నారు. 'ఆరె, వాళ్ళు పని పూర్తిచేసి వుండరు" అనుకున్నాడు.

"యిదిగో విను" అన్నాడు అన్నగారు. ఆయన అందమైన, తెలివైన ముఖం ముడుచుకుని మాట్లాడేడు. "ప్రతిదానికీ వో హద్దు వుంటుంది. విశిష్టమైన, నిజాయితీపరుడైన వ్యక్తిగా వుండడం, అసత్యపూరితమైన ప్రతిదాన్ని యేవగించుకోవడం మంచిదే, యిదంతా నాకు బాగా తెలుసు. కాని నువ్వు చెప్పేదానికి అర్థం లేదు, వున్నా చాల చెడ్డ అర్థం వుంటుంది, తెలుసా? నీకు యిందులో గొప్పది యేదీ కనిపించలేదా? నీవు యెవరి పట్ల యిష్టంగా వున్నానంటున్నావో ఆ రైతులకి సంబంధించి..."

'నేనెప్పుడూ అలాంటిదేమీ అనలేదు' అనుకున్నాడు లేవిన్.

"...వాళ్ళు మందూ మాకూ లేకుండా జబ్బులకి గురయి చచ్చిపోవడం? అజ్ఞానంలో కొట్టు మిట్టాడే ఆడవాళ్లు పసిబిడ్డల్ని మృత్యుముఖంలోకి గెంటడం, సామాన్య జనం చీకట్లో తడుము లాడుకుంటూ రాతకోతలు తెలిసిన వాళ్ల దయాధర్మాలమీద ఆధార పడడం, నువ్వు సహాయం చెయ్యగల స్థితిలో వుండీ అవి నీకు గొప్పవిగా కనిపించకపోవడం వల్ల చెయ్యకుండా వూరుకోవడం." కోజ్నిషెవ్ తమ్ముడిని మీమాంసలో పడేశాడు – తను యేది చెయ్యాలని తెలుసుకోవాలో దాన్ని తెలుసుకునేటంత వికాసం లేకపోయేనా వుండాలి లేదా తన ప్రశాంతతని, ఆత్మాభిమానాన్ని లేదా మరి దేన్నైనా గాని అలా చెయ్యడానికి అర్పించనిష్టం లేకుండానైనా వుండాలి.

అన్నగారి ముందు తల వంచనైనా వంచాలి లేదా తనకి లోకహిత కార్యాలపట్ల తగినంత మక్కువ లేదనైనా వొప్పుకోవాలి అని లేవిన్‌కి అనిపించింది. అతని మనస్సుకి కష్టం కలిగింది. గాయం తగిలినట్లైంది.

"రెండూ వొప్పే" అని దృఢంగా అన్నాడు. "నేననుకోవడం లేదు యిది సాధ్యమని..."

"యేమిటి నీ ఉద్దేశం? సరిగ్గా డబ్బుని కేటాయిస్తే వైద్య సహాయం చెయ్యడం అసంభవమంటావా?"

"అది సాధ్యం కాదనే నాకనిపిస్తుంది. మా జిల్లాలోని ఆరువేల చదరపు కిలోమీటర్ల ప్రాంతానికీ, మా వసంత రుతువు నాటి వరదలతో, శీతాకాలం మంచు తుఫాన్లతో, వేసవి

కాలం నాటి వ్యవసాయం వన్లతో వైద్య సహాయం యివ్వడం సాధ్యమని అనుకోను. అదీగాక యీ వైద్యంమీద నాకు నమ్మకం లేదు."

"అలా అనడం న్యాయం కాదు... నీకు లక్షలాది ఉదాహరణలు చూపించగలను... సరే పాతకాలం సంగతి యేమిటి?"

"వాటి అవసరం యేముంది?"

"అరె, యేమిటి నువ్వనేది? విద్యవల్ల ఉపయోగాలేమిటో అనే అనుమానం వుందా? అది నీకు మంచిది అయినప్పుడు అందరికీ మంచిది కాదూ?"

నైతికంగా వాదనలో తను చిత్తుగా ఓడిపోయినట్టు లేవిన్‌కి అనిపించింది. అందుకని అతనికి కోపం కూడా వచ్చింది. ప్రజాహిత కార్యాలపట్ల తన ఉదాసీనతకి గల ముఖ్య కారణాన్ని అనుకోకుండానే బయటపెట్టేశాడు.

"యిదంతా బాగానే వుంది, కాని నేనెన్నడూ వాడుకోని వైద్య సహాయ కేంద్రాల్ని స్థాపించే యాతన నేనెందుకు పడాలి? చదువుకోవడానికి నా పిల్లల్ని యెన్నడూ పంపని బళ్ళని గురించి నేనెందుకు యిబ్బంది పడాలి? రైతులూ వాళ్ళ పిల్లల్ని ఆ బళ్ళకి పంపరు. వాళ్ళ యెందుకు పంపాలా అని నాకు అనిపిస్తుంది" అన్నాడు.

ప్రజాహితం పట్ల యీ వైఖరి చూసి కోజ్నిషెవ్‌కి వో క్షణం నోరు మూతపోయింది. కాని ఆ సమయంలో మరో దాడి పథకం ఆలోచించేడు.

ఆయన యేమీ మాట్లాడలేదు. గాలం తాటిని పొకదాన్ని లాగి మళ్ళీ విసిరేడు. తర్వాత చిరునవ్వు నవ్వుతూ తమ్ముడికేసి తిరిగాడు.

"చూడు... మొదటగా వైద్య సహాయ కేంద్రం ఉపయోగం. యింతా చేసి మనం అగాఫ్యా మిహైలొవ్నా కోసం జేమ్స్త్వో డాక్టర్ని పిలిపించలా?"

"ఆమె చెయ్యి వంకరయి పోతుందను కుంటున్నాను."

"ఆ సంగతి తర్వాత చూద్దాంలే... రెండవది, చదువుకున్న రైతు పనివాడుగా యెక్కువ బాగా పని చేస్తాడు, చదువురాని వాడికంటె చాలా మెరుగ్గా వుంటాడు."

"యేం కాదు, యెవర్నైనా అడుగు" అని లేవిన్ ఖండితంగా జవాబు చెప్పేడు. "చదువూ, సంధ్యా వచ్చిన పనివాడు పని విషయంలో చాలా తిక్కగా వుంటాడు. దార్లు మరమ్మత్తు చెయ్యలేం. వంతెనని నిర్మిస్తే, దాని కొయ్యదుంగల్ని అప్పుడే యెత్తుకుపోతారు."

"అయినా గానీ..." అని కోజ్నిషెవ్ ముఖం చిట్లించుకుంటూ మొదలుపెట్టేడు. తన మాటని ఖండించడం, ముఖ్యంగా ఖండనలు వో మాటనుంచి యింకో మాటమీదకి గెంతుకుంటూ సంబంధం లేకుండా పోవడం, తను సమాధానం చెప్పడానికి తయారుగాలేని ప్రశ్నలు లేవనెత్తడం ఆయనకి యిష్టం వుండదు. "అయినా గానీ విషయం అది కాదు. విద్యవల్ల ప్రజలకి లాభం వుందంటావా లేదంటావా?"

"వుందనుకో" అన్నాడు లేవిన్ అనాలోచితంగా. తను అనుకుంటూ వున్నదాన్ని చెప్పలేదని

వెంటనే అతనికి తట్టింది. దీన్ని గనక తను ఒప్పుకుంటే తను చెప్పిన మిగిలినదంతా అర్థ రహితమైందనీ వ్యర్థమనీ రుజువవుతున్న గుర్తింపు అతనికి వచ్చింది. యెలా రుజువవుతుందో అతనికి తెలియదు. తర్కబద్ధంగా రుజువవుతుందని మాత్రం అతనికి ఖాయంగా అనిపించింది. దానికోసం యెదురు చూశాడు.

లేవిన్ అనుకున్న దానికంటే సులభంగానే వుందా రుజువు.

"లాభం వుందనే నువ్వు అనుకుంటే నిజాయితీ పరుడైన మనిషిగా నువ్వు అలాంటి కార్యక్రమం పట్ల ఆదరం చూపించకుండా, సహానుభూతి ప్రదర్శించకుండా, దాన్ని సాధించ డానికి కృషి చెయ్యకుండా వుండలేవు" అన్నాడు కోజ్నిషెవ్.

"కాని యీ కృషి మంచిదని నేననుకోవడం లేదు" అని యెర్రబడుతూ అన్నాడు.

"అదేమిటి? యిప్పుడేగా నువ్వన్నావు..."

"నా ఉద్దేశంలో అది మంచిదని గాని సంభవమని గాని కాదు."

"సంభవమవునో కాదో నువ్వు దానికోసం కృషిచేస్తే తప్ప తెలీదు కదా."

"సరే, పోనీ అలాగే అనుకుందాం" అన్నాడు లేవిన్, తను నిజంగా అలా అనుకోక పోయినా. "సరే అనుకుందాం, అయినా కూడా దీన్ని గురించి నేనెందుకు యాతన పడాలో నాకు బోధపడ్డం లేదు."

"యేమిటిది?"

"ఓ క్షణం, మనం దీన్ని గురించి మాట్లాడుకుంటూ వుంటే గనక, దాన్ని తాత్విక దృక్కోణంనుంచి నాకు వివరించు" అన్నాడు లేవిన్.

"తాత్విక దృక్కోణానికీ దీనికీ సంబంధం యేమిటో నాకు తెలీదు" అని ఓ రకంగా గొంతు పెట్టి కోజ్నిషెవ్ అన్నాడు. తను తత్వశాస్త్రం గురించి మాట్లాడే హక్కు తమ్ముడికి వుందని గుర్తించడం లేదన్నట్టుగా ఆ స్వరం లేవిన్‌కి అనిపించింది. అతనికి రేగిపోయింది.

"సంబంధం యేమిటో నేను చెప్తాను" అని లేవిన్ కోపంగా అన్నాడు. "మనం చేసే పనులన్నిటికీ వ్యక్తిగత సుఖశాంతులే ప్రేరకంగా ఉంటాయి నా దృష్టిలో. గొప్పింటి బిడ్డగా నాకనిపించేదేమంటే మన జేమ్‌స్త్వో సంస్థలు* నా సంక్షేమానికి యేమీ పనిచెయ్యడం లేదని. రోడ్లు యేం బాగా లేవు, బాగు పడవు. కాని నా గుర్రాలు నన్ను వాటిమీద తీసికెడతాయి, అధ్వానంగా వున్నా గానీ. డాక్టర్లు గాని వైద్య కేంద్రాలు గాని నాకవసరం లేదు, యీ కొత్త న్యాయ సంస్థలూ* నాకవసరం లేదు, యెన్నడూ వాటి దగ్గరకు వెళ్లలేదు, వెళ్లబోను. పాఠశాలల అవసరం నాకు లేకపోవడమే కాదు, నీకు నే చెప్పినట్టు, అవి హానికరం కూడాను. నాకు మట్టుకు జేమ్‌స్త్వో సంస్థలు యెందుకయ్యా అంటే దెస్యాతీనుకి పద్దెనిమిది కోపెక్కులు చెల్లించడం, బస్తీకి వెళ్లడం, నల్లుల పడకమీద రాత్రి దొర్లడం, చెత్తంతా వినడం, కాని యివేమీ నాకు వ్యక్తిగత ప్రయోజనాలని ఆసక్తి కలిగించవు."

"కాని చూడు" అని కోజ్నిషెవ్ చిరునవ్వు నవ్వుతూ అన్నాడు. "మనం భూస్వామ్య

దాసుల విముక్తికి కృషి చేసినప్పుడు మనకి వ్యక్తిగతమైన ప్రయోజనాలు ప్రేరేపిస్తే చేశామా? అయినా చేశాం కదా?" అన్నాడు.

"లేదు, అలా కాదు" అని లేవిన్ మరింత రెచ్చిపోయి అన్నాడు. "భూస్వామ్యదాసుల విముక్తి వుందేం అది వేరే కథ. మనకందులో వ్యక్తిగత ప్రయోజనం కచ్చితంగా వుంది. మర్యాదస్థులందరికీ భారంగా తయారైన మాటుని విసిరెయ్యాలను కుంటున్నాం మనం. కాని జేమ్‌స్త్వో సంస్థలో సభ్యుణ్ణి అయి నేనేం చేస్తానయ్యా అంటే, పట్నంలో వీధులు తుడవడానికి యెంతమంది తోటీ వాళ్ళు కావాలి, అక్కడ గొట్టాలు యెలా వెయ్యాలి అని చర్చిస్తాను. యింతా చేసి నేను జిల్లాలో వుండా వుండను, పెట్టా పెట్టను. యెవడో రైతు ఓ పంది మాంసం ముక్కని కాజేస్తే, దాన్ని విచారించే కొత్త న్యాయ సంస్థ బృందంలో కూర్చుని పూట పూటంతా వారి ప్రతివాదుల వకీళ్ళు అంకిళ్ళు పడిపోయేటట్టు వాగుతూ వుంటే వింటాను. అలాగే అధ్యక్షుడు మా బండ బుద్ధావతారం అల్యోష్కని 'యేమయ్యా పంది మాంసం ముక్కని కాజేసినట్టు నేరం వొప్పుకుంటావా' అని అడిగితే అతను 'యేమిటి ప్రభూ' అని జవాబు చెప్పడం వింటూ కూచోవాలి."

లేవిన్ వాగ్ధోరణి అసలు విషయానికి దూరంగా సర్యైన దూసుకుపోతూ వుంది. అతను న్యాయాధ్యక్షుణ్ణీ, బుద్ధావతారం అల్యోష్కనీ అనుకరించేడు కూడా. తన వాదనకి అది వూపు యిస్తుందని అతను అనుకున్నాడు.

కాని కోజ్నిషెవ్ వూరికే యేమిటో యీ వాదన అన్నట్టు భుజాలు యెగరేశాడంతే.

"అయితే యింతకీ యేమంటావ్?"

"యేమంటానంటే ఆ హక్కుల్ని, యేవైతే నాకు... నా ప్రయోజనాలకి సంబంధిం చినవో వాటిని నా శాయశక్తులా రక్షించుకుంటాను. నేను చదువుకొనే రోజుల్లో జెండార్మి వాళ్ళు వచ్చి మా గదులు సోదా చేసి మా ఉత్తరాలు చదివేరు. విద్యకి సంబంధించి, స్వేచ్ఛకి సంబంధించి నా హక్కుల్ని రక్షించుకోవడానికి నేను సిద్ధపడ్డాను. నిర్బంధ సైనిక సేవ విషయం నా ఆలోచనకి వస్తుంది. నా పిల్లలకి, నా అన్నదమ్ములకి, స్వయంగా నాకే దీనితో సంబంధం వుంది. నాకు సంబంధించిన విషయాల గురించి ఆలోచనా పాలోచనా చెయ్యడానికి నేను తయారుగా వున్నాను. కాని జేమ్‌స్త్వో పరిషత్తు నలభై వేల రూబుళ్ళ యెలా కేటాయించి ఖర్చుచెయ్యాలి లేదా బుద్ధావతారం అల్యోష్కని యెలా విచారణ జరపాలి అనే వాటి గురించి బుర్ర పాడు చేసుకోవడం నాకు బోధపడదు, బోధపర్చుకోలేను."

అనకట్ట తెగినప్పుడు నీళ్ళ వడిగా ప్రవహించినట్టుగా వుంది లేవిన్ వాగ్ధాటి. కోజ్నిషెవ్ మందహాసం చేశాడు.

"మాటకి నువ్వే రేపు విచారణలో వున్నావనుకో, పాతకాలపు పంచాయితీ పరిషత్తుల్లో నీ విచారణ యెలా సాగుతుందంటావ్?"

"నాకు విచారణ యెన్నటికీ జరుగదు. నేనెవ్వడి పీకా యెన్నడూ తెగ్గొయ్యను. అందు

చేత నాకా అవసరమూ ఉండదు. తెలిసిందా" అని మళ్లీ అసలు విషయానికి అరు అమళ్ల దూరం పోతూ చెపుతూనే ఉన్నాడు. "మన జేమ్‌స్త్వో సంస్థలు ట్రినిటీ పర్వదినం నాడు కొట్టి నేలలో గుచ్చిన బర్చ్ చెట్లలాంటివి. చూడ్డానికి యూరప్‌లో తమంత తాము మొలిచిన చెట్లలాగా ఉంటాయి. కాని వాటిని బర్చ్ మొక్కలని నమ్మి, నీళ్ల పోసి దోహదం చెయ్యడానికి నా మనస్సు సమాధానపడదు."

యీ బర్చ్ చెట్లు చర్చలోకి యెలా చొచ్చుకు వచ్చాయా అని ఆశ్చర్యపోతున్నట్లు కోజ్నిషెవ్ వూరికే భుజాలు యెగరేశాడు. నిజానికి తమ్ముడు యే అభిప్రాయంలో వున్నాడో వెంటనే గ్రహించాడు.

"చూడు వాదించే పద్ధతి అది కాదు."

కాని ప్రజాహిత కార్యాలపట్ల తను ఉదాసీనంగా వున్నాడన్న గుర్తింపు లేవిన్‌కి కలిగి వివరణ యివ్వాలనే ఉద్దేశంతో చెప్తూనే వున్నాడు.

"వ్యక్తిగత ప్రయోజనాలలో పొతుకుంటే గాని యే కార్యకలాపానికీ ఆధారం వుండదు. యిది సాధారణ సత్యం, తాత్విక సత్యం" అన్నాడు. తాత్విక అనే మాటని దృఢంగా నొక్కి చెప్తూ, ప్రతివాడికీ వున్నట్టుగానే తనకీ తత్వశాస్త్రం గురించి మాట్లాడే హక్కు వుందని చూపించడానికన్నట్టు అన్నాడు.

కోజ్నిషెవ్ మళ్లీ చిరునవ్వు నవ్వేడు. 'తన ప్రవృత్తిని సమర్థించుకోవడానికి తనకీ వొక తత్వశాస్త్రం వుంది' అనుకున్నాడు.

"తత్వశాస్త్రం గొడవ పక్కన పెట్టు" అన్నాడాయన పైకి. "వ్యక్తిగత ప్రయోజనాలనీ, సామూహిక ప్రయోజనాలనీ సంధించే బంధవాన్ని కనిపెట్టడమే తత్వశాస్త్రానికి అనేక యుగాలుగా ముఖ్య కర్తవ్యంగా వుంది. కాని అది వేరే చర్చలోకి వెడుతుంది. ప్రస్తుతం విషయం యేమంటే నీ పోలికని సరి చెయ్యాలి. బర్చ్ చెట్లని నేలలో గుచ్చలేదు. వాటిలో కొన్ని నాటిన మొక్కలు, కొన్ని పాతిన విత్తనాలు. వాటికి జాగ్రత్తగా దోహదం చెయ్యాలి. తమ తమ సంస్థల్లో యేవి ముఖ్యమైనవో, ప్రముఖమైనవో గుర్తించి వాటిని పదిలం చేసుకున్న దేశాలే భవిష్యత్తు వున్న దేశాలు, చరిత్రలో స్థానం వున్న దేశాలు."

కోజ్నిషెవ్ చర్చనీయ విషయాన్ని చారిత్రిక తత్వశాస్త్ర పరిధిలోకి తీసుకుపోయాడు. అది లేవిన్ బుర్రకి యెక్కని విషయం. అతని దృష్టికోణం యెంత తప్పో అతనికి స్పష్టం చేశాడు అన్నగారు.

"యిక యీ కార్యకలాపాలపట్ల నీకిష్టం లేకపోవడానికి సంబంధించి, యిలా అంటున్నానని మరేం అనుకోకు, అది మన రష్యన్ సోమరితనం వల్లా, ఉన్నత వంశీకుల వైఖరివల్లా వచ్చింది. యిది నీలో తాత్కాలిక దశాచ్ఛిద్రమే అనుకుంటున్నాను. నువ్వు మళ్లీ సరైన దారిలో పడతావనే నా నమ్మకం."

లేవిన్ యేమీ మాట్లాడలేదు. అన్ని వేపులనుంచీ తను చిత్తుగా వోడిపోయానని

అతనికి అనిపించింది. కాని తను చెప్పదల్చుకున్నదాన్ని అన్నగారు అర్థం చేసుకోలేదనే అతనికి అనిపించింది. అన్నగారు తన వూహాల్ని యెందుకు అర్థం చేసుకో లేకపోయాడా అనే విషయమే అతనికి తెలియనిదల్లా. తను స్పష్టంగా తన మనస్సులోని మాట చెప్పలేకపోయాడా, లేదా, అన్నగారు అర్థం చేసుకో దల్చుకోలేదా, లేదా అర్థం చేసుకొనే శక్తి ఆయనికి లేదా అనేది అతనికి తెలియలేదు. ఏమైనా అతను యింక ఆ విషయంలోకి లోతుగా పోదలుచుకో ప్రయత్నించలేదు. మళ్లీ మాట్లాడకుండా వేరే యేదో విషయం గురించి ఆలోచనలో తన సొంత వ్యవహారంలో మునిగిపోయేడు.

కోజ్నిషెవ్ గాలం ఆఖరి తాడు చుట్టేసి, గుర్రాన్ని విప్పేడు. యిద్దరూ కలిసి యింటికి వెళ్లిపోయారు.

4

అన్నగారితో మాట్లాడేటప్పుడు ఆఖర్న లేవిన్‌కి తట్టిన సొంత వ్యవహారం యిదీ. గత యేడు గడ్డికోత సమయంలో తనకి విగామానుపట్ల యేదో విషయంమీద కోపం వచ్చింది. తనని తాను సంబాళించుకోవడానికి వో రైతు చేతిలోనుంచి కొంకిక్కర కత్తిని తీసుకుని కోత మొదలుపెట్టాడు.

ఆ పని అతనికి చాలా సంతోషం కలిగించింది. దాంతో, అతను ఆ తర్వాత కొన్ని సార్లు అలానే గడ్డి కోశాడు. తన యింటి ముందున్న జాగాలో గడ్డిని స్వయంగా తనే కోశాడు. ఈ వసంతరుతు ఆరంభంనుంచీ రైతులతో కలిసి రోజుల తరబడి రోజుకి రోజంతా గడ్డి కొయ్యాలనే యోచన చేశాడు. అన్నగారి రాకతో యేం చెయ్యాలా అన్న సందిగ్ధంలో పడి పోయేడు, చెయ్యాలా వద్దా అని. రోజంతా అన్నగార్ని వొక్కళ్లే వదిలేసి తను వెళ్లిపోవడానికి తటపటాయించేడు. అన్నగారు వేళాకోళం చేస్తారేమోనని భయం కలిగింది. కాని పచ్చిక బీటిగుండా వెడుతూ వున్నప్పుడు గడ్డికోతవల్ల తనకి కలిగిన సంతోషం గుర్తు వచ్చింది... తను అనుకున్నట్టే కానిద్దామని అనిపించింది. అన్నగారితో యిప్పుడు మంట పుట్టించే వాదన తర్వాత, అది అతని మనస్సుకి తట్టింది.

'నాకు శారీరక శ్రమ కావాలి. లేకపోతే మరీ చిరాకెత్తుతూ వుంటుంది' అనుకున్నాడు. రైతుల ముందూ, అన్నగారి ముందూ యెంతో యిబ్బందికరంగా వుంటే వుండచ్చుగాక గడ్డికోత పని చెయ్యాలనే తీర్మానించుకున్నాడు.

సాయంత్రం లేవిన్ ఆఫీసు గదికి వెళ్లాడు. ఆ మర్నాడు చెయ్యాల్సిన పని గురించి పురమాయింపులు చేశాడు. గడ్డికోతవాళ్లకి ఆ మర్నాడు ఉదయం కలినొవ్ పచ్చికబీటిమీద గడ్డి కొయ్యాల్సిందిగా కబురు చేయించాడు. ఉన్న వాటిలో అన్నిటికంటే మంచిదీ, పెద్దదీ కలినొవ్ బీడే.

"నా కొంకిక్కర కత్తిని టిట్ దగ్గిరికి పంపి పదును పెట్టించి రేపు పొద్దుట తీసుకు

రమ్మనండి. నేను కూడా కోత పనిలో చేరతానేమో" అని అతను తన బెరుకుని పైకి కని పించ నియ్యకుండా కుమ్మకుంటూ అన్నాడు.

నిగామాను చిరునవ్వు నవ్వేడు.

"అలాగేనండయ్యా" అన్నాడు.

ఆ సాయంత్రం పూట టీ తాగేటప్పుడు లేవిన్ అన్నగారితో యీ విషయం చెప్పేడు.

"వాతావరణం బాగా వుండేటట్టే వుంది. రేపు నేను గడ్డికోత పని మొదలు పెట్టా లనుకుంటున్నాను" అన్నాడు.

"అలాంటి పని నాకిష్టం" అన్నాడు కోజ్నిషెవ్.

"నాకూనూ. అప్పుడప్పుడు నేనూ రైతులతో కలిసి పనిచేస్తూ వుంటాను. రేపు రోజంతా గడ్డికోద్దామని ఉంది నాకు."

కోజ్నిషెవ్ తల పైకెత్తి తమ్ముడికేసి ప్రశ్నార్థకంగా చూశేడు.

"ఏమిటి? రైతులతో సమంగా? రోజంతా?"

"ఆ, చాలా సరదాగా వుంటుంది" అన్నాడు లేవిన్.

"మంచి శరీర వ్యాయామమేగాని తట్టుకోగలవా?" అని కోజ్నిషెవ్ వ్యంగ్యం యే మాత్రమూ లేకుండా అడిగాడు.

"యిదివరలో చేసి చూశాను. మొదట్లో కష్టంగానే వుంటుంది, కాని తర్వాత దారిలో పడతాం. వెనక బడననే అనుకుంటున్నాను."

"సరేగాని చెప్పు, రైతులకి యేమనిపిస్తుంది? యజమాని తిక్క అని నవ్వుకుంటారా?"

"లేదు, నేను అలా అనుకోను. కాని పని చాల సరదాగా ఉంటుంది; కాని కష్టంగా కూడా వుంటుంది. అంచేత యేమాలోచించడానికీ వ్యవధి వుండదు."

"వాళ్లతో కలిసే భోజనం చేస్తావా? నీ కోసం అక్కడికి వేపుడు టర్కీ కోడినీ, లఫీత్ వైన్‌నీ పంపించడం బాగోదు."

"అబ్బే, భోజనానికి యింటికి వచ్చేస్తాను."

ఆ మర్నాడు ఉదయం లేవిన్ పెందరాళే లేచాడు. కాని అనేక వ్యవహారాలవల్ల ఆలస్యమై అతను కోత దగ్గరికి వెళ్లేటప్పటికి అక్కడ రెండవ వరస కోత సాగుతుంది.

కొండపైనుంచి అతనికి కొండపాద పీఠం దగ్గరి నేల అంతా కనిపించింది. అక్కడ గడ్డికోత అప్పటికే అయింది. అక్కడంతా బూడిదవర్ణంగానూ, మొదటి వరస పని మొదలు పెట్టిన చోట మనుషులు విడిచి పెట్టిన కోట్లు నల్లని చుక్కల్లాగానూ కనిపిస్తున్నాయి.

అతను యింకా దగ్గరికి వెళ్లగానే మనుషులు ఒకళ్ల వెనక ఒకళ్లు పొడుగాటి గీతలాగా ముందుకి సాగుతూ వుండడం కనిపించింది. కొంతమంది కోట్లు తొడుక్కున్నారు. కొంత మంది చొక్కాలతో వున్నారు. యెవడికి వాడు తన పద్ధతిలో కొంకి కర్ర కత్తిని తిప్పుతూ వున్నారు. అతను లెక్కపెట్టాడు. నలభై రెండుమంది ఉన్నారు.

మిట్టపల్లాంతో వున్న ఆ గడ్డిబీటమీద వాళ్ళు మెల్లిగా ముందుకి సాగుతున్నారు. అక్కడ యిదివరలో కరకట్ట వుండేది. లేవిన్ కొంతమంది రైతుల్ని గుర్తు పట్టేడు. పొడుగాటి తెల్ల చొక్కా తొడుక్కున్న ముసలి యెర్మిల్ వున్నాడు. కొంకిక్రర కత్తిని వూపుతూ దానిమీదకి మనిషి మొత్తం వొరిగిపోయాడు. పడుచు వాస్య వున్నాడు. అతను లేవిన్‌కి బండి తోలేవాడుగా పనిచేశాడు. అతను జోరుగా, విశాలంగా కత్తిని పోనిస్తూ కోస్తున్నాడు. లేవిన్‌కి గడ్డి కొయ్యడం నేర్పిన బక్కపల్చటి చిన్న మనిషి టిత్ కూడా కనిపించేడు. ఇప్పుడతను వరసని నడిపిస్తున్నాడు. అతను నిటారుగా నుంచున్నాడు. కత్తిని యేదో ఆటవస్తువు అయిన ట్టుగా వెడల్పాటి వరస కోస్తూ వూపుతున్నాడు.

లేవిన్ గుర్రం దిగి దాన్ని రోడ్డువార కట్టేశాడు. టిత్ దగ్గరికి వెళ్ళేడు. అతను పొదల్లోనుంచి యింకో కత్తిని తీసి లేవిన్‌కి అందించేడు.

"తయారయిందయ్యా, యమా పదునుగా ఉంది. దానంతట అదే కోసేస్తుంది" అన్నాడు. టోపీ యెత్తి చిరునవ్వు నవ్వుతూ దాన్ని లేవిన్‌కి యిచ్చేడు.

లేవిన్ దాన్ని తీసుకొని పరీక్షించేడు. తమ తమ వరసల్లో గడ్డికోత పూర్తి చేశాక చెమటతో తడిసిపోయి ఉల్లాసంగా వున్న కోతవాళ్ళు ఒకళ్ళ వెనక ఒకళ్ళు దారి దాటి వచ్చేరు. నవ్వుతూ యజమానికి నమస్కారం చేశారు. అందరూ అతనికేసి చూశారు కాని యెవళ్ళూ ఏమీ మాట్లాడ లేదు. కొన్ని క్షణాల తర్వాత పొడుగ్గా వున్న వో ముసలాయన లేవిన్ దగ్గరికి వచ్చేడు. అతను గొర్రెతోలు కోటు తొడుక్కున్నాడు. అతని ముఖం ముడతలు పడి వుంది. గడ్డం లేదు.

"అయ్యా, అన్న మాట ప్రకారం పనిలో ముందుకి రాండి, వెనక పడిపోవద్దు" అని ఆ ముసలతను లేవిన్‌తో అన్నాడు. పక్కనున్న గడ్డి కోతగాళ్ళు కిసుక్కున నవ్వుకున్నారు.

"వెనక పడకుండా వుండాలని ప్రయత్నిస్తాను" అన్నాడు లేవిన్. టిత్ వెనక నుంచుని పని మొదలయే క్షణం కోసం చూశేడు.

"గట్టిగా నిలబడాలి మరి" అని ముసలాయన రెట్టించాడు.

టిత్ లేవిన్ కోసం జాగా వదిలేడు. లేవిన్ అతని వెనకాలే కోత సాగించాడు. రోడ్డు పక్కనున్న గడ్డి కురచగా వుంది. లేవిన్ చాలా కాలంగా కోత పని చెయ్యలేదు. పైగా పక్కనున్న ఆ మనుష్యులందరూ తన కేసే చూస్తూ వుండడంతో యిబ్బందిగా వుంది. దాంతో కొంకిక్రర కత్తిని జోరుగా వూపినా మొదట్లో బాగా కొయ్య లేకపోయాడు. అతనికి వెనకనుంచి మాటలు వినిపిస్తూ వున్నాయి.

"క్రరకత్తి బారుగా వుండి పిడి అందడం లేదు. చూడండి అయన యెలా వొంగొంగి పోతున్నాడో" అన్నాడొకడు.

"కత్తిని గట్టిగా వొత్తండి" అని యింకొకడు అన్నాడు.

"యేం పర్వాలేదు, అలవాటవుతుంది, బాగానే సాగుతుంది" అని ముసలాయన అన్నాడు. "చూడండి, పోతా వున్నారు!.. అయ్యా మరీ వెడల్పుగా కోత కొయ్యకండి, అలుపొచ్చే

స్తుంది... ఆయన గడ్డే కదా, సొంత పని. చూడండి యెంత వదిలేశారో! మేం గనక అట్లా చేస్తే, మా వీపులు చిట్లుతాయి" అన్నాడు.

మెత్తని గడ్డి మొదలైంది. లేవిన్ యీ వ్యాఖ్యలన్నీ వింటూ యేమీ మాట్లాడకుండా శక్తి మేరకి గడ్డికోస్తూ తీత్ వెనకాలే తన కోత మెరుగు పర్చుకుంటూ వెళ్లాడు. ఓ వంద అడుగుల వరకూ వాళ్లు అలా వెళ్లారు. తీత్ ఆగకుండా ముందుకు వెళ్లాడు. యేమీ అలసినట్టు కనిపించలేదు. తను అంత సేపు నిలబడలేనని లేవిన్‌కి భయం వేసింది. అతను అప్పటికే అంత అలసిపోయాడు.

యిక తనకి అదే ఆఖరి శక్తితో కత్తిని పోనియ్యడ మనుకుని లేవిన్ అప్పటికి చాలిద్దా మని తీత్‌కి చెబుదా మనుకున్నాడు. కాని సరిగ్గా ఆ సమయంలోనే తీత్ తనకిగా తనే ఆగి పోయాడు. వొంగి కొంచెం గడ్డిని తీసుకొని కత్తిని తుడిచేడు. దానికి పదును పెట్టడం మొదలు పెట్టాడు. లేవిన్ నిటారుగా నుంచుని గట్టిగా గాలి పీల్చి వెనక్కి చూశేడు. వెనక వున్న మనిషి కూడ అంతే అలిసిపోయాడని తెలుస్తూనే వుంది. యేమంటే అతను లేవిన్ దగ్గరికి రాకుండా అక్కడనే ఆగిపోయి కత్తిని నూరడం మొదలుపెట్టాడు. తీత్ తన కత్తినీ, లేవిన్ కత్తినీ నూరి పదును పెట్టేడు. వాళ్లు మళ్లీ పనిలోకి వెళ్లారు.

రెండో సారి కూడ అలానే జరిగింది. తీత్ తన కత్తిని ఆపకుండా, తను అలవకుండా, లయబద్ధంగా పోనిస్తూనే వున్నాడు. లేవిన్ అతన్ని అనుసరించే వెళ్లేడు. వెనక బడకుండా వుండాలని ప్రయత్నించేడు. కాని అతనికి అది రాను రాను కష్టం అయిపోయింది. ఇక తను ముందుకి పోలేడు అని అతనికి అనిపించిన క్షణం వచ్చింది. కాని అదే క్షణంలో తీత్ మళ్లీ కత్తిని పదును పెట్టుకోవడానికి ఆగేడు.

ఆ రకంగా వాళ్లు మొదటి వరస పూర్తిచేశారు. తర్వాత వరసలేవీ లేవిన్‌కి మొదటి వరస అంత శ్రమ అనిపించలేదు. కాని యీ వరస కోత పూర్తయేటప్పటికి తీత్ కత్తిని భుజాన వేలాడేసుకుని మెల్లిగా నడుచుకుంటూ గడ్డిలో పడ్డ తన అడుగు జాడల్ని పట్టుకుని వెనక్కి వచ్చేడు. లేవిన్ కూడ తన జాడలోనే వెనక్కి మళ్లేడు. అతని ముఖంమీదనుంచి, ముక్కు మీదనుంచి చెమట అలా కారిపోతూనే ఉంది. నీళ్లల్లో తడిసినట్టుగా అతని చొక్కా వీపు తడిసిపోయింది. అయినా అతను సంతోషంగానే వున్నాడు. తను పనిలో నిలబడగలనని అప్పటికి ధైర్యం చిక్కి అతనికి యెక్కువ సంతోషం కలిగింది.

అతని సంతోషానికి పానకంలో పుడక వొక్కటే కనిపించింది, తను కోసిన వరసే అంత బాగా లేదు. తీత్ కోసిన వరసతో పోల్చుకుని చూస్తే తను కోసిన వరుస యెగుడు దిగుడుగా వుంది. తీత్ వరసలో వొక్క గడ్డి పరక కూడా మిగల్లేదు. 'చేతుల్ని తక్కువగానూ, శరీరాన్ని యెక్కువగానూ వూపుతా' అనుకున్నాడు.

తీత్ మొదటి వరుస గబగబా కోసుకుంటూ వెళ్లేడని లేవిన్ గమనించేడు. బహుశా తన యజమానిని పరీక్షించడానికి అలా చేసి వుంటాడు. అది పైగా చాలా పొడుగ్గా వుంది.

తర్వాతి వరసలు కొంచెం తేలిగ్గానే ఉన్నాయి. అయినా గానీ లేవిన్‌కి మిగిలిన వాళ్లతో అందుకోవడానికి చాలా శ్రమ అయింది.

వాళ్లకి వెనక బడకుండా, యథాశక్తి పని బాగా చెయ్యాలన్న దాని గురించి తప్ప లేవిన్ మరి దేన్ని గురించీ ఆలోచించలేదు, కోరుకోలేదు. కత్తులు స్వరున దూసుకు పోతూ చేసే చప్పుడు తప్ప అతను దేన్నీ వినలేదు; తన ముందు నిటారుగా వెడుతూ వున్న తీత్ రూపం తప్ప కోసిన గడ్డి అర్ధచంద్రాకార వరసలు తప్ప, కత్తికింద మెల్లిగా అలల్లా పడుతున్న గడ్డి తప్ప, కత్తి వాదరకి తెగిపడుతున్న పువ్వులు తప్ప, యెదర ముగిసే వరస తప్ప, అతనికి యేమీ కనిపించడం లేదు. ఆ వరస ముగిసే చోట తను హమ్మయ్య అనుకొని విశ్రాంతి తీసుకోవచ్చు.

యేం కథో, యెక్కడనుంచి అనిపించిందో అర్థం కాలేదు కాని, పని మధ్యలో తనకి తెలియకుండానే వేడిగా వున్న చెమటకి తడిసిన భుజాలమీద ఒక ఆహ్లాదకరమైన చల్లదనం కలిగినట్టు లేవిన్‌కి అనిపించింది. కత్తులని పదును పెట్టుకోవడం కోసం వాళ్లు ఆగినప్పుడు అతను ఆకాశంకేసి చూశాడు. నల్లని మేఘం కనిపించింది. పెద్ద పెద్ద వాన చినుకులు పడనారంభించాయి. కొంతమంది కోతవాళ్లు కోట్లు తీసుకోవడానికి పరిగెత్తారు. లేవిన్‌కి మల్లే యింకొంతమంది భుజాలు యెగరేస్తూ హాయిగా వుండే చల్లదనం సుఖాన్ని అనుభవించారు.

వాళ్లు వరస తర్వాత వరస కోశారు. కొన్ని పొడుగు వరసలు, కొన్ని పొట్టి వరసలు. కొన్నింటిలో గడ్డి పెళుసుగా వుంది, కొన్నింటిలో మెత్తగా వుంది. యెంత పొద్దు గడిచిందీ, యేమిటీ లేవిన్‌కి స్పృహ లేదు. బాగా పొద్దు పోయిందా, లేదా, పెందరాళేనా అనే దృష్టే లేకపోయింది. అతని పని యిప్పుడతనికి మహా సంతోషాన్ని కలిగించేదిగా వుంది. వూపుగా వున్న పని మధ్యలో తను యేం చేస్తున్నదీ మర్చిపోయిన క్షణాలు కూడా వున్నాయి, అప్పుడు అతనికి అంతా సులభంగానే కనిపించింది. అప్పుడు అతను కోసిన వరసలు తీత్ వరసలంత బాగా, సమంగా వున్నాయి. కాని తను యేం చేస్తున్నదీ గుర్తు రాగానే, యింకా బాగా చెయ్యాలని ప్రయత్నించేటప్పుడు అతనికి పనిలో వున్న కష్టం యెరుకలోకి వచ్చింది, దాంతో చేస్తున్నది చెడిపోయింది.

మరో వరస దగ్గరికి చేరారు. తర్వాత వరస మొదలు పెట్టాలనుకున్నాడు. కాని తీత్ పని ఆపుచేసి, ముసలాయన దగ్గరికి వెళ్లి యేదో గొణిగాడు. యిద్దరూ పొద్దు చూశారు. 'యేమిటి సంగతి, వాళ్లు మళ్లీ వరస మొదలు పెట్టరేం?' అనుకున్నాడు లేవిన్. రైతులు విరామం లేకుండా నాలుగ్గంటలకి పైగా పనిచేస్తూనే వున్నారనీ నాస్తా వేళయింది అన్న విషయం అతనికి తట్టనే లేదు.

"నాస్తా చేసే వేళయిందయ్యా" అన్నాడా ముసలాడు.

"అరె, నిజమే, అంత టైమయిందా? సరే, కానివ్వండి."

లేవిన్ తన కత్తిని తీత్‌కి అందించాడు. గుర్రం దగ్గరికి బయలేరాడు. చద్దిమూటలు

కోట్లు వున్న చోటుకి వెడుతూ వున్న రైతులంతో కలిశాడు. ఆ దారిలో విశాలమైన జాగాలో వెళ్లారు. కొత్తగా కోసిన గడ్డి వానకి తడిసింది. వాతావరణం గురించిన అనుమానం తనకి రాలేదని అతను అప్పుడు గమనించేడు. వానకి గడ్డి తడిసి పోయింది.

"గడ్డి పాడైపోతుందేమో" అన్నాడు.

"ఏం భయం లేదండయ్యా, కోతకి వాన మేటుకి ఎండ అన్నారు" అని ముసలాడు జవాబిచ్చేడు.

లేవిన్ గుర్రం యెక్కి వాస్తాకి యింటికి వెళ్లిపోయాడు.

కోజ్నిషెవ్ అప్పుడే లేస్తున్నాడు. లేవిన్ కాఫీ తాగేసి అన్నగారు బట్టలు వేసుకుని భోజనాల గదిలోకి రాకముందే, పచ్చికబీటికి తిరిగి వెళ్లిపోయాడు.

5

వాస్త్ర తర్వాత లేవిన్‌కి కోతగాళ్ల మధ్యలో స్థానం మారింది. తనని పరాచికాలాడుతూ పలకరించిన ముసలాడు యిప్పుడతన్ని తన పక్కకి రమ్మని పిలిచాడు. అటు పక్కన వో యువకుడు వున్నారు. అతనికి ఆకురాలు కాలంలో పెళ్లయింది. ఆ యువకుడికి కోత పని అదే మొదటి సారి. లేవిన్ ఆ యిద్దరికీ మధ్యలో ఉన్నాడు.

ముసలాయన వంగకుండా, స్థిరంగా ముందుకి పెద్ద అంగలతో వెళ్లేడు. అతని కాలి వేళ్లు బయటికి వున్నాయి. లయబద్ధంగా కచ్చితంగా వుండే కదలికలతో పని చేసేడు. నడుస్తూ వున్నప్పుడు చేతులు వూపడం కంటే యెక్కువ శ్రమ పడనట్టుగా, గడ్డిని యెత్తుగా వరసలో కూడా మేటు పడేటట్టు కొయ్యడం వొక పని లాగా కాకుండా పిల్లల ఆటలా అతను భావిస్తున్నట్టుగా వుంది. పదునుగా వున్న కత్తి వూటగం గడ్డిని అతని ప్రమేయం లేకుండా తనంత తనే సంయ్‌వ కోస్తూ పోతూ వున్నట్టుంది.

లేవిన్ వెనకాల నడుచు మిష్కా వున్నాడు. అతని ముఖం ముచ్చటగా ఉంది. జుట్టు మొహంమీద పడకుండా తాజా గడ్డిని మెలి తిప్పి నుదుటిమీద కట్టుకున్నాడు. అతను పడుతున్న శ్రమకి ముఖం కూడా ముడతలు పడుతోంది. కాని యెవళ్లేనా అతనికేసి చూసి నప్పుడు చిరునవ్వు ఆ ముఖంలో తొణికిసలాడేది. తను చేసే పని కష్టంగా వుంది అని వొప్పుకోవడం కంటే ప్రాణం యిచ్చెయ్యడమే మేలని అతను భావిస్తున్నట్టుగా వున్నాడు.

లేవిన్ ఆ యిదరి మధ్యా వున్నాడు. పగటి యెండ వేడిలో కూడా గడ్డికోత అతనికి కష్టం అనిపించలేదు. స్వేద రంధ్రాలనుండి వచ్చే చెమట శరీరానికి చల్లదనం కలిగించింది. వీపుమీదా, తలమీదా చొక్కా తుడుచుకున్న చేతిమీదా పడుతున్న యెండ అతనికి శక్తినీ, దృఢత్వాన్నీ కలిగించింది. తను యేం చేస్తున్నాడో ఆలోచించుకునే అవసరం లేని అచేతనా స్థితి క్షణాలు అతను తరచుగా అనుభవించేడు. కత్తి తన పనిని చేసుకుపోయింది. అని

మధుర క్షణాలు. వరసలు ముగిసిన చోట వున్న నది దగ్గరకు చేరే క్షణాలు మరీ మధురం అయ్యాయి. ఆ ముసలతను వో పిడికెడు తడి గడ్డిని తీసుకొని కత్తిని తుడిచి, వాదరని నీళ్లలో కడిగాడు. వరుస పెట్టేరాయి దాచే డబ్బాతో కాసిని నీళ్లు పట్టి లేవిన్‌కి అందించేడు.

"నా క్వాస్ యెలా వుందో చెప్పయ్యా, బాగుందేం" అని కళ్లు గీటుతూ అన్నాడు.

చిన్న గడ్డిపరకలు తేలుతూ యినప డబ్బా తుప్పు వాసనతో కలిసిన ఆ నును వెచ్చని నీటిలాంటి రుచికరమైన పాయసాన్ని తాగలేదని లేవిన్‌కి నిజానికి అనిపించింది. తర్వాత భుజం మీద పెట్టుకున్న కొంకిక్రర కత్తిమీద చెయ్యివేసి అతను ఉల్లాసంగా నడిచి వెళ్లేడు. అలా వెడుతూ నుదుటిమీద పట్టిన చెమటని తుడుచుకున్నాడు. గుండె నిండుగా గాలి పీల్చేడు. గడ్డికోతగాళ్ల దీర్ఘ పంక్తి పట్టుకుని అడివిలో, పొలాల్లో జరుగుతున్న వాటిని చూసుకుంటూ వెళ్లేడు.

లేవిన్ యెంత యెక్కువ సేపు గడ్డి కోస్తే, అంత యెక్కువగా ఆ విస్మృతి క్షణాలని అనుభవించేడు. అప్పుడు అతని చేతులు కత్తిని వూపేవి కావు. కత్తే చేతనత్వంతో, జీవత్వంతో నిండుగా తొణికిసలాడే అతని శరీరాన్ని తన వెనక తీసుకుపోయింది. యేదో యింద్రజాలం జరిగినట్టుగా, అసలు దాన్ని గురించి అనుకోకుండానే పని కచ్చితంగా, నవ్యంగా సాగిపోయింది. అవి మధురాతి మధుర క్షణాలు.

తమంతట తాము సాగిపోయే కదలికలని అతను తనకిగా ఆపవలసివచ్చినప్పుడు తన దృష్టిని పనిమీదకి మళ్లించవలసి వచ్చినప్పుడు పని కష్టం అనిపించేది. యేదేనా మిట్ట మీది గడ్డిని కొయ్యాల్సివచ్చినప్పుడు, కలుపు వున్న చోట కొయ్యాల్సి వచ్చినప్పుడు అలా జరిగేది. ముసలతను అలాంటి చోట్ల కూడ సునాయాసంగా పనిచేశాడు. మిట్టమీదకి వచ్చినప్పుడు అతను తన పద్ధతి మార్చేవాడు. వో సారి కత్తి మొనని, యింకో సారి కత్తి పిడి దగ్గరి భాగాన్ని అన్ని వేపులా చిన్నగా జపురుతూ కోశాడు. అలా చేస్తూ యెదర యేం వుందో జాగ్రత్తగా కనిపెట్టి చూసేవాడు. మధ్యమధ్యన ఓ మొక్కని యేరి నోట్లో వేసుకునేవాడు. లేదా లేవిన్‌కి యిచ్చేవాడు. ఒకోసారి కత్తి అంచుతో దారిలోనుంచి వో కొమ్మని యెత్తి విసిరేసేవాడు. వొకోసారి వో పురిడి పిట్ట గూడు చూపేవాడు. సరిగ్గా కత్తికిందనుంచి అందులో వున్న తల్లిపిట్ట యెగిరిపోయేది. ఓసారి దారిలో అడ్డం వచ్చే పాము తగిలింది. దాన్ని కత్తి అంచుతో పంగం క్రరతో యెత్తినట్టుగా యెత్తి లేవిన్‌కి చూపించి విసిరేశాడు.

లేవిన్‌కీ అతని వెనకాల వున్న పడుచతనికీ అలా కదలికల్ని మార్చుకోవడం కష్టం అయింది. ఇద్దరూ కూడా తమకిగా వో పద్ధతిని వొడుపుగా పట్టేసుకున్నారు. దాన్ని మార్చుకోవడం గాని, యెదర వస్తూ వున్నదాన్ని చూడ్డం గాని, ముమ్మరంగా తాము చేస్తూ వున్న పనినుంచి మళ్లి, చెయ్యడం సాధ్యం కాలేదు.

పొద్దు యెలా గడిచిందో లేవిన్ గమనించలేదు. యెంత సేపటిగా కోతకోస్తూ వున్నాడని గనక అడిగినట్టయితే వో అరగంటనుండి అని జవాబు చెప్పి వుండేవాడు, అప్పుడు

దాదాపు మధ్యాహ్నం భోజనాల వేళయినా. కోసిన గడ్డిమీదనుంచి వస్తూ వుండగా ముసలతను శేవిన్ దృష్టిని కొంతమంది అబ్బాయిలమీదకీ, అమ్మాయిలమీదకీ మళ్లించేడు. గడ్డి నిటారుగా వుండడంవల్ల వాళ్ళు కనిపించడం లేదు. వాళ్ళు అన్ని వేపులనుంచీ గడ్డి కోతగాండ్ర దగ్గరికి వస్తున్నారు. రొట్టెలు రుమాళ్లల్లో కట్టి పట్టుకు వస్తూ వుండడం వల్లా, గుడ్డంతో బిరడాలు బిగించిన క్వాస్ కూజాలు కూడా మోస్తూ వుండడం వల్లా బరువుకి వాళ్ల చేతులు దిగలాక్కుని వున్నాయి.

"మన పిల్లకాయలు వస్తున్నారు" అని ముసలతను వాళ్లకేసి చూపిస్తూ అన్నాడు. చేతిని కళ్లకి అడ్డం పెట్టుకుని సూర్యుడికేసి చూశాడు.

మరో రెండు వరసలయాక ముసలతను ఆగేడు.

"కడుపులో కామన్నని బుజ్జగించే వేళయిందయ్యా" అన్నాడు నిక్కచ్చిగా. గడ్డికోత గాళ్లు నది వొడ్డుదాకా వెళ్లి, కోసిన వరసలమీదనుంచి దాటుకుంటూ తమ తమ కోట్లున్న చోటికి వెళ్లారు. అక్కడ వాళ్ల పిల్లలు భోజనాలు తెచ్చి యెదురుచూస్తూ వున్నారు. వాళ్ళు గుంపులు గుంపులుగా బళ్లకిందా, విల్లో గుబురు కిందా చేరారు. వాటిమీద నీడకోసమని చెప్పి గడ్డి పరిచారు.

శేవిన్ విల్లో గుబురుకింద కూచున్న వో బృందంతో చేరాడు. యింటికి వెళ్లాలని అతనికి అనిపించలేదు.

యజమాని వున్నాడనే బెరుకు రైతులకి యెప్పుడో పోయింది. వాళ్ళు భోజనాలకి కూర్చు న్నారు. కొంతమంది కాళ్లూ చేతులూ కడుక్కున్నారు. పడుచువాళ్లు కొందరు నదిలో స్నానాలు చేశారు. కొంతమంది విశ్రాంతి తీసుకోవడానికి సుఖమైన యేర్పాట్లు చేసుకున్నారు. అందరూ మూటలు విప్పి, క్వాస్ కూజాలు తెరిచారు.

ముసలతను వో దాబరాగిన్నెలోకి కొంచెం రొట్టె చిదిపాడు. చెంచాకాడతో దాన్ని నలి పేడు. పదును రాయి పెట్టుకునే డబ్బాలో అందులో నీళ్లు పోశాడు. మరింత రొట్టె చిదిపి, దాంట్లో ఉప్పువేసి, తూర్పు దిక్కుకి తిరిగి యేదో ప్రార్థన చేసుకున్నాడు.

"యిదిగో నయ్యా మా వంటకం" అన్నాడు. దాబరాగిన్నె పక్కన మోకాళ్లమీద వాలి కూర్చున్నాడు.

అది చాలా రుచిగా వుంది. దాంతో శేవిన్ భోజనానికి యింటికి వెళ్లే ఆలోచనని మార్చు కున్నాడు. ఆ ముసలతనితో కలిసి భోజనం చేశాడు. అతని గృహ వ్యవహారాల గురించి ముచ్చ టించేడు. వాటి పట్ల ఆసక్తి ప్రదర్శించేడు. అతనికి తన వ్యవహారాల గురించి చెప్పేడు. అతనికి ఆసక్తికరంగా కనిపించిన వాటన్నిటి గురించి చెప్పేడు. అన్నగారి కంటే యీ ముస లతను తనకి దగ్గరైనట్టుగా అతనికి అనిపించింది. ఆ మృదువైన అనుభూతి తనకి తెలియ కుండానే చిరునవ్వులో ప్రతిఫలించింది. ముసలతను లేచి, మరోసారి ప్రార్థన చేసి, నందెడు గడ్డి తీసుకొని తలగడలాగా పెట్టుకుని చెట్టుకింద చేరాడు. శేవిన్ కూడా అలానే

చేశాడు. యీగలు, నుసుములు చెమట కక్కుతున్న తన ముఖంమీద, శరీరంమీద గిలిగింతలు పెడుతూ వున్నాగానీ, నడుం వాలుస్తూనే అతనికి నిద్రపట్టేసింది. సూర్యుడు పొదకి అటువేపు వాలి, అతని ముఖంమీద యెండ పడినప్పుడు అతనికి మెలకువ వచ్చింది. మునం తను అంతకు ముందే లేచాడు. పడుచువాళ్ళు కోతకత్తులని పదును పెడుతున్నాడు.

లేవిన్ చుట్టూ చూశాడు. కాని ఆ తావుని గుర్తించలేకపోయాడు. అంతలా అదంతా మారిపోయింది. విశాలమైన పచ్చికబీడులో యెక్కువ భాగం కోత పూర్తయింది. సువాసన లీనే గడ్డి వరసలు యేటవాలుగా పడుతున్న యెండలో నూతన, విశేష శోభతో మెరిశాయి. నది వొడ్డున వున్న పొదలు, అప్పటి దాకా దృష్టి పథంలోకి రాకుండా వున్న నదీ – అది యిప్పుడు వంపులతో తళతళ మెరుస్తూ వుంది – విశ్రాంతి తర్వాత లేచి తిరుగుతూ వున్న కోతవాళ్ళు, కోసిన వారే గోడలా లేచిన గడ్డి, గడ్డికోత పూర్తయిన పచ్చికబీటిపైన చక్కర్లు కొట్టే డేగలు, అన్నీ కొత్తగా కనిపించాయి. బాగా మెలకువ వచ్చేక యెంత కోత అయిందీ, యింకా యెంత ఆ రోజున కొయ్యవచ్చో అని లేవిన్ గుణించుకోవడం మొదలుపెట్టాడు.

కోతవాళ్ళు నలభై రెండు మందేనని దృష్టిలో పెట్టుకుంటే కోత చాల యెక్కువే అయినట్టు లెక్క. అంత పెద్ద పచ్చికబీటి గడ్డి కొయ్యడానికి పూర్వం రోజుల్లో ముప్పై మంది భూస్వామ్యదాసులకి రెండు రోజులు పట్టేది. అలాంటిది యిప్పుడు దాదాపు అయిపో వచ్చింది. యేవో కొన్ని మూలలు మాత్రం చిన్న చిన్న వరసలతో మిగిలాయి. కాని ఆ రోజు వీలైనంత మేరకు పూర్తి చేసెయ్యాలని లేవిన్‌కి ఆతృతగా వుంది. అందుచేత పొద్దు గబగబా వాలిపోతూ వుండడంతో అయ్యో అనుకుంటున్నాడు. అతనికి యే మాత్రమూ అలుపనిపించడం లేదు. యెంత గబగబా వీలైతే అంత గబగబా పని చెయ్యాలని మాత్రమే అతను అనుకున్నాడు.

"యేం? యివాళ మాష్కిన్ గుట్టం దాకా కోత పూర్తి చెయ్యగలమా?" అని మునం తన్ని అడిగాడు.

"దేవుడి సంకల్పం వుంటే, పొద్దేమో వాలిపోతుంది. కుర్రాళ్ళకి కొంచెం వోద్కా యేమన్నా ముడుతుందా?"

మళ్ళీ పని చేసి తిండి తిన్నాక పొగాకు అలవాటు ఉన్నవాళ్ళు పైప్‌లని తీశారు. మునం తను "అబ్బాయిలూ, మనమీ పూట మాష్కిన్ గుట్టందాకా కోసి చూపిస్తే అయ్యగారు వోద్కా యిప్పిస్తారు" అని అన్నాడు.

"కోసి చూపిస్తే! యేమిటది! తీత్, వూఁ, నడిపించు! వేగంగా! రాత్రి పొట్టనిండా పెట్టించు! నడిపించు!" అంటూ అన్ని వేపులనుంచీ కోతవాళ్ళు మిగిలిన రొట్టె తునకలు నోట్లో కుక్కుకుంటూ అరిచారు.

"అయితే, కుర్రాళ్ళూ, వెన్ను చూపించకండి" అని తీత్ అరిచి దాదాపు పరిగెత్తుతూ వరస మొదలెట్టేడు.

"వూఁ, కానియ్యండి గబగబా!" అని ముసలతను తొందర పెట్టేడు. తీత్, తనూ వాళ్ళని అందుకున్నారు. "జాగ్రత్త! నిన్ను కోసేస్తాను" అన్నాడు.

ముసలాళ్ళూ, పడుచువాళ్ళూ ఒకళ్లనొకళ్ళు ఓడించెయ్యాలని పోటాపోటీమీద పని చేశారు. తను హడావుడి పడుతూ పనిచేస్తున్నా గాని గడ్డిని బాగానే కోశేడు. చక్కగా వరసలుగా పేర్చుకుంటూనే పని చేశాడు. అయిదు నిమిషాల్లో మిగిలిన చిన్న మూలలు పూర్తయి పోయాయి. వెనక్కాల గడ్డి కోస్తూ వున్నవాళ్ళు తమ వరసలు పూర్తి చేసే వేళకి ముందర వున్న వాళ్ళు కోట్లు భుజాలమీద వేసుకుని రోడ్డు దాటుకుని మాష్కిన్ గుట్టం వేపు వెళ్లిపోతున్నారు. వాళ్ళ మాష్కిన్ గుట్టం పొదల చరియల్లోకి ఆకురాయి డబ్బాలు చప్పుడు చేసుకుంటూ వెళ్లేవేళకి సూర్యుడు చెట్ల ఊరాల వెనక మణిగాడు. పల్లం మధ్యలో గడ్డి మొలిదాకా వుంది. మెత్తగా, మృదువుగా, వెడల్పాటి పరకతో వుంది. అక్కడక్కడ రంగురంగుల పువ్వులు మెరుస్తున్నాయి.

నిలువునా కోద్దామా, అడ్డంగా కోద్దామా అని కాసేపు తర్కించుకున్నాక ప్రోఖర్ యెర్మీలిచ్ ముందు నడిపించాడు. అతను కూడ పేరున్న కోతగాడు. మనిషి భారీగా నల్లగా వుంటాడు. అతను ఓ వరస కోసేసి వెనక్కి తిరిగి వచ్చి, మళ్లీ కోత మొదలెట్టాడు. మిగిలిన అందరూ చరియ పైనుంచి కింద దాకా కోసుకుంటూ అడివి అంచున యెదురు గుండా వున్న మిట్టవేపు వెనకాల వచ్చేరు. సూర్యుడు అడివి గుబుర్ల వెనక వాలేడు. సాయంత్రం తుషారం మొదలైంది. గుట్టమీద వాళ్ళు మాత్రం యెండలో వున్నారు. కింద పొగమంచు లేస్తూ వున్న చోట పనిచేసే వాళ్ళు, అలాగే అవతలి వేపున వున్న వాళ్ళూ చల్లని తుషార ఛాయలో సాగుతున్నారు. పని మాంచి జోరుగా సాగింది.

గడ్డి లయాన్వితంగా కోత పడుతుంది. చక్కటి సుగంధాలీనుతుంది. యెత్తైన వరసలుగా పడుతోంది. చిన్న వరసలున్న ఆ బీటిమీద పనివాళ్ళు ఒకళ్లకొకళ్ళు హుషారిచ్చుకుంటూ పని చేసుకుపోతున్నారు. వాళ్ల ఆకురాయి డబ్బాలు చప్పుడు చేస్తున్నాయి. మధ్యమధ్య ఒకళ్ల కోతకత్తులు మరొకళ్ల కోతకత్తులని తకాతకామని ఢీ కొంటున్నాయి. పదును పెడుతూన్న చప్పుళ్ళు వినిపించాయి.

లేవిన్ మళ్లీ ముసలతనికీ, పడుచతనికీ మధ్య తేలాడు. ముసలతను గొర్రెతోలు కోటు తొడుక్కున్నాడు. యెప్పటి లాగానే చాలా హుషారుగా, పరిహాసాలాడుతూ చురుగ్గా వున్నాడు. అడివి పొదల్లో గుబురుగా వున్న గడ్డిలో వాళ్లకి పుట్టగొడుగులు బాగా కనిపించేయి. వాటిలో చాలా భాగం కత్తులకి యెర అయిపోయేవి. కాని ముసలతనికి పుట్టగొడుగులు తగిలినప్పుడల్లా అతను వొంగి, యెత్తి, "ముసల్దానికి ఫలహారం దొరికింది" అంటూ చొక్కా జేబులో వేసుకునే వాడు.

తడిసి మెత్తగా వున్న గడ్డిని కొయ్యడం సునాయాసంగానే వుంది కాని, నిటారుగా వున్న కొండ చరియమీద కిందికీ పైకీ దిగడం, యెక్కడం కష్టంగా వుంది. అయినా

కూడా ముసలాయన హుషారు తగ్గలేదు. కోతకత్తిని ముందటి లాగానే మహాయానంగా ఆడిస్తూ, పెద్దపెద్ద వార బూట్లతో మెల్లిగా, దృఢంగా అడుగులు వేస్తూ మిట్టమీదకి సాగేరు. లాగులు దిగలాక్కుపోయి చొక్కా పైకి వచ్చేసినట్టుంది. అతని శరీరం, అతను తొడుక్కున్న లాగూ శ్రమతో కంపిస్తున్నట్టుంది. అయినా అతను చొక్క గడ్డి పరకని వదల్లేదు. ఒక్క పుట్టగొడుగుని వదంలేదు. లేవిన్‌తోనూ, మిగిలిన వాళ్లతోనూ వేళా కోళాలు ఆడుతూనే ఉన్నాడు. అతని వెనకాలే వెడుతూ వుంటే కత్తితో పహా చరియలో పడిపోతానేమో ననిపించింది లేవిన్‌కి. కోతకత్తి లేకుండా కూడా అక్కడకు వెళ్లడం కష్టంగా వుంది. కాని అతను ముందుకి సాగుతూనే వున్నాడు. గడ్డిని కోస్తూనే వున్నాడు. యేదో బాహ్యశక్తి అతన్ని నడిపిస్తున్నట్టుగా వుంది.

6

మాష్కిన్ గుట్టంపైన కోత పూర్తి చేశారు. ఆఖరి వరుసలు పూర్తి అయేక వాళ్ళు కోట్లు తొడుక్కుని హుషారుగా యిళ్లకి వెళ్లారు. లేవిన్ గుర్రం యెక్కి అయిష్టంగా రైతుల దగ్గర సెలవు తీసుకొని యింటికి బయల్దేరాడు. మిట్టపైనుంచి వెనక్కి చూశాడు. దట్టమైన పొగమంచువల్ల యెవళ్ళూ కంటికి కానరావడం లేదు. కాని వాళ్ల హుషారైన గొంతుకలు, నవ్వులు, కత్తుల చప్పుళ్ళు విన వచ్చేయి.

లేవిన్ అన్నగారి గదిలోకి వెళ్లేటప్పటికి కోజ్నిషెవ్ భోజనం చేసి మంచు ముక్కలు వేసిన నిమ్మరసం చప్పరిస్తున్నాడు. పోస్టులో అప్పుడే వచ్చిన పత్రికల్ని, సంచికల్ని తిరగేస్తున్నాడు. లేవిన్ గొంతుక హుషారుగా వుంది. అతని జుట్టు రేగిపోయి చెమటకి తడిసిన నుదుటికి అంటుకు పోయింది. మాసిపోయిన చొక్కా వీపుకీ ఛాతీకీ అతుక్కుపోయింది.

"మొత్తం పచ్చికబీడు నంతట్నీ కోసేశాం! యెంత బ్రహ్మాండంగా వుంది, యెంత హుషారుగా వుంది" అన్నాడు లేవిన్. ముందురోజు జరిగిన అప్రియమైన సంభాషణ అసలు గుర్తే లేదు అతనికి.

"అరె బాప్‌రే! యెలా వున్నావో చూడు" అన్నాడు కోజ్నిషెవ్. తమ్ముణ్ని చూసిన వెంటనే అతనికి అసంతృప్తి కలిగింది. "తలుపు! తలుపు! తలుపు మూసెయ్యి! అప్పుడే టోలెడు లోపలికి వచ్చేసాయి" అని అరిచాడు.

కోజ్నిషెవ్‌కి యీగలంటే చిరాకు. రాత్రిళ్లప్పుడు గదిలో కిటికీ తలుపులు మాత్రం తెరిచే వుంచేవాడు. తలుపు మాత్రం వేసేసేవాడు.

"ఒట్టు, ఒక్కటి కూడా రాలేదు. యే ఒక్కటి దూరి వచ్చినా నేను పట్టుకుంటాను. అబ్బ, యెంత హుషారుగా వుందో పని, నువ్వు వూహించలేవు. వూఁ, రోజంతా యెలా గడిచింది?" అని, అడిగాడు.

"దివ్యంగా. కాని నిజంగా రోజంతా గడ్డి కోస్తూనే వున్నావా? నీ కడుపులో కాకులు గంతులేస్తూ వుండాలే. కుజ్మా నీ కోసం వంట చేసాడు."

"నాకు పెనరు ఆకలిగా లేదు. నేనక్కడే తినేశాను. కాని వెళ్ళి ముఖం చేతులూ కడుక్కుని వస్తాను."

"వెళ్ళు, వెళ్ళు. నేను నీ దగ్గరికి వస్తాను" అని కోజ్నిషెవ్ తమ్ముడికేసి చూసి తల వూపుతూ అన్నాడు. "వూఁ, కానీ" అన్నాడు చిరునవ్వు నవ్వుతూ. పేపర్లు కూడా సర్ది పెట్టుకున్నాడు. వున్నట్టుండి ఆయనకి కూడా ఉత్సాహం వచ్చింది. తమ్ముణ్ణి వదిలిపెట్టే బుద్ధి పుట్టింది కాదు. "వాన కురిసినప్పుడు యెక్కడ వున్నావ్?" అన్నాడు.

"వానా? పూరికే నాలుగు పాడి చినుకులు. నేనిప్పుడే వస్తాను. అయితే యీ రోజు కాలక్షేపం బాగానే అయిందన్నమాట. బాగుంది." అంటూ లేవిన్ బట్టలు మార్చుకోడానికి హడావుడిగా వెళ్ళిపోయాడు.

అయిదు నిమిషాల తర్వాత అన్నదమ్ములిద్దరూ భోజనాల గదిలో కలుసుకున్నారు. లేవిన్ తనకి ఆకలి లేదని అన్నా, కుజ్మా సంతృప్తి కోసం టేబిల్ దగ్గర చేరినా, భోజనం చెయ్యడం మొదలుపెట్టాక బాగా రుచిగా అనిపించింది. కోజ్నిషెవ్ చిరునవ్వు నవ్వుతూ లేవిన్‌కేసి చూశేడు.

"చెప్పడం మరిచేను. నీకో ఉత్తరం వచ్చింది. కుజ్మా, కొంచెం ఆ ఉత్తరం తెచ్చిపెట్టు. జాగ్రత్త తలుపులు వెయ్యి" అన్నాడు.

అది అబ్లాన్‌స్కీ రాసిన ఉత్తరం. లేవిన్ పైకే చదివాడు. అబ్లాన్‌స్కీ పీటర్స్‌బర్గ్ నుంచి రాశాడు: 'నాకు దాలీ దగ్గర నుంచి ఉత్తరం వచ్చింది. ఆమె యెర్గుషోవోలో వుంది. అక్కడ పరిస్థితులు సవ్యంగా వున్నట్టు లేవు. కొంచెం శ్రమ అనుకోకుండా ఆమె దగ్గరికి వెళ్ళి యెలా వున్నారో చూసి అవసరమైన సలహాలు యియ్యి. నే చెప్పక్కరలేదు. నీకు అన్నీ తెలుసు. నిన్ను చూసి సంబర పడుతుంది. పాపం వొక్కత్తే వుంది. మా అత్తగారూ, మిగిలిన అందరూ యింకా విదేశాల్లో వున్నారు.'

"బాగుంది, తప్పకుండా వెళ్ళి చూసివస్తాను" అన్నాడు లేవిన్. "యేం వస్తావా? దాలీ సరదా అయింది కదా?" అని అడిగేడు.

"యిక్కడికి బాగా దూరమా?"

"ఓ నలభై అయిదు కిలోమీటర్లు వుంటుంది. తప్పితే అరవై. కాని దారి బాగుంటుంది. బండి హాయిగా వెడుతుంది."

"అయితే బాగుంటుంది" అన్నాడు కోజ్నిషెవ్ యింకా చిరునవ్వు నవ్వుతూ.

తమ్ముడి ఉత్సాహంతో ఆయనకీ ఉత్సాహం వచ్చింది.

"చూడు, ఆకలి లేదన్నావ్!" అని యెండకి కమిలిన ముఖం, మెడ లేవిన్ ప్లేటు మీద వొంచినప్పుడు చూసి అన్నాడు.

"అమోఘం! అలాంటి శ్రమ యెంత సకల రోగనివారిణో నీకు తెలీదు. వైద్యశాస్త్రానికి కొత్త శబ్దం యిచ్చి పరిపుష్టం చేస్తాను. Arbeitscur[1]" అన్నాడు.

"నీకు అలాంటి చికిత్స అవసరం లేదనుకుంటాను."

"నాక్కాదు, నరాల జబ్బులున్నవాళ్ళకి."

"ప్రయత్నం చేసి చూడాలి. నీ గడ్డికోత పని యెలా వుంటుందో వచ్చి చూద్దా మనుకున్నాను. కాని యెండ బాగా యెక్కువగా వుండడంతో అడివి దుబ్బులు దాటి రాలేక పోయాను. కాసేపు అక్కడ చతికిలబడి అడివిలోనుంచి నడుచుకుంటూ గ్రామంలోకి వెళ్లాను. దారిలో మీ దాది కనిపించింది. రైతులు నిన్ను గురించి యేమనుకుంటూ వుంటారని అడిగాను. వాళ్ళు నువ్వు చేస్తున్న పన్ని మెచ్చుకోవడం లేదనే అనిపిస్తోంది. 'అది గొప్పింటి వాళ్ల పని కాద'ని ఆమె అంది. 'గొప్పింటివాళ్ల' పని అని వాళ్ళు పిలిచేదానికి సంబంధించి రైతులకి కచ్చితమైన అభిప్రాయం వున్నట్టుంది. వాళ్ళ హద్దు అని భావించే దాన్ని దాటి గొప్పింటి వాళ్ళు రావడం వాళ్ళకి సరిపడదు."

"కావచ్చు, అయినా నాకు యింత సంతోషం జీవితంలో యెన్నడూ కలగలేదు. పైగా యిందులో తప్పేమీ లేదు, వుందా? వాళ్లకి సరిపడకపోతే నేనేం చెయ్యను? అది నా దృష్టిలో చెడ్డది కాదు, యేం?" అన్నాడు.

"మొత్తంమీద యివాళ నువ్వు తృప్తిగా గడిపినట్టు కనిపిస్తోంది" అన్నాడు కోజ్నిషెవ్.

"అలాగా యిలాగానా? మొత్తం పచ్చికబీట్నంతట్నీ కోసేశాం. యెలాంటి ముసలాడితో దోస్తీ కుదిరింది! అతనెంత భేష్నైనవాడో వూహించలేవు."

"అయితే నీకివాళ తృప్తిగా గడిచింది. నాకూ అంతే. మొదటగా నేను రెండు చదరంగం చిక్కులు సాధించేను. వాటిల్లో ఒకటి భలే సరదా అయింది. బంటుతో మొదలెట్టడం. అది నీకు చూపిస్తా. తర్వాత నిన్న జరిగిన సంభాషణ గురించి ఆలోచించాను."

"నిన్న జరిగిన సంభాషణా?" అని లేవిన్ ప్రఫుల్లంగా కళ్ళు ముడిచి అన్నాడు. భోజనం తర్వాత తృప్తిగా తేనుస్తూ, వాళ్ళు దేన్ని గురించి మాట్లాడుకున్నారో గుర్తుకే తెచ్చుకోలేక పోయాడు.

"నువ్వన్నది వో మేరకి వొప్పే. నువ్వు వ్యక్తిగత ప్రయోజనాలే అసలు చోదక శక్తి అంటావు. ఓ మాదిరి సంస్కారవంతుడైన ప్రతివాడూ ప్రజాహితం పట్ల మొగ్గు చూపించాలని నేనంటాను. అక్కడే మనిద్దరికీ అభిప్రాయభేదం వచ్చింది. ఓ రకంగా నువ్వు వొప్పే. ప్రజాహిత కార్యక్రమాల్లో భౌతిక ఆసక్తంతో జనం పాల్గొంటే మెరుగే అనడం మేరకి. మొత్తంమీద నువ్వు స్వభావ సిద్ధంగా ఫ్రెంచివాళ్లన్నట్టు prime-sautière[2],

---

[1] శ్రమద్వారా చికిత్స (జర్మన్).

[2] ఆవేశవంతం (ఫ్రెంచి).

నువ్వు మంచి జోరుగా ఉత్సాహంతో పనిచెయ్యాల నుకుంటావ్. లేదా అసలు లేదు."

లేవిన్ అన్నగారి మాటలు వింటున్నాడే గాని, యేమీ అతనికి బోధ పడలేదు, బోధ పర్చుకోదల్చుకోలేదు. అన్నగారు యేదన్నా అడుగుతాడేమో, తను ఆయన చెప్పేదాన్ని వినడం లేదని వెల్లడైపోతుందేమోనని భయపడ్డాడు.

"అదీ, అబ్బాయ్, సంగతి" అని కోజ్నిషెవ్ అతని భుజం తడుతూ అన్నాడు.

"ఆఁ, అవునవును. నేను నా మాటమీద రొక్కించను" అని లేవిన్ తప్పు చేసిన కుర్రాడిలాగా నవ్వేడు. 'అసలే విషయం గురించి వాదించుకున్నాం? నేనూ నా మేరకు వొప్పే, ఆయనా ఆయన మేరకు వొప్పే. అన్నీ సవ్యంగానే వున్నాయి. కాని ఆఫీసుగదికి వెళ్ళి యేం చెయ్యాల్సివుందో చూసుకోవాలి' అని తనలో తను అనుకున్నాడు. లేచి, వొళ్ళు విరుచుకుని, చిరునవ్వు నవ్వేడు.

కోజ్నిషెవ్ కూడ చిరునవ్వు నవ్వేడు.

"కావాలంటే పద వెళ్దాం" అన్నాడు. తమ్ముడు వెళ్ళిపోవడం ఆయనకి యిష్టంగా లేదు. అతను ఉత్సాహాన్నీ, స్ఫూర్తినీ ఉద్దీప్తం చేశాడు. "పద, కావాలంటే ఆఫీసు గది దగ్గర ఆగుదాంలే" అన్నాడు.

"అయ్యో, దేముడా!" అని లేవిన్ అరిచాడు. యెంత గట్టిగా అరిచాడంటే అన్నగారికి భయం కలిగింది.

"యేమిటి సంగతి?"

"అగాఫ్యా మిహైలొవ్నా చెయ్యి! అసలా సంగతే మర్చిపోయాను" అని నొచ్చుకుంటు న్నట్టు లేవిన్ అన్నాడు.

"యిప్పుడు బాగా మెరుగు."

"అయినా వోసారి వెళ్ళి చూసి వస్తాను. నువ్వు టోపీ పెట్టుకునే లోపున వచ్చేస్తా."

మేడ మెట్లమీదనుంచి అతను రయ్యిన దిగుతూవుంటే టకటక మడమలు చప్పుడు చేశాయి.

7

అబ్లాన్‌స్కీ సర్కారు అధికార్లందరికీ బాగా పరిచితమైన కర్తవ్యాన్ని పరిపూర్తి చెయ్యడానికి పీటర్స్‌బుర్గ్ వెళ్ళాడు. అది చాలా స్వాభావికమూ, అవసరమూనూ. పైవాళ్ళకి అది అర్థం కాదు. అలాగే సర్కారు అధికార్లు ఆ కర్తవ్యాన్ని చులకనగా చూసి తమ నౌకరీల్లో వుండడమూ సాధ్యం కాదు. అదేమిటీ అంటే సచివాలయంలో తమ వునికిని గురించి గుర్తు చెయ్యడం. ఈ కర్తవ్య పరిపూర్తి నిమిత్తం అబ్లాన్‌స్కీ యింట్లో వున్న సొమ్మునంతటినీ కూడా పట్టుకుపోయాడు. దాచాల్లో మిత్రులతో మజా చేస్తూ గుర్రప్పందేల దగ్గర విహో

దీన్నా గడిపేడు. సరిగ్గా ఆ సమయంలో ఖర్చు వెచ్చాలు తగ్గించుకోవడం కోసం దాలీ పిల్లల్ని తీసుకుని పల్లెటూరికి వెళ్లింది. దాలీ తనకి కట్నంగా యిచ్చిన యెర్గుషొవొ గ్రామం వెళ్లింది. అక్కడి కలవనే వసంత ఋతువులో అమ్మేరు. లేవిన్ పాక్రోవ్‌స్కొయె ఎస్టేట్‌కి యాభై కిలోమీటర్ల దూరంలో వుందా వూరు.

యెర్గుషొవొలో వున్న పురాతన హవేలి యెప్పుడో కూలిపోయింది. దాలీ తండ్రి చిన్న యింటిని బాగు చేయించి పెద్దది చేశాడు. యిరవై యేళ్ల నాడు దాలీ చిన్నపిల్లగా వున్నప్పుడు ఆ చిన్న యిల్లు పెద్దదిగా సౌకర్యంగా ఉండేది. అలాంటి యిళ్లన్నింటిలాగానే దక్షిణ ముఖంగా బండిదారికి యెదురుగ్గా కాకుండా పక్కలకి వుండిదా. ఏమైనా అది యిప్పుడు పాతదైపోయి శిథిలావస్థలో వుంది. వసంత ఋతువులో అబ్లాన్‌స్కీ అక్కడి కలప అమ్మడానికి వచ్చినప్పుడు యిల్లెలా వుందో చూసి అవసరమైన మరమ్మత్తులు చేయించమని దాలీ చెప్పింది. తప్పుచేసిన భర్తలందరి లాగానే అబ్లాన్‌స్కీ కూడా భార్య సుఖసంతోషాల విషయమై మహా శ్రద్ధ చూపించే వాడై స్వయంగా యింటినంతట్నీ చూసి తనకి అవసరం అని తోచిన మార్పులన్నింట్నీ చేయించమని పురమాయింపులు చేశాడు. ఫర్నిచర్‌కి ప్రింటెడ్ క్లాత్ కప్పించాలి, తెరలు కట్టించాలి, తోటని శుభ్రం చేయించాలి, పువ్వులని పెంచాలి, చెరువు దగ్గర వంతెన కట్టించాలి. కాని అతను యింకా బోలెడు ముఖ్యమైన విషయాలని గురించి పట్టించుకోలేదు. ఆ పట్టించుకోక పోవడం దాలీకి గొప్ప చిక్కులు తెచ్చి పెట్టింది.

యెంతో శ్రద్ధ పట్టే భర్తగా, తండ్రిగా వుండాలని తను యెంత ప్రయత్నించినాగానీ తనకి వో భార్యా, బిడ్డలూ వున్నారన్న విషయమే అబ్లాన్‌స్కీకి గుర్తు వుండేది కాదు. అతనివన్నీ బ్రహ్మచారి అభిరుచులు, అతన్ని అదుపుచేసేవన్నీ అవే. మాస్కోకి తిరిగి వెళ్లి అన్నీ సవ్యంగా జరిపించానని భార్యకి బోరవిరుచుకుని చాటేడు. ఇల్లు అద్దంలా వుందని చెప్పేడు. ఆమె వెళ్లి అక్కడ హాయిగా వుండచ్చనేదీ, తన అభిప్రాయం అని అన్నాడు. భార్య పల్లెటూరికి వెళ్లడం అతని దృష్టిలో అన్ని విధాలా అనుకూలం. పిల్లల ఆరోగ్యానికి మంచిది, ఖర్చులా తగ్గుతాయి. యిక తనకా కావలిసినంత స్వేచ్ఛ. దాలీ పిల్లల కోసమని చెప్పి యిందుకు వొప్పుకుంది. ముఖ్యంగా స్కార్‌లెట్ ఫీవర్ వచ్చిన పిల్ల కోసం. ఆ పిల్ల పూర్తిగా కోలుకోలేదు యింకా. పైగా పల్లెటూరి యింటికి వెడితే తనకి తలవంపులు తెప్పించే చిన్నా చితకా గొడవలు కూడ ఉండవు. చెప్పులు కుట్టేవాడికి, చేపలు అమ్మినవాడికి, వంట చెరకు సరఫరా చేసినవాడికి చెల్లించాల్సిన సొమ్ము గొడవల్లాంటివి. పైగా చెల్లెలు కిట్టీ వేసవి కాలం మధ్యలో విదేశాలనుంచి తిరిగి వస్తుంది. ఆమె నదీ స్నానాలు చెయ్యాలన్చెప్పి డాక్టర్లు సిఫార్సు చేశారు. అందుకని ఆమె వచ్చి తనతో వుంటుందని దాలీ ఆశించింది. ఆ కారణంవల్ల కూడా పల్లెటూరికి మారడం బాగుంటుందని అనిపించింది దాలీకి. బాల్య స్మృతులు పెనవేసుకు

పోయి తమ యిద్దరికీ ప్రియం అయిన యిర్గుషేహోలో వేసవి గడవడం కంటె తనకి యెక్కువ హాయినిచ్చేది యేదీ లేదని కిట్టీ విదేశాలనుంచి రాసింది.

మొదట్లో దాలీకి పల్లెటూళ్లో మహా యాతనైపోయింది. ఆమె పల్లెటూళ్లో చిన్న ప్పుడెప్పుడో వుంది. ఆమె మనస్సులో పల్లెటూరి గురించి పడిపోయిన ముద్ర యెలాంటిదంటే బస్తీ బ్రతుకు యిబ్బందులన్నిటినుంచీ పారిపోయి శరణు వేడుకోగల చోటు అది. పల్లె టూరి బతుకులో బస్తీ వాసపు వాజాకుతనం లేకపోవచ్చు. (యీ విషయాన్ని దాలీ సునా యాసంగా వొప్పేసుకుంటుంది) గాని యేమైనా అక్కడ చవకగా సౌకర్యంగా వుంటుంది. అన్ని వస్తువులూ చవకగా అక్కడ దొరుకుతాయి. పిల్లలకి అంతకంటే మంచి చోటు వుండదు. కాని యింటి యజమానురాలిగా పల్లెటూరికి వచ్చి చూసేటప్పటికి తను వూహించుకున్నట్టుగా పరిస్థితులు లేవని ఆమెకి కనిపించింది.

పల్లెకి వచ్చిన మర్నాడే కుండపోతగా వాన కురిసింది. పిల్లల గదిలో హాలులో బాగా కురిసింది. మంచాలన్నింటినీ డ్రాయింగు రూమ్‌లోకి మార్చాల్సి వచ్చింది. నౌకర్లకి వంటమనిషి లేదు. వున్న తొమ్మిది ఆవుల్లోనూ కొన్ని చూడివనీ, కొన్ని అప్పుడే యీనేయనీ, కొన్ని ముసలి వనీ, మరి కొన్ని గొడ్డు పోయేయనీ పశువుల్ని కాసే ఆడమనిషి చెప్పింది. యిక వున్న పాలూ, వెన్నా పిల్లలకి కూడా చాలవు. కోడిగుడ్ల సంగతి సరేసరి. లేత కోడిపెట్టలు లేవు. చర్మం నీలి రంగు తిరిగిపోయిన ముసలి ముదురు కోళ్లనే వుడకబెట్టీ, వేయించుకునీ తిన్నారు. ఇల్లూ వాకిలీ కడగడానికి ఆడమనిషి దొరకలేదు. యేమంటే అంతా బంగాళ దుంప మొక్కల నాట్లకి పోయారట. షికారు వెళ్లడానికీ లేకపోయింది. ఓ గుర్రం పొగరు మోతుగా వుండి బండి కట్టుకి రాకుండా మొరాయించింది. పోనీ నదిలో స్నానం చేద్దామా అంటే పశువుల్నీ వొడ్డుని తొక్కేసి బురద చేసేసాయి. పైగా అది రోడ్డు కేసి వుంది. తోటలో షికారుకి వెడదామన్నా లేకపోయింది. యేమంటే కంచె కంతల్లోనుంచి పశువులు లోపలికి వచ్చేవి. వాటిల్లో ఉగ్రంగా కనిపించే వో ఆంబోతు కూడ వుండేది. అది బంయ్యిన రంకె వేసేది. దాన్ని చూస్తే కుమ్మే సేటట్టుండేది. బట్టలు పెట్టుకోవడానికి బీరువాలు లేవు. ఆ వున్న వాటికి తలుపులు పడేవి కాదు. వాకవేళ పడ్డా, యెవళ్లైనా అటు వెళ్లినప్పుడు వాటంతట అవే తెరుచుకునేవి. పొగడులో కళ్ళులని యెగదన దోచుకునే యినపకోలలు లేవు. బట్టలు వుతుక్కునే బాయిలర్ లేదు. పనిమనిషి గదిలో బట్టలు యిస్త్రీ చేసేందుకు బల్లా లేదు.

యేదో యింత విశ్రాంతిగా, సుఖంగా వుండచ్చు కదా అనుకున్న దాలీకి యీ గందర గోళం అంతా చూసి మొదట్లో గుండె జారిపోయింది. పరిస్థితిని సర్దుబాటు చెయ్యడానికి ఆమె నానా తంటాలు పడింది. తన నిస్సహాయ స్థితి ఆమెకి తెలుస్తూనే వుంది. క్షణక్షణం ఉబికి వచ్చే కన్నీళ్లని అపుకో ప్రయత్నించింది. నిగామాను కూడా దాలీ బాధలు చూసి సానుభూతి చూపించలేదు. అతను మనిషి చూడ్డానికి బాగుంటాడనీ, మర్యాద పడికట్లు తెలిసినవాడనీ ముచ్చటపడి అబ్లాన్‌స్కీ గుమ్మం కావలి ఉద్యోగంనుంచి నిగామానుగా చేశాడు.

అతను అంతకు ముందు సైన్యంలో సార్జెంటుగా వుండేవాడు. దాలీ యేమడిగినా వినయంగా "యేం చెయ్యలేమమ్మా, యీ జనం అలాంటివాళ్లు" అని దులిపేసుకునేవాడు. దేనికీ అతను పాయపడలేదు.

పరిస్థితి నిజంగా అధ్వాన్నంగా వుంది. కాని అబ్లానోవ్స్కీల యింటిలో కూడా, యితర పెద్ద కుటుంబాల్లో మాదిరీ, దృష్టికి ఆనని ముఖ్యమైన, ఉపయోగకరమైన వ్యక్తి వుంది – మత్రోనా. ఆమె యజమానురాల్ని ఓదార్చింది. అన్నీ సర్దుకుంటాయని (ఆ పదాల్ని మళ్ళేయ్ ఆమె దగ్గర్నుంచి సంగ్రహించింది) ధైర్యం చెబుతూ నిదానంగా హడావుడి పడకుండా చక్క బెట్టడానికి నడుం కట్టింది.

అక్కడికి చేరిన వెంటనే మత్రోనా నిగామాను పెళ్లాన్ని మంచి చేసుకుంది. మొదటి రోజునే ఆమెతో, నిగామానుతో కలిసి అకేసియా చెట్లకింద కూర్చుని టీ తాగింది. ఆ సమయంలో అన్ని విషయాల గురించీ తర్జన భర్జనలు చేసింది. మత్రోనా త్వరలోనే అకేసియా చెట్లకింద చేరే ఓ క్లబ్బులాంటి దాన్ని తయారు చేసింది. ఆ క్లబ్బులో నిగామాను భార్య, గ్రామపెద్ద, ఆఫీసు గుమస్తా సభ్యులు. ఆ క్లబ్బు సాయంతో అక్కడ యెదురైన కష్టాలు సరుకోవడం మొదలైంది. నిజంగానే ఓ వారం రోజుల్లో అంతా చక్కబడింది. కారకుండా కప్పు మరమ్మత్తు చేయించారు. వంట మనిషి దొరికింది. ఆమె గ్రామపెద్ద బంధువు. కోడిపెట్టల్ని కొన్నారు. ఆవులు పాలు యివ్వడం మొదలుపెట్టాయి. కంచె కంతల్ని మూయించారు. వడ్రంగి బట్టలకి కొయ్యపాత్రం తయారుచేశాడు. అల్మారాలకి కొక్కేలు బిగించేడు. దాంతో అవి తెరుచుకోకుండా మూసుకునే వుండేవి. ఇస్త్రీ బల్ల నొకదాన్ని కుర్చీ వీపుకీ అల్మారా అరకీ కట్టి తయారుచేశారు. నౌకర్ల మకాంమంచి బట్టలు యిస్త్రీ చేస్తున్న వాసన వచ్చేది.

"చూడండి! మీరేమో బేజారు పడిపోయారు" అంది మత్రోనా ఇస్త్రీ బల్ల చూపించి.

గడ్డి తడికలు పెట్టి స్నానాలకి కూడా జాగా యేర్పాటు చేశారు. లిలీ స్నానం చెయ్యడం మొదలుపెట్టింది. దాలీకి మనశ్శాంతి కలగక పోయినా సౌఖ్య ప్రదమైన జీవితానికి సంబంధించి ఓ మేరకి కలలు నిజమయాయి. ఆరుగురు పిల్లలతో దాలీకి మనశ్శాంతి రావడం కష్టం. ఓ పిల్లకి జబ్బు చెయ్యవచ్చు. యింకో పిల్ల జబ్బు పడే దశలో వుండచ్చు. మూడో పిల్లకి యిదో అదో దొరక్కపోవచ్చు. నాలుగో బిడ్డకి దుర్లక్షణాలు కనిపించవచ్చు. వొకటేమిటి, యిలా యేదో వొకటి తగులానే వుండచ్చు. హమ్మయ్య యివాళ ప్రశాంతంగా వుంది అని ఆమె వూపిరి పీల్చుకునే క్షణాలు యెప్పుడోగాని రావు. కాని దాలీ ఆనందం అంతా పిల్లలకోసం పడే శ్రమల్లోనే ఉంది. లేకపోయినట్లయితే భర్తను గురించిన ఆలోచనంతో వ్యధ పడిపోయి వుండేది. అతను ఆమెని యిప్పుడెంత మాత్రం ప్రేమించడం లేదు. యే పిల్లకి యెప్పుడు యేం జబ్బు చేస్తుందోనన్న భయం, పిల్లల్లో రోగ లక్షణాలు కనిపించినప్పుడు కలిగే విచారం తల్లికి యెంత యాతనగా వున్నా గానీ, పిల్లలే చిన్నా చితకా సంతోషం కలిగిస్తూ ఆమె వంతా పాలకి మందు వేసారు. ఆ సంతోషాలు యిసుకలో బంగారు రేణువుల్లా యెంత అల్పమైన

వంటే ఆమె మనస్సు యేమీ బాగాలేని సందర్భాల్లో ఆమెకి దుఃఖాలే, ఇసుక మాత్రమే కనిపించేవి. కాని ఆమెకి మధుర క్షణాలూ వుండేవి. అప్పుడు బంగారు రేణువుల్ని మాత్రమే, సంతోషాల్ని మాత్రమే ఆమె చూసేది.

పల్లెటూరి యేకాంత వాసంతో ఆమెకి యీ చిన్న చిన్న సంతోషాలే యెక్కువ స్ఫురణకి వచ్చేవి. తల్లి కావడం వల్ల తన పిల్లల్ని తను నిష్పక్షపాతంగా చూడలేదనీ, తను పొరపాటు పడుతున్నాననీ, పిల్లల్ని చూసి తరచుగా తనకి తాను నమ్మకం కలిగించుకో ప్రయత్నించేది. అయినా వాళ్ళు ముచ్చటైన పిల్లలు అని అనుకోకుండా వుండలేకపోయేది. ఆరుగురికి ఆరుగురూ యెవళ్ల మట్టుకి వాళ్ళు వాళ్ల ప్రత్యేకతలతో వున్నా, యిలాంటి పిల్లలు యెక్కడోగాని వుండరు అనుకునేది. వాళ్లని చూసి సంతోషపడేది, గర్వ పడేది.

8

మే నెలాఖరులో అన్నీ సర్దుకుని వో మాదిరిగా గాడిలో పడ్డాక ఆమెకి భర్త దగ్గర్నుంచి జవాబు వచ్చింది. పల్లెటూర్లో తమ పడుతున్న యిబ్బందుల గురించి విస్తారంగా తను రాసిన జాబుకి అది జవాబు. అన్ని విషయాల గురించి శ్రద్ధ పట్టక పోవడం తన తప్పేననీ, వీలు చిక్కిన వెంటనే తను వూరికి వచ్చేస్తాననీ అతను రాశాడు. కాని అలాంటి వీలు యెంతకీ చిక్కినట్టు లేదు. జూన్ ఆరంభం దాకా దాలీ యెర్గుషెవోలో వొక్కర్తే వుండిపోయింది.

సెయింట్ పీటర్ పండగకి ముందు వో ఆదివారం రోజున పిల్లల్ని దైవారాధన కోసం గుర్రం బండిలో చర్చికి తీసుకువెళ్లింది. చెల్లెలితో, తల్లితో, మిత్రులతో ఆధ్యాత్మిక, తాత్విక విషయాలు గురించి చర్చ వచ్చినప్పుడు మత ధర్మం పట్ల తనకి వున్న స్వతంత్ర భావాలని ప్రదర్శించి దాలీ వాళ్లకి హైరాన కలిగిస్తూ వుండేది. పునర్జన్మ గురించి దాలీకి సొంత మతం వుండేది. సంప్రదాయక చర్చి విశ్వాసాలని ఖాతరు చేసేది కాదు. కాని కుటుంబంలో మాత్రం ఆమె సకల చర్చి క్రతువుల్నీ అనుసరించేది. అదైనా యేదో మెప్పుకోసం కాదు, సర్వాత్మనా చేసేది. దగ్గర దగ్గర యేడాదికి పైగా పిల్లలు ధర్మానుష్ఠానం చెయ్యలేదని ఆమెకి యిప్పుడు చింతపట్టుకుంది. మత్రోనా పూర్తి తోడ్పాటుతో, సహకారంతో యీ వేసవిలో, యీ పల్లెటూళ్లో ఆ విధిని నిర్వహించాలని దాలీ నిర్ణయించుకుంది.

దాలీ కొన్ని రోజుల ముందు నుంచీ పిల్లలకి యెలాంటి బట్టలు వుండాలి యేమిటీ అన్న విషయం గురించి ఆలోచించింది. దుస్తుల్ని తయారు చేశారు, మార్పులు చేశారు, చలవ చేశారు, కుచ్చెళ్లని అమర్చేరు, బొత్తాలని కుట్టేరు, గోటు షోకు చేశారు. తాన్యా గౌనుని ఇంగ్లీషు పంతులమ్మ తయారు చేస్తానని తీసుకుంది. అది దాలీకి చాలా విచారం కలిగించింది. ఇంగ్లీషు పంతులమ్మ గౌను మడతలు తప్పుగా కుట్టి, చేతుల్ని అధ్వానంగా తయారు

చేసింది. దానితో గౌను తగలడ్డట్టే కనిపించింది. తాన్యా భుజాలమీద అది నిలబడనే లేదు. చూడ్డానికి ఘోరంగా వుంది. అదృష్టవశాత్తు మత్రోనా మాసిక వేసి కుట్టి, పైన కేప్ లాంటిది పెట్టి దాన్ని పరవాలేదనిపించింది. ఏదో గౌను మాట దక్కింది. కాని యింగ్లీషు పంతులమ్మతో పేచీ వచ్చినంత పనైంది. ఆ మర్నాడు ఉదయం తొమ్మిది గంటల వేళకి అంతా చక్కబడింది. చర్చి ఆరాధనని తాము వచ్చేదాకా అంటే తొమ్మిది గంటలదాకా ఆపమని కబురు చేశారు. పిల్లలు మంచి చమకు చమకులాడే గౌన్లతో గుర్రం బగ్గీ ముందు, అరుగు దగ్గర అమ్మ కోసం యెదురు చూస్తూ సంతోషంగా నుంచున్నారు.

మత్రోనా శోక్యం పుణ్యమా అని పెంకె గుర్రం వోరొవ్‌ని కాక నిగామాను గుర్రం బూరియ్‌ని బండికి కట్టేరు. దాలీ తను యెలా ముస్తాబవాలో తోచక ఆలస్యం చేసి ఆఖరికి తెల్లని మజ్లిన్ గౌను తొడుక్కుని బండి దగ్గరికి వచ్చింది.

దాలీ శ్రద్ధగా, ఆతిశయంతో బట్టలు వేసుకుంది. కేశాలంకరణ చేసుకుంది. ఇదివరలో ఆమె తనకోసం ముస్తాబయేది. ముచ్చటగా కనిపించాలని, నలుగురూ తనని చూసి ఓహో అనాలని ముస్తాబయేది. కాని వయస్సు వచ్చేకొద్దీ ఆమెకి ముస్తాబవడం సంతోషకారంగా అనిపించడం లేదు. ఆమె సౌందర్యం యెంతో త్వరగా వన్నె తగ్గిపోతోందనే అది తెలియజేసింది. కాని యివాళ మళ్లీ ముస్తాబవడం ఆమెకి సంతోషం కలిగించింది, ఉత్తేజం కలిగించింది. ఈ వేళ ఆమె తనకోసం బట్టలు వేసుకోలేదు. సొగసుగా కనిపించాలని మాత్రమే ముస్తాబవలేదు. ముద్దొచ్చే పిల్లల తల్లిగా తను సామాన్యంగా కలిగే ప్రభావాన్ని పాడు చెయ్యకూడదు, అందుకనే బాగా ముస్తాబయింది. అద్దంలో ఆఖర్న మళ్లీ చూసుకున్నాక ఆమెకి సంతృప్తి కలిగింది. తను ముచ్చటైందే. తొలి నాళ్లలో బాల్‌డాన్సులకి వెళ్లేటప్పుడు తను యెంత ముచ్చటగా వుండాలని తపన పడేదో, అంతలా కాకపోయినా ప్రస్తుత ఉద్దేశ్యానికి సరిపడేటంత ముచ్చటగానే వుంది.

చర్చి లోపల కొంతమంది రైతులు, వాళ్ల ఆడవాళ్లు తప్ప యెవళ్లూ లేరు. కాని తనూ, పిల్లలూ అక్కడికి వెళ్లగానే వాళ్ల వదనాల్లో గోచరమైన ప్రశంసా భావాన్ని లేదా తనకి అలా అనిపించినదాన్ని దాలీ చూసింది. పిల్లలు డాబుగా బట్టలు వేసుకొని ముచ్చటగా కనిపించడమే కాదు, బుద్ధిగా వుండి అందరికీ ఆనందం కలిగించేరు. అల్యోష బాగా నుంచో లేదన్న ముక్క నిజమే, మాటిమాటికీ చొక్కా యెలా వుందోనని వెనక్కి చూసుకుంటూనే వున్నాడు. అయినా గానీ మహా ముద్దొస్తూ వున్నాడు. తాన్యా ఆరిందాలాగా నుంచుని చిన్న పిల్లలమీద వో కన్నేసి చూస్తూ వుంది. కాని చిన్న పిల్ల లిలీ అన్నింటికేసీ ఆశ్చర్యంగా చూస్తూ అందరికీ యిష్టురాలై పోయింది. ధార్మిక అనుష్ఠానం పూర్తయిం తర్వాత ఆ పిల్ల "please, some more[1]" అని అన్నప్పుడు చిరునవ్వు నవ్వకుండా వుండలేక పోయారు.

---

[1] దయచేసి యింకొంచెం (ఇంగ్లీషు).

ఇంటికి తిరిగి వెళ్లాక పిల్లలు యేదో గంభీరమైంది జరిగిందన్న భావనతో అణకువగా వున్నారు. ఇంటి దగ్గర అంతా సవ్యంగానే జరిగింది. కాని భోజనాల దగ్గర గ్రీష యాగీ చెయ్యడం మొదలెట్టాడు. ఇంకా పెద్ద పని ఇంగ్లీషు పంతులమ్మ చెప్పిన మాటని ఖాతరు చెయ్యలేదు. దాంతో దండనగా అతనికి మిఠాయి లేకుండా పోయింది. దాలీ గనుక అక్కడ వుండి వుంటే అలాంటి రోజున దండనలూ గిండనలూ లేకుండా చూసేది. కాని యిప్పుడు యింగ్లీషు పంతులమ్మ తీర్పుని తను తిరగదోడడం సబబు కాదు. అంచేత గ్రీషకి మిఠాయి పెట్టకూడదన్న దండన అమలు జరగనిచ్చింది.

గ్రీష యేడ్చాడు. నికొలాయ్ కూడా యీల వేశాడు గాని వాడికి శిక్ష వెయ్యలేదనీ, తను మిఠాయి కోసం యేడవడం లేదనీ—తనకది అసలు లెక్కేలేదు—తనకి అన్యాయం జరిగిందనే మొత్తుకుంటున్నాననీ ఫిర్యాదు చేశాడు. అంతా చాలా విచారకరంగా తయారై తను యింగ్లీషు పంతులమ్మ దగ్గరికి వెళ్లి పిల్లవాణ్ణి యీ తప్పు కాయమని అడుగుదామనుకుంది. కాని హాలులోనుంచి వెళ్లేటప్పుడు ఆమెకి కనిపించిన దృశ్యం ఆమెని సంతోషంతో పులకరింపచేసింది. ఆమెకి కళ్లమ్మట నీళ్లు తిరిగాయి. దాంతో దోషిని తనకిగా తను క్షమించేసింది.

ఆ పెద్ద హాల్లో వో మూల కిటికీ వుంది. దానిమీద గ్రీష కూర్చున్నాడు. పక్కన తాన్యా వుంది. ఆ పిల్ల చేతిలో ప్లేటు వుంది. బొమ్మలకి తాయిలం పెట్టాలన్న మిషమీద తాన్యా తన మిఠాయిని పిల్లల గదిలోకి తీసుకెళ్లడానికి యింగ్లీషు పంతులమ్మ చేత వూఁ అనిపించుకుంది. దాన్ని బొమ్మల దగ్గరికి తీసుకెళ్లడానికి బదులుగా తమ్ముడి దగ్గరికి తెచ్చింది. వాడు మిఠాయి తింటూనే తనని దండించడం అన్యాయం అంటూ యేడుస్తున్నాడు. వెక్కుతూ మధ్యమధ్య "నువ్వు తిను, యిద్దరం తిందాం... కలిసి తిందాం..." అంటున్నాడు.

మొదట్లో తాన్యాకి గ్రీష పట్ల జాలి కలిగింది. తర్వాత తన ఉదారత్వం గుర్తు వచ్చింది. దాంతో ఆమె కళ్లు చెమర్చాయి. కానీ మిఠాయిని వదులుకోలేదు, తన వాటా తను తింది.

తల్లిని చూడగానే పిల్లలిద్దరూ బెదిరారు. కాని తాము చేస్తున్న పని సరైన దేనని ఆమె ముఖం ఒకసారి చూడగానే వాళ్లకి అర్థం అయింది. వాళ్లు వెంటనే ఫక్కున నవ్వేరు. మిఠాయి కుక్కుకున్న నోళ్లని చేతులు తిరగేసి తుడుచుకున్నారు. కిలకిలలాడే వాళ్ల ముఖాలమీద జామ్, కన్నీళ్లు పులుముకున్నాయి.

"ఓయి భగవంతుడా! మీ కొత్త బట్టల్రా! తాన్యా! గ్రీషా!" అని వాళ్ల అమ్మ అరిచింది, వాళ్ల బట్టలు పాడైపోకుండా చూడాలని. కాని అప్పుడే ఆనందంతో, పారవశ్యంతో, కన్నీళ్లతో చిరునవ్వు నవ్వింది.

కొత్తవి విప్పేసి ఆడపిల్లలకి బ్లౌజ్లు తొడగమనీ, మగపిల్లలకి పాత చొక్కాలు తొడగమనీ పురమాయింపు వచ్చింది. గుర్రాల్ని, నిగామానుకు యివ్వటం లేకపోయినా బూరియ్‌ని కాడిగుర్రంగా కట్టి, బండికి పూన్చమనీ పురమాయించేరు. యేమంటే కుటుంబం అంతా పుట్టగొడుగులు యేరడానికీ, నదిలో యీదడానికీ వెడుతున్నారు. పిల్లల గదిలో సంతోష

పారవశ్యంతో కేకలు, అరుపులు రేగాయి. వాళ్ళు బయల్దేరేదాకా అవి సద్దు మణగలేదు.

బుట్ట నిండుగా బుల్లెడు పుట్టగొడుగుల్ని యేరారు. ఆఖరికి లిలీ కూడ వో పుట్ట గొడుగుని చూసి యేరింది. ఆ రోజుదాకా పంతులమ్మ మిస్ హాల్ పుట్టగొడుగుల కోసం వెతికి వాటిని లిలీకి చూపించేది. కాని ఆ వేళ లిలీ స్వయంగా పెద్ద పుట్టగొడుగుని యేరింది. "లిలీ పుట్టగొడుగుని యేరిందర్రోయ్!" అని అందరూ యేక కంఠంతో ఆనందంగా అరిచే సంఘటన అయింది అది.

తర్వాత నది దగ్గరికి బండిలో వెళ్ళారు. గుర్రాలని బర్చ్ చెట్లకింద వుంచి స్నానాలకి దిగేరు. ఈగల్ని తోకలతో తోలుకుంటూ వున్న గుర్రాల్ని బండితోలే తెరెంతి వో చెట్టుకి కట్టే శాడు. కొంచెం పొగాకు తీసుకొని చుట్టుకుని విడుపాటి గడ్డిమీద నీడలో కూర్చుని పొగపీల్చడం మొదలుపెట్టాడు. నదిలో యీదులాడుతూ కేరింతాలు కొడుతూ వున్న పిల్లల అరుపులు యెడతెగకుండా అతనికి వినిపిస్తూ వున్నాయి.

అంతమంది పిల్లల్ని సందడించుకోవడం, ఒకళ్ళతో ఒకళ్ళు దెబ్బ లాడకుండా వుండే టట్టు వాళ్ళని కాయడం, యెవళ్ల మేజోళ్ళు, చెడ్డీలు, బూట్లు ఎవరివో ఆనవాలుగా చూసు కుంటూ వాటిని కలిసిపోకుండా జాగ్రత్తగా వుంచడం, బొత్తాలు, తేపులు, పట్టీలు సరిగ్గా వున్నాయో లేదో చూసి, కుట్టి, కట్టి, విప్పి సవరించడం లాంటి లక్షా తొంభై చిల్లర చీకు చింతలు దాలీకి వున్నాయి. నదిలో యీదాలంటే ఆమెకే సరదా. పిల్లలకీ అది మంచిదని ఆమె భావన. అన్ని చీకు చింతలున్నాగానీ పిల్లల్ని నది దగ్గరికి స్నానాల కోసం తీసుకెళ్లడం అంతగా మరేదీ ఆమెకి ఆనందం కలిగించలేదు. బొద్దుగా వున్న వాళ్ల కాళ్లని పట్టుకోవడం, వాటి మీద మేజోళ్ళు పైకి లాగడం, వాళ్ల శరీరాల్ని తన చేతులతో పట్టుకోవడం, నీళ్లల్లోకి వాళ్లని ముంచేటప్పుడు సంతోషంతోనో, భయంతోనో వాళ్ళు అరిచే వెర్రి అరుపులు వినడం, వాళ్ళు నీళ్ళు చల్లుకుంటూ వుంటే చూడడం మిలమిలలాడే వెడల్పాటి కళ్లతో యింతలో యికిలిస్తూ యింతలో బెదిరిపోతూ ముద్దొస్తూ వుండే వాళ్ల ముఖాల్ని చూడడం కంటే ఆహ్లాదకరమైంది వుండేది కాదు.

పిల్లలు సగం మంది స్నానాలు ముగించి వెనక్కి వచ్చి బట్టలు వేసుకున్నారు. అప్పుడు మంచి బట్టలు వేసుకున్న కొంతమంది రైతు ఆడాళ్ళు స్నాన ఘట్టాల దగ్గరికి వచ్చేరు. వాళ్ళు తోటకూర ఆకుల్ని యేరుకోవడానికి వచ్చిన మనుషులు. నీళ్లల్లో పడిపోయిన వో దుప్పటినీ, చొక్కానీ పైకి తియ్యమని ఆ ఆడవాళ్లల్లో వొకామెని పిలిచి మత్రోనా చెప్పింది. వాటిని ఆరబెట్టడానికి పరిచింది. దాలీ ఆ ఆడవాళ్లతో మాట కలిపింది. మొదట్లో వాళ్ళు చేతుల్ని కొణెదెలాగా పెట్టి ముఖం దాచుకుని కిలకిలా నవ్వుకున్నారు గాని వాళ్లకి దాలీ మాటలు అర్థం అవలేదు. కాని కొంచెం సేపట్లోనే వాళ్లకి ధైర్యం చిక్కింది. బెరుకు లేకుండా మాట్లాడేరు. పిల్లలు చాలా ముచ్చటగా వున్నారని మెచ్చుకుంటూ దాలీ మనస్సు ఆకట్టు కున్నారు.

"యెంత ముచ్చటగా వుందో! పొంరాతి తెలుపు" అంది వొకామె మురిసిపోయి తాన్యా కేసి చూసి తల వూపుతూ. "కాని చాల పీలగా వుంది" అంది.

"అవును, జబ్బు పడింది."

"అతను! తనకీ స్నానం చేయించారా?" అని మరొకావిడ వొళ్లో వున్న చంటివాణ్ణి చూపించి అడిగింది.

"అబ్బెబ్బే! వీడికి మూణ్నెల్లే" అంది దాలీ గర్వంగా.

"అరె! వాహ్!"

"నీకు పిల్లలున్నారా?"

"నలుగురు పుట్టేరు. యిద్దరు దక్కేరు. మగపిల్లాడు, ఆడపిల్ల. లెంట్ తర్వాత* పాలు మాన్పించేసాను."

"ఎన్నేళ్లేమిటి పిల్లకి?"

"యీ మధ్యనే యేడాదీ వెళ్లింది."

"అంతకాలం పాలు యెందుకిచ్చావ్?"

"మాలో అంతే, మూడో లెంట్‌దాకా."

సంభాషణ దాలీకి బాగా ఆసక్తి కలిగించే విషయాలమీదకి మళ్లింది. ప్రసవం యెలా జరిగింది? బిడ్డ జబ్బేమిటి? నీ పెనిమిటి యెక్కడున్నాడు? తరచూ యింటికి వస్తూ ఉంటాడా? అవే వాటిమీదకి.

ఆ పల్లెటూరి ఆడాళ్లతో మాట్లాడ్డం దాలీకి సరదాగా వుంది. తమ అభిరుచులు చాలా సమానంగా వుండి వాళ్లని వదిలి పెట్టి వెళ్లడానికి ఆమెకి మనస్కరించలేదు. అన్నిటి కంటె సంతృప్తి కలిగించిన సంగతి దాలీకి అంతమంది చక్కటి పిల్లలు వుండడం, తన పిల్లలు వాళ్లకి నచ్చినట్టు కనబడడం. ఆడవాళ్లు దాలీకి నవ్వు తెప్పించారు. అది ఇంగ్లీషు పంతులమ్మకి కోపం తెప్పించింది. ఆ నవ్వడం తనని చూసేనని ఆమెకి అర్థమైంది. కానీ అలా నవ్వడానికి కారణం యేమిటైందీ ఆమెకి తెలియలేదు. అందరూ బట్టలు తొడుక్కు న్నాక పంతులమ్మ బట్టలు తొడుక్కుంది. ఆమె మూడో స్కర్ట్ వేసుకున్నప్పుడు అక్కడ నిలబడి చూస్తూ వున్న ఆడవాళ్లల్లో వొకామె "చుట్టుకునీ చుట్టుకొనీ చుట్టుకోవడమేనా! కట్టుకునే దెప్పటికీ!" అని వ్యాఖ్యానించకుండా వుండలేకపోయింది. దాంతో అందరూ ఫక్కున నవ్వేరు.

9

స్నానాలు చేసిన పిల్లల తలలు తడిగా వున్నాయి. దాలీ జుట్టు రుమాలుతో పిడప చుట్టు కుంది. వాళ్ల బగ్గీ యింటి దాపులకి వచ్చింది. అప్పుడు బండివాడు ఆమెతో

"ఎవరో వస్తున్నారమ్మా, పొక్రోవ్‌స్కాయె ఊరి ఆయనలా కనిపిస్తున్నారు" అన్నాడు.

దాలీ ముందుకి తొంగి చూసింది. బూడిద రంగు టోపీ, బూడిద రంగు ఓవర్‌కోటూ తొడుక్కొని వస్తూ వున్న లేవిన్ కనిపించాడు. ఆమెకి చాల సంతోషం కలిగింది. అతనెప్పుడు కనిపించినా, ఆమెకి సంతోషంగానే వుంటుంది. కాని యిప్పుడు మరీ సంతోషంగా అని పించింది. యేమంటే లేవిన్ తనని తన సర్వవైభవంలోనూ చూస్తాడు. తన రాజసాన్ని లేవిన్ అంతగా యెవళ్ళూ మెచ్చుకోరు.

దాలిని చూస్తే లేవిన్‌కి సంసార జీవితం గురించి తను కన్న కలలన్నీ కళ్ళముందు రూపు తీసుకున్నట్టు అనిపిస్తుంది.

"పిల్లల్ని పోగు చేసుకున్న కోడి పెట్టలా వున్నారు నిజంగా దాలీగారూ" అన్నాడు.

"అబ్బ మిమ్మల్ని చూడ్డం యెంత సంతోషంగా వుంది" అని చేతిని చాస్తూ అందామె.

"యేదో మాట వరసకి అలా అంటున్నారు కాని మీరిక్కడున్నట్టు పిసరు నాకు కబురు చేశారా? మా అన్నయ్య మా వూరు వచ్చేడు. మీరిక్కడ వున్నట్టు మీ ఆయన ఉత్తరంవల్ల తెలిసింది."

"ఆయన ఉత్తరంవల్లా?" అని ఆమె ఆశ్చర్యపోతూ రెట్టించింది.

"ఆఁ. మీరిక్కడున్నారనీ, మీకేదన్నా అవసరం అవుతుందేమో కనుక్కోమనీ రాశాడు" అన్నాడు లేవిన్. ఆ ముక్క అన్నాక అతనికి వున్నట్టుండి యిబ్బంది కలిగింది. మాట సగం లోనే తుంచేసి మౌనంగా లైమ్ చెట్టు కొమ్మ పోదాన్ని విరిచి అలా నములుతూ ఇంటి పక్కనే నడిచాడు. తన భర్త స్వయంగా చూడవలసిన విషయాలకి సంబంధించి పై వ్యక్తి సాయం రావడం దాలీకి నచ్చకపోవచ్చున్న భయంవల్ల అతనికి యిబ్బంద నిపించింది. తన భర్త తన కుటుంబ బాధ్యతలని పై వాళ్ళకి అప్పగించిన ధోరణి నిజంగానే దాలీకి అసంతృప్తి కలి గించింది. లేవిన్ ఆ విషయాన్ని అర్థం చేసుకున్నాడని ఆమె వెంటనే గ్రహించింది. అదుగో అర్థం చేసుకోగల ఆ శుమత, భావనా సూక్ష్మత వుండడం వల్లనే అతనంటే ఆమెకి యిష్టం.

"ఇంతకీ నన్ను చూడ్డం వినాకిష్టం అని గ్రహించగల ననుకోండి. మీ అభిమానం అలాంటిది. బస్తీలో బతకడం అలవాటైన మీకు మా పల్లెటూళ్ళో చాల యాతనగా వుండచ్చు. అంచేత మీకు యేం కావాలన్నా పరవాలేదు చెప్పండి నే వున్నా" అన్నాడు లేవిన్.

"అబ్బెబ్బె, యేం అక్కర లేదు" అందామె. "వచ్చిన కొత్తలో అంతా అస్తవ్యస్తంగా వుంది. కాని యిప్పుడన్నీ చక్కబడ్డాయి, మా దాది పుణ్యమా అని" అంటూ మత్రోనాకేసి చూపించింది. వాళ్ళు తన గురించే మాట్లాడు కుంటున్నారని ఆమె పసి కట్టి ఉల్లాస భరిత మందహాసం చేస్తూ లేవిన్‌కేసి ఆదరంగా చూసింది. ఆమెకి అతను తెలుసు. అతను తమ చిన్నమ్మాయిగారికి తగ్గ వరుడనీ ఆమె యెరుగును. అలా జరిగితే బాగుండుననీ కోరు కుంది.

"బగ్గీలో కూర్చోండయ్యా, మేం కొంచెం జరుగుతాం" అంది.

"అబ్బే, ఫరవాలేదు నడుస్తా. గుర్రంతో పందేనికి నాతో యెవరొస్తార్రా పిల్లలూ?"

పిల్లలు లేవిన్ని అంత బాగా యెరగరు. అతన్ని యెప్పుడు చూశారో వాళ్లకి గుర్తు లేదు. అయినా గానీ అతని పట్ల సంకోచంగాని బెరుకుగాని వాళ్లకి లేకపోయేయి. తమతో కృత్రిమంగా ప్రవర్తించే పెద్దవాళ్ల పట్ల పిల్లలు బెరుగ్గా, సంకోచంగా వుంటారు. అందుగ్గాను వొకో అప్పుడు వాళ్ల తిట్లు తింటూ వుంటారు. బాగా తెలివైన వాళ్లమనీ, అఖండులమనీ, అనిపింపచేసే పెద్దవాళ్లని కూడా కృత్రిమత్వం మోసం చెయ్యవచ్చు. కాని యెంత యుక్తిగా మెరుగులు పెట్టినా కృత్రిమత్వం అనేది కనిపిస్తే యెంత బడుద్దాయి పిల్లవాడు కూడా పట్టేస్తాడు; యేవగించుకుంటాడు. లేవిన్‌లో దోషాలు యేమన్నా వుండచ్చు గాక, కృత్రిమత్వం మాత్రం లేశం కూడా లేదు. దాంతో పిల్లలకి అతని ముఖంలో తల్లి ముఖంలో కనిపించిన లాంటి ఆర్ద్రత కనిపించింది. వస్తారా అని అతను అడగ్గానే పెద్ద పిల్లలిద్దరూ వెంటనే బండిలోనుంచి కిందికి దూకేరు. తల్లి పక్కనో, దాది పక్కనో, మిస్ హోల్ పక్కనో గంతులు వేసినంత సునాయాసంగా అతని పక్కన గెంతేరు. లిలీ కూడా అతనితో వుంటానంది. దాలీ ఆ పిల్లని అతనికి అందించింది. అతను ఆ పిల్లని భుజాల మీద యెక్కించుకుని పరిగెత్తేడు.

"మరేం భయపడకండి, దాలీగారూ! మీ అమ్మాయికేం ఫర్లేదు, కింద పడెయ్యను" అని హుషారుగా చిరునవ్వు నవ్వుతూ అన్నాడు.

అతను చాల దృఢంగా, చురుగ్గా వున్నాడు. బహు జాగ్రత్తగా వున్నాడు. దాంతో తల్లి గుండె నిమ్మళించింది. అతన్ని సాదరంగా చూస్తూ ఆమె సంతోషంతో చిరునవ్వు నవ్వింది.

లేవిన్‌కి దాలీ అంటే నిజంగా యిష్టం. ఇక్కడ, యీ పల్లెటూర్లో పిల్లలనీ, ఆమెనీ చూసేటప్పటికి అతనికి వొక శైశవ ఆనంద మనస్థితి వచ్చింది. అతనిలో దాలీకి ముఖ్యంగా నచ్చింది అదే. అతను చిన్న పిల్లలతోబాటు పరిగెత్తేడు. వాళ్లకి కుస్తీ కసరత్తులు నేర్పాడు. వచ్చీరాని యింగ్లీషు ముక్కలు మాట్లాడి మిస్ హోల్‌కి నవ్వు తెప్పించేడు. దాలీతో పల్లెటూరి ముచ్చట్ల గురించి చెప్పేడు.

భోజనాల తర్వాత తనూ, అతనూ మాత్రమే వున్న అదును చూసి దాలీ అతనితో కిట్టీ గురించి మాట్లాడింది.

"మీకు తెలుసా కిట్టీ యిక్కడకు వస్తోంది, వేసవి కాలం అంతా నాతోనే వుంటుంది."

"అలాగా?" అన్నాడతను సిగ్గుపడుతూ. మాట మార్చేద్దామని గబగబా అన్నాడు: "అయితే ఆ రెండు ఆవుల్నీ పంపమంటారా? కాదూ కూడదూ డబ్బు యిచ్చి తీరాలీ అంటారా. నెలకి అయిదు రూబుళ్లు పంపండి చాలు – మీకు అంత మొహమాటం అయితే" అన్నాడు.

"అబ్బే వద్దు. మా ఆవులతో కాలక్షేపం అయిపోతోంది."

"కనీసం మీ ఆవుల్ని చూడనియ్యండి. మీకు అభ్యంతరం లేకపోతే వాటికి మేతా అదీ యెలా వుండాలో చెప్తాను. మేత మీదే అంతా వుంటుంది."

మాట మార్చేద్దామనే ఉద్దేశ్యంతోనే అతను దాలీకి పాడి పశువుల గురించిన సిద్ధాంతం వివరించడం మొదలుపెట్టేడు. మేతని పాలగా మార్చే యంత్రంగా ఆవుని భావించడం యిత్యాది వాటిమీద ముఖ్యంగా ఆ సిద్ధాంతం ఆధారపడి వుంది.

అతనలా మాట్లాడుతూనే వున్నాడు. కిట్టీ గురించి వినాలని అంత సేపూ తహతహ లాడుతూనే వున్నాడు. మళ్లీ వినాలంటే భయంగానూ వుంది. తను యెంతో ప్రయాసపడి సాధించుకున్న మనశ్శాంతి భంగం అవుతుందేమోనని అతనికి భయంగా వుంది.

"ఓహో అలాగా! కాని యీ విషయాలన్నిట్నీ దృష్టిలో పెట్టుకుని చేసే వాళ్లెవరు?" అంది ఖేదపడుతూ దాలీ.

మట్రోనా ధర్మమా అని వ్యవహారాలని సజావుగా నడిపించుకొస్తోంది. అందుచేత యెలాంటి మార్పులైనా చెయ్యడం ఆమెకి యిష్టం లేకపోయింది. అదీ గాక వ్యవసాయం గురించి లేవిన్‌కి వున్న పరిజ్ఞానాన్ని నమ్మనూ లేకపోయింది. పాలిచ్చే యంత్రంగా ఆవుని భావించడం అనేదే పెద్ద సందేహంగా వుంది. యీ ప్రకారం చూస్తే తను చేసుకున్న యేర్పాట్లలో ప్రత్యేకం యిబ్బందులే యెదురవుతాయని ఆమెకి అనిపించింది. ఆమెకి సంబంధించి అంతా సరళంగా, గొడవలు లేకుండా వుండే విషయమే. మట్రోనా చెప్పినట్టు పిమ్రాఖా, బెలొపాఖాయ ఆవులకి యెక్కువ మేత, కుడితి పెట్టాలి. వంటమనిషి వంటింట్లో మిగిలిన వాటిని చాకలి మనిషి ఆవుకి చేరెయ్యకుండా చూస్తే చాలు. మాంసకృత్తుల గురించీ, గడ్డి మేత గురించీ యీ గొడవంతా అర్థమవుతుందా చస్తుందా గోల తప్ప. కాని యింతకీ ముఖ్య విషయం కిట్టీ గురించి మాట్లాడాలి అనుకుంది ఆమె.

10

"తనకి కావల్సిందల్లా మనశ్శాంతి, యేకాంతమూనని కిట్టీ నాకు రాసింది" అని దాలీ నిశ్శబ్దాన్ని భంగిస్తూ అంది.

"ఆమె ఆరోగ్యం మెరుగైందా?" అని లేవిన్ తత్తరగా అడిగేడు.

"దేవుడి దయవల్ల పూర్తిగా కోలుకుంది. అసలు తనకి క్షయ అని నేనెప్పుడూ అను కోనే లేదు."

"నాకు చాలా సంతోషంగా వుంది" అన్నాడు లేవిన్. ఆ మాట అని, మౌనంగా ఆమె కేసి చూశాడు. ఆ తీరులో యేదో స్పందనాత్మకమైందీ, నిస్సహాయమైందీ వున్నట్టు దాలీకి అనిపించింది.

"లేవిన్‌గారూ, చెప్పండి, మీకు కిట్టీ అంటే కోపం యెందుకు?" అని అతనికేసి

చూసి దయగా, అయినా కొంచెం పరిహాస పూరితంగా వుండే చిరునవ్వు నవ్వుతూ అంది.

"కోపమా? నాకామె పట్ల కోపం లేదు" అన్నాడు లేవిన్.

"లేదు మీరు కోపంగా వున్నారు. యేం, మాస్కోలో మమ్మల్ని గాని, వాళ్లని గాని చూడ్డానికి యెందుకు రాలేదు?"

"డాలీగారూ" అని అతను సిగ్గుతో కుదుళ్లలోకంటా యెర్రబడి పోతూ అన్నాడు. "మీది జాలిగుండె అయివుండీ మీరు దీన్ని అర్థం చేసుకో లేకుండా వున్నారంటే నాకు ఆశ్చర్యం కలుగుతోంది. నావట్ల మీకు దయ యెందుకు రావడం లేదో మీకీ విషయం తెలిసి వుండీ..."

"యేమిటి నాకు తెలిసిన విషయం?"

"నేను ప్రస్తావన చేసానని, తిరస్కరించడం జరిగిందని" అన్నాడు లేవిన్. నో క్షణం కితమే కిట్టీపట్ల అతనికి కలిగిన జాలి అంతా పోయి కోపం, ఘృణ భావం వచ్చేయి.

"నాకు తెలుసని యెలా అనుకున్నారు?"

"యెందుకంటే అందరికీ తెలుసు కాబట్టి."

"అది మీ పొరపాటు. నాకు తెలీదు, నేను కొంచెం అనుమానించాను గాని."

"సరే, అయితే మీకు యిప్పుడు తెలిసింది కదా."

"నాకు తెలిసిందల్లా యేదో గొడవ జరిగిందని, అది కిట్టీకి చాల వ్యధ కలిగించిందని. ఆ విషయం గురించి యిక యెన్నడూ చర్చించవద్దని నన్ను వేడుకుంది. నాకే చెప్పకపోతే తను మరెవ్వరికీ చెప్పి వుండదు. యింతకీ యేం జరిగిందో చెప్పండి."

"చెప్పాను కదా యేం జరిగిందో."

"యెప్పుడు జరిగింది?"

"కిందటి సారి నేను మీ అమ్మగారి యింటికి వచ్చినప్పుడు."

"నేను మీతో యేం చెప్పాల నుకుంటున్నానో మీకు తెలుసా? కిట్టీని చూస్తే నాకు చాలా చాలా బాధ, చెప్పలేనంత బాధ కలుగుతుంది. మీరు మాత్రం కేవలం ఆత్మాభిమానం దెబ్బ తిందని భావించు కుంటున్నారు..." అంది డాలీ.

"కావచ్చు" అన్నాడు లేవిన్. "కానీ..."

ఆమె అతని మాటకి అడ్డం వెళ్లింది.

"కాని, అబ్బ, పాపం దాన్ని చూస్తే నాకు గుండె చెరువై పోతుంది. యిప్పుడు నాకు సమస్తమూ అర్థమైంది."

"డాలీగారూ" అన్నాడతను లేస్తూ. "మరేం అనుకోకండి, నేను వెళ్లాలి, మరి వుంటాను" అన్నాడు.

"అదేమిటి అప్పుడే? ఆగండి" అందామె అతని చొక్కా చేతిని పట్టుకుని. "వెళ్దురు గాని కూర్చోండి" అంది.

"మీకు పుణ్యం వుంటుంది, ఇక ఆ విషయం గురించి మాట్లాడకండి" అన్నాడ తను కూర్చుంటూ. కాని పూర్తిగా పోయింది అనుకున్న ఆశ మళ్లీ కదులుతూ తల యెత్తు తోంది అని అప్పుడు అతనికి అనిపించింది.

"మీరంటే నాకు యిష్టం లేకపోతే" అని దాలీ కళ్లు చెమ్మగిల్లగా అంది. "మిమ్మల్ని యింత బాగా యెరిగి వుండకపోతే..."

యిక అడుగంటి పోయింది అని తను భావించుకున్నది మరింతగా సజీవం అయి అతని హృదయాన్ని వశం చేసుకుంటోంది.

"అవును నాకిప్పుడంతా అర్థమైంది" అని దాలీ చెప్తూ వుంది. "మీకు అర్థం అవదు. మీరు మగాళ్లు. స్వతంత్రంగా దేన్ని కావాలంటే దాన్ని యెంచుకోగలరు. మీరు యెవర్ని ప్రేమిస్తున్నారో మీకు యెప్పుడూ స్పష్టంగా తెలుసు. కాని కన్నెపిల్ల స్త్రీ సహ జపు, కన్యాత్వపు లజ్జతో, డోలాయమానంగా వున్న స్థితిలో మగాళ్లని దూరంనుంచి మాత్రమే చూస్తూ వుండే పిల్ల, మగాళ్ల మాటంమీదే దృష్టి పెడుతుంది. అలాంటి పిల్లం హృద యంలో అలాంటి భావన కలిగే వీలు వుంది, కలుగుతుంది యేమంటే యేం చెప్పాల్సిందీ ఆమెకి తెలీదు."

"కాని ఆమె హృదయం కొంచెం చెప్పకపోతే..."

"లేదు, హృదయం చెప్పచ్చు, కాని మీరు ఆలోచించండి. మీ మగాళ్లు యేదో పిల్ల పట్ల సరదా పడతారు, వాళ్ల యింటికి వెళ్తారు, దగ్గరవుతారు, శ్రద్ధ పడతారు. మీకిష్టమైనవి వున్నాయా లేవా అని చూస్తూ వుంటారు. పూర్తిగా యిష్టపడుతున్నట్టు నమ్మకం కలగగానే మీరు పెళ్లి ప్రస్తావన చేస్తారు..."

"మరీ మీరు చెప్పినట్టే కాదులెండి."

"పోన్లెండి, మీ ప్రేమ పరిణితం అయాక మీ ముందున్న ఆడపిల్లలిద్దరిలోనూ యెవరి వేపు తాను మొగ్గుతుందో వాళ్లని యెంచుకుని మీరు పెళ్లి ప్రస్తావన చేస్తారు. కాని ఆడపిల్లని యెవళ్లూ అడగరు. ఆమె తనంత తను యెంచుకుంటోందని అనుకుంటారు గాని ఆమె యెంచుకొనే స్థితిలో లేదు. వూరికే అవును, కాదు అని జవాబివ్వగలదంతే."

'కాని నాకూ వ్రాన్‌స్కీకి మధ్యన యెన్నుకుంది' అనుకున్నాడు లేవిన్. అతని హృద యంలో రెచ్చిపోతున్న ఆశ మళ్లీ మణిగి పోయింది. గుండెని పిండింది.

"దాలీగారూ, గౌన్లని, యితర వస్తువులని అలా యెంపిక చేసుకుంటారు. కాని ప్రేమని మాత్రం కాదు. యెంపిక జరిగిపోయింది, సరే మేలైన మాట. యిక వెనక్కి మళ్లడం వుండదు కదా" అన్నాడు.

"అదే ఆత్మాభిమానం, వొట్టి ఆత్మాభిమానం" అంది దాలీ. ఆడవాళ్లకి మాత్రమే తెలిసిన భావనతో పోలిస్తే యీ భావనకి వున్న తుచ్ఛత్వాన్ని చూసి అతన్ని యేవగించుకుంటు న్నట్టు యీ మాట అంది. "మీరు కిట్టీతో పెళ్లి ప్రస్తావన చేసినప్పుడు, ఆమె సరిగ్గా

ఆదే స్థితిలో వుండి మీకు జవాబు చెప్పలేకపోయింది. ఆమె వూగిసలాటలో వుంది. మీరా, వ్రాన్‌స్కీయా అన్నది తేల్చుకోలేకపోయింది. అతన్నేమో రోజూ కలుసుకునేది, మిమ్మల్ని చూసేమో చాల రోజులై పోయింది. ఆమె కొంచెం అనుభవం వున్నదయితే, మాటకి ఆ చోట్లో నేనే వున్నాననుకోండి, నాకు వూగిసలాట వుండేది కాదు. అతనంటే నాకెప్పుడూ సరిపడేది కాదు. నా మనస్సులో తోచింది నిజమేనని రుజువైంది."

లేవిన్‌కి కిట్టీ చెప్పిన జవాబు గుర్తు వచ్చింది. ఆమె అంది 'లేదు, అలా జరగదు...'

"దాలీగారూ" అని అతను పొడిగా అన్నాడు. "మీకు నా మీద వున్న నమ్మకానికి సంతోషం. మీరు పొరపాటు పడ్డారని అనిపిస్తోంది. సరే ఒప్పో తప్పో అనేది అలా వుంచినా మీరు తిరస్కారంగా చూసే నా ఆత్మాభిమానంవల్ల, కిట్టీ గురించిన ఆలోచనే నాకు అసాధ్యం. శుద్ధ అసాధ్యం."

"నేను వొక్కమాట మాత్రం చెప్తాను. నేను మా చెల్లెలు గురించి మాట్లాడుతున్నాను. తను నాకు నా పిల్లలతో సమానం. తను మిమ్మల్ని ప్రేమించిందని నేననడం లేదు. కాని ఆ క్షణంలో ఆమె కాదనడం దేన్నీ రుజువు చెయ్యదు అనే చెప్తా" అంది.

"నాకు తెలీదు" అన్నాడు లేవిన్ ఠక్కుని లేచి నుంచుంటూ. "నా మనస్సులో అది యెంత సలుపు పెడుతూ వుందో మీకు తెలుసా? యిది యెలా వుందంటే బిడ్డ పోయి యేడుస్తూ వుంటే, లోకులు వాడలాగ వుండేవాడు, యిలాగ వుండేవాడు, బతికుంటే యెంత సంతోషం కలిగించే వాడు అని చెప్పడం లాగ వుంది. ప్చ్, కాని వాడు చనిపోయాడు, చని పోయాడు, చనిపోయాడు..."

"యెంత నవ్వులాటగా అంటూ వున్నారు మీరు" అని దాలీ, లేవిన్ ఉద్రేకాన్ని ఉపేక్షిస్తూ, విచారంగా చిరునవ్వు నవ్వి అంది. "అవును, నాకు యింకా, యింకా యెక్కువ అర్థమవుతోంది" అంది సాలోచనగా. "అయితే కిట్టీ వచ్చేక మీరు యిక్కడికి రారా?" అని అడిగింది.

"ఊహుఁ, రానుగాక రాను. కిట్టీతో పచ్చికొట్టను గాని వీలైతే నేను ఆమె సమక్షంలో వుండే యిబ్బందిని ఆమెకి కలిగించకుండా చూస్తాను."

"అబ్బ! మీరు చాలా పరిహాసంగా వున్నారు" అని దాలీ స్నేహభావంతో అతన్ని చూస్తూ అంది. "సరే, పోనీ లెండి, అసలీ విషయం గురించి మనం యెప్పుడూ మాట్లాడుకోనట్టే వుందాం. దేనికి వచ్చావ్, తాన్యా?" ఫ్రెంచిలో అంది లోపలికి వచ్చిన ఆ పిల్లని చూసి.

"నా పార యేదమ్మా?"

"నేను ఫ్రెంచిలో అడిగినప్పుడు నువ్వూ ఫ్రెంచిలో చెప్పాలి."

ఆ చిన్నపిల్ల ఫ్రెంచిలో చెప్పడానికి ప్రయత్నించింది. కాని "పార"ని ఫ్రెంచిలో యేమం

టారో గుర్తు రాలేదు. తల్లి ఆ మాట అందించింది. ఆ తర్వాత పార యెక్కడుందో ఫ్రెంచిలో చెప్పింది. లేవిన్‌కది నచ్చలేదు.

యిప్పుడతనికి దాలీ యింటిలోనూ, పిల్లల్లోనూ ముందటి లాగ యిష్టమైంది యేదీ కనిపించలేదు.

'పిల్లలతో ఫ్రెంచి మాట్లాడ్డం యెందుకు' అనుకున్నాడు. 'ఎంత కృత్రిమంగా, కపటంగా వుంది! పిల్లలకీ యిది తెలుసు. ఫ్రెంచి నేర్చుకోవడం, నిష్కపటంగా వుండడం మర్చిపోవడం' అనుకున్నాడు. ఆ విషయం గురించి దాలీయే లక్షసార్లు తనలో వితర్కించు కుందనీ, అయినా నిష్కపటత్వాన్ని మూల్యంగా చెల్లించి పిల్లలకి యీ విధంగా బోధించడం ముఖ్యమని భావించిందనీ అతనికి తెలీదు.

"యెక్కడికి బయలుదేరారప్పుడే! కూర్చోండి."

లేవిన్ టీ వేళ దాకా వుండిపోయాడు. కాని అతని ఉత్సాహం మాసిపోయింది. అతనికి యేదో యిబ్బంది అనిపించింది.

టీ తాగింతర్వాత గుర్రాల్ని సిద్ధం చెయ్యమని చెప్పాలని హాల్లోకి వెళ్ళాడు. తిరిగి వచ్చే టప్పటికి దాలీ ఆందోళనగా వుండటం కన్పించింది. ఆమె కళ్ళల్లో నీళ్ళు తిరుగుతున్నాయి. లేవిన్ అవతలికి వెళ్ళినప్పుడు ఓ సంఘటన జరిగింది. ఆ రోజు కలిగిన ఆనందాన్నంతటినీ, తన పిల్లల్ని చూసి ఆమెకి కలిగిన గర్వ భావాన్నంతటినీ అది నాశనం చేసింది. గ్రీష, తాన్యా బంతి కోసం దెబ్బలాడుకున్నారు. పిల్లల గదిలోనుంచి యేడుపులు వినిపిస్తే ఆమె ఒక్క ఉదుట్న అక్కడికి పరిగెత్తింది. చూస్తే యేముంది, ఘోరం. గ్రీష జుట్టు పట్టుకుంది తాన్యా. వాడు కోపంతో ముఖం అంతా జేవురించుకు పోయి పిడి గుద్దులు గుద్దుతున్నాడు. వాళ్ళని చూడగానే దాలీ గుండెలో యేదో పుటుక్కున తెగిపోయింది. తన జీవన జ్యోతి మణగి పోయినట్టు ఆమెకి అనిపించింది. తను యెంతో గొప్పగా భావించుకుంటున్న యీ పిల్లలు వొట్టి సాదా పిల్లలు మాత్రమే కాదు, జంతు లక్షణాలతో సరైన పెంపకం లేకుండా వున్న పిల్లలు – దుష్ట సంతానం.

ఆమె యిక దేన్ని గురించీ మాట్లాడ లేకపోయింది. తన దౌర్భాగ్య స్థితి గురించి లేవిన్‌కి చెప్పకుండా వుండ లేకపోయింది.

ఆమె చాలా బాధపడుతోందని చూసి అతను ఓదార్చబోయాడు. అందులో చెడ్డ యేమీ లేదనీ, పిల్లలంతా వాళ్ళల్లో వాళ్ళు కొట్టుకుంటారనీ చెప్పాడు. కాని ఆ మాటలు అంటూ అతను తనలో తను అనుకున్నాడు, 'నేను కృత్రిమంగా వుండను, నా పిల్లలతో ఫ్రెంచి మాట్లాడను. నా పిల్లలు యిలా వుండరు. ముఖ్య విషయం పిల్లల్ని చెడగొట్ట కుండా, పాడు చెయ్యకుండా వుండాలి. అప్పుడు వాళ్ళు మంచి పిల్లలవుతారు. లేదు, నా పిల్లలు యిలా వుండరు.'

అతను సెలవు తీసుకొని వెళ్ళిపోయాడు, ఆమె అతన్ని ఆపే ప్రయత్నం చెయ్యలేదు.

11

జూలై నెల మధ్యలో లేవిన్ చెర్నొరి వూరినుంచి గ్రామపెద్ద వచ్చేడు. ఆ వూరు పోక్రోవ్స్కొయెకి వో యిరవై కిలోమీటర్ల దూరం వుంటుంది. అక్కడ గడ్డి కోత గురించీ యితర పనుల గురించి లేవిన్‌కి చెప్పడానికి అతను వచ్చేడు. చెర్నొరి జాగీర్‌లో ముఖ్యంగా పచ్చికబీటి నుంచే ఆదాయం వస్తుంది. పూర్వం రోజుల్లో రైతులు దెస్యాతీన్‌కి యిరవై రూబుళ్ల చొప్పున యిచ్చేవారు. లేవిన్ జాగీర్ వ్యవహారాల అజమాయిషీ తన చేతిలోకి తీసుకున్నాక పచ్చికబీటిని పరిశీలించేడు. అక్కడి గడ్డికి యింకా యెక్కువ రావాలని లెక్కగట్టి దెస్యాతీన్‌కి పాతిక రూబుళ్లు చేసాడు. రైతులు ఆ ధర యివ్వమన్నారు. లేవిన్ అనుమానించినట్టుగా పై కొనుగోలుదార్లని వాళ్లు అడ్డం కొట్టేరు. అప్పుడు లేవిన్ స్వయంగా తనే అక్కడికి వెళ్లి గడ్డికోత పనిని కొంత కూలీల చేతా, కొంత వాటా పద్ధతుల మేరకీ చేయించాడు. రైతులు తమకి చేతనైనన్ని ఆటంకాలు పెట్టేరు. కాని లేవిన్ బెసగకుండా పై చెయ్యి సాధించేడు. మొదటి యేడే గడ్డికి దాదాపు రెండింతలు యెక్కువ వచ్చింది. ఆ మరుసటి యేడు, మళ్లీ ఆ తర్వాతి యేడు అంటే యింతకు ముందుటేడు, రైతులు అలానే వ్యతిరేకించారు గాని గడ్డికోత లేవిన్ అన్న ప్రకారమే జరిగింది. ఈ యేడు రైతులు ఫసలీలో మూడో వంతు తీసుకునే ఒప్పందంమీద రాజీకి వచ్చేరు. గడ్డికోత పూర్తయిందనీ, వాన కురిసే భయంవల్ల గుమస్తాని పిలుచుకెళ్లి అతని సమక్షంలో గడ్డి వాటాలు చేసారనీ, ఇనాందారుకి పదకొండు మేట్లు వచ్చాయనీ గ్రామపెద్ద చెప్పడానికే వచ్చాడు. లేవిన్ ముఖ్యమైన పచ్చికబీటిలో కోశారో యెంత గడ్డిని అని అడిగితే దానికి అతను దాట్లువేస్తూ జవాబులు చెప్పాడు. లేవిన్‌కి కబురు చెయ్యకుండా ఆదరా బాదరా గడ్డిని వాటాలు వేసేశారు. ఈ వ్యవహారం అంతా చూస్తే యేదో లోపాయికారీ పన్నుగడ జరిగిపోయినట్టు లేవిన్‌కి అనుమానం తట్టింది. అందుకని స్వయంగా వెళ్లి, అదేమిటో తేల్చుకోవాల నుకున్నాడు.

అతను మధ్యాహ్నం భోజనాల వేళకి ఆ వూరికి వెళ్లాడు. గుర్రాన్ని వో తెలిసినాయన శాలలో కట్టేడు. ఆయన భార్య తన అన్నగారికి పాలిచ్చిన దాది. గడ్డి ఫసలీ విషయాల గురించి వాకబు చేసి తెలుసుకోవడానికి ఆయన్ని తేనెపట్ల గూళ్లున్న చోటుకి వెళ్లి కలుసుకున్నాడు. ఆ ముసలాయన పేరు పర్మేనిచ్. స్ఫురద్రూపి. అధిక ప్రసంగి. లేవిన్‌ని ఆదరంగా పలకరించి తన తేనెగూళ్లన్నిట్నీ చూపించేడు. తేనెటీగల గురించీ, ఆ యేటి దండు గురించీ ఆమూలాగ్రం చెప్పేశాడు. కాని లేవిన్ గడ్డికోత గురించి అడగ్గానే ఆకుకీ పోకకీ అందకుండా నసుగుతూ జవాబు చెప్పేడు. దానితో లేవిన్ అనుమానాలు బలపడ్డాయి. అతను పచ్చికబీటికి వెళ్లి గడ్డి మేట్లని చూశాడు. యే మేటుకీ కూడా యాభై బళ్ల గడ్డి వుండి వుండదు. రైతుల దగా బట్టబయలు చెయ్యడం కోసమని చెప్పి లేవిన్ గడ్డి తోలుకుపోతున్న బళ్లని వెనక్కి మళ్లించమని పురమాయించేడు. గడ్డి దింపి కొఠారులో వెయ్య

మన్నాడు. తీరా చూస్తే మేటుకి ముప్పై రెండు బళ్ళే తేలాయి. గడ్డి అణిగి పోతుందనీ, మేటుల్లో యిమిడిపోయిందనీ, ప్రమాణపూర్తిగా గడ్డిని వాటాల మేరకి పంపకం చెయ్యడం జరిగిందని గ్రామపెద్ద పొట్టుపెట్టుకు చెప్పేరు. అయినా గానీ, తన ప్రమేయం లేకుండా పంపకాలు జరిగాయనీ, అందుగ్గాను యీ పదకొండు మేట్లనీ, మేటుకి యాభై బళ్ళవంతున తన భాగంగా అంగీకరించలేననీ లేవిన్ ఖండితంగా చెప్పేరు. చాలా సేపు మూలుగులూ, ముక్కుడాలూ జరిగాయి. అప్పుడు మేటుకి యాభై బళ్ళ వంతున వున్న ఆ పదకొండు మేట్లనీ రైతులే తీసుకొనేటట్టూ, యజమాని వాటాని మళ్ళీ మొదట్నుంచీ యేర్పాటు చేసేటట్టూ ఒప్పందం అయింది. యీ సంప్రదింపులు, గడ్డిని తిరిగి కొలవడం పూర్తయేటప్పటికి అపరాహ్ణం దాటింది. ఆఖరి గడ్డి మోపులు కట్టే వేలకి కొరవ పనులు చూడమని లేవిన్ గుమస్తాకి పురమాయించి, రైతులతో బిలబిలలాడుతున్న పచ్చికబీటిని కళ్ళారా చూడ్డానికని వో మోపుమీదకి యెక్కాడు.

లేవిన్ ముందు, బాడవ అవతల, నది వొంపు తిరిగే చోట రంగు రంగుల గౌన్లు తొడుక్కున్న రైతు ఆడవాళ్ళు ఉల్లాసంగా ఉచ్చ స్వరాలతో మాట్లాడుకుంటూ తిరుగుతున్నారు. చెదురుమదురుగా వున్న గడ్డిని లాఘవంగా పనలుగా వొక పంక్తిలో పెడుతున్నారు. ఆకుపచ్చని కొయ్యకాళ్ల నేపథ్యంలో యీ బూడిద రంగు పంక్తులు అగుపిస్తున్నాయి. ఆడవాళ్ల వెనకాల మగాళ్ళు ఆటగ్గొరులతో వచ్చేరు. ఆ పంక్తుల్ని యెత్తుగా, పెద్దగా వుండే మోపులుగా చేస్తున్నారు. క్షేత్రంలో ఖాళీ అయిన జాగాలో బళ్ళు గణగణ చప్పుడు చేసుకుంటూ వెడుతున్నాయి. ఆటగ్గొరులకి తగులుకుని గడ్డి మోపులు ఒక దాని తర్వాత ఒకటి మాయమైపోయి బళ్లమీద చేరుతున్నాయి. గడ్డి మోపుల అంచులు గుర్రాల వెనక భాగాల్ని కమ్మేస్తున్నాయి.

"చాలు, వాతావరణం యిలాగే వుంటే! భేషైన గడ్డి!" అన్నాడు పర్మేనిచ్ లేవిన్ పక్కన కూర్చుంటూ. "గడ్డి కాదిది! బంగారం! ఆటగ్గొరులు చూడండి యెలా పన్నేస్తా వున్నాయో! గింజలు మింగే బాతుల్లాగ!" అన్నాడు బళ్లకెక్కే మోపుల్ని చూపిస్తూ. "భోజనాల వేళమంచి బాగానే లాగించేశారు పని!" అన్నాడు.

"యేంటి నీ వంతు పని అయిపోయిందా?" అని ఓ పడుచువాణ్ని చూసి అడిగాడు. అతను ఓ బండి ముందు భాగంలో పగ్గాలు పట్టుకుని తోలుతున్నాడు.

"ఆఁ, అయిపోయింది, నాన్నా" అన్నాడా పడుచువాడు. గుర్రాన్ని లాగుతూ వో యెర్ర బుగ్గల పిల్లకేసి తిరిగి చిరునవ్వు నవ్వేడు. ఆ పిల్ల బండి వెనక కూర్చుంది. బదులుగా చిరునవ్వు నవ్వింది. మళ్లీ వెంటనే అతను గుర్రాన్ని అదిలించేడు.

"నీ కొడుకా?" అని లేవిన్ అడిగాడు.

"ఆఖరివాడండి" అన్నాడా ముసలాయన చిరునవ్వు నవ్వుతూ.

"మంచి కుర్రాడు."

"ఆఁ, మంచోడే."

"పెళ్లయిందా?"

"సెయింట్ ఫిలిప్ ఉపవాసం* నాటికి మూడో యేడు మొదలవుద్ది."

"పిల్లాజెల్లా యేమన్నా?"

"పిల్లలా! యేదారిపాటు యేదేమిటో బోధపడందే, పైగా పిగ్గొకటి!" అన్నాడు ముసలతను. "అద్గదండీ గడ్డి! బంగారమే" అన్నాడు మాట మారుద్దామని.

లేవిన్ వర్కేనిచ్ కొడుక్కేసీ కోడలికేసీ చూశేడు. వాళ్ళ దగ్గర్లోనే వున్న గడ్డి వనని బండిమీదకి యెక్కిస్తున్నారు. ముచ్చటైన పడుచు పెళ్ళాం పెద్ద ఆటగ్రులంతో గడ్డిని పోగు చేసి పైకి అందిస్తూ వుంటే, అందుకుంటూ దాన్ని బండిమీద సర్ది పరుస్తూ ఇవాన్ బండిమీద నుంచున్నాడు. ఆమె సునాయాసంగా, గబగబా, నేర్పుగా పనిచేస్తోంది. గడ్డి బరువుగా వుండడంవల్లా, అణగి వుండడంవల్లా సులభంగా కొర్రుకి లొంగడం లేదు. ఆమె ముందుగా చేత్తో వనని విదిల్చి తర్వాత కొర్రుని దాంట్లోకి గుచ్చుతోంది. అప్పుడు చక్కని శరీర భారాన్నంతటినీ కొర్రుమీదికి అదిమి, మరు క్షణంలో నిటారుగా నిలబడేది. ఆమె నడుంకి యెర్రటి దట్టీ చుట్టుకుంది. తెల్లని జాకెట్టు మడతల్లో పయోధరాలు నిండుగా వున్నాయి. ఆమె నిటారుగా నిలబడగానే వక్షస్సు యెగిసేది. ఆమె తకామని కొర్రు పిడిని పట్టుకుని గడ్డిని పైకి యెత్తేది. ఆ పిల్ల వొక్క క్షణం కూడా వృథాగా శ్రమ పడకుండా చూడాలన్నట్టు ఇవాన్ ఆత్రంగా ఆ గడ్డిని చేతులు బార చాపి అదరా బాదరా అందుకునేవాడు. తర్వాత బండిలో దాన్ని సర్దేవాడు. ఆఖరి వనల్ని పోగుచేసి పైకి అందించేక ఆ పిల్ల మెడమీద పడ్డ పరకల్ని విదిలించుకుంది. నుదుటిమీది ఎర్ర రుమాల్ని సవరించుకుంది. ఆ రుమాలువల్ల నుదురు యెండకి కమలకుండా తెల్లగా వుంది. గడ్డిని తాటితో కట్టడానికి బండికిందకి దూరింది. తాటిని యెలా మెలి తిప్పి కట్టాలో ఇవాన్ ఆమెకి చెప్పాడు. పెళ్ళాం యేమందో మరి, ఫక్కున నవ్వేడు. ఇద్దరి ముఖాల్లోనూ యౌవనభరిత, ప్రబల నూతనావిర్భూత ప్రేమ తటిల్లతలా మెరిసింది.

12

బండిమీద కెత్తిన గడ్డిని గబగబానే కట్టేశారు. ఇవాన్ కిందికి ఉరికి గుర్రం కళ్ళేలు పట్టుకొని నడిచేడు. అతని పెళ్ళాం కొర్రుని గడ్డిపైకి విసిరి, చేతులు వూపుకుంటూ మిగిలిన ఆడవాళ్ళని కలవడానికి దృఢంగా నడిచి వెళ్ళింది. ఇవాన్ రహదారి చేరాక బళ్ళవరుసలో కలిశాడు. ఆడవాళ్ళు బళ్ళవెనక నడిచారు. వాళ్ళ భుజాలమీద కొర్రులు ఆన్చుకున్నారు. మెరిసిపోయే గౌన్సు తొడుక్కున్నారు. పెద్దగా మాట్లాడుకుంటూ, నవ్వుకుంటూ వున్నారు. గరగరలాడే ఆడ కంఠం వొకటి యేదో పాటని అందుకుంది. పల్లవి వచ్చేదాకా ఆ వొక్క

కంఠమే సాగింది. అప్పుడు యాభై కంఠాలు ఒక్క సారే అందుకున్నాయి. హెచ్చు తగ్గు స్థాయిల్లో అన్నీ భిన్నంగా వున్నాయి. కాని అన్నీ బింకంగా పట్టుగా పాటని అందుకున్నాయి.

పాటలు పాడే ఆడవాళ్ళు లేవిన్ దగ్గరికి వచ్చేటప్పటికి ఆనంద సరంభంతో గర్జించే తుఫాన్ మేఘం మీదకి ముసురుకు వస్తున్నట్టు నిపించింది. తుఫాన్ మేఘం ముసురుకు వచ్చి, తను పడుకున్న గడ్డి మోపును చుట్టు ముట్టింది; యితర మోపులు, బళ్ళు, పచ్చికబీడు, సుదూర క్షేత్రాలు, ప్రతిదీ వూగిపోయి అరుపులతో, యీలలతో, కేకలతో నిండిపోయిన ఉన్మత్త గతంలో లయించి పోయాయి. ఆనంద సందోహంగా వున్న వాళ్ళని చూసి లేవిన్ యీర్ష్యపడ్డాడు. ఉరవడిగా వున్న ఆ జీవితోత్సాహంలో తమా పాలు పంచు కోవా లనుకున్నాడు. కాని పంచుకో లేకపోయాడు. అలా పడుకుని వినడం, చూడ్డం తప్ప యేమీ చెయ్య లేకపోయాడు. పాడే వాళ్ళు కనిపించనంత దూరం, వాళ్ళ పాట వినిపించనంత దూరం వెళ్ళగానే లేవిన్ యేదో వొంటరితనంతో, శారీరక ఆలసత్వంతో, ఆ ఆనందభరిత ప్రత్యేక ప్రపంచంనుంచి దూరీకృతమైన భావనతో కుంగిపోయాడు.

ఆ రైతుల్లోనే కొంతమంది గడ్డి విషయంలో మహా గట్టిగా దెబ్బలాడేరు. కొంతమందికి అతను కోపం తెప్పించాడు. వాళ్ళు అతనిని మోసం చెయ్యాలనుకున్నారు. కాని అదే రైతులు అతని ముందునుంచి వెడుతూ ఉల్లాసంతో తల వూపి వందనం చేశారు. తనపట్ల వాళ్ళకి యేమీ కసీ కోపం లేవని స్పష్టంగా తెలుస్తూనే వుంది. తాము చేసిన పన్లకి పశ్చాత్తాప పడడం మాట అటుంచి, అసలు తాము అతని కన్ను కప్పుదామని ప్రయత్నించారన్న విష యమే వాళ్ళకి గుర్తు వున్నట్టు లేదు. అదంతా సంతోషకర సమష్టి శ్రమ సాగరంలో మునిగి పోయింది. భగవంతుడే రోజుని యిచ్చాడు. భగవంతుడే శక్తిని యిచ్చాడు. రోజు, శక్తి కూడ శ్రమకి అర్పితం అయిపోయాయి. అదే దానికి పురస్కారం. కాని శ్రమ యెవరి కోసం? శ్రమ ఫలితాలు యెలాంటివి? అలాంటి విచికిత్స క్షుద్రమూ, అసంగతమూనూ.

లేవిన్ యీ జీవితాన్ని తరచు దర్శించి ముగ్ధుడయేవాడు. ఈ తరహా జీవితం గడిపే వాళ్ళంటే అతనికి యెప్పుడూ అమాయ కలిగేది. కాని యివాళ మొదటి సారిగా, ఇవాన్‌కీ అతని భార్యకీ మధ్య వున్న మధుర బంధవాలని చూశాక మనస్సుకి వాటిన దాని ఫలితం లేవిన్ హృదయంలో మొదటి సారిగా స్పష్టమైన ఆలోచనగా రూపు తీసుకుంది. తన యీ భార మైన, అలసత్వ భరిత, కృత్రిమ వ్యక్తిగత జీవితాన్ని యీ రకమైన శ్రమ పూర్ణ, నిర్మల, సమష్టి శ్రమ సౌఖ్య ప్రదాయక జీవితంగా మార్చుకోవడం తన చేతిలోనే వుందన్న ఆలోచన వచ్చింది.

తన పక్కన కూర్చున్న ముసలాడు పర్మేనిచ్ చాల సేపయింది యింటికి వెళ్ళి. రైతులు చెదిరిపోయారు. దగ్గర దగ్గర యిళ్ళ వాళ్ళు యెవళ్ళ యిళ్ళకి వాళ్ళు వెళ్ళిపోయారు. దూరం నుంచి వచ్చిన వాళ్ళు పచ్చికబీటిమీద చేరారు. వాళ్ళు భోజనాలు చేసి ఆ రాత్రి అక్కడనే గడుపుతారు. లేవిన్ వాళ్ళకి కనిపించకుండా గడ్డిమోపుమీద పడుకున్నాడు. వాళ్ళని చూస్తూ,

వాళ్ల మాటలు వింటూ, తనకిగా తను ఆలోచించుకుంటూ వున్నాడు. పచ్చికబీటిమీద పడుకోవాల్సిన రైతులు ఆ పొద్దు తక్కువ వేసవి రాత్రి అసలు నిద్రపోలేదు. వాళ్ళు భోజ వాలు చేస్తూ హుషారుగా మాట్లాడుకోవడం, నవ్వుకోవడం మొదట అతనికి వినిపించాయి. తర్వాత వాళ్ల పాటలు పరిహాసోక్తులు వినిపించాయి.

పగలంతా కష్టపడి శ్రమ చేసినా నవ్వుతూ తుళ్ళుతూవుండే యీ మానసిక స్థితి తప్ప వాళ్లల్లో అన్యమైంది లేకపోయింది. యిక తెల్లవారుతుందనగా అంతా సద్దు మణి గింది. రాత్రి శబ్దాలు తప్ప మరేదీ వినిపించలేదు. బాడవలో విరామం లేకుండా అరిచే కప్పల బెకబెకలు, పచ్చికబీటిమీద గుర్రాల సకిలింపులు వినవచ్చేయి. పచ్చికబీటిమీద ప్రభాత తుషారం పరచుకుంటోంది. కళ్లు తెరవగానే లేవిన్ గడ్డిమోపు మీదనుంచి లేచి నక్షత్రాలని చూసి రాత్రి గడిచి పోయిందని గ్రహించేడు.

'అయితే నేను యేం చెయ్యను? యెలా చెయ్యను?' అని తనలో తను అనుకున్నాడు. ఆ కురచ రాత్రి తను ఆలోచించుకుని, అనుభూతం చేసుకున్న దాన్ని అభివ్యక్తం చేసుకో ప్రయత్నించేడు. తను ఆలోచించుకుని, అనుభూతం చేసుకున్న దాన్నంతటినీ మూడు తర హాల ఆలోచనా స్రవంతుల కింద విభజించు కోవచ్చు. మొదటిది, తన పాత జీవితాన్నీ, నిరుపయోగమైన జ్ఞానాన్నీ, పనికిరాని విద్యనీ త్యజించడం. అలా త్యజించడం అతనికి సంతోషాన్ని కలిగించింది. దాన్ని అతను సునాయాసంగా, నిరాటంకంగా చేసేశాడు. రెండవ ఆలోచనా స్రవంతి తను గడప దలుచుకున్న జీవితానికి సంబంధించింది. యీ జీవితం స్వచ్ఛంగా, నిరాడంబరంగా, ఔచిత్యభరితంగా వుంటుందనడంలో అనుమానమే లేదు. తను ప్రస్తుతం బతుకుతున్న జీవితంలో లభ్యం కాని సంతోషం, శాంతి, తృప్తి, యీ జీవితంలో లభ్యమవుతాయన్న విశ్వాసం అతనికి వుంది. ప్రస్తుత జీవితంలో ఆ లోటు అతను విచారంగా అనుభూతి చెందుతూనే వున్నాడు. మూడవ స్రవంతి యీ పాత జీవితంనుంచి కొత్త జీవితానికి పరివర్తన యెలా జరిపించాలన్న సమస్యమీద కేంద్రితమై వుంది. ఈ ప్రశ్నకి జవాబు అతనికి స్పష్టమవలేదు. 'పెళ్లిచేసుకోనా? ఏదైనా పని చెయ్యనా? పని చెయ్యాల్సిన ఆవశ్యకతని అనుభూతం చేసుకోనా? పొక్రోవ్స్కొయెని వదిలెయ్యనా? పొలం కొననా? రైతు కమ్యూన్‌లో కలిసిపోనా? ఏ రైతు పిల్లనైనా పెళ్లి చేసుకోనా? యెలా జీవితాన్ని మార్చుకోను?' అని అతను పదే పదే అనుకున్నాడు. కాని జవాబు దొరకలేదు. 'రాత్రంతా నిద్రపోలేదు కాబట్టి స్పష్టమైన జవాబు పట్టుకోలేకపోతున్నాను' అని తనని తను పూరడించుకున్నాడు. 'సరే తర్వాత యీ సంగతి తేల్చుకుంటాను. కాని ఒకటి మాత్రం ఖాయం. యీ రాత్రి నా అదృష్టం నిర్ణయమై పోయింది. కుటుంబ జీవితం గురించి నా పూర్వపు కల లన్నీ వొట్టివి. అవాస్తవికమైనవి. ప్రతీదీ చాలా సాదాగా యింతకంటే మెరుగ్గా వుంటుంది...'

'యెంత మనోహరంగా వుంది' అని పైన ఆకాశంలో ముత్యపు చిప్పలా కనిపించేటట్టు యేర్పడ్డ తెల్లని మేఘాన్ని చూసి అనుకున్నాడు. 'యీ మధురాతి మధురమైన రాత్రి ప్రతీదీ

యెంత మనోహరంగా కనిపిస్తోంది. ఆ ముత్యపు చిప్ప యెలా యేర్పడింది? ఓ క్షణంకితమే పైకి చూశాను. యేమీ లేదక్కడ – దూది పింజల్లాంటి రెండు మేఘ శకలాలు తప్ప. జీవితం పట్ల నా దృష్టి కోణం కూడా తెలియకుండానే మారిపోయింది.'

అతను సత్రంకబీటిమంచి బయల్దేరి రాజపథంమీద పూరితేస నడిచాడు. తెమ్మెర గాలి వీచింది. అంతా బూడిద వర్ణంగా, విస్తృజంగా అయింది. సూర్యోదయానికి ముందు, తమస్సుమీద పూర్తి విజయం సాధించే తేజస్సుకి ముందు కనిపించే సొగసంచు ఆవహించే క్షణం అది.

లేవిన్ చలికి భుజాల్ని ముడుచుకుని దారి చూస్తూ గబగబా అడుగులు వేసుకుంటూ నడిచాడు. బండి గంటల చప్పుడు వినిపించింది. 'యేమిటో అది? బండిలో యెవరేనా వస్తున్నారేమో' అనుకున్నాడు. తల పైకి యెత్తాడు. తను వెడుతూవున్న రాజపథం వేపు నో నలభై అడుగుల దూరంలో నాలుగు గుర్రాల బండి వస్తోంది. ఆ బండిమీద పెద్ద పెద్ద తోలు పెట్టెలు వున్నాయి. రోడ్డుమీద చక్రాలగాడివల్ల యేడికోళ్ల గుర్రాలు కాడికి తాసుకుంటు న్నాయి. కాని తోలేవాడు చురుకైనవాడు. పైన కూర్చుని చక్రాలని గాళ్లలోనే వుండేటట్టు జాగ్రత్త పడి తోలుతున్నాడు. బండి ఆ మాదిరిగా నలిగిన దారిలో సాఫీగా వస్తోంది.

లేవిన్ అది మాత్రమే చూశాడు. తర్వాత యథాలాపంగా, బండిలో యెవరున్నారో యేమిటో పట్టించుకోకుండానే లోపలికి చూశాడు.

బండిలో నో మూల నో ముసలావిడ జోగుతుంది. కిటికీ దగ్గరలో నో పడుచు అమ్మాయి కనిపించింది. ఆమె అప్పుడే లేచినట్టుంది. రెండు చేతులతోనూ తెల్లని టోపీకి అటూ యిటూ వేలాడే రిబ్బన్లు పట్టుకుంది. అకళంకంగా చింతాక్రాంతంగా అతనికి అపరిచిత మైన బటిల ఆంతరంగిక పరిపూర్ణ జీవితంతో వున్న ఆమె అతన్నుంచి దూరంగా ఉషో దయారుణ తేజస్సు కేసి చూస్తోంది.

ఆ దృశ్యం అదృశ్యం అయిపోతూ వుండగా ఆమె స్వచ్ఛమైన నేత్రాలు అతనికేసి చూశాయి. ఆమె లేవిన్‌ని గుర్తుపట్టింది. ఆశ్చర్యపూర్వక సంతోషంతో ఆమె వదనం వెలి గింది.

లేవిన్ పొరపాటు పడడం అనేది జరగదు. ప్రపంచంలో యిలాంటి కళ్లు మరి వుండవు. తన జీవితాన్ని ప్రకాశవంతం చెయ్యగల ప్రాణి, జీవిత పరమార్థాన్ని వెల్లడించగల ప్రాణి మరొకరు లేరు. ఈమే ఆమె. ఆమె కిట్టీ. ఆమె స్టేషన్‌నుంచి యెర్గుషోవొకి వెడుతోందని లేవిన్ గ్రహించాడు. ఉన్నట్టుండి, నిద్రలేని ఆ రాత్రి అతన్ని కలిచిన విషయాలన్నీ, అతను చేసుకున్న నిర్ణయాలన్నీ అదృశ్యం అయిపోయాయి. యెవరో రైతు పిల్లని పెళ్లి చేసుకుందా మనుకున్న ఆలోచన గుర్తు వచ్చి వెలపరం కలిగింది. గత కొన్ని నెలలుగా తనకి వ్యధ కలిగిస్తూ వున్న జీవిత సమస్యకి పరిష్కారం యిక్కడ మాత్రమే, వేగంగా వెళ్లిపోతూ వున్న బండిలో మాత్రమే వుంది.

కిట్టీ మళ్లీ బండిలోనుంచి యువతిని చూడలేదు. బండి చక్రాల కీచు చప్పుడు, గంటల గణగణ దూరం అయిపోయాయి. కుక్కలు మొరిగాయి. బండి వూళ్లోనుంచి వెడుతోందన్నమాట. చుట్టు పక్కల బోసిగా వున్న పొలాలు, యెదర గ్రామం, అలాగే యేకాకిగా అన్నిటికీ దూరమై రాజపథంమీద పడి వొంటరిగా వెడుతున్న తను తప్ప యేమీ లేదు.

తనకి రాత్రి వచ్చిన అన్ని ఆలోచనలకీ భావనలకీ ప్రతీకగా వుండి, కొద్ది క్షణాలకితం తను ముగ్ధుడై చూసిన ముత్యపు చిప్ప కనిపిస్తుందేమోనని ఆకాశం కేసి చూశాడు. ముత్యపు చిప్ప పోలికలున్న యేదీ ఆకాశంలో కనిపించలేదు. అందుకోలేని ఆ యెత్తులో యేదో గూఢమైన మార్పు జరిగిపోయింది. ముత్యపు చిప్పలాంటి దాని జాడే మిగలలేదు. దానికి బదులు సగం ఆకాశం అంతా దూది పింజల్లాంటి మేఘ శకలాలతో నిండిపోయింది. అవి యింకా యింకా తునకలై పోతూ వున్నాయి. ఆకాశం నీల వర్ణ శోభితమైంది. ప్రకాశమానంగా వుంది. అతని ప్రశ్నార్థక దృక్కుకి అదే కోమలత్వంతో బోధకు రాని అదే దూరంతో జవాబు చెప్తోంది.

'ఉహుఁ, సరళంగా, శ్రమపూరితంగా వుండే యీ బతుకు యెంత మంచిదేనా గానీ నేను అటు వెళ్లలేను. నేను ఆమెని ప్రేమిస్తున్నాను' అనుకున్నాడు.

13

కరేనిన్‌కి బాగా సన్నిహితులైన బహుకొద్దిమందికి తప్పించి మరెవళ్లకీ తెలియని విషయం వొకటి అతనిలో వుంది. పైకి జడంగా, తర్క వితర్కంగా కనిపించే యీ మనిషి సామాన్య స్వభావంతో పొసగని బలహీనత అది. ఓ ఆడమనిషి గాని, చంటిపిల్ల గాని యేడవడం చూసినా, విన్నా అతను తట్టుకోలేడు. కన్నీళ్లు కనిపిస్తే అతని మనస్సు వికలమైపోతుంది. యిక యేమీ ఆలోచించలేడు. దేన్నీ అర్థం చేసుకోలేడు. అతని కార్యదర్శికీ, ఆఫీసు సూపరింటెండెంటుకీ యీ విషయం తెలుసు. అందుచేత అతని దగ్గరికి అర్జీలు పట్టుకు వచ్చే ఆడవాళ్లని హెచ్చరించేవాళ్లు. యేడిస్తే పనులు జరగవని, ఆయన మండి పడిపోతాడు, మీరు చెప్పేదాన్ని వినను కూడా వినడు అని చెప్పేవాళ్లు. నిజానిక్కూడా అంతే. కళ్లమ్మట నీళ్లు కనిపించాయో కరేనిన్ మానసికంగా వ్యాకుల పడి పోయేవాడు. వెంటనే కోపం వచ్చేసేది. "నేనేమీ చెయ్యను, ఏమీ! మీకు పుణ్యం వుంటుంది యిక్కడ్నుంచి వెళ్లిపొండి" అని అలాంటి సందర్భాల్లో అరిచేవాడు.

గుర్రం పందేలు అయాక తిరిగి వచ్చేటప్పుడు వ్రాన్‌స్కీకి తనకీ గల సంబంధాల గురించి బయటపెట్టి, అన్నా చేతులతో ముఖం కప్పుకుని యేడ్చింది. కరేనిన్‌కి ఆమె పట్ల క్రోధం రేగినా మానసికంగా వివశుడైపోయాడు. కన్నీళ్లు కనిపించినప్పుడు అతనికి అనుభూతమయే స్థితి అలాంటిది. ఈ విషయం తెలిసీ, యిలాంటి పరిస్థితిలో తన భావనల్ని వ్యక్తం చెయ్యడం ఉచితంగా వుండదని తెలిసీ అతను జీవలక్షణాలన్నిట్నీ లోపల్లోపల దమించుకుని,

దాచుకొనే ప్రయత్నం చేశాడు. చలించలేదు. ఆమె కేసి చూడలేదు. ఆ కారణంగా అతని ముఖంలో మృతుని మాదిరి కనిపించే అర్థం కాని కవళిక ద్యోతకమైంది. అది అన్నాని నిశ్చేష్టురాల్ని చేసింది.

ఇంటికి చేరాక ఆమె బండి దిగడానికి సాయం చేశాడు. తన ఆందోళనలని అదుపులో వుంచుకుని యెప్పటి లాగానే మామూలు మర్యాదలకి లోటు రానివ్వకుండా ఆమె దగ్గర సెలవు తీసుకొని తను అనవలసిన బాధ్యతలేని ఆ మాటలని అన్నాడు. మర్నాడు తన నిర్ణయాన్ని ఆమెకి తెలియజేస్తానని అన్నాడు.

పరమ దారుణమైన తన అనుమానాలని రుజువు చేస్తూ భార్య చేసిన నివేదన అతనికి తీవ్రమైన బాధ కలిగించింది. ఆమె కన్నీళ్లు ఆమె పట్ల తనలో కలిగించిన జాలివల్ల యీ బాధ మరింత యెక్కువయింది. కాని బండిలో ఒక్కడూ వున్నాక ఆ జాలి గాని, తనని అప్పటి దాకా వేధిస్తూ వున్న అనుమానాలు, యీర్ష్యలు గాని లేకుండా తను పూర్తిగా విముక్తమవడం చూసి అతనికి ఆశ్చర్యం కలిగింది. సంతోషం కలిగింది.

ఎంతో కాలంగా సలుపు పెడుతున్న పన్ను వూడిపోయిన వాడిలాగా తెరిపిన పడ్డట్టు అతనికి అనిపించింది. భయంకరమైన నొప్పిని, తన తల కంటె పెద్దదాన్ని దవడనుంచి పీకేశాక తన జీవితాన్ని విషకలుషితం చేసి, అంత కాలంగా తన సకల ఆలోచనలకీ కేంద్రం అయినటువంటిది పోయిందనీ, తను మామూలు జీవితం గడపవచ్చనీ, పన్ను గురించి కాక యితర విషయాల గురించి ఆలోచించవచ్చనీ రోగి నమ్మలేడు. కరేనిన్‌కి అలాంటి ఉపశమనం కలిగింది. తెలియని నొప్పి, ఘోరమైన నొప్పి వుంది, కాని అది పోయింది. ఇప్పుడు తను కేవలం భార్య గురించే ఆలోచించ నక్కర్లేకుండా బతకొచ్చు.

'పతితురాలు, నీతి నిజాయితీ లేనిది, హృదయం లేనిది, భ్రష్టురాలు. నాకిది సర్వదా తెలుసు, సర్వదా చూస్తూనే ఉన్నాను. కాని ఆమె పట్ల జాలి కొద్దీ నన్ను మోసం చేసుకొని ప్రయాసపడ్డాను' అనుకున్నాడు. తను సర్వదా దాన్ని గమనించినట్టే అతనికి నిజంగా అనిపించింది. తాము యిద్దరూ గడిపిన జీవితం గురించి వివరంగా గుర్తు చేసుకున్నాడు. యింతకు పూర్వం అభ్యంతరకరమైంది యేదీ అతనికి అందులో కనిపించలేదు. కాని యిప్పుడు, ఆమె యెప్పుడూ పతితురాలిగా వున్నట్టే కనిపించింది. 'ఆమెని పెళ్లి చేసుకొని తప్పు చేశాను. కాని నా తప్పులో నింద్యమైంది యేదీ లేదు, అందుచేత విచారించలేను. దోషిని నేను కాదు, ఆమె. ఇక నాకు ఆమెతో సంబంధం యేమిటి? నాకు సంబంధించి ఆమె లేనట్టే...' అనుకున్నాడు.

ఆమెకీ, కొడుక్కీ యిక యేం జరిగినా తనకి పట్టదు. భార్య పట్ల అతని వైఖరి మారినట్టే కొడుకు పట్ల కూడా మారిపోయింది. ఇప్పుడతనికి పట్టిన విషయమల్లా ఒకటే. ఉన్నంతలో ఉత్తమంగా, మర్యాదకి భంగం కలక్కుండా, తనకి పరమ శ్రేష్ఠంగా, అంటే న్యాయసమ్మతమైన రీతిలో, ఆమె జారిపోతూ తనమీద చల్లిన బురదని కడుక్కుని, తన

క్రియాశీల, నిష్క్రియ, నిరుపయోగిక జీవనపథంమీద వెళ్ళడం యెలాగా అనేది చూడ్డం పొక్కుటే.

'ఓ తుచ్ఛురాలెవరో పాపం చేసిందని చెప్పి నేను విచారించను. ఆమె నన్ను యీ వికట పరిస్థితిలోకి తోసింది. దీన్నుంచి బయటపడే మార్గమే నేను వెతుక్కోవాలి. ఆ దారి పట్టు కుంటా' అని యింకా యింకా యెక్కువగా ముఖం చిట్లించుకుంటూ తనలో తను అనుకు న్నాడు. 'నేనే మొదటి వాణ్ణీ కాను, ఆఖరి వాణ్ణీ కాను' అనుకున్నాడు. మెనెలెవ్‌తో మొదలై అనేక ఉదాహరణలు అతని మనస్సుకి స్ఫురించాయి. "సుందరి హెలెన్" ఒపెరెట్టాతో అప్పుడే కొత్తగా అందరికీ గుర్తువచ్చిన దాఖలా అది. ఆ మాదిరి ఐతిహాసిక నామాలే కాకుండా ఆధు నిక ఉన్నత సమాజంలో భర్తలకి ద్రోహం చేసిన భార్యల అవిధేయతకి సంబం ధించిన ఉదాహరణలు అనేకం గుర్తు వచ్చాయి. 'దర్యాలోవ్, పోల్తావ్‌స్కీ, ప్రిన్స్ కరిబానొవ్, కౌంట్ పస్కూదిన్, డ్రామ్... అవును, డ్రామ్ కూడా... అంతటి నిజాయితీపరుడూ, సమర్థుడూ కూడా... సెమ్యొనొవ్, చాగిన్, సిగోనిన్'ల పేర్లు కరేనిన్‌కి గుర్తు వచ్చేయి. 'పాపం కొంత అన్యాయమైన ridicule[1]కి వాళ్ళు గురయి వుండచ్చు. కాని నాకు వాళ్ళ దురదృష్టం తప్ప మరేదీ కనిపించలేదు. యెప్పుడూ వాళ్ళంటే నాకు జాలిగా వుండేది' అనుకున్నాడు, అది నిజం కాకపోయినా. అలాంటి దురదృష్టవంతుల పట్ల అతను యెప్పుడూ సానుభూతి చూపించలేదు. నిజానికి భర్తల్ని వంచించే ఆడవాళ్ళ ఉదాహరణలు యెంతగా యెదురైతే అతనికి తనపట్ల ఆధిక్యభావం అంత హెచ్చేది. 'యెవళ్ళకైనా సంప్రాప్తమయే దుర దృష్టం యిది. యిప్పుడు నాకు తటస్థించింది. ఇప్పుడున్న ముఖ్య విషయమల్లా యెలా ఉత్త మంగా బయటపడడం అనేదే.' తను ప్రస్తుతం వున్న పరిస్థితుల్లాంటివి యెదురైన వాళ్ళ యేమేం చేశారో వాటిని మననం చేసుకున్నాడు.

'దర్యాలోవ్ ద్వంద్వ యుద్ధం చేశాడు...'

యువకుడుగా వున్నప్పుడు కరేనిన్‌కి ద్వంద్వ యుద్ధం పట్ల ఆకర్షణ వుండేది. తను స్వభావ రీత్యా పిరికివాడు కావడమే అందుక్కారణం. ఆ విషయం అతనికీ తెలుసు. తనకేసి పిస్తోలు గురిపెట్టి వుండడమనే వూహకే అతను గజగజలాడి పోయేవాడు. తన జీవితంలో యెన్నడూ యే ఆయుధాన్నీ పట్టుకుని యెరగడు. ఈ భయంవల్లనే అతను పడుచుదనంలో ద్వంద్వ యుద్ధాలు చెయ్యడం గురించీ తన బతుకుని ప్రమాదంలో పడవేసే పరిస్థితుల గురించీ ఆలోచించుకునేవాడు. తర్వాత జీవితంలో మెట్లెక్కి పైకి వచ్చి, లోకంలో ఓ సుస్థిర స్థానం సంపాదించేక తన చిన్ననాటి యీ వూహల్ని మరిచిపోయాడు. ఇప్పుడు ఆ పాత అను భూతులు మళ్ళీ తమ రంగు చూపించాయి. తను పిరికివాడు అనే భయం యెంత బలీయంగా వుందంటే అతను చాల సేపు ద్వంద్వ యుద్ధం చేసే అవకాశం గురించి తున్నాంగా ఆలో

---

[1] అవహేళన (ఫ్రెంచి).

చించాడు. లోపల్లోపం ఆ వూహతో నయ్యాటలాడుకున్నాడు, యెట్టి పరిస్థితులలోనూ తను ద్వంద్వ యుద్ధం చెయ్యడని తెలిసి వున్నా.

'నిస్సందేహంగా మన సమాజం యెంత అటవికంగా వుందంటే (ఇంగ్లండ్ అలాంటిది కాదు) చాలమంది' – యీ చాలా మందిలో కరేనిన్ ఘనంగా యెంపిక చేసేవాళ్లు కూడా వున్నారు – 'ద్వంద్వ యుద్ధాలు మంచివని అనుకుంటారు. కాని వీటివల్ల యేం వొరుగుతుంది? మాటకి, నేనతన్ని ద్వంద్వ యుద్ధానికి రమ్మని సవాల్ చేస్తాననుకుందాం' అని కరేనిన్ మనస్సులో అనుకున్నాడు. సవాలు చేసిన తర్వాత గడపవలసిన ఆ రాత్రి గురించీ, తన కేసి యెక్కుపెట్టిన పిస్తోలు గురించీ కళ్లకి కట్టినట్టుగా వూహించుకుని వణికిపోయాడు. తను అలా యెన్నటికీ చెయ్యలేడని అతనికి బోధపడింది. 'మాటకి అతన్ని ద్వంద్వ యుద్ధానికి రమ్మని సవాలు చేస్తాననుకుందాం. పిస్తోలు పేల్చడం గురించి నాకు సూచనలు చేస్తారని అనుకుందాం. నా స్థానంలో నుంచుంటాను. ట్రిగ్గర్ నొక్కుతాను' అనుకున్నాడు కళ్ళు మూసుకుని. 'ఫలితం తేలుతుంది, అతన్ని హత్య చేసానని' కరేనిన్ తనలో తను అనుకుని, యీ తెలివితక్కువ వూహని విదిలించు కుంటున్నట్టుగా తలని గట్టిగా వూపేడు. 'తప్పు చేసిన పెళ్లానికీ, కొడుక్కీ, తనకీ వున్న సంబంధాలని పరిష్కరించుకోవడానికి యెవణ్ణో హత్య చెయ్యడంలో అర్థమేదన్నా వుందా? పెళ్లాంతో వ్యవహారం యెలా తేల్చుకోవాలీ అనే విషయం మిగిలే వుంటుంది. పైగా నన్నే చంపెయ్యచ్చు లేదా గాయపర్చచ్చు, వీటికి యెక్కువ అవకాశం వుంది కూడాను. యే పాపం పుణ్యం యెరుగని వాణ్ణి బలైపోతాను, చచ్చేనా పోతాను, క్షతగాత్రుణ్ణేనా అవుతాను. ఇది యింకా అసంబద్ధంగా వుంటుంది. పైగా వో మనిషిని ద్వంద్వ యుద్ధానికి పిలవడం నా తరపునుంచి చూస్తే నిజాయితీ అయిన పని కాదు. నేను ద్వంద్వ యుద్ధం చెయ్యడానికి నా మిత్రులు యెన్నడూ వొప్పుకోరన్న విషయం నాకు ముందే తెలీదా? ఒక రాజనీతిజ్ఞుడు, తన దేశానికి యెంతో అవసరం అయిన వ్యక్తి జీవితం ప్రమాద భరితం కావడం యెన్నటికీ వొప్పరు. దాని ఫలితం యేమవుతుంది? యేమవుతుంది అంటే, పరిస్థితి విషమించే అంచుదాకా యీ విషయాన్ని పోనివ్వడం జరగదని ముందే నాకు తెలిసి వుండడంవల్ల అతన్ని సవాలు చేసి నా శీలంమీద యెందుకూ పనికి రాని మిథ్యా కాంతి పుంజాల్ని ప్రసరింప చేసుకోవడం జరుగుతుంది. అది దగా, ఆత్మ వంచన. నన్నూ, యితరుల్నీ కూడా మోసం చేసుకోవడం అవుతుంది. ద్వంద్వ యుద్ధం గురించిన మాట యెత్తకో కూడదు, యెవరూ నేను అలాంటి పని చేస్తానని అనుకోరు. యే యితరమైన బాధా లేకుండా నా కార్యకలాపాలని నిర్వహించుకుందుకు నా గౌరవం కాపాడుకోవడం నా లక్ష్యం' అనుకున్నాడు. కరేనిన్ యెప్పుడూ ప్రభుత్వ వ్యవహారాలని ముఖ్యమైనవిగా భావించుకునేవాడు. అవి యిప్పుడు యింకా ముఖ్యమైనవిగా కనిపించేయి.

ద్వంద్వ యుద్ధం గురించి ఆమూలాగ్రం క్షుణ్ణంగా ఆలోచించి దాన్ని కాదని తోసి పారేశాక కరేనిన్ విడాకుల గురించి అనుకున్నాడు. అతనికి గుర్తు వున్న కొంతమంది దగా

పడిన భర్తలు యెంచుకున్న పరిష్కారం అది. తనకి తెలిసిన విడాకుల సందర్భాల నన్నిట్నీ గుర్తు చేసుకున్నాడు (తనకి పరిచయమైన నాగరిక సమాజంలో అలాంటివి చాలా వున్నాయి). కాని తన లక్ష్యంతో సరిపడే లక్ష్యం గల సందర్భం వొక్కటే కనిపించలేదు. ప్రతి సందర్భం లోనూ భర్త, వివాహ ధర్మాన్ని అతిక్రమించి నడిచిన భార్యని ఆమె ప్రియుడికి ధారపొయ్యడమో, అమ్మెయ్యడమో జరిగింది. ఆ పాపిష్టి ఆడమనిషికి, తను చేసిన దుష్కృత్యంవల్ల తిరిగి పెళ్లి చేసుకొనే అవకాశం వుండే హక్కులేని ఆ పాపిష్టి ఆడమనిషికి, కొత్త జీవిత భాగస్వామితో కపటమైన చట్ట సమ్మత సంబంధం చేసుకోవడం జరిగింది. తనకి సంబంధించిన యీ సందర్భంలో కరేనిన్‌కి తృప్తికరమైన విడాకుల అవకాశం కనిపించలేదు. అంటే దోషి అయిన భార్యని వదిలెయ్యడం మేరకి మాత్రమే వుండే విడాకులు. వివాహ ధర్మాన్ని అతిక్రమించి నడిచిన భార్య దోషాన్ని బట్ట బయలు చెయ్యడానికి చట్టం కోరే మోటు ప్రమాణాలనన్నిట్నీ సంపాదించడం, తను వున్న జీవితపు జటిల పరిస్థితులవల్ల సాధ్యం కాదని అతనికి తెలుసు. ఒక వేళ అలాంటి సాక్ష్యాలని సంపాదించినా వాటిని ముందుపెట్టడానికి యీ జీవిత సంస్కారం అనుమతించదు. యేమంటే అలాంటి దానివల్ల తనే లోకం దృష్టిలో ఆమె కంటే నీచంగా చులకన అయిపోతాడు.

విడాకుల కోసం చేసే ప్రయత్నంవల్ల నలుగురిలోనూ నవ్వుల పాలయే పరిస్థితి తల యెత్తుతుందంతే. దాన్ని తన విరోధులు తనని అప్రతిష్ట పాలుచెయ్యడానికీ, సమాజంలో తను వున్న ఉన్నత స్థానంనుంచి తనని దిగలాగడానికీ వాటంగా వాడుకుంటారంతే. తన ముఖ్య ఉద్దేశం, అంటే అతి తక్కువ నష్టంతో వ్యవహారాన్ని పరిష్కరించుకోవడం అనేది, విడాకులవల్ల కూడా నెరవేరదు. అదీ గాక విడాకులవల్ల లేదా విడాకులు పొందడానికి చేసే ప్రయత్నంవల్ల కూడా స్పష్టం అయేదేమంటే భార్యకి భర్తతో వున్న సంబంధాలు తెగిపోతాయి. తన ప్రియుడితో కలిసి పోవడానికి ఆమె స్వతంత్రురాలవుతుంది. భార్య పట్ల తిరస్కార పూరిత ఉదాసీన భావం తనకిప్పుడు వుందని కరేనిన్ భావించు కున్నప్పటికీ, అతని హృదంతరాళంలో వొకటి మాత్రం బలంగా వుండిపోయింది. అది ఆమె వ్రాన్‌స్కీతో యే బాధా లేకుండా కలవకూడదు అనేది. ఆమె దోషం ఆమెకి వరం కాకూడదు. అసలా ఆలోచనే కరేనిన్‌కి యెంతో గుండెలు పిండినట్టయి అతను లోపల్లోపల మూలిగాడు. బండిలో చోటు మారి చాలా సేపు ముఖం చిట్లించుకుని కూర్చున్నాడు. చలికి చల్లగా అయిన పుల్లి లాంటి కాళ్లమీద ఉన్ని రగ్గు కప్పుకున్నాడు.

'చట్ట సమ్మతమైన విడాకులకి బదులుగా కరిబానోవ్, పస్యూదిన్, మంచి మనిషి ద్రామ్ చేసినట్టు చెయ్యొచ్చు, భార్యనుంచి విడిపోవచ్చు' అని మనస్సుకి విమ్మళం చిక్కాక అనుకున్నాడు. కాని ఆ పని కూడా విడాకులంత అప్రదిష్టగానూ తయారవుతుంది. పైగా యేమంటే ఆ విడాకుల్లాగానే యిదీ ఆమెని వ్రాన్‌స్కీ వొళ్లో పడేస్తుంది. 'లేదు, యిది అసంభవం, అసంభవం' అని అతను పైకే అనేశాడు. మళ్లీ రగ్గుని కాళ్లమీదకి పైకి లాక్కున్నాడు.

'నేను దుఃఖపడకూడదు, కాని ఆన్నా వ్రాన్‌స్కీలని సుఖపడనివ్వకూడదు' అనుకున్నాడు.

విషయం అసందిగ్ధంగా ఉన్నంత కాలం అతను పడ్డ యాతన, అనుభవించిన యీర్ష్య భావం, బాధతో పన్నుని కూడా పీకేసినట్టు, భార్య వెళ్ళగక్కేసిన మాటలతో ఆ క్షణంలోనే పోయాయి. కాని వాటి స్థానంలో మరో భావన వచ్చింది. ఆమె నెగ్గకూడదు, అంతేకాదు, ఆమె దోషానికి దండన అనుభవించాలి అనే కోరిక అతని మనస్సులో రేగింది. తనకా భావం వుందని అతను ఒప్పుకోడు, కాని తనకు మనశ్శాంతి లేకుండా చేసినందుకు, తనకి అప్రతిష్ఠ కలిగించినందుకు ఆమె వ్యధకి గురవాలని లోపల్లోపల అతనికి వుంది. ద్వంద్వ యుద్ధానికి, విడాకులకి, వేర్పాటుకి సంబంధించిన పరిస్థితులని మరో సారి సింహావలోకనం చేసుకున్నాక, వాటిలో యేదీ సరికాదని మళ్ళీ తోసిపారేశాక కరేనిన్‌కి ఒకే ఒక మార్గం వున్నట్టు నమ్మకం కలిగింది. జరిగిందేదో జరిగింది. దాన్ని నలుగురికీ తెలియకుండా గుంభనగా వుంచి ఆమెని తనతోనే వుండనివ్వడం; అతనితో కలిసే అవకాశాలు లేకుండా చెయ్యడానికీ అలాగే ముఖ్యంగా (యీ విషయాన్ని తనకిగా తను ఒప్పుకోక పోయినా) ఆమెని దండించడానికీ, తనకి అందుబాటులో వున్న పద్ధతులన్నిట్నీ వాడడం. 'నేను యీ నిర్ణయాన్ని ఆమెకి ప్రకటించాలి. ఆమె తన సంసారాన్ని యెలాంటి దురదృష్టకర పరిస్థితుల్లో పడేసుకుందో వాటి నన్నిట్నీ సాకల్యంగా పర్యాలోచించాక పైకి status quo[1] కాపాడుకోవడమే యిరు పక్షాలకీ అన్నిట్లోకీ ఉత్తమమైన పద్ధతి. అలా చెయ్యడానికి నేను ఒప్పందం అవుతాను ఒక షరతు మీద: అతనితో అన్ని బంధనాలనీ తెంచుకోవాలి అన్న నా కోరికని ఆమె కచ్చితంగా పాటించాలి.' కరేనిన్ యీ నిర్ణయం చేసుకోగానే దానికి సమర్థనగా మరో బలీయమైన వాదం అతనికి స్ఫురించింది. 'యిలాంటి నిర్ణయంవల్ల నేను ధర్మానుసారం కూడా చరిస్తున్నట్టవుతుంది' అనుకున్నాడు. 'యిలాంటి నిర్ణయం చేసుకోవడంద్వారా మాత్రమే నేను పాపాత్మురాలైన ఆమెని విసిరెయ్యకుండా వుంటాను, బాగుపడడానికి అవకాశం యిస్తున్నాను. అంతే కాదు, నాకు యెంత కష్టప్రదమైనదైనా గానీ ఆ పని, ఆమెని సంస్కరించడానికి, ఆమెని రక్షించడానికి నా శక్తిని కూడా కొంత సమర్పిస్తున్నాను.' తన భార్యమీద తను యే రకమైన నైతిక ప్రభావాన్నీ కలిగించలేడని కరేనిన్‌కి తెలుసు. ఆమెని సంస్కరించడానికి తను చేసే ప్రయత్నాలవల్ల కపటత్వం, వంచన తప్ప మరేమీ ఒరగదనీ తెలుసు. యీ పరీక్షా కాలమంతటిలోనూ ఒక్క సారి కూడా ధర్మాన్ని అనుసరించాలన్న విషయమే అతని మనస్సుకి తట్టలేదు. అయినా కూడా యిప్పుడతను చేసుకున్న నిర్ణయం ధర్మ నియమానుసారంగా వుందనుకున్నాడు. తన నిర్ణయానికి ధర్మామోదం వుండడం అతనికి ఓ మేరకి చిత్త శాంతినీ, పూర్తిగా సంతృప్తినీ యిచ్చింది. సామాన్యంగా ఉదాసీన, ఉత్సాహహీన స్థితిలో వున్నప్పుడు కూడా యే ధర్మ నియమాల పతాకాన్ని తను యెగరేశాడో వాటి అనుగుణంగా

---

[1] యథాతథ పరిస్థితి (లాటిన్).

జీవితంలో యింతటి ముఖ్యమైన విషయానికి సంబంధించి తను నడవలేదన్న నిందని యెవరూ తనమీద మోపలేరని అతనికి సంతోషం కలిగింది. యీ విషయానికి సంబంధించి మరింతగా ఆలోచించుకున్నప్పుడు తన భార్యతో సంబంధాలు దాదాపు పూర్వంలో వున్న మాదిరీ యెందుకు వుండకూడదు అనిపించింది. ఆమె పట్ల మునుపటి గౌరవ భావం యిక యెన్నటికీ తిరిగి రాదన్న దాంట్లో అనుమానం లేదు. కాని దుష్టశీల, పాపాత్మురాలు అయిన భార్య కారణంగా తను బాధపడ్డంలో, తన జీవితం నాశనం చేసుకోవడంలో అర్థం లేదు, వుండబోదు. 'కాలం గడుస్తుంది, కాలమే అన్నిటినీ సరిచేసే మందు. పూర్వపు మా సంబంధాలు తిరిగి పాదు కుంటాయి. అంటే నా జీవితంలో అశాంతిని అనుభవించని హద్దుదాకా తిరిగి వస్తాయి. ఆమె దుఃఖితురాలు కాక తప్పదు, కాని ఆ తప్పు నాది కాదు. అంచేత నేను దుఃఖితుణ్ణి కాను' అనుకున్నాడు.

14

బండి పీటర్స్‌బుర్గ్ చేరే వేళకి కరేనిన్ యీ నిర్ణయం గురించి సకల పార్శ్వాలనుంచీ ఆలోచించడమే కాక, భార్యకి రాయదలుచుకున్న ఉత్తరాన్ని కూడా మనస్సులో అనుకున్నాడు. హాల్లోకి వెళ్ళగానే సచివాలయంనుంచి వచ్చిన ఉత్తరాలు, కాగితాలు కనిపించాయి. వాటిని చదువుకునే గదిలోకి తీసుకు రమ్మని పురమాయించేడు.

"గుర్రాల్ని వదిలెయ్యండి. యెవర్నీ రానివ్వకండి" అని యీ ఆఖరి మాటని వొత్తి పలుకుతూ నౌకరు అడిగిన దానికి జవాబు చెప్పాడు. అలా అనడం చిహ్నం తను హుషారుగా వున్నట్టు.

చదువుకునే గదిలోకి వెళ్ళాక రెండు సార్లు అటూ, యిటూ పచారుచేశాడు. రాసు కునే పెద్ద మేజా పక్కన ఆగేడు. అతని నౌకరు అప్పటికే ఆరు కొవ్వొత్తులు వెలిగించి అక్కడ పెట్టాడు. కరేనిన్ వేళ్ళ మెటికలు విరుచుకుని మేజా దగ్గర కూర్చుని రాత పరికరాల్ని సర్దేడు. తర్వాత మోచేతులు దానిమీద ఆన్చి, తల అడించి వో క్షణం ఆలోచించి, తర్వాత వో క్షణం కూడా ఆగకుండా రాయడం మొదలుపెట్టాడు. అతను సంబోధన యేమీ లేకుండా ఫ్రెంచిలో 'మీరు' అని సర్వనామం వాడుతూ రాశాడు. రష్యను భాషలో వున్న తత్సమానార్థకపదం కంటే ఫ్రెంచిలో అది తక్కువ నిరాదరంగా వుంటుంది.

'ఆఖరు సారి మనం మాట్లాడుకున్నప్పుడు మన సంభాషణ విషయానికి సంబంధించి నా నిర్ణయాన్ని తెలియ చేస్తానన్న కోరిక వ్యక్తం చేసాను. అన్ని విషయాలనీ సాకల్యంగా ఆలోచించాక, నేనన్న మాటని నిలబెట్టుకుందుకు యీ ఉత్తరాన్ని రాస్తున్నాను. నా నిర్ణయం యిదీ: మీ ప్రవర్తన యెలాంటి దైనప్పటికీ కూడా వొక అధికతర శక్తి మనల్నిద్దర్నీ యేకం చేసిన ఆ బంధనాన్ని తెంచే హక్కు నాకు వుందని నేను భావించడం లేదు. దంపతులలో యే వొకరి

చపల చిత్తంవల్ల గాని, యేక పక్ష సంకల్పంవల్ల గాని, యింకా చెప్తే, చేసిన పాపంవల్ల గాని కుటుంబం విచ్ఛిన్నం కాకూడదు. మన జీవితం ముందటి లాగానే సాగాలి. యిది నాకు, మీకు, మన కొడుక్కీ అవసరం. నేనీ ఉత్తరం రాయడానికి కారణం అయిన విషయానికి సంబంధించి మీరు పశ్చాత్తాపులై వుంటారనీ, యింకా పశ్చాత్తాపులవుతూ వుంటారనీ నాకు పూర్తి విశ్వాసం వుంది. మన విభేదానికి కారణమైన దాన్ని సమూలం పెకలించి వేస్తారనీ, గతాన్ని మర్చిపోవడంలో నాకు తోడ్పాటు యిస్తారనీ నాకు విశ్వాసం వుంది. అలా జరగక పోయిన పక్షంలో మీకు, మీ కొడుక్కీ కలగబోయే పరిణామాల గురించి వూహించుకోగలరు. యీ విషయం గురించి ముఖతః మరింత వివరంగా మాట్లాడగలనని ఆశిస్తున్నాను. పల్లెలోని వేసవి విడిదిలో వుండవలసిన సమయం ముగుస్తోంది కాబట్టి వీలైనంత త్వరగా, మంగళ వారం లోపున పీటర్స్‌బుర్గ్‌కి తిరిగి రావాల్సిందిగా అభ్యర్థన. యిక్కడికి రావడానికి సంబం ధించిన యేర్పాట్లన్నిట్నీ చెయ్యడం జరుగుతుంది. యీ అభ్యర్థనని మీరు మన్నించడం అనే విషయానికి నేను ప్రత్యేక ప్రాముఖ్యం యిస్తున్న సంగతి మీరు గ్రహించాలి.

అ. కరేనిన్.

తా. క. ఈ ఉత్తరంతో బాటు కొంత పైకం కూడా పంపుతున్నాను, మీ ఖర్చులకోసం యిది అవసరం కావచ్చు.'

తను రాసింది చదువుకుని తృప్తి పడ్డాడు. ముఖ్యంగా పైకానికి సంబంధించి కూడా దృష్టి పెట్టినందుకు. ఉత్తరంలో వో పరుష వాక్యం గాని వో ఛీత్కారం గాని లేదు. అలా అని లొంగిపోవడమూ లేదు. ముఖ్య విషయం యేమంటే తిరిగి రావడానికి సువర్ణ వారధిని తెరిచింది యిది. అతను ఉత్తరాన్ని మడిచి, దాన్ని పెద్ద ఏనుగు దంతం పేపర్ నైఫ్‌తో అదిమేడు. పైకాన్నీ, దాన్నీ వో కవరులో పెట్టాడు. అక్కడ వున్న లేఖన సామగ్రి తనకి సర్వదా ప్రదానం చేసే సంతోషాన్ని అనుభవించేడు. అప్పుడు గంట మోగించాడు.

"దీన్ని హర్కారా కిచ్చి రేపు దాచా దగ్గర అమ్మగారికి అంద చెయ్యమని చెప్పాలి" అన్నాడు లేస్తూ.

"చిత్తం హుజూర్, టీ యిక్కడికే తెమ్మంటారా?"

అక్కడికే టీ తీసుకు రమ్మని కరేనిన్ పురమాయించేడు. యేనుగు దంతం పేపర్ నైఫ్‌తో ఆడుకుంటూ చేతుల కుర్చీ దగ్గరకు వెళ్లాడు. దాని పక్కన దీపం వెలుగుతోంది. అక్కడనే ప్రాచీన ఇటాలియన్ లిపి*కి సంబంధించిన పుస్తకం వుంది. అది ఫ్రెంచి భాషలో వుంది. దాన్ని అతను చదువుతున్నాడు. చేతులు కుర్చీ పైన బంగారు అండాకార చట్రం బిగించిన అన్నా చిత్రం వుంది. దాన్ని వో విఖ్యాత చిత్రకారుడు చిత్రించాడు. చిత్రం శోభా యమానంగా వుంది. కరేనిన్ దానికేసి చూశాడు. నిగూఢ నేత్రాలు అతని కేసి పొగరుగా, అవహేళనగా చూశాయి. కడపటి సారి వాళ్లు సంభాషించుకున్న సాయంత్రం అతని కేసి చూసి

నట్టు చూశాయి. చిత్రకారుడు అన్నా శిరస్సుపైన యెంతో మనోహరంగా గీసిన నల్లని లేసు, నల్లని జుట్టు, వుంగరం వున్న అనామికతో తెల్లగా అందంగా భాసించే చెయ్యి వ్యక్తం చెయ్యలేనంత పొగరు మొత్తనంగా, సవాల్ చేస్తున్నట్టుగా ప్రతిఫలమయ్యాయి. అతను చిత్రం కేసి వో క్షణం చూశాడు. అతనికి కంపం కలిగింది. అతని పెదాలు 'బ్ర్'మని గొణిగాయి. అతను ముఖం వెనక్కి తిప్పేసుకున్నాడు. అతను హడావుడిగా చేతుల కుర్చీలో కూర్చున్నాడు. చదవడం మొదలెట్టాడు. కాని ప్రాచీన ఇటాలియన్ లిపి పట్ల అతనికి వున్న ఆసక్తి తిరిగి రాలేదు. పుస్తకం చూస్తున్నాడు గాని ఆలోచనలు యెక్కడనో వున్నాయి. అతను భార్య గురించి ఆలోచించడం లేదు. అంతకు ముందే ప్రభుత్వ వ్యవహారాల్లో తలెత్తిన వో క్లిష్టమైన సమస్య గురించి ఆలోచిస్తున్నాడు. అతనికి యిప్పుడదే ముఖ్య ఆసక్తికర వ్యవహారం అయింది. యిప్పుడు ఆ జటిల సమస్య మూలం యేమిటైందీ యింతకు ముందటి కంటే బాగా తెలుస్తున్నట్టు అతనికి అనిపించింది. వొక ఘనమైన ఆలోచన — అవును, యీ విషయాన్ని అతను బడాయితనం అనేది లేకుండా చెప్పగలడు — అతని మనస్సుకి తరుతోంది. అది చిక్కు ముళ్లని విప్పేస్తుంది. అతన్ని ఉద్యోగ పథంమీద యింకా ముందుకి తీసుకుపోతుంది. అతని శత్రువులకి వాగ్బంధం చేసేస్తుంది. తద్వారా ప్రభుత్వానికి యెనలేని లాభాన్ని చేకూరుస్తుంది. నౌకరు టీ తెచ్చి, అక్కడ పెట్టి వెళ్లిపోగానే కరేనిన్ లేచి రాసుకునే మేజా దగ్గరికి వెళ్లాడు. అప్పటి వ్యవహారాలకి సంబంధించిన దస్త్రం తీసి సంతుష్టికరమైన చిరునవ్వుతో స్టేండునుంచి వో పెన్సిల్ తీసేడు. ఆ జటిల సమస్యకి సంబంధించి తను కబురు పెట్టి తెప్పించిన కాగితాలు చదవడంలో నిమగ్నుడైపోయాడు. జటిలత్వం యిది. ఉన్నతోద్యోగిగా కరేనిన్‌లో వో ప్రముఖ లక్షణం వుంది. ఉద్యోగంలో పైకి వచ్చే కార్యకర్తలందరిలోనూ తప్పకుండా వుండే లక్షణమే అయినా అది కరేనిన్‌ని తోటి వాళ్లకంటే విశిష్టంగా, ప్రత్యేకంగా వుండేటట్టు చేసింది. అది అతని సంయమనం. నిజాయితీతో, ఆత్మవిశ్వాసంతో, తీవ్ర మహత్వ కాంక్షతో యీ లక్షణం మిళితమై అతన్ని ముందుకు తీసుకువెళ్లింది. పని జాగు పట్ల అతనికి వున్న యేవగింపు, కాగితం పని తగ్గించెయ్యడం, వీలున్నప్పుడల్లా తనే ఖుద్దున వ్యవహారాన్ని పరిష్కరించడం, పొదుపరితనంగా పని జరిపించడం అనేవి అతని విశిష్ట గుణాలు. జూన్ 2 నాటి విఖ్యాత కమిటీ ముందు, జరాయిస్క్ గుబేర్నియా మండలంలోని పొలాలకి నీటి పారుదల కలిగించడంలో జరిగిన అవకతవకల గురించిన విషయం గురించి తీవ్ర విమర్శ వచ్చింది. ఆ వ్యవహారం కరేనిన్ మంత్రివర్గానికి సంబంధించింది. దుబారా ఖర్చుకీ, విపరీతమైన జాగుకీ సాటిలేని ఉదాహరణ అది. కరేనిన్‌కి ఆ విమర్శ సరైనదేనని తెలుసు. జరాయిస్క్ గుబేర్నియా పొలాల నీటి పారుదల వ్యవహారం కరేనిన్‌కి ముందు పనిచేసిన అధికార్ల సమయంలో మొదలైంది. దానికి గాను యేమీ ఫలితం లేకుండా బోలెడు వృథా ఖర్చు అయిపోయిందన్న విషయమూ, యింకా అవుతోందన్న విషయమూ కాదనలేని వాస్తవాలు. కరేనిన్ అధికారంలోకి రాగానే యీ విషయం గ్రహించేడు.

యీ వ్యవహారంలో జోక్యం కలిగించు కుందా మనుకున్నాడు. కాని మొదట్లోనే కాలు యింకా గట్టిగా మోపుకోక ముందే, యీ గొడవలో చాలా మంది పెద్ద పెద్ద వాళ్లు యిరుక్కున్నారనీ దీన్ని రేపడం తెలివైన పని కాదనీ అర్థం అయింది. తర్వాత వేరే గొడవల్లో మునిగిపోయి అతను దీని విషయం మర్చిపోయాడు. మిగతా అన్నిటిలాగా యీ పనీ తన దారిన తను మందకొడిగా సాగింది. (చాలా మందికి యిది నాలుగు వేళ్లూ లోపలికి పోవడానికి యింత ఆధారంగా వుంది. ముఖ్యంగా నీతి నియమాలు గల ఆదర్శప్రాయమైన వొక సంగీత ప్రియుల కుటుంబానికి. ఆ కుటుంబంలో ఆడపిల్లలందరూ జంత్ర వాయిద్యం తెలిసిన వాళ్లే. కరేనిన్‌కి ఆ కుటుంబం పరిచితమే. పెద్దపిల్లల్లో వొకామెకి తను ధర్మపితగా కూడా వున్నాడు.) విరోధం వున్న మంత్రివర్గం యీ విషయాన్ని కెలకడం కరేనిన్‌కి తప్పనిపించింది. యేమంటే ప్రతి మంత్రి వర్గంలోనూ యీ బాపతు లాంటివి జరిగిపోతూనే వున్నాయి. ఆఫీసు వ్యవహారాల నీతి నియమానుసారం యెవరూ్‌ వీటి జోలికి పోరు. ఇప్పుడు వ్యవహారం ముగ్గులోకి యెలాగూ వచ్చింది కాబట్టి అతను ధైర్యంగా సరేనని చెప్పి గోదాలోకి దిగేడు. జరాయిస్క్ గుబేర్నియాలోని పొలాల నీటి పారుదల ఆయోగం పని తీరుని అధ్యయనం చేసి, నిరూపించడానికి వొక ప్రత్యేక ఆయోగాన్ని నియమించాలని అభ్యర్థించేడు. యిక యిప్పుడు ఆ పెద్ద మనుషులకి విదపట్టు నివ్వడు. అది ఖాయం. రష్యనేతర అల్ప సంఖ్యాక జాతుల స్థితి గతులని మెరుగు పరిచే నిమిత్తం ఆయోగాన్ని కూడా నియమించాలని అభ్యర్థించేడు. అల్ప జాతుల స్థితి గతులని మెరుగు పరిచే సమస్య జూన్ 2 నాటి కమిటీ ముందు కాకతాళీయంగా వచ్చింది. కాని కరేనిన్ యెంతో ఘోరంగా దుర్దశ అనుభవిస్తున్న ఆ జాతుల పట్ల దృష్టి పెడుతూ చాలా గట్టిగా సమస్యని సమర్థించేడు. కమిటీ సమావేశంలో ఆ విషయం అనేక మంత్రి వర్గాల మధ్య కలహాకారణం అయింది. కరేనిన్‌కి విరోధంగా వున్న మంత్రివర్గం రష్యనేతర అల్ప సంఖ్యాక జాతుల స్థితిగతులు యింతకంటె మెరుగ్గా ఉండలేవనీ, వాటి పునర్వ్యవస్థీకరణకి యే చర్యలు చేపట్టినా యీ వున్నవి చెడిపోతాయనీ, చెడుగులనేవి వుంటే కరేనిన్ మంత్రివర్గం చట్టాన్ని సరిగ్గా అమలు జరపక పోవడంవల్ల ఉత్పన్నమైనవేననీ వాదన తయారుచేసింది. ఇప్పుడు కరేనిన్ కోరదలుచుకున్నది: మొదటగా, అల్ప జాతుల స్థితిగతులని అక్కడికి వెళ్లి అధ్యయనం చెయ్యడానికి వో కొత్త ఆయోగాన్ని అప్పటికప్పుడు నియమించడం; రెండవదిగా ప్రస్తుత ఆయోగం దగ్గర వున్న అధికారిక పత్రాలలో చిత్రించిన మాదిరి అయా జాతుల స్థితిగతులు వుంటే గనక వాళ్ల దుర్దశకి సంబంధించి 1) రాజకీయంగా, 2) పాలనాపరంగా, 3) ఆర్థికంగా, 4) జాతిపరంగా, 5) పదార్థికంగా, 6) మతపరంగా కారణాలని శోధించడానికి మరో కొత్త ఆయోగాన్ని నియమించడం; మూడవదిగా అల్ప సంఖ్యాక జాతులలో వున్న దుర్భర పరిస్థితులని మెరుగు పరిచే ఉద్దేశంతో గత పదేళ్లగా యీ విరోధి మంత్రివర్గం తీసుకున్న చర్యల గురించిన సమాచారం సమర్పించమని అడగడం; నాల్గవదిగా, ఆఖరిదిగా కమిటీకి సమర్పించిన 1863 డిసెంబరు 5,

1864 జూన్ 7 నాటి 17015, 18308 నంబరు ఫైళ్లలో స్పష్టంగా కనిపిస్తున్నట్టుగా, మౌలిక చట్టం సంపుటం... అధికరణం 18లో 36 అనుబంధంలో చెప్పిన దానికి శుద్ధ విరుద్ధంగా యెందుకు ఆ మంత్రివర్గం చేసిందో దానికి సంజాయిషీ యివ్వాల్సి వుందని చెప్పడం. యీ ఆలోచనలని స్ఫూర్తి రేఖల్లో హడావుడిగా రాసుకుంటూ వుంటే కరేనిన్ ముఖంలో ఉత్సాహం తొణికిసలాడే అరుణిమ గోచరించింది. కాగితంమీద పూరా రాశాక అతను లేచి గంట కొట్టేడు. అదనపు సమాచారం పంపించ వలసిందిగా అడుగుతూ ఆఫీసు సెక్రటరీ పేర చీటీ రాసి దాన్ని అందజెయ్యమని ఆ నౌకరుకి చెప్పాడు. తర్వాత లేచి గదిలో పచారు చేశాడు. మళ్లీ అన్నా చిత్రం కనిపించి ముఖం చిట్లించుకుని తిరస్కారపూర్వకంగా చిరునవ్వు నవ్వేడు. కూర్చుని మళ్లీ పుస్తకం అందుకున్నాడు. ప్రాచీన ఇటాలియన్ లిపి పట్ల మళ్లీ ఆసక్తి కలిగింది. రాత్రి పదకొండు గంటలకి పక్క చేరాడు. పక్కమీద వాలి భార్య పట్ల తన పరిస్థితిని గుర్తు చేసుకున్నాడు. అది అంత నిరాశా జనకంగా కనిపించలేదు.

15

అన్నా పరిస్థితి సహించ లేనట్టుగా వుందనీ, ఆమె భర్తకి సర్వమూ చెప్పెయ్యాలనీ వ్రాన్స్కీ యెప్పుడు ఆమెని ఒప్పించ చూసినా, ఆమె చాల పట్టుగా, కోపంగా అతన్ని వ్యతిరేకించేది. కాని తన అంతరంగపు లోతుల్లో ఆమెకి తన పరిస్థితి మృషామయంగా నిజాయితీ హీనంగా వుందని తెలుసు. దాన్ని మార్చెయ్యాలని మనస్ఫూర్తిగా తపన పడింది. గుర్రం పందేల తర్వాత భర్తతో కలిసి తిరిగి వచ్చేటప్పుడు ఆమె యెంతో ఆందోళనగా వుండడంతో భర్తకి సర్వమూ చెప్పేసింది. అలా చెప్పెయ్యడం ఆమెకి బాధాకరంగా వున్నా గానీ సంతృప్తి కలిగింది. భర్త వెళ్లిపోయాక తనకి సంతృప్తిగా వుందని యిప్పుడు అన్నీ తేటతెల్లం అయిపోతాయని కనీసం అబద్ధాలు, వంచన వుండవని తనలో తను అనుకుంది. యిప్పట్నుంచీ తన పరిస్థితి శాశ్వతంగా స్పష్టం అయిందని ఆమెకి అనిపించింది. తన నూతన పరిస్థితి దుష్టమైందే కావచ్చు, కాని స్పష్టపడింది. సందిగ్ధత, అనృతం వుండవు. భర్తకి చెప్పెయ్యడంద్వారా అతనికీ, తనకీ కలిగిన బాధకి ప్రతిఫలం యేమంటే యిప్పుడు సర్వమూ స్పష్టమైన రూపం తీసుకోవడం. అదే రోజు సాయంత్రం ఆమె, వ్రాన్స్కీ కలుసుకున్నారు. కాని తనకీ భర్తకీ మధ్య జరిగిన దాన్ని ఆమె అతనికి చెప్పలేదు, అన్నిట్నీ స్పష్టం చేసుకోడానికి ఆమె వ్రాన్స్కీకి చెప్పవలసి వుండినా.

ఆ మర్నాడు పొద్దుట కళ్లు తెరవగానే ఆమెకి తను భర్తతో చెప్పిన మాటలే గుర్తు వచ్చేయి. ఆమెకి అవి యెంతో భయంకరంగా కన్పించాయి. అసలు తను అలాంటి అనకూడని రోత మాటలు యెలా సాహసంగా అనగలిగిందా అనేది ఆమెకి యిప్పుడు అర్థం అవలేదు. దాని పరిణామాలు యెలా వుంటాయన్నదీ వూహించుకో లేకపోయింది. కాని

ఆ మాటలని అనేసింది. కరేనిన్ నోరు మెదపకుండా వెళ్లిపోయాడు. 'వ్రాన్‌స్కీని కలుసుకున్నాను గాని యీ విషయం చెప్పలేదు. అతను వెళ్లిపోయే క్షణంలో వెనక్కి పిలిచి చెప్పాల నిపించింది. కాని మళ్లీ మనస్సు మారిపోయింది. యేమంటే మొదట్లోనే చెప్పలేదే అని యేదోలా అనిపించింది. చెప్పాలనుకున్నా యెందుకు చెప్ప లేకపోయాను?' అనుకుంది. యీ ప్రశ్నకి జవాబుగా ఆమె ముఖంమీద అజ్జ్వల్యితమైన వెచ్చని అరుణిమ సోకింది. తను అత నికి చెప్పకుండా యేది ఆపిందో ఆమెకి అర్థమైంది. ఆమెకి సిగ్గనిపించింది. అంతకు ముందు రోజు సాయంత్రం స్పష్టం అయినట్టు కనిపించిన తన స్థితి, వున్నట్టుండి అస్పష్టంగానే కాక నిరాశాజనకం అయినట్టుగా కూడా అనిపించింది. అంతకు ముందు తను ఆలోచించి యెరగని ఆ అపఖ్యాతి తలుచుకుని ఆమె భయభ్రాంతురాలై పోయింది. భర్త యేం చెయ్య గలడోనని ఆలోచించుకున్నప్పుడు ఆమెకి మహా భయంకరమైన వూహలు మనస్సుకి తట్టేయి. భర్త పంపే మనిషి వస్తాడు, తనని యింట్లోనుంచి గెంటేస్తాడు. తను చేసిన అపకీర్తి పని వూరూ వాడా టముకై పోతుంది అని వూహించుకుంది. యింట్లోనుంచి గెంటేస్తే తనెక్కడికి వెళ్లగలదు అని ప్రశ్నించుకుంది, కాని దానికి యే జవాబూ దొరకలేదు.

వ్రాన్‌స్కీ గురించిన ఆలోచన రాగానే అతను తనని యిక ప్రేమించడం లేదని ఆమెకి అనిపించింది. అతనికి తనంటే మొహం మొత్తుతోందనీ, తను అతని దాన్ని అయినట్టు చెప్పలేకపోతున్నదనీ ఆమెకి అనిపించింది. దాంతో అతని పట్ల విముఖత కలిగింది. తను భర్తతో యే మాటలు అందో అవి, తన మనస్సులో పదేపదే అవృతమవుతూ వున్న అవి, ప్రతివాళ్లకీ చెప్పేసినట్టూ, ప్రతివాళ్లూ వాటిని వినేసినట్టూ ఆమెకి భ్రమ కలిగింది. ఆ మనుషుల కళ్లల్లోకి తను చూడలేక పోతోంది. తన పనిమనిషిని కూడా పిలవలేక పోతోంది. కిందికి దిగి వెళ్లి కొడుకునీ, వాడి పంతులమ్మనీ చూసే ధైర్యం కూడా లేకపోతోంది.

తలుపు దగ్గర చాలా సేపటిగా చెవి పెట్టి వింటూ వున్న ఆమె పనిపిల్ల పిలవకుండానే లోపలికి వచ్చింది. అన్నా ఆమె కేసి యేమిటన్నట్టు చూసింది. అన్నా ముఖం భయంతో యెర్రబడింది. లోపలికి రావడం పొరపాటేననీ, గంట కొట్టి పిలిచినట్టు అనిపించడంవల్ల వచ్చేనని పనిపిల్ల సంజాయిషీ చెప్పింది. ఆమె అన్నా బట్టలూ, ఓ చీటీ పట్టుకొచ్చింది. ఆ చీటీ చెప్పేమంటి. లీజా మెర్కాలొవా, బారనెస్ ష్టోల్జ్ లిద్దరూ తమ ఆరాధకులు కలూజ్‌స్కీ, వృద్ధ స్ట్రేమొవ్‌లతో కలిసి ఆ ఉదయం క్రోకెట్ ఆటకోసం తన దగ్గరికి వస్తున్న విషయాన్ని బెట్సీ అన్నాకి గుర్తు చేసింది. 'ఏమీ లేదు వూరికే లోకరీతిని చూడ్డానికి రండి. మీకోసం యెదురు చూస్తూ వుంటాను' అని రాసింది.

అన్నా అది చదువుకుని గాఢంగా నిట్టూర్చింది.

"యేమీ లేదు, నాకు యేమీ అక్కరలేదు" అంది అనుష్కాతో. ఆమె సెంటు బుడ్లు, దువ్వెనలూ అక్కడ సర్దుతోంది. "నువ్వు వెళ్లిపో. నేను బట్టలు తొడుక్కుని కిందికి వస్తాను. నాకు యేమీ అక్కర లేదు, యేమీ" అంది అన్నా.

అన్నుష్కా వెళ్లిపోయింది. కాని అన్నా ముస్తాబవడం మొదలెట్టలేదు. అక్కడనే తలా, చేతులూ వేలేసి కూర్చుండి పోయింది. మధ్య మధ్యన ఆమె యేదో చెప్పబోతున్నట్టూ, యేదో చెయ్యబోతున్నట్టూ శరీరం అంతా కంపించి పోయేది. కాని మళ్లీ వొక విర్వేదంలో పడిపోయేది. నిరంతరంగా గొణుక్కుంటూనే ఉంది. "ఓ భగవంతుడా! ఓ నా భగవంతుడా!" అని. కాని ఆమెకి 'నా' అన్న మాటకి గాని, 'భగవంతుడా' అన్న మాటకి గాని అర్థం అవగాహనికి రాలేకపోయింది. తను ప్రస్తుతం వున్న స్థితిలో వూరట కోసం మతం వేపు తిరగడం కరేనిన్‌ని సహాయం అర్థించేటంత అసంబద్ధంగా వుంటుంది, ఆమె తను పెరిగిన మత ధర్మాన్ని యెన్నడూ శంకించకపోయినా. తన జీవిత పరమార్థంగా భాసించిన దాన్ని తను త్యజించినప్పుడే మతం తనకి అసరాగా వస్తుందని ఆమెకి తెలుసు. ఆమె హృదయం భారంగా వుండడం వల్లనే కాక, అంతకు ముందెన్నడూ తను యెరగనటువంటి మానసిక స్థితివల్ల కూడా భయకంపితురా లవుతుంది. తన ఆత్మలో ప్రతీదీ ద్వంద్వరూపంతో వున్నట్టు, కళ్లు బైర్లుకమ్మినప్పుడు ప్రతీదీ రెండుగా కనిపించే రీతిలో, ప్రతీదీ రెండుగా భిన్నమైనట్టు ఆమెకి భాసించింది. తను దేన్ని గురించి భయపడుతుందీ, తనకి యేం కావాలీ అనేది తెలియని క్షణాలు లేకపోలేదు. జరిగిన దాన్ని గురించి తను భయపడిందా లేక జరగాలని కోరుకుందా లేదా యేం జరగబోతుందో దాన్ని గురించి భయపడిందా లేక జరగాలని కోరుకుందా ఆమెకి తెలియలేదు. తను కోరుకున్నది యేమిటైందీ కూడా ఆమెకి తెలియలేదు, వూరికే తెలియలేదంతే.

'ఓహ్! నేనేం చేస్తున్నాను?' అని తల రెండు పార్శ్వాలలోనూ వున్నట్టుండి నొప్పి కలిగినట్టయి అనుకుంది. కణతల దగ్గర రెండు చేతులతోనూ జుట్టు పట్టుకొని వున్నట్టు, స్థిమిత పడ్డాక తెలుసుకుంది. గిరుక్కున లేచి గదిలో అటూ యిటూ పచారుచెయ్యడం మొదలుపెట్టింది.

"కాఫీ తయారయిందండి, పంతులమ్మగారూ, సెర్యోష మీ కోసం ఎదురుచూస్తూ వున్నారు" అని అన్నా ముందటి లాగానే వుండడం చూసి, మళ్లీ వచ్చిన అన్నుష్కా అంది.

"సెర్యోష? యెలా వున్నాడు సెర్యోష?" అని వున్నట్టుండి జీవం వచ్చినట్టు అడిగింది. ఆ పొద్దుటి పూట ఆమెకి మొదటి సారిగా కొడుకు ఉనికి గుర్తు వచ్చింది.

"కొంటెతనంగా తయారైనట్టు కనిపిస్తున్నాడు" అంది చిరునవ్వు నవ్వుతూ అన్నుష్కా.

"ఏం కొంటెతనం జరిగింది?"

"మూల బీరువాలో తమరు పెట్టిన పీచ్ పళ్లల్లో వొకదాన్ని తీసుకు తినేశాడు."

కొడుకు ప్రస్తావన అన్నాని హఠాత్తుగా నిరాశాజనక పరిస్థితినుంచి బయట పడేసింది. కొడుకు కోసమే బదుకుతున్న తల్లిగా కొంచెం అతిశయోక్తిపూరితమైనా పాక్షికంగా నిజమైన తన పాత్ర గుర్తుకు వచ్చింది. గత కొన్ని యేళ్లుగా ఆ పాత్రని పోషిస్తుంది. తను వున్న పరిస్థితిలో కూడా భర్తతో, వ్రాన్‌స్కీతో తన సంబంధాలు యే రూపంలో వున్నా గానీ

వాటి ప్రమేయం లేకుండా తనకి అది ఆసరా వుందని ఆమెకి సంతోషంతో అనిపించింది. ఆ ఆసరా తన కొడుకు. తను యెట్టి పరిస్థితులలోనూ కొడుకుని వదిలిపెట్టదు. భర్త తనని అవమానం పాల్జేసి యింట్లోంచి గెంటెయ్యవచ్చుగాక, వ్రాన్‌స్కీ ప్రేమ తగ్గవచ్చుగాక అతని దారిన అతను బతకవచ్చుగాక (మళ్లీ ఆమె అతని గురించి కటువుగా, తిరస్కార పూరితంగా అనుకొంది) తను మాత్రం కొడుకుని యెన్నడూ విడిచిపెట్టదు. ఆమెకి జీవితంలో వొక లక్ష్యం వుంది. కొడుకుతో తన పరిస్థితిని సురక్షితం చేసుకోవడానికి, వాణ్ణి తననుంచి వేర్పాటుచేసి తీసుకుపోకుండా వుండేందుకు, చర్యలు తీసుకోవాలి, చురుకైన చర్యలు తీసుకోవాలి. ఆ పనిని తను త్వరగా చెయ్యాలి. యెంత త్వరగా వీలైతే అంత త్వరగా, తననుంచి వాణ్ణి వేరు చేయకముందే. వాణ్ణి తీసుకొని యెక్కడికేనా వెళ్లిపోవాలి. అదీ విషయం. తను ఆ పనే చెయ్యాలి. తను శాంత పడాలి, యీ యాతనా భరిత స్థితినుంచి విముక్తి సాధించాలి. కొడుకు కోసం కొన్ని చర్యలు తీసుకోవాలన్న ఆలోచన, యెక్కడికేనా వాణ్ణి తీసుకొని వెళ్లిపోవాలన్న ఆలోచన ఆమెకి శాంతిని కలిగించింది.

ఆమె గబగబా బట్టలు వేసుకొని కిందికి వెళ్లింది. డ్రాయింగ్ రూములోకి దృఢ గమనంతో వెళ్లింది. సెర్యోష, పంతులమ్మ తన కోసం యెదురు చూస్తున్నారు. కాఫీ తయారైంది. సెర్యోష తెల్లని బట్టలు వేసుకున్నాడు. బల్ల పక్కన అద్దంకింద నుంచున్నాడు. తల, వీపు వాల్చుకుని వున్నాడు. అతని ముఖం ధ్యాన మగ్నంగా వుంది. అది ఆమెకి పరిచితమే. తండ్రి పోలికని స్ఫురింప చేస్తుందా వాలకం. అతను లోపలికి తెచ్చిన పువ్వులతో యేదో చేస్తున్నాడు.

పంతులమ్మ మామూలు కంటే కఠినంగా వుంది. సెర్యోష యెప్పటి లాగానే దాదాపు కీచుగా "అమ్మా" అని అరిచాడు. తర్వాత పువ్వులు పడేసి తల్లి దగ్గరికి వెళ్లాలా, లేదా గుచ్ఛం పూర్తిచేసి తల్లి దగ్గరకు వెళ్లాలా తేల్చుకోనట్టు సందిగ్ధంగా నుంచుండి పోయాడు.

పంతులమ్మ నమస్కారం అని చెప్పి, సెర్యోష తుంటరి ప్రవర్తన గురించి యేకరువు పెట్టడం మొదలుపెట్టింది. కాని అన్నా వినిపించుకోలేదు. తనతో బాటు పంతులమ్మని కూడా తీసుకెళ్లాలా లేదా అనే ఆలోచిస్తోంది. 'ఊహుఁ, ఆమెని తీసుకెళ్లను, వొక్క బాబుని మాత్రమే తీసుకెడతాను' అని తీర్మానించుకుంది.

"అవును, కొంటెగా తయారయాడు" అంది అన్నా. కొడుకు భుజం పట్టుకొని అతని కేసి కఠినంగా కాకుండా, బెరుగ్గా చూసింది. ఆ చూపు అతన్ని గజిబిజి చేసింది, సంతోష పరిచింది. ఆమె అతన్ని ముద్దు పెట్టుకుంది. "వీణ్ణి నా దగ్గర వదిలెయ్యండి" అని ఆమె విస్మితురాలైన పంతులమ్మతో అంది. అతన్ని వదలకుండానే కాఫీ సరంజామా వున్న బల్ల దగ్గర కూర్చుంది.

"అమ్మా! నేను... నేను... లేదు నేను..." అని కుర్రాడు ఆమె ముఖంమీద ద్యోతకం

అయిన భావం చూసి, పీచ్ పండు తీసుకున్నందువల్ల యేం జరుగుతుందా అని అర్థం చేసుకో ప్రయత్నిస్తూ అన్నాడు.

"పెర్ప్యేష" అందామె పంతులమ్మ వెళ్లిపోగానే. "తప్పు, అలా చెయ్యకూడదు, యింకె ప్పుడూ చెయ్యకు, యేం? నేనంటే నీకిష్టమేనా?" అని అడిగింది.

ఆమె కళ్లల్లో నీళ్లు గిర్రున తిరుగుతున్నట్లు ఆమెకి అనిపించింది. 'పీడిపట్ల ప్రేమ లేకుండా ఉండగలనా?' అని బెదురు బెదురుగా వున్న వాడి కళ్లల్లోకి లోతుగా చూస్తూ అనుకొంది. అయినా వాడి కళ్లు ప్రసన్నంగానే వున్నాయి. 'నన్ను పీడించడానికి వీడు వాళ్ల నాన్న పక్షం అవుతాడా? నేనంటే జాలిపడడా?' కన్నీళ్లు ఆమె చెక్కిళ్ల మీదనుంచి జారిపోతు న్నాయి. వాటిని కనిపించ నియ్యకుండా చెయ్యాలని ఆమె గబుక్కున లేచి దాదాపు పరిగెత్తు కుంటూ వసారాలోకి వెళ్లిపోయింది.

అంతకు ముందు రోజుల్లో ఉరుముల్తో, మెరుముల్తో వానలు కురిసాయి. యిప్పుడు చల్లగా, తేటగా వుంది వాతావరణం. నీళ్లకి తడిసిన ఆకుల్లోనుంచి యెండ పొడలు పొడలుగా పడుతూ వున్నా గాలి చురుక్కుమనిపిస్తోంది.

ఆన్నా చలి వల్లా, తన గుండెని అదిమిన ఆంతరంగిక భయం వల్లా వణికింది. ఆ భయం ఆరుబయటి గాలికి కొత్త శక్తితో పుంజుకుంది.

"వెళ్లు, Mariette దగ్గరికి వెళ్లు" అని తన కూడా కూడా వస్తున్న పెర్ప్యేషతో అంది. వసారాలో పరిచి వున్న చాపలకు అటూ యిటూ పచారు చెయ్యడం మొదలుపెట్టింది. 'నన్ను క్షమించలేరా యేం వాళ్లు? యిలా జరిగింది, అలా తప్ప మరొకలా వుండి వుండలేదన్న విషయాన్ని అర్థం చేసుకోలేరా?' అని తనలో తను అనుకుంది.

ఆమె ఆగి ఆస్పెన్ చెట్ల శిఖరాలకేసి చూసింది. ఆ చెట్ల ఆకులు నీటికి తడిసి వేడి లేని యెండలో మిలమిల మెరుస్తున్నాయి. యెవరూ తనని క్షమించరని ఆమె గ్రహించింది. ఆ ఆకాశంలాగా, ఆకుల్లాగా ప్రతివాళ్లూ తన పట్ల నిర్దాక్షిణ్యంగా వుంటారు. మళ్లీ తన మనస్సులో ద్వంద్వరూపంతో ఉన్నట్లు ఆమెకి అనిపించింది. 'అబ్బ! వద్దు, దీన్ని గురించి ఆలోచించవద్దు' అనుకొంది. 'వెళ్లిపోవడానికి సన్నద్ధం కావాలి. వెళ్లడం యెక్కడికి? యెప్పుడు? యెవర్ని కూడా తీసుకెళ్లాలి? ఆఁ, మాస్కోకి. సాయంత్రం రైలుకి. అన్నుష్కానీ, సెర్యోషనీ తీసుకుని. వూరికే అత్యవసరంగా కావాల్సిన వాటిని తీసు కెళ్లడమే. కాని మొదట వాళ్లిద్దరికీ ఉత్తరాలు రాయాలి.' ఆమె యింట్లో తన గదికి వెళ్లింది. రాత బల్ల దగ్గర కూర్చుని భర్తకి రాయడం మొదలుపెట్టింది.

'యింత జరిగిం తర్వాత నేను మీ యింట్లో వుండలేను. నేను వెళ్లిపోతున్నాను. అబ్బాయిని నాతో తీసుకెళ్లి పోతున్నాను. నాకు న్యాయ చట్టాలు తెలీవు. అంచేత తల్లి దండ్రుల్లో యెవరి దగ్గర బిడ్డ వుండాలో నాకు తెలీదు, కాని కొడుకు లేకుండా నేను బతక

లేను. కాబట్టి వాణ్ణి కూడా తీసుకు పోతున్నాను. కనికరం చూపించి వాణ్ణి నా దగ్గరే వుండ నియ్యండి.'

యిక్కడికొచ్చేదాకా గబగబా సహజంగానే రాసేసింది. భర్త దయాంతఃకరణకి, అత నిలో వుందని తను నమ్మిన ఆ గుణానికి, విజ్ఞప్తి చెయ్యడం, అతని హృదయాన్ని స్పృశించే రీతిలో ఉత్తరాన్ని ముగించవలసి రావటం ఆమెని ఆపేయి.

'నా దోషం గురించీ, పశ్చాత్తాపం గురించీ చర్చించలేను, యేమంటే...'

తన ఆలోచనలు చెదిరి పోవడంతో ఆమె మళ్ళీ ఆగింది. 'వుహూఁ, నేనా ముక్క రాయ క్కరలేదు' అనుకుంది. ఉత్తరాన్ని చించేసి అతని దయాంతఃకరణకి విజ్ఞప్తి చెయ్యడాన్ని వదిలేసి తిరిగి రాసింది.

రెండో ఉత్తరాన్ని వ్రాన్‌స్కీకి రాయాల్సి వుంది. 'నేను మా ఆయనకి విషయం యావత్తూ చెప్పేశాను' అని మొదలుపెట్టింది. కాని యిక ముందుకు సాగలేక చాలసేపు అలాగే కూర్చుండి పోయింది. అలా రాయడం చాలా మోటుగా, స్త్రీ స్వభావ విరుద్ధంగా వుంటుంది. 'మరింక యేం చెప్పను అతనికి?' అనుకుంది. మళ్ళీ ఆమె ముఖం సిగ్గుతో యెర్రబడింది. అతని ప్రశాంతత గుర్తుకు వచ్చింది. అతని పట్ల కలిగిన చిరాకు భావంతో ఆ వొక్క వాక్యాన్ని రాసిన కాగితం తీసుకుని ముక్కలు ముక్కలుగా చించేసింది. 'యేం అవ సరం లేదులే' అనుకుని రాతసామాన్లు కట్టి పెట్టేసింది. పంతులమ్మతోనూ, పనివాళ్లతోనూ చెప్పింది తను ఆ రోజే మాస్కోకి వెళ్లిపోతున్నానని. తర్వాత సామాన్లు సర్దుకోవడం మొదలెట్టింది.

16

నేవి రావా నౌకర్లు, చాకర్లు, తోటమాలీలు అందరూ గదుల్లోని సామాన్లని యెత్తి పట్టుకుని మోస్తూ, వస్తున్నారు, పోతున్నారు. అల్మారాలు, బట్టల బీరువాలు తెరిచినవి తెరిచినట్టే వుండిపోయాయి. తాడు చాల్లేదని అప్పటికే రెండు సార్లు దుకాణానికి పంపేరు. నేలమీద చిత్తు కాగితాలన్నీ చిందర వందరగా పడి వున్నాయి. సంచీలు, రెండు పెట్టెలు, దుప్పట్లలో కట్టిన మూటలు తీసుకొచ్చి హాలులో పెట్టారు. బగ్గీ వొకటి, రెండు అద్దె బళ్లూ గుమ్మం దగ్గర వున్నాయి. సామాన్లు సర్దడం పనిలో అన్నా తన ఆందోళనని మర్చిపోయింది. తన గదిలో బల్ల ముందు నుంచుని ప్రయాణంలో తనతో కూడా వుండాల్సిన సంచీని సర్దుకుంటోంది. అప్పుడు అన్నుష్కా గుమ్మం దగ్గరికి యేదో బండి వస్తోందని చప్పుడుని బట్టి చెప్పింది. అన్నా కిటికీలోనుంచి తొంగి చూసింది. కరేనిన్ హర్కారా గుమ్మం దగ్గర గంట కొడుతూ నుంచోడం కనిపించింది.

"వెళ్లి కనుక్కో విషయం యేమిటో" అంది. అది యే కబురైనా సరే అందుకోవ డానికి నిబ్బరంగా తయారై వొళ్లో చేతులు పెట్టుకుని చేతుల కుర్చీలో కూర్చుంది. హర్కారా కరేనిన్ దస్తూరితో ఉబ్బుగా వున్న పేకెట్ పట్టుకొచ్చేడు.

"మీ దగ్గర్నుంచి జవాబు పట్టమ్మని చెప్పారు" అన్నాడతను.

"మంచిది" అంది అన్నా. ఆ మనిషి గదిలోనుంచి వెళ్ళిపోగానే వణికే వేళ్ళతో పాకెట్‌ని చింపింది. దాంట్లోనుంచి బేంక్ నోట్ల కట్ట కింద పడింది. వాటిని సన్నటి కాగితం ముక్కతో కట్టేరు. ఆమె ఉత్తరాన్ని విడదీసి కిందనుంచి చదవడం మొదలుపెట్టింది. 'యిక్కడికి రావడానికి సంబంధించిన యేర్పాట్లన్నిట్నీ చెయ్యడం జరుగుతుంది. యీ అభ్యర్థనని మీరు మన్నించడం అనే విషయానికి నేను ప్రత్యేక ప్రాముఖ్యం యిస్తున్నాను' అని చదివింది. ఆమె గబగబా కళ్ళు పైకి పోనిచ్చి పైన చదివింది. తర్వాత మొత్తం ఉత్తరాన్ని ఓం ప్రథమంనుంచీ చదివింది. పూర్తిచెయ్యగానే శరీరం అంతా చల్ల బడిపోయినట్టు అనిపించింది. తను వూహించని గండం తనమీద విరుచుకు పడిందని అనిపించింది.

భర్తతో చెప్పిన మాటలకి ఆ ఉదయమే నిద్ర లేవగానే పశ్చాత్తాప పడింది. తను ఆ మాటలు అనకుండా వుండాల్సిందని తను కోరుకుంది. యిదిగో తను ఆ మాటలు అననట్టే చాటే ఉత్తరం యిక్కడ వుంది. తన కోరికని యదార్థం చేస్తోంది. అయినా ఇప్పుడీ ఉత్తరం తను వూహించను కూడా వూహించనంతటి భయానకంగా కనిపిస్తోంది.

'అయన నొప్పి! నొప్పి!' అనుకుంది. 'తను యెప్పుడూ నొప్పిగా వున్నట్టే కనిపిస్తాడు. తను క్రైస్తవుడు, దయాంతఃకరణుడు. అబ్బ, నీచ పాపిష్టి వ్యక్తి! నాకు తప్ప యెవరికీ తెలీదు, యెవరూ తెలుసుకోనూ లేరు. దీన్ని నేను వివరంగా చెప్పనూ లేను. అతను ధర్మ పరాయణుడనీ, శిష్టాచారుడనీ, నిజాయితీ పరుడనీ, తెలివైన వాడనీ అంటారు. కాని నాకు కనిపించేది వాళ్ళకి కనిపించదు. యెనిమిదేళ్ళపాటు నాలో సజీవమైన దాన్నంతట్నీ యెలా నలి మేశాడో వాళ్ళకి తెలీదు. ఒక్క సారి కూడా నన్ను ప్రేమని అపేక్షించే సజీవమైన ఆడదానిగా చూళ్లేదు. యీ విషయం వాళ్ళకి తెలీదు. అడుగడుగునా నన్ను యెంత అవమానం పాల్జే సాడో, తను యెంత ఆత్మ సంతుష్టిగా వున్నాడో వాళ్ళకి తెలీదు. నా జీవితాన్ని ఔచిత్య భరితంగా వుంచడానికి ప్రయత్నం చెయ్యలేదా? సర్వాత్మనా ప్రయత్నించలేదా? నేను తనని ప్రేమించ ప్రయత్నించలేదా? భర్తని ప్రేమించడం సంభవం కానప్పుడు కొడుకుని ప్రేమించ డానికి ప్రయత్నం చెయ్యలేదా? కాని యిక ఆత్మవంచన చేసుకోలేదు అని గ్రహించే వేళ వచ్చింది. యేమంటే నేను రక్తమాంస పుష్టమైన ప్రాణిని. ప్రేమించి జీవించ వలసినట్టు భగవంతుడు నన్ను తయారుచెయ్యడం నా దోషమా? మరి యిప్పుడు? తను నన్ను చంపినా, అతన్ని హత్యచేసినా నేను భరించేదాన్ని. అంతట్నీ క్షమించ గలిగి వుండేదాన్ని, కాని వుహు, తను...'

'తనేం చెయ్యబోయేదీ సూచన ప్రాయంగా కూడా యెందుకు నేను వూహించలేను? అంత నీచంగా వుండగలిగే మనిషి మాత్రమే చెయ్యగలదాన్ని చేస్తాడు. తనేం చేసినా అది నొప్పే, పతితురాలైన దాన్ని, యింకా చెడ్డగా, నీచత్వంగా పతితురాల్ని చేస్తాడు...' ఉత్త రంలో మాటలు ఆమెకి స్ఫురణకి వచ్చేయి. 'మీకూ, మీ కొడుక్కీ కలగబోయే పరిణా

మాలని వూహించుకోగలరు...' 'నా కొడుకుని నానుంచి తీసుకుపోవడానికి యిది బెదిరింపు. వెధవ చట్టాలున్నాయిగా, వాటి ప్రకారం అలా చెయ్య వచ్చునేమో. తనెందుకు యీ మాట అన్నాడో నాకు తెలియదా? నా బిడ్డని నేను ప్రేమిస్తున్న విషయాన్ని కూడా తను నమ్మడు. లేదా వాడి పట్ల నా ప్రేమని తిరస్కారంగా చూస్తాడు. (తను యెప్పుడూ నన్ను ఉడికిస్తూనే వుంటాడు.) కాని నా బిడ్డని నేను వదులుకోను, ఆ విషయం తనకి తెలును. వాడు లేకుండా నేను ప్రేమించిన మనిషితో వున్నాగానీ నాకు జీవితం లేదు. జీవితానికి అర్థం లేదు. నా బాబుని వదిలేసి పారిపోతే నేను పరమ కళంకితురాల్ని, నీచురాల్ని అయిపోతాను. యీ విషయం తనకి తెలును, అలాంటి పనిని నేను చెయ్యలేననీ తెలును.'

'మన జీవితం ముందటి లాగానే సాగాలి' అని రాసిన ముక్క గుర్తు వచ్చింది. 'యీ జీవితం ముందే యాతనా ప్రదంగా వుంది, యిటీవల దుర్భరమై పోయింది. యిక యిప్పుడెలా వుంటుంది? తనకి అన్నీ తెలును, తనకి తెలుసు, నేను దేనివల్ల వూపిరి పీలుస్తున్నానో, దేన్ని ప్రేమిస్తున్నానో దానిపట్ల పశ్చాత్తాప పడనని. కపటత్వం వంచన తప్ప మరేమీ దీని వల్ల ఒరగదని తెలును. కాని నన్ను శోథ పెట్టడమే తనకి కావాల్సిందల్లా. నాకు తెలుసు, నీటిలో చేపలాగా, తను అనృతంలోనే యీదులాడుతూ వుంటాడు, ఆనందపడుతూ వుంటాడు. కాని అతనికా ఆనందాన్ని యివ్వను. నన్ను పట్టుదలచుకున్న అబద్ధపు జాలుని తెంచేస్తాను, యేమైతే అదవుతుంది. యీ కపటత్వం కంటే, వంచన కంటే యేదైనా మేలే.'

'కాని యెలా? భగవంతుడా! హా భగవంతుడా! నాకంటే దౌర్భాగ్యురాలు వుంటుందా?..'

"లేదు, తెంచేస్తాను. తెంచేస్తాను!" అరిచింది, ఒక్క ఉదుట్న లేచి కన్నీళ్లు దిగమింగుకుంటూ. అతనికి ఉత్తరం రాద్దామని బల్ల దగ్గరికి వెళ్లింది. కాని దేన్నీ తెంచేసే శక్తి తనకి లేదని, తనున్న పరిస్థితినుంచి బయటపడే శక్తి తనకి లేదనీ, అది యెంత అనృతమయమైన జీవనమైనా, గౌరవహీనమైనదైనా దాన్ని ఛేదించుకు బయటపడే శక్తి తనకి లేదనీ హృదయం లోతుల్లో ఆమెకి తెలుసు.

బల్ల దగ్గర కూర్చుంది. రాయడానికి బదులుగా చేతులు దానిమీద పెట్టి, చేతులమీద తల ఆన్చుకుని యేడ్చింది. బిగ్గరగా యేడ్చింది. గుండె యెగిసి పడేటట్టు చిన్న పిల్లల మాదిరీ యేడ్చింది. తన పరిస్థితి స్పష్టంగా, నిశ్చితంగా చేసుకునే స్వప్నం శాశ్వతంగా భగ్నమై పోయిందని యేడ్చింది. అన్నీ యెప్పటి లాగానే వుంటాయనీ, అంతే కాదు ముందటి కంటే అధ్వాన్నంగా వుంటాయనీ ఆమెకి తెలును. ఉన్నత సమాజంలో తనకి వున్న స్థితి, ఉపేక్షించ గలిగినట్టు ఆ ఉదయమే కనిపించిన ఆ స్థితి, తనకి యెంతో ప్రియమైందని ఆమెకి తెలును. దాని బదులు భర్తనీ కొడుకునీ వదిలేసి, ప్రియుడితో తన బతుకు యేకం చేసుకునే కళంకిత నారీ జీవన స్థితిని తెచ్చుకోలేదు. తను యెంత ప్రయత్నించినా గానీ తను యిప్పుడున్న దానికంటే అధిక శక్తి సంపన్నురాలు కాలేదు. ప్రేమ స్వాతంత్ర్యాన్ని తను యెన్నటికీ అనుభవంలోకి తెచ్చుకోలేదు. సర్వదా పాపిష్టి పత్నిగానే వుండి పోతుంది. బతుకు బట్ట బయల

వుతుందేమోననే భయంతోనే వుంటుంది. తన బతుకు తను బతికే వ్యక్తితోనూ అతని జీవితంలో భాగస్వామి కాలేక అతనితో దొంగ సంబంధాల కోసం భర్తని మోసగిస్తూ బతుకుతుంది. అది అలాగే ఉంటుందని ఆమెకి తెలుసు. దీనికి అంతం యెలా వుంటుందో వూహించుకోను కూడ వూహించుకో లేనంత భయంకరంగా వుంటుంది. ఆమె ఆదుపు లేకుండా, యెవరేనా దండించినప్పుడు చిన్న పిల్లలు యేడ్చినట్టుగా, యేడ్చింది.

నౌకరు వస్తున్న అడుగుల చప్పుడు వినిపించి సంబాళించుకుంది. ఉత్తరం రాస్తున్నట్టు నటిస్తూ ముఖం దాచుకుంది.

"హర్కారా జవాబు కోసం అడుగుతున్నాడు."

"జవాబు? ఆ, అవును ఆగమను. నేనే పిలుస్తాను" అంది అన్నా.

'యేం రాయను?' అనుకొంది. 'నేను వొక్కత్తినీ యేం నిర్ణయించుకోగలను? నాకేం తెలుసు? నాకేం కావాలి? నాకు యేది యిష్టం?' తన ఆత్మలో ప్రతిదీ ద్వంద్వ రూపంతో భిన్నమై పోతున్నట్టు మళ్ళీ ఆమెకి అనిపించింది. ఆ భావన ఆమెని భయభ్రాంతం చేసింది. తన గురించిన ఆలోచనలనుండి మళ్ళడానికి ఆసరాగా మస్తిష్కంలో తట్టిన మొదటి ఆలోచనా రేఖని పట్టుకుంది. 'నేను అలెక్సేయ్‌ని (అంతరంగంలో వ్రాన్‌స్కీని అలానే పిలిచేది) కలుసుకోవాలి. అతను ఒక్కడే చెప్పగలడు నేను యేం చెయ్యాల్సి వుందో. బెట్సీ యింటికి వెడతాను. అక్కడ అతను కనిపించవచ్చు' అనుకుంది. తను బెట్సీ యింటికి వెళ్ళనని అతనితో అంతకు ముందు రోజునే చెప్పింది. అప్పుడు తనూ వెళ్ళనని అతనన్నాడు. ఆ విషయం యిప్పుడు మర్చిపోయింది. బల్ల దగ్గరికి వెళ్ళి 'మీ ఉత్తరం అందింది. అ.' అని భర్తకి రాసింది. గంట కొట్టి నౌకర్ని పిలిచి దాన్ని అతనికి యిచ్చింది.

"మనం వెళ్ళడం లేదు" అని లోపలికి వచ్చిన అన్నుష్కాతో అంది.

"అసలు వెళ్ళడం లేదా?"

"యివాళ వెళ్ళడం లేదు. కాని రేపటిదాకా మూటలు విప్పకండి. బండిని వుండమనండి. నేను ప్రిన్సెస్ బెట్సీ త్వేర్‌స్కాయా యింటికి వెళ్ళొస్తాను."

"ఏం బట్టలు తెమ్మంటారు?"

17

ప్రిన్సెస్ బెట్సీ త్వేర్‌స్కాయా అన్నాని రమ్మని పిలిచిన క్రోకెట్ ఆట యిద్దరు ఆడవాళ్ళూ, వాళ్ళ అభిమానులు కలిసి ఆడే ఆట. ఆ యిద్దరు మహిళలూ పీటర్స్‌బుర్గ్‌లో బాగా యెంపిక చేసిన వాళ్ళ నూతన బృందానికి చెందిన ప్రముఖ మహిళలు. ఆ బృందాన్ని దేనికో అనుకరణకి అనుకరణగా les sept merveilles du monde[1] పిలుచుకునే

[1] ప్రపంచంలోని యేడు అద్భుతాలు (ఫ్రెంచి).

వారు. ఆ మహిళలు ఉన్నత సమాజ సభ్యుల బృందం వాళ్ళు. కాని ఆ బృందం అన్నా కలిసి మెలిసి తిరిగే బృందానికి విరుద్ధంగా వుండేది. పైగా లీజా మెర్కాలోవా అభిమాని, పీటర్స్ బర్గ్‌లో గొప్ప పలుకుబడి వున్న పెద్ద వయస్కురాలూ అయిన ప్ర్టైమొవ్ అధికార జీవితంలో కరేనిన్‌కి విరోధి. ఈ కారణాలన్నిటి వల్లా అన్నాకి బెట్సీ యింటికి వెళ్ళడం యిష్టం లేకపోయింది. బెట్సీ చీటీలో ఈ నిరాకరణకి సంబంధించిన సూచన లేకపోలేదు. కాని వ్రాన్‌స్కీని అక్కడ కలుసుకోవచ్చన్న ఆశతో యిప్పుడు అక్కడికి వెళ్ళాలనుకుంది.

మిగతా వాళ్ళకంటే ముందే అన్నా ప్రిన్సెస్ బెట్సీ యింటికి వెళ్ళింది.

అన్నా ప్రిన్సెస్ యింట్లోకి వెడుతూవుంటే వ్రాన్‌స్కీ నౌకరు కూడా మెట్లమీద తగిలేడు. అతను కామేర్ జాంకర్ మాదిరీ చెంపలు పెంచుకున్నాడు. గుమ్మం దగ్గరికి వెళ్ళాక అతను టోపీ తీసేసి ఆమెని లోపలికి వెళ్ళనివ్వడానికి పక్కకు తప్పుకుని దారి యిచ్చేడు. అన్నా అతన్ని గుర్తు పట్టింది. తను అక్కడికి రానని వ్రాన్‌స్కీ అంతకు ముందు రోజు చెప్పిన మాట తక్కున గుర్తు వచ్చింది. బహుశా యీ నౌకరు ఆ వర్తమానం అందించే చీటీ తెచ్చి వుంటాడు.

ఆమె హాల్లో నుంచుని ఉత్తరీయం తీస్తూ వుంటే అతను చీటీ అందజేస్తూ 'ర' అని ఉచ్చరించడం కూడ కామేర్ జాంకర్ మాదిరీ ఉచ్చరిస్తూ "ప్రిన్సెస్‌కి కౌంట్ దగ్గరనుంచి" అనడం వినిపించింది.

మీ యజమాని యెక్కడ అని అడగాలని కూడా అన్నా అనుకుంది. యింటికి వెళ్ళిపోవాలని, తన దగ్గరికి రమ్మని వ్రాన్‌స్కీకి కబురు చెయ్యాలని తహతహలాడింది. తనే అతని దగ్గరికి వెళ్ళాలనీ కోరిక కలిగింది. కాని వీటిల్లో యే ఒక్కటీ చెయ్యలేక పోయింది. తను వచ్చినట్టు తెలియజేసే గంట మోగడం వినిపించింది. ప్రిన్సెస్ బెట్సీ నౌకరు తెరిచిన గుమ్మం దగ్గర ఆమెని లోపలికి వెళ్ళనివ్వడం కోసం ఆమె కేసి సగం తిరిగి నుంచుని వున్నాడు.

"ప్రిన్సెస్ తోటలో వున్నారు. మీరు వచ్చిన సంగతి ఆమెకి చెప్తారు. మీరు తోట లోకి వెడతారా ఆమెకోసం?" అని మరో గదిలో యింకో నౌకరు అడిగాడు.

ఆమె యింటి దగ్గర లాగానే అనిశ్చితంగా, అసందిగ్ధంగా వున్నట్టు నిపించింది ఆమెకి. ముందటి కంటె అధ్వానంగా వున్నట్టు నిపించింది. ఏమంటే తను యేమీ చెయ్యలేక పోతుంది. వ్రాన్‌స్కీనా చూడలేదు. తనకి సరిపడని వాళ్ళతో తన మన స్థితికి నప్పని వాళ్ళతో వుండాల్సి వస్తోంది. అయినా తనకి నప్పిన గౌను వేసుకుంది. ఆ విషయం ఆమెకి తెలుసు. తను ఒంటరిగా లేదు. తనకి అలవాటుగా వున్న దాబుసరి సోమరి వాతావరణంలో వుంది. యింటి దగ్గర కంటే యిక్కడ వుండడమే మనస్సుకి తేలిగ్గా వున్నట్టు కనిపించింది. యేమంటే యిక్కడైతే యేం చెయ్యాలో యేమిటో ఆలోచించుకునే అవసరం తనకి లేదు. నేటికవే తమం తట తామే జరిగిపోతాయి. తనని చకితం చేసే సొగసైన తెల్లని గౌను తొడుక్కుని తన దగ్గ రికి వస్తూవున్న బెట్సీని చూసి అన్నా యెప్పటి లాగానే మందహాసం చేసింది. బెట్సీతో బాటు

తుష్కేవిచ్ వున్నాడు. వాళ్ల బంధువు అయిన వో పడుచు అమ్మాయి వుంది. రాజధానికి దూరంలో వుండే ఆమె తల్లిదండ్రులకి తమ బిడ్డ ఆ వేసవికాలం ప్రసిద్ధురాలైన ప్రిన్సెస్‌తో గడుపుతుందని మహా సంతృప్తిగా వుంది.

బహుశా అన్నాలో యేదో కొత్తగా కనిపించి వుంటుంది, యేమంటే బెట్సీ వెంటనే ఆమె కేసి తదేక దృష్టితో చూసింది.

"రాత్రి సరిగా నిద్ర పట్టలేదు" అంది అన్నా. తను వూహించినట్లు వ్రాన్‌స్కీ ఉత్తరం పట్టుకువచ్చిన నౌకరు తమ దగ్గరికి రావడం చూసింది.

"నాకు చాలా సంతోషంగా వుంది మీరు రావడం" అంది బెట్సీ. "నాకు అలసటగా వుంది. వాళ్లు వొచ్చే లోపున కాస్త టీ తాగుదాం" అని తుష్కేవిచ్ కేసి తిరిగి "మీరూ, మాషా వెళ్లి గడ్డి కోసిన చోట క్రోకెట్ గ్రౌండు చూడండి" అంది. "మనం టీ తాగుతూ హాయిగా మాట్లాడుకుందాం. We'll have a cosy chat, ఆఁ?" అని చిరునవ్వు నవ్వుతూ అన్నా కేసి తిరిగి గొడుగు పట్టుకున్న అన్నా చేతిని చిన్నగా నొక్కుతూ అంది.

"అదే బాగుంటుంది. యేమంటే నేను యెక్కువ సేపు వుండటం లేదు. నేను మేడమ్ వ్రెదె దగ్గరికి వెళ్లాలి. వస్తానని యెప్పట్నుంచో ఆవిడతో అంటూనే వున్నాను" అంది అన్నా, అబద్ధాలు చెప్పడం ఆమె స్వభావంలోనే లేకపోయినా యిప్పుడు నలుగురిలోనూ అబద్ధాలు చెప్పడం సునాయాసమూ, సహజమూ అయిపోయింది. అంతే కాదు సంతోష కరంగా వుంటోంది.

వో క్షణం కితం వూహకి కూడా తట్టని మాటని యెందుకని అందో అన్నా యే రకంగానూ స్పష్టంగా చెప్పలేదు. వ్రాన్‌స్కీ యిక్కడ లేడు కాబట్టి అతన్ని చూడ్డానికి యెలా బయటపడాలా అనే మార్గం కోసమే అలా అనేసింది. తను చూడవలసిన బోలెడు మందిలో మేడమ్ వ్రెదె పేరే యెందుకు స్ఫురించింది అంటే కారణం చెప్పలేదు. కాని యెన్ని ఉపాయాలు ఆలోచిస్తూ బుర్ర బద్దలు కొట్టుకున్నా వ్రాన్‌స్కీని చూడ్డానికి యింతకంటే మంచి మార్గం తనకి దొరికి వుండేది కాదని తర్వాత తేలింది.

"యేం లేదు, యెట్టి పరిస్థితుల్లోనూ మిమ్మల్ని వెళ్లనివ్వను" అంది బెట్సీ అన్నా కళ్లల్లోకి గుచ్చి గుచ్చి చూస్తూ. "మీరంటే యింత యిష్టం వుండబట్టి గాని లేకపోతే మీమీద కోపం వచ్చి వుండేది నాకు. మా బృందంతో కలవడం అంటే మీకు హోదా తగ్గుతుందని భయంగా వున్నట్టుంది. చిన్న డ్రాయింగు రూమ్‌కి టీ తీసుకురా" అని యెప్పుడూ నౌకర్లతో మాట్లాడేటప్పుడు వాళ్లని చూసినట్టు కళ్లు చిన్నవి చేసి చూసి చెప్పింది. నౌకరు యిచ్చిన చీటీ తీసుకుని చదివింది. "వ్రాన్‌స్కీ తోకరా కొట్టేసాడు. రావడం లేడట" అని ఫ్రెంచిలో అంది. క్రోకెట్ ఆటలో ఆటగాడుగా కంటే ప్రస్తుతం వ్రాన్‌స్కీ అన్నాకి యెంతో యెక్కువ అని ఆమె మనస్సుకి తట్టనే లేనట్టు అలా సాదాగా సహజంగా అనేసింది.

బెట్సీ అన్నీ యెరుగునని అన్నాకి తెలుసు. కాని తన ముందు వ్రాన్‌స్కీ గురించి ఆమె

ప్రస్తావించడం విన్నప్పుడల్లా ఆమెకి ఏమీ తెలీదు అని ఆ క్షణంలో అన్నాకి నమ్మకం కలిగేది.

"అలాగా" అంది అన్నా ఉదాసీనంగా ఆ విషయం అంత ముఖ్యమైంది కానట్టు. చిరునవ్వు నవ్వుతూనే చెప్పింది. "మీ స్నేహితులతో కలవాలంటే భయం యెందుకు?" మాటలమీద శ్లేష, రహస్యాల్ని దాచుకోవడం యితర మహిళలకి మాదిరి అన్నాకి చాలా యిష్టంగా వుంది. యేదో దాచుకోవలసిన అవసరం గాని, దాచుకునే కారణం గాని కాకుండా దాచుకునే క్రమం ఆమెకి మురిపెం కలిగించింది. "నేను పోప్ కంటె యెక్కువ కాథలిక్‌గా వుండలేను" అంది. "ట్వెర్స్కోయ్, లీజా మెర్కాలోవా మన సమాజంలో మేలు బంతులు. అన్ని చోట్లా వాళ్లకి ఆదరంగా స్వాగతం చెప్తారు. నేను" అని ఆమె 'నేను' వొత్తి పలికింది. "యెన్నడూ కఠినంగా, వోర్మి లేనట్టుగా వుండలేదు. విషయం యేమంటే నేను అంత హడావుడిగా వున్నాను" అంది.

"లేదు బహుశా ట్వెర్స్కోయ్‌ని కలుసుకోవడం మీకు యిష్టం లేదేమో? అయిన్నీ, కరేనిన్‌గారినీ సర్కారీ కమిటీల్లో తన్నుకోనివ్వండి. మనకెందుకు? ఉన్నత సమాజంలో నాకు తెలిసిన వ్యక్తుల్లో యీయన ముచ్చటైన మనిషి, క్రోకెట్ అంటే పడి చస్తాడు. మీరే చూస్తారు. లీజాకి మునలి ప్రేమికుడిలా నవ్వుతాల స్థితిలో వున్నా ఆ నవ్వుతాలు పరిస్థితి కనిపించనియ్యకుండా బయట పడే ప్రయత్నం చెయ్యడం చూస్తే భలే అనిపిస్తుంది. భేష్యైన ముచ్చట కొలిపే వ్యక్తి. సాఫో షెల్టోవ్‌ని యెరుగుదురా? ఆమె బాణీ కొత్తది. సరికొత్త బాణీ."

బెట్సీ అలా మాట్లాడుతూనే వుండగా సంతోషంతో మెరుస్తూ చురుగ్గా వున్న ఆమె కళ్లని చూసి ఆమె యేదో వూహించిందనీ, యేదో యెత్తు వేస్తోందనీ అన్నా గ్రహించింది.

"ఆఁ, వ్రాస్క్కీకి జవాబు రాసి పంపించాలి" అని రాతబల్ల దగ్గర కూర్చుని గబగబా నాలుగు మాటలు గిలికింది. ఆ కాగితాన్ని కవరులో పెట్టింది. "మనతో భోజనం చెయ్యడానికి రమ్మని పిలిచాను. యిక్కడ వొకామెకి తోడు లేదు. చదవండి, అతన్ని రప్పించేటట్టు వుందా నా ఉత్తరం? మరేం అనుకోకండి, వో క్షణంలో వస్తాను. దీన్ని అతికించి పంపించెయ్యండి" అంది గుమ్మం దగ్గరనుంచి వెళ్లిపోతూ. "యేమేం చెయ్యాలో నాలుగు మాటలు చెప్పేసి వస్తాను" అంది.

క్షణం కూడా ఆలోచించకుండా అన్నా రాతబల్ల దగ్గరికి వెళ్లి, ఆ ఉత్తరం చదవకుండానే 'మిమ్మల్ని జరూరుగా కలవాలి. మేడం వ్రెదె తోటలోకి రండి. నేను ఆరు గంటలకి అక్కడ వుంటాను' అని కింద జత చేసింది. దాన్ని కవరులో పెట్టి మూసేసింది. బెట్సీ వచ్చి, ఆమె సముఖంలోనే దాన్ని పంపేసింది.

టీ బల్లని చల్లగా వున్న చిన్న డ్రాయింగ్ రూమ్‌లోకి తీసుకు వచ్చారు. టీ తాగుతూ వాళ్లిద్దరూ బెట్సీ మాట యిచ్చినట్టు cosy chatతో గడిపారు, రాబోయే అతిథుల

గురించి మాట్లాడుకున్నారు, ముఖ్యంగా లీజా మెర్కాలోవా గురించి.

"చాలా ముచ్చటైంది, నాకు యెవ్వరూ ఆమె అంటే యిష్టమే" అంది అన్నా.

"మీరు ఆమె అంటే యిష్ట పడాల్సిందే. ఆమెకి మీరంటే వ్యామోహం. గుర్రప్పందేల తరువాత నా దగ్గరికి వచ్చింది. మీరు వెళ్లిపోయారని చెప్పి చాలా బాధపడిపోయింది. మీరేదో నవలల్లోని నాయిక అంటుంది. తను మగాడై వుంటేనట మీ కోసం లక్షా తొంభై వెర్రి పనులు చేసి వుండేదట. ఆమె యెలాగైనా ఆ పనులు చేస్తూనే వుందని స్త్రేమొవ్ అంటాడు."

"కాని యిది చెప్పండి నాకు, నాకెన్నడూ అర్థం కావడం లేదు..." అన్నా కొంచెం ఆగింది. ఆమె మాట్లాడే గొంతుకని బట్టి ఆమె యేదో ఉబుసుపోకకి అడిగినట్టు కాక వుండవలసిన దాని కంటే యెక్కువ ఘనంగానే భావించుకున్నట్టు స్పష్టంగా కనిపించింది ప్రశ్న. "ప్రిన్స్ కలూజ్‌స్కీతో, ఆయన్ని మిషా అంటారను కుంటాను. ఆయనతో ఆమె సంబంధాలు యెలా వుంటాయంటారు? నేను వాళ్లని యెప్పుడో గాని కలవను. యెలాంటి సంబంధాలు?"

బెట్సీ కళ్లతోనే చిరునవ్వు నవ్వింది. అన్నా కేసి తదేకంగా చూసింది.

"కొత్త రకం సంబంధాలు. వాళ్లందరూ అలాంటి సంబంధాలనే యెంచుకున్నారు. యేం వస్తే యేం లే అని ఫరవా లేకుండా వుండడం. కాని ఆ ఫరవా లేకుండా ఉండడంలో తేడాలున్నాయి."

"అలాగా, కాని కలూజ్‌స్కీతో ఆమె సంబంధాలు యెలా వుంటాయి?"

బెట్సీ వున్నట్టుండి పగలబడి నవ్వింది. యెప్పుడో గాని ఆమె అలా నవ్వదు.

"మీరు ప్రిన్సెస్ మ్యాకయా హక్కుల్ని ఉల్లంఘిస్తున్నారు. కొంటెపిల్ల ప్రశ్న యిది" అంది బెట్సీ. నవ్వు ఆపుకుందామని ప్రయత్నించింది కాని ఆపుకోలేక మళ్లీ నవ్వింది. తరుచుగా నవ్వని వాళ్లల్లో కూడా నవ్వు పుట్టించే నవ్వు అది. "మీరు వాళ్లని అడగండి" అని నవ్వు తెరల మధ్యలో అంది.

"లేదు మీరు నవ్వుతున్నారు" అని అన్నా తనూ నవ్వడం మొదలుపెట్టింది. "కాని నాకు అర్థం కావడం లేదు. యీ విషయంలో ఆవిడ మొగుడి పాత్ర యేమిటో తెలీడం లేదు."

"ఆవిడ మొగుడా? లీజా మెర్కాలోవా మొగుడు ఆమె కూడా కూడా వుంటాడు. ఆవిడ గౌను కుచ్చెళ్లు సవరిస్తూ వుంటాడు. యదార్థంలో దానికి మించి యేమిటి వుందో యెవళ్లూ పట్టించుకోరు. మర్యాదస్థుల సమాజంలో గౌను కుచ్చెళ్లు తదితరాలు యెవళ్లూ అడగరు, వాటిని గురించి ఆలోచించరు. యిక్కడా అదే విషయం వర్తిస్తుంది."

అన్నా ప్రసంగ విషయం హడావుడిగా మార్చడానికని "మీరు రోలండకీ పార్టీకి వెడతారా?" అని అడిగింది.

"యేమో వెళ్లక పోవచ్చు" అంది బెట్సీ, అన్నా కేసి చూడకుండా. చిన్న చిన్న పార

దర్శకమైన కప్పుల్లో ఘుమఘుమలాడే టీ పోసింది. వో కప్పుని అన్నా వేపు తోసి తను సిగరెట్ తీసి వెండి హోల్డర్‌లో పెట్టి ముట్టించుకోవడం మొదలుపెట్టింది.

"వూఁ, చూడండి నేను చాలా అదృష్టవంతురాల్ని" అంది ముందటిలాగా నవ్వకుండా. "నేను మిమ్మల్ని అర్థం చేసుకోగలను, లీజానీ కూడా. లీజా భోళా స్వభావం ఉన్న మనుష్యుల్లాంటిది. పసిపిల్లం మాదిరీ యేది మంచి యేది చెడ్డా తెలుసుకోలేరు. కమీసం చిన్నతనంలో అలా వుండేది. ఇప్పుడు అలా తెలుసుకోకుండా వుండడం తనకి నప్పుతుందని ఆమెకి తెలుసు. యిప్పుడు ఉద్దేశపూర్వకంగానే భోళాగా వుండచ్చు" అంది బెట్సీ చిరునవ్వు నవ్వుతూ. "నిజంగానే అది ఆమెకి తగ్గట్టే వుంది. ఒకే విషయాన్ని వేరు వేరు రకాలుగా తీసుకోవచ్చు, చూశారూ విషాదభరితమైందిగా చూసి యాతన పడడం, ఆఁ యేదో మామూలు విషయమేలే అని అలా చూసి సరదాగా గడిపెయ్యడం. మీరు విషాదభరితంగా చూసే ప్రవృత్తి కనబరుస్తారు."

"నా గురించి నాకు తెలిసినట్టుగా యితరుల గురించి తెలిసి వుంటే యెంత బాగుండును!" అని అన్నా గంభీరంగా, సాలోచనగా అంది. "మిగతా వాళ్ళకంటే మెరుగ్గా వున్నానా, చెడ్డగా వున్నానా? నా ఉద్దేశంలో చెడ్డగానే అని" అంది.

"అచ్చం కొంటెపిల్లం మాదిరీ, అసలైన కొంటెపిల్లం మాదిరి" అని బెట్సీ రెట్టించింది. "ఆఁ, వాళ్ళు వచ్చేశారు" అంది.

18

అడుగుల చప్పుడు వినిపించింది. వొక మగమనిషి కంఠం తర్వాత ఒక ఆడమనిషి కంఠం, నవ్వు వినిపించాయి. వాళ్ళు యెదురు చూస్తూ వున్న అతిథులు వచ్చేరు. సాఫో ష్ట్రోల్జ్, అందరూ వాస్కా అని పిలిచే వో పడుచతను వచ్చేరు. అతను ఆరోగ్యంతో మిసమిసలాడి పోతున్నాడు. వో మాదిరిగా వేయించిన మాంసం, ట్రఫల్స్ పుట్టగొడుగులు, బర్గండీ వైన్ కలిగించిన లాభాలు కంటికి సదురుగా కనిపిస్తున్నాయి. వాస్కా తల వంచి ఆడవాళ్ళకి వందనం చేసి వాళ్ల కేసి చూశాడు. కాని వో క్షణం సేపు మాత్రమే అలా చూశాడు. సాఫో వెనకాలే డ్రాయింగు రూమ్‌లోకి వెళ్ళాడు. ఆమెకి అంటుకు పోయినట్టు వెళ్ళాడు. ఆమెని మింగేద్దామా అన్నట్టు మిలమిల మెరిసే చూపులని ఆమెమీదనే లగ్నం చేశాడు. సాఫో ష్ట్రోల్జ్ జుట్టు బంగారు రంగులో వుంది. ఆమె కళ్ళు నల్లగా వున్నాయి. ఆమె యెత్తు మడమల చెప్పులతో చిన్న చిన్న అడుగులు వేస్తూనే వేగంగా లోపలికి వెళ్ళింది. ఆ ఆడవాళ్ల చేతుల్ని మగవాడిలాగా గట్టిగా అదిమింది.

యిటీవల ప్రఖ్యాతమైన యీ మహిళని అన్నా అంతకు ముందు చూడలేదు. ఆమె అందం చూసీ, ఔచిత్యపు హద్దులు దాటే వేషధారణ చూసీ ఆమె తెగువ గల రీతి చూసీ

అన్నా చకితురాలై పోయింది. ఆమె తలమీద బంగారు జుట్టూ, నవరాలూ కలిసి ఆమె కొప్పు, చుట్టుకుంది. అది యెగిసి వచ్చే అర్ధ ఆచ్ఛాదిత వక్షస్సూ, మెడా కలిపి చూసిన దానికంటే పెద్దగా కనిపించింది. ఆమె గబగబా యెదరికి సాగింది. ఆమె వేసే ప్రతి అడుగూ గౌను కిందనుంచి ఆమె మోకాళ్ళ, పిరుదుం ఆకృతిని గోచరమచేస్తోంది. వెనకాల ఉద్భిత్తుగా తేలిన బట్టల బుట్టలో యీ అందమైన నాజూకైనా శరీరం యెక్కడ అంతరవుతున్నదీ, యెక్కడ బట్టల బుట్ట మొదలవుతుందీ అనే సందేహం యెవళ్ళకేనా వస్తుంది. యీ శరీరం పైన యెంత వెల్లడిగా వుందో కిందా వెనకా, అంత ఆచ్ఛాదితంగా వుంది.

బెట్సీ అన్నాని వెంటనే పరిచయం చేసింది.

"అబ్బ వూహించుకోండి, యిద్దరు పైనికుల్నీ బండికింద నలగ్గొట్టి వుండేసే వాళ్లం!" అని ఆమె వెంటనే చిరునవ్వు నవ్వుతూ చెప్పడం మొదలుపెట్టింది. కళ్ళు చికిలిస్తూ, గౌను జీరాడే అంచుని ఆడిస్తూ అలా చెప్పింది. ఆ అంచుని వో పక్కకి యెక్కువ వేసుకుంది. "నేనూ, వాస్కా కలిసి వస్తున్నాం... ఆఁ, అవును మీరు అతన్ని కలుసుకోనే లేదు కదూ!" అని ఆ పడుచతన్ని పూర్తి పేరుతో పరిచయం చేసింది. అతనితో పరిచయం లేని కొత్త వాళ్ల ముందు అతన్ని వాస్కా అని పిలిచి మర్యాద నతిక్రమించినందుకు సిగ్గుతో యెర్ర బడుతూ కిలకిలా నవ్వింది.

వాస్కా మరోసారి అన్నాకి తలవంచి వందనం చేసాడు. కాని ఆమెతో యేమీ అనలేదు. అతను సాఫో కేసి తిరిగి మాట్లాడేడు.

"మీరు పందెం వోడిపోయారు. మనం యిక్కడికి ముందు వచ్చాం. తెండి, పందెం చెల్లించండి" అన్నాడు చిరునవ్వు నవ్వుతూ.

సాఫో యింకా హుషారుగా నవ్వింది.

"యిప్పుడు యివ్వడం వుండదు."

"పోన్లెండి తరువాత రాబట్టుకుంటాను."

"బాగుంది, బాగుంది! అరె అఁ!" అంది హఠాత్తుగా యింటావిడ కేసి తిరిగి. "అయ్యో తెలివాని! నా మతిమరుపు కాదు గాని! వో అతిథిని తీసుకొచ్చేను. ఇదుగో" అని చూపించింది.

సాఫో తనతో కూడ తీసుకువచ్చి పరిచయం చెయ్యడం మరిచిపోయిన ఆ వ్యక్తి యెంత ఘనమైన వాడంటే అతను పడుచువాడైనప్పటికీ యిద్దరు ఆడవాళ్లూ అతనికి స్వాగతం చెప్పడానికి నుంచున్నారు.

అతను సాఫో కొత్త అభిమానుల్లో ఒకడు. అతను కూడా వాస్కా లాగానే ఆమెని అంటి పెట్టుకునే వుంటాడు.

కొంచెం సేపటి తర్వాత ప్రిన్స్ కలూజ్‌స్కీ వచ్చేడు. ప్రేమొవ్‌తో కలిసి లీజా మెర్కా లోవా వచ్చింది. లీజా మెర్కాలోవా సన్నగా బక్కపల్చగా వుంటుంది. ప్రాచ్యదేశ వాసుల లాంటి అలస వదనం ఆమెది. ఆమె కళ్ళు సుందరంగా వుంటాయి. ఆ కళ్ళు నిగూఢమైన

వని ప్రతివాళ్ళూ అంటారు. ఆమె వేసుకున్న నల్లని బట్టలు (అన్నా చూడగానే ఆమెని మెచ్చుకుంది) అన్ని విధాలా ఆమె అందానికి నప్పినట్టు వున్నాయి. సాఫో యెంత చురుగ్గా, చకచక మంటూ వుంటుందో లీజా అంత మెత్తగా, అలసంగా ఉంటుంది.

కాని అన్నా అభిరుచికి లీజా చాలా ఆకర్షణంగా వుంది. ఆమె భోళాభాళా చంటి పిల్లం మాదిరీ నటిస్తుందని బెట్సీ అంది. కాని అది నిజం కాదని ఆమెని చూడగానే అన్నాకి అర్థమైంది. ఆమె యదార్థానికి భోళాభాళాగానే ప్రవర్తించే రీతి వేలెత్తి చూపించేటట్టు వున్నా ముచ్చటగా, యెవళ్ళకీ హాని చెయ్యకుండా వుంటుంది. ఆమె నడత సాఫో మాదిరీ వుంటుంది. సాఫో మాదిరీ ఆమెకీ కొంగుకి ముడేసినట్టు కూడా కూడా తిరుగుతూ, కళ్ళతో ఆమెని తినేసేటట్టు చూసే ఆరాధకులు యిద్దరు వున్నారు. ఒకతను పడుచువాడు, ఒకతను ముసలాయన. కాని తన చుట్టూ వున్న వాతావరణం కంటే ఆమెని అధికం చేసేదేదో ఆమెలో వుంది. గాజు పూసల మధ్యలో అసలు వజ్రంలా మెరిసేదేదో ఆమెలో వుంది. ఆ మెరుపు ఆమె అందమైన కళ్ళల్లోనుంచి వస్తుంది. అవి నిజంగా నిగూఢమైనవే. నల్లని వృత్తాలతో వున్న ఆ కళ్ళ అలస, రాగాన్విత దృక్కు, పూర్ణ నిజాయితీతో చకితం చేస్తుంది. ఆ కళ్ళల్లోకి చూసిన యెవళ్ళకేనా గానీ పూర్తిగా ఆమె గ్రాహ్యమైనట్టూ, ఆమెని ప్రేమించకుండా వుండలేనట్టూ అనిపిస్తుంది. అన్నాని చూడగానే ఆమె ముఖం వెంటనే సంతోషభరిత మందహాసంతో వెలిగింది.

“మిమ్మల్ని చూసి యెంత సంతోషం కలిగింది!” అని అన్నా దగ్గరికి వెడుతూ అంది ఆమె. “నిన్న పందెం తర్వాత మిమ్మల్ని కలుసుకుందా మనుకుంటూ వున్నాను. యింతట్లోకే మీరు వెళ్ళిపోయారు. నిన్న ముఖ్యంగా మిమ్మల్ని కలుసుకుందా మనుకున్నాను. నిజంగా అది భయంకరమైన దృశ్యం కదూ?” అని అన్నా కేసి తన అంతరంగాన్ని తెరుస్తున్నట్టు కనిపింపచేసే చూపు చూస్తూ అడిగింది.

“అవును, నేను అంతలా చలించిపోతానని అనుకోలేదు” అని సిగ్గుపడుతూ అన్నా జవాబు చెప్పింది.

తోటలోకి వెడదామని సరిగ్గా అప్పుడే అందరూ లేచారు.

“నేను రావడం లేదు” అని లీజా చిరునవ్వు నవ్వుతూ అన్నా పక్క కూర్చుంటూ అంది. “మీరు వెళ్ళడం లేదు కదూ? క్రొకెట్ ఆడ్డంలో సరదా యేముంది?” అంది.

“కాని నాకు యిష్టమే” అంది అన్నా.

“ఆఁ, చెప్పండి, మీకు కాలక్షేపం అవడానికి యేం చేస్తారు? మిమ్మల్ని చూస్తేనే మనసుకి ఆహ్లాదంగా వుంటుంది. మీరు సరదాగా బతుకుతున్నారు. నాకు విసుగ్గా వుంటోంది.”

“విసుగ్గా వుంటోందా? పీటర్స్‌బర్గ్‌లో అందరి కంటే ఖుషీగా వుండే బృందంలో వుంటారే మీరు!” అంది అన్నా.

“అలా అయితే మా బృందంలో లేనివాళ్ళకి యింకా యెక్కువ విసుగ్గా వుండివుండాలి.

మనకు, కనీసం నాకు, యేదీ ఖుషీగా అనిపించదు. చాలా చాలా విసుగ్గా వుంటుంది."

సాఫో సిగరెట్టు కాలుస్తూ తన అభిమానులిద్దరితోనూ తోటలోకి వెళ్ళింది. టీ బల్ల దగ్గర బెట్సీ, స్ట్రెమొవ్ కూర్చుండి పోయారు.

"మీకు విసుగ్గా వుంటోందా?" అంది బెట్సీ. "నిన్న రాత్రి మీ యింటి దగ్గర భలే మజాగా గడిచిందని సాఫో యిప్పుడే నాతో అంది."

"అబ్బ చచ్చేటంత విసుగనిపించింది" అంది లీజా. "పందేం తర్వాత అందరం మా యింటికి వెళ్ళాం. మళ్ళీ అదే మనుషులు, అవే కబుర్లు. అలా సోఫాలమీద సాయంత్రం అంతా సాగిలపడే వున్నామంతే. అందులో మజా యేముంది? విసుగు లేకుండా వుండాలంటే యేం చేస్తారు మీరు చెప్పండి?" అంది అన్నా కేసి తిరిగి. "మిమ్మల్ని చూస్తే చాలు యెవళ్ళ కేనా తెలుస్తుంది యిక్కడుంది ఒకామె, ఆమె బహుశా సుఖంగా వుండచ్చు, దుఃఖంగా వుండచ్చు కాని విసుగ్గా వుందని యెప్పుడూ అనుకోదు అని. మీరు యేమి చేస్తున్నారో చెప్పండి నాకు" అంది.

"నేను యేమీ చెయ్యను" అంది అన్నా, నొక్కి నొక్కి యిలాంటి ప్రశ్నలడగడంతో సిగ్గుపడి.

"అదీ శ్రేష్ఠమైన పద్ధతి" అన్నాడు స్ట్రెమొవ్ సంభాషణలో లౌక్యం కలిగించుకుంటూ.

స్ట్రెమొవ్‌కి యాభై యేళ్ళుంటాయి. జుట్టు నెరుస్తోంది. అయినా గానీ నేవళింపు పోలేదు. అందమైన వాడు కాదు గాని ముఖంలో తెలివితేటలు, నడవడిలో వ్యక్తిత్వం, దృఢత్వం గోచరమవుతూ వుంటాయి. లీజా అతని భార్యకి మేనగోడలు. అతను ఖాళీగా వున్నప్పుడల్లా ఆమెతోనే వుండేవాడు. ప్రభుత్వోద్యోగంలో అతను అన్నా భర్త కరేనిన్‌కి విరోధి. అంతేత లౌక్యం తెలిసిన మనిషి కాబట్టి అన్నా పట్ల ముఖ్యంగా ఆదరం కనబరుస్తూ స్నేహంగా వుండడానికి ప్రయత్నించేడు.

"నేను యేమీ చెయ్యను" అని కుటిలంగా చిరునవ్వు నవ్వుతూ ఆ మాటలని రెట్టించాడు. "అదే శ్రేష్ఠమైన పద్ధతి. నే చెప్పానా యెప్పుడూ మీకు" అని లీజా మెర్కాలొవా కేసి చూసి అన్నాడు. "విసుగ్గా వుంటుందేమోనని అనుకోకుండా వుంటే విసుగ్గా వున్నట్టనిపించదు. నిద్రలేమివల్ల భయపడే వ్యక్తి నిద్రపట్టదేమోనని భయపడకుండా వుండడం లాంటిదే యిది. అన్నాగారు యిప్పుడు అన్న ముక్క అదే."

"ఆ మాట నేను అని వుంటే నాకు చాల సంతోషంగా వుండేది. యేమంటే అది తెలివైన మాటే గాక నిజం కూడా" అని అన్నా చిరునవ్వు నవ్వింది.

"ఆహా! అయితే నిద్రలేమి, విసుగు అనేవి లేకుండా యెలా పోతాయో చెప్పండి."

"నిద్ర పట్టాలీ అంటే పని చెయ్యాలి. అలాగే సంతోషంగా వుండడానికీ పని చెయ్యాలి."

"నా పని యెవళ్ళకీ అక్కర్లేనప్పుడు నేను పనెందుకు చెయ్యాలి? నటన నా చేత కాదు. నేను అలా చెయ్యనూ చెయ్యను."

"మీరు యిక బాగుపడరు" అని లీజా కేసి చూడను కూడా చూడకుండా అన్నా కేసి తిరిగి మాట్లాడేడు క్రెస్త్రమొవ్.

అన్నాని యెప్పుడో గాని చూడడు అతను. అంచేత యేదో సాదా విషయాలు తప్ప యేం మాట్లాడ లేకపోయాడు. ఆ సాదా విషయాలనే, అంటే తను పీటర్స్‌బర్గ్‌కి యెప్పుడు తిరిగి వెడుతుందనీ, కౌంటెస్ లీదియా ఇవానొవ్నాకి ఆమె అంటే యెంతో యిష్టం అనీ, యిలాంటి మాటల్నే, యెంత అభివ్యక్తిపూర్వకంగా చెప్పాడంటే ఆమెని సర్వాత్మనా సంతుష్టురాల్ని చెయ్యాలనే గాక తనకి ఆమె పట్ల గల గౌరవభావాన్ని ప్రదర్శించేటట్టు అన్నాడు.

అందరూ క్రోకెట్ ఆటగాళ్ల కోసం యెదురు చూస్తున్నారని తుష్కేవిచ్ వచ్చి చెప్పాడు.

"వద్దు, వెళ్లద్దండీ" అంది లీజా, అన్నా వెళ్లిపోయే ఉద్దేశంలో వున్నట్టు విని. క్రెస్త్రమొవ్ కూడా లీజాని బలపరిచాడు.

"యిలాంటి మనుషుల్ని కలుసుకున్నాక పెద్దావిడ వ్రేదె దగ్గరికి వెళ్లడం చాలా విరుద్ధంగా వుంటుంది. పైగా మీరు అక్కడకి వెడితే చెవులు కొరుక్కునే మాటలకి అవకాశం కలిగిస్తారు. యిక్కడైతే మీరు అలాంటి మాటలు కాకుండా ఉన్నతమైన వాటిని జాగృతం చేస్తారు" అన్నాడు.

ఏ క్షణం అన్నా తటపటాయించింది. తెలివైన యీయన ప్రశంసలు, లీజా మెర్కాలోవా తన పట్ల చూపించిన అమాయిక అభిమానం, యిక్కడున్న పరిచిత నాగరిక వాతావరణం అన్నీ ఆమెకి సునాయాసంగా కనిపించేటట్టు వున్నాయి, మరి అటు చూస్తే యెదర యెంతో కఠినమైన సమయం వుంది. దాంతో ఆమె వెనక్కి దిగడి పోదామా, అన్నీ వ్రాన్‌స్కీకి చెప్పే గడ్డు క్షణాన్ని వాయిదా వేద్దామా అని వూగులాడింది. కాని యీవత్తూ స్పష్టం అవకుండా యింటికి పోతే యెంత యాతనగా వుంటుందో ఆలోచనకి వచ్చింది. తను జ్ఞాపకం చేసుకోవడానికే భయంకరంగా కనిపించే ఆ క్షణం, ఒక్కత్తీ తల చేత్తో పట్టుకుని కూర్చున్న ఆ క్షణం గుర్తు వచ్చి, ఆమె వాళ్ల దగ్గర సెలవు తీసుకొని వెళ్లిపోయింది.

19

వ్రాన్‌స్కీ పైకి రంగేలీ జీవితం గడిపే వాడిలా కనిపించినా కూడా అతనికి కంగిరి పింగిరిగా వుండడమంటే అసహ్యం. కుర్రాడిగా వున్నప్పుడు, అంటే సైనిక విద్యాలయంలో చదువుకునే రోజుల్లో, యేదో గడ్డు పరిస్థితి యెదురై అప్పు అడిగే స్థితిలో పడి, లేదనిపించుకునే అవమానం భరించాల్సి వచ్చింది. అప్పట్నుంచి అలాంటి స్థితి రాకుండా జాగ్రత్త పడ్డాడు.

తన వ్యవహారాలు సీదా సాదాగా వుంచుకుందుకు అతను పరిస్థితులను బట్టి సాలుకి

నాలుగైదు సార్లు యేకాంతంగా కూర్చుని జమా ఖర్చులు తేల్చుకుంటూ వుంటాడు. దీన్ని జమా ఖర్చుల పద్దు అనీ లేదా faire la lessive[1] అనీ అనేవాడు.

పందేలు జరిగిన మర్నాడు పొద్దుపోయి నిద్ర లేవాక వ్రాన్‌స్కీ గడ్డం గీసుకోకుండా, స్నానం చెయ్యకుండా సైనిక యూనిఫాం వేసుకొని పద్దులు, కాగితాలు దగ్గరున్న డబ్బు ముందేసుకుని పన్లో మునిగిపోయాడు. పెత్రీత్‌స్కీ నిద్రనుంచి లేచి తన మిత్రుడు రాత బల్ల దగ్గర వుండడం చూసి గప్ చిప్‌గా బట్టలు వేసుకొని వెళ్ళిపోయాడు. అతనికి అంత రాయం కలిగించకూడదని వెళ్ళిపోయాడు. అలాంటప్పుడు అడ్డం వెళ్తే వ్రాన్‌స్కీ చిరాకు పడిపోతాడని అతనికి తెలుసు.

తన స్థితిగతుల్లోని ప్రతి చిన్న విషయాన్నీ అమూలాగ్రం యెరిగిన యే వ్యక్తి అయినా గానీ ఆ పరిస్థితిలోని జటిలత, దాన్ని స్పష్టపరచుకోవడంలో కష్టాలు కేవలం తనకి మాత్రమే వున్నాయని తనకి తెలియకుండానే అలాంటి పరిస్థితిలో వున్నానని అనుకుంటూ వుంటాడు. మిగతా వాళ్ళకి కూడా అలాంటి జటిల వ్యక్తిగత స్థితి గతులు వుంటాయన్న విషయం అతనికి తట్టదు. వ్రాన్‌స్కీకి కూడా అలానే అనిపించింది. తనున్న సంక్లిష్ట పరిస్థితుల్లాంటి పరిస్థితుల్లో వేరే వాళ్ళయితే యెప్పుడో చిక్కులు పడిపోయి, హృదయ విదారక దశకి జారి పోయి వుండే వాళ్ళని అతను అంత నిరాధారం గాని, ఆంతరిక గర్వభావంతో అనుకుంటూ వుండేవాడు. తను అలాంటి దశకు జారిపోకుండా వుండాలంటే తన పరిస్థితుల్ని అర్థం చేసుకొని స్పష్టపరచుకునే అక్కర వచ్చిందని వ్రాన్‌స్కీకి అవగతం అయింది.

చాలా సునాయాసకరమైన పని, తన ఆదాయ వ్యయాల్ని చూసుకోవడం మొదలు పెట్టాడు. చక్కని దస్తూరిలో వో కాగితంమీద తన అప్పులన్నిట్నీ రాశాడు. ఆ మొత్తం పదిహేడు వేల రూబుళ్ళ కొన్ని వందలు తేలింది. పద్దు సాఫీగా తేలడం కోసమన్చెప్పి పై చిలుకు వందల్ని లెక్కలోంచి తీసేసాడు. చేతుల్లో వున్న రొఖ్ఖాన్నీ, బేంక్‌లో దాన్నీ లెక్కపెడితే పద్దెనిమిది వందల రూబుళ్ళు వున్నట్టు తేలింది. సంవత్సరాది లోపున సొమ్ము వచ్చే అవకాశం లేదు. అప్పుల్ని మరో సారి చూసుకుని వాటిని మూడు అవర్ణాలుగా వర్గీకరించాడు. మొదటి దాంట్లో తక్షణం చెల్లించాల్సిందాన్ని చేర్చాడు. కనీసం అడగ్గానే వెంటనే చెల్లించేందుకు గాను చేపట్టున వుంచుకోవలసిన దాన్ని అందులో చేర్చాడు. యీ అప్పులన్నీ సుమారు నాలుగు వేల రూబుళ్ళు తేలాయి. వో గుర్రానికి పదిహేను వందలు, వో పేకాట అప్పు రెండు వేల అయిదు వందలు. వ్రాన్‌స్కీ సమక్షంలో అతని యువ మిత్రుడు వెనేవ్‌స్కీ వో పేకాట మోసగాడికి యీ మొత్తం వోడిపోయాడు. అతనికి వ్రాన్‌స్కీ పూచీ వున్నాడు. వ్రాన్‌స్కీ ఆ మొత్తాన్ని అప్పుడే యిచ్చేద్దా మనుకున్నాడు. (అప్పుడు జేబులో ఆ సొమ్ము వుంది.) కాని వెనేవ్‌స్కీ, యాష్విన్‌లు వద్దు మేమే చెల్లిస్తామని బలవంతం చేశారు. వ్రాన్‌స్కీ ఆట

---

[1] ఉతకడం (ఫ్రెంచి).

ఆడను కూడా ఆడలేదు కదా అని కారణం చూపించారు. అంత మట్టుకు బాగానే వుంది. కాని వెనేవ్‌స్కీ తరపున హామీ ఉంటానని మాట అనడంద్వారా యీ వెధవ గొడవలో యిరుక్కున్నందుకు ఆ మోసగాడి మొహాన రెండు వేల అయిదు వందలు విసిరి కొట్టి వాడికి వో నమస్కారం పారేసేందుకు ఆ సొమ్ము వుంచుకోవాలని వ్రాన్‌స్కీకి తెలుసు. ఆ రకంగా ముఖ్యమైన యీ మొదటి జాబితాలో నాలుగు వేలు చేరాయి. రెండవ జాబితా లోవి అంత ముఖ్యమైనవి కాదు. అవి యెనిమిది వేలు తేలాయి. గుర్రపుశాల పద్దులవి. గడ్డికీ, ఓట్ ధాన్యానికీ, ఇంగ్లీషు జాకీకి యివ్వాల్సిన మొత్తాలు, జీను వాడికి యివ్వాల్సినవీ ఆ బాపతువీ. తను కొంచెం తెరిపిన పడాలి అనుకుంటే కనీసం రెండు వేలు యీ జాబితాలో చెల్లించాల్సినవి వున్నాయి. యిక ఆఖరి జాబితాలో షాపులకి, హోటల్లకి, టైలర్‌కి యివ్వాల్సినవి వున్నాయి. వాటి గురించి అంత పట్టించుకోవాల్సిన పని లేదు. ప్రస్తుతం ఖర్చులకి కనీసం ఆరు వేలన్నా కావాలి కాని దగ్గర పద్దెనిమిది వందలే వున్నాయని ఆఖరికి తేలింది. సాలీనా లక్షరూబుళ్ల ఆదాయం వచ్చే వ్యక్తి అని వ్రాన్‌స్కీ గురించి అందరూ అనుకునే వాళ్లు. అలాంటి వాడికి యీ అప్పులు వో లెక్క జమాగా కనిపించకూడదు. కాని యదార్థం యేమంటే అతనికి లక్షరూబుళ్ల ఆదాయం లాంటిదేమీ లేదు. తండ్రి ఆస్తి చాలా పెద్దది. అదే సాలీనా రెండు లక్షల వరుమానాన్ని యిస్తుంది. దాన్ని అన్నదమ్ములు పంచుకోలేదు. వ్రాన్‌స్కీ అన్నగారు అప్పటికే తలమునకగా అప్పుల్లో వుండి వో డిసెంబరిస్టు తిరుగుబాటుదారుడి కూతురైన* ప్రిన్సెస్ వార్యా చిర్కోవాని పెళ్లాడేడు. ఆమెకి యే రకమైన ఆస్తీ లేదు. అందుకని వ్రాన్‌స్కీ తండ్రి ఆస్తిమీద వచ్చే ఆదాయన్నంతట్నీ అన్నగారికి వదిలేశాడు. సాలీనా వో పాతిక వేలు మాత్రం తనకి యిమ్మని అడిగేడు. తను పెళ్లి చేసుకునే దాకా తన కది చాలని, బహుశా తను పెళ్లి చేసుకో పోవచ్చని అన్నగారితో చెప్పేడు. అన్నగారు వ్యయం యెక్కువ వుండే రెజిమెంట్‌కి కమాండరు, కొత్తగా పెళ్లి చేసుకున్నాడు. అంచేత వ్రాన్‌స్కీ ఉదారంగా యిచ్చిన దాన్ని కాదనలేని స్థితి అతనిది. తల్లికి స్వంత యెదర వుంది. ఆమె వ్రాన్‌స్కీకి ఆ పాతిక వేలకీ తోడు తను మరో యిరవై వేలు యివ్వడానికి వొప్పుకుంది. ఆ మొత్తం ఆదాయాన్నంతట్నీ కోపెక్కు మిగల్చకుండా వ్రాన్‌స్కీ ఖర్చు పెట్టేసేవాడు. కాని వ్రాన్‌స్కీ మాస్కో వదిలిపెట్టి వెళ్లిపోవడం, అన్నాతో సంబంధం కలిగించుకోవడం తల్లికి కోపకారణమై కొంత కాలంగా తను పంపించాల్సింది పంపడం మానేసింది. తత్ఫలితంగా సాలుకి నలభై అయిదు వేలమీద బతకడం అలవాటైన వ్రాన్‌స్కీకి యివ్వాడు యిరవై అయిదు వేలే చేతికి అందుతూ వుంటే చిక్కులు యేర్పడ్డాయి. వాటిల్లోంచి బయట పడ్డానికి తల్లిని అడగలేదు. ఆమె రాసిన ఆఖరి ఉత్తరం అంతకు ముందు రోజే అందింది. అది అతనికి చాలా కోపం తెప్పించింది. యేమంటే అతను జీవితంలో పురోగతిని సాధించి ఉద్యోగంలో ముందుకు పోతే తను సహాయం చెయ్యగలదు గాని మంచి సమాజంలో తలవంపులు కలిగించేలాంటి బతుకు బతికేందుకు కాదని అందులో సూచనగా

వుంది. తల్లి తనని యీ రకంగా కొనెయ్య ప్రయత్నించడం అతనికి అవమానంగా కనిపించింది. ఆమె పట్ల అతని హృదయంలో యింకా యెక్కువ ఉదాసీన భావం కలిగింది. అన్నాతో తన సంబంధాల ఫలితంగా సంఘటనలు యెలా వుండబోయేదీ కించిత్తు అనుమానం తగిలి, తను ఉదారంగా అన్నగారితో అనేసిన మాటలు అనాలోచితంగా అన్నవనీ, తను బ్రహ్మచారి అయినా కూడా తనకి మొత్తం లక్ష ఆదాయం అవసరమనీ అనిపించింది. కాని ఉదారంగా అనేసిన మాటలని యిప్పుడు వెనక్కి తీసుకోలేదు. వదినగారు అన్న మాటలని, ప్రేమాస్పదురాలైన మంచి వార్యా అన్న మాటలని గుర్తు చేసుకుంటే చాలు, తనన్న మాటలని వెనక్కి తీసుకో వడం యెంత అసంభవమో తెలియడానికి. అనుక్షణం అతని దయార్ద్ర స్వభావాన్ని తాము గుర్తు చేసుకుంటామనీ, అతన్ని గురించి యెంతో గొప్పగా భావించుకుంటూ వుంటామనీ ఆమె అంది. అందుచేత అన్న మాటని వెనక్కి తీసుకోవడం, వొక ఆడదాన్ని కొట్టడం, వో అబద్ధం ఆడటం, లేదా దొంగతనం చెయ్యడం అంత అసంభవం. ఒక్క దానికి మాత్రం అవకాశం వుంది. వ్రాన్‌స్కీ వొక్క క్షణం కూడా వస్తాయించకుండా ఆ పని చేద్దామనుకున్నాడు. వడ్డీ వ్యాపారి దగ్గర్నుంచి పదివేల రూబుళ్ళ అప్పు తేవడం. అందులో కష్టం లేదు. తను మామూలు ఖర్చులు తగ్గించుకుంటాడు. పందెం గుర్రాల్ని అమ్మేస్తాడు. ఆ రకంగా నిర్ణయించుకున్నాక అతను రోలందకికి ఉత్తరం రాశాడు. ఆ వ్యక్తి గుర్రాలు కొంటానని చాలా సార్లు అన్నాడు. తర్వాత ఇంగ్లీషు జాకీకీ, వడ్డీ వ్యాపారికీ కబురు చేశాడు. తన దగ్గర వున్న సొమ్ముని వాటి వాటి పద్దుల కింద విభజించేడు. యిదంతా అయ్యాక తల్లికి కటువుగా, నిరాదరంగా వుండే ఉత్తరం రాశాడు. తర్వాత అన్నా దగ్గర్నుంచి వచ్చిన మూడు చీటీల్ని యాదాస్తు పుస్తకంలోనుంచి తీసి చదివేడు. మళ్లీ చదివేడు. అప్పుడు వాటిని కాల్చేశాడు. అంతకు ముందు ఆమెతో జరిగిన సంభాషణ గుర్తు వచ్చి ఆలోచనలో మునిగిపోయాడు.

20

తను యేం చెయ్యాలీ, యేం చెయ్యకూడదూ అని కచ్చితంగా నిర్ణయించే ప్రవర్తనా నియమావళి పెట్టుకోవడంవల్ల వ్రాన్‌స్కీకి జీవితం సుఖప్రదంగా సాగిపోతుంది. యీ ప్రవర్తనా నియమావళి చాల తక్కువ పరిధికే పరిమితం అయి వుండవచ్చుగాక, కాని మరో వేపునుంచి చూస్తే యీ నియమావళి చాలా కచ్చితంగా వుండింది. వ్రాన్‌స్కీ వొక్క పిసరు కూడా యీ పరిధి దాటి బయటికి వెళ్లలేదు. దాంతో తనేం చెయ్యాలీ అనే దానికి సంబంధించి సందేహమే వుండేది కాదు. యీ నియమావళి కచ్చితంగా నిర్దేశించేదేమంటే పేకాట మోసగాడికి తప్పకుండా చెల్లించాలి. కాని దర్జీకి చెల్లించక్కర లేదు. మగాళ్లతో అబద్ధం ఆడకూడదు, ఆడవాళ్లతో అబద్ధం ఆడవచ్చు. యెవర్నీ మోసం చెయ్యకూడదు కాని భర్తని మోసం చెయ్యచ్చు. అవమానం పాలయితే క్షమించకూడదు కాని అవమానం పాలు చెయ్యచ్చు,

యింకా అలాంటివి. యీ నియమావళి అహేతుకం కావచ్చు, న్యాయం కాకపోవచ్చు కూడా కాని నిస్సందేహమైంది. వ్రాన్‌స్కీ దాన్ని అనుసరించినంత కాలం యే దిగులూ లేకుండా, తల యెత్తుకుని నిబ్బరంగానే వున్నట్టు అనుకున్నాడు. కాని యిటీవల కొంత కాలంగా అన్నాతో తన సంబంధాలలో నిమగ్నమైనాక తన నియమావళి సర్వకాల సర్వావస్థలకీ అనువర్తించదనీ, భవిష్యత్తులో కష్టాలు కలగవచ్చునీ, చిక్కులు రావచ్చునీ, అప్పుడు తనకి మార్గదర్శకంగా వుండే సూత్రాలు యేమీ లేవనీ అతనికి అనిపిస్తోంది.

అన్నా పట్లా, ఆమె భర్త పట్లా తన ప్రస్తుత వైఖరి యేమిటో స్పష్టంగానే, తేట తెల్లంగానే వుంది. అది తన నియమావళిలో స్పష్టంగా, నిర్దిష్టంగా విభాజితమయే వుంది.

అన్నా తన ప్రేమని అర్పించిన మర్యాదస్థురాలైన మహిళ. తను కూడా ఆమెని ప్రేమిస్తున్నాడు. అంచేత ఆమెని ధర్మపత్ని మాదిరిగా, యింకా యెక్కువగా కూడా, ఆదరించాల్సి వుంది, ఆమెని వో మాటతో, సూచనతో కూడా అవమానపరచడం మాట సరేసరి. వో మహిళకి అర్హత వున్న అత్యంత ఉన్నత ఆదరాభిమానాల్ని ఆమె పట్ల చూపించకపోవడం కంటే తన చేతిని ఖండించుకోవడమే మెరుగని అతను భావించేడు.

సమాజం పట్ల అతని వైఖరి కూడా స్పష్టంగానే వుంది. యీ విషయం నలుగురికీ తెలిసే వుండచ్చు, అనుమానం కలిగి వుండచ్చు. కాని దీనికి సంబంధించి యెవళ్ళకీ యేమీ అనే ధైర్యం లేదు. అలా కాకుండా యెవడేనా నోరు విప్పితే అతను వాడి నోరు మూయించేసేవాడు, తనకి ప్రేమ పాత్రురాలైన ఆడమనిషి అవిదిత ప్రతిష్ఠని కాపాడేవాడు.

అన్నా భర్త పట్ల అతని వైఖరి అన్నిటికంటే యెక్కువ స్పష్టంగా వుంది. అన్నా తనని ప్రేమించిన క్షణంనుంచీ ఆమెమీద తనకే యెదురులేని హక్కు వుందని అతను అనుకున్నాడు. ఆమె భర్తని అనవసరమైన వ్యక్తిగా, శోక్యం కలిగించుకునే వాడిగా పరిగణించేడు. నిస్సందేహంగా అతని స్థితి దయనీయమైందే, కాని చేసేదేముంది? భర్తకున్న అధికారమల్లా చేతిలో ఆయుధం పట్టుకుని తన ప్రతిష్ఠ నిలబెట్టమనడమే. అందుకు ఆదినుంచీ వ్రాన్‌స్కీ తయారుగానే వున్నాడు.

కాని కొన్ని రోజులుగా ఆమెకీ తనకీ మధ్య నూతన ఆంతరిక సంబంధాలు వెల్లడవుతూ వచ్చేయి. అవి అస్పష్టంగా వుండి వ్రాన్‌స్కీకి చింత కలిగిస్తున్నాయి. తనకి నెల తప్పిందని అన్నా అంతకుముందు రోజునే అతనితో చెప్పింది. యీ వార్త, అన్నా తననుంచి యేం ఆశిస్తుందో, అపేక్షిస్తుందో అవీ తన జీవితాన్ని నిర్దేశించే నియమావళిలో స్పష్టంగా పూర్తిగా వెల్లడవలేదు. యదార్థానికి అతనలాంటి వార్త వస్తుందని అనుకోలేదు. అన్నా తన పరిస్థితి గురించి ఘోషించిన వెంటనే ఆమె భర్తని వదిలి పెట్టెయ్యాలని అతని హృదయం ఆక్రోశించింది. ఆ మాటే అతను చెప్పాడు. కాని యిప్పుడు ఆలోచించుకున్నాక అలా చెయ్యకుండా వుండడమే మెరుగని స్పష్టమైంది. యిలా తనలో తను అనుకున్నాక అలా చెయ్యడం తప్పు కాదు కదా అనే శంక కూడా కలిగింది.

'భర్తని వదిలిపెట్టు అని ఆమెకి చెపితే యేమన్న మాట? నాతో వచ్చెయ్యి అని. కాని నేను అందుకు తయారుగా వున్నానా? యిప్పుడు నా దగ్గర డబ్బు యేం లేదు కదా యెలా తీసుకెళ్లగలను? పోనీ యీ కష్టం గట్టెక్కుతాననే అనుకుందాం... నేను ఉద్యోగంలో ఉండగా ఆమెని యెలా తీసుకెళ్లగలను? అలాంటి పని చెయ్యమని అడిగానా అంటే అందుకు నేను సంసిద్ధుణ్ణయి వుండాలి. అంటే డబ్బు వుండాలి, ఉద్యోగానికి రాజీనామా పెట్టాలి."

మళ్లీ వ్రాన్‌స్కీ ఆలోచనలో మునిగిపోయాడు. ఉద్యోగానికి రాజీనామా చెయ్యాలా వద్దా అనే ప్రశ్న మరో రహస్య ప్రశ్నని లేవదీసింది. అది అతనికి మాత్రమే తెలుసు. అది అతని జీవితంలో యెప్పుడూ ముఖ్యమైందిగానే వుంది, అలా అని అతను ఒప్పుకోక పోయినా.

చిన్నతనంనుంచీ, యౌవన దినాలనుంచీ విజయ కాంక్షే అతని స్వప్నం. స్వయంగా తను కూడా ఆ స్వప్నం తనకి వుందని ఒప్పుకోడు, కాని అది యెంత బలంగా వుందంటే యిప్పుడు దాని తీవ్రత అతని ప్రేమతో తల పడింది. సమాజంలోనూ, ఉద్యోగంలోనూ ఆరంభంలో అతన్ని విజయమే వరించింది. కాని రెండేళ్ల నాడు ఘోరమైన తప్పు చేశాడు. తన స్వతంత్రతని చూపించడమూ, ఆ రకంగా లబ్ధి పొందడమూ ఆశించిన అతను ఉద్యోగంలో ప్రమోషన్‌ని తిరస్కరించాడు. అలా తిరస్కరించడంవల్ల తనకి ఘనత వస్తుందనుకున్నాడు. కాని అలా చెయ్యడంవల్ల అధిక సాహసం వున్నవాడన్న అభిప్రాయం కలిగించి ఉపేక్షకి గురి అయేడు. తెలిసో, తెలియకో స్వతంత్ర వ్యక్తి అనే స్థానం వచ్చేక అతను మహా వ్యవహార కుశలత్వంతో, తెలివిగా ప్రవర్తించి, యెవరివట్లా తనకి కోపంలేదనీ, ఎవరూ తనని బాధపెట్టలేదనీ తవమానాన తను హాయిగా బతకడం కంటె మరేం యెక్కువ కోరుకోవడం లేదనీ కనిపించేటట్టు గడిపాడు. నిజానికి ఒక యేదాది పైగా మాస్కో వెళ్లిం దగ్గర్నుంచి తనేం హాయిగా బతకడం లేదు. స్వతంత్ర వ్యక్తిగా తను తెచ్చి పెట్టుకున్న స్థితి, దేన్నైనా చేయగల్గిన క్రియాశీలుడనీ కాని యేం చెయ్యడానికీ పట్టించుకోకుండా వుండే స్థితి, లుప్తం అయిపోతుంది. తనని గురించి మంచి వాడూ, గౌరవనీయుడూ కాని క్రియాశూన్యుడనీ చాలా మంది అనుకోవడం మొదలు పెట్టారని గమనించేడు. అన్నాతో అతని సంబంధాలు అంత మంది దృష్టిని ఆకర్షించి, అంతగా మాట్లాడుకోవడానికి ప్రేరేపించి ఆ రకంగా వ్రాన్‌స్కీకి ఒక కొత్త చమక్‌ని ప్రదానం చెయ్యడంతో అతని కొరుక్కు తినేసే విజయ కాంక్ష కొంతమేరకి వెనక్కి పర్దుకుంది. కాని ఒక వారంకితమే ద్విగుణీకృతమై యీ కాంక్ష మళ్లీ కొరకడం మొదలుపెట్టింది. సెర్పు ఖోవ్‌స్కోయ్ తన బాల్య మిత్రుడు సాంఘిక హోదా గలవాడే, సైనిక విద్యాలయంలో తన సహపాఠి చదువులో, ఆటల్లో, కొంటె పనుల్లో కాంక్షా తీవ్రతలో తనకి పోటీ అయిన వ్యక్తి యిటీవలే మధ్య ఆసియాలో సైనిక కొలువునుంచి తిరిగి వచ్చేడు. అక్కడ అతనికి రెండు సార్లు ప్రమోషన్ వచ్చింది. అంత చిన్న వయస్సు బ్రిగేడీర్‌లకి అరుదుగా లభించే గౌరవ పురస్కారాలు లభించాయి.

సెర్పుఖోవ్‌స్కాయ్ పీటర్స్‌బర్గ్‌కి వస్తూనే నూతనంగా ఉదయిస్తూ వున్న తొలి మహత్వపూరిత నక్షత్రం అని అతన్ని పొగిడారు. వ్రాన్‌స్కీతో కలిసి చదువుకున్న యీ వ్యక్తి అతని యీడువాడు, అప్పుడే బ్రిగేడీర్ అయిపోయాడు. దేశపు మొత్తం రాజకీయ చర్యల గతిని ప్రభావితం చేసే ఉద్యోగానికి నియుక్తుడయేందుకు వచ్చేడు. మరి వ్రాన్‌స్కీ యెంత స్వతంత్రత, మురిపించే శక్తి, సుందర మహిళ ప్రేమ ఉన్నప్పటికీ కూడా సాదా కెప్టెన్ గానే ఉన్నాడు. కావలసినంత స్వాతంత్ర్యం అనుభవించుకో నిచ్చేటట్టు వున్నాడు. 'నేను సెర్పుఖోవ్‌స్కాయ్‌ని చూసి అసూయ పడను' అని తనలో తను అనుకున్నాడు. 'అతనికి ప్రమోషన్ వచ్చిందన్న విషయం వోపికతో వుంటే నా బోటిగాడికూడా గబగబా పైకి పోయే అవకాశం వుందని తెలియజేస్తోంది. మూడేళ్ల కితం అతనికీ నాలాంటి స్థితే ఉండేది. యిప్పుడు నేను రాజీనామా చెయ్యడం అంటే నా కొమ్మ నేనే నరుక్కున్నట్టు. రాజీనామా పెట్టక పోతే నష్టపోయేది యేమీ లేదు. ఉన్న దాన్ని దేన్నీ మార్చడం తనకి యిష్టం లేదని ఆమే అంది. ఆమె ప్రేమ వున్నంత కాలం నాకు సెర్పుఖోవ్‌స్కాయ్ అంటే అసూయ లేదు.' మెల్లిగా మీసాలు మెలితిప్పుకుంటూ అతను లేచి గదిలో పచారు చేశాడు. అతని కళ్లల్లో ప్రత్యేక తరహా కాంతి గోచరమైంది. తన పరిస్థితి తనకి స్పష్టంగా వున్నప్పుడు సర్వదా కలిగే శాంత, దృఢ, సంతోషభరిత మానసిక స్థితి అతనికి కలిగింది. జమా ఖర్చుల పద్దులు చూసుకున్నాక అన్ని విషయాలూ యెప్పటిలాగా తేజోవంతంగా, ప్రకాశమానంగా కనిపించాయి. అతను గడ్డం గీసుకుని, చన్నీళ్ల స్నానం చేసి, బట్టలు వేసుకొని బయటికి వెళ్లాడు.

21

"నిన్ను పిలుద్దామని వచ్చేను. నీ పద్దుల పని యీ పూట మామూలుకంటే యెక్కువ సేపు పట్టింది. అయిపోయిందా?" అన్నాడు పెత్రీత్‌స్కీ.

"శుభ్రంగా" అన్నాడు వ్రాన్‌స్కీ కళ్లతోనే చిరునవ్వు నవ్వుతూ. మీసాల కొసల్ని బహు జాగ్రత్తగా మెల్లిగా మెలి తిప్పేడు. యే మాత్రం పొరపాటు చేసినా సాఫీ చేసుకున్న తన వ్యవహారాలు చెడిపోతాయేమోనని భయపడినట్టు వున్నాడు.

"దాని తర్వాత స్నానాల గదిలోనుంచి శుభ్రంగా స్నానం చేసి వచ్చిన వాడిలా వుంటావు" అన్నాడు పెత్రీత్‌స్కీ. "నన్ను గ్రీష్కా" (వాళ్ల రెజిమెంట్ కమాండర్‌ని అలా పిలిచేరు) "పంపేడు. వాళ్లు నీ కోసం చూస్తున్నారు."

వ్రాన్‌స్కీ జవాబు చెప్పలేదు. మిత్రుడి కేసి చూస్తున్నాడు గాని దేన్ని గురించో ఆలోచిస్తున్నాడు.

"యేమిటది భజంత్రీలా?" అని అడిగేడు పోల్కా, వాల్ట్జుల పరిచితమైన వాయిద్యాలు వినిపించి. "యేమిటి వేడుకలు?" అని అడిగాడు.

"సెర్పుఖొవ్‌స్కొయ్ వచ్చేడు."

"అలాగా, నాకు తెలీదు" అన్నాడు వ్రాన్‌స్కీ.

అతని కళ్లల్లో మందహాసం తేజోవంతమైంది.

తన ప్రేమ ఆనందదాయకంగా వున్నందుకు, దాని కోసం తన తీవ్ర విజయ కాంక్షని త్యాగం చేసినందుకు లేదా కనీసం అలాంటి పాత్ర యెన్నుకున్నందుకు మనస్సులో తృప్తి పడ్డాడు. అందువల్ల వ్రాన్‌స్కీకి సెర్పుఖొవ్‌స్కొయ్ పట్ల యీర్ష్య కలగలేదు. అంతేకాదు, సెర్పుఖొవ్‌స్కొయ్ పటాలానికి తిరిగి రాగానే మొదటగా తనని కలుసుకో లేదన్న కోపమూ రాలేదు. సెర్పుఖొవ్‌స్కొయ్ తనకి మంచి మిత్రుడు, అతను వచ్చేడు అదే సంతోషం.

"నాకు చాలా సంతోషంగా వుంది."

రెజిమెంట్ కమాండర్ దెమిన్ వో పెద్ద హవేలీలో వుంటున్నాడు. అతిథులందరూ కింద వరండాలో పోగయారు. పెరట్లోకి అడుగు పెడుతూనే యూనిఫాం వేసుకున్న గాయక బృందం వొకటి పెద్ద వోద్కా పీపా దగ్గర చేరి వుండడం వ్రాన్‌స్కీకి కనిపించింది. సరదాగా వుండే భారీ విగ్రహం కల్నల్‌గారు కూడా కనిపించాడు. ఆయన చుట్టూ ఆఫీసర్లు వున్నారు. కల్నల్‌గారు కూడా వరండా కింది మెట్టుమీదికి దిగివచ్చి ఆఫెన్‌బాఖ్* క్వాడ్రిల్ వాయిస్తూ వున్న బేండ్ కంటే ఉచ్చైస్వరంతో అరుస్తూ వో పక్కన నుంచున్న సైనికుల కేసి చేతులు వూపుతూ యేదో ఆజ్ఞాపించేడు. ఒక దళం-సైనికులు, వో సార్జెంట్, కొందరు చిన్న ఆఫీసర్లు వ్రాన్‌స్కీతో బాటు వరండా దగ్గరికి వెళ్లారు. కల్నల్ బల్ల దగ్గరికి వెళ్లి వైన్ గ్లాస్ తీసుకొని మళ్లీ మెట్ల దగ్గరికి వచ్చి గ్లాసు పైకెత్తి "మన మాజీ సహోద్యోగి, ప్రస్తుతం బ్రిగేడియర్ అయిన సాహసి ప్రిన్స్ సెర్పుఖొవ్‌స్కొయ్ కోసం! హుర్రా!" అన్నాడు.

సెర్పుఖొవ్‌స్కొయ్ నవ్వుతూ చేత్తో గ్లాసు పట్టుకుని కల్నల్ వెనకనుంచి యివతలికి వచ్చేడు.

"నువ్వు యింకా యింకా పడుచువాడివై పోతున్నట్టున్నావే, బొందరేంకో" అన్నాడు యెదురుగా నుంచున్న యెర్ర బుగ్గల సార్జెంట్ కేసి తిరిగి. అతను పడుచువాడిలా కనిపిస్తున్నాడు. సైన్యంలో రెండవ నియమిత కాలాన్ని పూర్తి చేస్తున్నాడు.

వ్రాన్‌స్కీ సెర్పుఖొవ్‌స్కొయ్‌ని చూసి మూడేళ్లయింది. అతను రాటు దేలాడు. చెంపలు పెంచాడు. కాని ముందటి లాగానే సలాకలా ఉన్నాడు. సౌందర్యంకంటే రూపానికి సంబంధించి వొక విధమైన వదన సౌజన్యంతో, ఉదాత్తతతో విశిష్టంగా వున్నాడు. వ్రాన్‌స్కీకి అతనిలో మరో మార్పు గోచరించింది. ముఖంలో మెరిసే ధీర, స్థిర తేజస్సు. జీవితంలో విజయం సాధించి, యీ విజయాన్ని అందరూ సంభావిస్తున్నారని విశ్వాసం కలిగించుకున్న వాళ్లందరి ముఖాల్లోనూ అలాంటి తేజస్సు కనిపిస్తుంది. వ్రాన్‌స్కీకి యీ తేజస్సు పరిచితమే, సెర్పుఖొవ్‌స్కొయ్ కేసి చూసిన క్షణమే దాన్ని గమనించాడు.

సెర్పుఖొవ్‌స్కొయ్ మెట్లు దిగుతూ వ్రాన్‌స్కీని చూశేడు. అతని ముఖం ఆనంద

హాసంతో విరిసింది. అతను తల వెనక్కి యెగరేసి అతని దగ్గరికి వెళ్లడానికి ముందే సార్జెంట్ బలవంతం చెయ్యడం వల్ల తప్పించుకోవడం సాధ్యమవలేదన్నట్టు సూచిస్తూ, గ్లాసు పైకి యెత్తి వ్రాన్‌స్కీకి అభివాదం చేశాడు. ఆ సార్జెంట్ ముద్దు పెట్టుకోవడాని కన్నట్టు పెదాలు పెట్టి నిటారుగా పెత్రుత్‌స్కోయ్ ముందు నుంచున్నాడు.

"అడుగో వచ్చేసాడు" అంటూ కల్నల్ అరిచేడు. "సీ మనసు అంత యిదిగా లేదని యాష్విన్ చెప్పేడు నాతో" అన్నాడు.

మెరికెలాంటి సార్జెంట్ నవనవలాడే చెమ్మగలిన పెదాలని పెత్రుత్‌స్కోయ్ ముద్దు పెట్టుకుని, రుమాలుతో మూతి తుడుచుకుని వ్రాన్‌స్కీ దగ్గరికి వెళ్లాడు.

"యెంత సంతోషంగా వుంది నాకు" అని అతనితో కరచాలనం చేస్తూ, పక్కకి తీసుకు పోతూ అన్నాడు.

"అతన్ని చూసుకో" అని కల్నల్ వ్రాన్‌స్కీని చూపించి యాష్విన్‌కి చెప్పి తను కిందికి సైనికుల కేసి వెళ్లాడు.

"నిన్న పందేల దగ్గరికి రాలేదేం? నువ్వు వస్తావనుకున్నా" పెత్రుత్‌స్కోయ్ కేసి పరిశీలనగా చూస్తూ అన్నాడు వ్రాన్‌స్కీ.

"వచ్చేను కాని ఆలస్యంగా వచ్చేను. మరేం అనుకోకు" అని అడ్జుటెంట్‌తో మాట్లాడ్డానికి వో క్షణం పక్కకి తిరిగేడు. "దీన్ని నా తరఫున సైనికులందరికీ పంచి యివ్వండి" అన్నాడు.

గబగబా మూడు వంద రూబుళ్ల నోట్లు తీసేడు, అలా తీస్తూ వుండగా అతని ముఖం సిగ్గుతో యెర్రబడింది.

"వ్రాన్‌స్కీ, యేమిటి యేమన్నా తింటావా, తాగుతావా?" అని యాష్విన్ అడిగేడు. "హేయ్! కౌంట్‌కి తినడాని కేమన్నా తెచ్చి పెట్టండి! యిదిగో తాగు" అన్నాడు.

కల్నల్ యింటి దగ్గర మందు విందు చాలసేపు సాగింది.

అందరూ బాగా తాగేరు. పెత్రుత్‌స్కోయ్‌ని యెత్తి పట్టుకుని యెగరేశారు. తర్వాత కల్నల్‌ని యెత్తి యెగరేశారు. పాటగాళ్ల ముందు కల్నల్ పెత్రిత్‌స్కీతో నాట్యం చేశాడు. తర్వాత కల్నల్ కొంచెం అలిసిపోయి ముంగిట్లో వో బల్లమీద చేరాడు. ప్రష్యాకంటే రష్యా యెలా యెక్కువో, అదీ ముఖ్యంగా అశ్విక దళ దాడికి సంబంధించి, యాష్విన్‌కి రుజువు చెయ్యడం మొదలుపెట్టాడు. కొంచెం సేపు మజా వేడుక మందగించింది. పెత్రుత్‌స్కోయ్ చేతులు కడుక్కుందుకు లోపలికి వెళ్లాడు. అక్కడ అతనికి వ్రాన్‌స్కీ కనిపించేడు. వ్రాన్‌స్కీ చన్నీళ్లతో తల తడుపు కుంటున్నాడు. అతను ట్యూనిక్ తీసేసి జుట్టు కమ్మేసిన యెర్రటి మెడని వాష్ బేసిన్‌లో కుళాయికింద పెట్టి మెడనీ, తలనీ చేత్తో గట్టిగా రుద్దుకుంటున్నాడు. అయిం తర్వాత పెత్రుత్‌స్కోయ్ దగ్గరికి వెళ్లేడు. ఇద్దరూ వెంటనే వో సోఫామీద కూర్చున్నారు. యిద్దరి మధ్యా మంచి ఆసక్తికరమైన సంభాషణ సాగింది.

"నీ విషయం అంతా మా ఆవిడద్వారా తెలిసింది. నువ్వు తరచూ మా ఆవిడ్ని కలుసుకున్నావని నాకు సంతోషం" అన్నాడు సెర్పుహొవ్‌స్కొయ్.

"ఆమె నాకు స్నేహితురాలు. పీటర్స్‌బుర్గ్‌లో కలుసుకోవాలంటే నాకు సంతోషంగా వుండేవాళ్ళు యీ యిద్దరు ఆడవాళ్ళే" అని వ్రాన్‌స్కీ చిరునవ్వు నవ్వుతూ అన్నాడు. సంభాషణ యెటు దారి తీస్తుందో ముందే పసికట్టినందువల్ల అతను చిరునవ్వు నవ్వేడు. అతనికి యిష్టంగా వుందది.

"వాళ్ళు మాత్రమేనా?" అని సెర్పుహొవ్‌స్కొయ్ చిరునవ్వు నవ్వుతూ అడిగేడు.

"నీ గురించి విన్నాను, కాని మీ ఆవిడద్వారా మాత్రమే కాదు" అన్నాడు వ్రాన్‌స్కీ ముఖం గంభీరంగా పెట్టి సెర్పుహొవ్‌స్కొయ్ సూచించిన దాన్ని దాట వేస్తూ. "నువ్వు పైకి రావడం నాకు సంతోషంగా వుంది. కాని పిసరు కూడా ఆశ్చర్యం లేదు. నేను యింతకంటే యెక్కువే ఆశించాను" అన్నాడు వ్రాన్‌స్కీ.

సెర్పుహొవ్‌స్కొయ్ చిరునవ్వు నవ్వేడు. తన గురించి అలాంటి అభిప్రాయం వినడం అతనికి యిష్టమని తెలుస్తూనే వుంది. దాన్ని అతను దాచుకునే అవసరమూ కనిపించలేదు.

"నీ దగ్గర దాచుకోవడం యెందుకు గాని నా మట్టుకి నేను తక్కువే ఆశించేను. కాని నాకు సంతోషంగా వుంది, చాలా. నాకు కాంక్ష యెక్కువ. అదే నా బలహీనత, ఆ విషయం వొప్పుకుంటున్నాగా."

"నువ్వు పైకి రాకుండా వున్నట్లయితే నువ్వీ విషయాన్ని వొప్పుకుని వుండేవాడివి కాదేమో" అన్నాడు వ్రాన్‌స్కీ.

"లేదు, నేనలా అనుకోవడం లేదు" అన్నాడు సెర్పుహొవ్‌స్కొయ్ మళ్ళీ చిరునవ్వు నవ్వుతూ. "యిది లేకపోతే జీవితం వ్యర్థంగా వుంటుందని నేను అనను, కాని విసుగ్గా వుంటుంది. నేను బహుశా పొరపాటు పడి వుండచ్చు. కాని నేను యెంచుకున్న జీవిత విధానంలో, అందుగ్గాను నాకు అర్హత, సామర్థ్యం వున్నాయని నాకు అనిపిస్తుంది. నా చేతిలో పడిన అధికారాన్ని, అది గనక పడితే, అది యెలాంటిదైనా అనేక మంది యితరులతో పోలిస్తే, నేను బాగా జరిపిస్తాను" అని సెర్పుహొవ్‌స్కొయ్ తను నెగ్గుకొచ్చానన్న గుర్తింపుతో చిరునవ్వు నవ్వుతూ అన్నాడు. "అందుకనే నేను అధికారానికి యెంత దగ్గర అయితే అంత సంతోషంగా వుంటుంది నాకు" అన్నాడు.

"నీ విషయంలో అంతే కావచ్చు నేమో గాని అందరికీ అలా వుండాలనేదేం లేదు. నాకూ వొకప్పుడు అలాంటి అభిప్రాయమే వుండేది. కాని కాలం గడిచే కొద్దీ కేవలం అందుకోసమే బతకరన్న విషయాన్ని గ్రహించాను" అన్నాడు వ్రాన్‌స్కీ.

"అసలు విషయానికి వచ్చేం, అసలు విషయానికి!" అన్నాడు సెర్పుహొవ్‌స్కొయ్ నవ్వుతూ. "నీ గురించి అంతా విన్నానని మొదలెట్టాను, నువ్వు ప్రమోషన్ వద్దనడం మంచి. నీ నిర్ణయాన్ని ఆమోదించాననుకో. కాని ప్రతి పనికీ దాని దాని పద్ధతి వుంటుంది.

నువ్వు వద్దనడం మంచిదే, కాని ఆ చేసే పద్ధతి బాగా లేదు అని నా అభిప్రాయం."

"జరిగిందేదో జరిగింది. మీకు తెలుసుగా నేనో సారి యేదేనా చేశానూ అంటే యిక మళ్లీ దానికేసి తిరిగి చూడను. పైగా, నేను హాయిగా వున్నాను."

"హాయిగానే వున్నావు – కాని ప్రస్తుతానికి. కాని యీ బాపతు జీవితం మీకు సంతోషం కలిగించదు. మీ అన్నయ్య విషయంలో అలా అనను. ఇప్పుడు మనకి విందు యేర్పాటు చేసిన కల్నల్‌లాగా ముద్దొచ్చే పిల్లాడివతను. అదుగో విను" అని అతను హుర్రా అనే అరుపులు విని అన్నాడు. "అతను మహా సంతోషంగా వున్నాడు. కాని అలాంటిది మీకు సంతోషం కలిగించదు."

"సంతోషం కలిగిస్తుందని నేనన లేదు."

"అంతే కాదు, మీ లాంటివాళ్లు అవసరం."

"యెవరికి?"

"యెవరికా? సంఘానికి. రష్యాకి మనుషులు అవసరం. పార్టీ అవసరం. లేకపోతే సర్వనాశనం అయిపోతుంది."

"యేమిటి మీ ఉద్దేశం? రష్యన్ కమ్యూనిస్టులకి వ్యతిరేకంగా బెర్తెనేవ్ పార్టీయా?"

"అబ్బ!" అన్నాడు సెర్పుహొవ్‌స్కోయ్ తను అంత తెలివి తక్కువగా వుంటాడన్న అభిప్రాయం కలిగినందుకు విచారిస్తున్నట్టు ముఖం పెట్టి. "Tout ça est une blague[1]. అలాంటివి యెప్పుడూ వున్నాయి, వుంటాయి. కమ్యూనిస్టులు వగైరాల్లాంటి వాళ్లు యెప్పుడూ లేరు. కాని యేదో భయం కలిగించే పార్టీని కనిపెట్టే ముచ్చు మనుషులెప్పుడూ వుంటారు. ఇది పాత మాటే. ఇప్పుడు మనకి కావల్సింది మీ లాంటి, నా లాంటి స్వతంత్రమైన వాళ్ల బలమైన పార్టీ."

"కాని యెందుకు?" అని అడిగేడు వ్రాన్‌స్కీ. అధికారం చేతిలో వున్న వాళ్ల పేర్లు కొన్ని చెప్పేడు. "వాళ్లు యెందుకు స్వతంత్రులు కారు?" అని అడిగేడు.

"యెందుకనీ అంటే వాళ్లకి జన్మతః స్వతంత్ర స్థితి లేదు, పేరు లేదు. మనకి మల్లే వాళ్ల జాతకం ఉచ్చలో లేదు. వాళ్లకి సొమ్ము చూపించో, ఆదరం కురిపించో వాళ్లని కొనెయ్యవచ్చు. తమ స్థితిని నిలబెట్టుకోవడానికి వాళ్లు యేదో ఒక దాన్ని కల్పించుకుంటూ వుంటారు. అందుకని వాళ్లు యేదో వూహని, ధోరణిని ముందుకు తోస్తూ వుంటారు. వాటిల్లో వాళ్లకే నమ్మకం వుండదు. అవి వూరికే హాని కలిగిస్తాయంతే. ఈ మార్గాలన్నీ వాళ్లకి ప్రభుత్వం వారి యిల్లూ, పెద్ద జీతం ప్రాప్తింపచేసే సాధనాలు మాత్రమే. వాళ్ల చేతుల్లో ముక్కలకేసి చూస్తే cela n'est pas plus fin que ça[2] అనిపిస్తుంది. వాళ్లకంటే నేను తెలివితక్కువ వాణ్ణి కావచ్చు, బడుద్ధాయిని కావచ్చు. కాని నేనలా యెం ఆలోచిం

---

[1] ఇవన్నీ వూసుపోని కబుర్లు (ఫ్రెంచి).

[2] యిదంతా అంత క్లిష్టమైంది కాదు (ఫ్రెంచి).

చను. ఒక ముఖ్యమైన విషయానికి సంబంధించి వాళ్లకంటే నాకు ఓ కచ్చితమైన ఆధిక్యత ఉంది. నాలాంటి వాళ్లని కొనెయ్యడం కష్టం. మరిప్పుడు అలాంటి వాళ్ల అవసరం యెక్కువ వుంది."

వ్రాన్‌స్కీ చాలా శ్రద్ధగా విన్నాడు. మాటల అర్థంతో చూసుకుంటే సెర్పుఖొవ్‌స్కొయ్ దృక్పథం అతనికి ఆసక్తి కారకంగా వుంది. అధికారులకి వ్యతిరేకంగా సంఘర్షణ చెయ్యాలని అతను ఆలోచిస్తున్నాడు. ఆ క్రమంలో అతనికి యిష్టమైనవీ కొన్ని వున్నాయి. అనిష్టమైనవీ వున్నాయి. మరి తనకేమో తన రెజిమెంట్ మేరకే తన యిష్టానిష్టాలన్నీ పరిమితమై పోయాయి. ఏవన్నా విషయాల గురించి ఆలోచించడం వాటిని సమూలంగా అర్థం చేసుకోగలగడం, తెలివితేటలు, వాగ్ధోరణి వుండడంతో సెర్పుఖొవ్‌స్కొయ్ యెంత శక్తివంతుడవగలడో అనే దాన్ని కూడా వ్రాన్‌స్కీ గ్రహించాడు. యీ గుణాలు తను వున్న మనుషుల్లో చాలా దుర్లభంగా వుంటాయి. వ్రాన్‌స్కీకి యీర్ష్య కలిగింది. అలా కలిగినందుకు సిగ్గు కలిగింది.

"కాని యిందుగ్గాను నాలో ఒక ముఖ్య విషయం లోపించింది. అధికారం సంపాదించాలనే కోరిక. ఒకప్పుడుండేది, కాని పోయింది" అన్నాడు వ్రాన్‌స్కీ.

"ఇలా అంటున్నందుకు మరేం అనుకోకు. అది నిజం కాదు" అన్నాడు సెర్పుఖొవ్‌స్కొయ్, చిరునవ్వు నవ్వుతూ.

"అబ్బెబ్బె, నిజం, ముమ్మాటికీ నిజం!" అని వ్రాన్‌స్కీ మరింత నిర్దిష్టంగా "యిప్పుడు నిజం" అన్నాడు.

" 'యిప్పుడు' నిజం, అది వేరే విషయం. అయినా యీ 'యిప్పుడు' యెప్పటికీ వుండదు."

"బహుశా, వుండకపోవచ్చు" అన్నాడు వ్రాన్‌స్కీ.

"చూశావా నువ్వు 'బహుశా' అన్నావు" అన్నాడు సెర్పుఖొవ్‌స్కొయ్ అతని మనస్సులోని భావాల్ని పసికడుతున్నట్టు. "కాని నే చెప్తున్నా, 'నిశ్చయంగా' అంతే. అందుకనే నిన్ను కలవాలనుకున్నాను. నువ్వు చెయ్యవలసింది నువ్వు చేశావ్. అది నాకు అర్థమవుతుంది. కాని నువ్వు ఓ హద్దు మించి దాన్ని చెయ్యకూడదు. నిన్ను carte blanche[1] నాకిమ్మని అడుగుతున్నాను. ప్రాపకం యివ్వడం లేదు నీకు... యెందుకివ్వకూడదు నేను? నువ్వు నాకెన్ని సార్లు ప్రాపకం యివ్వలేదు! కాని మన స్నేహం దానికి పైన వుంటుందని నా ఆశ. ఆ!" అన్నాడు అతని కేసి చూస్తూ మగువులా మృదువుగా మందహాసం చేస్తూ. "నాకు carte blanche యిచ్చెయ్యి. నీ రెజిమెంట్ వదిలెయ్యి. గుట్టు చప్పుడు కాకుండా పైకి తీసుకొచ్చేస్తాను నిన్ను" అన్నాడు.

---

[1] ఖాళీ చెక్కు, అంటే సర్వాధికారాలు అని అర్థం (ఫ్రెంచి).

"కాని నాకేమీ అక్కర్లేదన్న మాట అర్థం కావడం లేదా? ఏమీ అక్కర్లేదు. యెలా వున్నవి అలానే వుంటే చాలు" అన్నాడు వ్రాన్స్కీ.

సెర్పుహొవ్స్కొయ్ లేచి అతని ముందు నుంచున్నాడు.

"యెలా వున్నవి అలానే వుంటే చాలని నువ్వనుకుంటావు. నాకు తెలుసు దాని భావం. కాని విను. మనిద్దరం సమవయస్కులం. నీకు బహుశా నాకంటె యెక్కువమంది ఆడవాళ్ళు తెలిసివుంటారు" అని సెర్పుహొవ్స్కొయ్ చిరునవ్వు నవ్వుతూ, హావభావాలతో వ్రాన్స్కీ భయపడనక్కర లేదనీ యేమంటే తను అతని సున్నితమైన అనుభూతి గాయాన్ని మృదువుగా జాగ్రత్తగా స్పృశిస్తాననీ తెలియచేశాడు. "కాని నేను పెళ్ళయిన వాణ్ణి. నా మాట నమ్ము. ఒక్క ఆడమనిషిని యెరిగి వుంటే (యెవళ్ళో రాసినట్టు) ఆమె నువ్వు ప్రేమించే భార్య అయితే, వేల మంది ఆడవాళ్ళని యెరిగి వున్నప్పుడు తెలుసుకునే దానికంటే యెక్కువ తెలుసుకుంటావు" అన్నాడు.

"యిప్పుడే వస్తున్నాం" అని తమని కల్నల్ దగ్గరికి పిలుచుకు వెళ్ళడానికి లోపలికి చూసిన ఆఫీసర్ని చూసి అన్నాడు వ్రాన్స్కీ.

సెర్పుహొవ్స్కొయ్ చెప్పేదాన్ని పూర్తిగా వినాలని, అర్థం చేసుకోవాలని వ్రాన్స్కీకి అనిపించింది.

"నా అభిప్రాయం యిదీ. ఆడది మగవాడి కార్యకలాపాల్లో పెద్ద ఆటంకం. యే ఆడమనిషినేనా ప్రేమించినప్పుడు మరి దేన్ని సాధించడమేనా కష్టం. ప్రేమని ఆటంకం కాకుండా సౌఖ్యంగా చేసుకోవడానికి వొకటే మార్గం వుంది, పెళ్ళి. యెలా చెప్పను... యెలా..." అని సెర్పుహొవ్స్కొయ్ ఉపమానం కోసం ఆగేడు. "ఆగు... ఆగు... ఆఁ, యే fardeau[1]ని యెత్తి కూడా చేతుల్ని ఖాళీగా వుంచుకోవాలీ అంటే వొకటే మార్గం వుంది. ఆ fardeauని వీపుమీద పెట్టుకోవడం. అదే పెళ్ళి. పెళ్ళయింతర్వాత నాకు అర్థమైంది అదే. ఒక్క సారి నా చేతులు ఖాళీ అయాయి. పెళ్ళి లేకుండా ఆ బరువుని మొయ్యి! నీ చేతులు ఖాళీ లేక నువ్వు యే పనీ చెయ్యలేవు. మజన్కొవ్ని చూడు, క్రూపొవ్ని చూడు. ఆడవాళ్ళ వాళ్ళ బతుకుల్ని నాశనం చేసేశారు."

"ఉష్! కాని యెలాంటి ఆడవాళ్ళ గురించి చెప్తున్నావ్!" అన్నాడు వ్రాన్స్కీ, తను యిద్దరికీ తెలిసిన వొక నటినీ, వీళ్ళ ఫ్రెంచి ఆడవాళ్ళనీ గుర్తు చేసుకుంటూ.

"ఉన్నత సమాజంలో ఆడవాళ్ళకి యెంత స్థిరమైన స్థానం వుంటుందో అది మగాళ్ళకి అంత అనర్థం. ఈ fardeauని వూరికే భుజాలమీద మోసుకోవడానికి బదులు దాన్ని వేరేవాడి చేతుల్లోంచి లాక్కోవాలి."

---

[1] బరువు (ఫ్రెంచి).

"నువ్వెప్పుడూ ప్రేమించలేదు" అని అన్నాడు వ్రాన్‌స్కీ మెల్లిగా అలా ముందుకి చూస్తూ అన్నా గురించి ఆలోచించుకుంటూ.

"కావచ్చు, కాని నీతో చెప్పింది గుర్తుంచుకో. యింకోకటి కూడా. ఆడవాళ్ళు మగాళ్ల కంటె లౌకికంగా వుంటారు. మగాళ్ళు ప్రేమని యేదో గొప్ప పనిగా చేస్తారు కాని వాళ్ళ యెప్పుడూ దాన్ని tere-à-terre[1]గా చూస్తారు."

"వస్తున్నాం, వస్తున్నాం" అని లోపలికి వస్తూవున్న నౌకర్ని చూసి అన్నాడు. కాని ఆ నౌకరు వాళ్లని పిలవాలని రాలేదు. వ్రాన్‌స్కీకి ఉత్తరం అందివ్వాలని వచ్చేడు.

"యెవరో దీన్ని ప్రిన్సెస్ బెట్సీ త్వెర్‌స్కాయానుంచి తెచ్చేరు."

వ్రాన్‌స్కీ ఉత్తరం తీసి చదువుకున్నాడు. ఉత్తేజంతో మొహం యెర్రబడింది.

"నాకు తల నొప్పిగా వుంది. వెళ్లిపోతున్నా" అన్నాడు సెర్పుఖొవ్‌స్కొయ్‌తో.

"అలాగే, కాని నాకు carte blanche యిస్తావ్ కదూ?"

"తర్వాత మాట్లాడదాం. పీటర్స్‌బుర్గ్‌లో వుంటావుగా, కలుస్తాను."

22

అప్పటికే దాదాపు ఆరయింది. ఆలస్యం కాకుండా అక్కడికి చేరాలి. తన గుర్రాలయితే అందరూ గుర్తుపడ్తారు. అందుకని వ్రాన్‌స్కీ యాష్విన్ అద్దె బగ్గీ యెక్కి సాధ్యమైనంత వేగంగా తోలుకు పొమ్మని చెప్పాడు. నలుగురు కూర్చునే బగ్గీ అది. విశాలంగానే ఉంది. వ్రాన్‌స్కీ వో మూల కూర్చున్నాడు. ఎదర సీటుమీద కాళ్లు పెట్టి ఆలోచనలో మునిగి పోయాడు.

తన వ్యవహారాలన్నిట్నీ వొక పద్ధతిగా యేర్పాటు చేసుకున్న అస్పష్ట భావన, సెర్పుఖొవ్‌స్కొయ్ స్నేహం, తనని అవసరమైన వ్యక్తిగా పరిగణించడం అనే ప్రశంస స్మృతిలో మెదిలిన భావన; అన్నిటికంటె ముఖ్యం యిప్పుడు సంకేత స్థలంలో జరగబోయే కలయిక – యివన్నీ కలిసి జీవిత సుఖానుభూతితో అతన్ని నింపేశాయి. యీ అనుభూతి యెంత తీవ్రంగా వుందంటే తనకి తెలియకుండానే అతను చిరునవ్వు నవ్వేడు. కాళ్ళు దించి కాలుమీద కాలు వేసుకున్నాడు. పిక్కని చేత్తో పట్టుకున్నాడు. ముందు రోజున పడిపోయినప్పుడు దానికి దెబ్బ తగిలింది. తర్వాత సీట్లో వెనక్కి చేర్లబడి కొన్ని సార్లు గట్టిగా గాలి పీల్చాడు.

'బాగుంది. దివ్యంగా ఉంది' అనుకున్నాడు. అంతకు ముందు యెన్నో సార్లు తన శరీరం గురించిన సౌఖ్య ప్రదమైన స్పృహ అతనికి అనుభూతమే గాని యిప్పటిలాగా అతనికి తన శరీరం పట్ల యింత ప్రేమ ముందెప్పుడూ కలగలేదు. బలిష్టమైన కాలిమీద చిన్న నొప్పి

[1] రోజువారీ మామూలు విషయం (ఫ్రెంచి).

అతనికి బాగా వున్నట్టనిపించింది. గాలి పీల్చేటప్పుడు ఛాతీ కండరాల కదలిక అనుభూతి ప్రియంగా వుంది. అన్నాకి యెంతో నిరాశాజనకంగా వున్న ఆగస్టు మాసపు నిర్మల శీత పవనం ప్రావ్స్కీకి ఉత్తేజనాపూర్వక జీవ చైతన్యాన్ని ప్రసాదిస్తోంది. చన్నీళ్లతో బాగా కడుక్కున్న ముఖానికీ, మెడకీ హాయిని కలిగిస్తోంది. ఆ తాజా గాలిలో మీసాలకి రాసుకున్న సువాసన నూనె సుగంధం ముఖ్యంగా హాయి కలిగించ చేస్తోంది. బగ్గీ కిటికీలోనుంచి అతనికి కనిపించేదంతా, నిర్మల శీత పవనంలో, సూర్యాస్తమయ సమయపు మసక కాంతి రేఖల్లో తను వున్నంత తాజాగా, దృఢంగా, ఉల్లాసభరితంగా వున్నాయి. అస్తమయ సూర్యుని కిరణ కాంతిలో మెరిసే యిళ్లకప్పులు, కోసుగా వున్న కంచెలు, గృహావరణల మూలలు, మధ్య మధ్య తగిలే వాహనాలు, మనుషులు, నిశ్చలంగా వున్న వృక్ష, తృణ, హరిత వర్ణం, సమ స్థాయిలో దున్నిన బంగాళా దుంపల వాగేటి చాళ్లు, యిళ్లు, చెట్లు, పొదలు, బంగాళా దుంపల చాళ్లూ కూడా పరిచే యేటవాలు నీడలు ఉల్లాసభరితంగా కనిపించేయి. ఇవన్నీ కూడా అప్పుడే గీసి రంగులు వేసిన తైల వర్ణచిత్రంగా శోభాయమానంగా భాసించాయి.

"తోలాలి, తోలాలి గబగబా" అని ప్రావ్స్కీ కిటికీలోనుంచి తల బయటికి పెట్టి జేబులోనుంచి మూడు రూబుళ్ల నోటొకటి తీసి బండివాడికి యిచ్చి అన్నాడు. బండి తోలే వాడి చెయ్యి యేదో తడుములాడుతున్నట్టు లాంతరు వెలుతురులో కనిపించింది. కొరడా ఛెళ్ళు మనడం వినిపించింది. బగ్గీ సాఫీగా వున్న రాజపథంమీద జోరుగా పరుగు తీసింది.

'నాకు యేమీ, యేమీ అక్కరలేదు యీ ఆనందం తప్ప' అనుకున్నాడు. కిటికీల మధ్యలో వున్న గంట యేనుగు దంతపు బొత్తాం కేసి తదేకంగా చూస్తూ తను ఆఖరి సారి చూసినప్పుడు అన్నా యెలా వుందో ఆ రూపాన్ని ఊహించుకుని అనుకున్నాడు. 'ఎంత కాలం గడిస్తే అంత యెక్కువ ప్రేమ వుంటోంది ఆమె పట్ల. అదిగో వ్రెదె తోట. ఆమె యెక్కడ వుందో? యెక్కడ? యెలా కనిపిస్తుంది? కలుసుకునే సంకేత స్థలం యిక్కడ యెందుకు పెట్టింది? బెట్సీ చీటీలో తనెందుకు రాసింది?' యిప్పుడు మాత్రమే అతను ఆ ప్రశ్నలని వేసుకున్నాడు కాని వాటిని గురించి అనుకునే వ్యవధి లేదు. వృక్ష పథం దగ్గరికి చేరకముందే బండిని ఆపమని చెప్పి తలుపు తీసి బగ్గీ యింకా ఆగక ముందే దూకేసి యింటి దగ్గరికి పోయే వృక్ష పథంమీద నడవడం మొదలుపెట్టాడు. అక్కడ యెవరూ లేరు. కాని కుడి వేపు చూడగానే ఆమె కనిపించింది. ఆమె ముఖంమీద పన్నని ముసుగు వేసుకుంది. కాని సంతోష భరిత దృక్కులతో అన్నా నడకని గుర్తించాడు. ఆ నడక ఆమె సొంతం. ప్రత్యేకం ఆమెకే అలాంటి నడక వుంది. ఆమె భుజాల వంపులు, తల వుంచుకునే తీరు గుర్తించాడు. అతని శరీరంలో ఒక విద్యుత్తరంగం దూసుకు పోయినట్టు అతనికి ఒక రకమైన తూగుతో కదిలే తన కాళ్లనుంచి, శ్వాస పీల్చేటప్పుడు కదిలే ఛాతీదాకా ఒక కొత్త శక్తి శరీరంలో, ఆహ దమస్తకం, అనుభూతం అయింది. పెదాలమీద గగుర్పాటు అనుభూతి గోచరమైంది.

ఆమె అతని దగ్గరికి వచ్చి గట్టిగా చేతిని అదిమింది.

"నీ కోసం కబురెట్టినందుకు కోపం రాలేదు కదా? నీతో మాట్లాడాలి" అంది. ముసుగు కిందనుంచి ఆమె పెదాలు గంభీరంగా, కఠినంగా కనిపించడం చూసి వ్రాన్‌స్కీ మానసిక స్థితి వెంటనే మారిపోయింది.

"కోప్పడ్డమా? కాని నువ్విక్కడికి యెలా వచ్చావ్? యెక్కడికి?"

"యెక్కడికేవా ఫర్లేదు" అందామె వ్రాన్‌స్కీ చేతిమీద తన చెయ్యి వేస్తూ. "పదు నీతో మాట్లాడాలి" అంది.

ఏదో ముఖ్యమైన విషయమే అయుంటుందని, ఈ సమావేశం సౌఖ్యప్రదంగా ఉండదని వ్రాన్‌స్కీకి అర్థమైంది. ఆమె ముందు అతనికి సొంత సంకల్ప బలం పోతుంది. అన్నా కల వరానికి కారణం యేమిటో తెలియకుండానే అతనికీ అది సోకింది.

"యేమిటి విషయం? యేం జరిగింది?" అని మోచేత్తో ఆమె చేతిని నొక్కుతూ వ్రాన్‌స్కీ అడిగేడు. ఆమె కళ్లల్లోకి జవాబు కోసం శోధిస్తూ చూసేడు.

ఆమె మౌనంగా కొంత దూరం నడిచింది. ధైర్యం కూడదీసుకుని హఠాత్తుగా ఆగింది.

"నిన్న నీకు చెప్పలేదు" అని మొదలుపెట్టింది గట్టిగా భారంగా శ్వాస పీలుస్తూ. "మా ఆయనతో కలిసి యింటికి వెళ్లేటప్పుడు దారిలో ఆయనకి విషయం యావత్తూ చెప్పే శాను... తన భార్యగా వుండలేనని... మొత్తం చెప్పేశాను" అంది.

అతను ఆమె చెప్పేదాన్ని శ్రద్ధగా, ఆమెమీదకి వొంగుతూ విన్నాడు — ఆ వొంగడంద్వారా ఆమె భారాన్ని కొంత ఉపశమింప జేస్తున్నట్టు. ఆమె చెప్పడం పూర్తి చెయ్యగానే అతను నిటారుగా నుంచున్నాడు. అతని ముఖంమీద అహంభావపూరిత గంభీర భావం ద్యోతకమైంది.

"అవును, అవును అదే మెరుగు. వెయ్యి రెట్లు మెరుగు. నీకది యెంత కష్టం అయి వుంటుందో నాకు తెలుసు."

కాని అన్నా అతని మాటలు వినడం లేదు. అతని ముఖంలో కవళికలని బట్టి అతని మనోభావాల్ని గ్రహించే ప్రయత్నం చేస్తోంది. అతనికి తట్టిన మొదటి భావాన్ని అతని ముఖ కవళిక ప్రతిబింబిస్తోందని ఆమెకి తెలియదు — ద్వంద్వ యుద్ధం యిప్పుడు తప్పదు అన్న భావం అది. ద్వంద్వ యుద్ధం అనే వూహే ఆమెకి యెన్నడూ తట్టలేదు. అంచేత వ్రాన్‌స్కీ ముఖంలో క్షణకాలం పాటు గోచరమైన గంభీరత్వాన్ని ఆమె వేరే విధంగా అనుకొంది.

భర్త ఉత్తరం అందేక అన్నీ యెప్పటిలాగే వుంటాయనీ, సమాజంలో తన స్థానాన్ని ఉపేక్షించే ధైర్యం లేదనీ, తన బిడ్డని వదులుకొని ప్రియుడితో తన అదృష్టాన్ని జోడించు కోలేదనీ అంతరంగంలో ఆమెకి తెలిసింది. బెట్సీ దగ్గర గడిపిన ఆ పూట అది రుజువు అయింది. అయినా వ్రాన్‌స్కీతో యీ సమావేశానికి చాలా ప్రాముఖ్యం యిచ్చింది. దీనివల్ల తన స్థితిలో మార్పు వస్తుందనీ, తనకి విముక్తి వస్తుందనీ ఆశించింది. మొత్తం అంతా విని వ్రాన్‌స్కీ గనక దృఢంగా, మహోత్సాహభరితంగా, వొక్క క్షణం కూడా తటపటాయించ

కుండా "అన్నిట్నీ వదిలేసి నాతో వచ్చెయ్యి" అని మాట అంటే తను కొడుకుని కూడా వదిలేసి, అతనితో వెళ్ళిపోయి వుండేది. కాని తను ఆశించినంత ప్రతిచర్య యీ వార్తవల్ల అతన్నుంచి రాలేదు. తనకి అవమానం కలిగిందని అతను భావించినట్టు కనిపించేడు.

"యిదంతా చెప్పడం నాకు యేమీ కష్టం అవలేదు. దాని మానాన అదే వచ్చేసింది" అంది అన్నా చిరాగ్గా. "ఇదుగో... చూడు..." అని ఆమె గ్లవ్‌లోనుంచి భర్త ఉత్తరం తీసింది.

"నాకు తెలుసు, తెలుసు" అని అడ్డం వచ్చేడతను ఉత్తరం తీసుకుంటూ. కాని దాన్ని చదవలేదు. ఆమెని వోదార్చడానికి ఆత్రుత పడ్డాడు. "నేను ఒక్క విషయాన్నే కోరుతున్నాను, నొక్క దాని కోసమే వేడుకుంటున్నాను. నువ్వు యీ పరిస్థితికి స్వస్తి చెప్పెయ్యి, నా జీవితాన్ని నీ ఆనందం కోసం సమర్పించనియ్యి" అన్నాడు.

"యెందుకు నాతో ఆ మాట అంటున్నావ్?" అందామె. "నాకందులో అనుమానం వుంటుందా? నేను యేమాత్రం అనుమానించినా..."

"యెవరు వాళ్ళు?" అన్నాడు వ్రాన్‌స్కీ హఠాత్తుగా తమ వేపు వస్తూ వున్న యిద్దరు ఆడవాళ్ళని చూసి. "మనల్ని యెరుగుదురేమో" అని గబగబా ఆమెని తనతో కూడా లాక్కుపోతూ పక్క దారిలోకి వెళ్ళాడు.

"ఆహ్! నాకేం భయం లేదు" అంది అన్నా. ఆమె పెదాలు వొణుకుతున్నాయి. పరదా కిందనుంచి వింత విద్వేషంతో అన్నా కళ్ళు తనకేసి చూస్తున్నట్టు వ్రాన్‌స్కీకి అనిపించింది. "నీతో నే చెప్పేది అది కాదు. ఆ విషయంలో నాకు ఆవగింజంత అనుమానం లేదు. కాని చూడు. ఆయన యేమి రాస్తున్నాడో, చదువు" అని మళ్ళీ ఆమె ఆగింది.

భర్తతో అన్నా తెగ తెంపుల వార్త మొదట విన్నప్పటి లాగానే యీ ఉత్తరం చదివినప్పుడు కూడా వ్రాన్‌స్కీకి అవమానితుడైన భర్తతో తన సంబంధం యెలా వుంటుందా, అనే సహజమైన ఆలోచనే మనస్సుకి తోచింది. ఉత్తరం చేత్తో పట్టుకుని నుంచున్నప్పుడు అతనికి అనుకోకుండానే రేపో మాపో సవాల్ అందుకోవచ్చునీ, ద్వంద్వ యుద్ధం జరగవచ్చునీ తోచింది. తను యిప్పుడున్నట్టే ముఖం గర్వంగా, కటువుగా పెట్టుకుని గాలిలోకి గుండు పేలుస్తాడు. తను అవమానితుడైన భర్త గుండుకి గురి అవుతాడు. సరిగ్గా ఆ క్షణంలో సెర్పుహోవ్‌స్కోయ్ అన్నమాటా, తనే ఆ ఉదయం అనుకున్న మాటా మెరుపులా తట్టేయి, తను జంజాటం నుంచి దూరంగా వుండాలి అని. యీ ఆలోచనని తను అన్నా ముందు వ్యక్తం చెయ్యలేడన్న విషయం అతనికి తెలుసు.

ఉత్తరం చదవడం పూర్తయాక అతను కళ్ళెత్తి ఆమె కళ్ళ కేసి చూశాడు. అతని చూపులో దృఢత్వం లేదు. అతను యీ విషయమంతటినీ ముందే ఆలోచించుకున్నాడని అన్నా వెంటనే గ్రహించింది. వ్రాన్‌స్కీ తనతో యేమి చెప్పినా, అతను అనుకున్న దాన్నంతటినీ

చెప్పదని ఆమెకి అర్థం అయింది. తన కడపటి ఆశ అడుగంటిందనీ ఆమెకి తెలిసింది. తను ఆశించింది యిది కాదు.

"ఆయన యెలాంటి వాడో చూశావా?" అందామె వొణికే గొంతుకతో. "ఆయన..."

"మరేం అనుకోకు, నాకీ విషయం సంతోషంగా వుంది" అని వ్రానెస్కీ ఆమెకి అడ్డం వెళ్లేడు. తనని మాట్లాడనివ్వమని అర్థిస్తున్నట్టుగా వుంది అతని చూపు. "నాకు సంతోషంగా వుంది యెందుకంటే అతను ప్రతిపాదిస్తున్న రీతిలో అన్నీ యేం జరగవు" అన్నాడు.

"యెందుకని జరగవు?" అని అన్నా కన్నీళ్లని ఆపుకుంటూ అడిగింది. ఆమె అతని మాటలని యిక యే మాత్రమూ పట్టించుకోవడం లేదని స్పష్టంగా తెలుస్తోంది. తన రాత తేలిపోయిందని ఆమెకి అనిపించింది.

వ్రానెస్కీ ద్వంద్వ యుద్ధం అనివార్యం అనుకున్నాడు. మరి దాని తర్వాత యిలాంటి స్థితి వుండలేదు. ఆ మాటే చెప్పాలనుకున్నాడు. కాని వేరే మాట చెప్పాడు.

"యీ పరిస్థితి వుండదు. యిప్పుడు నువ్వు అతన్ని వదిలేస్తావని నా ఆశ. నువ్వు" అతను యిబ్బంది పడ్డాడు, అతని ముఖం యెర్రబడింది. "మన జీవితం గురించి నన్ను ఆలోచించనివ్వి దానికి వో పద్ధతి యేర్పాటు చెయ్యనిస్తావని ఆశిస్తాను. రేపు..." అని అతను మొదలుపెట్టాడు.

ఆమె అతన్ని పూర్తి చెయ్య నివ్వలేదు.

"నా బాబు సంగతి?" అని ఆమె అరిచింది. "ఆయన యేం రాస్తున్నాడో చదవలేదా? నేను నా బిడ్డని వదిలెయ్యాలి. నేను అలా చెయ్యలేను, చెయ్యాలనుకోవడం లేదు" అంది.

"కాని నీకు పుణ్యం వుంటుంది అన్నా, యేది మెరుగు? నువ్వు కొడుకుని వదులుకోవడమా లేక యీ అవమానకరమైన స్థితిలో కొనసాగడమా?"

"యెవరికి యిది అవమానం?"

"అందరికీ, ముఖ్యంగా నీకు."

"అవమానకరం అంటున్నావ్... అలా అనకు. నాకు మట్టుకు నాకు యీ మాటలకి అర్థం లేదు" అందామె. ఆమె కంఠం యింకా వొణుకుతూనే వుంది. యిప్పుడతను నిజం కాని మాట వొక్కటి కూడా అనకూడదని ఆమె భావన. యిప్పుడామెకి అతని ప్రేమ తప్ప యేమీ మిగలలేదు. ఆమె అతన్ని ప్రేమించాలనే కోరుకుంది. "నేను నిన్ను ప్రేమించిన నాటినుండీ ప్రతిదీ మారిపోయిందని నువ్వు గ్రహించాలి. నా మట్టుకి నాకు వొక్కటే మిగిలింది... ఒక్కటే, నీ ప్రేమ. నీ ప్రేమ వుంటే చాలు, నేను యెంతో సమున్నతంగా దృఢంగా వుంటాను, యేదీ అవమాన పరచలేదు నన్ను, యెంతో విశ్వాసం వుంటుంది నాకు, అందుకనే నా పరిస్థితి గర్వంగా వుంటుంది. యెందుకంటే నాకు గర్వం... నాకు గర్వం..." తను యే

విషయం చూసి గర్వపడేది ఆమె చెప్పలేదు. సిగ్గు, హతాశ ఆమెని రుద్ధం చేసాయి. ఆమె ఆగి వెక్కింది.

అతని కంఠం కూడ రుద్ధమైంది. ముక్కు పుటాల్లో చిరచిరమనే అనుభూతి కలిగింది. తన జీవితంలో మొట్టమొదటి సారిగా అతనికి కన్నీళ్లు తిరిగే స్థితి వచ్చింది. తనని అంతలా స్పందింపజేసింది యేమిటో అతను చెప్పలేడు. ఆమె పట్ల అతనికి జాలి కలిగింది. తను ఆమెకి యేమీ సాయం చెయ్యలేడని అతనికి తెలుసు. కాని ఆమె దౌర్భాగ్య పరిస్థితికి దోషం తనదేనని అతనికి తెలుసు. తనే యేదో తప్పు చేశాడు.

"విడాకులు వీలుపడవా?" అని బెరుగ్గా అడిగాడు. ఆమె జవాబు చెప్పకుండా తల ఆడించింది. "అతన్ని వదిలేసి ఆ బిడ్డని నీతో తెచ్చుకోలేవా?" అని అడిగాడు.

"తెచ్చుకోవచ్చు. కాని అంతా ఆయనమీద ఆధారపడుతుంది. నేనిప్పుడు ఆయన దగ్గరికి వెళ్లాలి" అని నిరుత్సాహంగా అంది. అన్నీ అంతకు ముందు లాగానే జరిగిపోతాయని ఆమెకి తట్టిన వూహ స్థిరపడింది.

"నేను మంగళవారం నాడు పీటర్స్‌బుర్గ్ వెడతాను. అప్పుడు అన్నీ తేలిపోతాయి."

"ఆఁ, కాని యీ విషయం గురించి మనం యిక మాట్లాడుకోవద్దు" అంది.

అన్నా బగ్గీని పంపేస్తూ వ్రెదె తోట దగ్గరికి రావల్సిందిగా పురమాయించింది. అది యిప్పుడు అక్కడకు వచ్చింది. అన్నా వ్రాన్‌స్కీ దగ్గర సెలవు తీసుకొని వెళ్లిపోయింది.

23

సోమవారం నాడు జూన్ 2 నాటి కమిటీ మామూలు సమావేశం జరిగింది. కరేనిన్ గదిలోకి వెళ్లి సభ్యులకీ, అధ్యక్షుడికీ యెప్పటి లాగానే నమస్కారం చేశాడు. తన కోసం తయారు చేసి ముందు పెట్టిన కాగితాలమీద చేతిని పెట్టి తన స్థానంలో కూర్చున్నాడు. తను ఉల్లేఖించవలసిన విషయాలు, తన ఉపన్యాస సారాంశం, రాసిన కాగితాలు వాటిలో ఉన్నాయి. ఆ ఉల్లేఖనలని రాయవలసిన అవసరం అతనికి లేదు. అతని మనస్సులో అన్నీ సిద్ధంగా వున్నాయి. తను చెప్పబోయే దాన్ని మననం చేసుకో నక్కరలేదు కూడా అతను. ఉదాసీన భావం కనిపింప చెయ్యాలని వృథాగా ప్రయత్నం చేస్తూ వుండే తన ప్రత్యర్థి ముఖం యెదర కనిపించగానే తన వాగ్ధాటి నిర్నిరోధంగా ప్రవహిస్తుందనీ, తనిప్పుడు వాటి పట్ల ధ్యానం వుంచే దాని కంటే వేగంగా మాటలు దూసుకుంటూ వస్తాయనీ అతనికి తెలుసు. తను చెప్పబోయేది అధిక విషయపుష్టంగా వుంటుందనీ, తన ప్రతి మాటకీ విలువ వుంటుందనీ అతనికి అనిపించింది. ఈ లోపున యేదో మామూలు వివరణని వింటూ అతను చాలా అమాయకంగా, చాలా సాధువుగా ముఖం పెట్టి కూర్చున్నాడు. పొంగరించిన నరాలు అల్లుకున్నట్టు వున్న అతని తెల్లని

చేతులని చూసి తన ముందున్న కాగితాలమీద మెల్లిగా తాటిస్తూ వున్న పొడుగాటి వేళ్లని చూసి, అలిసిపోయినట్టుగా ఓ పక్కకి వొరగేసుకున్న తలని చూసిన వాళ్లెవరూ కూడా యీ మనిషి నోట్లోంచి మాటలు ఝరీ వేగతుల్యంగా వస్తాయనీ, పెద్ద తుఫానుని ప్రేరేపిస్తాయనీ, సభ్యులు వొకళ్లని చూసి వొకళ్లు గొంతు చించుకునేట్టు అరుచుకోవడానికి కారక మవుతాయనీ, అధ్యక్షుడు పరిస్థితిని ప్రశాంతంగా వుంచడానికి తన గంటని మోగించాల్సి వస్తుందనీ వూహించలేరు. నివేదిక పూర్తయాక కరేనిన్ నిబ్బరమైన సన్నని కంఠంతో అల్ప సంఖ్యాక జాతుల స్థితి గతుల విషయంలో తనకి తోచిన అభిప్రాయాల్ని చెప్తానని అన్నాడు. అందరూ అతనికేసి తమ దృష్టి మళ్లించారు. అతను గొంతు సవరించుకున్నాడు. ప్రత్యర్థికేసి చూడకుండా, తన అలవాటు ప్రకారం యెదురుగ్గా వున్న వ్యక్తి కేసి చూసి అతని మీదే చూపు లగ్నం చేసాడు. ప్రస్తుతం యెదురుగ్గా వున్న ఆ వ్యక్తి సాధువుగా వుండే చిన్న ముసలాయన. సమావేశాల్లో వొక్క సారి కూడ నోరు మెదిపి యెరుగడు. కరేనిన్ అతన్ని చూస్తూ ఉపన్యాసం మొదలుపెట్టాడు. విషయం మౌలిక చట్టం దగ్గరికి రాగానే కరేనిన్ ప్రత్యర్థి వొక్క ఉదుటున లేచి మంచుని అభ్యంతరం చెప్పడం మొదలుపెట్టాడు. ఆయోగంలో సభ్యుడూ, కరేనిన్ చేత వాదనలో దెబ్బలు తిన్నవాడూ అయిన స్త్రెమోవ్ తన వివరణ తను యివ్వబోయాడు. ఇవన్నీ కలిపి మొత్తంమీద సమావేశం మరింత గందరగోళం అయిపోయింది. కాని కరేనిన్ కలికి తురాయి కొట్టేశాడు, అతని ప్రతిపాదనని ఆమోదించారు. మూడు కొత్త ఆయోగాల్ని నియమించేరు. ఆ మర్నాడు పీటర్స్‌బుర్గ్‌లోని వో ముఖ్య బృందంలో యీ సమావేశమే చర్చనీయాంశం అయిపోయింది. కరేనిన్ వూహించిన దానికంటే యెక్కువగా విజయం లభించింది.

మర్నాడు మంగళవారం. తెల్లవారుతూనే కరేనిన్‌కి ముందు రోజు నాటి విజయం తృప్తిగా అనిపించింది. అతన్ని పొగడ్డానికి అవకాశం దొరికిందనే ఆశతో అతని సెక్రటరీ వచ్చి ఆ సమావేశం గురించి గుర్తు చేశాడు. తన చెవిన పడిన మాటలని కరేనిన్‌కి చెప్పినప్పుడు కరేనిన్ తనకి అదంతా యేం పట్టనట్టు కనిపించ ప్రయత్నించేడు. కాని చిరునవ్వు నవ్వకుండా వుండలేకపోయాడు.

సెక్రటరీతో మాటల్లో పడి కరేనిన్, ఆ వేళ మంగళవారం అనీ, అన్నాని రమ్మని చెప్పిన రోజు అదేననీ మర్చిపోయాడు. దాంతో నౌకరు వచ్చి ఆమె వచ్చిందని చెప్పగానే కరేనిన్‌కి ఆశ్చర్యం, చేదుభావన కలిగాయి.

అన్నా పీటర్స్‌బుర్గ్‌కి ఆ ఉదయమే తిరిగి వచ్చింది. ఆమె యిచ్చిన టెలిగ్రామ్ మేరకి ఆమె కోసం బగ్గీ వెళ్లింది. అందుచేత భర్త తన రాక కోసం చూస్తూనే వుండాలి కదా. కాని ఆమె రాగానే భర్త ఆమెని కలుసుకోవడం కోసం బయటికి రాలేదు. అతను చదువుకొనే గదిలోనే సెక్రటరీతో పన్లో వున్నాడనీ, యివతలికి రాలేదనీ ఆమెకి చెప్పారు. తను వచ్చానన్న విషయం భర్తకి కబురు చేసి, తన గదిలోకి వెళ్లిపోయింది. అతను తన దగ్గరికి వస్తాడని

చూస్తూ సామాన్లు సర్దుకోవడం మొదలుపెట్టింది. గంటసేపు గడిచిపోయింది కాని అతను రాలేదు. హౌస్ కీపరుకి యేదో చెప్పాలన్న మిషమీద భోజనాల గదిలోకి వెళ్ళి, భర్త తనని కలుసుకోవడానికి అక్కడికి వస్తాడనే అనుకుంటూ కావాలని గొంతు పెద్దది చేసి మాట్లాడింది. కాని అతను అక్కడికీ రాలేదు. అతను సెక్రటరీని సాగనంపుతూ తలుపు దగ్గరకి రావడం చప్పుడు ఆమె వింది. అప్పుడతను అలవాటు ప్రకారం ఆఫీసుకి వెళ్ళిపోతాడని ఆమెకి తెలుసు. అతను వెళ్ళిపోక ముందే అతన్ని చూసి తన సంబంధాల గురించి తేల్చుకుందామని ఆమెకి వుంది.

అన్నా హాలు దాటుకుని దృఢసంకల్పంతో అతని దగ్గరికి వెళ్ళింది. లోపలికి వెళ్ళేటప్పటికి అతను వెళ్ళిపోవడానికి ఆఫీసు బట్టలు వేసుకొని వున్నాడు. ఓ చిన్న బల్ల దగ్గర కూర్చుని మోచేతులమీద ఆనుకుని అలా దిగాలుగా చూస్తూ కూర్చున్నాడు. అతను తనని చూడక ముందే అన్నా అతన్ని చూసింది. తన గురించే అతను ఆలోచిస్తున్నాడని ఆమె వూహించింది.

ఆమెని చూడగానే అతను లేవబోయాడు కాని అతని మనస్సు మారిపోయింది. అతని ముఖం వున్నట్టుండి యెర్రబడింది. అంతకు ముందు అన్నా అలాంటి భావాన్ని యెన్నడూ అతనిలో చూసి యెరగదు. అతను ఆమె కళ్ళల్లోకి కాకుండా వాటి పైగా ఆమె నుదుటి కేసి, జుట్టు కేసి చూశాడు. ఆమె దగ్గరికి వెళ్ళి చెయ్యి అందుకుని కూర్చోమని అన్నాడు.

"మీరు వచ్చారు నాకు సంతోషంగా వుంది" అన్నాడతను ఆమె పక్కన కూర్చుని. ఆమెతో మాట్లాడాలనే అనుకున్నాడు కాని మాటలు రాలేదు. యేదో చెప్దామని కొన్ని సార్లు ప్రయత్నించేడు గాని చెప్పలేక పోయాడు. ఈ సమావేశానికి తయారవుతూ అతన్ని తిరస్కరించాలనీ, అవమానం పాలు చెయ్యాలనీ అన్నా అనుకుంది గాని యేం చెప్పాలో యిప్పుడు ఆమెకీ తెలియలేదు. అతనంటే జాలి కలిగింది. ఆ రకంగా యిద్దరూ కొంత సేపు మౌనంగా వుండిపోయారు. "సెర్యోష బాగున్నాడా" అన్నాడతను ఆఖరికి. జవాబు కోసం ఆగకుండానే "యివాళ నేను యింట్లో భోజనం చెయ్యను, యిప్పుడే నేను వెళ్ళిపోవాలి" అన్నాడు.

"మాస్కో వెళ్ళాలని అనుకున్నాను" అందామె.

"లేదు, యిక్కడికి వచ్చి చాలా మంచి పని చేశారు. చాలా మంచి పని" అన్నాడు. మళ్ళీ యెవళ్ళూ మాట్లాడలేదు.

అతను సంభాషణ మొదలుపెట్టలేడని గ్రహించి ఆమే మొదలుపెట్టింది.

"మీరు" అని అతని కేసి చూస్తూ తన జుట్టుమీదనే లగ్నం అయిన అతని దృష్టి నుంచి తన కళ్ళు దించకుండా ఆమె మొదలుపెట్టింది. "నేను అపరాధిని, దుష్టురాల్ని, కాని నేను మీతో చెప్పినట్టే వున్నాను. నేను మార్చుగలిగింది యేదీ లేదని చెప్పడానికే వచ్చాను."

"నేను మిమ్మల్ని యీ విషయం గురించి అడగలేదు" అని అతను తకామని, తీవ్రంగా ఆమె కేసి నేరుగా ఘృణత్వంతో చూస్తూ అన్నాడు. "నేను అలానే అనుకున్నాను."

కోప తీవ్రతవల్ల అతనికి తన ప్రతిభా విశేషంమీద తిరిగి పూర్వాధికారం వచ్చినట్టే కనిపించింది. "కాని నేను మీకు అప్పుడు చెప్పినట్టు, తర్వాత మీకు ఉత్తరంలో రాసినట్టూ" అని అతను కటువుగా కీచు కంఠంతో అన్నాడు "దాన్ని నేను మళ్లీ చెప్తున్నానిప్పుడు. ఆ విషయం తెలుసుకోవాల్సిన అవసరం నాకు లేదు. దాన్ని నేను ఉపేక్షిస్తున్నాను. పెళ్లాలెవరూ కూడా మొగుళ్లకి మీరు అందజేసినంత 'సంతోషకరమైన' సమాచారాన్ని అందివ్వడానికి మీ అంతలా హడావుడి పడిపోరు." 'సంతోషకరమైన' అనే మాటమీద ప్రత్యేకం వొత్తి పలికేడు అతను. "లోకులకి తెలియకుండా వున్నంత కాలం, నా పేరుకి భంగం కలగనంత కాలం, నేను దాన్ని ఉపేక్షిస్తాను. అందుకనే మన సంబంధాలు యెప్పుడూ వున్నట్టే వుండాలని హెచ్చరిస్తున్నాను. మీ అంతట మీరు దిగజారే పరిస్థితిలోకి పడిపోతే అప్పుడు మాత్రమే నేను నా గౌరవం కాపాడుకోవడానికి చర్యలు తీసుకోవాల్సి వుంటుందని హెచ్చరిస్తున్నాను."

"కాని మన సంబంధాలు పూర్వం లాగా వుండలేవు" అంది అన్నా బెరుగ్గా, అతని కేసి భయంగా చూస్తూ.

అతని శాంత కవళికలు చూసి, కీచుగా వుండే పిల్లతరహా యేవగింపు కంఠస్వరం మళ్లీ వినగానే ఆమెకి జాలి పోయింది, వెలపరం వచ్చింది. అతనంటే ఆమెకి భయమే గాని ఆరు నూరైనా నూరు ఆరైనా తమ సంబంధాల విషయం అతనితో తేల్చుకోవాలనే అనుకుంది.

"నేను మీ భార్యగా వుండలేను, నేను..." అని చెప్పడం మొదలుపెట్టింది.

అతను కర్కశంగా, కోపంగా నవ్వేడు.

"మీరు యెంచుకున్న జీవిత విధానం మీ బుద్ధి విశేషంమీద ప్రభావం చూపిస్తున్నట్టు కనిపిస్తోంది. నేను యెంతో గౌరవిస్తున్నాను, యేవగించుకుంటున్నాను — మీ గతం పట్ల గౌరవం, వర్తమానం పట్ల యేవగింపు. నా మాటలని మీరు అర్థం చేసుకున్న పద్ధతి నేననుకున్నది కాదు."

అన్నా గాఢంగా గాలి పీల్చి తల వాలేసుకుంది.

"మీ లాగా విశృంఖల అయిన ఆడమనిషి" అని అతను రెచ్చిపోయి అంటూనే వున్నాడు. "భర్తతో తన తప్పుడు పని గురించి చెప్ప గలిగి అందులో తప్పేమీ లేదని అనుకో గలిగినటువంటిది, భర్త పట్ల తన విధులని నిర్వహించడం తప్పుగా భావించుకోవడం యేమిటో నాకు అర్థం కావడం లేదు" అన్నాడు.

"మీరు! నన్నేం చెయ్యమంటారో చెప్పండి."

"నాక్కావలసిందేమంటే ఆ మనిషి నా యింట్లో కనిపించకూడదు. మన మిత్రులు గాని, నౌకర్లు గాని మీలో అనుమానించవలసింది లేనట్టుగా మీరు ప్రవర్తించాలి... మీరు అతన్ని కలుసుకోవడం మానెయ్యాలి. యిది పెద్ద కోరిక కాదనుకుంటాను. ప్రతిఫలంగా

మీరు భార్య హోదాకి తగ్గ హక్కులు అనుభవిస్తారు, ఆ విధులు అమలు జరప నక్కర లేకుండానే. అదే నేను చెప్పదల్చుకున్నదంతా. నేను వెళ్లే వేళయింది. నేను భోజనానికి రాను" అన్నాడు.

అతను లేచి గుమ్మం దగ్గరికి వెళ్లాడు. అన్నా కూడ లేచింది. ఒక్క మాట కూడా అనకుండా అతను వంగి అభివాదం చేసి ఆమె వెళ్లడానికి తలుపు తెరిచాడు.

24

గడ్డి మోపుమీద లేవిన్ గడిపిన రాత్రి అతని మనస్సుమీద ముద్రవేసింది. అతనికి వ్యవసాయం పట్ల వైమనస్యం కలిగింది. దాంట్లో వుండే ఆసక్తి అంతా పోయింది. ఫలసాయం చాలా బాగా వుంది, కాని అంత దురదృష్టం యిప్పుడూ కలగలేదు. రైతులతో యీ సంవత్సరం కలిగినంత విరోధం ముందెప్పుడూ కలగలేదు. కనీసం అలా అని అతనికి అనిపించింది. యీ దురదృష్టానికీ రైతులతో విరోధానికీ కారణం అతనికి యిప్పుడు స్పష్టమైంది. తనని రైతులకి సన్నిహితం చేసిన ఆ పనిలోని ఆనందం, రైతులన్నా వాళ్ల జీవిత విధానం అన్నా తనకి కలిగిన యీర్ష్య, వాళ్ల జీవిత విధానాన్ని అనుసరించాలన్న తన కోరిక, స్వప్నంగా వున్న దశనుంచి ఆ రాత్రి ఉద్దేశంగా మారిన ఆ కోరిక, దాన్ని యెలా అమలు జరపాలా అనే ఆచరణాత్మక ఉద్దేశం – యివన్నీ కూడా తన ఎస్టేట్ సంచాలకత్వం పట్ల అతని దృష్టిని యెంతలా మార్చేసాయంటే అతనికి యిదివరలో అదంటే వున్న ఆసక్తి కనిపించలేదు. తనకీ వ్యవసాయ కార్మికులకీ మధ్య వున్న వైమనస్య పూరిత సంబంధాలని చూడకుండా వుండలేక పోయాడు. ఈ విషయమంతటికీ మూలంగా వున్నవి అవే. పావా లాంటి మేలుజాతి ఆవుల మంద, యెరువులు వేసి లోహ హలాలతో దున్నిన భూములు, గట్లమీద చెట్లు నాటిన అలాంటి తొమ్మిది సమతల క్షేత్రాలు, లోతుగా దున్ని యెరువులు వేసిన తొంభై దెస్యతీన్ల పొలం, విత్తులు చల్లే యంత్రాలు, అన్నీ కూడా సంతోష కారకాలు అయివుండాలి – అవి గనక తన సొంతంగా గాని, లేక తన అభిప్రాయాలతో పాలు పంచుకుని సాయపడే స్నేహితుల వల్ల గాని సమకూరి వుంటే. కాని యిప్పుడతనికి అంతా స్పష్టంగా విశదమైంది (వ్యవసాయానికి సంబంధించి తను కృషి చేస్తూ వున్న పుస్తకం వల్ల అతనికి యిలా విశదమైంది. వ్యవసాయ కార్మికులు వ్యవసాయంలో ముఖ్యాంశం అవాలని దాని ప్రకారం వుంది). ఏమంటే వ్యవసాయం విషయంలో తను నిర్వహిస్తున్న ధోరణి తనకీ వ్యవసాయ కార్మికులకీ మధ్య జరిగే కఠోర, తీవ్ర సంఘర్షణ తప్ప యేమీ కాదు. యీ సంఘర్షణలో వొక పక్క, అంటే తన పక్క, అన్నిటినీ లేమిగ్గా వుండేటట్టు మార్చే స్థిర గాఢ ప్రయత్నం వుంది. అటు పక్క యెలా వున్న వాటికి అలానే లొంగిపోవడం వుంది. యీ సంఘర్షణలో తన వైపునుంచి తను యెంత ప్రయాస పడినా, అవతలి వైపునుంచి యే ప్రయత్నమూ, కనీసం సంకల్పమూ లేక

పోయినా, వ్యవసాయం యే పురోగతీ సాధించలేదు. అద్భుతమైన పరికరాలు, పశువులు, భూమి విరద్ధకంగా తగులడి పోతున్నాయి. అన్నిటి కంటె ముఖ్యమైంది, యీ లక్ష్యం కోసం తను పడే శ్రమ వ్యర్థమవుతోందన్నదే కాక, తన కార్యకలాపాల అర్థం అతనికి స్పష్టమైన యివ్వడు, ఆ లక్ష్యమే అనుచితమైందన్న భావం అతనికి కలగడం. ఈ సంఘర్షణ దేని గురించి? తను ప్రతి కోపెక్కు కోసం గుంజాటన పడుతున్నాడు. (తనకి సంబంధించి అలా చెయ్యడం అవసరం. లేకపోతే యే మాత్రం కళ్లేలు వదులు చేసినా పనివాళ్లకి యివ్వడానికి కూడా డబ్బు వుండదు.) వాళ్లేమో నిదానంగా, కులాసాగా, లోగడ అలవాటు వడ్డట్టే చెయ్యడానికి తంటాలు పడుతున్నారు. ప్రతి పనివాడూ యథాశక్తి శ్రమించి, తను చేస్తున్న పనిమీద ధ్యాస పెట్టి, విత్తులు చల్లే యంత్రాన్ని, గుర్రపు కొర్రుని, నూర్పుడు యంత్రాన్ని విరగ్గొట్టకుండా పని చెయ్యడం తన ప్రయోజనాల దృష్ట్యా అవసరం. అటు వేపు నుంచి చూస్తే పనివాడు యెంత వీలైతే అంత కులాసాగా, తీరిగ్గా పని చెయ్యాలని చూస్తాడు. అన్నిట్నీ మించి దేభ్యాగా, సరదాగా, తను చేస్తున్న దాన్ని గురించి ఖాతరీ లేకుండా వుండా లనుకుంటాడు. యీ విషయాన్ని లేవిన్ యీ వేసవిలో అడుగడుగునా గమనించేడు. అడివి కలుపు మొక్కలూ, పసనాభి మొక్కలూ పెరిగిపోయి, విత్తనానికి పనికి రాకుండా పోయిన క్లోవర్ గడ్డిని కొయ్యమని, అలాంటి జాగాని యెంచి కోతగాళ్లని తను పంపితే వాళ్లు అలా చెయ్యడానికి బదులు బాగా వున్న జాగాల్లో గడ్డి కోశేరు. యిదేమిట్రా అంటే నిగామాను అలా కొయ్యమన్నాడనీ, అది భేష్మైన గడ్డి అవుతుంది, ఫరవాలేదనీ సాకు చెప్పారు. కాని మంచి గడ్డిని కొయ్యడం తేలిక, అందుకని అలా చేశారు వాళ్లు. ఆ విషయం తనకి తెలుసు. గడ్డిని అర బెట్టడానికి అతను యంత్రాన్ని పంపేడు. మొదటి వరసలో వుండగానే దాన్ని విరగ్గొట్టి పెట్టేరు. ఏమంటే నెత్తిమీద యంత్రం రెక్కలు తిరుగుతూ వుంటే దానికింద గోళ్లు గిల్లుకుంటూ కూచోవడం వాళ్లకి విసుగ్గా వుందట. "మరేం బెంగపడకయ్యా, ఆడోళ్లు గడ్డిని ఆరబెట్టేస్తారు" అని ధైర్యం చెప్పారు. లోహ హలాల్ని పాడు చేశారు, యేమంటే మలుపుల్లో తిప్పేటప్పుడు. కొర్రుని లేపాలని దున్నేవాడి బుర్రకి తట్టక దాన్ని గట్టిగా నొక్కి గుర్రాన్ని గట్టిగా తోలి పీడించి పెంటి పాడుచేశారు. మరేం అనుకోవద్దని తనకి దణ్ణం పెట్టేరు. గుర్రాలని గోధుమ పొలాల్లోకి వదిలేశారు, యేమంటే యే పనివాడికీ రాత్రి కావలాపని చెయ్యడం యిష్టం లేక. వద్దని చెప్పినా కూడా పనివాళ్లు వంతుల వారీగా గుర్రాల్ని కాపలా కాసేరు. పగలంతా పని చేసిందాని వల్ల వాంకకి నిద్ర వచ్చేసింది. జరిగే హాని జరిగిపోయేక వాడు తప్పయిపోయిందని లెంపలు వేసుకుని "మీ యిష్టం వచ్చిన శిక్ష వెయ్యండయ్యా" అన్నాడు. నీళ్లు పెట్టకుండా, పగం పగం కోసిన గడ్డి బీటి మీదకి తోలెయ్యడంతో మూడు భేష్మైన దూడలు చచ్చిపోయాయి. బాగా యెక్కువగా పచ్చి గడ్డిని మేసెయ్యడం వల్ల అవి పొట్టలు ఉబ్బి చచ్చిపోయాయన్న మాటని పనివాళ్లు వొప్పుకోలేదు. వాళ్లు లేవిన్‌కి వూరడింపు మాటలు చెపుతూ బాధపడక్కరలేదనీ, పొరు

గాయనకి మూడు రోజుల్లో మూట పన్నెండు పశువులు చచ్చిపోయేయని అన్నారు. వాళ్ళేదో లేవిన్‌కీ, అతని ఆస్తికీ నష్టం కలిగించాలని అలా చెయ్యలేదు. తద్భిన్నంగా తనంటే వాళ్ళకి ఆరాధనా భావం వుందని అతనికి తెలుసు. తనని మంచి యజమాని అంటారని (అదే గొప్ప పొగడ్త) తెలుసు. అలా జరగడానికి కారణం శ్రద్ధ పెట్టకుండా కులాసాగా పని చెయ్యాలని వాళ్ళకి వుండడం. అదేవిధంగా తన ప్రయోజనాలు వాళ్ళకి సంబంధించి పరాయివి, వాళ్ళకి దురవగాహనమైనవి మాత్రమే కాదు, వాళ్ళ ప్రయోజనాలకి పూర్తిగా చుక్కెదురుగా వుంటాయి. లేవిన్ కొంత కాలంగా తన వైఖరితో అసంతుష్టిగా వున్నాడు. తన నావ చిల్లు పడిందని తెలుసు కాని, దానికి కారణం తెలీలేదు. కావాలని తనని తను మోసం చేసుకుంటున్నాడేమో. కాని యిక మోసం చేసుకోలేదు. అంచేత తన యెస్టేటు నిర్వహణ బాధ్యత పట్ల ఆసక్తిపోవడమే కాదు, విముఖత్వం కూడా కలిగింది. దానిమీద యిప్పుడతని మనస్సు లగ్నం అవడం లేదు.

దీనికి తోడు యాభై కిలోమీటర్ల దూరంలోనే కిట్టీ ష్చేర్‌బాత్‌స్కీ వుండటం వొకటి. ఆమెని కలుసుకోవాలని అతనికి వుంది. కాని కలుసుకునే ధైర్యం లేదు. డాలీని చూడ్డానికి వెళ్ళినప్పుడు ఆమె చెప్పింది తనని రమ్మని. పెళ్ళి ప్రస్తావన తిరిగి చేసే యీ సారి తన చెల్లెలు తప్పకుండా వొప్పుకుంటుందని అంది. బండిలో వెళ్ళిపోతూ వున్న కిట్టీని యీషన్మాత్రంగా చూశాక తన ప్రేమ పిసరు కూడా తగ్గలేదని అతనికి తెలిసింది. కాని కిట్టీ అక్కడ వుండడం వల్ల అబ్లాన్‌స్కీల యింటికి వెళ్ళలేకుండా వున్నాడు. తనా వివాహ ప్రస్తావన చేశాడు, ఆమె తిరస్కరించింది అన్న విషయం అధిరోహించ లేని అంతరాన్ని యిద్దరి మధ్యా పెట్టింది. 'ఆమె తను కోరుకున్న వాడికి యిల్లాలు కాలేకపోయిందన్న కారణంగా నా యిల్లాలు కమ్మని ఆమెని అడగలేను' అనుకున్నాడు. అలాంటి ఆలోచనే కిట్టీ అంటే కటుత్వం వైమనస్యం కలిగేట్టు చేస్తుంది. 'నిష్ఠుర భావం లేకుండా ఆమెతో మాట్లాడలేను. కోపం లేకుండా ఆమెని చూడలేను. ఆమె నన్ను యింకా యెక్కువ యేవగించు కుంటుందంతే. మరి అలానే జరగాలి. పైగా డాలీ నాతో అన్న మాటల తర్వాత అక్కడికి యెలా వెళ్ళను? తను చెప్పింది నాకు తెలుసు అని బయట పడకుండా వుండగలనా? చాలా ఉదారంగా, ఆమెని క్షమిస్తున్నట్టు, ఆమె పట్ల దయ చూపిస్తున్నట్టు వెళ్ళనా? ఆమె ముందు క్షమాశీలిగా, నా ప్రేమ అనుగ్రహిస్తున్నవాడి పాత్ర ధరిస్తూ వెళ్ళనా?.. డాలీ నాకు యెందుకు దాన్ని చెప్పింది? నేను గనక ఆమెని యాదృచ్ఛికంగా కలుసుకుని వున్నట్టయితే అంతా దానంతట అదే సహజంగా సర్దుకుని వుండేది. కాని యిప్పుడు మాత్రం అది అసంభవం, అసంభవం.'

డాలీ అతనికి వో చీటీ రాసి పంపించింది. ఆడవాళ్ళ గుర్రం స్వారీ చేసేటందుకు అనువుగా వుండే జీనుని కిట్టీ కోసం పంపమని రాసింది. 'మీ దగ్గర ఆ జీను వుందని విన్నాను. మీరే స్వయంగా తీసుకు వస్తారని ఆశిస్తున్నాను' అని రాసింది.

ఇది అతను భరించలేక పోయాడు. ఒక తెలివైన, సున్నిత హృదయురాలైన మహిళ తన చెల్లెళ్ళని యెలా యింతలా అవమానించగలదు? జవాబుగా పది చీటీలు రాసి పదింటినీ చింపేశాడు. ఆఖర్న యే చీటీ లేకుండా టీసు పంపించి వూరుకున్నాడు. తను వస్తున్నాను అని రాయ లేకపోయాడు. యెందుకంటే తను వెళ్ళడం లేదు కనక. ఏదో పని తగిలి రాలేక పోతున్నానని లేదా యెక్కడికో వెళ్ళిపోతున్నానని రాయటం మరీ బాగోదు. అంచేత చీటీ యేం లేకుండా టీసు పంపేశాడు. అలా పంపినందుకు సిగ్గుపడ్డాడు. మర్నాడు యేవగింపుగా కనిపించిన వ్యవసాయం వ్యవహారాలన్నిట్నీ నిగామానుకి అప్పగించేసి, యెక్కణ్నో దూరంగా వుంటున్న మిత్రుడు స్వియాజ్‌స్కీ దగ్గరికి వెళ్ళిపోయాడు. స్వియాజ్‌స్కీ ఎస్టేట్‌లో మంచి కంజాపిట్టల బాడవలు వున్నాయి. అతను కూడా యీ మధ్యనే ఉత్తరం రాశాడు ఒకసారి వచ్చి తను ముందెప్పుడో అన్న మాట నిలబెట్టుకొమ్మని. తన జమీ వ్యవహారాలు తల మునకలుగా వుండడంతో లేవిన్ యీ కార్యక్రమాన్ని అలా వాయిదా వేస్తూనే వుండి పోయాడు, సూరొవ్‌స్కీ ఉయేజ్దులో కంజాపిట్టలు భ్రమ కలిగిస్తూ వున్నప్పటికీ. యిప్పుడు దగ్గర్లో వున్న ష్చేర్‌బాత్‌స్కీల కుటుంబం దగ్గర్నుంచి, యింకా యెక్కువగా తన జమీ వ్యవహారాలనుంచి, వెళ్ళిపోయి కంజాల వేట వరదా తీర్చుకోవచ్చును. యేమంటే షికారీ వినోదమే తన జీవితంలో కటువైన రోజులనుంచి తనకి మనశ్శాంతిని కలిగిస్తుంది.

25

సూరొవ్‌స్కీ ఉయేజ్దులో రైల్వే గాని, టపా తీసికెళ్ళే ప్రభుత్వం దారి గాని లేవు. అందుచేత లేవిన్ తన బగ్గీలో బయలుదేరాడు.

సగం దారిలో గుర్రాలకి దాణా నీళ్ళు పెట్టేందుకు వో సంపన్న రైతు యింటి దగ్గర ఆగేడు. ఆరోగ్యవంతుడైన వో బట్టతల ముసలతను గేటు తెరిచాడు. అతనికి వెడల్పాటి యెర్రని గడ్డం వుంది. ఆ గడ్డంలో అక్కడక్కడ నెరిసిన వెంట్రుకలు వున్నాయి. గుమ్మం తలుపు తెరిచి అతను గుర్రాల్ని లోపలికి వెళ్ళనిస్తూ గేటు స్తంభానికి కరుచుకున్నాడు. కొత్త పెరట్లో వెల్లడిగా వుండే కొట్టాన్ని బండివాడికి చూపించేడు. ఆ పెరడు చాల శుభ్రంగా వుంది. ఆ కొట్టంలో కాలిపోయిన కొన్ని స్తంభాలు వున్నాయి. తర్వాత లేవిన్‌ని లోపలికి రమ్మని గదిలోకి తీసికెళ్ళాడు. నడవలో వాళ్ళకి వో పడుచు అమ్మాయి కనిపించింది. ఆమె శుభ్రమైన బట్టలు వేసుకుంది. మేజోళ్ళు లేకుండా రబ్బరు బూట్లు వేసుకుంది. వొంగుని నేల తుడుస్తోంది. లేవిన్ కుక్క గెంతుకుంటూ దగ్గరకెళ్ళేటప్పటికి భయంతో కెవ్వుమంది. కుక్క కరవదు ఫరవా లేదని లేవిన్ చెప్పాక నవ్వింది. గది తలుపుకేసి చేతితో చూపించింది. తర్వాత మళ్ళీ వొంగి ముచ్చటైన ముఖం దాచుకుని నేల పామడం మొదలు పెట్టింది.

"సమొవార్ రాజెయ్యనా?" అని అడిగింది.

"ఆఁ."

గది పెద్దది. దాన్ని రెండుగా విభజించేరు. డబ్ పెయ్యి వుండక్కడ. దేవతా ప్రతిమలకింద పెద్ద మేజా, బల్ల, రెండు కుర్చీలు వున్నాయి. మేజామీద చెక్కటి లతలు బొమ్మలు చెక్కి వున్నాయి. తలుపు పక్కన పింగాణీ సామాను పెట్టిన చిన్న అల్మారా వుంది. ఈగలు రాకుండా కిటికీ తలుపులు మూసేశారు. ప్రతిదీ యెంతో శుభ్రంగా వుండడంతో, రోడ్డుమీద కుంటల్లోని బురద చిమ్ముకుంటూ పరిగెత్తుకు వచ్చిన కుక్క లాస్కని లేవిన్ నో మూలకి పోయి పడుకొమ్మన్నాడు. గదిని చూశాక లేవిన్ వెనక పెరట్లోకి వెళ్లాడు. రబ్బరు బూట్లు తొడుక్కున్న ముచ్చటైన అమ్మాయి అతన్ని దాటుకుని నూతి దగ్గరికి నీళ్ల కోసం వెళ్లింది. ఆమె భుజంమీద పెట్టుకున్న కావడికి రెండు ఖాళీ బాల్చీలు వూగుతున్నాయి.

"కాంచెం గబగబా కానియ్యమ్మా" అని ముసలాడు గొంతు పెద్దది చేసి హుషారుగా అరిచాడు. తర్వాత లేవిన్ దగ్గరికి వచ్చేరు. "తమరు నికొలాయ్ ఇవానొవిచ్ స్వియాజ్‌స్కీ దగ్గరికేనా వెళ్తూవుంట, హుజూర్?" అని మోచేతుల్ని వరండా కమ్మీలమీద పెడుతూ, మాట్లాడ్డానికి సరదా పడుతూ అడిగేడు. "ఆయన వస్తూవుంటారు" అన్నాడు.

స్వియాజ్‌స్కీతో తన పరిచయం గురించి ముసలతను చెప్తూ వుండగా మధ్యలో గేటు మరోసారి కిర్రుమంది. కొంతమంది పనివాళ్లు పొలాల దగ్గర్నుంచి వచ్చేరు. నాగళ్లనీ అటగ్రొరుల్నీ లాగే గుర్రాలు బాగా మేసి బలిసి వున్నాయి. పనివాళ్లు యింట్లో వాళ్లల్లాగావే వున్నారు. వాళ్లల్లో యిద్దరు పడుచువాళ్లు గింటం గుడ్డ కమీజాలు వేసుకున్నారు. తలకి టోపీలు పెట్టుకున్నారు. మిగిలిన యిద్దరూ నేతగుడ్డ చొక్కాలు వేసుకున్నారు. వాళ్లల్లో ఒకతను ముసలాడు, రెండో వాడు పడుచువాడు. లేవిన్‌తో మాట్లాడే ముసలతను గుర్రాల దగ్గరికి వెళ్లి వాటిని విప్పడం మొదలుపెట్టాడు.

"ఎక్కడ దున్నుతున్నారు వీళ్లు?" అని లేవిన్ అడిగాడు.

"బంగాళాదుంపలు తవ్వుతున్నారు. మాక్కూడా కొద్దిగా పొలం వుందయ్యా. ఫెదోత్, ఈ గుర్రాన్ని బయటికి వదలకు. తొట్టె దగ్గర వుంచు. యింకో గుర్రాన్ని కడదాం" అన్నాడు.

"నేను చెప్పిన నాగలి కర్రలు వచ్చేయా, నాన్నా?" అని పొడుగ్గా, బలిష్ఠంగా వున్న యువకుడు అడిగేడు. అతను ముసలతని కొడుకని తెలుస్తూనే వుంది.

"స్లెడ్జిలో వున్నాయి" అని ముసలతను కళ్లేల్ని మెలికలు తిప్పి నేలమీదకి విసిరేస్తూ జవాబు చెప్పేడు. "వాళ్లు భోజనాలు చేసే వేళకి అన్నిట్నీ సర్దెయ్యి" అన్నాడు.

ఆ ముచ్చటైన పడుచు పిల్ల జబ్బలు దిగలాక్కు పోయేటట్టు నీళ్ల బాల్చీలని మోసుకొచ్చి గుమ్మంలోకి వెళ్లింది. యెక్కడనుంచో కొంతమంది ఆడవాళ్లు ముందుకి వచ్చేరు. పడుచు పిల్లలు అందంగా వున్నారు. ముసలాళ్లు, నడివయస్కురాళ్లు అందంగా లేరు. కొంతమందికి పిల్లలున్నారు. కొంతమందికి లేరు.

ఈ లోపున సమోవార్‌లో నీళ్లు కళపెళ కాగేయి. గుర్రాల పని చూసింతర్వాత పనివాళ్లు, యింట్లో వాళ్లు అందరూ భోజనాలకి వెళ్లేరు. లేవిన్ బగ్గీలోనుంచి తన సామాను తెచ్చుకుని, ముసలతన్ని టీకి రమ్మని పిలిచేడు.

"ఓ సారి టీ అయిందప్పుడే యివాళ" అన్నాడు ముసలతను ఆ పిలుపుకి సంతోష పడుతూ. "కాని మీతోబాటు కొంచెం తాగుతా" అన్నాడు.

టీ తాగేటప్పుడు లేవిన్ ముసలతని వ్యవసాయం గురించి యావత్తూ తెలుసుకున్నాడు. అతను పదేళ్లవాడు ఓ స్థానిక వితంతు జమీందారిణి దగ్గర్నుంచి వందా యిరవై దెస్యతీన్ల భూమిని కౌలుకి తీసుకున్నాడు. ముందోటేడు యీ భూమినంతట్నీ కొనేశాడు. అప్పుడే మరో పొరుగు జమీందారుమంచి మూడు వందల దెస్యతీన్ల పొలం కౌలుకి తీసికున్నాడు. దీన్లోనుంచి కొంత భాగం, వున్న అంతలోనూ అధ్వాన్నమైన దాన్ని, తను మరొకళ్లకి కౌలుకి యిచ్చేడు. యిక ఆ మిగిలిన దాన్ని తన కుటుంబ సభ్యులని, యిద్దరు పనివాళ్లని అడ్డం వేసుకుని సాగు చేసుకుంటున్నాడు. తన స్థితి యేమంత లాయకీగా లేదని ముసలాడు బీద అరుపులు అరిచేడు. అతను లాయకీగా లేదనడం ఊరికే యేదో మాటవరసకి అనాలి కదా అని అన్నట్టు వుందని నిజానికి అతని వ్యవసాయం మూడు పువ్వులు ఆరుకాయలుగా ఉందని లేవిన్ గ్రహించేడు. లేకపోయినట్టయితే అతను దెస్యతీనుకి మాట అయిదు రూబుళ్ల చొప్పున పెట్టి పొలం కొనగలుగునా, ముగ్గురి కొడుకులకి, మేనల్లుడికి పెళ్లిళ్లు చెయ్యగలుగునా, రెండు సార్లు అగ్ని ప్రమాదాలకి గురైన యింటిని పట్టుపట్టుకీ విశాలం చేసి, మెరుగులు దిద్ది బాగు చేయించగలుగునా. పైకి బీద అరుపులు అరిచినా ముసలతనికి తన వైభవం, తన కొడుకులు, మేనల్లుడు, వాళ్ల పెళ్లాలు, అవులు, గుర్రాలు మరీ ముఖ్యంగా తన వ్యవసాయం పద్ధతి సమంజసంగానే గర్వకారణంగా వున్నాయని తెలుస్తూనే వుంది. ముసలతను వ్యవసాయంలో కొత్త పద్ధతులు ప్రవేశపెట్టడానికి వెనకాడ్డని లేవిన్‌కి మాటల సందర్భంలో తెలిసింది. అతను చాలా పెద్దమడిలో బంగాళాదుంపలు వేశాడు. లేవిన్ బంగాళా దుంప పొలం యింకా మొగ్గ తొడుగుతూనే వుంది. కాని ముసలాడి పొలం పూత కూడా అయిపోయింది. దాన్ని అతను వచ్చేటప్పుడు చూశాడు. బంగాళాదుంపల్ని నాటడానికి పొలం దున్నేందుకు పొరుగు జమీందారు దగ్గర్నుంచి లోహ హలం తెచ్చాడు. దాన్ని నాగలం అని పిలుస్తాడతను. గోధుమ కూడా పండిస్తున్నాడు. ఓ చిన్న వివరం లేవిన్‌కి ఆశ్చర్యం కలిగించింది. ముసలతను జల్లించిన రై ధాన్యం పొట్టుని గుర్రాలకి పెడుతున్నాడు. రైతులు అలవాటుగా అవతల పారేసే యిలాంటి అద్భుతమైన దాణాని వాడాలని లేవిన్ యెన్ని సార్లు అనుకున్నాడో కాని యెప్పుడూ చెయ్యలేక పోయాడు. కాని యీ రైతు దాన్ని వాడేడు. ఆ దాణా గొప్పదని ఆకాశానికి యెత్తేస్తున్నాడు.

"పడుచు ఆడవాళ్లు యెందుకండీ వుంట? కొంచెం కొంచెం అవతల పోస్తారు. అప్పుడు బళ్లమీద దాన్ని శాలకి తోలుకుపోతారు."

"మా జమీందార్లకి పనివాళ్లతో యిబ్బందిగా వుంది" అన్నాడు లేవిన్ ముసలతనికి టీ గ్లాసు అందిస్తూ.

"వందనాలండయ్యా" అన్నాడు ముసలతను. కాని చక్కెర వద్దన్నాడు. తను టీ తాగేటప్పుడు కొరుక్కోగా మిగిల్చిన చక్కెరని చూపించేడు. "పనివాళ్లతో వ్యవసాయం పనులు అవుతాయా? శుద్ధ దండుగ. మీ స్వియాజ్‌స్కీగార్ని తీసుకోండి. ఆయన భూమి యెలాంటిదో మాకు తెలుసు. అలాంటిది మరి వుండదు. కాని ఆయన లాబడి చూస్తే తీసికట్టే, బాగా చూసుకోక పోవడం వల్ల వచ్చే ఫలితం అది" అన్నాడు.

"కాని నువ్వు కూడ పనివాళ్ల చేత చేయించు కుంటున్నావు?"

"మాకు మేమే రైతులం కదా. అన్నిట్నీ మేమే స్వయంగా చూసుకుంటాం. పనివాడు బాగా చెయ్యలేదా — తన్ని తగలేస్తాం. వాడి పని మేమే చేసుకుంటాం."

"నాన్నా, ఫినోగేన్‌కి తారు కావాలంట" అని రబ్బర్ బూట్లు వేసుకున్న ముచ్చటైన అమ్మాయి వచ్చి చెప్పింది.

"అదండయ్యా సంగతి" అని ముసలతను లేస్తూ అన్నాడు. అతను చాలా సేపు శిలువ గీసుకుని లేవిన్‌కి కృతజ్ఞతలు చెప్పి బయటికి వెళ్లాడు.

లేవిన్ బండివాణ్ణి పిలుద్దామని వెనక గదిలోకి వెళ్లేడు. అక్కడ మగాళ్లందరూ మేజా దగ్గర భోజనానికి కూర్చుని వుండడం కనిపించింది. ఆడవాళ్లు నుంచుని వాళ్లకి వడ్డన చేస్తున్నారు. ముసలతని దిట్టమైన పడుచు కొడుకు పాయసం నోరంతా కుక్కుకుని, యేదో తమాషా కథ చెప్తున్నాడు. అందరూ నవ్వుతున్నారు. ముసలాడి కూతురు అందరి కంటే ఖుషీగా వుండి, ఖాళీ అయిన వో కంచంలో కాబేజీ సూప్ వడ్డిస్తోంది.

ఆ అమ్మాయి ముచ్చటైన ముఖంలో కళకళలాడుతూ కనిపించిన సుఖసంపదలు ఆ రైతు కుటుంబం చూసి అన్నీ చక్కగా అమిరేయని లేవిన్‌కి తృప్తి కలిగించింది. ఏది ఏమైనా ఆ అనుభూతి చాలా గాఢంగా హత్తుకుంది. లేవిన్ దాన్ని వదిలించుకో లేకపోయాడు. స్వియాజ్‌స్కీ యింటికి చేరే దాకా దారి కడవెళ్లా మాటి మాటికీ యీ రైతు కుటుంబం వ్యవసాయం గురించిన ఆలోచన వస్తూనే వుంది, అందులో గట్టిగా పరిశీలించ వలసిన విషయం యేదో వున్నట్టు.

26

స్వియాజ్‌స్కీ ఆ ఉయేజ్దులోని గొప్పింటి వాళ్ల మార్షల్. లేవిన్ కంటే అయిదేళ్ళ పెద్ద. అతనికి పెళ్లయి చాలా కాలమైంది. అతని పడుచు మరదలు వాళ్లింట్లోనే వుంటుంది. ఆమె అంటే లేవిన్‌కి చాలా యిష్టం. ఆ అమ్మాయిని తను పెళ్లి చేసుకోవాలని స్వియాజ్‌స్కీకి, అతని భార్యకీ వుందని లేవిన్‌కి తెలుసు. పెళ్లికి యోగ్యమైన పడుచు వాళ్లందరికీ

తెలిసి వుండేటట్లే, లేవిన్‌కీ యీ విషయం పిసరు అనుమానానికి తావు లేకుండా తెలుసు. కాని ఆ విషయాన్ని యెవళ్లూ యెప్పుడూ పైకి చెప్పరు. తను పెళ్లి చేసుకోవాలని యెంత తనకి వున్నా, ఖుల్లాలిగా ఆ అమ్మాయి యెంత బాగా వుండగలిగినా, కిట్టీ అంటే తనకు ప్రేమ లేకపోయినా కూడా తను ఆకాశంలో యెగర లేనట్టే తను యీ అమ్మాయిని పెళ్లి చేసుకోలేడని కూడా తనకి తెలుసు. యీ గుర్తింపు, తను స్వియాజ్‌స్కీతో గడుపుతూ పొంద వచ్చని ఆశించిన ఆనందంమీద నీడని పరిచింది.

షికారికి రమ్మని పిలుస్తూ స్వియాజ్‌స్కీ ఉత్తరం అందినప్పుడు లేవిన్‌కి యీ విషయం స్ఫురణకి వచ్చింది. కాని తనని పెళ్లికొడుకుగా స్వియాజ్‌స్కీ పరిగణిస్తాడని అనుకోవడం తన తప్పు కావచ్చుని భావించుకుని అతని వద్దకి వెళ్లాలనే నిర్ణయించుకున్నాడు. అదీగాక, ఆ అమ్మాయి పట్ల తన భావనలని పరీక్షకి పెట్టాలని అంతరంగంలో అతనికి అనిపించింది. స్వియాజ్‌స్కీ కాపరం చాలా సౌఖ్యప్రదంగా వుంటుంది. వ్యక్తిగా స్వియాజ్‌స్కీయే లేవిన్‌కి జేమ్‌స్త్వో పరిషత్తులోని కార్యకర్తల్లో ఉత్తముడుగా తెలుసు, అతనంటే లేవిన్‌కి యెప్పుడూ సరదాగానే వుండేది.

స్వియాజ్‌స్కీ యెప్పుడూ లేవిన్‌కి ఆశ్చర్యం కలిగించే వాళ్లల్లోని మనిషిగానే వుండిపోయాడు. వాళ్ల ఆలోచనా ధోరణి, అభిప్రాయాలూ మౌలికంగా వుండకపోయినా హేతుబద్ధంగా వుంటాయి, వాటికీ వాళ్ల జీవిత విధానానికీ యే రకమైన సంబంధమూ వుండదు. వాళ్ల జీవిత విధానం సునిశ్చితంగా, దృఢంగా వుంటుంది. వాళ్ల అభిప్రాయాలతో, వైఖరితో ముడిపడకుండా సర్వస్వతంత్రంగా, దాదాపు ప్రతికూలంగా తన దారిన తను సాగిపోతుంది. స్వియాజ్‌స్కీ చాలా ఉదారమైన అభిప్రాయాలు వున్న మనిషి. అతనికి జమీందారీ గొప్ప వాళ్లంటే ఘృణ భావం వుంది. వాళ్లల్లో చాలా మందికి, పిరికితనం వల్ల వాళ్లు పైకి తేలకపోయినా, భూస్వామ్య దాసత్వం అంటే పక్షపాతం వుందని అతని నమ్మకం. టర్కీలాగా రష్యా పతనమై పోయిందనీ, రష్యా ప్రభుత్వం కూడా యెంత దుష్టమైందంటే అసలా విషయం గురించి వ్యాఖ్యానాలు, తాత్పర్యాలు చెయ్యడం అనవసరమనీ అతని భావం. కాని తను మార్షల్‌గా ఉన్నాడు. అది కూడా ఆదర్శవంతుడైన మార్షల్. ఎక్కడికి వెళ్లినా ఆ హోదా చిహ్నాలైన యెర్ర పట్టీ, పతకం వున్న టోపీ పెట్టుకునే వాడు. అతని అభిప్రాయంలో మనిషిలా బతకడం అనేది వొక్క విదేశాల్లోనే సాధ్యం. అంచేత వీలు చిక్కినప్పుడల్లా విదేశాలకి వెళ్లేవాడు. కాని రష్యాలో సంక్లిష్ట ఆధునిక వ్యవసాయిక పద్ధతుల్తో వుండే పెద్ద జమీనీ నిర్వహించే వాడు. రష్యాలో జరిగేదాన్నంతట్నీ చాలా ఆసక్తిగా గమనించేవాడు. అతని దృష్టిలో రష్యన్ రైతు మానవుడిగా వికసించడానికీ వానరానికీ మధ్య దశలో వున్నాడు. కాని జేమ్‌స్త్వో యెన్నికలప్పుడు తనే ముందు మహోత్సాహంతో రైతులతో కరచాలనం చేసి, వాళ్ల అభిప్రాయాలని శ్రద్ధగా వినేవాడు. అతనికి శకునాలన్నా నమ్మకం లేదు, అపశకునాలన్నా నమ్మకం లేదు. కాని చర్చి ఫాదరీల సంక్షేమం పట్ల చాలా శ్రద్ధ చూపించేవాడు. చర్చిలని

నమ్మకనం చెయ్యకుండా వుండడానికే అంతే శ్రద్ధ చూపించేవాడు. తమ వూళ్ళో వున్న చర్చిని మూసెయ్యకుండా చూసేందుకు చాలా శ్రమ దమాదులు పడ్డాడు.

మహిళా సమస్య విషయంలో అతని స్వతంత్రత యింకా విశేషంగా వుంది. మహిళా విమోచన విషయంలో, ముఖ్యంగా ఆడవాళ్ళు పనిచెయ్యడానికి సంబంధించి, అతని అభిప్రాయాలు అతివాద పక్షపాతంగా వుండేవి. కాని భార్యతో యెలా కాపరం చేసే వాడంటే సంతానం లేకుండా స్నేహ పూర్వకంగా వున్న వాళ్ళ దాంపత్యం చూసి అందరూ ముగ్ధులై పోయేవాళ్ళు. పైగా తన భార్య జీవితాన్ని యెలా యేర్పాటు చేశాడంటే వాళ్ళిద్దరూ సాధ్యమైనంత కులాసాగా, ఖుషీగా కాలం వెళ్ళబుచ్చేందుకు తగ్గ ఉమ్మడి ఆసక్తి మినహా తనకిగా ఆమె యే పనీ చేసేది కాదు, చెయ్యగలిగేదీ కాదు.

యితరులలో వున్న ఉత్తమ గుణాలనే తప్ప వేరే వాటిని చూసే లక్షణమే గనక లేవిన్‌కి లేకపోయి వున్నట్టయితే స్వియాజ్‌స్కీ స్వభావంలో అతనికి గజిబిజి కలిగించేది గాని చిక్కులు పెట్టేది గాని కనిపించి వుండేది కాదు. స్వియాజ్‌స్కీని మూఢుడుగానో, తుంటరిగానో లెక్కవేసి వుండే వాడంతే. కాని స్వియాజ్‌స్కీని మూఢుడని అనలేదు, యేమంటే స్పష్టంగా అతను బుద్ధిశాలి అవడం మాత్రమే కాదు, బాగా చదువుకున్నవాడు, తన పాండిత్యాన్ని ప్రదర్శించని అణకువతనం వున్న వాడూనూ. అతనికి తెలియని విషయం లేదు. కాని అవసరం పడినప్పుడే తన జ్ఞానాన్ని చూపించేవాడు. అతన్ని తుంటరి అని అసలే కొట్టిపారెయ్యలేదు, యేమంటే స్వియాజ్‌స్కీ నిస్సందేహంగా నిజాయితీపరుడు, దయాళువు, బుద్ధిశాలి. ఉత్సాహంగా, శక్తితో విరామం లేకుండా అతని తోటి వాళ్ళందరూ మెచ్చుకునేటట్టు పని చేస్తాడు. అతను ఉద్దేశపూర్వకంగా యెప్పుడూ తప్పు చెయ్యడనీ, చెయ్యగలిగేడనే విషయం ఖాయం.

అతన్ని అర్థం చేసుకుందామని లేవిన్ ప్రయత్నించేడు. కాని అర్థం చేసుకో లేకపోయాడు. స్వియాజ్‌స్కీ జీవితం లేవిన్‌కి యెప్పుడూ విడివడని చిక్కు ప్రశ్న లాగానే వుండిపోయింది.

లేవిన్‌కీ అతనికీ స్నేహం. అందుకని లేవిన్ అతని జీవిత దృక్పథం యేమిటైందీ తెలుసుకుందామని, శోధించుదామనీ ప్రయత్నించేడు. కాని యీ ప్రయత్నం యెప్పుడూ ముందుకు సాగలేదు. అందరికీ తెరిచి వుంచిన స్వియాజ్‌స్కీ మనసు తలుపులు దాటి లోపలి గదుల్లోకి లేవిన్ యెప్పుడు ప్రవేశించాలని ప్రయాసపడినా స్వియాజ్‌స్కీ కొంచెం చింతాక్రాంతుడై పోయేవాడు. లేవిన్ తన పేగులు లెక్క పెట్టేస్తాడేమోనని భయపడినట్టు వొక భీతి భావం అతని ముఖంమీద దూసుకు పోయేది. అతను నవ్వుతూ, సహృదయంతో లేవిన్‌ని మళ్ళించేసేవాడు.

యిప్పుడు వ్యవసాయం పనుల నిర్వహణ పట్ల ఆసక్తి పోయేక స్వియాజ్‌స్కీ దగ్గరికి వెళ్ళడం లేవిన్‌కి సంతోషంగా వుంది. స్వియాజ్‌స్కీ దంపతులు గువ్వ పిట్టల్లా బాగా

అమిరిన గూట్లో వుండడమూ తమకి తాము తృప్తిగా వుండడమూ, అందరితోనూ తృప్తి పడడమూ చూసి లేవిన్ ప్రసన్న భరితుడయేడు. అంతేకాక వాళ్ళ జీవితం అంత తేటగా, సునిశ్చితంగా, ఉల్లాస భరితంగా వుండేటట్లు చేసిన రహస్యం యేమిటో తెలుసుకోవాలని లేవిన్‌కి అనిపించింది. అదీ ముఖ్యంగా యిప్పుడు, తను తన జీవితంలో యెంతో అసంతృప్తి పడినప్పుడు అనిపించింది. అంత మాత్రమే కాదు, స్వియాజ్‌స్కీ దగ్గర యిరుగుపొరుగు జమీందార్లు తగులుతారు. వ్యవసాయం గురించీ, పలసాయం గురించీ వ్యవసాయ కార్మికుల్ని పనిలో పెట్టుకోవడం గురించి, యింకా ఆ బాపతు విషయాల గురించీ వాళ్ళతో మాట్లాడి వాళ్ళ అభిప్రాయాలు కూడా తెలుసుకోవచ్చు ననిపించింది. వీటిని ఉదాత్తమైన విషయాలుగా పరిగణించరు, ఆ విషయం లేవిన్‌కి తెలుసు. కాని ప్రస్తుతంలో అతనికి ముఖ్య ఆసక్తికరంగా కనిపించినవి యివే. 'ఖని భూస్వామ్యదాస వ్యవస్థలో ముఖ్యం అయివుండక పోవచ్చు. ఇంగ్లండ్‌లో ముఖ్యం కాకపోయి వుండచ్చు. ఈ రెండింటిలోనూ స్థిరత్వ పరిస్థితులు వున్నాయి. కాని ప్రస్తుతం యిక్కడ అంతా తారుమారు అయిపోయి కొత్త రూపు దాల్చే సమయంలో పరిస్థితులు యెలా కుదురుకుంటాయి అనేది రష్యాకి సంబంధించి అత్యంత ప్రాముఖ్యం గల ప్రశ్న' అనుకున్నాడు లేవిన్.

షికారీ లేవిన్ ఆశించినట్టు లేకపోయింది. బాడవ యెండిపోయింది. కంజాలు లేవు. రోజంతా తుపాకీ భుజాన్న వేసుకుని తిరిగినా మూడు పిట్టల్ని మాత్రం కొట్టి పట్టుకు వచ్చేడు. కాని వేట తర్వాత యెప్పుడూ వుండేటట్టుగా ఆకలితో బాగా నకనకలాడుతూ తిరిగి వచ్చేడు. శారీరక శ్రమ తర్వాత అతనికి యెప్పుడూ అనుభవంలోకి వచ్చే ఉత్సాహభరిత మాన సిక స్థితిలో చురుకెక్కిన బుద్ధికుశలతో తిరిగి వచ్చేడు. వేట సమయంలో, అంటే మనస్సుకి వేరే ఆలోచనలు యేమీ రావని అనుకునే ఆ సమయంలో కూడా, సగం దారిలో తనకి తటస్థ పడిన ముసలాయన కుటుంబం గురించే మనస్సుకు తోస్తేది. ముసలతని కుటుంబంలో శ్రద్ధగా చూసి నేర్చుకోవలసింది యేదో వుంది.

ఆ సాయంత్రం టీ తాగేటప్పుడు యేదో వ్యవహార విషయాలు మాట్లాడేందుకు వచ్చిన యిద్దరు జమీందార్ల సమక్షంలో ప్రసంగ విషయం లేవిన్ ఆశించినదానితోనే మొదలైంది.

బల్ల దగ్గర లేవిన్ యింటి యిల్లాలి పక్కన కూర్చున్నాడు. అతని కెదురుగా కూర్చున్న ఆమె చెల్లెలితోనూ అతను మాట్లాడుతాడని అనుకున్నారు. యిల్లాలు పొట్టి. ఆమెది గుండ్రటి మొహం, బంగారు రంగు జుట్టు, చిరునవ్వుతో తొణికి సలాడు తుంది. నవ్వినప్పుడు బుగ్గలు సొట్టలు పడుతున్నాయి. తన పాలిట చిక్కు ప్రశ్నగా తయారైన ఆమె భర్త నిగూఢత్వాన్ని ఆమె భేదిస్తుందని లేవిన్ ప్రయత్నించేడు. కాని యేదో యిబ్బంది పడుతున్నట్టు అనిపించి సునాయాసంగా ఆలోచన చెయ్యలేకపోయాడు. అతనికి నతమత మవుతున్నట్టు అనిపించడానికి కారణం స్వియాజ్‌స్కీ మరదలు ప్రత్యేకమైన ఫ్రాక్ వేసుకొని అతని ముందు కూర్చోవడం. అలా వేసుకోవడం తన కోసమేనని అతను

భావించుకున్నాడు. ఆ ఫ్రాక్ ఆమె తెల్లటి ఛాతీమీద సమలంబ చతుర్భుజ కత్తిరింపుతో వుంది. ఛాతీ చాలా తెల్లగా వుండడం సంగతి యెలా వున్నా, లేదా తెల్లగా వుండడం వల్లనే నేమో, యీ సమలంబ చతుర్భుజ ఫ్రాక్‌వల్ల లేవిన్‌కి ఆలోచనలు సునాయాసంగా లేకుండా యిబ్బంది కలిగింది. తనని దృష్టిలో వుంచుకునే ఫ్రాక్ మెడ అలా కత్తిరించడం జరిగిందని, పొరపాటుగానే కావచ్చు, అతను భావించుకున్నాడు. అందుకని అటు చూడ్డం ఉచితం కాదని అనుకున్నాడు. అటు చూడకుండా వుండాలని ప్రయత్నించేడు. ఫ్రాక్‌ని అలా కత్తిరించి కుట్టడానికి దోషం తనదేనని అతనికి అనిపించింది. తను యెవర్నో మోసం చేస్తున్నానని, వాళ్లకి దేన్నో స్పష్టంగా వివరించాలనీ కాని అలా స్పష్టం చెయ్యడం యే రకంగానూ వీలు కావడం లేదనీ అతనికి అనిపించింది. అందుకని అతను సిగ్గుపడిపోయాడు, అస్థిమితంగా వున్నాడు. అతను అస్థిమితంగా వుండటం స్వియాజ్‌స్కీ ముచ్చటైన మరదలుమీద ప్రభావం కలిగించింది. కాని యిల్లాలు మాత్రం దాన్ని గమనించనట్టే నటించి చెల్లెల్ని మాటల్లోకి దింపాలని ప్రయత్నించింది.

"అయితే మీరంటారు" అని ఆమె అంతకు ముందే మొదలైన సంభాషణని ముందుకి తోస్తూ మొదలుపెట్టింది, "మా ఆయనకి రష్యన్ వస్తువులంటే సరదా వుండదని. దానికి విరుద్ధం, విదేశాల్లో వున్నప్పుడు ఆయన సంతోషంగానే వుంటారు గాని యింటి దగ్గరున్నంత సంతోషంగా యెప్పుడూ వుండరు. ఇక్కడ తన నైజం కనిపిస్తూ వుంటుంది. చేతి నిండా పని వుంటుంది. అన్ని విషయాల పట్లా ఆసక్తి వుంటుంది. అవును, మీరు మా బడి చూశారా?"

"ఆఁ... ఆ లతలు అల్లుకున్న యిల్లే కదూ?"

"ఆఁ, అది నాస్త్యా పని" అంది చెల్లెలి కేసి తిరిగి.

"మీరే అక్కడ చదువు చెప్తున్నారా?" అని లేవిన్ అడిగేడు. ఫ్రాక్ మెడ కత్తిరింపు తప్పించుకుని చూడాలని ప్రయత్నించేడు. కాని అటు వేపు చూపు మళ్లితే మెడ తప్పకుండా కనిపిస్తూనే వుంది.

"ఆఁ, నేనే పాఠాలు చెప్పేదాన్ని, యింకా చెప్తున్నాను గాని మంచి పంతులమ్మ వచ్చింది. మేం శరీర వ్యాయామం కూడా నేర్పడం మొదలుపెట్టాం."

"వద్దు, చాలండి, యింక టీ వద్దు" అన్నాడు లేవిన్. తనకి మర్యాదగా వుండదే మోనని అనుకుంటూనే, సంభాషణని యిలా కొనసాగించలేక సిగ్గుతో యెర్రబడుతూ లేచి నుంచున్నాడు. "వాళ్లు మంచి ఆసక్తికరమైన విషయం చర్చిస్తూ వున్నట్టున్నారు" అని అంటూ అతను బల్ల అటు వేపు వెళ్లాడు. అక్కడ స్వియాజ్‌స్కీ, యిద్దరు జమీందార్లూ కూర్చున్నారు. స్వియాజ్‌స్కీ మేజాకి పక్కవాటుగా కూర్చున్నాడు. ఓ చేత్తో కప్పు పట్టుకుని ఆడుకుంటున్నాడు. రెండో చేత్తో గడ్డం పట్టుకుని, మెలి తిప్పుకుంటూ, వాసన చూస్తున్నట్టుగా ముక్కు దగ్గర పెట్టుకుని మళ్లీ కిందికి జారవిడుస్తున్నాడు. మిలమిల మెరిసే

అతని నల్లని కళ్లు కోపంతో బుస్సుమంటూ వున్న నెరిసిన మీసాలాయనమీద లగ్నం అయి వున్నాయి. ఆ జమీందారుగారు మాట్లాడే విషయం అతనికి సరదాగా వున్నట్లు కనిపిస్తోంది. జమీందారుగారు రైతుల గురించి పితూరిచేస్తూ మాట్లాడుతున్నాడు. ఆయన మాటలకి స్వియాజ్‌స్కీ దగ్గర జవాబు సిద్ధంగా వుందని లేవిన్‌కి తెలుసు. అది వెంటనే ఆయన నోరు కట్టించేస్తుంది. కాని తను జవాబు చెప్పడం బాగోదని అతను జవాబు చెప్ప లేకుండా వున్నాడు. ఖుషీగానే జమీందారుగారి మాటలు వింటూ కూర్చున్నాడు.

నెరిసిన మీసాలాయన భూస్వామ్య దాస్య వ్యవస్థని బలపరిచే మనిషన్న విషయం తెలుస్తూనే వుంది. ఆయన తన జీవితమంతా పల్లెలోనే బతికేడు, వ్యవసాయానికి అర్పితమైపోయాడు. లేవిన్‌కి యీ లక్షణాలు అతని వేషధారణలో కనిపించేయి. ఆయన పాత కాలపు చమ్కా కోటు తొడుక్కున్నాడు, అది ఆయన మామూలు వేషం కాదని తెలుస్తూనే వుంది. ముడుచుకున్న కనుబొమలతో తెలివితేటలు కనిపించే కళ్లు, ఆడంబరంగా వుండే రష్యన్ భాష, యెప్పుడూ అదే ధోరణిలో మాట్లాడుతూ వుండడం వల్ల అబ్బిన అధికారిక స్వరం, మాట్లాడే విషయాన్ని తేలేసి చెపుతున్నట్టుగా యెండకి కమిలిన అందమైన పెద్ద చేతుల్ని విసరడం, నో చేతి అనామికకి వున్న పాత కాలపు పెళ్లి ఉంగరం లాంటివన్నీ ఆ లక్షణాలని ద్యోతకం చేశాయి.

27

"అమర్చినదాన్ని విడిచిపెట్టడం బాధ కలిగించకుండా వున్నట్లయితే... యెంత శ్రమించాం... చేతులు జాడించుకుని అమ్మేసి చక్కాపోతాను స్వియాజ్‌స్కీ లాగా... 'సుందరి హెలెన్'* పాట వింటూ..." అన్నాడా జమీందారు. తెలివితేటలు ఉట్టిపడే ఆయన వృద్ధ వదనంమీద చిరునవ్వు వెలిగింది.

"కాని వదిలిపెట్టడం లేదుగా, అంటే యేదో కారణం వుందన్నమాట" అన్నాడు స్వియాజ్‌స్కీ.

"కారణం యేముందీ! నా యింట్లో నేను వుంటున్నాను, యిదేం కొన్నదీ, అద్దెకి తీసుకున్నదీ కాదు. పైగా రైతుంకి తెలివి రాదా అని ఆశ పోకటుంది కదా. వొప్పుకోండి, మానండి యిప్పుడున్న స్థితి తాగుబోతు బటాచోర్ వ్యవహారం, అం. భూమిని ఖండ ఖండాలు చేసెయ్యడమూ నో ఆవు గాని, గుఱ్ఱం గాని లేకపోవడం రైతులు ఆకలితో మాడుతూవున్నా. వాళ్లని పనిలో పెట్టుకోండి! — అన్నిట్నీ తగలేసి నిప్పెట్టేస్తారు! పైపెచ్చు మిమ్మల్ని పంచాయితీకి లాగుతారు."

"కాని పంచాయితీకి మీరే ఫిర్యాదు చెయ్యొచ్చుకదా" అన్నాడు స్వియాజ్‌స్కీ.

"నేనా! ఫిర్యాదులు చెయ్యడమా? ఎట్టి పరిస్థితులలోనూ వద్దు బాబోయ్! ఫిర్యాదు

మాట యెత్తడమే సంకటం. గుర్రాలక్షేత్రంలో యేమైంది? కూలి డబ్బులు దండుకున్నారు, చక్కాపోయారు. మునసబు యేం చేసాడు? వాళ్లని విడుదల చేసి పారేశాడు. వోలోస్త్ కోర్టు వల్లా, గ్రామపెద్ద వల్లా యిలా యింకా నడుస్తోంది. అతను పాత రోజుల్లోలాగ మంచిమాట చేస్తున్నాడు. అదే లేకపోయినట్లయితే అన్నిట్నీ వదులుకుని యెక్కడికేనా పారిపోవడమే యిక."

ఆయన స్వియాజ్‌స్కీకి పురి పెడుతున్నాడని తెలుస్తూనే వుంది. కాని స్వియాజ్‌స్కీకి కోపం రావడం లేదు సరి కదా, యిది అతనికి సరదాగా వున్నట్టే వుంది.

"అలాంటి చర్యలు యేమీ లేకుండానే మేము మా వ్యవసాయం జరిపిస్తున్నాం" అని చిరునవ్వు నవ్వుతూ అన్నాడు. "లేవినూ, నేనూ, అయనా."

స్వియాజ్‌స్కీ రెండో జమీందారు కేసి చూపించాడు.

"ఆఁ, మిఖయీల్ పెత్రోవిచ్ వ్యవసాయం చేయిస్తూనే వున్నాడు, యెలాగో యేమిటో మరి అడగండి. దాన్నేమన్నా రేషనల్ వ్యవసాయమేనంటారా?" అని ఆ జమీందారుగారు ముదలకించేడు. 'రేషనల్' అనే కొత్త మాట ఆయనకి గొప్పగా కనిపించినట్టే వుంది.

"నేను వ్యవసాయాన్ని సీదాసాదాగా నడిపిస్తాను, దేవుడి దయవల్ల. నా పద్ధతి యేమంటే ఆకురాలు కాలంలో రైతుల పన్నులకి సొమ్ము తయారుగా వుంచుతాం. రైతులు నా దగ్గరికి వచ్చి 'అయ్యా, సాయం చెయ్యండ'ని అడుగుతారు. వాళ్ళు మనవాళ్లే కదా, మన యిరుగు పొరుగు వాళ్ళు. వాళ్లంటే జాలి పుట్టకుండా వుంటుందా? అంచేత వాళ్ల పన్నుల్లో మూడో వంతు ముందుగానే యిచ్చి 'ఒరే బాబులూ, మీకు నేను సాయం చేస్తున్నానుస్మీ, గుర్తుంచుకోండి నా కవసరం పడినప్పుడు మీరు వచ్చి ధాన్యం విత్తడానికి, గడ్డి కోతకి, పంట కోతకి నాకు సాయం చెయ్యాలి? యీ రకంగా ప్రతి కుటుంబం చెయ్యాల్సిన పని గురించి వాళ్లతో మాట్లాడి తేల్చడమే. వాళ్లల్లో సరే, బటాచోర్లు వుంటారనుకోండి అదే వేరే విషయం."

ఈ పురాతన పితృస్వామిక వ్యవస్థ లేవిన్‌కి బాగా పరిచితమే. అతను స్వియాజ్‌స్కీ కేసి చూసి, మిఖయీల్ పెత్రోవిచ్ మాటకి అడ్డం వెళ్లి, నెరిసిన మీసాలాయన్ని ఉద్దేశించి మాట్లాడేడు.

"మీ అభిప్రాయం యేమిటి? వ్యవసాయం యెలా సాగించాలని మీరనుకుంటున్నారు?" అని అడిగేడు.

"మిఖయీల్ పెత్రోవిచ్ లాగానే. అర్ధ ఫలసాయం యిచ్చేటట్టో లేదా కౌలుకో రైతులకి భూమిని యిచ్చెయ్యడమే. అలా చెయ్యచ్చు గాని దేశసంపద తగులడుతుంది. భూస్వామ్య దాస పద్ధతి వున్నప్పుడు, వ్యవసాయం యేర్పాట్లు బాగా చేసుకుని నేను తొమ్మిది వంతులు ఫలసాయం పొందితే, యీ ఫలసాయం పంపకం పద్ధతిలో మూడు వంతులు మాత్రమే యివ్వడు వస్తుంది. భూస్వామ్యదాసుల విమోచనం రష్యాని నాశనం చేసి పారేసింది."

స్వియాజ్‌స్కీ హాసపూరితమైన కళ్ళతో లేవిన్ కేసి చూశాడు. తనకి సరదాగా వుందని తెలియచేసే సూచన కూడా చేశాడు. కాని జమీందారుగారు చెప్పేదాంట్లో లేవిన్‌కి వేళాకోళంగా వుండేదేం కనిపించలేదు. స్వియాజ్‌స్కీ కంటే అతనికి ఆయనే బాగా అర్థం అయేడు. విమోచన రష్యాకి యెందువల్ల వినాశకరం అయిందీ అని ఆయన వివరించే దాంట్లో చాలా భాగం లేవిన్‌కి సబబుగానే కనిపించింది. లేవిన్‌కి కొత్తవి అనిపించే వాదనలని ఆయన ముందు పెట్టాడు. అవి తిరుగులేనివిగా లేవిన్‌కి కనిపించాయి. జమీందారుగారు తన ఆలోచనలనే వివరిస్తున్నారని తెలుస్తూనే వుంది. అలాంటిది అరుదుగా కనిపించే సుగుణం. ఆయన అభిప్రాయాలు యేదో ఉబుసుపోకకి ఆలోచనలు చేసేవాడి వూహాలు కావు. తను బతుకుతూ వున్న జీవన పరిస్థితులనుంచి పుట్టినవి. వాటిని గురించి ఆయన తన పల్లెటూరి యేకాంత జీవితంలో యోచన చేసుకున్నాడు. వాటిని గురించి అన్ని వేపులనుంచీ తర్కించుకున్నాడు.

"అన్ని రకాల ప్రగతి చర్యలని అధికారంలో వున్నవాళ్ళే ప్రవేశపెడతారు" అని ఆయన తను విద్యావంతుణ్ణే అని చూపించుకోవడానికి ఆతృత పడుతున్నట్టు అన్నాడు. "పీటర్ ది గ్రేట్, కాథరిన్ రాణీ, అలెగ్జాండర్ చక్రవర్తి చేసిన సంస్కరణలు తీసుకోండి. లేకపోతే యూరపియన్ చరిత్రని తీసుకోండి. ముఖ్యంగా వ్యావసాయిక పురోగతి విషయంలో యిది మరీ నిజం. వెధవ బంగాళదుంప సంగతే చూడండి! దాన్ని కూడా జబర్దస్తీగా ప్రవేశపెట్టాల్సి వచ్చింది. యిక కొయ్యనాగళ్ళతో ఎప్పుడూ భూమి దున్నేవాళ్ళు కాదు. వాటిని కూడా బహుశా మధ్యయుగాల్లో బలవంతంగా ప్రవేశపెట్టించి వుంటారు. భూస్వామ్య దాస్య వ్యవస్థని రద్దు చేయక పూర్వం జమీందార్లం ఆధునిక వ్యావసాయిక పద్ధతుల్ని ప్రవేశపెట్టాం. ఆరబెట్టే యంత్రాలు, తూర్పారబట్టే యంత్రాలు ఉపయోగించడం, పొలాలకి యెరువులు వెయ్యడం, అన్ని రకాల కొత్త యంత్రాలని తేవడం లాంటివన్నీ, ఆ పన్ను చేసే అధికారం వుండబట్టే అన్నీ చేశాం. మొదట్లో రైతులు అడ్డగించేరు, తర్వాత వాళ్ళూ మా దార్లోనే వచ్చేరు. ఇప్పుడు భూస్వామ్య దాస వ్యవస్థ రద్దవడంతో మా అధికారాన్ని హరించేసి నట్టయింది. ఆధునిక ఉన్నత స్థాయికి మేం తీసుకెళ్ళిన వ్యవసాయం మళ్ళీ ఆదిమ అనాగరిక దశకి జారిపోతుంది. నాకలా అనిపిస్తోంది" అన్నాడు.

"యెందుకని? మీకది రేషనల్ పద్ధతి అని తోస్తే కూలీలని పెట్టుకుని మీరు కొనసాగించవచ్చు" అన్నాడు స్వియాజ్‌స్కీ.

"అధికారం లేదు, బాబూ, యెవళ్ల మద్దతుతో సాగించమంటారు చెప్పండి."

'అదగ్గదీ' అనుకున్నాడు లేవిన్. 'శ్రమ — నిర్వహణలో ముఖ్య అంశం.'

"కూలీల మద్దతుతో" అన్నాడు స్వియాజ్‌స్కీ.

"మన కూలీలకి పని పడదు, ఆధునిక పరికరాలు పడవు. వాళ్ళకి కావల్సిందల్లా వొక్కటే — పీకల మొయ్యా తాగడం, వాళ్ల చేతులలో పడిందాన్ని తగలెయ్యడం. గుర్రాలకి మూర్ఖత్వంగా నీళ్లు పోసి చంపేస్తారు. మంచి ముస్తీబుని విరగ్గొట్టేస్తారు. బండి చక్రాల

పైర్లని పూడపీకి అమ్మేస్తారు. ఆ వచ్చిన డబ్బుతో వోద్కా తాగేస్తారు. మార్పుడు యంత్రాల్లోకి బోల్టులు వదిపి విరగ్గొట్టేస్తారు. తమ పద్ధతి తప్ప యే పద్ధతీ వాళ్ళు భరించరు. అందుకనే వ్యవసాయం తీసికట్టయిపోతుంది. పొలాన్ని పట్టించుకోరు – కలుపు మొక్కలు పెరిగిపోయి వుంటాయి. ఆ వున్న చెక్కని ఖండ ఖండాలుగా పంచేసుకుంటారు. ఒకప్పుడు పుట్లకొద్దీ పండే పొలం యిప్పుడు భూముంకి పడిపోయింది. దేశం మొత్తం ఆదాయం తగ్గిపోయింది. యిప్పుడు తీసుకున్న యీ చర్యలనే కొంచెం ముందు చూపుతో చేసినట్టయితే..."

అక్కణ్ణుంచి ఆయన విమోచనకి సంబంధించి తన యోచనని వివరించేడు. దాని ప్రకారం వెడితే యీ చెడుగులు వుండేవి కాదు.

లేవిన్‌కి యిందులో ఆసక్తి కలగలేదు. ఆయన ముగించగానే అతను స్వియాజ్‌స్కీ కేసి తిరిగి సమస్యకి సంబంధించిన మొదటి విషయంలో అతని అసలు అభిప్రాయం యేమిటో రాబట్ట ప్రయత్నించేడు.

"వ్యవసాయం దిగనాసిల్లి పోతున్న మాట నిజం. పనివాళ్లతో మన సంబంధాలు వ్యవసాయాన్ని రేషనల్ దారిలో, ప్రయోజనకరంగా పెడతాయన్నది అసంభవం" అన్నాడు.

"నే వొప్పుకోను" అని స్వియాజ్‌స్కీ గంభీరంగా అభ్యంతరం చెప్పేడు. "నా అభిప్రాయం యేమంటే మనకి వ్యవసాయాన్ని అజమాయిషీ చెయ్యడం తెలీదని. భూస్వామ్యదాన వ్యవస్థలో మన అజమాయిషీ హెచ్చు స్థాయిలో వుండేది కానే కాదు, చాలా తగ్గు స్థాయిలో వుండేది. మనకి మంచి యంత్రాలా లేవు. సరైన గుర్రాలా లేవు, మంచి నిర్వహణ పద్ధతులా తెలీవు, జమా ఖర్చుల పద్దులా మనం యెరగం. ఏ జమీందార్నైనా తీసుకోండి. యేది తనకి లాభదాయకమో, నష్టదాయకమో చెప్పలేడు."

"ఇటాలియన్ పద్ధతి జమాఖర్చులు" అన్నాడు నెరిసిన మీసాలాయన వెటకారంగా. "అన్నీ తగలెట్టేస్తూ వుంటే యే జమా ఖర్చులూ పనికి రావు" అన్నాడు.

"యెందుకు తగలెడతారు అన్నిట్నీని? గుర్రాలు లాగే పనికి మాలిన రష్యన్ యంత్రాల్ని పాడుచేస్తారు గాని నా ఆవిరి మార్పిడి యంత్రాన్ని యెవరూ పాడు చెయ్యరు. మీ పాత పల్లెటూరి ముసలి గుర్రాల్లాంటి వాటిని – దాని పేరేదో వుంది కదూ? – మెలిపెట్టే జాతిని, తోక మెలిపెట్టి పని చేయించాలే వాటిని, వాటిని తగలెయ్యొచ్చు. కాని పెర్షెరాన్ జాతి గుర్రాల్ని లేదా కనీసం మంచి బండి లాగే మోట గుర్రం జాతికి తిండి యెవర్నూ తగలెయ్యరు. అన్నిటితోనూ అంతే. మనం మెరుగు పర్చుకోవాల్సింది మన నిర్వహణ పద్ధతి" అన్నాడు.

"అందుకు తగ్గ తాహతు అంతా యెక్కడిదండీ! మాటలు అనడానికేం, యిప్పుడు మా అబ్బాయి వొకడు యూనివర్సిటీలో చదువుతున్నాడు. మిగతా పిల్లలు బళ్ళో వున్నారు. యెక్కణ్ణుంచి తెచ్చుకొనమంటారు పెర్షెరాన్ గుర్రాల్ని?"

"మరి బేంకులున్న దెందుకంటారు?"

"యీ వున్న దాన్ని కాస్తా వేలం పాట పాలు చెయ్యమంటారా? మీకో దణ్ణం."

"వ్యవసాయ స్థాయిని పెంచి తీరాలనీ, పెంచాలనీ అనే దాంతో యేకీభవించలేను" అన్నాడు లేవిన్. "నేను ప్రయత్నించేను, అందుకు తాహతు నాకూ వుంది. కాని యేమీ సాధించలేక పోయాను. బేంకులు యేం లాభదాయకమో నాకు తెలీదు. నా మట్టుకి నాకు వ్యవసాయం పనిలో పెట్టిన దంతా కృష్ణార్పణం అయిపోయింది — యంత్రాలు, పశువులు అన్నీ నష్టమే" అన్నాడు.

"ఇదీ ముమ్మాటికీ నిజం" అని మీసాలాయన తృప్తిగా వత్తాసు యిచ్చేడు.

"పైగా అలా వున్నది నేనొకణ్ణే కాదు. రేషనల్‌గా వ్యవసాయం నడిపించే ప్రయత్నం చేసే భూస్వాములందరి మాటా చెప్తున్నాను. నూటికీ కోటికీ వొకళ్ళా అరా తప్ప అంతా నష్టపోతూనే ఉన్నారు. మీరే చెప్పండి మీ వ్యవసాయం లాభంగా సాగుతోందా?" అని లేవిన్ అడిగేడు. అప్పుడు స్వియాజ్‌స్కీ చూపులో క్షణికమైన భయం గోచరమైంది. స్వియాజ్‌స్కీ అంతరంగం లోపలికి ప్రవేశించాలని తను ప్రయత్నం చేసినప్పుడల్లా గోచరమయే మెరుపు అది.

లేవిన్ అలాంటి ప్రశ్న వెయ్యడం ధర్మంగా లేదు. ఇంటావిడ అంతకు ముందు కొంచెం సేపటి కితం టీ త్రాగేటప్పుడు అతనికి చెప్పింది. వాళ్లాయన వో జర్మన్ అకౌంటెంట్‌ని పిలిపించాడనీ, అయిదు వందల రూబుళ్ల పారితోషికం యిచ్చాడనీ, అతను తమ ఆర్థిక పరిస్థితిని పద్దులు రాసి వ్యవసాయం సాలుకి మూడు వేలో అంతకు కొంచెం పైబడో నష్టంతో సాగుతోందని తేల్చాడనీ చెప్పింది. కచ్చితంగా యెంతో ఆమెకి గుర్తులేదట గాని జర్మన్ అకౌంటెంట్ కోపెక్కుతో సహా లెక్కవేసాడని చెప్పింది.

నెరిసిన మీసాల జమీందారు స్వియాజ్‌స్కీ వ్యవసాయం లాభసాటిగా సాగుతోందన్న చర్చ చూసి ముసి ముసి నవ్వులు నవ్వుకున్నాడు. తన పొరుగున వున్న మార్షల్‌గారు యేం లాభాలు గూబల్లో దింపుకుంటున్నాడో ఆయనకి తెలీదు కనకనా.

"నాకు లాభం రాకపోవచ్చు. దానివల్ల నేను మంచి దక్షుడైన యజమానిని కానని తేలుతుంది, లేదా నా ఇస్తు పెంచుకోవడానికి మదుపు పెట్టానని" అన్నాడు స్వియాజ్‌స్కీ.

"అబ్బ ఇస్తు" అని లేవిన్ పెద్ద చరుపు తగిలినట్టు గట్టిగా చించుకున్నాడు. "యూరప్‌లో భూమిమీద పెట్టిన శ్రమవల్ల అది మెరుగుపడి వ్యవసాయంలో ఇస్తు రావచ్చు వాళ్లకి. కాని మన దగ్గర శ్రమ పడే కొద్దీ అధ్వాన్నం అవుతుంది. చావ దున్నేయడం, అంతే. దాన్నుంచి శిస్తేం రాదు" అన్నాడు.

"ఇస్తు యెందుకు రాదు? అది అర్థశాస్త్ర నియమం."

"అయితే మనం ఆ నియమానికి బయట వున్నాం. ఇస్తు అనే దానివల్ల మనకు యేమీ

స్పష్టం అవదు. పై పెచ్చు మన బుర్రలు కంపు అవుతాయి అంతే. మరేం అను కోకపోతే చెప్పండి. ఇస్తు యే సిద్ధాంత రీత్యా..."

"పెరుగు తాగుతారా? ఆ పెరుగు యిలా అందించు మాషా లేకపోతే రాస్ప్బెర్రీలంటేనా సరే" అని స్వియాజ్స్కీ భార్యని అడిగేడు. "యీ యేడాది రాస్ప్బెర్రీలు యింకా వస్తూనే ఉన్నాయి" అన్నాడు.

సంభాషణ ముగిసిందనే అనుకుని స్వియాజ్స్కీ మంచి హుషారుగా లేచి వెళ్ళిపోయాడు, లేవిన్‌కి సంభాషణ అప్పుడే మొదలైందని అనిపిస్తే.

వాదించడానికి మనిషి లేకపోయినా లేవిన్ నెరిసిన మీసాల జమీందారుగారితో చర్చ కొనసాగించేడు. అసలు చిక్కు అల్లా పనివాళ్ల అలవాట్లనీ ధోరణులనీ గురించి స్పక్రమంగా పరిశీలించక పోవడం మంచే వచ్చిందని రుజువు చెయ్య ప్రయత్నించేడు. కాని తను సొంత పద్ధతిలో యేకాంతంగా ఆలోచించడానికి అలవాటు పడ్డ వాళ్లందరికి లాగా ఆ జమీందారు గారికి యితరుల అభిప్రాయాలని అర్థం చేసుకోవడం కష్టం అనిపించింది. తన ఆలో చనా పరిధిపట్ల పక్షపాతంతో వుండిపోయాడు. రష్యన్ రైతు పశువు అనీ, పశువులాగానే ప్రవర్తించడం అతనికి యిష్టమనీ, అతని పశుత్వాన్ని వదిలించడానికి కఠిన చట్టం అవసరమనీ, అలాంటిది యిప్పుడు లేదనీ ఆయన నొక్కి చెప్పేడు. గట్టి బడితె అవసరం, కాని మనం చాలా ఉదారులమై పోయాం, శతాబ్దాల నాటి బడితెని అవతల పారేసి వకీళ్లనీ జైళ్లనీ దాని స్థానంలో పెట్టాం. యీ జైళ్లల్లో మురికి కంపు కొట్టే రైతులకి మంచి సూప్‌ని తినిపిస్తూ యిన్ని ఘనపుటడుగుల జాగాని కేటాయించారు అన్నాడు.

"కాని యెందుకు అనుకోరు..." అని సమర్థవంతంగా పనిచేసేటట్టు పనివాడికి బుద్ధి పుట్టించే సంబంధాలని కనిపెట్టడం సాధ్యమేనని మౌలిక సమస్య కేసి లేవిన్ మళ్లేడు.

"రష్యన్ రైతుల విషయంలో అలాంటిది యెన్నటికీ సాధ్యం కాదు. బలమైన చట్టం లేదు" అని నెరిసిన మీసాలాయన జవాబు చెప్పేడు.

"కొత్త పరిస్థితులు యెలా వుడతాయి?" అని స్వియాజ్స్కీ అడిగేడు. అతను పెరుగు తిని, సిగరెట్ కాల్చి మళ్లీ చర్చించుకునే వాళ్ల దగ్గరికి వచ్చేడు. "శ్రమ శక్తికి సంబంధాల గురించి చెప్పగల వాటి నన్నిట్నీ చెప్పెయ్యడం జరిగింది, వాటిని గురించి అధ్యయనం చెయ్యడం జరిగిపోయింది. బర్బరత్వపు అవశేషం — అందరి పట్లా బాధ్యత వహించే ఆదిమ కాలం నుంచీ వున్న రైతు కమ్యూన్* దానంతట అదే అంతం అయిపోతోంది. భూస్వామ్య దాస వ్యవస్థ సమాప్తం అయిది. యిక స్వతంత్ర శ్రమ మిగిలింది. దీని రూపాలు నిశ్చితంగానే వున్నాయి, వాటిని స్వీకరించాలి. వ్యవసాయ కార్మికులు, రోజువారీ కార్మికులు, మధ్యతరగతి రైతులు[1] — యీ పరిధి దాటి పోలేరు" అన్నాడు.

---

[1] లేవిన్ వచ్చేటప్పుడు దారిలో కలుసుకున్న ముసలి రైతు లాంటి వాళ్ళు — అను.

"కాని యూరప్ యీ రూపాలతో తృప్తిపడడం లేదు."

"తృప్తిపడడం లేదు, అన్వేషిస్తున్నారు. తప్పకుండా కొత్త రూపాలని కనిపెడతారు."

"అదే సరిగ్గా నేను చెప్తున్నదీ! వాటి కోసం మనమే యెందుకు వెతకకూడదు?" అన్నాడు లేవిన్.

"యెందుకంటే రైల్వే నిర్మాణ పద్ధతుల్ని మళ్లీ ఆవిష్కరించుకోవడం లాగా వుంటుంది యిది. ఆ పద్ధతుల గురించి ఆలోచించడమూ జరిగింది, అవి మన ముందు తయారుగానూ వున్నాయి."

"కాని అవి మనకి సరిపడక పోతే? అవి తెలివి తక్కువవి అయితే?" అని లేవిన్ అడిగేడు.

అతనికి మళ్లీ స్వియాజ్‌స్కీ కళ్లల్లో భయం కనిపించింది.

"ఆఁ, మనం అన్నీ తుగ్గ బాంతో పట్టేస్తాం! యూరప్ దేని కోసం వెతుకుతుందో దాన్ని మనం యిప్పటికే ఆవిష్కరించాం. నాకదంతా తెలుసు. కాని వొకటి అడుగుతాను యేమను కోకండి. శ్రామిక సంఘటనం విషయంలో యూరప్‌లో జరిగిన దంతా మీకు తెలుసా?"

"లేదు, చాం తక్కువ."

"యూరప్‌లో వున్న గట్టి బుర్రలన్నీ యీ ప్రశ్నతోనే సతమతమవుతున్నాయి. షుల్జె – డెలిచ్ ప్రణాళిక*... శ్రామికుల సమస్యకి సంబంధించిన సాహిత్యం, అన్నిటి కంటే యెక్కువగా ఉదారమైన లాస్సాల్ వైఖరి*, మిల్హాజెన్ వ్యవస్థ*... ఇది యిప్పటికే వాస్తవం. మీకు తెలుసనుకుంటాను."

"కొంచెం తెలుసు, కాని చాలా అస్పష్టంగా."

"మీరు వినయానికి అలా అంటున్నారు. నాకు తెలిసిన దాని కంటే తక్కువ కాదు అనుకుంటాను. నేను సామాజిక శాస్త్రాల ప్రొఫెసర్ని కాననుకోండి. కాని యీ విషయాలంటే నాకు ఆసక్తి. మీకు నిజంగా దీని పట్ల అభిరుచి వున్నట్లయితే దీన్ని అధ్యయనం చెయ్యండి."

"కాని వాళ్లు దేన్ని సాధించారు?"

"క్షమించండి..."

జమీందార్లు వెళ్లిపోవడానికి లేచారు. స్వియాజ్‌స్కీ వాళ్లకి వీడ్కోలు చెప్పడానికి వాళ్లతో కూడ వెళ్లాడు. స్వియాజ్‌స్కీ మనసు లోపలి కక్ష్యల్లోకి ప్రవేశించాలన్న లేవిన్ చెడ్డ అలవాటుకి మరోసారి అడ్డుపడింది.

28

లేవిన్‌కి ఆ మహిళలతో ఆ సాయంత్రం చెడ్డ విసుగ్గా గడిచింది. అంతకు ముందెన్నడూ లేనంతగా వొక ఆలోచన అతన్ని కలవర పెట్టేంది. వ్యవసాయం యేర్పాట్ల పట్ల

తనకి కలిగిన అసంతృప్తి కేవలం తనకి మాత్రమే కలిగిన అసంతృప్తి కాదు. యానత్ రష్యా లోనూ వ్యాప్తమై వున్న వొక సామాన్య పరిస్థితి ఫలితంగా వచ్చినటువంటిది. తను వచ్చే టప్పుడు దారిలో ఆగి చూసిన రైతు దగ్గర పనివాళ్ళ చేసినట్టుగా వ్యవసాయ కార్మికుం చేత పని చేయించడం వొట్టి కల కాదు, గట్టిగా ఆలోచించి పరిష్కరించవలసిన సమస్య. దీనికి పరిష్కారం కనిపెట్టవచ్చని లేవిన్‌కి అనిపించింది. తను ఆ ప్రయత్నం చెయ్యాలని అనుకున్నాడు.

ఆ మర్నాడు గుర్రాలమీద ఆ మహిళలతో కలిసి దగ్గర్లో వున్న ప్రభుత్వ అడివిలోని గుహని చూడ్డానికి వెళ్లేందుకు గాను తను వుంటానని చెప్పి వాళ్ల దగ్గర ఆ రాత్రికి సెలవు తీసుకున్నాడు లేవిన్. నిద్రపోవడానికి ముందు వ్యవసాయ కార్మికుల సమస్యకి సంబంధించిన పుస్తకాలని తీసుకుందామని స్వియాజ్‌స్కీ చదువుకునే గదికి వెళ్లాడు. వాటిని స్వియాజ్‌స్కీ అతనికి చదువుకోడానికి యిస్తానని అన్నాడు. స్వియాజ్‌స్కీ చదువుకునే గది చాలా పెద్దది. అన్ని వేపులా పుస్తకాలు నిండిపోయిన బీరువాలున్నాయి. రెండు మేజాలు వున్నాయి. ఒకటి పెద్ద రాత మేజా, గది మధ్యలో వుంది. రెండవది గుండ్రటి మేజా. దాని మీద కొత్త విదేశీ వార్తాపత్రికలూ, వార పత్రికలూ మాస పత్రికలూ ఉన్నాయి. అవి మధ్యలో వున్న దీపకాంతిలో చుట్టూతా వున్నాయి. రాత మేజా పక్కన బంగారు పూత అక్షరాల లేబిల్స్ వున్న స్టేండ్ వొకటుంది. అక్కడ నానా రకాల ఫైల్స్ వుంటాయి.

స్వియాజ్‌స్కీ పుస్తకాలు తీసుకొని వూగులాడే పడక కుర్చీలో కూర్చున్నాడు.

"లేవి కోసం చూస్తున్నారు?" అని లేవిన్‌ని అడిగేడు. లేవిన్ పత్రికల్ని చూడ్డం కోసమని గుండ్రటి మేజా దగ్గర ఆగేడు.

"ఆఁ, అందులో మంచి వ్యాసం వొకటుంది" అన్నాడు, లేవిన్ తిరగేస్తున్న పత్రికను చూసి. "పోలండ్ విభజనలో అసలు బాధ్యుడు ఫ్రెడరిక్ కాద*న్నట్టే కనిపిస్తుంది" అని మంచి ఉత్సాహంతో అన్నాడు.

చాల ఆసక్తికరమైన ముఖ్యమైన అప్పుడే వెలికి వచ్చిన కొత్త విషయాలని తనదైన విస్పష్ట స్పష్టతతో వివరించడం మొదలుపెట్టాడు. లేవిన్ మనస్సులో ఆ క్షణంలో వ్యవ సాయిక సమస్యలే నిండి వున్నా అతను తన మిత్రుడు చెప్పేది వింటూ తనలో తను అను కున్నాడు. 'యీ మనిషి మనస్సులో యేముంది? పోలండ్ విభజన విషయంలో కడకి యితనికి యేమిటా ఆసక్తి?' అనుకున్నాడు. స్వియాజ్‌స్కీ పూర్తి చెయ్యగానే "వూ అయితే యేమైంది" అని లేవిన్ జబర్దస్తీగా అడిగేడు. కాని యేమీ అనలేదు. "ఇలా కనిపిస్తుంది" అనే ఆ మాటే ఆసక్తికరంగా వుంది. కాని ఆ విషయం తనకి యెందుకు ఆసక్తికరంగా వుందో స్వియాజ్‌స్కీ స్పష్టం చెయ్యలేదు. చెప్పే అవసరమూ అతనికి అనిపించలేదు.

"ఆ చిరచిరలాడే జమీందారుగారు భలే సరదా అయిన మనిషే" అన్నాడు లేవిన్, నిట్టూరుస్తూ. "తెలివైనవాడే, చాలా విషయాలు చెప్పాడు" అన్నాడు.

"ఓహ్, వదిలేద్దురూ, ఆయన అందరిలాగానూ భూస్వామ్య దాస్య వ్యవస్థని గట్టిగా సమర్థించే మనిషి."

"మరి మీరు వాళ్ల మార్షల్..."

"కాని నేను వాళ్లని రెండో వేపు నడిపిస్తూ వుంటాను" అన్నాడు స్వియాజ్‌స్కీ నవ్వుతూ.

"కాని అన్నిటికంటే నాకు ఆసక్తికరమైంది యేమంటే" అని లేవిన్ అన్నాడు. "మన రేషనల్ వ్యవసాయం లాభసాటిగా సాగదు. కేవలం ఆదిమ పద్ధతి అయితేనే సాగుతుంది. లేదా ఆ కిమ్మన్నాస్తిగా కూర్చున్న జమీందారు చేస్తున్నట్టుగా వడ్డీ పద్ధతి సాగుతుంది. దోషం యెవరిది?" అన్నాడు.

"మనదే మరి. మన పని సాగడం లేదనడం తప్పు. వసీల్చికొవ్ సాగిస్తున్నాడు."

"గుర్రాల క్షేత్రం..."

"కాని మీకది యెందుకు ఆశ్చర్యం కలిగించాలో నాకు అర్థం కాదు. రైతుల భౌతిక, నైతిక వికాసం యెంత తక్కువ స్థాయిలో వుందంటే వాళ్లు కొత్త దాన్ని దేన్నైనా వ్యతిరేకిస్తారు. యూరప్‌లో రేషనల్ వ్యవసాయం సాగుతోందంటే అక్కడి రైతులు విద్యావంతులయ్యారు కాబట్టి. యింతకీ తేలే విషయం యేమంటే మనం రైతుల్ని విద్యావంతుల్ని చెయ్యాలి, అదీ సంగతి."

"కాని వాళ్లని యెలా విద్యావంతుల్ని చెయ్యడం?"

"అందుగ్గాను మనకి మూడు విషయాలు కావాలి, పాఠశాలలు, పాఠశాలలు, పాఠశాలలు."

"మీరిప్పుడే అన్నారు రైతుల భౌతిక వికాసం తక్కువగా వుందని. మరి పాఠశాలలు దానికి యెలా తోడ్పడతాయి?"

"మీరు అంటున్న ముక్క నాకు జబ్బు మనిషికి సలహా యిచ్చే సామెతని గుర్తు చేస్తోంది. అతనికి చెప్పారట, 'మందు తీసుకో' అని 'తీసుకున్నా'నని అన్నాట్ట. 'జలగల్ని పట్టించమ'న్నారట. 'అదీ అయింది. ఇంకా అధ్వానంగా తయారైంది' అన్నాట్ట. 'ఇక మిగిలింది దైవప్రార్థన చెయ్యడమే' అన్నార్ట. 'అదీ చేశాను. యింకా అధ్వాన్నం అయింది' అన్నాట్ట. అలా వుంది మీరు చెప్పేది. నేను అర్థశాస్త్రం గురించి చెపితే యింకా అధ్వాన్నం అంటారు మీరు. నేను సోషలిజం అంటే అదీ అధ్వాన్నం అంటున్నారు. విద్య అంటే అదీనీ అంటున్నారు."

"కాని పాఠశాలలు యే రకంగా ఉపయోగ పడతాయి?"

"రైతులలో కొత్త అవసరాలు పుట్టడానికి దారి తీస్తాయి."

"అదే నాకెన్నడూ అర్థం కాని విషయం" అని లేవిన్ వేడెక్కిపోయి అడ్డం వెళ్లేడు. "బళ్లు యే రకంగా రైతుల భౌతిక పురోగతికి తోడ్పడతాయి? విద్య, బళ్లు కొత్త అవసరాలు

పుట్టడానికి దారి తీస్తాయని మీరు అంటున్నారు. యింకా అధ్వాన్నం అవుతుంది. యేమంటే ఆ అవసరాంవి తీర్చుకునే సమర్థత రైతులకి వుండదు. కూడికలు, తీసివేతలు, ధార్మిక ప్రశ్నోత్తర క్రమం నేర్చుకుంటే వాళ్ల భౌతిక పరిస్థితులు యెలా మెరుగవుతాయో నాకెన్నడూ అర్థం కాదు. మూర్రోజుల నాడు వో రైతు ఆడమనిషిని కలిశాను, ఆమె చంకలో చంటిబిడ్డ వుంది. ఎక్కడికెడుతున్నావ్ అని అడిగేను. 'మా పిల్లాడికి గాలి సోకింది, యేడుపు మానడం లేదు, మంత్రకత్తె దగ్గరికి వెడుతున్నా, నయం చేస్తుంద'ని చెప్పింది. వాళ్ళ యెలా నయం చేస్తారని అడిగాను. 'కోడిపెట్టం గూటిమీద పిల్లాడ్ని పెట్టి మంత్రిస్తార'ని చెప్పింది."

"చూడండి మీరే అన్నీ చెప్పేరు. ఆ రైతు ఆడమనిషి బిడ్డని యిలా భూత వైద్యం దగ్గరికి తీసుకెళ్లకుండా చెయ్యాలంటే మనకి అవసరం..." అని స్వియాజ్‌స్కీ వేళాకోళంగా నవ్వుతూ అన్నాడు.

"అదేం కాదు" అని లేవిన్ చిరాగ్గా అన్నాడు. "ఆ రైతు ఆడమనిషి వైద్యం రైతుల పాఠశాలలతో సమంగా వుంది నాకు. రైతులు బీదవాళ్ళు, చదువు సంధ్యలు లేవు. ఆ విషయం మనకి స్పష్టంగా తెలుసు, ఆ రైతు ఆడమనిషికి తన బిడ్డ యేడుపు లాగా, యేమంటే బిడ్డ నాకటే గోంపెడుతూ వుండడం కనిపిస్తూనే వుందిగా. కాని బళ్లు వాళ్ల బీదరికాన్నీ, అవిద్యనీ యెలా తొలిగిస్తాయో అనేది నాకర్థం కావడం లేదు, కోడిపెట్టం గూటిపైన పెట్టడంద్వారా పిల్లాడికి యెలా నయమవుతుందో అలాగే. వాళ్లని బీదవాళ్లగా చేసేదేదైతే వుందో దాన్ని దూరం చెయ్యాల్సి వుంది."

"కనీసం ఈ విషయంలో మీరు మొత్తం మీద మీకు యిష్టం లేని స్పెన్సర్‌ని అంగీకరిస్తున్నారు.* సంవత్సరంనుంచీ, సౌఖ్యంనుంచీ ఆయన మాటల్లో 'తరచు స్నానం చేసే అలవాటువల్ల శుభ్రమై' విద్య వస్తుందని, చదవడం రాయడం అనే దానివల్ల కాదని ఆయన అంటాడు."

"వూఁ నాకు చాలా సంతోషంగా వుంది లేదా విచారంగా వుంది, స్పెన్సర్‌దీ నాదీ వొకే అభిప్రాయం అయినందుకు. నాకీ విషయం చాలా ముందునుంచీ తెలుసు. పాఠశాలలవల్ల లాభమేం ఉండదు. ఉపయోగపడేదల్లా రైతుల్ని ధనికుల్ని చేసి వాళ్లకి మరింత తీరికని యిచ్చే ఆర్థిక వ్యవస్థ. అప్పుడు పాఠశాలలూ వుంటాయి."

"అయినా యివాళ యూరప్ అంతటా బడి నిర్బంధం."

"మీ విషయం యేమిటి? మీరు స్పెన్సర్‌తో యీ విషయంలో అంగీకరిస్తారా?" అని లేవిన్ అడిగాడు.

కాని స్వియాజ్‌స్కీ కళ్లల్లో ఆ భయ భావం మళ్లీ దూసుకుపోయింది. అతను చిరునవ్వు నవ్వుతూ అన్నాడు.

"కాని ఆ చంటి పిల్లాడి యేడుపు కథ బాగుంది. మీరే స్వయంగా విన్నారా?"

యీ మనిషి జీవిత విధానానికీ, అభిప్రాయాలకీ మధ్య వున్న సంబంధం తను యిన్నడూ తెలుసుకో లేదని లేవిన్‌కి అనిపించింది. తన వాద ప్రతివాదాల స్వీకరణల గురించి స్వియాజ్‌స్కీ యేమీ పట్టించుకోవడం లేదు. అతనికి వాద ప్రతివాదాల క్రమం పట్టనే పట్టింపు. ఆ క్రమం తనని వో మూలకి గెంటేస్తే, అతను తబ్బిబ్బు అయిపోతాడు. అది అతను భరించలేడు. అందేత సంభాషణని మరింత సంతోషకరంగా, ఉల్లాసకరంగా ఉండేటట్లు తిప్పి దీన్ని తప్పించుకుంటాడు.

తను వచ్చేటప్పుడు విడిది చేసిన రైతు తన మనస్సుమీద వేసిన ముద్రతో సహా — అదే ఆ నాటి అనుభూతులన్నిటికీ ఆధారంగా వుండింది — ఆ రోజు తనలో కలిగిన అనుభూతుల వల్ల లేవిన్ చాలా ఉత్సాహ ప్రేరితుడయ్యాడు. యీ ప్రీతిపాత్రుడైన స్వియాజ్‌స్కీ వున్నాడు: సామాజిక ఉపయోగం కోసం తన భావాల్ని పోగుచేసుకుంటున్నాడు, లేవిన్‌కి అందని రహస్యమైన వేరే సిద్ధాంతాలతో అతని జీవితం నిర్దేశితం అయివుంది, కాని మంద అని పిలిచే ప్రజాసమూహంతో పాటూ తనకీగా తాను నమ్మని భావాలతో ప్రజాభిప్రాయాల్ని రూపొందిస్తున్నాడు. ఆ చిరచిరలాడే జమీందారు వున్నాడు. జీవితం రుద్దిన స్వీకరణలకి సంబంధించి సబబుగానే వున్నా గానీ మొత్తం వొక వర్గంమీద రష్యాలో అత్యుత్తమమైన వర్గంమీద తన క్రోధ దృష్టి చూపించడం విషయంలో సబబుగా లేదు. యిక లేవిన్‌కి తన కార్యకలాపాలకి సంబంధించే అసంతృప్తి యీ సమస్యలన్నిటికీ పరిష్కారం కనిపెట్ట వచ్చనే అస్పష్ట ఆశ — ఇవన్నీ కలిసి, అతనిలో వొక అంతర్గత ఆందోళనని కలిగించాయి. కాని పరిష్కారం అందుబాటులో వుందన్న వొక మిణుకుని మెరిపింప చేశాయి.

లేవిన్ తన గదిలో వొక్కడూ వుండిపోయాడు. స్ప్రింగు సోఫామీద వాలేడు. అతను కాలో చెయ్యో కదిలించినప్పుడల్లా దాని స్ప్రింగులు అనుకోకుండానే లేస్తూ వుండేవి. లేవిన్‌కి చాలా సేపు నిద్రపట్టలేదు. స్వియాజ్‌స్కీ యెన్నో తెలివైన విషయాలు చెప్పినా లేవిన్‌కి వొక్కటీ బుర్రలో మిగల్లేదు. కాని చిరచిరలాడే జమీందారుగారి మాటలు దృష్టి పెట్టవలసినవే నన్నట్టు కనిపించాయి. లేవిన్ ఆయన అన్న ప్రతి మాటనీ మననం చేసుకొని వాటికి తన వూహల్లో యిచ్చుకున్న సమాధానాలని పరిచూసుకున్నాడు.

'ఆఁ, నేను ఆయనకి చెప్పి వుండవలసింది — రైతుకి యే విధమైన కొత్త మార్పులూ యిష్టం వుండవు కాబట్టి మన వ్యవసాయం సఫలం కావడం లేదని, మార్పుల్ని బలవంతంగా ప్రవేశపెట్టాలని మీరు అంటారు. యీ మార్పులు వుంటే తప్ప వ్యవసాయాన్ని కొనసాగించ లేకపోయినట్లైతే మీరు చెప్పింది సబబే. కాని కొనసాగుతోంది, అదీ బాగా సాగుతోంది. ఎక్కడంటే రైతులు తమ పాత సంప్రదాయాలని అనుసరించిన చోట, దారిలో తగిలిన ఆ ముసలి రైతు క్షేత్రంలో మాదిరీ. వ్యవసాయం విషయంలో మీకూ నాకూ కలిగిన అసంతృప్తి కలిగింది, అంటే తప్పు మనదేనా కావాలి లేదా వ్యవసాయ కూలీందేనా కావాలి. మనం చాలాకాలం మన దేశ శ్రమశక్తి ప్రత్యేక లక్షణాలని విస్మరించి యూరపియన్ పద్ధతిని

తెచ్చిపెట్ట ప్రయత్నిస్తున్నాం. శ్రమ శక్తిని అధర్మప్రాయం అయిందిగా చూడ్డం కాక ప్రత్యేక లక్షణాలు వున్న రష్యన్ రైతుని దృష్టిలో పెట్టుకుని ఆ రకంగా యెందుకు వ్యవసాయం జరిపించుకో కూడదు? మాటకి, నేను వచ్చేటప్పుడు దారిలో తగిలిన రైతు తన వ్యవసాయం జరిపించినట్టుగా మీరు జరిపిస్తే, వ్యవసాయం విజయం సాధించడంలో పనివాళ్లకి ఆసక్తి కలిగేటట్టు చేస్తే, రైతు స్వీకరించడానికి యిష్టపడే పద్ధతుల్ని కనిపెట్టడంలో నెగ్గితే బాగుంటుంది అనుకోండి అని నేను అతనితో చెప్పి వుండాల్సింది. యీ రకంగా చెయ్యగలిగితే నేల సారం తగ్గకుండా మన దిగుబడిని రెండింతలు మూడింతలు చేసి వుండేవాళ్లం. యిందులో సగపాలు సగపాలు భాగం చేసుకోండి, సగం కూలీలకి యిచ్చెయ్యండి. మీ రాబడి యిప్పుడున్న దానికంటే యెక్కువ వుంటుంది, అలాగే కూలీలకీని. యిలా చెయ్యాలంటే మనం వ్యావసాయిక స్థాయిని తగ్గించాలి, వ్యవసాయం దిగుబడి పట్ల కూలీకి ఆసక్తి కలిగించాలి. యిది ఎలా సాధించాలీ అనేది వివరంగా చర్చించాల్సిన ప్రశ్న, కాని ఖాయంగా సాధించవచ్చు.'

యీ ఆలోచనలతో లేవిన్‌కి ఉత్తేజం వచ్చింది. ఈ భావాల్ని ఆచరణ యోగ్యం చెయ్యడం యెలాగా అన్న ఆలోచనలతో అతనికి అర్ధరాత్రిదాకా నిద్రపట్టలేదు. ముందు ఆ మర్నాడు వుండడానికి ఒప్పుకున్నాడు. కాని యిప్పుడు పొద్దుటే యింటికి వెళ్లిపోవాలని తీర్మానించుకున్నాడు. యిదీ గాక కొత్తరకం మెడ కత్తిరింపు ఫ్రాక్ తొడుక్కున్న మరదలు అతని మనస్సులో సిగ్గునీ, ఏదో చెయ్యకూడని తప్పు చేసిన పశ్చాత్తాప భావాన్ని రేపింది. యిప్పుడు ముఖ్య విషయం వీలైనంత త్వరగా వెళ్లిపోవడం. శీతాకాలం నాట్లు మొదలవక ముందే తన కొత్త పథకాన్ని రైతుల ముందు పెట్టాలి. అలా అయితే వాళ్లు కొత్త పునాది మీద చెయ్యవచ్చు. తన వ్యవసాయాన్ని పూర్వపద్ధతినుంచి పూర్తిగా మార్చెయ్యాలని అతను తీర్మానించుకున్నాడు.

29

లేవిన్ పథకాలని అమలు జరపడంలో కొన్ని చిక్కులు యెదురయ్యాయి. కాని యథాశక్తి ప్రయత్నించేడు. తను ఆశించిన దాన్నంతట్నీ అతను సాధించ లేకపోయినా తనని తను మోసం చేసికోకుండా, యీ యత్నం కృషి జరప దగ్గంత విలువైందేనన్న నమ్మకం కలిగేటంత మేరకి సాధించాలిగాడు. అన్నిటికంటే కష్టతమమైం దేమిటంటే – వ్యవసాయం పనులు సాగుతున్నాయి. అంతట్నీ ఆపుచేసేసి మళ్లీ ఓం ప్రథమంనుంచీ ఆరంభించడం సంభవం కాదు, యంత్రం నడుస్తూ వుండగానే దాన్ని మెరుగుపర్చాలి.

ఇంటికి తిరిగి రాగానే అతను విగామానుతో తన పథకాల గురించి చెప్పాడు. ఇప్పటిదాకా చేసింది తెలివిహీనమైందనీ, లాభరహితమైందనీ అతను సంతోషపడిపోయి లేవిన్ వూహాలు

బాగున్నాయని మెచ్చుకున్నాడు. తను యెంతో కాలంగా యీ విషయమే చెపుతూ వున్నాడనీ కాని లేవిన్ చెవిని పెట్టలేదనీ నిగామాను అన్నాడు. అన్ని వ్యవసాయం పనుల్లోనూ వ్యవసాయ కూలీలతో బాటుగా పాలు పంచుకునే భాగస్వామిగా వుండాలన్న తన ఉద్దేశం లేవిన్ ప్రకటించగానే నిగామాను కేవలం ఉదాసీనంగా వుండిపోయాడు. తన నిశ్చిత అభిప్రాయం యేమిటైందీ తెల్పలేదు. గబగబ ప్రసంగ విషయం మార్చేసి మిగిలిన రై పంటనంతట్నీ మర్నాడు పోగుచేసేసుకోవాలని, మనుషుల్ని దుక్కి దున్నడానికి పంపాలని అన్నాడు. ఆ రకంగా, యీ సమయంలో అలాంటి ఆలోచనలకి వ్యవధి లేదని లేవిన్‌కి అర్థమయేటట్టు చేశాడు.

లేవిన్ యిదే విషయం గురించి రైతులతో మాట్లాడేడు. కొత్త షరతులలో భూమిని కౌలుకివ్వడం గురించి ప్రతిపాదించేడు. అప్పుడు కూడా అతనికి యిదే కష్టం యెదురైంది. వాళ్ళు రోజువారీ పనుల్లో యెంతగానో కూరుకుపోయి యీ కొత్త వ్యవస్థలో లాభనష్టాలు యేమిటో ఆలోచించే అవకాశమే లేకపోయింది.

భోరాభారా రైతు ఇవాన్‌కి మాత్రం లేవిన్ చెప్పింది అర్థమైనట్టే కనిపించింది. అంటే తమా తన కుటుంబం ఆవు పాడి వల్ల వచ్చే లాభాల్లో వాటా పంచుకో వచ్చునన్న విషయం, అతను పూర్తిగా దీన్ని సమర్థించేడు. కాని లేవిన్ అతనికి భావి లాభాల గురించి బోధపర్చడం మొదలుపెట్టగానే ఇవాన్ ముఖ కవళికలు భయం ద్యోతకమయేటట్టు మారిపోయి తను పూర్తిగా లేవిన్ చెప్పేది వినలేక పోతున్నానని బాధ వ్యక్తం చేశేడు. అప్పటికప్పుడు యేదో పని కల్పించుకుని దాన్ని సాకుగా చెప్పేవాడు. శాలలో గడ్డిని పోగు చెయ్యడానికి ఆటక్రొరు తీసుకొనేవాడు, లేకపోతే తొట్టెలో నీళ్ళు పోసేవాడు, లేకపోతే పేడ తీసి శుభ్రం చెయ్యడం మొదలుపెట్టేవాడు.

తమని మరింత యెక్కువగా వొలిచేసుకోవడం వినా జమీందారుకి వేరే ఉద్దేశం లేదని రైతులకి గట్టి నమ్మకం. అది లేవిన్‌కి యెదురైన మరో కష్టం. అతని (యేం చెప్పినా గానీ) అసలు ఉద్దేశం యేమిటైందీ అతను చెప్పినా తమకి చెప్పడని వాళ్ళ ఖాయమైన అభిప్రాయం. వాళ్ళల్లో వాళ్ళు యీ విషయం గురించి చర్చించుకునేటప్పుడు చాలా విషయాల గురించి చెప్పుకున్నారు గాని తమ మనస్సుల్లో అసలు యేం వుందో బయట పెట్టారు కాదు. పైగా (ఆ చిరచిరలాడే జమీందారుగారు చెప్పింది యెంత సబబో లేవిన్‌కి యిప్పుడు అవగతం అయింది) కొత్త పద్ధతుల్ని అంగీకరించమని గాని, కొత్త పనిముట్లని వాడమని గాని తమని ఒత్తిడి చెయ్యకూడదనే అనుల్లంఘనీయమైన షరతుని మొదటగా పెట్టేరు. లోహ హలాంతో నేలని బాగా దున్నవచ్చుని, తేలిక రకం నాగళ్ళతో నేలని బాగా తిరగ దొయ్యవచ్చునీ వాళ్ళూ వొప్పుకున్నారు. కాని వాటిని యెందుకు అసలు వాడలేరో సవాలక్ష కారణాలు వెతికి చెప్పేరు. వ్యవసాయ స్థాయి తగ్గించవలసి వస్తుందని లేవిన్‌కి తెలిసినా, లాభాలు యెంతో స్పష్టంగా కనిపిస్తూ వున్న మంచి మార్పుల్ని వదులుకోవడం అతనికి బాధగా వుంది. యిన్ని యిబ్బందులు ఎదురైనా అతను తన మనస్సులో వున్న

దాన్ని ఆకురాలు కాలం నాటికి నెగ్గించుకోగలిగారు, లేదా కనీసం అతనికి అలా తోచింది.

లేవిన్ మొదట్లో క్షేత్రాన్నంతట్నీ వున్నదున్నట్టుగా రైతులకీ, నిగామానుకి కొత్త షరతులమీద అప్పగించేద్దామనుకున్నాడు. కాని అది సంభవం కాదని త్వరలోనే నమ్మకం కలిగి, దాన్ని విభజించి యివ్వాలని నిర్ణయించుకున్నాడు. పశువుల కొట్టం, పళ్ల తోట, కాయగూరల మళ్లు, పచ్చిక బీళ్లు, పొలాలు అన్నీ భాగాలుగా చెయ్యాలి. లేవిన్ దృష్టిలో అందరికంటే విషయం బాగా అర్థం చేసుకున్న పాలేరు భోళాభాళా ఇవాన్ ముఖ్యంగా తన కుటుంబ సభ్యులే కలిసి వున్న బృందంతో పశువుల కొట్టం బాధ్యత తీసుకున్నాడు. యెనిమిదేళ్లుగా బంజరుగా పడి వున్న దూర భూముల్ని తెలివైన వడ్రంగి ఫ్యోదొర్ రెజునోవ్ పెత్తనంలో వున్న ఆరు రైతు కుటుంబాలు ఉమ్మడిగా తీసుకున్నాయి. అదే షరతులలో రైతు షురాయెవ్ కాయగూరల మళ్లనన్నిట్నీ తీసుకున్నాడు. మిగిలిన జమీ అంతా పాత పద్ధతిలోనే వుండిపోయింది. కాని యీ మూడు విభాగాలూ కొత్త ప్రణాళిక ప్రకారం నాందీ వాచకం పలికి నటువంటివి. లేవిన్ వాటి పట్ల ఆసక్తి చూపించేడు.

పశువుల కొట్టంలో పరిస్థితి యేం మెరుగుపడలేదు. వెచ్చటి శాల్నీ, తాజా మీగడ చిలికి వెన్న తెయ్యడాన్నీ ఇవాన్ ససేమిరా వొప్పుకోలేదు. శాలలు చల్లగా వుంటేనట ఆవులు మేత తక్కువ తింటాయట. పులిసిన మీగడనుంచి వెన్నని త్వరగా తీయవచ్చట. ఇవీ అతని వాదనలు. ముందటి లాగానే జీతం కావాలని అడిగేడు. తనకి యివ్వడిచ్చే సొమ్ము జీతం కాదనీ, అతని వాటా లాభాల్లో సంచికరువనీ అతనికి పిసరు కూడా అర్థం కాలేదు.

ఫ్యోదొర్ రెజునోవ్ బృందం విత్తనాలు చల్లడానికి ముందుగా రెండు సార్లు దున్నలేదు. అలా దున్నాలని ముందు వొప్పందం అయారు. యిదేమయ్యా అంటే వ్యవధి లేకపోయిందిట. యీ బృందం రైతులు ఉమ్మడిగా పంచుకున్న భూమి అనకుండా దాన్ని కౌలుకిచ్చిన పొలం అన్నారు. కొత్త షరతుల మేరకి దాన్ని తీసుకోడానికి వొప్పుకుని అలానే అనడం కొనసాగించేరు. "తమరు గనక శిస్తు పుచ్చుకుంటే తమరికీ సుఖంగా వుంటుంది, మాకూ మనస్సు నిమ్మళంగా వుంటుంది" అని రెజునోవ్ కొన్ని సార్లు లేవిన్‌తో చెప్పను కూడా చెప్పాడు. ఓ పశువుల శాలనీ, నూర్పిడి కళ్లాన్నీ కడతామని చెప్పారు గాని కట్టకుండా వాయిదావేస్తూనే వచ్చేరు. ఆకురాలు కాలం వచ్చింది కాని యెక్కడి గొంగళి అక్కడే వుంది.

కాయగూరల మళ్ల బాధ్యత తీసుకున్న షురాయెవ్ రైతులకి చిన్న చిన్న మళ్లు చేసి కిరాయికి యిచ్చేయ్యాలని చూశాడు. ఈ మళ్లని తనకి యిచ్చిన షరతుల్ని అతను, కావాల్సికే పొరపాటుగా అర్థం చేసుకున్నాడన్న విషయం స్పష్టం.

నూతన వ్యవస్థ లాభాలని గురించి విపులీకరిస్తూ రైతులతో మాట్లాడేటప్పుడు వాళ్ల పూరికే తన కంఠధ్వనులు వింటున్నారంతే తప్ప యెంత మొత్తుకున్నా తమని మోసం చెయ్యనివ్వము అన్న తీర్మానంతో వున్నారన్న భావం లేవిన్‌కి కలగక పోలేదు. రైతులందర్లోకీ చురుకైన రెజునోవ్‌తో మాట్లాడేటప్పుడు అతనికి ముఖ్యంగా అలా అనిపించింది. రెజునోవ్

వ్యంగ్యంగా నవ్వుకోవడం, యెవర్నైనా మోసం చెయ్యవచ్చునేమో గాని తనని, లెవిన్‌ని మాత్రం కాదనీ స్ఫురింప చేస్తున్నట్టు వుండేదది. ఇవన్నీ నిజమే.

అయినా కూడా, యివన్నీ నిజమే అయినా కూడా యీ పద్ధతిని ఆరంభించినట్లూ, కచ్చితమైన లెక్కలు రాసిపెట్టి తను అన్నమాట ప్రకారం జరిపించినట్టయితే యీ నూతన వ్యవస్థ లాభాల్ని క్రమేపీ వాళ్లకి రుజువు చెయ్యగలనవీ, అప్పుడు పనులు వాటంతటవే సాగి పోతాయనీ లేవిన్ నమ్మేడు.

యీ ప్రయోగాలతోనూ, జమీ నిర్వహణతోనూ, తను రాసే పుస్తకం పనితోనూ లేవిన్‌కి తీరికే లేక ఆ వేసవి అంతా అతను వేటకి వెళ్లనే లేదు. ఆగస్టు నెలాఖరులో ఆబ్లాన్‌స్కీల నౌకరు వచ్చి పక్కజీనుని తిరిగి అందజేసి, వాళ్లంతా తిరిగి మాస్కో వెళ్లిపోయారని చెప్పాడు. దాలీ రాసిన ఉత్తరానికి జవాబు యివ్వక పోవడం వల్ల తన అమర్యాద లేవిన్‌కి గుర్తుకు వచ్చి సిగ్గుతో కుమిలి పోయాడు. అలా జవాబు యివ్వకుండా వుండడం అనేది యిక తెప్ప తగలేసినట్టేనని అనిపించింది, యిక మళ్లీ తను వెళ్లి వాళ్లని చూళ్లేడు. అలాగే స్వియాజ్‌స్కీల యింటి దగ్గర్నుంచి వచ్చేటప్పుడు మర్యాదకి వాళ్ల దగ్గరా సెలవు తీసుకోకుండా వచ్చేసి వాళ్ల పట్లా అమర్యాదగా ప్రవర్తించేడు. యిక మళ్లీ వాళ్లింటికీ వెళ్లలేడు. అయినా అదంత ఫరవాలేదు. తన నూతన వ్యావసాయిక వ్యవస్థని అమలు జరపడం అనే దాంతో అతను తల మునకలుగా వున్నాడు. అంతకు ముందు మరి యే పనితోనూ యింత తీరిక లేకుండా వుండలేదు. స్వియాజ్‌స్కీ యిచ్చిన పుస్తకాలు చదివేడు, తనకి అవసరమైన కొత్త పుస్తకాల కోసం కబురు చేశాడు. తను అధ్యయనం చేస్తూ వున్న విషయంమీద అర్థశాస్త్రవేత్తలు, సోషలిస్టులు యేం చెప్పారో చదివాడు. వూహించినట్టుగానే తను ప్రవేశపెడుతున్న మార్పులకి సంబంధించింది యేదీ అతనికి కనిపించలేదు. తను యెదుర్కొంటున్న సమస్యలకి పరిష్కారం దొరుకుతుందేమోనని అర్థశాస్త్ర పుస్తకాలను, ఉదాహరణకి అతను మిల్స్* పుస్తకాలని పేజీ పేజీ ఆతృతగా చదివేడు. ఆ పుస్తకాలలో యూరపియన్ వ్యావసాయిక వ్యవస్థలో వున్న పరిస్థితి మేరకి చేసిన సూత్రీకరణలు వున్నాయి. కాని రష్యాకి వర్తించని ఆ సూత్రీకరణలని యెందుకు విశ్వజనీనమైనవని పరిగణించాలో అతనికి అర్థం కాలేదు. సోషలిజం గురించిన సంబంధించీ అంతే. తన విద్యార్థి రోజుల్లో తను పరవశించిపోయి కలగన్న ఆచరణయోగ్యమవని అద్భుత కల్పన లాంటి వాటేనా వాళ్లు చూపించారు, లేదా యూరపియన్ వ్యవసాయం జబ్బులకి పనికొచ్చే నాటు చిట్కాలేనా చెప్పారు. రష్యా జబ్బులకీ ఆ యూరపియన్ జబ్బులకీ అసలు సామ్యమే లేదు. యూరప్ సంపద పెరిగిన నియమాలని, ఆ సంపద యింకా పెరుగుతూ వున్న నియమాలని విశ్వజనీనమైనవన్నట్టుగా, తిరుగు లేనివన్నట్టుగా అర్థశాస్త్రం ఢంకా బజాయించి చాటుతోంది; ఆ నియమాల ప్రకారం అభివృద్ధి జరిగితే వినాశనం దాపురిస్తుందని సోషలిజం ఘంటాపథంగా చాటుతోంది. అది గాని, యిది గాని తను, లేవిన్, అలాగే సకల రష్యన్ రైతాం

గమూ, వ్యవసాయదార్లూ సామూహిక సంక్షేమం కోసం కృషి చేసేందుకు మహా ఫలవంతంగా తను కోట్లాది హస్తాల్ని, కోట్లాది దేస్యతిన్ల భూమినీ యెలా వినియోగించాలో జవాబివ్వడం లేదు, సూచన ప్రాయంగా కూడా తెలియచెయ్యడం లేదు.

అధ్యయనం చెయ్యడమంటూ వొక సారి మొదలుపెట్టాడు కాబట్టి లేవిన్ ఆ విషయానికి సంబంధించిన దాన్నంతటినీ చిత్తశుద్ధితో క్షుణ్ణంగా చదివేడు. స్వయంగా పరిస్థితుల్ని గురించి తెలుసుకుందుకు ఆకురాలు కాలంలో విదేశాలకి వెళ్లాలనుకున్నాడు. అలా చేస్తే తను యెన్నో సార్లు పడిన యిబ్బందుల్లో పడదు కనీసం. తనతో మాట్లాడే వాళ్ల ఆలోచనల్ని అర్థం చేసుకుంటూ, తను తన ఆలోచనల్ని వెల్లడి చేస్తూ కూడా తనకి తెలియకుండానే "కాఫ్‌మన్? మరి జోన్స్? ద్యుబావాయో? మిచెలీ సంగతి?* వాళ్ల పుస్తకాలు చదవలేదూ? అయ్యొయ్యో! తప్పకుండా చదవాలి. వాళ్లు యీ విషయం గురించి ఆమూలాగ్రం శోధించేశారు" అనే మాటలు యెదురయ్యేవి.

కాఫ్‌మన్ గాని, మిచెలీ గాని తనకి చెప్పేది యేమీ లేదని యిప్పుడు స్పష్టంగా తెలిసింది. తనకేం కావాలో తనకి తెలుసు. రష్యాలో బ్రహ్మాండమైన నేల వుంది, బ్రహ్మాండమైన రైతులున్నారు. కొన్ని సందర్భాలలో స్వియాజ్‌స్కీ యింటికి వెళ్లేటప్పుడు తనకి దారిలో తగిలిన రైతు మాదిరీ పనివాళ్లూ నేలా యెక్కువ ఉత్పాదకంగా కనిపించడమూ వుంది. యెక్కువ సందర్భాల్లో యూరపియన్ పద్ధతిలో పెట్టుబడిని పెట్టినప్పుడు ఫలసాయం చాలా తక్కువ వుంది. ఇలా యెందుకు జరుగుతోందీ అంటే రైతులు గనక తమ యిచ్ఛానువర్తిగా పనిచేస్తే చక్కగా చేస్తారు. వాళ్ల ప్రతికూలత యాదృచ్ఛికం కాదు, నిత్యం వుండే అంశం. దానికి పునాది ఆ మనుషుల స్వభావంలోనే వుంది. విస్తారమైన ఉజాడు భూముల్ని లాయకీ చేసి సాగు చెయ్యాల్సిన పరిస్థితి సంప్రాప్తమైన రష్యన్ ప్రజలు, అలాంటి భూములు వున్నంత కాలం అందుకు తగ్గ పద్ధతులనే అమలు పరుస్తూ వుంటారు. ఆ పద్ధతులు అందరూ అనుకున్నంత చెడ్డవి కావు. తను ఆ విషయాన్నే తన పుస్తకంలో సిద్ధాంతపరంగా తన జమీలో ఆచరణపరంగా రుజువు చెయ్యదల్చుకున్నాడు.

30

సెప్టెంబరు నెలాఖర్లో రైతులతో భాగస్వామ్యంగా యిచ్చిన భూమిలో పశువుల శాల కట్టడం కోసం కలపని కొన్నారు. వెన్నని అమ్మేసారు. ఆ వచ్చిన లాభాల్ని సమంగా పంచుకున్నారు. వ్యవసాయ క్షేత్రంలో ఆచరణాత్మకంగా పెద్ద పని జరిగిపోతోంది, కనీసం లేవిన్‌కి అలా అనిపించింది. ఈ మొత్తం అంతటినీ సిద్ధాంతపరంగా స్థాపించాలి. తను రాస్తూ వున్న పుస్తకాన్ని పూర్తి చెయ్యాలి. తన పుస్తకం అర్థశాస్త్రంలో విప్లవాన్ని తీసుకు రావడమే

గాక, భూమి పట్ల రైతుల వైఖరికి సంబంధించి పూర్తిగా కొత్త విజ్ఞానానికి పునాది వేసి ఆర్థిక శాస్త్ర విజ్ఞానాన్ని సమూలం ధ్వంసం చేసి పారేస్తుంది. అందుచేత ఈ పనులు చేసేందుగ్గాను విదేశాలు వెళ్లాలి. యీ దిశల్లో అక్కడ జరుగుతూ వున్న కార్యక్రమాల నన్నిట్నీ అధ్యయనం చెయ్యాలి. అలాగే అక్కడ యేం జరిగిందో అది అలా జరగకూడదని విశ్వసనీయమైన ప్రమాణంతో రుజువుచెయ్యాలి. ప్రయాణానికి డబ్బు సమకూరడానికి గోధుమ అమ్మకం కోసమే లేవిన్ ఆగేడు. కాని వానలు మొదలై పొలంలో మిగిలిపోయిన పంటనీ, బంగాళాదుంపలనీ మానూలు చేసుకోవడం వీలు అవలేదు. మొత్తం పనంతా స్తంభించి పోయింది. గోధుమని అమ్మడానికి బళ్లకెత్తడం కూడా కుదరలేదు. బాటలన్నీ బురదమయం అయిపోయి దారి లేకుండా పోయింది. రెండు గాలి మరలు వరదకి కొట్టుకు పోయాయి. వరద వాతావరణం రానురాను మరీ దిగజారింది.

సెప్టెంబరు 30 ఉదయం పూట సూర్యదర్శనం అయింది. వాతావరణం మెరుగ వుతుందని ఆశ కలిగింది. తన ప్రయాణం గురించి లేవిన్ నిశ్చయంగా తయారవడం మొదలు పెట్టాడు. గోధుమని గాదెల్లో నింపమని పురమాయించేడు. సొమ్ము వ్యటమ్మని నిగామా మని వర్తకుడి దగ్గరికి పంపేడు. ప్రయాణానికి ముందు ఆఖరి యేర్పాట్లని చూసుకుందుకు స్వయానా తనే గుర్రం బండిలో బయల్దేరి వెళ్లాడు.

సాయంత్రం వేళకి పనులన్నీ పూర్తయేయి. తొడుక్కున్న తోలు కోటుమీదనుంచి మెడపైన, బూట్లపైన నీళ్లు కారుతూ తడిసి ముద్దయిపోయాడు. అయినా కూడా మాంచి ఉత్సాహంగానే వుండి లేవిన్ యింటి ముఖం పట్టేడు. సాయంత్రానికి వాతావరణం యింకా చెడిపోయింది. వడగళ్లు గుర్రంమీద దడదడా పడుతూ వుంటే పాపం ఆ ప్రాణి చెవులనీ, తలనీ కుదుపుతూ గింజుకుంటూనే దౌడు తీసింది. కాని లేవిన్ టోపీ పెట్టుకుని హాయిగా వుండి రాస్తామీద గాడుల్లో ఉరవడిగా పారే సెలయేళ్లనీ, బోసి కొమ్మల మీదనుంచి జారే నీటి బిందువుల్నీ వంతెన చెక్క పలకలమీద పొగువడే వడగళ్లనీ, ఆకులు రాలిన చెట్టు కింద నేలమీద కమ్ముకున్న బీచ్ చెట్ల ఆకుల్నీ వినోదంగా చూస్తూనే వెళ్లాడు. చుట్టూతా వున్న దృశ్యం బావురుమంటూ వున్నా లేవిన్‌కి మాత్రం మహా ఉత్సాహంగా వుంది. దూరంలో వున్న వో గ్రామం రైతులతో జరిగిన సంభాషణ వల్ల తమ కొత్త సంబంధాలకి వాళ్లు అలవాటు పడుతున్నట్టు అతనికి తెలిసింది. బట్టలు ఆరబెట్టుకుందామని లేవిన్ వో ముసలి రైతు యింటి దగ్గర ఆగేడు. ఆ ముసలాడు లేవిన్ పథకం బాగుందని మెచ్చుకుని పశువులని కొనుక్కునేందుకు వో సహకార బృందంలో చేరేందుకు ముందుకు వచ్చేడు.

'నేను గట్టిగా నిలబడాలంతే నా లక్ష్యం కోసం, నేననుకున్న దానిని సాధించగలను' అనుకున్నాడు లేవిన్. పని చెయ్యడానికీ, ప్రయాసపడడానికీ తగ్గ హేతువు వుంది. నా కోసం కాదు కదా నేను యాతన పడుతూ వుండటం, పది మంది కోసమూనూ. వ్యవసాయ వ్యవస్థకి సంబంధించి ముఖ్యంగా ప్రజల స్థితికి సంబంధించీ ఆమూలాగ్రం మార్పుతేవాలి;

దారిద్ర్యం బదులుగా సమృద్ధి, సంతృప్తి రావాలి. శత్రుత్వం స్థానంలో సహనం, పరస్పర ప్రయోజనాపేక్ష రావాలి. ఒక్క ముక్కలో చెప్పుకోవాలంటే రక్తపాత రహిత విప్లవం, బ్రహ్మాండమైనటువంటిది. మొదట మా ఉయేజ్డ్ నాలుగు గోడల మధ్యా, తర్వాత గుబేర్నియాలో, తర్వాత రష్యా మొత్తం, ఆ మీదట సర్వప్రపంచమంతటా వస్తుంది. ధర్మబద్ధమైన సంకల్పం ఫలవంతం కాకుండా పోదు. అవును, కృషి చెయ్యడానికి తగ్గ హేతువున్న లక్ష్యం యిదే. నేను నల్ల టై కట్టుకుని బాల్‌డాన్స్‌కి వెళ్ళి కిట్టీ ష్చేర్‌బాత్‌స్కీ పెళ్ళి చేసుకోను అంటే ఆ తిరస్కారానికి గురయి, వనికిమాలిన వాడిగా దయనీయంగా తయారైన కాన్‌స్తంతీన్ లేవిన్ని, దీన్నంతట్నీ చేస్తున్నానన్నది తక్కువేం కాదు. బెంజమిన్ ఫ్రాంక్లిన్* క్కూడా తన గురించి యిలాంటి హేయమైన అనుభూతి కలిగి వుండచ్చు, ఆయనక్కూడా తన పట్ల స్థైర్యం కలిగి వుండక పోవచ్చు. అంత మాత్రం చేత యేమైంది. ఆయనకి కూడా తన అగాఫ్యా మిహైలొవ్నా వుండే వుండవచ్చు. తన వ్యూహాంని ఆమెకి చెప్పకుని వుండచ్చు' అనుకున్నాడు.

లేవిన్ యిలా ఆలోచన చేసుకుంటూ యింటికి చేరాడు. అప్పటికి చీకటి పడింది.

వర్తకుడి దగ్గర కొంత సొమ్ము తీసుకుని నిగామాను వచ్చేడు. సహకార బృందంలో చేరేందుకు ఆ ముసలి రైతుతో యేర్పాటు జరిగింది. వచ్చేటప్పుడు దారిలో చాలా పొలాల్లో గోధుమ నిల్చిపోయి వుందని అతను చూశాడు. అందుచేత వాళ్ళతో పోల్చుకుంటే మామూలు కాకుండా మిగిలిన పోయిన తమ నూట అరవై మోపులూ పెద్ద లెక్కలోది కాదు అనిపించింది.

భోజనం చేశాక లేవిన్ యెప్పటిలాగా పుస్తకం తీసుకొని చేతుల కుర్చీలో కూర్చున్నాడు. చదువుతూనే తను రాయటోయే పుస్తకం కోసం చేయవలసిన విదేశయాత్ర గురించి ఆలోచిస్తూ వుండిపోయాడు. ఇవాళ అతనికి అంతకు ముందు యెప్పటి కంటె యెక్కువగా తన కృషి ప్రాముఖ్యం అంతా స్పష్టంగా విశదం అయింది. అతని ఆలోచనలని అభివ్యక్తం చేసే వాక్యాలకి వాక్యాలు ప్రయత్న రహితంగానే మనస్సులో రూపు తీసుకున్నాయి. 'వీటిని రాసి పెట్టుకోవాలి. వీటి ఆధారంగా సంక్షిప్త భూమిక తయారు చేసుకోవాలి, ముందు దీని అవసరం లేదని అనుకున్నాను.' బల్ల దగ్గరకు వెడదామని అతను లేచాడు. అతని కాళ్ల దగ్గర పడుకున్న లాస్కా కూడా లేచి, వొళ్ళు చాచుకుని యెక్కడికి వెళ్ళాలి మనం అన్నట్టు అతని కేసి చూసింది. కాని అతనికి రాసే అవకాశం లేకపోయింది. సరిగ్గా ఆ సమయంలో దళ ముఖ్యులు వచ్చేరు. వాళ్ళని కలుసుకోవడం కోసం లేవిన్ హాల్లోకి వెళ్ళాడు.

ఆ మర్నాడు చెయ్యవలసిన పన్ల గురించి పురమాయింపులు జరిగి పనిమీద వచ్చిన ఆ రైతులందర్నీ కలుసుకున్నాక లేవిన్ చదువుకొనే గదిలోకి వెళ్ళి పని చేసుకోవడం మొదలు పెట్టాడు. లాస్కా బల్లకింద ఉండ చుట్టుకు పడుకుంది. అగాఫ్యా మిహైలొవ్నా తన కుర్చీలో చేరి అల్లిక పని మొదలుపెట్టింది.

కొంచెం సేపు రాశాక లేవిన్‌కి అనుకోకుండానే అసాధారణ సజీవ రూపంతో కిట్టీ

గుర్తు వచ్చింది. ఆమె తిరస్కారం, మొన్న బండిలో వెడుతూ ఆమె దర్శనమవ్వడం స్పష్టంగా గుర్తు వచ్చేయి. అతను లేచి గదిలో అటూ యిటూ పచార్లు చెయ్యడం మొదలుపెట్టాడు.

"పనిమాలి దిగాలుగా వుండడం యెందుకు? యెందుకు యింట్లో కూర్చోవడం? అంతా సిద్ధంగా వుంటే యేదేనా మంచి వూరు వెళ్లి ఖనిజ జలం దగ్గరికి వెళ్లచ్చుగా" అంది అగాఫ్యా మిహైలొవ్నా.

"యెల్లుండి వెడతా, అగాఫ్యా మిహైలొవ్నా. దానికి ముందు యిక్కడి వ్యవహారాలు చక్కబెట్టుకోవాలి కదా."

"యేమిటో నా నెత్తి! యేమిటా వ్యవహారాలు? రైతులకి తమరు చేసింది చాలదటనా? ఊళ్లో యేమంటున్నారో తెలుసా? మీ యజమానికి యిందుగ్గాను జార్ యేం లాభం చేస్తాడమ్మా అని. మీరు రైతుల గురించి యేం బెంగ పడిపోతున్నారో నాకర్థం కాదు" అంది.

"నేను వాళ్లకోసం కాదు, నాకోసమే అలా చేసుకుంటున్నాను."

వ్యవసాయానికి సంబంధించి లేవిన్ పథకాలు యావత్తూ అగాఫ్యా మిహైలొవ్నాకి తెలుసు. లేవిన్ తన ఆలోచనలన్నిట్నీ ఆమెకి చెప్పేవాడు. చాల సార్లు ఆమెతో వాదించి ఆమె వాదన తప్పని చెప్పేవాడు. కాని యీ సారి ఆమె అతన్ని పూర్తిగా వేరే రకంగా అర్థం చేసుకుంది.

"అసలు విషయం మన మోక్షం మనం చూసుకోవడం" అని నిట్టూరుస్తూ అందామె. "పర్ఫేన్ దెనీసిచ్‌ని చూడండి. వో చదువుందా, రాత కోతలు యెరుగునా యేమన్నానా? కాని దేవుడు చల్లగా చూసి అందరం అలా తనువు చాలించాలి!" అందామె అంత కితమే చనిపోయిన వో నౌకర్ని మనస్సులో వుంచుకుని. "పవిత్ర జలం తీసుకున్నాడు, పద్ధతిగా అంతిమ సంస్కారం జరిపించుకున్నాడు" అంది.

"నేనా విషయం గురించి చెప్పడం లేదు. ఇదంతా నా లాభం కోసమే చేస్తున్నాను. రైతులు యెంత బాగా పనిచేస్తే అంత యెక్కువగా మనకి లబ్ధి వుంటుందన్నమాట" అన్నాడు లేవిన్.

"మీరు వెయ్యి చెప్పండి, లక్ష చెప్పండి. రైతు గనక వొళ్లు వంగని వాడైతే యేమీ చెయ్యడు, చూడడు. కొంచెం పాపభీతి వున్న మనిషైతే కాస్త పని చేసి తగలెడతాడేమో తప్పిస్తే లేకపోతే అంతే."

"కాని ఇవాన్ పశువుల గురించి చాలా శ్రమ పడుతున్నాడని మీరే అన్నారు కదా."

"నేను ఒకటే చెప్పదలచుకున్నా" అని అగాఫ్యా మిహైలొవ్నా కరాకండిగా, పైకి సంభాషణకి సంబంధం లేకపోయినా తన ఆలోచనని బయట పెడుతూ "మీరు పెళ్లి చేసుకోవాలి. అదీ అసలు విషయం" అంది.

లేవిన్ తనకిగా యే విషయం గురించి అప్పుడు అనుకుంటూ వున్నాడో దాన్ని గురించే ఆమె ప్రస్తావించడం అతని మనస్సుకి గుచ్చుకుంది. అతను ముఖం చిట్లించి మళ్లీ పని

చేసుకుందామని కూర్చున్నాడు. పుస్తకం విషయంలో తను యేది ముఖ్యం అనుకుంటున్నాడో దాన్ని గురించి మనస్సులో తర్కించుకున్నాడు. మధ్య మధ్య ఆగి నిశ్శబ్దంగా అగాఫ్యా మిహైలొవ్నా సూదులు టకటకలాడ్డం విన్నాడు. తను గుర్తు చేసుకోవడం యిష్టం లేని విషయం గుర్తుకు రాగానే మధ్య మధ్య ముఖం చిట్లించుకున్నాడు.

తొమ్మిది గంటల ప్రాంతంలో బండి మువ్వల చప్పుడు, బురదలోనుంచి బండి యీడ్చుకుంటూ వచ్చే చప్పుడు వినిపించాయి.

"అదుగో యెవర్లో వస్తున్నారు. మీరు దిగాలుగా వుండడం తప్పుతుంది" అని అగాఫ్యా మిహైలొవ్నా లేచి గుమ్మం దగ్గరికి వెడుతూ అంది. లేవిన్ కూడా ఆమె వెనకాలే వెళ్లాడు. తన పని ముందుకు సాగక పోవడంతో యెవర్లో ఒకళ్లు వస్తున్నారని చూసి సంతోషపడ్డాడు.

31

మెట్ల మీదనుంచి పరిగెత్తుకుంటూ సగం దిగేటప్పటికి లేవిన్‌కి హాల్లోనుంచి దగ్గుతూ వుండే పరిచయమైన కంఠధ్వని వినిపించింది. కాని తన అడుగుల చప్పుడులో ఆ ధ్వని అతనికి స్పష్టంగా వినిపించలేదు. తను పొరపాటు పడవచ్చు కదా అనుకున్నాడు. కాని అంతట్లోనే అతనికి కుష్కించి పోయిన పొడగరి విగ్రహం కనిపించింది. తనని తను మోసం చేసుకోనక్కర లేదని యిప్పుడు స్పష్టపడింది గాని అయినా దగ్గుతూ, ఫర్‌కోటు విప్పుతూ వున్న ఆ పొడగరి తన అన్న నికొలాయ్ కాదు పొరపాటు పడ్డానవే భావించుకోబోయాడు.

లేవిన్‌కి అన్నగారంటే ప్రేమ వుంది. కాని అతనితో వుండడం మహా యాతనగా వుంటుంది. ఇప్పుడు, తన ఆలోచనలతో, అగాఫ్యా మిహైలొవ్నా గుర్తు చెయ్యడంతో ఆ విషయమే బుర్రలోకి వచ్చి గజిబిజిగా పోయిన ఆ సమయంలో, అన్నగార్ని చూడ్డం అంటే మరీ కష్టం కలిగింది. తనకి కొత్త మనిషి కులాసా, సరదా అతిథి అయితే బాగుంటుంది, గజిబిజిగా వున్న తన మనస్థితిని వేరే విషయాలమీదకి మళ్లిస్తాడు అని అతని ఆశ. కాని అందుకు బదులుగా తన పుట్టు పూర్వోత్తరాలు యావత్తూ తెలిసిన అన్నగార్ని కలుసుకోవాల్సి వస్తోంది. అన్నగారు తన మనోభావాల్ని వెల్లడి చెయ్యమని అడిగి తనని విసుక్కున్నే చేస్తాడు. అతనికి అది యిష్టం లేదు.

తన మనసులో యిలాంటి పాడు వూహాలు పుట్టుకొస్తున్నాయేం ఖర్మ అని తనమీద తనే చిరాకుపడుతూ లేవిన్ హాల్లోకి పరిగెత్తి వెళ్లాడు. అన్నగార్ని దగ్గర్నుంచి చూడగానే అతనికి కలిగిన నిరాశ వెంటనే పోయి జాలి అతని హృదయంలో పొంగింది. నికొలాయ్ సన్నగా జబ్బుగా వుండడం వల్ల యిదివరకే చూస్తే భయం పుట్టేటట్టు వుండేవాడు.

ఇప్పుడు యింకా చిక్కిపోయి రోగగ్రస్తంగా కనిపించేడు. ఒట్టి ఎముకల గూడులా కనిపించేడంతే.

పన్నగా పొడుగ్గా వున్న మెడ యెగరేస్తూ, మఫ్లర్ విప్పుతూ దయనీయంగా విచిత్రమైన మందహాసం చేస్తూ హాల్లో నుంచున్నాడతను. శాంతంగా, నమ్రతగా వున్న ఆ చిరునవ్వు చూడగానే లేవిన్‌కి తన కంఠం రుద్ధమైనట్టు అనిపించింది.

"చూశావా, నీ దగ్గరికి వచ్చేశాను" అని నికొలాయ్ తమ్ముడి ముఖం కేసి ఏ క్షణం కూడా కళ్ళు మళ్ళించుకోకుండా చూస్తూ కీచుకంఠంతో అన్నాడు. "ఇక్కడికి రావాలని చాలా కాలంగా అనుకుంటూ వున్నాను. కాని ఒంట్లో అసలు బాగుండ లేదు. ఇప్పుడు చాలా మెరుగు" అని యీడుకు పోయిన పెద్ద చేతులతో గడ్డం దువ్వుకుంటూ అతను అన్నాడు.

"ఆఁ, ఆఁ" అన్నాడు లేవిన్. అన్నగార్ని ముద్దుపెట్టుకున్నప్పుడు అతని పెదాలకి అన్నగారి చర్మం యెంత పొడారిపోయిందో స్పర్శ తగిలింది, వింత వెలుగుతో ప్రకాశిస్తూ వున్న ఆ పెద్ద కళ్ళని దగ్గర్నుంచి చూశేడు. దాంతో లేవిన్‌కి భయం యింకా యెక్కువ అయింది.

తాము యింకా పంచుకోకుండా వున్న తమ జమీలో భాగాన్ని అమ్మేసాననీ అన్నగారు వచ్చి తన వాటా రెండు వేల రూబుళ్ళనీ తీసికెళ్ళవచ్చనీ లేవిన్ అతనికి కొన్ని వారాల ముందు రాశాడు.

తన రాకకి ఒక కారణం ఆ సొమ్ము తీసుకోవడం అనీ, కాని అసలు కారణం పాత గూటిలో కొన్ని రోజులు గడిపి తన స్వస్థలంలో కొంచెం తిరగడమనే కోరిక అనీ నికొలాయ్ చెప్పాడు. పాతకాలపు వీరులకి మాదిరీ స్వస్థలం తన భవిష్యత్తు కార్యకలాపాలకి ఉత్తేజాన్ని యిస్తుందట, అని అతను అన్నాడు. అంతకు ముందుకంటే అతను వొంగిపోయేడు, అతని పొడగరితనం దృష్టిలో వుంచుకుని చూస్తే చాలా సన్నబడి పోయేడు. అయినా గానీ అతని కదలికల్లో చురుకు, లాఘవం యెప్పటి లాగానే వున్నాయి. లేవిన్ అతన్ని తను చదువుకునే గదికి తీసికెళ్ళాడు.

అన్నగారు చాలా సావధానంగా బట్టలు మార్చుకున్నాడు. అంతకు ముందు అలా చేసే వాడు కాదు. పల్చగా వున్న జుట్టు దువ్వుకున్నాడు. చిరునవ్వు నవ్వుతూ మెట్లు యెక్కేడు.

చిన్నప్పుడు తను యెన్నో సార్లు చూసినట్లే అన్నగారు స్నేహపూర్వకంగా, ప్రసన్నతా భావంతో లేవిన్‌కి కనిపించేడు. అతను పెద్దన్నగారు సెర్గేయ్ ఇవానొవిచ్ కోజ్నిషెవ్ గురించి కూడా యే రకమైన కటుత్వం లేకుండా మాట్లాడేడు. అగాఫ్యా మిహైలొవ్నాని కలుసుకున్నాక ఆమెతో నవ్వుతూ వేళాకోళం ఆడేడు. పాత నౌకర్ల గురించి అడిగేడు. పర్‌ఫేన్ దేనిసిచ్ చనిపోయాడన్న వార్త అతన్ని నిశ్చేష్టుణ్ణి చేసింది. అతని ముఖంమీద ఒక భీతి ఛాయ ధ్వనుకుపోయింది. కాని వెంటనే దాన్నుంచి తేరుకున్నాడు.

"పాపం! మంచి ముండావాడు" అని విషయం మార్చేడు. "ఆఁ, నెల్, రెండు నెలలో వుంటాను. ఆ తర్వాత మాస్కో వెడతాను. మ్యాకొవ్ నాకు ఉద్యోగం యిస్తానన్నాడు తెలుసా, నేను ప్రభుత్వ ఉద్యోగం చేస్తాను. ఇప్పటినుంచి వేరే రకంగా బతుకుతా" అని చెప్తూనే ఉన్నాడు. "ఆ తెలుసా? ఆ ఆడమనిషిని వదిలేశాను" అన్నాడు.

"మాషేనా? యెందుకని?"

"అబ్బ! దరిద్రపుగొట్టుముండ! ఎన్ని యిబ్బందులు పెట్టింది" అన్నాడే గాని ఆమె పెట్టిన యిబ్బందులేమిటైందీ వివరించాడు కాదు. పల్చని టీ కాచిపెట్టినందుకు ఆమెని పంపించేశానని చెప్పలేడు, ఆమె తనని రోగిష్టి మనిషిగా చూడ్డం కారణం అనీ చెప్పలేడు. "అసలేమిటంటే నా జీవితాన్ని మార్చేసుకోవా లనుకుంటున్నాను. అందరి లాగానే నేనూ తప్పులు చేశాను. డబ్బు తగలేశాను. దీన్దేముందిలే, తుచ్ఛం. అందుగ్గాను నేనేం విచా రించను. నాకు కావల్సిందల్లా మంచి ఆరోగ్యం. దేవుడి దయవల్ల నా ఆరోగ్యం యిప్పుడు బాగానే వుంది" అన్నాడు.

లేవిన్ అతను చెప్పేదాన్ని విన్నాడు. దేన్ని గురించేనా చెప్దామా అని ఆలోచించ బోయేడు. కాని యేది అతనికి తట్టింది కాదు. నికొలాయ్ అది గ్రహించేడు. అతను లేవిన్ పని యెలా వుందీ యేమిటీ అని అడిగేడు. లేవిన్‌కి సంతోషం కలిగింది. ఆ వొక్క విషయం గురించే అతను పంచన యేమీ లేకుండా మాట్లాడగలడు. అతను తన పథకాల గురించీ, తను తీసు కున్న ఆచరణాత్మక చర్యల గురించీ అన్నగారికి వివరంగా చెప్పేడు.

నికొలాయ్ విన్నాడు గాని పెద్ద ఆసక్తికరంగా వున్నట్టు కనిపించలేదు.

యీ యిద్దరు వ్యక్తులూ యెంతలా వొకే మూసలోంచి వచ్చినవాళ్ళలా, సన్నిహితంగా ఉంటారంటే, కదలికలో చిన్న మార్పు గాని, కంఠధ్వనిలో కాస్త తేడా గాని మాటలకంటే యెంతో యెక్కువ వాళ్ళకి తెలియజేస్తాయి.

ఇప్పుడిద్దరి మనస్సుల్లోనూ వొకే ఆలోచన ప్రబలంగా వుంది – నికొలాయ్ జబ్బూ, అనన్న మృత్యువు. కాని నికొలాయ్‌కి గాని, లేవిన్‌కి గాని దాన్ని గురించి మాట్లాడే ధైర్యం లేకపోయింది. అంచేత తమ తమ మనస్సుల్లో ఉన్న దాన్ని గురించి చెప్పుకోకపోవడంతో వాళ్ళనుకునే మిగిలిన ప్రతీ మాటా అనృతంగానే వుంది. రాత్రయింది. పడుకునే వేళ అయింది. ఆ విషయం యిప్పటంతగా లేవిన్‌కి యెప్పుడూ సంతోషం కలిగించలేదు. ఏ అపరిచిత వ్యక్తితోనూ, అధికారికంగా తగిలిన యే వ్యక్తితోనూ యివాళ అనిపించినంతగా అతనికి అస్వాభావికంగా కృత్రిమంగా వున్నట్టు అనిపించలేదు. కృత్రిమంగా వున్నానే అన్న యెరుక, అందుకు గాను పశ్చాత్తాప పడడం అతన్ని యింకా కృత్రిమంగా అయేట్టు చేశాయి. మృత్యుముఖంలోకి చూస్తూ వున్న ప్రియమైన అన్నగారి కోసం కన్నీళ్ళు కార్చాలని మనస్సులో వుంది. కాని తను యెలా జీవించాలనుకుంటున్నదీ అన్నగారు చెప్తూ వుంటే ఆ మాటలు వింటున్నాడు.

ఇంట్లో వెచ్చగా వుండడం వల్లా, వొక పడక గదే ప్రత్యేకించి వుండడం వల్లా లేవిన్ అన్నగారికి తన పడక గదిలోనే పరదా వెనకాల పడక యేర్పాటు చేశాడు.

అన్నగారు మంచంమీద వాలేడు. నిద్రపోయాడో లేదో గాని జబ్బు మనిషి చేసినట్టే అటూ యిటూ దొర్లేడు. దగ్గేడు. దగ్గుకి కఫం అడ్డుపడినప్పుడు తనలో తనే గొణుక్కున్నాడు. మధ్య మధ్యన గాఢంగా గాలి పీల్చి "హోరి భగవంతుడా" అని గొణిగేడు. కఫం అడ్డం పడి ఉక్కిరి బిక్కిరి అయినప్పుడు "అబ్బ, దీన్ని తగలెయ్య" అని చిరాగ్గా తిట్టేడు. ఇవన్నీ వింటూ లేవిన్‌కి చాలా సేపు నిద్ర పట్టలేదు. అతని మనస్సులో ఆలోచనలు పరి పరి విధాల తచ్చాడేయి. కాని అన్ని ఆలోచనలూ వొక్క విషయం మీదకే, అంటే మృత్యువు మీదకే, వచ్చి వాలేయి.

మృత్యువు ప్రతిదానికీ అనివార్య అంతం అనేది మొదటి సారిగా వొక అదమనీయ శక్తి రూపంలో అతని ముందు ప్రత్యక్షం అయింది. ఆ మృత్యువు, నిద్రలో మూలుగుతూ తర్క వితర్కం యేమీ లేకుండానే వొట్టి అలవాటు వల్ల కొంచెం సేపు దేవుణ్నీ కొంచెం సేపు దయ్యాన్నీ గుర్తుకు తెచ్చుకుంటూ వున్న తన ప్రియమైన అన్నగారి రూపంలో అప్పటి దాకా వున్న సుదూర భావన కాదు. మృత్యువు తనలోనూ వుంది, అని తను అనుభూతి చెందాడు. ఇవాళ కాకపోతే రేపు, రేపు కాకపోతే యెల్లుండి, కాకపోతే ముప్పై యేళ్ల తర వాత – తేడా యేం వుంది గనక? ఈ అనివార్య మృత్యువు యేమిటైందీ అతనికి తెలీదు. దాన్ని గురించి తను ఆలోచించలేదు. ఆలోచించలేడు, ఆ ధైర్యం లేదు.

"నేను పని చేస్తున్నాను, యేదో చెయ్యాలని అనుకుంటున్నాను అయినా అన్నీ సమాప్తం అయిపోతాయనే విషయాన్ని మరిచే పోయాను, మృత్యువనే లాంటి దొకటుందనీ మర్చే పోయాను."

అతను ముడుచుకు పోయి, మోకాళ్లమీద చేతులు పెట్టుకుని మంచంమీద కూర్చు న్నాడు. ఆలోచనల్లో తీవ్రంగా మునిగిపోయి వుండడంతో గట్టిగా శ్వాసకూడా పీల్చకుండా వుండి పోయాడు. కాని యెంతగా మనస్సు లగ్నం చేస్తే అంతగా అతనికి యిది స్పష్ట పడింది, నిస్సందేహంగా స్పష్టపడింది. ఏమంటే నిజానికి జీవితంలో వొక చిన్న విషయం మీద తను దృష్టి పెట్టలేదు, మర్చిపోయాడు. మృత్యువు వస్తుంది, అన్నిట్నీ సమాప్తం చేస్తుంది. అంచేత దేన్ని ఆరంభించినా వ్యర్థం, మనం నిస్సహాయులం. ఇది భయంకరం గానే వుంది కాని యిది అంతే.

'కాని నేనింకా బతికే వున్నాను. నేనేం చెయ్యాలి? ఏం చెయ్యాలి?' అని హతాశుడై అనుకున్నాడు. అతను కొవ్వొత్తి వెలిగించి మెల్లిగా లేచి అద్దంలో ముఖం చూసుకుందామని వెళ్లాడు. ముఖాన్నీ, జుట్టునీ పరకాయించి చూసుకున్నాడు. కణతల దగ్గర నెరిసిన వెంట్రు కలు కనిపించాయి. నోరు తెరిచి చూసుకున్నాడు. దంతాలు కొన్ని చెడిపోతున్నాయి. కండ పుష్టి గల చేతుల్ని చాచేడు. ఆఁ, గట్టిగానే వున్నాడు. కాని నికొలాయ్ కూడా, యిప్పుడు

శిధిల శ్వాసకోశాంలో వూపిరి పీల్చుకోవడానికి తంటాలు పడుతూ వున్నా ఛాకప్పుడు బలంగా, శరీర దారుఢ్యంతోనే వున్నాడు. హఠాత్తుగా అతనికి తమ చిన్నతనం గుర్తు వచ్చింది. పడుకుందామని పక్కలమీదకి చేరినా నిద్రపోకుండా ట్యూటర్ ఫ్యోదొర్ బొగ్దానిచ్ గదిలో నుంచి అవతలికి వెళ్లిపోయేదాకా ఆగేవాళ్లు. అప్పుడు ఛాకళ్ల మీదకి ఛాకళ్లు తలగడాలు విసురుకుని కేరింతాలు కొడుతూ నవ్వీ నవ్వీ, తెగ నవ్వుకొనే వాళ్లు. ఎంత విరగబడి నవ్వుకునే వాళ్లంటే ఫ్యోదొర్ బొగ్దానిచ్ వస్తాడేమోననే భయం కూడా తుళ్లిపడే ఆ జీవితానంద మాధుర్యాన్ని పొంగి పొర్లకుండా ఆపేది కాదు. 'ఇప్పుడు వంగిపోయిన ఆ శూన్య ఛాతీ... నేను, నాకేం జరుగుతుందో యెందుకు జరుగుతుందో తెలియకుండా...'

"హేక్! హేక్! అబ్బ! దీన్తగలెయ్య! నువ్వేం చేస్తున్నావ్? నిద్రపోవడం లేదేం?!" అని నికొలాయ్ అడిగేడు.

"యెందుకనో నిద్రపట్టడం లేదు."

"నాకు మంచి నిద్రపట్టింది. ఇప్పుడు నాకు చెమట కూడా పట్టడం లేదు. చూడు నా చొక్కా చెమటవుందా?"

లేవిన్ అతని చొక్కా తడిమి చూశాడు. మళ్లీ తెర అవతలి వేపు వెళ్లి కొవ్వొత్తి ఆర్పేశాడు. అయినా అతనికి నిద్ర రాలేదు. తను యెలా బతకాలీ అనే సమస్యని పరిష్కరించుకున్నాను అనుకున్నాడో లేదో యీ సమస్య వచ్చి పడింది – మృత్యువు సమస్య. దీనికి సమాధానం లేదు.

'అవును, అతను చనిపోతున్నాడు. వసంత ఋతువు దాకా వుంటాడేమో. అతనికేం చెయ్యగలను? యేం చెప్పగలను? నాకేం తెలుసు దీన్ని గురించి? అసలు దీన్ని గురించి మరిచి పోయాను.'

32

మొదట్లో నమ్రతగా అణకువగా వుండడం వల్ల వెంటనే అయ్యోపాపం అనే భావం కలిగించే మనుషులు, అంతే త్వరగా తమ అనుచిత కోపం, తప్పులు యెంచే లక్షణాలతో భరించలేనివాళ్లుగా తయారవుతారని లేవిన్‌కి చాలా కాలంగా తెలుసు. అన్నగారి విషయంలో యిది నిజమే అవుతుందని అతను ముందే గ్రహించాడు. నిజంగానే నికొలాయ్ మెతకదనం యెక్కువ సేపు వుండలేదు. ఆ మర్నాడు ఉదయమే అతను చిరాకు పడిపోయాడు. లేవిన్‌కి బాగా నలుపుపెట్టే పుళ్లమీదే ఉప్పు రాశేడు.

తప్పు తనదేనని లేవిన్‌కి అనిపించింది గాని యిక యిప్పుడు చేసేది యేమీ లేకపోయింది. తామిద్దరూ నటన మానేసి ఛాకళ్లతో ఛాకళ్లు మనస్సు విప్పి మాట్లాడినట్లయితే గనక, అంటే, యేమనుకుంటున్నారో అనుభూతి చెందుతున్నారో దాన్నే గనుక పైకి చెప్పుకున్న

ట్నయితే ఒకళ్ల కళ్లల్లోకి ఒకళ్లు చూసుకొని "నువ్వు చనిపోతున్నావు, చనిపోతున్నావు, చనిపోతున్నావు" అని లేవిన్ చెప్పేవాడు, "చనిపోతున్నానని తెలుసు, కాని భయపడుతున్నా, భయపడుతున్నా" అని నికొలాయ్ చెప్పేవాడు. మనస్సు విప్పి మాట్లాడుకుంటే వాళ్లు వేరే యింకో మాటని దేన్నీ మాట్లాడేవాళ్లు కాదు. కాని అది అసంభవం. దాంతో లేవిన్ జీవితమంతా ప్రయత్నించినా చెయ్యలేక పోయినదాన్ని చెయ్య ప్రయత్నించేడు. అతను చూసి నట్టుగా చాలామంది దీన్ని యెంతో బాగా చెయ్యగలిగి వుంటారు, అలా లేకుండా వాళ్లకి బతకడం అసంభవం – అదేమంటే తను అనుకుంటూ వున్న దాన్ని చెప్పకుండా వుండే ప్రయత్నం. అతను అదే చేశాడు, కాని చాలా పాడుగా చేశాడు, తనకి తెలుసు. అన్నగారు దాన్ని కనిపెట్టేవాడు. దాంతో అతనికి మరింత మంటెక్కి పోయేది.

మూడో రోజున నికొలాయ్ తమ్ముణ్ణి తన పథకాలన్నిట్నీ మరో సారి వివరించమని లేవిన్ని అడిగేడు. విన్నాక లేవిన్ని చెడామడా విమర్శించేడు. ఉద్దేశపూర్వకంగానే దాన్ని కమ్యూనిజంతో కలగాపులగం చేశాడు.

"నువ్వు పూరికే పరాయివాళ్ల ఆలోచనలు అంది పుచ్చుకున్నావ్. కాని వాటిని వక్రీకరించేవు: ఎక్కడ లాయకీ కాదో అక్కడ వాటిని అమలు చెయ్యబోతున్నావు."

"నేను చేసే దానికీ, కమ్యూనిజానికీ అసలు సామ్యమే లేదు. కమ్యూనిస్టులు సొంత ఆస్తి, పెట్టుబడి, వారసత్వ హక్కు అనేవి న్యాయసమ్మతం కాదని అంటారు. కాని నేను యీ ముఖ్య స్టిమ్యులస్ కాదనడం లేదు" (యీ బాపతు మాటలని వాడడం లేవిన్కి యిబ్బంది అనిపించింది గాని తన పనిలో యెక్కువ అభిరుచి చూపించడం పెరిగిన దగ్గర్నించీ అలాంటి రష్యేతర మాటల్ని యింకా యింకా యెక్కువ వాడేడు). "నేను శ్రమని నియమితం చెయ్యాలనే కోరుతున్నాను" అన్నాడు.

"అదే, అదే మరి. నువ్వు యెంగిలి ఆలోచనలు పట్టేవు. వాటికి ప్రాణభూతమయిన వాటినన్నిట్నీ కొట్టి పారేశావు. నువ్వేదో కొత్తదాన్ని కనిపెట్టినట్టు మమ్మల్ని నమ్మించ ప్రయత్నిస్తావు" కోపంతో టై కట్టుకున్న మెడని యెగరేస్తూ అన్నాడు నికొలాయ్.

"కాని నా ఆలోచనకీ వాటికీ మధ్య సామ్యం యేమీ లేదు..."

"వాటికి..." అని నికొలాయ్ కళ్లల్లో కోపరేఖ ఝలక్ మనగా వ్యంగ్యంగా చిరునవ్వు నవ్వుతూ అన్నాడు. "ఆ ఆలోచనలకి కనీసం యేమనాలో దాన్ని జామెట్రిక్ సౌందర్యం అయినా వుంది, ఒక స్పష్టత, అసందిగ్ధ సౌందర్యం వుంది. అవి పూహాస్వర్గాలే కావచ్చు. కాని మన గతాన్నంతటినీ tabula rasa[1] చేస్తే – అంటే సొంత ఆస్తి, కుటుంబం వుండవు – అప్పుడు శ్రమ వ్యవస్థితం అవుతుంది. నీ ఆలోచనలు అందించేదేమీ లేదు..."

---

[1] తుడిచి పెట్టిన పలక (లాటిన్). అంటే సాఫుగా తుడి చెయ్యడం – అను.

"యెందుకు యీ రెండింటినీ కలగాపులగం చేస్తావు? నేనెప్పుడూ కమ్యూనిస్ట్ని కాలేను."

"నేను వున్నాను, కమ్యూనిజం సమయం యింకా రాలేదు, కాని అందులో తార్కికత వుంది. దానికి భవిష్యత్తు వుంది. తొలి శతాబ్దాల్లో క్రైస్తవ మతానికి వున్నట్టు."

"నేననుకోవేదల్లా శ్రమ శక్తిని శాస్త్రీయ దృక్పథం దృష్ట్యా దర్శించాలని. అంటే దాని లక్షణాలని అధ్యయనం చేసి నిరూపించాలి..."

"యేం లాభం లేదు. శ్రమ శక్తి అభివృద్ధి చెందే క్రమంలో తన రీతిలో కొన్ని నిశ్చిత రూపాలు తీసుకుంటుంది. ఒకప్పుడు బానిసలు వుండేవాళ్లు, వాళ్ల తర్వాత metayers[1], యిప్పుడు మనకి పంట పంచుకునే వ్యవస్థ వుంది, పట్టాదారు పద్ధతి వుంది, కూలీ పద్ధతి వుంది. ఇంకేం కావాలి?"

ఈ మాటలు విని లేవిన్‌కి చిర్రున కోపం వచ్చింది. యేమంటే తను కమ్యూనిజానికీ ప్రస్తుతం వున్న రూపాలకీ మధ్య సమతూకంగా వుండేదాన్ని పట్టాలని అనుకుంటున్నట్టు, అది సాధ్యం అయే అవకాశాలు తక్కువ అయినట్టు అతని మనస్సు లోపల్లోపల అది నిజమే నన్నట్టనిపించింది.

"పనివాడికీ నాకూ పనిని ఉత్పాదకంగా వుండేటట్టు చెయ్యాలని ప్రయత్నిస్తున్నాను. నేను యేర్పాటు చెయ్యాలనుకుంటున్న..." అని కోపంగా అన్నాడు.

"నువ్వేమీ యేర్పాటు చెయ్యాలనుకోవడం లేదు. యెప్పుడూ వున్నట్టే వుండాలను కుంటున్నా వంతే, అందరికంటే తేడాగా వుండాలనుకుంటున్నావు. రైతులని పూరికే దోచు కోవడం లేదని కాని దాని గురించి నీకు ఆలోచన కూడా వుందని చూపించుకోవాల నుకుంటు న్నావు."

"నువ్విలా అనుకుంటూ వుంటే నీకో దండం నన్నొదిలెయ్యి" అని లేవిన్ జవాబి చ్చేడు. తన యెడమ బుగ్గ అదుపు చేసుకోలేనట్టుగా అదురుతోందని అతనికి అనిపిస్తూనే వుంది.

"నీకసలు నిజమైన నమ్మకాలు లేవు, వుండవు, నీ అహం తృప్తిపడడం కోసం చూస్తూ వుంటావంతే."

"సర్లే, వదిలెయ్యి నన్ను."

"యెలాగూ వదిలేస్తాను. ఇదివరకే అలా చేసి వుండాల్సింది. నీ ఖర్మ, ఫో, అసలు యిక్క డికి రావడం వాదే బుద్ధి తక్కువ."

తర్వాత అన్నగార్ని శాంతింప చెయ్యాలని లేవిన్ యెంత కాళ్లావేళ్లా పడ్డా కూడా

---

[1] పట్టాదార్లు (ఇంగ్లీషు).

నికొలాయ్ వినిపించుకోలేదు. తను వెళ్లిపోతాననే మంకు పట్టు పట్టి కూర్చున్నాడు. అన్నగారికి బతుకు దుర్భరం అయిందని లేవిన్‌కి అనిపించింది.

వెళ్లిపోవాలని నికొలాయ్ అంతా సిద్ధమై వుండగా లేవిన్ మళ్లీ కృత్రిమంగానే బతిమలాడి, తన తప్పులుంటే తను అతన్ని యేమన్నా కష్టపెట్టి వుంటే క్షమించమని వేడుకున్నాడు.

"ఆరె, నీ ఔదార్యం చూపించ దలుచుకున్నావా?" అని నికొలాయ్ చిరునవ్వు నవ్వేడు. "నువ్వు పొస్వ అని అనిపించుకోవాలనుకుంటే, సరే నీకా సంతోషాన్ని యిస్తాను. అయినా నేను వెళ్లిపోతున్నా."

అతను వెళ్లిపోయే ముందు నికొలాయ్ అతన్ని ముద్దు పెట్టుకున్నాడు. అతని కళ్లల్లోకి వింత గాంభీర్యంతో చూశేడు.

"అయినా నా గురించి చెడ్డగా అనుకోకురా" అన్నాడు. అతని కంఠం రుద్ధమైంది.

హృదయం పలికిన మాటలు యివి మాత్రమే. యీ మాటల అభిప్రాయం లేవిన్‌కి బోధపడింది. 'నువ్వే చూస్తున్నావుగా నీకే తెలుసుగా నా పరిస్థితి అధ్వానంగా వుంది. బహుశా మనం యెన్నటికీ మళ్లీ కలుసుకోమేమో.' లేవిన్‌కి యిది బోధపడింది. అతని కళ్లల్లో నీళ్లు గిరుక్కున తిరిగాయి. అన్నగార్ని ముద్దుపెట్టుకున్నాడు, కాని యేమీ అనలేదు. అన డానికేముంది గనక.

అన్నగారు వెళ్లిపోయిన రెండు రోజుల తరువాత లేవిన్ విదేశాలకి వెళ్లాడు. రైల్లో అతనికి కిట్టీ పినతండ్రి కొడుకు ష్చేర్‌బాత్‌స్కీ తగిలేడు. తను దిగాలు పడివుండడం అతనికి ఆశ్చర్యకారకమైంది.

"యేమిటి సంగతి?" అని ష్చేర్‌బాత్‌స్కీ అడిగేడు.

"ప్రత్యేకం యేమీ లేదు. యీ లోకంలో సుఖంగా వుండే వీలూ లేదు."

"యెందుకు లేదు? మ్యూలున్‌కి గీలున్‌కి బదులుగా నాతో పారిస్ రా. అక్కడ చూద్దువు గాని యెలాంటి మజా వుంటుందో."

"వద్దు. నాకు సంబంధించి అంతా ముగిసినట్టే. ఇక నేను ఈ లోకంనుంచి వెళ్లి పోయే వేళ వచ్చింది."

"అదేమిటి!" అని ష్చేర్‌బాత్‌స్కీ నవ్వుతూ అన్నాడు. "నేనైతే యిప్పుడు మొదలు పెట్టడానికి తయారుగా వున్నాను."

"అవును, కొన్ని రోజులకితం దాకా నేనూ అలానే అనుకున్నాను. కాని యిప్పుడు తెలుస్తోంది త్వరలో యీ లోకంనుంచి వెళ్లిపోతున్నానని."

తను కొన్ని రోజులుగా తను అనుకుంటూవున్న విషయాన్నే నిజంగా చెప్పాడు. అన్నిట్లోనూ అతనికి మృత్యువు కన్పిస్తుంది. లేదా మృత్యువు రాక కనిపిస్తోంది. అయినా కూడా అతనికి తను వేసుకున్న పథకాల పట్ల ఆసక్తి పోలేదు. మృత్యువు వచ్చేదాకా యెలాగో అలా బతకాలి. అతనికి సంబంధించి అన్నిటి మీదా చీకటి కమ్ముకుంటోంది. కాని యీ చీకటి మూలంగానే తన కృషి తమస్సునుంచి జ్యోతి వేపు నడిపించే సూత్రం అని అతనికి అని పించింది. సర్వ శక్తితోనూ దాన్ని ఆలంబనంగా పట్టుకున్నాడు.

నాల్గవ భాగం

1

కరేనిన్ భార్యాభర్తలు వొకే యింట్లో కాపరం చేస్తూనే వున్నారు, ప్రతి రోజూ కలుసుకుంటూనే వుండేవాళ్ళు. కాని వొకళ్ళకి వొకళ్ళు యే మాత్రం అంటీ పట్టకుండా పరాయి వాళ్ళల్లా వుండిపోయారు. యింట్లో పని పాటలు చేసే వాళ్ళకి యే పిసరూ అనుమానం కలక్కూడదని కరేనిన్ భార్యని రోజూ విధిగా చూసేవాడు. కాని యింటి దగ్గర భోజనం చెయ్యడం మానేశాడు. వ్రాన్‌స్కీ యెప్పుడూ యీ యింటికి వచ్చేవాడు కాదు కాని అన్నా అతన్ని వేరే యెక్కడన్నా కలుసుకునేది. ఆ విషయం ఆమె భర్తకి తెలుసు.

పరిస్థితి ముగ్గురికీ దుర్భరంగానే వుంది. యిది తాత్కాలిక దుఃఖకరమైన యిబ్బంది అనీ, త్వరలోనే మారిపోతుందనీ వాళ్ళకి గనక ఆశలేకపోయినట్లయితే వొక్కళ్ళు కూడా దాన్ని ఒక్క రోజు కూడా భరించగలిగి వుండేవాళ్ళు కాదు. ప్రతిదీ ముగిసిపోయినట్టుగానే ఈ ప్రేమ కాంక్ష పోతుందనీ, ప్రతి వాళ్ళూ దీన్ని గురించి మరిచిపోతారనీ తన పేరు నిష్కళంకంగా బయట పడుతుందనీ కరేనిన్ నమ్మకం. యీ పరిస్థితికంతటికీ బాధ్యురాలై, మిగిలిన వాళ్ళకన్నా యెక్కువ దుర్భరవేదన పడుతున్న అన్నా త్వరలోనే యీ చిక్కు విడిపోతుందని, తన పరిస్థితి తేటతెల్లమవుతుందని అనుకోవడమేకాక, అలా జరుగుతుందని గాఢంగా నమ్మింది. అందుచేత దాన్ని భరించింది. యీ చిక్కుని యెవరు విప్పుతారో ఆమెకి తెలీదు కాని అది యేమైనా త్వరలోనే జరుగుతుందనే ఆమె గాఢ విశ్వాసం. తనకి తెలియకుండానే ఆమె వొరవడిని అనుసరిస్తూ వ్రాన్‌స్కీ కూడా తన ప్రమేయం లేనిది యేదో తమ కష్టాలన్నిట్నీ విధిగా పరిష్కరించవలసినదేదో వస్తుందని ఆశించాడు.

శీతకట్టు మధ్యలో వ్రాన్‌స్కీ వొక వారం విసుగ్గా గడపవలసివచ్చింది. పీటర్స్‌బర్గ్ చూడవచ్చిన వొక విదేశీ ప్రిన్స్‌ని అతనికి అప్పగించారు. అతను అక్కడ చూడదగ్గ వాటి నన్నిట్నీ ప్రిన్స్‌కి చూపించాల్సి వుంది. వ్రాన్‌స్కీ తనకిగా తానేం తక్కువ వాడు కాదు, విశిష్ట వ్యక్తిత్వం వున్నవాడే. అదీ గాకుండా తన ఆత్మాభిమానానికి కించిత్ భంగం కలక్కుండా మంచి మర్యాదలు చూపించడం, ఆ ప్రిన్స్ హోదాలాంటి వాళ్ళతో కలిసిమెలిసి తిరగడం అనే కళలని వొడిసి పట్టిన వాడే. అందుకనే ఆ ప్రిన్స్‌ని అతనికి అప్పగించేరు. కాని అతనికి యీ బాధ్యత నిర్వహించడం మహా యాతన అనిపించింది. ప్రిన్స్‌కి పిసరు పొల్లుపోకుండా అన్నిట్నీ చూడాలని కోరిక. యేమంటే తిరిగి వెనక్కి వెళ్ళాక రష్యాలో తానేం చూసాడూ అని అడిగితే

చెప్పద్దూ! అదీగాక రష్యాలో అనుభవించదగ్గ రసగుళికలన్నిట్నీ అనుభవించాలని అతనికీ ఆత్రుతగా వుంది. ఆ రెండు రకాలా ప్రిన్స్‌కి తృప్తికలిగించేటట్టు పర్యటన నిర్వహించడం వ్రాన్‌స్కీ బాధ్యత అయింది. పొద్దుటి పూట చూడదగ్గ విశేషాలు చూడ్డానికి వెళ్లేవాళ్లు. సాయంత్రాలప్పుడు జాతీయ వినోద కార్యక్రమాల్లో పాల్గొనేవాళ్లు. ప్రిన్స్‌లలో కూడా యీ ప్రిన్స్ ఆరోగ్యం యెన్నతగింది. కసరత్తు చేసి శరీరాన్ని బాగా రూపుతీర్చుకున్నాడు. అంతేత అలవాట్లు శ్రుతి మించినా కూడా పువ్వులా నవనవలాడుతూ వుండేవాడు. ప్రిన్స్ విస్తృతంగా దేశాటన చేశాడు. ఆధునిక రవాణా సౌకర్యాలవల్ల కలిగిన గొప్ప లాభం విదేశీ భోగాలు అందుబాటులోకి రావడం అని గుర్తించాడు. అతను స్పెయిన్ సందర్శించి అక్కడ ప్రేమ గీతాలు పాడాడు. ఒక స్పానిష్ మాండలిన్ వాయిద్యకారిణితో ప్రేమ కలాపం జరిపేడు. స్విట్జర్‌లేండ్‌లో సంభార్ జింకల్ని వేటాడేడు. ఇంగ్లండ్‌లో ఎర్ర కోటు తొడుక్కుని గుర్రాల్ని కంచెలమీద గెంతిస్తూ దౌడు తీశేడు. పందెం కాసి రెండు వందల అడివి కోళ్లని కొట్టేడు. టర్కీలో ఓ జనానాకి వెళ్లాడు. భారతదేశంలో యేనుగు సవారీ చేశాడు. యిప్పుడు రష్యా యాత్రలో రష్యన్ విచిత్రాలన్నిట్నీ రుచి చూడాలనే కోరికతో వున్నాడు.

ప్రిన్స్‌కి వినోదం కలిగించే బాధ్యత తనమీద వుండటంతో అనేకమంది అందించే వినోదాలలో యెంచుకోవడం వ్రాన్‌స్కీకి కష్టం అయింది. వాళ్లు అట్లు తిన్నారు. ఎలుగు బంట్ల వేటకెళ్లారు. మూడు గుర్రాల బగ్గీ యెక్కారు. జిప్సీలని చూశేరు. అచ్చమైన రష్యన్ పద్ధతిలో, పింగాణీ సామాను పచ్చ పచ్చ చేసే దాకా, కైపు యెక్కేట్టు తాగి తందనాలాడేరు. ఆ ప్రిన్స్ మహా తేలిగ్గా రష్యన్ స్వభావంలోకి పరకాయ ప్రవేశం చేశాడు. ఒక పళ్లెం నిండుగా వున్న పింగాణీ సామానుని చిత్తు చేశేశాడు. ఓ జిప్సీ ఆడమనిషిని వొళ్లో కూర్చో పెట్టుకుని "వూఁ, యింకేమి వుంది? ఓస్, యింతేనా రష్యన్ విచిత్రం అంతా" అని అడుగుతున్నట్టు చూశాడు.

నిజానికి రష్యన్ సరదాలన్నిటిలోనూ ప్రిన్స్‌కి బాగా నచ్చినవి ఫ్రెంచి నటీమణులు, బాలేనర్తకులు, శ్వేత చిహ్న షాంపేన్. వ్రాన్‌స్కీకి ప్రిన్స్‌లు కొత్త కాదు; అయినా గత కొంతకాలంగా అతను మారిపోయిం దానివల్లనో మరే కారణంవల్లనో లేకపోతే యీ ప్రిన్స్‌ని మరీ సన్నిహితంగా చూడ్డంవల్లనో అతనికి ఆ వారం చాలా యీడ్చుకుంటూ గడుస్తున్నట్టు అనిపించింది. ప్రమాదకరమైన ఉన్మాదితో గడపవలసివచ్చి ఆ ఉన్మాది అంటే భయపడుతూ, యెక్కడ వాడి పిచ్చి తనకి అంటుకుంటుందోనని భయపడే వాడిలాగా అతను ఆ వారం అంతా గడిపాడు. ప్రిన్స్ దగ్గర వున్న సమయంలో తన ఆత్మాభిమానం యే మాత్రం గాయపడకుండా వుండాలంటే తన హుందాతనాన్ని కొంచెం కూడా సడల నివ్వకూడదన్న గుర్తింపు వ్రాన్‌స్కీకి వుంది. రష్యన్ మాధుర్యాల్ని చవి చూపించడానికి మితిమీరి అతిగా పోయిన వాళ్లపట్ల ప్రిన్స్ తిరస్కార పూర్ణ వైఖరి చూపించేడు. వ్రాన్‌స్కీకి వాళ్లు తమ ప్రవర్తనతో ఆశ్చర్యం కలిగించారు. తను బాగా తెలుసు కోవాలనుకుంటున్న రష్యన్ మహి

ళం గురించి ప్రిన్స్ చెప్పిన అభిప్రాయాలు విని వ్రాన్‌స్కీ కోపంతో యెర్రబడిపోయాడు. కాని ప్రిన్స్ అంటే వ్రాన్‌స్కీకి వెలపరం కలగడానికి ముఖ్య కారణం అతనికి ప్రిన్స్‌లో తన ప్రతిబింబం కనిపించడమే. మరి ఆ దర్పణంలో కనిపించేది అతని ఆత్మాభిమానానికి సంతుష్టిని యివ్వలేదు. ప్రిన్స్ శుద్ధ బుద్ధావతారం, మితిమీరిన ఆత్మ విశ్వాసం వున్న వాడు, మహా ఆరోగ్య సంపన్నుడు, బహుశుచిత్వమున్నాడు అంతే. అతను పెద్ద మనిషి — ఆ ముక్క నిజం, దాన్ని వ్రాన్‌స్కీ కొట్టిపారెయ్య లేడు. తన కంటే అధికులైన వాళ్ల దగ్గర అతను సహజత్వంతో, ఆత్మసమ్మాన భావంతో వుంటాడు. తన సమానస్థులతో సాదాగా, యెరమరికలు లేకుండా వుంటాడు. తనకంటే తక్కువ వాళ్లతో సహృదయ ప్రావకం కనబరుస్తున్నట్టుంటాడు. వ్రాన్‌స్కీ అలానే వుండేవాడు, అలా వుండడం గొప్ప అని యెప్పుడూ భావిస్తూ వుండేవాడు. కాని ప్రిన్స్‌కి సంబంధించి వ్రాన్‌స్కీ తక్కువ వర్గం వాడే అవడంతో, అందువల్ల తనపట్ల అతను అలా ప్రావక దృష్టి చూపించడంతో వ్రాన్‌స్కీకి మంటెక్కిపోయింది.

'బదుద్దాయి దున్నపోతు! యేం నేనలా కనిపిస్తున్నానా?' అనుకున్నాడు.

సరే, యేది యేమైతేనేం, యేడవ రోజున ప్రిన్స్‌ని మాస్కోకి పంపిస్తూ వీడ్కోలు చెప్పి, అయిష్టమైన విధుల్నీ, అవిష్టమైన దర్పణాన్నీ వదిలించుకున్నందుకు హమ్మయ్య అనుకున్నాడు. తను చేసిన సహాయానికి కృతజ్ఞతలు పొందేడు. ఎలుగుబంటి వేటనుంచి తిరిగివచ్చేక రాత్రంతా రష్యన్ జాతర రుచి చూపించి రైల్వే స్టేషన్లో ప్రిన్స్‌కి వీడ్కోలు చెప్పి సెలవు తీసుకున్నాడు.

2

ఇంటికి వెళ్లాక వ్రాన్‌స్కీకి అన్నా దగ్గర్నుంచి వచ్చిన చీటీ కనిపించింది. 'నాకు బాగా లేదు, విచారంగా వుంది. యిల్లు వదిలిపెట్టలేను, మిమ్మల్ని చూడకుండా వుండనూ లేను. యీ సాయంత్రం రండి. కరేనిన్ యేడు గంటలకి అయుక్త సమావేశానికి వెడతారు, పది గంటలదాకా అక్కడే వుంటారు.' భర్త స్పష్టంగా యిచ్చిన ఆజ్ఞని ఉల్లంఘించి ఆమె తనని యింటికి రమ్మంటున్నందుకు క్షణకాలం పాటు ఆశ్చర్యపోయాడు. కాని వెళ్లాలని నిర్ణయించుకున్నాడు.

ఆ శీతకట్టులో వ్రాన్‌స్కీని కల్నల్ చేశారు. అతను రెజిమెంట్‌తోబాటు కాకుండా విడిగా ఒంటరిగా వుండడం మొదలుపెట్టాడు. నాస్తా తిన్నాక అతను సోఫాలో పడుకున్నాడు. అయిదు నిముషాలలో గత కొద్ది రోజులుగా తను చూసిన వెలపరం కలిగించే దృశ్యాల జ్ఞాపకాలు కలగాపులగంగా కలిసిపోయి అన్నా జ్ఞాపకాలూ అలాగే ఎలుగుబంటి వేటలో సాయం చేసిన రైతు దృశ్యాలూ మిళితం అయిపోయాయి. తెలియకుండానే అతని కళ్లు నిద్రలో

మూసుకుపోయాయి. భయంతో వొణుకుతూ లేచేటప్పటికి చీకటి పడింది. గబగబా వో కొవ్వొత్తి వెలిగించాడు. 'యేమిటది? యేం జరిగింది? యెంత భయంకరమైన కల నన్నిలా బెదర గొట్టింది? ఆఁ, అవును, వేటప్పుడు ఆ రైతు, పీచు గడ్డం వున్న మురికి చిన్నమనిషి. అతను వొంగిపోయి యేదో చేస్తూ వున్నట్టుండి ఫ్రెంచిలో అర్థం కాకుండా యేదో గొణి గాడు. అదీ' అని అనుకున్నాడు. 'యెందుకిది నన్నింతలా భయ పెట్టాలి?' మరో సారి ఆ చిన్నమనిషి అతని కళ్ల ముందు కనిపించేడు. అర్థం కాకుండా అతను గొణిగిన ఫ్రెంచి మాటలు వినిపించాయి. వ్రాన్‌స్కీ వెన్నులో భయంతో వణుకు పుట్టింది.

'యేమిటీ అర్థంపర్థంలేని చెత్త' అని గడియారం కేసి చూస్తూ అనుకున్నాడు.

ఎనిమిదిన్నర అయింది. నౌకర్ని పిలిచాడు. గబగబా బట్టలు వేసుకుని బయటికి వెళ్లాడు. ఆలస్యం అయిపోయిందన్న బెంగలో కల విషయం మరిచిపోయాడు. కరేనిన్‌ల యిల్లు చేరాక గడియారంకేసి చూశాడు. పది నిముషాలు తక్కువ తొమ్మిది అయింది. వో ఇత బూడిద రంగు గుర్రాలు కట్టిన యెత్తు బగ్గీ వొకటి గుమ్మం దగ్గర వుంది. అది అన్నా బగ్గీ అని గుర్తించాడు. 'ఆమె నా దగ్గరికి బయల్దేరింది' అనుకున్నాడు. 'అదే బాగుంటుంది. యీ యింట్లోకి అడుగుపెట్టడం అంటే నాకు అసహ్యం. యేదైతేనేం నేను దాంకోలేను' అను కున్నాడు. బాల్యంనుంచీ దేనిపట్లా కూడా సిగ్గుపడక్కర్లేకుండా వుండే మనిషిలాగా స్లెడ్జి దిగి గుమ్మం వేపు వెళ్లాడు. తలుపు తెరుచుకుంది. చేతిమీద రగ్గు వేసుకున్న వాకిలి కావలి వాడు బగ్గీని పిలిచాడు. వ్రాన్‌స్కీకి చిన్నా చితకా వివరాలు పట్టించుకునే అలవాటు లేదు కాని వాకిలి కావలివాడి ముఖంలో యిప్పుడు కనిపించిన ఆశ్చర్యాన్ని గమనించకుండా వుండ లేకపోయాడు. సరిగ్గా గుమ్మంలోనే అతను కరేనిన్‌ని దాదాపు ఢీకొట్టాడు. పాలిపోయి దిగాలుగా వున్న కరేనిన్ ముఖంమీద దీప కాంతి నేరుగా పడింది. అతను గుండ్రటి నల్లని టోపీ పెట్టుకున్నాడు. బీవర్ కాలర్ కింద తెల్లని మెడపట్టీ మెరుస్తోంది. కరేనిన్ నిశ్చలం జడ దృక్కులు వ్రాన్‌స్కీమీదనే లగ్నం అయేయి. వ్రాన్‌స్కీ వొంగి అభివాదం చేశాడు. కరేనిన్ యేదో చెప్పబోయినట్టు పెదివి ఆడించి, ప్రత్యభివాదం చేస్తున్నట్టు టోపీని తాకి గబగబా వెళ్లిపోయాడు. అతను వెనక్కి చూడకుండా బండి యెక్కడం, కిటికీలోనుంచి అందించిన ఒపెరా గ్లాస్‌లనీ రగ్గునీ అందుకోవడం, బండిలో కనిపించకుండా పక్కకి మళ్లడం వ్రాన్‌స్కీ చూశాడు. వ్రాన్‌స్కీ హాల్లోకి వెళ్లాడు. అతని కనుబొమలు ముడుచుకు పోయాయి. కళ్లల్లో కోపమూ, అలాగే గర్వమూ మెరిశాయి.

'యేం పరువు తక్కువ పరిస్థితి! యీ మనిషి ద్వంద్వయుద్ధం చేసి తన గౌరవాన్ని కాపాడుకుంటే నేనూ యేదో చెయ్యగలను, నా ఉద్దేశాలేమిటో చెప్పగలను. కాని యీ దౌర్బ ల్యం... లేదా పిచత్వం... నేను తనని మోసం చేస్తున్నాన నిపించేటట్టు చేస్తున్నాడితను. తనని మోసం చేసే ఉద్దేశం నాకు లేదు, రాదు' అనుకున్నాడు.

వ్రెడె తోటలో అన్నాతో మాట్లాడిన తర్వాత వ్రాన్‌స్కీ ఆలోచనాధోరణి మారింది.

అన్నా పూర్తిగా అతనికి అర్పితం అయిపోయింది, అతనే తన అదృష్ట నిర్ణేత అంది. భవిష్యత్తు యెలాంటి దైన్యానికీ. ఆ భవిష్యత్తుని స్వీకరించడానికి సిద్ధంగా వుంది. వ్రాన్‌స్కీ అప్రయత్నంగానే అన్నా దుర్బల స్థితిని గ్రహించి, తమ సంబంధం పరిసమాప్త మవుతుందని వొకప్పుడు తనకి కలిగిన వూహకి తిలోదకాలిచ్చేడు. అతని వైయక్తిక కాంక్ష మరోసారి వెనక్కి పోయింది. ప్రతిదీ పరమ స్పష్టంగా నిర్దిష్టంగా వున్న కార్యకలాప పరిధి నుంచి తను బయట పడుతున్నాననే యెరుకతోనే అతను పూర్తిగా తన అనుభూతులకి లొంగిపోయాడు. అతని అనుభూతులు మరింతగా అతన్ని అన్నాకి బంధించాయి.

ఇంకా హాల్లో వుండగానే అతనికి ఆమె లోపలికి వెడుతున్న అడుగుల చప్పుడు వినిపించింది. ఆమె తన కోసం యెదురు చూస్తూ వుందని అతను వూహించాడు. తన రాక విని లోపలికి వెళ్ళిందని అనుకున్నాడు.

"అబ్బా! వద్దు!" అని వ్రాన్‌స్కీని చూడగానే ఆమె అరిచింది. మొదటి మాటతో బాటే ఆమె కళ్ళల్లో నీళ్ళు ఉబికాయి. "అబ్బా! వద్దు! యిలాగ కనక జరిగితే చాలా ముందే, చాలా ముందే అలా జరిగిపోతుంది" అంది.

"యేమిటి? ప్రియా!"

"యేమిటా? నేను యెదురు చూస్తూ వుంటాను. గంట, రెండు గంటలు వ్యధ పడుతూ వుంటాను... లేదు, చెయ్యలేను, నీతో పోరుచెయ్యలేను. నువ్వు త్వరగా రాలేక పోయేవు. రాలేదు. చెయ్యలేను."

అన్నా రెండు చేతులూ అతని భుజంమీద వేసి చాలా సేపు గాఢంగా, పారవశ్యంతో, ప్రశ్నార్థకంగా చూస్తూనే వుండిపోయింది. యెంత కాలంగా తను అతన్ని చూడలేదో దాన్ని భర్తీ చేస్తున్నట్టుగా అతని ముఖంలోకి చూస్తూ వుండిపోయింది. తాము కలుసుకున్నప్పుడు యెప్పుడూ వున్నట్టుగానే యిప్పుడు కూడా ఆమె తన వూహల్లో అతన్ని దర్శించిన దాంతో (యెంతో మహనీయంగా వాస్తవంలో అసంభవంగా వుండే దాంతో) అతను వాస్తవంలో వున్న దాన్ని తులనాత్మకంగా చూసింది.

3

"అయితే అయన్ని చూశావ్?" అని దీపం కింద బల్ల దగ్గర చేరి కూర్చున్నాక అడిగింది. "ఆలస్యంగా వచ్చినందుకు నీకు శిక్ష" అంది.

"కాని యెలా జరిగిందిది? పరిషత్తులో వుండాలికదా అతను?"

"వెళ్ళాడు, అక్కణ్ణుంచి తిరిగివచ్చి మళ్ళీ యెక్కడికో వెళ్ళాడు. సరే, దాంతో యేమిలే, వదిలెయ్యి. ఆ గొడవ యెత్తకు. నువ్వెక్కడున్నావ్? ప్రిన్స్‌తోనా?"

అన్నాకి అతని జీవితంలోని అన్ని విషయాలూ తెలుసు. తనకి రాత్రంతా నిద్రలేక పోయిందనీ అంచేత ఆదమరిచి నిద్రపోయాననీ చెప్పబోయాడు. కాని సంతోషంతో ఉత్తేజంగా వున్న ఆమె వదనం చూసి అతనికి సిగ్గు అనిపించింది. అందుకని ప్రిన్స్ యాత్రమీద నో నివేదిక యివ్వవలసివచ్చిందని అన్నాడు.

"ఊఁ అయితే యిప్పుడదంతా అయిపోయింది కదా? అతను వెళ్ళిపోయాడు కదా?"

"దేవుడి దయవల్ల అంతా అయిపోయింది. యిది నాకు యెంత యాతనగా వుందో చెపితే నువ్వు నమ్మవు."

"యెందుకని? మీ వంటి మగ వాళ్ళందరికీ యిదే నిత్య జీవితం కదా" అని బల్ల మీద వున్న అల్లిక సరంజామాని అందుకుని కనుబొమలు చిట్లిస్తూ అందామె. అతనికేసి చూడకుండానే కొక్కెం విప్పడం మొదలుపెట్టింది.

"అలాంటి జీవితం నేను యెప్పుడో వదిలేశాను" అని ఆమె ముఖంలో వచ్చిన మార్పుకి ఆశ్చర్యపోయి దాని అర్థం యేమిటా అని వెతుకుతూ అన్నాడు. "యీ వారంలో యిలాంటి జీవితం చూసి స్వయంగా అద్దంలో ప్రతిబింబం చూసుకున్నట్టుగా అనిపించింది నాకు. నాకు చాలా చెడ్డగా అనిపించింది. యీ విషయం నేను వొప్పుకుని తీరాలి" అని అందమైన తెల్లని పలువరస కనిపించేటట్టు చిరునవ్వు నవ్వుతూ అన్నాడతను.

ఆమె చేతిలో అల్లిక సూది పట్టుకుంది గాని అల్లడం లేదు. వూరికే కూర్చుని అతనికేసి నిగూఢ, తేజోభరిత, ఆదరపూర్వక కళ్లలో చూస్తూ వుంది.

"యివాళ పొద్దుట లీజా వచ్చింది. కౌంటెస్ లిదియా ఇవానొవ్నా గురించి పట్టింపు లేకుండా పాపం వాళ్ళు నా దగ్గరకి వస్తూనే వున్నారమ్మా" అని జత చేసి చెప్పింది. "మీ ఎథీని పార్టీ గురించి చెప్పింది. యెంత వెలవరంగా వుంది!" అంది.

"నేను చెప్పబోతూ వున్నా..."

అన్నా అతని మాటకి అడ్డం వెళ్లింది.

"అక్కడ Thérèse కూడా వుంది కదా, నీకు తెలిసినావిడ?"

"నే చెప్దా మనుకున్నా..."

"మీ మగాళ్లు యెంత వెలవరంగా వుంటారు! వొక ఆడది అలాంటి వాటిని యెన్నటికీ మర్చిపోలేదని నీకు తెలీదూ?" అందామె, యెక్కువ కాక రేగిపోతూ. ఆ రకంగా తన కోపానికి కారణం వెల్లడి చేసింది. "ముఖ్యంగా నీ జీవితం గురించి తెలియని ఆడమనిషికి. నాకేం తెలుసు? నాకు అసలు ఆదినుంచీ యేం తెలుసు? నువ్వు చెబితే తప్ప. నువ్వు నిజమే చెప్తున్నావో అబద్ధమే చెప్తున్నావో నాకెలా తెలుసు?" అంది.

"అన్నా! నువ్వు నన్ను అవమాన పరుస్తున్నావు. నా మీద నీకు నమ్మకం లేదా? నేను నీకు చెప్పలేదా నీ ముందు వెల్లడి చెయ్యని ఆలోచన వొక్కటి కూడా నా మనసులో లేదని?"

"అవునవును" అందామె తన అమాయని తరిమేసే ప్రయత్నం చేస్తున్నట్టు. "కాని అబ్బ! నేనెంత దౌర్భాగ్యంగా వున్నానో నీకు తెలిస్తేనా? నువ్వంటే నాకు నమ్మకం వుంది. నమ్మకం వుంది... ఆ, అయితే యేమిటి నువ్వంటున్నది?"

తను యేం చెప్ప దలచుకున్నాడో అది అతనికి వెంటనే గుర్తు రాలేదు. యిటీవల కొంత కాలంగా యెక్కువగా అన్నాలో కనిపిస్తున్న యీర్ష్య తాకిళ్ళు అతన్ని భయ విహ్వలుణ్ణి చేశాయి. అతనెంత ప్రయత్నించినా గాని అతని ఉత్సాహం చల్లబడిపోతుంది, తనపట్ల ఆమెకిగల ప్రేమవల్లనే ఆమెకా యీర్ష్య కలుగుతోందతనికి తెలిసినా గాని. ఆమె ప్రేమే తనకి పరమ ఆనందదాయకమైందని యెన్నిసార్లు తను అనుకోలేదు. ఆమె తనని ప్రపంచంలోని సుఖాలన్నిటి కంటే ప్రేమ మహత్వంగా వుండే స్త్రీలాగా ప్రేమిస్తోంది. అలాంటిది యిప్పుడు, ఆమెతో బాటుగా మాస్కోనుంచి వచ్చిన నాటి కంటే, అతనికి ఆనందం దూరమైపోయింది. అప్పుడతను విచారగ్రస్తుణ్ణని అనుకున్నాడు కాని ఆనందం ముందు రాబోతోందని భావించుకున్నాడు. యిప్పుడు మహత్తర ఆనందం వెనక పడిపోయిందని అనిపించింది. ఆమె తను మొదటి సారి చూసిన స్త్రీలాగా యే మాత్రం లేదు. భావనాత్మకంగా శారీరకంగా ఉభయత్రా కూడా ఆమె మొదటి సారి కంటే దిగజారి పోయింది. ఆమె మోటు అయింది, ఆ నటి Théresa ప్రస్తావన వచ్చినప్పుడు క్రోధభావం ఆమె వదనాన్ని వికృతం చేసింది. యెవరేనా వ్యక్తి తను కోసి వాడిపోయిన పువ్వుకేసి చూసినట్టుగా అతను అన్నాకేసి చూశాడు. యే సౌందర్యం నిమిత్తమై దాన్ని కోసి పాడు చేశాడో ఆ సౌందర్యాన్ని ఆ పువ్వులో చూడ్డం అతనికి కష్టం అవుతుంది. అయినా తన ప్రేమ చాలా ప్రబలంగా వున్నప్పుడు, నిజంగా తలుచుకుని వుంటే దాన్ని తన హృదయంలో నుంచి పెరికి పారెయ్యగలిగి వుండేవాడు. కాని యీ క్షణంలో ఆమెపట్ల తనకి ప్రేమ లేదని అనిపించినప్పుడు కూడా, అన్నాలో తన బంధనాలని తెంచుకోవడం సాధ్యం కాదని అతనికి తెలుసు.

"వూఁ చెప్ప, ప్రిన్స్ గురించి యేమిటి చెప్పాలనుకున్నావు? నేను భూతాన్ని తరిమేశానులే, తరిమేశా" అంది. ఆమెతో రేగే యీర్ష్యని వాళ్ళు భూతం అని పిలిచేవాళ్ళు. "వూఁ, ప్రిన్స్ గురించి యేమిటి చెప్తున్నావు? అతనితో గడపడం నీకెందుకంత కష్టం అనిపించింది?" అని అడిగింది.

"దుర్భరం" అన్నాడతను, తన ఆలోచనాధారని అందుకో ప్రయత్నిస్తూ. "దగ్గరగా చూసే కొద్దీ అతని మంచి లక్షణాలనేవి కరిగిపోతూ వుంటాయి. అతన్ని గురించి వర్ణించాలంటే బాగా మేపిన పశువు అనాలి. పోటీల్లో మొదటి బహుమతి వస్తుందే అలాంటి పశువు, అంతే" అని అతను విసుగ్గా అన్నాడు. ఆ విసుగు ఆమెకి కుతూహలం కలిగించింది.

"అదేమిటి? యెంత చెడ్డా అతను చదువుకున్న వాడు, లోకం చూసిన వాడు కదా" అని మాట చేర్చింది.

"ఆ చదువే వేరు – వాళ్ళ చదువు. చదువుని యేవగింపుగా చూసే హక్కుని వాళ్ళకి

యివ్వడమే వాళ్ల చదువు యేకైక లక్ష్యంలా వుంది. యేమంటే పాశవిక సుఖాలని తప్ప మిగతా ప్రతిదాన్నీ వాళ్లు యేమరింపుగానే చూస్తారు."

"కాని ఆ పాశవిక సుఖాలంటే మీకందరికీ యిష్టమే కదా" అంది. మరోసారి తనని తప్పించుకుని చూసే మలిన దృక్కు అతనికి కనిపించింది.

"యెందుకంతలా ఆతన్ని వేనకేసుకు వస్తున్నావు?" అని అతను చిరునవ్వు నవ్వుతూ అడిగాడు.

"నేనతన్ని వేనకేసుకు రావడం లేదు. కాని నీకుగా నీకు ఆ సుఖాలంటే అంత యిష్టం లేనప్పుడు అతనితో వుండనని చెప్పి వుండాల్సిందనుకుంటా. కాని థెరెసాని ఈవ్ వేషంలో చూడ్డం నీకూ వరదాయే."

"అదిగో మళ్లీ భూతం, భూతం" అని వ్రాన్‌స్కీ బల్లమీద ఆనుకున్న ఆమె చేతిని తీసుకుని ముద్దుపెట్టుకుంటూ అన్నాడు.

"నాకు తెలుసు, కాని యేం చెయ్యలేను. నీ కోసం యెదురుచూస్తూ కూర్చుని యెంత నరకం అనుభవించానో నువ్వు వూహించలేవు. నేను యీర్ష్యగా వున్నానని అనుకోను. నాకు యీర్ష్య లేదు. నువ్వు నా దగ్గర వున్నప్పుడు నువ్వంటే నమ్మకంగా వుంటుంది. నామంచి దూరంగా నాకు యేమీ తెలియని బతుకు గడుపుతూ వుంటే..."

ఆమె తన చేతిని లాక్కుని ఆఖరికి కొక్కెం విప్పింది. చూపుడు వేలుని తోస్తూ వెలుతుర్లో మెరుస్తూ వున్న తెల్లని వూలుని మెలి తిప్పింది. ఆమె నాజూకైన మణికట్టు బుటా వేసిన గౌను చేతిలో గబగబా కంపిస్తూ తిరిగింది.

"వూఁ, అయితే యిదెలా జరిగింది? మా ఆయన్ని యెక్కడ కలుసుకున్నావ్?" అని కంఠంలో అస్వాభావికమైన జీర కనిపించేటట్టు అడిగింది.

"గుమ్మం దగ్గర తారసపడ్డాం నాకళ్లకొకళ్లం."

"తను యిలా నీకు వొంగి దణ్ణం పెట్టేడా?..."

ఆమె ముఖం వాలేసుకుని కళ్లు సగం మూసి, చేతులు ముడిచి గబగబా ముఖ భంగిమని మార్చింది. సరిగ్గా కెరేనిన్ తనకి వొంగి అభివాదం చేసినప్పటి భంగిమ ముద్రని వ్రాన్‌స్కీ ఆమె ముచ్చటైన ముఖంలో గుర్తించాడు. అతను మందహాసం చేసేడు. ఆమె కిలాకిలా నవ్వింది. ఆమె గొప్ప సమ్మోహక శక్తుల్లో వొకటైన సంతోషభరిత హృదయ పూర్వకమైన విందు నవ్వు అది.

"యేమిటో ఆయన నాకు యెంతకీ అంతుబట్టడు. తనతో నువ్వు మాట్లాడిన తర్వాత నీతో తెగతెంపులు చేసుకున్నా లేదా నన్ను ద్వంద్వ యుద్ధానికి రమ్మని తొడ గొట్టినా... కాని యిదేమిటో నాకు అర్థం కాదు. యిలాంటి పరిస్థితిని యెలా భరిస్తాడు? అతను బాధ పడుతున్నాడు. అది తెలుస్తూనే వుంది" అన్నాడు వ్రాన్‌స్కీ.

"తనా?" అంది ఆమె వెటకారంగా. "యే బాధాలేకుండా హాయిగా వున్నాడు" అంది.

''అన్నీ అంత దివ్యంగా యేర్పాటు చేసుకోగలిగినప్పుడు మనకందరికీ యేమిటి వ్యధ?''

''కాని ఆయనేం బాధపడ్డం లేదు. నాకాయన సంగతి తెలీదా — ఆబద్ధాల పుట్ట. యే మాత్రం హృదయం వున్నా తను నాతో వుంటున్నట్టుగా వుండడం సాధ్యమేనా? ఆయనకి యేదీ అర్థం కాదు, చలనం కలిగించదు. యే మాత్రం చలించిన మనిషైనా పాపిష్టి పెళ్లాంతో నాకే యింట్లో వుండగలడా? ఆమెతో మాట్లాడగలడా? దగ్గర కనిపించినప్పుడు 'నువ్వు' అని పిలవగలడా?'' అంటూ ''నువ్వు ma chère, నువ్వు అన్నా'' అని కరేనిన్ అనడం అనుకరించి చూపించకుండా వుండలేకపోయింది.

''అతను మొగాడు కాదు, మనిషి కూడా కాదు. తోలుబొమ్మ. యెవర్నూ ఆయన్ని గురించి యెరగరు. నేనొక్కత్తినే యెరుగుదును. అబ్బ, నేనే తన స్థానంలో వుంటేనా, ఆమెని యెప్పుడో నరికి పోగులుపెట్టి వుండేదాన్ని — నాలాంటి భార్యని — 'నువ్వు, ma chère, అన్నా' అని పిలిచే బదులుగా. తను మగాడు కాదు. సచివాలయ యంత్రం. నేను నీ యిల్లాలినీ తను బయటి మనిషనీ, తను అడ్డం వున్నాడనీ అర్థం చేసుకోడు... పోన్లే, వెధవగోడవ, అతన్ని గురించి మాట్లాడుకోవద్దు... వద్దు, మాట్లాడుకోవద్దు.''

''నువ్వు అన్న మాట సరి కాదు, తగింది కాదు, ప్రియా'' అన్నాడు వ్రాన్‌స్కీ ఆమెని ఓదార్చ ప్రయత్నిస్తూ. ''సరే పోన్లే అతన్ని గురించి మాట్లాడుకోవద్దు. ఊఁ, చెప్పు, యేం చేస్తూ వున్నావు. యేమిటి సంగతి? నీ నలత యేమిటి? డాక్టరు యేమన్నాడు?''

ఆమె అతనికేసి అధిక్షేపపూరిత సంతోషంతో చూసింది. బహుశా ఆమె భర్త గురించిన వేరే హాస్యాస్పద, వికృత పార్శ్వాలు గుర్తు చేసుకుంటూ వాటిని వెల్లడించే అదును కోసం చూస్తూ వుండి వుండాలి.

కాని వ్రాన్‌స్కీ చెపుతూనే వున్నాడు.

''నా అనుమానం నలత కాదు, నువ్వు నీళ్లోసుకోవడం అయివుంటుంది. యెప్పుడు అవచ్చు అది?''

అన్నా కళ్లల్లో అధిక్షేపపూరిత మెరుపు దూసుకుపోయింది, ముందటి మందహాసం స్థానంలో మరొక రకమైన చిరునవ్వు వచ్చింది. దానిలో వ్రాన్‌స్కీకి తెలియనిదేదో ఆమెకి వెల్లడైనట్టు వుంది. అందులో విచారభరిత ఛాయ గోచరమైంది.

''త్వరలోనే, త్వరలోనే. మన పరిస్థితి సంకటంగా వుందనీ, దీన్ని సమాప్తం చెయ్యాలనీ నువ్వు అన్నావుగా. యెంత దుర్భరంగా వుందో, నిన్ను నిరాటంకంగా, బహిరంగంగా ప్రేమించగలగడానికి యే మూల్యం చెల్లించడానికి సిద్ధంగా వున్నానో నువ్వు వూహించగలిగితేనా! అప్పుడు నేను చిత్రహింసలు పడను, నిన్ను నా యీర్ష్యతో యాతన పెట్టను... త్వరలోనే యిది జరుగుతుంది, కాని మనం అనుకుంటున్నట్టు కాదు.''

యిది యెలా జరుగుతుందోనన్న ఆలోచన రాగానే ఆమెకి తనమీద తనకే జాలి కలిగింది. ఆమె కళ్లల్లో నీళ్లు ఉబికాయి. ఆమె కంఠం రుద్ధమైంది. దీపం వెలుతుర్లో ఉంగరాలతో

మెరిసే మిలమిలలాడే తన తెల్లని చేతిని అతని చేతిమీద వుంచింది.

"యిది మనం అనుకుంటూ వున్నట్టు జరగదు. యీ విషయం నీకు చెప్పాలనుకో లేదు, కాని నువ్వు చెప్పేటట్టు చేశావు. త్వరలోనే చాలా తొందర్లోనే యీ ముడి విడిపోతుంది. మనమంతా శాంతిగా వుంటాం, యిక యెంత మాత్రం బాధపడం."

"నాకర్థం కావడం లేదు" అన్నాడతను. కాని అతనికి అర్థమైంది.

"యెప్పుడు జరుగుతుంది అని అడిగావు నువ్వు. త్వరలోనే. నేను బతికి బయటపడలేను. హుష్, నాకు అడ్డం రాకు" అని ఆమె గబగబా చెప్పింది. "నాకు తెలుసు, ఖాయంగా తెలుసు. నేను చచ్చిపోబోతున్నాను. చచ్చిపోతున్నందుకు మీకిద్దరికీ తెరిపి కలిగిస్తున్నందుకూ చాలా సంతోషంగా వుంది."

కన్నీళ్లు ఆమె కళ్లనుంచి జారేయి. అతనామె చేతిమీదకి వొంగి మళ్లీ మళ్లీ ముద్దు పెట్టుకున్నాడు. తను ఉద్రేకాన్ని అణుచుకో ప్రయత్నించేడు, ఆ ఉద్రేకానికి నిజమైన కారణం లేదని తెలిసినా దాన్ని దాటలేక పోయేడు.

"అంతేత అదీ విషయం, అదే మేలు" అందామె అతని చేతిని గట్టిగా అదుముతూ. "యిదొక్కటే మనకి మిగిలిది" అంది.

అతను సంబాళించుకుని తల పైకి యెత్తేడు.

"యేం చెత్త! యెంత పరమ చెత్త మాటలు మాట్లాడుతున్నావు!"

"వుహు, లేదు, యిది నిజం!"

"యేది నిజం?"

"నేను చచ్చిపోవడం. నాకు కల వొచ్చింది."

"కల?" అని వ్రాన్స్కీ రెట్టించాడు. అతనికి వెంటనే తన కలలో కనిపించిన రైతు గుర్తు వచ్చేడు.

"ఆఁ, కల. యిదే కల కొంతకాలం కితం వచ్చింది. నా పడక గదిలోకి దేన్నో తెచ్చుకుందామనో, వెతుకుదామనో వెళ్లానట — నీకు తెలుసుగా కలల్లో యెలా వుంటుందో" అందామె. ఆమె కళ్లు భయంతో పెద్దవయాయి. "యేం, అప్పుడు మూల యేదో మంచుంది."

"వెర్రి మాటలు! నువ్వెలా నమ్ముతున్నావ్..." కాని ఆమె తన మాటకి అతన్ని అడ్డం రానివ్వలేదు. తను చెప్పదలచుకున్నది ఆమెకి చాలా ముఖ్యం.

"యేం ఆ మంచున్నది యిటు తిరిగింది. చూస్తే జీబురు గడ్డం వున్న రైతు. భయంకరమైన చిన్న మనిషి. నేను పారిపోదామనుకున్నాను. కాని ఆ రైతు వొంగి యేదో సంచిలో కెలకడం మొదలుపెట్టాడు."

ఆ రైతు సంచీ యెలా కెలకడం మొదలుపెట్టాడో ఆమె చూపించింది. ఆమె ముఖం భయ విహ్వలమై పోయింది. వ్రాన్స్కీకి తన కల గుర్తు వచ్చింది, అతనికీ అదే భయం కలిగింది.

"అతను కలికి యెర్ గబగబా గొణిగాడు, గబగబా ఫ్రెంచిలో 'Il faut le battre le fer, le broyer, le pétrir...'[1] నా భయంతో నేను లేద్దామని ప్రయత్నించేను లేవాను, కాని కలలోనే. యిదేమిటని ప్రశ్నించుకున్నాను. కొర్నేయ్ చెప్పాడు: 'నువ్వు పురుట్లో చని పోతావు, అమ్మా, పురుట్లో...' అప్పుడు మెలుకువ వచ్చింది..."

"యేం అర్థం పర్థం లేని మాట. శుద్ధ చెత్త" అన్నాడు వ్రాన్‌స్కీ. కాని తన గొంతుక నమ్మకంగా లేదని అతనికే తెలుసు.

"సరే, దాన్ని గురించి మాట్లాడొద్దులే. గంట కొట్టు, టీ తెప్పిస్తాను. వుహుం, వెళ్లద్దు. యెక్కువ సేపు కాదులే, నేను..."

కాని ఆమె హఠాత్తుగా మాట్లాడ్డం ఆపేసింది. ఆమె ముఖంలో వెంటనే మార్పు వచ్చింది. భయం, ఆందోళన పోయి గంభీర, శాంత, ఆనందపూరిత ఏకాగ్రత వచ్చింది. యీ మార్పు యేమిటో అతనికి బోధపడలేదు. ఆమె తనలో నూతన ప్రాణి కదలికని అను భూతి చెందింది.

4

ఇంటి గుమ్మం దగ్గర వ్రాన్‌స్కీని చూశాక కరేనిన్ తను ముందనుకున్నట్టే ఇటా లియన్ ఒపెరాకి వెళ్లాడు. రెండు అంకాలు అయేదాకా కూర్చుని, తను చూడవలసి వున్న వాళ్లందర్నీ చూశాడు. ఇంటికి తిరిగివచ్చేక మిలిటరీ ఆఫీసరు ఓవర్‌కోటు వుండే యేమైనా కోట్లు పెట్టుకునే రాక్‌లో జాగ్రత్తగా చూశాడు. కాని అది కనిపించక పోవడంతో యథాప్రకారం తన గదికి వెళ్లాడు. కాని యథాప్రకారం పడక చేరలేదు. దానికి బదులుగా తెల్లవారకట్ల మూడింటి దాకా తన చదువుకునే గదిలో అటూ యిటూ పచార్లు చేస్తూనే వున్నాడు. భార్య పట్ల కోపంతో అతనికి మనశ్శాంతి లేకుండా వుంది. పై మర్యాదలు ఆమె పాటించలేదు. తను పెట్టిన షరతు, అంటే తన ప్రియుణ్ణి తమ యింట్లో కలుసు కోవడానికి వీలు లేదన్న ఒక్క షరతూ ఆమె ఉల్లంఘించింది. తన ఆదేశాన్ని ఆమె మన్నించ లేదు. అంచేత విడాకులు యిచ్చి తన కొడుకుని ఆమెనుంచి తీసేసుకునే బెదిరింపుని అమలు జరిపి ఆమెని దండించాలి. యిందులో వున్న యిబ్బందులన్నీ అతనికి తెలుసు. కాని తనలా బెదిరించేడు కాబట్టి దాన్ని అమలు జరపడం తనమీద వుంది. తనున్న పరిస్థితిలో యిదే శ్రేష్ఠమైన మార్గం అని కౌంటెస్ లిదియా ఇవానొవ్నా సూచించింది. అదీగాక విడాకులు పొందే క్రమం యిటీవల కాలంలో యెంత పకడ్బందీ అయిందంటే మామూలు యిబ్బందుల్ని తొలగించుకునే అవకాశాలు కరేనిన్‌కి అనుగుణం అయాయి. కష్టాలు కలిసి కట్టుగా వస్తాయి

---

[1] యినుప ముక్కని సమ్మెటతో మోదాలి, సాగదియ్యాలి, సాపు చెయ్యాలి (ఫ్రెంచి).

గాని హాక్కాటాకట్ రావు. అల్ప సంఖ్యాక జాతుల స్థితిగతుల్ని మెరుగు పరిచే జరాయిన్క్ గుబేర్నియాకి నీటిపారుదల సౌకర్యం కల్పించడం అనే విషయమూ అతనికి పనిలో యెంతో యిబ్బంది కలిగించింది. దాంతో అతను కొంతకాలంగా మహా చిరాగ్గా వుంటున్నాడు.

అతనికి రాత్రంతా నిద్రపట్టలేదు. అతని కోపం గొంతుకుంటూ యెక్కిపోయి, పొద్దుటి వేళకి చరమ హద్దుకి చేరుకుంది. అతను గబగబా బట్టలు వేసుకుని, భార్య నిద్ర లేచిందని విన్న ఉత్తరక్షణం ఆమె దగ్గరికి పూరా కోపంతో నిండి పోయిన ఛషకంలా వెళ్లాడు. ఆ ఛషకం యెక్కడ తుళ్లితే ఆమెతో మాట్లాడేందుకు అవసరం అయిన శక్తి వొలికిపోతుందోననే భయంతో వెళ్లాడు.

భర్తని ఆమూలాగ్రం బాగా యెరుగుదు ననుకొన్న అన్నా అతను దగ్గరికి రాగానే చూసి నిశ్చేష్టురాలై పోయింది. అతని కనుబొమలు ముడుచుకున్నాయి. అతని కళ్లు ఆమెని తప్పించుకుని ముందుకు మబ్బుగా చూస్తూ వున్నాయి. అతని నోరు యేహగింపుగా బిగిసి పోయి వుంది. అతని నడకలో, కదలికల్లో, కంఠధ్వనిలో అంతకు ముందు ఆమె యెన్నడూ యెరగని దృఢత్వం, కటుత్వం కనిపించాయి. అతను గదిలోకి వెళ్లి ఆమెని పలకరించకుండా రాత బల్ల దగ్గరికి వెళ్లి పోయాడు. తాళం చెవి తీసుకుని సొరుగు తెరిచాడు.

"యేం కావాలి మీకు?" అని ఆమె అరిచింది.

"మీ ప్రేమలేఖలు" అన్నాడతను.

"అక్కడ లేవవి" అందామె సొరుగు మూసేస్తూ, కాని ఆమె సొరుగుని మూసే పద్ధతి తన వూహ నరైందని అతనికి తెలియ చెప్పింది. అతను మోటగా ఆమె చేతిని తోసేసి తక్కున సంచీని లాగేరు, ఆమె అందులో తన ముఖ్యమైన పత్రాలని పెట్టుకుంటుందని అతనికి తెలుసు. అతని చేతిలోనుంచి ఆమె దాన్ని లాక్కుందామని ప్రయత్నించింది కాని అతనామెని తోసేశాడు.

"కూర్చోండి, మీతో మాట్లాడాలను కుంటున్నాను" అని, ఆ సంచీని చంకలో పెట్టుకుని అన్నాడు. దాన్ని గట్టిగా అదిమి పట్టుకోవడంవల్ల అతని భుజం పైకి లేచింది.

అన్నా మాటా పలుకూ లేకుండా ఆశ్చర్యంతో, పిల్లిలా అతని కేసి చూస్తూ వుండి పోయింది.

"మీరు మీ ప్రియుణ్ణి యీ యింట్లో కలుసుకోవడానికి వీల్లేదని మీకు చెప్పడం జరిగింది."

"అతన్ని కలుసుకోవడం నాకు అవసరం అయింది, యేమంటే..."

ఆమెకి యేం చెప్పాలో తోచక మాట్లాడలేక పోయింది.

"ఒక ఆడమనిషి తన ప్రియుణ్ణి యెందుకు కలుసుకుంటుందో ఆ వివరాల్లోకి నేను పోదల్చుకోలేదు."

"నాకు వూరికే..." అని ఆమె రేగి పోయింది. అతని మోటతనంతో ఆమెకి కోపం

వచ్చి ధైర్యం చిక్కింది. "నన్ను అవమాన పరచడం మీకెంత తేలికో నిజంగా మీకు తెలిదా?" అంది.

"నిజాయితీ వున్న మగాడికో, ఆడదానికో అవమానం జరగదు. కాని దొంగని దొంగ అని పిలవడం పూరాకే la constation d'un fait[1]."

"యింతకు ముందెన్నడూ మిమ్మల్ని యింత క్రూరంగా చూడలేదు."

"భర్త భార్యకి స్వేచ్ఛ యిచ్చి, తన మర్యాదలు పాటించాలి అన్నా వొక్కగానొక్క షరతుమీద గౌరవ పూర్వకమైన పేరు కింద రక్షణ యివ్వడం క్రూరత్వం అంటావ్? యిదేనా క్రూరత్వం?"

"అంతకంటే కనాకష్టం, తెలుసుకోవాలనుకుంటే నీచత్వం" అని అన్నా మండి పడిపోతూ అరిచింది. గదిలోనుంచి వెళ్ళిపోవడానికని లేచింది.

"లేదు!" అని అతను గంయ్‌మని అరిచాడు. అతని కంఠం అంతకు ముందెన్నడూ లేనంతగా యీ క్షణంలో కీచుమని హెచ్చు స్థాయిలో లేచింది. తన వేళ్లతో ఆమె మణికట్టుని గట్టిగా పట్టుకున్నాడు. అలా పట్టుకోవడంతో ఆమె చేతిని వున్న కంకణం నొక్కుకుని చర్మం కందింది. ఆమెని కుర్చీలోకి విసిరి కూలేశాడు. "నీచత్వం? అలాంటి మాటని నువ్వు వాడదలచుకుంటే నన్ను చెప్పనీ నీకు, కట్టుకున్న మొగుణ్ణీ, కొడుకునీ వదిలేసి ప్రియుడితో కులుకుతూ కూడా మొగుడు పెట్టిన తిండి తినడం అనేది నీచత్వం" అన్నాడు.

ఆమె తల వంచుకుంది. ముందు రోజు రాత్రి తన ప్రియుడికి చెప్పిన మాటని ఆమె చెప్పలేకపోయింది. అతనే తన భర్త అనీ, శాస్త్ర ప్రకారం కట్టుకున్న వాడు అడ్డం వస్తున్నాడు అనీ. ఆమె దాన్ని గురించి అనుకోను కూడా అనుకోలేదు. ఆమె అతని మాటల ఔచిత్యాన్ని గ్రహించి మెల్లిగా అంది.

"నా పరిస్థితి నాకే కనిపిస్తోంది, దాని కంటే అధ్వాన్నంగా మీరు చిత్రించలేరు, కాని మీరెందుకు నాకీ విషయం చెప్పాలి?"

"యెందుకు చెప్పాలా? యెందుకా?" అతను అదే తారస్థాయిలో అన్నాడు. "యెందుకంటే లోక మర్యాద కాపాడమని నేనడిగిన దాన్ని తమరు పాటించకపోవడంవల్ల మన యీ పరిస్థితిని అంతం చేసే చర్యలు తీసుకుంటాను" అన్నాడు.

"త్వరలోనే, త్వరలోనే యిది యెలాగైనా అంతం అవుతుంది" అందామె. దగ్గరకు వస్తూ వున్న మృత్యువూ, యిప్పుడు తను కోరుకుంటూ వున్న మృత్యువు గురించిన ఆలోచన మనసుకి మళ్లీ తట్టి ఆమె కళ్లల్లో నీళ్లు తిరిగాయి.

"నువ్వూ నీ ప్రియుడూ అనుకున్న దాని కంటే ముందే యీ పరిస్థితి అంతం అవుతుంది. మీకు పాశవిక మోహం తీరడం చాలు..."

---

[1] యదార్థం చెప్పడమే (ఫ్రెంచి).

"కరేనిన్‌గారూ! యిది క్రూరత్వం కంటే అధ్వాన్నం – చచ్చిన పాముని కొట్టడం పిరికితనం."

"ఆహా! మీరు మీ గురించే అనుకుంటున్నారు, ఒకప్పుడు మీ భర్త అయిన ఆ మగాడి వ్యధ గురించి మీకేం పట్టదు. అతని బతుకు నాశనం అయిపోయినా మీకు చీమ కుట్టినట్టు లేదు, అతను వ్యధాలికి... వ్యధాకిలి... వ్యధపడ్డాడు."

కరేనిన్ యెంత ఉరవడిగా మాట్లాడేడంటే మాట తడబడిపోయి వ్యధాకులితుడయే డన్న మాటని పలకలేకపోయాడు. ఆఖరికి వ్యధ పడ్డాడని అనగలిగేడు. ఆన్నాకి నవ్వూ వచ్చింది, అలాంటి సమయంలో నవ్వు పుట్టించేదేదో కనిపించడంతో సిగ్గూ వచ్చింది. మొదటిసారిగా ఆమె క్షణకాలం పాటు అతని పట్ల జాలిపడింది. అతని స్థానంలో తనని చూసుకుంది. అతని పట్ల విచారం కలిగింది. కాని తనేం చెప్పగలదు? చెయ్యగలదు? తల వాల్చుకుని మౌనంగా వుండిపోయింది. అతను కూడా ఓ క్షణంసేపు మౌనంగా వుండిపోయాడు. ఆ తర్వాత అతను మాట్లాడినప్పుడు కంఠం అంత కీచుగా లేదు. మరింత నిదానంగా, అలవోకగా వచ్చిన మాటలని నొక్కి పలుకుతూ మాట్లాడేడు.

"నేను యేం చెప్పాలని వచ్చానంటే..." అన్నాడు.

ఆమె అతనికేసి చూసింది. 'వూహుఁ, నేను వూహించుకున్నానంతే' అని 'వ్యధపడడం' అనే మాట అనడంలో అతను తడబడినప్పుడు అతని ముఖంలో కనిపించిన భంగిమని గుర్తు చేసుకుని అనుకొంది. 'యిలాంటి శూన్య నేత్రాలు, ఆత్మ తృప్తి వున్నలాంటి మనిషి అసలు దేనికేనా స్పందించడం అనేది యెలా సాధ్యం?' అనుకొంది.

"దేన్నీ మార్చే శక్తి నాకు లేదు" అని గొణిగింది.

"నేను యేం చెప్దామని వచ్చేనంటే రేపు నేను మాస్కో వెళుతున్నాను. మళ్లీ యీ యింటికి తిరిగిరాను. నేను విడాకుల విషయం అప్పచెప్తున్న లాయరు నా నిర్ణయం మీకు తెలియ చేస్తాడు. నా బిడ్డడు మా చెల్లెలి దగ్గర వుంటాడు" అని, కొడుకు గురించి యేం చెప్పదలచుకున్నాడో కష్టపడి గుర్తు చేసుకుంటూ అన్నాడు కరేనిన్.

"నన్ను హింస పెట్టడానికే మీరు సెర్యోషని నానుంచి తీసుకు పోతున్నారు" అందామె కనుబొమల కిందనుంచి అతని కేసి చూస్తూ. "మీకు వాడంటే ప్రేమ లేదు, సెర్యోషని నా దగ్గర వుండ నివ్వండి" అంది.

"అవును, నా కొడుకు పట్ల నాకు ప్రేమ లేకుండా పోయింది. యేమంటే మీ పట్ల నాకు వున్న యేవగింపు భావం వాడిమీదకి పాకింది. అయినా కూడా వాణ్ణే నేను తీసికెడతాను. సెలవ్."

వెళ్లిపోవడానికి అతను అటు తిరిగాడు. కాని యీసారి ఆమె అతన్ని ఆపింది.

"మీరు సెర్యోషని నా దగ్గర వుండ నివ్వండి" అని మరోసారి గొణిగింది. "నేనింత కంటే యెక్కువ యేమీ చెప్పలేను. సెర్యోషని నా దగ్గర వుండ నివ్వండి కనీసం నా...

త్వరలోనే కాన్పు వస్తుంది నాకు. అప్పటి దాకా వాళ్ళే నా దగ్గర వుండ నియ్యండి" అంది.

కరేనిన్ జేవురించుకున్నాడు. మోటగా ఆమెనుంచి విడిపించుకుని వొక్క మాట కూడా అనకుండా గదిలోనుంచి వెళ్ళిపోయాడు.

5

ప్రఖ్యాత పీటర్స్‌బర్గ్ లాయరుగారి వెయిటింగ్ రూమ్‌లోకి కరేనిన్ వెళ్ళేటప్పటికి అక్కడ నిండుగా జనం వున్నారు. ముగ్గురు ఆడవాళ్ళు వున్నారు. ఒక ముసలావిడ, వో పడుచావిడ, వో వర్తకుడి భార్య. ముగ్గురు పెద్దమనుషులు వున్నారు. వేలికి వుంగరం పెట్టుకున్న వో జర్మన్ బేంకర్, గడ్డం వున్న వర్తకుడు, పతకం తగిలించుకున్న యూనిఫాం తొడుక్కుని కోపంగా వున్న వో ఆఫీసరు. అందరూ కొంత సేపటిగా అక్కడ నిరీక్షిస్తూ వున్నట్టే కనిపించారు. యిద్దరు అసిస్టెంట్లు కాగితాలమీద యేదో బరబర గిలికేస్తూ బల్లల దగ్గర కూర్చున్నారు. బల్లమీద వుండే రాత సామాన్లంటే కరేనిన్‌కి మహా మోజు, అవి చాలా భేషుగ్గా వున్నాయి. ఆ విషయం గుర్తించకుండా వుండలేక పోయాడు కరేనిన్. ఓ అసిస్టెంట్ కళ్ళు రెట్టగించి, కూర్చున్న చోట్నుంచి లేవకుండానే, కరేనిన్ కేసి చూసి అడిగాడు:

"మీకు యేం కావాలి?"

"నాకు లాయరుగారితో పని వుంది."

"ఆయనకి తీరికలేదు" అని అసిస్టెంటు టక్కున అక్కడ వున్న వాళ్ళకేసి కలం వూపి మళ్ళీ రాతలో పడిపోతూ అన్నాడు.

"కొన్ని క్షణాలు ఆయన తీరిక చేసుకోలేరా?" అని కరేనిన్ అడిగాడు.

"ఆయనకి తీరిక క్షణాలు వుండవు. ప్రతి క్షణమూ వ్యవధి లేకుండానే వుంటుంది. కొంచెం వోపిక పట్టండి."

"అయితే కొంచెం శ్రమ అనుకోకుండా ఆయనకి నా కార్డు యివ్వండి" అని కరేనిన్ తన గురించి వెల్లడి చేసుకోవాల్సిన అవసరం తప్పదనుకొని హుందాగా అన్నాడు.

అసిస్టెంటు కార్డు తీసుకున్నాడు. దానిమీద రాసి వున్నది తనకి యిష్టం లేనట్టు కనిపించేడు. దాన్ని తీసుకుని తలుపు తెరుచుకుని లోపలికి వెళ్ళాడు.

కరేనిన్ సూత్ర రీత్యా బహిరంగ విచారణ పక్షం వహిస్తాడు. కాని కొన్ని ఉన్నత స్థానాల్లో వున్న వాళ్ళ కారణంగా రష్యాలో దాన్ని అమలు జరిపే కొన్ని వివరాలని ఆమోదించ లేకపోయాడు. అంచేత వీటిని, జార్ స్వయంగా మద్దతు యిచ్చిన వాటిని గురించి యే మేర వరకూ వ్యాఖ్యానించవచ్చో ఆ మేర వరకూ, వాటిని వ్యాఖ్యానించేవాడు. అతని జీవిత మంతా పాలనా కార్యకలాపాలతోనే గడిచింది. అంచేత తను యెప్పుడు యేది ఆమోదించకపోయినా,

తప్పులు చెయ్యడం తప్పని సరి అనీ, యే రంగంలో అవి కనిపించినా వాటిని సరిదిద్దుకునే అవకాశం వుందనీ గుర్తించడం ద్వారా తన అనిష్టతని తగ్గించుకునేవాడు. నూతన న్యాయ వ్యవస్థలో లాయర్ ప్రతివాది తరఫున వాదించడంకోసం యేర్పాటైన షరతులు అతనికి నచ్చలేదు. యేమైనా అంత వరకూ అతనికి స్వయంగా లాయర్లతో వ్యవహారాలు లేకపోయాయి, అంచేత అతని అనిష్టత సూత్ర రీత్యా వుండే మేరకే పరిమితం అయి పోయింది. యిప్పుడు యీ లాయరుగారి వెయిటింగ్ రూమ్ కలిగించిన విసుగు వల్ల అనిష్టతా భావం మరింత పెరిగింది.

"ఆయన యిప్పుడే మిమ్మల్ని పిలుస్తారు" అన్నాడు అసిస్టెంటు. రెండు క్షణాల తర్వాత లాయరుగారితో మాట్లాడుతున్న పొడగరి సీనియర్ సాలిసిటర్‌గారు గుమ్మంలో ప్రత్యక్షమయ్యారు. ఆయన వెనక్కాల లాయరుగారే ప్రత్యక్షమయారు.

లాయరుగారు పొట్టిగా దిట్టంగా వుంటారు. ఆయనది బట్ట తల. ఆయన గడ్డం జేగురు రంగు నలుపు రంగు కలిసి వుంది. ఆయన కనుబొమలు నిడువుగా నిస్తేజంగా వుంటాయి. ఆయన నుదురు కోతి నుదురులాగా వుంది. మెడపట్టీ దగ్గర్నుంచి, రెండు గొలుసుల గడియారం దగ్గర్నుంచి, నిగనిగ మెరిసే తోలు బూట్ల దాకా ఆయన వేషం యెప్పుడో పెళ్లినాడు వేసుకున్నది అయివుంటుంది. ఆయనది తెలివితేటలున్న రైతు ముఖమే కాని ఆయన బట్టలు మొహం మొత్తేటట్టు, తక్కువ అభిరుచితో వున్నాయి.

"రండి" అని కరేనిన్‌తో అన్నాడు. తను వో పక్కకి తప్పుకుని కరేనిన్‌ని లోపలికి వెళ్లడానికి దారి యిచ్చి తలుపు వేసేశాడు.

"కూర్చోండి" అని కాగితాలతో నిండిపోయిన రాత బల్ల పక్క వున్న చేతుల కుర్చీ చూపించాడు. తను బల్ల దగ్గర కూర్చున్నాడు. తల వో పక్కకి వొంచి చిన్న చేతుల్ని రుద్దుకోవడం మొదలుపెట్టాడు. అతని చేతివేళ్లు పొట్టిగా లావుగా వున్నాయి. వాటికి తెల్లని వెంట్రుకలు వున్నాయి. ఆయన కులాసాగా సర్దుకుని కూర్చున్నాడో లేదో యింతలోకే వర్ల పురుగు వొకటి బల్లమీదకి టక్కున యెగురుతూ వొచ్చింది. లాయరుగారు అతని లాంటి వాడికి వుంటుందని వూహించలేని లాఘవంతో చేతులు చాచి దాన్ని టక్కున పట్టుకుని మళ్లీ యథాప్రకారం కులాసాగా సర్దుకున్నాడు.

"నా పని గురించి మాట్లాడే ముందు" అని, లాయరుగారి చర్యల్ని ఆశ్చర్యపోయి చూస్తూ కరేనిన్ అన్నాడు. "నేను మాట్లాడబోయే విషయాన్ని రహస్యంగా వుంచాలని మీకు నేను చెప్పాలి" అన్నాడు.

జేగురు రంగులో కొంచెం కొంచెం వాలి వున్న లాయరుగారి మీసాలపైన కనిపించీ కనిపించని చిరునవ్వు లాస్యం చేసింది.

"నా మీద వుంచిన విశ్వాసాన్ని మన్నించకపోయి వున్నట్లయితే నేను లాయర్ని అయి వుండే వాణ్నే కాను. కాని మీకు దాఖలా కావాల్సి వస్తే..."

కరేనిన్ ఆయన కేసి కళ్ళు యెత్తాడు. ఆయన చురుకైన బూడిదరంగు కళ్ళు నవ్వుతున్నాయని చూశాడు. అప్పటికే ఆయనకి యావత్తూ తెలిసినట్టు వుంది.

"నా పేరు మీకు తెలునుకదా?" అన్నాడు కరేనిన్.

"మిమ్మల్ని యెరుగుదును. ప్రతి రష్యన్ మాదిరిగానే మీ అమూల్యమైన..." యిక్కడ ఆయన మళ్లీ యింకో వద్ద పురుగుని పట్టుకున్నాడు. "సేవలని యెరుగుదును" అని లాయరు గౌరవ పురస్సరంగా తల వొంచి అన్నాడు.

కరేనిన్ ధైర్యం పుంజుకోవడం కోసం గాఢంగా శ్వాస పీల్చేడు. కాని వొక సారంటూ ధైర్యం పుంజుకున్నాక ఉత్సాహ స్వరంతో, కీచుగా తడబడకుండా, నీళ్ళు నమలకుండా, కొన్ని మాటల్ని యథాప్రకారం వొత్తుతూ చెప్పుకుంటూ పోయేడు.

"పెళ్ళాం ప్రవర్తన సరిగా లేదని పితూరీ చెయ్యాల్సి వచ్చిన దురదృష్టవంతుడైన భర్తని నేను" అని మొదలుపెట్టాడు. "చట్ట ప్రకారం మా సంబంధాలకి స్వస్తి చెప్పా లనుకుంటున్నాను అంటే ఆమెకి విడాకు లివ్వాలను కుంటున్నాను. కాని నా బిడ్డడు ఆమె అజమాయిషీలో వుండని రీతిలో" అన్నాడు.

లాయరుగారి బూడిదరంగు కళ్ళు నవ్వకుండా వుండాలని ప్రయత్నం చేశాయి. కాని అవుకోలేని సంతోషంతో చమక్‌మన్నాయి. అది చక్కటి పారితోషకం ముడుతుందన్న ఆశతో మాత్రమే కాదని కరేనిన్ గ్రహించాడు. అది విజయోత్సాహం మెరుపు. అది తను తన భార్య కళ్ళల్లో చూసినలాంటి ద్వేష పూరిత హర్షోల్లాసాన్ని పోలిన హర్షోల్లాస మెరుపు.

"విడాకులు పొందడానికి మీకు నా సాయం కావాలి, కదా?"

"ఆఁ సరిగ్గా చెప్పారు. కాని మీకు కాలహరణం చేస్తున్నా నేమోనని హెచ్చరించా లను కుంటున్నాను. ప్రాథమిక సమాచారం కోసం మాత్రమే నేను వచ్చేను. నాకు విడాకులు కావాలి. కాని విడాకులు లభ్యం అయే షరతులు నాకు చాలా ముఖ్యం. యీ షరతులు నా అవసరాలకి తగ్గట్టు లేకపోతే నేను చట్టపరమైన కార్యక్రమాన్ని చేపట్టకపోవచ్చును కూడ."

"ఓ, అంతే మరి. యెప్పుడూ నిర్ణయం తీసుకునేది క్లయింట్లే" అన్నాడు లాయరు.

లాయరు కరేనిన్ కాళ్లకేసి చూపు దించేడు. తన అదుపులేని సంతోషం క్లయింట్‌కి కష్టం కలిగించవచ్చుని అనిపించి అలా చూశాడు. తన ముక్కు ముందు వో వద్ద పురుగు యెగరడం కనిపించింది. ఆయన చెయ్యి టక్కున లేచింది. కాని కరేనిన్ ఉన్నత స్థితి, హోదావల్ల గౌరవం కొద్దీ ఆ కోరికని అణుచుకున్నాడు.

"యీ విషయానికి సంబంధించి నాకు చట్టాలు వో మాదిరిగా తెలిసి వున్నప్పటికీ, యిలాంటి కేసులు నిర్వహించబడిన ఆ యదార్థ పద్ధతులు తెలుసుకోవాలని వుంది" అన్నాడు కరేనిన్.

"మీరు కోరుకున్న దాన్ని మీరు సాధించగలిగే అనేక మార్గాల గురించి నన్ను చెప్ప మంటారు" అని తృప్తిగా తన వాది వాగ్ధోరణిని అనుసరిస్తూ అన్నాడాయన.

ఔనన్నట్టు కరేనిన్ తల వూపడంతో ప్రోత్సాహం వొచ్చి లాయరు యెర్రటి మచ్చలు పడే కరేనిన్ ముఖంకేసి మధ్యమధ్య చూస్తూ చెప్పేడు.

"మన చట్టాల ప్రకారం విడాకులు యిలాంటి సందర్భాల్లో సాధ్యం" అని మొదలు పెట్టేడు. మన చట్టాలపట్ల అసమ్మతి వున్న ఛాయ ఆయన గొంతుకలో ధ్వనించింది. "ఆగు కొంచెం" అన్నాడు ఆ సమయంలో గుమ్మంలోనుంచి లోపలికి చూసిన అసిస్టెంటుని ఉద్దేశించి. కాని లేచి అతనితో యేదో మాట్లాడి వచ్చి మళ్ళీ కూర్చున్నాడు. "...యీ సందర్భాల్లో సాధ్యం. మొదటిది, శారీరకంగా భార్యా భర్తలు వికలురైనప్పుడు; రెండవది, కనీసం అయిదు సంవత్సరాలు యే సంబంధమూ లేకపోయినప్పుడు" అన్నాడు పాయింటు పాయింటుకీ వెంట్రుకలున్న బొద్దు వేళ్లని ముడుస్తూ. "మూడవది, వ్యభిచరించడం" (యీ మాటని వివరించడంలో ఆయనకి కలిగిన సంతోషం స్పష్టం) "ఉప విభాగాలు యివి" (అని బొద్దు వేళ్లని ముడుస్తూ చెప్పేడు, యీ పరిస్థితుల్ని ఉప విభాగాల్ని వొకే విధంగా వర్గీకరించడానికి లేకపోయినా) "భర్తగాని భార్యగాని శారీరకంగా వికలులవడం, భార్యగాని భర్తగాని వ్యభిచరించడం." వేళ్లనన్నిట్నీ వాడ్డం అయిపోవడంతో చేతిని తెరిచేడు. "యిదంతా సూత్రరీత్యా చెప్పేమాట. కాని మీరు యదార్థ స్థితిని తెలుసుకునే ఉద్దేశంతో యిక్కడికి వచ్చి నాకు గౌరవం కలిగించేరు. తదనుగుణంగా, లోగడ వున్న వాటి ఆధారంగా, విడాకుల విషయాన్ని యిలా కుదించి చెప్పుకోవచ్చని మీకు తెలియ జేస్తున్నాను... శారీరక వైకల్యం లేదను కుంటున్నాను. అలాగే యెడబాటూ లేదనుకుంటున్నాను."

కరేనిన్ అవునన్నట్టుగా తల వూపేడు.

"యిక మిగిలింది యిదే. భార్యాభర్తల్లో యెవళ్లో వొకరు వ్యభిచరిస్తున్నట్టు పరస్పర వొప్పందం మేరకి కోర్టులో తేలడం. లేదా పరస్పర వొప్పందం లేకుండా ఆ వ్యభిచారం నిర్ధారితం కావడం. యీ రెండవ సందర్భం యెప్పుడోగాని ఆచరణలో కనిపించదు" అన్నాడు లాయరు. కరేనిన్ మొహం కేసి వొకసారి చూసి మౌనంగా వుండిపోయాడు. పిస్తోళ్లని అమ్మేవాడు అనేక రకాల పిస్తోళ్ల గుణగుణాల్ని వర్ణించి యిక యెంచుకోవడం ఖాతాదారుడి యిష్టం అని వూరుకున్నట్టుగా వూరుకున్నాడు. కరేనిన్ యేమీ అనకపోవడంతో లాయరు మళ్ళీ చెప్పేడు. "అతి తేలిక పద్ధతీ, సాధారణంగా వుండే పద్ధతీ యింకా చెప్పాలంటే హేతుబద్ధమైందీ యేమిటంటే పరస్పర వొప్పందం మేరకి వ్యభిచరించడం అనేది. నేను విద్యా గ్రంథం లేని వాడితో మాట్లాడుతూ వున్నట్టయితే యిలా చెప్పి వుండే వాణ్ణి కాదు. కాని మనకి సంబంధించి విషయం స్పష్టంగా వుందని అనుకుంటున్నాను" అన్నాడు లాయరు.

కరేనిన్ యెంత వ్యాకుల పడిపోయాడంటే పరస్పర వొప్పందం వల్ల వ్యభిచరించడం అనే వాదన తాలూకు సహేతుకత్వాన్ని వెంటనే గ్రహించలేకపోయాడు. అలా అని అతని ముఖం చూస్తే తెలుస్తూనే వుంది. అందుకని లాయరు మళ్ళీ హడావుడిగా చెప్పేడు:

"మనుషులు వొకళ్లతో వొకళ్లు కలిసి యిక యెక్కువ కాలం వుండలేరు — అదీ వున్న

పరిస్థితి. యిద్దరికీ అంగీకారం అయితే యిక చిల్లర మల్లర విషయాల గురించి పట్టించుకోరు. అంచేత యిదే తేలికైన, దివ్యమైన పద్ధతి."

ఇప్పటికి కరేనిన్‌కి చక్కగా బోధపడింది. కాని అతనికి ధార్మిక శంకలు వున్నాయి. అవి అలాంటి పద్ధతి అనుసరించకుండా అడ్డుపడ్డాయి.

"ప్రస్తుత సందర్భంలో ఆ ఉపాయం అనవసరం. ప్రస్తుతం వొక్కటే సాధ్యం: ఉత్తరాల ద్వారా బలవంతంగా వెల్లడి చెయ్యడం, అవి నా దగ్గర వున్నాయి" అన్నాడు.

ఉత్తరాల ప్రస్తావన రాగానే లాయరు పెదాలు బిగించేడు. సానుభూతి, యేవగింపూ రెండూ వెల్లడి చేసే చిన్న ధ్వని చేశాడు.

"అలాంటి తరహా విషయాలు పీఠాధిపతులు నిర్ణయిస్తారని తమకి చెప్పాలి. అలాంటి సందర్భాల్లో వున్న చిన్న చిన్న మతలబులు పురోహితులకి యిష్టం" అన్నాడాయన, పురోహితుల అభిరుచి అంటే తనకి యిష్టం అయినట్టు చిరునవ్వు నవ్వుతూ. "ఉత్తరాలు పాక్షికంగా కేసుని రుజువు చేస్తాయనుకోండి. కాని వెల్లడి చెయ్యడం అనేది నేరుగా జరగాలి, కచ్చితంగా చెప్పాలంటే సాక్షుల ద్వారా. యీ విషయాన్ని నా చేతుల్లో పెట్టే గౌరవాన్ని గనక నాకు మీరు కలిగించినట్లయితే యే మార్గాలు అనుసరించాలో యెంచుకోవడం నాకు వదిలిపెట్టండి. ఫలితం ఆశించేవాడు మార్గాల్ని అంగీకరించాలి" అన్నాడు.

"అలా అయినట్లయితే గనక..." అని కరేనిన్ వున్నట్టుండి పాలిపోతూ మొదలు పెట్టాడు. కాని సరిగ్గా ఆ సమయంలో లాయరు లేచి, లోపలికి వచ్చిన అసిస్టెంటుతో మాట్లాడ్డానికి గుమ్మం దగ్గరికి వెళ్లాడు.

"మనతో బేరాలు కుదరవని ఆమెకి చెప్పు" అని మళ్లీ కరేనిన్ దగ్గరికి వచ్చేడు.

తన బల్ల దగ్గరికి వచ్చి దొంగగా యింకో వట్ల పురుగుని పట్టుకున్నాడు. 'వేసవి కాలం నాటికి నా ఫర్నిచరు యేం తగులడుతుందో' అని ముక్కు చిట్లించుకుంటూ అనుకున్నాడు.

"వూఁ, మీరనే మాటకి వస్తే..." అన్నాడు.

"నా నిర్ణయం యేమిటైందీ తర్వాత తెలియ జేస్తాను" అని లేచి నుంచుంటూ బల్లమీద ఆనుకుని కరేనిన్ అన్నాడు. కొంచెం సేపు మౌనంగా నుంచుని మళ్లీ అన్నాడు. "మీరు చెప్పిన దాన్ని బట్టే విడాకులు తీసుకోవడం సాధ్యం అని నేను నిర్ధారణకి వచ్చాను. మీ పారితోషికం యెంతో తెలియ జెయ్యండి."

"మీరు నన్ను నా పద్ధతిలో పనిచేసేందుకు పూర్తి స్వేచ్ఛ యిస్తేనే అంతా జరుగుతుంది" అన్నాడు లాయరు కరేనిన్ అభ్యర్థనని గురించి పట్టించుకోకుండా. "తమరినుంచి యే మాటా యెప్పుడు తెలుస్తుంది?" అని గుమ్మం దగ్గరికి వెడుతూ అడిగాడు. ఆయన కళ్లు మెరిసే తోలు బూట్లలాగా మిలమిల మెరిసిపోతున్నాయి.

"వో వారంలోగా. మీరు యీ కేసుని తీసుకునే విషయమూ, మీ పారితోషికం విషయమూ దయచేసి తెలియ చెయ్యండి."

"తప్పకుండా."

లాయరు గౌరవ పురస్సరంగా వొంగి వందనం చేశాడు. తలుపు తెరిచి పట్టుకున్నాడు. తర్వాత వొక్కడూ వుండి పోవడంచేత తన సంతోషాన్ని వెల్లడి చేసుకున్నాడు. ఆయనకి యెంత సంతోషం కలిగిందంటే తన నియమానికి భిన్నంగా వర్తకుడి భార్యకి కొంత రాయితీ యిచ్చేడు, వడ్ల పురుగుల్ని పట్టుకోవడం కూడా మానేశాడు. ఫర్నిచరుని మార్చాలనీ, వాటికి శీతకట్టులోగా సిగోనిన్ మాదిరీ ముఖమల్ గుడ్డలు వేయించాలనీ అనుకున్నాడు.

6

ఆగస్టు 17 కమిషన్ సమావేశంలో కరేనిన్‌కి దిగ్విజయం లభించింది. కాని ఆ విజయ పరిణామాలు అతనికి చెడ్డగా తయారయేయి. అల్పసంఖ్యాక జాతుల జీవితం గురించి అన్ని పార్శ్వాలూ శోధించేందుకు మరో కొత్త కమిషన్‌ని నియమించారు. కరేనిన్ పుణ్యమా అని అంతకు ముందు యెన్నడు లేనంత వేగంగా, ఉత్సాహంతో పనిలోకి పంపేరు. మూడు నెలల్లో నివేదిక తయారైంది. రాజకీయ, పాలనాత్మక, ఆర్థిక, జాతిపర, మతపర రంగాలలో అల్పసంఖ్యాక జాతుల గురించి పరిశోధన జరిగింది. అన్ని ప్రశ్నలకీ జవాబులు వచ్చేయి. యే మాత్రం అనుమానానికి తావులేని జవాబులు. యెమంటే ప్రమాద పతితం అయే మానవ మస్తిష్క జనితం కావని, అధికారిక పరిశోధనా ఫలితం అని. జవాబులన్నిటినీ అధికారిక సమాచారంనుంచి తీసుకోవడం జరిగింది. గుబేర్నియా గవర్నర్ల, బిషప్పుల నివేదికలనుంచి తీసుకోవడం జరిగింది. వాళ్ల నివేదికలు మళ్లీ ఉయేజ్డ్ అధికారులనుంచీ, డీకన్లనుంచీ, అవి మళ్లీ వోలోస్త్ పాలకులనుంచీ, చర్చి పురోహితులనుంచి తీసుకున్నటువంటివి. అంచేత యీ జవాబులవల్ల సందేహానికి తావుండదు. ఉదాహరణకి ఆయా సంవత్సరాల్లో పంట దిగుబడి యెందుకు పడిపోయింది, అక్కడ నివసించే ప్రజలు తమ మత విశ్వాసాలకి యెందుకు అంటి పెట్టుకుని వున్నారు లాంటి వాటికి, యెన్ని యుగాలు గానో సమాధానాలు లేని వాటికి, అధికార యంత్రాంగం అసరా లేకుండా జవాబులు లభ్యంకాని వాటికి యిప్పుడు సందేహానికి తావు లేని జవాబులు వచ్చేయి. యీ జవాబులు కరేనిన్‌కి అనుకూలం అయే రీతిలో వున్నాయి. కాని గత సమావేశంలో గట్టిగా దెబ్బతిన్న స్త్రెమొవ్, కమిషన్ నివేదిక రాగానే కరేనిన్ వూహించని యెత్తుగడలకి దిగేడు. వున్నట్టుండి స్త్రెమొవ్, అతను మరి చేర్చుకున్న కొంతమంది సభ్యులు కరేనిన్ పక్షం వేపు తిరిగిపోయారు. కరేనిన్ సూచించిన చర్యలని బలపరిచి బల పరచడమే కాక, అదే ధోరణిలో యింకా తీవ్రమైన చర్యల్ని ప్రతిపాదించేరు. కరేనిన్ మూలభావానికి యింకా గట్టిగా వున్న యీ చర్యల్ని ఆమోదించడం జరిగింది. అప్పుడు స్త్రెమొవ్ యెత్తుగడలు తేటతెల్లం అయేయి. కాని కడకంటా యీడిస్తే

గనక యీ చర్యలు యెంత చపటతనంతో వుంటాయంటే ప్రతివాళ్ళూ — ఉన్నత అధికార్లు, ప్రజాభిప్రాయం, రాజకీయ వైఖరి వున్న ఆడవాళ్ళు, పత్రికల వాళ్ళు, వాటికి వ్యతిరేకంగా గోల చేశారు. వాటికి వ్యతిరేకంగా, వాటిని నలుగురి దృష్టికీ తెచ్చినటువంటి గుర్తింపు వచ్చిన కరేనిన్‌కి వ్యతిరేకంగా గోలగోల చేశారు. స్త్రెమొవ్ పక్కకి తప్పుకున్నాడు. తను గుడ్డిగా కరేనిన్ వెనక బడిపోయినట్టు కనిపింపచేసి, యీ పరిణామం చూసి నివ్వెప్పైనట్టు కనిపించేడు. ఆ విధంగా కరేనిన్ ప్రతిష్ఠకి గండి పడింది. తనకి అనారోగ్యంగా వున్నా, తను అనుభవిస్తూ వున్న కుటుంబ సమస్యలు వున్నా గానీ కరేనిన్ లొంగలేదు. కమిషన్లో చీలిక వచ్చింది. స్త్రెమొవ్ నాయకత్వం కింద కొంతమంది సభ్యులు నివేదికని సమర్పించిన కరేనిన్ నాయకత్వం కింద వున్న పునఃపరిశీలక సంఘాన్ని తాము నమ్మేమని తమ తప్పుని సమర్థించుకున్నారు. యీ నివేదిక శుద్ధ చెత్త అనీ, కాగితం దండుగ తప్ప మరేం కాదనీ వాదించేరు. పత్రాలపట్ల అలాంటి విప్లవాత్మక వైఖరి వుండడంలోని ప్రమాదం గుర్తించిన కరేనిన్, మరి కొంతమంది వ్యక్తులూ పునఃపరిశీలక సంఘం యిచ్చిన సమాచారాన్ని బలపరిచేరు. ఫలితంగా పైవర్గాలలో వున్న ప్రతి వొక్కళ్ళూ, గొప్ప వాళ్ళ యిళ్ళకి సమాజంలో తరుచుగా వెళ్ళే ప్రతి ఒక్కళ్ళూ గందరగోళ పడిపోయారు. అల్ప సంఖ్యాక జాతుల వాళ్ళు బాధలు పడుతున్నారో, క్షీణించిపోతున్నారో లేదా పురోగమిస్తున్నారో తేల్చుకోలేకపోయారు. యీ పరిస్థితి వల్లా, పాక్షికంగా భార్య తప్పుడు దారి తొక్కి, తనకి సంప్రాప్తింపచేసిన అవమానం వల్లా కరేనిన్ పరిస్థితి బాగా కదిలిపోయింది. ఆ విషయ స్థితిలో అతను వొక ముఖ్యమైన నిర్ణయం తీసుకున్నాడు. మొత్తం కమిషన్ అంతటికీ ఆశ్చర్యం కలిగేటట్టు, తను స్వయంగా అల్పసంఖ్యాక జాతులని దర్శించేందుకు, పరిశీలించేందుకూ వెళ్ళడానికి అనుమతి అడగదలచుకున్నట్టు ప్రకటించేడు. అనుమతి అందుకుని దూర ప్రాంతాలకి బయల్దేరేడు.

కరేనిన్ ప్రయాణం యెంతో సంచలనం రేపింది. ముఖ్యంగా యెందుకంటే ప్రయాణం అయి బయల్దేరే ముందుగా అతను తనని గమ్యానికి తీసుకెళ్ళవలసి వున్న పన్నెండు గుర్రాల నిమిత్తం కేటాయించిన ఖర్చు సొమ్ముని తిరగ్గొట్టేడు.

"ఆయన అలా చెయ్యడం చాలా ఘనంగా వుంది. యిప్పట్లో ప్రతి వాళ్ళు రైళ్ళల్లో అన్ని చోట్లకీ వెడుతూ వున్నప్పుడు గుర్రాలకి సొమ్ము కేటాయించడం యేమిటి?" అని ప్రిన్సెస్ మ్యాకయాతో ప్రిన్సెస్ బెట్సీ అంది.

ప్రిన్సెస్ మ్యాకయా వొప్పుకోలేదు. అలాంటి అభిప్రాయం ప్రిన్సెస్ బెట్సీ వ్యక్తం చెయ్యడం ఆమెకి చిరాకు కలిగించింది కూడా.

"మీకేం చెప్తారు, బాగానే వుంది! మీ దగ్గర లక్షలు లక్షలు మూలుగుతూ వున్నాయి కాబట్టి. కాని వేసవిలో తనిఖీ నిమిత్తం మా ఆయన్ని పంపినప్పుడు నాకు సంతోషంగా

వుంటుంది. ప్రయాణం సరదాగా వుంటుంది, ఆయన వొంటికీ మంచిది. గుర్రాలకి కేటాయించిన సొమ్ము నా బండికీ, బండివాడికీ సరిపోతుంది'' అంది.

దూర ప్రాంతాలకి వెళ్ళే దారిలో కరేనిన్ మాస్కోలో మూడ్రోజులు వున్నాడు.

మాస్కో వెళ్ళిన రోజునే గవర్నర్ జనరల్‌ని దర్శించేడు. తిరిగి వచ్చేటప్పుడు బగ్గీలూ, బళ్ళూ యెప్పుడు రద్దీగా వుండే గజేట్నీ సందులో యెవళ్ళో తన పేరుని గట్టిగా, హుషారుగా పిలవడం వినిపించింది. అతను అటు వేపు తిరక్క తప్పలేదు. కాలిబాటమీద చిన్న షోకైన టోపీ తలమీద వో పక్కకి పెట్టుకుని చిన్న షోకైన కోటు తొడుక్కుని అబ్లాన్‌స్కీ నుంచున్నాడు. అతను పడుచుతనంతో, ఉత్సాహంతో, యెర్రటి పెదాల మధ్య తెల్లని పళ్ళు కనిపించేటట్టు మిలమిలా మెరిసే చిరునవ్వుతో, కరేనిన్ బగ్గీ ఆగాలని అరుస్తూ నుంచున్నాడు. ఓ చేత్తో అక్కడ నుంచున్న బగ్గీ కిటికీని పట్టుకున్నాడు. ఆ బగ్గీలో నుంచి ముఖమల్ టోపీ పెట్టుకున్న ఆడమనిషి తలా, యిద్దరు పిల్లల తలలూ కనిపించేయి. రెండో చెయ్యి వూపుతూ అబ్లాన్‌స్కీ బావగార్ని పిలిచేడు. ఆవిడ కూడా ఆప్యాయంగా చిరునవ్వు నవ్వి కరేనిన్‌ని పిలిచింది. ఆమె దాలీ, వాళ్ళు ఆవిడ పిల్లలు.

కరేనిన్ మాస్కోలో యెవళ్ళని చూడాలని అనుకోలేదు, యిక భార్య తమ్ముడి సంగతి సరేసరి. అతను టోపీ పైకి లాక్కుని ముందుకు వెళ్ళాలని అనుకున్నాడు. కాని బండి ఆపమని అబ్లాన్‌స్కీ తోలేవాడికేసి అరిచి మంచులో బండి దాకా నడుచుకుంటూ వెళ్ళాడు.

"యిక్కడికి వచ్చిన కబురు కూడా తెలియ చెయ్యకపోవడం యెంత అన్యాయం! యెప్పుడు వచ్చేవు? నిన్న ద్యూస్సో హోటల్‌కి వచ్చేను. అక్కడ కరేనిన్ అని పేరు కనిపించింది కాని, వొట్టు, నువ్వన్న అనుమానమే తగల్లేదు'' అన్నాడు అబ్లాన్‌స్కీ బగ్గీ కిటికీలోనుంచి తల లోపలికి పెడుతూ. "లేకపోతే గదికి వచ్చి వుండేవాణ్ణి. యెంత సంతోషంగా వుంది నిన్ను యిక్కడ కలుసుకోవడం'' అన్నాడు, మంచుని దులుపు కోవడం కోసం వో కాలుని మరో కాలికి వేసి కొట్టుకున్నాడు. "నువ్వు వచ్చినట్టు కబురు చెయ్యకపోవడం యెంత అన్యాయం!" అని రెట్టించాడు.

"నాకు వ్యవధి లేకపోయింది. అస్సలు కాళీ లేకపోయింది" అని కరేనిన్ పొడిగా జవాబు చెప్పేడు.

"రా, మా ఆవిడ్ని చూద్దువుగాని, ఆవిడ నిన్ను చూడాలని యిదవుతోంది."

చలికి బిగిసిపోయిన కాళ్ళ చుట్టూ కప్పుకున్న కంబళీని విప్పి కరేనిన్ బగ్గీ దిగి దాలీ దగ్గరికి వెళ్ళేడు.

"యేమిటండి కరేనిన్‌గారూ మామీద యిలా శీతకన్ను వేశారేమిటి?" అంది దాలీ చిరునవ్వు నవ్వుతూ.

"అస్సలు కాళీ లేకపోయిందమ్మా, మిమ్మల్ని చూడ్డం చాలా సంతోషంగా వుంది"

అని వాళ్ళని చూడ్డం తనకి చాలా విచారంగా వుందని ధ్వనించే గొంతుకతో అన్నాడు. "బాగున్నారా?" అన్నాడు.

"మా అన్నా యెలా వుంది?"

కరేనిన్ యేదో గొణిగాడు. వెళ్ళిపోవడం కోసం అటు తిరిగేడు. కాని అబ్లాన్‌స్కీ అతన్ని ఆపేడు.

"చూడు, రేపు యిలా చేద్దాం. డాలీ, రేపు యీయన్ని భోజనానికి రమ్మని పిలు. నేను కోజ్నిషెవ్‌నీ, పెస్త్సోవ్‌ని రమ్మని పిలుస్తాను. మన మాస్కో బుద్ధిజీవులని రుచి చూపిద్దాం" అన్నాడు.

"ఆఁ, తప్పకుండా వస్తారు కదూ" అంది డాలీ. "మీ యిష్టం అయిదింటికి గాని ఆరింటికి గాని, మీ వీలునుబట్టి. యింతకీ మా అన్నా యెలా వుందో చెప్పారు కాదు. యెంత కాలం అయింది చూసి..." అంది.

"ఆమె బాగానే వుంది" అన్నాడు కరేనిన్ చిరచిరలాడుతూ. "మిమ్మల్ని చూసినందుకు సంతోషంగా వుంది" అంటూ బగ్గీ దగ్గరికి వెళ్ళిపోయాడు.

"మీ కోసం చూస్తూ వుంటాం మరి" అంది డాలీ.

కరేనిన్ చెప్పిన మాట బళ్ళ గోలలో కలిసి పోయి వినిపించలేదు.

"రేపు నేను నీ దగ్గరకి వచ్చి నిన్ను తీసుకువెడతా" అని అబ్లాన్‌స్కీ అరిచేడు.

కరేనిన్ బగ్గీలోకి యెక్కి యెవళ్ళనీ చూడకుండా, యెవళ్ళకీ కనిపించకుండా వుండేందుగ్గాను ఓ మూలకి జరిగి కూర్చున్నాడు.

"చిత్రమైన మనిషి" అని అబ్లాన్‌స్కీ భార్యతో అన్నాడు. తర్వాత గడియారంకేసి చూశేడు. ప్రేమ పూర్వకంగా పెళ్ళానికీ, పిల్లలకీ ముద్దు గాలిలోకి విసిరి చకచకా వెళ్ళిపోయాడు.

"మాటు! మాటు!" అని డాలీ సిగ్గుపడుతూ భర్తని పిలిచింది.

అతను వెనక్కి తిరిగేడు.

"తాన్యాకీ, గ్రీషకీ కోట్లు కొనాలి. డబ్బు కావాలి."

"ఫరవా లేదు. నేను తర్వాత యిస్తానని చెప్పు" అని అంటూ, దారిలో తగిలిన పరిచయస్థులెవళ్ళకో హుషారుగా తల వూపుతూ వెళ్ళిపోయాడు.

7

ఆ మర్నాడు ఆదివారం. అబ్లాన్‌స్కీ బొల్షోయ్ థియేటర్‌లో ఓ బాలే రిహార్సల్‌కి వెళ్ళేడు. అప్పుడే అతని అభ్యర్థన మేరకి ఆ థియేటర్ బృందంలో చేరిన ముచ్చటైన

చిన్న నర్తకి మాష చిబిసోవాకి తను యిస్తానని అంతకు ముందు రోజు వాగ్దానం చేసిన పగడాల హారం యిచ్చేడు. థియేటర్ చీకట్లో, తెరల వెనక ఆ కానుకతో వెలిగిపోతున్న ఆమె ముచ్చటైన ముఖాన్ని ముద్దుపెట్టేసుకున్నాడు. పగడాల హారం కానుక యివ్వడమే కాకుండా ఆ సాయంత్రం బాలే తర్వాత ఆమెని కలుసుకోవడం కోసం యేర్పాటు చేసుకోవాల్సి వుంది కూడా. ప్రదర్శన మొదలైనప్పుడు తను రాలేననీ ఆఖరి అంకం వేళకి వచ్చి ఆమెని భోజనానికి తీసుకెడతాననీ చెప్పేడు. థియేటర్ దగ్గర్నుంచి అతను అఖోత్నీ రియాద్ చౌక్‌కి వెళ్లి విందు భోజనాలకి చేపల్నీ, కాయగూరల్నీ స్వయంగా యెంపిక చేశాడు. పన్నెండు గంటల కల్లా ద్యుస్సో హోటెల్‌కి వెళ్లాడు. అదృష్టవశాత్తూ అతను చూడవలసిన ముగ్గురు మిత్రులూ అదే హోటెల్లో వున్నారు. అప్పుడే విదేశాలనుంచి తిరిగివచ్చిన లేవిన్; అబ్లాన్‌స్కీ కొత్త అధికారి — అప్పుడే ఆయనకా ఉన్నత పదవిని యిచ్చారు, ఆయన పర్యవేక్షణ నిమిత్తం మాస్కో వచ్చేడు; యిక తన బావ కరేనిన్. అతన్ని యెలాగైనా అబ్లాన్‌స్కీ యింటికి భోజనానికి తీసుకెళ్లవలసి వుంది.

అబ్లాన్‌స్కీకి భోజనం చెయ్యడం సరదా, కాని శ్రేష్ఠమైన భోజ్యాలతో, సారాయిలతో, అతిథులతో వుండే చిన్న విందులు యివ్వడమంటే యింకా సరదా. ఆవేళ విందు భోజనం యేర్పాట్లు అతనికి చాలా నచ్చేయి: సజీవంగా తెచ్చిన పెర్చ్ చేపలు, కాయగూరలు, la pièce de résistance[1] మామూలుదే అయినా బీఫ్ వేపుడు వుంటుంది గాని, అది అద్భుతమైన నాణ్యంతో వుంటుంది. యిక ఈ వంటకాలకి తగ్గట్టుగా మధువులు వుంటాయి. భోజన పానీయాలకి సంబంధించి అది. యిక అతిథుల విషయానికి వస్తే కిట్టీ వుంటుంది, లేవిన్ వుంటాడు. చూసే వాళ్ల దృష్టికి వీళ్లిద్దరే అనితే అంత బాగుండదని చెప్పి యింకో బంధువుల ఆమెని, యువ ష్చేర్‌బాత్‌స్కీని కూడా పిలిచేడు. అతిథుల్లో la pièce de résistanceగా కోజ్నిషెవ్, కరేనిన్‌లు వుంటారు. కోజ్నిషెవ్ మాస్కో తత్వవేత్త. కరేనిన్ పీటర్స్‌బర్గ్ వ్యవహారజ్ఞుడు. వీళ్లు కాక అందరికీ తెలిసిన తిక్క మనిషీ, ఔత్సాహికుడూ పెస్త్‌సోవ్‌నీ పిలిచాడు. అతను ఉదారవాది, సంగీతం తెలిసిన వాడు, చరిత్రకారుడు, వాగుడుపిట్ట, యాభై యేళ్ల యువకుడు. కోజ్నిషెవ్, కరేనిన్‌లకి మసాలాలాగా పనికొస్తాడు. వాళ్లిద్దర్నీ పోటీ పెట్టి యేడిపించుకునేట్టు చేస్తాడు.

కలప వర్తకుడు కలపకి రెండో వాయిదా పంపేడు. అందులో కొంత సొమ్ము యింకా మిగిలి వుంది. యీమధ్య దాలీ చాలా సరసంగా సౌమ్యంగా వుంటోంది. యివాళ విందు భోజనం వూహలు యే రకంగా చూసినా అబ్లాన్‌స్కీకి సంతోషకారకంగా వున్నాయి. ఫలితంగా అతను అంత కంటే ఆనంద దాయక మానసిక స్థితిలో వుండి వుండలేదు. ఒకటి రెండు సొద్దు విషయాలు ముసుగులో కనిపించేయి కాని అబ్లాన్‌స్కీ హృదయంలో తరంగిస్తూ వున్న ఆనంద సము

---

[1] ప్రముఖ వంటకం (ఫ్రెంచి).

ద్రంలో అవి మునిగిపోయాయి. ఆ రెండు సొద్దులూ యివి: ఒకటి, అంతకు ముందు రోజు వీధిలో తారస పడినప్పుడు కరేనిన్ తనని పలకరించిన కటువైన ముభావపు తీరు; కరేనిన్ మాస్కో వచ్చి తనని చూడకుండా కనీసం తమకి కబురు చెయ్యకుండా వుండడం, అన్నాకీ వ్రాన్‌స్కీకీ గల సంబంధాల గురించి రేగుతున్న పుకార్ల నేపథ్యంలో చూస్తే ఆ భార్యా భర్తల మధ్య పరిస్థితి సవ్యంగా లేదని వూహించడానికి అబ్లాన్‌స్కీకి ఆస్కారం యిచ్చింది.

ఇది మొదటి సొద్దు. యిక చిన్నది రెండోది వుంది, అదేమంటే ప్రస్తుతం వచ్చిన కొత్త అధికారి, కొత్త అధికార్లందరికిలాగానే, చండ భయంకరుడనే పేరుతో వచ్చేడు. పొద్దున్నే ఆరింటికే లేచి కూచుంటాడట. ఎద్దులాగా పని చేస్తాడట. తన కింద పని చేసేవాళ్ళూ అలానే వుండాలంటాడట. అంతే కాకుండా వ్యవహార విషయాల్లో చాలా మొరటుగా వుంటాడనీ, అంతకు ముందు అధికారి వున్న దానికీ ప్రస్తుతందాకా అబ్లాన్‌స్కీ వున్న దానికీ అన్ని విధాలా యెడ్డెం అంటే తెడ్డెం అనే రకంగా వుంటాడనీ అన్నారు. అంతకు ముందు రోజు అబ్లాన్‌స్కీ సర్కారువారు నిర్దేశించిన బట్టలు వేసుకుని ఆఫీసుకి వెళ్ళాడు. కొత్త అధికారి చాలా ఆదరపూర్వకంగా పాత పరిచయస్థుడిలా మాట్లాడేడు. అందుకని మామూలు కోటు తొడుక్కుని అయన్ని దర్శించడం తన బాధ్యతగా అబ్లాన్‌స్కీ భావించేడు. యేమో అధికారి తనని యిప్పుడు ముభావంగా చూస్తాడేమో అనే భయం యిప్పుడతనికి వున్న యింకొక చిన్న సొద్దు. కాని అన్నీ దివ్యంగా అమరుతాయని అబ్లాన్‌స్కీ అంతఃకరణకి తోచింది. 'మనమంతా మనుషులమే, పాపులమే. అంచేత మనం కజ్జాలు పెట్టుకుని వొకళ్ళ వొకళ్ళు బాధ పెట్టుకోవడం యెందుకు?' అని హోటల్‌లోకి అడుగు పెడుతూ అనుకున్నాడు.

"యేమిటి వసీలీ" అని అతను టోపీని వో పక్కకి వొరగేసుకుని వసారాలోకి యెగురుకుంటూ వెళ్ళి తనకి తెలిసిన వో నౌకర్ని పలకరించేడు. "చెంపలు పెంచావేమిటి? ఆఁ! లేవిన్‌గారు యేడవ నంబరు గదిలో వున్నారు కదా? యేదీ దారి చూపించు. కౌంట్ అనిచ్‌కిన్‌గార్ని (కౌంట్ అనిచ్‌కిన్‌గారే కొత్త అధికారి) నేను చూడవచ్చేమో కనుక్కో" అన్నాడు.

"అలాగే నయ్యా. చాలా కాలం అయిందయ్యా తమ దర్శనం అయి" అన్నాడు వసీలీ చిరునవ్వు నవ్వుతూ.

"నిన్న వచ్చావిక్కడికి, కాని అటు వేపు దారినుంచి వచ్చారే. యిదేనా యేడవ నంబరు గది?"

అబ్లాన్‌స్కీ లోపలికి వెళ్ళేటప్పటికి లేవిన్, త్వేర్ గుబేర్నియా వాడైన వో రైతుతో కలిసి తాము చంపిన ఎలుగుబంటి చర్మాన్ని కొలుస్తున్నాడు.

"ఆఁ! మీ వేటా? బాగుంది. ఆడయెలుగా? నమస్తే అర్హీప్" అన్నాడు అబ్లాన్‌స్కీ. ఆ రైతుతో కరచాలనం చేసి కోటూ, టోపీ తీసెయ్యకుండా కూర్చున్నాడు.

"విప్పెయ్యి వాటిని, కాసేపు కూర్చో" అని లేవిన్ అబ్లాన్‌స్కీ టోపీ తీసేస్తూ అన్నాడు.

"వ్యవధి లేదు. వూరికే చూసి పోదామని వచ్చేను" అన్నాడు అబ్లాన్‌స్కీ. కోటు బొత్తాలు విప్పేసి. కాని తర్వాత దాన్ని తీసేసి వేట గురించి, సొంత విషయాల గురించి లేవిన్‌తో మాట్లాడుతూ గంటసేపు వుండిపోయాడు.

"వూఁ! విదేశాల్లో యెలా గడిపావో యేమిటో చెప్పు. యెక్కడెక్కడికి వెళ్లావు?" అని రైతు వెళ్లిపోయాక అడిగేడు.

"జర్మనీ వెళ్లాను, ప్రష్యా, ఫ్రాన్స్, ఇంగ్లండ్ దేశాలకి వెళ్లాను. కాని రాజధాని నగరాలకి వెళ్లలేదు. ముఖ్యంగా కార్ఖానా నగరాలకి వెళ్లాను. నాకు తెలియని కొత్త వాటిని చాలా చూశాను. వెళ్లినందుకు చాలా సంతోషం కలిగింది."

"శ్రమ శక్తిని నిర్వహించడం గురించి నీ అభిప్రాయాలు నాకు తెలుసులే."

"అబ్బే లేదు, రష్యాలో శ్రామిక సమస్య లేదు. రష్యాలో వున్నది శ్రామికుడికీ నేలకీ వుండే సంబంధం సమస్య. విదేశాల్లోనూ యిదే సమస్య వుంది. కాని అక్కడ తగలేసిందాన్ని సర్దుబాటు చేసుకోవడం సమస్య. కాని మనదైతే..."

అబ్లాన్‌స్కీ లేవిన్ చెప్పే దాన్ని శ్రద్ధగా విన్నాడు.

"అవును నిజమేలే. నువ్వన్న ముక్క నిజమే. కాని నువ్వు యింత క్షేమగ్గా వుండడం నాకు సంతోషంగా వుంది. ఎలుగుబంట్ల వేటకెడుతున్నావు, పనిచేస్తున్నావు, మనసు పెట్టి పన్లు చేస్తున్నావ్. ష్చేర్‌బాత్‌స్కీ చెప్పాడు — నిన్ను కలిశాట్ట కదా — నువ్వు దిగాలుగా వున్నావనీ, చావు గురించి మాట్లాడేవనీ..."

"వూఁ, మృత్యువు గురించి అనుకోవడం యెప్పుడు మానననుకో" అన్నాడు లేవిన్. "నిజానికి అందుకు సమయం వచ్చిందను కుంటున్నాను. మిగిలిందంతా అర్థవిహీనం. నిజంగా చెప్తున్నా విను: నా అభిప్రాయలూ, పనీ నాకు చాలా యిష్టమైనవే. కాని నీ అంతట నువ్వే చూడు — యీ ప్రపంచమంతా యేమిటంటావ్, సూక్ష్మాతి సూక్ష్మ గోళంమీద పెరిగిన పల్చని బూజు కాకపోతే. మరి మనమేమో గొప్ప పన్లు చెయ్యగల సమర్థులమనుకుంటాం. గొప్ప వూహలు, గొప్ప పన్లు! ప్చ్! వొట్టి యిసుక రేణువులు."

"నాయనా, ఇక్ష్వాకుల నాటినుంచీ వున్న మాట అంటున్నావు అంతే."

"కావచ్చు. కాని నువ్వు దీన్ని స్పష్టంగా చూడగలిగితే మిగతా ప్రతిదీ విలువ కోల్పోతుంది. యివాళో రేపో నువ్వు చచ్చిపోతావనీ, యేదీ మిగలదనీ నువ్వు తీక్ష్ణంగా గ్రహించగలిగినప్పుడు ప్రతిదీ యెంత అర్థరహితమవుతుంది! నా ఆలోచన ఘనమైందని నేనుకుంటున్నాను, దీనికి వ్యావహారిక రూపాన్ని యివ్వగలిగినట్టయితే కూడా అది యెలుగుబంటి వేట అంత తుచ్ఛమూ అవుతుంది. మనం మన బతుకుల్ని అలా వెళ్లబారుస్తాం — వేటలో, పనిలో మనసు లగ్నం చేసి మృత్యువు గురించి ఆలోచనే చెయ్యం."

లేవిన్ చెప్పేది వింటూ వుంటే అబ్లాన్‌స్కీ పెదాలమీద ఆదరపూర్వక మందహాసం లాస్యం చేసింది.

"అదుగో మరి చూశావా! నువ్వు నా దారిలోకి వచ్చేవు. గుర్తుందా, నేను జీవితంలో ఆనందం పొందే దారిలో తిరుగుతూ వున్నందుకు నామీద దాడి చేశావ్, గుర్తుందా? అంత కటువుగా, నైతికవాదీ!..."

"లేదు, అయినా జీవితంలో కొంత మంచి వుంది, అది..." లేవిన్‌కి ఆలోచన తట్టలేదు. "నాకు తెలిసిన దల్లా మనం త్వరలో చనిపోతామనే."

"త్వరలో యెందుకని?"

"యిదిగో విను, మృత్యువు గురించిన ఆలోచనలు వుంటే జీవితం అంత ఆకర్షవంతంగా కనిపించకపోయినా మానసిక శాంతి లభిస్తుంది."

"అందుకు వ్యతిరేకం, అంత్య ఘడియకి చేరువయే కొద్దీ జీవితం తీపి యెక్కువ అవుతుంది. సరే, నాకు వేళ అయింది" అన్నాడు అబ్లాన్‌స్కీ పదోసారి లేస్తూ.

"పర్లేదులే, కూర్చో కాసేపు" అన్నాడు లేవిన్ అతన్ని ఆపుతూ. "మళ్ళీ యెప్పుడు కలుస్తామో యేమిటో, నేను రేపు వెళ్ళిపోతున్నాను."

"బాగుంది, నేనూ భలేవాణ్నే! నేను యెందుకొచ్చినట్టు యిక్కడికి?... నువ్వివాళ సాయంత్రం మా యింటికి భోజనానికి రావాలి. నీ అన్నయ్య కోజ్నిషెవ్, మా బావ కరేనిన్ వస్తారు."

"ఆయన యిక్కడున్నాడా?" అని లేవిన్ అడిగాడు. కాని నిజానికి కిట్టీ గురించి అడగాలనుకున్నాడు. శీతకట్టు ఆరంభంలో ఆమె రెండో అక్కగార్ని, అంటే దౌత్య ఉద్యోగి భార్యని, చూడ్డానికి సెయింట్ పీటర్స్‌బర్గ్ వెళ్ళినట్టు విన్నాడు. ఆమె తిరిగి వచ్చిందీ లేనిదీ తెలియలేదు. అయినా అతను అడగలేదు. యేమైనా అతని ఆలోచన మారిపోయింది. 'వచ్చిందో లేదో, యేమిటి దానివల్ల నాకు!' అనుకున్నాడు.

"యేం, వస్తావు కదూ!"

"యెందుకు రాను!"

"అయితే అయిదింటికి. మామూలు కోటు వేసుకుని."

యీ సారి అబ్లాన్‌స్కీ లేచి తన కొత్త అధికారిని చూడ్డానికి కిందికి వెళ్ళాడు. అతని అంతఃకరణకి తట్టింది దగా అవలేదు. ఆ భయంకరుడు చాలా ఆదరంగా వుండే వాడిగా తేలాడు. అబ్లాన్‌స్కీ ఆయనతో మధ్యాహ్న భోజనం చేసి చాలా సేపు కూర్చుండి పోయాడు. దాంతో మూడు తర్వాతనే కరేనిన్‌ని చూడ్డానికి వెళ్ళగలిగాడు.

8

పొద్దున్నే చర్చిలో ప్రార్థనకి వెళ్ళి వచ్చాక కరేనిన్ ఆ పొద్దుటి పూట అంతా తన గదిలోనే వుండిపోయాడు. ఆ పూట అతను రెండు పన్లు చెయ్యవలసి వుంది. మొదటిది,

పీటర్స్‌బర్గ్ వెడుతూ దారిలో మాస్కోలో ఆగిన అల్పసంఖ్యాక జాతుల ప్రతినిధివర్గాన్ని కలుసుకుని వాళ్లకి సూచనలు యివ్వడం. రెండవది లాయరుకి రాస్తానని చెప్పిన ఉత్తరం రాయడం. యీ ప్రతినిధివర్గాన్ని పిలవడం చొరవ కరేనిన్‌దే అయినా వాళ్ల రాక అతనికి కొంచెం యిబ్బంది కలిగించవచ్చు, కొంత ప్రమాద సూచకం కావచ్చు. వాళ్లింకా మాస్కోలో వుండగానే వాళ్లని కలుసుకునే అవకాశం వచ్చినందుకు కరేనిన్ చాలా సంతోష పడ్డాడు. పాపం కమిషన్ సభ్యులకి తాము నిర్వహించవలసిన కర్తవ్యం యేమిటో, తాము యేం చెయ్యవలసి వుందో పీసరు కూడా తెలీదు. తమ అవసరాలని గురించీ అసలు పరిస్థితి గురించీ చెప్పుకోవడమూ, తమకి సాయం చెయ్యవలసిందిగా ప్రభుత్వాన్ని అర్థించడమూ తమ రాక ఉద్దేశ్యం అని వాళ్లు అమాయకంగా అనుకున్నారు. తమ అభ్యర్థనల్లో కొన్ని, తమ విజ్ఞాపనల్లో కొన్ని శత్రుపక్షాన్ని బలపరుస్తాయనీ, కరేనిన్ లక్ష్యానికి భంగం కలిగిస్తాయనీ వాళ్లకి అసలు తెలీదు. కరేనిన్ వాళ్లతో చాలా సేపు గడిపాడు. కార్యాచరణ కార్యక్రమాన్నొక దాన్ని తయారు చేశాడు. వాళ్లు యెట్టి పరిస్థితుల్లోనూ దాన్ని అతిక్రమించకూడదు. వాళ్లు వెళ్లిపోయిం తర్వాత, యీ ప్రతినిధివర్గంతో యెలా వ్యవహరించాల్సి వుందో వివరిస్తూ పీటర్స్‌బర్గ్‌కి ఉత్తరాలు రాశాడు. యీ విషయంలో అతని మొదటి సహాయకురాలు కౌంటెస్ లిదియా ఇవానొవ్నా. ప్రతినిధివర్గాలతో వ్యవహరించడంలో ఆమె దిట్ట. ఆమెకిలాగా యెవర్నూ వాళ్లని కదిలించి, సరైన దార్లో నడిచేట్టు వుంచలేరు. యీ వ్యవహారం పూర్తవగానే కరేనిన్ లాయర్‌కి ఉత్తరం రాశాడు. యే విధమైన సందేహాలు లేకుండా, తనకి ఉచితం అని తోచిన రీతిలో లాయరు పని చేసేందుకు పూరా అనుజ్ఞ యిచ్చేడు. వ్రాన్‌స్కీ ఆన్నాకి రాసిన ఉత్తరాల్లో మూడింటిని యీ ఉత్తరంతో జత చేసి పంపేడు. ఆ ఉత్తరాలు ఆన్నా సొరుగులోనుంచి అతను తీసినవి.

ఇక తిరిగి యింటికి వెళ్లకూడదనే ఉద్దేశ్యంతో కరేనిన్ యిల్లు వదిలివచ్చినప్పట్నుంచీ, లాయర్ని చూసి కనీసం ఆ వొక్క వ్యక్తికీ తన మనసులో మాట నివేదించు కున్నప్పట్నుంచీ, ముఖ్యంగా తన జీవిత సమస్యని కాగితంమీద పెట్టే సమస్యగా మార్చినప్పట్నుంచీ అతను తను తీసుకున్న నిర్ణయానికి క్రమేపీ అలవాటు పడ నారంభించేడు. దాన్ని అమలు జరిపే అవకాశం అతనికి యిప్పటికి స్పష్టంగా కనిపించింది.

అతను లాయరుకి రాసిన ఉత్తరాన్ని అతికించబోతూ వుండగా అబ్లాన్‌స్కీ గట్టిగా మాట్లాడ్డం వినిపించింది. అబ్లాన్‌స్కీ తను వచ్చినట్టు కరేనిన్‌కి చెప్పమని పొత్తిడి చేస్తూ నౌకరుతో వాదిస్తున్నాడు.

'సరే యిప్పుడేమిటిహ? మరీ మంచింది. తన అక్కగారికి సంబంధించి పరిస్థితి యేమిటో అతనికి చెప్పేస్తాను, భోజనానికి యెందుకు రాలేనో చెప్తాను' అనుకున్నాడు.

"రానియ్యి" అని కాగితాల్ని సర్దుకుని పెట్టెలో పెట్టుకుంటూ అన్నాడు.

"అదుగో, చూశావా? వున్నాడాయన లోపం! నువ్వు అబద్ధం ఆడేవు" అని అబ్లాన్‌స్కీ

నౌకరుతో అవి, కోటు తీసేసి గదిలోకి వచ్చేడు. "నిమ్మ కలిసినందుకు చాలా సంతోషంగా వుంది. నేనుకుంటూ వున్నా..." అని అబ్లాన్‌స్కీ హుషారుగా మొదలుపెట్టాడు.

"నేను రాలేను" అని కరేనిన్ సంచుంటూ, అతన్ని కూర్చోమని అనకుండా ముక్త సరిగా అన్నాడు.

అబ్లాన్‌స్కీ పట్ల ఆదరపూర్వక వైఖరి అవలంబించా లనుకున్నాడు కరేనిన్ తను విడాకులు యిచ్చెయ్యబోయే భార్య తమ్ముడి పట్ల అలా వుండడం సహజమే మరి. కాని అబ్లాన్‌స్కీ హృదయంలో తరంగిస్తూ వున్న ఉత్సాహ సముద్రాన్ని అతను దృష్టిపెట్టలేదు.

అబ్లాన్‌స్కీ తేటగా మెరుస్తూ వుండే తన కళ్లతో తేరిచూశాడు.

"యెందుకని రాలేవు? యేమిటి నీ ఉద్దేశం?" అని ఆశ్చర్యపోయి ఫ్రెంచిలో అన్నాడు. "కాని వస్తానని మాట యిచ్చేవు. నువ్వు వస్తావని మాకు ఆశగా వుంది" అన్నాడు.

"నేను రాలేను అని చెప్పాలను కుంటున్నాను, యేమంటే మన బంధుత్వ సంబంధాలు తెంచుకోవాలి."

"యేమిటి? యేమిటి నువ్వంటున్నది? యెందుకని?" అని అబ్లాన్‌స్కీ చిరునవ్వు నవ్వుతూ అన్నాడు.

"యెందుకంటే నేను మీ అక్కకి, అంటే నా భార్యకి విడాకులు యిచ్చేస్తున్నాను, నేను భరిం..."

కాని కరేనిన్ మాట పూర్తి చెయ్యకముందే అతను అనుకోని విధంగా అబ్లాన్‌స్కీ ప్రవర్తించడంతో పూర్తి చెయ్యలేకపోయాడు. అబ్లాన్‌స్కీ గట్టిగా నిట్టూర్చి కుర్చీలో కూలబడిపోయాడు.

"లేదు, లేదు, బావగారూ వుహు, మీరంటున్నది నిజం కాదు" అని ముఖం దీనంగా పెట్టి అన్నాడు.

"యిది అంతే."

"క్షమించాలి. నేను, అబ్బా, నేను నమ్మలేను."

కరేనిన్ కూర్చున్నాడు. తను వూహించిన దానికి భిన్నంగా తన మాటల ప్రభావం కని పించిందనీ, తను పరిస్థితిని వివరించవలసి వుందనీ, యెలా వాటిని గురించి వివరించినా తన బావమరిది పట్ల తన వైఖరి యెప్పుడూ వున్నట్టే వుంటుందనీ అతను గ్రహించాడు.

"గత్యంతరం లేక విడాకుల పరిష్కారం దాకా నేను పోవాల్సి వచ్చింది" అన్నాడు.

"నే చెప్పేది వొక్కటే బావా. నాకు తెలుసు నువ్వు ధర్మబద్ధంగా వుండే మంచి మనిషి వని. అన్నా కూడా—క్షమించాలి, ఆమె గురించి నా అభిప్రాయం మార్చుకోలేను— మంచి మనిషి, అద్భుతమైనది, అంచేత, క్షమించాలి, నువ్వన్న దాన్ని నమ్మలేను. యేదో పొరపాటు జరిగి వుంటుంది" అన్నాడు.

"అబ్బ, యిది వొట్టి పొరపాటు మాత్రమే అయితేనా!"

"అవును... నాకు తెలుసు" అని అబ్లాన్‌స్కీ అతనికి అడ్డం వెళ్లేడు. "అవును... కాని వొకటి, తొందరపడద్దు. అయ్యో తొందరపడద్దు, తొందరపడద్దు" అన్నాడు.

"నేను తొందరపడడం లేదు" అన్నాడు కరేనిన్ పొడిగా. "కాని యిలాంటి విషయాలకి సంబంధించి యెవళ్లూ సలహా యివ్వలేరు. నా నిర్ణయం మారదు" అన్నాడు.

"యెంత ఘోరం" అన్నాడు అబ్లాన్‌స్కీ గాఢంగా నిట్టూరుస్తూ. "నేనోటి చెప్తాను, బావా, నిన్ను వేడుకుంటున్నా అలా చెయ్యి" అన్నాడు. "నువ్వింకా యీ వ్యవహారంలోకి దిగలేదనుకుంటున్నా. దిగే ముందు మా ఆవిడ్ని చూసి ఆమెతో మాట్లాడు. ఆమెకి అన్నా అంటే తోబుట్టువు ప్రేమ. ఆమెకి నువ్వంటేమో యిష్టమే. ఆమె భలే మనిషి. నీకు పుణ్యం వుంటుంది ఆమెతో మాట్లాడు. నా కోసం, దయచేసి, నిన్ను వేడుకుంటున్నాను" అన్నాడు.

కరేనిన్ ఆలోచనలో పడ్డాడు. అబ్లాన్‌స్కీ అతన్ని సానుభూతితో చూశాడు నిశ్శబ్దాన్ని భంగించకుండా.

"యేం వచ్చి ఆమెని చూస్తావా?"

"యేమో చెప్పలేను. అందుకనే నిన్ను చూడంది. మన సంబంధాలు మారాలి."

"కాని యెందుకని? యెందుకో నాకు అర్థం అవడం లేదు. మనం బంధువులం అనేది అలా వుంచినా నీపట్ల నాకు స్నేహభావం పైగా నిజమైన గౌరవ భావం" అని కరేనిన్ చేతిని నొక్కుతూ అన్నాడు. "అందులో కనీసం కొంత నా పట్ల నీకు వుందనే అనుకుంటున్నాను. నీ దారుణాతి దారుణమైన అనుమానం నిజమే అని తేలినా నేను యే పక్షమూ వహించే కోరిక కనబర్చను, అంచేత మన సంబంధాలు యెందుకు మారాలో నాకు తెలీదు. కాని నే అడిగినట్లు చెయ్యి, వచ్చి మా ఆవిడతో మాట్లాడు."

"యీ విషయంలో మన దృష్టి వేరు వేరుగా వుంది. యిక దాన్ని గురించి ప్రస్తావించుకోవద్దులే" అని కరేనిన్ ముభావంగా అన్నాడు.

"కాని యెందుకు నువ్వు రాకూడదు? కనీసం యివాళ భోజనానికి. నువ్వు వస్తావని మా ఆవిడ చూస్తోంది. రావాలి మరి. ఆమెతో తప్పకుండా మాట్లాడు. ఆమె భలే మనిషి. బాబ్బాబు! యివి చేతులు కావు, అంతలా నిన్ను బతిమాలుతున్నాను" అన్నాడు.

"నీకంత యిదిగా వుంటే వస్తాలే" అన్నాడు కరేనిన్ నిట్టూరుస్తూ.

మాట మారుద్దామని అతను యిద్దరికీ ఆసక్తికరంగా వుండే విషయం గురించి మాట్లాడేడు: అబ్లాన్‌స్కీకి కొత్తగా వచ్చిన అధికారి, యింకా పడుచు వాడే అయినా, ఆ హోదా ఉద్యోగానికి నియమితుడయ్యాడు.

కరేనిన్‌కి యీ కొత్త అధికారి కౌంట్ అనిచ్‌కిన్ అంటే యింతకుముందు పడదు. యెప్పుడు యిద్దరి అభిప్రాయాలూ యెడమొహం పెడమొహంగా వుండేవి. యిప్పుడు,

దీనికి తోడు, తన ఉద్యోగంలో కంగుతిన్న మనిషికి ప్రమోషన్ వచ్చిన వ్యక్తిపట్ల వుండే ఘృణాత్వం అతను దాచుకోకుండా కనిపించ చేశాడు.

"అతన్ని చూశావా?" అని కరేనిన్ విషపు నవ్వు నవ్వుతూ అడిగేడు.

"ఆఁ, నిన్న ఆఫీసుకి వచ్చేడు. వ్యవహార జ్ఞానం బాగా వున్న వాడిలాగే కనిపించేడు, శక్తి వున్నట్టుంది."

"ఆఁ, కాని యీ శక్తి యెటు మళ్లుతుందో?" అన్నాడు కరేనిన్. "దేన్నైనా సాధించే దిశగా లేక యిప్పటికే సాధించిన దాన్ని తగలెయ్యడానికా? మన ప్రభుత్వంలో వున్న పెద్ద అనర్థం జాగు. దీనికి అతను ఘనుడు" అన్నాడు.

"యేమో నాకు తెలీదు అయన్ని దేనికి తప్పు పట్టవచ్చో. పర్యవేక్షకుడిగా అయన్ని గురించి నాకింకా తెలీదు. కాని ఒకటి తెలుసు — గట్టి వాడు. యివ్వాడే అయన్ని చూసి వస్తున్నాను. నిజంగా గట్టి వాడు. యిద్దరం కలిసి భోజనం చేశాం. మద్యం పాళ్ల — వైన్‌ని నారింజ రసాన్ని — యెలా కలపాలో చూపించాను. చాలా హాయిగా వుంది. చిత్రం, ఆయన యింతకు ముందు యెరగడట. ఓ, భలే వాడు" అన్నాడు అబ్లాన్‌స్కీ.

అప్పుడు అబ్లాన్‌స్కీ గడియారం చూసేడు. "బాప్‌రే! అప్పుడే నాలుగు దాటిపోయింది. నేనింకా దొల్గొవూషిన్ దగ్గర ఆగాలి! వూఁ, అయితే, మరి భోజనానికి రా. నువ్వు రాకపోతే మా ఆవిడ యెంత దిగులుపడుతుందో చెప్పలేను."

తన బావమరిది వచ్చినప్పుడు పలకరించిన రీతిలో కాకుండా పూర్తి భిన్నంగా వుండే రీతిలో కరేనిన్ అతన్ని సాగనంపేడు.

"వస్తానని అన్నాను కాబట్టి వస్తాను" అని ఉదాసీనంగా జవాబు చెప్పేడు.

"ఆ ముక్క నాకు నచ్చింది, తెలుసా, యెందుకు వచ్చాన్రా నాయనా అని అనుకోవులే" అన్నాడు అబ్లాన్‌స్కీ చిరునవ్వు నవ్వుతూ.

బయటికి పరిగెత్తుతూ కోటు పైకి లాక్కుని, ప్రమాద వశాత్తూ ఓ నౌకరు నెత్తి మీద మోచెయ్యి కొట్టుకుంటే నవ్వేసి తన దారిన వెళ్లిపోయాడు.

"అయిదింటికి, మామూలు కోటు వేసుకుని రా" అని వెనక్కి తిరిగి కేకవేశాడు.

9

అయిదు దాటి కొంచెం సేపు అయింతర్వాత, కొంతమంది అతిథులు కూడా వచ్చేసిన తర్వాత అబ్లాన్‌స్కీ యింటి దగ్గర ప్రత్యక్షమయేడు. కోజ్నిషెవ్, పెస్త్‌సోవ్‌లతో కలిసి వచ్చేడు. వాళ్లిద్దరూ అతనికి గుమ్మంలో తగిలేరు. వాళ్లిద్దరూ మాస్కో బుద్ధి జీవుల అగ్ర ప్రతినిధులంటే యెప్పుడూ అబ్లాన్‌స్కీ వాళ్ల గురించి అంటూ వుండేవాడు. ఆ యిద్దరికీ

కూడా సచ్ఛీలతకీ, మేధకీ సంబంధించి గొప్ప గౌరవం వుండేది. వాళ్లు పొకళ్ల నొకళ్లు గౌరవించుకునేవాళ్లు. కాని దాదాపు ప్రతి విషయంలోనూ ఉర్ధ విరుద్ధంగా వుండేవాళ్లు. వాళ్లు ప్రతికూల శిబిరాల్లో వుండడం వల్ల కాక వొకే శిబిరానికి చెందడం వల్ల అలా వుండేవాళ్లు (వాళ్ల మధ్య భేదం లేదని వాళ్ల శత్రువులు వొట్టు పెట్టుకుని అనేవాళ్లు). కాని ఆ వొక్క శిబిరంలోనూ యెవళ్ల మొగ్గలు వాళ్లకి వుండేవి. అర్ధ అమూర్త విషయాలకి సంబంధించి వుండే అభిప్రాయ భేదాలంతగా యేదీ మనుషుల్ని దూరం చెయ్యలేదు కాబట్టి వాళ్లు తమ తమ అభిప్రాయాల్లో విభేదించడమే కాక, యే కోపమూ లేకుండా యీ పరిస్థితిని అంగీకరించేందుకు అలవాటు పడ్డారు; చెరపలేని ఒకళ్ల దురభిప్రాయాలని చూసి మరొకళ్లు నవ్వుకునేవాళ్లు.

వాళ్లు వాతావరణం గురించి మాట్లాడుకుంటూ లోపలికి అడుగు పెట్టేటప్పుడు అబ్లాన్‌స్కీ వాళ్లని దాటేడు. అప్పటికి అబ్లాన్‌స్కీ మామ ప్రిన్స్ షేర్‌బాత్‌స్కీ, యువ షేర్‌బాత్‌స్కీ, తూరొవ్‌త్సిన్, కిట్టీ, కరేనిన్ డ్రాయింగు రూమ్‌లో కూర్చున్నారు.

అక్కడ పరిస్థితి సాఫీగా లేదని అబ్లాన్‌స్కీ వెంటనే పసికట్టేడు. పండగలప్పుడు వేసుకునే పట్టు గౌను తొడుక్కుని దాలీ పిల్లల గదిలో ఒంటరిగా భోజనాలు చేస్తున్న పిల్లల గురించీ, యింకా యిల్లు చేరని భర్త గురించీ ఆలోచనల్లో మునిగి పోయి యీ వచ్చిన వాళ్లం దర్నీ కలిపి కాలక్షేపం అయ్యేట్టు చూడలేకపోయింది. పెద్ద ప్రిన్స్ అన్నట్టు వాళ్లంతా అక్కడ పూజారి కూతుళ్లలా కూర్చున్నారు, నిశ్శబ్దం భంగించడానికి మాటల్ని పిండుతూ, అసలు తాము అక్కడ యెందుకు చేరినట్టో తెలీక ఆశ్చర్యపోయూ వున్నట్టు వున్నారు. హుషారుగా వుండే తూరొవ్‌త్సిన్ గట్టున పడ్డ చేపలా వున్నాడు. అబ్లాన్‌స్కీ లోపలికి వచ్చేటప్పటికి అతను చిరునవ్వు నవ్వుతూ పెదాలు చాచేడు. 'భేష్ బాబూ! యేదో పరదాగా యింత తాగి Château des fleursకి పోదాం. అనుకున్న నన్ను యీ ముప్పి మనుషుల్తో బంధించడం!' అని అంటున్నట్టుగా వుందా చిరునవ్వు. పెద్ద ప్రిన్స్ మాటా పలుకూ లేకుండా కూర్చున్నాడు. మాటి మాటికీ కరేనిన్ కేసి చూసి యీ ఘనమైన ఉన్నతాధికార్ని విందు భోజనాల దగ్గర వడ్డించే అపురూప వంటకంలాగా వున్న అతన్ని యెలా ఆట పట్టించాలా అని మాటల కోసం బుర్ర బద్దలు కొట్టుకుంటున్నట్టు వున్నాడని అబ్లాన్‌స్కీకి అనిపించింది. కిట్టీ కళ్లు గుమ్మం కేసే చూస్తూ వున్నాయి, ఆమె లేవిన్ రాగానే సిగ్గు పడకుండా వుండేందుకుగాను శక్తినంతట్నీ కూడగట్టుకుంటోంది. కరేనిన్‌కి పరిచయం చెయ్యని యువ షేర్‌బాత్‌స్కీ తనని గురించి ఖాతరు చెయ్యకపోయినా తనేం పట్టించుకోనని కనిపించాలని మహా ప్రయత్నం చేస్తున్నాడు. కరేనిన్ తెల్లని టై కట్టుకున్నాడు, ఫ్రాక్ కోటు వేసుకున్నాడు. ఆడవాళ్లతో కలిసి భోజనం చెయ్యాల్సి వచ్చినప్పుడు పాటించే పీటర్స్‌బుర్గ్ ఆచారం అది. తను వస్తానని అన్నాడు కాబట్టే వచ్చాడనీ, యీ బృందంతో వుండడం తనకి బాధగా వుందని అబ్లాన్‌స్కీకి చెప్తున్నట్టుంది అతని ముఖం. నిజం చెప్తా

అంటే అబ్లాన్‌స్కీ వచ్చేదాకా అక్కడి మనుషులు మౌనంగా బిగిసిపోయి వుండడానికి తప్ప కరేనిన్ బెల్లం కొట్టిన రాయిలా వుండడమే.

అబ్లాన్‌స్కీ అయ్యొయ్యో ఆలస్యం అయిపోయిందని, యెవరో ప్రిన్స్ తనని ఆపు చేసేసాడనీ గొణుగుతూ లోపలికి వచ్చేడు. తను రాకపోవడానికీ, తన ఆలస్యానికీ యెప్పుడూ దోషం ఆ అజ్ఞాత ప్రిన్స్ నెత్తినే వడేసేవాడు. లిప్త కాలంలో అందరికీ పరిచయాలు చేసేసాడు. కోజ్నిషెవ్‌ని కరేనిన్ దగ్గరికి తీసికెళ్లి పోలెండ్ రష్యనీకరణం అనే చర్చనీయాంశాన్ని వదిలేడు. పెస్త్సోవ్‌తో సహా అందరూ ఆత్రుతగా ఆ అంశాన్ని అందుకున్నారు. అబ్లాన్‌స్కీ తూరొవ్‌త్సిన్ వీపు చరిచి యేదో తమాషాగా అతని చెవిలో వూది అతన్ని దాటికి, పెద్ద ప్రిన్స్‌కీ పక్కన కూర్చోబెట్టాడు. తర్వాత కిట్టీతో ఆమె ఆ పూట చాలా శోభాయమానంగా కనిపిస్తోందని అని, పడుచు షేర్‌బాత్‌స్కీని కరేనిన్‌కి పరిచయం చేశాడు. నిజంగానే క్షణ కాలంలో అతను ఈ సమాజ మర్యాదలనే పిండిని యెంత బాగా కలిపేడంటే డ్రాయింగ్ రూమ్ ఉల్లాసభరితమైన సంభాషణలతో, సందడితో కళకళలాడింది. అక్కడ లేని వాడల్లా లేవిన్ వొక్కడే. అదీ మంచికే జరిగింది. యేమంటే భోజనాల గదిలోకి వో సారి చూసేసరికి పోర్ట్, షెర్రీ వైన్లని లెవె దుకాణంనుంచి కాకుండా డెప్రె దుకాణంనుంచి తెప్పించినట్టు అబ్లాన్‌స్కీకి తెలిసింది. వెంటనే బండి వాణ్ణి లెవె దగ్గరికి ఆఘమేఘాలమీద పంపించి ఆ పొరపాటు సవరించే వ్యవధి దొరికింది.

తిరిగి డ్రాయింగు రూమ్‌లోకి వచ్చేటప్పుడు అతనికి లేవిన్ తగిలాడు.

"నేను ఆలస్యం చెయ్యలేదు కదా?"

"నువ్వు ఆలస్యం చెయ్యంది యెప్పుడు?" అని అతని చేతిని అందుకుంటూ అన్నారు అబ్లాన్‌స్కీ.

"యేం చాలామంది చేరారేమిటి? యెవరెవరున్నారు?" అని లేవిన్, టోపీమీదనుంచి గ్లవ్‌తో మంచు దులుపుకుంటూ తనకి తెలియకుండానే సిగ్గు పడుతూ అన్నాడు.

"అంతా మన వాళ్లే. కిట్టీ వుంది. రా, నిన్ను కరేనిన్‌కి పరిచయం చేస్తాను."

అబ్లాన్‌స్కీ ఉదారభావాలు వున్న వాడే అయినా కరేనిన్‌తో పరిచయం అంటే యెవళ్లైనా పొంగుతారని తెలిసిన మనిషి అవడంచేత తన మిత్రరత్నానికి ఆ గౌరవం కలిగిస్తూ వుండేవాడు. కాని లేవిన్ యీ క్షణంలో ఆ సమ్మానం అభినందించే స్థితిలో లేడు. అప్పుడు యీషణ్మాత్రంగా దారిమీద బండిలో చూసిందే తప్ప అతను కిట్టీని ఆ మరపు రాని వీథి నాటినుంచీ, తను వ్రాన్‌స్కీని కలుసుకున్న ఆ సాయంత్రంనుంచీ మళ్లీ చూళ్లేదు. తను యీ విందులో ఆమెని చూడగలడని అతని హృదంతరాళంలో అనిపించింది. కాని తనకా యెరుక లేనట్టు సమాధాన పర్చుకుని మనసుని శాంతంగా వుంచుకోవాలని ప్రయత్నించేడు. ఆమె నిజంగా అక్కడే వుందని విన్నాక అతనికి తెలియకుండానే యెంత సంతోష పారవశ్యమూ,

భయమూ కలిగాయంటే వూపిరి పీల్చుకోవడం అతనికి కష్టం అయింది, తను యేం చెప్పదలచుకున్నాడో అది చెప్పలేకపోయాడు.

'యెలా వుంది? యెలా వుందామె? పూర్వంలాగానే వుందా లేక బగ్గీలో వున్నట్టు వుందా? దాలీ నిజం చెప్పిందా? ఆవిడ మాట నిజం యెందుకు కాకపోతుంది?' అని అతను ఆలోచనల్లో వున్నాడు.

"ఓ, కరేనిన్‌గారికి నన్ను పరిచయం చెయ్యి" అని అతను శ్రమపడి యేమైతే కానీ అన్న తెగింపుతో డ్రాయింగ్ రూమ్‌లోకి అడుగుపెడుతూ అన్నాడు. ఆమె కనిపించింది.

ఆమె పూర్వంలాగా లేదు, బగ్గీలో కనిపించి నప్పటిలాగానూ లేదు. పూర్తిగా వేరేగా వుంది.

ఆమె భయంగా వుంది. బెరుగ్గా వుంది. లజ్జాన్వితంగా వుంది. అయినా కూడా మనోహరంగా వుంది. అతను గదిలోకి అడుగుపెట్టిన క్షణమే ఆమె అతన్ని చూసింది. ఆమె అతని కోసమే చూస్తోంది. ఆమెకి సంతోషం కలిగింది, ఆ సంతోషంలో యెంత వివశురాలయి పోయింది. ఒక క్షణంలో, అతను యింటావిడ దగ్గరికి, అంటే దాలీ దగ్గరికి వెళ్లి తనకేసి తిరిగి చూపు విసిరినప్పుడు, ఆ క్షణంలో సంబాళించుకోలేక యేడ్చేస్తుందేమోనని ఆమెకీ, లేవిన్‌కీ, యిదంతా చూస్తూ వున్న దాలీకి కూడా, అనిపించింది. ఆమె సిగ్గు పడింది, పాలిపోయింది, మళ్లీ సిగ్గు పడింది. గడక్కరలాగా బిగిసిపోయి పెదాలు వొణుకుతూ అతని కోసం చూస్తూ కూర్చుంది. అతను ఆమె దగ్గరికి వెళ్లాడు, వొంగి అభివాదం చేశాడు, వొక్క మాట కూడా అనకుండా చేతిని ఆమె వేపు చాచాడు. ఆమె పెదాల వొణుకూ, కళ్ల చెమ్మ — దానివల్ల ఆ కళ్ళ మెరుపు అధికమైంది — లేనట్లయితే ఆమె

"యెంతకాలం అయింది మనం కలుసుకుని!" అని అన్నప్పుడు ఆమె మందహాసం దాదాపు శాంతంగానే కనిపించేది. అప్పుడు అతని చేతిని తన చల్లని చేత్తో హతాశాజనిత దృఢత్వంతో అదిమింది.

"మీరు నన్ను చూళ్లేదు గాని నేను మిమ్మల్ని చూశాను" అని లేవిన్ ఉల్లాసపూర్వక మందహాసంతో అన్నాడు. "రైల్వే స్టేషన్నుంచి యెర్గుషోవొ వెళ్తే దారిలో మిమ్మల్ని చూశాను" అన్నాడు.

"యెప్పుడు?" అని ఆమె ఆశ్చర్యపోయి అడిగింది.

"మీరు యెర్గుషోవొ వెడుతూ వున్నప్పుడు" అని లేవిన్ గుండెలో యెగిసి వస్తూ వున్న ఆనందంతో ఉక్కిరిబిక్కిరి అవుతూ మళ్లీ చెప్పేడు. 'యీ సున్నిత ప్రాణి ముగ్ధత్వాన్ని నేనెలా శంకించగలిగాను? దాలీ నిజం చెప్పినట్టే కనిపిస్తోంది' అనుకున్నాడు.

అబ్లాన్‌స్కీ అతని చెయ్యి పట్టుకుని కరేనిన్ దగ్గరికి తీసుకువెళ్లాడు.

"యితను" అంటూ వొకళ్ల నొకళ్లకి అబ్లాన్‌స్కీ పరిచయం చేసాడు.

"మిమ్మల్ని మళ్లీ కలుసుకోవడం సంతోషంగా వుంది" అని కరేనిన్ ముక్తసరిగా అన్నాడు.

"యింతకు ముందే మీరు కృత పరిచితులా?" అని అబ్లాన్‌స్కీ ఆశ్చర్యంగా అడిగేడు.

"మేం యిద్దరం ఓ రైలు పెట్టెలో మూడు గంటలు కలిసి గడిపేం" అని చిరునవ్వు నవ్వుతూ లేవిన్ చెప్పాడు. "కాని ముసుగు నాట్యం తర్వాత వొకళ్ల నొకళ్లు తెలుసుకోకుండా, తెలుసుకోవాలనే కుతూహలం తీరకుండానే విడిపోయాం. కనీసం నా మట్టుకి అలా జరిగింది" అన్నాడు.

"ఓ, అదా! మరి, లేవండి భోజనాలు చేద్దాం" అంటూ భోజనాల గది వేపు చూపిస్తూ అబ్లాన్‌స్కీ అన్నాడు.

మగాళ్లందరూ భోజనాల గదిలో ఆరు రకాల వోద్కా, అన్ని రకాల జున్నూ వున్న బల్ల దగ్గరికి వెళ్లారు. ఆ జున్నుల్లో కొన్నిటికి వెండి చాకులు గుచ్చి వున్నాయి, కొన్నిటికి లేవు. ఆ బల్లమీద చేప గుడ్లు, హెర్రింగ్ చేపలు, వింత చేసిన రకరకాల పదార్థాలు, ఫ్రెంచి రొట్టె వున్నాయి.

మగాళ్లు సుగంధ వోద్కాలూ, నంజాళ్లు వున్న బల్ల దగ్గరే తిరిగారు. కోజ్నిషెవ్, కరేనిన్, పెస్త్సోవ్‌లు చర్చిస్తూ వున్న పోలండ్ రష్యీకరణం అనే విషయం వాళ్లు భోజనాల కోసం యెదురు చూస్తూ వుండడంలో కొంచెం కొంచెంగా జావగారిపోతూ వుంది.

యెంతో గంభీరమైన సైద్ధాంతిక చర్చలని యెవర్నూ గమనించకుండానే పరాచికం అనే లవణం వడేసి సమాప్తం చేసేసి, మాట్లాడేవాళ్ల ధోరణిని మార్చెయ్యడంలో కోజ్నిషెవ్ సిద్ధ హస్తుడు. అతను యిప్పుడు తన నైపుణ్యాన్ని చూపించేడు.

రష్యన్ అధికారులు పై నుంచి ప్రవేశ పెట్టే సూత్రాల్ని అనువర్తింప చెయ్యడం ద్వారానే పోలండ్ రష్యీకరణం సాధించవచ్చని కరేనిన్ వాదించేడు.

ఒక జాతి జనాభా అధికం కావడం ద్వారానే రెండవ జాతిని యిముడ్చుకుంటుందని పెస్త్సోవ్ నొక్కి వాదించేడు.

కోజ్నిషెవ్ రెండు వాదనలనీ వొప్పుకున్నాడు. కాని కొన్ని మినహాయింపులతో వొప్పుకున్నాడు. వాళ్లు డ్రాయింగ్ రూమ్‌లోనుంచి వెళ్లిపోయేటప్పుడు అతను మందహాసం చేసి చర్చను ముగించేస్తున్నట్టు అన్నాడు:

"అంటే అల్ప సంఖ్యాక జాతులని రష్యీకరణం చెయ్యడానికి వొక పకడ్బందీ అయిన మార్గం వుందంటారు: వీలైనంత మంది సంతానాన్ని కనడం. మా తమ్ముడూ నేనూ యీ మహత్తర లక్ష్యానికి దోహదం చెయ్యలేకపోయాం. కాని వివాహితులైన మీరు, ముఖ్యంగా అబ్లాన్‌స్కీ మీరు, నిజమైన దేశభక్తి పరాయణులుగా మెలగండి. మీకు పిల్లలెంత మంది?" అని వైన్ పొయ్యమన్నట్టు చిన్న వైన్ గ్లాసు చాచి, అబ్లాన్‌స్కీని కొంటెగా అడిగేడు.

అందరూ ఫక్కున నవ్వేరు. యెవళ్ళూ ఆబ్లాన్‌స్కీ అంత గట్టిగా నవ్వలేదు.

"అవునవును అదే శ్రేష్ఠమైన ఉపాయం" అని అతను జున్ను ముక్క నములుతూ, తన ముందుకు చాచిపెట్టిన గ్లాసులో ప్రత్యేక తరహా వోద్కా పోస్తూ అన్నాడు. సంభాషణ ఆ విధంగా సరదాగా ముగిసింది.

"యీ జున్ను ఫరవా లేదు. రుచి చూడండి" అన్నాడు ఆబ్లాన్‌స్కీ. "ఫూ, అయితే కసరత్తు చేస్తున్నావన్న మాట మళ్లీ" అని లేవిన్‌కేసి తిరిగి యెడమ చేత్తో అతని రండలు పట్టి చూస్తూ అన్నాడు. లేవిన్ చిన్నగా నవ్వి, కండరాలు బిగించేడు. అతని కోటు చేతి కింద, ఆబ్లాన్‌స్కీ వేళ్ళు నొక్కిన చోట జున్ను ముద్ద గట్టి చేసిన లాంటి ఉక్కు కండరం లేచింది.

"అదీ! కండలంటె అలా వుండాలి! అచ్చం భీముడు!"

"ఎలుగుబంట్ల వేటకెళ్లేవాళ్లకి గట్టి కండలుండాలేమో" అని వేట ముక్కా మొహమూ తెలియని కరేనిన్ పల్చని రొట్టె ముక్కని తీసుకుని దానిమీద జున్ను పెట్టుకుంటూ అన్నాడు.

లేవిన్ చిరునవ్వు నవ్వేడు.

"యేమీ కాదు, అందుకు వ్యతిరేకంగా చిన్న పిల్లాడు కూడా ఎలుగుబంటిని చంపగలడు" అని ఆడవాళ్లకి దారి యివ్వడం కోసం పక్కకి తప్పుకుంటూ అన్నాడు లేవిన్. దాలీ ఆడవాళ్లని సంజాళ్లు వున్న బల్ల దగ్గరికి తీసుకువచ్చింది.

"మీరు ఎలుగుబంటిని వేటాడేరని విన్నా" అని కిట్టీ మసాలా వేసిన పుట్టగొడుగు ఫోర్కుకి అందకుండా జారిపోతూ వుంటే దాన్ని ఫోర్కుతో పట్టుకునే యాతన పడుతూ, కింద నుంచి తెల్లని చెయ్యి మెరుస్తూ వున్న లేసుని వెనక్కి తోస్తూ అడిగింది. "మీ ప్రాంతంలో ఎలుగుబంట్లు వుంటాయని నాకు తెలవదు" అని ముచ్చటైన తలని అతనికేసి వోరగా పెట్టి చిరునవ్వు నవ్వుతూ జత చేసింది.

ఆమె అన్న యీ మాటల్లో ప్రత్యేకమైంది యేదీ లేదు. కాని ప్రతి మాటా, ఆమె పెదవుల ప్రతి కదలికా, కళ్లా చేతులా ప్రతి కదలికా అతనికి వర్ణించి చెప్పలేనంత మహాత్య పూరితంగా భాసించేయి. కిట్టీ మాటల్లో క్షమ కోసం అభ్యర్థన వుంది, తనపట్ల విశ్వాస ప్రకటన వుంది, లాలన వుంది, కోమల వినయపూరిత లాలన; ఆశ వుంది, ప్రేమ వుంది. దేనిపట్ల విశ్వాసం లేకుండా తను వుండలేడో ఆ ప్రేమ. ఆ ఆనందంతో అతను ఉక్కిరి బిక్కిరి అయేడు.

"ఆఁ! మేం ఎలుగుబంట్ల వేట కోసం త్వేర్ గుబేర్నియా వెళ్లాం. అక్కణ్ణుంచి వచ్చేటప్పుడే రైల్లో కరేనిన్‌గార్ని లేకపోతే మీ బావగారి బావగార్ని కలుసుకుంట" అన్నాడు లేవిన్ చిరునవ్వు నవ్వుతూ. "భలే తమాషా అయిన కలయిక" అన్నాడు.

లేవిన్ చాలా వర్ణనాత్మకంగా, ఆసక్తికరంగా వుండేట్టు రాత్రంతా జాగారం చేశాక

గ్రే తోలు ఓవరుకోటు తొడుక్కుని కరేనిన్ వున్న పెట్టెలోకి యెలా యెలా వెళ్లిందీ చెప్పేడు.

"మనిలో మాణిక్యం వుంటుందనే సామ్యాన్ని అవహేళన చేసేటట్టు నా గ్రే తోలు కోటుని చూసి కండక్టరు నన్ను బయటికి గెంటేద్దామనుకున్నాడు. కాని నేను అట్టహాసంగా పదగుంఫన మొదలుపెట్టాను, మీరు కూడా" అని కరేనిన్ కేసి తిరిగేడు. అతని అసలు పేరూ, తండ్రి పేరూ మర్చిపోయినందువల్ల "మీరు" అన్నాడు.

"నా గ్రే తోలు కోటుని బట్టి నన్ను బయటికి గెంటేద్దామనుకున్నారు, కాని తర్వాత నా పక్షం వహించేరు, అందుగ్గాను మీకు చాలా కృతజ్ఞుణ్ణి" అన్నాడు.

"విషయం యేమిటంటే సీట్లు యెన్నుకోవడంలో ప్రయాణీకుల హక్కులేమిటో చాలా అస్పష్టంగా వున్నాయి" అని వేళ్ల అంచుల్ని రుమాలుమీద తుడుచుకుంటూ కరేనిన్ అన్నాడు.

"నా విషయంలో మీరు సందిగ్ధంలో పడ్డా రనిపించింది నాకు" అని లేవిన్ సరదాగా అన్నాడు. "అందుకని నా గ్రే తోలు కోటు కలిగించిన దురభిప్రాయాన్ని యెదుర్కోం దుకు నేను పాండిత్య ప్రకర్షక సంభాషణ మొదలెట్టాను" అన్నాడు.

యింటావిడతో మాట్లాడుతూ వున్నా నో చెవి అప్పగించి తమ్ముడి మాటలు వింటూ వున్న కోజ్నిషెవ్ అతని కేసి వోరగా చూశేడు. 'యేమైందివాళ వీడికి? పెద్ద విజేత వాలకం పెట్టేస్తున్నాడు' అనుకున్నాడు. లేవిన్ తనకి రెక్కలు మొలిచినట్టు భావించుకుంటున్నా డని అతనికి తెలీదు. ఆమె తన మాటలు వింటోందని, ఆ వినడం ఆమెకి సంతోషంగా వుందనీ అతనికి తెలుసు, అతనికి అది చాలు, అదే సర్వస్వమూనూ. యీ గదిలో మాత్రమే కాదు, యావత్ప్రపంచంలోనూ మహత్తర ప్రాముఖ్యం, ఘనత్వం సంపాదించుకున్న తనూ, కిట్టీ తప్ప మరెవళ్లూ లేరు. తను యేదో, కళ్లు గిర్రున తిరిగిపోయేటంత, యెత్తులో వున్న ట్టుగా అతనికి భాసించింది. మిగిలిన వాళ్లందరూ, యీ సాధువులైన కరేనిన్‌లూ, అబ్లాన్‌స్కీలూ, మిగిలిన ప్రపంచం, చాలా కింద వున్నట్టు అనిపించింది.

అబ్లాన్‌స్కీ బల్ల దగ్గర కిట్టీని, లేవిన్‌ని చాలా యథాలాపంగా, మరెక్కడా కూర్చో డానికి వాళ్లకి చోటు దొరకనట్టు, వాళ్ల కేసి చూడకుండానే పక్క పక్కన కూర్చోబెట్టాడు.

"నువ్విక్కడ కూర్చోలే" అని లేవిన్‌తో అన్నాడు.

భోజనం పింగాణీ పాత్ర సామానంత చక్కగానూ వుంది. చక్కని పింగాణీ భోజన పాత్రలంటే అబ్లాన్‌స్కీకి వెర్రిమోజు. మారీ లూయిజ్ సూప్ వంక పెట్టడానికి లేనంత లేపుగ్గా కుదిరింది. నోట్లో వేసుకుంటే కరిగిపోయే చిన్నచిన్న పిండివంటలు అసలు సొద్దు పెట్టడానికి వీల్లేనట్టుగా వున్నాయి. తెల్ల టై కట్టుకున్న మాత్వేయి, మరో యిద్దరు నౌకర్లూ అన్న పానాలకి సంబంధించిన వాటన్నిట్నీ చకచకా, గబగబా, చడీ చప్పుడూ లేకుండా, వడ్డించేరు.

భోజనం పదార్థాల విషయానికి సంబంధించి దివ్యంగా వుంది. పదార్థేతర విషయికంగా

కూడా అంతే దివ్యంగా వుంది. సంభాషణ ఒకో అప్పుడు విడి విడి వ్యక్తులకి పరిమితమై, ఒకో అప్పుడు అందరికీ సంబంధించి విస్తరిస్తూ ప్రవాహంలాగా సాగిపోయింది. భోజనాలు ముగిసే వేళకి యెంత ఉల్లాసభరితంగా వుందంటే మగాళ్ళు అలా మాట్లాడుకుంటూనే భోజనాల బల్ల దగ్గర్నుంచి లేచారు. కరేనిన్ కూడా ఉల్లాసం కనిపించ చేసే స్థాయికి వచ్చేడు.

10

వాదనని తుదిదాకా లాగించడం పెస్త్సోవ్‌కి సరదా, కోజ్నిషెవ్ దాన్ని తెంపెయ్యడంతో కష్టం కలిగింది, ముఖ్యంగా తన అభిప్రాయానికి న్యాయం జరగలేదని అనిపించింది.

"జనాభా సాంద్రత అనే కాదు నా అభిప్రాయం" అని సూప్ తింటూ వున్నప్పుడు కరేనిన్‌తో అన్నాడు. "జన సాంద్రత — సూత్రాలతో కాకుండా, జాతీయ మూలాధారాలతో కలిసి" అని వివరించేడు.

"యేదైనా ఒకటే వనిపిస్తుంది నాకు" అన్నాడు కరేనిన్ మెల్లిగా అలసత్వంతో. "నా దృష్టిలో ఒక జాతి హెచ్చు స్థాయి అభివృద్ధి వుంటేనే మరొక జాతిమీద ఆధిపత్యం సంపాదించగలదు, అదిగనక..."

"కాని అసలు సమస్య అదే" అని పెస్త్సోవ్, యెప్పుడూ తనే మాట్లాడాలన్న ఆతృత వుండేవాడిలాగా, ఖంగుమనే స్వరంతో తను చెప్పే దానిమీద మనసంతా లగ్నం చేసి చెప్పే టట్టు అడ్డం వచ్చేడు. "హెచ్చు స్థాయి అభివృద్ధి అనే దాన్ని అర్థం చేసుకోవడం యెలాగ? ఇంగ్లీషు వాళ్ళా, ఫ్రెంచి వాళ్ళా, జర్మన్ వాళ్ళా — యెవరు హెచ్చు స్థాయి అభివృద్ధి సాధించేరు? వీళ్ళల్లో యెవళ్ళు యితరుల్ని తమ ప్రభావం కిందకి తెచ్చుకుంటారు? రైన్ ప్రాంతంమీద ఫ్రెంచి వాళ్ళకి పలుకుబడి బాగా వుందని మనకి కనిపిస్తోంది. కాని జర్మన్లు అభివృద్ధి స్థాయిలో తక్కువలో యేం లేరే!" అని అతను అరిచేడు. "యిక్కడ వేరే నియమాలు వర్తిస్తాయి" అన్నాడు.

"నిజంగా సుశిక్షితమైన జాతికి యెప్పుడూ ప్రభావం కలిగించే యిది వుంటుందని నాకనిపిస్తుంది" అన్నాడు కరేనిన్.

"నిజమైన సుశిక్షణని యే లక్షణాలని బట్టి గుర్తించడం?" అని పెస్త్సోవ్ అడిగాడు.

"ఆ లక్షణాలు మామూలుగా సర్వవిదితమే అంటా" అన్నాడు కరేనిన్.

"ఆఁ, సర్వవిదితమే!" అని కోజ్నిషెవ్ కొంటెగా చిరునవ్వు నవ్వుతూ మాట కలిపేడు. "యివాళ ఒక్క భాషాసాహిత్యాల విద్యనే నిజమైన విద్యగా చూస్తున్నారు. కాని ఉభయ పక్షాల వాళ్ళూ హోరాహోరీ కుమ్ములాడుకుంటున్నారు. భాషాసాహిత్యాల విద్యని వ్యతిరేకించే వాళ్ళ వాదనలని పసలేనివని కొట్టెయ్యడం అసాధ్యం" అన్నాడు.

"మీరే అలాంటి విద్యల్లో పండితులు, కోజ్నిషెవ్. కొంచెం రెడ్ వైన్ కావాలా?" అని అర్నోవ్స్కీ అడిగాడు.

"నేను యీ విద్య గురించి గాని ఆ విద్య గురించి గాని నా అభిప్రాయాన్ని చెప్పను" అని కోజ్నిషెవ్ పిల్లవాడికి చెప్తున్నట్టు అనుగ్రహించే చిరునవ్వు నవ్వుతూ రెడ్ వైన్ కోసం గ్లాసు చాచి అన్నాడు. "ఉభయ పక్షాల వాదనలూ గట్టివే అని మాత్రం చెప్పగలను" అని కరేనిన్ కేసి తిరిగి అన్నాడు. "నామట్టుకు నాకు ఆ భాషాసాహిత్యాల విద్య వచ్చింది. అయినా గానీ యీ వాగ్వివాదంలో నేను యెవరి పక్కన చేరాలీ అన్న దాన్ని నిర్ధారించుకోలేకపోతున్నాను. ఆ విద్యని శాస్త్ర విద్యకంటే పై మెట్టులో పెట్టడాన్ని అర్థం చేసుకోవడానికి అసమర్థుణ్ణి" అన్నాడు.

"ప్రకృతి శాస్త్రాలకీ అంతే బోధనాత్మక ప్రభావం వుంది, దాని వల్లా మానసిక వికాసం వుంటుంది" అని పెస్త్సోవ్ గబగబా అన్నాడు. "ఖగోళశాస్త్రాన్ని గాని, వృక్ష శాస్త్రాన్ని గాని తీసుకోండి. లేకపోతే సార్వజనీన నియమాలు వున్న జంతుశాస్త్రం తీసుకోండి" అన్నాడు.

"దీంతో పూర్తిగా యేకీభవించలేకుండా వున్నాను" అన్నాడు కరేనిన్. "భాషాశాస్త్ర రూపాలని అధ్యయనం చేసే క్రమమే మానసిక వికాసానికి విశేషంగా ప్రభావం కలిగిస్తుంది. పైగా సంప్రదాయిక రచయితల ప్రభావం అత్యున్నత నైతిక స్థాయిలో వుంటుందన్న విషయాన్ని కాదన కూడదు. దురదృష్టవశాత్తూ ప్రకృతి శాస్త్ర బోధనతో యివాళ పీడగా తయారైన హానికర, అసత్యపూరిత సిద్ధాంతాలు కలిసి వున్నాయి" అన్నాడు.

కోజ్నిషెవ్ జవాబు చెప్పబోయాడు. కాని పెస్త్సోవ్ ఖంగుమనే స్వరం అడ్డు వచ్చింది. అలాంటి అభిప్రాయం ధర్మం అయింది కాదని పెస్త్సోవ్ ఉగ్రంగా విరుచుకు పడిపోయాడు. కోజ్నిషెవ్ తన ఆశ్చర్యమైన వాదనని ముందు పెట్టడానికి తన వంతు వచ్చేదాకా నోపిగ్గా ఆగేడు.

"వూఁ, అయితే" అని కనిపించీ కనిపించని చిరునవ్వు నవ్వుతూ కరేనిన్ కేసి తిరిగి అన్నాడు. "యిటు పక్షంవి గాని, అటు పక్షంవి గాని లాభ నష్టాలని సరిగా తూకం వెయ్యడం కష్టం అని మీరు ఒప్పుకోవాలి. యే పక్షాన్ని బలపరచాలీ అనే సమస్యని, యిప్పుడు మీరు చెప్పిన లాభాలు భాషాసాహిత్యాల విద్య యివ్వక పోయినట్లయితే, అంటే దాని నైతిక ప్రభావం – disons le mot[1] – సర్వఖండనవాద విరోధ ప్రభావం, లేనట్లయితే సులభంగా తిరుగు లేనిదిగా నిర్ణయించి వుండలేం" అన్నాడు.

"నిస్సందేహంగా."

"యీ లాభం, సర్వఖండనవాద విరోధ ప్రభావం భాషా సాహిత్యాల విద్య పక్షాన లేన

---

[1] సాఫీ మాటలో (ఫ్రెంచి).

ట్లయితే, మనం ఉభయ పక్షాల తర్కం పట్ల యెక్కువ ఆలోచన చేసి, వాటిని యెక్కువ లాగి పీకి చూసే వాళ్లం" అని కోజ్నిషెవ్ అదే చిరునవ్వు నవ్వుతూ అన్నాడు. "మనం రెండు ధోరణులకీ సమాన విస్తార అవకాశాలు యిచ్చేవాళ్లం. కాని యీ భాషాసాహిత్యాల విద్యా వ్యాప్తిల్లో సర్వఖండన మోతాదులు బలంగా వున్నాయని స్పష్టమైంది, అంచేత ధైర్యంగా వాటిని రోగులకి యిస్తున్నాం... వాటిల్లో ఆ బలమైన మోతాదులు లేకపోతేనో?" అని అతను ఆనుకోకుండా పరిహాసపూర్వక చమత్కారంతో అన్నాడు.

కోజ్నిషెవ్ మాత్రలు, మోతాదులు అందరికీ నవ్వు తెప్పించాయి. యీ వీరన సంభాషణలో యేదన్నా సరదాగా వుండేది తల యెత్తుతుందా అని పొంచి కూర్చున్న తూరోవ్త్సిన్ యెవర్నా నవ్వనంత గట్టిగా, ఖంగు ఖంగుమని నవ్వేడు.

పెస్త్సోవ్‌ని పిలవడంలో అబ్లాన్‌స్కీ తప్పు చెయ్యలేదు. పెస్త్సోవ్ వుంటే బౌద్ధిక సంభాషణ ఆవగారదు. కోజ్నిషెవ్ యీ చర్చకి స్వస్తి చెప్పెయ్యగానే పెస్త్సోవ్ మరోటి మొదలుపెట్టాడు

"ప్రభుత్వానికి యీ లక్ష్యం దృష్టిలో వుందని అనలేం. ప్రభుత్వం సాధారణంగా వుండే వాటిని బట్టి నడవాలి మరి. ఆచరణలో వున్న చర్యలు కలిగించే ప్రభావాన్ని పట్టించుకోదు. ఉదాహరణకి మహిళల విద్య విషయం తీసుకోండి. యిది హానికరం అని పరిగణించాలి. అయినా ప్రభుత్వం మహిళల కోసం విద్యాలయాల్ని, విశ్వవిద్యాలయాల్ని కూడా తెరుస్తోంది" అన్నాడు.

సంభాషణ వెంటనే మహిళా విద్య విషయంలోకి పడింది.

మహిళా విద్య అనేదాన్ని మహిళా విమోచన అనేదాంతో మామూలుగా కలగావులగం చేస్తున్నారనీ అందుకనే దాన్ని హానికరం అనవచ్చని కరేనిన్ తన అభిప్రాయం చెప్పాడు.

"కాని యీ రెండు సమస్యలూ పరస్పరం కలిసే వుంటాయని నా భావన" అని పెస్త్సోవ్ ప్రకటించేడు. "యిదో విషవలయం. విద్యలేకపోవడంవల్ల ఆడవాళ్లకి హక్కులు లేవు, మరి వాళ్లకి హక్కులు లేకపోవడం అనే దాని ఫలితమే వాళ్లకి విద్య లేకపోవడం. మహిళల్ని దాసత్వంలో బంధించడం యెంత గాఢమైందంటే, యెంత పాతదంటే మనల్నీ వాళ్లనీ పెద్ద అగాధం వేరు చేస్తోందన్న విషయాన్ని గమనించడం మనకిష్టం లేదు" అన్నాడతను.

"మీరు హక్కుల గురించి మాట్లాడేరు" అని పెస్త్సోవ్ ముగించడం కోసం చూస్తూ వున్న కోజ్నిషెవ్ అన్నాడు. "జూరి సభ్యులుగా, జేమ్‌స్త్వో మండలి సభ్యులుగా కమిటీ అధ్యక్షులుగా, గుమాస్తాలుగా, పార్లమెంట్ సభ్యులుగా వుండే హక్కు..."

"కచ్చితంగా."

"కాని, దారి తప్పి యెక్కడన్నా చెదురుమదురుగా, ఆడవాళ్ళు యీ స్థానాలకి వచ్చినా మీరు 'హక్కులు' అనే పదాన్ని సరిగా వాడలేదని నాకనిపిస్తుంది. వాటిని 'విధులు' అనడం మరింత బాగుంటుంది. మనం జూరి సభ్యులుగా, జేమ్‌స్త్వో మండలి సభ్యులుగా టెలిగ్రాఫ్

ఆపరేటర్లుగా వుంటున్నప్పుడు మనం వొక విధిని నిర్వహిస్తున్నామనే యెవళ్లేనా అనుకుంటారు. అంచేత ఆడవాళ్లు తమ విధుల పరిపూర్తి కోసం చూస్తున్నారని అనడం మరింత సబబు, సమంజసం. సామాన్యంగా మగవాళ్లు చేసే ప్రయత్నానికి దోహద పడాలన్న వాళ్ల కోరికకి సానుభూతి చూపించకుండా వుండలేం."

"మాటకి నూరు పాళ్లూ నిజం" అని కరేనిన్ తల వూపేడు. "నా దృష్టిలో యిక మిగిలిన సమస్య అల్లా వాళ్లు ఆ విధుల్ని అందుకోవడానికి సమర్థులేనా అని" అన్నాడు.

"విద్య అంటూ వొకసారి వాళ్లకి అందుబాటులోకి వస్తే వాళ్లు చాలా సమర్థులని తప్పకుండా రుజావు చేసుకుంటారు" అన్నాడు అబ్లాన్‌స్కీ. "మనం చూశాం..." అని చెప్పబోయాడు.

"యిదో, ఆ సామెత యేమిటీ అది?" అని కళ్లల్లో కొంటెతనం తొణికిసలాడుతూ యీ సంభాషణ వింటూ వున్న పెద్ద ప్రిన్స్ అన్నాడు. "మా అమ్మాయిల ముందర దాన్ని చెప్పడానికి నాకు జంకులేదనుకోండి: జుట్టు బారెడు తెలివి చిటికెడు..."

"నీగ్రో వాళ్లు విముక్తం అయే దాకా వాళ్ల గురించి సరిగ్గా అలాగే అనుకునేవాళ్లు" అని పెస్త్సోవ్ కోపంగా అన్నాడు.

"ఆడవాళ్లు యీ కొత్త విధుల్ని అంది పుచ్చుకోవడానికి ఆతృతగా వున్నారనుకోవడం చిత్రం, మగాళ్లు దురదృష్టవశాత్తూ వాటిని వదిలించుకోవడానికి ఆతృతగా వున్నప్పుడు" అన్నాడు కోజ్నిషెవ్.

"విధులు హక్కులతో కలిసి వుంటాయి: అధికారం, డబ్బు, గౌరవం. ఆడవాళ్లు వెంటబడేది అలాంటివే" అన్నాడు పెస్త్సోవ్.

"యిది యెలాంటిదంటే నేను దాయి హక్కు కావాలనుకుంటూ, ఆడవాళ్లకి అందుగాను డబ్బు యిచ్చి నాకు యివ్వనందుకు కష్టపెట్టుకోవడం లాగా" అన్నాడు పెద్ద ప్రిన్స్.

తూరోవ్‌త్సిన్ ఫెళ్లున విరగబడి నవ్వేడు. కోజ్నిషెవ్ తను ఆ పరిహాసం ముక్క అనలేకపోయానే అని నాలిక కరుచుకున్నాడు. కరేనిన్ కూడా చిరునవ్వు నవ్వేడు.

"కాని మగవాడు దాయి కాలేడు, ఆడదైతే..." అని చెప్పబోయాడు పెస్త్సోవ్.

"యెందుకు కాలేడు? యెవడో ఇంగ్లీషు వాడు యేదో ఓడమీద తన బిడ్డకి పాలు యిచ్చేడు" అని పెద్ద ప్రిన్స్ తన కూతుళ్ల ముందు ఆ మాత్రం స్వేచ్ఛ తీసుకుంటూ అన్నాడు.

"అలాంటి ఇంగ్లీషు వాళ్లు యెంతమంది వున్నారో అంతమంది ఆడగుమాస్తాలూ వుంటారు" అన్నాడు కోజ్నిషెవ్.

"కాని కుటుంబంలేని ఆడమనిషి యేం చెయ్యాలంటారు?" అని అబ్లాన్‌స్కీ అడిగేడు. అతను అంతసేపూ చిబిసోవా గురించే ఆలోచిస్తున్నాడు. ఆ కారణంగా పెస్త్సోవ్ పట్ల సానుభూతి కనబరుస్తూ అతన్ని సమర్థించేడు.

"అలాంటి ఆడమనిషి సంగతి గనక చూస్తే, ఆమె తన కుటుంబాన్ని కోపోతే తన తోబుట్టువుల కుటుంబాన్ని వదిలేసి వుంటుంది. అక్కడ ఆవిడకి ఆడవాళ్ళు చేసే పని బోలెడు వుంటుంది" అని దాలీ వున్నట్టుండి, కసిగా అంది. భర్త మనసులో వున్నది యేమిటో ఆమె కచ్చితంగానే పసికట్టినట్టు వుంది.

"కాని మనం స్వాతంత్ర్యపరంగా, సిద్ధాంతరీత్యా మాట్లాడుతున్నాం" అని పెస్త్సోవ్ ఖంగుమన్నాడు. "ఆడమనిషి స్వతంత్రంగా వుండాలనీ, విద్య కావాలనీ కోరుతోంది. యివి తనకి సంబంధించిన విషయాలు కావు అనేదాంతో నలిగిపోతోంది, బాధపడుతోంది" అన్నాడు.

"నన్ను అనాథాశ్రమంలో దాయిగా నియమించుకోరే అనే బాధతో నేను నలిగిపోతున్నాను, బాధ పడిపోతున్నాను" అని పెద్ద ప్రిన్స్ తూరోవ్‌త్సిన్‌కి అపార ఆనందం కలిగిస్తూ అన్నాడు. తూరోవ్‌త్సిన్ యెంత పగలబడి నవ్వేడంటే తింటూ తింటూ వున్న ఆకుకూర లాంటి కాండం చెయ్యి జారి చట్నీలో పడిపోయింది.

11

లేవిన్, కిట్టీలు తప్ప మిగిలిన వాళ్ళందరూ చర్చలో మాట కలుపుతూనే వున్నారు. ఒక జాతి మరో జాతిమీద కలిగించవలసిన ప్రభావం గురించి వాళ్ళు మొదట్లో మాట్లాడే సమయంలో తనూ యేదో చెప్పాలని లేవిన్‌కి అనిపించింది. కాని పాకప్పుడు యెంతో ప్రముఖంగా తనకి కనిపించిన తన అభిప్రాయాలు అతని మనసులో కలలాగా కరిగిపోయేయి, అతనికి యే మాత్రం ఆసక్తికరంగా లేవు. యెవరూ చిటికిన వేలు కూడా కదపని విషయాల పట్ల తమ అభిప్రాయాలు చెప్పెయ్యాలనే దురద వీళ్ళకి యెందుకోనని లేవిన్ ఆశ్చర్యపోయేడు కూడా. మహిళ హక్కులకీ, విద్యకీ సంబంధించి చెప్పిన విషయం పట్ల కిట్టీకి ఆసక్తి వుండే మోనని యెవళ్ళకేనా అనిపించవచ్చు. తన నేస్తం వారెంకా గురించి, ఆమె అనవ్యాకరమైన పరాధీనతని గురించి అనుకున్నప్పుడు ఆమె యీ విషయం గురించి యెంత పట్టించుకుంది! తనకి గనక పెళ్ళి కాకపోతే తన పరిస్థితి తత్తుల్యంగానే వుంటుందని యెన్ని సార్లు అనుకుంది గాదు! తన అక్కతో సరిగ్గా దీన్ని గురించే యెన్ని సార్లు వాదించింది కాదు! కాని యిప్పుడు దీనికి సంబంధించి పిసరు కూడా ఆమె అభిరుచి కనపర్చలేదు. లేవిన్‌కీ ఆమెకీ తమ సొంత సంభాషణ సాగుతోంది. మాటల సంభాషణ కాదు, రహస్య భాషణ సాగుతోంది. క్షణ క్షణానికీ అది వాళ్ళని సన్నిహితం చేస్తోంది, వాళ్ళు ప్రయాణం అయి సాగబోయే ఆ అజ్ఞాత పథపు సంతోషభరిత భీతిని వాళ్ళల్లో కుదిలిస్తోంది.

మొదటగా లేవిన్ అంతకు ముందుటేడు కిట్టీని యెలా బగ్గీలో చూసిందీ, తనకి

ఆమె కనిపించేముందు తను యెలా గడ్డి కోతకోసి తిరిగి వస్తూ వున్నదీ ఆమె అడిగిన ప్రశ్నకి జవాబుగా చెప్పేడు.

"అప్పుడే తెల్లవారింది, మీరు అప్పుడే లేచి వుంటారు. మీ maman యింకా హో మూం నిద్రపోతూనే వున్నారు. చక్కని ఉదయం. నేను నడిచి వస్తూ బగ్గీ యెవళ్లదై వుంటుంది చెప్మా అనుకున్నాను. మువ్వలు కట్టిన ఫేష్టైన గుర్రాలవి. అవి పక్కనుంచి పరిగెత్తి వెళ్లాయి. కిటికీలో నాకు కనిపించిం దెవరనుకున్నారు? మీరు! రెండు చేతులతోనూ టోపీ రిబ్బన్లు పట్టుకున్నారు. యేదో గాఢాలోచనలో మునిగిపోయి వున్నారు" అన్నాడతను చిరునవ్వు నవ్వుతూ. "అప్పుడు మీరేం ఆలోచిస్తూ వున్నారో తెలుసుకోవచ్చా? యేదేనా ముఖ్య విషయం గురించా?" అని అడిగేడు.

'నా జుట్టు రేగిపోయి వుందో యేమిటో' అనుకొంది ఆమె. అయినా ఆ సంఘటన జ్ఞప్తికి వచ్చినప్పుడు లేవిన్ ముఖంమీద తటిల్లతలా మెరిసిన మందహాసం చూసి అప్పుడు తను అతనికి చెడ్డ అభిప్రాయం కాక సదభిప్రాయమే కలిగించినట్టు ఆమె గ్రహించింది. ఆమె సిగ్గుపడిపోయి సంతోషంగా మందహాసం చేసింది.

"యేమో నిజంగా నాకు గుర్తులేదు."

"తూరొవ్‌త్సిన్ యెంత విస్పష్టంగా నవ్వుతాడు" అని అతని చెమ్మగిల్లిన కళ్లనీ, యెగిసిపడే భుజాల్నీ చూసి అన్నాడు లేవిన్.

"మీరాయన్ని చాలా కాలంగా యెరుగుదురా?"

"ఆయన్ని యెరగని వాళ్లెవరు?"

"మీరాయన చెడ్డ వారను కుంటున్నారని నా కనిపిస్తోంది."

"చెడ్డ కాదు, కొరగాని వాడని."

"అయ్యో కాని మీరు పొరబడ్డారు. వెంటనే ఆ అభిప్రాయం మార్చుకోండి. నాక్కూడా ఆయన్ని గురించి చెడ్డ అభిప్రాయమే వుండేది. కాని నిజానికి ఆయన ప్రేమాస్పదుడు, జాలి మనిషి. ఆయన మనసు బంగారం" అంది కిట్టీ.

"ఆయన మనసు గురించి మీకెలా తెలియ వచ్చింది?"

"ఓ, ఆయనా నేను మంచి నేస్తులం. నాకాయన బాగా తెలుసు. కిందటేడాది శీత కట్టులో, మీరు మా యింటికి వచ్చివెళ్లాక" అని తప్పు చేసినట్టు కాని ఒప్పుకుంటున్నట్టు చిరునవ్వు నవ్వుతూ అంది. "దాలీ పిల్లలందరూ స్కార్‌లెట్ జ్వరంతో మంచా లెక్కారు. ఆయన మమ్మల్ని చూద్దామని వో రోజున వచ్చేడు. యేం జరిగిందో చెప్తే నమ్ముతారా?" అని గొంతు తగ్గించి అంది. "ఆయన యెంతో జాలిపడి అక్కడే వుండి పిల్లల సంరక్షణ చూడ్డంలో ఆమెకి సాయం చేశాడు. వరసగా మూడు వారాలు అక్కడ్నే వుండిపోయి దాది లాగా పిల్లల్ని సాకేడు... నేను స్కార్‌లెట్ ఫీవర్ అప్పుడు తూరొవ్‌త్సిన్ గురించి లేవిన్‌కి చెప్తున్నా" అని అక్క వేపు వొరిగి చెప్పింది.

"ఆఁ, అద్భుతమైన మనిషి, దొడ్డ మనిషి" అని దాలీ తూరొవ్‌త్సిన్ కేసి చూసి బెరుగ్గా చిరునవ్వు నవ్వుతూ అంది. తన గురించే వాళ్ళు మాట్లాడుకుంటున్నారని ఆతను గ్రహించేడు. లేవిన్ మళ్ళీ అతని కేసి చూసి తను అతని సుగుణాల్ని యింతకు ముందు గ్రహించ లేకపోయానేమో అని ఆశ్చర్యపడ్డాడు.

"పొరపాటు అయిపోయింది, ఘోరమైన పొరపాటు. యిక యెప్పుడు యెవళ్ళ గురించీ చెడ్డగా అనుకోను" అని ఆ క్షణంలో తనకి తోచిందాన్ని ఉత్సాహంగా, మనస్ఫూర్తిగా చెప్పాడు.

12

ఆడవాళ్ళ హక్కుల గురించిన చర్చ దాంపత్య హక్కుల అసమానత్వం అన్న సున్నితమైన విషయానికి దారి తీసింది. దాన్ని ఆడవాళ్ళ ముందు చర్చించడం కుదరదు. భోజనాలు చేసేటప్పుడు పెస్త్‌సోవ్ మళ్ళీ మళ్ళీ ఆ విషయానికే మళ్ళబోయాడు కాని కోజ్నిషెవ్, అబ్లాన్‌స్కీ నేర్పుగా అతన్ని ఆ విషయంనుంచి తప్పించేసారు.

భోజనాలయి అందరూ లేచాక ఆడవాళ్ళు వెళ్ళిపోయాక పెస్త్‌సోవ్ అందరితోబాటూ నడవక కరేనిన్ కేసి తిరిగి యీ అసమానత్వానికి గల ముఖ్య కారణాన్ని వివరించడం మొదలు పెట్టాడు. చట్టం కాని, సమాజం గాని వివాహబంధాన్ని అతిక్రమించిన భర్తనీ, భార్యనీ అవమానంగా దండించడమే తన అభిప్రాయం ప్రకారం భార్య భర్తల అసమానత్వానికి కారణం అన్నాడు.

అబ్లాన్‌స్కీ హడావుడిగా కరేనిన్ దగ్గరికి వచ్చి సిగరెట్ కాలుద్దామని పిలిచేడు.

"నేను సిగరెట్ కాల్చను" అని కరేనిన్ నిదానంగా అన్నాడు. తనకి ఆ విషయం గురించిన చర్చ అంటే భయం లేదని ఉద్దేశపూర్వకంగా చూపించ దలుచుకున్నట్టు అతను పెస్త్‌సోవ్ కేసి పొడిగా మందహాసం చేస్తూ చూశాడు.

"అలాంటి దానికి తగ్గ గట్టి ఆధారం వుందని నా కనిపిస్తోంది" అని డ్రాయింగ్ రూమ్ కేసి నడుస్తూ అన్నాడు. కాని హఠాత్తుగా తూరొవ్‌త్సిన్ అడ్డం వచ్చేడు.

"మీరు ప్ర్యాచ్నికొవ్ సంగతి విన్నారా?" అని తూరొవ్‌త్సిన్ అడిగేడు. అతను షాంపేన్ తాగిన ప్రభావం కనిపిస్తోంది. మాట్లాడే అవకాశం కోసం చాలా సేపు చూస్తూ వున్నాడు. "నాకివాళే తెలిసింది" అని కరేనిన్‌ని ఉద్దేశించి ముఖ్యంగా మాట్లాడుతూ తడిగా వున్న యెర్రటి పెదాలమీద మధురమైన మందహాసం లాస్యం చేస్తూ వుండగా మొదలు పెట్టాడు. "వాస్య ప్ర్యాచ్నికొవ్ త్వేర్ పట్నంలో క్వీత్‌స్కీతో ద్వంద్వయుద్ధం చేసి అతన్ని చంపేశాడు."

తగిలిన వేలికే తగులుతూ వుంటుందన్న సామెతలాగా ఆపూట సంభాషణ పదేపదే

కరేనిన్ వుండుమీదకే మళ్ళుతోందని అబ్లాన్‌స్కీకి అనిపించింది. యీ సారి కూడా అతను కరేనిన్‌ని తీసుకుపోదామని ప్రయత్నం చేశాడు. కాని కుతూహలం పట్టలేక కరేనిన్

"ఆఁ, ఆఁ, చెప్పండి, ప్ర్యాచ్నికొవ్ యెందుకు ద్వంద్వయుద్ధం చేశాడు?" అని అడిగేడు.

"యెందుకంటే పెళ్లాంవల్ల. పౌరుషం చూపించేడు. ఆ మనిషిని సవాల్ చేసి కాల్చి పారేశాడు."

"హుమ్!" అని కరేనిన్ యధాలాపంగా అని, కనుబొమలు పైకి యెత్తి డ్రాయింగ్ రూమ్ వేపు వెళ్లాడు.

"మీరు వచ్చేరు నాకెంతో సంతోషంగా వుంది" అని దాలీ డ్రాయింగ్ రూమ్ ముందు వున్న గదిలో అతన్ని చూసి బెదురుగా చిరునవ్వు నవ్వుతూ అంది. "మీతో మాట్లాడాలి, యిక్కడ కూర్చుందాం" అంది.

అతను ఆమె పక్కన కూర్చున్నాడు. కనుబొమలు యెత్తేడు, దాంతో వొక ఉదాసీనత అతని ముఖంమీద కనిపించింది. అతను కుటిలంగా చిరునవ్వు నవ్వుతూ కూర్చున్నాడు.

"బాగుంది, నేను కూడా మీతో మాట్లాడి యిక వెళ్లొస్తానని చెప్పాలనుకున్నాను. నేను రేపు వెళ్లిపోతున్నాను" అన్నాడు.

అన్నా నిర్దోషి అని దాలీకి పూర్తి నమ్మకం వుంది. నిర్దయుడైన యీ జడ మానవుడు నిదానంగా తన నిర్దోషి నేస్తాన్ని నాశనం చెయ్యడానికి కుట్ర పన్నుతున్నందుకు అతనిమీద కోపంతో ఆమె ముఖం పాలిపోతున్నట్టూ, పెదాలు వొణుకుతున్నట్టూ అనిపించింది.

"అన్నయ్యగారూ" అని ఆమె అతని ముఖంలోకి యేమైతే కానీలే అని తెగింపుగా చూస్తున్నట్టు అంది. "అన్నా యెలా వుందని మిమ్మల్ని అడిగేను. మీరు జవాబు చెప్పలేదు. ఆమె యెలా వుంది?" అని అడిగింది.

"నేననుకోవడం ఆమె క్షేమంగ్గా వుందని, దాలీగారూ" అని అతను ఆమె కేసి చూడ కుండా జవాబు చెప్పేడు.

"అన్నయ్యగారూ, మరేం అనుకోకండి, నాకు ఆ హక్కు లేదనుకోండి... కాని అన్నా అంటే నాకు సోదరి ప్రేమ, గౌరవం. మీ మధ్య యేం జరిగిందో చెప్పమని వేడు కుంటున్నాను. ఆమెలో మీకు యేం దోషం కనిపించింది?"

కరేనిన్ నుదురు ముడతలు పడింది. దాదాపు కళ్ళు మూసుకుంటూ, తల వాలేసుకున్నాడు.

"అన్నాతో నా పూర్వ సంబంధాల్ని మార్చుకునే అవసరం కనిపించిన దానికి కార ణాల్ని మీ ఆయన మీకు చెప్పే వుంటారు" అని అతను ఆమె కళ్లల్లోకి చూడకుండా, ఆ క్షణంలో ఆ గదిలోనుంచి వెళ్లిన షేర్‌బాత్‌స్కీ కేసి చిరచిర చూస్తూ అన్నాడు.

"నేను నమ్మను, నమ్మను నేను, నమ్మలేను" అని దాలీ వొక్కసారి ఝటితంగా సన్నని వేళ్లని ముందు కట్టుకుని అంది. ఆమె గబగబా లేచి చేతిని కరేనిన్ చొక్కా చేతిమీద వేసింది. "యిక్కడ మాట్లాడుకోవడానికి అంతరాయంగా వుంటుంది. నాతో రండి" అంది.

డాలీ ఆందోళనకి కరేనిన్ చలించేడు. లేచి, మాటా పలుకూ అనకుండా పిల్లలు చదువుకునే గదిలోకి ఆమె వెనకే వెళ్ళాడు. వాళ్ళు చాకుతో అటూ యిటూ గీతలు పెట్టి వున్న మైనం గుడ్డ కప్పిన మేజా దగ్గర కూర్చున్నారు.

"నేను నమ్మను, నేను నమ్మను" అని డాలీ, తనకేసి చూడకుండా తప్పించుకుంటున్న అతని కళ్ళల్లోకి చూడ ప్రయత్నం చేస్తూ, రెట్టించింది.

"యదార్థాన్ని నమ్మక తప్పదు, డాలీగారూ" అన్నాడు, 'యదార్థం'మీద వొత్తి పలుకుతూ.

"కాని ఆమె యేం చేసింది? యిదిగో ఫలానా అనేది యేం చేసింది?" అని అడిగింది.

"ఆమె తన ధర్మాన్ని అతిక్రమించి భర్తకి అన్యాయం చేసింది. అదీ ఆమె చేసిన పని" అన్నాడు.

"లేదు, లేదు, అది అసంభవం! మీరు తప్పకుండా పొరపడ్డారు" అని డాలీ కళ్ళు మూసుకుని వేళ్ళు కణతలమీద నొక్కుకుని అంది.

కరేనిన్ తను అనుకున్న దానికి తిరుగులేదని ఆమెకీ, అలాగే తనకిగా తనకీ, చూపించ నాశిస్తున్నట్టు కేవలం పెదాలతో జడంగా చిరునవ్వు నవ్వేడు. కాని అతన్ని కుదపకపోయినా డాలీ అన్నాని గట్టిగా సమర్థించడం పుండుమీద కారం చల్లినట్టుగా వుంది అతనికి. అతను ఆవేశంతో మాట్లాడేడు.

"పెళ్ళామే కట్టుకున్న వాడితో స్వయానా అలాంటి ముక్క అంటూ వుంటే యింకా పొరపాటు పడ్డం యేమిటి ఖర్మ! తమతో కలిసి, తమ కొడుకుతో కలిసి గడిపిన ఎనిమిదేళ్ళ కాపరం పొరపాటైపోయిందని తెంపలు వాయించుకుంటూ, మళ్ళీ బతుకు ఓం ప్రథమం నుంచీ మొదలుపెట్టాలనుకుంటూ వుంటే" అని అతను కోపంగా బుసలు కొట్టేడు.

"అన్నా—దురాచారం! యీ రెండింటినీ పక్కపక్కన పెట్టి చూడలేను. నేను నమ్మలేను నామీద వొట్టు."

"డాలీగారూ!" అన్నాడతను. ఆమె ముఖం కేసి నేరుగా చూశేడు. దయగా, ఆందోళనగా వుందామె. తన వాలక స్వాధీనం తప్పుతోందని అతనికి తెలుస్తూనే వుంది. "యిది వొట్టిదే అని అనుమానంతో వుండిపోవడానికి నేను యేం మూల్యం యిచ్చి వుండను? అనుమానంతో వున్నప్పుడు నాకు కష్టంగా వుండేదే కాని యిప్పటికంటే బాగా వుండేది. అనుమానం వున్నంత కాలం ఆశ వుండేది. యిప్పుడు ఆ ఆశాలేశం కూడా లేకుండా పోయింది. అయినా అనుమానిస్తూనే వున్నాను. యిప్పుడు ప్రతిదాన్నీ యే మేరకి అనుమానిస్తున్నానంటే నా కొడుకు నా కొడుకేనా అనే శంక వస్తోంది. వాడంటే నాకు అసహ్యం పుడుతోంది. నేనెంత నిర్భాగ్యుణ్ణి!" అన్నాడు.

ఆ మాట అతను అనవలసిన అవసరం లేదు. అతని ముఖంలోకి చూసిన మరుక్షణమే

డాలీ ఆ విషయాన్ని గ్రహించింది. అతనిపట్ల ఆమెకి జాలి కలిగింది. తన అప్పగారి సచ్ఛీలత పట్ల ఆమె నమ్మకం చెదిరింది.

"అబ్బ, యెంత దారుణం! దారుణం! కాని మీరు ఆమెకి విడాకులు యివ్వాలని నిర్ణయించుకున్నారట, నిజమేనా?"

"యిక గత్యంతరంలేక చెయ్యాల్సిన పని అని నిర్ణయించుకున్నాను. యిక నాకు వేరే మార్గం యేముంది?"

"యేమీ లేదు, యేమీ లేదు!" అని ఆమె కళ్లలో నీళ్లు తిరుగుతూ వుంటే రెట్టించింది. "ఊహుఁ, వుండాలి!" అంది.

"యిలాంటి దురదృష్టకరమైన వాటికి సంబంధించి దారుణమైంది యిదే. యితర బాధలు ఓ చావో, కావాల్సిన వాళ్ల పోవడమో భరించినట్టుగా దీన్ని భరించలేం. యీ సందర్భంలో యేదో చేసి తీరాలి" అని ఆమె మనసు చదువుతున్నట్టు అన్నాడు. "యింతటి అవమానకరమైన స్థితినుంచి బయట పడే మార్గం చూడాలి. మేం ముగ్గురం కలిసి బతకలేం" అన్నాడు.

"నాకు అర్థం అవుతుంది, నాకు అర్థం అవుతుంది" అంది డాలీ, తల దించుకుంటూ. ఓ క్షణం సేపు ఆమె యేమీ అనలేదు. తన గురించి, తన కష్టం గురించి ఆలోచనల్లో వుండి పోయింది. హఠాత్తుగా తల పైకి యెత్తి బతిమాలుతున్నట్టుగా తన చేతుల్ని దిగించింది. "కాని చూడండి, మీరు క్రైస్తవులు, కదా? ఆమె గురించి ఆలోచించండి. ఆమెని వది లేస్తే ఆమెకి యేం కావాలి చెప్పండి?" అని అడిగింది.

"ఆ విషయమూ ఆలోచించేను, చాలా ఆలోచించేను" అన్నాడు కరేనిన్. అతని ముఖంమీద యెర్రటి మచ్చలు వచ్చాయి. అతని కాంతిలేని కళ్ళు ఆమె మీదకే లగ్నం అయేయి. అప్పటికి డాలీకి అతని పట్ల హృదయపూర్వకంగా జాలి కలిగింది. "నా తల కొట్టేసినట్టుండే యీ మాటలు ఆమె ముఖతః విన్న వెంటనే నాకు యీ ఆలోచన వచ్చింది. అంతకు ముందు వున్నట్టుగానే ప్రతీ దాన్నీ వుండనిచ్చాను. తన పద్ధతుల్ని మార్చుకుంటుందేమోనని అవకాశం యిచ్చి చూశాను. దాని ఫలితం యేమిటి? లోకుల దృష్టిలో చులకన కాకుండా వుండాలి అని నేను అడిగిన వొక్కగా నొక్క మామూలు అభ్యర్థననీ మన్నించలేకపోయింది" అన్నాడతను. అతని కోపం యెక్కువైపోతోంది. "చేసిన తప్పు తెలుసుకుని అయ్యో అని బాధపడే మనిషిని రక్షించగలం. పంకిలమై, పతనమై ఆ బురదే తన పాలిట మోక్షం అని భావించే వాళ్లని యేం చెయ్యగలం?" అన్నాడు.

"యేమైనా చెయ్యండి, విడాకులు తప్ప" అంది డాలీ.

"మీకు పుణ్యం వుంటుంది అదేమిటో చెప్పండి."

"అబ్బ, యెంత భయంకరమైంది. ఆమె యెవళ్ల భార్యగామా వుండలేదు. నాశనం అయిపోతుంది."

"నన్నేం చెయ్యమంటారు?" అని కరేనిన్ కనుబొమలు, భుజాలు కొంచెం యెత్తి అన్నాడు. తన భార్య కొత్తగా చేసిన తప్పు అతనికి గుర్తు వచ్చి గుండె రగిలిపోయింది. దాలీతో మాట్లాడ్డం మొదలుపెట్టినప్పుడు వున్న కటుత్వం అతనిలో మళ్లీ కనిపించింది. "మీరు ఆ మాత్రం ఆదరం చూపించారు, మరి వుంటాను" అని లేస్తూ అన్నాడు.

"వుహుఁ, వుండండి! మీరామెని నాశనం చెయ్యకూడదు. వొక్క మాట! నా విషయం చూడండి. నాకు పెళ్లయింది, మా ఆయన దారి తప్పి ప్రవర్తించేరు. కోపంతో, అసూయతో కుతకుత లాడిపోయి నేనూ అన్నిట్నీ కాల దన్నేద్దా మనుకున్నాను... నేనూ... కాని నా కళ్లు తెరిపించింది యెవరనుకున్నారు? అన్నా! ఆమె నన్ను కాపాడింది. నా బతుకు నేను బతుకుతున్నాను. పిల్లలా యెదుగుతున్నారు. మా ఆయన కాపరం ఆయనకి దక్కింది, తప్పయి పోయిందని నాలిక కరుచుకుంటారు, బాగుపడుతున్నారు, మెరుగవుతున్నారు. నేను... ఆయన్ని క్షమించాను, మీరూ క్షమించాలి" అంది.

కరేనిన్ వింటూనే వున్నాడు గాని ఆమె మాటలు యెటో పోతున్నాయి. విడాకులు యివ్వాలి అని తను నిర్ణయం చేసుకున్నప్పుడు కలిగిన కోపం మళ్లీ అతనిలో రేగింది. అతను భుజాలు విరుచుకుని కీచు గొంతుకతో గట్టిగా అన్నాడు.

"ఆమెని క్షమించలేను, క్షమించను. అలాంటిది అన్యాయం నా దృష్టిలో. ఆమె కోసం నేను చెయ్యంది లేదు, ఆమె తను పొర్లే బురదని అన్నిటమీదా చిందించి కంపు చేసింది. నేనేం దుర్మార్గుణ్ణి కాదు, నేనెప్పుడూ యెవళ్లనీ అసహ్యించుకోలేదు. కాని ఆమె అంటే నాకు నరనరానా అసహ్యం పుడుతోంది; ఆమెని క్షమించలేను, ఆమె చేసిన అన్యాయం అంత టిది!" అని కోపంతో కంఠం రుద్ధమైపోతూ వుండగా అన్నాడు.

"మిమ్మల్ని ద్వేషించేవాళ్లని ప్రేమించండి" అని దాలీ సిగ్గు పడుతూ గొణిగింది.

కరేనిన్ యేవగింపుగా బుసకొట్టేడు. ఆ సూక్తి అతనికి బాగా తెలుసు, కాని దాన్ని యీ సందర్భంలో అనువర్తింప చెయ్యలేం.

"మిమ్మల్ని ద్వేషించేవాళ్లని మీరు ప్రేమించవచ్చునేమో గాని తను ద్వేషించేవాళ్లని యే మనిషీ ప్రేమించలేడు. సరే, మిమ్మల్ని కలతపెట్టినందుకు యేమీ అనుకోకండి. యెవళ్ల బాధలు వాళ్లకి వున్నాయి" అని కరేనిన్ యిప్పటికి పూర్తి నిబ్బరం చిక్కించుకుని సెలవు తీసుకుని వెళ్లిపోయాడు.

13

భోజనాల బల్ల దగ్గర్నుంచి అందరూ లేచినప్పుడు లేవిన్ డ్రాయింగు రూమ్‌లోకి కిట్టీతో కలిసి వెళ్లి వుండేవాడు. కాని తను మరీ ఆమె పట్ల శ్రద్ధ వహిస్తున్నట్టు కనిపించడం ఆమెకి నచ్చదేమోనని అతనికి భయం కలిగింది. అతను మగాళ్లతో వుండిపోయి, వాళ్ల

వర్ణనీయాంశంలో మాట కలిపేదు. కాని అంత సేపూ ఆమె ఉనికీ, ఆమె కదలికలు, ఆమె చూపులు, అతని యెరుకలోనే వున్నాయి — తను ఆమె కేసి చూడకపోయినా.

యెవర్ని గురించీ చెడ్డగా అనుకోవద్దు, అన్నిట్నీ ప్రేమించు అని తను ఆమెకి యిచ్చిన వాగ్దానాన్ని అతను అతిసునాయాసంగా నెరవేరుస్తున్నాడు. సంభాషణ రష్యన్ రైతు కమ్యూన్‌ల కేసి మళ్లింది. పెస్త్సొవ్‌కి యీ కమ్యూన్‌లో నూతన సామాజిక రూపాల నాందీ కనిపించింది. దానికి సామూహిక ప్రారంభం అని పేరు పెట్టాడు. లేవిన్ పెస్త్సొవ్ చెప్పిందాంతో గాని తన అన్నగారు చెప్పిన దాంతో గాని, యేకీభవించలేదు. లేవిన్ అన్నగారు రష్యన్ రైతు కమ్యూన్‌ల ప్రాముఖ్యాన్ని గుర్తించనూ గుర్తించలేదు. వాళ్ల మధ్య వున్న అభిప్రాయ భేదాల్ని తగ్గించి, యిద్దర్నీ సర్దుబాటు చేసే మేరకి లేవిన్ సంభాషణలో జోక్యం చేసుకున్నాడు. తను యేం చెప్తున్నాడో అందులో తనకే ఆసక్తి లేదు, యిక వాళ్లు చెప్తూ వున్న దాని సంగతి సరేసరి. అతనికి కావాల్సిందల్లా వొక్కటే, తామిద్దరూ, మిగిలిన అందరూ సుఖ శాంతులతో వుండాలనే. యిప్పుడు ముఖ్యం అయిన విషయం వొక్కటే. ఆ వొక్క విషయపు సాకార రూపం డ్రాయింగు రూమ్‌లో వుంది. అప్పుడు గుమ్మం దాకా వచ్చి అక్కడ ఆగింది. అటు వేపు తిరగకుండానే అతనికి ఆ దృక్కు అనుభూతం అయింది, తన వేపే వో మందహాసం విరుస్తూ వున్నట్టు అనిపించింది. అతను అటు వేపు తిరిగాడు. ఆమె గుమ్మంలో తనకేసి చూస్తూ షేర్‌బాత్‌స్కీతో కలిసి నుంచుని వుంది.

"మీరు పియానో దగ్గరికి వెళ్తున్నారని అనుకున్నా" అని కిట్టీ దగ్గరికి వెడుతూ అన్నాడు. "పల్లెటూళ్లో మాకు లేనిది అదే — సంగీతం" అన్నాడు.

"వుహుఁ, మిమ్మల్ని పిలుద్దామని వచ్చేం. మీరే వచ్చారు బాగుంది" అని చిరునవ్వు కానుక యిస్తూ ఆమె అంది. "యెందు కొచ్చిన వాదనలివి? యెవర్నూ అవతలి వాళ్లని వొప్పించలేరు" అంది.

"కావచ్చు లెండి. మన ప్రత్యర్థి యేం చెప్తున్నాడో మనం అర్థం చేసుకోం కాబట్టే అంత వేడివేడిగా వాదిస్తాం" అన్నాడు లేవిన్.

అపారమైన తెలివితేటలున్న యిద్దరి మధ్య జరిగే వాదోపవాదాలు చూసి లేవిన్‌కి వొక విషయం యెన్నడనగానో తెలిసింది. ఆ వాదించుకునేవాళ్లు ఆయాసం వొచ్చేటట్టు అరిచి, వాళ్ల సున్నితమైన తర్కబద్ధమైన వాదనలు జోరుగా గుప్పించేసి తాము ఒకళ్ల కొకళ్లు చెప్పదలచుకున్న విషయాలు యే నాటినుంచో తమకి తెలుసనీ వాగ్వాదం మొదలైనప్పటినుంచి తెలుసనీ, కాని తమ అభిరుచులు వేరనీ, భిన్నభిన్నమైన వాటిని తాము అభిమానించేమనీ, కాని తమ యిష్టానిష్టాలు అవతలి వాళ్లు తప్పు పట్టుకుంటారో యేమోనని వాటిని చెప్పకుండా వుండిపోయామనీ ఆఖరికి తేల్తారు. అనే విషయాన్ని లేవిన్ అనేక సందర్భాల్లో గమనించేడు. వాదం జరిగే సమయంలో తన ప్రత్యర్థికి యిష్టం యేమిటో తను గ్రహించే వాడు, తనూ అదంటే యిష్టపడేవాడు. వెంటనే ఆ విషయంలో అవతలి వ్యక్తితో యేకీభవించేవాడు.

దాంతో వాదనకి యిక అవసరం తీరిపోయేది. మరో అప్పుడు అవతలి వ్యక్తి అలానే ప్రవర్తించడం వుండేది. అంటే తన అభిప్రాయంతో యేకీభవించడం, తను యిష్టపడి దేన్ని సమర్థించాలని వాదనా బలం పుంజుకోబోతున్నాడో దాంతో యేకీభవించడం, తను గనక స్పష్టంగా నిజాయితీగా తన మాటని సమర్థించుకుంటే తన ప్రత్యర్థి వున్నట్టుండి తను చెప్పిందాన్ని వొప్పేసుకుని వాదన ఆపెయ్యడం – యిలా చాలా సార్లు జరిగింది. కిట్టీతో అదే విషయం చెప్పేడు. అతను చెప్పిన దాన్ని అర్థం చేసుకో ప్రయత్నిస్తూ ఆమె నుదురు ముడిచింది. కాని అతను వివరించ బోగానే ఆమెకి అర్థం అయింది.

"అలాగా, అవతలి వ్యక్తి దేన్ని సమర్థిస్తున్నాడో, యేదంటే యిష్టపడుతున్నాడో మీరు గ్రహించాలంతే, అప్పుడు..."

ఆమె చక్కగా గ్రహించింది, అతను డొంక తిరుగుడుగా చెప్పిన దాన్ని సునాయాసంగా చెప్పింది. అతను సంతోషంగా చిరునవ్వు నవ్వేడు. పెన్త్సోవ్, కోజ్నిషెవ్‌లు బండరాళ్లల్లాంటి శబ్దాలు వాడి వాదించుకున్న దానికంటే క్లిష్టమైన ఆలోచనని అతి తక్కువ పదాలతో స్పష్టంగా తార్కికంగా చెప్పడం యెంత హాయిగావో వుంది.

ష్చేర్‌బాత్‌స్కీ వెళ్లిపోయాడు. కిట్టీ అప్పుడే పేకల కోసం పరిచిన బల్ల దగ్గరికి వెళ్లింది. ఆమె అక్కడ కూర్చుని వో సుద్ద ముక్క తీసుకుని ఆకుపచ్చ వులెన్ టేబిల్‌క్లాత్‌మీద వృత్తాలు గీయడం మొదలుపెట్టింది.

వాళ్లు భోజనాల బల్ల దగ్గర మొదలైన మహిళల హక్కులు అన్న చర్చని తిరిగి ఆరంభించేరు. పెళ్లికాని పిల్ల యేదో కుటుంబంలో ఆడపని చూసుకోవచ్చని దాలీ అన్న మాటని లేవిన్ వొప్పుకున్నాడు. సహాయం అవసరంలేని కుటుంబం వొక్కటి కూడా లేదనీ, వున్నదైనా లేనిదైనా ప్రతి కుటుంబానికీ కూలికి పెట్టుకున్నదో, సొంత యింటి మనిషో వొక దాది అవసరం వుందనీ లేవిన్ వాదించేడు.

"వుహుఁ" అంది కిట్టీ సిగ్గు పడుతూ. కాని ధైర్యంగా అతనిమీదే తన విశ్వాసమైన కళ్లు లగ్నం చేసింది. "ఆడపిల్ల తిరస్కారం లేకుండా కుటుంబంలోకి వెళ్లలేని స్థితిలో పడవచ్చు, కాని ఆమె..."

అతనికి వెంటనే అర్థం అయింది.

"ఓ, అవును. మీరన్న మాట నిజమే, నిజమే" అన్నాడు.

పెన్త్సోవ్ భోజనాల దగ్గర ఆడవాళ్ల హక్కుల గురించి రుజువు చెయ్యబోతున్నదంతా యిప్పుడతనికి అర్థమైంది. యేమంటే పెళ్లి కాని పడుచులాగా వుండిపోయి, అవమానం భరించడం అంటే కిట్టీ యెంత భయపడిందో అతను గ్రహించేడు. తను ఆమెని ప్రేమించడంవల్ల ఆమె భయమూ, అవమానమూ తనూ అనుభూతి చెందగలిగేడు. దాంతో వెంటనే తన వాదన వెనక్కి తీసేసుకున్నాడు.

తర్వాత కొంచెం సేపు యెవళ్లూ మాట్లాడలేదు. ఆమె సుద్ద ముక్కతో గీస్తూ

వుంది. ఆమె కళ్లల్లో కొంచెం కొంచెం మెరుపు మెరిసింది. ఆమె మానసిక స్థితికి పతు డౌతూ అతను తన ప్రతి అణువు ఆనంద పులకాంకిత భారంతో నిండిపోతున్నట్టు అనుభూతి చెందాడు.

"అయ్యో! మొత్తం బల్లంతా గీతలు గీసేశానే" అందామె. సుద్ద కింద పెట్టి లేవబోయింది.

'తను లేకుండా నేనొక్కణ్ణే యెలా వుండవిక్కడ?' అని భయపడిపోయి అతను అనుకున్నాడు. సుద్దని తీసుకున్నాడు. "కొంచెం ఆగండి" అని బల్ల దగ్గర కూర్చుంటూ అన్నాడతను. "చాలా కాలంగా మిమ్మల్ని నో విషయం అడగాలనుకుంటూ వున్నా" అన్నాడు.

ఆమె స్నేహపూర్వకమైన కళ్లల్లోకి, కాని భీతిగా వున్న కళ్లల్లోకి, కళ్లు పెట్టి చూశేడు.

"వూఁ, అడగండి."

"యిదిగో" అని అతను కొన్ని మాటల మొదటి అక్షరాల్ని క్రమంగా రాశేడు. 'అ.పా.కా.అ.మీ.అ.ఎ.సా.కా.లే.అ.సా.కా.' అని రాశేడు. 'అది సాధ్యం కాదు అని మీరు అన్నప్పుడు ఎప్పటికీ సాధ్యం కాదనా లేక అప్పటికి సాధ్యం కాదనా' అని ఆ అక్షరాల అర్థం. యింత నిగూఢంగా వుండే వాక్యాన్ని ఆమె వూహించగలగే అవకాశం తక్కువే అయినా అతని కళ్లు ఆమెలోకంటూ చొచ్చుకు చూశేయి. ఆమె ఆ అక్షరాల అర్థాన్ని వూహించడంమీద తన జీవితమే ఆధారపడి వున్నట్టు చూశేయి.

ఆమె అతని కేసి గంభీరంగా చూసింది. గడ్డం చేతిమీద ఆన్చుకుని, కనుబొమలు ముడిచింది. ఆ అక్షరాల అర్థం యేమిటైంది వూహించ మొదలుపెట్టింది. 'నా వూహ సరైందేనా?' అని అడుగుతున్నట్టు తడవ తడవకీ అతని కేసి చూసింది.

"నాకు అర్థమైంది" అంది సిగ్గు పడుతూ.

"యేమిటది?" అని అతను 'ఎ.సా.కా.' అనే అక్షరాలు చూపించి అడిగాడు.

"ఎప్పటికి సాధ్యం కాదని" అందామె. "కాని అది నిజం కాదు" అంది.

అతను గబగబా తను రాసింది చెరిపేసి ఆమెకి సుద్ద యిచ్చి తను నుంచున్నాడు. ఆమె 'అ.నే.చె.గ.వుం.కా.' అని రాసింది.

వీళ్లిద్దరూ పేక బల్ల దగ్గర వుండడం దాలీ చూసింది. కరేనిన్‌తో సంభాషణ జరి పేక భారమైన ఆమె హృదయం తేలిక పడింది. కిట్టీ బల్ల దగ్గర సుద్దతో కూర్చుంది. లజ్జాన్విత, సంతోష భరిత మందహాసంతో లేవిన్ కేసి చూస్తోంది. అందమైన లేవిన్ శరీరం బల్లమీదకి వాలి వుంది. కాంతిలో మెరిసే అతని కళ్లు కాసేపు ఆమె కేసి, కాసేపు అక్షరాల కేసి మళ్లేయి. అతను వున్నట్టుండి కాంతితో మెరిశేడు. అతను బల్లమీద కిట్టీ రాసింది యేమిటో గ్రహించేడు. 'అప్పట్లో వేరే చెప్పగలిగి వుండేదాన్ని కాదు.'

అతను ఆమె కేసి సిగ్గుపడుతూ అర్థిస్తున్నట్టు చూశేడు.

"అప్పట్లోనేనా?"

"ఫూఁ" అందామె చిరునవ్వు నవ్వుతూ.

"యిప్పుడు?"

"యిదిగో, చదవండి. నా మనస్ఫూర్తిగా యేది వేడుకున్నానో దాన్ని రాస్తాను. అమె 'మీ. మ. మ. పో.' అని రాసింది. 'మీరు మన్నించి మర్చిపోగలిగితే' అని వాటి అర్థం.

అతను ఉద్రేకంతో వొణికే వేళ్లతో సుద్ద ముక్క తీసుకుని తుంపి యీ మాటల మొదటి అక్షరాలు రాశాడు. 'నేను మన్నించాల్సింది మర్చిపోవాల్సింది లేదు. మిమ్మల్ని ప్రేమించడం యెన్నడూ మాన లేదు.'

ఆమె అతని కేసి చూసి కంపిస్తూ నవ్వింది.

"వాకర్థం అయింది" అని గొణిగింది.

అతను కూర్చుని దీర్ఘ వాక్యం రాశాడు. ఆమె దాన్ని అర్థం చేసుకుని, తను వూహించింది అవునా కాదా అని అడగకుండా దానికి జవాబు రాసింది.

ఆమె రాసింది యేమిటో అతను కొంచెం సేపు వూహించలేకపోయాడు. యేమిటున్నట్టు ఆమె కేసి చూస్తూ వుండిపోయాడు. ఆనంద పారవశ్యంతో అతని చేతన మొద్దుబారింది. యెంత బుర్ర బద్దలు గొట్టుకున్నా ఆ మాటల అర్థం బోధపడలేదు. కాని అతను తెలుసు కోవాల్సి వున్న దాన్నంతట్నీ ఆమె అందమైన కళ్లల్లోని కాంతి తెలియ చెప్పింది. అతను మూడు మాటలు రాశాడు. అతను యింకా పూర్తి చెయ్యక ముందే వెనక నుంచి చూసి ఆమె వాక్యం పూర్తి చేసి "ఫూఁ" అని జవాబు రాసింది.

"గళ్లనుడి కట్టు ఆడుకుంటున్నారేమిట్రా" అని అప్పుడే లోపలికి వచ్చిన పెద్ద ప్రిన్స్ అడిగేడు. "ఫూఁ, అమ్మా, కిట్టీ థియేటర్‌కి వెళ్లాలనుకుంటే బయల్దేరాలి" అన్నాడు.

లేవిన్ లేచి కిట్టీని గుమ్మం దాకా సాగనంపేడు.

ఆ యిద్దరి సంభాషణలోనూ మొత్తం చెప్పేసుకున్నారు. తను అతన్ని ప్రేమించి నట్టు ఆమె చెప్పింది, అతను ఆ మర్నాడు ఉదయం తమ యింటికి వస్తాడని తను తల్లికీ తండ్రికీ చెప్తుంది.

14

కిట్టీ వెళ్లిపోయింది. లేవిన్ వొక్కడూ వుండిపోయాడు. అతను ఆమె లేకుండా వొంటరితనంతో నలిగిపోయాడు. యెప్పుడు తెల్లవారి ఉదయం అవుతుందా అని ఆత్రపడ్డాడు. ఉదయం గబగబా, గబగబా రావాలి. తను ఆమెని మళ్లీ చూస్తాడు. శాశ్వతంగా తాము యేకమైపోతారు. ఆమె లేకుండా యిప్పుడు పధ్నాలుగు గంటలు వొక్కడూ గడపడం అంటే ప్రాణం పోతున్నట్టుగా వుంది. తను జనంతో కలిసి, కాలక్షేపం కోసం యేదో మాట్లాడ్డం

తప్పదు. ఆబ్లాన్‌స్కీ కంటే మంచి కాలక్షేపం అప్పుడు వుండదు కాని అతను వేరే యెక్కడికో వెడుతున్నాడు. అలా అని అతను అన్నాడు కాని నిజానికి బాలేకి వెడుతున్నాడు. యేమైనా తను పరమానందభరితుడై వున్నాడనీ, తను అతన్ని యెంతో అభిమానిస్తున్నాడనీ, యెన్నటికీ యెన్నటికీ అతని మేలు మరువలేననీ లేవిన్ అతనికి చెప్పగలిగేడు. ఆబ్లాన్‌స్కీ చూసిన చూపూ, నవ్విన చిరునవ్వూ తన అనుభూతుల్ని అతను సరిగ్గా గ్రహించినట్టు లేవిన్‌కి తెలియచేశాయి.

"అయితే చచిపోయే యిది లేదన్న మాట" అని ఆబ్లాన్‌స్కీ ఆదరపూర్వకంగా లేవిన్ చేతిని నొక్కుతూ అన్నాడు.

"అబ్బే... బ్బే... లే!") అన్నాడు లేవిన్.

అతను సెలవు తీసుకుని వెళ్లిపోయేటప్పుడు అభినందనలు తెలియజేస్తున్నట్టుగా దాలీ కూడా అంది:

"మీరు కిట్టీని మళ్లీ కలుసుకున్నారు, నాకు యెంత సంతోషంగా వుందో చెప్పలేను! పాత స్నేహాల్ని పదిలంగా చూసుకోవాలి!"

లేవిన్‌కి ఆమె మాటలు నచ్చలేదు. యిదంతా యెంత ఉన్నత స్థానంలో, ఆమె అవగాహనకి అందని స్థానంలో వుందంటే ఆమెకి వాటిని గురించి సూచించబోవడం సాహసంగా కనిపించింది.

లేవిన్ సెలవు తీసుకుని, ఒంటరిగా వుండకూడదని అన్నగారితో కలిశాడు.

"యెక్కడికి వెడుతున్నావ్?"

"యేదో సమావేశం వుంది."

"నేనూ వస్తాను, రానా?"

"దానిదేముంది! రా!" అన్నాడు కోజ్నిషెవ్ చిరునవ్వు నవ్వుతూ. "యివాళ నీకేమైంది?" అని అడిగాడు.

"నాకా? ఆనందం యివాళ నాకు దక్కింది!" అని బగ్గీ కిటికీ అద్దం దించేస్తూ అన్నాడు లేవిన్. "మరేం ఫరవా లేదుగా? ఉక్కగా వుంది! ఆనందం! అవును గాని నువ్వెందుకు పెళ్లి చేసుకున్నావ్ కాదు?" అని అడిగేడు.

కోజ్నిషెవ్ చిరునవ్వు నవ్వేడు.

"నాకు చాలా సంతోషంగా వుంది, ఆమె యెంతో ముచ్చటగా..." అని మొదలు పెట్టేడు.

"వద్దు, వద్దు ఒక్క మాట కూడా అనద్దు" అని లేవిన్ కోజ్నిషెవ్ ఫర్ కాలర్‌ని రెండు చేతులతోనూ పట్టుకుని, అతని మూతిమీద కాలర్‌ని పెట్టి అన్నాడు. 'ఆమె యెంతో ముచ్చటగా వుంది' అనే మాటలు చాలా సాదాగా, అరిగి పోయినట్టుగా, తన స్పందనా శిఖరాలతో తూగనట్టుగా వున్నాయి.

కోజ్నిషెవ్ హుషారుగా నవ్వేడు. మామూలుగా అలా నవ్వడు.

"కనీసం యీ సందర్భంగా నా సంతోషాన్ని అయినా తెలియచెయ్యనీ" అన్నాడు.

"ఆ పని రేపు చేద్దువుగాని, యిప్పుడే కాదు. ఒక్క మాట కూడా, ఒక్క మాట కూడా అనద్దు! గప్‌చుప్!" అని లేవిన్ మళ్లీ అన్నగారి మూతిమీద కాలర్ పెట్టి కప్పేస్తూ అన్నాడు. "నువ్వంటే నాకు చచ్చేటంత అభిమానం. మీ మీటింగ్‌కి రానా?" అన్నాడు.

"దానికేం, రా!"

"యివాళ అక్కడ యేం చర్చిస్తారు?" అని లేవిన్ చిరునవ్వు నవ్వుతూ అడిగేడు.

వాళ్లు మీటింగ్‌కి వెళ్లారు. కార్యదర్శి నత్తుతూ నత్తుతూ ముందటి సమావేశం గురించిన నివేదిక చదవడం లేవిన్ విన్నాడు. కార్యదర్శికే అదేమిటో అర్థం కాలేదన్నది తెలుస్తూనే వుంది. కాని అతని ముఖం చూస్తే అతను యెంతో మంచివాడనీ, దయగల మనిషనీ, సహృదయుడనీ లేవిన్‌కి తెలిసింది. నివేదిక చదివేటప్పుడు నత్తడం అతనికి గాభరా కలిగించింది, గడబిడపడ్డాడు. అతని మంచితనానికి అదే దాఖలా. తర్వాత ఉపన్యాసాలు మొదలయేయి. వాళ్లు యేదో నిధులు కేటాయించడం గురించీ, పైపుల్ని వెయ్యడం గురించీ వాదించారు. కోజ్నిషెవ్ యిద్దరు సభ్యులకి కష్టం కలిగించేడు. దేన్ని దేన్ని గురించో దీర్ఘంగా, గొప్పగా మాట్లాడేడు. అప్పుడు యేదో నోట్సు రాసుకుంటూ వున్న సభ్యుడొకరు బెరుకు బెరుగ్గా మాట్లాడ్డం మొదలుపెట్టి తర్వాత స్థిమితపడి కచ్చితంగా తెగేసినట్టు కోజ్నిషెవ్‌కి జవాబు చెప్పాడు. అప్పుడు స్వియాజ్‌స్కీ (అతనూ అక్కడ వున్నాడు) చక్కని, ఉదాత్త స్వరంతో యేదో చెప్పాడు. లేవిన్ అందరు మాట్లాడింది విన్నాడు. యీ నిధులు గాని, పైపులు గాని యేం కొంపలంటుకు పోతున్న విషయమో అతనికి అర్థం కాలేదు. ఆ మాట్లాడిన వాళ్లు నిజంగా కోపంగా లేరు, అంతా మంచి వాళ్లుగానే వున్నారు, తమ విధుల్ని చాలా చక్కగా, సరదాగా నిర్వహింసుకుపోతున్నారు అనే లేవిన్‌కి అనిపించింది. యెవళ్లకీ యెవళ్లూ బాధ కలిగించడం లేదు. అందరికీ బాగానే వున్నట్టుగా వున్నారు. లేవిన్‌కి సంబంధించి యివాళ మహా విలక్షణమైంది వాళ్ల అసలు స్వభావం చూడగలడం. అంతకు ముందు యెన్నడూ గమనించని చిన్న చిన్న లక్షణాలద్వారా వాళ్ల మనసుల్ని గ్రహించ గలగడం, ఆ రకంగా వాళ్లందరూ మంచి వాళ్లనీ, దయాగుణం వున్న వాళ్లనీ లేవిన్‌కి అనిపించింది. వాళ్లందరూ ముఖ్యంగా లేవిన్ పట్ల యివాళ ఆదరంగా వున్నారు. వాళ్లు తనతో మాట్లాడిన తీరుబట్టీ, తన కేసి చూసిన సోదర, సౌశీల్య వైఖరి బట్టీ అతనా విషయం గ్రహించేడు. తను అంతకు ముందు కలుసుకోని వాళ్లు కూడా తన పట్ల యివాళ అలానే ప్రవర్తించేరు.

"ఊఁ, బాగుందా?" అని కోజ్నిషెవ్ అడిగేడు.

"బ్రహ్మాండంగా వుంది. యింత సరదాగా వుంటుందని అనుకోలేదు. దివ్యంగా వుంది! చాలా సంతోషంగా వుంది."

స్వియాజ్‌స్కీ లేవిన్ దగ్గరికి వెళ్లి తమ యింటికి టీకి రమ్మని పిలిచేడు. స్వియాజ్‌స్కీలో తనకి నచ్చనిది యేమిటి చెప్మా, యేమిటి యితనిలో నేను వెతికింది అని యెంత బుర్ర బద్దలు కొట్టుకున్నా లేవిన్‌కి గుర్తు రాలేదు. అతను తెలివైన వాడు, అద్భుతమైన దయా స్వభావం కలవాడు కదా! అనిపించింది.

"అంతకంటేనా" అని లేవిన్ అన్నాడు. స్వియాజ్‌స్కీ భార్య, మరదలు యెలా వున్నారోనని వాకబు చేశాడు. లేవిన్ మనసులో స్వియాజ్‌స్కీ మరదలు ఆమె వివాహ ఆలోచనతో ముడి పడిపోయి వుండడంవల్ల యెందుకనో తెలియని కారణంగా స్వియాజ్‌స్కీ భార్య మరదళ్ల కంటే తన సౌభాగ్యం గురించి చెప్పదగిన వాళ్ళు వుండరని అతనికి అనిపించింది. అందుకని వెళ్లి టీ తాగాలంటే అతనికి సంతోషం కలిగింది.

పల్లెలో వ్యవహారాలు యెలా సాగుతున్నాయని స్వియాజ్‌స్కీ లేవిన్‌ని అడిగేడు. యూరప్‌లో వాడని పద్ధతులు లేవిన్‌కి కనిపించే అవకాశం లేదని అభిప్రాయపడ్డాడు. కాని యీ పూట ఆ ముక్కవల్ల లేవిన్‌కి చిరాకు కలగలేదు. తద్భిన్నంగా స్వియాజ్‌స్కీ వాస్తవమనీ యీ గొడవంతా నిష్ఫలమనీ, అతనికి అనిపించింది. స్వియాజ్‌స్కీ యెంతో నైపుణ్యంతో, సరసత్వంతో తన వాదననే మొండిగా పట్టుకోకుండా వుండడం కూడా అతనికి కనిపించింది. స్వియాజ్‌స్కీ యింట్లో వున్న ఆడవాళ్లు మరీ విశేషంగా కనిపించారు, అంతకు ముందెన్నడూ అంత ముచ్చటగా వాళ్లు కనిపించలేదు. వాళ్లకి సర్వమూ తెలుసనీ, తన ఆనందం వాళ్లకి సంతోషం కలిగించిందనీ కాని బాగుంటుందో బాగోదోనని ఆ విషయం గురించి మాట్లాడకుండా వున్నారనీ అనిపించింది. అతను గంట, రెండు గంటలు, మూడు గంటలు నానా రకాల విషయాలు వాళ్లతో మాట్లాడుతూ కూర్చున్నాడు, కాని తన హృదయం దేనితో నిండిపోయిందో దాన్ని గురించి మాత్రమే ఆలోచిస్తూ వున్నాడు. వాళ్లకి విసుగ్గా వుందనీ, యిక నిద్రపోవాలనుకుంటూ వున్నారనీ గమనించలేదు. స్వియాజ్‌స్కీ ఆవలింతలు ఆపుకోలేక, తన మిత్రుడికి యేం పూనిందో అర్థం చేసుకోలేక అతన్ని హాలుదాకా సాగనంపేడు. అప్పటికి తెల్లవారకట్ల రెండవుతోంది. హోటల్‌కి చేరాక పది గంటలు యెలా ఓపిక పట్టి గడపాలా అన్న ఆలోచనతో లేవిన్ భయపడిపోయాడు. రాత్రి కాపలా వుండే మనిషి దీపం వెలిగించేడు. లేవిన్ గనక ఆపకపోయినట్లయితే వెళ్లిపోయి వుండేవాడే. యెగోర్ నామధేయుడైన ఆ నౌకరు యెప్పుడూ లేవిన్ దృష్టిని ఆకర్షించలేదు గాని యీ పూట మాత్రం లేవిన్‌కి అతను మంచి వాడుగా, చురుకైన వాడుగా, అన్నిటికీమించి దయాస్వభావం వున్న వాడుగా కనిపించేడు.

"రాత్రంతా జాగారం వుండడం కష్టం కదా యెగోర్?"

"యేం చెప్తామయ్యా! యిళ్లల్లో పని తేలికే గాని యిక్కడ బక్షీలు యెక్కువ వస్తాయి."

యెగోర్‌కి ముగ్గురు కొడుకులూ, ఒక కూతురూనూ. ఆమె కుట్టుపని చేస్తుంది,

యెగోర్ ఆమెని ముస్తీలు షాపులో పని చేసే వాడికిచ్చి పెళ్లి చెయ్యాలనుకుంటున్నాడు, అని సమాచారం లాగేడు లేవిన్.

లేవిన్ యీ అవకాశం తీసుకుని పెళ్లిలో అసలు వుండాల్సింది ప్రేమ అనీ, దంపతులు వొకర్ని వొకరు ప్రేమించుకుంటే ఆనందానికి చూసుకో నక్కర్లేదనీ యేమంటే ఆనందం ఆ మనిషి హృదయంలోనే వుంటుందనీ సిద్ధాంతాన్ని యెగోర్‌కి వివరించి చెప్పేడు.

యెగోర్ అతను చెప్పినదాన్ని శ్రద్ధగా విన్నాడు. ఆ విన్నది శుభ్రంగానే అర్థమైనట్టూ కనిపించేడు. యేమంటే తను యెప్పుడు మంచి యజమానుల దగ్గర పని చేసినా తనకి తృప్తి కలిగిందనీ, ప్రస్తుతం తను పని చేస్తున్న యజమాని ఫ్రెంచి వాడైనా తనకి తృప్తిగా వుందనీ చెప్పేడు. అలాంటి సమర్థన చూసి లేవిన్‌కి ఆశ్చర్యం కలిగింది.

'చాలా దయాస్వభావం కలవాడు' అనుకున్నాడు లేవిన్.

"మరి నువ్వు పెళ్లి చేసుకున్నప్పుడు నీ ఆవిడ్ని ప్రేమించావా, యెగోర్?"

"యెందుకు ప్రేమించమయ్యా!" అని యెగోర్ అన్నాడు.

యెగోర్ కూడా ఉల్లాసంగా వున్నాడనీ, తన మనసులో వున్న దాన్నంతట్నీ వ్యక్తం చెయ్యాలనుకుంటూ వున్నాడనీ లేవిన్ చూశాడు.

"నా జీవితం కూడా అద్భుతమైంది. యింత పిల్లాడప్పట్నుంచీ..." అని మెరిసే కళ్లతో మొదలుపెట్టాడు. లేవిన్ ఉల్లాసం చూసి అతనికీ ఉల్లాసం వచ్చినట్టుంది, ఆవలించేవాణ్ణి చూసి ఆవతలి వాడికీ ఆవలింతలు వచ్చినట్టు.

ఆ సమయంలో గంట మోగింది. యెగోర్ వెళ్లిపోయాడు, లేవిన్ వొక్కడూ వుండి పోయాడు. భోజనాలప్పుడు లేవిన్ దాదాపు యేమీ తినలేదు. స్వియాజ్‌స్కీల యింటి దగ్గర రాత్రి భోజనం, టీ వద్దన్నాడు, అయినా భోజనం గురించిన ఆలోచనే రావడం లేదు. అంతకు ముందు రోజు రాత్రి నిద్రలేదు, అయినా నిద్ర తలపే లేదు. గదిలో చలిగా వుంది కాని అతనికి ఉక్కగా వుంది. కిటికీల పై రెక్కలు తెరిచి యెదురుగ్గా కూర్చున్నాడు. మంచు కప్పిన యిళ్ల కప్పులమీదనుంచి చర్చి గుమ్మటానికి పైన వున్న యినప శిలువ కనిపించింది, దానికి గొలుసులు వున్నాయి. దాని పైన రథసారథి నక్షత్ర రాశిలో యెంతో ప్రకాశమానంగా వున్న కెపెల్లా తార కనిపించింది. కిటికీలోనుంచి వీస్తూ వున్న చల్లని తాజా గాలి గాఢంగా పీలుస్తూ ఆ నక్షత్రాన్నీ, శిలువనీ చూస్తూ, కలలో లాగా మనసులో జ్ఞాపకాలనీ, చిత్రాలనీ పోనిస్తూ అక్కడ కూర్చున్నాడు. మూడు గంటలు దాటిన తర్వాత కొంచెం అతనికి వసారాలో అడుగుల చప్పుడు వినిపించింది. అతను తలుపు తెరిచి యెవరోనని చూశాడు. తనకి తెలిసిన మనిషే, మ్యాష్కిన్. జూదరి క్లబ్బునుంచి తిరిగి వస్తున్నాడు. అతను విచారంగా చిరచిర లాడుతూ దగ్గుతూ వున్నాడు. 'పాపం, విధివంచితుడు' అనుకున్నాడు లేవిన్. ఆ మనిషి పట్ల సానుభూతితో, ఆదరంతో లేవిన్ కళ్లలో నీళ్లు తిరిగేయి. అవతలికి వెళ్లి సానునయంగా అతనితో మాట్లాడేవాడే, కాని తను రాత్రి

తొడుక్కునే చొక్కా తొడుక్కుని వున్నాడని గుర్తు వచ్చి లోపలికి వెళ్ళి తెరిచిన కిటికీ దగ్గర కూర్చున్నాడు. తాజా గాలి పీలుస్తూ, తనకి యెంతో అర్థవంతంగా కనిపించిన ఆ మౌన శిలువ చిత్రం కేసీ, పైకి యెక్కి వచ్చే ప్రకాశమాన తారక కేసీ చూస్తూ వుండిపోయాడు. ఏడు గంటలు అవస్తూ వుండగా నేల పామేవాళ్ళు తమ పని మొదలుపెట్టారు, చర్చి గంటలు మోగడం మొదలైంది, లేవిన్‌కి చలి అనిపించింది. కిటికీ తలుపు మూసేసి, మొహం కడుక్కుని బట్టలు వేసుకుని, బయటికి వెళ్ళేడు.

15

వీధులు నిర్మానుష్యంగా వున్నాయి. లేవిన్ ష్చేర్‌బాత్‌స్కీల యింటికి వెళ్ళాడు. సింహ ద్వారం మూసే వుంది. యింట్లో అంతా నిద్రపోతూ వున్నట్టే కనిపించింది. అతను తిరిగి హోటల్‌కి వెళ్ళిపోయి గదిలోకి వెళ్ళి కాఫీ తెమ్మని చెప్పేడు. యెగోర్ కాకుండా పగలు పనిలో వుండే నౌకరు కాఫీ తెచ్చిపెట్టేడు. లేవిన్ అతనితో మాట్లాడదామనుకున్నాడు కాని యెవళ్ళో గంట కొట్టి పిలవడంతో ఆ నౌకరు వెళ్ళిపోయాడు. లేవిన్ కొంచెం రొట్టె ముక్క కొరికి కాఫీ తాగుదామనుకున్నాడు కాని అతని నోటికి యేదీ రుచించలేదు. అతను వాటిని ఉమ్మేసి, కోటు తొడుక్కుని మళ్ళీ బయటికి వెళ్ళేడు. ష్చేర్‌బాత్‌స్కీల యింటికి రెండవ సారి వెళ్ళేటప్పటికి తొమ్మిదైంది. యింట్లో వాళ్ళు అప్పుడే లేచినట్టు వుంది. వంట మనిషి బజారు పనిమీద వెళ్ళడం కనిపించింది. లేవిన్ చచ్చు మరో రెండు గంటలు వోపిక పట్టాల్సి వుంది.

ఆ రాత్రీ, పొద్దుటా అంతా లేవిన్ పూర్తిగా అచేతనావస్థలోనే వున్నాడు, యీ భౌతిక ప్రపంచంనుంచి పూర్తిగా నిస్సంగుడై వున్నాడు. పగలంతా యేమీ తినలేదు, రెండు రాత్రుళ్ళ కునుకు లేదు, కొన్ని గంటలు వొట్టి చొక్కాతో చలిలో (బట్టలు సరిగా వేసుకోకుండానే) కూర్చున్నాడు. అయినా యెన్నడు లేనంత తాజాగా, శక్తివంతంగా వున్నట్టూ, శరీరంతో సంబంధం లేకుండా పూర్తి స్వేచ్ఛగా వున్నట్టూ అతనికి అనిపించింది. అతను యే ప్రయాస లేకుండా కండరాల్ని కదుపుతున్నాడు, తను చెయ్యలేనిది యేదీ లేదని అతనికి అనిపించింది. అవసరం పడితే గనక తను గాలిలో యెగరగలననీ, వో యింటిని కదిలించగలననీ అతనికి విశ్వాసంగా వుంది. అతను తడవ తడవకీ గడియారం చూసుకుంటూ, చుట్టూతా పరిశీలిస్తూ మిగిలిన సమయాన్ని వీధుల్లో తిరుగుతూ గడిపేడు.

లేవిన్ ఆ సమయంలో చూసిన వాటిని ఆ తర్వాత మళ్ళీ యెన్నటికీ చూడగలగలేక పోయాడు. బళ్ళోకి వెళ్ళే పిల్లలూ, యింటి కప్పుమీదనుంచి యెగురుతూ కిందికి దిగి వచ్చిన పావురాళ్ళు, చల్లారడం కోసమన్నట్టు కిటికీ తినెమీద యే కనిపించని హస్తమో వుంచిన పిండి చల్లిన తాజా రొట్టెలూ విశేషంగా అతన్ని హత్తుకున్నాయి. యీ రొట్టెలు, యీ పావు

రాళ్ళు, యీ పిల్లల గుంపులు యీ లోకానివి కావు. అంతా వొకే క్షణంలో జరిగింది, యేక కాలమందే జరిగింది: వో పిల్లవాడు వో పావురాయి కేసి పరిగెత్తి, లేవిన్ కేసి తిరిగి చిరునవ్వు నవ్వేడు. ఆ పావురాయి రెక్కలు ఆడించి గాలిలోకి యెగిరింది. తళతళలాడే మంచుమీద యెండలో అది మెరిసింది. రొట్టెలు వుంచిన కిటికీలోనుంచి తాజాగా కాల్చిన రొట్టెల సువాసన వచ్చింది. అంతా మిళితమై యెంత అసాధారణంగా మంచితనంతో శోభిస్తూ వుండంటే సంతోష పారవశ్యంలో లేవిన్‌కి నవ్వాలనీ యేడవాలనీ కూడా అనిపించింది. అతను గజేత్నీ వీధి గుండా, కిస్లోవ్కా వీధి గుండా చుట్టూ తిరగేసుకుని వెళ్ళి తిరిగి హోటల్‌కి చేరు కున్నాడు. గడియారం ముందర పెట్టుకుని పన్నెండు గంటలు అవడం కోసం జపం చేస్తూ కూర్చున్నాడు. పక్క గదిలోనుంచి యంత్రాల గురించీ, యేదో మోసం గురించీ మాట్లాడు కోవడం వినిపించింది. పొద్దుటి పూట దగ్గే దగ్గులు కూడా వినిపించేయి. గడియారం ముల్లులు పన్నెండుకి చేరడం ఆ మనుషులకి కాబట్టలేదు. ముల్లులు పన్నెండుమీదకి చేరాయి. లేవిన్ బయటికి వెళ్ళేడు. బగ్గీల వాళ్లకి అంతా తెలిసినట్టే వుంది. అతన్ని తన బగ్గీలో తీసుకు వెళ్ళాలనే హక్కు యెవళ్ళ మట్టుకి వాళ్ళు తనకే దక్కాలన్న భావంతో కిలకిల లాడుతూ బగ్గీ వాళ్ళు అతన్ని చుట్టు ముట్టేశారు. అతను వో బగ్గీని పిలిచాడు. మిగిలిన వాళ్ళు కష్టపెట్టుకోకుండా వుండేందుకని మరోసారి తను వాళ్ల బగ్గీ యెక్కుతానని హామీ యిస్తూ తను యెక్కిన బగ్గీని ష్చేర్‌బాత్‌స్కీల యింటికి తోడుక్కు పొమ్మని చెప్పాడు. బగ్గీ తోలేవాడు గొర్రెతోలు కోటు వేసుకున్నాడు. లోపల తొడుక్కున్న చొక్కా తెల్లని కాలరు మెడని చుట్టి వుంది. ఆ వేషంలో అతను అద్భుతంగా వున్నాడు. ఆ బగ్గీ పొడుగ్గా వుంది. ఎత్తుగా వుంది. లేవిన్ మళ్లీ అంత అందమైన బగ్గీ యెక్కడు అన్నట్టు వుంది. గుర్రం కూడా అందంగా వుంది. శాయశక్తులా పరిగెత్తాలని ప్రయత్నించింది కాని యెందుకనో అసలు కదులుతున్నట్టే లేదు. బగ్గీ తోలేవాడికి ష్చేర్‌బాత్‌స్కీల యిల్లు తెలుసు. ఆ యింటి సింహద్వారం దగ్గరికి చేరగానే తన తీసుకువచ్చిన ఘనమైన వ్యక్తికి ప్రత్యేక మన్నన చూపిస్తున్నట్టు అతను చేతుల్ని చుట్టి 'హోయ్' అని అరిచేడు. ష్చేర్‌బాత్‌స్కీల దర్వాన్‌కి సర్వమూ తెలునులా వుంది.

"యెంతకాలం అయిందయ్యా మిమ్మల్ని చూసి" అని అతను లేవిన్‌తో అన్న తీరూ మందహాసం చేసే అతని కళ్ళూ ఆ విషయాన్ని తెలియ చేశాయి.

అతనికి అన్నీ తెలియడమే కాదు, అతను సంతోషంతో పొంగిపోతున్నట్టూ, ఆ పొంగి పొర్లే సంతోషాన్ని అదుపు చేసుకోవడం అతనికి కష్టంగా వున్నట్టూ కూడా కనిపించేడు. నిజానికి ఆ ముసలాయన దయాన్విత నేత్రాల్లోకి చూసేక తన ఆనందానికి వున్న మూతన పార్శ్వం లేవిన్ అవగాహనకి వచ్చింది.

"యింట్లో వాళ్ళు లేచారా?"

"లేవకేమండీ!" అని అతను చిరునవ్వు నవ్వుతూ చెప్పి, లేవిన్ టోపీని కూడా తీసు

కళ్లో ఉద్వేగంతో వున్నట్టు చూసి "దాన్ని యిక్కడ వుంచెయ్యండయ్యా!" అన్నాడు. అదీ కొంచెం అర్థవంతంగా వున్న మాటే.

"తమరు వచ్చేరని యెవరితో చెప్పమంటారయ్యా?" అని లోపల్నుంచి నౌకరు అడిగేడు.

నౌకరు పడుచు వాడైనా, కొత్త తరహా వాడైనా, షోకిలాగా వున్నా దయాళువు, మంచి వాడు. అందరికిలాగానే అతనికీ అన్నీ తెలుసు.

"పెద్ద ప్రిన్సెస్... ప్రిన్స్.... చిన్న ప్రిన్సెస్‌తో..." అన్నాడు లేవిన్.

అతనికి మొట్టమొదట కనిపించిన వ్యక్తి mademoiselle Linon. ఆమె హాల్లో నుంచి వెదుతోంది. ఆమె ఉంగరాల ముంగురుల్నా ముఖమూ మెరిసిపోతున్నాయి. అతను ఆమెని యింకా పలకరించాడో లేదో గుమ్మం అవతలనుంచి గౌను రెపరెపలాడ్డం విని పించింది. యిక లేవిన్‌కి mademoiselle Linon కనిపించడం లేదు, అనన్య ఆనంద పారవశ్యం అతన్ని అంతలా ముంచెత్తి వేసింది. Mademoiselle Linon అతన్ని వదిలి పెట్టి వేరే గుమ్మంలోనుంచి తొందరగా అవతలకి వెళ్లిపోయింది. ఆమె వెళ్లిపోగానే చెక్క పలకల పై చిన్న అడుగులు గబగబా చప్పుడు చేస్తూ వచ్చేయి. తన ఆనందం, తన జీవితం, తనే — అంత కాలమూ తను వెతికి ఆర్తితో చూసిన మెరుగైన తన భాగం — గబగబా తన కేసి వచ్చింది. నడిచి రాలేదు, వుహుఁ, ఆమె యేదో అగోచర శక్తితో అతని వేపు దూసుకు వచ్చింది.

అతనికి ఆమె నిర్మల, నిశ్చల నేత్రాలు తప్ప మరేం కనిపించలేదు. తన హృదయాన్ని ఆనందంతో నింపిన అదే సంతోష భీతి నేత్రాలు అవి. ఆమె కళ్ల మెరుపు యింకా యింకా దగ్గర పడింది, ప్రేమ దీధితులతో అతన్ని అంధుణ్ణి చేసింది. ఆమె అతన్ని తాకుతూ వుండేటంత దగ్గరగా వచ్చి ఆగింది. ఆమె చేతులు లేచి అతని భుజంమీద వాలేయి.

ఆమె చెయ్యగలిగినదంతా చేసింది. అతని దగ్గరికి పరిగెత్తుకు వచ్చింది, సిగ్గు పడుతూ సంతోషభరితంగా తనని సంపూర్ణంగా అతనికి అర్పించుకుంది. అతనామెని ఆలింగనం చేసుకుని, తన చుంబనని కాంక్షిస్తున్న ఆమె అధరాలకి తన అధరాలని ఆనించేడు.

ఆమె కూడా రాత్రంతా నిద్రపోలేదు, ఆ ఉదయం అంతా అతని కోసం యెదురు చూస్తూ గడిపింది. ఆమె తల్లిదండ్రీ సంతోషంతో ఆమెకి అనుమతి యిచ్చేరు, ఆమె సంతోషం తమ సంతోషంగా భావించేరు. ఆమె అతని కోసం యెదురు చూస్తూ వుంది. తనే అతన్ని మొదటగా చూసి తన సంతోషం గురించీ అతని సంతోషం గురించీ అతనికి చెప్పాలని అనుకొంది. ఒంటరిగా అతన్ని కలుసుకోవడానికి సమాయత్తమైంది, ఆ కలయిక గురించి అనుకుంటూ సంబర పడింది, తను యెలా ప్రవర్తిస్తుందో తెలియక బెరుకు పడింది, సిగ్గు పడింది. అతని పదధ్వని ఆమె వింది, అతని కంఠ స్వరం వింది. Mademoiselle Linon వెళ్లిపోయేదాకా గుమ్మం దగ్గర ఆగింది. Mademoiselle

Linon వెళ్ళింది. యే రకమైన ఆలోచనా లేకుండా, యెలా యేమిటి అని తనని తను ప్రశ్నించుకోకుండా అతని వేపు పరిగెత్తి వెళ్ళి సంపూర్ణంగా తనని అర్పించుకుంది.

"రండి, అమ్మ దగ్గరికి వెడదాం" అని అతని చెయ్యి పట్టుకుని అంది. అతను చాలా సేపు యేమీ మాట్లాడ లేకపోయాడు. మాటలు తన అనుభూతుల ఔన్నత్యాన్ని నష్టపరుస్తాయన్న భయంతోకంటే తను యేదో చెప్పబోయిన ప్రతిసారీ ఆనందాశ్రువులు ఉబికి మాటల్ని ముంచెత్తుతాయనే భయంతోనే అతను యేమీ అనలేకపోయాడు. అతనామె చేతిని అందుకుని ముద్దుపెట్టుకున్నాడు.

"యిది నిజమా?" అని అతను ఆఖరికి గద్గదంగా అన్నాడు. "నువ్వు నన్ను ప్రేమిస్తున్నావంటే నమ్మలేకపోతున్నాను" అన్నాడు.

కిట్టీ తనని అతను "నువ్వు" అన్నందుకూ, అతను తన కేసి చూసిన భీరుత్వానికీ చిరునవ్వు నవ్వింది.

"వూఁ" అని కిట్టీ మెల్లిగా, విశేషమహత్వంతో అంది. "నేను అదృష్టవంతురాల్ని" అంది.

చెయ్యి వదలకుండానే అతన్ని డ్రాయింగు రూమ్‌లోకి తీసుకుపోయింది. పెద్ద ప్రిన్సెస్ వాళ్ళని చూడగానే రొప్పింది. వెంటనే ఆమెకి యేడుపు వచ్చింది, నవ్వు వచ్చింది. ఆమెకి వుంటుందని లేవిన్ వూహించని చురుకుతో వాళ్ళ కేసి పరిగెత్తుకుంటూ వెళ్ళి, అతని తలని చేతులతో పట్టుకుని ముద్దుపెట్టుకుని తన కన్నీళ్ళతో అతని బుగ్గలు తడిపేసింది.

"హమ్మయ్య, అంతా స్థిరపడింది. నాకు సంతోషంగా వుంది. యీమెని ప్రేమించు. నాకు సంతోషంగా వుంది, అబ్బ! కిట్టీ!"

"గబగబానే విషయం తేలిపోయింది" అని పెద్ద ప్రిన్స్ పట్టించుకోనట్టు కనిపించాలని ప్రయత్నిస్తూ అన్నాడు. కాని అతని కళ్ళు కూడా చెమ్మగిల్లడం లేవిన్ గమనించాడు.

"చాలా కాలంగా, యెప్పుడూ యిదే కోరుకున్నాను" అని ఆయన లేవిన్ చెయ్యి పట్టుకుని తన వేపు లాక్కుంటూ అన్నాడు. "అప్పుడు కూడా, యీ కొంటె పిల్ల బుర్రకి కొంచెం యేదో..."

"నాన్నా" అని కిట్టీ గంయ్‌మని రెండు చేతులతోనూ తండ్రి నోరు మూసేసింది.

"సరే, చెప్పన్లే" అన్నాడతను. "నాకు చాలా చాలా ఆనందంగా వుంది... బాప్‌రే! నేనెంత మంద మతిని!"

అతను రెండు చేతులూ కిట్టీ చుట్టూతా వేసి ఆమె ముఖాన్ని, చేతుల్ని, మళ్ళీ ముఖాన్ని ముద్దుపెట్టుకుని ఆమెమీద శిలువ గీశాడు.

కిట్టీ అంత సేపు, ఆర్ద్రానుభూతితో తండ్రి బొద్దు చేతిని చుంబించడం చూసినప్పుడు, తనకి సంబంధించి అప్పటిదాకా పరాయి వాడైన ప్రిన్స్ పట్ల, నూతన ఆర్ద్ర భావన లేవిన్ మనసులో తరంగిస్తూ వచ్చింది.

16

పెద్ద ప్రిన్సెస్ మాట్లాడకుండా చిరునవ్వు నవ్వుతూ చేతుల కుర్చీలో కూర్చుంది. ప్రిన్స్ ఆమె పక్కన కూర్చున్నాడు. కిట్టీ తండ్రి చెయ్యి పట్టుకునే ఆయన పక్కన కుర్చీలో కుర్చుంది. యెవళ్లూ మాట్లాడ్డం లేదు.

ప్రిన్సెస్ మొదటగా మాటల్లో అన్ని విషయాల్నీ పెట్టి ఆలోచనంకీ అనుభూతులకీ వ్యావహారిక రూపం యిచ్చింది. మొదట్లో అందరికీ అది వింతగా, బాధగా కనిపించింది.

"పూ; అయితే యెప్పుడు? తాంబూలాలు పుచ్చుకుని ప్రధానం చేసుకోవాలి. ముహుర్తం యెప్పుడు పెట్టాలి? యేమంటావ్, అలెగ్జాండర్?"

"చెప్పాల్సింది అతను" అన్నాడు పెద్ద ప్రిన్స్ లేవిన్ కేసి చూపిస్తూ. "అతనే కథానాయకుడు" అన్నాడు.

"యెప్పుడా?" అని లేవిన్ సిగ్గు పడుతూ అన్నాడు. "రేపే, నన్ను గనక అడిగినట్టయితే. యివాళ ప్రధానం, రేపు వివాహం" అన్నాడు.

"చాల్లే, mon cher, వెర్రాచికాలు."

"పోనీ అయితే, వో వారం రోజుల్లో."

"యేమిటి, మతిపోయిందా యితనికి."

"యేం యెందుక్కూడదు?"

"ఆయ్ బాప్‌రే!" అని లేవిన్ తొందర చూసి నవ్వుతూ అంది పెద్ద ప్రిన్సెస్. "పెళ్లికూతురి బట్టలూ అవీ వద్దూ!" అంది.

'పెళ్లికూతురి బట్టలూ గిట్టలూ అన్నీ వుండాలా యేమిటి?' అని దడదడ లాడే గుండెతో లేవిన్ అనుకున్నాడు. 'కాని పెళ్లికూతురి బట్టలూ, ప్రధానం యింకా చెత్తా చెదారం – యేం వుంటేనేం గాక, నా ఆనందాన్ని పాడు చెయ్యగలవా? లేదు, యేదీ నా ఆనందానికి పొద్దు పెట్టలేదు' అనుకుని అతను కిట్టీ కేసి చూశాడు. పెళ్లికూతురి బట్టల ప్రస్తావన ఆమెకి యే పిసరూ కష్టం కలిగించనట్టే కనిపించింది. 'అంటే దీనర్థం అవి వుండాలన్న మాట' అనుకున్నాడు.

"నాకేం గొడవలేమీ తెలీవు, వూరికే నాకు తోచింది చెప్పాను" అని నొచ్చుకుంటున్నట్టుగా చెప్పాడు.

"అయితే మనమే స్థిరమైన యేర్పాట్లు చేద్దాం. తాంబూలాలు పుచ్చుకోవడం, ప్రధానం యిప్పుడు జరిపేద్దాం. బాగుంటుంది."

ప్రిన్సెస్ భర్త కేసి జరిగి అతన్ని ముద్దుపెట్టుకుని వెళ్లిపోబోయింది. కాని అతను ఆమెని ఆపు చేసి ఆమె చుట్టూ చేతులు వేసి పడుచు ప్రేమికుడిలా నవ్వుతూ మళ్ళీ మళ్లీ ముద్దుపెట్టుకున్నాడు. ఆ ముసలి దంపతులు గందరగోళ పడిపోయినట్టుగా వున్నారు.

ప్రేమ పిచ్చివాళ్ళ తామా లేక తమ కూతురా అనేది తేలనట్టు వున్నారు. ముసలాళ్ళ అవతలికి వెళ్లిపోగానే లేవిన్ వధువు దగ్గరికి వెళ్లి ఆమె చేతిని తీసుకున్నాడు. యిప్పుడతను తనని సంబాళించుకున్నాడు. మాట్లాడగలుగుతున్నాడు. ఆమెకి చెప్పాలని అనుకున్నది యెంతో వుంది. కాని యేం చెప్పాలనుకున్నాడో దాన్ని చెప్పలేడు.

"యిలాగే జరుగుతుందని నాకు తెలుసు. నేనెప్పుడూ ఆశ పెట్టుకోలేదు కాని మనసులో యీ విశ్వాసం పాతుకుంది. ముందే రాసి వుందని నాకు నమ్మకం వుంది" అన్నాడు.

"నా సంగతో?" అందామె. "అప్పుడు కూడా..." కిట్టీ వో క్షణం ఆగింది. నిశ్చలమైన చూపుని అతని వేపే ఉద్దేశపూర్వకంగా తిప్పి చెప్పింది. "అప్పుడు కూడా, నా అదృష్టాన్ని మోకాలడ్డి తొంగదోసుకున్నప్పుడు కూడా. నేను యెప్పుడూ మిమ్మల్ని మాత్రమే ప్రేమించాను, కాని వ్యామోహంలో పడిపోయాను. నేను యీ విషయాన్ని చెప్పకు తీరాలి... మీరు దాన్ని మర్చిపోగలరా?" అంది.

"బహుశా మేలే జరిగింది. మీరు కూడా నన్ను యెంతో క్షమించాల్సి వుంది. నేను మీకు చెప్పకుండా వుండలేను..."

కిట్టీకి యేదో చెప్పాలని లేవిన్ నిర్ణయించుకున్నాడు, యిది అందులో వొకటి. అది లోనే రెండు విషయాలు చెప్పాలని అనుకున్నాడు. తను నాస్తికుణ్ణనీ, రెండవది ఆమెకిలాగా పవిత్రుడు కాదనీ. అలా చెప్పడం అతనికి యాతనగానే వుంది. కాని యీ రెండు విషయాలూ చెప్పడం విధాయకం అని అనిపించింది.

"ఊహుఁ, యిప్పుడు కాదు, తర్వాత" అన్నాడు లేవిన్.

"అలాగే, తర్వాత. కాని చెప్పితీరాలి. నేను దేన్ని గురించీ భయపడను. నాకు అన్నీ తెలియాలి. యేం, యిది ఫైసలయింది కదా."

లేవిన్ ఆమె మాట పూర్తి చేశాడు:

"నేను యెలా వున్నానో అలా మీరు స్వీకరించడం, నన్ను కాదనకుండా వుండడం ఫైసలయింది. అంతేనా?"

"ఆఁ, ఆఁ, కాదనను" అంది.

Mademoiselle Linon వాళ్ల మాటలకి అడ్డం వచ్చింది. ఆమె ఆప్యాయమైన చిరునవ్వు నవ్వుతూ, అది తెచ్చి పెట్టుకున్నట్టే కనిపించినా తన ప్రియమైన శిష్యురాలికి శుభాకాంక్షలు చెప్పడానికి వచ్చింది. ఆమె వెళ్లిపోతూనే నౌకర్లు, పనివాళ్ల శుభాకాంక్షలు చెప్పడానికి వచ్చేరు. తర్వాత బంధువులు వచ్చేరు. యెలాంటి ఆనందమధువులో మునిగి తేలడం మొదలైందంటే లేవిన్ పెళ్లయిన తర్వాతి రోజుదాకా దాంట్లోనుంచి బయట పడలేకపోయాడు. లేవిన్‌కి యిబ్బందిగా, అసౌకర్యంగా అనిపించింది, కాని అతని ఆనందం నిరంతరాయంగా పెరిగిపోతూ వుంది. అతనికి తెలియని వాటిని యెన్నిటినో అతను చెయ్యాల్సి

వచ్చింది, కాని చెయ్యమని చెప్పిన వాటినన్నిట్నీ అతను చేశాడు. ఆ చెయ్యడం అతనికి సంతోషం కలిగించింది. తన ప్రధానం మిగతా మామూలు ప్రధానాల కంటే భిన్నంగా వుంటుందనీ, వాటిని అనుసరించి వుండే లాంఛనాలు తన ప్రత్యేక సందర్భంలో సుఖసౌభాగ్యాలకి ఆటంకంగా వుంటాయనీ అనుకున్నాడు. కాని జరిగింది యేమిటీ అంటే అతనూ అందరికి లాగానే చేశాడు, దానివల్ల అతని ఆనందం యెక్కువ అయింది, దానివల్ల అతనికి యెంత విశేష ఆనందం కలిగిందంటే అలాంటిది యితరులకి యెన్నడూ తెలిసి వుండదు.

"ఆఁ, మనం యిప్పుడు మిఠాయిలు తిందాం" అని M-lle Linon అంటే లేవిన్ మిఠాయిలు కొనడానికి వెళ్లాడు.

"నాకు చాలా సంతోషంగా వుంది. ఫామీన్ దుకాణంలో పుష్ప గుచ్ఛాలు కొనాలని నా సలహా" అని స్వియాజ్‌స్కీ అన్నాడు.

"అలా కొనాలి కదా?" అని అతను ఫామీన్ దుకాణం దగ్గరికి వెళ్లాడు.

కొంచెం డబ్బు బదులు పుచ్చుకొమ్మనీ, యేమంటే బోలెడు ఖర్చు వుంటుందనీ, కానుకలు కొనాల్సి వుంటుందనీ అన్నగారు సలహా యిచ్చేడు.

"కానుకలు కావాలి కదా?" అని అతను కానుకల కోసం ఫూల్డె దగ్గరికి వెళ్లాడు.

మిఠాయి దుకాణం వాళ్లు, ఫామీన్ దుకాణం దగ్గర, ఫూల్డె దగ్గర తన కోసం కని పెట్టుకు చూస్తున్నట్టు మిగిలిన అందరికిలాగానే, తన సంతోషం చూసి వాళ్లకీ సంతోషం కలిగినట్టు కనిపించింది. అసాధారణమైన విషయం ప్రతివాళ్లూ అతనంటే యిష్ట పడడమే కాదు, తనంటే అంతకు ముందు స్నేహభావంలేని వాళ్లు, ఉదాసీనంగా వుండేవాళ్లు, ఆర్ద్రత లేని వాళ్లు కూడా తనపట్ల ముగ్ధులవుతున్నారు, తన కోరికలని నెరవేర్చే ప్రయత్నం చేస్తున్నారు, తన అనుభూతుల పట్ల కోమలత్వం, సరసత్వం చూపిస్తున్నారు. అలాగే తన వధువు పరమ పరిపూర్ణమైం దవడంవల్ల లోకంలో తన కంటే అదృష్టవంతుడు లేడన్న తన విశ్వాసాన్ని మన్నిస్తూ వున్నారు. కిట్టీ కూడా తనకి సంబంధించి అలాగే అనుకుంటోంది. కౌంటెస్ నార్డ్‌స్టన్ కిట్టీకి యింతకంటే మంచి వరుడు లభించి వుండగలడని సూచన చెయ్య సాహసించినప్పుడు కిట్టీ యెంత ఉద్వేగపడి, లోకంలో లేవిన్ కంటే మంచి వాడు లేడని తిరుగు లేకుండా చెప్పిందంటే, కౌంటెస్ నార్డ్‌స్టన్ ఆ విషయాన్ని ఒప్పుకోవాల్సి వచ్చింది. ఆ తర్వాత కిట్టీ వుండగా ఆమె లేవిన్‌ని కలుసుకోవడం తటస్థిస్తే ఆమె మందహాసం చేస్తూ ప్రశంసాపూర్వకంగా అతన్ని చూసేది.

తన గురించి ఆమెకి యావత్తూ నివేదించుకుంటానని లేవిన్ కిట్టీకి యిచ్చిన మాట వొక్కటే ఆనాటి సౌనకంలో వుడక. అతను పెద్ద ప్రిన్స్‌ని సంప్రదించి, అతని అనుమతి తీసుకుని తన అంతరాత్మ క్షోభ అక్షర రూపంలో వున్న డైరీలని ఆమెకి యిచ్చేడు. తన భవిష్యత్ అర్ధాంగిని దృష్టిలో వుంచుకునే అతనా డైరీలని రాసి పెట్టుకున్నాడు. అతన్ని రెండు విషయాలు క్షోభపెట్టాయి. ఒకటి తన అపవిత్రత, రెండవది నాస్తికత. అతని నాస్తి

కతని గురించి ఆమె పెద్ద పట్టించుకోలేదు. ఆమె ఆస్తికురాలు, మతనిష్ఠాంవి. ఆమె యెన్నడూ శంకించలేదు. కాని లేవిన్ బాహిర నాస్తికత ఆమెకి చింత కలిగించలేదు. ఆమె ప్రేమ బలంతో అతని మనసులోకి చూసింది, అక్కడ ఆమెకి కనిపించింది పూర్తి తృప్తిని యిచ్చింది. అతని మనస్థితి నాస్తికమైందని అన్నా ఆమెకి యేం ఫరవా లేదు. రెండవ నివేదన ఆమెకి విపరీతమైన దుఃఖం కలిగించింది.

లేవిన్ మానసిక క్షోభ లేకుండా ఆమెకి తన డైరీలని యివ్వలేదు. తనకీ ఆమెకీ మధ్య యే రహస్యాలూ వుండరాదనీ, వుండకూడదనీ అతనికి తెలుసు. అందుకనే వాటిని ఆమె చదవాలని అతను అనుకున్నాడు. కాని ఆమెమీద యెలాంటి ప్రభావం పడుతుందీ అన్న విషయాన్ని ఆమె స్థానంలో తనని పెట్టుకుని వూహించలేకపోయాడు. ఆ సాయంత్రం థియేటర్‌కి వెళ్లే ముందు వాళ్ల యింట్లో అడుగు పెట్టి కిట్టీ గదిలోకి వెళ్లి ఆమె దయనీయ, విచారభరిత వదనం కన్నీళ్లతో తడిసి ముద్దయి వుండడం చూసినప్పుడు గాని లజ్జా జనకమైన తన గతాన్నీ, ఆమె నిష్కళంక పవిత్రతనీ వేరు చేసే భయంకర అగాధాన్ని అతను అర్థం చేసుకోలేకపోయాడు. తను చేసిన పనికి స్తంభించిపోయాడు.

"తీసెయ్యండి, తీసెయ్యండి యిక్కణ్నుంచి మీ భయంకరమైన డైరీలని" అని ఆమె బల్లమీదనుంచి వాటిని అతని వేపు నెంటుతూ అంది. "యెందుకు మీరు వాటిని నాకి చ్చారు?... వుహుఁ, యిదే మంచిది లెండి" అని లేవిన్ ముఖంమీద హతాశ చూసి జాలిపుట్టి తన మాట సందాళించుకుని అంది. "కాని యిది భయంకరం, భయంకరం" అంది.

అతను తల వాల్చుకుని యేమీ మాట్లాడలేదు. యేమీ చెప్పలేకపోయాడు.

"మీరు నన్ను క్షమించలేరా?" అని గొణిగాడు.

"క్షమించడం జరిగింది, కాని యివి భయంకరంగా వున్నాయి."

కాని లేవిన్ ఆనందం యెంత అధికంగా వుందంటే యీ స్వీకారం కూడా దాన్ని తగ్గించలేకపోయింది. కాని నొక నూతన వర్ణాన్ని ప్రసాదించింది. కిట్టీ అతన్ని క్షమించింది, ఆ క్షణంనుంచీ ఆమె భర్తగా వుండడానికి తన అయోగ్యత యింకా యెక్కువ అతనికి గ్రహింపు అయింది. నైతికపరంగా ఆమె ముందు తను యింకా తల వంచుకోవాల్సివచ్చింది. తనకి యోగ్యతలేని అదృష్టం తనని వరించినందుకు మునుపటికంటే అధికంగా దాన్ని ఉన్నత మైనట్టు పరిగణించేడు.

17

భోజనాలప్పుడూ, ఆ తర్వాతా జరిగిన సంభాషణని గురించే అప్రయత్నంగా ఆలోచిస్తూ కెరేనిన్ తన హోటల్ నొంటరి గదికి తిరిగి వెళ్ళేడు. క్షమించడం గురించి దాలీ అన్న మాటలు అతనికి చిరెత్తించాయి. ఆ క్రైస్తవ ధర్మ సూక్తి యీ సందర్భంలో వర్తిస్తుందా లేదా

అనేది చాలా జటిలమైన ప్రశ్న. దాన్ని అషామాషీగా చర్చించడానికి లేదు. పైగా కరేనిన్ యెన్నడనగానో దీనికి నకారాత్మక సమాధానం యిచ్చేడు. అక్కడ యేమేం మాటలు దొర్లినా యుద్ధావతారం, సాధువు అయిన తూరొవ్‌త్సిన్ అన్న మాటలు అతని మనసుకి బాగా నాటుకున్నాయి: భేష్ అదీ, ద్వంద్వయుద్ధానికి తొడగొట్టేడు, వేరే లోకానికి పంపేడు. ప్రతివాళ్ళకీ యీ ముక్క నచ్చినట్టే వుంది, కాని లోక మర్యాద కోసం అలా పైకి తేలారు కాదు.

'యేమైనా ఆ విషయం ముగిసిపోయింది, దాన్ని గురించి యేమీ ఆలోచించే ప్రశ్నే లేదు' అని తనలో తను అనుకున్నాడు. హోటల్ గది చేరుకునే వేళకి యీ ఆలోచనలన్నిట్నీ తరిమేసి రాబోయే ప్రయాణం గురించీ, దాని ఉద్దేశ్యం గురించీ ఆలోచిస్తూ వున్నాడు. తనని అనుసరించి గదికి వచ్చిన హోటల్ దరవాన్‌ని తమ నౌకరు యెక్కడ వున్నాడని అడిగాడు. అప్పుడే బయటికి వెళ్ళాడని అతగాడు సమాధానం చెప్పేడు. కరేనిన్ టీ తెమ్మని పురమాయించి బల్ల దగ్గర కూర్చుని ప్రయాణం దారిని రైల్వే గైడ్‌లో చూడ్డం మొదలుపెట్టేడు.

"రెండు టెలిగ్రామ్‌లు వచ్చేయండి, హుజూర్, మన్నించండి, నేనిప్పుడే బయటికి వెళ్ళాను" అని లోపలికి వస్తూ నౌకరు అన్నాడు.

కరేనిన్ టెలిగ్రామ్‌లు అందుకుని తెరిచాడు. మొదటి టెలిగ్రామ్‌లో తనకీగా తనే ఆశిస్తూ వున్న పదవికి స్త్రెమొవ్‌ని నియమించినట్టు సమాచారం వుంది. అతను ఆ టెలిగ్రామ్‌ని నేలకి విసిరి కొట్టి జేవురించుకుని లేచి అటూ యిటూ పచారు చెయ్యడం మొదలుపెట్టేడు. 'Quos vult perdere dementat'[1] అనుకున్నాడు. Quos అంటే అతని దృష్టిలో ఆ ఉద్యోగానికి నియమించిన వాళ్ళని. తనకి ఆ స్థానం లభించనందుకు అతనికి కష్టం కలగలేదు, తనని దాటి పోయినందుకు కష్టం కలగలేదు, కాని యీ కేతిగాడు, వదరుబోతు స్త్రెమొవ్ కంటే అసమర్థుడు ఆ ఉద్యోగానికి వుండడనే విషయం వాళ్ళ బుర్రకి యెక్కలేదేమా అనేది అతనికి అర్థం కాక గందరగోళ పడిపోయేడు. వాళ్ళు స్త్రెమొవ్‌ని నియామకం చేసి తమని నాశనం చేసుకున్నారు, తమ prestige[2] పోగొట్టుకున్నారు. యీ విషయం వాళ్ళ బుర్రకి యెక్కలేదేమో అనుకున్నాడు.

'యిందులో కూడా యిలాంటిదే యేదో వుంటుంది' అని రెండో టెలిగ్రామ్ విప్పుతూ అనుకున్నాడు. ఆ టెలిగ్రామ్ భార్యనుంచి. నీలం పెన్సిల్‌తో వున్న 'అన్నా' అనే మాట మొదటగా అతని కంటికి కనిపించింది. 'చనిపోతున్నాను. రండి అని వేడుకుంటున్నాను ప్రాధేయ పడుతున్నాను. క్షమాదానం పొంది శాంతంగా కళ్ళు మూస్తాను' అని చదివేడు. అతను తిరస్కారపూర్ణంగా చిరునవ్వు నవ్వి, ఆ టెలిగ్రామ్‌ని విసిరేశాడు. మొదటి క్షణంలో

[1] వాళ్ళకి వినాశకాలే విపరీత బుద్ధి (లాటిన్).

[2] ప్రతిష్ఠ (ఫ్రెంచి).

అతని మనసుకి యిది దగా, ఉచ్చు అనే అభిప్రాయం అనుమానానికి తావు లేకుండా అనిపించింది.

'తను యెలాంటి మోసానికేనా దిగజారుతుంది. కడుపుతో వుంది. బహుశా కాన్పు రోజులయి వుండచ్చు. కాని తన ఉద్దేశ్యం యేమై వుంటుంది? బిడ్డ అక్రమ సంతానం కాదనిపించుకోవాలనేమో నన్ను సమాధాన పరుచుకుని విడాకులు లేకుండా చేసుకోవాలనేమో' అనుకున్నాడు. 'కాని యిందులో యేమని వుంది – చనిపోతున్నాను...' అతను టెలిగ్రామ్‌ని యింకోసారి చదివేడు. ఆ మాటల ప్రత్యక్ష అర్థం అతన్ని వివశుణ్ని చేసింది. 'యిది నిజమే అయితే?' అనుకున్నాడు. 'వ్యధ, మృత్యుసామీప్యం ఆమెకి పశ్చాత్తాపం కలిగించాయేమో, నేను యిదేదో ఉచ్చు అనుకుని ఆమె దగ్గరికి వెళ్లడానికి యిష్టంగా లేనేమో. యిది క్రూరం అవుతుంది, అందరూ నన్ను వేలెత్తి చూపిస్తారు, పైగా అలా చెయ్యడం మూర్ఖత్వం కూడానూ' అనుకున్నాడు.

"ప్యోత్ర్, బగ్గీ పిలు, నేను పీటర్స్‌బర్గ్ వెళ్లిపోతున్నాను" అని నౌకర్ని పిలిచేడు.

పీటర్స్‌బర్గ్ వెళ్లి భార్యని చూడాలని కరేనిన్ నిర్ణయించుకున్నాడు. ఆమె జబ్బు గనక అబద్ధం అని తేలితే యేమీ అనకుండానే వెళ్లిపోతాడు. ఆమె నిజంగా జబ్బుగా వుంటే, చావు బతుకుల మధ్య వుంటే, చనిపోయే ముందు తనని చూడాలని అనుకుంటే, తను ఆలస్యం కాకుండా వేళకి వెడితే ఆమెని క్షమిస్తాడు. తను వెళ్లడం ఆలస్యమై ఆమె ముందే అంతిమ శ్వాస విడిస్తే సరియైన కర్మకాండ జరిపిస్తాడు.

ప్రయాణంలో తను చెయ్యవలసిం దాన్ని గురించి యిక ఆలోచించలేదు.

రాత్రంతా రైలు ప్రయాణం చేసి అలిసిపోయి, యెడ్డిగా వున్నట్టు అనిపిస్తూ వుండగా యెదర తన కోసం యే కార్యక్రమాలు నిరీక్షిస్తూ వున్నాయో వాటి గురించి అనుకోకుండా, కరేనిన్ పొగ మసక కమ్మిన పీటర్స్‌బర్గ్ నగరంలో రాజ పథంలో పేరుగా ముందుకే చూస్తూ, బగ్గీలో వెడుతున్నాడు. అతనా విషయం గురించి ఆలోచించలేకపోయాడు. యేమంటే ఆలోచించినప్పుడల్లా అతనికి ఆవ్నా చనిపోతే తన పరిస్థితిలో వున్న కష్టాలన్నీ పరిష్కారం అయిపోతాయన్న అవగాహన కళ్ల ముందు తారట్లాడింది. రొట్టెలమ్మే కుర్రాళ్లు, మూసి వున్న దుకాణాలు, రాత్రి బళ్లు తోలేవాళ్లు, కాలిబాటలు తుడిచే వాళ్లు అతని కళ్ల ముందు దూసుకుపోతున్నారు, తను యెదుర్కోవాల్సి రాబోయే దాన్ని గురించి, దేన్ని కోరుకునే సాహసం చెయ్యలేకపోతున్నాడో, అయినా కోరుకుంటున్నాడో దాన్ని గురించి ముసురుకు వచ్చే ఆలోచన లని మనసులోనుంచి తొలగించుకోవడానికి ప్రయత్నిస్తూ కంటి ముందు కనిపించే వాటి నన్నిట్నీ చూశేడు. యింటి గుమ్మం దగ్గరికి వెళ్లేడు. గుమ్మం ముందు వో అద్దె బండీ, వో బగ్గీ వున్నాయి. యీ బగ్గీలో తోలేవాడు కునుకు తీస్తున్నాడు. గుమ్మం దగ్గరికి వెడుతూ కరేనిన్ తన మనసులో యే మూలనో చేసుకుని వుంచుకున్న నిర్ణయాన్ని అద్దంలాగా యివతలికి తీసి చూసుకున్నాడు. 'యిది గనక మోసం అయితే తిరస్కారపూర్వక శాంతంతో

చటక్కున అక్కడినుంచి వెళ్లిపోవడం, నిజం గనక అయితే వ్యావహారిక మర్యాదలు పాటించడం' అనేది ఆ నిర్ణయం.

కరేనిన్ గుమ్మం దగ్గర గంట కొట్టక ముందే దరవాన్ తలుపు తీశేడు. టై లేకుండా, పాత కోటు వేసుకుని స్లిప్పర్లు తొడుక్కున్న దరవాన్ పెత్రోవ్, లేకపోతే కపితోనిచ్, వింతగా కనిపిస్తున్నాడు.

"అమ్మగారికెలా వుంది?"

"నిన్న పురుడు వచ్చింది, యిబ్బంది లేకుండా."

కరేనిన్ ఆగేడు, అతని ముఖం వివర్ణమైంది. అప్పుడు అతనికి అవగాహనకి వచ్చింది తను యెంతలా ఆమె మృత్యువుని కోరుతున్నదీ.

"ఆమె వొంట్లో యెలా వుంది?"

ఆ సమయంలో ఉదయంపూట వేసుకునే ఆప్రన్ వేసుకుని కార్నేయ్ మెట్లు దిగి పరిగెత్తుతూ వచ్చేడు.

"యేం బాగా లేదండి, నిన్న కొంతమంది డాక్టర్లు వచ్చేరు, యిప్పుడు కూడా వో డాక్టరు పక్కనే వున్నాడు" అన్నాడతను.

"సామాన్లు లోపలికి తెప్పించు" అన్నాడు కరేనిన్, యింకా మృత్యువు అవకాశం వుందని యీ మాటలని విని తేలిక పడుతూ లోపలికి వెళ్లేడు.

చిలక్కొయ్యని మిలిటరీ ఓవర్ కోటు వొకటి వేలాడుతోంది. కరేనిన్ దాన్ని చూసేడు.

"యెవరున్నారక్కడ?" అని అడిగేడు.

"డాక్టరుగారు, మంత్రసాని, కౌంట్ వ్రాన్‌స్కీ."

కరేనిన్ లోపలి గదుల్లోకి వెళ్లేడు.

డ్రాయింగు రూమ్‌లో యెవళ్లూ కనిపించలేదు. అతని అడుగుల చప్పుడు విని ఊదారంగు రిబ్బన్ల టోపీ పెట్టుకున్న మంత్రసాని లోపలినుంచి యివతలికి వచ్చింది.

ఆమె కరేనిన్ దగ్గరికి వచ్చింది. మృత్యువు సమీపంలో వున్నప్పుడు వచ్చే చొరవతో కరేనిన్ చేతిని పట్టుకుని అతన్ని పడక గది లోపలికి తీసుకు వెళ్లింది.

"దేముడి దయవల్ల మీరు వచ్చేరు. ఆమె మీ గురించి మాత్రమే, మీ గురించి మాత్రమే పలవరిస్తూ వున్నారు" అని చెప్పింది.

"మంచు ముక్క యిలా యివ్వాలి! గబగబా!" అని ఆదేశిస్తున్నట్టు డాక్టరు కంఠధ్వని వినిపించింది.

కరేనిన్ ఆన్నా గదిలోకి వెళ్లాడు. ఆమె రాత బల్ల పక్కన కురచ కుర్చీమీద కాళ్లు వొకవేపు వేసి వ్రాన్‌స్కీ కూర్చున్నాడు. చేతుల్లో ముఖం పెట్టుకుని యేడుస్తున్నాడు. డాక్టరు గొంతుక విని ముఖంమీదనుంచి చేతులు తీసేసి వొక్క ఉదుటున లేచేడు. వెంటనే అతనికి కరేనిన్ కనిపించేడు. కరేనిన్‌ని చూడగానే అతను చకితుడైపోయి, మళ్లీ

కుర్చీమీద కూలబడి, కనిపించకుండా అదృశ్యం అయిపోవాలని అనుకుంటున్నట్టుగా తలని భుజాల మధ్యకంటా వాల్చుకున్నాడు. కాని మళ్లీ ప్రయాసమీద సంబాళించుకుని లేచాడు.

"ఆమె అవసాన దశలో వుంది. ఆశ కనిపించడం లేదని డాక్టర్లు అంటున్నారు. నేను సంపూర్తిగా మీ దయాదాక్షిణ్యాంమీద ఆధారపడ్డాను. కాని నన్నిక్కడ వుండనివ్వండి... అయినా మీ యిష్ట ప్రకారం చేస్తాను, నేను..."

యితరుల బాధ కంట బడినప్పుడు కరేనిన్‌కి యెప్పుడూ కలిగే మానసిక దౌర్బల్యం వ్రాన్‌స్కీ కన్నీళ్లు చూసినప్పుడు కలిగింది. అతను వెంటనే ముఖం తిప్పేసుకుని వ్రాన్‌స్కీ చెప్పేది పూరా వినకుండానే గబగబా పడక గది గుమ్మం దగ్గరికి వెళ్లిపోయాడు. లోపలినుంచి అన్నా గొంతుక వినిపించింది. ఆమె స్వరం స్పష్టంగా, జీవంతో తొణికిసలాడుతూ, కచ్చితమైన తూగుతో వుంది. కరేనిన్ లోపలికి అడుగుపెట్టి ఆమె మంచం దగ్గరికి వెళ్లాడు. ఆమె ముఖం అతని వేపే పెట్టుకుని పడుకుంది. ఆమె చెక్కిళ్లు యెర్రగా వున్నాయి. ఆమె కళ్లు తళతళకుమంటున్నాయి. గౌను కఫ్సునుంచి యివతలికి వచ్చిన తెల్లని చిన్న చేతులు దుప్పటి అంచులతో ఆడుకుంటున్నాయి. ఆమె ఆరోగ్యంగా, తాజాగానే కాకుండా మంచి మానసిక స్థితిలో వున్నట్టు కూడా కనిపించింది. ఆమె గబగబా, ఉచ్చ స్వరంతో, అసాధారణమైన నిర్దుష్ట ధ్వనితో, ఉద్రేకభరిత కంఠంతో మాట్లాడింది.

"యేమంటే అలెక్సేయ్... నేను మా ఆయన అలెక్సేయ్ అలెగ్జాండ్రొవిచ్ గురించి మాట్లాడుతున్నాను (యిద్దరి పేర్లూ అలెక్సేయ్ కావడం యెంత వింత, భయంకర కాకతాళీయ ఘటన!) అలెక్సేయ్ నన్ను తిరస్కరించరు. నేను మర్చిపోతాను, ఆయన నన్ను క్షమిస్తారు... కాని ఆయన రారేం? ఆయన జాలి మనిషి. యెంత మంచి మనసున్న వాడో తనకే తెలీదు. ఓయ్! దేముడా! యెంత క్షోభగా వుంది! నీళ్లు కావాలి, గబగబా! అబ్బ! కూడదు, బిడ్డకి చెరుపు చేస్తుంది. పూ, సరే, దాన్ని దాదికి యివ్వండి. అదే మంచిది. ఆయన వస్తారు, దీన్ని చూసి కష్టం కలుగుతుంది. దాదికి యివ్వండి."

"అన్నాగారూ, ఆయన వచ్చేరు" అని ఆమె దృష్టిని కరేనిన్ వేపు మళ్లించాలని మంత్రసాని అంది.

"ఓహ్! యేం వాగుడు!" అని అన్నా భర్తని చూడకుండా అంటూనే వుంది. "దాన్ని నా దగ్గరికి తీసుకు రండి, నా దగ్గరికి. ఆయన యింకా రాలేదు. యెవళ్లకీ ఆయన గురించి తెలీదు. అందుకనే క్షమించడని అంటున్నారు. యెవళ్లకీ ఆయన్ని గురించి తెలీదు, నా వొక్కత్తెకే తెలుసు. యిది నాకు సంబంధించి దుఃఖకరమైంది. ఆయన కళ్లు! సెర్యోష కళ్లు అలాంటివి. అందుకనే వాడి కళ్లు చూడలేను. సెర్యోషకి అన్నం పెట్టారా? మీరంతా వాణ్ని గురించి పట్టించుకోకుండా వదిలేస్తారని నాకు తెలుసు. ఆయన మర్చిపోరు. సెర్యోషని మూల గదిలోకి మార్చి Marietteని తోడు పడుకోమని చెప్పాలి."

వున్నట్టుండి ఆమె మాట తెంపేసింది. ముడుచుకుపోయింది – మీద పడబోయే దెబ్బని

తప్పించుకోవాలను కుంటున్నట్టుగా చేతుల్ని ముఖంపైకి యెత్తుకుంది. భర్తకేసి చూసింది.

"లేదు, లేదు. ఆయనంటే నాకు భయం లేదు. చావంటే భయంగా వుంది. అలెక్సేయ్, యిటు, నా దగ్గరికి రావాలి. నాకు వ్యవధి లేదు, అందుకని త్వర పడుతున్నాను. యెక్కువ బతకను, జ్వరం మళ్లీ ఉధృతంగా వస్తుంది, అప్పుడు నాకు స్పృహ వుండదు. యిప్పుడు వుంది, అన్నీ అన్నీ తెలుస్తాయి" అంది.

కరేనిన్ ముడతలు పడ్డ ముఖంమీద తీవ్ర వేదనాభరిత భంగిమ కనిపించింది. అతను ఆమె చేతిని తీసుకుని యేదో చెప్పబోయాడు గాని వొక్క ముక్క కూడా పెగల్లేదు. అతని కింది పెదవి వణికింది, కాని అతను యింకా అమిత ఆవేశభరితుడై వున్నాడు. మధ్య మధ్యన ఆమెకేసి చూశాడు, అంతే. అలా చూసినప్పుడల్లా ఆమె కళ్లు తనమీదనే లగ్నమై వున్నట్టు కనిపించింది. ఆ చూపు యెంత ఆర్ద్రతాభరిత ముగ్ధత్వంతో అతనికి కనిపించిందంటే అంతకు ముందు యెన్నడూ అతనికి అలాంటిది ఆమె కళ్లల్లో కనిపించలేదు.

"కొంచెం ఆగు, నీకు తెలీదు... ఆగండి, ఆగండి..." అని ఆమె తన ఆలోచనల్ని కూడదీసుకునే ప్రయత్నంలో వున్నట్టు మౌనంగా వుండిపోయింది. "ఆఁ!" అని చెప్పడం మొదలుపెట్టింది. "ఆఁ, యిదీ నే చెప్పదలచుకున్నది. నన్ను చూసి ఆశ్చర్యపోవద్దు — నేను మారలేదు... కాని నన్నెవరో ఆవేశించారు లోపల, ఆమెని చూస్తే నాకు భయంగా వుంది. ఆమె ఆ మనిషిని ప్రేమించింది, నేను నిన్ను అసహ్యించుకోవాలని ప్రయత్నించేను, కాని నేను ముందర వున్న మనిషిగా నన్ను మర్చిపోలేకపోయాను. నేను ఆమెని కాదు. నేని ప్పుడు అసలు మనిషిని, పూర్తిగా. నేనిప్పుడు చనిపోతున్నాను, చనిపోతున్నానని నాకు తెలుసు, అతన్ని అడుగు. యిప్పుడు చేతులమీద, కాళ్లమీద ఆ భారం నాకు తెలుస్తోంది. వేళ్లు యెలా వున్నాయి — చాలా పెద్దవిగా వున్నాయి. కాని అంతా త్వరలోనే ముగిసిపోతుంది. నా కోరిక అల్లా వొకటే నన్ను మన్నించు, పూర్తిగా క్షమించు. నేను పాపిష్టి దాన్ని, కాని ఆయా అంటోంది ఆ వ్యధామూర్తి — ఆమె పేరేమిటి? — ఆమె యింకా పాపిష్ఠిది అట. నేను రోమ్ వెళ్లిపోతాను అక్కడ యెడారి వుంది, అప్పుడిక నావల్ల యెవళ్లకీ చింత కలగదు ఒక్క సెర్యోషనీ, యీ చిన్న పాపనీ తీసుకెడతానంతే... లేదు, నువ్వు నన్ను క్షమించలేవు, నాకు తెలుసు యిలాంటి పనికి క్షమ లేదు. అబ్బ, లేదు, లేదు, వెళ్లిపో, నువ్వు అతి మంచి వాడివి" అని అన్నా సలపం కాగిపోయే చేత్తో అతని చేతిని పట్టుకుని రెండో చేత్తో అతన్ని దూరం గెంటింది.

కరేనిన్ మానసిక దౌర్బల్యం యెక్కువై యే దశకు చేరుకుందంటే దానితో సంఘర్షణ పడడం విరమించుకున్నాడు. తను మానసిక దౌర్బల్యం అని అనుకుంటూ వున్నది అలా కాక తద్భిన్నంగా మానసిక పరమానంద స్థితి అనీ అది తను అంతకుముందు యెరగని సుఖాన్ని ప్రసాదిస్తోంది అనీ వున్నట్టుండి అతనికి అనిపించింది. తను జీవితం అంతా అనుసరించ ప్రయత్నిస్తూ వున్న క్రైస్తవ ధర్మ నియమం, శత్రువుల్ని ప్రేమించు, క్షమించు అని

శాసిస్తోన్న విషయం అతనికి తట్టనే లేదు. కాని శత్రువుల్ని అలా ప్రేమించడంవల్ల, క్షమించ డంవల్ల ఆనందం కలిగి అతని ఆత్మ నిండిపోయింది. అతను మంచం పక్కన మోకాలిమీద వాలి, గౌను కిందనుంచి సలసల కాగిపోతూ వున్న ఆమె చేతిమీద తల పెట్టి చిన్న పిల్ల వాడిలా వెక్కి వెక్కి యేడ్చాడు. బట్టతల పడిపోతూ వున్న అతని తలని ఆమె చేతుల్లోకి తీసుకుని, తన వేపు లాక్కుని, విజయ గర్వంతో తొణికిసలాడే కళ్లని యెత్తింది.

"ఆయన వచ్చేరు! నాకు తెలుసు. యిప్పుడు అందరికీ సెలవు, అందరికీ!... వాళ్లు మళ్లీ వెనక్కి వచ్చేరు, యేం వాళ్లు వెళ్లరెందుకని?... అబ్బ, నామీదనుంచి తీసెయ్యండి యీ ఫర్ కోట్లని!"

డాక్టరు మెల్లిగా ఆమె చేతిని విడిపించి ఆమెని తలగడమీద ఆన్చేడు. భుజాల దాకా కప్పేడు. ఆమె కిమ్మనకుండా వాలి పడుకుని మెరిసే కళ్లతో శూన్యం కేసి చూస్తూ వుంది.

"ఒక్క విషయం గుర్తుంచుకోవాలి, నాకు క్షమాభిక్ష మాత్రమే కావాలి, మరేం అక్కర్లేదు... 'అతను' రాడేం?" అని గుమ్మం దగ్గర నుంచున్న వ్రాన్‌స్కీ కేసి చూస్తూ అంది. "యిటు రా, యిటు రా! యీయనతో చెయ్యి కలుపు."

వ్రాన్‌స్కీ మంచం దగ్గరికి వచ్చేడు. ఆమెని చూసి ముఖాన్ని మళ్లీ చేతులతో కప్పేసుకున్నాడు.

"చేతులు తీసేసి ఆయన కేసి చూడు. ఆయన ఋషి! చేతులు తీసెయ్యి, ఆఁ" అంది కోపంగా. అప్పుడు భర్త కేసి తిరిగి "అలెక్సేయ్, యితని ముఖంమీదనుంచి చేతులు తీసెయ్యి, యితని ముఖం చూడాలని వుంది నాకు" అంది.

వ్రాన్‌స్కీ ముఖంమీద పెట్టుకున్న చేతుల్ని కరేనిన్ తీసేడు. వ్రాన్‌స్కీ ముఖం లజ్జతో, వ్యధతో వికారంగా కనిపిస్తోంది.

"యిప్పుడు యితని చేత్తో చెయ్యి కలుపు. యితన్ని క్షమించు."

కరేనిన్ కళ్లల్లో ఉబికి వస్తూ వున్న నీళ్లని ఆపుకునే ప్రయత్నం చెయ్యకుండానే వ్రాన్‌స్కీ వేపు చేతిని చాచేడు.

"దేవుడి కృప! దేవుడి కృప!" అందామె. "యిప్పుడు నేను సిద్ధంగా వున్నాను. కొంచెం కాళ్లు చాచుకుంటాను... యిలా. యిప్పుడు బాగుంది. ఆ పువ్వులు అలా అసహ్యంగా వున్నా యేమిటి? వయొలెట్ పూలల్లా లేనే లేవు అసలు!" అంది వాల్ పేపర్ కేసి చూస్తూ. "ఓరి దేము డోయ్! యెప్పుడు అంతమవుతుందిది? నాకు మత్తుమందు యివ్వండి! మత్తుమందు! అబ్బా! అబ్బా! అబ్బా!" అని అరిచింది.

మంచంమీద అటూ యిటూ దొర్లడం మొదలుపెట్టింది.

ఆ డాక్టరూ, యితర సహ డాక్టర్లూ అది ప్రసూతి జ్వరం అని చెప్పారు. యెక్కడో నూటికి వొకటే రెండూ తప్పిస్తే గండం గడిచి బయట పడటం కష్టం అట. రోజంతా

ఆమెకి జ్వరం వేసేసింది. సంధి స్థితిలోనే వుంది, స్పృహ లేకుండానే వుంది. అర్ధరాత్రి వేళకి పూర్తిగా స్పృహ పోయింది. నాడి అందీ అందకుండా పడిపోయింది.

యే క్షణంలోనే ప్రాణం పోవచ్చునవే స్థితిలో వుంది.

వ్రాన్‌స్కీ యింటికి వెళ్లిపోయాడు. కాని యెలా వుందో తెలుసు కుందుకు పొద్దుటే మళ్లీ వచ్చేడు. కరేనిన్ అతన్ని హాల్లోనే కలుసుకోవడం తటస్థించింది.

"మీరు వుండిపొండి, ఆమె మిమ్మల్ని చూడాలని అనుకుంటుందేమో" అని, తనే అతన్ని ఆమె గదిలోకి తీసుకువెళ్లాడు.

పొద్దుటి పూట ఆమెకి మళ్లీ ఉత్తేజం వచ్చింది. మాటల్లో, ఆలోచనల్లో చురుకుదనం వచ్చింది. మళ్లీ స్పృహ పోయింది. మూడవ రోజు కూడా యిదే ధోరణి సాగింది. ఆశ మిణుక్కుమంటోందని డాక్టర్లు చెప్పారు. ఆ రోజున వ్రాన్‌స్కీ కూర్చున్న గదిలోకి కరేనిన్ వెళ్లాడు. తలుపు మూసేసి అతనికి యెదురుగా కూర్చున్నాడు.

"కరేనిన్‌గారూ" అని వ్రాన్‌స్కీ మొదలుపెట్టారు, సంజాయిషీలు చెప్పుకునే వేళ వచ్చిందని గుర్తించి. "నేను యేమీ చెప్పలేకుండా వున్నాను. అర్థం చేసుకోలేకుండా వున్నాను. నా పట్ల సానుభూతి చూపించండి. మీకు యెంతో కష్టంగా వుండక తప్పదు కాని నా పరిస్థితి యింకా అధ్వాన్నం అని నమ్మండి" అన్నాడు.

అతను లేవబోయాడు గాని కరేనిన్ అతని చెయ్యి తీసుకుని అన్నాడు:

"నేను చెప్పేది పూరా వినమని వేడుకుంటున్నాను. యిది చాలా అవసరం. మీ ముందు నా మనసులో మాటని స్పష్టంగా చెప్పుకోవడం ఆవశ్యకం యేమంటే నా పట్ల మీకు తప్పు అభిప్రాయం వుండకూడదని. నా మనసులో వున్న మాటలు నన్ను నడిపించాయి, నడిపిస్తాయి. మీకు తెలుసు నేను విడాకులు యిచ్చేద్దామని నిర్ణయించుకుని, తత్సంబంధమైన చర్యలు మొదలుపెట్టాను కూడా. యిలా చెయ్యి మొదలుపెట్టడానికి గుంజాటన పడ్డ విషయం మీ దగ్గర దాచను, శంకలతో నలిగిపోయాను. మరో విషయం కూడా దాచుకోకుండా చెప్పేస్తాను, మీ మీద, ఆమెమీద పగ తీర్చుకోవాలన్న తపనతో బాధపడ్డాను. ఆమె టెలిగ్రాం అందుకుని యిక్కడికి వచ్చినప్పుడు కూడా నా మనసు మారకుండానే వుంది. అంతే కాదు, ఆమె చావుని కోరుకున్నాను... కాని..." అతను తన అనుభూతుల్ని వెల్లడి చెయ్యాలా లేదా అని ఆలోచించుకుంటూ ఆగేడు. "కాని ఆమెని చూసి క్షమించేను. క్షమాదానం చేసిన ఆనందం నేనేం చెయ్యాలో ఆ కర్తవ్యాన్ని నాకు చూపించింది. నేనామెని పూర్తిగా క్షమించేను. నేను 'ఎడమ చెంప కూడా తిప్ప' కోరుకుంటున్నాను, నా 'అంగీ తీసుకున్నప్పుడు పైవస్త్రమును యివ్వడా'నికి తయారుగా వున్నాను. నా ప్రార్థన అల్లా భగవంతుడు నాకీ క్షమాదాన ఆనందాన్ని దూరం చెయ్యకుండా వుండాలనే." అతని కళ్లల్లో నీళ్లు తిరిగేయి. అతని దృక్కులోని నిర్మలత్వాన్నీ, ప్రశాంతినీ చూసి వ్రాన్‌స్కీ చకితుడై పోయాడు. "యిదీ నా పరిస్థితి" అని కరేనిన్ సాగించేడు. "నన్ను దుమ్ములో అణగదొక్కవచ్చు, నలుగురి ముందూ

నవ్వులాల పాలు చెయ్యవచ్చు. కాని ఆమెని పరిత్యజించను, ఒక్క పరుషవాక్కు మీరు నానుంచి వినరు. నా కర్తవ్యం స్పష్టం అయింది. నేను ఆమెతో కలిసి వుండాలి నేను కలిసి వుంటాను. ఆమె మిమ్మల్ని చూడగోరితే మీకు కబురు చేస్తాను. కాని నా ఉద్దేశ్యంలో మీరు ప్రస్తుతం యిక్కడినుంచి వెళ్లిపోవడం మంచిది'' అన్నాడు.

అతను లేచి నుంచున్నాడు, వెక్కిళ్లవల్ల అతని కంఠం రుద్ధమైంది. వ్రాన్‌స్కీ కూడా లేచి నుంచున్నాడు. నిటారుగా నుంచోలేక, భుజాలు వంచుకునే అతని కేసి చూశాడు. కరేనిన్ మనోభావాలు అతనికి అవగాహన కాలేదు. కాని అవి ఉన్నతమైనవనీ, తన దృష్టి క్షేత్ర పరిధికి బయట వుండి తను అందుకోలేనివనీ గ్రహించాడు.

18

కరేనిన్‌తో సంభాషణ తర్వాత వ్రాన్‌స్కీ యింట్లోనుంచి బయటికి వెళ్లి మెట్ల ముందు నుంచుండిపోయాడు. యెంతో కష్టంమీద తను యెక్కడ వున్నదీ, నడిచి గాని బగ్గీలో గాని యెక్కడికి వెళ్లాల్సి వుందీ అర్థం చేసుకోబోయాడు. తను లజ్జితుడుగా, అవమానితుడుగా, దోషిగా, తన అవమానాన్ని స్నపతం చేసుకునే మార్గంలేని వాడుగా అతనికి అనిపించింది. అప్పటిదాకా తను యెంతో గర్వంగా, సునాయాసంగా నడుస్తూ వున్న బాటమీదనుంచి పిడుగు పడి దూరం విసిరేసినట్టుగా వుందతనికి. అంత వరకూ యెంతో దృఢంగా వున్న వన్నీ, తను ఆధారపడగల జీవిత సకల నియమాలూ, అలవాట్లూ అన్నీ హఠాత్తుగా మృషా మయంగా, అనుచితమైనవిగా తయారయేయి. వంచితుడైన భర్త, అప్పటిదాకా తన అదృష్ట మార్గంలో యాదృచ్ఛికంగా, ఒక మేర వరకూ హాస్యాస్పదంగా, అవరోధంగా వున్నాడనుకొన్న మనిషిని, హఠాత్తుగా ధర్మపత్ని స్వయంగా పిలిపించి, కళ్లు తిరిగి పోయే టంత యెత్తులో అధిష్ఠింపచేసింది. ఆ యెత్తులో యీ భర్త క్రూరుడుగా, కపటిగా హాస్యాస్పదుడిగా కనిపించలేదు; ఉదారుడిగా, సాధుమూర్తిగా మహోన్నతుడిగా కనిపించేడు. వ్రాన్‌స్కీ దీన్ని గుర్తించకుండా వుండలేకపోయాడు. అనుకోకుండానే భూమికలు మారి పోయాయి. కరేనిన్ ఔన్నత్యం, తన నీచత్వం, కరేనిన్ ఔచిత్యం తన అనౌచిత్యం గుర్తించేడు. కరేనిన్ దుఃఖంలో కూడా ప్రదర్శించిన ఔదార్యం, తను చేసిన వంచనలోని తుచ్ఛత్వం, నైచ్యం అతను గుర్తించేడు. తను అన్యాయంగా యేవగించుకున్న ఆ మనిషి ముందు తను నైచ్యంగా వున్నానన్న గుర్తింపు, అప్పుడు అతను అనుభవిస్తున్న బాధలో ఒక లఘు అంశం మాత్రమే. అతను మాటల్లో చెప్పలేనంత వ్యథ అప్పుడు యెందుకు అనుభవిస్తున్నాడంటే, యిటీవల అన్నాపట్ల తగ్గుతోందీ అని అనుకున్న తన కాంక్షాభరిత ప్రేమ ఆమెని శాశ్వతంగా పోగొట్టుకున్నానన్న గుర్తింపువల్ల యెన్నడూ లేనంత తీవ్రంగా జ్వలించింది. జబ్బుగా వున్న

ప్పుడు అన్నాని అతను సంపూర్తిగా గుర్తించాడు. ఆమె అంతరంగంలోకి చూశేడు. అప్పటి దాకా తను ఆమెని ప్రేమించలేదనే అనిపించింది. యిప్పుడు, ఆమెని పూర్తిగా యెరిగి నప్పుడు, యెలా ప్రేమించాలో అలా ప్రేమించ మొదలుపెట్టినప్పుడు ఆమె ముందు అవ మానితుడై పోయాడు, శాశ్వతంగా దూరమైపోయాడు, ఆమె మనసులో లజ్జాకరమైన తన స్మృతిని వదిలిపెట్టి పోతున్నాడు. సిగ్గుతో యెర్రబడిన తన ముఖంమీదనుంచి తన చేతుల్ని కరేనిన్ తీసెయ్యడం కంటే భయంకరమైన హాస్యాస్పదమైన, లజ్జాకరమైన స్థితి మరొకటి తనకి సంబంధించి వుండబోదు. అతను కరేనిన్ యింటి మెట్లమీద కొరడు బారిపోయి, యేం చెయ్యాలో తోచక నుంచుండి పోయాడు.

"బగ్గీ తెప్పించమంటారా, ప్రభూ" అని దరవాన్ అడిగేడు.

"ఆఁ, తీసుకు రా."

వ్రాన్‌స్కీకి మూడు రోజులుగా కంటిమీద కునుకు లేదు. ఇంటికి చేరగానే బట్టలు మార్చుకోకుండానే ముఖం బోర్ల పెట్టి తల చేతిలో పెట్టుకుని సోఫామీద పడిపోయేడు. అతని బుర్ర బరువెక్కిపోయింది. యెంతో వింత వింత బింబాలు, జ్ఞాపకాలు, ఆలోచనలు ప్రచండ వేగంతో, స్పష్టతతో బుర్రలో దూసుకుపోతున్నాయి. రోగి కోసం మందుని చెంచాలో తను పోస్తున్నట్టు, అది కొంచెం కింద వొలికినట్టూ కాసేపు కళ్ల ముందు మెదిలింది. కాసేపు మంత్రసాని తెల్లని చేతులు కళ్ల ముందు కనిపించాయి, కాసేపు కరేనిన్ వింతగా మంచం పక్కన మోకాలిమీద కూర్చున్న దృశ్యం తారట్లాడింది.

'నిద్రపోవాలి, మర్చిపోవాలి' అని ఆరోగ్యవంతుడు అలిసిపోయి పడుకోవాలనుకుంటే పడుకోగలిగిన శాంత చిత్తంతో, విశ్వాసంతో అనుకున్నాడు. నిజంగానే ఆ క్షణంలో అతని బుర్ర మసక బారిపోయింది, అతను విస్మృతిలో పడిపోతున్నాడు. అచేతన జీవన తరంగాలు అతని మనసుమీద దుమకడం మొదలుపెట్టాయి. వున్నట్టుండి విద్యుతాఘాతం కర్కశంగా తగిలినట్టు సోఫామీద అతని యావచ్ఛరీరం కుదిలింది, భయంతో చేతులని అన్చుకుని అతను వొక్క ఉదుట్న లేచాడు. అతని కళ్లు విప్పారి తెరుచుకున్నాయి, అసలు అతను వాటిని మూయనే మూయనట్టు. వొక్క క్షణం కితమే యెంతో భారంగా వున్నట్టనిపించిన శిరో భారం, అవయవాల అలసత్వం హఠాత్తుగా మాయమైపోయాయి.

'నన్ను దుమ్ములో అణగదొక్కవచ్చు' అని కరేనిన్ అన్న మాటలు గింగురుమంటున్నాయి. కరేనిన్ తన ముందు కూర్చుని వున్నాడు; అన్నా జ్వలిస్తున్న చెక్కిళ్లతో, తేజోవంతంగా వున్న కళ్లతో తన కేసి కాక కరేనిన్ కేసి కోమలంగా, ప్రేమగా చూడ్డం కనిపిస్తోంది; కరేనిన్ తన ముఖంమీదనుంచి తన చేతుల్ని తీసినప్పుడు యెంత మూఢుడిగా, వికృతంగా తను వున్నాడో తనకిగా తనకి కనిపించింది. అతను మళ్లీ పడుకుని కాళ్లు చాచుకుని కళ్లు మూసుకున్నాడు.

'నిద్రపోవాలి! నిద్రపోవాలి!' అని అతను మళ్లీ అనుకున్నాడు. కాని కళ్లు మూసు

కుంటే, యెంతో స్పష్టంగా, మరపురాని గుర్రప్పందెం ముందు రోజు సాయంత్రం అన్నా యెలా వుందో ఆమె ముఖం ప్రత్యక్షమైంది.

"యిది యిక యెన్నటికీ తిరిగిరాదు. తన స్మృతి పథంలోనుంచి దీన్ని తొలగించుకోవాలని చూస్తోంది. కాని యిది లేకుండా నేను బతకలేను. యెలా మా యిద్దరికీ సర్దుబాటు అవుతుంది? యెలా సర్దుబాటు అవుతుంది?" అని అతను పైకి అన్నాడు. తనకి తెలియకుండానే ఆ మాటల్ని మళ్లీ మళ్లీ అన్నాడు. యీ శబ్ద పునరావృత్తి అతని మస్తిష్కంలో ముసురుకుంటూ వస్తున్న బింబాలా, స్మృతులా గుంపుని దూరం గెంటేసింది. కాని యీ పునరావృత్తి అతని మనసులో చెలరేగే వూహల్ని కొంచెం సేపు మాత్రం అడ్డగించ గలిగింది. అన్నాతో తను గడిపిన మధురాతి మధుర క్షణాలు వాటితోబాటు యీ అవమానం మరోసారి ప్రచండ వేగంతో, వొకదాని తర్వాత వొకటి ప్రత్యక్షమయాయి. "చేతులు తీసెయ్యి" అని అన్నా గొంతుక వినిపించింది. కరేనిన్ చేతులు తీసేశాడు. ఆ క్షణంలో తన వదనం మీదున్న లజ్జాపూర్వక, మూఢ భంగిమ అతనికి అనుభూతం అయింది.

నిద్రవచ్చే అవకాశం లేదని తెలిసీ నిద్రపోవాలని కృషి చేస్తూ అతనక్కడ అలానే పడుకున్నాడు. మస్తిష్కంలోకి కొత్త దృశ్యాలు రాకుండా చేసుకుందుకు యే ఆలోచనలకి సంబంధించిన కొన్ని శబ్దాలు వచ్చినా వాటిని గొణుక్కుంటూ వున్నాడు. అతనికీ మాటలు పరాయి గొంతుక ఉన్మత్తతో అంటున్నట్టు పౌనఃపున్యంగా వినిపించాయి: "నేను దీని విలువని గుర్తించలేకపోయాను, దీన్ని సరిగా ఆస్వాదించలేకపోయాను. నేను దీని విలువని గుర్తించలేకపోయాను, దీన్ని సరిగా ఆస్వాదించలేకపోయాను."

"యేమిటిది?" నాకేమన్నా పిచ్చెక్కుతోందా?" అని తనలో తను అనుకున్నాడు. "బహుశా అలానే అవుతోందేమో. జనానికి యెందుకు పిచ్చెక్కుతుంది? యెందుకు తమని తమని కాల్చుకుంటారు?" అనుకున్నాడు. కళ్లు తెరిచేడు. తల వేపున వదినగారు వార్య అల్లిక పని చేసిన దిండు కనిపించి ఆశ్చర్యం కలిగింది. దిండు కుచ్చులు వేళ్లతో తడిమేడు, వార్యనీ, ఆమెని తను ఆఖరి సారి కలుసుకున్న సందర్భాన్ని గుర్తు చేసుకో ప్రయత్నించేడు. కాని మనసు వేరే ఆలోచనలకి మళ్లడం కష్టంగా వుంది. "నేను నిద్రపోవాలి, నిద్రపోవాలి" అని దిండుని తల వేపు లాక్కుని వొత్తుకుంటూ అనుకున్నాడు. కళ్లు మూసుకోవడానికే చాలా యాతన పడాల్సివచ్చింది. అతను వొక్క ఉదుట్న లేచి సోఫా అంచుమీద కూర్చున్నాడు. "నాకు అంతా ముగిసిపోయింది. యిప్పుడేం చెయ్యాలి? బతుక్కి యిక మిగిలిందేమిటి?" అనుకున్నాడు. అన్నా పట్ల ప్రేమ కాకుండా తన జీవితంలో మిగిలిన వాటి గురించి గబగబ ఆలోచనలు వచ్చేయి.

"కాంక్ష? సెర్పుహొవ్స్కోయ్? ఉన్నత సమాజం? రాజ దర్బారు?" దేనిమీదా అతని మనసు లగ్నం కాలేదు. వీటన్నిటికీ పూర్వం విలువ వుండేది. యిప్పుడేమీ లేదు. అతను సోఫాలోనుంచి లేచాడు. కోటు తీసేశాడు, బెల్టు వదులు చేసుకున్నాడు. బాగా తేలికగా గాలి పీల్చు

కోవడం కోసం వెంట్రుకలు ఒత్తుగా వున్న ఛాతీమీదనుంచి చొక్కా తీసేశాడు. నేలమీద అటూ యిటూ పచారు చెయ్యడం మొదలుపెట్టాడు. "జనానికి యిలాగే పిచ్చెక్కుతుంది, యిలాగే వాళ్లు పిస్తోలుతో కాల్చుకుంటారు.... అవమానం తప్పించుకుందుకు" అని మెల్లిగా మాట కోడించుకున్నాడు.

వ్రాన్స్కీ గుమ్మం దగ్గరికి వెళ్లి తలుపు మూసేడు. తర్వాత రెప్పవెయ్యకుండా అలా చూస్తూ, పళ్లు బిగపట్టి మేజా దగ్గరికి వెళ్లేడు. అందులోనుంచి రివాల్వర్ తీసి, తదేకంగా చూశేడు. గుళ్లు నింపిన దాని గుర్రాన్ని పైకి లేపాడు. ఆలోచనల్లో మునిగిపోయాడు. చేతిలో రివాల్వర్‌తో, తల వాల్చుకుని, ముఖం తీవ్రంగా ముడుచుకుని కొన్ని క్షణాలు అలానే నిలబడిపోయాడు. 'ఖాయంగా' అని ఒక తర్కబద్ధ, దీర్ఘ, స్పష్ట ఆలోచన నిశ్చిత పరిణామం దగ్గరికి చేర్చినట్టు అనుకున్నాడు. నిజానికి యెంతో నిర్వివాదంగా కనిపించే యీ 'ఖాయంగా' అనేది గత గంట సేపట్లోనూ కనీసం పది సార్లయినా మస్తిష్కంలో పునరావృతమవుతూ వున్న జ్ఞాపకాల, బింబాల పరిణామం మాత్రమే. అవి శాశ్వతంగా ఘనీభవించిపోయిన ఆనంద స్మృతులు, జీవితంలో ముందు ముందు రాబోయేవి నిష్ప్రయోజనకరమన్న భావనలు, తన అవమానం నలుపుతున్న అదే చేతన — యిదే క్రమంలో యీ బింబాలు, భావనలు మళ్లీ తిరుగుతూ వచ్చేయి.

'ఖాయంగా' అని రెట్టించుకున్నాడు. మూడవసారి అతని ఆలోచనల స్మృతులు వేదనాత్మక విషవృత్తం పరిభ్రమించ సాగింది. అతను రివాల్వర్‌ని ఛాతీమీద యెడమ వేపు పెట్టుకుని, పిడికిలి ముడుచుకుంటున్నట్టుగా చేతిని నొక్కి, ట్రిగ్గర్ నొక్కేడు. గుండు పేలిన చప్పుడు అతనికి వినిపించలేదు, కాని ఛాతీమీద తగిలిన తీవ్ర ఆఘాతానికి అతను కింద పడిపోయేడు. అతను మేజా అంచుని ఆసరాగా పట్టుకోబోయేడు, రివాల్వర్ కింద పడిపోయింది. ఆశ్చర్యంగా చూస్తూ నేలమీద చతికిల బడిపోయాడు. కిందనుంచి మేజా ఒంపు తిరిగిన కాళ్లని, చిత్తు కాగితాల బుట్టని, పులిచర్మం తివాసీని చూస్తూ తన గదిని గుర్తుపట్టలేకపోయాడు. నౌకరు డ్రాయింగ్ రూమ్‌లో నేలమీద కిర్రు కిర్రు చప్పుడు చేస్తూ గబగబా రావడం వినిపించింది. గట్టి సంకల్ప ప్రయత్నంమీద తను నేలమీద వున్నట్టూ పులి చర్మం తివాసీమీదా చేతిమీదా వున్న రక్తం చూసి తనని తాను కాల్చుకున్నట్టూ అతనికి స్పృహ తగిలింది.

"యెంత తెలివితక్కువ! గురితప్పింది!" అని చేత్తో రివాల్వర్ కోసం తడుముకుంటూ గొణుక్కున్నాడు. రివాల్వర్ దగ్గర్లోనే వుంది. కాని అది బాగా దూరంలో వున్నట్టు అతనికి స్ఫురించింది. దాన్ని చూడాలనే ప్రయత్నంలో అతను ఒంగేడు, దాంతో పట్టుదప్పి పడిపోయేడు. అతని గాయంనుంచి రక్తం ధారాపాతంగా కారింది.

ఆ నౌకరు చెంపలు పెంచుకున్న భారీ మనిషి. తన నరాలు దుర్బలమైనవని చాలా సార్లు పరిచయస్థులతో మొరపెట్టుకునేవాడు. అతను యజమాని నేలమీద పడి వుండడం

చూసి గాభరా పడిపోయి, రక్తం కారుతూ వున్న అతన్ని అలానే వొదిలేసి సాయం పిలుచుకు రావడానికి పారిపోయేడు. వో గంట తర్వాత వ్రాన్‌స్కీ వదినగారు ముగ్గురు డాక్టర్లని వెంట బెట్టుకుని వచ్చింది. ఆ డాక్టర్ల కోసం ఆమె నాలుగు దిక్కులకీ మనుషుల్ని పంపింది. అందరూ వొకేసారి వచ్చేరు. ఆమె గాయపడిన మనిషిని మంచంమీద పడుకోబెట్టి, అతన్ని కనిపెట్టుకుని అక్కడ్నే వుండిపోయింది.

19

భార్య దగ్గరికి వెళ్లి, ఆమెని చూసే ప్రయత్నంలో వున్నప్పుడు కరేనిన్ పక్షంగా వో తప్పు జరిగింది. ఆమె పశ్చాత్తాపం మనస్ఫూర్తిగా వుండగలదు, తను ఆమెని క్షమించ గలడు, ఆమె కోలుకుని బతకగలదు అనే అవకాశాన్ని కరేనిన్ దృష్టిలోకి తీసుకోకుండా తప్పు చేశాడు. అతను మాస్కోనుంచి తిరిగివచ్చిన రెండు నెలలకి యీ తప్పు అతని ముందు పూర్తి శక్తితో ప్రత్యక్షమైంది. అలాంటి అవకాశం వుంటుందని అతను దృష్టిలోకి తీసు కోకపోవడంవల్లనే కాక మృత్యుశయ్యమీద వున్న భార్యని ముఖాముఖీ చూసేదాకా అతనికే తన మనసు యేమిటో తెలీలేదు. యితరుల బాధ చూసినప్పుడు అతనికి యెలాంటి గాఢ సాను భూతి కలుగుతుందో, దేన్ని అతను అనవసరమైన దౌర్బల్యం అని సిగ్గుపడ్డాడో, దానికి మృత్యుశయ్యమీద వున్న భార్య పక్కన కూర్చున్నప్పుడు మొదటి సారిగా వశుడైపోయేడు. ఆమె పట్ల సానుభూతి, ఆమె చావును కోరుకున్నందుకు పశ్చాత్తాపం, అన్నిటినీ మించి ఆమెని క్షమించడంద్వారా లభించిన ఆనందం అతని బాధని తగ్గించడమే కాక అతను అంతకు ముందెన్నడు యెరగని చిత్తశాంతిని ప్రసాదించేయి. తనకి యేది వ్యధాకులితం అయిందో అదే మానసిక సౌఖ్యప్రదాయిని అయిందని హఠాత్తుగా అతను గుర్తించేడు. ఆ సమయందాకా తను అసహ్యించుకుని, తీర్పు చేసి, నిందించిన ఆ జటిల అపరిష్కృత సమస్య, తన మనసు ప్రేమతో, క్షమతో నిండిపోయినప్పుడు సరళంగా స్పష్టంగా కనిపించింది.

అతను భార్యని క్షమించేడు. ఆమె పడుతున్న బాధకీ పశ్చాత్తాపానికీ విచారించేడు. అతను వ్రాన్‌స్కీని క్షమించేడు, అతని పట్ల జాలిపడ్డాడు, ముఖ్యంగా అతని దురంత ప్రయ త్నం గురించి విన్నాక అలా అనిపించింది. కొడుకు పట్ల అతనికి యెక్కువ ప్రేమ కలిగింది. తను కొడుకు గురించి శ్రద్ధ పట్టనందుకు నొచ్చుకున్నాడు. కాని కొత్తగా పుట్టిన బిడ్డ పట్ల అతనికి దయ మాత్రమే కాకుండా అనిర్వచనీయ కోమల అనుభూతి కలిగింది. మొదట్లో ఆ దుర్బల శిశువుపట్ల జాలివల్ల అతను తన కూతురుగాని ఆ పిల్ల గురించి శ్రద్ధ పట్టేడు. తల్లి జబ్బుగా వుండడంవల్ల యెవర్నూ ఆ పిల్ల గురించి పట్టించుకోలేదు. అతను గనక శ్రద్ధ చూపించకపోయినట్లయితే ఆ పిల్ల చనిపోయి వుండేదే. తనకి ఆ పిల్లపట్ల ప్రేమ యెలా పుట్టిందో అతనికే తెలియలేదు. ఒక్క రోజులో అతను కొన్ని సార్లు చంటి బిడ్డ గదికి వెళ్లి

చాలా సేపు కూర్చుండి పోయేవాడు. మొదట్లో అతను అక్కడ వుండడం దాదికి ఆయాకి యిబ్బందిగా వుండేది కాని రాను రాను వాళ్ళు అలవాటు పడిపోయారు. ఒకోసేపు అతను దగ్గరదగ్గర అరగంట సేపు నిద్రపోతూ వున్న ఆ పిల్ల యెండిపోయిన గౌరవర్ణ ముఖం కేసి, ఆ పిల్ల కనుబొమలు ముడుచుకునేటప్పుడు పడే ముడతల కేసి, ముడుచుకున్న వేళ్ల చేతులని వెనక్కి తిప్పి కళ్లనీ ముక్కునీ ఆ పిల్ల రుద్దుకుంటూ వుండడాన్ని చూస్తూ వుండి పోయేవాడు. అలాంటి సమయాల్లో కరేనిన్‌కి విశేషంగా మానసిక శాంతి, సంతుష్టి కలిగేవి. తన పరిస్థితిలో అసాధారణమైంది గాని మార్చవలసింది గాని వున్నట్టు అతనికి కనిపించేది కాదు.

తన పరిస్థితి యెంత స్వాభావికంగా కనిపించినప్పటికీ తనని అందులో అలాగే వుండ నివ్వడం జరగదని కాలం గడిచే కొద్దీ అతనికి స్పష్టం అవసాగింది. తన ఆత్మని నిర్దేశించే ప్రబల మానసిక శక్తి కంటే అతిరిక్తమైన శక్తి, లేదా యెక్కువ బలీయమైన కఠోర శక్తి, తన జీవితాన్ని నిర్దేశిస్తూ వుందనీ, ఆ శక్తి తనని వ్యధనుంచి విముక్తం చేసి తను తపిస్తూన్న మానసిక శాంతిని ప్రసాదించదనీ అతను గ్రహించేడు. ప్రతి వాళ్ళు తన కేసే ప్రశ్నార్థక ఆశ్చర్యంతో చూస్తున్నారని, తనని వాళ్ళు అర్థం చేసుకోవడం లేదనీ, తననుంచి యేదో ఆశిస్తూ వున్నారనీ అతను గ్రహించేడు. తన భార్యతో గల సంబంధాలు అస్థిరంగా, అస్వాభావికంగా వున్న విషయాన్ని అతను ప్రత్యేకం గుర్తించేడు.

మృత్యు సామీప్యంలో వున్నప్పుడు అన్నా స్వభావంలో మొసలెత్తిన మెనరు జారిపోగానే ఆమెకి తనంటే భయంగా వుందని, తను వుంటే ఆమెకి బాధగా వుందనీ, ఆమె తన ముఖంలోకి చూడగలిగే ధైర్యం చెయ్యడం లేదనీ కరేనిన్ గమనించేడు. ఆమె తనతో యేదో చెప్పాలని అనుకుంటున్నట్టూ, కాని చెప్పే ధైర్యం చెయ్యలేకపోతున్నట్టూ వుండేది. తమ పరిస్థితులు అలావే సాగవనీ, తననుంచి ఆమె యేదో ఆపేక్షిస్తూ వుందనీ యేదో అనుమానం అతనికి కలిగేది.

ఫిబ్రవరి ఆఖరిలో అన్నా బిడ్డ, ఆ బిడ్డ పేరు కూడా అన్నాయే, జబ్బు పడింది. పొద్దుటి పూట ఆ బిడ్డ గదికి వెళ్లి చూసి, డాక్టరుకి కబురు పెట్టమని చెప్పి కరేనిన్ సచివాలయానికి వెళ్లిపోయాడు. మధ్యాహ్నం మూడు గంటల దాకా అతను తిరిగి యింటికి రాలేదు. లోపలికి అడుగుపెట్టగానే లాంఛనమైన ఉడుపులు వేసుకుని, ఎలుగు చర్మం జాకెట్ వేసుకున్న అందమైన నౌకరొకడు ఆడమనిషి ఫర్ కోటు పట్టుకుని నుంచుని వుండడం కనిపించింది.

"యెవరు వొచ్చేరు?" అని కరేనిన్ అడిగాడు.

"ప్రిన్సెస్ బెట్సీ త్వెర్‌స్కాయా" అని నౌకరు జవాబు చెప్పేడు, అతను చిరునవ్వు నవ్వుతూ అలా జవాబిచ్చినట్టు కరేనిన్‌కి అనిపించింది.

యీ కఠిన కాలం అంతా కూడా తన ఉన్నత సమాజ పరిచయస్థులంతా, ముఖ్యంగా

మహిళలు, తన పట్లా, తన భార్య పట్లా యెక్కడ లేని ఆసక్తి కనబరుస్తూ వున్నారని కరేనిన్ గమనించేడు. యీ జనం అంతా ప్రయాసపడి దాచుకునీ దాచుకోలేకుండా యేదో సంతోషాన్ని, తనకి లాయరు దగ్గరా, యిప్పుడు నౌకరు దగ్గరా కనిపించినలాంటి సంతోషాన్ని, కనిపింప చేస్తున్నట్టు అతనికి అనిపించింది. వాళ్ళు యేదో పెళ్లివారిలాగా సంతోష పడుతు వ్నారు. యెప్పుడు అతన్ని కలుసుకున్నా, ప్రయాసమీద దాచి పెట్టుకున్న సంతోషంతో, వాళ్ళు ఆమె ఆరోగ్యం గురించి అతన్ని అడిగేవాళ్ళు.

ప్రిన్సెస్ బెట్సీ త్వెర్‌స్కాయా రావడం కరేనిన్‌కి యిష్టం లేదు. ఆమెతో కలిసి వున్న జ్ఞాపకాలవల్లా, తనకి ఆమె అంటే మామూలు గానే వుండే అయిష్టతవల్లా కూడా ఆమె రాక అతనికి యిష్టం లేకపోయింది. అందుకని కరేనిన్ భార్య గదిలోకి వెళ్లకుండా తిన్నగా పిల్లల గదిలోకి వెళ్లాడు. మొదటి గదిలో సెర్యోష బల్లమీద ఛాతీ ఆన్చుకుని కుర్చీ పైన మోకాలిమీద వాలి యేదో గీసుకుంటూ హుషారుగా మాట్లాడుతూ వున్నాడు. అన్నా జబ్బు పడినప్పుడు ఫ్రెంచి గవర్నెస్ స్థానంలో వచ్చిన ఇంగ్లీషు గవర్నెస్ సెర్యోష పక్కన కూర్చుని అల్లుకుంటోంది. కరేనిన్ లోపలికి వెళ్లగానే ఆమె హడావుడిగా లేచి నుంచుంది. అతనికి నమస్కారం పెట్టి లేచి నుంచోమన్నట్టు సెర్యోష చొక్కా చేతిని గుంజింది.

కరేనిన్ కొడుకు జుట్టు నిమిరి, భార్య ఆరోగ్యం గురించి అడిగిన గవర్నెస్‌కి సమాధానం చెప్పి, చంటి బిడ్డ గురించి డాక్టరు యేం చెప్పాడని అడిగాడు.

"మరేం బెంగ లేదనీ, చికిత్సా స్నానాలు చేయించమనీ డాక్టరు చెప్పాడు, హుజూర్."

"కాని అది యింకా యేడుస్తూనే వుంది" అని కరేనిన్ పక్క గదిలోనుంచి వచ్చే చంటి బిడ్డ యేడుపు విని అన్నాడు.

"దాదిని మార్చాలని నా అభిప్రాయం హుజూర్" అని ఇంగ్లీషు గవర్నెస్ నొక్కి చెప్పింది.

"యేం యెందుకని?" అని కరేనిన్ వెళ్లే వెళ్లే వాడు ఆగి అడిగేడు.

"కౌంటెస్ పాల్ వాళ్లకీ అంతే అయిందండి. చంటి బిడ్డకి యేదో వైద్యం చేయిస్తూనే వున్నారు గానండి, అసలు సంగతి పిల్లకి ఆకలి తీరకపోవడం అండి. దాది దగ్గర పాలు లేవు."

కరేనిన్ ఆలోచించుకుంటూ కొంచెం సేపు వుండిపోయాడు. తర్వాత చంటి బిడ్డ గదిలోకి వెళ్లాడు. చంటి బిడ్డ దాది ఒళ్లో తల వెనక్కి వాలేసుకుని, గింజుకుంటూ, తన్నుకుంటూ వుంది. దాది అందిస్తున్న ఉరుస్తనాన్ని ఆమె, ఆయా యిద్దరూ బుజ్జగిస్తూ వున్నాగానీ తోసేస్తోంది.

"యేం వొంట్లో అలాగే వుందా?" అని కరేనిన్ అడిగాడు.

"చాలా తిక్కగా వుంది హుజూర్" అని ఆయా అంది.

"దాది దగ్గర పాలు లేవంటోంది మిస్ ఎడ్వర్డ్స్" అన్నాడు.

"నాకూ అలానే అనిపిస్తోందండీ" అంది ఆయా.

"మరి ఆ ముక్క యెందుకు చెప్పలేదు?"

"యెవరికి చెప్పమంటారు? అమ్మాగారికి యింకా స్వాస్థ్యంగా లేదు" అని ఆయా కొంచెం కోప్పడుతున్నట్లు అంది.

ఆమె యింట్లో చాలాకాలంగా పని చేస్తూ వుంది. ఆమె సీదా సాదాగా అన్న యీ మాటల్లో కరేనిన్‌కి తన స్థితి గురించిన సూచన ధ్వనించింది.

చంటి పిల్ల యింకా యెక్కువగా గుక్కపట్టి యేడుస్తోంది. ఆయా హొస్పని చెయ్యి విసిరి దాది దగ్గర్నుంచి చంటిబిడ్డని తీసుకుని చేతుల్లో వూపుతూ అటూ యిటూ పచార్లు చెయ్యడం మొదలుపెట్టింది.

"దాదిని పరీక్షించమని డాక్టరుకి చెప్పండి" అన్నాడు కరేనిన్.

చక్కగా ముస్తాబై, ఆరోగ్యంతో తొణికిసలాడుతూ వున్నట్లు కనిపించే దాది యేదో మెల్లి మెల్లిగా గొణుక్కుంటూ ఉరువక్షోజాల్ని రవికెతో కప్పుకుని బొత్తాలు పెట్టుకుంటూ, యెక్కడ తనకి ఉద్వాసన జరుగుతుందోననే భయంతో తన దగ్గర పాలు లేవన్న సందేహం పట్ల తిరస్కారపూరితంగా చిరునవ్వు నవ్వింది. ఆ చిరునవ్వులో కూడా కరేనిన్‌కి తన స్థితి పట్ల యేవగింపు కనిపించింది.

"అదృష్టంలేని బిడ్డ" అని బిడ్డని తీసుకుని వూరుకో బెడుతూ నడుస్తూ వున్న ఆయా అంది.

కరేనిన్ ఆమె అటూ యిటూ పచారు చెయ్యడం చూస్తూ కూర్చున్నాడు. అతని ముఖంలో బాధ, నిరుత్సాహం కనిపించేయి.

యెలాగైతేనేం పిల్లని సముదాయించి వూరుకోబెట్టి ఆయా ఉయ్యాల్లో పడుకో బెట్టింది. తలగడాలు సర్ది వెళ్లిపోయింది. అప్పుడు కరేనిన్ లేచి మునివేళ్లమీద కష్టంగా నడిచి బిడ్డ దగ్గరికి వెళ్లాడు. ఓ క్షణమో, రెండు క్షణాలో మౌనంగా మంచుని బిడ్డని నిరుత్సాహంగా చూస్తూ వుండిపోయాడు. హఠాత్తుగా అతని ముఖం చిరునవ్వుతో వెలిగింది. ఆ చిరునవ్వుకి అతని నుదుటిమీద చర్మం కదిలింది, ముందు జుట్టు కదిలింది. మరుక్షణం అతను మునివేళ్లమీద గది బయటికి వెళ్లిపోయాడు.

భోజనాల గదికి వెళ్లి గంట మోగించి నౌకర్ని పిలిచి డాక్టరుకి మళ్లీ కబురు చెయ్య మని చెప్పేరు. యిలాంటి ముచ్చటైన బిడ్డ గురించి యేమీ పట్టించుకోకుండా వున్నందుకు భార్యమీద చిరాకు కలిగింది. అలా చిరాగ్గా భార్య దగ్గరికి వెళ్లడం యిష్టంలేకపోయింది, ప్రిన్సెస్ బెట్సీని చూడ బుద్ధి పుట్టలేదు. కాని తను మామూలుగా రావాల్సిన వేళకి అతను యెందుకు రాలేదా అని భార్య ఆశ్చర్యపోవచ్చు. అంచేత బలవంతంగా ఆమె గదికి వెళ్లాడు. మందంగా వున్న తివాసీమీద అడుగులు వేస్తూ గది దగ్గరికి వెళ్లేటప్పటికి, వినాలని లేక పోయినా కొన్ని మాటలు చెవిన పడక తప్పలేదు.

"అతను యిక్కణ్నుంచి వెళ్లకుండా వుండిపోయినట్లయితే మీరూ, అతనూ చూసుకోక పోవడం నాకు అర్థమయ్యేది. కాని మీ ఆయన పీటకి అతీతంగా వుండాలి" అంది బెట్సీ.

"మా ఆయన వల్ల కాదు నేను చూడకపోవడం. నాకే అతన్ని చూడ్డం యిష్టం లేదు. యీ విషయం గురించి మాట్లాడుకోవద్దు లెండి" అని అన్నా ఆవేశంగా అంది.

"కాని మీకోసం పిస్టల్‌తో కాల్చుకున్న వ్యక్తికి వీడ్కోలు చెప్పడానికి నిరాకరిస్తారా? పైగా..."

"సరిగ్గా ఆ కారణంవల్లనే అతన్ని కలుసు కోదల్చుకోలేదు."

ముఖంమీద భయం, దోషిత్వం ద్యోతకమవుతూ వుండగా కరేనిన్ ఆగేడు, యెవళ్లకీ కనబడకుండానే వెనక్కి వెళ్లి పోదామనుకున్నాడు. అలా చెయ్యడం బాగోదనిపించింది. అందుకని తన రాకని తెలియ జేస్తున్నట్టు దగ్గు దగ్గేడు. లోపల మాటలు ఆగిపోయేయి. అతను లోపలికి వెళ్లేడు.

అన్నా బూడిదరంగు డ్రెస్సింగు గౌను తొడుక్కుని సోఫామీద కూర్చుంది. చిన్నగా కత్తిరించిన ఆమె నల్లని జుట్టు గుండ్రటి శిరముమీద నల్లని టోపీలాగా వుంది. భర్తని చూసినప్పుడెప్పుడూ జరిగేటట్టుగానే ఆమె ఉల్లాసం అంతా అదృశ్యమైపోయింది. ఆమె తల వాల్చుకుని ఆందోళనగా బెట్సీ కేసి చూసింది. బెట్సీ నవనాగరికంగా ముస్తాబై వుంది. ఆమె తలమీద పెద్ద టోపీ దీపం షేడ్‌లాగా అనింది. ఆమె నీలంరంగు ఫ్రాక్ తొడుక్కుంది. దానిమీద చారలు వొకవేపూ, చోళిమీద చారలు మరో వేపూ వున్నాయి. ఆమె బొమ్మ నిటారుగా పెట్టి సోఫామీద అన్నా పక్కన కూర్చుంది. ఆమె తల వంకించి వెటకారంగా చిరునవ్వు నవ్వుతూ కరేనిన్‌ని చూసింది.

"ఓహ్" అని ఆమె ఆశ్చర్యపోతున్నట్టుగా అంది. "మిమ్మల్ని యింటి దగ్గర చూడ్డం నాకు చాలా సంతోషంగా వుంది. మీరు యెక్కడికీ రావడమే లేదు, దాంతో అన్నా జబ్బు పడిం దగ్గర నుంచీ మీరు కనిపించనే లేదు. కాని మీ గురించి అంతా విన్నాను. మీరు ఆమె గురించి యెంత శ్రద్ధ పట్టేంది విన్నాను. మీలాంటి భర్త మాటకీ కోటికీ గాని దొరకరు" అని ఆప్యాయంగా, అర్థవంతంగా వుండే గొంతుకతో, తను అతనికి విశాలహృదయుడన్న పతకం ప్రదానం చేస్తున్నట్టుగా, అంది.

కరేనిన్ అంత పట్టించుకోనట్టుగా వంగి వందనం చేసి భార్య చేతిని ముద్దుపెట్టుకుని యెలా వుందని అడిగేడు.

"బాగానే వున్నట్టుంది" అని అతని కళ్ల కేసి చూడకుండా ఆమె జవాబు చెప్పింది.

"కాని మీ ముఖం జ్వరం వచ్చినట్టు కనిపిస్తోంది" అన్నాడు "జ్వరం" అనే మాటని వొత్తి పలుకుతూ.

"మేమిద్దరం యెక్కువగా మాట్లాడుకుంటున్నాం. యిది నా స్వార్థమే. అందుకని యిక నేను దిగడతా" అంది బెట్సీ.

ఆమె లేచి నుంచుంది. కాని అన్నా హఠాత్తుగా సిగ్గు పడుతూ గబుక్కున ఆమె చేతిని పట్టుకుంది.

"అబ్బే, అప్పుడేనా కొంచెం సేపు ఆగండి. నేను మీతో మాట్లాడాలి, వుహుఁ మీతో" అంది కరేనిన్ కేసి తిరిగి. సిగ్గుతో ఆమె మెడ, నుదురు యెర్రబడ్డాయి. "నేను మీనుంచి యేమీ దాచుకోను, దాచుకోలేను నిజానికి" అంది.

కరేనిన్ మెటికలు విరుచుకుని తల పంకించేడు.

"తాష్కెంట్‌కి వెళ్లిపోయే ముందు యిక్కడికి వచ్చి సెలవు చెప్పి పోదామని కౌంట్ వ్రాన్‌స్కీ అనుకుంటున్నాడని బెట్సీ అంది" ఆమె భర్త కేసి చూడలేదు. తను చెప్పదలచుకున్నది యెంత కష్టమైందైనా గానీ చెప్పెయ్యాలని తాను త్వరపడుతున్నట్టు కనిపించింది. "అతన్ని కలుసుకోలేనని ఆమెకి చెప్పాను" అంది.

"లేదమ్మా, కరేనిన్‌గారిమీద ఆధారపడి వుందని మీరు అన్నారు" అని బెట్సీ ఆమెని సవరించింది.

"లేదు, నేను అతన్ని కలుసుకోను, యేమీ వొరగదు దానివల్ల..." ఆమె హఠాత్తుగా ఆగిపోయింది, భర్త కేసి ప్రశ్నార్థకంగా చూసింది. (అతను ఆమె కేసి చూడడం లేదు.) "వొక్క ముక్కలో నాకు యిష్టం లేదు..."

కరేనిన్ ఆమె దగ్గరికి వెళ్లి ఆమె చెయ్యి అందుకోడానికి చెయ్యి చాచేడు.

పొంగరించిన నరాలతో వేళ్లు చెమ్మగా వున్న ఆ చేతినుంచి అన్నా మొదట తన చేతిని లాగేసుకుంది. కాని తర్వాత తనే ప్రయత్నపూర్వకంగా అతని చేతిని అదిమింది.

"నామీద ఆ మాత్రం నమ్మకం వుంచినందుకు సంతోషం కాని..." అని అతను అన్నాడు. తను వొక్కడూ వున్నప్పుడు యెంతో తేటతెల్లంగా, సాదాగా కనిపించిన నిర్ణయం బెట్సీ వుండగా చర్చించడం కుదరడం లేదని గ్రహించి చిరాకు పడ్డాడు. కారణం యేమిటంటే ఉన్నత సమాజం దృష్టిలో తన జీవిత సంచాలనం చేసే కఠోర శక్తి, తను ప్రేమ, క్షమ లాంటి వాటికి అర్పితం కాకుండా అడ్డగించే ఆ కఠోర శక్తి మూర్తికా రూపం బెట్సీ అని అతని భావన. అతను ఆమె కేసి చూస్తూ మధ్యలోనే ఆపేశాడు.

"వుఁ, సెలవు డార్లింగ్" అంది బెట్సీ లేచి నుంచుంటూ. ఆమె అన్నాని ముద్దు పెట్టుకుని వెళ్లిపోయింది. కరేనిన్ ఆమెతో కూడా వెళ్లాడు.

"కరేనిన్‌గారూ! మీరు నిజంగా దయాంతఃకరణ కలవారని నాకు తెలుసు" అని చిన్న డ్రాయింగు రూమ్‌లో మరోసారి యెంతో ఆప్యాయంగా అతని చేతిని అదుముతూ అంది. "నేను పరాయిదాన్నే అనుకోండి, కాని అన్నా అంటే నాకు యెంతో ప్రేమ, మీరు అంటే నాకెంతో గౌరవం వుండడం వల్ల సలహా యిచ్చే సాహసం చేస్తున్నాను. అతన్ని యిక్కడికి రానివ్వండి. వ్రాన్‌స్కీ ప్రతిష్ఠకి మూర్తిమంత రూపం, అతను తాష్కెంట్ వెళ్లిపోతున్నాడు" అంది.

"మీ ఆదరాభిమానాలకి సలహాకి సంతోషం ప్రిన్సెస్, కాని యెవర్ని కలుసుకోవాలో, కలుసుకో అక్కర్లేదో అనే విషయం తెల్చుకోవలసింది మా ఆవిడే" అన్నాడు.

కరేనిన్ కనుబొమలు యెత్తి గౌరవంగా ఉచితమైన మాటలు అన్నాడు. కాని అదే సమయంలో, మాటలు యేమైనా గానీ ప్రస్తుత పరిస్థితిలో గౌరవం అనే ప్రశ్నే లేదని అతనికి ఆలోచన స్ఫురించింది. తను మాట్లాడిన తర్వాత బెట్సీ ఆపుకుని ఆపుకుని వికటంగా, వ్యంగ్యంగా చిరునవ్వు నవ్వుతూ అతని కేసి చూసిన చూపులో అతను దాన్ని చూశాడు.

20

కరేనిన్ పెద్దహాల్లో బెట్సీకి వీడ్కోలు చెప్పి తిరిగి మళ్లీ భార్య దగ్గరికి వెళ్లాడు. ఆమె పడుకుంది. కాని అతని అడుగుల చప్పుడు వినిపించగానే గబగబా లేచి కూర్చుంది. అతని కేసి బెదురుతూ చూసింది. ఆమె యేడుస్తూ వుందని అతను గ్రహించేడు.

"నామీద నమ్మకం వుంచినందుకు సంతోషం" అని అతను బెట్సీ వుండగా ఫ్రెంచిలో అన్నదాన్ని రష్యన్‌లో రెట్టించేడు. అతను రష్యన్‌లో మాట్లాడితే "నువ్వు" అంటాడు. "నువ్వు" అనే ఆ మాట అన్నాకి తప్పకుండా మంటగా వుంటుంది. "నువ్వు తీసుకున్న నిర్ణయానికీ చాలా సంతోషం. తను యెలాగూ వెళ్లిపోతున్నాడు కాబట్టి కౌంట్ వ్రాన్‌స్కీ యిక్కడికి రావడం యేమీ అవసరం లేదనే నాకు అనిపిస్తూ వుంది, యేమైనా..."

"నేనే ఆ విషయం చెప్పేశాను కదా, యిక రెట్టించవలసిన అవసరం యేముంది?" అని ఆమె ఆపుకోలేని చిరాకుతో అంది. 'యేమీ అవసరం లేదు' అని తనలో తను అనుకుంది. 'తను ప్రేమించే ఆడమనిషి దగ్గరికి వెళ్లి సెలవు తీసుకునే అవసరం లేదు, యెవర్ల కోసం అయితే చనిపోవాల నుకున్నాడో, యెవరు లేకుండా తను బతకలేడో ఆ మనిషి దగ్గరికి వెళ్లి వీడ్కోలు తీసుకునే అవసరం లేదు! వుహుం, అవసరం లేదు' అనుకొంది. ఆమె పెదవి కొరుక్కుంది. పొంగరించిన నరాలు వున్న అతని చేతులమీదకి చూపు పోనిచ్చింది. అతను మెల్లిగా ఒక చేత్తో మరో చేతిని నలుపు కుంటున్నాడు.

"యీ విషయం గురించి యిక చర్చించుకోవద్దు" అని మరింత శాంతంగా వుండే గొంతుకతో అంది.

"యీ విషయం పరిష్కరించుకోవడం పూర్తిగా నీకు వదిలేశాను, నాకు సంతోషం కలిగింది యేమంటే..." అని కరేనిన్ మొదలుపెట్టాడు.

"నా కోరిక మీ కోరిక వొకటే అయింది" అని ఆమె గబగబ పూర్తి చేసింది, అతను నానుస్తూ మాట్లాడ్డంతో చిరాకు పుట్టి ముఖ్యంగా యే మాట చివరికి వస్తుందో తెలిసినందుకు.

"ఆఁ" అని వత్తాసు యిచ్చేడు. "చాలా చిక్కులతో వున్న సొంత వ్యవహారాల్లో ప్రిన్సెస్ బెట్సీ జోక్యం కలిగించుకోవడం యేమీ సబబుగా లేదని నాకనిపించింది. ఆమె ముఖ్యంగా..."

"ఆమెని గురించి లోకులు యేమనుకున్నా, వొక్క ముక్క కూడా నేను నమ్మను" అంది ఆన్నా గలగలా. "నేనంటే ఆమెకి మనస్ఫూర్తిగా యిష్టం" అంది.

కరేనిన్ హమ్మురని నిట్టూర్చి యేమీ మాట్లాడలేదు. ఆమె ఆందోళనగా గౌను కుచ్చెళ్లతో ఆడుకుంది. అతని కేసి లోపలినుంచి పుట్టుకువచ్చే వెలపర భావంతో చూసింది, అలాంటి ఛాయ కలిగినందుకు తనని తను తిట్టుకుంది, కాని దాన్ని దమించుకోలేకపోయింది. ఆమెకి ఆ సమయంలో వొక్కటే కావాల్సి వచ్చింది, వెలపరం పుట్టించే అతని సన్నిధి తొలగిపోవడం.

"డాక్టరు కోసం కబురు పెట్టాను" అన్నాడు.

"నాకు బాగానే వుంది. నాకెందుకు డాక్టరు?"

"నీ కోసం కాదు, చంటి పిల్ల కోసం. ఆయా చెప్పడం దాది దగ్గర పాలు లేవని."

"నేను చంటి దానికి పాలిస్తాను మొర్రో అంటే యివ్వనివ్వలేదు. పోనీ ఫర్లేదు" (యీ పోనీ ఫర్లేదు అనే దాని ప్రాముఖ్యం కరేనిన్ గ్రహించేడు.) "అదేమో చంటిది, ఆకలికి మాడుతోంది" అని ఆమె గంట మోగించి చంటి పిల్లని తీసుకురమ్మని పురమాయించింది. "నేను పాలిస్తానంటే వొప్పుకోలేదు, యిప్పుడు నన్ను తప్పు పట్టుకుంటున్నారు" అంది.

"నిన్నేం తప్పట్టు కోలేదు..."

"ఆఁ, పట్టుకున్నావు! ఓయ్, భగవంతుడా! నాకు చావెందుకు వొచ్చింది కాదు?" అని భోరుమంది. "క్షమించండి, నాకు చిరాగ్గా వుంది, అన్యాయంగా మాట్లాడుతున్నాను" అని సంబాళించుకుంటూ అంది. "కాని, నువ్వు వెళ్ళ..."

'లాభం లేదు, యిలా సాగడం కుదరదు' అని కరేనిన్ భార్య గదిలోనుంచి బయటికి వెడుతూ తీర్మానం చేసుకుంటున్నట్టు తనలో తను అనుకున్నాడు.

ఉన్నత సమాజం దృష్టిలో తన స్థితి అసాధ్యత, తన పట్ల తన భార్య యేవగింపు, తన మనఃస్థితికి వ్యతిరేకంగా తన జీవితాన్ని నిర్దేశిస్తూ పూర్తిగా తన యిచ్ఛని, అలాగే భార్య పట్ల తన వైఖరిని మార్చుకోవాలని అభ్యర్థిస్తోందో ఆ సర్వ శక్తివంతమైన నిగూఢ కఠోర శక్తి యివాళ్టిలాగా యింత స్పష్టంగా ఉగ్రరూపంలో అతని ముందు యెన్నడు ప్రత్యక్షం అవలేదు. ఉన్నత సమాజం, తన భార్య తన నుంచి దేన్నో ఆపేక్షిస్తున్నారు, కాని అది యేమిటైందీ కచ్చితంగా అతనికి తెలీలేదు. యీ కారణంవల్లనే అతని మనసులో క్రోధభావం పుడుతోంది. అదే అతని మనశ్శాంతిని, ఔదార్య ఫలితాన్ని నష్టపరుస్తోంది. వ్రాన్‌స్కీతో సంబంధాల్ని తెంచుకోవడం ఆన్నాకి ఉచితంగా వుంటుందని అనుకున్నాడు. కాని అలాంటిది అసంభవం అని ప్రతి వాళ్ళ అనుకుంటే, పిల్లలు అవమానం పొందకుండా వున్నంత కాలం, వాళ్ళని తననుంచి వంచించకుండా వున్నంత కాలం, తన స్థితిలో మార్పు చేసుకునే అవసరం రానంత కాలం ఆ సంబంధాలని పునరుద్ధరించడానికీ తయారుగానే వున్నాడు. యిది చాలా

చెడ్డగానే వుండచ్చు. కాని అన్నాని విస్సపోయు, లజ్జాజనక స్థితిలో పడవేసే సంబంధ విచ్ఛేదం కంటే, తనకి ప్రియమైన అన్నిటినుంచీ తనని వంచించడం జరిగే దాని కంటే అదే మెరుగు. కాని తను విపత్కర్తైనట్టుగా వుండదలచి. తనకి యివ్వారు స్వాభావికంగా, మంచిగా కనిపించే దాన్ని చెయ్యనివ్వరని, ప్రతి వాళ్ళూ తనకి వ్యతిరేకం అవుతారని అతనికి ముందుగానే తెలుసు. తన చెడ్డదాన్ని చేసేటట్టు చేస్తారు, కాని వాళ్ళ దృష్టిలో అది తన కర్తవ్యం.

21

బెట్సీ యింకా పెద్దహాల్లోనుంచి బయటికి వెళ్ళకుండానే గుమ్మం దగ్గర అబ్లాన్‌స్కీ తగిలేడు. అతను పీచు గుల్లలు అమ్మే యెలిసేయెవ్ దుకాణంనుంచి అప్పుడే వచ్చేడు.

"హాయ్! ప్రిన్సెస్! యెంత చిత్రంగా వుంది మిమ్మల్ని కలుసుకోవడం! నేను మీ యింటికి వెళ్ళే వస్తున్నాను" అన్నాడు.

"ఓ నిముషం సేపు కలుసుకోవడమే, నేను వెళ్ళిపోతున్నా" అని ఆమె గ్లవ్ తొడుక్కుంటూ అంది.

"ప్రిన్సెస్, గ్లవ్స్ తొడుక్కోవడానికి తొందర పడకండి, ముందు మీ చేతిని ముద్దు పెట్టుకోనివ్వండి. పాత ఆచారాల్ని పునరుద్ధరిస్తున్నారు కాబట్టి, చేతిని ముద్దుపెట్టుకునే ఆచారం కంటే ఘనమైంది లేదంటాను" అని బెట్సీ చేతిని ముద్దుపెట్టుకున్నాడు. "యెప్పుడు దర్శనం చెయ్యను?"

"ఆ లాయకీ లేదు తమకి" అని బెట్సీ అంది చిరునవ్వు నవ్వుతూ.

"అయ్యో, లేకపోవడం యేమిటి? చాలా వుంది. నేను చాలా సీరియస్ మనిషిని అయాను. నా సొంత వ్యవహారాల్నే కాదు, యితరుల వ్యవహారాల్ని తృప్తిగానే పర్దుబాటు చేస్తూ వున్నాను" అని అర్థవంతంగా చూశాడు.

"ఓ, నాకు చాలా సంతోషంగా వుంది" అంది బెట్సీ, అతను అన్నాని ఉద్దేశించి మాట్లాడుతున్నాడని వెంటనే వూహించింది. వాళ్ళు హాల్లో ఓ మూలకి వెళ్ళారు. "అతను ఆమెని చంపేస్తున్నాడు!" అని అర్థవంతంగా ధ్వనించేటట్టు గుసగుసలాడింది. "యిలా బతకడం అసంభవం, అసంభవం..."

"మీరు అలా అర్థం చేసుకున్నారు, సంతోషం" అని అబ్లాన్‌స్కీ గంభీరంగా బాధ ద్యోతకమయే చూపు చూస్తూ తల ఆడించి అన్నాడు. "అందుకనే నేను పీటర్స్‌బుర్గ్ వచ్చేను" అన్నాడు.

"వూరు వూరంతా యీ విషయం గురించే మాట్లాడుకుంటున్నారు" అందామె. "యీ పరిస్థితి అసంభవంగా వుంది. ఆమె కుష్కించి పోతోంది. అన్నా ప్రేమని తెలిగ్గా

తీసుకునే రకం ఆడవాళ్ళలాంటిది కాదని అతనికి అర్థమయి చావదు. యేదో వొకటే అవాలి: అతను పట్టుగా వుండి యెక్కడికేనా తనతోబాటు తీసుకుపోవేనా తీసుకుపోవాలి లేదా విడాకులేనా యివ్వాలి. ప్రస్తుత పరిస్థితిలో అన్నా ఉక్కిరిబిక్కిరి అయిపోతుంది" అంది.

"అవును; అవును... నిజమే..." అని అబ్లాన్‌స్కీ నిట్టూరుస్తూ అన్నాడు. "అందుకనే వచ్చేను. అంటే కేవలం యిందు కోసమనే కాదు... నన్ను కామ్మెర్‌హెర్* చేశారు. అందుచేత వాళ్ళనీ వాళ్ళనీ చూసి కృతజ్ఞతలు చెప్పుకోవాలి కదా. కాని ముఖ్య విషయం ఆమె సంగతులు సర్దుబాటు చెయ్యడం" అన్నాడు.

"దేవుడు మీకు సాయం చెయ్యాలని కోరుతున్నాను" అంది బెట్సీ.

బెట్సీని బయటి దాకా సాగనంపి, మరోసారి వాడి కొట్టుకునే చేతి భాగంలో మణికట్టు దగ్గర గ్లవ్‌పైన ముద్దుపెట్టుకుని కొంటె మాటలేవో అన్నాడు. వాటిని విని నవ్వాలో కోప్పడాలో ఆమెకి తెలీలేదు. అలా అన్నాక అతను అక్కగారి గది దగ్గరికి వెళ్లాడు. ఆమె యేడుస్తూ కనిపించింది.

అబ్లాన్‌స్కీ రావడం ఉత్సాహంగా వచ్చినా అన్నా మనఃస్థితికి అనురూపంగా వుండేటట్టు సానుభూతి పూర్వకంగా, కవితావేశ పూరితంగా స్వాభావికంగా మారేడు. ఆమెని యెలా వుందని అడిగి, ఆ ఉదయం యెలా గడిపిందని అడిగేడు.

"రోతగా, రోతగా. పగలు, ఉదయం, గడిచిన రోజులు, రాబోయే రోజులు కూడా" అని అన్నా జవాబు చెప్పింది.

"నువ్వు విచారంగా వుండిపోతున్నావనిపిస్తోంది నాకు. నువ్వు దిగమింగుకోవాలి, బతుకుని బతుకులా చూడాలి. నాకు తెలుసు యెంత కష్టమో కాని..."

"ఆడవాళ్ళు మగాళ్ళని వాళ్ళ చెడుగులకి కూడా ప్రేమిస్తారని విన్నాను" అని ఆమె వున్నట్టుండి అంది. "కాని ఆయన సుగుణాలకి ఆయన్ని అసహ్యించుకుంటున్నాను. ఆయనతో కలిసి వుండలేను. నువ్వే చూడు, ఆయన ముఖం చూస్తేనే నా నరనరానా మంట పుడుతుంది. నేను ఆయనతో వుండలేను, వుండలేను, వుండలేను. నేను యేం చెయ్యను? నేను నిర్భాగ్యురాల్ని, యింత కంటె నిర్భాగ్యురాలుగా వుండలేనని అనుకున్నా. కాని నేను ప్రస్తుతం వున్న పరిస్థితి దారుణం అయింది వుండదు, అలాంటిదాన్ని వూహించుకోను కూడా వూహించలేను. ఆయన యెంత మంచివాడో, అద్భుతమైన మనిషో తెలిసీ, నేను ఆయన చిటికిన వేలి గోటిపాటి చెయ్యనని తెలిసీ యెలా ఆయన్ని అసహ్యించుకోగలుగుతున్నాను? ఆయన ఔదార్యానికి ఆయన్ని యేవగించుకుంటున్నాను. నాకు సంబంధించి మిగిలింది యేదీ లేదు, యిక..."

"చావు తప్ప" అని ఆమె వుండేదే. కాని అబ్లాన్‌స్కీ ఆమెని పూర్తి చెయ్యనివ్వలేదు.

"నువ్వు హెంట్లో బాగా లేక ఆవేశపడుతున్నావు. నువ్వు గోరంతలు కొండంతలు చేస్తున్నావు. అంత భయంకరమైంది యేమీ లేదిప్పుడు" అన్నాడు.

అని అబ్లాన్‌స్కీ చిరునవ్వు నవ్వేడు. అలాంటి హతాశాపూరిత స్థితి ముందు అబ్లాన్‌స్కీ చోట్లో వేరే యెవళ్ళన్నా చిరునవ్వు నవ్వి వుండేవాళ్ళు కాదు (చిరునవ్వు నవ్వడం చాలా క్రూరం) కాని అతని చిరునవ్వులో యెంతో దయ, దాదాపు స్త్రీసమ కోమలత్వం వుండడంతో అది కష్టం కలిగించలేదు సరికదా వూరడించింది, ఓదార్చింది. వూరడింపుగా అతను సాఫీగా అన్న మాటలు, చిరునవ్వు నవనీతంలాగా పనిచేశాయి. అన్నాకి అది క్షణం అనుభవంలోకి వచ్చింది.

"లేదు, స్తీవా, నేను నాశనం అయిపోయాను. నాశనం అయిపోయాను. అంత కంటే అధ్వాన్నంగా వుంది నా స్థితి. అంతా ముగిసిందని అనలేను. తద్విరుద్ధంగా అంతా పూర్తిగా అంతం కాలేదే అని నాకే అనిపిస్తోంది. బాగా పురిపెట్టిన తాడులా వున్నాను, యెప్పుడేనా పుటుక్కున తెగిపోవచ్చు. యింకా అంతా ముగిసిపోలేదు, అంతం భయంకరంగా వుంటుంది" అంది.

"మరేం ఫరవా లేదు, నిబ్బరించుకో. తాడుని వదులు చెయ్యవచ్చులే. పరిష్కారం లేని చిక్కులంటూ వుండవులే."

"నేను యెంతో ఆలోచించేను, ఒక్కటే మార్గం..."

ఆమె భయకంపిత వదనం చూసి ఆమె చూడగలిగే వొక్క మార్గమూ మృత్యువు అని అతను గ్రహించేడు. అతను ఆమెని చెప్పనివ్వలేదు.

"యేం కాదు" అన్నాడతను. "నువ్వు నీ అంతట నీ పరిస్థితిని అంచనా కట్టలేవు. అసలు నేనేమనుకుంటున్నదీ చెప్పని" అని మరోసారి నవనీతంలాంటి చిరునవ్వు నవ్వేడు. "నేను ఓం ప్రథమంనుంచీ మొదలుపెడతాను. నీకంటే వయసులో యిరవై యేళ్ళు పెద్ద వాడైన అతన్ని పెళ్ళి చేసుకున్నావు. ప్రేమించకుండా పెళ్ళి చేసుకున్నావు, ప్రేమంటే యేమిటో తెలీకుండా. అది మరి తప్పే కదా?"

"భయంకరమైన తప్పు" అంది అన్నా.

"నే మళ్ళీ అంటున్నా. యిది వొక వాస్తవం. తర్వాత దురదృష్టవశాత్తూ నువ్వు ఆ మనిషిని ప్రేమించావు. దురదృష్టమే, కాని అదీ వాస్తవమే. నీ భర్త యీ వాస్తవాన్ని గుర్తించేడు, నిన్ను క్షమించేడు" అతను ప్రతి వాక్యం తర్వాతా ఆగేడు, ఆమె అభ్యంతరం చెపుతుందేమోనని చూస్తూ. కాని ఆమె యేమీ అనలేదు. "అంచేత పరిస్థితి యిదీ. ప్రస్తుతం సమస్య యేదంటే నువ్వు నీ భర్తతోబాటు యిక్కడ వుండగలవా లేదా? నీకలా వుండాలని వుందా లేదా? అతను అలా వుండాలనుకుంటున్నాడా లేదా?"

"నాకేం తెలీదు, నాకేం తెలీదు."

"కాని నువ్వే అన్నావు కదా దీన్ని భరించలేకుండా వున్నానని."

"లేదు, నేనేం అనలేదు, ఆ మాటని ఖండిస్తున్నాను. నాకేం తెలీదు, నాకేం అర్థం కాదు."

"కాని చూడు..."

"నువ్వు అర్థం చేసుకోలేవు. తలకిందులుగా అగాధంలోకి పడిపోతున్నట్టుగా వుంది, కాని నన్ను రక్షించవద్దు. రక్షించుకోలేను కూడా."

"భయపడకు, నిన్ను యెలాగైనా అగాధంలో పడకుండా రక్షిస్తాం. నీ దుస్థితిని నేను అర్థం చేసుకున్నాను. నీకేం కావాలో నువ్వే మనుకుంటున్నావో చెప్పలేకుండా వున్నావు."

"నాకేమీ యేమీ అక్కర్లేదు, యిది అంతం అయిపోవాలన్న పొక్కట్ తప్ప."

"కాని అతను దీన్ని చూస్తూనే వున్నాడు, తెలుసుకుంటూనే వున్నాడు. అతని బాధ నీ బాధకంటే తక్కువ అనుకుంటున్నావా? అతనూ క్షోభ పడుతున్నాడు, నువ్వూ క్షోభ పడుతు న్నావు. కాని దీని ఫలితం యేమిటవుతుంది? విడాకులు యీ చిక్కునంతటినీ విడదీస్తాయి" అన్నాడు. తను అనుకుంటూ వున్న ముఖ్య విషయాన్ని యెలాగో చెప్పేశాడు, చెప్పేసి అర్థ వంతంగా ఆమె కేసే చూశాడు.

ఆమే యే జవాబూ చెప్పలేదు. చిన్నగా కత్తిరించిన జుట్టు వున్న తలని వూపిందంతే. కాని వున్నట్టుండి పూర్వం వుండే మాదిరి సౌందర్యంతో మెరిసే ముఖంమీద కనిపించిన భావాన్ని బట్టి అన్నా అది తనకి అందుకోలేని ఆనందం కావడంవల్ల మాత్రమే దాన్ని కోరుకోవడం లేదని అతనికి అర్థం అయింది.

"మీ యిద్దర్నీ చూస్తూ వుంటే నాకు చెప్పలేనంత విచారంగా వుంది. యీ చిక్కు విడదియ్యగలిగితే నాకెంత సంతోషంగా వుంటుంది!" అని అబ్లాన్‌స్కీ మరింత ధైర్యంగా చిరునవ్వు నవ్వుతూ అన్నాడు. 'వుహూఁ, నువ్వు యేమీ, యేమీ అనవద్దు. నేను అనుకుంటూ వున్న దాన్ని మాటల్లో చెప్పగలిగే శక్తిని భగవంతుడు నాకు యిస్తే యెంత బాగుండును! నేను అతని దగ్గరికి వెడతాను" అన్నాడు.

అన్నా అతని కేసి చమక్‌మని మెరిసే ఆలోచనా మగ్న నేత్రాలతో చూసింది. యేమీ మాట్లాడలేదు.

22

బోర్డు మీటింగుల్లో అధ్యక్షస్థానంలో కూర్చున్నప్పుడు కనిపించే గంభీర ధోరణిలో అబ్లాన్‌స్కీ బావగారి చదువుకునే గదిలోకి వెళ్లాడు. కరేనిన్ చేతులు వెనక్కి కట్టుకుని గదిలో అటూ యిటూ పచారు చేస్తున్నాడు. అబ్లాన్‌స్కీ అన్నాతో చర్చిస్తూ వున్న విష యాం గురించే కరేనిన్ ఆలోచిస్తూ వున్నాడు.

''అంతరాయం కలిగించడం లేదు కదా?'' అని అబ్లాన్‌స్కీ బావగార్ని చూసి యెందుకో తెలియకుండానే బెదురు పుట్టినట్టు అనిపిస్తూ అడిగేడు. ఆ బెదుర్ని కప్పి పుచ్చుకుందుకు అతను కొత్తగా కొన్న సిగరెట్ పెట్టెని తీసి తోలు వాసన చూసి సిగరెట్టొకటి తీసుకున్నాడు. ఆ సిగరెట్ పెట్టెకి మూత తెరిచే పద్ధతి కొత్తగా వుంది.

''లేదు, నాతో యేమన్నా పని వుందా?'' అని కరేనిన్ తుంపేస్తున్నట్టుగా అడిగేడు.

''ఆఁ, నేననుకున్నా... నాకు మాట... మాట్లాడాల్సి వుంది'' అని, తనకే ఆశ్చర్యం కలిగేటట్టు, యెన్నడూ యెరగని బెరుకుతో అన్నాడు.

ఆ బెదురు చాలా వింతగా, దానంతట అదే వచ్చింది. అందులో తను చెయ్యబోతున్నది పాప కార్యం అని చెప్పే అతని అంతరాత్మ గొంతుకని అతను గుర్తుపట్టలేకపోయాడు. ఆ బెరుకుని అధిగమించడానికి చాలా ప్రయాసపడ్డాడు.

''మా అక్కపట్ల నాకు వున్న ప్రేమ గురించీ, మీ పట్ల నాకు గల ఆదరాభిమానాల గురించీ అనుమానం వుండదను కుంటున్నాను'' అని బెరుకుతో యెర్రబడుతూ అన్నాడు.

కరేనిన్ పచార్లు చెయ్యడం ఆపేడు, యేం మాట్లాడలేదు. నేను నా ఖర్మకి బలి అయిపోయాను అన్న భావం అతని ముఖంలో ద్యోతకం అయి అబ్లాన్‌స్కీ చకితుడైపోయాడు.

''నా ఉద్దేశ్యం, అంటే, అక్కకీ మీకూ మధ్య వున్న సంబంధాల గురించి చర్చించాలని నా కోరిక'' అని బెదురు పోగొట్టుకోవడానికి యింకా తంటాలు పడుతూ అన్నాడు అబ్లాన్‌స్కీ.

కరేనిన్ విచారంగా చిరునవ్వు నవ్వేడు. యేమీ మాట్లాడకుండా బావమరిది కేసి చూసి మేజా దగ్గరికి వెళ్లేడు. తను రాస్తూ వున్న ఉత్తరాన్ని తీసి బావమరిదికి యిచ్చేడు.

''నేను నిరంతరంగా దీన్ని గురించే ఆలోచిస్తున్నాను. యిదిగో నేను రాసింది యిదీ. నాకు సంబంధించి రాతలో నా మనసులో వున్నది పెట్టడం బాగుంటుంద నిపిస్తుంది, యేమంటే నేను యెదర వుండడమే ఆమెకి కారం రాసుకున్నట్టు వుంటుంది'' అన్నాడు దాన్ని అందిస్తూ.

అబ్లాన్‌స్కీ దాన్ని అందుకుని, తనమీదనే లగ్నమైన నిస్తేజ నేత్రాలలోకి ఆశ్చర్యంగా చూస్తూ చదవడం మొదలుపెట్టాడు.

'నేను యెదురుగుండా వుండడం మీకు మంటగా వున్నట్టు కనిపిస్తోంది. యిలా వుందని ఒప్పుకోవడం నాకు యెంత బాధాకరంగా వున్నాగానీ నాకు పరిస్థితి యిలానే కనిపిస్తోంది, దీనికంటే భిన్నంగా వుండదు. మిమ్మల్ని తప్పు పట్టను, భగవంతుడి సాక్షిగా చెప్తున్నాను

మీరు జబ్బుగా వున్నప్పుడు మిమ్మల్ని చూసి మన యిద్దరి మధ్యా జరిగిన దాన్నంతట్నీ మనస్ఫూర్తిగా మర్చిపోయి కొత్త జీవితాన్ని ప్రారంభించాలని తీర్మానించుకున్నాను. నేను చేసిన పని తప్పయి పోయిందని విచారించను, యిప్పటికీ విచారం కలగదు. నాక్కావాల్సిందల్లా వొక్కటే — మీ సుఖశాంతులు, మీ మానసిక సుఖశాంతులు. కాని నాకిప్పుడు అనిపిస్తోంది దాన్ని నేను సాధించలేకపోయానని. మీకు అసలైన ఆనందం మనశ్శాంతి యెలా లభిస్తుందో మీరే చెప్పండి. మీ యిచ్ఛకి మీ న్యాయ భావనకి పూర్తిగా లొంగిపోతున్నాను.'

అబ్లాన్‌స్కీ ఉత్తరాన్ని తిరిగి యిచ్చేసి, యేం చెప్పాలో తోచక, ముందు మాదిరి ఆశ్చర్యంతో బావగారి కేసి చూశాడు. ఆ నిశ్శబ్దం యిద్దరికీ యిబ్బందికరంగానే వుంది. కరేనిన్ ముఖం కేసే చూస్తూ మౌనంగా వుండడంతో అబ్లాన్‌స్కీ పెదాలు వొణుకుతున్నాయి.

"అదీ, నేను చెప్ప దలచుకున్నది" అని అవతలి వేపు ముఖం మళ్ళించుకుంటూ ఆఖరికి అన్నాడు కరేనిన్.

"ఆఁ... అవును..." అని కంఠం రుద్ధమైపోవడంతో అబ్లాన్‌స్కీకి యేం చెప్పడానికీ శక్తి లేకపోయింది. "ఆఁ, అవును, మీ మనసులో వున్నది నాకు అర్థమైంది" అని ఆఖరికి అనగలిగాడు.

"ఆమెకి యేం కావాలో నాకు తెలుసుకోవాలని వుంది" అన్నాడు కరేనిన్.

"ఆమెకిగా ఆమే తన స్థితి యేమిటో యెరగదని నాకు అనిపిస్తోంది. ఆమెకి యేదీ నిర్ణయం చేసుకోవడం అసాధ్యం" అని తేరుకుంటూ అన్నాడు అబ్లాన్‌స్కీ. "ఆమె మీ ఆదరతతో ఉక్కిరిబిక్కిరిగా వుంది, మునిగిపోయింది. ఆమె ఆ ఉత్తరం చదివితే యేమీ చెప్పగలగలేదు, ఆమె తల యింకా కిందుగా వాల్చేసుకుంటుంది" అన్నాడు.

"అయితే యిప్పుడు యేం చెయ్యాలి? యెలా పరిష్కరించడం? ఆమెకేం కావాలో యెలా తెలుసుకోవాలి?"

"నా అభిప్రాయం చెప్పమంటే యీ పరిస్థితికి స్వస్తి చెప్పడానికి అవసరం అని మీకు తోచిన చర్యలని సూచించడం మీ మీదే వుందని."

"అయితే నీ ఉద్దేశం దీనికి స్వస్తి చెప్పాల్సిన అవసరం వుందని?" అని కరేనిన్ అడ్డం వెళ్ళాడు. "కాని యెలా?" అని కళ్ళ ముందు చేతులతో సూచిస్తూ అడిగాడు. అలాంటిది అతనికి కొత్త.

"నాకే దారీ కనిపించడం లేదు" అన్నాడు కరేనిన్.

"యే దారీ దొరకనంతటి కష్టం యేదీ వుండదు" అని లేస్తూ, ప్రఫుల్లంగా అన్నాడు అబ్లాన్‌స్కీ. "సంబంధాలన్నిట్నీ తెంచుకుందామని నువ్వు అనుకున్న సమయం వుండింది... యిప్పుడు నీకు నమ్మకం కుదిరితే మీ యిద్దరూ వొకే చోట సుఖంగా వుండలేరని..."

"సుఖం గురించి యెవళ్ళ అర్థాలు వాళ్ళకి వుంటాయి. కాని చూడు, నేను ప్రతి

దానికే వూ అంటాను, నాకుగా యేమీ కావాలని కోరను. అప్పుడు మా పరిస్థితికి పరిష్కారం యేమిటి?"

"నన్నడిగితే" అని ఆప్యాతో మాట్లాడినప్పుడు నవ్వినలాంటి నవనీత మందహాసం చేస్తూ అన్నాడు అబ్లాన్‌స్కీ. ఆ చిరునవ్వు యెంతో విశ్వాసాన్ని పుట్టిస్తుంది. తన బలహీనత తెలిసిన కరేనిన్ దానికి లొంగిపోతూ, అబ్లాన్‌స్కీ యేం చెప్పినా వొప్పుకోవడానికి తయార యేడు. "నన్నడిగితే వొక్కటే అవకాశం వుంది" అన్నాడు. "తను వొప్పుకోకపోయినా ఆమెకి కావాల్సింది వొక్కటే. మీ యిద్దరి సంబంధాలవీ, వాటితో మిళితమై వున్న స్మృతుల్నీ అంతం చేసుకోవడం. ప్రస్తుత స్థితిలో కొత్త సంబంధాలని యేర్పాటు చేసుకోవడం అవసరం. యీ నూతన సంబంధం ఉభయ పక్షాలూ స్వతంత్రులైనప్పుడు సాధ్యం" అన్నాడు.

"విడాకులు" అని కరేనిన్ ఘృణ భావంతో అడ్డం వెళ్ళాడు.

"అవును, నేననుకోవడం విడాకులు వొక్కటే మార్గం" అని అబ్లాన్‌స్కీ సిగ్గుతో యెర్రబడుతూ అన్నాడు. "మీ యిద్దరూ వున్న స్థితిలో వుండే ప్రతి వాళ్ళకీ, యే దృష్టితో చూసినా యిదే అత్యుత్తమ మార్గంగా కనిపిస్తుంది. దంపతులిద్దరికీ కలిసి బతకలేమని తెలిసినప్పుడు మరిక మార్గం యేమిటి? అలాంటిది యెప్పుడేనా జరగచ్చు." కరేనిన్ గాఢంగా నిట్టూర్చి కళ్ళు మూసుకున్నాడు. "ఒక్కటే దృష్టిలో వుంచుకోవాల్సిన విషయంగా వుంది – భార్యా భర్తల్లో యెవళ్ళేనా వేరే వాళ్ళని పెళ్ళి చేసుకోవాలనుకుంటున్నారా లేదా అనేది. అలా కాకపోయినట్లయితే అంతా చాలా సీదా సాదాగా వుంటుంది" అని బెరుకు తగ్గి నిబ్బరం పుంజుకుంటూ అన్నాడు అబ్లాన్‌స్కీ.

కరేనిన్ ఆవేశపడి కనుబొమలు ముడిచి యేదో తనలో తను గొణుక్కుని యేమీ మాట్లాడలేదు. అబ్లాన్‌స్కీకి అంత సులభంగా కనిపించిన దాన్ని అతను కొన్ని వేల సార్లు ఆలోచించాడు. అతనికి యిది సీదా సాదాగా కనిపించలేదు సరికదా చాలా కష్టభూయిష్టంగా వుంది. యిప్పుడు విడాకుల విషయం కూలంకషంగా సర్వమూ తెలియ వచ్చింది. అంచేత అది అసంభవంగా కనిపించింది. యేమంటే తన ఆత్మ గౌరవభావన, ధర్మం పట్ల వున్న గౌరవం అసత్యపూరిత వ్యభిచార అపరాధాన్ని నెత్తిమీద మోపుకోనివ్వవు, పైగా తను ప్రేమించి క్షమాదానం ప్రసాదించిన భార్యని అవమానానికీ అప్రతిష్ఠకీ గురి చెయ్యడానికి అసలు అనుమతించవు. యింకా యెక్కువ యితర ఘనమైన కారణాలవల్ల కూడా విడాకుల ఆలోచనని అతను తిరస్కరించాల్సి వచ్చింది.

విడాకులు తీసుకుంటే పిల్లాడి గతి యేమిటి? వాడ్ని తల్లి దగ్గర వదలడం పడదు. విడాకులు తీసుకున్న భార్యకి పరువులేని కొత్త కాపరం వుంటుంది. అలాంటి కాపరంలో సవతి బిడ్డ పరిస్థితి, వాడి ఆలనా పాలనా చెడిపోతాయి. కొడుకుని దగ్గరే వుంచుకుంటే? అలాంటిది పగ తీర్చుకోవడంలాగా వుంటుంది, తనకి అలా చెయ్యడం యిష్టం లేదు.

కాని విడాకులు తీసుకోవడం అతనికి అసాధ్యంగా కనిపించిన ముఖ్య కారణం విడాకులు యిస్తే అన్నా జీవితం నాశనం అయిపోతుందని. మాస్కోలో డాలీ చెప్పిన మాటలు అతను మర్చిపోలేకపోయాడు: విడాకులు తీసుకుందామని నిర్ణయించడంలో తను తన విషయమే చూసుకుంటున్నాడు గాని దానివల్ల ఆమె పుట్టి గతుర్లేకుండా నాశనం అయిపోతుందని చూడడం లేదు. ఆ మాటలు యిప్పుడు తను ఆమెని క్షమించాక, పిల్లల పట్ల బంధం యెక్కువయాక తన ధోరణిలో కొత్త అర్థంతో స్ఫురించేయి. విడాకులకి ఒప్పుకోవడం అంటే భార్యకి స్వతంత్రం యివ్వడమంటే తను ప్రేమించే పిల్లల్ని బంధించే సకల పాశాల్నీ తెంచుకోవడంగా, పుణ్యమార్గంమీద అన్నాకి ఆఖరి సహాయాన్ని లేకుండా చెయ్యడంగా అతనికి కనిపించింది. అంటే వొక్క ముక్కలో చెప్పాలంటే ఆమె పతనం అన్న మాట. అన్నాకి విడాకులంటూ వస్తే ఆమె వ్రాన్స్కీ వొళ్లో వాలిపోతుంది. ఆ సంబంధం అక్రమం, పాపపూరితం, యేమంటే చర్చి నియమాల ప్రకారం భర్త బతికి వున్నంత కాలం ఆడది మళ్లీ పెళ్లి చేసుకోవడానికి లేదు. యివన్నీ అతనికి తెలుసు. 'ఆమె వ్రాన్స్కీతో చేరుతుంది, యేదో రెండేళ్లు అయేక అతను ఆమెని వదిలి పెట్టేస్తాడు లేకపోతే ఆమె మరో సంబంధం పెట్టుకుంటుంది' అనుకున్నాడు కరేనిన్. 'విడాకులివ్వడానికి ఒప్పుకోవడం ద్వారా ఆమె నాశనానికి నేను జవాబుదారీ అవుతాను' అనుకున్నాడు. అతను యీ విషయం గురించి కొన్ని వందల సార్లు ఆలోచించేడు. విడాకులు, బావమరిది చెప్పినట్టు సాదాసీదాగా వుండకపోగా చాలా అసంభవంగా కనిపించేయి. బావమరిది చెప్పిన మాటలు అతనికి నమ్మకంగా కనిపించలేదు. అతను ముందుపెట్టిన వాదనల్లో ప్రతి మాటకీ వెయ్యేసి మాటలు జవాబు చెప్పగలడు. కాని అతను చెప్పేది అతని ప్రాపంచిక జీవితాన్ని నడిపించే ప్రబల కఠోర శక్తి అనిపిస్తోందని, దాని ముందు తల వంచాలని తెలిసే వింటూ వున్నాడు.

"సమస్య యేమిటంటే యెలాగ, యే షరతులకి నువ్వు విడాకులు యిస్తావూ అనేది. ఆమె యేమీ కోరదు, నిన్ను యేమీ అర్థించే సాహసం ఆమెకి లేదు, అంతా నీ సహృదయతమీద ఆధారపడి వుంటుంది."

'ఓరి భగవంతుడా! ఓరి భగవంతుడా!' అని కరేనిన్ విడాకుల లోతుపాతులు గుర్తుకువచ్చి లోపల్లోపల మూలిగేడు. ఆ ప్రకారం భర్త నేరం మోపుకోవాలి. వ్రాన్స్కీ చేసినట్టుగా సిగ్గుపడి అతను చేతులతో ముఖం కప్పుకున్నాడు.

"నువ్వు చాలా కుమిలిపోతున్నావు నాకు తెలుసు. కాని నువ్వు గట్టిగా యీ విషయం గురించి ఆలోచిస్తే..."

'నిన్ను కుడి చెంపమీద కొట్టు వాని వైపునకు ఎడమ చెంప కూడ త్రిప్పుము. ఎవడైన నీమీద వ్యాజ్యము వేసి నీ అంగి తీసికొన గోరిన యెడల వానికి నీ పై వస్త్రమును కూడ యిచ్చి వేయుము' అని కరేనిన్ అనుకున్నాడు.

"ఆఁ, ఆఁ" అని అతను కీచు గొంతుకతో అరిచేడు. "నేను నిందనంతటినీ నెత్తిమీద మోసుకుంటాను. కొడుకుని కూడా ఆమె దగ్గరే వుంచుకోనిస్తాను... కాని... కాని, అన్నిటికీ యిలానే వుండ నివ్వడం మెరుగ్గా వుండదా? సరే, యెలా కావాలనుకుంటే అలానే చేద్దాం."

బావమరిదికి ముఖం కనిపించకుండా వుండాలని అటు తిరిగి అతను కిటికీ దగ్గర కూర్చున్నాడు. అతనికి కటువుగా వుంది, లజ్జగా వుంది, కాని పీటికి తోడుగా అలాంటి ఔన్నత్య భరిత త్యాగంవల్ల కలిగే సుఖమాధుర్యాలు అనుభవంలోకి వచ్చేయి.

అబ్లాన్‌స్కీ చలించిపోయాడు. మాట్లాడకుండా వుండిపోయాడు.

"బావా" అని ఆఖరికి అన్నాడు. "నీ ఔదార్యాన్ని ఆమె యెంతలా సంభావిస్తుందో చెప్పలేనంటే నమ్ము. కాని యిదే భగవదేచ్ఛలాగా వున్నట్టు కనిపిస్తోంది" అని జత చేశాడు. ఆ మాట అన్నాక అది యెంత తెలివితక్కువగా వుందో తట్టి, తన తెలివితక్కువతనానికి నవ్వుకోకుండా వుండలేకపోయాడు.

కరేనిన్ యేదో చెప్పాలనుకున్నాడు కాని కన్నీళ్లు అడ్డం వచ్చేయి, అతను చెప్పలేకపోయాడు.

"యిదంతా విధి లిఖితం అని దీన్ని స్వీకరించాల్సిందే. దీన్ని యదార్థంగా అంగీకరించి, నేను నీకూ అన్నాకీ సాయం చెయ్యడానికి ప్రయత్నిస్తాను" అన్నాడు అబ్లాన్‌స్కీ.

బావగారి గదిలోనుంచి అవతలికి వెళ్లేటప్పటికి అబ్లాన్‌స్కీ చలించిపోయాడు. కాని దానివల్ల తను సాధించదలచుకున్న దాన్ని సాధించగలిగానన్న సంతోషం భగ్నం కాలేదు. కరేనిన్ తను అన్న మాట తప్పి వెనక్కి వెళ్లడని అతనికి నమ్మకం వుంది. యీ సంతోషంతో బాటుగా విడాకుల సంగతి తేలిపోయాక తన భార్యకీ, దగ్గరి మిత్రులకీ వొక పొడుపు కథని విప్పమని యిచ్చే ఆలోచన తట్టి సంతోషం కలిగింది. 'నాకూ జార్‌కీ మధ్య తేడా యేమిటి? జార్ విభజన అవసరమయే వ్యవస్థని యేర్పాటు చేస్తాడు, అది పైవ్యానికి మాత్రమే, దానివల్ల యెవళ్లకీ సుఖం వుండదు. కాని నేమా ఆ విభజనలు చేస్తాను, దాని వల్ల ముగ్గురి బతుకులు సుఖంగా గట్టున పడ్డాయి... లేదా చక్రవర్తికీ నాకూ మధ్య సమానంగా వున్నదేమిటి? అప్పుడు... సరే... యింకా బాగా వుండే వూహ చేస్తా' అని చిరునవ్వు నవ్వుతూ తనలో తను అనుకున్నాడు.

23

వ్రాన్‌స్కీకి ఛాతీమీద గుండె భాగంనుంచి గుండు తప్పిపోయినా గాయం గట్టిదే తగిలింది. కొన్ని రోజులు అతను చావు బతుకుల మధ్య పెనుగులాడేడు. మొదటి సారి నోరు తెరిచి మాట్లాడగలిగినప్పుడు వదిన వార్య వొక్కత్తే గదిలో వుంది.

"వార్య" అన్నాడతను ఆమె కేసి గుచ్చిగుచ్చి చూస్తూ.

"నేను యాదృచ్ఛికంగా కాల్చుకున్నాను. ఆ ముక్క మళ్లీ నా దగ్గర యెత్తవద్దు, యిది యాదృచ్ఛికమనే యెవళ్లైనా అడిగితే చెప్పు. లేకపోతే చాలా మూర్ఖంగా వుంటుందిది" అన్నాడు.

వార్య యేమీ జవాబు చెప్పకుండానే అతనిమీదకి వాలి అతని కళ్లల్లోకి సంతోష భరిత మందహాసంతో చూసింది. అతని కళ్లు తేటగా వున్నాయి, జ్వరగ్రస్తంగా లేవు, కాని ఆ దృక్కులో గంభీరత్వం వుంది.

"దేవుడి దయ! నీకు నొప్పిగా వుందా?" అని వార్య అడిగింది.

"కొద్దిగా, యిక్కడ" అని అతను ఛాతీ కేసి చూపించాడు.

"కట్టు మారుస్తా పోనీ."

అతను వెడల్పాటి దవడల్ని బిగబట్టి ఆమె కట్టు మారుస్తూ వుంటే మెదలకుండా ఆమె కేసి చూశాడు. కట్టడం పూర్తయాక అన్నాడు:

"నా బుర్ర చంచలంగా లేదు. నేను కావాల్సికి పిస్తోలు యెక్కుపెట్టి పేల్చుకున్నా నన్న మాట రానివ్వద్దు."

"అలాంటి మాట యేమీ లేదు. నువ్వు మళ్లీ పొరపాటున యిలా కాల్చుకోకుండా వుండాలంతే, ఆఁ?" అని ఆమె ప్రశ్నార్థ పూర్వక మందహాసం చేస్తూ అంది.

"అలా చెయ్యాననే అనుకుంటున్నాను, కాని బాగా వుండి వుండేది అప్పుడే గనక..." అంటూ అతను విచారంగా చిరునవ్వు నవ్వేడు.

వార్యని భయపెట్టిన యీ మాటలు, యీ చిరునవ్వు యెలా వున్నా జ్వరం తగ్గి అతని ఆరోగ్యం మెరుగు పడుతూనే తన దుఃఖంలో వొక భాగంనుంచి తను పూర్తిగా విముక్తుడైనట్టు అతనికి అనిపించింది. రివాల్వర్‌తో కాల్చుకోవడంద్వారా తను అనుభవించిన లజ్జనీ, అవమానాన్నీ కడిగేసుకున్నాడు. కరేనిన్‌ని గురించి శాంతంగా ఆలోచించగలిగేడు. కరేనిన్ చాలా ఉదారంగా వున్నాడని వొప్పుకోగలిగాడు, తనకి యిప్పుడు అవమానం అనిపించ లేదు. యిప్పుడు తన జీవితంలో తన పాత స్థానాన్ని తిరిగిపొందచ్చు. జనం కళ్లల్లోకి లజ్జా భావం లేకుండా చూడగలడు. తన పాత అలవాట్ల ప్రకారం బతకగలడు. తన అను భూతుంలో యెడతెగకుండా తన్నుకులాడుతున్నా వొక్క విషయాన్ని మాత్రం హృదయంలోనుంచి పెకలించుకోలేకపోయేడు అది ఆమె శాశ్వతంగా దూరం అయిపోయిందేనన్న విదారకమైన విషయం. యిప్పుడు, అన్నా భర్త ముందు తన అపరాధానికి ప్రాయశ్చిత్తం చేసుకున్నప్పుడు ఆమెని వదిలేసి యిక యెన్నటికీ అన్నాకీ, ఆమె పశ్చాత్తాపానికీ, అన్నా భర్తకీ మధ్య అడ్డం వెళ్లకూడదు. యీ విషయం గురించి అతను గట్టిగా నిర్ణయం చేసుకున్నాడు. కాని ఆమె ప్రేమ పోగొట్టుకున్న విచారాన్ని మాత్రం తన మనసులోనుంచి తొలగించుకోలేకపోయేడు,

తను ఆమెతో గడిపిన పారవశ్యపూరిత క్షణాల స్మృతుల్ని తొలగించుకోలేకపోయాడు. అప్పట్లో వాటి విలువ తెలియలేదు, యిప్పుడు అవి వెంటాడుతున్నాయి.

సెర్పుహొవ్‌స్కాయ్ అతనికి తాష్కెంట్‌లో ఉద్యోగం వేయించేడు. వొక్క క్షణం సందేహించకుండా వ్రాన్‌స్కీ అందుకు వొప్పుకున్నాడు. కాని ప్రయాణం ఘడియ దగ్గర పడే కొద్దీ, తన కర్తవ్యంగా భావించుకుంటూ వున్న ఆ త్యాగం చెయ్యడం అతనికి మరింత కష్టంగా తయారైంది.

వ్రాన్‌స్కీ గాయం మానింది. ప్రయాణానికి యేర్పాట్లు చేసుకోవడం మొదలుపెట్టాడు.

'వొక్కసారి ఆమెని కలుసుకోవా, ఆమెనుంచి కరిగిపోవా, మరణించనా' అని అతను అనుకుంటూ, బెట్సీ దగ్గర సెలవు తీసుకోవడానికి వెళ్లినప్పుడు ఆమెకి తన మనసులో వున్న సంగతి చెప్పాడు. బెట్సీ ఆ వార్తని అన్నా దగ్గరికి తీసుకువెళ్లి వీల్లేదన్న కబురు తీసుకు వచ్చింది.

'యిదీ మంచిదే' అని ఆ కబురు వచ్చేక వ్రాన్‌స్కీ అనుకున్నాడు. 'యిదో బలహీనత, నాలో మిగిలి వున్న కాస్త శక్తినీ అది హరించి వేసేది' అనుకున్నాడు.

మర్నాడు ఉదయం బెట్సీ తనే వచ్చింది. అబ్లాన్‌స్కీ వచ్చి కరేనిన్ విడాకులకి వొప్పుకున్నాడన్న సంతోషకరమైన వార్త తనకి చెప్పాడనీ, అంచేత వ్రాన్‌స్కీ వెళ్లి ఆమెని చూడవచ్చనీ చెప్పింది.

వెళ్లివస్తానని బెట్సీకి చెప్పను కూడా చెప్పకుండా, తన నిర్ణయం విషయం మర్చిపోయి, కరేనిన్ యెక్కడ వున్నాడు యేమిటీ అని అడగను కూడా అడక్కుండా, కనీసం విచారించను కూడా విచారించుకోకుండా వ్రాన్‌స్కీ కరేనిన్ యింటికి వెంటనే బయల్దేరి వెళ్లి పోయాడు. అతను దేనివంకా చూడకుండా, యెవర్నీ గురించీ దృష్టి పెట్టకుండా పరిగెత్తుకుంటూ మెట్లు యెక్కేడు. తర్వాత పరిగెత్తడం ఉచితం కాదని, కష్టంమీద వేగం తగ్గించిన అడుగులతో ఆమె గదిలోకి వెళ్లాడు. గదిలో యెవళ్లన్నా వున్నారా లేదా అనే ఆలోచన లేకుండా, చూడకుండా అతను అన్నాని చేతులతో కౌగలించుకుని ఆమె ముఖంమీద, చేతుల మీద, మెడమీద ముద్దుల వర్షం కురిపించేడు.

అన్నా అతని రాక కోసం చూస్తూనే వుంది. అతనికి యేం చెప్పాలా అని ఆలోచిస్తూ వుంది. కాని యేమీ చెప్పలేకపోయింది. వ్రాన్‌స్కీ భావావేశం అన్నానీ ముంచెత్తింది. అన్నా వ్రాన్‌స్కీనీ, తననీ సంబాళించుకుందామని అనుకుంది కాని మించిపోయింది. వ్రాన్‌స్కీ ఆవేశం ఆమెని కమ్మింది. కంపించే అధరాలతో ఆమె చాలా సేపు యేమీ అనలేకపోయింది.

"ఆఁ, నువ్వు జయించేవు. నేనిప్పుడు నీ దాన్ని" అని ఆమె అతని చేతిని ఛాతీమీద అదుముకుంటూ అంది.

"యిలానే వుండాల్సింది, మన బొందిలో ప్రాణం వున్నంత కాలం యిలానే వుండాలి. నాకిప్పుడిది తెలిసింది" అన్నాడు వ్రాన్‌స్కీ.

"యిది నిజం" అందామె యెక్కువ వివర్ణం అవుతూ, అతని తలని తన చేతిలోకి తీసుకుని. "కాని యింత జరిగిన తర్వాత యిందులో భయానకమైంది యేదో వుంది" అంది.

"సర్దుకుంటుంది, అంతా సర్దుకుంటుంది. మనం చాలా అదృష్టవంతులం అవుతాం. మన ప్రేమ, యింకా తీవ్రం గనక అయితే, అందులో భయానకం అయింది వుండబట్టే" అని అతను తల పైకి యెత్తుతూ, ముచ్చటైన పలువరస మెరుస్తూ వుండగా అన్నాడు.

ఆమె అతని మాటలకి గాక, ప్రేమ పూరితమైన నేత్రాలకి జవాబుగా చిరునవ్వు నవ్వకుండా వుండలేకపోయింది. ఆమె అతని చేతిని తీసుకుని తన చల్లని చెక్కిళ్లమీదా, కత్తిరించిన జుట్టుమీదా నిమురుకుంది.

"యీ కత్తిరించిన జుట్టుతో నిన్ను గుర్తేపట్టలేను. నువ్వు యెంత ముచ్చటగా వున్నావు! పిల్లాడిలాగా! కాని యెంత పాలిపోయావు!" అన్నాడు.

"చాలా నీరసంగా వుంది" అని చిరునవ్వు నవ్వుతూ అంది. ఆమె పెదవులు మళ్లీ కంపించేయి.

"మనం ఇటలీ వెళ్లిపోదాం. నీ ఆరోగ్యం అక్కడ బాగవుతుంది" అన్నాడు.

"అది సాధ్యమేనా! నువ్వూ నేనూ భార్యా భర్తలుగా మన కుటుంబంతో వుండడం సాధ్యమేనా?" అని అతని కళ్లల్లోకి దగ్గరగా చూస్తూ అంది.

"నేననుకునేది అల్లా దీనికి భిన్నంగా యెప్పటికేనా యేదన్నా జరుగుతుందా అని" అన్నాడు.

"స్తీవ అనడం ఆయన అన్నిటికీ ఒప్పుకున్నాడని. కాని ఆయన్నుంచి అంత ఔదార్యం నేను స్వీకరించను" అని సాలోచనగా వ్రాన్‌స్కీనుంచి దూరంగా యెటో చూస్తూ అంది. "నాకు విడాకులు అక్కర్లేదు. యిప్పుడు నాకు యెలాగైనా ఒకటే. నాకు యిదొక్కటే తెలీ లేదు, సెర్యోష విషయం యేం చేస్తాడో" అంది.

తను పునస్సమాగ శుభ క్షణంలో ఆమె విడాకుల గురించీ, కొడుకు గురించీ యెలా ఆలోచన చేస్తోందో అతనికి బోధపడలేదు. వాటికి విలువ వున్నట్టు!

"ఆ విషయాలు యెత్తద్దు, ఆ విషయాలు యెత్తద్దు" అని ఆమె చేతిని తన చేతుల్లోకి తీసుకుని అటూ యిటూ తిప్పుకుంటూ, తన వేపు దృష్టి మళ్లింప చేసుకుంటూ అన్నాడు. కాని ఆమె అతని కేసి చూళ్లేదు.

"అయ్యో! నేనెందుకు చచ్చిపోలేదు? యెంత బాగుండేది అది!" అని ఆమె అంది. ఆమె చెక్కిళ్ల పై నుంచి కన్నీళ్లు జారేయి. కాని అతనికి బాధకలక్కుండా వుండాలని ఆమె చిరునవ్వు నవ్వే ప్రయాస పడింది.

వ్రాన్‌స్కీ విషయాలని గతంలో చూసే రీతి ప్రకారం చూస్తే తాష్కెంట్‌లో వచ్చిన ప్రశంసనీయ, సాహసోపేత ఉద్యోగావకాశాన్ని మోకాలొడ్డి తిరస్కరించడం చాలా అవమానకరం, అసంభవం అయిన మాట. కాని యిప్పుడు ఒక్క క్షణం కూడా ఆలోచించకుండా దాన్ని అతను తిరస్కరించేడు. పై అధికార వర్గాల్లో అది కోపకారణం అయిందని తెలిసి పైనిక కొలువుకి రాజీనామా చేసేడు.

ఓ నెల తర్వాత కొడుకుతో యింట్లో కరేనిన్ ఒక్కడు వుండిపోయాడు. విడాకులు తీసుకోకుండా, దాన్ని గట్టిగా తిరస్కరించి వ్రాన్‌స్కీతో కలిసి అన్నా విదేశాలకి వెళ్లిపోయింది.

వివరణలు

యీ నవల రచనా కాలం నాటికి రష్యా సమాజం అనేక తరగతులుగా వుండేది. (వర్గాలు కాదు.) ముఖ్యంగా అయిదు తరగతులు. యీ తరగతులు సాంఘిక హోదా అంతరాలని సూచించేవి. అత్యున్నత తరగతి ''నొబిలిటి'' (దీన్నే భారత దేశంలో కులీనులు అని వ్యవహరిస్తున్నారు). భారత దేశంలో కులాలకీ, యిక్కడ యీ తరగతులకీ కొంత సామ్యం కనిపించవచ్చు. కాని విభేదం ముఖ్యంగా యెక్కడుందంటే యీ తరగతుల స్థాయిని యెవరికేనా చక్రవర్తి ప్రదానం చెయ్యొచ్చు లేదా వాళ్ళు కొనుక్కోవచ్చు, ఉద్యోగ రీత్యా సంపాదించుకోవచ్చు. కులాలలో అలాంటిది లేదు. (వొక్క విశ్వామిత్రుడు మాత్రం బ్రహ్మర్షి స్థానం సాధించుకున్నట్టు, ఇతిహాసం వుంది. మిగిలిన ఉదాహరణలు కనిపించవు.) రష్యా "నొబిలిటి"లో జార్‌ది అత్యున్నత స్థానం. తర్వాత ప్రిన్స్, కౌంట్ లాంటివి వున్నాయి. ''నొబిలిటి''కి చెందిన ఉన్నత వంశీకులు యీ బిరుదులు లేకపోయినా వుండచ్చు. ఉదాహరణకి యీ నవలలో వ్రాన్‌స్కీ కౌంట్, కాని లేవిన్ యే బిరుదూ పెట్టుకోలేదు. అయినా అతని సాంఘిక హోదా వ్రాన్‌స్కీ హోదా కంటే యెక్కువ అని అతని భావం. కరేనిన్ ఉద్యోగ రీత్యా చాలా గొప్ప హోదా వున్న వాడైనా అతన్ని ప్రిన్స్ ష్చేర్‌బాత్‌స్కీ తనకంటే సాంఘిక హోదాలో తక్కువవాడిగా చూస్తాడు.

1861లో భూస్వామ్య దాసత్వంనుంచి విమోచనకి ముందు ''నొబిలిటి'' కొన్ని ప్రత్యేక హక్కులు అనుభవించేది. వాళ్ళు పన్నులు కట్టేవాళ్ళు కారు. సైనిక కొలువు, పౌర కొలువు నిర్బంధం కావు. కొలువులో వున్నా స్వేచ్ఛగా వదిలి విరమణ చెయ్యచ్చు, విదేశాలకి యిబ్బందులేమీ లేకుండా స్వేచ్ఛగా వెళ్ళచ్చు. వాళ్ళని శారీరకంగా శిక్షించడం వుండేది కాదు. వాళ్ళు దాసుల్ని వుంచుకోవచ్చు. ఎస్టేట్ వుంచుకోవచ్చు. ''నొబిలిటి సభ'' లాంటి స్వయంపాలిత వ్యవస్థలు వాళ్ళకి వుండేవి. ఆ సభలు తమతమ మార్షల్స్‌ని యెన్నుకునేవి. యీ మార్షల్స్ ఇంగ్లీషు షెరిఫ్ హోదాలాంటి వాళ్ళు.

పేజి 19 – ప్రిన్స్: పాత కాలం రష్యాలో ఉన్నత వంశీకులలో వుండే వొక బిరుదు. రష్యా జార్‌కింద యేక రాజ్యం అయినప్పుడు ప్రిన్సిపాలిటీస్‌కి అధినాయకులుగా వున్న వాళ్ళు ప్రిన్స్‌లు. యీ ఉన్నత వంశీకులకి తర్వాత వాళ్ల పాలనకింద యే ప్రిన్సిపాలిటీస్ లేకపోయినా యిది వొక బిరుదుగా మిగిలి, ఉన్నత వంశీ

కులకి వ్యవహరించేదిగా అయింది. 18వ శతాబ్దందాకా వంశపారంపర్యంగా వచ్చేది. తర్వాత జార్ ప్రదానం చేసేది కూడా అయింది.

పేజి 26 – రూరిక్: రష్యన్ యితిహాసం ప్రకారం తొమ్మిదవ శతాబ్దంలో రష్యా ఉత్తర ప్రాంతాలకి వచ్చిన స్కేండినేవియన్ రాకుమారుడు. అతను యిద్దరు సోదరులతో, సైనిక బృందంతో వచ్చాడు. రష్యాలో ఒక రాజ్యానికి అధిపతి అయి అతి కులీన రష్యన్ కుటుంబాల కులపతి అయేడు, భారత దేశంలో రాజాలు చంద్రవంశం, సూర్యవంశం వాళ్ళు అని చెప్పుకున్నట్టు.

పేజి 26 – "అందులో బెంథామ్, మిల్లుల పేర్లు ప్రస్తావించి...": బెంథామ్ ఇయెరెమియా (1748–1832) – ఇంగ్లీషు న్యాయశాస్త్రవేత్త, నైతికవాద తత్త్వవేత్త. మిల్ల్ జాన్ స్టూవర్ట్ (1806–1873) – యింగ్లీషు రాజకీయవేత్త, అర్థశాస్త్రవేత్త, తత్త్వవేత్త.

పేజి 26 – బెయస్ట్, ఫ్రెడరిక్ (1809–1886): శాక్సనీ, ఆస్ట్రియన్ ప్రగతి వ్యతిరేక రాజకీయవేత్త.

పేజి 28 – సబ్ కేప్టెన్: సైన్యంలో ౯క రేంకు. పైనుంచి క్రమంలో సైనిక రేంకులు: జనరల్, బ్రిగేడీర్, కల్నల్, లెఫ్టినెంట్ కల్నల్, కేప్టెన్, సబ్ కేప్టెన్, లెఫ్టినెంట్.

పేజి 34 – "పౌర ఉద్యోగంలోనేమో హోదా...": సైనిక ఉద్యోగాల్లో మాదిరి పౌర ఉద్యోగాల్లో కూడా హోదాలుండేవి. పౌర ఉద్యోగంలో 14 రేంకులు వుండేవి. 1–5 రేంకులు ఉన్నత శ్రేణివి. అంటే ప్రభుత్వ విధానాలని కూడా నిర్ణయించేవాళ్ళవి. 6–8 రేంకులు కార్యనిర్వాహక శ్రేణివి. యీ రెండు శ్రేణుల వాళ్ళకీ యెక్కువ హక్కులు, పెద్ద జీతాలు వుండేవి. 9–14 దాకా సాదా రేంకులు. 1809 తర్వాత విద్యా అర్హతలు యీ ఉద్యోగాలకి వుండాలని నిర్ణయించారు. 5–8 రేంకుల వాళ్ళని తీసుకోవడానికి నో యూనివర్సిటీ డిగ్రీ కావాలి. 10వ రేంకుకి వెళ్ళిన వాడు "నోబిలిటీ" సంపాదిస్తాడు, అది అతని జీవిత కాలం మాత్రమే వుంటుంది. 8వ రేంకు పైన రేంకు సంపాదించిన వాళ్ళకి "నోబిలిటీ" వంశపారంపర్యంగా పొందుతారు.

పేజి 35 – గుబేర్నియా: రష్యాలో ప్రధాన పాలక మండలం. యిందులో ఉయేజ్డ్‌లుండేవి. ఆ ఉయేజ్డ్‌లలో మళ్లీ వోలొస్త్‌లుండేవి. ఉదాహరణకి భారత దేశంలో రెవెన్యూ జిల్లా, తాలూకా, ఫిర్కాలాగా.

పేజి 36 – "జార్ బొమ్మకీ, త్రికోణ పట్టకానికీ": రష్యాలో ప్రతి ప్రభుత్వ కార్యాలయంలోనూ జార్ బొమ్మ, త్రిభుజ పట్టకం వుండేవి. యీ పట్టకం ప్రతిభుజంమీద పీటర్ ది గ్రేట్ శాసనాలు రాసి వుండేవి. (పీటర్ ది గ్రేట్ – రష్యన్ చక్రవర్తి 1682–1725).

పేజి 36 – కామెర్ జుంకర్: చక్రవర్తి కొలువులో అనేక శాఖలుగా దర్బారు నిర్వహణ సాగేది. ఆయా శాఖల కొలువుల్లో వున్న వాళ్లకి ప్రత్యేక బిరుదులుండేవి. 19వ శతాబ్దంలో ఆ బిరుదులు వున్న వాళ్లందరూ నిజంగా కొలువు చేసేవాళ్లు కారు. అతి తక్కువ స్థాయి బిరుదులు వూరికే గౌరవ హోదాలుగా మాత్రమే వుండేవి. యీ బిరుదుల్ని పౌర, సైనిక కొలువుల్లో వున్న నొబిలిటికి మాత్రమే యిచ్చేవాళ్లు. దర్బారు బిరుదుల్లో అతి తక్కువది కామెర్ జుంకర్. దీని పై హోదా బిరుదు, కామెర్‌హేర్. దీన్ని 5వ రేంకు పైన వుండే ఉద్యోగులకి, యిచ్చేవాళ్లు.

పేజి 38 – జేమ్‌స్త్వో: స్థానిక (గుబేర్నియా, ఉయేజ్డ్‌ల) స్వయంపాలిత సంస్థ. 1864లో అమలు జరిపిన సంస్కరణల మేరకి ప్రవేశపెట్టారు. జేమ్‌స్త్వో పరిధిలో స్థానిక విషయాలున్నాయి (రోడ్లు, గణాంక శాఖ, ధర్మ సంస్థలు, ప్రాథమిక పాఠశాలలు, ఆస్పత్రులు, స్థానిక పరిశ్రమలు). జేమ్‌స్త్వో సంస్థలు ప్రజల చొరవని అభివృద్ధి చేశాయి, రష్యా భూస్వామ్య రాచరికంనుంచి బూర్జువా రాచరికంగా మారడానికి తోడ్పడ్డాయి.

పేజి 41 – ఉయేజ్డ్: పాలక మండలం (35 పేజీకి నోటు చూడండి).

పేజి 41 – దెస్యతీన: పాత రష్యన్ భూమి కొలత, 1.092 హెక్టార్‌కి సమానం.

పేజి 44 – ఎయిడ్ డి కేంప్: చక్రవర్తి పరివారానికి చెందిన మిలిటరీ ఆఫీసరు. అంగరక్షకుడి హోదా అవవచ్చు.

పేజి 46 – కీయిన్: కల్పిత పేరు.

పేజి 46 – "వూరెన్స్ట్, క్నాన్ట్, ప్రిపాసోవ్‌లు": కల్పిత విద్వాంసుల పేర్లు.

పేజి 47 – కమిటీ మెంబరు: బేమ్స్ట్వో కార్యనిర్వాహక వర్గ సభ్యుడు.

పేజి 49 – జెండార్మ్ వాళ్ళు: రష్యాలో దేశభద్రతా రక్షక పోలీసు.

పేజి 51 – మఫ్: శీతాకాలంలో చేతులు వెచ్చగా వుండేట్టు పెట్టుకునే ఫర్‌తో చేసిన సంచిలాంటిది. దానికి దారం కట్టి మెడలో వేలాడేసుకునేవారు. చేతులు లోపల పెట్టడానికి రెండు వైపుల చివురు జేబుల్లా వుండేవి.

పేజి 60 – "ఆకాశంలో యెత్తుగా యెగిరే తీరు బట్టి డేగని గుర్తిస్తాను, కళ్ళల్లో కని పించే ప్రేమ వెలుగు తీరు బట్టి ప్రేమికుణ్ణి గుర్తిస్తాను": రష్యన్ మహా కవి పూష్కిన్ (1799–1837) కావ్యంనుంచి పాదాలు.

పేజి 63 – "నా జీవిత పుటల్ని యేవగింపుగా చదువుతాను, భయంతో కంపిస్తాను, నిందిస్తాను, కటువుగా విలపిస్తాను": రష్యన్ మహా కవి పూష్కిన్ కావ్యం నుంచి పాదాలు.

పేజి 65 – ప్రఖ్యాత ఆస్ట్రియన్ సంగీతకారుడు జోహన్ స్ట్రాస్ (1825–1899) కూర్చిన "గబ్బిలం" అనే ఒపేరెట్టానుంచి పాదాలు.

పేజి 65 – మేరి మాగ్దలీన్: సువార్తలో పతిత మేరి మాగ్దలీన్‌కి ప్రస్తావన. క్రీస్తు ఆమెకి క్షమాదానం ప్రసాదిస్తాడు. ఆమె పశ్చాత్తప్తురాలై ఆయన బోధనలని అనుసరించింది.

పేజి 66 – "డిక్కెన్స్ రాసిన ఓ నవలలోని పాత్ర": ఇంగ్లీషు రచయిత చార్లెస్ డిక్కెన్స్ (1812–1870) రాసిన "మన పరస్పర మిత్రుడు" అనే నవలలో మిస్టర్ పడ్‌స్నెప్ అనే ఒక పాత్రకి ప్రస్తావన. అతను డిక్కెన్స్ రాసినట్టు "తనకి ఒక ప్రత్యేక చేష్ట అలవరచుకున్నాడు. తన కుడి చెయ్యి విసిరి యీాగల్ని తోలినట్టు అతి క్లిష్ట ప్రపంచ సమస్యలని పరిష్కారం చేసేసేవాడు."

పేజి 66 – "ప్లేటో తన 'సింపోజియం'లో విర్వచించిన రెండు రకాల ప్రేమ":

ప్లేటో (క్రీ. పూ. 428–348) – ప్రాచీన గ్రీకు తత్త్వవేత్త ప్రతిపాదించిన అమలిన ప్రేమకి ప్రస్తావన. యీ ప్రేమలో శారీరక సంబంధం వుండదు.

పేజి 70 – "...పెద్దలే కుదిర్చే రష్యన్ సంప్రదాయం...": రష్యాలో పెళ్లిళ్లు కుదుర్చుకునే పద్ధతి. వధువుల కోసం చూసి వరుడికి నచ్చితే వధువు యింటికి వెళ్లి తల్లిదండ్రులకి సంబంధాలు చెప్పే ఆడవాళ్లు అప్పుడు వుండేవాళ్లు.

పేజి 75 – "పాపిష్ఠి బాబిలోన్": యుఫ్రేటస్ నది తీరాన వున్న ప్రాచీన నగరం. వ్యభిచారానికీ, వ్యామోహానికీ పేరు మోసింది.

పేజి 78 – "శాస్త్ర విద్య కంటే భాషాసాహిత్యాల విద్య వల్ల కలిగే లాభాలూ...": భాషాసాహిత్యాల విద్య – ప్రాచీన గ్రీకు, లాటిన్ భాషలు సాహిత్యం తత్త్వశాస్త్రం చదివే విద్యావ్యవస్థ. శాస్త్ర విద్య – ముఖ్యంగా శాస్త్రాల అధ్యయనంమీద ఆధారపడిన విద్యా వ్యవస్థ. 19వ శతాబ్దపు ఉత్తరార్థంలో యీ విద్యా పద్ధతులని సమర్థించేవాళ్ల మధ్య వాగ్వాదాలు జరిగాయి.

పేజి 78 – "నిర్బంధ సైనిక కొలువు": 1874లో రష్యాలో కొత్త మిలిటరీ నియమావళి అమలులో వచ్చింది. దాని ప్రకారం అంతకుముందు ఉన్న పాతికేళ్ల సైనిక కొలువు స్థానంలో కాలపరిమితి 6 నెలలనుంచి 6 యేళ్లదాకా వుండే కొలువు ప్రవేశపెట్టారు. మిలిటరీ కొలువు సార్వజనీనం అయింది.

పేజి 84 – పేజ్ కోర్: అత్యున్నత సాంఘిక హోదా వున్న "నోబిలిటీ"కి ఉత్తమ సైనిక పాఠశాల.

పేజి 86 – "Château des fleurs": మాస్కోలో పారిస్ తరహా మనోరంజక స్థానం పేరు.

పేజి 118 – నోవా: బైబిల్‌లోని నో కథలో యావన్మంది ప్రజానీకం వ్యామోహం అధోగతులలో మునిగిపోతూ వున్నా నిర్మల, పవిత్ర జీవితాన్ని గడిపిన మహాత్ముడు.

పేజి 119 – "ఆమె తొడుక్కున్న పూలు బట్టల చేతులకి, మెడకి లేసులు లేవు.": 19వ

శతాబ్దంలో ఆడవాళ్ళ పూలు బట్టలు తొడుక్కుంటే వాటికి మెడ దగ్గర మణికట్ల దగ్గర లేత రంగు పట్టుతోగాని లేసుతోగాని కుట్టి వేసుకునే పట్టీలు.

పేజి 122 – "రైతులు యిది వరకటిలాగానే యివాళా బానిసలుగా...": 1861లో జరిగిన భూస్వామ్య దాస్య విమోచనకి ప్రస్తావన. అంతకుముందు దాకా భూస్వామ్య దాసులకి యే రకమైన హక్కులు వుండేవి కాదు. వాళ్ళని శారీరకంగా దండించడం, వాళ్ళ పిల్లల్ని వాళ్ళనుంచి వేరు చెయ్యడం వుండేవి. పెట్టుబడిదారీ విధాన అభివృద్ధికి యీ భూస్వామ్య దాస్య వ్యవస్థ ఆటంకంగా వుండేది. 1861లో దాన్ని రద్దు చేసి వాళ్ళకి కొన్ని హక్కులు కల్పించేరు. వాళ్ళకి జీవనాధారంగా కమతాల్ని యిచ్చేరు. కాని వాళ్ళు ఆ కమతాలకి శిస్తు చెల్లించాల్సి వుండేది. దానివల్ల ఆర్థికంగా వాళ్ళ వాస్తవ పరిస్థితిలో పెద్ద మార్పు రాలేదు.

పేజి 126 – "పల్లెటూరి న్యాయాధికార్లు": 1864 న్యాయశాఖ సంస్కరణ ప్రకారం అమలులోకి వచ్చిన న్యాయ వ్యవస్థ విభాగాలకి ప్రస్తావన. యివి చిన్న చిన్న సివిల్, క్రిమినల్ కేసులు చూశేవి. వాటి సభ్యుల్ని జేమ్‌స్త్వొ కౌన్సిళ్ళు యెన్నుకునేవి.

పేజి 131 – టిండాల్, జాన్ (1820–1895): ఇంగ్లీషు భౌతికశాస్త్రజ్ఞుడు, శాస్త్రవిజ్ఞానాన్ని సామాన్యజన ఆదరణీయం చేశాడు.

పేజి 142 – బొలొగోయె: మాస్కో పీటర్స్‌బుర్గ్‌ల మధ్య పెద్ద రైల్వే స్టేషన్. యిప్పటికీ వుంది.

పేజి 146 – పాన్‌స్లావ్: పాన్‌స్లావిజానికి ప్రస్తావన. 19వ శతాబ్దం ఉత్తరార్థంలో యేర్పడిన జాతీయవాద ధోరణి. దాని ప్రతినిధులు స్లావ్ జాతుల యేకత్వం కోసం కృషి చేశారు.

పేజి 146 – స్లావ్ కమిటీ: సామాజిక రాజకీయ, ధర్మ సంస్థలు. 19వ శతాబ్దం మధ్యలో యేర్పడ్డాయి. వాటి ఉద్దేశం విదేశీ పెత్తనం కింద ఉన్న స్లావ్ జాతులకు సహాయం చేయడం. అవి పాన్ స్లావిజం భావాల ప్రభావం కింద ఉన్నాయి.

పేజి 150 – షేక్‌స్పియర్, విలియమ్ (1564–1616): మహా ఇంగ్లీషు నాటకకర్త,

కవి. రాఫయేల్, సాంతి (1483–1520): మహా ఇటాలియన్ చిత్రకారుడు, శిల్పి. బీథోవెన్, లుద్విగ్ వన్ (1770–1827): మహా జర్మన్ సంగీతకారుడు, పియానో వాయిద్యకారుడు, సంగీతరూపక స్వరకర్త.

పేజి 154 – ఫ్రెంచి థియేటర్: పీటర్స్‌బుర్గ్‌లో థియేటర్. అక్కడ ఫ్రెంచి వాళ్ళు నటించేవాళ్ళు. ముఖ్యంగా తేలిక నాటకాలు ప్రదర్శించారు: కామెడీలు, ఓపెరెట్టాలు, వగైరా.

పేజి 154 – రెబెకా: ప్రఖ్యాత ఇంగ్లీషు రచయిత వాల్టర్ స్కాట్ (1771–1832) రాసిన "ఐవాన్హో" అనే నవలలో ఓ పాత్రకి ప్రస్తావన.

పేజి 154 – గ్రాండ్ ప్రిన్సెస్: వివాహితురాలైన జార్ సోదరి లేదా జారు మరదలు.

పేజి 167 – "యీస్టర్ ముందు లెంట్ దినాలలో...": లెంట్ ఉపవాసానికి ప్రస్తావన. ఉపవాసాలు అంటే రష్యన్ ఆర్తడాక్స్ చర్చి నియమాల ప్రకారం మాంసం తినకుండా, పాలు తాగకుండా వుండవలసిన రోజులు. యీ ఉపవాసాల రోజుల్లో సామూహిక తిరనాళ్ళు, వివాహాలు నిషేధం. సంవత్సరంలో నాలుగు దీర్ఘ ఉపవాస కాలాలు వున్నాయి.

లెంట్ – ఈస్టర్ ముందు చేసే యేడు వారాల ఉపవాసం. యిది వసంత కాలంలో వస్తుంది.

పీటర్, పాల్ ఉపవాసం – వేసవి కాలంది, జూలై 12 దాకా. ఎస్సంప్షన్ ఉపవాసం – ఆకురాలు కాలంలో వస్తుంది, సెప్టెంబరు 15నుంచి 29దాకా.

క్రిస్టమస్ ఉపవాసం – ఫిలిప్ సెయింట్ స్మృతి దినంతో మొదలై సాగుతుంది. నవంబరు 25నుంచి జనవరి 7దాకా. ఉపవాసం అనగానే భారత దేశంలో మాదిరీ కటిక ఉపవాసం అని కాదు. మాంసం గాని, పాల పదార్థాలు గాని, కోడి గుడ్లు గాని తినడం నిషేధం అంతే. ఆకుకూరలు, కాయగూరలు, కొన్ని రోజుల్లో చేపలు కూడా, తినవచ్చు.

పేజి 170 – ఫ్రెంచి థియేటర్: పేజి 154కి నోటు చూడండి.

పేజి 172 – టిట్యులర్ కౌన్సిలరు: తొమ్మిదవ రేంక్ ప్రభుత్వ ఉద్యోగి (చూడండి 34 పేజికి నోటు).

పేజి 172 – తాలైరాన్ (1754–1838): ఫ్రెంచి రాజకీయవేత్త, దౌత్య నీతిజ్ఞుడు, దూరదృష్టి వున్న కుటిల రాజకీయవేత్త.

పేజి 175 – కౌల్‌బాఖ్, విల్‌హెల్మ్ (1805–1874): ప్రఖ్యాత చారిత్రక చిత్రకారుడు.

పేజి 176 – లూయీ XV: ఫ్రెంచి చక్రవర్తి (1715–1774).

పేజి 178 – "గ్రిమ్ కథ వొకటుంది": తన నీడ కోల్పోయిన మనిషి గురించి కథ గ్రిమ్ సోదరులది కాదు. వేరే జర్మన్ రచయిత అడల్బెర్ట్ షమిస్సో (1781–1838) రాసిన కథ యిది. 'పీటర్ ష్లెమిల్ అద్భుత సాహస కృత్యాలు' అనేది ఆ కథ పేరు.

పేజి 179 – బూఫ్ థియేటర్: ఫ్రెంచి థియేటర్‌కి మరో పేరు.

పేజి 184 – "మీ రాంబులె సభ...": పారిస్‌లో రాంబులె హోటల్‌లో మార్కిజ్ రాంబులె (1588–1665) స్థాపించిన సాహిత్య క్లబ్బు వుండేది.

పేజి 184 – "నిర్బంధ సైనిక కొలువు": పేజి 78కి నోటు చూడండి.

పేజి 198 – "లెంట్ దినాల ఆఖరులో...": పేజి 167కి నోటు చూడండి.

పేజి 203 – "శాలి శీతకట్టు గోధుమ": ఆకురాలు కాలంలో విత్తనాలు చల్లిన పంట. ఆ విత్తనాలు శీతాకాలంలో మంచు అప్పుడు నేలలో వుంటాయి. మంచు కరిగిపోగానే మొక్క వచ్చి పంట పండుతుంది. ఈ రకం ధాన్యంలో వేసవి కాలంలో మంచు కరిగిన తేమ వుంటుంది. పైగా మామూలుగా వేసవి కాలం పంట కంటే ముందే మామూలుకి వస్తుంది.

పేజి 209 – "అస్సీయన్ తరహా ఆడవాళ్ళు": శృంగారభరిత 'అస్సీయన్ కావ్యాల' నాయికలకి ప్రస్తావన. వాటిని ఇంగ్లీషు కవి జి. మక్‌ఫెర్సన్ (1736–1796) రాశాడు. పతివ్రతా శిరోమణులను ఘనంగా కీర్తించేడు.

పేజి 214 – "దెస్యతీన్‌కి ముప్పై సాజెన్ల కంటే వుండదు కలప": యిక్కడ ఘన

సాజెన్ పరిమాణం ఉద్దేశం (సాజెన్ – రష్యన్ కొలత, 2.14 మీటర్లకి సమానం). అంటే అబ్లాన్స్కీ అభిప్రాయంలో ఆతను అమ్మిన ప్రతి చదరపు దెస్యతిన్‌కి 30 ఘనపు సాజెన్ కలప కంటే లభించదు.

పేజి 223 – "వెర్తర్ కాంక్ష": మనిషిని పూర్తిగా వశం చేసుకుని అతిలోక క్రియలని చేయడానికి ప్రేరేపించే లాంటి కాంక్ష. వెర్తర్ – జర్మన్ మహా రచయిత జోహాన్ గోథే (1749–1832) రాసిన "యువ వెర్తర్ బాధలు" అనే నవల నాయకుడు.

పేజి 223 – క్రాస్నయె సెలో: పీటర్స్‌బుర్గ్ పరిసరాల్లో వున్న ఒక విడిది. పీటర్స్‌బుర్గ్‌లో, దాని పరిసరాల్లో ఉన్న సైన్యాలు వేసవి కాలంలో అక్కడ శిబిరంలో విడిది చేస్తాయి.

పేజి 224 – పేజ్ కోర్: 84 పేజికి నోటు చూడండి.

పేజి 226 – ఇంగ్లీషు క్లబ్బు: మాస్కో, పీటర్స్‌బుర్గ్‌లలో కులీనుల క్లబ్బు.

పేజి 227 – "మహారాజా తూ... లా...": ఫ్రెంచి సంగీతకారుడు షార్ల్ గునో (1818–1893) సృష్టించిన ఒపెరా 'ఫౌస్ట్'లో మార్గరెట్ పాడిన పాటలో మొదటి పాదం. ఈ ఒపెరాని జర్మన్ మహా రచయిత గోథె రచన 'ఫౌస్ట్' కథ అనుసరించి రాశాడు.

పేజి 228 – పీటర్‌హాఫ్: పీటర్స్‌బుర్గ్ పరిసరాలలో రష్యన్ జార్‌ల వేసవి విడిది. వేసవి కాలంలో హోదాగల సైన్యదళాలు అక్కడే బసచేశాయి.

పేజి 229 – త్సార్స్కొయె సెలో: పీటర్స్‌బుర్గ్ పరిసరాల్లో రష్యన్ జార్‌ల వేసవి విడిది. వేసవి కాలంలో హోదాగల సైన్యదళాలు అక్కడే బసచేశాయి.

పేజి 243 – మౌంటెడ్ గార్డ్స్: రష్యన్ చక్రవర్తి గౌరవ రక్షక దళం.

పేజి 261 – "జార్‌గారి జనరల్ అడ్జుటెంట్": బ్రిగేడియర్ రేంక్‌లో వుండే చక్రవర్తి అంగరక్షకుడు.

పేజి 280 – "వితంతు శరణాలయం": యుద్ధంలో చనిపోయిన లేదా సైనిక, పౌర

కొలువులో పదేళ్ల పైబడి పనిచేసి మామూలుగా చచిపోయిన సైనిక ఆఫీసర్ల, ఉద్యోగుల వితంతువులకి శరణాలయం.

పేజి 287 – పయటిస్టు: మిస్టిక్ భావాలు, ధార్మిక చింతన వున్న వ్యక్తి.

పేజి 302 – "...సెయింట్ పీటర్ పండుగ...": పీటర్, పాల్ సెయింట్స్ స్మృతి దినం, జులై 12.

పేజి 306 – "మన జేమ్‌స్త్వొ సంస్థలు...": 38 పేజీకి నోటు చూడండి.

పేజి 306 – "యీ కొత్త న్యాయ సంస్థలూ...": 1864లో న్యాయ వ్యవస్థని రష్యాలో సంస్కరించేరు. యీ సంస్కరణ ప్రకారం న్యాయ వ్యవస్థని పాలక కార్య నిర్వాహక శాఖలనుంచి విడదీశారు. న్యాయవాద పద్ధతి స్థాపితం అయింది. నొక బహిరంగ పని విధానం కోర్టుల విచారణకి సంబంధించి ప్రకటించేరు. యిది మొదటి దశ కోర్టులకి వుండేది.

రెండవ రకం కోర్టులని స్థాపించేరు. రాజీ కోర్టులు. చిన్న చిన్న శిక్ష, నేర సంబంధమైన కేసుల్ని విచారించేవి. యీ రాజీ కోర్టుల న్యాయాధి కార్లని జేమ్‌స్త్వొ మండలులు యెన్నుకునేవి.

పేజి 330 – "లెంట్ తర్వాత...": 167 పేజీకి నోటు చూడండి.

పేజి 340 – "సెయింట్ ఫిలిప్ ఉపవాసం...": క్రిస్టమస్ ఉపవాసానికి ప్రస్తావన (167 పేజీకి నోటు చూడండి).

పేజి 342 – రైతు కమ్యూన్: రష్యాలో గ్రామాల్లో భూమి రైతుల ఉమ్మడి కమతంగా వుండేది. యీ వ్యవస్థని రైతు కమ్యూన్ అని వ్యవహరించేవాళ్ళు. భూమిపై విడిగా సభ్యులకి స్వామ్యం లేదు. పాదార్థిక విలువలకి సంబంధించి, నేరాలకి సంబంధించి యీ రైతు కమ్యూన్ సభ్యులకి విడి విడి బాధ్యత లేదు. కమ్యూన్ సభ్యులందరూ సమష్టిగా బాధ్యత వహించాల్సి వుండేది.

పేజి 346 – "సుందరి హెలెన్": ఫ్రెంచి సంగీతరూపకర్త జాన్ అఫెన్‌బాఖ్ (1819–1880) రాసిన ఒపెరెట్టా పేరు. ప్రాచీన గ్రీకు ఇతిహాసం "ఇలియడ్" కథని అనుసరించి ఈ కథని హాస్యకృతిగా మార్చి రాశాడు. మెనెలస్ – ఈ

ఒపెరెట్టాలో కథానాయకుడు. అతను స్పార్టా చక్రవర్తి. అతని భార్య హెలెన్‌ని పారిస్ అనే ఓ గ్రీకు కాపరి యెత్తుకుపోయాడు. యీ కథ ట్రాయ్ యుద్ధ గాథగా ప్రఖ్యాతం అయింది.

పేజి 351 – "ప్రాచీన ఇటాలియన్ లిపి": 15వ శతాబ్దంలో ఇటలీలో దొరికిన రాగి ఫలకాలకి ప్రస్తావన. ఈ ఫలకాలపై లిపి చాలా కాలం మట్టిలో వున్నా గానీ బాగా భద్రంగా వుంది.

పేజి 373 – "హో డిసెంబరిస్టు తిరుగుబాటుదారుడి కూతురైన...": 1825 డిసెంబరులో జార్ నిరంకుశ పాలనకి వ్యతిరేకంగా కొంతమంది కులీనులు తిరుగుబాటు చేశారు. జార్ చాల క్రూరంగా తిరుగుబాటుని అణిచివేసి తిరుగుబాటుదారుల్ని దండించాడు: అయిదుగుర్ని ఉరితీయించాడు, చాలమందికి ఏ సామాజిక హక్కులు లేకుండా, ఆస్తి లేకుండా చేసి, నిర్బంధ శ్రమ శిక్ష విధించేడు.

పేజి 378 – జాన్ అఫెన్‌బాఖ్: ఫ్రెంచి సంగీతరూపకర్త.

పేజి 404 – "సుందరి హెలెన్": 346 పేజికి నోటు చూడండి.

పేజి 409 – "రైతు కమ్యూన్": పేజి 342కి నోటు చూడండి.

పేజి 410 – "షుల్జె – డెలిచ్ ప్రణాళిక...": హెర్మన్ షుల్జె – డెలిచ్ (1808–1883) – జర్మన్ అర్థశాస్త్రవేత్త, రాజకీయవేత్త. 19వ శతాబ్దపు యాభైలలో స్వతంత్ర సహకార సంఘాలని, పొదుపు బేంకులని స్థాపించాలని సూచించేడు. యివి శ్రామికులకి, చేతి వృత్తుల వాళ్లకి వుండాలన్నాడు. ఆయన అభిప్రాయం ప్రకారం యీ సహకార సంస్థలు అన్ని వర్గాల ప్రతినిధుల్ని యేకం చేసి, వాళ్ల ప్రయోజనాలు సమసించడానికి నడిపిస్తాయి.

పేజి 410 – "లాస్సాల్ పైఖరి...": ఫెర్డినాండ్ లాస్సాల్ (1825–1864) – జర్మన్ రాజకీయవేత్త. ప్రభుత్వ సహకారంతో వృత్తి సంఘాలు వుండాలని సూచించేడు.

పేజి 410 – "మిల్హాజెన్ వ్యవస్థ...": మిల్హాజెన్ పట్టణంలో డోల్ఫస్ అనే వొక మిల్లు

యజమాని శ్రామికుల జీవితావసరాల నిమిత్తం సంఘం స్థాపించేడు. యిది వ్యాపార సంస్థ, కాని ధార్మిక ఆశయాల్ని యీ సంస్థలో మిళితం చేశాడు.

పేజీ 411 – "పోలండ్ విభజనలో అసలు బాధ్యుడు ఫ్రెడరిక్ కాదు...": ప్రష్యా, ఆస్ట్రియా, రష్యాల మధ్య కుదిరిన ఒప్పందానికి ప్రస్తావన. యీ ఒప్పందం ప్రకారం పోలండ్ భూభాగాన్ని విభజించేరు. ప్రష్యా రాజా ఫ్రెడరిక్ యీ విభజనలో చురుగ్గా పాల్గొన్నాడు.

పేజీ 413 – "...స్పెన్సర్‌ని అంగీకరిస్తున్నారు": ఇంగ్లీషు బూర్జువా తత్త్వవేత్త, సామాజికశాస్త్రజ్ఞుడు హెర్బర్ట్ స్పెన్సర్ (1820–1903) ఒక వ్యాసంలో విద్య ప్రజలకి సంక్షేమాన్ని యివ్వదు, తద్వ్యతిరేకంగా సంక్షేమం విద్య అభివృద్ధికి అవసరమైన షరతు అని రాశాడు.

పేజీ 418 – మిల్స్: పేజీ 26కి నోటు చూడండి.

పేజీ 419 – "కాఫ్‌మన్? మరి జోన్స్? ద్యుబావాయో? మిచెలీ సంగతి?": కల్పిత పేర్లు.

పేజీ 421 – బెంజమిన్ ఫ్రాంక్లిన్ (1706–1790): అమెరికన్ వికాసదాయకుడు, రాజకీయవేత్త, భౌతికశాస్త్రజ్ఞుడు.

పేజీ 468 – "భాషాసాహిత్యాల విద్య": 78 పేజీకి చూడండి.

పేజీ 515 – కామ్మెర్‌హేర్: 36 పేజీకి చూడండి.

పాఠకులకు మనవి

ఈ పుస్తకం గురించి, దీని అనువాదం గురించి మీ అభిప్రాయాలను "రాదుగ" ప్రచురణాలయానికి దయచేసి తెలుపండి.

మీ అభిప్రాయాలను ఈకింది చిరునామాకు పంపండి:

Raduga Publishers
17, Zubovsky Boulevard
Moscow, USSR

మా ప్రచురణలు దొరికే చోట్లు:

విశాలాంధ్ర పబ్లిషింగ్ హౌస్
విజ్ఞాన్ భవన్,
4–1–435, బ్యాంక్‌స్ట్రీట్
హైదరాబాద్–500001

విశాలాంధ్ర బుక్ హౌస్
11–1–37 గాంధీ రోడ్డు
తిరుపతి – 517501

విశాలాంధ్ర బుక్ హౌస్
ఏలూరు రోడ్డు
విజయవాడ–520002

విశాలాంధ్ర బుక్ హౌస్
సూపర్ బజారు ఎదుట
విశాఖపట్నం – 530002

విశాలాంధ్ర బుక్ హౌస్
సుల్తాన్ బజారు
హైదరాబాద్ – 500001

విశాలాంధ్ర బుక్ హౌస్
హనుమకొండ
వరంగల్ – 506011

విశాలాంధ్ర బుక్ హౌస్
కాలేజీ రోడ్డు
అనంతపురం – 515004

విశాలాంధ్ర బుక్ హౌస్
అరండల్ పేట
గుంటూరు – 522002

త్వరలో వెలువడుతుంది

ఎ. చేహొవ్. "కథలు". రెండవ ముద్రణ.

రాచమల్లు రామచంద్రా రెడ్డి అనువాదం చేసిన ఎ. చేహొవ్ కథలు మొదటి సారి "ప్రగతి" ప్రచురణాలయం 1973లో ప్రచురించింది. చేహొవ్ మహా ప్రజ్ఞగల రచయిత. చేహొవ్ కథలు పాఠకుల్ని యెప్పుడూ అలరిస్తూనే వుంటాయి. "గుమాస్తా మరణం", "ఊసరవెల్లి", "గుల్లలో జీవించిన మనిషి", "కుక్కను వెంటబెట్టుకున్న మహిళ" లాంటి కథలు వున్న యీ సంపుటం రెండవ ముద్రణ త్వరలో వెలువడుతోంది!

విశాలాంధ్ర ప్రచురణాలయం వారిని మీ కాపీకోసం అడగండి! త్వరపడండి!

త్వరలో వెలువడుతుంది

మక్సీమ్ గోర్కీ. "కథలు". రెండవ ముద్రణ.

విప్లవ సాహిత్య పితామహుడు మక్సీమ్ గోర్కీ పేరు వినని అభ్యుదయ సాహిత్య జీవి వుండడు. "అమ్మ" నవం ప్రతి తెలుగు పాఠకుడి అభిమానాన్ని చూరగొంది. గోర్కీ రాసిన కథలని రాచమల్లు రామచంద్రా రెడ్డి అనువాదం చేశారు. "ప్రగతి" ప్రచురణాలయం ప్రచురించింది. యిప్పుడు "రాదుగ" ప్రచురణాలయం తిరిగి వాటిని ముద్రిస్తోంది. "మకార్ చుద్రా," "డేగపాట," "చెల్కాష్", "యిరవై ఆరుమంది పురుషులూ, ఒక అమ్మాయీ" లాంటి ప్రఖ్యాత కథలు వున్న యీ సంకలనం రెండవ ముద్రణ త్వరలో వస్తోంది.

మీ కాపీకోసం త్వరపడండి!

విశాలాంధ్ర ప్రచురణాలయం వారిని సంప్రదించండి!